# భాగము - 5

# త్యాగశిఖరం

## అధ్యాయము - 1

## మూడు గొంతులు

**నాగపట్టణపు** చూడామణి విహారంలో పొన్నియిన్ సెల్వన్ ఓపికతో వేచివున్నారు. తంజావూరుకు వెళ్ళి తలిదండ్రులను చూడాలన్న ఆరాటం ఆయన హృదయంలో పొంగుతూంది. లంకారాజ్యాన్ని తాను కైవసం చేసుకోవడానికి ప్రయత్నించినట్లు తన మీద మోపబడిన నింద నిరాధారమని నిరూపించేందుకు ఆయన ఉవ్విళ్ళూరుతున్నారు. తండ్రి మాటను తాను జవదాటినట్లు తన మీద మోపబడిన నిందను కూడ త్వరలో తొలగించుకోవాలని ఆయన ఆశిస్తున్నారు.

కానీ తన ఆరాటాన్ని, కుతూహలాన్ని అదిమిపెట్టి, అక్కగారి దగ్గరినుంచి సందేశం వచ్చిన తర్వాతే బయలుదేరాలని దృఢంగా నిశ్చయించుకొన్నారు.

పొద్దు గడవడమేమో చాల కష్టంగా ఉండేది. బౌద్ధ భిక్షువులు రోజంతా జరుపుతున్న ఆరాధనల్లోను, పూజల్లోను పాలుపంచుకొని/పాల్గొని కాస్త సమయాన్ని వెళ్ళబుచ్చుతున్నారు.

చూడామణి విహారపు సుందర కుడ్య చిత్రాలను చూసి ఆనందించడంలో ఇంకాస్త పొద్దు గడిచేది.

భిక్షువులతో, ముఖ్యంగా ఆచార్య భిక్షువుతో, సంభాషణల్లో గడిపిన సమయం ఆయనకు చాల ఉత్సాహాన్నిచ్చింది.

ఎందుకంటే ఆచార్య భిక్షువు దక్షిణ సముద్రానికవతల ఉన్న పలుదేశాల్లో చాల కాలంపాటు యాత్రలు చేసి వచ్చినవారు. చైనాదేశం నుంచి శావక ద్వీపం వరకు అనేక నగరాలకు వెళ్ళి వచ్చినవారు. ఆయా దేశాల గురించి, ఆయా నగరాల గురించి, అక్కడ నివసిస్తున్న ప్రజల గురించి బాగా వివరించి చెప్పగలరాయన.

చైనాదేశానికి దక్షిణంగానున్న సముద్రం ఎల్లగా వున్న దేశాలు ఆరోజుల్లో 'శ్రీవిజయం' అనే సామ్రాజ్యం కింద ఉండేవి. అరుమణం, కాంభోజరాజ్యం, మాణిక్యవారం, తలైతక్కోలం, మూపప్పాళం, మాయూరిడింగం, తామ్రలింగం, ఇలామురి దేశం మొదలైన పలుదేశాలు, నగరాలు శ్రీవిజయసామ్రాజ్యానికి

లోబడి, లేక మిత్రదేశాలుగా ఉండేవి. వీటన్నిటి మధ్య 'కటారం (గడారం)' అనే నగరం తక్కిన నగరాలకన్న ఎక్కువగా సిరిసంపదలతోను, కీర్తిప్రతిష్ఠలతోను తులతూగేది.

ఆచార్యభిక్షువుకు తీరిక దొరికినప్పుడల్లా ఆ దేశాల గురించి, నగరాల గురించి చెప్పమని పొన్నియిన్ సెల్వన్ అడిగేవారు. ఆయన కూడ అలుపూ సొలుపూ లేకుండ చెప్పుకొచ్చారు. ఆయా దేశాల్లోని సహజ విశేషాల గురించి, వాణిజ్య వర్తక విశేషాల గురించి చెప్పారు. స్వర్ణ, రత్నమాణిక్యాలతోను, వరి, చెరకు వంటి పంటలతో తులతూగిన చోళనాడుతో పోటీ చేయగల ఆ దేశాల గొప్పతనం గురించి వివరించారు. పాతకాలంనుంచి తమిళనాడుకు, ఆ దేశాలకు మధ్య సాగుతూ వస్తున్న సంబంధాల గురించి వివరించారు. పల్లవనాడుకు చెందిన శిల్పులు ఆ దేశాలకు వెళ్ళి అద్భుత శిల్పసౌందర్యంతో కూడిన ఆలయాలను నిర్మించిన వృత్తాంతాలను వివరించారు. తమిళనాడునుంచి వెళ్ళిన చిత్ర, శిల్ప, సంగీత, నాట్య కళలు ఆ దేశాల్లో విస్తరించిన వైనాన్ని విశదీకరించారు. రామాయణం, మహాభారతం మొదలైన ఇతిహాసాలు, వినాయకుడు, సుబ్రమణ్యస్వామి, శివపార్వతులు, పెరుమాళ్ళు (విష్ణువు) మొదలైన దైవాలు, బుద్ధ ధర్మం ఆ దేశాల ప్రజలను ఆకట్టుకొని వారి మనసుల్లో నెలకొన్న విషయం, ఒక దానినుంచి ఇంకొకదాన్ని వేర్పరచి అర్థం చేసుకోలేక ఆ ప్రజలు అన్ని దైవాలను పూజిస్తున్న విషయాన్ని వివరించారు. తమిళభాషకు పితృవైన అగస్త్యమునికి ఆ దేశాల్లో విశేష గౌరవం ఉందని, ఆ మునివర్యునికి పలు ఆలయాలు కట్టించారని కూడ చెప్పారు.

~

ఇదంతా మళ్ళీ మళ్ళీ అడిగి తెలుసుకొని అరుళ్మొళి తమ మనసులో ఆ వివరాలన్నీ పదిలపరుచుకొన్నారు. ఆయా దేశాలకు గల భూమార్గాలను, సముద్రమార్గాలను బాగా విచారించి తెలుసుకొన్నారు. దారిలో ఉన్న అపాయాలు, వసతుల గురించి కూడ అడిగి తెలుసుకొన్నారు.

"స్వామీ! ఆ దేశాలకు మీరు మళ్ళీ యాత్రలకు వెళ్ళే అవకాశాలున్నాయా?" అని వేడుకొన్నారు.

"బుద్ధ భగవానుని చిత్తం ఎలా ఉంటే అలా జరుగుతుంది. యువరాజా! ఎందుకడుగుతున్నారు?" అన్నారు ఆచార్య భిక్షువు.

"నేనూ మీతోబాటు వద్దామని ఆశపడుతున్నాను..."

"నేను లోకాన్ని త్యజించిన సన్యాసిని; మీరు భూలోకాన్నేలే చక్రవర్తి కుమారులు. మీరూ, నేనూ కలిసి యాత్ర చేయడమా? మిమ్మల్ని ఈ విహారంలో కొన్నాళ్ళుంచుకొని కాపాడడమే పెద్ద భారంగా ఉంది. ఎప్పుడు ఏ అపాయం ఎదురౌతుందోనని గాభరా కలుగుతూంది..."

"స్వామీ! మీకాభారాన్ని వెంటనే తొలగింపగోరుతున్నాను. ఈ క్షణమే ఇక్కడినుంచి..."

"యువరాజా! ఒకటి తలచి, ఇంకొకటి చెప్పాను. మీకు ఇక్కడ అతిథిగా ఆశ్రయమివ్వడం

భారమైనా, దాన్ని ఒక భాగ్యంగా భావిస్తున్నాను. తమ తండ్రైన చక్రవర్తి, తమ అక్కగారైన యువరాకుమారి బౌద్ధ ధర్మానికి ఎంతో సహాయం చేశారు. దానికి ప్రత్యుపకారంగా మేము మీకిప్పుడు చేస్తున్న సహాయం నూరింట ఒక భాగం కూడ సాటి రాదు. మీరు బౌద్ధ ధర్మానికి ఇప్పటికే చేసిన మహోపకారాలు తక్కువైనవా? అనురాధపురంలో శిథిలమైన స్తూపాలను, విహారాలను మీరు పునర్నిర్మింపజేసిన విషయాన్ని మేమెన్నటికైన మరువగలమా? దానికంతటికీ ప్రత్యుపకారంగా లంకాదేశపు మణిమకుటాన్నే మీకు ధరింపజేసేందుకు భిక్షువులు ముందుకు వచ్చారు కద? యువరాజా! దాన్నెందుకు తిరస్కరించారు? లంకాదేశపు స్వతంత్ర సింహాసనాన్ని మీరధిష్ఠించివుంటే, వందలకొద్ది ఓడల్లో దక్షిణ దేశాలకు మీరు వెళ్ళి రావచ్చు కద? ఈ భిక్షువు వెంట యాత్రలకు వెళ్ళాలన్న ఆలోచనే వచ్చేది కాదు కద?"

"గురుదేవా! లంక రాజ కుల చరిత్రను వివరించే 'మహా వంశం' అనే గ్రంథాన్ని మీరు చదివారా?" అని యువరాజు అడిగారు.

"అయ్యా! ఇదేం ప్రశ్న? 'మహా వంశం' చదవక నేనీ చూడామణి విహారానికి ఆచార్య భిక్షువునయ్యేవాడినా?"

"అయ్యా! క్షమించాలి. 'మహావంశం' చదివారా అని మిమ్మల్నడగడం 'మీకు చదవడం వచ్చా' అని అడగడానికి సమానం. కానీ ఆ మహావంశం వివరించే వంశ పరంపరలో ఎవరెవరు ఎంతటి భయంకరమైన పాపాలను చేశారన్నది మీకు తెలుసు కద? కొడుకు తండ్రిని చెరలో వేశాడు; తండ్రి కొడుకును నరికి చంపాడు; తల్లి కొడుకుకు విషాన్నిచ్చి చంపింది. తల్లిని కొడుకు నిప్పులో వేసి చంపాడు! కన్నవారికి, వారి పిల్లలకు ఇటువంటి సంబంధముంటే, చిన్నాన్నలు, మామలు, చిన్నమ్మ, పెద్దమ్మలు, అన్నదమ్ములు - వీరి గురించి చెప్పనవసరం లేదు. గురుదేవా! ఇటువంటి క్రూరపాతకాలను ఆ లంకారాజ్యపు రాజ వంశస్థులు చేశారని 'మహా వంశం' చెబుతోంది కద?"

"అవునవును! అటువంటి క్రూర కృత్యాలకు వారు పొందిన కఠిన శిక్షలను కూడ వివరించి చెబుతోంది. ఆ ఉదాహరణలను ఎత్తి చూపి, ప్రజలను ధర్మ మార్గాన నడవమని ఉపదేశిస్తూంది. దాన్ని మరిచి పోవద్దు! మహావంశం పవిత్రమైన గ్రంధం. ప్రపంచంలోనే సాటిలేని ధర్మ బోధ చేసే గ్రంధం!" అని ఆచార్య భిక్షువు ఉద్వేగంతో చెప్పారు.

"స్వామీ! నేను ఆ గ్రంధాన్ని తప్పుబట్టడం లేదు. రాజ్య కాంక్ష మనుషులను రాక్షసుల కన్న క్రూరులుగా ఎలా మార్చేస్తోందన్న విషయం గురించి మాత్రమే చెప్పాను. అటువంటి క్రూర పాపాల వల్ల కళంకితమైన లంకా రాజ్య సింహాసనాన్ని నేను తిరస్కరించింది తప్పంటారా?"

"మహా బుద్ధిమంతులైన బౌద్ధ సంఘంవారు ఆ కారణం వల్లనే లంకారాజ్యపు రాజ వంశాన్నే మార్చగోరారు. తమను ప్రధములుగా తీసుకొని ఒక కొత్త రాజ వంశం మొదలు కావాలని ఆశించారు. మీరు

దాన్ని తిరస్కరించింది తప్పే. లంకా సింహాసనాన్ని అధిష్ఠించి అశోక వర్ధనుడిలాగ లోకమంతా బౌద్ధ ధర్మాన్ని విస్తరింపజేసి కాపాడే అవకాశం మీకు దొరికేది...."

"గురుదేవా! భారత దేశాన్ని ఒక ఛత్రం కింద ఏలిన అశోక వర్ధనుడెక్కడ? ఈ రోజు ఈ చూడామణి విహారంలో దాక్కొని తమ రక్షణను కోరిన ఈ చిన్నవాడెక్కడ? నిజానికి తమ శిష్యునిగా కూడ నాకు అర్హత లేదు. బౌద్ధ ధర్మాన్ని ఎలా కాపాడబోతాను?"

"యువరాజా! అలా చెప్పకండి. తమలో నిగూఢమైవున్న శక్తిని మీరెరుగరు. మీరు గనుక బౌద్ధ ధర్మాన్ని మనఃపూర్వకంగా ఒప్పుకొంటే అశోకునిలాగ కీర్తి ప్రతిష్ఠలు పొందుతారు..."

"నా మనస్సులో చిన్నప్పటినుంచి శివపార్వతులు, గణపతి, సుబ్రమణ్య స్వామి, నంది, భృంగీశులు, చండికేశ్వరులు నెలకొనివున్నారు. వారందరిని బయటకు తొలగించి కద బౌద్ధ ధర్మానికి నా మనసులో చోటివ్వవలసివస్తుంది? గురుదేవా! ఈ దాసుడిని క్షమించండి. తమతో యాత్రలకు వస్తానన్నప్పుడు బౌద్ధ మతంలో చేరిపోతాననే ఉద్దేశంతో చెప్పలేదు. సముద్రాలను దాటి సుదూర దేశాలకు వెళ్ళాలనే ఆశ వల్లనే తమతో వస్తానన్నాను. కానీ, మళ్ళీ ఆలోచిస్తే..."

"యువరాజా! తమ మాటలను నేను పొరబాటుగానే అర్థం చేసుకొన్నాను. అయినా కూడ బౌద్ధ ధర్మానికి, మీకు బంధం లేకపోలేదు. బుద్ధ భగవానుడు ఒక పూర్వ జన్మలో శిబి చక్రవర్తిగా జన్మించారు. పావురాన్ని కాపాడేందుకు తమ మాంసాన్నే కోసిచ్చారు. ఆ శిబి వంశ పరంపరలో వచ్చినవారు చోళ వంశస్థులు. అందుకే మీ కులంలో పుట్టినవారికి 'శెంబియన్' అన్న బిరుదు ఇవ్వబడింది. దీన్ని మీరు మరిచిపోకండి...."

"మరువలేదు, గురుదేవా! నేను మరిచినా, నా ఒంట్లో పారే రక్తం మరువనివ్వదు. ఒక వైపు శిబి, మను నీతి చోళులు నా రక్త మాంసాల్లో భాగమై 'పరులకు ఉపకారం చేయి; ఇతరుల కోసం నీ సుఖభోగాలను త్యాగం చేయి!' అని ఘోషిస్తూనే ఉన్నారు. ఇంకొక వైపు కరికాన్ వలవన్, విజయాలయ చోళులు, పరాంతక చక్రవర్తి నా రక్తంలో చేరి ' చేత కత్తి పట్టు! చతురంగ బలాలను కూడదీయి! నలు దిశలా దండెత్తి పో! కడలి దాటి పో! చోళ సామ్రాజ్యాన్ని విస్తరించి లోకమింతకు మునుపు చూడని కీర్తి శిఖరాలకు తీసుకు పో!' అని పిడుగు పడ్డట్లు గర్జిస్తున్నారు. మరింకొకవైపు శివభక్తులైన ఆదిత్య చోళులు, మహా శివభక్తులైన గండరాదిత్యులు, 'ఆలయ కైంకర్యం చేయి! పెద్ద పెద్ద శివాలయాలను కట్టించు! ఆకాశాన్నంటే గోపురాలతో ఆలయాలను నిర్మించు!' అని ఉపదేశిస్తూనే ఉన్నారు. నా పూర్వీకులిందరి మధ్య చిక్కుకొని ఊపిరాడకున్నాను. గురుదేవా! వారి పోరు తట్టుకోలేక ఒక్కొక్కసారి నిజంగానే బౌద్ధ ధర్మాన్ని స్వీకరించి భిక్షువుగా మారిపోదామనిపిస్తుంది. కరుణ చూపి నాకు బౌద్ధ ధర్మాన్ని గురించి వివరంగా చెప్పండి. బుద్ధ భగవానుని గూర్చి చెప్పండి!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

ఇది విన్న ఆచార్య భిక్షువు ముఖం ఆనందంతో విప్పారింది.

"యువరాజా! బౌద్ధ మతం గురించి, బుద్ధ భగవానుని గురించి మీరెరుగనిది ఏముండగలదు?" అన్నారు.

"అదిగో, ఆ గోడలపైన చిత్రించిన చిత్రాలను వివరించి చెప్పండి. అక్కడ ఒక చిత్రంలో రాకుమారుడొకడు మధ్యరాత్రి లేచి వెళ్ళడానికి ప్రయత్నిస్తున్నట్లుంది కద? అదేమి? ఆయన సమీపాన పడుకొనివున్న స్త్రీమణి ఎవరు? ఊయలలో నిద్రిస్తున్న బిడ్డ ఎవరు? ఆ రాకుమారుని ముఖాన ఎందుకంత దిగులు గూడు కట్టుకొనివుంది?" అని అడిగారు యువరాజు.

"అయ్యా! బుద్ధ భగవానుడు మీలాగే రాజవంశంలో పుట్టినవారు. యశోధర అనే నిరుపమాన సౌందర్యవతిని పెళ్ళాడారు. వారికి ఒక ముద్దుల కొడుకు జన్మించాడు. తండ్రి రాజ్యభారాన్ని ఆయనకు ఒప్పగించేందుకు సిద్ధంగా ఉన్నారు. ఆ సమయాన సిద్ధార్థులు లోకంలో ప్రజలనుభవిస్తున్న దుఃఖాలను పోగొట్టే మార్గాన్ని కనిపెట్టాలని ఆశించారు. అందుకని తన ముద్దుల భార్యను, బిడ్డను, రాజ్యాన్ని త్యజించాలని తీర్మానించుకొన్నారు. ఆయన అంతఃపురం వదిలి బయలుదేరుతున్న దృశ్యమే అది, యువరాజా! ఆ వృత్తాంతాన్ని మీరిప్పటికే ఎరుగుదురు కద?"

"అవును. చాల సార్లు విని తెలుసుకొనివున్నాను. కానీ ఈ చిత్రాలను చూసినప్పుడు మనసులో పదిలమైనట్లు విన్నప్పుడు మనసులో పదిలం కావడంలేదు. నిద్ర పోతున్న యశోధరను లేపి, 'నిన్ను విడిచి వెళ్ళి పోతున్నారు; ఆయనకడ్డుపడి ఆపు!' అని చెప్పాలనిపిస్తుంది. సరే! తర్వాతి చిత్రం గురించి చెప్పండి!"

~

బుద్ధ భగవానుని జీవిత చరిత్రను విశదీకరిస్తున్న తక్కిన చిత్రాలను కూడ భిక్షువు వివరంగా చెప్పారు. అరుళ్మొళి వర్మ బౌద్ధ ధర్మాన్ని స్వీకరిస్తే ఎంత బాగుంటుందని ఆయన మనసు లోలోపల ఆశపడుతూనే ఉన్నారు. కాబట్టి ఆ చిత్రాల వివరాలను అమిత కుతూహలంతో చెప్పుకొచ్చారు. చివరిగా సిద్ధార్థులు బోధి వృక్షం కింద కూర్చొని తపస్సు చేస్తున్నప్పుడు జ్ఞానోదయం పొందే చిత్రానికి వచ్చారు.

ఆ చిత్రాన్ని గురించి చెప్పిన తర్వాత పొన్నియిన్ సెల్వన్ "గురువర్యా! మీమాటకు వ్యతిరేకంగా నేనేమైన చెబితే మీకు కోపం వస్తుందా?" అని అడిగారు.

"యువరాజా! నేను పంచేంద్రియాలను జయించి మనసును అదుపులో ఉంచుకోగలవాడిని. మీరు మీమాటను ధారాళంగా చెప్పవచ్చు" అన్నారు ఆచార్య భిక్షువు.

"బోధి వృక్షం కింద కూర్చొన్నప్పుడు సిద్ధార్థులు జ్ఞానోదయం పొందారని నేను నమ్మడంలేదు."

పంచేంద్రియాలను, మనసును జయించారన్న ఆచార్య భిక్షువు ముఖం అది విని కాస్త కుంచించుకుపోయింది.

"యువరాజా! మహాబోధి వృక్షం ఒక శాఖను అశోక వర్ధనుని కాలంలో లంకకు తీసుకొని

రాబడింది. ఆ కొమ్మ వేళ్ళూని చెట్టుగా పెరిగి పెద్దదై వెయ్యేళ్ళకు పైబడి ఇప్పటికీ బిగి పోకుండ అనురాధపురంగా విస్తరించి విరాజిల్లుతోంది. ఆ పవిత్ర వృక్షాన్ని మీరే అనురాధపురంలో చూసివున్నారు. మరి 'నమ్మడం లేదు' అని ఎందుకంటున్నారు?" అని అడిగారు.

"గురుదేవా! బోధి వృక్షమే లేదని నేనడం లేదు. దాని కింద సిద్ధార్థులు కూర్చొని తపస్సు చేశారన్న విషయాన్ని కూడ నేను తిరస్కరించడం లేదు. అక్కడే ఆయనకు జ్ఞానోదయమయిందని చెప్పడాన్నే నేనంగీకరించడం లేదు. ఏ రోజు ఆయన ప్రజల దుఃఖాలను పోగొట్టడానికి మార్గాన్ని వెతకాలని కట్టుకొన్న భార్యను, కన్న బిడ్డను, అర్హత ఉన్న రాజ్యాన్ని త్యజించి మధ్యరాత్రి బయలుదేరారో ఆ రోజే ఆయనకు జ్ఞానోదయమైందని నేనంటున్నాను. దాని కన్న అద్భుతమైన కృత్యాన్ని నేను ఏ వృత్తాంతలోను, కావ్యంలోను వినలేదు, చదవలేదు. రాముడు తండ్రి వాక్కును పాలించేందుకు రాజ్యాన్ని త్యాగం చేశాడు. భరతుడు తన అన్న మీది భక్తి వల్ల 'రాజ్యం వద్దు' అన్నాడు. హరిశ్చంద్ర చక్రవర్తి తానిచ్చిన మాటను నెరవేర్చేందుకు తమ రాజ్యాన్ని త్యజించారు. శిబి చక్రవర్తి కూడ పావురాన్ని కాపాడేందుకు తమ శరీరంనుంచే మాంసాన్ని కోసిచ్చారు. కానీ సిద్ధార్థులు ఎవరికీ మాటివ్వలేదు. ఎవరినీ తృప్తిపరచగోరలేదు. మనుష్యజాతి దుఃఖాలను పోగొట్టే మార్గాన్ని వెతికేందుకు తమకు తామే, అన్నిటినీ త్యజించి, బయలుదేరారు. బుద్ధ భగవానుడు బోధివృక్షం కింద జ్ఞానోదయం పొందిన తర్వాత, దీని కన్న అద్భుతమైన కార్యమేమైనా చేశారా? లేదు కాబట్టి అంతఃపురం వదిలి బయలుదేరినప్పుడే ఆయనకు జ్ఞానోదయమైందని నేననడం పొరబాటవుతుందా?"

~

ఇలా పొన్నియిన్ సెల్వన్ చెప్పిన మాటలు ఆచార్య భిక్షువు చెవుల్లో అమృతం పోసినట్లనిపించింది.

"అయ్యా! మీరు చెప్పిన మాటల్లో గొప్ప నిజముంది. అయినా కూడ బోధివృక్షం కిందనే ప్రజల దుఃఖాలను పోగొట్టే మార్గం బుద్ధ భగవానునికి ఉదయమైంది. అప్పటినుంచే భగవానుడు బోధన చేయడం మొదలుపెట్టారు."

"స్వామీ! ఆ బుద్ధ భగవానుని బోధనలు విన్నాను. ఆ బోధనలకన్న వారి త్యాగమే గొప్పదైన బోధన అని నేను భావిస్తున్నాను. క్షమించాలి. నేను కూడ ఆయనలాగే ఆయన చేసిన కార్యాలను చేయాలని కోరుకొంటున్నాను. కాసేపటి క్రితం నా పూర్వీకుల మూడు గొంతులతో మూడు విధాలుగా తీరిక లేకుండ నన్ను వేధిస్తున్నారని చెప్పాను కద? ఆ వేధింపునుంచి విడుదల పొందాలని కోరుకొంటున్నాను. నన్ను తమ శిష్యునిగా స్వీకరించండి!" అన్నారు యువరాజు.

"యువరాజా! మీలాంటి శిష్యుని పొందడానికి నేనెంతో భాగ్యం చేసివుండాలి. కానీ దానికి కావలసిన అర్హత కూడ నాకు లేదు; ధైర్యం కూడ లేదు. లంకలో బౌద్ధ మహాసంఘం

సమావేశమయ్యేటప్పుడు మీరు మీ విన్నపాన్ని తెలియజేయవచ్చు" అన్నారు ఆచార్య భిక్షువు.

"మీ అర్హత గురించి నాకు సందేహం లేదు. కానీ ధైర్యం గురించి చెప్పారు కద, అదేమి?"

"అవును; ధైర్యం లేదు నిజమే! రెండు రోజులుగా ఈ నాగపట్టణంలో ఒక వదంతి వ్యాపించింది. దాన్ని ఎవరు పుట్టించారో తెలియదు. మీరు ఈ విహారంలో ఉన్నారని, తమను బౌద్ధ భిక్షువుగా మార్చేందుకు మేము ప్రయత్నిస్తున్నామని ప్రజలు చెప్పుకొంటున్నారట. ఇందువల్ల అనేకులు కోపంగొన్నారట. ఈ విహారం మీద ప్రజలు దండెత్తి వచ్చి నిజం తెలుసుకోవాలని చెప్పుకొంటున్నారట....!"

"ఆహా! ఇదేం పిచ్చితనం? నేను బౌద్ధమతంలో చేరడం గురించి ఊరి ప్రజలకెందుకు దిగులు? నేను కాషాయవస్త్రాలు ధరించి సన్యాసం పుచ్చుకొంటే వీరెందుకు కోపగించుకోవాలి? ఇంతకీ నాకు వివాహం కూడ కాలేదు కద? భార్యను, పిల్లలను వదిలి వెళ్ళిపోతున్నానని నింద మోపలేరు కద?" అన్నారు యువరాజు.

"అయ్యో! ప్రజలకు మీపైన కోపమేమీ లేదు. తమను మోసం చేసి బౌద్ధ భిక్షువుగా మార్చేందుకు ప్రయత్నిస్తున్నామని మాపైనే కోపమంతాను. ఒట్టి వదంతే ఇంతటి కల్లోలాన్ని లేపింది. నిజంగానే జరిగితే ఏమవుతుంది? ప్రజలీ విహారాన్ని నేలమట్టం చేసేస్తారు. ఏదో మీ తండ్రి పాలనలో మేము నెమ్మదిగా నివసిస్తున్నాము... ఈ ప్రశాంత స్థితిని పాడు చేసుకోవడానికి నేనిష్టపడడం లేదు. అందుకే ధైర్యం లేదన్నాను" అన్నారు ఆచార్య భిక్షువు.

ఆయన అలా చెప్పి ముగించేలోపు ఆ విహారం ప్రధాన ద్వారం వద్ద అనేక ప్రజల గొంతులు పెద్దగా వినిపించింది.

భిక్షువు అది కాసేపు శ్రద్ధగా విన్న తర్వాత, "యువరాజా! నేను చెప్పింది నిజమని నిరూపించేందుకు ప్రజలే ఇక్కడికి వచ్చేశారు లాగుంది. దీన్ని ఎలాగ నిభాయించబోతున్నానో, తెలియదు! బుద్ధ భగవానుడే దారి చూపాలి!" అన్నారు.

చూడామణి విహారం చుట్టుపక్కల గుమిగూడిన వేలాది ప్రజలు చేస్తున్న హాహాకారాలు క్షణక్షణానికి అధికం కాసాగింది.

~~~
~~~

# అధ్యాయము - 2

## వచ్చాడు మురుగయ్యన్!

**చూడామణి** విహారం ముందు కడలి పొంగేటప్పుడు లేచే ఉద్ధృతమైన హోరులాగ లేచిన ప్రజల నినాదాన్ని ఆచార్య భిక్షువు, అరుళ్మొళి కాసేపు వింటూ నిలబడ్డారు.

ఆ బౌద్ధ విహారం, అందులో ఉన్న భిక్షువులు తనవల్ల ఇంతటి సంకటానికి గురి కావడం చూసి యువరాజు చాల కలతజెందారు.

“స్వామీ! నావల్ల మీకింతటి కష్టం కలిగినందుకు చాల విచారిస్తున్నాను!” అన్నారు.

“యువరాజా! మీ కారణంగా దీనికన్న నూరు రెట్లు పెద్ద కష్టం వచ్చినా మేము పట్టించుకోము. మీరు, మీ కుటుంబస్థులు మాకు చేసిన సహాయానికి ఇది సాటి వస్తుందా?” అన్నారు ఆచార్య భిక్షువు.

“అది మాత్రమే కాదు. ఇలా దాగుడు మూతలాడుతూ ఏ పనీ చేయడం నాకిష్టం లేదు. నేనిక్కడున్నప్పుడే 'లేదు' అని ఎందుకు చెప్పాలి? సత్యానికి విరుద్ధమైన ఈ కార్యంలో మిమ్మల్ని కూడ ఎందుకు ఇరికించాలి? మీ మేలైన చికిత్స వల్ల నా జబ్బు కూడ పూర్తిగా నయమైంది. ఇప్పుడే వెళ్ళి ఎందుకు ప్రజలకు నేను ఫలానా అని తెలియజెప్పేస్తాను. మీరు నాకు ఆశ్రయమిచ్చి చికిత్స చేసి నన్ను కాపాడారని ప్రజలకు తెలియజేస్తాను. ఈ చూడామణి విహారానికి నావల్ల ఎటువంటి అపకీర్తి కూడ రాకూడదు" అన్నారు యువరాజు.

“అయ్యా! ఇందులో సత్యవిరుద్ధమైన కార్యమేమీ లేదు. తన శత్రువులు మీరున్న చోటును కనిపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నాగపట్టణంలో వారు గత రెండు రోజుల్లో లేపిన వదంతే దాన్ని నిరూపిస్తూంది. అలా ఉండగా, మీరు ఇక్కడ ఉన్న విషయాన్ని తెలియజేయకుండడంలో తప్పేమి? రాజ వంశస్థులు కొన్ని సమయాల్లో ఇలా రహస్యంగా దాగి ఉండడం రాజకీయ ధర్మానికి తగినదే. పంచపాండవులు ఒక సంవత్సరంపాటు అజ్ఞాతవాసం చేయలేదా? అప్పుడు ధర్మపుత్రులు సత్యానికి విరుద్ధంగా నడుచుకొన్నారని చెప్పగలమా?” అన్నారు ఆచార్యులు.

“గురుదేవా! తమ బుద్ధి కుశలత, వాగ్వివాదశక్తి అపారమైనవని ఎరుగుదును. మీతో తర్కించి గెలవలేను. కానీ ఒకటి మాత్రం చెబుతాను. పాండవులు అలా ఎందుకు అజ్ఞాతవాసం చేయవలసి వచ్చిందంటే, వారు జూదంలో ఓడిపోయి వనవాసం, అజ్ఞాతవాసం చేస్తామని ఒప్పుకొన్నారు కాబట్టి. నాకలాంటి అవసరం ఏమీ లేదు. నా విరోధులను గురించి చెప్పారు. నాకటువంటి విరోధులు ఎవరు? ఎందుకని వారు నన్ను విరోధించాలి? నాకేమో రాజ్యమేలాలనే ఆశ కించిత్తు కూడ లేదు. ఇదంతా బాహాటంగా చెప్పి, నాకు విరోధులెవరైనా ఉంటే వారిని కూడ స్నేహితులుగా చేసుకొంటాను. నావల్ల

మీకిబ్బంది లేకుండ పోతుంది. ప్రజలు కూడ నేను సజీవంగా ఉన్నానని తెలుసుకొని తృప్తిపడుతారంటే అలాగే తృప్తి పడనీ! అందువల్ల ఎవరికేం నష్టం?"

"యువరాజా! మీరు చెబుతున్నదంతా నిజమే. మీరున్న పరిస్థితిలో నేనుంటే నేను కూడ అలాగే నడుచుకొనేవాడిని. కానీ అందుకు అడ్డు నిలుస్తున్నది మీ సహోదరి కుందవైదేవికి మేమిచ్చిన మాటే. పళైయార్రై యువరాకుమారి వంటి తెలివైనవారు ఇంతవరలు చోళవంశంలో పుట్టలేదని మీరే చాలసార్లు చెప్పారు. ఇంకే రాజవంశంలో కూడ ఉదయించలేదన్నది నా అభిప్రాయం. వారు సందేశం పంపించేవరకు మిమ్మల్ని ఇక్కడ ఉంచి కాపాడాలని చెప్పి వెళ్ళారు. బలమైన కారణం లేకుండ వారలా చెప్పివుండరు. సుందరచోళ చక్రవర్తి కుటుంబానికి విరుద్ధంగా చోళదేశపు చిన్నరాజులు పలువురు కుట్ర చేస్తున్నారని దేశమంటా ప్రజలు చెప్పుకొంటున్నారు. ఇంకొకవైపు పాండ్యదేశపు గూఢచారులు కొందరు రహస్య పన్నాగాలు చేస్తున్నట్లు కూడ వినికిడి. ఆ కుట్రదారులకు ఈ విహారంలో ఉన్న మేము సహాయం చేస్తున్నామేమో అని భావించడం వల్లనే ప్రజలు కోపంగొని వాకిట వచ్చి గుమిగూడారు. ఇటువంటి పరిస్థితిలో మీరు బయటకు వెళ్ళి ప్రజల ముందు మిమ్మల్ని బయటపెట్టుకోవడం ఉచితమైన కార్యమా? ఆలోచించండి! దానికన్న మిమ్మల్ని కాపాడే ప్రయత్నంలో మాకందరికీ ఏదైనా అపాయం కలిగితే కలగనీ! అందుకు మేమెన్నడూ వెనుకంజ వేయము...!"

~

ఆచార్య భిక్షువు ఇలా చెబుతుండగానే ఇంకొక యువ సన్యాసి అక్కడికి ఆదుర్దాగా వచ్చారు.

"స్వామీ! పరిస్థితి చేయి దాటిపోతూంది. వేలకొద్ది ప్రజలు విహారాన్ని చుట్టుముట్టి 'యువరాజును చూడాలి' అని కేకలేస్తున్నారు. 'యువరాజిక్కడ లేరు' అని మేమెంత చెప్పినా వినడం లేదు. 'మేమే విహారం లోపలికొచ్చి శోధించాలి' అని అరుస్తున్నారు. వారికి మనమేదైనా నచ్చచెప్పకపోతే బలవంతంగా లోపలికి దూరి వచ్చేస్తారులాగుంది!" అన్నారు.

"వారికి మనమేం దారి చెప్పగలం? బుద్ధ భగవానుడు వారి మనసులను మార్చేందుకు ఏదైనా దారి చూపితేనే సరి!" అన్నారు ఆచార్య భిక్షువు.

యువరాజప్పుడు, "గురుదేవా! నాకొక దారి తోస్తూంది. దయవుంచి వినాలి. తమ శిష్యులు నేనిక్కడ లేనని ప్రజలకు చెప్పారు. ఇక నేను ప్రజల ముందుకు వెళ్ళి నిలబడితే మీ శిష్యులు చెప్పిన మాట అబద్ధమైపోతుంది. అందువల్ల ప్రజల మూర్ఖావేశం అధికం కావచ్చు కూడాను" అన్నారు.

"తప్పక అలాగే జరిగి తీరుతుంది. దాని ఫలితాన్ని మేము అనుభవించే తీరాలి" అన్నారు ఆచార్యులు.

"దానికన్న తమ శిష్యుల మాటను నేను నిజం చేసేస్తాను..."

"యువరాజా! అది తమవల్ల కాని కార్యమని తలుస్తాను. మీరు చెప్పినట్లే కద? దాన్ని నిజం

చేయడమెలా?"

"దానికొక దారి ఉంది. ప్రజలు ఈ విహారంలోకి చొరబడే లోపల నేనిక్కడినుంచి వెళ్ళిపోదామని నేనాలోచిస్తున్నాను!"

"ఆహా! మమ్మల్ని కాపాడుకోవడం కోసం మేమలాంటి పాపకృత్యం చేయాలా? మిమ్మల్ని బయటకు పంపించాలా?"

"గురుదేవా! ఇందులో పాపమూ లేదు, నిందా లేదు. ఇక్కడికి అర్ధకోసు దూరాన ఆనైమంగలంలో చోళ మాళిగ ఉంది. ఆరోజు నా సహోదరిని చూసేందుకు వెళ్ళినట్లే ఇప్పుడు కూడ కాలువ దారి గుండా వెళ్ళిపోతాను. తర్వాత, తీరిక దొరికినప్పుడు మళ్ళీ ఇక్కడికి వస్తాను!" అన్నారు యువరాజు.

~

ఆచార్య భిక్షువుకు యువరాజు చెప్పిన ఈ ఉపాయం నచ్చినట్లు తోచింది.

"అవునవును! అలా చేస్తే మిమ్మల్ని వెంటనే బయటపెట్టేసుకోవలసిన అవసరం తప్పుతుంది. తమ అక్కగారికిచ్చిన మాటను కూడ నెరవేర్చినట్లవుంది. కానీ విహారంనుంచి బయటకు వెళ్ళే చోట కూడ ప్రజలు గుమిగూడి ఉండవచ్చు కద? వారు మీరు పడవలో వెళ్ళడాన్ని చూడగలరు కద?"

"గురుదేవా! అందుకు ఒక ఉపాయం చేయవచ్చు. గుంపులో ఉన్న ఒకరిని విహారం లోపలికి వచ్చి వెతుక్కోండి అని చెబుదాం" అన్నారు యువ భిక్షువు.

"వారినిక్కడ కాస్త ఆలస్యం చేసి ఆపేస్తే, అంత లోపల చీకటి పడిపోతుంది. యువరాజు వెడలేందుకు అనుకూలంగా ఉంటుంది. అది మాత్రమే కాదు; త్వరలో ఒక పెద్ద సుడిగాలి వచ్చే సూచనలు కనిపిస్తున్నాయి. ఇక్కడినుంచి చూస్తున్నప్పుడే కడలి అలలు కొండెత్తు లేస్తున్నాయి. కడలిలో కల్లోలం కూడ అధికమవుతూంది. బుద్ధభగవానుని కరుణ అలా ఉందో ఏమో! పెద్ద తుఫాను వచ్చి మన ఈ సంధిగ్ధ పరిస్థితి వీడిపోవాలని భగవానుని చిత్తమేమో!" అన్నారు గురువర్యులు.

"అలా చెప్పవద్దు. మన క్లిష్ట పరిస్థితి తీరేందుకు సముద్రం కల్లోలితమై పెద్ద తుఫాను రావాలా?" అన్నారు గురువర్యులు.

"స్వామీ! తమ శిష్యులు చెప్పే ఉపాయాన్ని పరీక్షించి చూద్దామని నాకూ అనిపిస్తూంది. లోపలికి ఒక్కడే ఒంటరిగా వస్తే, వాడితో మాట్లాడి నేనతని మనసును మార్చడం సాధ్యం కావచ్చేమో!" అన్నారు యువరాజు.

"ఆ ఆలోచన కూడ నా మనసులో ఉంది. రెండు రోజుల క్రితం కోడిక్కరై నుంచి ఒక పడవ నడిపేవాడు, వాడి భార్య విహారం వాకిట వచ్చి యువరాజు గురించి విచారించారు. యువరాజు ఇక్కడే ఉన్నారన్నారు. వాడి భార్య పెద్దగా కేకలేసింది....!"

"ఆహా! అటువంటి పడవనడిపేవాడెవ్వడు? వాడి పేరేమని తెలుసా?" అని అడిగారు

యువరాజు.

"అవును. తన పేరు మురుగయ్యన్ అని చెప్పాడు. కోడిక్కరై త్యాగవిడంగర్ కుమారుడని కూడ చెప్పాడు."

"వాడు నాకు బాగా తెలుసు. నా కోరికకు విరుద్ధంగా ఏమీ చేయడు. వాడిని నా దగ్గరికెందుకు పిలుచుకొని రాలేదు?"

"వాడి పెళ్ళాం మన రహస్యాన్ని కాపాడలేదని సందేహించాము. ఇప్పుడు వాడు, వాడి భార్య ప్రజల గుంపులో ఉన్నారు."

"పండు జారి పాలలో పడ్డట్లయింది. మురుగయ్యన్ని మెల్లగా ఇక్కడికి పిలుచుకొని రండి. వాడు నేను గీచిన గీటు దాటడు. చీకటి పడ్డ తర్వాత వాడే తిరిగి వచ్చి ఆనైమంగలం మాళిగకు నన్ను తన పడవలో తీసుకొని వెళ్ళి విడిచి పెడతాడు!" అన్నారు యువరాజు.

"యువరాజా! ఈ కాలంలో ఎవరినీ పూర్తిగా నమ్మకూడదు. ఈ పడవ నడిపేవాడు, వాడి భార్యే రెండు రోజులుగా ఈ పట్టణంలో మీ గురించిన వదంతిని ప్రచారం చేసివుండాలని నేనంటున్నాను."

"అలాగే ఉన్నా కూడ దాని వల్ల నష్టమేమీ లేదు. ఎలాగూ ఎవరినైనా ఒక్కడిని విహారం లోపలికి వచ్చేందుకు అనుమతించాలి కద? వాడు కాస్త పెళ్ళాం మాట ప్రకారం ఆడేవాడే. కానీ నా కోరికకు, ఆదేశానికి వ్యతిరేకంగా భార్య మాట కూడ వినడు. వీలైతే వాడినే పిలుచుకొని రండి!" అన్నారు యువరాజు.

ఆచార్య భిక్షువు సమ్మతించగా యువ భిక్షువు బయటకు వెళ్ళారు. వారు వెళ్ళిన కాసేపటికల్లా ఆచార్య భిక్షువు, "యువరాజా! నా మనసేమో నెమ్మదిగొనడం లేదు. నేనూ బయటకు వెళ్ళి చూసి వస్తాను. ప్రజల మనోస్థితి ఎలా ఉందని ప్రత్యక్షంగా చూసి తెలుసుకొని వస్తాను. నా పొరబాటు వల్ల ఈ పురాతన విహారానికి కీడు కలగకూడదు. మీకు కూడ ఏ హానీ కలగకూడదు!" అని చెప్పేసి బయటకు వెళ్ళారు.

~~~
~~~

# అధ్యాయము - 3

## కడలి పొంగింది!

**విహారం** బయట ఆచార్య భిక్షువు చూసిన దృశ్యం ఆయన మతి పోగొట్టేటట్లు ఉంది. వేలకొద్ది ప్రజలు తండోపతండాలుగా వచ్చి గుమిగూడివున్నారు. వారి తీరు, వారి కేకలు గమనిస్తే వారు అమితావేశంగొని ఉన్నారని విశదమవుతూంది. ఆ ఆవేశాన్ని క్రోధంగ మార్చడం అతి సులభం. పలువురు చేత శూలం, కత్తి, బడితె వంటి ఆయుధాలను పట్టుకొనివున్నారు. ఇంకొందరి చేతుల్లో గునపాలున్నాయి. భిక్షువులు తమ దారికి రాకపోతే విహారాన్నే పడగొట్టి నేలమట్టం చేసేయాలన్నది వారి ఉద్దేశం కాబోలు.

దానికి కావలసిన కారణాలు లేకపోలేదు. పరాంతక చక్రవర్తి కాలంనుంచి చోళనాడుకు, లంకారాజ్యానికి మధ్య యుద్ధాలు జరుగుతున్నాయి. చోళనాడు వీరులు పలువురు లంకలో మరణించారు. ఏదైనా ఒకటి ఇష్టం లేకపోతే, దానికి సంబంధించిన/చేరిన వాటిని కూడ ఇష్టపడకపోవడం ప్రజల స్వభావం కద? లంకతో యుద్ధం కారణంగా చోళనాడు ప్రజలకు ఏర్పడ్డ ఆవేశకావేశాలు ఆ దీవిలో వ్యాపించిన బౌద్ధమతం మీదకు కూడ కాస్త మళ్ళింది. ఏదైనా ఒక కారణం దొరికితే చాలు - తమిళనాడులో మిగిలివున్న బౌద్ధ విహారాలమీద, వాటిలో నివసిస్తున్న భిక్షువులమీద – పగ తీర్చుకోవడానికి పామర జనాలు సిద్ధంగా ఉన్నారు.

అటువంటి సందర్భం ఇప్పుడు ఏర్పడిపోయిందని ఆచార్య భిక్షువు గ్రహించారు. ఎవరో దురుద్దేశం కలవారు పామర జనాల ఆవేశాన్ని ఎగదోసినట్లున్నారు. బుద్ధ భగవానుని దయవల్లనే ఈ మహాపాయం నుంచి బయటపడడం సాధ్యం...!

ఆచార్య భిక్షువును చూసిన వెంటనే ప్రజల గోల అధికమైంది.

"పొన్నియిన్ సెల్వన్‌గారిని మాకిచ్చేయండి! లేకపోతే ఈ విహారాన్ని పడగొట్టి నేలమట్టం చేసేస్తాం!" అన్న కేకలు ఏకకాలంలో వేల గొంతులనుంచి వెలువడి సముద్రఘోషలాగ మారుమోగింది. అదే సమయాన కడలిలో అలల ఘోష అధికం కావడాన్ని కూడ ఆయన గమనిస్తూ వచ్చారు. యువ భిక్షువు చెప్పింది నిజమే. అతివేగమైన, అతిబలమైన సుడిగాలి సముద్రతీరాన్ని సమీపిస్తూంది. అతి త్వరలోనే తుఫాను తీరాన్ని తాకబోతూంది. ఈ ప్రజల అపాయంనుంచి తప్పించుకొన్నా కూడ తుఫాను దెబ్బ నుంచి విహారం బతికి బయటపడాలి కద అని దిగులు పడసాగారు.

ఇంతలో యువ భిక్షువు చేతులతో సంజ్ఞ చేసి ప్రజల కోలాహలాన్ని కాస్త నెమ్మదించారు.

~

"మహాప్రజలారా! మా ఆచార్యులను పిలుచుకొని వచ్చాను. కాస్త శాంతంగా ఉండండి. మీరింత

మందీ ఒకేసారి విహారంలోపలికి దూరి రాలేరు కద? మీలో ఎవరినైనా ఒక్కరినో, ఇద్దరినో సూచించండి. వారు విహారం లోపలకు వచ్చి వెతికి చూడనీ! వారు తిరిగి వచ్చి చెప్పిన విషయాన్ని మీరు అంగీకరించాలి! ఇది మీకు సమ్మతమే కద? మీలో ఎవరు నాతోబాటు విహారం లోపలికి వస్తున్నారు?" అని అడిగారు.

గుంపులో వందలకొద్దీ ప్రజలు, "నేను వస్తాను! నేను వస్తాను!" అని కేకలేశారు.

యువ భిక్షువు మళ్ళీ చేయెత్తి, "అందరూ చేరి కేకకేయడం వల్ల ఏం ప్రయోజనం? ఎవరైన ఒక్కరిని ఎంపిక చేయండి. అందుకు నేనొక ఉపాయం చెబుతాను. ఇటీవల, గత నెల రోజుల్లో, పొన్నియిన్ సెల్వన్ని చూసినవారుంటే చెప్పండి. అలాంటివారిని నేను లోపలికి పిలుచుకొని వెళతాను. యువరాజును గుర్తు పట్టేందుకు కూడ అనుకూలంగా ఉంటుంది!" అన్నారు.

గుంపులో ముందు నిలబడి ప్రతిసారి కేకలేస్తున్న రాక్కమ్మాళ్, "ఇదిగో మేమిద్దరం చూశాము!" అన్నది.

యువ భిక్షువు పడవ నడిపేవాడిని చూసి, "ఆమె చెబుతున్నది నిజమేనా?" అని అడిగారు.

మురుగయ్యన్, "స్వామీ! ఈమె చెబుతున్నది పూర్తి నిజంకాదు; ఈమె యువరాజును ఇటీవల చూడలేదు. నేను గత నెల రోజుల లోపు ఈలంలో పొన్నియిన్ సెల్వన్‌గారిని చూసింది నిజం. నేను తెలియక ఆయనకు చేసిన అపకారానికి క్షమాపణ కోరుకొన్నాను. అప్పుడాయన నాపై కరుణతో చిరునవ్వు నవ్వింది నిన్న జరిగినట్లు నా మనసులో పదిలమైంది. ఆయనను నేను సులభంగా గుర్తు పట్టగలను" అన్నాడు.

"అలాగైతే నీవే ఈ పనికి తగినవాడివి. నీ భార్య చెప్పినదాంట్లో కూడ అంతగా తప్పేమీ లేదు. నీవు చూసింది ఆమె చూసినట్లు భావించి అలా చెప్పింది. నీవిప్పుడు ఈ విహారంలో వెతికి చూసి వచ్చి చెబితే ఒప్పుకొంటుంది. బుద్ధ భిక్షువులు తపస్సు చేసే విహారంలో స్త్రీలకు ప్రవేశం లేదని ఆమెకు తెలిసే ఉంటుంది. కాబట్టి నీవిలా రా!" అని యువ భిక్షువు పిలిచారు. తర్వాత విహారం ముందు మెట్లనుంచి కిందకు దిగి వెళ్ళి మురుగయ్యన్ చేయి పట్టుకొని మళ్ళీ మెట్లెక్కారు. ప్రజలను చూసి, "ఇదిగో, ఈ మురుగయ్యన్ ఇటీవల యువరాజును చూశాడట. కాబట్టి ఇతన్ని లోపలికి పిలుచుకొని వెళుతున్నాను. విహారమంతా వెతికి చూసి వచ్చి చెబుతాడు. మీకందరికీ ఇది సమ్మతమే కద?" అన్నారు.

ప్రజల కూటమినుంచి సమ్మతం అంత త్వరగా రాలేదు. కొందరు, "సమ్మతమే" అని గొణిగారు. ఇంకొందరు, "ఇందులో ఏదైనా మోసం ఉండవచ్చా?" అని ఒకరితోనొకరు రహస్యంగా మాట్లాడుకొన్నారు.

యువ భిక్షువు అది గమనించి పెద్దగా, "మహాప్రజలారా! ఇదిగో మా ఆచార్యులిక్కడే ఉన్నారు. మీరేదైనా అడగాలనుకొంటే వారినే అడగవచ్చు. అంతలోపల ఇతన్ని లోపలికి తీసుకొని వెళ్ళి చూపిస్తాను" అని చెప్పేసి, మురుగయ్యన్ని పిలుచుకొని లోపలకు వెళ్ళారు.

~

గంభీర భావంతో బాటు శాంతం నెలకొన్న ఆచార్య భిక్షువు ముఖాన్ని చూసిన వెంటనే ప్రజల మనస్సుల్లో కాస్త భక్తి భావం కలిగింది. ఆయనను అధిక ప్రసంగ ప్రశ్నలు అడిగేందుకు ఎవరూ తెగించలేదు.

ఆచార్య భిక్షువు కాసేపు ఆ ప్రజాసందోహాన్ని చూస్తూ నిలబడ్డారు. తర్వాత వారి వెనుక సముద్రాన్ని చూశారు.

“మహాజనులారా! మీరందరూ ఇక్కడికి వచ్చి చేరిన ఉద్దేశాన్ని గ్రహించాను. చక్రవర్తి ముద్దుల కుమారుడు, పొన్ని నది ముద్దు బిడ్డడు అయిన అరుళ్మొళి వర్మగారి మీద మీకందరికీ ఎనలేని ప్రేమ ఉందని నాకు తెలుసు. మీలాగే నేను కూడ ఆయనమీద అమిత ప్రీతి, ప్రేమ కలిగినవాడినే. ఆయన కడలిలో మునిగిపోయారన్న వార్త వచ్చినరోజు ఇదే మెట్ల మీద నిలబడి కన్నీరు విడిచాను. బౌద్ధ ధర్మం పాటించేవారెవ్వరూ అరుళ్మొళి వర్మగారిమీద ప్రీతి, ప్రేమగొనకుండడం అసాధ్యం. ఎందుకంటే, బౌద్ధ ధర్మానికి, బౌద్ధ భిక్షువులకు ఆయన అటువంటి మహోపకారాలు చేశారు. బౌద్ధుల పుణ్యక్షేత్రమైన అనురాధపురంలో బౌద్ధ రాజుల కాలంలో విరిగి పడి పాడుబడ్డ విహారాలను, స్తూపాలను పునర్నిర్మింపజేశారు. అటువంటి ఉత్తములైన యువరాజుకు మేమెలా హాని చేయగలం? యువరాజుకు ఏమీ కీడు జరగకుండాలి. ఆయనను కడలి తీసుకొని వెళ్ళిపోయిందన్న వార్త అబద్ధమైవుండాలని మేమందరమూ ప్రార్థిస్తున్నాము. మీ అందరికన్న మేము పొన్నియిన్ సెల్వన్ మీద అధిక ప్రేమ కలిగివుండడానికి అనేక కారణాలున్నాయి...”

ఈ సమయాన ప్రజల గుంపునుంచి ఒకడు అడ్డుపడి, “అందుకే మాకందరికీ భయంగా ఉంది. మీ ప్రేమ అపరిమితమైపోయి, యువరాజు తలను బోడిగుండు చేసేసి కాషాయ వస్త్రాలు కట్టించేసి బౌద్ధ భిక్షువుగా చేసేస్తారేమోనని భయపడుతున్నాము!” అన్నాడు.

ఇది వినగానే వాడి చుట్టూవున్న పలువురు హేళనగా గొల్లుమని నవ్వారు.

~

ఆచార్య భిక్షువుకు ఆ సమయాన ఉన్నట్లుండి పెద్ద ఆవేశం కమ్ముకొంది. ఈ సందర్భంలో ప్రజల సందేహాన్ని నివృత్తి చేసేందుకు ఒకే ఒక్క మార్గముందని ఆయన దృఢంగా నమ్మారు. వెంటనే ముందు వెనుకలాలోచించకుండ మనసుకు తోచినదాన్ని కింద సూచించిన ప్రకారం శపథంగా ప్రకటించారు:

“చక్రవర్తి దివ్య కుమారుడు, పొన్నియిన్ సెల్వన్ అయిన యువరాజు అరుళ్మొళి వర్మగారిని స్వీకరించమని నేనడగను. ఆయనే ముందుకొచ్చినా అంగీకరించను. లోకాన్నేలేందుకు పుట్టినవారు, మీ అనురాగాన్ని చూరగొన్నవారయిన రాకుమారుని తల బోడి చేసి, కావి బట్టలు కట్టించే కైంకర్యాన్ని నేనేనాడూ చేబట్టను. దానికి సహాయం కూడ  చేయను. ఈ విధంగా బుద్ధ భగవానుని పాదాల మీద శపథం చేస్తున్నాను! బుద్ధం శరణం గఛ్చామి! ధర్మం శరణం గఛ్చామి! సంఘం శరణం గఛ్చామి!”

పిడుగులాంటి గంభీరమైన స్వరంతో ఆచార్య భిక్షువు అలా చెప్పిన మాటలను వినగానే ఆ

ప్రజల మనసుల్లో ఒక పెద్ద మార్పు కలిగింది. పలువురు కంట నీరుబికింది. కాసేపు అక్కడ నిశ్శబ్దం నెలకొంది.

ఆచార్య భిక్షువు తమ భాషణను ఇలా కొనసాగించారు:-

"చోళనాడు ప్రజల కంటిపాపైన యువరాజు గురించి మీరందరూ ఇలా దిగులుపడడం సహజమే. పొన్నియిన్ సెల్వన్ గురించిన దిగులు మీకిప్పుడు తీరిపోయివుండవచ్చు. ఇక మీ కుటుంబం, ఇల్లు, వాకిలి గురించి శ్రద్ధ తీసుకోండి. మహా జనులారా! మనమింతవరకు కనీ, విని ఎరుగనంత పెద్ద సుడిగాలి, తుఫాను మనని సమీపిస్తూంది. అదిగో, మీ వెనక్కి తిరిగి చూడండి!"

ప్రజలు తిరిగి చూశారు. ఆయన చెప్పినట్లుగానే, వారు జీవితంలో ఎన్నడూ చూడని విచిత్రమైన దృశ్యాన్ని చూశారు. విచిత్రమైనది మాత్రం కాదు; భయంకరమైనది కూడాను.

~

సముద్రం పైపైకి పొంగివస్తూ, ఆకాశాన్ని కమ్ముకొన్న నల్లని కారు మబ్బులనంటుతున్నట్లుంది. ఆ వర్షజలం నిండిన కారు మేఘాలు ఒక చోట నిలవకుండ పైపైకి రాసాగాయి. ప్రజలు నిలబడ్డ చోటినుంచి చూసినప్పుడు ఆ కొండంతటి కారు మేఘాలు, కడలి అలలు వారున్న చోటు వరకు వచ్చేస్తే వారు మాత్రం కాదు, చూడామని విహారమే మునిగిపోవడం తథ్యం అని తోచింది.

ఈ దృశ్యాన్ని చూసిన ప్రజలు దిగ్భ్రమించి నిలబడిపోయినప్పుడు ఆచార్య భిక్షువు మళ్ళీ, "అదిగో, మీరందరూ నివసించే నాగపట్టణాన్ని చూడండి!" అన్నారు.

నాగపట్టణం విహారానికి కాస్త ఉత్తరంగా ఉంది. చాల విశాలమైనది కూడాను. సముద్రతీరానికి సమీపాన వస్తు భండార వీధులు, సుంకం వసూలు చేసే భవనాలు మొదలైనవి ఉన్నాయి. వాటికవతల ప్రజలు నివసించే ఇళ్ళు నలుదిక్కులా సుమారు అరకోసు దూరం విస్తరించివున్నాయి.

కడలి పొంగి వస్తుభండార వీధులను, సుంకపు చావడులను దాటి, పట్టణంలోని వీధుల్లోకి చొరబడనారంభించింది.

సముద్రంలోని ఓడలు, పడవలు ఎక్కడో ఆకాశాన వేలాడుతున్నట్లు కొండెత్తు అలలమీద తేలియాడుతూ అటూ ఇటూ ఊగసాగాయి. ఓడల తెరచాపలు పిశాచాల్లాగ ఆడుతూ చీలికలు, పీలికలైపోతున్నాయి.

"మహాజనులారా! ఒకప్పుడు కావేరి పట్టణాన్ని సముద్రం ముంచేసిందని విన్నాము. అటువంటి విపత్తు మన నాగపట్టణానికి కలగకుండ బుద్ధ భగవానుడు కాపాడనీ! అయినా కూడ మీరు వెంటనే వెళ్ళి మీ పిల్లాపాపలను, ఇల్లు వాకిళ్ళను వీలైనంతవరకు కాపాడుకోవడానికి ప్రయత్నించండి!" అని ఆచార్య భిక్షువు గద్గద స్వరంతో అన్నారు.

~

ఇది వినగానే ఆ జనసముద్రం కదలి అలలలాగే వేగంగా నగరంవైపు మళ్ళింది. ముందు నిలబడ్డవారు పరుగెత్తనారంభించారు. వెనుక నిలబడ్డవారు వారి వెనుక పరుగెత్తారు. కొద్ది నిమిషాల్లో ఒక పెద్ద జనసమూహం గుమిగూడిన ఆ ప్రదేశం నిర్మానుష్యమైంది.

పడవ నడిపేవాడి భార్య రాక్కమ్మాళ్ మాత్రం నిలబడ్డ చోటే నిలబడి, "నా మొగుడు! నా మొగుడు!" అని అరవసాగింది.

"అమ్మా! తల్లీ! నీ భర్తకు ఎటువంటి అపాయమూ కలగదు. క్షేమంగా తిరిగి వస్తాడు. నిన్ను నీవు కాపాడుకో!" అన్నారు ఆచార్య భిక్షువు.

"లేదు, లేదు! నా మగడిని వదిలి నేనెలా వెళ్ళగలను? నేనూ గుడికి వస్తాను" అన్నది రాక్కమ్మాళ్.

"కూడదమ్మా, కూడదు! బౌద్ధ సన్యాసులు నివసించే విహారం లోపల స్త్రీలకు ప్రవేశం లేదు! నీకు తెలియదా?" అన్నారు భిక్షువు.

ఈ సమయాన ఆ జనసముద్ర కూటమిలో పరుగెత్తక వెనుకబడిన ఒకతను ఆమెను సమీపించి, ఆమె చెవిలో ఏదో చెప్పాడు. తర్వాత ఆమె చేయి పట్టుకొని బిరబిరా లాక్కొని వెళ్ళాడు. ఆమె అతడి వెంట అయిష్టంగా వెళ్ళింది.

"ఆహా! ఈ మనిషి ఎవడు? వాడికీ, ఈ స్త్రీకి ఏం సంబంధం?" అని ఆలోచిస్తూ ఆచార్య భిక్షువు విహారం లోపలికి వెళ్ళారు. పొన్నియిన్ సెల్వన్ ఉన్నచోటును సమీపించారు. మురుగయ్యన్ ఇంతలోపల సంభ్రమమంతా తీరిపోగా, యువరాజు మాటలను భయభక్తులతో వింటున్నాడు.

"మురుగా! నీవు ఈ రోజు రాత్రి తిరిగివచ్చి నన్ను పడవలో ఆనైమంగలానికి తీసుకొని వెళ్ళాలి" అన్నారు యువరాజు.

"యువరాజా! రాత్రి వరకు వేచివుండనవసరం లేదు. ప్రజాకూటమి చెదరిపోయింది. మీరు ఇప్పుడే బయలుదేరి వెళ్ళవచ్చు" అన్నారు ఆచార్య భిక్షువు.

తర్వాత బయట జరిగిందంతా క్లుప్తంగా కొన్ని మాటల్లో చెప్పారు.

"స్వామీ! ప్రజలు వెళ్ళిపోయారు కద? ఇప్పుడు నేనెందుకు ఇక్కడినుంచి వెళ్ళిపోవాలి?" అని అడిగారు యువరాజు.

"వారు తిరిగి రారని ఏం నిశ్చయం? అదీగాక, భిక్షువులైన మామాటను నిజం చేస్తామని కాసేపటి క్రితం చెప్పారు కద? దాన్ని నెరవేర్చి కరుణించాలి!" అన్నారు ఆచార్య భిక్షువు.

~

నిజం ఏమంటే, పొంగి వస్తున్న కడలి ఆ విహారాన్ని కాసేపట్లో ముంచేస్తుందన్న భీతి ఆయన మనసులో బలంగా కలిగింది. కాబట్టి యువరాజును తొందర తొందరగా బయటకు పంపగోరారు.

ఆనైమంగలం సముద్రతీరం నుంచి తూర్పుగా కాస్త దూరాన ఉంది. కాబట్టి పొంగి వస్తున్న సముద్రం అంతదూరం వరకు వెళ్ళలేదు. వెళ్ళి తాకినా, అక్కడున్న అంత పెద్ద చోళమాళిగ మునిగిపోదు.

యువరాజు భిక్షువు మాటను పాటించదలచారు. వెంటనే పడవను తీసుకొని రమ్మని ఆజ్ఞ జారీ చేశారు.

ఇంతలో అక్కడ సమావేశమైన భిక్షువులను చూసి ఆచార్యులు, "మనం కరుణామూర్తియైన బుద్ధ భగవానునికి చెందినవారము. ఇప్పుడు నాగపట్టణపు ప్రజలకు మహాపరీక్ష ఎదురైంది. కడలి పొంగి వేగంగా నగరంలోకి చొరబడడాన్ని చూశారు. సుడిగాలి వేగానికి ఇళ్ళ కప్పులు ఎగిరిపోతున్నాయి. చెట్లు ఫెళఫెళా విరిగి పడుతున్నాయి. నాగపట్టణంలోను, చుట్టుపక్కల వయోవృద్ధులు, చిన్న పిల్లలు అనేకులు తప్పించుకొనే ఉపాయం తెలియక తల్లడిల్లుతుంటారు. మీరందరూ నలువైపుల వెళ్ళి మీ కళ్ళ ముందు కష్టపడుతున్నవారికి సహాయం చేయండి. బిడ్డలను, వయోవృద్ధులను మొదట కాపాడండి. సముద్రరాజు కోపంనుంచి ఎంతమందిని కాపాడగలరో అంతమందిని కాపాడండి! నేను వయసు మళ్ళినవాడిని. ఇక్కడే ఉండి సాయంకాలపు పూజను చేసుకొంటాను" అన్నారు.

ఇది వినగానే భిక్షువులు అక్కడినుంచి బయలుదేరి వెళ్ళారు.

కాలువలో పడవ వచ్చి అక్కడికి చేరింది. యువరాజు ఆచార్య భిక్షువుకు నమస్కరించి సెలవు తీసుకొని పడవెక్కారు. మురుగయ్యన్ కూడ పడవెక్కి పడవను నడపనారంభించాడు.

పడవ కనుమరుగయ్యేవరకు ఆచార్య భిక్షువు దాన్నే చూస్తూ నిలబడ్డారు. ఆయన ముఖం చుట్టూ ఒక అపూర్వమైన జ్యోతి ప్రకాశించింది.

~~~
~~~

# అధ్యాయము - 4

## నంది మునిగింది!

**పడవ** కాలువలో వెళుతున్నప్పుడు నీటి మట్టం నిమిష నిమిషానికి అధికమవుతుండడాన్ని యువరాజు గమనించారు.

పడవ తల్లడిల్లసాగింది. మురుగయ్యన్ దాన్ని నడిపేందుకు చాల కష్టపడవలసివచ్చింది.

సుడిగాలి వేగం కూడ క్షణక్షణానికి అధికం కాసాగింది. కాలువకిరువైపుల చెట్లు ఫెళఫెళ విరిగి పడుతున్నాయి.

పడవ నంది మంటపాన్ని సమీపించింది. యువరాజు ఆ మంటపాన్ని చూశారు. నంది తలను దాటి నీటి మట్టం పెరిగింది. ఇందునుంచి నీటి మట్టం ఎంతవరకు పెరిగిందో బాగ తెలియవచ్చింది.

"మురుగయ్యా! పడవను కాసేపు నిలుపు" అన్నారు యువరాజు. మురుగయ్యన్ పడవనాపాడు. కానీ దాని ఊగిసలాటను ఆపలేకపోయాడు.

యువరాజు పడవనుంచి ఒక్క దూకుతో మంటపంలో అడుగుపెట్టారు. తర్వాత దాని సమీపాన పడివున్న చెట్టును పట్టుకొని మంటపం శిఖరాన్నెక్కారు. అక్కడినుంచి చుట్టూ పరికించి చూశారు. కాలువ దిగువ భాగమంతా జలమయంగా ఉంది. కొబ్బరి తోపులో సగానికి పైగా చెట్లు విరిగిపడివున్నాయి. చెట్ల మధ్యనుంచి చూడగా కడలి పొంగి కొబ్బరి తోపు చివరిమూల వరకు వచ్చేసిన వైనం విశదమైంది.

ఉత్తరాన చూడామణి విహారం ఉన్నవైపు చూపులు సారించారు యువరాజు. విహారపు మెట్లవరకు సముద్రం పొంగి వచ్చిన దృశ్యం స్పష్టంగా కనిపించింది.

పొన్నియిన్ సెల్వన్ మనసులో అప్పుడొక ఆలోచన ఉదయించింది. అది ఆయన శరీరాన్నంతా జలదరింపజేసింది.

"మురుగయ్యా! పడవను వెనక్కి తిప్పు! విహారం వైపు మళ్ళించు!" అన్నారు యువరాజు.

~

అధికంగా మాట్లాడే అలవాటు లేనివాడు, యువరాజు మీద అమిత భక్తివిశ్వాసాలు కలిగినవాడు అయిన మురుగయ్యన్ ఎందుకని కూడ అడగకుండ పడవను తిప్పి చూడామణి విహారం వైపు నడిపాడు.

వచ్చేటప్పుడు పట్టిన సమయం కన్న తిరిగి వెళ్ళేటప్పుడు కాస్త తక్కువ సేపే పట్టింది. కానీ యువరాజుకేమో ఒక్కొక్క క్షణం ఒక్కొక్క యుగంలాగ అనిపించింది.

లంకలో ఉన్న బౌద్ధ విహారంలాగ నాగపట్టణంలోని చూడామణి విహారం అంత గంభీరంగానో,

పెద్దదిగానో లేదు. నీటి మట్టం ఇంకాస్త పెరిగితే మంటప శిఖరమే మునిగిపోయేటట్లుంది.

~

యువరాజు పడవనుంచి నీట మునగని ఒక మంటపం పైదూలం మీదికి దూకారు. అటూ ఇటూ గాభరాగా పరుగెత్తారు. విహారం కింది అంతస్తుకు వెళ్ళకుండ పైమేడలోని ఒక్కొక్క భాగాన్ని వెతుక్కొంటూ వచ్చారు. పైమేడలోని కొన్ని గదుల్లో ఎదవరకు నీరు వచ్చేసింది. యువరాజుకు నిరాశ అధికం కాసాగింది. చివరికి గౌతమ బుద్ధుని గంభీరమైన మూర్తి అమర్చబడివున్న గదికి వచ్చి చేరారు. ఆ శిల్పం ఎదవరకు నీటి మట్టం వచ్చేసింది. యువరాజు అక్కడే నిలబడి చుట్టూ చూశారు. నీటిలోపలికి వంగి చూశారు. వారి నోటి నుంచి వచ్చిన సంతోషమూ, ఆశ్చర్యమూ కలిసిన 'ఆహా' అన్న శబ్దం వారు వెతుక్కొంటూ వచ్చిన చోటికి వచ్చి చేరారన్న విషయాన్ని వెల్లడి చేసింది.

అవును; బుద్ధుని శిల్పం కింద ఆయన పాదాలు రెంటినీ కట్టుకొని ఆచార్య భిక్షువు కూర్చొనివున్నారు.

పొన్నియిన్ సెల్వన్ నీట మునిగి ఆచార్యుల చేతులను బలవంతంగా విడిపించి పైకెత్తారు. నీటి లోపల ఆయనను లేవనెత్తడం తేలికగానేవుంది. నీటిపైకి వచ్చాక అంత సులభమనిపించలేదు. ఆజానుబాహువు, మంచి బలిష్టులైన ఆచార్య భిక్షువు శరీరభారం యువరాజుకు ఊపిరి సలపకుండ చేసింది.

"మురుగయ్యా! మురుగయ్యా!" అని పడవ నడిపేవాడిని గట్టిగా పిలిచారు.

"ఇదిగో వస్తున్నా!" అని చెబుతూనే మురుగయ్యన్ పడవను తీసుకొని వచ్చాడు.

యువరాజు ఆచార్యులను ఎత్తుకొని వేగంగా పడవవైపు వెళ్ళారు. ఆయన కాళ్ళు తడబడ్డాయి.

~~~
~~~

# అధ్యాయము - 5

## తల్లినుంచి విడిపోయిన లేగదూడ

**యువరాజు** ఆచార్యులను ఎత్తుకొని, మురుగయ్యన్ తీసుకొని వచ్చిన పడవలోకి దూకారు. ఆయన దూకిన వేగానికి ఆ చిన్న పడవ వెర్రిగా ఊగిసలాడింది. ఒక క్షణం అది తలకిందులైపోతుందేమోననిపించింది. మురుగయ్యన్ అతికష్టం మీద దాని పట్టి నిలదొక్కాడు.

"మురుగయ్యా! ఇక పడవను నడుపు! ఆనైమంగలం మాళిగకు తీసుకొని వెళ్ళు!" అని పొన్నియిన్ సెల్వన్ గద్గద స్వరంతో అన్నారు. ఆ సమయాన తీవ్రస్థాయిని చేరుకొన్న సుడిగాలి, మహాకల్లోలితమైన సముద్రం ఒక్కటై చేసిన ఘోషలో ఆయన చెప్పింది మురుగయ్యన్ చెవిన పడలేదు. కానీ యువరాజు ముఖభావాలను చూసి ఆయన ఉద్దేశాన్ని అర్థం చేసుకొన్న మురుగయ్యన్ పడవను మళ్ళీ నడపనారంభించాడు. చూడామణి విహారపు మునిగిపోని మంటప శిఖరాలకు, బుద్ధ భగవానుని శిల్పానికి గుద్దుకోకుండ పడవను జాగ్రత్తగా నడపడం కష్టసాధ్యమైంది. మురుగయ్యన్ సుడిగాలిలోను, తుఫానులోను పడవ నడిపి అలవాటున్నవాడు కావడం వల్ల పడవను లాఘవంగా నడుపుకొంటూ వెళ్ళాడు. అది గమనించి యువరాజు ఆశ్చర్యపోయారు. అతడికి కాస్త సహాయం చేద్దామనిపించింది. కానీ ఆచార్యులను విడిచిపెట్టేందుకు జంకారు. అందుకు తగినట్లు, ఉన్నట్లుండి ఆచార్య భిక్షువు యువరాజు పట్టునుంచి విడిపించుకోవడానికి ప్రయత్నించారు. ఆ సమయాన పడవ బుద్ధ భగవానుని సమీపంగా వెళుతూంది. ఇప్పుడు కడలి పొంగు ఆ శిల్పం కళ్ళవరకు వచ్చేసింది. ఇంకొన్ని నిమిషాల్లో బుద్ధ భగవానుని శిల్పం పూర్తిగా మునిగిపోతుందనడంలో సందేహం లేదు.

యువరాజు భిక్షువును గట్టిగా పట్టుకొన్నారు. చూసేందుకు చాల మెత్తని దేహమున్నట్లున్న యువరాజు చేతుల్లో ఎంతటి బలముందో చూసి భిక్షువు ఆశ్చర్యపోయారు. మనసులో శక్తి ఉంటే, చేతుల్లో బలం వస్తుంది కాబోలు! ఇంతకీ చాల రోజులు జ్వరంతో పీడించబడ్డ శరీరం!

పడవ బుద్ధుని శిల్పాన్ని దాటి వెళ్ళింది. మునిగిపోతున్న ఆ శిల్పాన్ని భిక్షువు చూస్తూండిపోయారు. శిల్పం వేగంగా మరుగైంది. భిక్షువు కళ్లనుంచి కన్నీరు ధారగా ప్రవహించసాగింది.

"యువరాజా! ఎంత పని చేశారు?!" అన్నారు ఆచార్య భిక్షువు. ఆయన పెదవుల కదలికనుంచి ఆయనేమంటున్నారో గ్రహించిన యువరాజు భిక్షువు చెవి దగ్గరగా వెళ్ళి, "స్వామీ! ఆ ప్రశ్నను నేను కద అడగాలి? ఎంతకు తెగించారు మీరు?" అన్నారు.

"యువరాజా! ఈ విహారం ఐదువందలేళ్ళుగా ఇక్కడ విరాజిల్లుతూంది. మహానుభావుడైన ధర్మపాద ముని కాలంలో కూడ ఉండేది. వీరశైవులైన పల్లవులు కూడ దీన్ని ధ్వంసం చేయకుండ

విడిచిపెట్టారు. అలాంటి పురాతన విహారం నా కాలంలో, నా కళ్ళముందే మునిగిపోయింది. ఇటుకలతో కట్టబడ్డ ఈ విహారం ఈ వరదను తట్టుకొని నిలబడలేదు. వరద తగ్గుముఖం పట్టిన తర్వాత కొన్ని పిట్ట గోడలు మాత్రమే మిగులుతాయి! విహారం పోయిన తర్వాత నేను మాత్రం ఎందుకు బతికుండాలి?" అన్నారు భిక్షువు.

"విహారం పడిపోతే మళ్ళీ కైంకర్యం చేసి కట్టించుకోవచ్చు. బుద్ధ భగవానుని చిత్తముంటే నేనే కట్టిస్తాను. మీరు పోతే నేను మిమ్మల్ని మళ్ళీ బతికించుకోలేను కద?" అన్నారు యువరాజు అరుళ్మొళి వర్మ.

~

కడలి, సుడిగాలి ఒక్కటై చేస్తున్న కోలాహలంవల్ల వారు ఇక ముందుకు వాగ్వివాదాన్ని కొనసాగించలేకపోయారు. అదీగాక, వారు చుట్టూ నలువైపులా చూసిన ఘోర దృశ్యాలు ఇక వారిని ముందుకు మాట్లాడకుండ చేశాయి.

విరిగిన తెరచాపలతో పెద్ద పెద్ద ఓడలు, చిన్న చిన్న చేపలు పట్టే పడవలు తీరానికి కొట్టుకు రాసాగాయి. వాటిలో అనేకం ఒడ్డుకు కొట్టుకొని, కట్టడాలకు గుద్దుకొని, ఊగిసలాడుతున్న చెట్లకు కొట్టుకొని ముక్కలు చెక్కలై విరిగి పడ్డాయి.

పెనుగాలిలో ఇళ్ళ కప్పులు అలాగే లేచిపోయి ఎగిరి వరదలో పడ్డాయి.

ఇంకొన్ని ఇళ్ళ కప్పులు నీట తేలియాడసాగాయి. వాటిలో కొన్నిటిని కొందరు జనాలు అతికష్టం మీద పట్టుకొని ప్రాణభయంతో 'ఓ' అని కేకలేస్తున్నారు కూడాను.

పెద్ద పెద్ద చెట్లు సుడిగాలికి విరిగి పడ్డాయి. వాటిలో కొన్ని తేలుతూ కొట్టుకుపోసాగాయి. తేలుతున్న చెట్లను పట్టుకొని కొందరు తమ ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రయత్నిస్తున్నారు.

జంతువులు ఆక్రందనలు చేస్తూ నీట కొట్టుకుపోయాయి.

ఇటువంటి ఘోర దృశ్యాలను చూసి, చూసి యువరాజు, ఆచార్య భిక్షువు చాల కలత చెందారు. అటువంటి పరిస్థితిలో తామేమీ సహాయం చేయలేమన్న భావం వారి వేదనను మరింత అధికం చేసింది.

~

మురుగయ్యన్ అటూ ఇటూ చూడక అతి జాగరూకతతో పడవ నడుపుతున్నాడు.

చూడామణి విహారం సముద్రతీరం పక్కనే ఉంది. అక్కడినుంచి కాలువ కాస్త దూరం వరకు దక్షిణంగా ప్రవహిస్తూంది. తర్వాత నైఋతి దిశగా అరకోసు దూరం ప్రవహించి, అక్కడినుంచి మళ్ళీ దక్షిణంగా ప్రవహిస్తూంది. ఈ రెండవ మలుపులోనే ఆనైమంగలం మాళిగ ఉంది.

దారి మధ్యవున్న నంది మంటపాన్ని పడవ సమీపించినప్పుడు, నంది పూర్తిగా మునిగిపోవడమేగాక వరదనీరు మంటపం పై అంచును తాకుతూ ప్రవహిస్తుండడం కనిపించింది.

మంటపానికి అవతల నలువైపుల ఉన్న కొబ్బరితోపులో మూడువంతుల చెట్లు అప్పటికే సుడిగాలికి పడిపోయాయి. మిగిలిన చెట్ల పైచివరి మట్టలు గాలిలో దెయ్యాలు తల విరబోసుకొని ఆడుతున్నట్లు ఆడుతున్నాయి. వాటిలో కొన్నిటి మట్టలు గాలికి విరిగి పడి చాల దూరంగా వెళ్ళి పడివున్నాయి.

నంది మంటపం శిఖరాన తల్లినుంచి విడివడ్డ ఒక లేగదూడ ఎలాగో వచ్చి చిక్కుపడివుంది. అది నలువైపులా చూస్తూ ఏం చేయాలో తోచక, అప్పుడప్పుడూ ఒళ్ళు విదిలించుకొంటూ, 'అంబా' అంటూ దీనంగా అరుస్తూంది. అది పడవలో వెళుతున్నవారి చెవిన పడింది. "అయ్యో పాపం! తల్లినుంచి విడివడ్డ ఈ దూడ గతి ఏమి?" అని యువరాజు అనుకొంటుండగానే, ఒక పెద్ద కొబ్బరి చెట్టు మట్ట విరిగి మంటపం వెనుక భాగం మీద పడింది. కాస్త ముందువైపున పడివుంటే ఆ దూడ మీదే పడివుండేది.

చెట్టు పడ్డ వేగానికి నీట ఒక పెద్ద అల లేచి మంటపం పైభాగం మీదికి దూకింది. అప్పటికే వణుకుతున్న లేగ దూడ ఆ అల వేగాన్ని తట్టుకోలేక కాళ్ళు తడబడి కింద పడింది. అల వల్ల మంటపం పైనుంచి కింద వరదలో తోయబడింది.

యువరాజు ఇంతవరకు ఆచార్య భిక్షువును తమ చేతులతో గట్టిగా పట్టుకొనివున్నారు. దూడ మంటపం పైనుంచి కింద పడగానే, 'ఆః' అని గట్టిగా అరిచి భిక్షువును వదిలారు. భిక్షువు ఆ క్షణమే నీట దూకారు.

పడవ నడిపే మురుగయ్యన్ తెడ్డును వదిలి యువరాజును పట్టుకొన్నాడు. యువరాజు కోపంతో 'వదులు!' అని వాడి చేతిని విదిలించారు. అంతలో భిక్షువు రెండు బారల్లో దూడను చేరుకొని దాని ముంగాళ్ళను గట్టిగా పట్టుకొన్నారు. దూడ స్వాభావికంగా తన ప్రాణాలపైని ఆశతో తలను మాత్రం నీటిపైన ఎత్తి ఉంచుకోవడానికి ప్రయత్నించసాగింది. భిక్షువు దూడను పట్టి లాక్కొని పడవను సమీపించారు. యువరాజు ఆయనకు చేయూతనిచ్చి సహాయం చేశారు. ఇద్దరూ చేరి దూడను పడవలోకెక్కించారు. తర్వాత యువరాజు సహాయంతో ఆచార్య భిక్షువు పడవలోకెక్కారు.

ఇంతసేపూ ఎలాగో నిలగొక్కుకొన్న దూడ పడవ కాస్త ఊగగానే దబ్బున పడింది. అదృష్టవశాత్తు పడవ లోపలే పడింది. భిక్షువు దాని సమీపాన కూర్చొన్నారు. దూడ తలను తన ఒడిలో పెట్టుకొని నిమరసాగారు.

"గురుదేవా! కాసేపటి క్రితం చూడామణి విహారంలో బుద్ధ భగవానుని చరణాలను పట్టుకొని ప్రాణత్యాగం చేయ ప్రయత్నించారు కద? అలా చేసివుంటే ఈ లేగదూడను కాపాడగలిగేవారా?" అని అడిగారు యువరాజు.

"అయ్యా! నేను చేయబోయిన తప్పును చేయకుండ అడ్డుపడ్డారు. అందుకు కృతజ్ఞుడను! అవును. ఈ లేగదూడను కాపాడడం వల్ల నా మనసు నెమ్మదిగొంది. చూడామణి విహారం ఇక విరిగి పడిపోయినా అంతగా దిగులు పడను!" అన్నారు ఆచార్యులు.

“ఆచార్యా! ఒక్క దూడ ప్రాణాన్ని కాపాడినందుకే ఇంత సెమ్మదిగొంటున్నారు కద? సేడీ సుడిగాలిలో ఎన్ని వేల ప్రాణులు, ప్రజలు కష్టపడుతున్నారు? ఎన్ని నోరు లేని జీవాలు ప్రాణాలు కోల్పోబోతాయి? ఈ దుఃఖాలన్నిటికీ పరిహారమేమి?” అని అడిగారు యువరాజు.

“అయ్యా! మనకు సాధ్యమైంది మాత్రమే మనం చేయగలం. దానికి మించి మనం చేయగలదేమీ లేదు. స్వాభావిక ఉత్పాతాలను అడ్డగించే శక్తి మనకు లేదు. సుడిగాలిని మనం బంధించగలమా? కడలి పొంగి వచ్చేటప్పుడు దాన్ని ఆపగలమా? ఆహా! సముద్రాలకవతల ఉన్న దక్షిణదేశాల్లో అగ్ని పర్వతాలు నిప్పులు కక్కడం, భూకంపాలు వచ్చి భూమి రెండుగా చీలడం సేను కళ్ళారా చూశాను. వాటన్నిటినీ మనమాపగలమా? మన కళ్ళ ముందు కష్టపడుతూ విలవిల్లాడే జీవానికి సహాయం చేయడం మాత్రమే మనం చేయగలిగింది!”

“ఆచార్యా! స్వాభావిక ఉత్పాతాలు ఎందుకు ఏర్పడుతున్నాయి? సుడిగాలి, భూకంపాలు ఎందుకు ఏర్పడుతున్నాయి? మహారోగాలు ఎందుకు వస్తున్నాయి? వాటివల్ల ప్రజలకు, తక్కిన ప్రాణులకు కలుగుతున్న కష్టాలకు బాధ్యులెవ్వరు? మనం స్వాభావిక ఉత్పాతాలను ఆపలేము. కానీ దేవునికి సాధ్యమా, కాదా? దేవుడెందుకు ఈ భయోత్పాతాలను అడ్డగించక వాటివల్ల జీవరాశులు పడే కష్టాలను చూస్తూ ఊరుకొంటున్నాడు?” అని యువరాజు అడిగారు.

“పొన్నియిన్ సెల్వా! మీరిప్పుడు అడిగిన ప్రశ్నకు ఆదికాలంనుంచి ఎందరో మహానుభావులు, మునివర్యులు సమాధానం తెలుసుకోవడానికి ప్రయత్నించారు. కానీ వారందరికి తృప్తి కలిగించే సమాధానాలు వారికి దొరకలేదు. అందుకే బుద్ధ భగవానుడు దేవుని గురించి ఏమీ చెప్పలేదు. దేవుని గురించిన పరిశోధనలోకే దిగలేదు. ’ఇతరులకు సహాయం చేయండి. ఇతరుల కష్టాలను పోగొట్ట ప్రయత్నించండి. ఆ ప్రయత్నంలోసే నిజమైన ఆనందాన్ని పొందుతారు. దానినుంచి సుఖ దుఃఖాలను దాటి నిర్వాణ స్థితిని పొందుతారు! ’ అని బుద్ధ భగవానుడు బోధించారు!” అన్నారు ఆచార్య భిక్షువు.

~

పడవ నంది మంటపాన్ని దాటి ఆసైమంగలంవైపు వెళ్ళసాగింది.

పొన్నియిన్ సెల్వన్ దీర్ఘాలోచనలో మునిగారు. కాసేపటి క్రితం ఆచార్యులు విశదీకరించిన బౌద్ధ మత సిద్ధాంతాలను, తమ పూర్వీకుల మత సిద్ధాంతాలను మనసులోసే పోల్చి చూసుకొన్నారు. ఇతరులకు సహాయం చేయమని శైవ, వైష్ణవ మతాలు రెండూ బోధిస్తున్నాయి. ’పరోపకారార్థ మిదం శరీరం’ అన్న నీతి వాక్యం కూడ ఉండనే ఉంది. కానీ అదే సమయాన దేవునిపైన నమ్మకమునుంచి భక్తిగొనివుండాలనే కర్తవ్యాన్ని కూడ మన పూర్వీకులు బోధించారు. దేవునికి సంహారమూర్తియైన రుద్రునిగాను, కరుణామూర్తియైన విష్ణువుగాను రూపమిచ్చి వర్ణిస్తున్నారు. దేవునికి జగన్మాత రూపమిచ్చి, ఒకే సమయాన ప్రేమ రూపంగొన్న ఉమాదేవిగాను, ఘోర భయంకర దుర్గాపరమేశ్వరిగాను వర్ణించారు. ఈ

సిద్ధాంతాలలో ఏది నిజం? లోకమాత ఘోర భయంకర రణ భద్రకాళిగా ఉండడం సాధ్యమా? ఏల సాధ్యం కాదు? కన్న బిడ్డను ఒకసారి ప్రేమతో లాలించి ముద్దాడుతుంది. ఇంకొక సారి కోపించుకొని శిక్షించడమూ చేస్తుంది. ఎందుకు కొడుతుందని కొన్నిసార్లు బిడ్డకు అర్థం కావడం లేదు. కానీ కన్నతల్లికి తన బిడ్డ మీద ప్రేమ లేదనగలమా?

చీకటి పడే సమయానికి పడవ ఆనైమంగలంలోని చోళ మాళిగను సమీపించింది. పొంగివచ్చిన కడలి ఆ మాళిగను తాకలేదని పడవలో వచ్చినవారు చూశారు. మాళిగ ముందు మెట్ల దగ్గర పడవను తీసుకొని వచ్చి నిలిపాడు మురుగయ్యన్.

కొంతవరకు ప్రకృతి కూడ పడవలో ప్రయాణిస్తున్నవారి మీద కరుణ చూపింది - పెనుగాలి వీచి కడలి పొంగి వచ్చినా కూడ వాన మాత్రం పడలేదు. చిన్న తుంపరతో నిలిచిపోయింది.

పడవ ఆనైమంగలం మాళిగకు చేరిన తర్వాతే జడివాన మొదలైంది.

~

ఆనైమంగలం మాళిగ కాపలావాడు వాకిట ఒక దివిటీ పట్టుకొని నిలబడివున్నాడు. చుట్టు పక్కల నుంచి అక్కడ తల దాచుకోవడానికి వచ్చిన ప్రజలతో మాట్లాడుతున్నాడు.

పడవొకటి మెట్ల దగ్గరికి వచ్చి ఆగగానే ఆ కాపలావాడు దివిటీని ఎత్తి పట్టాడు. పొన్నియిన్ సెల్వన్ దివ్యవదనం అతనికి స్పష్టంగా గోచరించింది. వెంటనే తక్కినదంతా మరిచిపోయి మెట్లమీదినుంచి వేగంగా పరుగెత్తుకొచ్చాడు.

ఇంతలో యువరాజు, ఆచార్య భిక్షువు పడవనుంచి మెట్ల మీదికి దిగారు. దూడను కూడ మెల్లగా దించారు.

కాపలావాడు యువరాజు కాళ్ళమీద పడబోయాడు. ఆయన వాడిని పట్టి ఆపారు. కాపలావాని చేతనున్న దివిటీ కాలువలో పడి ఆరిపోయింది.

“యువరాజా! చూడామణి విహారం గురించి నేనే చాల దిగులుపడుతున్నాను. మీరిక్కడికి వచ్చేసింది చాల మంచిదైంది" అన్నాడు కాపలావాడు.

“నేను చూడామణి విహారంలో ఉన్న విషయం నీకెలా తెలుసు?” అని అడిగారు యువరాజు.

“తెలుసు, యువరాజా! యువరాకుమారి, కొడుంబాళూర్ రాకుమారి ఇక్కడికి వచ్చినప్పుడు తెలుసుకొన్నాను. ఎవరికీ చెప్పవద్దని యువరాకుమారి నొక్కి చెప్పి వెళ్ళారు...”

“దాన్ని నీవు ఇంకా నెరవేర్చవలసివుంది. మాళిగ ముందు గుమిగూడి ఉన్నవారెవరు?”

“సముద్రతీరాన ఉన్న గ్రామాలలో సముద్రం పొంగి రావడం వల్ల పరుగెత్తి వచ్చిన ప్రజలు. రాత్రి తలదాచుకోవడానికి చోటు కోసం అడిగారు. వాళ్ళను తరిమేస్తాను...”

“వద్దు, వద్దు! వారందరికీ ఉండేందుకు, పడుకోవడాలిని చోటివ్వు. కానీ నా గురించి చెప్పకు. నీ

దివిటీ కాలువలో పడి ఆరిపోవడం మంచిదయ్యింది. మమ్మల్ని వేరొక దారి గుండా మాళిగ పైమేడకు తీసుకొని వెళ్ళు!” అన్నారు యువరాజు.

వారు మాళిగ లోపల ప్రవేశించగానే పెనుగాలితోబాటు జడివాన మొదలైంది.

~~~
~~~

# అధ్యాయము - 6

## మురుగయ్యస్ విలపించాడు!

తంజావూరు నగరం సమీపాన మందాకిని ప్రయాణిస్తున్న పల్లకి వెనుక చెట్టు విరిగి పడ్డ అదే రోజు, వీరనారాయణ పురం చెరువులో గాలి వీచి పడవ జరిగిపోయిన అదే వేళ, నాగపట్టణంలో జరిగిన సంభవాలను గత అధ్యాయంలో వివరించామని పాఠకులు గ్రహించివుంటారు.

ఆ రాత్రంతా నాగపట్టణం, చుట్టుపక్కల ప్రదేశాలు చాల అల్లకల్లోలమైనాయి. అందరూ తాము బతికి బయటపడితే చాలన్న పరిస్థితిలో ఉన్నప్పుడు ఒకరికొకరు సహాయం చేయడం అసాధ్యమైంది. కానీ బౌద్ధ భిక్షువులు నాగపట్టణం వీధుల వెంబడి తిరుగాడుతూ ప్రజలకు వీలైనంతవరకు సహాయం చేయసాగారు.

అదే రాత్రి ఆచార్య భిక్షువు, పొన్నియిన్ సెల్వన్ చాలసేపు మేల్కొనివుండి చాల విషయాల గురించి మాట్లాడుకొన్నారు. ఈ బలమైన సుడిగాలి వల్ల సముద్రం పొంగి రావడం వల్ల సముద్ర తీరానున్న ప్రజలు ఎంతటి కష్టనష్టాలకు గురౌతున్నారన్న విషయం గురించి మాట్లాడుకొని దిగులుపడ్డారు.

~

మాళిగ ప్రధానాధికారిని పిలిపించి మాళిగ ధాన్యాగారంలో ధాన్యం ఎంత ఉందని, బొక్కసంలో ధనం ఎంత ఉందని విచారించారు యువరాజు. ధాన్యాగారం నిండా ధాన్యం ఉందని తెలియవచ్చింది. తిరునాగై కారోణంలోని నీలాయతాక్షి అమ్మవారి ఆలయాన్ని నల్లరాతితో పునర్నిర్మించేందుకు శెంబియన్ మహదేవి పంపించిన బంగారు కాసులు పన్నెండు తామ్రపు బిందెల నిండా ఉన్నట్లు కూడ తెలియవచ్చింది.

"గురుదేవా! బుద్ధ భగవానుని చిత్తానికి తగిన కైంకర్యం చేయడానికి కావలసిన వసతులు ఉన్నాయి. మాళిగ ధాన్యాగారంలోని ధాన్యాన్నంతటినీ పేద ప్రజలకు అన్నదానం చేసేందుకు ఖర్చు చేయండి. రాగి బిందెల్లోని బంగారు కాసులన్నిటినీ ఇళ్ళు కోల్పోయిన వారికి వినియోగం చేయండి!" అన్నారు యువరాజు.

"అదెలా సాధ్యం? ధాన్యాన్నేమో వినియోగించవచ్చు. కానీ తమ పెద్ద బామ్మగారు, శెంబియన్ మహాదేవి, ఆలయ కైంకర్యం కోసం పంపించిన ధనాన్ని వేరొక కార్యానికి ఎలా ఖర్చు చేయవచ్చు? ఆ మహారాణి విచారించరా?" అన్నారు ఆచార్య భిక్షువు.

"ఆచార్యా! నా పెదనానమ్మకు నేను సమాధానం చెప్పుకొంటాను. ఇప్పుడే ధనాన్ని పేదప్రజల కష్టాన్ని దాటించేందుకు ఖర్చు చేస్తాను. రాబోయే కాలంలో నా పెద నానమ్మ మనసు ఆనందంతో పొంగి పోయేటట్లు ఈ చోళనాడంతటా వందలకొద్ది శివాలయాలను కట్టిస్తాను. పెద్ద పెద్ద గోపురాలను నిర్మిస్తాను.

ఇలా సముద్రం పొంగి వచ్చినా కూడ మునిగిపోనంత ఎత్తైన స్థూపాలను కట్టిస్తాను. తంజావూరు నగరంలో దక్షిణకాశి అని చెప్పబడేటట్లు ఆకాశాన్నంటే గోపురంగల శివాలయాన్ని కట్టిస్తాను. అయ్యా! ఈ రోజు మునిగిన చూడామణి విహారం మట్టిలో కలిసిపోయినా దిగులుపడకండి. దాని సమీపాన నల్లరాతితో, ప్రళయం వచ్చినా కదిలని దృఢమైన ఇంకొక పెద్ద చూడామణి విహారాన్ని నిర్మించి ఇస్తాను!" అని ఆవేశపూరిత స్వరంతో అన్నారు యువరాజు.

"పొన్నియిన్ సెల్వా! రాబోయే కాలం గురించి మీరింత ఉత్సాహంతో మాట్లాడడం నాకెంతో ఆనందాన్ని కలిగిస్తోంది!" అన్నారు ఆచార్య భిక్షువు.

"అవును! నేనీ లోకంలో జీవించి ఏవో బృహత్కార్యాలను చేయాలని భగవంతుని చిత్తం. అందుకే నా ప్రాణాలకు కలిగిన ఎన్నో అపాయాలనుంచి నన్ను కాపాడారు. ఈ రోజు కూడ చూడండి. ఈ మురుగయ్యన్ ఎలాగో వచ్చి చేరాడు. లేకపోతే మీరూ, నేనూ చూడామణి విహారంలోనే మరణించేవారము. కడలి పొంగి వచ్చి ఇంత త్వరగా విహారాన్ని ముంచేస్తుందని ఊహించేవారం కాము..."

"అది నిజమే. ఐదు వందల సంవత్సరాలుగా జరగని సంభవం ఈరోజు పొద్దున ఒక్క పూటలో జరిగిపోతుందని ఎవరూహించగలరు? కరుణాసముద్రుడైన బుద్ధ భగవానుడు పొంగి వచ్చిన కడలి కోపంనుంచి తమను కాపాడారు. తమ మూలకంగా నా అల్ప ప్రాణాన్ని కాపాడి కరుణించారు. మీరు చేయాలని ఉద్దేశించిన కార్యాన్ని నేను పరిపూర్ణంగా ఒప్పుకొంటాను. రాజ్యాంగ ఖజానా/బొక్కసం నుంచి ధనం తీసుకొని ఖర్చు చేస్తే ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ కోపగిస్తారు. ఆలయ కైంకర్యం కోసం కేటాయించిన ధనాన్ని పేదవారికి ఇళ్ళు, వాకిళ్ళు కట్టించేందుకు వినియోగిస్తే తమ పెదనానమ్మగారు కోపగించుకోరు. అలా మీరు చేయడం ఉచితమే. కానీ ఈ మహత్తరమైన ఈ పుణ్యకార్యాన్ని మీరే ముందుండి చేయించడం కద పెద్దతనంగా ఉంటుంది? ఈ పేద సన్యాసి అంత పెద్ద బాధ్యతను తీసుకోలేడు...!"

"గురుదేవా! నేను ముందుండి నడిపిస్తే నన్ను నేను బయటపెట్టుకోవలసిన అవసరం ఏర్పడుతుంది. పాండవుల అజ్ఞాత వాసం గురించి మీరు చెప్పింది నా మనసులో పదిలమైవుంది. ఈ సమయాన నేను బయటపడితే దేశంలో గందరగోళం, కలకలం, కలహం ఏర్పడవచ్చని బుద్ధికుశలతలో సాటిలేని మేటియైన నా అక్కగారు చెప్పారు. నేను అజ్ఞాతంగ ఉండడం వల్ల ఎవరికీ ఎటువంటి హానీ కలగదు. కాబట్టి సుడిగాలి తీవ్రత వల్ల కష్టపడుతున్న ప్రజలకు మీరే మాళిగలోని ధనధాన్యాలను తీసిచ్చి సహాయం చేయాలి!" అన్నారు యువరాజు.

"పొన్నియిన్ సెల్వ! నా మనసెందుకో మారిపోయింది. తమ ఉనికి తెలియజేసి ప్రజలకు సహాయం చేయడానికి ఇదే తగిన సమయమని నాకనిపిస్తూంది. అదే బుద్ధ భగవానుని చిత్తం అని భావిస్తున్నాను" అన్నారు ఆచార్య భిక్షువు.

~

ఈ సమయాన ఎవరో వెక్కి వెక్కి ఏడుస్తున్న శబ్దం విని ఇద్దరూ ఉలిక్కిపడి తిరిగి చూశారు. మురుగయ్యన్ ఒక మూల కూర్చొని ముఖాన్ని రెండు చేతులతో కప్పుకొని ఏడుస్తున్నాడు. యువరాజు వాడి దగ్గరకు వెళ్ళి చేయి పట్టుకొని పిలుచుకొని వచ్చారు.

"మురుగయ్యా! ఇదేమి? ఎందుకేడుస్తున్నావు?" అని అడిగారు.

"నా పెళ్ళాం... నా పెళ్ళాం..." అని తడబడుతూ చెప్పి మళ్ళీ ఏడవసాగాడు మురుగయ్యన్.

"అవును! నీ భార్యను మేము పూర్తిగా మరిచిపోయాము. ఆమె ఈ రాత్రి సుడిగాలిలోను, వానలోను చిక్కుకొని ఏమైందోనని నీవు దిగులుపడడం సహజమే. కానీ ఈ అర్ధరాత్రి సమయాన చేయగలిగిందేమీ లేదు. పొద్దు పొడవగానే నీ భార్యను వెతికి కనిపెడదాం" అన్నారు యువరాజు.

"అయ్యా! అందుగురించి నేను దిగులుపడడం లేదు. ఆమెకే ఆపద కలగదు. ఇటువంటి ఎన్నో సుడిగాలులు, వరదలను ఆమె సంభాళించుకొంది!" అన్నాడు మురుగయ్యన్.

"మరెందుకేడుస్తున్నావు?"

పడవ నడిపే మురుగయ్యన్ తత్తరపడుతూ ఈ వివరాలను చెప్పాడు:-

"నా భార్యమీద ఏవేవో సందేహాలుగొన్న విషయం తలుచుకొని విచారపడుతున్నాను. ఆమే నన్ను ప్రోత్సాహించి మీరు చూడామణి విహారంలో ఉండవచ్చని చెప్పి కోడిక్కరైనుంచి తీసుకొని వచ్చింది. ఆమె బలవంతంవల్లనే నేనొచ్చాను. తమకు ఏదైన హాని చేయబోతుందేమోనని సందేహపడ్డాను. అది ఎంతటి పొరబాటని ఇప్పుడు తెలుస్తోంది. కాసేపటి క్రితం ఈ పేదవాడిని ఎంతగానో మెచ్చుకొన్నారు. భగవంతుడు నా మూలంగా మీ ప్రాణాలను కాపాడాడన్నారు. కానీ ఈ కార్యానికి నన్ను పురిగొల్పింది నా పెళ్ళామే. అటువంటి మనిషిని సందేహించాం కద అని తలుచుకొన్నప్పుడు ఏడుపొచ్చేసింది!"

ఇదంతా వింటున్న పొన్నియిన్ సెల్వన్ మనసులో ఇప్పుడు మరొక సందేహం ఉదయించింది.

"నీ భార్య చాల ఉత్తమురాలు. ఆమెను నీవు సందేహించింది పొరబాటే. కానీ ఆమెకు నేనిక్కడున్నానన్న విషయం ఎలా తెలిసింది?" అని అడిగారు.

"నా అత్త, నా చెల్లెలు పూంగుళలి పడవలో నాగపట్టణానికి బయలుదేరారు. అందునుంచి నా భార్య ఒకింత ఊహించుకోగలిగింది."

"ఏ అత్త?" అని యువరాజు ఆదుర్దాగా అడిగారు.

"అయ్యా! లంకా ద్వీపంలో పలుసార్లు మిమ్మల్ని అపాయాలనుంచి కాపాడిన మూగత్తే..."

"ఆహా! వారిప్పుడెక్కడ? నీ అత్త, పూంగుళలి ఏమైనారు? ఇక్కడికి బయలుదేరి వచ్చారన్నావు కద?"

"అవునయ్యా! బయలుదేరారు. కానీ వారి ప్రయాణానికి ఆటంకం కలిగింది!" అని చెప్పి

మురుగయ్యన్ మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

~

పొన్నియిన్ సెల్వన్ చాల దిగులుగొని అతన్ని వివరాలడిగి తెలుసుకొన్నారు. లంకా ద్వీపపు రాణిని, ఎవరో మూర్ఖులు బలవంతంగా పట్టుకొని వెళ్ళారని తెలిసిన వెంటనే ఆయన కోపానికి అలవిలేకపోయింది. వారిని రాక్కమ్మాళ్ అడ్డగింపజూసిందని, అందుకని వారు ఆమెను కొట్టి చెట్టుకు కట్టేసి వెళ్ళారని తెలుసుకోగానే ఆమెపైన కలిగిన సందేహం వీడింది. యువరాజుకు ఆమెపైన అభిమానం, గౌరవం కలిగాయి.

"గురుదేవా! చూశారా? ఈ లోకంలో నేను పూజించే దైవమొకటుందంటే అది మందాకినీ దేవే. ఆ మూగరాణికి హాని కలిగించిన వారిని నేను క్షమించలేను. పళువేట్టరయ్యర్లు నన్ను చెరపట్టడానికి ఆజ్ఞ జారీ చేయించినా కూడ నాకు వారిమీద ఏమాత్రం కోపం కలగలేదు. కానీ మూగరాణికి వారేమైన హాని కలిగించివుంటే నేను దాన్ని ఏమాత్రం ఓర్చుకోలేను. పళువేట్టరయ్యర్ కులాన్ని సమూలంగా తుడిచేసి తర్వాతి పని చూస్తాను. నన్ను కన్న తల్లి, నా సొంత తండ్రి లంకా ద్వీపపు రాణికి హాని కలిగించినా కూడ, వారిని నేను క్షమించలేను! గురుదేవా! రేపే నేను తంజావూరుకు బయలుదేరబోతున్నాను. వ్యాపారిలాగ వేషం వేసుకొని ఈ పడవ నడిపే మురుగయ్యన్ని తోడుతీసుకొని వెళ్ళబోతున్నాను. ఆ మూగ రాణి గురించి తెలుసుకొనేవరకు నా మనసు నెమ్మదిగొనదు. ఆచార్యా! సుడిగాలి, తుఫాను బాధితులకు సహాయం చేసే కైంకర్యాన్ని మీరే చేపట్టాలి. మీ పేరు మీదుగా నడిపించేందుకు ఇష్టపడకపోతే, లంకారాణి పేరు మీదుగా చేయించండి. లంకారాణికి బౌద్ధ మతంలో నమ్మకముందని మీకు తెలుసేమో? 'భూత దీవి అని ప్రజలు పిలిచే బోధ దీవిలో ఉన్న బౌద్ధ భిక్షువుల మఠంలోనే ఆమె మామూలుగా నివసిస్తుంటూంది!" అన్నారు యువరాజు.

ఆచార్య భిక్షువు కూడ ఇందుకు మారు పలుకక ఒప్పుకొన్నారు.

~

మరునాడు సుడిగాలి, తుఫాను తీవ్రత తగ్గింది. పొంగి వచ్చిన కడలి కూడ వెనక్కు వెళ్ళింది. కానీ వాటి వల్ల ఏర్పడ్డ నాశనం వర్ణనాతీతం. నాగపట్టణంలో సగానికి పైగా ఇళ్ళు కప్పులు కోల్పోయి పిట్ట గోడలుగా నిలిచాయి. ఆ వీధుల్లో ఒక దాని వెంబడి యువరాజు అరుళ్మొళి వర్మ ఒక మూటను మోసుకొని నడుస్తున్నారు. ఆయన వెనక మురుగయ్యన్ ఇంకొక పెద్ద మూటను మోసుకొంటూ వెళుతున్నాడు. వారు సుడిగాలి వల్ల, వరదవల్ల కలిగిన అల్లకల్లోలాలను చూస్తూ ముందుకు వెళ్ళారు.

విరిగిపడ్డ ఒక ఇంటి గోడ వెనుక మరుగ్గా నిల్చొని ఒక స్త్రీ వారినే చూస్తూంది. ఆమె ఇంకెవరో కాదు - మురుగయ్యన్ భార్య రాక్కమ్మాళే. యువరాజు, మురుగయ్యన్ ఆమె నిలబడ్డ చోటును సమీపించేవరకు ఓపిగ్గా వేచివుంది. ఉన్నట్లుండి తాను దాక్కొన్న చోటినుంచి బయటికొచ్చి యువరాజు

ముందుకొచ్చి ఆయన కాళ్ళమీద పడింది. మురుగయ్యన్ ఆమెను తన వైపు మళ్ళించజూశాడు. పెదవులపైన వేలుంచుకొని సైగ చేశాడు. 'ఉష్', 'ఉష్' అని హెచ్చరించాడు. ఏమీ ఫలించలేదు.

"చక్రవర్తి దివ్యకుమారా! వీరాధివీరా! పొన్నియిన్ సెల్వా! చోళదేశపు పుణ్యకుమారా! చూడామణి విహారంలో మీరు మునిగిపోకుండ బతికి వచ్చారా? నా కళ్ళెంత భాగ్యం చేశాయి!" అని కేకలేసింది.

వీధిలో అటూ ఇటూ తిరుగుతున్న అందరి చూపులూ ఇప్పుడు యువరాజు వైపు మళ్ళాయి.

~~~
~~~

# అధ్యాయము - 7

## ప్రజల కుతూహలం

**పడవ** నడిపే మురుగయ్యన్ తన పెళ్ళాం వేసిన కేకలు విని అదిరిపడ్డాడు. మళ్ళీ అమెను చూసి చేతులతో సైగలు చేస్తూ, "ఏయ్! ఏం పేలుతున్నావు? నీకేమైనా పిచ్చిపట్టిందా?" అన్నాడు.

"నాకేం పిచ్చి పట్టలేదు. నీకే పిచ్చి; నీ అబ్బకు పిచ్చి; నీ తాతకు పిచ్చి! వీరు నీకెవరని గుర్తు తెలియలేదా? లంకారాజ్యాన్ని జయించి, లంక రాజు మహీంద్రుని కొండల్లోకి తరమగొట్టిన వీరాధివీరుని నీకు తెలియలేదా? చక్రవర్తి ముద్దుల కుమారుని, చోళ దేశపు కంటిపాపలాంటి వారిని, కావేరి తల్లి కాపాడి ఇచ్చిన పుణ్యకుమారుని నీవు గుర్తుపట్టలేకున్నావా? అలాగైతే నీవెందుకు బయలుదేరావు? ఎక్కడికి వెళుతున్నావు?" అని నిలదీసింది రాక్కమ్మాళ్.

యువరాజిప్పుడు అడ్డుపడి, "అమ్మాయీ! నీవు నన్ను ఎవరోనని పొరబాటుగా అనుకొన్నావు. నేను లంక దేశంనుంచి వచ్చిన వ్యాపారిని. నేనే ఇతన్ని నాకు దారి చూపేందుకు నాతో తోడు తీసుకొని బయలుదేరాను! ఇతనెవరు? నీ మగడా? కావాలంటే నీవితన్ని నీతో పిలుచుకొని వెళ్ళు! అనవసరంగా కేకలేయకు!" అన్నారు.

ఈ సంభాషణ జరుగుతుండగానే వారి చుట్టూ ప్రజలు గుమిగూడారు. గుంపు నిమిష నిమిషానికీ అధికం కాసాగింది. వచ్చిన వారందరూ యువరాజును గుచ్చి చూడసాగారు.

అప్పుడు రాక్కమ్మాళ్ ఇంకా పెద్ద గొంతుతో, "ఏ దైవమా! ఇదేమి? పొన్నియిన్ సెల్వన్ వారికి చిత్తభ్రమ కలిగిందా? కడలిలో మునిగినప్పుడు అంతా మరిచిపోయారా? లేక ఆ పాపిష్టి బౌద్ధ భిక్షువులు ఆయనకు మంత్రం వేసి మతి పోగొట్టి ఆయన తనని ఇంకెవరోనని అనుకొనేటట్లు చేశారా? లేక – అయ్యయ్యో! అలా కూడ జరగే అవకాశముందా? తమరు మరణించి, తమ శరీరంలోకి పరకాయ ప్రవేశ విద్య తెలిసినవాడెవడైనా దూరాడా? అలా ఏం సాధ్యం కాదు! యువరాజా! బాగా ఆలోచించండి. మీరు వ్యాపారి కారు. సుందర చోళ చక్రవర్తి దివ్య కుమారులు. లోకాన్ని ఒకే ఛత్రం కింద ఏలేందుకు పుట్టినవారు. సందేహముంటే తమ అరచేతిని పరీక్షించుకోండి. శంఖ చక్రాలుంటాయి!" అన్నది

వెంటనే యువరాజు అరుళ్మొళి వర్మ తమ రెండు చేతులను గట్టిగా మూసుకొన్నారు.

"అమ్మాయీ! నీవు నోరు మూసుకొని ఉండలేవా?" అని గద్దించి, మురుగయ్యన్ని చూసి, "ఇదేం తంటా? ఈమె కేకలను నీవు అపలేవా?" అన్నారు.

మురుగయ్యన్ తన భార్య దగ్గరికొచ్చి ఆమె చెవిలో, "రాక్కమ్మా! నీకు పుణ్యముంటుంది! మాట్లాడకుండు! యువరాజు ఎవరికీ తెలియకుండ వ్యాపారి వేషంలో తంజావూరుకు

వెళ్ళాలనుకొంటున్నారు!" అన్నాడు.

"ఒరే పాపిష్టి కొడకా! అది ముందే ఎందుకు చెప్పలేదు? యువరాజు చూడామణి విహారంలో లేనే లేరన్నావే? ఇప్పుడు కూడ ఆ ఆలోచనతోనే ఉన్నావు. అయ్యయ్యో! ఎంత పెద్ద తప్పు చేసేశారు? ఆ పాపిష్టి పళువేట్టరయ్యర్లు తమను చెరపట్టి పగ తీర్చుకోవడానికి సమయం కోసం వేచివున్నారన్న విషయాన్ని మరిచేపోయాను కద? యువరాజా! అయినా కూడ మీరు భయపడకండి. పళువేట్టరయ్యర్లు మీకు కించిత్తు హాని కూడ చేయలేరు. నాలాగ, నా భర్తలాగ లక్షలకొద్ది ప్రజలు మీ పక్షాన నిలబడి మిమ్మల్ని కాపాడేందుకు సిద్ధంగా ఉన్నారు!" అన్నది. వెంటనే తన చుట్టూ నిలబడ్డ జనాలను చూసి, "నేను చెప్పింది మీరంతా ఆమోదిస్తున్నారు కద? మీలో ఎవరైన పళువేట్టరయ్యర్ల పక్షంవారున్నారా? అలాగైతే వారిలా ముందుకు రండి! నన్ను మొదట చంపి తర్వాత యువరాజుకు ఏదైన హాని చేయండి!" అని అరిచింది.

~

అంతవరకు ఎనలేని ఆశ్చర్యంతో అంతా చూస్తున్న ప్రజలు, వెంటనే, "పొన్నియిన్ సెల్వన్ గారికి నూరేళ్ళు! లంకను జయించిన వీరాధివీరునికి జయహో!" అని పెద్దగా ఘోషించనారంభించారు. అది విని మరింత మంది వచ్చి చేరారు. అలా వచ్చినవారిలో నాగపట్టణపు నగరాధికారి కూడ ఉన్నారు. ఆయన గుంపును తొలగించుకొని ముందుకు వచ్చి, "యువరాజా!/రాకుమారా! తమరు చూడామణి విహారంలో ఉన్నారని విన్నాను. కానీ మేమా వదంతిని నమ్మలేదు. ఇప్పుడు నిజాన్ని తెలుసుకొన్నాను. నిన్న వీచిన గాలి ఈ నగరాన్ని ఎంతో ధ్వంసం చేసింది. కానీ తమరు బుద్ధ విహారాం నుంచి క్షేమంగా బయటకు వచ్చేశారు కద! అందువల్ల మా కష్టాలన్నీ మరిచిపోతాము. ఈ నగరంలో ఈరోజు మీరు పాదం మోపింది మా భాగ్యం!" అన్నారు.

యువరాజు తానిక అజ్ఞాతంగా ఉండడం అసాధ్యమని, అందుకు ప్రయత్నించడం వల్ల ఫలితం లేదని గ్రహించారు.

"అయ్యా! తమ ప్రీతికి చాల కృతజ్ఞతలు. ఈ నగర ప్రజల ప్రేమ నన్ను పరవశింపజేస్తూంది. కానీ ఒక అతి ముఖ్యమైన కార్యంమీద నేను వెంటనే తంజావూరుకు వెళ్ళవలసివుంది. ప్రయాణం ఆలస్యం కాకూడదనే నేనిలా వ్యాపారి వేషం ధరించి బయలుదేరాను. నాకు సెలవివ్వండి!" అన్నారు.

అప్పుడు ప్రజల కూటమి నుంచి ఒక గొంతు, "లేదు, లేదు! యువరాజు ఇక్కడ ఒక్క రోజైన ఉండి పేదవారైన మా ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్ళాలి!" అన్నది.

వెను వెంటనే వేలకొద్ది ప్రజలు, "అవును! యువరాజు ఒక్కరోజైన ఇక్కడ విడిది చేసి మా ఆతిథ్యాన్ని స్వీకరించి వెళ్ళాలి!" అని ఘోషించారు.

~

నగరాధికారి అప్పుడు, "యువరాజా! నా నగర ప్రజల ప్రేమను, ఉత్సాహాన్ని చూశారు కద? మీరు ఒక్కపూటైన మా అతిథిగా ఉండి వెళ్ళాలి. బుద్ధ భిక్షువులు చేసిన భాగ్యం మేము చేయలేదా? నిన్న ఈ నగరప్రజలు మిమ్మల్ని బౌద్ధ భిక్షువులు దాచిపెట్టారని సందేహించి వారి విహారాన్నే నేలమట్టం చేసేందుకు సిద్ధపడ్డారు. ఆ సమయాన సుడిగాలి వచ్చేసింది! మేము చేయలేకపోయిన కార్యాన్ని సుడిగాలి చేసేసింది. విహారం విరిగిపడి నేలమట్టమైంది!" అన్నారు.

అది విన్న యువరాజు, "అయ్యో! మీరు బౌద్ధ భిక్షువుల మీద నింద మోపడం సరికాదు. నేను వేడుకొన్నందువల్లనే నన్ను భిక్షువులు విహారంలో ఉండనిచ్చారు. చలిజ్వరం వచ్చి కొస ప్రాణంతో కొట్టుమిట్టాడుతున్న నాకు వైద్యం చేసి యమపాశం నుంచి కాపాడారు. చూడామణి విహారం కూలిపోయిందని విని నా మనసు వేదన పడుతూంది. దాన్ని మళ్ళీ కట్టించడం నా కర్తవ్యం!" అన్నారు.

"ఆహా! ఇదంతా మాకు ముందే తెలియకపోయింది కద? ఇప్పుడు మీరు తెలియజేసినందువల్ల మేమే ఆ చూడామణి విహారాన్ని పునర్నిర్మిస్తాము. యువరాజా! మీరు ఒక్కపూటైన మా అతిథిగా ఉండి వెళ్ళాలి!" అన్నారు నగరాధికారి.

"ఔను! ఔను!" అని వేలకొద్ది ప్రజల ఆమోదఘోష మారుమోగింది.

"యువరాజా! మీరిక్కడ ఒక పూట ఉండి వెళ్ళడం వల్ల కలిగే ఆలస్యాన్ని సరి పుచ్చుకోవచ్చు. మీరేమో కాలినడకన బయలుదేరారు. గాలివాన వల్ల చోళదేశపు రహదారులన్నీ నిరుపయోగస్థితిలో ఉన్నాయి. నదులన్నీ పొంగి పొర్లుతున్నాయి. కాలి నడకన వెళితే ఎప్పుడు వెళ్ళి చేరుతారు? మిమ్మల్ని ఏనుగెక్కించి ఊరేగింపుగా సాగనంపుతాము. మేమందరమూ మీతో తంజావూరు వచ్చి మిమ్మల్ని తంజావూరు చేరుస్తాము!" అన్నారు నగరాధికారి.

ఆయన మాట్లాడుతుండగానే ప్రజల కూటమి ఇంకా అధికమైంది.

~

యువరాజు ఆలోచనలో పడ్డారు. కార్యమేమో చెడింది. రహస్యం బయటపడిపోయింది. రాక్కమ్మాళ్ మూర్ఖంగా కేకలేసి తనను బయటపెట్టేసింది. మూర్ఖత్వం వల్ల అలా చేసిందా...? లేక, ఇంకేదైన ఉద్దేశముందా? ఏదెలా ఉన్నా, ఈ నగర ప్రజల ఆదరాభిమానాలను తోసిపుచ్చి వెంటనే బయలుదేరడం జరగని పని. అందువల్ల వారంతా చాల నొచ్చుకొంటారు. అదీగాక, తన గురి తప్పిపోయినా పోవచ్చు. మధ్యాహ్నం వరకైన ఇక్కడుండి, వీరిని సంతృప్తి పరచిన తర్వాతే బయలుదేరగలం. సుడిగాలి వల్ల కష్టనష్టాలకు లోనైన వీరిని ఓదార్చి వెళ్ళేందుకు కూడ అనుకూలంగా ఉంటుంది. ఆహా! నేనీ సమయాన బయటపడడం వల్ల దేశంలో సంక్షోభం కలుగుతుందని అక్కగారన్నారు కద? అది ఎంత నిజమైన మాట! - నా అక్కలాంటి తెలివైన మనిషి ఈ లోకంలోనే ఎవరూ లేరు! - తంజావూరు సింహాసనం మీది హక్కు గురించి మాట్లాడుకొంటున్నారు కద? నిజానికి కుందవైదేవిని కద సింహాసనంమీద కూర్చోబెట్టాలి...?

ఇలా పొన్నియిన్ సెల్వన్ ఆలోచిస్తుండగా ప్రజల కూటమి అధికం కావడాన్ని గమనించారు. వారి కుతూహలం పెరగడాన్ని కూడ గమనించారు. సుడిగాలి కలిగించిన కష్టాలను ప్రజలు పూర్తిగా మరిచిపోయినట్లున్నారు. ఎక్కడినుంచో ఏనుగులు, గుర్రాలు, పల్లకీలు, రాజ లాంఛనాలు, గొడుగులు, వింజామరలు, భేరీలు మొదలైన వాద్యాలు - అన్నీ వచ్చి చేరాయి.

ఒక్క పూటైనా ఇక్కడుండి వెళ్ళాలని యువరాజు తీర్మానించుకొన్నారు.

నగరాధిపతిని చూసి, “అయ్యా! ఇంతమంది ప్రజల ప్రేమను తోసిపుచ్చి వెళ్ళేందుకు నేనిష్టపడడం లేదు. మధ్యాహ్నం వరకు ఇక్కడే ఉండి, సాయంత్రం బయలుదేరుతాను. అందుకైన సమ్మతిస్తారు కద?” అన్నారు.

~

యువరాజు ఒక పూట ఉండి వెళ్ళడానికి సమ్మతించారని తెలియగానే ప్రజల ఉత్సాహం ఎల్లలు దాటింది. కుతూహలాన్ని చూపించే దారులు వెతకసాగారు - వాద్యాలు ఘోషించనారంభించాయి. అక్కడక్కడా వీధుల్లో కత్తి ఆటలు, కురపై ఆట మొదలైనవి ప్రారంభమయ్యాయి. యువరాజుకు ప్రజల కుతూహలపూరిత విన్యాసాలను దాటుకొని చోళమాళిగను చేరుకోవడం కష్టసాధ్యమైంది. ఎలాగో చివరికి వెళ్ళి చేరారు.

మాళిగలో యువరాజు కాసేపు కూడ సేదదీర సాధ్యం కాలేదు. ఎందుకంటే, వారు బయటపడ్డ విషయం చుట్టుపక్కల గ్రామాలన్నిటికీ వ్యాపించేసింది. ప్రజలు తండోపతండాలుగా వచ్చి గుమిగూడసాగారు. యువరాజును చూడాలన్న తమ కోరికను తెలియబరిచారు.

యువరాజు కూడ అప్పుడప్పుడూ బయటకు వచ్చి ప్రజల క్షేమసమాచారాలను విచారించి తెలుసుకొన్నారు. సుడిగాలి వల్ల  కలిగిన కష్టనష్టాల గురించి చాల అక్కరతో అడిగి తెలుసుకొన్నారు. తాను తంజావూరుకు వెళ్ళగానే ప్రజలకు కలిగిన కష్టనష్టాలకు పరిహారం ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. దాని గురించి ప్రజలంతగా ఉత్సాహం చూపించలేదన్నది కూడ గ్రహించారు. ప్రజలు, “పళువేట్టరయ్యర్ల అధికారం ముగింపుకొస్తుందా?” అని మాట్లాడుకోవడం కూడ ఆయన చెవిన పడింది. చక్రవర్తి ఆరోగ్యం గురించి, ఆయన తర్వాత సింహాసనమెవరు అధిష్టించబోతున్నారన్న విషయం గురించి తగ్గు స్వరంలో, కానీ యువరాజు చెవిన పడేటట్లు, పలువురు మాట్లాడుకొన్నారు!

వీటన్నిటికీ మధ్య నాగపట్టణం నగరపు పెద్ద పెద్ద కుటుంబాలవారు, అధికారులు, నగరాధికారులంతా వచ్చి చేరారు. యువరాజుకు విందు భోజనం ఇచ్చేందుకు పెద్దగా ఏర్పాట్లు జరిగాయి. యువరాజును చూడవచ్చిన ప్రజలకు భోజనం వడ్డించేందుకు కూడ ఏర్పాట్లు జరిగాయి. సుడిగాలి వల్ల నష్టమైనవి పోగా, మిగిలిన ధాన్యసంపదంతా వచ్చి చేరింది. కూరగాయల గురించి దిగులే లేదు. పడిపోయిన అరటి చెట్లనుంచి అరటికాయలు, కొబ్బరి చెట్లనుంచి కొబ్బరికాయలు తీసుకొని వచ్చి ఒక

లక్షమందికి విందు భోజనం వండవచ్చు కద?

~

విందు భోజనం ముగిసి, బయలుదేరవలసిన సమయమాసన్నమైంది. యువరాజు చోళమాళిగ పైమేడ ముందు భాగానికొచ్చి చేతులు జోడించి నిలబడ్డారు. వీధిలో ఒక పెద్ద కోలాహలమైన ఊరేగింపు బయలుదేరడానికి సన్నాహాలు జరుగుతున్నాయి. యువరాజు ఎక్కి వెళ్ళేందుకు అలంకరించబడ్డ ఒక ఏనుగు వచ్చి నిలబడింది. దాని ముందు, వెనుక గుర్రాలు, వృషభాలు మొదలైనవి సిద్ధంగా ఉన్నాయి. రాజ లాంఛనాలు, గొడుగులు పట్టుకొన్నవారు, పలువిధాలైన వాద్యకారులు వచ్చి నిలబడ్డారు. ప్రజలేమో నిన్న సాయంత్రం పొంగివచ్చిన సముద్రంలాగ కోలాహలంతో కనుచూపు మేరకు విస్తరించివున్నారు.

యువరాజు పైకేమో చిరునవ్వుతో కూడిన ముఖంతో కనిపించారు. కానీ ఆయన మనసులోనేమో ఒక పెద్ద దిగులు గూడు కట్టుకొంది. కన్న తల్లి కన్న వందరెట్లు అధికంగా తనమీద ప్రేమను కురిపించిన ఆ లంకారాణి గతి ఏమైందో తెలుసుకోవాలని ఆయన మనసు విలవిల్లాడింది. మురుగయ్యన్ భార్యనడిగి ఇంకొన్ని వివరాలు తెలుసుకొందామనుకొన్నారు. ఆమేమో గుంపులో కలిసిపోయి మరుగైంది. మురుగయ్యన్ మాత్రం యువరాజును విడవక ఆయన వెంబడి చోళమాళిగకు వచ్చి చేరాడు. వాడి పెళ్ళాం రాక్కమ్మాళ్ ఏమైందని వాడికీ తెలియలేదు.

మరొకవైపు యువరాజును ఇంకొక దిగులు పట్టి పీడించసాగింది. చక్రవర్తి కోరికకు విరుద్ధంగా తాను రాజ్యాన్ని చేపట్టగోరుతున్నానని పళువేట్టరయ్యర్లు అప్పటికే అంటున్నారు. ఈ ప్రజల ఆర్భాటం చూస్తే వారి ఆరోపణ నిజమని నిర్ధారమైపోతుంది కద?

ఎలాగైనా ఈ నగరప్రజల అభిమాన వలయం నుంచి తప్పించుకొని బయటపడితే చాలనిపించింది యువరాజుకు.

ఈ పరిస్థితిలో ఆయన ఏమాత్రం ఎదురుచూడని ఇంకొక సంభవం జరిగింది.

ప్రజల వద్ద సెలవు తీసుకొని బయలుదేరే ఉద్దేశంతో యువరాజు చేతులు జోడించి నిలబడ్డప్పుడు, నగరపు పెద్ద కుటుంబాల పెద్దలు, నగరాధికారులు మాళిగ వాకిట వచ్చి నిలబడ్డారు.

ముందుగా ఏర్పాటు చేసుకొన్నట్లు కొన్ని నిమిషాలపాటు భేరీలు, ఢంకాలు, తప్పెటలు మొదలైన వందలకొద్ది వాద్యాలు సముద్రఘోషను మించి ఘోషించాయి. ఉన్నట్లుండి అన్ని వాద్యాలు ఒక్కసారిగా ఆగిపోయినప్పుడు ఆ మహాకూటమిలో నిశ్శబ్దం నెలకొంది. ఆ సమయాన నగర ప్రముఖుల్లో ముఖ్యులుగా కనిపించిన ఒకరు మాళిగ ముందు వాకిటిమీది గూడు పైకెక్కి గంభీర స్వరంతో ఇలా చెప్పారు:-

"పొన్నియిన్ సెల్వ! ఒక విన్నపం. నాగపట్టణం, చుట్టుపక్కల గ్రామాల తరఫున ఒక కోరిక. చక్రవర్తి ఆరోగ్యం గురించి మేమందరమూ దిగులుగొనివున్నాము. అదే విధంగా మేము వింటూ వస్తున్న

ఇంకొక వార్త కూడ మా దిగులుకు కారణమైంది. పళువేట్టరయ్యర్లు, పలువురు చిన్నరాజులు కూడబలుక్కొని చక్రవర్తి తర్వాత మధురాంతక దేవరికి పట్టం కట్టాలని తీర్మానించారని విన్నాము. మధురాంతక దేవరు ఇంతవరకు యుద్ధరంగానికి వెళ్ళనివారు. వారు పట్టానికి వస్తే నిజానికి పళువేట్టరయ్యర్లే రాజ్యాన్ని ఏలుతారు. చిన్నరాజులు, సామంతులు వేసిందే చట్టమవుతుంది. పెద్ద యువరాజు ఆదిత్య కరికాలన్ మూడేళ్ళుగా చోళరాజ్యానికే రాలేదు. అందుకు ఏవేవో కారణాలు చెబుతున్నారు. ఆయనకు మకుటం ధరించేందుకు ఇష్టంలేదని కూడ అంటున్నారు. అలాగైతే తదుపరి సింహాసనాన్ని అధిష్టించవలసింది ఎవరు? చోళనాడు తపస్సు చేసి పొందిన పుణ్యకుమారులు, కావేరి మాత కాపాడిన ప్రియపుత్రులు, లంకను జయించిన వీరాధివీరులు అయిన మీరే... ప్రజలారా! నేను చెప్పింది మీకందరికీ సమ్మతమే కద?" అని ఆ ప్రముఖ వ్యక్తి ప్రజల కూటమిని చూస్తూ అడిగిన వెంటనే, అష్ట దిక్కులు దద్దరిల్లిపోయేటట్లు ప్రజల ఆమోద ధ్వని మారుమోగింది. "అవును! మామాట కూడ అదే!" అని వేవేల గొంతులు ధ్వనించాయి. దాని వెంబడి, "పొన్నియిన్ సెల్వన్ నూరేళ్ళు జీవించాలి!" అని ఒక లక్ష గొంతులు ఘోషించాయి.

ఉత్తరమిచ్చేందుకు యువరాజు పెదవులు కదలనారంభించగానే, ఏదో మంత్రం వేసినట్లు ఆ జనసముద్ర ఘోష చటుక్కున ఆగిపోయింది.

"అయ్యా! మీరందరూ నామీదగొన్న ప్రేమాభిమానాలను చూసి ఆనందపడుతున్నాను. కానీ ప్రేమను మీరు చూపించే విధం ఉచితంగా లేదు కద? నా ప్రియమైన తండ్రి, సుందర చోళ చక్రవర్తి ఇంకా సజీవంగా ఉన్నారన్న విషయాన్ని మీరు మరిచిపోయినట్లుంది. చక్రవర్తి చిరకాలం జీవించాలని నాతోబాటు మీరందరూ ప్రార్థించాలి. ఆయన సజీవంగా ఉన్నప్పుడు ఆయన తర్వాత ఎవరన్న విషయాన్ని గురించి ఆలోచించడమెందుకు?"

~

నగర ప్రముఖుల్లో ముఖ్యులైన ఆ పెద్దాయన యువరాజు అడిగిన ప్రశ్నలకు ఉత్తరాన్ని సిద్ధంగా ఉంచారు.

"పొన్నియిన్ సెల్వ! చోళనాడులో ఒక రాజు సజీవంగా ఉన్నప్పుడే ఆయన తర్వాత ఎవరు సింహాసనమధిష్టించాలని నిర్ణయించడం తరతరాలుగా వస్తున్న సంప్రదాయం. మదురై జయించిన వీరులు, తిల్లైయమ్మవారి ఆలయానికి బంగారు గోపురం కైంకర్యం చేసిన మహా పరాంతక చక్రవర్తి తమ కాలంలోనే తమ పిదప పట్టానికి అర్హులెవ్వరని నిర్ణయించలేదా? ఆ విధంగానే కద తమ తండ్రి సింహాసనమెక్కారు?" అన్నారు.

"అవును! కాబట్టి ఇప్పుడు కూడ తదుపరిగా పట్టానికెవరు అర్హులని చక్రవర్తే కద నిర్ణయించాలి? మీరూ, నేనూ అందుగురించి ఆలోచించడమూ, మాట్లాడుకోవడమూ సరి/సబబు కాదు

కద?" అన్నారు యువరాజు.

"పొన్నియిన్ సెల్వ! చక్రవర్తికి మాత్రమే ఆ హక్కు ఉందని ఒప్పుకొంటున్నాము. చక్రవర్తి స్వేఛ్ఛగా ఆ నిర్ణయం తీసుకొగలిగే వారయితే అది సరి అవుతుంది. ప్రస్తుతం చక్రవర్తిని పళువేట్టరయ్యర్లు తంజావూరు కోటలో చెరపట్టి కద ఉంచారు? యువరాజా! ఇంకా చెప్పబోతే, చక్రవర్తి ప్రాణాలతో ఉన్నారా, లేదా అన్న సందేహం కూడ మాలో పలువురికి ఉంది. తమతోబాటు తంజావూరుకు వచ్చి ఆ సందేహాన్ని తీర్చుకోగోరుతున్నాము. అదృష్టవశాత్తు చక్రవర్తి బాగుంటే, ఆయనకు మా కోరిక తెలియజెప్పుకొంటాము. ఆయన తర్వాత మీరే సింహాసనమధిష్టించాలని విన్నవించుకొంటాము. తర్వాత, చక్రవర్తి ఎలా తీర్మానిస్తారో అలా తీర్మానించనీ!"

పెద్దాయన చక్రవర్తి సజీవంగా ఉన్నారో లేరోనన్న సందేహాన్ని వెలిబుచ్చుతూ అన్న మాటలు యువరాజు మనసులో ఒక పెద్ద దిగులును పుట్టించాయి. ఇన్నాళ్ళు ఆయనెరుగని వేదన, భీతి ఏర్పడ్డాయి. చక్రవర్తి ప్రాణాలకు ఏదో ఆపద కలిగినట్లు, దాన్నడ్డుకోలేని దూరాన తానున్నట్లు ఒక భ్రమ కలిగింది. లంకారాణిని ఎవరో మూర్ఖులు బలవంతంగా పట్టుకొని వెళ్ళిన విషయం కూడ గుర్తుకొచ్చింది. ఇక ఒక్క క్షణం కూడ ఆలస్యం చేయక తంజావూరుకు వెళ్ళి చేరాలని ఆదుర్దా పడసాగారు. కొన్ని క్షణాల్లో యువరాజు తాము చేయవలసింది ఇదీ అని తీర్మానించుకొన్నారు. వీరితో వాదిస్తూండడం వల్ల ప్రయోజనం లేదు. ప్రయాణం ఆలస్యమవుతుందంతే. ఇప్పుడు వీరి మాటను ఒప్పుకొన్నట్లు చెప్పి బయలుదేరితే, దారిలో ఎన్నెన్నో ఉపాయాలు కనిపెట్టవచ్చు.

"అయ్యా! మీకోరికకు నేనడ్డు నిలబడను. చక్రవర్తిని గురించి మీరన్న మాటలు ఆయనను దర్శించాలన్న నా ఆదుర్దాను, దిగులును అధికం చేస్తున్నాయి. నేను వెంటనే బయలుదేరాలి. మీరు కూడ చక్రవర్తిని దర్శించాలంటే నాతోబాటు ధారాళంగా రండి. పట్టపు హక్కు గురించి చక్రవర్తి ఏం చెబుతారో అది విని మనమందరం దాని ప్రకారం నడుచుకొందాం!" అన్నారు.

కాసేపటికల్లా యువరాజు ఏనుగెక్కి ప్రయాణమయ్యారు. వేలకొద్ది ప్రజల ఊరేగింపు తంజావూరు వైపు బయలుదేరింది. పోనుపోను యువరాజు వెంట వెళ్ళిన ఊరేగింపు పెరగసాగింది.

~~~
~~~

# అధ్యాయము - 8

## పడవలో పళువేట్టరయ్యర్

**సుడిగాలి** వీచిన ఉదయమే పెద్ద పళువేట్టరయ్యర్ కడంబూరునుంచి తంజావూరుకు బయలుదేరారన్న విషయం పాఠకులకు గుర్తుండే ఉంటుంది. కొళ్ళిడం వరకు ఆయన అలవాటుగా వెళ్ళే దారినే వెళ్ళి, తర్వాత కొళ్ళిడం నదీతీరం వెంబడి ఉన్న బాట వెంబడి పశ్చిమంగా తిరిగారు. చోళనాడు గ్రామాల గుండా ఆయన దీర్ఘప్రయాణం చేయనిష్టపడలేదు. పశ్చిమంగా వెళ్ళి తిరుపై చెరువుకు ఎదురుగా కొళ్ళిడం నదిని దాటాలనుకొన్నారు.

ఈసారి పెద్ద పళువేట్టరయ్యర్ వందలకొద్దీ పరివారంతో బయలుదేరలేదు. తాను వెళ్ళడం, రావడం సాధ్యమైనంతవరకు ఎవరి ఆసక్తిని కూడ ఆకట్టుకోకూడదని అనుకొన్నారు. కాబట్టి పదిమందిని మాత్రం వెంట తీసుకొని వెళ్ళారు.

తిరుపైయారుకు నేరుగా కొళ్ళిడం నది ఉత్తరతీరాన్ని ఆయన చేరినప్పుడు ఆ నది ఇరువైపులా గట్లను తాకుతూ వరద పొంగి పారుతూంది. అక్కడున్న చిన్న పడవలో గుర్రాలను తీసుకొని వెళ్ళడం సాధ్యం కాని పని. పెనుగాలి వీయబోతుందన్న సూచనలు కానరాసాగాయి. కాబట్టి తిరిగి వెళ్ళేందుకు సౌకర్యంగా ఉంటుందని పెద్ద పళువేట్టరయ్యర్ తమ గుర్రాలను ఉత్తర తీరాన వదిలిపెట్టి తమతో వచ్చిన పది వీరులతో పడవెక్కారు. పడవ నది మధ్య ఉండగా సుడిగాలి బలం పుంజుకొంది. పడవ నడిపేవారిద్దరూ అతి కష్టంమీద పడవను నడపసాగారు. నది వెల్లువ పడవను తూర్పుగా లాగసాగింది. సుడిగాలి దాన్ని పశ్చిమంగా తోయజూసింది. పడవ నడిపేవారు పడవను దక్షిణంగా నడప ప్రయత్నించారు. ఈ మూడు శక్తుల మధ్య చిక్కుకొన్న ఆ పడవ చక్కర్లు కొట్టసాగింది.

పళువేట్టరయ్యర్ మనసులో కూడ అప్పుడొక పెద్ద సుడిగాలి వీయసాగింది. నందిని ముందున్నప్పుడు ఆయన బుద్ధి మైకంగొనడం మామూలే. ఆమె చెప్పేదంతా నిజమేనని ఆయనకు తోస్తుంది. జీవితమంతా తాను చేయడానికిష్టపడని ఒక కార్యాన్ని నందిని చెప్పేటప్పుడు అది చేయదగినదే అని ఆయనకు తోచేస్తుంది. మనసులో కాస్త సందేహమున్నా కూడ నోరు "సరే! సరే! అలాగే చేద్దాం" అని చెప్పేస్తుంది. చెప్పిన తర్వాత, మాట తప్పి ఏదీ చేసేందుకు ఆయన ఇష్టపడరు.

ఇప్పుడు కూడ నందిని ఆయనను తంజావూరు వెళ్ళి మధురాంతకుని పిలుచుకొని రమ్మన్నప్పుడు, సరే అని ఒప్పేసుకొన్నారు. కానీ బయలుదేరిన తర్వాత, దానికి సంబంధించిన అనేక సందేహాలు ఉదయించి ఆయన మనసును వేధించసాగాయి. నందిని నడతలో అణుమాత్రం కూడ కళంకం ఏర్పడగలదని ఆయన సందేహించలేదు. కానీ నందిని(కి) ఈడైన ముగ్గురు యువకుల మధ్య ఆమెను

వంటరిగా వదిలిపెట్టి వచ్చామన్న ఆలోచన ఆయన మనసులో తలెత్తి, ఆయనను వేధించసాగింది.

~

గందమారన్, వంతిదేవుడు, ఆదిత్య కరికాలన్ - ఆయన కోపంగొనడానికి ఆయనకు అనేక కారణాలున్నాయి. బొక్కసపు నేలమాళిగలో తాము, నందిని అర్ధరాత్రి వెళుతున్నప్పుడు, గందమారన్ ఎదురొచ్చి, నందినిని, "మీ కుమార్తె" అన్నది ఆయన మనసులో కాలిన ఇనుపకడ్డీతో వాత పెట్టినట్లు పదిలమైంది. అప్పుడు కలిగిన కోపంలో అతన్ని చంపేసేందుకే కాపలావాడికి రహస్య ఆజ్ఞ ఇచ్చేశారు. తర్వాత దాని గురించి పశ్చాత్తాప పడ్డారు. ఎలాగో గందమారన్ బతికిపోయాడు. వాడు ఎలా బతికాడు, నేలమాళిగ కాపలావాడు ఎలా చనిపోయాడు అన్న వివరాలను ఆయన ఇంకా తెలుసుకోలేకపోయారు. ఆ తర్వాత గందమారన్ తమ అంతఃపురంలోనే కొన్ని రోజులు ఉన్న విషయం, నందిని అతడికి శ్రద్ధతో ఉపచారాలు చేసిన విషయం ఆయన మరువలేకపోయారు.

ఇక, వంతిదేవుడు కూడ కడంబూరులో ఉన్నాడు. మొట్టమొదట ఆ అధికప్రసంగి యువకుని చూస్తే ఆయనకు నచ్చలేదు. తర్వాత తంజావూరులో చక్రవర్తికి ఏకాంతంగా ఏదో హెచ్చరిక చేయ ప్రయత్నించిన విషయం, తంజావూరు కోటనుంచి ఎవరికీ తెలియకుండ తప్పించుకొని పారిపోయిన విషయం తెలిసినప్పుడు ఆయన చిరాకు అధికమైంది. అప్పుడు చిన్న పళువేట్టరయ్యర్ వాడు తప్పించుకొని పారిపోవడానికి నందిని సహాయం చేసివుండవచ్చని ఖచ్చితంగా చెప్పిన విషయం కూడ ఆయన మరువలేదు. అది ఏనాడూ నిజం కాజాలదు. ఎందుకంటే, అతడు కుందవైకి, అరుళ్మొళి వర్మకు అంతరంగ దూత అని తెలియవచ్చింది. కాబట్టి అతడికి, నందినికి మధ్య ఏవిధమైన సంబంధమూ ఉండజాలదు. అయినా కూడ వాడిని, నందినిని ఒక్కటిగా చేర్చి ఊహించుకొన్నప్పుడల్లా పెద్ద పళువేట్టరయ్యర్ ఉక్కు హృదయంలో అగ్నిజ్వాలలు లేచాయి.

చివరిగా, ఆదిత్య కరికాలన్ ఉండనే ఉన్నారు. ఆయన మునుపొకసారి గుడి పూజారి ఒకరి కూతురిని పెళ్ళి చేసుకోగోరారని, ఆమే నందిని అని ఆయన చెవిన పడింది. ఆ ఇద్దరూ ఇప్పుడు ఒకే చోట కలిశారు. అందుకు నందిని చాల ప్రయత్నాలు చేసింది. ఎందుకని? ఒకటి మాత్రం నిజం. ఆదిత్య కరికాలన్ చాల మొరటువాడై ఉండవచ్చు. పెద్దలంటే మర్యాదలేనివాడు కావచ్చు. కానీ అతడు చోళ కులంలో ఉదయించినవాడు. ఆ కులంలో ఎవరూ పరస్త్రీకి ద్రోహం చేయలేదు. కరికాలన్ కూడ అటువంటివాడు. స్త్రీల విషయంలో మంచి నడవడిక కలిగినవాడు. కానీ నందిని? ఆమెను తాము ఇంత వరకు నమ్మి ఆమె కోరినదంతా నెరవేర్చుతూ వచ్చింది సబబేనా? ఆమె నడవడికలో మచ్చ ఏమీ లేదని రూఢిగా చెప్పగలమా?  ఆమె పుట్టుపూర్వోత్తరాలే ఆయనకు ఇంకా సరిగ్గా తెలియదు. ఆమె గురించి ఆయన సహోదరుడు చాలసార్లు చెప్పక చెప్పి హెచ్చరించాడు. తమ్ముడు చెప్పిందే నిజమైపోతుందా? నందిని తమను వంచించేస్తుందా? - ఆహా! కథల్లో చెబుతారు కద? అటువంటి వంచక హృదయమున్న స్త్రీలు

లోకంలో నిజంగానే ఉంటారా? - వారిలో నందిని ఒకతా? ఇలా ఎంచినప్పుడు ఆయన మనసులో క్రోధజ్వాలలు లేవగా, అదే సమయాన ఆయన ఆమెపైగొన్న మోహాగ్ని కూడ జ్వాలలు లేపింది. వీటి వల్ల పుట్టిన వేదనను మరిచేందుకు పెద్ద పళువేట్టరయ్యర్ తమ తలాడిస్తూ, గొంతు సవరించుకొన్నారు. పదిమంది మధ్య ఉన్నామన్న ప్రజ్ఞే ఆయనను తన తలను రెండు చేతులతో కొట్టుకోకుండ ఆపింది. తనకు తెలియకుండానే పెద్దగా నిట్టూర్చసాగారు. పడవ అంచును రెండు చేతులతోను గట్టిగా పట్టుకొని, పళ్ళను గిట్ట కరుచుకొని, “అన్ని నిజాలను ఇక రెండే రోజుల్లో తెలుసుకొంటాను. ఇంతవరకు చేసిన తప్పుల్లాగ ఇక ఏనాడూ చేయను!” అని సంకల్పం చేసుకొన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 9

## గట్టు తెగింది!

పళువేట్టరయ్యర్ మనసులో నెలకొన్న వేదనను పడవలోని తక్కినవారు గ్రహించలేకపోయారు. పడవ సుడిగాలిలో చిక్కుకొన్నందువల్లే ఆయన అంతగా సంకటపడుతున్నారనుకొన్నారు. పెద్ద పళువేట్టరయ్యర్ మనోధైర్యంలో మేటి అని పేరుపొందినవారు. ఆయనే కలతబారడం చూసి వారి మనసులో కూడ భీతి కలగనారంభించింది. ఎప్పుడు పడవ తలకిందులవుతుందోనని, అందరూ తప్పించుకొని బతికి బయటపడే ఉపాయాల గురించి ఆలోచించసాగారు.

చివరగా, పడవ అలా చాలసేపు తల్లడిల్లిన తర్వాత, ఒడ్డు చేరవలసిన చోటుకు అర్ధకోసు తూర్పుగా ఒడ్డును సమీపించింది. “ఇక దిగుల్లేదు" అని అందరూ పెద్దగా నిట్టూర్చారు. ఆ సమయాన నదీతీరాన సుడిగాలి వల్ల దెయ్యంలాగ ఊగుతున్న చెట్లలో ఒకటి విరిగి పడింది. విరిగిన చెట్టును గాలి లేపుకొచ్చి పడవకు అతి సమీపాన నీట పడవేసింది. పడవను మళ్ళించి అవతలగా నడిపేందుకు పడవ నడిపేవారు మహాప్రయత్నం చేశారు. ఏమీ ఫలించలేదు. చెట్టు అతివేగంగా వచ్చి పడవను గుద్దింది. పడవ ధడేల్మని తలకిందులైంది. మరుక్షణం పడవలో ఉన్నవారంతా నీటిలో పడి తేలారు.

తక్కిన వారందరూ పడవ తలకిందులైతే ఎలా తప్పించుకోవాలన్న విషయాన్ని గురించే ఆలోచిస్తూండడం వల్ల, అది నిజంగా జరగగానే, ఆ అపాయం నుంచి బయటపడేందుకు ఒకింత సిద్ధంగానే ఉన్నారు. పడవ తీరం దగ్గరకొచ్చేసినందువల్ల కొందరు ఈదుతూ వెళ్ళి దరి చేరారు. కొందరు చెట్లను కరుచుకొని నిలబడ్డారు. ఇంకొందరు చేతికి దొరికింది పట్టుకొని తేలసాగారు.

కానీ పెద్ద పళువేట్టరయ్యర్ పరధ్యానంగా ఉండడం వల్ల పడవకు కలిగిన ప్రమాదాన్ని ఎదురు చూడనే లేదు. పడవ తలకిందులు కాగానే నీట మునిగిపోయారు. ఆయనను ప్రవాహం చాల దూరం వరకు కొట్టుకొని వెళ్ళిపోయింది. కొన్నిసార్లు నీళ్ళు తాగేసి ముక్కు, చెవుల వెంట నీరు లోపలికి వెళ్ళి ఊపిరాడక సతమతమై, ఎలాగో చివరికి కాస్త సంభాళించుకొని, పైకి తేలినప్పుడు, పడవ కనిపించలేదు; పడవలో తమతోబాటు వచ్చినవారు కూడ కానరాలేదు. అది మాత్రమేగాక, వరద తమని ప్రవాహ మధ్యప్రదేశానికి లాక్కొని వెళుతుండడాన్ని గమనించారు.

వెంటనే ఆ వృద్ధుని మనసులో పాత ధీరత్వం మళ్ళీ లేచింది. ఎన్నో యుద్ధాల్లో అతి ప్రమాదకరమైన పరిస్థితుల్లో తెగింపుతో పోరాడి గెలుపు సాధించిన ఆ మహావీరుడు ఇప్పుడు కూడ ఈ కొళ్ళిడం నది వరద ప్రవాహంతో పోరాడి గెలుపొందాలని తీర్మానించుకొన్నారు. చుట్టుపక్కల చూశారు. తేలుతూ సమీపానికి వచ్చిన ఒక కొయ్య దిమ్మను లాగి పట్టుకొన్నారు. తీరాన్ని గురిగా ఉంచుకొని

ఈదసాగారు. వరద వేగంతోను, సుడిగాలి వేగంతోను ఒకేసారి పోరాడుతూ ఈదసాగారు. చేతులు అలిసిపోయినప్పుడు ఊరకనే తేలుతూ వెళ్ళారు. చాలసార్లు గట్టెక్కేందుకు ప్రయత్నించినప్పుడు వాన వల్ల, బురద వల్ల నది మళ్ళీ ఆయనను ప్రవాహంలోకి తోసేసింది. వెంటనే, వదిలి పెట్టిన కొయ్య ముక్కను దూకి పట్టుకొన్నారు.

ఇలా చీకటి పడి ఒక జాము గడిచేదాక పోరాడిన తర్వాత, నదీతీరాన చెట్లు దట్టంగా పెరిగివున్న ఒక చోట ఆయన కాళ్ళు నేలను తాకాయి. తర్వాత, వంగిన పొదల సహాయంతో ఆ వృద్ధుడు తడబడుతూ గట్టెక్కారు.

ఆయన చుట్టూ గాఢాంధకారం కమ్ముకొనివుంది. పక్కన ఏదీ ఊరు ఉన్నట్లు కనిపించలేదు. తిరుపై నదికి ఎదురుగా గట్టెక్కవలసిన పడవ కాలువకు సుమారు ఒకటిన్నర కోసుల దూరం తూర్పుగా వచ్చివుండాలని ఆయన అంచనా వేసుకొన్నారు. అవునవును! కుడంద్తై నగరానికి సమీపానే తాము గట్టెక్కివుండాలి. ఈ రాత్రి ఎలాగైన కుడంద్తై నగరానికి వెళ్ళి చేరగలమా?

సుడిగాలి అప్పుడే తన పూర్తి ఉగ్రరూపాన్ని దాల్చింది. వేలకొద్ది దెయ్యాలు, పిశాచాలు చేరి చేస్తున్న శబ్దంలాంటి ఆ సుడిగాలి సృష్టిస్తున్న శబ్దానికి చెవులు దిబ్బెళ్ళు పడేలాగుంది. చెట్లు ఫెళఫెళ విరిగి పడుతున్నాయి. ఆకాశాన బ్రహ్మాండం బద్దలయ్యేటట్లు పిడుగుల శబ్దం వినిపించసాగింది. జడివాన జోరుగా కురవనారంభించింది.

"ఎక్కడైన ఒక పాడుబడ్డ మంటపమో, లేక పాత గుడో లేకుండ పోతుందా? దాంట్లో తల దాచుకొని రాత్రి గడపవలసిందే. పొద్దు పొడిచిన తర్వాతే ప్రయాణాన్ని పునఃప్రారంభించాలి" అని తీర్మానించుకొని, తడబడుతూ వణుకుతున్న కాళ్ళను ఊని నడుస్తూ నదీతీరం వెంబడి నడిచి వెళ్ళారు.

~

నది గట్టు అంచును తాకుతూ వరద ప్రవహిస్తూంది. వాన వల్ల గట్టుమీద కూడ చాల నీరుంది. చీకటి గురించి ఇక చెప్పనవసరం లేదు. కాబట్టి, ఆ వీర వృద్ధుడు నడిచి వెళుతూన్నప్పుడు తమకెదురుగా నదీతీరానికడ్డంగా నీరు కాస్త అధికంగా ఉండడాన్ని గమనించలేదు. ఉన్నట్లుండి మోకాళ్ళ వరకు నీరు రాగానే, కాస్త వెనుకంజ వేసి ఆలోచించారు. తొడలవరకు నీరు రాగానే అదిరిపడ్డారు. ఆపైన ఆలోచించేందుకు అవకాశమే దొరకలేదు. మరుక్షణం ఆయన నీట తలకిందులుగా పడ్డారు. కొళ్ళిడం నది గట్టు తెగి ఆ చోట దక్షిణంగా దూకిన వరద వెల్లువ ఆయనను ఒక దొర్లు దొర్లించి కొట్టుకొని వెళ్ళింది. గట్టుకవతల పల్లంగా ఉండడం వల్ల చాల లోతుగా, పాతాళానికే ఆయనను ఆ వరద వెల్లువ లాక్కొని వెళుతున్నట్లనిపించింది. పడవ బోల్తా పడి వరదలో కొట్టుకొని వెళ్ళినప్పుడు ఆయన ఒకింత సులభంగానే సంభాళించుకొన్నారు. ఇప్పుడది సాధ్యం కాలేదు. దొర్లి, దొర్లి కిందకు వెళ్ళసాగారు. కళ్ళు కనిపించడం లేదు; చెవులు వినిపించడం లేదు; నిలదొక్కుకొని పైకి రావడానికే సాధ్యం కావడం లేదు. ఊపిరాడడం

లేదు. ఎవడో ఒక రాక్షసుడు ఆయనను నీట అదిమి, అదిమి తలకిందులుగా దొర్లించి, దొర్లించి అదే సమయాన పాతాళానికి లాక్కొని వెళ్ళాడు. ఆహా! ఆ రాక్షసుడెవడో కాదు. కొళ్ళిడం నది గట్టు తెంచుకొని, ఆ తెగిన గట్టు గుండా ఉధృతంగా పారుతున్న ఆ వరద రాక్షసుడే! వాడి ఘోరమైన పట్టునుంచి, భయంకరమైన దొర్లింపుల నుంచి తప్పించుకొని బతకడం సాధ్యమా? కాలు నేలకు తగలడం లేదే? చేతికి పట్టు ఏదీ దొరకడం లేదే? ఊపిరాడుతోంది కద! గొంతును నొక్కి తిప్పుతున్నట్లుందే! చెవులు దిబ్బెళ్ళు పడుతున్నాయి...! దుర్గాపరమేశ్వరీ దేవీ! నేనీ విపత్తునుంచి బతికి బయటపడతానా? ఒసే పాపిష్టి నందినీ! నీ వల్ల నాకు కలిగిన గతి చూడు! అయ్యో! పాపం! నిన్నా ధూర్తుల మధ్య వదిలి పెట్టి వచ్చేశాను కద! ఛీఛీ! నీ అందం చూసి మైమరచి, నీ పరిస్థితిని చూసి కనికరించి నిన్ను పెళ్ళి చేసుకొని నేను కన్న సుఖమేమి? నెమ్మది కోల్పోవడం తప్ప ఇంకే ఫలాన్ననుభవించాను? చివరికి ఈ కొళ్ళిడం నది వరదలో చిక్కుకొని సతమతమై చావబోతున్నాను కద! అరవై నాలుగు యుద్ధగాయాలను భరించిన నా శరీరాన్ని పాతి, వీరగల్లు నాటి పళ్ళిప్పడై కట్టబోరు! నా శరీరాన్ని ఎవరూ వెతికి పట్టబోవడం కూడ జరగదు! ఎక్కడైన బురదలో కూరుకొని చావబోతున్నాను! నా గతేమైందని కూడ ఎవరికీ తెలియకుండపోబోతూంది! లేక, ఈ వరద నా శరీరాన్ని ఎక్కడైన ఒడ్డుకు తీసుకొని వెళ్ళి పడేస్తుంది! కుక్కలు, నక్కలు పీక్కు తిని ఆకలి తీర్చుకోబోతాయి...!

కొన్ని క్షణాల వ్యవధిలో ఇలాంటివెన్నో ఆలోచనలు పళువేట్టరయ్యర్ మనసులో తోచి మరుగైనాయి. తర్వాత ఆయన పూర్తిగా స్పృహ కోల్పోయారు.

~

ఢడేల్మని ఏదో తలకు కొట్టుకోగానే ఆయనకు కాస్త తెలివి వచ్చింది. చేతులు దేనినో - నల్లరాతినో, గట్టి నేలనో - పట్టుకొనివున్నాయి. ఏదో ఒక శక్తి ఆయనను పైకి తీసుకొని వెళ్ళి తోసింది. ఆయన కూడ మిగిలివున్న శక్తిని ప్రయోగించి, చేతులూని పైకి లేచి దూకారు. మరుక్షణం ఆయన నల్లరాతి నేలపైనున్నారు. కష్టపడి కళ్ళు తెరవడానికి ప్రయత్నించారు. గట్టిగా అదమబడ్డ కనురెప్పలను కాస్త తెరవగానే, ఎదురుగ ఉన్న జ్యోతి ఆయన కళ్ళను గుచ్చింది. ఆ జ్యోతిలో దుర్గాపరమేశ్వరి దివ్యముఖం దర్శనమిచ్చింది! దేవీ! నీ కరుణే కరుణ! నా ప్రశాంతత కోల్పోయిన భూలోక జీవితాన్ని ముగించేసి ఆకాశలోకంలో నీ సన్నిధానానికే పిలిపించుకొన్నావు కాబోలు...!

లేదు, లేదు! ఇది ఆకాశలోకం కాదు! భూలోకంలో ఉన్న అమ్మవారి గుడి. ఎదురుగా దర్శనమిస్తున్నది అమ్మవారి విగ్రహం. మనం కింద పడివున్నది గర్భగృహానికి ముందున్న అర్ధ మంటపం. అమ్మవారి సమీపాన మిణుకు మిణుకుమని ఒక దీపం వెలుగుతూంది. దాని వెలుతురే కాసేపటి క్రితం మన కళ్లను గుచ్చింది. బయట ఇంకా జోరుగా వాన పడుతూంది. అంతటి సుడిగాలి, వాన కూడ అమ్మవారి గర్భగృహంలోని దీపాన్ని కదిలించలేకపోయాయి! ఇది ఒక మంచి శకునమా? దుర్గాపరమేశ్వరికి తమ

మీదున్న కరుణకు సూచనా? ఎన్ని ఆపదలొచ్చినా మన జీవం ఆరిపోదని ఎత్తి చూపుతున్నట్లుంది కద! జగన్మాత కరుణే కరుణ! మన భక్తి, మనం చేసిన పూజలు - అన్నీ వృధా పోలేదు.

ముసలాయన తడబడుతూ లేచి నిలబడ ప్రయత్నించారు. ఆయన ఒళ్ళు గడ గడ వణికింది. చాలసేపు వరదలో ఉన్నందువల్ల ఒళ్ళు చల్లబడి వణకడం సహజమే కద? అమ్మవారి సన్నిధికి తెరగా వేసేందుకు ఉంచిన బట్టను తీసుకొని ఒంటిని బాగ తుడుచుకొన్నారు. తమ తడి బట్టలను తీసి పారేసి ఆ తెరను నడుము చుట్టూ కట్టుకొన్నారు.

అమ్మవారి సన్నిధిలో కొట్టిన కొబ్బరి చిప్పలు, అరటి పళ్ళు, నైవేద్యానికి ఉంచిన పొంగల్ ప్రసాదాలు - అన్నీ ఉండడాన్ని చూశారు. దేవికి పూజ చేయడానికి వచ్చిన పూజారి, భక్తులు అన్నిటినీ అలాగే పడేసి పారిపోయారు కాబోలు. వారెందుకలా పరుగెత్తి పారిపోయారు? సుడిగాలికి, వానకు భయపడి పరుగెత్తారా? లేక కొళ్ళిడం నది గట్టు తెగడం చూసి పరుగెత్తారా? ఏదేమైనా, మనం చేసిన పుణ్యమే! దుర్గాపరమేశ్వరి అమ్మవారు మనని వరద నుంచి కాపాడడం మాత్రమే కాదు; మన ఆకలి తీరేందుకు ప్రసాదం కూడ ఉంచింది...

ఈ రాత్రి ఈ కోవెలలోనే గడపాల్సిందే. దీనికన్న మంచి చోటు దొరకబోవడం లేదు. వరద ఈ చిన్న గుడిని తాకుతూనే వెళ్ళాలి. దానివల్ల కోవెలకే ఆపద రావచ్చు. కోవెల చుట్టూ వరద సుళ్ళు తిరుగుతూ ఉంటుంది. పునాదులనే కదిలించినా కదిలించవచ్చు. కానీ ఈ రాత్రి లోపల అలా ఏం జరగదు. అలా జరిగినా సరే. ఈ రాత్రి ఈ గుడిని విడిచి వెళ్ళకూడదు. ఒంట్లో శక్తి లేదు; మనసులోను శక్తి లేదు...

భయభక్తులతో పెద్ద పళువేట్టరయ్యర్ దేవి సన్నిధానాన్ని సమీపించారు. అక్కడున్న ప్రసాదాన్ని తీసుకొని కావలసినంత భుజించారు. మిగిలిన ప్రసాదాన్ని భద్రంగా మూసిపెట్టారు.

దేవి ముందు నమస్కారం చేసే భావంతో పడుకొన్నారు. కళ్ళు మూసుకుపోయాయి. కాసేపటికల్లా పళువేట్టరయ్యర్ గాఢనిద్రలో మునిగారు.

~~~
~~~

# అధ్యాయము - 10

## కళ్ళు తెరుచుకొన్నాయి!

**మొదట** నది వరదలోను, తర్వాత గట్టు తెగిన వరదలోను చిక్కుకొని చాల అలిసిపోయినందువల్ల పెద్ద పళువేట్టరయ్యర్ చాలసేపు ఆదమరచి నిద్రపోయారు. చాలినంత నిద్రపోయిన తర్వాత జ్ఞాపకాలు, కలలు తోచాయి. ఒకసారి దుర్గాపరమేశ్వరి గుడి లోపలినుంచి బయలుదేరి నాలుగడుగులు వేసి ఆయన దగ్గరకు వచ్చింది. నిప్పులు కక్కుతున్న కళ్ళతో ఆయనను చూస్తూ ఇలా అంది:-

"ఒరే పళువేట్టరయ్యా! నీవు, నీ కులంవారు తరతరాలుగా నాకు కావలసినవారు. అందుకే నిన్ను హెచ్చరిస్తున్నాను. నీవు నీ అంతఃపురంలో తీసుకొచ్చి పెట్టుకొన్నావు చూడు - ఆ నందిని మనుష్యరూపంగొన్న రాక్షసి. నీ కులాన్ని, చోళ కులాన్ని సమూలంగా నాశనం చేసేందుకు వచ్చింది. అందుకు తగిన సమయం కోసం ఎదురు చూస్తూంది. మొదట దాన్ని నీ అంతఃపురం నుంచి, నీ మనసునుంచి వెళ్ళగొట్టు! లేకపోతే, నీకు, నీ కులానికి ఎప్పటికీ చెరగని/మాయని మచ్చ / అపకీర్తి కలుగుతుంది...!"

~

పళువేట్టరయ్యర్ అదిరిపడి మేల్కొన్నారు. ఆయన ఒళ్ళు గడగడా వణుకుతూంది. తాము చూసింది కలేనని నమ్మడానికి శ్రమపడవలసి వచ్చింది. కానీ అది కలే అయివుండాలని చివరికి తీర్మానించుకొన్నారు.

అప్పటికి బాగా తెల్లవారింది. సుడిగాలి ఉగ్రం తగ్గింది. వాన పూర్తిగా నిలిచిపోయింది. హోరుమన్న శబ్దం మాత్రం వినిపిస్తూంది. కోవెల వెలుపలి మంటపం అంచు దగ్గరకొచ్చి నిలబడి చుట్టు పక్కల పరికించి చూశారు. ఆయన చూసిన దృశ్యం ఆయనకు ఉత్సాహాన్ని కలిగించేటట్లు లేదు.

కొళ్ళిడం గట్టు కోత ఇంత లోపల చాల పెద్దదైంది. నది వరద నీరు చాల వరకు ఆ కోత గుండా పొంగి పొర్లుతున్నట్లు తోచింది. తూర్పు దిశగాను, దక్షిణంగాను విపరీతమైన వరద ప్రవాహమయంగా ఉంది. పశ్చిమాన మాత్రం కోవెల పక్కగా కాస్త దూరం వరకు వరద నీరు సుడులు తిరుగుతూ, తుళ్ళుతూ ప్రవహిస్తూంది. దానికవతల చిన్న చెట్లు, పొదలతో కూడిన అడవి చాల దూరం వరకు విస్తరించివుండడం కానవచ్చింది. అది తిరుప్పురంపయం గ్రామం పక్కనున్న అడవిగా ఉండాలని, ఆ అడవి మధ్యలోనే ఎక్కడో గంగమండలపు రాజు పృథ్వీపతికి వీరగల్లు నాటి పళ్ళిప్పడై (=వీరస్వర్గం పొందిన వీరులకు కట్టించే గుడి) కట్టి ఉండాలని ఊహించారు.

ఆ పళ్ళిప్పడై ఉన్న ప్రదేశంలో నూరేళ్ళకు మునుపు జరిగిన మహాయుద్ధం ఆయనకు గుర్తొచ్చింది. ఆ పోరులో చోళ కుల రాజులకు సహాయంగా తమ పూర్వీకులు చేసిన వీర సాహసకృత్యాలను కూడ జ్ఞాపకం చేసుకొన్నారు. అటువంటి పెద్దకులమైన తమ కులానికి ఈ నందిని వల్ల నిజంగానే అపకీర్తి కలగబోతుందా? దుర్గాపరమేశ్వరి తమ కలలో కనిపించి చెప్పింది నిజమా...?

ఎలావున్నా ఇక సర్వ జాగరూకతతో ఉండాలి. నందిని అంతరంగమేమని కనిపెట్టే తీరాలి. మొదట ఇక్కడినుంచి తప్పించుకొని బయటపడ్డ తర్వాత కద తక్కిన కార్యాలు చేయడం? తిరుప్పురంపయం గ్రామాన్ని చేరుకోగలిగితే అక్కడ ఏమైనా సహాయం పొందవచ్చు. తలకిందులైన పడవనుంచి తమలాగ ఇంకెవరైన తప్పించుకొనివుంటే వారు కూడ అక్కడికి వచ్చివుండవచ్చు. కానీ వరదను దాటి తిరుప్పురంపయం గ్రామాన్ని చేరడం ఎలా?

ఈ గుడి చుట్టూ వరద నీరు సుళ్ళు తిరుగుతూ ప్రవహిస్తూంది కద? దీంట్లో ఒక మదపుటేనుగు దిగినా కొట్టుకుపోతుంది కద? దీన్ని దాటి ఎలా వెళ్ళడం?

వరద గుడి చుట్టూ తిరుగుతూ గుంటలు తవ్వడం ఖాయం. కోవెల ఎప్పుడు పడిపోతుందో తెలియదు! దుర్గాపరమేశ్వరి శక్తి వల్ల పడిపోకుండ ఉంటే ఉన్నట్లు. అయినా కూడ అక్కడినుంచి బయట పడడమెలా? వరద ఇంకిన తర్వాత వెళ్ళడమంటే ఇంకా ఎన్నాళ్ళు పడుతుందో తెలియదు.

అదృష్టవశాత్తు ఇంకొక మార్గముంది. గుడి ముందు బ్రహ్మాండమైన వేపచెట్టు ఒకటుంది. సుడిగాలికి పడిపోక తప్పించుకొంది. కానీ వరద ప్రవాహం ఆ వేప చెట్టు చుట్టూ సుళ్ళు తిరుగుతూ గుంటలు తవ్వుతుంటే, కోవెల పడిపోక మునుపు, ఆ చెట్టు పడిపోవడం ఖాయం. చెట్టు పడితే బహుశ పశ్చిమాన ఉన్న అడవి ప్రదేశానికి ఒక వంతెనలాగ అది పడవచ్చు. లేకపోతే, వరద ఆ చెట్టును కొట్టుకొని తీసుకొని వెళ్ళి ఎక్కడైనా ఒడ్డుకు చేర్చవచ్చు. చెట్టు పడ్డ వెంటనే దానిపైన దూకి పట్టుకొంటే, ఒక వేళ అక్కడినుంచి తప్పించుకొని బతకవచ్చు.

అంతవరకు ఈ కోవలెలోనే ఉండవలసిందే. దేవి కరుణవల్ల ఇంకా ఒక రోజు వరకు ఆకలి తీర్చుకోవడానికి ప్రసాదం మిగిలివుంది. చెట్టు పడేంతవరకు, లేక వరద తగ్గేంతవరకు అక్కడే ఓపిగ్గా వేచివుండవలసిందే. అది తప్ప ఇంకే దారి వుంది?

తొందరపడడంవల్ల ప్రయోజనమేమీ లేదు. తన చేతిమీదుగా ఈ లోకంలో ఇంకా ఏదో పెద్ద కార్యాలు జరగవలసివుండడం వల్లనే కద జగన్మాత తనని వరదలో చనిపోకుండ కాపాడింది. కాబట్టి ఇక ముందు జరగవలసినదానికి కూడ దుర్గాపరమేశ్వరి దారి చూపుతుంది కద?

పగలు గడిచింది. ఇంకా ఒక రాత్రి పగలు గడిచాయి. సుడిగాలి తాను వెళ్ళిన దారి పొడుగునా భీకర దృశ్యాలను సృష్టిస్తూ పశ్చిమంగా వెళ్ళిపోయింది.

వాన కూడ నిలిచిపోయింది. కానీ దుర్గాపరమేశ్వరి గుడిలో చిక్కుకొన్న పళువేట్టరయ్యర్‌కు

మాత్రం విడుదల దొరకలేదు. కొళ్ళిడం నది వరద తగ్గినట్లు కనిపించింది కాని, గట్టు కోత మరింత పెద్దది కాసాగింది. కాబట్టి కోవెల చుట్టూ తిరుగుతూ వెళుతున్న వరద తగ్గలేదు. లోతు కూడ పెరుగుతూండాలి. దాన్ని కొలవడం ఎలా? లేక ఆ గట్టు కోత వరదలో దిగి ఈదుకొంటూ వెళ్ళడం సాధ్యమా?

చివరికి, ఆ రోజు సూర్యుడస్తమించే సమయానికి ఆ కోవెల ముందున్న ఆ పెద్ద వేపచెట్టు పెకలించుకొని పడిపోయింది. పడ్డ చెట్టు అదృష్టవశాత్తు గట్టు కోత వరద పశ్చిమతీరాన్ని తాకుతూంది. దాని మీదుగా అవతలి వైపుకు చేరుకోవడానికి పళువేట్టరయ్యర్ సిద్ధమయ్యారు. రాత్రి బయలుదేరి ఆ అడవిలో దారి తెలుసుకోవడమెలాగ అని కాస్త సందేహించారు. ఆ జంకు కొన్ని క్షణాలకు పైన నిలవలేదు. వెంటనే బయలుదేరవలసిందే అని తీర్మానించుకొని, తమను ఆ మహాప్రమాదం నుంచి కాపాడి కరుణించిన దుర్గాపరమేశ్వరికి కృతజ్ఞత తెలుపుకోవడానికి సన్నిధిని సమీపించారు. సన్నిధిలో సాష్టాంగంగా నమస్కరించారు.

ఆ సమయాన ఆయన ఒళ్ళు జలదరించేటట్లు ఒక గొంతు వినిపించింది. మొదట దుర్గాపరమేశ్వరే మాట్లాడుతున్నట్లనిపించింది. తర్వాత, కాదు; గొంతు గుడికి కాస్త అవతలనుంచి వస్తున్నట్లు గ్రహించారు.

“మాంత్రికా! మాంత్రికా!” అని పిలిచిందా గొంతు.

తర్వాత, “రవిదాసా! రవిదాసా!” అని పిలిచింది. మునుపెన్నడో విన్న గొంతులాగనిపించింది.

పళువేట్టరయ్యర్ లేచి ముందరి మంటపానికొచ్చారు. ఒక స్తంభం వెనుక మరుగ్గా నిలబడి ఆ గొంతు వినిపించిన దిశగా చూశారు. గట్టు కోత వరదకవతల, విరిగిపడ్డ వేపచెట్టు చివర ఒక ఆకారం నిలబడివుండడాన్ని చూశారు. “మాంత్రికా! మాంత్రికా!” అని పిలిచిన గొంతు, ఆయనకు తమ సహోదరుడు మునుపొకసారి చెప్పిన వివరాలను గుర్తుకు తెచ్చాయి. దుర్గాదేవి కరుణవల్ల తామింతవరకు తెలుసుకోలేని రహస్యాలను తెలుసుకోబోతున్నామన్న ఆలోచన ఉదయించింది. కాబట్టి మెదలకుండ నిలబడ్డారు.

అవతలి గట్టున నిలబడ్డ ఆకారం పడివున్న వేపచెట్టు మీదుగా ఇవతలి వైపుకు రావడాన్ని గమనించారు.

తమ జీవితంలో అంతవరకు చేయని ఒక విచిత్రమైన కార్యాన్ని పళువేట్టరయ్యర్ అప్పుడు చేశారు. కోవెల ముందరి మంటపంలో చటుక్కున పడుకొన్నారు. నిద్రపోతున్నట్లు నటించారు.

~

రవిదాసనే ఆ మంత్రవాది / మాంత్రికుడి గురించి తెలుసుకోవాలనే ఆసక్తి ఆయనను అంతగా ఆకట్టుకొంది. వాడు నందినిని చూసేందుకు కొన్నిసార్లు తమ అంతఃపురానికి వచ్చిన మంత్రవాదే అయివుండాలి. వాడికీ, నందినికీ మధ్యవున్న సంబంధం నిజానికి ఎటువంటిది? వాడిని ఇక్కడ ఈ సమయాన వెతుకుతూ తిరుగాడుతున్నదెవరు? ఎందుకని? ఇదంతా తెలుసుకొంటే నందిని నిజంగానే

తమను వంచిస్తూందా అన్న విషయాన్ని తెలుసుకోవచ్చు కద? రవిదాసు గనక ఆయన చేత చిక్కుకొంటే వాడి దగ్గరనుంచి నిజం తెలుసుకోకుండ వదలకూడదు ని దృఢంగా నిశ్చయించుకొన్నారు.

నిద్రపోతున్నట్లు నటిస్తున్న ఆయన దగ్గరకు ఆ మనిషి వచ్చాడు. మళ్ళీ, "రవిదాసా! రవిదాసా!" అని పిలిచాడు.

ఆహా! ఈ గొంతు కడంబూర్ మాళిగలో మునుపొకసారి వేళన్ ఆట ఆడి గురి/సోది చెప్పాడే, ఆ దేవరాళన్ గొంతులాగ కద ఉంది? వీడి గొంతు పిసికి నిజం కక్కిద్దామా? వద్దు! ఇంకాసేపు ఓపిక పడదాం. వీడి ద్వారా మంత్రవాదిని పట్టుకోవడం కద ముఖ్యమైన పని?

"మంత్రవాదీ! సూర్యుడస్తమించేలోపే నిద్రపోయావా? లేక చచ్చి తొలగిపోయావా?" అని అంటూనే ఆగంతకుడు పళువేట్టరయ్యర్ని తాకి చూసి ఆయన ముఖం కనిపించేలాగ ఇటువైపు దొర్లించాడు. అలా దొర్లించినా కూడ పళువేట్టరయ్యర్ కదలకుండ ఉన్నారు.

సాయంత్రం, రాత్రి కలిసే ఆ సంధ్యాసమయాన మసక వెలుతురులో, దేవరాళన్ (అవును, దేవరాళనే!) పళువేట్టరయ్యర్ ముఖాన్ని చూశాడు. తన కళ్ళను బాగా నులుముకొని మళ్ళీ గుచ్చి చూశాడు. భీతి, భయం, ఆశ్చర్యం, అపనమ్మకమూ కలిసి ధ్వనించిన హీనస్వరంతో "ఊ ఊ!", "ఓ! ఓ!", "ఆ! ఆ!" అని ఈలవేసినట్లు అరుస్తూ అక్కడినుంచి పరుగెత్తనారంభించాడు.

~

పళువేట్టరయ్యర్ కళ్ళు తెరిచి లేచి కూర్చొని చూసేలోపు వాడు కోవెల ముందున్న బలిపీఠాన్ని రెండంగల్లో దాటి వెళ్ళి, వేపచెట్టు కాండం మీద వేగంగా నడవనారంభించాడు.

తిరిగి చూసేందుకు ఒక్క క్షణం కూడ నిలబడకుండ ఆ చెట్టుపైన ఒక్క పరుగుతో దాటి అవతలి గట్టుకు చేరుకొన్నాడు. మరుక్షణం పొదలు, చెట్లతో నిండిన ఆ అడవిలో దూరి మాయమైనాడు.

పళువేట్టరయ్యర్ వాడు భయంతో దూకి పరుగెత్తడాన్ని కళ్ళార్పకుండ ఆశ్చర్యంతో చూస్తూండిపోయారు. వాడు అడవిలో మరుగవ్వగానే, అవకాశం దొరికినప్పుడు వాడిని పట్టుకోక పొరబాటు చేశాం కద అన్న సందేహం ఆయనను పీడించింది. వెంటనే ఆయన కూడ ముందుకు దూకి పరుగెత్తనారంభించారు. దేవరాళన్ లాగ అంత వేగంగా ఆయన ఆ చెట్టు కాండం మీదుగా పరుగెత్తలేకపోయారు. తడబడుతూ, మెల్లమెల్లగా అక్కడక్కడా కొమ్మల ఆసరా తీసుకొని దాటవలసి వచ్చింది.

అవతలి తీరం చేరగానే అడవిలో (ఒంటి) కాలిబాట ఒకటి కనిపించింది. దాన్ని పరికించి చూశారు. బురదలో తాజా అడుగు జాడలు కనిపించాయి. ఆ దారినే దేవరాళన్ వెళ్ళివుండాలని తీర్మానించుకొని వడివడిగా ఆ దారినే ముందుకు వెళ్ళారు.

అది రాత్రి తొలిజామే అయినా ఆకాశాన ఇంకా మేఘాలు కమ్ముకొన్నందువల్ల బాగా చీకటిగానే

ఉంది. అడవి ప్రదేశంలో ఏవేవో శబ్దాలు వినిపించాయి. సుడిగాలిలోను, వానలోను దెబ్బ తిని, కష్టాలకు గురైన అడవి ప్రాణులు వాన నిలవగానే సంతోషంగా అటూ ఇటూ తిరుగుతూ అలా శబ్దం చేయసాగాయి.

~

కాలిబాట కాస్త దూరం వెళ్ళి ఆగిపోయింది. కానీ పళువేట్టరయ్యర్ అంతటితో ఆగిపోదలచలేదు. ఆ రాత్రంతా అడవిలో తిరుగాడవలసివచ్చినా కూడ ఆ దేవరాళన్ని, వాడు వెతుకుతున్న మంత్రవాది రవిదాసును పట్టుకొనే తీరాలని తీర్మానించుకొని అడవి పొదల మధ్య దారి చేసుకొని వెళ్ళారు.

ఒక జాము వేళ అడవిలో అలా తిరుగాడిన తర్వాత కాస్త దూరాన వెలుతురు కనిపించింది. అది ఉన్నచోట ఉండకుండ వెళుతూండడం వల్ల అది దారి వెతికేందుకు ఎవరో చేత పట్టుకొని వెళుతున్న దివిటీ వెలుతురని భావించారు.

ఆ వెలుతురును గురిగా పెట్టుకొని అతివేగంగా నడిచారు. వెలుతురును సమీపించసాగారు.

చివరికి, ఆ దివిటీ వెలుతురు అడవి మధ్య ఒక పాడుబడ్డ మంటపాన్ని వెలుతురులో చూపించేటట్లు చూపించి వెంటనే మరుగైంది. ఆ మంటపం తిరుప్పురంపయంలో ఉన్న పృథ్వీపతి పళ్ళిప్పడై గుడి అని వెంటనే గ్రహించారు. పళువేట్టరయ్యర్ పళ్ళిప్పడై దగ్గరగా వెళ్ళి ఒక గోడ వారగా నిలబడి చెవులు రిక్కించి వినసాగారు.

అవును; ఆయన ఎదురుచూసింది వృథా పోలేదు. ఇద్దరు మనుషులు మాట్లాడుకోవడం వినిపించింది. పెద్దగా మాట్లాడుతుండడం వల్ల స్పష్టంగా వినిపించింది.

"మంత్రవాదీ! నిన్ను ఎంతసేపటినుంచి వెతుకుతున్నానో తెలుసా? నీవు ఒకవేళ రాలేకపోయావేమో, లేక నిన్ను కూడ యముడు తీసుకెళ్ళి పోయాడేమో అని భయపడిపోయాను!" అన్నాడు దేవరాళన్.

మంత్రవాది రవిదాసు వికటాట్టహాసం చేశాడు.

"యముడు నా దగ్గరకెందుకు వస్తాడు? సుందర చోళుడు, వాడి ఇద్దరు కొడుకులనే సమీపిస్తున్నాడు. రేపు వారి జీవితకాలం ముగిసిపోతుంది!" అన్నాడు మంత్రవాది.

ఆ సమయాన ఆకాశాన్ని, భూమిని జ్యోతిర్మయం చేస్తూ ఒక మెరుపు మెరిసింది.

~~~
~~~

# అధ్యాయము - 11

## మంటపం విరిగిపడింది!

**మెరుపు** వెలుతురులో అక్కడ నిలబడ్డ ఇద్దరి రూపాలను పళువేట్టరయ్యర్ ఒక్కక్షణం చూసి తెలుసుకొన్నారు. వారిలో ఒకడైన రవిదాసును ఒకట్రెండు సార్లు తమ అంతఃపురంలోనే చూసివున్నారు. వాడు మంత్ర విద్యల్లో ఆరితేరినవాడని నందిని చెప్పింది. తమ సహోదరుడు ఈ మంత్రవాది గురించే సందేహపడి తమని హెచ్చరించాడు. ఇంకొకడు కడంబూర్ మాళిగలో వేలాట ఆడిన దేవరాళన్. వాడిని మనం చూసింది అదేనా మొదటి సారి? లేక, చాలకాలం మునుపు రాజ్యాంగ ఉద్యోగం నుంచి ఆయన చేత తీసివేయబడ్డ పరమేశ్వరనా వాడు...?

ఉండనీ; వీరింకా ఏం మాట్లాడుకొంటారో విందాం.

"రవిదాసా! నీవిలాగే చాలకాలంగా చెప్పుకొస్తున్నావు. 'రోజులు దగ్గర పడిపోయాయి', 'యముడు దగ్గరకొచ్చేశాడు' అని ప్రేలాపిస్తున్నావు! యముడు వచ్చి ఎవరెవరినో తీసుకుపోతున్నాడు! కానీ మూడేళ్ళుగా మంచం పట్టిన ఆ సుందర చోళునేమో తీసుకుపోవడం లేదు. వాడి కొడుకులనేమో యముడు సమీపించేందుకే జంకుతున్నాడు. లంకలో మనమిద్దరం ఎంతగానో ప్రయత్నించాం కద...?"

"అందువల్ల తప్పేమీ లేదు, మిత్రమా! యమధర్మరాజు నీకన్న, నాకన్న కూడ తెలివైనవాడు! ముగ్గురినీ ఒకేరోజు తీసుకొని వెళ్ళడానికే ఇంతకాలంగా వేచివున్నాడు. ఆరోజు రేపు రాబోతోంది. మంచి వేళగా నీవుకూడ ఇక్కడికే వచ్చి చేరావు. సరైన యమదూతవు నీవు! ఎందుకిలా వణుకుతున్నావు? కొళ్ళిడం వరదలో చిక్కుకొన్నావా? పడవ తీసుకొని వచ్చావు కద?"

"తీసుకొచ్చి ఉంచాను. కానీ పడవను సుడిగాలి, వరద కొట్టుకొనిపోకుండ భద్రపరచడం చాల కష్టమైపోయింది! నిన్ను ఎంతసేపు, ఎక్కడెక్కడని వెతకడం...? రవిదాసా! నా ఒళ్ళెందుకిలా వణుకుతూందని అడిగావు కద? కాసేపటి క్రితం యమధర్మరాజును నేను ప్రత్యక్షంగా చూశాను! కాదు, కాదు! యముడి అన్నను చూశాను. అందువల్ల నిజంగానే కాస్త భయపడిపోయాను..."

"పరమేశ్వరా! ఏం పేలుతున్నావు? యముడేమిటి? వాడి అన్నేమిటి? వారిని చూసి నీకెందుకు భయం? వారు కద నిన్ను చూసి భయపడాలి?"

~

రవిదాసు ఆ రెండోవాడిని 'పరమేశ్వరా' అని సంబోధించగానే పళువేట్టరయ్యర్ ఉలిక్కిపడ్డారు! తాను సందేహించింది నిజమే! యమధర్మరాజు అన్న అని సూచించింది కూడ తమనే అని గ్రహించారు. వాడిని వెంటనే గొంతు పిసికి చంపేయాలని ఆయన మనసు, చేతులు తహతహలాడాయి. వారింకా ఏం

మాట్లాడుకొంటారో వినాలన్న ఆసక్తి వల్ల ఓపికగా ఊరుకొన్నారు. నందిని గురించి వారింకా మాట్లాడనారంభించలేదు. సుందర చోళ చక్రవర్తి కుటుంబానికే రేపు యముడు రాబోతున్నాడని మంత్రవాది చెప్పిన మాటకు అర్థమేమి? నిజంగానే జోస్యం చూసి చెబుతున్నాడా? వీడి మంత్రశక్తి గురించి నందిని చెప్పిందంతా నిజమేనా? ఒకవేళ వీడు చెప్పినట్లు దైవాధీనంగా జరిగిపోతే...? తమ ఉద్దేశం నెరవేరడం సులభమైపోతుంది! చోళ సామ్రాజ్యాన్ని భాగాలు చేసి పంచవలసిన అవసరం రాదు! కానీ ఈ పరమేశ్వరన్...? వీడెందుకు ఈ విషయంలో తలదూర్చాడు? ఇరవైయేళ్ళ క్రితం 'చోళవంశాన్నే తుడిచి పెట్టేస్తాను' అని శపథం చేసి వెళ్ళినవాడు కద వీడు...? ఆఁ! తమ గురించే వాడు ఏదో చెబుతున్నాడు! ఏం చెబుతున్నాడో విందాం!

"నీవు నాకు చెప్పినట్లు నేను ఇవాళ ఉదయమే ఇక్కడికి వచ్చాను. కానీ నీవు కనబడలేదు. గాలిలోను, వానలోను చిక్కుకొని ఎక్కడైనా తలదాచుకొన్నావేమోనని చుట్టుపక్కలంతా గాలించి చూశాను. కొళ్ళిడం గట్టు తెగిన చోట ఒక చిన్న కోవెల ఉంది. దాంట్లో ఎవరో పడుకొనివున్నట్లు కనిపించింది. బహుశ నీవే అలా ఆదమరచి నిద్రపోతున్నావేమోనని దగ్గరకు వెళ్ళి చూశాను. ఎవరిని చూశాననుకొంటున్నావు? సాక్షాత్తు పెద్ద పళువేట్టరయ్యర్...!"

~

మంత్రవాది హహ్హహ్హా అని పెద్దగా నవ్వాడు. అది విన్న అడవి పక్షులు 'క్రీచ్'మని కూశాయి. మూగ గుడ్లగూబలు ఉరిమాయి.

"పళువేట్టరయ్యర్ని చూశావా? లేక వాడి పిశాచిని చూశావా?" అని అడిగాడు రవిదాసు.

"లేదు; పిశాచి కాదు. బోర్లా పడుకొన్నవాడిని పట్టి ఇటువైపు దొర్లించి ముఖాన్ని బాగా పరికించి చూశాను. రవిదాసా! యముడికి ఇద్దరన్నలు ఉండ సాధ్యమా? పళువేట్టరయ్యర్‌లాగే, అదే ముఖం, అదే మీసం, అదే గాయపు మచ్చలు - వీటితో ఇంకో మనిషి ఉండ సాధ్యమా?"

"నీవు చూసినవాడు పళువేట్టరయ్యరే! సందేహం లేదు. నిన్న సాయంత్రం పళువేట్టరయ్యర్ పడవెక్కి కొళ్ళిడం నదిని దాటుతున్నాడు. పడవ సుడిగాలి వల్ల తలకిందులైంది. వాడి పరివారజనాల్లో తప్పించుకొని బతికి బయటపడ్డవారు ఇప్పుడు కూడ కొళ్ళిడం నది వెంబడి వాడి కోసం గాలిస్తున్నారు. వాడు కొళ్ళిడం నది వరదలో మునిగి చనిపోయివుండవచ్చని సందేహిస్తున్నారు. తెగిన గట్టు వరకు వారు వెళ్ళి చూసేసి తిరిగి వస్తున్నప్పుడు వారి మాటలను నేను విన్నాను. కాబట్టి నీవు చూసినవాడు పళువేట్టరయ్యరే అయివుండాలి. ఒకవేళ వాడి ప్రేతాన్ని చూశావేమో?"

"లేదు, లేదు. ప్రేతమైతే కనుగుడ్లెలా కనిపిస్తాయి? నేను దొర్లించి చూసినవాడి కళ్ళు బాగా మూసుకొనివున్నాయి. అలిసిపోయి నిద్రపోతున్నాడు కాబోలు..."

"మూర్ఖుడా! నీవు చేసిన పనేమి? వాడిని ఊరకే వదిలిపెట్ట్ వచ్చేశావా? తలమీద ఒక రాయి

తీసి పడేసి వచ్చివుండకూడదా...?"

"పళువేట్టరయ్యర్ తల గురించి నీకు తెలియదు. వాడి తలమీద రాయి వేస్తే, రాయే విరిగి ముక్కలవుతుంది!"

"అలాగైతే కొళ్ళిడం వరదలోకి వాడిని ఈడ్చి పడేసి ఉండవచ్చు కద?"

"నేను చెప్పాను కద? వాడిని చూసిన వెంటనే యముడి అన్నను చూసినట్లు అదిరిపడ్డాను. కడంబూరులో వాడి ముందు వేలాట ఆడినప్పుడు కూడ నా గుండె దడదడ కొట్టుకొంది. వాడు నన్ను చూసి గుర్తు పడితే..."

"అది తలుచుకొని ఇప్పుడెందుకు వణుకుతున్నావు?"

"వాడు ప్రాణాలతో ఉన్నంతవరకు నాకు దిగులుగానే ఉంటుంది. నీవు చెప్పినట్లు చేయకుండ వచ్చేశాను కద – వరదలో తోసేయకుండ వచ్చేశాను కద అని విచారంగా ఉంది..."

"ఏ దిగులూ వద్దు. ఒక విధంగా చూస్తే పెద్ద పళువేట్టరయ్యన్ ప్రాణాలతో ఉండడమే మంచిది. అప్పుడే సుందర చోళుడు, వాడి కొడుకులు చచ్చిన తర్వాత చిన్న రాజులందరూ రెండు పక్షాలుగా విడిపోయి యుద్ధానికి దిగుతారు. పళువేట్టరయ్యర్లు, శంబువరయ్యర్లు ఒకవైపు, కొడుంబాళూర్ వేళార్, తిరుక్కోవలూర్ మలైయమాన్ ఇంకొకవైపు నిలబడి పోట్లాడుకొంటారు. అది మన ఉద్దేశానికి చాల అనుకూలంగా ఉంటుంది. వాళ్ళు తమలో తాము కొట్లాడుకొంటున్నపుడు మనం రహస్యంగా పాండ్యనాడులో సైన్యం సమకూర్చుకోవచ్చు..."

"రవిదాసా! 'ఆలు లేదు, చూలు లేదు, కొడుకు పేరు సోమలింగం' అన్నట్లు మాట్లాడుతున్నావు! సుందరచోళునికి, వాడి ఇద్దరు కొడుకులకు రేపు ముగింపైతేనే కద నీవు చెబుతున్నట్లు చోళదేశపు నాయకులు పోరాటానికి దిగుతారు? ముగ్గురి కథ రేపే ముగుస్తుందని ఏం నిశ్చయం? నీకొక విషయం తెలుసా...?"

"దేన్ని గురించి చెబుతున్నావు?"

"నాగపట్టణంలో అరుళ్మొళి వర్మ ప్రాణాలతో ఉన్నాడట! ప్రజలు వాడి చుట్టూ చేరి వాడే చోళదేశపు చక్రవర్తి కావాలని ఆర్భాటం చేస్తున్నారట! నీవది విన్నావా?"

~

రవిదాసు మళ్ళీ నవ్వేసి, "నేను వినలేదు. నాకే అది తెలుసు. అరుళ్మొళి వర్మను బుద్ధ విహారం నుంచి బహిరంగపరిచిందెవరనుకొన్నావు? మన రేవసాసి క్రమవిత్తుని కూతురు రాక్కమ్మాళే! ఆమే పడవ నడిపే మురుగయ్యన్ భార్య!" అన్నాడు.

"దానివల్లనేమి? అరుళ్మొళి వర్మ బయటపడ్డందువల్ల మనకేమి లాభం? ఇక వాడి చుట్టూ లక్షలకొద్ది ప్రజలుంటారు కద? లంకాదేశంలో వాడు ఇద్దరు ముగ్గురితో ఉన్నప్పుడే మన ప్రయత్నాలు

ఫలించలేదు కద?" అన్నాడు దేవరాళన్.

"అది కూడ మంచిదే అని చెబుతున్నాను కద? ముగ్గురికీ యమలోకయాత్ర ఒకేరోజు మూడుతున్నప్పుడు..."

"రవిదాసా! లక్షమంది మధ్యనున్న యువరాజును యముడెలా సమీపించగలడు? దాన్ని నీవు వివరించలేదు కద?"

"సమీపిస్తాడు, మిత్రమా! సమీపిస్తాడు! ఏనుగు మావటి అంకుశం కొనమీద యముడు కూర్చొనివుంటాడు! తగిన సమయంలో యువరాజు ప్రాణాలు తీస్తాడు! పరమేశ్వరా! చోళనాడు ప్రజలు యువరాజును ఏనుగుపైకెక్కించి ఊరేగిస్తూ తంజావూరుకు పిలుచుకొని వస్తారు. ఆ ఏనుగును నడిపే మావటికి దారిలో ఏదైన ప్రమాదం కలుగుతుంది. వాడి స్థానంలో మన రేవదాస క్రమవిత్తుడు మావటిగా చేరుతాడు! తర్వాత ఏం జరుగుతుందని నీవే ఊహించుకోవచ్చు!"

"రవిదాసా! నీ కుశాగ్రబుద్ధికి సాటిలేదని ఒప్పుకొంటాను. క్రమవిత్తుడు చేపట్టిన కార్యాన్ని నెరవేరుస్తాడని మనం నమ్మవచ్చు. సుందర చోళుని సంగతి? వాడికేం ఏర్పాట్లు చేశావు?" అన్నాడు దేవరాళన్.

"పళువేట్టరయ్యర్ నేలమాళిగలో సోమన్ శాంభవన్ని విడిచిపెట్టి వచ్చాను - చేత వేలాయుధంతో. అక్కడినుంచి సుందరచోళుని అంతఃపురానికి సొరంగమార్గముంది. సుందర చోళుడు పడుకొనే చోటునే సోమన్ శాంభవన్‌కి స్పష్టంగా చూపించాను. రెండు కళ్ళు కనిపించని గుడ్డివాడు కూడ నేను సూచించిన చోట నిలబడి శూలాన్ని విసిరి సుందర చోళుని ముగించేయవచ్చు. సోమన్ శాంభవన్ని 'తొందర పడకు! రేపటివరకు ఓపిక పట్టు' అని హెచ్చరించి వచ్చాను..."

"అదెందుకని? సమయం కూడివచ్చినప్పుడు కార్యాన్ని ముగించడం మంచిది కద?"

"మూర్ఖుడా! సుందర చోళుడు ముందుగానే చంపబడితే వాడి కొడుకులు ముందు జాగ్రత్తలు తీసుకోరా? ఆ ముసలి చచ్చి ఏం ప్రయోజనం? అదలా ఉండనీ! నీవేం వార్త తీసుకొని వచ్చావు? కడంబూర్ మాళిగలో అందరూ ఎలా ఉన్నారు? రేపు రాత్రి అక్కడ జరగబోతున్న కార్యం కద అన్నిటికన్న ముఖ్యమైనది?"

"కడంబూర్లో అంతా కోలాహలంగానే ఉంది. పెళ్ళి మాటలు, ప్రేమ కలాపాలు జరుగుతున్నాయి. నీవేమో ఆ పళువూర్ రాణిని నమ్మడం నాకేం నచ్చలేదు..."

"పళువూర్ రాణా ఆమె? వీరపాండ్యుని మహాదేవి అని చెప్పు! వీరపాండ్యులు మరణించడానికి రెండు రోజుల క్రితం ఆమెను తమ పట్టమహిషిగా స్వీకరించిన విషయం మరిచిపోయావా? వీరపాండ్యుని మరణానికి పగ తీర్చుకొంటానని ఆమె చేసిన శపథం మరచావా? ఒక వారం రోజుల క్రితం ఇదే చోట ఆమె వీరపాండ్యుల కుమారుని చేతినుంచి వీర ఖడ్గాన్ని స్వీకరించలేదా...?"

"అవునవును! కానీ నిన్న సాయంకాలం వీరపాండ్యమహాదేవి వీరనారాయణపురం చెరువులో ఉల్లాస యాత్ర చేసి తిరిగివచ్చిన వైనం నీవు చూసివుండాల్సింది...."

"ఉల్లాసంగా ఉండక మరింకెలా ఉండాలంటావు? మనసులో ఉన్నది దాచిపెట్టుకొనే విద్యలో నందినికి ఇంకెవరూ సాటిరారు. లేకపోతే పళువేట్టరయ్యర్ అంతఃపురంలో మూడేళ్ళపాటు కాలం వెళ్ళబుచ్చగలిగేదేనా? అక్కడవుండి మన కార్యాలకు ఇంతగా సహాయం చేయగలిగేదా? అవునూ, పళువేట్టరయ్యర్ని కాసేపటి క్రితం దుర్గాంబ గుడిలో చూశానన్నావు కద? వాడు ఎక్కి వచ్చిన పడవ తలకిందులైన విషయం కూడ విన్నాను. వాడు కడంబూర్ నుంచి ఎప్పుడు బయలుదేరాడు? ఎందుకు..."

"ఎందుకని నాకు ఖచ్చితంగా తెలియదు. మధురాంతకుని కడంబూరుకు పిలుచుకొని రావడానికి బయల్దేరాడని విన్నాను. నిన్న పొద్దున బయల్దేరి వెళ్ళాడు. వాడు వెళ్ళిన తర్వాత యువరాజులు వేటకు వెళ్ళారు. రాకుమార్తెలు వీరనారాయణపురం చెరువులో జలక్రీడలకు బయలుదేరి వెళ్ళారు. యువరాజులు, రాకుమార్తెలు కుతూహలంతో తిరిగి వచ్చిన దృశ్యాన్ని నీవు చూసివుంటే నీవింత ఆత్మవిశ్వాసంతో మాట్లాడవు...!"

"అందుగురించి నీవేమాత్రం దిగులు పడవద్దు. పళువేట్టరయ్యర్ని తంజావూరుకు పంపించేసినందునుంచే పాండ్యమహాదేవి మనసులో ఏముందో అర్థం చేసుకోవచ్చు కద?"

"స్త్రీల మనసును ఎవరర్థం చేసుకోగలరు? ఆ ముసలాడిని ఊరికి పంపించింది పగ తీర్చుకోవడానికైనా కావచ్చు. లేక ప్రేమ నాటకం నడిపేందుకైన కావచ్చు..."

"ఏం ప్రేలాపిస్తున్నావు పరమేశ్వరా? నందిని ఆ పాత కథను పూర్తిగా మరిచిపోయింది. కరికాలన్ని ఆమె ఇప్పుడు విషంలాగ ద్వేషిస్తూంది!"

"నేను కరికాలన్ గురించి చెప్పడం లేదు. వాడి దూత వంతిదేవుని గురించి చెబుతున్నాను. రెండు మూడు సార్లు వాడు దొరికినా ఆమె విడిచిపెట్టిన విషయం నీవు మరిచావా?"

~

మంత్రవాది గలగలా నవ్వేసి, "అవును! వంతిదేవుడింకా ఎందుకు బతికున్నాడో త్వరలోనే తెలుస్తుంది. అది తెలిసినప్పుడు నీవు మాత్రం కాదు, ఇంకా చాల మంది ఆశ్చర్యపోతారు! ముఖ్యంగా, సుందర చోళుని ముద్దుల కుమార్తె కుందవై ఆశ్చర్యపోతుంది. ఆమె ఏ సుకుమార యువకునికి తన మనసిచ్చిందో వాడే ఆమె అన్న కరికాలన్ని చంపాడని తెలిస్తే ఆశ్చర్యపడదా?"

"ఏమంటున్నావు రవిదాసా? నిజంగానే వంతిదేవుడా కరికాలన్ని చంపబోతున్నాడు? వాడు మన పక్షం చేరిపోయాడా, ఏమి?"

"అదంతా ఇప్పుడు అడక్కు! కరికాలన్ని చంపే చేయి ఎవరిదైతేనేం? పాండ్య కులానికి చెందిన మీన చిహ్నం పొదిగిన వీరఖడ్గం వాడిని చంపబోతుంది. వాడిని చంపిన నింద వంతిదేవుని తలమీద

పడబోతుంది! మన రాణి సామర్థ్యం గురించి ఇప్పుడేమంటావు?"

"నీవు చెప్పినట్లు అంతా జరగనీ. తర్వాత అడుగు. చెబుతాను."

"ఇంకేదీ జరిగినా, జరగకపోయినా, కరికాలన్ ప్రాణం వాడి శరీరాన్ని రేపు రాత్రి లోపల విడవడం ఖాయం. నందిని తాను తీసుకొన్న బాధ్యతను నెరవేర్చబోతుంది. మన బాధ్యతను మనం నెరవేర్చాలి..."

"మన బాధ్యత ఏమి?"

"రేపు రాత్రి కడంబూర్ మాళిగ నుంచి బయటపడే సొరంగమార్గంలో సిద్ధంగా ఉండాలి. కార్యం ముగియగానే నందిని ఆ మార్గం గుండా వస్తుంది. ఆమెను తీసుకొని రాత్రికి రాత్రే కొల్లిమలై (మలై = కొండ) చేరుకోవాలి. అక్కడ ఉండి, చోళ సామ్రాజ్యంలో జరిగే అల్లకల్లోలాన్ని చూస్తూంటాం. ఒకవేళ వీలైతే..."

"వీలైతే, ఏం?"

"పళువేట్టరయ్యర్ నేలమాళిగలో కూడబెట్టిన ధనాన్నంతా తీసుకొని వెళ్ళి చేరవేయాలి. చోళనాడు బొక్కసం నుంచి దోచి తీసుకొని వెళ్ళిన ధనంతోనే చోళనాడు పైన దండెత్తేందుకు సైన్యం కూడదేయడం ఎంత సమంజసంగా ఉంటుంది?"

ఇలా చెప్పేసి రవిదాసు మళ్ళీ నవ్వాడు.

~

దేవరాళన్‌గా నటించిన పరమేశ్వరన్, "సరే, సరే! గాలిమేడల్ని చాల పెద్దవిగా కట్టేయకు! మొదట కొళ్ళిడాన్ని దాటి కడంబూర్ చేరదాం. కడంబూర్లో నీవు చెప్పినట్లే అన్నీ జరగనీ! తర్వాత, పళువేట్టరయ్యర్ బొక్కసాన్ని కొల్లగొట్టడం గురించి ఆలోచిద్దాం. ఏమంటావు? ఇప్పుడే బయల్దేరదామా? రాత్రే కొళ్ళిడాన్ని దాటేద్దామా?" అన్నాడు.

"వద్దు, వద్దు! పొద్దు పొడవగానే పడవెక్కితే చాలు. అంత లోపల గాలివాన కూడ తగ్గిపోతుంది. నదిలో వరద కూడ కాస్త తగ్గుతుంది..."

"అలాగైతే, ఈ రాత్రి ఈ పళ్ళిప్పడైలోనే పడుకొందామా?"

రవిదాసు కాసేపాలోచించాడు. అప్పుడు కాస్త దూరాన నక్కలు ఈలవేసే శబ్దం వినిపించింది. రవిదాసు ఒళ్ళు వణికింది.

"రవిదాసా! కేవలం నక్కల ఈల విని ఎందుకిలా వణుకుతున్నావు?" అన్నాడు దేవరాళన్.

"మిత్రమా! కోడిక్కరై ఊబి బురదలో నీవు గొంతుదాక కూరుకుపోయి, చుట్టూ వంద నక్కలు నిలబడి నిన్ను తినేందుకు కాచుకొని ఉన్న భయంకరాన్ని నీవనుభవించివుంటే ఇలా మాట్లాడవు! సింహ గర్జనను, మదపుటేనుగు ఘీంకారాన్ని విని నాకు భయం కలగలేదు. నక్కల ఈల వినిపిస్తే ఒళ్ళు వణుకుతూంది. రా! రా! ఈ వల్లకాడులో ఉండడం వద్దు. ఎక్కడైనా ఒక గ్రామం పక్కనున్న ఒక కోవెలలో గాని, సత్రంలోగాని ఈ రాత్రి తలదాచుకొందాం. లేకపోతే కొళ్ళిడం తీరానున్న దుర్గాదేవి గుడి గురించి

చెప్పావు కద? అక్కడికి వెళదాం. ఆ ముసలాడింకా అక్కడే పడుకొనివుంటే వరదలోకి లాగి పడేద్దాం. అదే వాడికి మనం చేసే పెద్ద సహాయమవుతుంది. ఎల్లుండి వరకు వాడు ప్రాణాలతో ఉంటే, వాడు చాల మనోవేదనకు లోను కావలసి వస్తుంది!"

~

పైన వివరించిన సంభాషణంతా పెద్ద పళువేట్టరయ్యర్ ఒక్క మాట తప్పకుండ వింటూ వచ్చారు. వారు మాట్లాడుకొన్న ప్రతి మాట ఆయన చెవిలో సీసాన్ని కరిగించి పోసినట్లనిపించింది. ఆయన హృదయం ఒక పెద్ద అగిపర్వతపు గర్భంలాగ కుతకుతలాడసాగింది. తాము ప్రేమించి పెళ్ళాడిన అమ్మాయి వీరపాండ్యుని మరణానికి పగ తీర్చుకోవడానికే వచ్చిందన్న విషయం, మూడేళ్ళుగా ఆమె తమను మోసపుచ్చుతూందన్న విషయం ఆయనకు చెప్పలేనంత ఆవేదనను, అవమానాన్ని కలిగించాయి.

ఆరు తరాలుగా చోళవంశానికి, పళువూర్ వంశానికి మధ్య నెలకొని, పెరుగుతూ వస్తున్న సంబంధాన్ని ఆయన అప్పుడు గుర్తు చేసుకొన్నారు. చూడబోతే, సుందర చోళుడు, వాడి పిల్లలు ఎవరు? సుందర చోళుని బామ్మ పళువూర్ వంశానికి చెందినది కద? సుందర చోళుని పిల్లలపైన తమకు కలిగిన కోపమంతా ఇటీవలిదే కద? ఆదిత్య కరికాలన్ ఏదో చిన్న పిల్లాడిలాగ నడుచుకొన్నాడని, మలైయమాన్ తమకు నచ్చలేదన్న కారణంగా ఎంత భయంకరమైన కుట్ర జరిగేందుకు తావిచ్చేశాం? చోళకులానికి తరతరాలుగా శత్రువులైన పాండ్యవంశపు కుట్రదారులు తమ అంతఃపురంలోనే ఉండి, తమ బొక్కసం నుంచి దోచుకొని వెళ్ళిన ధనంతో చోళకులానికి విరుద్ధంగా కుట్రకార్యాలు జరిపేందుకు కద తాము తావిచ్చేశాం? ఆహా! ఈ ఛండాలురు చెప్పినట్లు రేపు రాత్రి లోపల మూడు చోట్ల మూడు భయంకరమైన హత్యలు జరగబోతున్నాయా? మన ఒంట్లో ఊపిరున్నంతవరకు దాన్ని అడ్డగించే తీరాలి. ఇంకా అరవై ఘడియల సమయముంది. అంతలోపల ఎన్నో కార్యాలు చేయవచ్చు. రాత్రికి రాత్రే కుడంద్దైకి వెళ్ళి తంజావూరుకు కడంబూరుకు సందేశాలు పంపించాలి. పంపించేసి, కడంబూరుకు బయల్దేరాలి. ఈ పాతకులు అక్కడికి చేరేలోపు మనమక్కడికి చేరుకోవాలి.

వీళ్ళను కడంబూరుకు రానివ్వడమా? లేక, ఇక్కడే వీరిని చంపేసి వెళ్ళిపోవడం మంచిది కద? మన చేత ఆయుధమేమీ లేదు. లేకపోతేనేమి? వజ్రాయుధానికి సాటైన మన చేతులున్నప్పుడు ఇంకే ఆయుధాలు కావాలి? కానీ వీరు చురకత్తులను బొడ్లో దాచుకొని ఉండవచ్చు. వాటిని బయటకు తీసేందుకే అవకాశమివ్వక ఇద్దరినీ గొంతు పిసికి చంపేయాలి...

కానీ వీరితో ఇక్కడ ద్వంద్వ యుద్ధానికి దిగడం ఉచితమా?

వీరి నుంచి తెలుసుకోవలసిన విషయాలన్నీ తెలుసుకోవడమైంది. మన కులదైవమైన దుర్గాపరమేశ్వరే తమ పడవను తలకిందులయ్యేటట్లు చేసి మనని ఆమె దివ్యాలయంలో పడుకొనేటట్లు చేసి, ఈ భయంకర రహస్యాలను తెలుసుకొనేటట్లు చేసింది. చక్రవర్తికి, ఆయన కుమారులకు ఏ ఆపద

కలగకుండ కాపాడడం కద మన ముఖ్య కర్తవ్యం? అందులోను, కరికాలన్‌కి కడంబూర్లో ఏ విపత్తు జరగకుండ చూడడం చాల చాల ముఖ్యం. అలా ఏదైనా జరిగితే మనకు, మన కులానికి మాసిపోని అపకీర్తి ఏర్పడుతుంది. ఆరు తరాలుగా చోళకులానికి పళువూర్ వంశస్థులు చేస్తూ వస్తున్న సేవలు మరుగై మట్టి కొట్టుకుపోతాయి. స్త్రీ అని తీసుకొని వచ్చి మన అంతఃపురంలో పెట్టుకొన్న ఆ రక్కసి వల్ల కరికాలన్ చంపబడితే, దానికన్న మనకు కలిగే అపకీర్తి ఇంకేదీ లేదు, ఉండబోదు.

ఆహా! అంతటి అందమైన రూపం వెనుక అంతటి హాలాహల విషం ఉండగలదా? ముల్లోకాలను సమ్మోహితం చేయగల ఆ లాస్యం (=చిరునవ్వు) వెనుక ఇంతటి వంచన దాగివుండగలదా? ఈ ఛండాలురు కాసేపటి క్రితం చెప్పినదంతా నిజమై ఉండ సాధ్యమా....?

~

పళువేట్టరయ్యర్ హృదయాన కోపాగ్ని రగిలేటట్లు చేసిన ఆ కుట్రదారుల మాటలు ఒకవిధంగా ఆయనకు కాస్త తృప్తినిచ్చాయి. నందిని కుట్రదారిణి కావచ్చు; మన మీద ప్రేమ ఉన్నట్లు నటిస్తూ వంచించి మోసగించేందుకు వచ్చి ఉండవచ్చు. కానీ ఆమె కరికాలన్ మీద గాని, గందమారన్ మీద గాని, వంతిదేవుని మీద గాని మోహంగొని మనని వంచించలేదు! ఆ మూఢ యువకులను ఆమె పట్టించుకోనే లేదు. ఆమె ఉద్దేశాన్ని నెరవేర్చుకోవడానికి వారిని ఉపయోగించుకోవడం కోసమే వారితో సుముఖంగా మాట్లాడుతూ నడుచుకొంటూంది!

ఈ విషయం పళువేట్టరయ్యర్ మనసు లోపలి మనసులో కాస్త ఊరట కలిగించింది. కరికాలన్ చంపబడకుండ ఆపవలసింది, మన కుల గౌరవాన్ని కాపాడుకోవడానికి, తమకు ఎన్నటికీ మాయని అపకీర్తి కలగకుండ అడ్డుకోవడానికి మాత్రమే కాదు, నందినిని ఇటువంటి ఘోర పాప కార్యం చేయకుండ ఆపేందుకు కూడాను. ఒక వేళ ఆమె మనసునే మార్చ సాధ్యం కావచ్చు. ఈ ఛండాల కుట్రదారుల చేత చిక్కుబడడం వల్ల ఆమె ఇక వేరే దారి లేక వారికి లోకువై ఉండ సాధ్యమా? వీరిని ఇక్కడే చంపి తొలగించేస్తే నందినికి విడుదల దొరకవచ్చు కద...?

ఇలా ఎంచి ఆ వీర వృద్ధులు తమకు తెలియకనే గొంతు సవరించుకొన్నారు. సింహ గర్జన వంటి ఆ శబ్దం కుట్రదారులిద్దరినీ అదిరిపడేటట్లు చేసింది.

“ఎవరది?” అన్నాడు దేవరాళనైన పరమేశ్వరన్.

ఇక తాము మరుగ్గా ఉండడం సాధ్యం కాదు, ఉచితం కూడ కాదు అని ఎంచి పెద్ద పళువేట్టరయ్యర్ బయటకొచ్చారు.

~

వర్షాకాలపు చీకటిలో ఉన్నట్లుండి అగుపించిన ఆ పెద్ద ఆకారాన్ని చూసి అ కుట్రదారులిద్దరూ అదిరిపడి నిలబడ్డప్పుడు, “నేనే యముడి అన్నను!” అని చెప్పేసి పళువేట్టరయ్యర్ పెద్దగా నవ్వారు.

ఆ గంభీరమైన నవ్వు శబ్దం ఆ అడవి ప్రదేశాన్నంతా గడగడ వణికించింది.

వచ్చినవారు పెద్ద పళువేట్టరయ్యర్ అని తెలియగానే రవిదాసు, దేవరాళన్ ఇద్దరూ తప్పించుకొని పారిపోజూశారు! కానీ పళువేట్టరయ్యర్ అందుకు తావివ్వలేదు. తమ దీర్ఘహస్తాలను చాచి ఇద్దరినీ గట్టిగా పట్టుకొని ఆపారు. ఆయన కుడిచేయి రవిదాసు గొంతును పట్టుకొంది. ఎడమ చేయి దేవరాళన్ ఒక భుజాన్ని పట్టుకొంది. వజ్రాయుధం కన్న బలమైన ఆ చేతుల పట్టు వారిద్దరినీ ఊపిరాడక సతమతం చేశాయి.

చేతుల్లో ఎంత బలమున్నా ఇద్దరినీ ఒకేసారి సంభాళించడం సాధ్యం కాదని ఎంచి పళువేట్టరయ్యర్ దేవరాళన్ని తలకిందులుగా పడేటట్లు తోశారు. కింద పడ్డ వాడి వెన్నుపైన గట్టిగా కాలూని రవిదాసు గొంతును రెండు చేతులతో నొక్కసాగారు.

కానీ దేవరాళన్ ఊరకుండలేదు. తన బొడ్లో దోపుకొన్న చురకత్తిని శ్రమపడి తీసి తనను నొక్కిపెట్టిన ఆయన కాలిని పొడవజూశాడు. ఆయన అది గ్రహించి తన రెండో కాలితో కత్తి పట్టుకొన్నవాడి చేతి మణికట్టును బలంగా ఒక్క తన్ను తన్నారు. కత్తి చాల దూరంగా వెళ్ళి పడింది. కానీ అదే సమయాన వాడిని  నొక్కి పట్టిన కాలు కాస్త జరిగింది. దేవరాళన్ చటుక్కున ఆయన కాలి కిందినుంచి జారుకొని ఎగిరి లేచి నిలబడ్డాడు. దెబ్బ తినని తన రెండో చేత్తో ఆయన మీద ముష్టి గుద్దులు కురిపించసాగాడు. కానీ గుద్దులు నల్లరాతి గోడమీద పడుతున్నట్లనిపించాయి. గుద్దిన దేవరాళన్ చేయే నొప్పెట్టింది. అది కూడ ఇంకొక చేయిలాగ పడిపోతుందేమోననిపించింది.

ఇంతలో రవిదాసు తన గొంతును పిసుకుతున్న పళువేట్టరయ్యర్ చేతులనుంచి విడిపించుకోవడానికి మహాప్రయత్నం చేశాడు. ఏమీ ఫలించలేదు. ముసలాయన ఉక్కుపట్టు ఏ మాత్రం సడలలేదు. రవిదాసు కళ్ళు వెళ్ళుకురాసాగాయి, “దేవరాళా! శీఘ్రం! శీఘ్రం! గుడిపైకెక్కు! మంటపాన్ని కిందకు తోయి!” అన్నాడు.

దేవరాళన్ వెంటనే పరుగెత్తుకు వెళ్ళి పళ్ళిప్పడై మంటపం పైకెక్కాడు. అక్కడ మంటపం కప్పులో ఒక చోట బీటవారి మంటపం పడిపోయే స్థితిలో ఉంది. దాన్ని వారు ఇంతకు మునుపే గమనించారు. రవిదాసు దాన్నే సూచించాడని దేవరాళన్ గ్రహించాడు. మంటపం కప్పు విరిగిన భాగాన్ని తనలో మిగిలివున్న బలాన్నంతా కూడదీసుకొని జరిపి తోశాడు. అది పడ్డప్పుడు దానితోబాటు ఒక చెట్టును కూడ తీసుకొని పడింది.

పళువేట్టరయ్యర్ పైనుంచి మంటపం కప్పు విరిగి పడబోతుందని గ్రహించారు. ఒక చేతిని రవిదాసు గొంతునుంచి తీసి పైనుంచి పడే మంటపం కప్పును ఆపజూశారు.

రవిదాసు అప్పుడొక బృహత్ప్రయత్నం చేసి పళువేట్టరయ్యర్ పట్టునుంచి తప్పించుకొని అవతలికి జరిగాడు.

మంటపం కప్పు, చెట్టు ఒక్కటిగా చేరి పెద్ద పళువేట్టరయ్యర్ మీద పడ్డాయి. ఆయన వెంటనే స్పృహ కోల్పోయారు.

~~~
~~~

# అధ్యాయము - 12

## ధూమకేతువు మరుగైంది!

**చాలసేపైన** తర్వాత పళువేట్టరయ్యర్కి స్పృహ వచ్చినప్పుడు, ఆయన ఒక భయంకరమైన యుద్ధరంగంలో ఉండడాన్ని చూశారు. కత్తులు ఒకదానికొకటి కొట్టుకొని ఢనేల్, ఢనేల్మని శబ్దం చేస్తున్నాయి. ఒకవైపు జయభేరులు మోగుతున్నాయి. వాటితోబాటు వేలాది గొంతులు, "మహారాజాధిరాజు పాండ్యరాజుకు జయహో! పాండ్యవిరోధులకు అపజయం!" అని ఘోషించాయి. ఇంకొకవైపు వేలకొద్ది గొంతులు "గంగరాజు పడిపోయాడు! పరుగెత్తండి! పరుగెత్తండి!" అని అరిచాయి.  పరుగెత్తి పారిపోతున్నవారిని అడ్డుపడి ఆపే గొంతులు కూడ వినిపించాయి.

అప్పుడు ఉన్నట్లుండి యుద్ధరంగంలో ఒక క్షణంపాటు నిశ్శబ్దం నెలకొంది. పళువేట్టరయ్యర్ చుట్టూ చూశారు. రెండు కాళ్ళను కోల్పోయిన విజయాలయ చోళుని ఒక ఆజానుబాహువైన వీరుడు తన భుజాలకెత్తుకొని వచ్చాడు. భుజాలపైన కూర్చొన్నవాడు రెండు చేతుల్లోను రెండు రాక్షస ఖడ్గాలను పట్టుకొన్నాడు. "చోళవీరులారా! ఆగండి! పల్లవులారా! పరుగెడకండి! ఆరేళ్ళకు చావే! నూరేళ్ళకు చావే! నా వెంట రండి! శత్రువులను ఛిన్నాభిన్నం చేద్దాం!" అని అతడు ఘోషించాడు. పారిపోనారంభించిన చోళ-పల్లవ వీరులు విజయాలయ చోళుని చూసి, అతని మాటను విని ఆగారు. వారి ముఖాల్లో అలసట, భీతి తొలగి మళ్ళీ  ధీర, వీర కళలు తోచాయి. వెనుకంజ వేసినవారు ముందడుగు వేశారు. ఆ అపూర్వమైన మార్పుకు కారణమైన విజయాలయ వర్మను పళువేట్టరయ్యర్ మళ్ళీ చూశారు. ఆశ్చర్యమాశ్చర్యం! అది కూడ తామే అని గ్రహించారు. ఆ పళువేట్టరయ్యర్ ఒక చేత్తో తమ భుజాల మీదున్న రెండు కాళ్ళు లేని విజయాలయ వర్మను భద్రంగా పట్టుకొని ఇంకొక చేత ఒక పొడవైన కత్తిని పట్టుకొని దాన్ని గిరగిరా తిప్పుతూ శత్రువుల మధ్య చొరబడ్డారు. వారిద్దరూ వెళ్ళిన చోటల్లా పాండ్య వీరుల తలలు నేలమీద దొర్లి పడ్డాయి.

పోరు తీరు పూర్తిగా మారిపోయింది. పాండ్య సైన్యం చెదరిపోనారంభించింది. చోళ-పల్లవులు జయించారు. ఎనిమిది దిక్కులూ అదిరేటట్లు జయ భేరీలు మోగాయి. పల్లవ చక్రవర్తికి ముందు విజయాలయ చోళుడు ఆసీనులైవున్నారు! ఆయన చెంత పళువేట్టరయ్యర్ నిలబడివున్నారు. పల్లవ చక్రవర్తి చోళరాజును చూసి, "వీరాధివీరా! మీవల్ల ఈ రోజు ఓటమి గెలుపైంది! ఇక చోళనాడు స్వతంత్రనాడు! మీరూ, మీ కుమారుడు ఆదిత్యుడు, మీ సంతతి ఎన్నటికీ స్వతంత్రరాజులుగా చోళనాడును ఏలుతారు!" అన్నారు. వెంటనే విజయాలయ చోళుడు తమ చెంత నిలబడ్డ పళువేట్టరయ్యర్ని చూసి, "బావా! మీ వల్లనే మనకీ విజయం చేకూరింది. స్వతంత్ర చోళదేశపు సేనాధిపతిగాను, ధనాధికారిగాను మిమ్మల్ని నియమిస్తున్నాను. మీ సంతతులు చోళ కులానికి నిజమైన నమ్మకస్తులైతే వారు కూడ చోళ దేశానికి

సేనాధిపతులుగాను, ధనాధికారిగాను ఉంటారు!" అన్నారు. గాయాలతో నిండిన పళువేట్టరయ్యర్ ముఖం గర్వంతో విప్పారింది.

ఉన్నట్లుండి ఆ ముఖంలో కఠిన/కఠోర కోపం తోచింది. ఆ పళువేట్టరయ్యర్ ఈ కొత్త పళువేట్టరయ్యర్ని చూసి, "ఒరే! పాపీ! ద్రోహి! ఛండాలా! నా కులాన్ని చెరిచేందుకు పుట్టిన వెధవా! ఆరు తరాలుగా ఎంతో కష్టపడి చేకూర్చిన వీరకీర్తినంతా నాశనం చేస్తున్నావే! మిత్రద్రోహం, స్వామిద్రోహం చేశావే! చోళకుల పరంపరకు పగవారైన వారికి నీ ఇంట్లోనే చోటిచ్చావు కద? నీ ఖొక్కసం నుంచే ధనమిచ్చావు కద? నీ వల్లనే కద ఈ రోజు చోళకులం అస్తమించబోతుంది? నీవు నాశనమైపోతావు! నీకు, నీ కులానికి నీ వల్ల కలిగిన అపకీర్తి లోకం ఉన్నంతవరకు మాయనే మాయదు!" అని శపించారు. శపించిన పళువేట్టరయ్యర్ కళ్ళనుంచి నీరు ధారగా ప్రవహించింది.

తర్వాత ఇంకా చాల పళువేట్టరయ్యర్లు అగుపించారు. ఒక్కొక్కరు తాము చేసిన వీరకృత్యాలను వివరించారు. ఒక్కొక్కరు పళువేట్టరయ్యర్ని శపించారు. తర్వాత అందరూ చేరి శపించారు. "ఛండాలుడా! కులద్రోహమూ, రాజద్రోహమూ చేశావు కదరా! మేము ప్రాణాలిచ్చి సంపాదించిన కీర్తినంతా నాశనం చేసేశావు కద? నీ బుద్ధి ఎందుకిలా పోయింది?" అన్నారు.

పళువేట్టరయ్యర్లు మాయమైనారు. కొడుంబాళూర్ వేళార్లు, మలైయమాన్లు వచ్చారు. ఒంటరిగా నిలబడ్డ పళువేట్టరయ్యర్ని చుట్టుముట్టారు. "ఛీఛీ! నీవూ ఒక మనిషివేనా? చోళకులాన్ని నీవు, నీ పరంపరే అండగా నిలబడి రక్షిస్తూ వస్తున్నారని గర్వపడ్డావే? ఇప్పుడేమంటావు? చోళ కులానికి నీవు యముడిగా మారిపోయావు కద? పాతకుడా! నీ భవిష్యత్తు ఎక్కడ?" అని చెప్పి హేళనగా నవ్వారు.

వారి వెనుక గుంపుగా నిలబడ్డ చోళనాడు ప్రజలు రాళ్ళు, మట్టి బెడ్డలు ఆయన మీదకు విసరసాగారు. అప్పుడు సుందర చోళ చక్రవర్తి ఆ గుంపును పైదొలగించుకొని బలహీనమైన కాళ్ళతో తడబడుతూ ముందుకు వచ్చారు. వేళార్లను, మలైయమాన్లను, తక్కినవారిని కోపంగా చూశారు. "ఛీఛీ! ఏం పనిది? వీరాధివీరుడైన పళువేట్టరయ్యర్ మీదనా రాళ్ళు విసురుతున్నారు? నేనూ, నా పిల్లలు తుడుచిపెట్టుకుపోయినా సరే, మీరెవరూ ఆయన మీద నింద మోపకండి! ధనాధికారీ! రండి నాతో అంతఃపురానికి!" అన్నారు. జనకూటమి చెదరిపోయింది. సుందర చోళ చక్రవర్తి కూడ మాయమైనారు. తమ్ముడు మాత్రం ఆయన ముందు నిలబడ్డారు. "అన్నా! చక్రవర్తి మనమీద ఇంత నమ్మకం కలిగివున్నారు కద? ఆయనకు ద్రోహం చేయవచ్చా? ఆయన కులాన్ని నాశనం చేసేందుకు వచ్చిన ఆ ఆడ పిశాచిని మన అంతఃపురంలో ఉంచుకోవచ్చా?" అన్నారు. వెంటనే ఆయన కూడ మరుగైనారు.

వంతిదేవుడు, గందమారన్ లాంటి యువకులు వారి చుట్టూ చేరారు. "మీసం నెరసిన ముసలాడా! నీకు ఆశ మాత్రం నెరవలేదు కద? నీ ఒంటిమీది అరవైనాలుగు గాయాలు ఇప్పుడేమంటున్నాయి? అవి వీరత్వానికి బహుమతులా? లేక, ద్రోహ కూలి పురుగుల గాయాలా?" అనేసి

గలగలమని నవ్వారు. వారిని చంపేసేందుకు ఆయన ఒరనుంచి కత్తి దూయజూశారు. కానీ కత్తి ఉండవలసిన చోట లేదు.

~

ఈ సమయాన కుందవై రాకుమారి వచ్చింది. యువకులవైపు చూసి, చేత్తో సైగ చేసి వారి నవ్వులను ఆపింది.

“తాతా! వీరి పరిహాసాలను మీరు పట్టించుకోకండి. మీ అంతఃపురంలో స్త్రీ వేషం ధరించివున్న ఆ విష సర్పాన్ని తీసి పారేయండి! అన్నీ సరై పోతాయి!” అన్నది.

వారందరూ మరుగైనారు. పళువేట్టరయ్యర్ కులానికి చెందిన స్త్రీలు రాసాగారు. పది మంది, నూరు మంది, వేల మంది, ఆరు తరాలకు చెందిన వారందరూ వచ్చి ఆయనను చుట్టుముట్టారు.

“అయ్యయ్యో! నీకు ఈ గతా పట్టాలి! మన వీర కులానికి నీవల్ల ఇటువంటి నిందా కలగాలి? మేము మా భర్తలను, అన్నదమ్ములను, పది మాసాలు మోసి కన్న కొడుకులను చోళనాడు కోసం యుద్ధరంగానికి పంపించామే? వారు తమ రక్తం చింది, ప్రాణాలు బలిచ్చి పళువూర్ వంశానికి ఎనలేని కీర్తిని తెచ్చారు కద? అదంతా ఒక్క క్షణంలో పోగొట్టేశావు కద?” అని ఏడ్చారు.

“ఓ స్త్రీలారా! నోరు మూసుకొని అంతఃపురానికి వెళ్ళండి! నా వల్ల ఎటువంటి అపకీర్తి రాబోదు!” అని అతికష్టం మీద బదులు చెప్పారు పళువేట్టరయ్యర్. అప్పుడు ఆ స్త్రీలు ఒక దిశవైపు వేలెత్తి చూపించారు. యమధర్మరాజు ఎనుబోతు వాహనం మీద శూలం, యమపాశం పట్టుకొని వస్తూండడం కనిపించింది. యముడు పళువేట్టరయ్యర్ని సమీపించాడు. పోతూ పోతూ, “పళువేట్టరయ్యరా! నీకు నా వందనాలు! సుందర చోళ చక్రవర్తి ప్రాణాన్ని, అతడి ఇద్దరు కుమారుల ప్రాణాలను ఒకే రోజు తీసుకొని వెళ్ళేందుకు సహాయం చేశావు కద? అందుకు చాల ధన్యవాదాలు!” అన్నాడు యమధర్మరాజు.

“లేదు, లేదు! నేను నీకు సహాయం చేయలేదు! చేయను! నిన్ను అడ్డగిస్తాను! యముడా! ఆగు! ఆగు!” అని పళువేట్టరయ్యర్ అరిచారు. యముణ్ణి అడ్డగించేందుకు వేగంగా వెళ్ళ ప్రయత్నించారు. కానీ ఆయనను ఏదో ఒక శక్తి పట్టి ఆపింది. ఏదో ఒక పెద్ద భారం ఆయనను నొక్కింది. ఉన్నచోటినుంచి కదల్లేకపోయారు.

"చూశావా! మేము చెప్పింది నిజమైంది!” అని చెప్పేసి పళువేట్టరయ్యర్ కులస్త్రీలు 'ఓ' అని ఎలుగెత్తి ఏడ్చారు. వారిలో చాలమంది శాపనార్థాలు పెడుతూ ఏడ్చారు.

వారి ఏడుపు నిమిష నిమిషానికీ పెద్దది కాసాగింది. పళువేట్టరయ్యర్ దాన్ని తట్టుకోలేకపోయారు. ఆయన మాట్లడాలనుకొన్నారు. కానీ ఏడుపు శబ్దంలో అది మరుగైపోయింది.

ఆ ఏడుపు, గోడు వినలేక రెండు చేతులతోను చెవులను మూసుకోజూశారు. కానీ ఆయన చేతులు కూడ అచేతనమైనాయి.

~

ఒక బృహత్ప్రయత్నం చేసి చేతులను పైకెత్తి విదిలించారు. ఆ ప్రయత్నంలో ఆయన కనురెప్పలు కూడ తెరుచుకొన్నాయి. చటుక్కున తెలివొచ్చింది. అంతసేపు ఆయన చూసిందంతా చిత్తభ్రమతో చూసిన దృశ్యాలని గ్రహించారు. కానీ ఆ ఎలుగెత్తి ఏడుస్తున్న గొంతు శబ్దం మాత్రం ఇంకా వినిపిస్తూంది. కాస్త శ్రద్ధగా విన్నారు. అది ఆడవాళ్ళ ఏడుపు శబ్దం కాదు! నక్కల ఈలలు!

ఆయనకు స్పృహ తప్పుతున్నప్పుడు చివరగా చెవిన పడ్డ సంభాషణను గుర్తు చేసుకొన్నారు.

"ముసలాడు చచ్చిపోయాడు!" అన్నది ఒక గొంతు.

"బాగా చూడు! పళువేట్టరయ్యర్ ప్రాణం చాల గట్టిది. యముడు కూడ వాడి దగ్గరకు వచ్చేందుకు భయపడతాడు!" అన్నది ఇంకొక గొంతు.

"యముడు భయపడ్డా కూడ నక్కలు భయపడవు. కాస్తో, కూస్తో ప్రాణం మిగిలివున్నా కూడ, నక్కలు చూసుకొంటాయి. పొద్దు పొడిచేటప్పటికి ముసలాడి ఎముకలు మాత్రమే మిగిలివుంటాయి!"

"మంచి సమయం చూసి నీవు విరిగిన మంటపాన్ని తోశావు. లేకపోతే నాకా గతి పట్టేది. ముసలాడు నన్ను చంపేసేవాడు!"

"ఎక్కడ? మంటపాన్ని జరపడం సాధ్యమేమో, చూద్దాం!"

కాసెపైన తర్వాత, "ఇసుమంతైనా జరగడం లేదు! ఒక పగవాడి పళ్ళిప్పడై మంటపాన్ని ఉపయోగించి ఇంకొక పగవాడి వీరగల్లు నాటేశాం!" అని చెప్పేసి మంత్రవాది గలగలా నవ్వాడు.

"నవ్వింది చాలు, రా! పడవ విప్పేసుకొని ఏట్లో కొట్టుకుపోబోతూంది. తర్వాత కొళ్ళిడాన్ని దాటలేం!"

~

ఈ మాటలు గుర్తు చేసుకొని పళువేట్టరయ్యర్ తమ పరిస్థితి ఏమని పరీక్షించుకొన్నారు. అవును; ఆయన మీద పళ్ళిప్పడై మంటపం ఒక భాగం ఒకటి విరిగి పడివుంది. దాని భారం ఆయనను అదిమిపెడుతూంది.

కానీ ఊపిరాడుతూంది. ఎలా? అదృష్టవశాత్తు మంటపంతోబాటు పడ్డ చెట్టు ఆయన భుజాలమీద పడి, దాని మీద మంటపం పడివుంది. ఆ చెట్టే ఆయన ప్రాణాలను కాపాడింది. మంటపం తిన్నగా ఆయన మీద పడివుంటే ఆయన తల, వక్షస్థలం ముక్కలు ముక్కలయ్యేవి!

ముసలాయన తమ దేహబలాన్ని చూసి తామే ఆశ్చర్యపోయారు. ఆ పెద్ద భారాన్ని ఇంతసేపూ మోస్తున్నా కూడ తాను ప్రాణాలు కోల్పోలేదన్న విషయాన్ని గ్రహించారు. కానీ ఇంత గట్టి ప్రాణాన్ని ఇంకా కాపాడుకో సాధ్యమా?

అవును; ఎలాగైనా కాపాడుకోవలసిందే. కాపాడుకొని, చోళకులానికి కలగబోయే అపాయాన్ని

అడ్డుకోవాలి. అలా అడ్డుకోకపోతే ఆయన కులానికి ఎన్నడూ మాసిపోని అపకీర్తి కలగడం తథ్యం. ఆకాశలోకానికి వెళితే అక్కడ కూడ ఆయన పూర్వీకులందరూ ఆయనను శపిస్తారు. కాబట్టి ఏ పాట్లు పడైనా ఈ చెట్టును, మంటపాన్ని అవతలికి తొలగించి లేవాలి. అయ్యో! ఎంతసేపిలా ఇలా స్పృహ తప్పి ఇక్కడ పడివున్నామో తెలియడం లేదు కదా? ఇంతలోపల తాము అడ్డుకోవాలనుకొన్న విపరీతాలు జరిగిపోతే...?

ఇంతలో నక్కల ఈలలు మరింత దగ్గరపడసాగాయి. నక్కల ఊపిరి విడిచే శబ్దం ఆయన తల దగ్గరగా వినిపించింది! ఆహా! ఈ నక్కలకు కూడానా తాము పరిహాసపాత్రులయ్యాము! చూద్దాం వాటిని ఒక చేయి!

పళువేట్టరయ్యర్ ఒక చేత్తో మాత్రం కాదు, రెండు చేతులతోను ప్రయత్నించసాగారు. తమ ఒంట్లో మిగిలివున్న బలాన్నంతా కూడదీసుకొని ఆ చెట్టును పక్కకు తొలగించ ప్రయత్నించారు. అది కొద్ది కొద్దిగా పైకి లేవడంతో దానిపైనున్న మంటపపు బండ కూడ పక్కకు జారనారంభించింది. మధ్య మధ్య ఆయన చేస్తూ వచ్చిన హాహాకారాలు నక్కలను దూరంగా నిలబెట్టాయి.

ఒక యుగమనిపించిన ఒక ఘడియ పాటు అలా ప్రయత్నించిన తర్వాత ఆయనను అదిమిపెట్టిన చెట్టు, మంటపం కాస్త అవతలికి జరిగి ఆయనను విడుదల చేశాయి.

ఆ మహాప్రయత్నం వల్ల ఆయనకేర్పడ్డ శ్రమ కారణంగా కాసేపలాగే ఉండిపోయారు. పెద్దగా నిట్టూర్చారు.

తర్వాత అలాగే ఆకాశాన్ని తలెత్తి చూశారు. మంటపం దగ్గర ఉండడం వల్ల, సుడిగాలికి చాల చెట్లు పడిపోవడం వల్ల ఆకాశం బాగ కనిపించింది. ఇప్పుడు నల్లటి మేఘాలు ఆకాశాన్ని కమ్ముకోలేదు. వజ్రపు తునకల్లాంటి చుక్కలు ఆకాశంలో కనిపించాయి. కదులుతున్న మేఘాలు వాటిని కొద్దిగా కప్పేసి, మళ్ళీ పక్కకు జరుగుతూ అతివేగంగా కదలసాగాయి.

చటుక్కున ఆకాశంలో ఉత్తరదిక్కున కనిపించిన ఒక విచిత్రమైన నక్షత్రం ఆయన చూపులను ఆకట్టుకొంది. అరెరె! కొన్ని రోజుల క్రితం పెద్ద తోకతో కనిపించిన ధూమకేతువేనా ఇప్పుడు చిన్న తోకతో కుంచించుకుపోయి కనిపిస్తూంది? ఆ తోకచుక్క ఒక చివర సుమారు ఒక అడుగు దూరానికి పొగలాగ కనిపించింది. పదిరోజుల క్రితం కూడ ఆకాశాన ఒక కోణం పూర్తిగా పరుచుకొన్న ఆ తోక ఇప్పుడు ఇలా కుంచించుకు పోవడానికి కారణమేమి?

ఆకాశంనుంచి చూపులు మళ్ళించి చుట్టూ చూశారు. నక్కలు ఇంకా పోలేదన్న విషయాన్ని గమనించారు! వాటి కళ్ళు ఆ చీకటిలో నిప్పు కణికల్లా ప్రకాశిస్తున్నాయి. ముసలాడు ఎప్పుడు చస్తాడని కాచుకొనివున్నాయి కాబోలు! పోనీ! అంత మటుకు మర్యాదైనా ఈ నక్కలు పళువేట్టరయ్యర్ పట్ల కలిగివున్నాయి కదా!

~

ఉన్నట్లుండి భూమ్యాకాశాలు, ఆ అడవి ప్రదేశం జ్యోతిర్మయమైనాయి. ఆ కాంతి ఆయన కళ్ళను గుచ్చినట్లనిపించింది. అది మెరుపు కాదు. ఇంకేమైవుంటుంది? ఆకాశాన్ని చూశారు. జ్వాజ్వల్యమానంగా ప్రకాశిస్తున్న ఒక అగ్ని పుంజం ఆకాశ వలయంలో ఒక కోణంలో పయనిస్తుండడాన్ని చూశారు. దాని కాంతే ఆయన కళ్ళకు మిరుమిట్లుగొలిపించింది కళ్ళను ఒక్కక్షణం మూసి మళ్ళీ తెరిచారు. ఆ అగ్ని పుంజం చిన్నదైపోయింది. రానురాను కాంతి తగ్గింది; ఉన్నట్లుండి అది మాయమైపోయింది. మునుపటిలాగ చీకటి కమ్ముకొంది.

ఈ విచిత్రం ఏమైవుంటుందని ఆలోచిస్తూనే మళ్ళీ ఆకాశంవైపు చూశారు. చిన్నదైన ధూమకేతువు మునుపటి స్థానాన్ని చూశారు. అక్కడ అది కనిపించలేదు. ఆహ్! ధూమకేతువే పడిపోయింది! దీని అర్థం ఏమి? దీని పరిణామమేమి? లోకంలో ఏదో విపరీతం జరగబోతుందనడానికి సూచనే ఇది. రాజకుటుంబీకులు ఎవరికైనా ఆపద కలగబోతుందనడానికి సూచన. తోక చుక్క మరుగైనప్పుడు రాజకుటుంబీకులెవరైనా మరణిస్తారు - ఇది ప్రజల మధ్య చాల కాలంగా వ్యాపించిన నమ్మకం. అలాగేం లేదు అని చెప్పేవారు కూడ ఉన్నారు. దాని నిజానిజాలు రేపు తెలిసిపోతాయి. రేపా? లేదు! ఈ రోజే తెలిసిపోతుంది...! అదిగో తూర్పు తెల్లవారుతూంది. పొద్దు పొడవబోతూంది! ఈ రాత్రి లోపల మూడు చోట్ల మూడు భయంకర కృత్యాలు జరగవచ్చు. అవి ఎలా జరగబోతున్నాయన్న వివరాలు తమకు మాత్రమే తెలుసు. వాటిని అడ్డుకొనే శక్తి కూడ తమకు మాత్రమే ఉంది. ఆ అడ్డుకోవడంలో గెలుపొందితే ధూమకేతువు పడ్డ అపశకునాన్ని కూడ వమ్ము చేయవచ్చు. లేకపోతే... దాని గురించి తలుచుకోవడానికే ఆయనకు అసాధ్యమైంది. అడ్డుకొనే తీరాలి! చోళకులానికి చెందిన ముగ్గురినీ కాపాడాలి!

తమ మొదటి కర్తవ్యం, అతి ముఖ్యమైన కర్తవ్యం, ఆదిత్య కరికాలన్ని కాపాడడమే! అతడికి ఏదైన ఆపద కలిగితే ఆ నింద తిన్నగా తమ తలమీదే పడుతుంది. కాబట్టి కొళ్ళిడాన్ని దాటి వెంటనే కడంబూరుకు వెళ్ళాలి. దానికి ముందు, కుడందైకి వెళ్ళి తంజావూరుకు, నాగపట్టణానికి హెచ్చరిక పంపించి వెళ్ళడం మంచిది. తర్వాత, విధి ఎలా ఉంటే అలా జరుగుతుంది. మనం చేయగలిగిందంతే!

పళువేట్టరయ్యర్ లేవ ప్రయత్నించారు. ఒళ్ళంతా నొప్పెట్టింది. చెట్టు పడ్డ చోట గుండెలపైన తట్టుకోలేనంత బాధ కలిగించింది. ఒక కాలు విరిపోయినట్లనిపించింది. ఒళ్ళంతా అనేక గాయాలేర్పడివున్నాయి.

వాటన్నిటినీ ఆ వీరవృద్ధుడు పట్టించుకోలేదు. పళ్ళు గిట్ట కరుచుకొని ఒక మహాప్రయత్నం చేసి లేచి నిలబడ్డారు. చుట్టు పక్కల చూశారు. మంచివేళగా, ఆయన మరణం కోసం వేచివున్న నక్కలు అంతలోపల పరుగెత్తి పారిపోయాయి. ధూమకేతువు పడ్డప్పుడు ఏర్పడ్డ కాంతిని చూసి అవి బెదిరి పారిపోయాయి కాబోలు!

కుడంద్దై నగరం అక్కడినుంచి ఏ దిశలో ఉండవచ్చని అంచనా వేసుకొని ఆ దిశగా బయలుదేరారు. కాళ్ళను గట్టిగా ఊని నడవనారంభించారు.

దారి పొడుగునా సుడిగాలి వీచి చెట్లన్నీ పడివున్నాయి. పెద్ద వాన వల్లను, కొళ్ళిడం నది గట్టు తెంచుకొని వరదగా పారడం వల్లను అంతా వరద ప్రవాహమయంగా ఉంది. ఈ ఇబ్బందులన్నిటినీ కించిత్తు కూడ ఆయన పట్టించుకోక ముందుకు సాగారు. మనసులో కల్లోలం దేహశ్రమనంతటినీ మరిచిపోయేటట్లు చేసింది. కానీ కాలం గడుస్తూనే ఉంది. పొద్దు పొడిచి రెండు జాముల తర్వాత ఆయన కుడంద్దై నగరాన్ని సమీపించారు. ఆ మహానగరపు మధ్యప్రదేశానికి వెళ్ళేందుకు ఆయన ఇష్టపడలేదు. ఆయనను ఈ తీరున చూస్తే ప్రజలు వచ్చి చుట్టుముడతారు. ఏమి, ఎలా అని అడుగుతారు. ఆయన చేయదలచిన కార్యాన్ని త్వరితంగాను, సమర్థవంతంగాను చేయలేకపోతారు.

కాబట్టి నగర సరిహద్దులోనే, జన సందోహం ఎక్కువ లేని చోట ఎవరినైనా పట్టుకొని తంజావూరుకు, నాగపట్టణానికి తాళపత్ర సందేశం పంపాలి. తర్వాత ఒక వాహనం సంపాదించుకొని కడంబూరుకు వెళ్ళాలి.

దుర్గాదేవి కోవెల దగ్గరున్న జ్యోతిష్కులు ఆయనకు గుర్తొచ్చారు. అవును, అది ఒక ఒంటరి ప్రదేశం / జన సంచారం లేని ప్రదేశం. చుట్టుపక్కల ఇంకే ఇళ్ళూ లేవు. జ్యోతిష్కులు ఈ కార్యానికి తగిన మనిషి. మంచి గుణం, నడవడిక కలిగినవాడు. రాజకుటుంబానికి, ముఖ్యమంత్రికి కావలసినవాడు. దానివల్లనేమి? ఈ కార్యాన్ని ఎవరైనా చేస్తారు. రాజకుటుంబానికి కావలసిన వారైతే ఇంకా హెచ్చు ఆతురతతో, ఆదుర్దాతో చేస్తారు. ఆహ్! ఆ జ్యోతిష్కులకు నిజంగా జోస్యం తెలుసా, జోస్యంలో నిజం ఉందా లేదా అన్నది ఇప్పుడు పరిశోధించి చూసేయవచ్చు.

పళువేట్టరయ్యర్ అమ్మవారి కోవెలను, దానికి దగ్గర్లోనే ఉన్న జ్యోతిష్కుల ఇంటిని సమీపించారు. కోవెల ముందున్న ఎత్తైన, పెద్ద చెట్టు సుడిగాలికి విరిగి పడివుంది. మొదట ఆయన చూపులనాకట్టుకొన్నది కోవెల పక్కన రెండు గుర్రాలు పూన్చిన ఒక రథం. అది విచిత్రంగా చేయబడ్డ రథం. ఆ రథం పైభాగం ఒక పడవలాగ ఉంది. వరద వచ్చే సమయాన తొందరగా ప్రయాణం చేయవలసి వస్తే ఇటువంటి రథాలను ఉపయోగిస్తారు. పెద్ద నదులను దాటేటప్పుడు ఉన్నట్లుండి వరద వెల్లువొస్తే ఆ పడవను రథంనుంచి విడదీసి, గుర్రాలను రథంనుంచి విప్పదీసి వదిలేస్తే అవి ఈదుకొంటూ అవతలి గట్టుకు చేరుకొంటాయి. రథంలో వచ్చినవారు పడవను తోసుకొంటూ అవతలి గట్టుకు వెళ్ళి చేరవచ్చు.

ఇలాంటి రథాలు చోళనాడులో అరుదే. ఈ రథం ఎవరిదై ఉండవచ్చు? అంతఃపురపు రథమై ఉండాలి. ఇందులో వచ్చినవారు జ్యోతిష్కుల ఇంట్లో జోస్యం వింటూ ఉంటారు కాబోలు. వారు ఎవరై ఉండవచ్చు? రథసారథిని అడుగుదామా? వద్దు! వాడు మనని చూసి బెదిరిపోయినా పోవచ్చు. తిన్నగా జ్యోతిష్కుల ఇంట్లోకి ప్రవేశించి చూసేయడమే ఉత్తమం. అక్కడికి వచ్చినవారెవరైనా సరే, ఈ రథాన్ని అడిగి

తీసుకొంటే, కడంబూరుకు తిరిగి వెళ్ళడానికి అనుకూలంగా ఉంటుంది కద?

~

పళువేట్టరయ్యర్ జ్యోతిష్కుల ఇంటి వాకిలికి వచ్చినప్పుడు లోపలినుంచి స్త్రీల గొంతులు వినిపించాయి. ముసలాయన అదిరిపడ్డారు. ఎవరి గొంతది? ఏల? యువరాకుమారి కుందవై గొంతే అది! ఆమె ఎందుకిక్కడికి వచ్చింది? ఈ సమయం చూసా రావాలి? మొదట ఇలా అనుకొన్నాయన వెంటనే మనసు మార్చుకొన్నారు. అలాగైతే, యువరాకుమారే ఇక్కడుంటే, ఇంకా మంచిది. పండు జారి పాలలో పడ్డట్లయింది. కుందవై చెవిలో విషయాన్ని వేసేస్తే మన భారమే తొలగినట్లవుతుంది. ఆమె తండ్రికి, తమ్ముడికి ఆపదను వివరంగా చెప్పేస్తే, ఆ సమర్థవంతమైన అమ్మాయి తగిన ముందు జాగ్రత్తలు తీసుకోగలదు. తర్వాత మనం నెమ్మదిగా కడంబూరుకు వెళ్ళవచ్చు. అక్కడే కద మన ముఖ్యమైన కర్తవ్యం నెరవేర్చవలసి ఉంది?

పళువేట్టరయ్యర్ జ్యోతిష్కుల ఇంటి వాకిట ప్రవేశించినప్పుడు, ముందు తలుపు దగ్గర, తామింతకు మునుపొకసారి చూసిన అదే కాపలా వాడు - జ్యోతిష్కుల శిష్యుడు - ఆయనకు అడ్డుపడి ఆపాడు. పళువేట్టరయ్యర్ ఇప్పుడు ఉన్న తీరులో ఆయనను ఆ అబ్బాయి గుర్తుపట్టలేకపోయాడు. కాబట్టే, “నిలు!” అని గద్దిస్తూ ఆయననాపాడు. పళువేట్టరయ్యర్ ఒక్కసారి హుంకరించి వాడి మెడ పట్టి తోశారు. శిష్యుడు పాపం గిరికీలు కొడుతూ వెళ్ళి వీధిన పడ్డాడు. పళువేట్టరయ్యర్ మదపుటేనుగులాగ భూమి అదిరేటట్లు నడుస్తూ జ్యోతిష్కుల ఇంట ప్రవేశించారు.

~~~
~~~

# అధ్యాయము - 13

## కుందవై కోరిన వరం

**పళువేట్టరయ్యర్** జ్యోతిష్కుల ఇంట ప్రవేశించినప్పుడు అక్కడ నిజంగానే కుందవై, వాణతి ఉన్నారు.

లంకాద్వీప రాణి పొద్దు పొడిచినప్పటినుంచి కనిపించకపోవడంతో కుందవై మనసు కలతబారింది. అదే సమయాన పూంగళలి కూడ కనిపించకపోవడంతో ఆమె గాభరా మరింత ఎక్కువైంది. ముఖ్యమంత్రి అనిరుద్ధులను చూడ వెళ్ళింది. ఆ సమయాన అక్కడకు అరుళ్మొళి వర్మ గురించిన వార్త వచ్చి చేరింది. నాగపట్టణంలో వీచిన సుడిగాలివల్ల అతడు బయటపడవలసివచ్చిందని, తండోపతండాలుగా ప్రజలు అతన్ని విజయఘోషతో తంజావూరుకు పిలుచుకొని వస్తున్నారని తెలుసుకొంది. కుందవై గాభరా ఎల్లలు దాటింది. ఇందువల్ల ఏదో ఒక పెద్ద విపరీతం జరగబోతుందని ఎంచింది. పొన్నియిన్ సెల్వన్ని దారిలో కలిసి మాట్లాడి తంజావూరులో జరిగినదంతా వివరించాలనుకొంది. అతడు పెద్ద గుంపుతో తంజావూరులో ప్రవేశించగోరితే పళువేట్టరయ్యర్‌గారి వీరులు అతన్ని అడ్డగించి ఆపేందుకు ప్రయత్నిస్తారు. ఇంతలో సేనాధిపతి బూది విక్రమకేసరి దక్షిణసైన్యంతో కొడుంబాళూర్ వరకు వచ్చేశారని తెలిసింది. రెండు సైన్యాలు తంజావూరు సమీపాన ఢీకొనే అవకాశాలున్నాయి. అందువల్ల తండ్రి చాల బాధపడతారన్నది తథ్యం. అందువల్ల ఆయన ప్రాణానికే ఆపద రావచ్చు. ఇంకా ఏమేం పరిణామాలు కలుగుతాయో ఎవరికి తెలుసు? సుడిగాలి వల్ల కలిగిన కష్టనష్టాలతో ప్రజలు చాల బాధపడుతున్నారు. ఏదైనా నెపం దొరికితే చాలు, చోళసామ్రాజ్యమే తుడిచిపెట్టుకుపోయేటంతటి మహా అంతర్యుద్ధం జరగవచ్చు. తర్వాత దాన్ని ఆపడం ఎలా? మొదలైన తర్వాత ఆప ప్రయత్నించడం కన్న ముందుగానే అడ్డుపడి ఆపడం మంచిది కద? లేకపోతే ఇంతకాలం చేసిన ప్రయత్నాలన్నీ వృధా అయిపోవా? కాబట్టి అరుళ్మొళి వర్మను దారిలోనే కలిసి, పళైయారైకి తీసుకొని వెళ్ళి కొంతకాలం అక్కడే ఉంచాలి. కడంబూర్ నుంచి పెద్ద పళువేట్టరయ్యర్ని కూడ రప్పించాలి. అరుళ్మొళికి రాజ్యమేలే ఆశ లేదని తెలియజేసి, ఆయన సమ్మతం పొందిన తర్వాతే తంజావూరుకు వాడిని పిలుచుకొని వెళ్ళాలి.

ఇలా తనలో తాను తీర్మానించుకొని, తండ్రికి కూడ చెప్పకుండ, తల్లికి, ముఖ్యమంత్రి అనిరుద్ధులకు మాత్రం తెలియజెప్పి, తనను విడవని వాణతిని తోడు తీసుకొని బయలుదేరింది. పళైయారైకి వెళ్ళేముందు కుడంద్తై జ్యోతిష్కులను ఇంకొక సారి చూసి మాట్లాడలనుకొంది. దిగులు అధికమైనప్పుడు భవిష్యత్తు గురించి జోస్యం చూసి తెలుసుకోవాలని కోరుకోవడం సహజమే కద?

అలవాటు ప్రకారం అమ్మవారి కోవెల దగ్గర రధాన్ని వదిలిపెట్టి జ్యోతిష్కుల ఇంట ప్రవేశించింది.

జ్యోతిష్కులకు తన దిగులును వివరించనారంభించి, ఇంకా ఎంతో సేపు కాలేదు. అంతలో ఇంటి వాకిట ఏదో గడబిడ శబ్దం వినిపించింది. ముఖ్యంగా, పళువేట్టరయ్యర్ చేసిన హుంకారం ఆమెకు గగుర్పాటు కలిగించింది. అలా గంభీరంగా హుంకారం చేయగలిగినవారు పెద్ద పళువేట్టరయ్యర్ ఒక్కరే. అడ్డుకోజూసిన జ్యోతిష్కుల శిష్యుని పక్కకు తోసేసి లోపలికి వస్తున్నట్లనిపించింది. ఆయన ఎలా ఇక్కడికి వచ్చారు? ఎందుకు వచ్చారు? అదీ ఈ వేళలో...

ఆహా! ఒకవేళ జోస్యం అడిగేందుకే వచ్చారు కాబోలు...! ఆయన జ్యోతిష్కులతో మాట్లాడే మాటలను వింటే ఆయన మనసులో ఉన్నదేమిటో తెలుసుకోవచ్చు. రాజ్యానికి, రాజకులానికి పెద్ద సంకటం ఏర్పడ్డ ఈ సమయాన పెద్ద పళువేట్టరయ్యర్ మనసు పోకడ తెలుసుకొంటే ఎంతో ఉపయోగకరంగా ఉంటుంది. అది తెలుసుకోవడానికి ఇప్పుడు ఒక సదవకాశం దొరికింది. పైగా, తాను, వాణతి ఇక్కడుండడాన్ని చూస్తే ఏమనుకొంటారో, ఏమో? ఏల? తప్పుగానే భావిస్తారు! సందేహం లేదు. కాబట్టి ఆయన కంట పడకుండ దాగి ఉండడమే మంచిది.

కుందవై జ్యోతిష్కులకు సైగతోనే తన ఉద్దేశాన్ని తెలియజేసి, వాణతిని చేయి పట్టుకొని పిలుచుకొని తొందర తొందరగా పక్కగదిలోకి వెళ్ళింది

~

వారు దాక్కొన్న గది తలుపు మూయబడిన తక్షణం పెద్ద పళువేట్టరయ్యర్ లోపల ప్రవేశించారు. గాభరాగా లేచి నిలబడి నమస్కరించిన జ్యోతిష్కులను ఒకసారి పరీక్షగా చూసేసి చుట్టు పక్కల పరికించి చూశారు. ఆయన ముఖంలో ఆశ్చర్యమూ, నిరాశ గోచరించాయి. అది ఒక్క క్షణం మాత్రమే. వెంటనే సర్దుకొని, "జ్యోతిష్కులుగారూ! నేనెవరో తెలుస్తూందా? ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్నే! ఎందుకిలా గుడ్లు మిటకరించి చూస్తున్నారు? అంతగా రూపు మారిపోయానా? మీవల్ల నాకు ఒక ముఖ్యమైన కార్యం కావలసివుంది. మీరు నాకొక పెద్ద ఉపకారం చేయాలి. మొదట, భోంచేసేందుకు ఏదైనా ఉంటే తీసుకురండి. చాల ఆకలిగా ఉంది. భోంచేస్తూనే చెప్పవలసింది చెబుతాను" అన్నారు.

జ్యోతిష్కులు తడబడుతూ, "అయ్యా! ఈ పేదవాడు మీకు చేయగలిగిన సహాయమేముండగలదు? మీరు నా గుడిసె వెతుక్కొంటూ వచ్చిందే నా భాగ్యం. మీ అంతస్తుకు తగినట్లు విందు ఇచ్చేందుకు నా వల్ల కాదు. అయినా కూడ ఈ గుడిసెలో ఉన్నదంతా మీదే. దయచేసి ఆసీనులు కండి. నిలబడే ఉన్నారే? మిమ్మల్ని చూస్తూనే అదిరిపడ్డాను. కాబట్టి మిమ్మల్ని ఉచిత రీతిన ఆహ్వానించి ఉపచారం చేయ మరచాను. అయ్యో! ఈ పేదవాని గుడిసెలో మీరు కూర్చోవడానికి తగిన ఆసనం కూడ లేదు. పెద్ద మనసు చేసి ఆ పీట మీద కూర్చోవాలి" అని చెప్పి కాసేపటి క్రితం కుందవై, వాణతి కూర్చొన్న పీటలను చూపించారు.

పళువేట్టరయ్యర్ ఆ పీటలను, వాటి సమీపాన పడివున్న పూలను పరీక్షగా చూసి, "జ్యోతిష్కులుగారూ! లేదు. నేను కూర్చోనవసరం లేదు. ఏదైన భుజించేందుకు భక్ష, భోజ్యాలుంటే ఆకులో చుట్టివ్వండి. తంజావూరుకు త్వరగా ఒక సందేశాన్ని పంపాలి. నా సహోదరుడు కాలాంతక గండనికి... తాళాపత్రమూ, ఘంటమూ ఇస్తారా? వద్దు! తాళపత్రం రాస్తూ కూర్చోవడానికి సమయం లేదు. నా రాజముద్రపుటుంగరాన్ని ఇస్తాను. దాన్ని తీసుకొని వెంటనే తంజావూరుకు వెళ్ళగలరా? లేక, వాకిట నిలబడ్డాడే, మీ శిష్యుడు, బాగ లావుపాటిగా ఉన్నాడు. వాడిని త్వరగా పంపించగలరా?" అని అడిగారు.

"మీ ఆజ్ఞ ఏమిటో, అలాగే చేస్తాను. నేను, నా శిష్యుడు ఇద్దరూ కావాలంటే వెళతాము. కానీ, ధనాధికారీ! పెద్ద మనసు చేసి ఈ పేదవాడిచ్చే భోజనాన్ని ఆరగించి వెళ్ళాలి!"

"జ్యోతిష్కులుగారూ! ఎందుకు మిమ్మల్ని మీరే పేదవాడని తరచూ చెప్పుకొంటున్నారు? మీ ఇంటిని వెతుక్కొంటూ రాజులు, రాకుమార్తెలు తరచూ రావడం కద్దని విన్నాను. నేనొక్కడినే మీ వద్ద జోస్యం అడిగేందుకు రాని వాడిని. అది తప్పని గ్రహించాను. ఒకవేళ మిమ్మల్ని జోస్యం అడిగివుంటే ఇలా భయంకరమైన విపత్తులు కలగబోయేవి కావేమో..."

"అయ్యో! మీ మాటలు నాకు చాల దిగులును కలిగిస్తున్నాయి. ఏం విపత్తు కలగబోతూంది? ఎవరికి? మిమ్మల్ని ఈ తీరున చూడగానే నేనదిరిపడ్డది సబబే. సుడిగాలిలోను, వరదలోను చిక్కుబడ్డారా? కొళ్ళిడం గట్టు తెగిందని విన్నాను. ఒకవేళ అందువల్ల...! ధనాధికారీ! పళువూర్ యువరాణి క్షేమమే కద?" అని జ్యోతిష్కులు అడగగానే పళువేట్టరయ్యర్ భయంకరంగా నవ్వారు.

"లేదు, లేదు! పళువూర్ యువరాణికి ఏం కాలేదు. ఆమె కొళ్ళిడంలో మునిగి చచ్చిపోలేదు. ఇంతవరకు కడంబూర్ అంతఃపురంలో క్షేమంగానే ఉంటూండాలి. కానీ ఆ ఛండాలి రేపు ఈ సమయం వరకు ప్రాణాలతో ఉంటుందా అని నేను చెప్పలేను. జ్యోతిష్కులుగారూ! మీరు చెప్పగలరా? రాజ కుటుంబాలకు చెందిన జాతకాలన్నీ మీ దగ్గరున్నాయని విన్నాను. అది నిజమా? నందిని జాతకం, నేను ముసలితనంలో బుద్ధి చెడి పెళ్ళాడిన ఆ మోహినీ పిశాచి జాతకం, మీ దగ్గరుందా?"

జ్యోతిష్కులు ఇంకా బెదిరిపోయి, "ధనాధిపతీ! ఏమిటిలా మాట్లాడుతున్నారు? నన్ను శోధిస్తున్నారా? యువరాణి జాతకం నా దగ్గర లేదు. వారు పుట్టిన దినం, వేళ తమరు తెలియజేస్తే జాతకం గణించగలను" అన్నారు.

"వద్దు, వద్దు! నందిని జాతకాన్ని నేనే గణించుకొంటాను. దాని ఆయుష్షును నేనే, నా చేతులతోనే ముగించేందుకు తీర్మానించుకొన్నాను. తక్కినవారి జాతకాల గురించి తెలిస్తే చెప్పండి. చక్రవర్తి ఆయుర్దాయం ఎలా ఉంది? ఆహా! తల ఆడిస్తున్నారు! మీరు చెప్పరు. మిమ్మల్ని నేను శోధిస్తున్నట్లే భావిస్తారు. లేక మీ జ్యోతిష శాస్త్రమే ఒట్టి బూటకమేమో, ఎవరికి తెలుసు...? జ్యోతిష్కులు గారూ! జాతకం అలా ఉండనీ. కొంత కాలంగా ఆకాశంలో కనిపిస్తున్న ధూమకేతువు ఈ ఉదయాన ఆకాశంనుంచి భూమి

మీద పడి మరుగైంది కద, అది మీకు తెలుసా? తెలిస్తే, దాని అర్థమేమని చెప్పగలరా? అది ఏదైనా పెద్ద ఉత్పాతాన్ని సూచిస్తుందా? చక్రవర్తికిగాని, ఆయన కుమారులకు గాని కలగబోయే విపత్తును సూచిస్తుందా? ఇది కూడ మీరు చెప్ప నిరాకరిస్తే మీ జోస్యం ఒట్టి బూటకమే...!"

"ధనాధిపతీ! అలా తీర్మానించకండి. రాజ్యాంగ సంబంధమైన విషయాల్లో జోస్యం చూడకూడదన్నది మా వృత్తి పరంపర సంప్రదాయం. ఈ రోజు ఉదయం ధూమకేతువు పడిపోవడాన్ని నేను కళ్ళారా చూడలేదు. ఏదో జగజ్జ్యోతిర్మయమైన కాంతి కనిపించగానే ఆశ్చర్యంతో బయటకు వెళ్ళి చూశాను. కొన్ని రోజులుగా తోక చిన్నదవుతున్న ఆ తోక చుక్క కనిపించలేదు. ధూమకేతువు కనిపించడం, మాయమవడం రాజకులానికి అదృష్టమని అంటారు. కానీ అది జ్యోతిష్య శాస్త్రానికి చెందినది కాదు. ప్రజల నమ్మకమంతే. అందులో నాకంతగా నమ్మకం లేదు. ఈ రోజు ఉదయాన కూడ చక్రవర్తి క్షేమమే అని తెలుసుకొన్నాను..."

"అది మన అదృష్టమే. ఈ రోజు రాత్రి చక్రవర్తికి ఏమీ కలగకుండాలి. రేపటివరకు ఆయన క్షేమంగా ఉంటే తర్వాత దిగులు లేదు. పొన్నియిన్ సెల్వన్ గురించి ఏమైన తెలుసా...?"

"నిన్న రాత్రి చాల పొద్దుపోయిన తర్వాత యువరాజు తిరువారూరుకు వచ్చి చేరారని విన్నాను. ధనాధిపతీ! వేల, లక్షలమంది ప్రజలు ఆయన చుట్టూ గుమిగూడి వస్తున్నారట. ఆయన ఇష్టానికి విరుద్ధంగా ఆయనను తంజైకి పిలుచుకొని వస్తున్నారట..."

"ఆహా! వారి ప్రయత్నం ఫలించి వారు గనక యువరాజును తంజావూరుకు తీసుకొని వచ్చి చేర్చేస్తే ఎంతో మంచిది. కానీ వీలవుతుందా? లక్షలకొద్ది ప్రజలు చుట్టూ గుమిగూడి ఉన్నా కూడ యముడిని అడ్డుపడి ఆపగలమా? చెప్పండి, జ్యోతిష్కులుగారూ, చెప్పండి! మీరు జోస్యం చెప్పకపోయినా నేను చెబుతాను. చక్రవర్తికి, అయన ఇద్దరు కుమారులకీ నేడు పెద్ద గండం ఉంది. యమధర్మరాజు వారిని సమీపిస్తున్నాడు. చక్రవర్తి యముడు పళువూర్ అంతఃపురానికి చెందిన బొక్కసపు నేలమాళిగలో దాక్కొనివున్నాడు. అరుళ్మొళి వర్మ యముడు ఏనుగు మావటి అంకుశంలో దాక్కొనివున్నాడు. వారిద్దరికీ అడ్డుపడి ఆపి, చక్రవర్తిని, పొన్నియిన్ సెల్వన్ని కాపాడడం మీ బాధ్యత. నా రాజముద్ర ఉన్న ఉంగరాన్ని తీసుకొని మీ శిష్యుడు తంజావూరుకు వెళ్ళనీ. మీరు తిరువారూరుకు వెళ్ళి యువరాజును హెచ్చరించాలి. చేస్తారా? వెంటనే బయల్దేరుతారా?"

జ్యోతిష్కులు తత్తరపడిపోయారు. పళువేట్టరయ్యర్కి చిత్తభ్రమ కలిగిందా అన్న సందేహం ఆయన మనసులో తోచింది. కానీ అలా కూడ నిశ్చయంగా చెప్ప వీలుకాదు. అయన చెబుతున్నదంతా హేతుబద్ధంగానే ఉంది. ఆక్రోశంతోను, గాభరాతోను మాట్లాడినా కూడ, నిజం చెబుతున్నట్లే తోస్తూంది. ఈ మాటలన్నీ యువరాకుమారి కూడ వింటూంటారు. వారి ఆలోచన కూడ తెలుసుకోవాలి. ఎలాగైన ఈ ముసలాయన్ను ఇక్కడినుంచి పంపించేయాలి.

"దుర్గాపరమేశ్వరి దయవల్ల మీ ఆజ్ఞను నా చేతనైనంతవరకు నెరవేరుస్తాను!"

~

జ్యోతిష్కులు ఇలా చెప్పినప్పుడు లోపలి గదినుంచి అమ్మాయిల కాలి గజ్జెల శబ్దం వినిపించింది.

"ఆహా! దుర్గాపరమేశ్వరి తన కాలి గజ్జెలు శబ్దం చేసి కరుణిస్తూంది. ఇక నేను కడంబూరుకు వెనుదిరగవచ్చు. ఇదిగో బయలుదేరుతున్నా..."

"ధనాధిపతీ! ఆకలేస్తుందన్నారు కద? ఈ పేదవాని ఇంట భోజనమారగించి..."

"లేదు, లేదు! నా ఆకలంతా ఎగిరిపోయింది. నేనూ కడంబూరుకు ఎగిరి వెళ్ళాలి. ఆలయం పక్కన ఒక రథం ఉంది కద, అది ఎవరిది జ్యోతిష్కులు గారూ? దాన్ని నేను తీసుకొని వెళ్ళబోతున్నాను. కొళ్ళిడం నదీ తీరాన్ని చేరిన వెంటనే దాన్ని తిప్పి పంపించేస్తాను, పడవను మాత్రం తీసుకొని..."

"అయ్యా! ఆ రథం...ఆ రథం... నా పైన దయవుంచి ఆ రథాన్ని తీసుకొని వెళ్ళకండి..."

"జ్యోతిష్కులుగారూ! మీరు అనవసరంగా దిగులుపడుతున్నారు. చోళ సామ్రాజ్యపు పట్టపు యువరాజు ప్రాణాలను కాపాడేందుకు నేనా రథాన్ని తీసుకొని వెళ్ళబోతున్నాను. దుర్గాదేవే అందుకు సమ్మతిస్తుంది. మళ్ళీ కాలి గజ్జెల శబ్దం వినిపించి కరుణిస్తే, సమ్మతం కలిగిందని తెలుసుకొంటాను.. అదిగో, వినండి!"

ఇలా పెద్ద పళువేట్టరయ్యర్ చెబుతుండగానే, యువరాకుమారి కుందవై పక్క గది తలుపును తెరుచుకొని మెత్తగా కాలి గజ్జెల శబ్దం చేయగా నడిచి వచ్చింది.

"తల్లీ! నేనూహించింది సరిపోయింది. పక్కగదిలో ఉన్నది నీవేనని తలచాను. నీ ముఖాన్ని చూసేందుకు నాకు ధైర్యం చాలలేదు. అందుకే నీ చెవిన పడనీ అని ఇంత పెద్దగా మాట్లాడాను. జ్యోతిష్కులకు నేను చెప్పిందంతా నీవు విన్నావు కద?"

"అయ్యా! క్షమించాలి. నేను చేసిన తప్పుకు మన్నించాలి. మీరు ఉన్నట్లుండి ఈ ఇంట ప్రవేశించినప్పుడు అది మీరేనని నిర్దుష్టంగా తెలియకపోవడం వల్ల, మీ మాటలను పక్కగదిలో దాక్కొని వినవలసివచ్చింది. క్షమించాలి!" అన్నది కుందవై.

"తల్లీ! నేను నిన్ను క్షమించేందుకు ఏ కారణమూ ఏర్పడలేదు. నిన్నే నేను క్షమాపణ కోరుకోవాలి. అందుకు నేను అర్హుడనేనా అని సందేహపడుతున్నాను. ఈ రాత్రి లోపల కడంబూరుకు చేరి, పట్టపు యువరాజుకు ఏ ఆపదా కలగకుండ అడ్డుకోగలిగితే, నీ వద్ద మన్నింపు కోరేందుకు అర్హత పొందుతాను. మూడేళ్ళుగా ఈ ముసలాడి కళ్ళు మోహాంధకారంతో మూసుకుపోయాయి. నా కళ్ళను తెరిపించేందుకు నీవెంతో ప్రయత్నించావు. ఎన్నో సూచనలు చేశావు. ఏవీ నా తలకెక్కలేదు. నిన్న రాత్రి దుర్గాపరమేశ్వరి కరుణ వల్ల, పాండ్యదేశపు ఇద్దరు కుట్రదారుల సంభాషణను రహస్యంగా వినగలిగాను.

దాని ఫలితంగానే నిజాన్ని తెలుసుకొన్నాను. ఆ ఛండాలిని నందినిని, ఆ విషసర్పాన్ని, నా అంతఃపురంలోనే ఉంచుకొని పాలుపోసి పెంచాను. ఆమె నన్ను కులద్రోహిని చేసింది; రాజద్రోహిని చేసింది. చోళనాడు బొక్కసం నుంచి ధనాన్ని దొంగిలించి పాండ్యదేశపు కుట్రదారులకందజేసింది. ఆ పాతకి నందినిని ఈ రాత్రి గడిచేలోపు నా చేతులతోనే చంపకపోతే నా మనసులో రగులుతున్న నిప్పు ఆరదు..."

~

ఇలా పళువేట్టరయ్యర్ చెప్పుకొచ్చినప్పుడు ఆయన ఏ మాత్రం ఊహించని, ఎవరూ ఎదురు చూడని ఒక కార్యాన్ని కుందవై చేసింది. ఉన్నట్లుండి ఆయన కాళ్ళమీద పడి దండం పెట్టింది. పళువేట్టరయ్యర్ ఏం చేయాలో తోచక నిశ్చేష్టుడై నిలబడ్డప్పుడు, యువరాకుమారి లేచి నిలబడి, "అయ్యా! నాకు ఒక వరమిచ్చి కరుణించాలి!" అన్నది.

"రాకుమారీ! నన్ను శోధిస్తున్నావులాగుంది. వద్దు! నా పాప కృత్యాలు ఎంత భయంకరమైనవో గ్రహించాను. వాటికి ప్రాయశ్చిత్తం ఎలా చేయాలా అని ఆలోచిస్తున్నాను. దానికి ముందు, నేటి గండం నుంచి చోళకులపు ముగ్గురు ప్రముఖులను కాపాడే తీరాలి. నీ తండ్రికి, సహోదరులకు, ఎలాంటి హాని కలగకుండాలి. అందుకు నాకు సహాయం చేయి. ఈ ఒక్కరోజు గడవనీ. రేపు నేనే నీవద్దకు వచ్చి, 'నాకు శిక్ష ఏమి? ప్రాయశ్చిత్తం ఏమి?' అని అడుగుతాను!" అన్నారు.

"అయ్యా! మీకు శిక్ష విధించేందుకుగాని, ప్రాయశ్చిత్తం చెప్పేందుకుగాని నేను ముందడుగు వేయను. మీరు నా తాతగారి స్థానంలో ఉన్నారు. నా తండ్రి గౌరవానికి పాత్రులు. నిజంగానే మిమ్మల్ని ఒక వరం కోరుతున్నాను..."

"అలాగైతే వెంటనే అడుగమ్మా! ఒట్టి మాటలు మాట్లాడేందుకు ఇప్పుడు సమయం కాదు!"

"వరమిస్తానని వాక్కివ్వండి!"

"నీకూ, నీ కుటుంబానికీ నేను చేసిన ద్రోహానికి, నేను చేయగలిగినది ఏదీ సాటిరాదు. నీవేదడిగినా ఇస్తాను. త్వరగా అడుగమ్మా!"

"యువరాణి నందినికి మీరేమీ హాని చేయరని మాటివ్వండి. అదే నేను కోరుకొనే వరం!"

"అమ్మా! ఆటలాడేందుకు ఇదేనా తగిన వేళ? నా ముదుసలి ప్రాయంలో నా బుద్ధి చెడింది నిజమే. అందుకని నన్ను పూర్తి పిచ్చివాడిని చేయాలనుకొంటున్నావా? ఆ కుట్రదారిణికి నేను తగిన శిక్ష విధించకపోతే, తక్కిన కుట్రదారులను ఎలా శిక్షించ సాధ్యం? దాన్ని నా చేతులతోనే చంపేసే తదుపరి కార్యం చూస్తాను. నా మనసులో ఉన్నదంతా చెప్పేసి, ఈ ముసలాడిని అది చివరిదాక మోసం చేయలేకపోయిందన్న విషయాన్ని ఎత్తి చూపించేసి, దాన్ని నా కత్తితోనే నరికి చంపేస్తాను. దానికి తక్కువైన ఏ శిక్ష విధించినా నేను న్యాయం చేసినవాడిని కాజాలను. దాని తర్వాత, నాకు తగిన శిక్షేమిటే ఆలోచిస్తాను. వెళ్ళమ్మా, వెళ్ళు! నీ తండ్రిని, నీ తమ్ముని ఈ రోజు రాబోయే గండం నుంచి

కాపాడుకోవడానికి తగిన ప్రయత్నాలు చేయి...!"

"చేస్తానయ్యా! కానీ నా సహోదరిని కాపాడేందుకు కూడ ప్రయత్నం చేయవద్దా? యువరాణి నందిని నా సహోదరి. ఆమెకు మీరు ఏ హాని కలిగించినా, అది కూడ చోళకులానికి ద్రోహమవుతుంది!"

పళువేట్టరయ్యర్ అంతులేని ఆశ్చర్యసముద్రంలో మునిగిపోయారు. "నేనింకా కలగంటున్నానా?" అని ఆయన పెదవులు గొణిగాయి.

"లేదు, లేదు! మీరు కలగనడం లేదు. మీరు వింటున్నదీ, చూస్తున్నదీ నిజమే. కాస్త ఆలోచించి చూడండి. పాత సంభవాలను గుర్తు తెచ్చుకోండి. నా తమ్ముడు అరుళ్మొళిని కావేరి నదిలో మునిగిపోకుండ ఒక స్త్రీమణి కాపాడిన విషయం గుర్తుందా? ఆమే యువరాణి నందిని తల్లి. యువరాణిని మీరు పెళ్ళి చేసుకొని అంతఃపురానికి పిలుచుకొని వచ్చిన రోజున మా తండ్రి తెలివి తప్పి పడిపోయిన విషయం గుర్తుందా? యువరాణి తల్లిని చూస్తున్నట్లు భావించడం వల్లనే చక్రవర్తి స్పృహ తప్పారు. ఆమె చనిపోయిందని చాల కాలం నమ్మారు. కాబట్టి యువరాణిని చూడగానే తెలివి తప్పారు...."

పళువేట్టరయ్యర్కి ఇంకొన్ని సంఘటనలు కూడ గుర్తొచ్చాయి. మధ్యరాత్రి నందినిని తీసుకొని వెళ్ళి సుందర చోళ చక్రవర్తి ముందు నిలబెట్టింది, ఆమెను చూసి చక్రవర్తి కేకలు వేసింది, దానికి నందిని కల్పించి చెప్పిన కారణాలు ఆయనకప్పుడు జ్ఞాపకం వచ్చాయి.

"తల్లీ! నీవు చెబుతున్నది వినోదం కాదని గ్రహిస్తున్నాను. విధివిలాసమే చాల విచిత్రంగా ఉంది. యువరాణి నీ సహోదరి అంటే, ఆదిత్య కరికాలన్‌కి కూడ సహోదరే. ఈ సంబంధం నీకు మాత్రమే తెలుసా? ఇంకెవరికైనా తెలుసా? చక్రవర్తికి తెలుసా?"

"చక్రవర్తి రెండు రోజుల క్రితం వరకు నా పెద తల్లి చనిపోయిందనే భావిస్తూ వచ్చారు. మొన్న ఆయన ముందుకు వచ్చినప్పుడు కూడ దీపం తీసి విసిరారు. తర్వాతే నమ్మారు..."

"దాని గురించి అడగలేదమ్మా! యువరాణి తన సహోదరి అన్న విషయం కరికాలన్‌కి తెలుసా?"

"అతడికి ఇప్పటికి తెలిసివుండాలి. అతడికి వాణర్ కుల వీర యువకుడొకరి ద్వారా తాళపత్రం పంపించాడు. ఆయనకు నేను చెప్పి పంపించాను..."

"ఆహా! వంతిదేవుని సూచిస్తున్నావు కాబోలు!"

"అవునయ్యా!"

"అతడు కరికాలన్‌కి చెప్పివుంటాడనిపించడం లేదు. చెప్పినా కరికాలన్ నమ్మివుండడు. నాకే నమ్మకం కలగలేదు కద? వాడెలా నమ్ముతాడు? యువరాణికి ఈ వార్త తెలియ సాధ్యంలేదు. తెలిసినా ప్రయోజనం లేదు. కుట్రదారులు ఇంకో విధంగా తమ ఉద్దేశాన్ని నెరవేర్చుకోజూస్తారు. ఈ రాత్రి అందుకు తప్పక ప్రయత్నం చేస్తారు. అమ్మా! నీవు తెలియజేసిన సంగతి నా బాధ్యతను ఇంకా భయంకరం చేసింది.

యువరాణి నందిని సహోదర హత్య చేయకుండ చూసే బాధ్యత నా మీద ఉందిప్పుడు. నేను వెంటనే కడంబూరుకు వెళతాను. మీరు వచ్చిన రథాన్ని తీసుకొని వెళతాను. చక్రవర్తికి, పొన్నియిన్ సెల్వన్కి ఏమీ కాకుండ కాపాడడం నీ బాధ్యత!" అన్నారు.

"అయ్యా! మీరు దిగులు పడకండి. నేను ఇదిగో, ఇప్పుడే తంజావూరుకు బయలుదేరుతున్నాను. పళైయారైనుంచి వాహనం తెప్పించుకొని వెళతాను. పొన్నియిన్ సెల్వన్ గురించి దిగులు పడనవసరం లేదు. వాడు పుట్టిన రోజు, వేళ వాడిని కాపాడుతాయి!" అన్నది కుందవై.

"అమ్మాయీ! జ్యోతిష్యాన్ని నమ్మి అజాగ్రతగా ఉండకు! జ్యోతిష్కులు మనసులో నిజం తెలిసినా, బయటకు చెప్పరు! రెండర్థాలు ధ్వనించేలా ఏదైనా చెబుతారు. కార్యం జరిగిన తర్వాత, 'ముందే చెప్పలేదా?' అంటారు. జ్యోతిష్యాన్ని నమ్మినా కూడ జ్యోతిష్కులను నమ్మకూడదు!" అని వెళుతూ వెళుతూ ఒక వాగ్బాణాన్ని వదిలి వెళ్ళారు పళువేట్టరయ్యర్.

ఆయన బయటకు వెళ్ళిన కొన్ని క్షణాలకల్లా ఆళ్వార్ కట్టియాన్ లోపల ప్రవేశించాడు.

"అవునవును! ధనాధికారి చెప్పింది నేను ఆమోదిస్తాను. జోస్యాన్ని నమ్మినా, జ్యోతిష్కులను నమ్మనే నమ్మకూడదు!" అన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 14

## వాణతి చేసిన శపథం

**ఉన్నట్లుండి** ప్రవేశించిన ఆళ్వార్ కట్టియాన్ని చూసి కుందవై, "తిరుమలై! నీవెలా ఇక్కడికి వచ్చావు? ఎందుకని?" అని అడిగింది.

"అమ్మా! అంతా ఈ జ్యోతిష్కుల మోసపు మాటలవల్లనే! ఈ రోజు పొద్దున ఈయనను, 'నేను వెళ్ళే కార్యం విజయవంతంగా జరుగుతుందా?' అని అడిగాను. 'జరుగుతుంది' అన్నారు. కానీ ఈ చోటు దాటి కాస్త దూరం కూడ పోలేకపోయాను. కార్యమెలా విజయవంతంగా జరుగుతుంది? అందుకే కాసేపటి క్రితం పళువేట్టరయ్యర్ చెప్పింది నేనొప్పుకొంటాను - జోస్యాన్ని నమ్మినా, జ్యోతిష్కులను నమ్మకూడదని. ఈయన నన్ను కావాలనే మోసగించారా అని తెలుసుకోవడానికే వచ్చాను. పళువేట్టరయ్యర్ గొంతు వినగానే నా సందేహం బలపడింది. కానీ నేను మిమ్మల్ని ఇక్కడ ఎదురుచూడనే లేదు' అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"నన్ను నీవిక్కడ ఎదురుచూసి ఉండడం అసాధ్యమే. నీవెందుకు వచ్చావు? ఏ కార్యం విజయవంతమవుతుందా, లేదా అని జ్యోతిష్కులను అడిగావు? రహస్యమేమీ కాదు కద?" అన్నది యువరాకుమారి.

"మీకు తెలియకూడని రహస్యమేముండగలదు? చక్రవర్తి ఆజ్ఞ మేరకు ముఖ్యమంత్రి నిన్న రాత్రే నన్ను నాగపట్టణం వెళ్ళమని పురమాయించారు - యువరాజును వెంటడే పిలుచుకొని వచ్చేందుకే. దారిన శెంబియన్ మహాదేవికి ఒక తాళపత్రాన్ని ఇచ్చి వెళ్ళమని కూడ పురమాయించారు. మీరు ఎప్పుడు తంజావూరు నుంచి బయలుదేరారు, దేవీ?"

"పొద్దు పొడిచిన కాసేపటికల్లా బయల్దేరాను. ఎందుకడుగుతున్నావు, తిరుమలై?"

"కొడుంబాళూర్ సైన్యాలు తంజావూరు కోటను చుట్టుముట్టేశాయా అని తెలుసుకోవడానికే అడిగాను..."

"ఏమి? ఏమి?"

"అవును, దేవీ! మీకు తెలియదా, ఏమి? నిన్న రాత్రి చక్రవర్తిని చూసిన తర్వాత ముఖ్యమంత్రి తమ మాళిగకు తిరిగి వచ్చినప్పుడు ఆయన కోసం రెండు సందేశాలు వేచివున్నాయి. ఒకటేమో, నాగపట్టణం నుంచి యువరాజు బయలుదేరి వస్తున్నారని, మహాజనకూటమి ఆయన చుట్టూ చేరి ఆయనతోనే వస్తున్నారనీను..."

"అది నేను కూడ ఇవాళ ఉదయాన తెలుసుకొన్నాను. నా తమ్ముడికి ఇక్కడే అడ్డుపడి నిలిపేసుకోవడానికే బయలుదేరి వచ్చాను. ఇంకొక సందేశం వచ్చిందన్నావు కద, అదేమి?"

ఆళ్వార్ కట్టియాన్ వాణతిని చూస్తూ, "అమ్మా! ఈ కొడుంబాళూర్ రాకుమారిని మీతో ఎందుకు పిలుచుకొని వచ్చారు?" అని అడిగాడు.

"ఆమె ఎప్పుడూ నాతో వచ్చేలాగ ఇప్పుడూ వచ్చింది; పిలుచుకొని వచ్చాను. ఎందుకని అడుగుతున్నావు?"

"రెండో సందేశాన్ని ఈ రాకుమారి ఇక్కడున్నప్పుడు చెప్పడానికి కాస్త సందేహించవలసి వస్తూంది."

"చెప్పు, తిరుమలై! ఈమె నాకు ఎంత అంతరంగ స్నేహితురాలన్న విషయం నీకు తెలియదా? నాకు తెలియగల విషయమేమైనా ఈమె కూడ తెలుసుకోవచ్చు."

"అయినా కూడ ఈ రాకుమారికి సంబంధించిన కార్యమది. దక్షిణ సైన్యాధిపతి ఒక మహాసైన్యన్ని తీసుకొని తంజావూరును సమీపిస్తున్నారని నిన్న రాత్రి ముఖ్యమంత్రికి వార్త అందింది. సేనాధిపతినుంచి ముఖ్యమంత్రికి ఒక తాళపత్ర సందేశం కూడ అందింది. చక్రవర్తిని తంజావూరు కోటలోను, చిన్న యువరాజును ఏదో ఒక రహస్యప్రదేశంలో పళువేట్టరయ్యర్లు చెరపట్టి ఉంచారని ఆరోపించబడివుంది. పళువేట్టరయ్యర్లు ధనాధికారి బాధ్యతను, కోట కాపలాను వెంటనే విడిచిపెట్టి పైదొలగాలని, యువరాజును తీసుకొచ్చి ఒప్పజెప్పాలని రాసివుంది. లేకపోతే ఈ రోజు సాయంత్రంలోపు తంజావూరు కోట ముట్టడింపు ప్రారంభమవుతుందని రాయబడిండా పత్రంలో. అమ్మా! తంజావూరుకు దక్షిణంగాను, పశ్చిమంగాను ఇప్పడికే కొడుంబాళూర్ సైన్యాలు సమీపించేశాయి కద, మీకు తెలియదా?"

"తెలియదు. ముఖ్యమంత్రి దీని గురించి నాకొక్క మాట కూడ చెప్పలేదే?"

"చెప్పివుంటే బహుశ మీరు తంజావూరు కోటను విడిచి బయలుదేరేవారు కారు. ముఖ్యంగా, కొడుంబాళూర్ రాకుమారిని వెంటనే బయటకు తీసుకొని రావాలని ముఖ్యమంత్రి ఆశించి ఉండవచ్చు...."

"అదేల? ఈమె అక్కడుంటే ఆమెకు ఏం ఆపద కలుగుతుంది?"

"ఈ రాకుమారిని చిన్న పళువేట్టరయ్యర్ పట్టి చెరలో వేసినా వేయవచ్చు..."

"అంతటి తెగింపు ఆయనకుందా? నిజంగానే నీవిది చెబుతున్నావా?"

"అవును, దేవీ! దక్షిణ సేనాధిపతి ఇంకా ఏం చెప్పి పంపారో వింటే మీరే తెలుసుకొంటారు..."

"ఏమది? ఇంకా ఏం చెప్పి పంపారు?"

"యువరాజు అరుళ్మొళి వర్మకు, కొడుంబాళూర్ రాకుమారి వాణతికి వెంటనే పెళ్ళి జరిపించాలి. ఆదిత్య కరికాలన్ తమకు రాజ్యం వద్దని చెప్పడం వల్ల అరుళ్మొళి వర్మకే తదుపరిగా పట్టానికి అర్హులుగా యువరాజు పట్టాభిషేకం చేయాలని కూడ అడుగుతున్నారు. దీనికంతటికీ ఒప్పుకోకపోతే తంజావూరు

కోటను మూడేరోజుల్లో నేలమట్టం చేస్తానని చెప్పి పంపారు. చోళనాడు ప్రజలు తమను ఆదరిస్తున్నారని కూడ తెలియజేశారు...."

~

ఇదంతా వింటున్న వాణతి, "అక్కా! మా పెదనాన్నకు ఉన్నట్లుండి పిచ్చిగాని పట్టిందా, ఏమి?" అని ఉద్రేకంతో అడిగింది.

"ఏం వాణతీ అలా అంటున్నావు? చాల కాలంగా పలువురి మనసుల్లో ఉంటూ వస్తున్న విషయాన్నే ఆయన బహిరంగపరిచారు. పళువేట్టరయ్యర్లు మధురాంతకునికి పట్టం కట్టాలని ప్రయత్నాలు మొదలుపెట్టడం వల్ల కొడుంబాళూర్ రాజుగారు, తిరుక్కోవలూర్ మలైయమాన్ ఇలా బహిరంగంగా చెప్పనారంభించారు..."

"అవును, తల్లీ! తిరుక్కోవలూర్ మలైయమాన్ కూడ ఒక పెద్ద సైన్యంతో కడంబూర్ కోటను సమీపిస్తుంటారు. నాతో ఆయన మాట్లాడిన తీరునుంచే నేనలా ఊహించాను. ముఖ్యమంత్రికి కూడ వార్త అందింది..."

"కానీ నేనిప్పుడు తెలుసుకొన్న సంగతులు వారిద్దరికీ తెలియదు. వారిద్దరితోటి నేను మాట్లాడి అంతర్యుద్ధం జరగకుండ అడ్డుపడి ఆపాలి. ఎలా చేయబోతున్నానో తెలియడం లేదు..."

"తల్లీ! ఇప్పుడు పరిస్థితి చాల ముదిరిపోయింది. ఇక మీద ఒక పెద్ద భారత యుద్ధమే జరిగి తీరుతుందనిపిస్తూంది..."

"దీన్ని నీవు మహాభారత యుద్ధంతో పోల్చింది చాల సమంజసం, తిరుమలై! ఇప్పుడు యుద్ధం జరిగితే, అది సహోదరుల మధ్య జరిగే యుద్ధమే అవుతుంది. బంధువులు, తోబుట్టువుల మధ్య జరిగే సర్వనాశన యుద్ధమవుతుంది. వాణతీ! ఇది విను! నా తాతగారి తండ్రి, పేరుగాంచిన పరాంతక చక్రవర్తి, పళువేట్టరయ్యర్ రాకుమారిని పెళ్ళాడారు. ఆయన కుమార్తె - నా చిన్నవ్వ – కొడుంబాళూర్ రాజును పెళ్ళాడింది. నా తాతగారు అరింజయులు కొడుంబాళూర్ రాకుమారిని పెళ్ళాడారు. నా తండ్రేమో మలైయమాన్ పుత్రికను వివాహమాడారు. ఇలా ఈ మూడు కులాల రాజులు మా చోళకులంతో దగ్గరి సంబంధం కలిగినవారు. అయినా కూడ వారిప్పుడు కక్షతో యుద్ధానికి సిద్ధమై వస్తున్నారు! ఈ విధిని ఏమని చెప్పడం? - వీరి దెబ్బలాట వల్ల చోళరాజ్యమే తుడిచిపెట్టుకుపోతుంది కాబోలు..."

"అక్కా! నాకు దాని గురించంతా దిగుల్లేదు. వారెలాగైనా దెబ్బలాడుకొని చావనీ. కానీ ఇందులోకి నా పెదనాన్న నాపేరెందుకు లాగాలి? వెంటనే తిరిగి వెళ్ళి నా పెదనాన్నను చూసి, ఆయనతో దెబ్బలాడాలనుంది..."

"దాని వల్ల ప్రయోజనమేమి, ముద్దూ! నీవు చెప్పేది నీ పెదనాన్న వినరు. నీవూ, నేనూ చేరి బతిమాలుకొన్నా ప్రయోజనముండదు. చిరుప్రాయపు అమ్మాయిలమైన మన మాటలను నీ

పెదనాన్నవంటి ముసలివాళ్ళు పట్టించుకోరు. నా తమ్ముడు అరుళ్మొళి వర్మ మూలంగానే ఈ యుద్ధాన్ని ఆప సాధ్యం. తిరుమలై! వెళ్ళినవాడివెందుకు తిరిగివచ్చావు? అరుళ్మొళి ఇప్పుడెక్కడున్నాడు?"

"తిరువారూరు నుంచి నిన్న రాత్రే బయలుదేరాలని నిశ్చయించినట్లు వార్త. కానీ దారి పొడుగునా వరదమయంగా ఉండడం వల్ల రాలేకపోయారట. నేను కూడ పళైయార్రై దాటి అవతలికి వెళ్ళజూసి, వీలుపడక తిరిగి వచ్చాను. కుడమురుట్టి నది గట్టు తెగి ఒకే సముద్రంలాగుంది..."

"ఎలాగూ వరద తగ్గుతుంది. ఆ తర్వాత అరుళ్మొళి ఈ దారినే కద రావాలి? అంతవరకు వేచివుండవలసిందే. అంతలోపల తంజావూరులో ఏదైనా విపరీతం జరిగిపోతుందేమోనని భయంగా ఉంది. తిరుమలై! నీవు వెంటనే తంజావూరుకు తిరిగి వెళ్ళి కొడుంబాళూర్ రాజుగారికి నేనిచ్చే సందేశాన్ని అందించగలవా? అరుళ్మొళి వచ్చేవరకు తంజావూరు కోటను ముట్టడించవద్దని తెలియజేస్తావా?"

"అక్కా! నేనూ వీరితో తంజావూరుకు వెళ్ళనా?"

"నీవు ఈ మనిషితో వెళ్ళి ఏం చేస్తావు, బంగారూ?"

"వెళ్ళి నా పెదనాన్నతో దెబ్బలాడుతాను..."

"ఏమని దెబ్బలాడుతావు? నీ మాట విని ఆయన యుద్ధం విరమించికొంటారా?"

'యుద్ధాన్ని ఆపితే ఆపనీ; లేకపోతే ఎలాగైనా నాశనమైపోనీ. కానీ నా పేరును ఇందులోకి ఎందుకు లాగారని దెబ్బలాడుతాను..."

"నీపేరు లాగారా? అదెలా?"

"కాసేపటి క్రితం ఈ వీర వైష్ణవులు చెప్పింది మీరు వినలేదా, అక్కా?" అని చెప్పేసి వాణతి సిగ్గుతో తలవంచుకొంది.

"నీ గురించి ఎవరేం చెప్పారు? తిరుమలై! నీవీ అమ్మాయి గురించి ఏం చెప్పావు?"

"వీరిని పొన్నియిన్ సెల్వన్‌కిచ్చి పెళ్ళి చేయాలని సేనాధిపతి నొక్కి వక్కాణించారని చెప్పాను కద? బహుశ దాన్నే సూచిస్తున్నారు కాబోలు!"

"వాణతీ! దానికి నీ ఆక్షేపణ ఏమి? పొన్నియిన్ సెల్వన్ని పెళ్ళి చేసుకోవడం నీకిష్టం లేదా?"

"ఇష్టముందో లేదో, దాని గురించి ఇప్పుడేం మాటలు? పెళ్ళి విషయం, పట్టం విషయం రెండు చేర్చి ప్రస్తావించారు కద? దాన్నే నేను ఆక్షేపిస్తున్నాను. నన్ను చోళ సింహాసనం మీద కూర్చోబెట్టేందుకే నా పెదనాన్న ఈ యుద్ధాన్ని ప్రారంభిస్తున్నారని కద అర్థం వస్తుంది?"

ఈ సమయాన ఒక అమ్మాయి గొంతు, "కొడుంబాళూర్ రాకుమారికి సింహాసనమెక్కడమంటేనే అయిష్టం కాబోలు!" అన్నది. అందరూ ఆ గొంతు వినిపించిన వైపు చూశారు. అక్కడ పడవ నడిపే పిల్ల పూంగుళలి నిలబడివుంది.

~

కుందవై ఆమెను ఆశ్చర్యంతో చూస్తూ, "అమ్మాయీ! నీవిక్కడికి ఎలా వచ్చావు? నీవు, లంకారాణి కనిపించక మేమంతా ఎంత గాభరా పడ్డామో తెలుసా? నీ అత్త ఎక్కడ?" అని అడిగింది.

"దేవీ! క్షమించాలి! నన్ను నా అత్త పళువూర్ అంతఃపురం సొరంగమార్గం గుండా లాక్కొని వచ్చి కోట బయటకు పంపించేసింది. నేను తంజావూరు అంతఃపురంలో ఒక్కరోజుండడం కూడ నా అత్తకు ఇష్టం కాలేదు! నాకూ అంతఃపుర జీవితం అంతగా నచ్చలేదు నిజమే! కొడుంబాళూర్ రాకుమారికి సింహాసనమంటేనే విసిగిపోయినప్పుడు నాలాంటి మామూలు మనుషులకు అంతఃపురంలో జీవించడం ఎలా నచ్చుతుంది?" అన్నది పూంగుళలి.

"అమ్మాయి! నేనొకటడిగితే నీవింకేమో చెబుతున్నావు కద? నీ చిత్తం సరైన స్థితిలో లేనట్లుంది!" అన్నది కుందవై.

"అక్కా! ఆమె చిత్తం స్థితంగానే ఉంది. నన్ను హేళన చేసేందుకే ఇలా మాట్లాడుతూంది. నేను చోళనాడు సింహాసనమెక్కి మహారాణి కావాలని ఆశపడుతున్నానట! అందుకే తమ తమ్ముడిని - పొన్నియిన్ సెల్వన్ని - పెళ్ళాడగోరుతున్నానట! ఈమె మనసు నాకు బాగ తెలుస్తూంది!" అన్నది వాణతి.

"పాము కాలు పాముకు తెలుస్తుందన్న సామెత తప్పవుతుందా?" అన్నది పూంగుళలి.

"అమ్మాయిలూ! ఆపండి! ఏ సమయంలో ఏం మాట్లాడాలో తెలియడం లేదు మీకు. పూంగుళలీ! ఇప్పుడు నీ అత్త ఎక్కడుంది?" అని అడిగింది కుందవై.

"పళువూర్ మాళిగకు చేరిన బొక్కసపు నేలమాళిగలో ఉంది."

"ఎందుకని?"

"అక్కడ ఎవడో ఒక హంతకుడు చేత శూలంతో దాక్కొనివున్నాడు. ఆహ్! వాడిని మేమిద్దరం ఇవాళ ఉదయం పెట్టిన తిప్పలు గుర్తు చేసుకొంటే...! మా ఇద్దరినీ రెండు ఆడ పిశాచాలనుకొని వాడు బెదిరిపోయి అటూ ఇటూ పరుగెత్తిన విషయాన్ని తలుచుకొంటే...!" అని చెప్పేసి పూంగుళలి గలగల నవ్వింది.

~

ఈ పిల్లకు ఖచ్చితంగా చిత్తం భ్రమించిందని నిశ్చయించుకొని కుందవై, "తర్వాత చెప్పు! వాడెవడు? ఎందుకని అక్కడ దాక్కొనివున్నాడు? మీకదెలా తెలిసింది?" అని అడిగింది.

"అదంతా నాకు తెలియదు, దేవీ! నా అత్త మూగది, చెవిటిది కావచ్చు. కానీ మనందరికీ తెలియని విషయాలను తెలుసుకోగల విచిత్రమైన శక్తివుంది ఆమెకు. అంతఃపురంలో ఉన్నవారెవరినో చంపేందుకే వాడక్కడ దాక్కొని ఉన్నాడని తెలుసుకొంది. దేవీ! పది తలల రావణుని చేతులను విరిచేందుకు నా అత్త ప్రయత్నించింది కద? అదెందుకో తెలుసా?"

"తెలియదు. నీకు తెలిస్తే చెప్పు!"

"నా అత్త రావణుని చేతులను జరిపేందుకు ప్రయత్నించినప్పుడు మీరందరూ ఆమెకు పిచ్చి పట్టిందనుకొన్నారు. కానీ నా అత్త పిచ్చిదికాదు. ఆ రావణుని చేతుల మధ్యనుంచే పళువేట్టరయ్యర్ బొక్కసపు నేలమాళిగకు వెళ్ళే సొరంగ మార్గముంది..."

"ఆహ్! అలాగా!" అని ఆశ్చర్యపడింది కుందవై.

"ఈలం మూగరాణి చక్రవర్తి అంతఃపురానికెలా వచ్చిందని ఇప్పుడు తెలుస్తోంది!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఇంతకాలమూ అంతఃపురంలో ఉన్న మనకు అలాంటి సొరంగమార్గముందని తెలియకుండ పోయిందే! అదలా ఉండనీ! నీవెందుకు వెంటనే అంతఃపురానికి వచ్చి మాకిదంతా చెప్పలేదు? నీ అత్తను ఒంటరిగా వదిలేసి ఎందుకిలా వచ్చావు?" అన్నది యువరాకుమారి.

"అత్త పిడివాదమే / హఠమారితనమే కారణం. అక్కడ దాక్కొన్న వాడిని తాను చూసుకొంటానని చెప్పి నన్ను బయటకు పంపేసింది!"

"ఎందుకు? అంతకన్న ముఖ్యమైన కార్యం మీద నిన్ను పంపించిందా?"

"అవునమ్మా!"

"అదేమి, పూంగుళలీ?"

"పొన్నియిన్ సెల్వన్‌కి కూడ ఏదో విపత్తు కలగబోతూందని నా అత్త తన అతీత శక్తి వల్ల గ్రహించివుండాలి. ఆయనున్న చోటికి వెళ్ళమని నన్ను పంపింది!"

"ఆహ్! పొన్నియిన్ సెల్వన్ ఉన్న చోటిని వెతుక్కొంటూ నీవు వెళుతున్నావా? మరెందుకిక్కడ ఆగిపోయావు?"

"లేదు, దేవీ! నిజం చెప్పేస్తాను. అంతఃపుర వ్యవహారాల్లో ఇక తల దూర్చనని తీర్మానించుకొన్నాను. కోడిక్కరైకి వెళుతున్నాను. దారిన ఈ వీరవైష్ణవుడు నన్ను కలిసి ఇక్కడికి పిలుచుకొని వచ్చాడు...! మీరిక్కడున్నారని తెలిసివుంటే వచ్చేదాన్ని కాను...!"

"అమ్మాయీ! అంతఃపురమంటే నీకెందుకంత విసుగు పుట్టింది? మేమంటే ఎందుకిష్టం లేకపోయింది? నిన్నెవరేం చేసేశారు?" అని కుందవై అడిగింది.

"నన్నెవరూ ఏమీ చేసేయలేదు. ఎవరి గురించి కూడ నాకు అయిష్టం లేదు. కొంతమందికి సింహాసనం ఇష్టం లేనట్లే నాకు అంతఃపుర జీవనం ఇష్టం లేదు! అంతే!" అనేసి, పూంగుళలి కడగంటి చూపుతో వాణతిని చూసి నవ్వింది.

అది గమనించిన వాణతి ఆవేశం పట్టిన దానిలా ఒకడుగు ముందుకు వేసి, "అక్కా! ఈమె నన్ను మళ్ళీ దెప్పి పొడుస్తూంది. నేను చెబుతున్నాను, వినండి. మీ దివ్య పాదాల మీద ఆన చేసి చెబుతున్నాను. ఆకాశవాణి, భూదేవి సాక్షిగా శపథం చేస్తున్నాను. పొన్నియిన్ సెల్వన్ ఈ గండం కూడ

తప్పి బతికితే, ఆయన నన్ను వివాహమాడేందుకు ఒప్పుకొని పాణిగ్రహణం చేస్తే, అటువంటి గొప్ప పేరు నాకు దక్కితే, తంజావూరు సింహాసనం మీద నేనొక్కరోజు కూడ కూర్చోను! ఇది నా శపథం! ఇది సత్యం! సత్యం! సత్యం!"

~~~
~~~

# అధ్యాయము - 15

## కప్పు తేలింది!

**ఈ** సందర్భంలో కొడుంబాళూర్ రాకుమారి ఇలాంటి శపథం చేస్తుందని ఎవరూ ఊహించలేదు. అది విని అందరూ అదిరిపడి, అవాక్కైనారు.

యువరాకుమారి కోపమూ, పరితాపమూ కలిసి పొంగిన స్వరంతో, "అమ్మాయీ! ఇదేం శపథం! ఎందుకు చేశావు? ఇలాంటి మూఢత్వం కూడ ఉండగలదా? ఏదో ఆవేశం పూనినదానిలాగ కద పేలావు?" అన్నది.

"లేదక్కా, లేదు! నాకు పిచ్చిపట్టలేదు. నా తెలివి తేటగానే ఉంది; నేను స్థిత ప్రజ్ఞగానే ఉన్నాను. చాల రోజులుగా ఆలోచించి మనసులో నిశ్చయించుకొన్నదే ఇప్పుడు అందరికీ తెలిసే రీతిగా చెప్పాను" అన్నది వాణతి.

అందుకు కుందవై ప్రత్యుత్తరం చెప్పేలోపు పూంగుళలి నవ్వు ఆమె దృష్టిని ఆకట్టుకొంది. ఆ పిల్లకు ఇప్పుడు నిజంగానే పిచ్చిపట్టినట్లు తోచింది. మొదట గలగలమని నవ్వింది. తర్వాత ముఖాన్ని రెండు చేతులతో కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చింది. ఉన్నట్లుండి ఏడుపు ఆపేసి మెత్తగా,

"అలల కడలి నెమ్మదిగొన
ఎదలోపలి కడలి కల్లోలం కానేల?"

అని పాడనారంభించింది.

కుందవై ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "ఈ ఇద్దరమ్మాయిలూ చేరి నా మనసును గందరగోళం చేసేసి, పిచ్చి పట్టించేటట్లున్నారు. తిరుమలై! యువరాజును చూడ బయలుదేరినవాడివి ఈ పిల్లను పిలుచుకొని ఎందుకు తిరిగి వచ్చావు?" అని అడిగింది.

"దేవీ! పొన్నియిన్ సెల్వన్ని కలిసేందుకే బయలుదేరి వెళ్ళాను. దారి పొడుగునా వరదమయంగా ఉండడం వల్ల ముందుకు వెళ్ళలేకపోయాను. నాలాగే ఈమె కూడ ఆగిపోయి ఉండడాన్ని గమనించాను. పడవ సంపాదించి ఇస్తే దాన్ని నడుపుకొని తిరువారూరుకు చేర్చగలనని చెప్పింది. అందుకోసం జ్యోతిష్కులవద్దకు తిరిగి వచ్చాను. కోవెల పక్కన తమ రథాన్ని చూడగానే సంతోషపడ్డాను. తన వద్ద అడిగి పడవను తీసుకొందామని అనుకొన్నాను. కానీ పళువేట్టరయ్యర్ రథంతోబాటు పడవను కూడ తీసుకొని వెళ్ళిపోయారు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఇప్పుడు ఏం చేయాలని ఆలోచిస్తున్నావు? పళువేట్టరయ్యర్ చెప్పిందంతా నీవు విన్నావు కద?" అన్నది కుందవై.

"అవును, తల్లీ! అదంతా విన్న తర్వాత ఇక్కడ వృధా పోతున్న ఒక్కొక్క నిమిషమూ ఒక్కొక్క యుగంలాగ అనిపిస్తూంది. ఈ అమ్మాయి చెబుతున్న వార్తలనుంచి కూడ చక్రవర్తిని భయంకరమైన అపాయం సమీపిస్తూందని తెలుస్తూంది. అది ముఖ్యమంత్రికి కూడ తెలియదు. కాబట్టి మీరు కొడుంబాళూర్ రాకుమారిని వెంట తీసుకొని వెంటనే తంజావూరుకు బయలుదేరండి. కొడుంబాళూర్ సైన్యం ఒక వేళ ఇప్పటికే తంజావూరు కోటను ముట్టడించివుంటే మీరు తప్ప ఇంకెవరూ వారిని దాటుకొని లోపలకు వెళ్ళలేరు. వాణతీదేవి కూడ మీతోబాటుంటే చాల అనుకూలమైపోతుంది. నేనీ పడవ నడిపే అమ్మాయిని సమాధానపరిచి ఎలాగైన ఒక పడవను సంపాదించి, పొన్నియిన్ సెల్వన్‌గారి వద్దకు వెళతాను. జ్యోతిష్కుల శిష్యుని అప్పుడే ఒక పడవ సంపాదించుకొని రమ్మని పంపేశాను!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

వాణతి ఉలిక్కిపడి మేలుకొన్నదానిలాగ వెర్రి చూపులు చూస్తూ, "వీల్లేదు! వీల్లేదు! పొన్నియిన్ సెల్వన్‌గారి వద్దకే వెళతాను! చచ్చినా ఆయన పాదాలవద్దే చనిపోతాను!" అన్నది.

అది విన్న పూంగుళలి, 'కీచు' గొంతుతో, "వైష్ణవులుగారూ! నేను మీతో రావడం సాధ్యం కాదు! కోడిక్కరైలోని నా ప్రేమికులు నన్ను పిలుస్తున్నారు! మధ్యరాత్రి నిప్పులుగక్కే నా ప్రేమికులు నన్ను పిలుస్తున్నారు! యువరాకుమారి తాళపత్రం రాసి పంపారు కద, ఆ వాణర్ కులవీరునికి కూడ నా ప్రేమికులను చూపించాను. నేను వారి దగ్గరకు వెళ్ళాలి!" అన్నది.

ఇంతవరకు వీరి సంభాషణలో పాల్గొనక అంతా వింటున్న జ్యోతిష్కులు ఇప్పుడు ఉన్నట్లుండి అడ్డుపడ్డారు. "అమ్మగారూ! అందరూ కాసేపు ఊరుకోండి!" అని పెద్దగా అన్నారు.

~

ఒక నిమిషంపాటు అక్కడ నిశ్శబ్దం నెలకొంది. ఇంకొక శబ్దం - గగుర్పాటు కలిగించే మహాశబ్దం - సుడిగాలి వీచేటప్పుడు అలల కడలిలో పుట్టే హోరులాంటి శబ్దం - వినిపించింది.

"అమ్మగార్లూ! ఈ సమయం చూసి మీరు ఈ పాపిష్టివాడి గుడిసెకు వచ్చారు కద! నేను దేశానికంతా జ్యోతిష్యం చెబుతూ వచ్చినవాడిని. మీకు హెచ్చరిక చేయకుండ ఉండిపోయాను!" అని జ్యోతిష్కులు వాపోయారు.

"అయ్యా! మాకేం కొత్త అపాయం కలగబోతూంది?" అని అడిగింది కుందవై.

"అమ్మా! అరిసిలా నది పొంగి ఉత్తరపు గట్టు తెగేటట్లుందని పొద్దునే నా శిష్యుడు చెప్పాడు. ఆ నది గట్టు తెగితే ఆ వరద నీరంతా వచ్చి కావేరిలో పడుతుంది. కావేరి గట్టు మీద పొంగితే ఈ పేదవాని ఇల్లు పూర్తిగా మునిగిపోతుంది. ఈ ఇల్లు కావేరికి అతిసమీపంగా ఉంది. రండి, రండి! బయటకు రండి!" అని జ్యోతిష్కులు గగ్గోలు పెడుతూ ఇంటినుంచి బయటకు పరుగెత్తారు.

అందరూ ఆయన వెంట వేగంగా బయటకు వెళ్ళారు. భీతిగొన్న ముఖంతో జ్యోతిష్కులు, "అదిగో!" అని వేలెత్తి చూపించారు. ఆయన చూపించిన నైఋతి దిక్కున ఒక అపూర్వమైన దృశ్యం

కనిపించింది. అర్ధ కొబ్బరి చెట్టంత ఎత్తున ఒక పెద్ద గోడ – ఎత్తుగా పరుచుకొని కొద్దిగా వంగిన ఒక విశాలమైన గోడ – ఆ ఇంటివైపు హోరెత్తుతూ వస్తుండడాన్ని చూశారు. కావేరి నది గట్టు తెగి వరద వెల్లువ అలా ఒక పెద్ద గోడలాగ ముందుకు దూసుకు వస్తూందని అక్కడున్న వారందరూ ఒక్కక్షణంలో గ్రహించారు.

"అమ్మా! రండి! అందరూ పరుగెత్తి రండి! అమ్మవారి కోవెల మంటపంపైకెక్కి నిలబడదాం! అది తప్ప ఇంకే మార్గం లేదు! తిరుమలై నా శిష్యుని పడవ తీసుకొని రావడానికి పంపించే మంచిదైంది. పరుగెత్తి రండి!" అని చెబుతూనే జ్యోతిష్కులు దారి చూపించారు.

తక్కిన వారందరూ ఆయన వెన్నంటి వెళ్ళారు. పూంగుళలి పిచ్చి ఇప్పుడు ఎగిరిపోయింది. "దేవీ! మీరేమీ భయపడకండి. దీనికన్న పెద్ద వరదలను నేను ఎదుర్కొని సంభాళించాను!" అని చెబుతూనే ఆమె పరుగెత్తింది. అందరి కన్న ముందు కోవెల మంటపం చేరుకొని దానిపైకి ఎగిరి ఎక్కింది.

~

ఇంతలో వరద కోవెలను సమీపించి ఆ కోవెల చుట్టూ సుడులు తిరగసాగింది. కింద నిలబడ్డవారి మోకాళ్ళదాకా వచ్చేసింది. జ్యోతిష్కులు, ఆళ్వార్ కట్టియాన్ ఎలాగో కిందా మీదా పడి మంటపం పైకెక్కారు.

కుందవై, వాణతి మాత్రమే ఇంకా కిందనే ఉన్నారు.

ఇద్దరూ పైకెక్క ప్రయత్నించారు. పైనున్న పూంగుళలి కుందవైకి చేయిచ్చి పైకెత్తింది.

వాణతి మాత్రం కింద మిగిలిపోయింది. రెండుసార్లు పైకెక్క ప్రయత్నించి రెండు సార్లూ కిందకు జారి పడిపోయింది.

పైనున్న ఇద్దరు స్త్రీమణులూ ఆమెను పట్టి మంటపం పైకి లాగ ప్రయత్నించారు.

పూంగుళలి ఒక చేతిని, కుందవై ఇంకొక చేతిని పట్టుకొని పైకెత్తారు.

వాణతి చటుక్కున తలెత్తి చూసింది. ఆమె ఒక చేతిని పూంగుళలి పట్టుకొని ఉండడాన్ని గమనించింది. వెంటనే ఆ చేతిని విదిలించి, ఆమె చేతిని పట్టుకొన్న చేతిని విడిపించుకొంది.

ఆ వేగానికి కుందవై పట్టుకొన్న చేయి కూడ జారిపోయింది.

వాణతి దబ్బున పడింది. నీటనే పడింది. అంత లోపల వరద వెల్లువ ఆమె గొంతుదాక వచ్చేసింది. కాలు నేలమీద ఊనడం లేదు. వాణతి వరద నీట తేలియాడసాగింది. వరద ఆమెను కొట్టుకొని వెళ్ళిపోయింది.

ఇదంతా ఒక్క క్షణంలో జరిగిపోయింది. మంటపంమీదున్న వారంతా, "ఆః!" అని గగ్గోలు పెట్టారు.

కొన్ని క్షణాల్లో వరద వాణతిని జ్యోతిష్కుల ఇంటి కప్పు మీదికి చేరవేసింది. ఆమె ఆ కప్పు మీదికి ఎక్కింది. "మంచి వేళ! అపాయమేమీ లేదు!" అనుకొంది.

మంటపం మీదున్న వారు కూడ ఆమెను చూశారు. వారు కూడ "మంచి వేళ! అపాయమేమీ లేదు! పడవ వచ్చిన వెంటనే ఆమెను ఎలాగూ అక్కడినుంచి తప్పించవచ్చు!" అనుకొన్నారు.

"కప్పును గట్టిగా పట్టుకో! వదిలి పెట్టకు!" అని పెద్దగా అరిచారు.

వాణతి జ్యోతిష్కుల ఇంటి కప్పును అలాగే గట్టిగా పట్టుకొంది.

కాసేపటికల్లా ఆ కప్పే జరుగుతున్నట్లు తోచింది. అరెరె! ఇల్లు విరిగి పడిపోతుందా, ఏమి?

అవును, జ్యోతిష్కుల ఇంటి గోడలు విరిగి పడ్డాయి. కానీ కప్పు మాత్రం పడిపోలేదు!

కప్పు వెల్లువలో తేలనారంభించింది.

వాణతి ఆ కప్పును గట్టిగా పట్టుకొని తేలింది.

కోవెల మంటపంవైపు తిరిగి చూసింది.

"అక్కా! నేనాయనను చూడ వెళుతున్నాను. పొన్నియిన్ సెల్వన్ని చూడబోతున్నాను. కావేరి తల్లి నన్నాయన వద్దకు తీసుకొని వెళుతుంది!" అని కేకేసింది.

ఆమె చెప్పింది వారి చెవిన పడివుంటుంది. ముఖ్యంగా పూంగుళలి చెవిన పడివుంటుంది అని మనఃపూర్వకంగా నమ్మింది.

జ్యోతిష్కుల ఇంటి కప్పు వెల్లువలో తేలుతూ వెళ్ళసాగింది.

వాణతి కూడ దానిమీద వెళ్ళసాగింది.

~~~
~~~

# అధ్యాయము - 16

## పూంగుళలి దూకింది!

**చోళనాడులో** ప్రయాణం చేసినవారు దాని ప్రకృతి రూపురేఖల్లో ఒక విచిత్రాన్ని గమనించేవుంటారు. చోళనాడును సారవంతమైన పంటభూమిగా చేసే నదుల్లో వరద వచ్చినప్పుడు ఆ వరద వెల్లువ నదికి రెండు గట్ల మట్టం కన్న చాల ఎత్తుగా పారుతూంది. ఇలా వెల్లువగా పారడం వల్లనే ఆ వరద నీరు పంట కాలువల ద్వారా పంట భూములకు చేరడం సాధ్యమవుతూంది.

ఈ స్థితిలో వెల్లువను నది మామూలుగా పారే దారి వెంబడే పారేటట్లు చేయడం చాల కష్టం కద? నదులకు రెండు తీరాల వెంబడి గట్లు కట్టుదిట్టంగా నిర్మించాలి. లేకపోతే వెల్లువ నది వెంబడి పారడానికి బదులు నలువైపులా పారి చోళనాడును నీరు నిలిచిన బురద నేలగా మార్చి, ఎందుకూ పనికి రాకుండ చేస్తుంది.

దీని కారణంగా అనాది కాలంనుంచి చోళరాజులు కావేరికి, దాని ఉప నదులకు కట్టుదిట్టమైన గట్లు నిర్మించడంలో చాల శ్రద్ధ చూపారు. కరికాల్ వలవన్ లంకా యుద్ధంలో ఓడిపోయిన వారిని బంధించి తీసుకొని వచ్చి కావేరికి గట్లు ఎత్తే పనిలో దించాడు. ఆ వృత్తాంతం పాఠకులకు తెలిసేవుంటుంది.

కావేరి నది ఉపనదుల్లో నీరు బాగ ఎత్తుగా పారేందుకు సహాయపడేందుకే శ్రీరంగానికి ఒక కోసు దూరం తూర్పుగా చోళ రాజులు రాతితో ఆనకట్ట కట్టారు. ఆ ఆనకట్ట మూలంగా కావేరి నదిలో నీటి మట్టం ఇంకా పైకి లేచి ఉపనదుల నిండ నీరు పారడం సాధ్యమైంది.

ఇలా ప్రకృతిసిద్ధమైన వనరులతోబాటు మానవ నిర్మిత ఏర్పాట్లు కూడ చేరి చోళనాడును సాటిలేని, సిరిసంపదలతో తులతూగే నాడుగా చేశాయి.

~

చోళ దేశపు పంటభూములకు ఇలా ప్రకృతి ఎంతో సహాయం చేసినట్లే, ఒక్కొక్కసారి అపాయాలను కూడ కలిగించేది.

చోళదేశపు సముద్రతీరానికి తూర్పుగా సముద్రంలో తరచు సుడిగాలులు, తుఫాన్లు వీయడం కద్దు. ఆ గాలులు కొన్నిసార్లు సముద్రతీరం వెంబడే ఉత్తరంగా పయనించి, కృష్ణ-గోదావరి నదీ ముఖద్వారాల గుండానో, లేక కళింగ దేశంలోనో లోపలికి దూరి మహావర్షాన్ని కురిపించి చాల కష్టనష్టాలు కలిగించేది. ఇంకొన్ని సార్లు చోళదేశంలోనే ప్రవేశించి పశ్చిమంగా అతివేగంగా వెళుతుంది. కోడిక్కరైకి, కొళ్ళిడం నది ముఖద్వారానికి మధ్య సుడిగాలి చోళనాడు లోపల ప్రవేశించడం చరిత్రలో అనేకసార్లు జరిగిన సంభవమే. కొన్నిసార్లు ఆ సుడిగాలి ఘోర భయంకర రూపంగొని సముద్రాన్నే లేపి సముద్రతీరం

వెంబడివున్న ఊళ్లను తుడిచిపెట్టేస్తుంది.

పూంపుహార్ అని పేరుగాంచిన కావేరి పట్టణాన్ని సముద్రం అలా ముంచి తుడిచిపెట్టేసిందన్నది కట్టు కథ కాదు; చరిత్ర ఆధారాలవల్ల మనం నిరూపించగల నిజమైన సంభవమే.

నదుల్లో వెల్లువ అధికంగా వచ్చినప్పుడు గట్లు తెగడం కద్దే. నదుల నీటి మట్టం కన్న భూమట్టం దిగువగా ఉండడం వల్ల గట్లు తెగగానే చుట్టుపక్కలంతా నీటిమయమైపోతుంది. నదీతీరానికి సమీపానున్న ఊళ్ళు మునిగిపోతాయి. అలాంటప్పుడు ప్రజల ప్రాణాలు కాపాడుకోవడానికి దగ్గరున్న గుళ్ళు చాల ఉపయోగకరంగా ఉండేవి.

విజయాలయ చోళుని కుమారుడైన ఆదిత్య చోళుడు కావేరి నది పుట్టిన హైస్య పర్వతం నుంచి ఆ మహానది కడలిలో సంగమమయ్యేవరకు నూట ఎనిమిది గుళ్ళను కట్టించాడని చరిత్ర చెబుతూంది. సాధారణ సమయాల్లో గుళ్ళు దేవుని పూజించేందుకు ఉపయోగపడినట్లే, నదిలో వరద వెల్లువ ఎక్కువై గట్లు తెంచుకొని పారేటప్పుడు ప్రజలు ఆ ఆలయ మంటపాల మీదికెక్కి ప్రాణాలు కాపాడుకోనీ అన్నది ఆదిత్య చోళుని ఉద్దేశమైవుండవచ్చు కద?

నదుల గట్లు తెగడవం వల్ల ఒక్కొక్కసారి నదుల తీరే మారిపోవడం కద్దు. అరిశిలా నది, కుడమురుట్టి మొదలైన నదులు చాల సార్లు దారి మారి, చోటు మారాయి అన్న విషయాన్ని పాత చరిత్ర వృత్తాంతాలనుంచి తెలుసుకోవచ్చు.

~

ఇక మన కథ జరిగిన కాలానికి వద్దాం. చోళనాడుకు పార్థిబేంద్రుని ఓడ వస్తున్నప్పుడు మొదలైన సుడిగాలి, వంతిదేవుని కారణంగా యువరాజు అరుళ్మొళి వర్మను కడలిలో దూకజేసిన తర్వాత, సముద్రతీరం వెంబడే వెళ్ళి కళింగనాడును చేరి మరుగైంది.

కానీ అరుళ్మొళి వర్మ నాగపట్టణపు చూడామణి విహారంలో ఉన్నప్పుడు పుట్టిన సుడిగాలి చోళనాడు లోపలే దూరి పలు అట్టహాస కృత్యాలను చేసి పశ్చిమంగా వెళ్ళింది. ఒకే రాత్రి లోపల అది కావేరి రెండు తీరాల వెంబడి తన లీలలను చూపిస్తూ వెళ్ళి మర్నాడు కొంగునాడును చేరి బలహీనమై మరుగైంది. అది పయనించిన చోటల్లా పలు నష్టాలను కలిగించింది. అంతేకాదు, దాని వెంబడే జడివాన కురిసేటట్లు చేస్తూ వెళ్ళింది. పడమర వైపు పోను పోను వాన అధికం కాసాగింది. కాబట్టి కావేరిలోను, కొళ్ళిడంలోను, వాటినుంచి విడివడ్డ ఉపనదుల్లోను విపరీతంగా వరద వెల్లువ పొంగి పొర్లింది. చాల నదుల గట్లు తెగాయి. వర్షం వల్లను, నదుల గట్లు తెగి వరద వెల్లువ పారడం వల్లను చోళనాడంతా వరదమయమైంది.

కానీ ఇంతటి ప్రకృతి వైపరీత్యాలు కూడ చోళనాడు ప్రజలకు భీతి కలిగించలేదు. ఇలాంటి వైపరీత్యాలు తరచూ జరుగుతుండడం వల్ల అలాంటి పరిస్థితుల్లో ఏం చేయాలని ప్రజలు చక్కగా అర్థం చేసుకొన్నారు. తక్షణానికి గుడి మంటపాల మీదికో, లేక ఇంకేపైన ఎత్తైన చోట్లకో చేరుకొని ప్రాణాలు

కాపాడుకొంటారు. వెల్లువ ఎంత వేగంగా వస్తుందో అంత వేగంగా తగ్గిపోతుంది కూడాను. తర్వాత అలవాటు ప్రకారం వారి వారి పనుల్లో నిమగ్నమై పోతుంటారు. ఇళ్ళు కోల్పోయినవారు చుట్టుపక్కలవారి సహాయంతో మళ్ళీ ఇళ్ళు కట్టుకొంటారు. "అయ్యో! ఇల్లు పోయిందే!" అని తలమీద చేయేసుకొని కూర్చోరు.

అలసట, సోమరితనం అంటేనే తెలియని, ఆత్మవిశ్వాసం కలిగిన ప్రజలు ఆ కాలంలో చోళనాడులో జీవించేవారు. లేకపోతే ఇప్పటికీ లోకమంతా చూసి ఆశ్చర్యపోయే అద్భుతాలను వారు సాధించగలిగేవారా?

~

వాణతి కోవెల మంటపం మీదికి ఎక్కలేక జారిపడడం అందరికీ చాల దిగులు కలిగించింది. కానీ వెంటనే ఆమె జ్యోతిష్కుల ఇంటి కప్పు మీదికెక్కి గట్టిగా పట్టుకొని కూర్చోవడాన్ని చూడగానే వారికి ధైర్యం వచ్చింది. యువరాకుమారికి ఒకింత కుతూహలంకూడ కలిగింది. వాణతిని అపాయకరమైన పరిస్థితుల్లో చిక్కుకొనేటట్లు చేయడంలోను, అప్పుడామె ఎలా ఆ పరిస్థితిని ఎదుర్కొంటుందోనని చూడడంలోను కుందవైకి ఎప్పుడూ చాల ఆసక్తి. వీరాధివీరుడైన తన తమ్ముని పెళ్ళిచేసుకోబోయే అమ్మాయి మనోధైర్యం, తెంపరితనం కలిగిన ధీరవనితై ఉండాలని ఆమె కోరుకొనేది. అలాంటి ధీరత్వాన్ని వాణతిలో పెంపొందించేందుకు కుందవై అనేక ఉపాయాలను ప్రయోగిస్తూ వచ్చింది. ఆ ఉపాయాలు మంచి ఫలితాన్నిచ్చాయని ఆమెకిప్పుడు నమ్మకం ఏర్పడింది.

కొంతకాలంగా వాణతి మూర్ఛవచ్చి పడిపోయే అలవాటును విడిచిపెట్టింది కద?

ఇప్పుడు కుందవై తంత్రమేమీ అవసరం లేకనే దైవాధీనంగా వాణతి ధీరత్వాన్ని పరీక్షించేందుకు ఒక సందర్భం ఏర్పడింది. చుట్టూ వెల్లువ సుడులు తిరుగుతూ కమ్ముకోగా ఒక పెంకుటింటి కప్పుమీద వాణతి కూర్చొనివుంది. ఆమె భయపడకుండ ఉంటుందా? జ్యోతిష్కుల శిష్యుడు పడవ తీసుకొని వచ్చి ఆమెను అపాయంనుంచి కాపడేంతవరకు ఆమె గట్టిగా పట్టుకొనివుంటుందా? - అవును; ఉంటుంది! సందేహం లేదు! ఇంతకాలమూ తాను ఇస్తూ వచ్చిన శిక్షణ ఈ సమయాన నిరుపయోగమైపోతుందా?

ఇలా కుందవై ఆలోచిస్తున్నప్పుడు ఆళ్వార్ కట్టియాన్, "తల్లీ! ఇదేమి? కప్పు జరుగుతూందే!" అన్నాడు.

"నీ కంట్లో ఏదే లోపముంది! వరద వెల్లువ ముందుకు వెళుతూంది; అది నీకు కప్పు జరుగుతున్నట్లు కనిపిస్తూంది!" అన్నది కుందవై. ఇలా చెబుతుండగానే ఆమె మనసులో కూడ సందేహం పుట్టింది. దాని ఆనవాళ్ళు ఆమె ముఖంమీద గోచరించాయి.

"అమ్మా! బాగ చూడండి!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అయ్యో! ఇదేం విపరీతం?" అన్నది కుందవై.

"జ్యోతిష్కులుగారూ! మీ శిష్యుడు పడవ తీసుకొని త్వరలో వస్తాడా?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"చాలు, చాలు! జ్యోతిష్కులను, ఆయన శిష్యుడిని ఇంతవరకు నమ్మింది చాలు! తిరుమలై! నీవల్ల వాణతిని కాపాడనవుతుందేమో చూడు! లేకపోతే నేనే వెల్లువలోకి దూకవలసిందే! వాణతికి ఏదైనా జరిగితే ఆపైన నేనొక్క క్షణం కూడ బతికివుండలేను!" అన్నది కుందవై.

"తల్లీ! అపాయం వచ్చిన సమయంలోనే నిదానాన్ని/నెమ్మదిని కోల్పోకూడదు. ఇది మీకు తెలియనిది కాదు. కొడుంబాళూర్ రాకుమారి కోసం నా ప్రాణమైనా ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. దానివల్ల ఫలితం దక్కాలి కద? పడవ లేకుండ నేను మాత్రం ఈదుకొంటూ పోతే ఆ కప్పుమీద వెళ్ళి అంటుకొని కూర్చోవచ్చు. ఆ కప్పు నన్ను, కొడుంబాళూర్ రాకుమారిని మోయగలదా? లేక ఇద్దరినీ వరద వెల్లువలో ముంచేసి తాను కూడ మునిగిపోతుందా? దీని గురించి కాస్త ఆలోచించాలి..."

పూంగుళలి నవ్వడం విని ఇద్దరూ తిరిగి చూశారు.

"ఈ వీర వైష్ణవులు ఆలోచించి ముగించేలోపు కొడుంబాళూర్ రాకుమారి జీవితమే ముగిసిపోతుంది!" అన్నది పూంగుళలి.

"అలా జరిగితే ఈ పడవ నడిపే అమ్మాయి సంతోషపడుతుంది!" అని ఆళ్వార్ కట్టియాన్ చెప్పగానే పూంగుళలి ముఖం కోపంతో ఎర్రబారింది.

తిరుమలై ఇంకా ఇలా చెప్పుకొచ్చాడ్: "కానీ, దేవీ! అలాగేం జరగబోదు. వటపత్రం మీద శయనిస్తూ లోకాన్నంతా కాపాడే పెరుమాళ్ళు (విష్ణువు) వాణతిని కూడ కాపాడుతాడు. మత్స్య, కూర్మ, వరాహావతారాలెత్తి ఈ భూలోకాన్ని కాపాడిన శ్రీమన్నారాయణుడు కొడుంబాళూర్ రాకుమారిని కూడ కాపాడుతాడు...! అదిగో చూడండి! జ్యోతిష్కుల శిష్యుడు పడవ తీసుకొని వస్తున్నాడు!"

~

ఆళ్వార్ కట్టియాన్ చూపించిన దిశలో నిజంగానే ఒక పడవ వస్తూ కనిపించింది. ఆ పడవ వెల్లువ వేగాన్ని ఎదిరిస్తూ వీరున్న కోవెల మంటపంవైపు మెల్లగా రాసాగింది.

వాణతి ఎక్కిన కప్పేమో వరదలో కొట్టుకుపోతూంది.

పడవ వీరున్న చోటికి వచ్చి వారందరినీ ఎక్కించుకొని వెళ్ళడానికి ఇంకా చాల సమయం పడుతుంది. అంతలోపల వాణతి చాలదూరం వెళ్ళిపోతుంది. కనుమరుగైపోవచ్చు కూడ.

ఇదంతా ఆలోచించి మంటపంపైనున్న వారు పడవలో వస్తున్న శిష్యుని చూసి కేకలేశారు. సైగలు కూడ చేసి చూశారు. తనను వేగంగా రమ్మంటున్నారనుకొని పడవను వేగంగా నడుపుకొని రా ప్రయత్నించాడు.

అప్పుడు పూంగుళలి కుందవైదేవిని చూసి, "దేవీ! నాకు అనుమతినివ్వండి! నేను

ఈదుకొంటూ వెళ్ళి పడవను దారి మార్చి కొడుంబాళూర్ రాకుమారిని పడవెక్కించి వస్తాను!" అన్నది.

కుందవై కాస్త జంకింది. పూంగుళలి చేయూతనివ్వడానికి ప్రయత్నించినందువల్లనే వాణతి వెల్లువలో పడిపోయిందన్న విషయం ఆమె గుర్తు చేసుకొంది.

"దేవీ! నన్ను నమ్మండి. నా అజాగ్రత వల్లనే రాకుమారి వెల్లువలో పడిపోయారు. కాబట్టి వారిని కాపాడడం నా కర్తవ్యం!" అన్నది పూంగుళలి.

"అమ్మాయీ! నేను నిన్ను నమ్ముతున్నాను. కానీ వాణతినే నమ్మడం లేదు!" అన్నది కుందవై.

"ఆహా! ఒకవేళ నేనుండే పడవలో ఎక్కేందుకు నిరాకరిస్తారంటారా? అలాగైతే వారిని పడవెక్కించి నేను దిగేస్తాను!" అని చెబుతూనే పూంగుళలి వరద వెల్లువ ప్రవాహంలోకి దూకింది. పడవ వైపు వేగంగా ఈదుకొంటూ వెళ్ళింది.

~

కుందవై జ్యోతిష్కులను చూసి, "అయ్యా! జ్యోతిష్కులుగారూ! ఇంతవరకు నేను మీ శాస్త్రంలో చాల నమ్మకం కలిగివుండేదాన్ని. కానీ ఇప్పుడా నమ్మకాన్ని కోల్పోయాను!" అన్నది.

"కానీ నాకు ఈ రోజు పూర్తి నమ్మకం ఏర్పడింది, దేవీ! కొడుంబాళూర్ రాకుమారి జాతకం ప్రకారం వారికి ఈరోజు పెద్ద గండం కలగాలి. పళువేట్టరయ్యర్ మూలంగా అది వస్తుందేమో అనుకొన్నాను. అలా రాకపోగా చాల ఆశ్చర్యపోయాను. ఇంకొక రీతిగా గండం వచ్చింది. రాకుమారి ఈ గండం తప్పి బతుకుతారు! ఆహా! వారి అపూర్వమైన చేతి రేఖలు! వారి గురించి నేను చెప్పినదంతా జరుగుతుంది! అందు గురించి సందేహం లేదు!"

"భలేవుంది! అదెలా సాధ్యం? వాణతికి ఈ గండం తప్పినా మీ మాటలు ఫలించబోవడం లేదు. కాసేపటి క్రితం ఆ అమ్మాయి మీ ఇంట చేసిన శపథాన్ని మీరు వినలేదా?" అన్నది కుందవై.

"ఎవరే శపథం చేసినా, నా జోస్యం ఫలించే తీరుతుంది. అలా జరగకపోతే నా దగ్గరున్న జ్యోతిష్యశాస్త్ర తాళపత్రాలన్నిటినీ కావేరిలో విసిరేస్తాను! ఇది నా శపథం!" అన్నారు జ్యోతిష్కులు.

అప్పుడు ఆళ్వార్ కట్టియాన్, "మీరు ఆ ఆకులను నీట విసిరేసేంతవరకు కావేరిమాత వేచివుండలేదు. ఆమే తీసుకొని వెళ్ళిపోయింది!" అన్నాడు.

జ్యోతిష్కులు అతడు చెప్పిన నిజాన్ని విని అవాక్కైనారు. "అయినా కూడ, నా జోస్యం ఫలించకపోదు!" అని తనలో తానే గొణుక్కొన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 17

## ఏనుగు(?) విసిరేసింది!

**గత** అధ్యాయాలలో వివరించిన సంభవాలు జరిగిన సమయానికి ఒక రోజు ముందు నాగపట్టణపు పురప్రజల అతిథిగా యువరాజు అరుళ్మొళి వర్మను వదిలిపెట్టి వచ్చాము. విందు భోజనకార్యక్రమమంతా ముగిసిన తర్వాత అలంకరించబడిన ఒక ఏనుగుపైన యువరాజు బయలుదేరారు. లెక్కలేనంతమంది ప్రజలు తంజావూరుకు వస్తామని ఆయన వెంబడి బయలుదేరారు. ఆరోజు రాత్రి యువరాజు, ప్రజలందరూ తిరువారూరుకు వచ్చి చేరారు.

తిరువారూర్ ప్రజలు యువరాజు వస్తున్నారని ముందుగానే తెలుసుకొనివుండడం వల్ల, ఆయనకు రాజయోగ్యమైన స్వాగతమిచ్చి రాజోపచారాలు చేశారు. పురాతన నగరమైన తిరువారూర్ (తిరుఆరూర్) ప్రధాన ద్వారంనుంచి చివరి ద్వారం వరకు జనం తండోపతండాలుగా బారులు తీరి నిలబడ్డారు. నాలుగు రాజవీధుల్లోను ఇసుక వేస్తే రాలనంతగా జనం క్రిక్కిరిసి నిలబడ్డారు. ఇళ్ళ వాకిళ్ళన్నీ తోరణాలతో అలంకరించబడ్డాయి. తిరుఆరూర్ చోళమాళిగను కూడ అధికారులు చక్కగా అలంకరించారు. యువరాజుకు మాత్రమేగాక ఆయనతో వస్తున్న ప్రజలకు కూడ విందుభోజనం ఏర్పాటు చేశారు.

ముందురోజు రాత్రి తిరువారూర్ మీద కూడ పెనుగాలి వెళ్ళింది. కానీ యువరాజు రాక కలిగించిన ఉత్సాహం, కుతూహలం, కోలాహలం ముందు రోజు వీచిన సుడిగాలిని పూర్తిగా మరిపింపజేసింది. వీధుల్లో వాద్యఘోష, ఆటపాటలు, బొమ్మలాటలు, కురవై ఆటలతోబాటు కత్తి యుద్ధం ఆటలుకూడ ఉత్సాహంతో నడుస్తున్నాయి.

~

తంజావూరు చోళవంశస్థులు కైలాసంలో నాట్యం చేసే నటరాజస్వామి కోవెల తర్వాత తిరువారూర్ త్యాగరాజస్వామి ఆలయం మీద విశేషభక్తిగొని అనేక మాన్యాలిచ్చారు. కానీ యువరాజు అరుళ్మొళి వర్మ మాత్రం అంతవరకు తిరువారూరుకు రాలేదు. కాబట్టి యువరాజు ఆలయానికి తప్పక రావాలని ఆలయ ధర్మకర్తలు, పూజారులు ప్రత్యేకంగా విన్నవించుకొన్నారు. యువరాజు కూడ వారి కోరికమేరకు ఆలయానికి వెళ్ళారు. అనేక కారణాలవల్ల ఆయన మనసు కల్లోలితమై ఉండడం వల్ల దేవుని మీద ధ్యానం పూర్తిగా ఉంచలేకపోయారు. అర్చన, ఆరాధన ముగిసి, దేవుని ప్రసాదం తీసుకొని తిరిగి వెళ్ళేటప్పుడు ఆలయ ధర్మకర్తలు, పూజారులను చూసి యువరాజు, “ఈ ఆలయ దైవానికి త్యాగరాజస్వామి అని ఎందుకు పేరొచ్చింది?” అని అడిగారు.

దేవతలకు దేవుళ్ళైన త్రిమూర్తులలో ప్రధముడైన శివపరమాత్మ ముల్లోకాల్లో జీవించే

ప్రాణులను కాపాడేందుకు చేసిన త్యాగాలను వివరించి చెప్పారు పూజారులు. ముల్లోకాలను కాపాడేందుకు, తుడిచిపెట్టేందుకు కూడ సామర్థ్యము, బలమూ ఉన్న శివాపరమాత్మ తన భక్తులను అనుగ్రహించేందుకై అటువంటి కష్టాలనుభవించాడని వివరించారు. ప్రాణులు జీవించేందుకై స్మశానంలో తపస్సు చేసిన వృత్తాంతాన్ని వర్ణించారు. ఆ తపస్సును విడిచిపెట్టి దేవతల క్షేమంకోసం ఉమను పెళ్ళాడిన విషయాన్ని చెప్పారు. అన్ని లోకాలకు భగవానుడు భిక్షాటన మూర్తిగా తోచి/ప్రత్యక్షమై భిక్షమెత్తిన వృత్తాంతాన్ని వివరించారు.

అటువంటి త్యాగరాజస్వామి ఆలయాన్ని పొందిన తిరువారూరులో పురాతనకాలంలో అరుళ్మొళి వర్మ పూర్వీకులు నివసించిన వృత్తాంతాన్ని, మనునీతి చోళుడు ఒక ఆవుకు న్యాయం చేకూర్చేందుకు తన ప్రియపుత్రుడినే త్యాగం చేసిన వృత్తాంతాన్ని గుర్తుచేశారు.

~

ఇవన్నీ అరుళ్మొళివర్మ మనసులో గట్టిగా పదిలమైనాయి. ఇంతవరకు బుద్ధ భగవానుని త్యాగాలను విని ఆశ్చర్యపోతూ వచ్చిన యువరాజు, దేవదేవుడైన శివపరమాత్మను త్యాగమూర్తిగా చిత్రించే వృత్తాంతాలను విని మరింత ఆశ్చర్యపడసాగారు. పాశ్చాత్యదేశాలలో భగవానుని ప్రియపుత్రునిగా పూజించబడే అవతార పురుషులు ప్రజల క్షేమంకోరి శిలువమీద మేకులతో కొట్టబడి ప్రాణత్యాగం చేసిన వృత్తాంతం కూడ ఆయన అప్పటికే వినివున్నారు. ఈ వృత్తాంతాలన్నీ విని వాటి గురించి ఆలోచించగా, ఆలోచించగా, మానవుడు దైవత్వం పొందగలిగేది త్యాగం వల్ల మాత్రమే అన్న భావం ఆయన మనసులో వేళ్ళూనింది. కాబట్టి ఆయనను చుట్టుముట్టిన ప్రజలు, తమకు ఆయనమీదున్న ప్రేమాభిమానాలవల్ల, ఆయనను తంజావూరు సింహాసనమెక్కగోరడం గురించి ఆయన మనసు అమితమైన వేదనకు లోనైంది. వీరందరి ప్రేమ అనే చెరసాలనుంచి తప్పించుకోవడమెలా అని తీవ్రంగా ఆలోచించసాగారు.

ఆలయ సంప్రదాయాల తర్వాత తిరువారూర్ ప్రజలు యువరాజుకు పెద్ద విందు భోజనం వడ్డించారు. ఆయనకు వినోదం కలిగించేందుకు అనేక రకాల ఆటపాటలు ఏర్పాటు చేశారు. వాటన్నిటిమీద యువరాజు మనసు మళ్ళించకపోయినా కూడ పైకి మాత్రం ఉత్సాహం చూపిస్తూ వచ్చారు.

తర్వాత ఇంచుమించు అర్ధరాత్రి సమయానికి యువరాజు చోళమాళిగకు వచ్చి చేరారు. అక్కడ వారికోసం కొన్ని విపరీత వార్తలు వేచివున్నాయి. తంజావూరుకు పశ్చిమంగా జడివాన కురిసి, కావేరి, కొళ్ళిడం నదుల్లోను, వాటి ఉపనదుల్లోను పెద్ద వరద వెల్లువ వచ్చి చాలచోట్ల గట్లు తెగిపోయాయని, అన్నిచోట్ల వరదమయంగా ఉండడం వల్ల ముందుకు ప్రయాణం చేయడం కష్టమవుతుందని చెప్పారు. రెండు రోజులు తిరువారూరులో ఆగి, వరద తగ్గిన తర్వాత బయలుదేరడం ఉచితమని కూడ తెలియజేశారు. అది యువరాజుకు అంతగా ఇష్టంకాలేదు. తంజావూరుకు వెంటనే వెళ్ళి చేరాలన్న ఆదుర్దా ఆయన మనసులో బలంగా నెలకొంది. నది గట్లు తెగడం, వరద వెల్లువ పొంగి రావడం ఆయనను ఆపగలవా,

ఏమి?అవును; ఇంతమంది ప్రజలు తోడు వస్తే ప్రయాణం వేగంగా ముందుకు సాగడం కష్టమవుతుంది. తాను మాత్రం ఒంటరిగా ఏనుగెక్కి వెళితే ప్రయాణానికి ఎలాంటి అడ్డు రానవసరం లేదు. ఏనుగుకు అందని లోతుగల నది తంజావూరుకు వెళ్ళే దారిలో ఏదీ లేదు. అలా ఉన్నా కూడ యువరాజుకు దానిగురించి దిగుల్లేదు. నీటి గురించి ఆయనకెప్పుడూ భయం లేదు. పొన్ని నది ఆయన తల్లికన్న మిన్నగా ప్రీతి కలిగినది కద? చిన్న బిడ్డగా ఉన్నప్పుడు తాను మునిగిపోకుండ కాపాడిన కావేరిమాత ఇప్పుడు తనని కాపాడకుండ పోతుందా?

ఈ జనసముద్రంనుంచి ఎలా తప్పించుకోవడమన్నదే ప్రశ్న. అయోధ్యనుంచి రాముడు రాత్రికి రాత్రే తప్పించుకొన్న వృత్తాంతం పొన్నియిన్ సెల్వన్‌కి గుర్తొచ్చింది. అలాగే తానుకూడ రాత్రి ప్రజలు నిద్రపోయేటప్పుడు వెళ్ళిపోతేనేం? ఏదేమైన, ఏనుగు మావటికి ఏ సమయంలోనైనా బయలుదేరేందుకు సిద్ధంగా ఉండమని చెప్పడం మంచిది.

~

ఈ ఆలోచన రాగానే ఏనుగు మావటిని పిలుచుకొని రమ్మని అంతఃపుర సేవకుని ఆజ్ఞాపించారు. సేవకుడు వీధిలోకి వెళ్ళి చూసేసి వెంటనే తిరిగి వచ్చాడు. ఏనుగు మాత్రం వాకిట కట్టబడివుందని, మావటి కనిపించడం లేదని చెప్పాడు.

"ఒకవేళ వీధిలో జరుగుతున్న ఆటపాటలను చూసేందుకు వెళ్ళివుంటాడు. వాడు తిరిగి రాగానే పిలుచుకొని రా! లేక ఇంకొందరిని పంపి వెతికి చూడమని చెప్పు!" అని యువరాజు ఆజ్ఞాపించారు.

"అలాగే, రాజా! పడవ నడిపే మురుగయ్యన్ అనే ఒకడు మాళిగ వాకిట వేచివున్నాడు. మిమ్మల్ని వెంటనే చూడాలని చాల హఠం పడుతున్నాడు!" అన్నాడు సేవకుడు.

పడవ నడిపే మురుగయ్యన్ని ఇంతసేపు మరిచిపోయాం కద అని యువరాజు పశ్చాత్తాప పడ్డారు. తాము రహస్యంగా తప్పించుకొని వెళ్ళడానికి ఒకవేళ అతడు సహాయం చేసినా చేయవచ్చు. అతన్ని వెంటనే తమ వద్దకు తీసుకొని రమ్మని మాళిగ సేవకుని ఆజ్ఞాపించారు.

~

మురుగయ్యన్ యువరాజు సమక్షానికి వచ్చిన వెంటనే ఆయన పాదాలమీద పడి వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.  ఈ మూఢభక్తుని సమాధానపర్చడమూ, అతడి వద్దనుంచి సమాచారం రాబట్టుకోవడమూ కష్టమే అయినా, ప్రయత్నించి చూడాలి.

మురుగయ్యన్ తన దుఃఖానికి కారణాన్ని ఇలా వివరించాడు:-

మురుగయ్యన్ నాగపట్టణంలోనే తన భార్యనుంచి విడిపోయాడు. తిరువారురు వచ్చిన తర్వాత ప్రజల మధ్య గాలించి చూశాడు - ఆమె ఒక వేళ ఇక్కడికి వచ్చిందేమో చూద్దామని. ఒక జాము వేళ వెతికిన తర్వాత రాజవీధినుంచి పక్కకు వెళుతున్న ఒక సందు మూలలో ఆమెను, యువరాజు ఎక్కి

వచ్చిన ఏనుగు మావటిని చూశాడు. వారు సందులో దూరిన వెంటనే చాల వేగంగా నడిచి వెళ్ళారు. మురుగయ్యన్ కూడ వారిని వెంబడించాడు. చివరిగా ఒక ఇంటి వాకిట వారు ఆగారు. అక్కడ ఇంకొక మనిషి వారికోసం వేచివున్నట్లు తోచింది. వాడు కూడ వీరిద్దరితో చేరాడు. తర్వాత ముగ్గురూ చేరి వెళ్ళారు. మురుగయ్యన్‌కి ఏవేవో సందేహాలు పుట్టాయి. తన పెళ్ళాం శీలాన్నే సందేహించసాగాడు. నిజాన్ని కనిపెట్టాలన్న ఉద్రిక్తత అతడిలో పొంగింది. కాబట్టి వారిని వెళ్ళి పట్టుకోక వారి వెంబడే వెళ్ళాడు. వారు ఊరు దాటి పంట కాలువలు, పంటల మధ్యగా వెళ్ళి చివరికి ఒక స్మశానాన్ని చేరారు. మురుగయ్యన్ భీతిగొన్నాడు. కానీ పట్టు విడవక స్మశానంలోకి వెళ్ళి ఒక చెట్టు వెనక దాక్కొన్నాడు. రాక్కమ్మ, ఏనుగు మావటితో దారిలో చేరిన మనిషి, స్మశానంలో బూడిద రాసుకొని ఏవేవో భయంకరమైన మంత్రాలను జపించాడు. తర్వాత ఏనుగు మావటిని చూసి, "రేపు పొద్దున నీ ప్రాణానికి అపాయం కలగబోతూంది! జాగ్రత్తలు తీసుకొని బతికి బయటపడు!" అన్నాడు. ఏనుగు మావటి మతిపోగొట్టుకొన్నవాడిలాగ, "ఏం ఆపద? ఎలా వస్తుంది? తెలిస్తేనే కద తప్పించుకోగలను?" అన్నాడు. మంత్రవాది/మాంత్రికుడు, "ఏనుగుకు ఉన్నట్లుండి మదపిచ్చి పడుతుంది! నీవు దాన్ని సమీపించగానే నిన్ను కింద తోసేసి పరుగెడుతుంది! నీవల్లే ఏనుగుకు మదమెక్కిందని జనాలనుకొంటారు. నీ చేతనున్న అంకుశాన్ని లాక్కొని నిన్ను చంపేస్తారు!" అన్నాడు మాంత్రికుడు. "అయ్యయ్యో! తప్పించుకోవడానికి దారేది?" అని మావటి గాభరాతో అడిగాడు. "రేపు పొద్దున ఏనుగు దగ్గరకు వెళ్ళకు!" అన్నాడు మాంత్రికుడు. "అదెలా సాధ్యం? తర్వాత రాజ దండనకు లోనుకావలసివస్తుంది కద?" అని మావటి గగ్గోలు పెట్టాడు. "అలాగైతే నా ఇంటికి రా! మంత్రించిన కవచం ఇస్తాను. దాన్ని ధరించి వెళ్ళు! చేత అంకుశంతో వెళ్ళకు!" అన్నాడు మాంత్రికుడు.

మురుగయ్యన్ ఆ తర్వాత అక్కడ నిలవలేక పరుగెత్తి వచ్చేశాడు. రేపు ఉదయం ఏనుగుకు మదమెక్కబోతుందని యువరాజును హెచ్చరించేందుకే అలా పరుగెత్తి వచ్చాడు.

~

ఇదంతా చెప్పి మురుగయ్యన్ మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్వసాగాడు.

"మురుగయ్యా! ఎందుకేడుస్తున్నావు? నీవెలాగూ సమయానికి వచ్చి హెచ్చరించేశావు కద? ఇక నేను చూసుకొంటాను!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

"అయ్యా! ఈ కుట్రలో నా భార్య చేరివుండడం వల్లనే విచారిస్తున్నాను. రాక్కమ్మ గురించి ఏమనుకోవాలో తెలియడం లేదు.ఆమె గురించిన పాత సందేహాలు మళ్ళీ తలెత్తుతున్నాయి!" అన్నాడు మురుగయ్యన్.

"ఆమెను నేను దిద్దుతాను. నీవు దిగులుపడకు! వెంటనే తిరిగి వెళ్ళు! మావటిని ఎలాగైనా వెతికి పట్టుకు రా!" అన్నారు యువరాజు.

మురుగయ్యన్ వెళ్ళిన తర్వాత యువరాజు కాసేపు ఆలోచనలో మునిగారు. మురుగయ్యన్

చూసింది, విన్నది, వాటి అర్థం ఏమైవుంటుందని ఊహించి తెలుసుకోవడానికి ప్రయత్నించారు. పళువేట్టరయ్యర్ల ఉద్దేశం, పాండ్యదేశపు కుట్రదారుల ప్రయత్నం - వీటి గురించి యువరాకుమారి చెప్పినదంతా గుర్తు చేసుకొన్నారు. ఆ కుట్రదారుల ప్రయత్నాలలో ఇది ఒకటై ఉండవచ్చు. లేక, ఒట్టి మూర్ఖత్వం కావచ్చు. ఏదెలావున్నా కూడ, ఉదయాన తామేం చేయాలన్న విషయం గురించి ఒక తీర్మానం తీసుకొన్నారు. తర్వాత నెమ్మదిగా నిద్రపోయారు.

~

మర్నాడు తొలిపొద్దుసే ప్రయాణానికి ఆయత్తమైనారు యువరాజు. మాళిగ వాకిలి దగ్గరకు వచ్చారు. అక్కడ కట్టివున్న ఏనుగు ఆయనను చూడగానే తొండంతో తల నిమిరి ముద్దాడింది. “ఏనుగుకు మదపిచ్చి పడుతుంది" అని మాంత్రికుడు చెప్పాడని మురుగయ్యన్ చెప్పింది గుర్తుకొచ్చింది యువరాజుకు. కానీ అటువంచి సూచనలేవీ కనిపించలేదు.

“మావటి ఎక్కడ?” అని పెద్దగా అడిగారు యువరాజు. వెంటనే అనేక గొంతులు "ఏనుగు మావటి ఎక్కడ?” అని ప్రతిధ్వనించాయి.

యువరాజుతోబాటే ప్రయాణించేందుకు చాలమంది ప్రజలు సిద్ధమై తరలివచ్చారు. వారి మధ్య చిక్కుబడి ముందుకు రాలేక సతమతమవుతున్న మురుగయ్యన్ని చూశారు యువరాజు. అతన్ని చూసి సైగ చేయగానే జనాలు పక్కకు తొలగి దారిచ్చారు. మురుగయ్యన్ రాత్రి చాలసేపు వెతికిన తర్వాత తన భార్యను మాత్రం కనిపెట్టాడని, ఆమె స్మశానానికి వెళ్ళిన విషయాన్ని పూర్తిగా నిరాకరించి, మురుగయ్యన్‌కి పిచ్చిపట్టిందని చెప్పిందని, ఏనుగు మావటి కనిపించనే లేదని తెలియజేశాడు.

“అందు గురించి దిగుల్లేదు, మురుగయ్యా! ఏనుగు కాలికి కట్టిన గొలుసును విప్పేయి!” అన్నారు యువరాజు.

అలా మురుగయ్యన్ ఏనుగు కాలికి కట్టిన గొలుసును విప్పుతుండగానే, "ఇదిగో, వచ్చేశాడు మావటి!” అని ఒక గొంతు వినిపించింది. “వచ్చేశాడు! వచ్చేశాడు!” అని పలు స్వరాలు ధ్వనించాయి.

ఏనుగు మావటి చేత అంకుశంతో వేగంగా పరుగెత్తుకొస్తున్నడు. జనాలు తొందర తొందరగా పక్కకు తొలగి దారి వదిలారు.

పొన్నియిన్ సెల్వన్ కూడ "చాల మంచిది!” అని పెద్దగా నిట్టూర్చి, మావటి పరుగెత్తి వస్తున్న వైపు చూశారు.

పాపం! ఒక్క రాత్రి అనుభవంతో వాడు ఎంతగా మారిపోయాడు! భయభక్తులుగొన్నవాడిలాగ కద కనిపిస్తున్నాడు!

ఒక చేత అంకుశాన్ని పట్టుకొన్న మావటి ఏనుగు దగ్గరకొచ్చి ఇంకొక చేత్తో దాని తొండాన్ని తాకాడు.

వెంటనే ఏనుగు వాడిని తొండంతో చుట్టి తలకిందులుగా పైకెత్తింది. విన్నవారు బెదిరిపోయేటట్లు భీకరంగా ఘీంకరించి మావటిని విసిరేసేసింది.

మావటి చాల దూరాన వెళ్ళి పడ్డాడు. వాడి చేత పట్టుకొన్న అంకుశం ఇంకా దూరాన వెళ్ళి పట్టింది.

“ఏనుగుకు మదమెక్కింది!” అన్న భీతిగొన్న ధ్వని ఆ జనసముద్రంనుంచి లేచింది.

చుట్టూ నిలబడ్డ ప్రజలు నలువైపులా చెదరి పారిపోసాగారు.

~~~
~~~

# అధ్యాయము - 18

## మోసపోయిన మావటి!

"**సందర్భం** అన్నది దేవుని మారుపేరు" అని ఆకాలంలో ఒక మహాజ్ఞాని చెప్పారు. దేవుడు తాను చేసిన కార్యాన్ని తాను చేశానని ఒప్పుకోవడానికి ఇష్టపడనప్పుడు 'సందర్భం' అన్న మారుపేరును ధరిస్తున్నాడట! ప్రపంచ చరిత్రలో చాల పేరుగొన్న మహావీరులు, మహాకార్యాలను సాధించిన మహానుభావులు - వీరి వృత్తాంతాలను పరిశీలించినప్పుడు, సందర్భం వీరికి చాల సహాయం చేసిందని తెలుసుకోవచ్చు. వారిమీద భగవంతుడు మిక్కిలి దయగొని అటువంటి సందర్భాలను సృష్టించాడని కొందరంటారు. వారు జన్మించిన వేళ, జాతక ఫం, బ్రహ్మరాత, పూర్వజన్మ సుకృతం - అని జీవితంలో ఎదురయ్యే అనుకూల సందర్భాలకు కారణాలు వెతికి చెప్పేవారు కూడ ఉన్నారు.

చంద్రగుప్తుడు, విక్రమాదిత్యుడు, జూలియస్ సీజర్, నెపోలియన్, డ్యూక్ ఆఫ్ వెల్లింగ్‌టన్, జార్జ్ వాషింఘ్టన్ వంటి మహావీరుల జీవితాల్లో 'సందర్భాలు' ఎంతో సహాయం చేశాయని చదివి తెలుసుకొనే ఉన్నాము.

ఇందునుంచి భగవంతుడు పక్షపాత బుద్ధి కలవాడని తీర్మానించడం పొరబాటవుతుంది. చరిత్రలో పేరుప్రఖ్యాతులుగాంచిన మహానుభావులు, వీరులకేగాక ఇంకా ఎందరికో అలాంటి సందర్భాలను సృష్టిస్తున్నాడు భగవంతుడు.

కానీ ఆ సందర్భాలను ఉపయోగించుకోవడం మానవుని సమయానికి తగిన నిర్ణయం తీసుకోగలిగిన సామర్థ్యం మీద ఆధారపడివుంటుంది. సందర్భాన్ని జారవిడుచుకొనేవారు కోటానుకోట్ల మంది పేరుప్రఖ్యాతులు సంపాదించలేక సాధారణ జీవితాలను కొనసాగించి ఈ లోకాన్ని విడిచి వెళుతున్నారు. సందర్భాలను చక్కగా ఉపయోగించుకొన్నవారు చరిత్రలో తమ పేరును నెలకొల్పి వెళుతున్నారు.

ఒకేసారి ఒకేరోజు ఒకే సమయాన పుట్టినవారి జీవితాలు వ్యత్యాసంగా ఉండేందుకు ఇంకేం కారణం చెప్పగలం?

~

యువరాజు అరుళ్మొళి వర్మ జీవితంలో అటువంటి సందర్భం ఒకటి వచ్చింది. ఏనుగు తన దగ్గరికి వచ్చిన మావటిని ఎత్తి విసిరేసినప్పుడు, 'ఏనుగుకు మదమెక్కింది!' అని కేకలు లేచినప్పుడు, ఆ సందర్భం ఆయనను వరించింది. దాన్ని ఆయన ఉపయోగించుకోక చేజార్చివుంటే ఈ కథ ఇంకో విధంగా ఉండేది. తమిళనాడు చరిత్రలో రాజరాజ చోళులు (అరుళ్మొళి వర్మ) అంతటి మహోన్నత స్థానాన్ని పొందేవారు కాదు కూడాను.

అదృష్టవశాత్తు ఆ సందర్భాన్ని తెలుసుకొని దాన్ని ఉపయోగించుకొనే సమయోచిత జ్ఞానం ఆయన కలిగివున్నారు. పడవ నడిపే మురుగయ్యన్ గత రాత్రి చెప్పిన వృత్తాంతాన్ని గుర్తు చేసుకొన్నారు. ఏనుగు దగ్గరకు వచ్చినవాడు నిజమైన మావటి కాడు. ఏదో దురుద్దేశంతో వచ్చినవాడు. అందుకే ఏనుగు వాడిని విసిరేసింది అన్న విషయాన్ని కూడ ఒక్క క్షణంలో ఊహించి తెలుసుకొన్నారు. వచ్చినవాడెవడు, ఎందుకు వచ్చాడు అన్నది పరిశోధిస్తూ కూర్చొంటే చేతికి చిక్కిన అవకాశం జారిపోతుంది. 'ఏనుగుకు మదపిచ్చి పట్టింది!' అన్న కేకల వల్ల ప్రజల్లో పుట్టిన భీతి, గందరగోళాన్ని మళ్ళీ ఉపయోగించుకొనే అవకాశం రాదు. ఆ ప్రజల మధ్యనుంచి తప్పుకొని వీలైనంత వేగంగా తంజావూరు చేరడమే ఆ సమయాన ఆయన ప్రధానోద్దేశం. ఆ ఉద్దేశాన్ని నెరవేర్చుకోవడానికి దీనికన్న మంచి సందర్భం దొరకబోదు.

కాబట్టి, మురుగయ్యన్ని దగ్గరకు పిలిచి, అతడి చెవిలో ఏదో చెప్పేసి, తర్వాత అతడి భుజాల మీదకెక్కి ఏనుగుపైకి ఎగిరారు. అలా ఎగిరేటప్పుడు ఏనుగుపైనున్న అంబారీని పక్కకు తోశారు. అంబారీ కిందపడి దొర్లింది. తర్వాత, ఏనుగు చెవిలో కూడ దాని భాషలో ఏదో చెప్పారు. వెంటనే ఏనుగు పరుగు లంకించుకొంది. మునుపటిలాగే, భయంకరంగా ఘీంకరిస్తూనే వేగంగా నడిచింది. కాసేపటికి పరుగెత్తడానికే మొదలుపెట్టింది.

అదే సమయాన మురుగయ్యన్ "అయ్యో! ఏనుగుకు మదపిచ్చి పట్టింది! పరుగెత్తండి! పరుగెత్తండి!" అని పెద్దగా కేకలేశాడు.

ప్రజలు మునుపటికన్న ఇంకా బెదిరిపోయి నలుదిక్కులా పరుగెత్తారు. చుట్టుపక్కలున్న సందుగొందుల్లోకి దూరి పరుగెత్తారు. తెరచిన ఇళ్ళలో దూరి దాక్కొన్నారు. దేనికీ బెదరని ధీరమనస్కులు కూడ మదించిన ఏనుగంటే పరుగెత్తే తీరాలి. ఎంతటి మహావీరుడైనా కూడ మదపుటేనుగును ఎదిరించలేడు (అనువాదకుల మాట: చిత్రదుర్గం రాజైన మదకరి నాయకుడు ఒక మదపుటేనుగును ఎదిరించి లొంగదీసుకోగలిగినందు వల్లే ఆ బిరుదు పొందాడు (18 వ శతాబ్దం)). ఆయుధాలతో ఎదిరించి నిలబడడం కూడ సాధ్యం కాని పని. నిరాయుధులైన సాధారణ ప్రజలు - స్త్రీలు, పురుషులు, వృద్ధులు, పిల్లలు - పరుగెత్తక ఇంకేం చేయగలరు?

తిరుఆరూర్ నగరాన్ని దాటగానే, యువరాజు ఏనుగును తిన్నగా తంజావూరుకు వెళ్ళే రాజబాటవైపు నడపక, వాయవ్య దిశగా పోనిచ్చారు. ఇంతకు ముందు, మొదట పళైయారైకి వెళ్ళి అక్కడ తమ అక్కగారుంటే వారితో మాట్లాడేసి తర్వాత తంజావూరుకు వెళ్ళాలన్న ఆలోచన ఉండేది. అదిప్పుడు ఇంకా దృఢపడింది. మదం పట్టిన ఏనుగు దారికి అడ్డం పడి పరుగెత్తడమే సహజంగా తోస్తుంది (చూసేవారికి). తంజావూరు రాజబాటలో వెళితే ప్రజలు తమను వదలకుండ వెన్నంటి రావచ్చు. దారిలేని దారిన వెళితే ప్రజలు వెన్నంటి రాలేరు.

ఇలా అతివేగంగా ఆలోచించి ఒక తీర్మానానికి వచ్చి ఏనుగును వాయవ్యదిశగా అడ్డదారిన

నడిపించుకొంటూ వెళ్ళారు యువరాజు. పంట పొలాలు, పంట కాలువలు, నదులు, వాటి తెగిన గట్లు - వీటన్నిటినీ పట్టించుకోక ఏనుగు ఉల్లాసంగా/హుషారుగా తనకు తోచిన తీరున వెళ్ళసాగింది. యువరాజు మనసు కూడ ఇదీ అని తెలియని ఒక నూతనోత్సాహంగొని, పంజరంనుంచి విడుదలైన పక్షిలాగ ఆకాశవీధిలో విహరించింది. తమ జీవితంలో ఒక ముఖ్యమైన ఘట్టాన్ని సమీపిస్తున్నామన్న అంతరానుభూతి నుంచి అటువంటి ఉత్సాహం పొంగుకొచ్చింది.

~

ఏనుగు పరుగెత్తనారంభించగానే అదే సమయాన మురుగయ్యన్, "ఏనుగుకు మదపిచ్చి పట్టింది!" అని అరుస్తూ పరుగెత్తనారంభించాడు. ఏనుగు ఎత్తి విసిరేసిన మావటి పడ్డచోతును గురిగా పెట్టుకొని అటువైపు పరుగెత్తాడు. యువరాజు విడిది చేసిన చోళమాళిగకు కాస్త దూరాన దేశమంతటా పేరుప్రఖ్యాతులుగాంచిన 'కమలాలయం' అన్న తామర కొలనొకటుండేది. ఆ కొలను గట్టు దగ్గరకు వెళ్ళి చూశాడు. ఏనుగుకు భయపడ్డ చాల మంది ప్రజలు కొలను గట్టు దిగి నిలబడివున్నారు. కొందరు నీటిలోపలే దిగి నిలబడివున్నారు. ఒక మనిషి తడబడుతూ ఈదుకొంటూ గట్టెక్కడం కనిపించింది. వాడిని మురుగయ్యన్ పరీక్షగా చూశాడు. మునుపటి రాత్రి మావటిని, రాక్కమ్మను పిలుచుకొని వెళ్ళిన మాంత్రికుడే వాడు! అదృష్టశాలి! గట్టి ఆయుష్షు! ఏనుగు ఎత్తి విసిరేసినా కూడ ఇంకా బతికే ఉన్నాడు కద? కాసేపటి క్రితం చేత అంకుశంతో ఏనుగు దగ్గరకు పరుగెత్తుకొచ్చినవాడు వీడే! అంకుశం ఏమైందో తెలియదు. అది కూడ కొలనులో పడిపోయిందా?

మురుగయ్యన్ వాడి దగ్గరకు వెళ్ళి, "మావటీ! అదృష్టం కొద్దీ బతికావు! అంకుశం ఎక్కడ?" అని అడిగాడు.

రేవదాసు అనబడే క్రమవిత్తుడు మురుగయ్యన్ని ఎగాదిగా చూసి, "ఏమయ్యా అడుగుతున్నావు? నీవెవరు? నేనిప్పుడే కొలనులో స్నానం చేసి గట్టెక్కుతున్నా!" అన్నాడు.

"ఒహో! అలాగా? నీవు ఏనుగు మావటివి కావా? ఏనుగు ఎత్తి విసిరేసింది నిన్ను కాదా? అలాగైతే మావటి ఎక్కడ?" అని అడిగాడు మురుగయ్యన్.

"నాకేం తెలుసు? నన్నెందుకు అడుగుతున్నావు?" అని దబాయించాడు రేవదాసు.

"మాంత్రికా! నన్నెందుకు ఏమార్చజూస్తున్నావు? నిన్న రాత్రి ఏనుగు మావటిని స్మశానానికి తీసుకొని వెళ్ళి 'ఏనుగుకు మదం పడుతుంది' అని హెచ్చరించావు కద? అలా ఉండగా, నీవే ఆ హెచ్చరికను మరిచి ఏనుగు దగ్గరికి వెళ్ళి చిక్కుకొన్నావు కద? సరే, అది నీ ఖర్మ! మావటి ఎక్కడ? నా భార్య రాక్కమ్మాళ్ ఎక్కడ?" అని అడిగాడు మురుగయ్యన్.

క్రమవిత్తుని ముఖాన మునుపటి కన్న ఆశ్చర్యం ఎక్కువైంది.

"ఏనుగు మావటి ఏమిటి? రాక్కమ్మాళ్ ఏమిటి? నీకేమైనా పిచ్చి పట్టిందా?" అని అంటూనే

క్రమవిత్తుడు చుట్టు పక్కల పరికించి చూశాడు.

"అవునవును! ఏనుగుకు మదపిచ్చి పట్టినట్లే నాకూ పిచ్చి పట్టింది! ఏనుగు మావటి ఎక్కడున్నది మాత్రం చెప్పేయి! లేకపోతే..." అని మురుగయ్యన్ కాస్త అధికార ధోరణిలో మాట్లాడ మొదలు పెట్టాడు.

చుట్టూ చూస్తున్న రేవదాసన్ ఇప్పుడు మురుగయ్యన్ని చూసి చిరునవ్వు నవ్వాడు.

"నీవు నన్ను 'మాంత్రికుడు' అంటున్నావు! నీవు నాకన్న పెద్ద మాంత్రికుడిలాగ ఉన్నావే! నీకంతా తెలిసినట్లుంది! నీనుంచి దాచడంలో ప్రయోజనం లేదు. 'ఏనుగుకు మదపిచ్చి పట్టింది! దానిమీదకు ఎక్కవద్దు!' అని యువరాజును హెచ్చరించేందుకే పరుగెత్తి వచ్చాను. దాని ఫలితం ఇలా జరిగింది. నీ భార్య, ఏనుగు మావటి అక్కడ ఒక ఇంట్లో ఉన్నారు. వారిని నీవు చూడాలనుకొంటే నేనే నిన్ను పిలుచుకొని వెళతాను. యువరాజుకేమీ కాలేదు కద? ఆయన క్షేమమే కద?" అని అడిగాడు.

"యువరాజు క్షేమమే. ఆయనే నిన్ను, ఏనుగు మావటిని పిలుచుకొని రమ్మని ఆజ్ఞాపించారు..."

"యువరాజు వద్ద నాకు మంచి బహుమానం ఇప్పించాలి! తెలిసిందా? చూడబోతే, నేనే కద ఆయనను కాపాడాను? ఆః! అదిగో...!" అని మాంత్రికుడు ఆశ్చర్యంతో చెప్పి మాటలను ఆపాడు.

~

మాంత్రికుడు పరీక్షగా చూసిన చోట, కొలను గట్టున గన్నేరు పొదల్లో శూలపు మొనలాంటి వస్తువు కనిపించింది.

"ఆః! అంకుశం!" అంటూనే మాంత్రికుడు ఆ గన్నేరు పొదలవైపు పరుగెత్తాడు.

మురుగయ్యన్ వాడికన్న వేగంగా పరుగెత్తి గన్నేరు పొదల్లో దూరి అంకుశపు పిడి పట్టుకొని జాగ్రత్తగా చేతిలోకి తీసుకొన్నాడు.

తర్వాత తిరిగి చూశాడు. మాంత్రికుడు కనిపించలేదు. "అరెరె! మోసపోయాం కద?" అన్న విచారంతో అటూ ఇటూ పరికించి చూశాడు. ప్రయోజనం లేదు. కొలను గట్టున గుమిగూడిన ప్రజల మధ్య దూరి మాయమైనాడు మాంత్రికుడు.

మదపుటేనుగు పరుగెత్తి వెళ్ళిన తర్వాత, చెదరిన ప్రజలు మళ్ళీ చోళ మాళిగవైపు రావడాన్ని గమనించాడు మురుగయ్యన్.

కానీ అతడక్కడ ఆగలేదు.

గత రాత్రి మాంత్రికుడిని ఏ ఇంట్లో చూశాడో ఆ ఇల్లున్న దిక్కును గుర్తు చేసుకొని అటువైపు వెళ్ళాడు. దారి పొడుగున, రాజవీధుల్లో ప్రజలు అక్కడక్కడా గుమిగూడి మాట్లాడుకొంటున్నారు. మదపుటేనుగు పరుగెత్తడాన్ని చూసిన కొందరు, "ఏనుగుపైన ఎవరో కూర్చొని ఉన్నట్లు తోచింది"

అన్నారు. ఇంకొందరు దాన్ని ఒప్పుకోలేదు. "అదెలా సాధ్యం? ఏనుగు మావటిని ఎత్తి విసిరేసిన తర్వాతే కద పరుగెత్తనారంభించింది? దానిపైన ఎవరెక్కి ఉండ సాధ్యం?" అని తర్కించారు. అందరూ ఇలా వివాదిస్తూనే చోళమాళిగవైపు తిరిగి వెళ్ళసాగారు. తమ ప్రేమాభిమానాలను చూరగొన్న యువరాజుకేమీ అపాయం కలగలేదని రూఢి చేసుకోవాలని అందరూ ఉత్కంఠతో ముందుకు సాగారు.

~

మురుగయ్యన్ ప్రజలు వెళ్ళిన దిశకు వ్యతిరేకదిశలో వెళ్ళి తాను గురి పెట్టుకొన్న సందులో దూరాడు. అప్పుడక్కడ ప్రజల సంచారమే లేదు. అందరూ రాజవీధుల్లోకి వెళ్ళారు. రాత్రి చూసిన ఇంటిని పగటిపూట గుర్తు పట్టడం అంత తేలిక కాలేదు. ప్రతి ఇంటినీ పరీక్షగా చూస్తూ వెళ్ళాడు. ఒక ఇంటి ముందు వాకిలి మాత్రం తాళం వేయబడింది. లోపలినుంచ ఏదో గొణుగుడు శబ్దం వినిపించింది. ఆ ఇంటి పక్కన ఒక పాడుబడ్డ ఇల్లుంది. మురుగయ్యన్ ఆ పాడుబడ్డ ఇంట దూరి పక్కింటి కప్పుమీదికెక్కి డాబా మీదికి దూకాడు. అతడు ఎదురు చూసినట్లే అక్కడ ఏనుగు మావటి కనిపించాడు. అతడు పిచ్చిపట్టినవాడిలాగ తోచాడు. వాడు కాళ్ళు చేతులు కట్టబడివుండడమే కాక, వాడు ఒక స్తంభానికి కట్టబడివున్నాడు. మావటి తన చేతి కట్లను పళ్ళతో కొరికి విప్పుకోవడానికి తెగ ప్రయత్నం చేస్తున్నాడు. మధ్య మధ్య కొరకడం ఆపి కేకలేస్తున్నాడు.

మురుగయ్యన్ని చూడగానే వాడి ముఖం కాస్త తేటపడింది. నాగపట్టణంలోనే మురుగయ్యన్ని చూసివున్నాడు. యువరాజుకు కావలసినవాడని కూడ గ్రహించాడు. కాబట్టి ఇప్పుడు గాభరాగా, “మురుగయ్యా! నా కట్లు విప్పు! ఛండాలురు నన్ను మోసం చేశారు! యువరాజుకు అపాయం ఏమీ కలగలేదు కద?” అన్నాడు.

మురుగయ్యన్ వాడి కట్లు విప్పుతూనే పొద్దున జరిగిన సంఘటనలను క్లుప్తంగా చెప్పి, మావటిని అతడికి ఏమైందని విచారించాడు. మావటి కూడ ఒకింత తడబడుతూ అంతా వివరించాడు. ఏనుగుకు మదమెక్కినా తనకేమీ కాకుండ ఉండేందుకు మంత్రించిన కవచమిస్తామని ఈ ఇంటికి పిలుచుకొని వచ్చారని, ఇక్కడికి వస్తూనే సాంబ్రాణి పొగ వేస్తూ మాంత్రికుడు ఏవో మంత్రాలు జపించాడని, అప్పుడు తనకు మైకం కమ్మి నిద్రపోయాడని, తాను మేలుకొని చూసినప్పుడు ఇలా తనను స్తంభానికి కట్టేసి ఉండడాన్ని తెలుసుకొన్నాడని చెప్పాడు.

ఇద్దరూ ఆ ఇంటి నుంచి బయటకు వచ్చి చోళమాళిగవైపు వేగంగా వెళ్ళారు.

వారు ఆ మాళిగను చేరుకొన్నప్పుడు మునుపటికన్న పెద్ద కూటమి కూడివుండడాన్ని, వారంతా చాల దిగులుతో మాట్లాడుకొంటూండడాన్ని గమనించారు.

ప్రజల దిగులుకు కారణం - యువరాజు కనిపించకపోవడమే. ఆయనకేం అయిందని నిర్దుష్టంగా తెలిసినవారక్కడ ఎవరూ లేరు. ఏనుగుపైన ఒకరిని చూసినట్లు మాత్రం కొందరు చెప్పారు. అది

ఒకవేళ యువరాజే అయివుండవచ్చని ఊహించారు.

యువరాజు ఏనుగులను మచ్చిక చేసుకొనే విద్యలో ఆరితేరినవారని, ఆయనకు ఏనుగుల భాష కూడ తెలుసన్న విషయం చోళనాడులో చాల ప్రసిద్ధమైనది. కాబట్టి మదమెక్కిన ఏనుగు వల్ల ఎవరికీ ఏ హాని కలగకూడదని పొన్నియిన్ సెల్వన్ దాని మదాన్ని అణచేందుకు దానిపైకెక్కి వెళ్ళివుండాలని కొందరు తమ దృఢనమ్మకాన్ని వెలిబుచ్చారు.

ఈ సమయాన మురుగయ్యన్, ఏనుగు మావటి అక్కడికి వచ్చి చేరారు. మావటికి కిందటి రాత్రి ఏం జరిగిందో తెలిసినప్పుడు, వారి ఆశ్చర్యం పదింతలైంది.

ఏనుగు మావటిని కట్టిపడేసి అంకుశాన్ని తీసుకొని వచ్చినవాడు చోళకులం విరోధుల చేత పంపబడ్డవాడైవుండాలి. 'ఒక వేళ పళువేట్టరయ్యర్లే పంపించివుండవచ్చు!" అని కొందరు ఊహించి చెప్పినదాన్ని ప్రజల్లో చాల మంది నమ్మారు. కాబట్టి పళువేట్టరయ్యర్ల మీద వారి కోపం ఇంకా అధికమైంది. ఆ క్రోధావేశంలో కొందరు వెంటనే తంజావూరుకు బయలుదేరారు. ఏనుగు వెళ్ళిన దారిని విచారించుకొని ఒక జట్టువారు, తంజావూరుకు తిన్నగా వెళ్ళే రాజమార్గం వెంబడి తక్కినవారు కోపావేశంతో బయలుదేరి వెళ్ళారు.

~~~
~~~

# అధ్యాయము - 19

## తిరునల్లం

**జ్యోతిష్కుల** ఇంటి కప్పును, దానితోబాటు తన ప్రాణాలను గట్టిగా పట్టుకొన్న వాణతి కావేరి నది గట్టు తెగిన వెల్లువలో తేలుతూ వెళుతూంది. వెల్లువ ఆమెను పైపైకి తీసుకొని వెళ్ళి తూర్పుగా వెళ్ళసాగింది. కొన్నిసార్లు మెల్లగాను, కొన్నిసార్లు వేగంగాను లాక్కువెళ్ళింది. ఇంకొన్ని సార్లు సుడిగుండాల్లో చిక్కుకొని ఆ ఇంటి కప్పు సుడులు తిరుగుతూ తల్లడిల్లింది.

కొన్నిసార్లు ఆ వెల్లువ లోతెక్కువలేని మెట్ట ప్రదేశాల మీదుగా వెళ్ళింది. అక్కడక్కడ చెట్లకింద వెల్లువ ప్రవహించినప్పుడు, తీరం వెంబడి అక్కడక్కడ ఉన్న మంటపాలు ఎంతవరకు మునిగివున్నాయో చూసినప్పుడు వెల్లువ ఎంత లోతుందని తెలియవచ్చింది. వెల్లువ మిట్ట మీద వెళుతున్నప్పుడు వాణతి కప్పుమీది నుంచి దిగేద్దామని ఆలోచించేలోపు సుడిగుండాల్లోకి లాక్కొని వెళ్ళిపోయింది.

దిగేందుకు కూడ వాణతికి అంతగా మనస్కరించలేదు. ఎందుకంటే పొన్ని నది వెల్లువ ఆమెను పొన్నియిన్ సెల్వన్ ఉన్నచోటికి తీసుకొని వెళుతున్నట్లు ఆమె మనసులో ఒక భావం కలిగింది. యువరాజుకు కలగబోయే అపాయం గురించి పళువేట్టరయ్యర్ సూక్ష్మంగా చెప్పింది ఆమె మనసులో బాగ పదిలమైంది. వారిని ఆ అపాయంనుంచి కాపాడేందుకే పొన్ని నది తనను తీసుకొని వెళుతున్నట్లు భావించింది.

ఆహా! ఆ పూంగుళలికి ఎంత గర్వం? యువరాజు విషయంలో ఎంత హక్కు, అధికారంగొంది? కానీ అలా హక్కున్నట్లు ప్రవర్తించేందుకు బలమైన కారణముంది కూడాను. యువరాజు బతికివున్నదే పూంగుళలి వల్లనే కద! ఏనాడూ కాదు! - ఆ కుడంద్రై జ్యోతిష్కులు చెప్పింది ఆమె వింది కద! యువరాజుకు ఇలాంటి గండాలెన్నో వస్తాయిగాని ఆయన ప్రాణాలకు ఏ అపాయమూ రాదు! ఆయన పుట్టిన వేళ అలాంటిది! లోకాన్నేలేందుకు పుట్టినవారిని ఈ సుడిగాలి, వాన వరద ఏం చేయగలవు? ఆయనలా గండం తప్పేందుకు ఎవరైన ఒకరు నెపం కావాలంతే! పూంగుళలికి అటువంటి భాగ్యం దొరిగింది! అందుకని ఆమె ఎలా ఆయనమీద హక్కు చెలాయించగలదు? అయినాకూడ, అటువంటి భాగ్యం తనకు దొరకకూడదా అన్న తీరని కోరిక ఆమె మనసులో చాల కాలంగా గూడు కట్టుకొనివుంది.

కొన్నిసార్లు కప్పు సుడులు తిరిగినప్పుడు వెనక చాల దూరంలో ఒక పడవ వస్తూండడాన్ని వాణతి చూసింది. అందులో ఒక స్త్రీ, ఒక పురుషుడు ఉండడం కూడ కనిపించింది. ఎవరని స్పష్టంగా తెలియలేదు. ఆ స్త్రీ పడవ నడుపుతుండడాన్ని గమనించగానే అది బహుశ పూంగుళలి కావచ్చని అనుకొంది వాణతి. తనను వరద నుంచి కాపాడేందుకు వస్తున్నారా? యువరాకుమారి పంపించిందా?

చాలు, చాలు, ఆమెకు (=పూంగుళలికి) యువరాజు ఋణపడివుండడమే చాలు. తాను కూడ ఋణపడడం వద్దు! కూడనే కూడదు. తాను ఆమె వల్ల ఈ వెల్లువనుంచి కాపాడాబడకూడనే కూడదు.

కొన్నిసార్లు పడవ ఆమెకు అతిసమీపంగా వచ్చేసినట్లనిపించింది. కొన్నిసార్లు కప్పు వేగంగా ముందుకు వెళ్ళిపోయి, పడవ వెనకబడిపోయినట్లనిపించింది.

ఇలా పడవ ఒకసారి కనుమరుగైనప్పుడు, ఇంటి కప్పు దిశ తిరిగి దక్షిణంగా వెళుతున్నట్లనిపించింది. కావేరినది దక్షిణతీరాన్ని దాటి, దక్షిణంగా సముద్రంలాగ కనిపిస్తున్న వరదనీరున్న ప్రదేశానికి వెళ్ళింది. చివరికి వరద నీటి ఎల్ల కనిపించింది. ఆహా! ఇది ఒక నదీతీరం లాగ కద కనిపిస్తూంది! అవును! ఇది అరిసిలా నదీ తీరమే! కావేరి నది వరద గట్లు తెంచుకొని మధ్య అనేక దేశాలను ముంచేసి వచ్చి ఈ నదిలో పడుతుంది. దీని దక్షిణతీరం కాస్త మెట్టగా ఉండడం వల్ల ఆ నదిలో ఒదిగి ప్రవహిస్తూంది. ఆ నదీ తీరం, చెట్లతో కూడిన చుట్టుపక్కల ప్రదేశాలు ఆమెకు పరిచితంగా కనిపించాయి. పూర్వజన్మ వాసనలాగ గుర్తుకొచ్చింది. లేదు, లేదు! ఈ జన్మలోనే రెండుమూడు సార్లు చూసిన ప్రదేశమే! తాను తిరునల్లం అన్న క్షేత్రాన్ని సమీపిస్తుండాలి. అక్కడున్న ఆలయాన్ని శెంబియన్ మహాదేవి తమ భర్త గండరాదిత్యుల జ్ఞాపకార్థం నల్లరాతితో పునర్నిర్మించేందుకు కైంకర్యం చేయాలని చాల ఆసక్తితో ఉన్నారు. అక్కడ ఆ నదీ తీరాన చోళ వంశస్థులు విడిది చేసేందుకు ఒక వసంత మాళిగ కూడ ఉంది. శెంబియన్ మహాదేవి ఒకసారి యువరాకుమారి కుందవైని అక్కడికి పిలుచుకొని వెళ్ళగా, తాను కూడ వారితో వెళ్ళింది! ఆ మాళిగతో చేరివున్న తోటల్లోకి వెళ్ళి పక్షుల ఇంపైన కిలకిలారావాలను వినడమంటే తనకెంతో ఇష్టం! ఆహా! అప్పుడు అక్కడ జరిగిన ఒక సంఘటన వాణతి మనసులో ఎన్నడూ మరిచిపోలేనంత గాఢంగా పదిలమైంది.

~~~
~~~

# అధ్యాయము - 20

## తిరునల్లం

కొడుంబాళూర్నుంచి వాణతి పళైయార్రైకి వచ్చిన కొత్తలో, చోళనాడులోని జలసమృద్ధి ఆమెను అమితాశ్చర్యానికి గురిచేసింది. కొడుంబాళూర్ పక్కన నది ఏదీ లేదు. చెరువులు మాత్రమే ఉండేవి. వర్షాకాలంలో చెరువులు నిండి తొణుకుతుండేవి. వేసవి కాలంలో ఎండిపోయేవి. ఇలా రెండు గట్లను తాకుతూ పారే నదులు, కాలువలు అక్కడ లేవు. తామరలు, కలువలు విరగబూసిన తటాకాలను ఆమె పుట్టినవూరిలో చూడలేదు. వీటన్నిటినీ చూస్తూ వాణతి మైమరచి కూర్చొనివుండేది. కొలనుల్లో తామరాకులమీద ముత్యాల్లాంటి నీటి బిందువులు అటూ ఇటూ పరుగెత్తడాన్ని చూసి సంతసించేది. తామరపూల చుట్టూ నల్లతుమ్మెదలు తిరుగుతూ ఆడి పాడడాన్ని చూసి పరవశించేది. పొద్దు గడవడమే తెలిసేది కాదు.

ఒకసారి వాణతి, కుందవై శెంబియన్ మహాదేవి పిలవగా తిరునల్లం క్షేత్రానికి వెళ్ళారు. వసంత మాళిగలో విడిది చేశారు. శెంబియన్ మహాదేవి, కుందవై తరచూ జైన, బౌద్ధ మహాగురువుల వృత్తాంతాల గురించి, భక్తి రసమొలికే వారి పద్యాల గురించి మాట్లాడడం మొదలుపెట్టేసేవారు. శెంబియన్ మాదేవి తాము తమ భర్త గండరాదిత్యులతో కలిసి చేసిన తీర్థ, క్షేత్ర యాత్రల గురించి చెప్పడం మొదలుపెట్టేసేవారు. అదంతా వింటూ కూర్చోవడంలో వాణతికి అంతగా ఆసక్తి లేదు. దానికన్న మాళిగకు చేరివున్న తోటలకు వెళ్ళి పక్షుల ఇంపైన/మధుర గీతాలను వినడంలోను, తటాకాలలోని తామరపూల చుట్టూ తిరిగే నల్లతుమ్మెదల ఇంపైన ఝుంకారాన్ని వినడంలోను ఆమె చాల ఆసక్తిగొనివుండేది. ఇంకా, మాళిగ పక్కనే పారుతున్న నది వెల్లువ సుడులను చూసి చాల ఆనందించేది. కొడుంబాళూర్ చుట్టుపక్కల అంతటి మనోహర, రమణీయ దృశ్యాలు చూడ సాధ్యం కాదు కద?

~

ఒకరోజు శెంబియన్ మహాదేవి, కుందవై ఏదో చాల ఆసక్తిగా మాట్లాడుకొంటున్నారు. వాణతి వారి దగ్గరికి వెళ్ళినప్పుడు యువరాకుమారి, “వాణతీ! నీవు తోటకు వెళ్ళు. కాసేపటికి నేనూ వస్తాను" అన్నది. వాణతి అలాగేనని చెప్పి కుతూహలంతో తుళ్ళుతూ, గెంతుతూ పరుగెట్టింది. తోటలో కాసేపు విహరించిన తర్వాత తామర కొలను వద్దకు వెళ్ళింది. కొలను గట్టున ఆకాశాన్ని కప్పేసేటంత పెద్ద దట్టమైన చెట్లున్నాయి. వాటిలో చాల ఎత్తుగా, కొమ్మలు, ఆకులతో ఒక మద్ది చెట్టుంది. ఇప్ప చెట్టు పూలు పూసే కాలమది. ఆ చెట్టు కింద నేలమీద రాలిన ఇప్ప పూలు నేలను పూర్తిగా కప్పేశాయి. వాటి సువాసన ఘుమ్మని వీస్తూ తోటంతా వ్యాపించింది. ఆ చెట్టు పెద్ద వేరుపైన వాణతి కూర్చొంది. చెట్టునానుకొని పైకి,

కిందకూ, అటూ, ఇటూ చూడసాగింది. పక్షుల మధురగీతాలు ఆమె చెవిన అమృతాన్ని పోయసాగాయి. ఆమె ఎన్నడూ అనుభవించని మధురభావాలు ఆమె మనసులో తోచాయి. ఆ మధురభావాలు తరచూ ఆమె ఎదలో పొంగిపొరలి ఆమె ఒళ్ళంతా పులకరింపజేశాయి. జీవితమింత ఆనందమయంగా ఉండగలదని వాణతి ఆ రోజు వరకు కలలో కూడ అనుకోలేదు.

ఆ చెట్టుకింద నుంచి చూస్తే కాస్త దూరాన నదీప్రవాహం కనిపించింది. అప్పుడామె ఆ నదీప్రవాహపు రమణీయ దృశ్యాన్ని చెట్ల మధ్యనుంచి చూస్తూ ఆనందిస్తూంది.

ఒకసారి ఎవరో ఒక యువకుడు నదిలో ఈదుతుండడం కనిపించింది. ఎర్రటి నదీప్రవాహంలో అతని బంగారు వన్నె మేను సగం నీటిలోపల, సగం నీటిపైన తేలుతూ ఆమె మనసునాకట్టుకొంది. ఛీఛీ! ఎవరో ఒక యువకుని పైన తన ధ్యానం మళ్ళడం ఎంత అసమంజసం? సిగ్గు, శరం తనతో పుట్టిన  వారితో పుట్టినవారిగా ఎంచే వాణతికి ఆ భావం చాల సిగ్గును/సంకోచాన్ని కలిగించింది.  ఆమె మనసు కట్టుబాట్లను మీరి ఆమె కళ్ళు మళ్ళీ ఒకటి రెండు సార్లు నదివైపు మళ్ళాయి.

వాణతికి తనమీదే తనకు కోపమొచ్చింది. అక్కడినుంచి లేచి వెళ్ళిపోదామా అనుకొంది. ఆ సమయాన ఇంకొక సంభవం అమె మనసునాకట్టుకొంది.

ఆమె కూర్చొన్న చోటికి సమీపాన తలపైన కాస్త ఎత్తైన ప్రదేశంనుంచి పక్షిపిల్లల కూతలు వినిపించగా, తలెత్తి చూసింది. అక్కడ ఆమెకు కనిపించిన దృశ్యం ఆమెకు ఏకకాలంలో పరితాపాన్ని, దిగులును కలిగించాయి.

ఒక చెట్టుకొమ్మలో Y లాగ ఉన్నచోట ఒక పక్షిగూడుంది. దానిలో కొన్ని పక్షిపిల్లలున్నాయి. అవే అలా 'క్రీచ్ క్రీచ్' అని మెత్తగా శబ్దం చేస్తున్నాయి. ఆ కూతల్లో భయం, అపాయ సూచన, దీన విలాపమూ కలగలిసివున్నాయి. అలా కలగలిసివున్నట్లు వాణతి చెవులకు వినిపించింది. గూడుకు అతిసమీపాన ఒక అడవిపిల్లి కొమ్మ ఎక్కి వస్తూ కనిపించింది. మెల్లమెల్లగా అది గూడును సమీపిస్తూంది!

అది చూసి వాణతి, “అయ్యో! అయ్యో!” అని కేకలేసింది. మరుక్షణమే, “ఏమి? ఏమి?” అని ఒక గొంతు వినిపించింది. ఎవరో వేగంగా పరుగెత్తి వస్తున్న కాలి అడుగుల చప్పుడు కూడ వినిపించింది. వాణతి అటువైపు తిరిగి చూసింది. కాసేపటి క్రితం నదివెల్లువలో ఈదుతున్న యువకుడే ఇప్పుడు గట్టిక్కి పరుగెత్తి వస్తున్నాడని వాణతి గ్రహించింది.

అదే సమయాన ఎక్కడినుంచో రెండు పక్షులు వచ్చేశాయి. గూడు చుట్టూ ఆర్తనాదాలు చేస్తూ గిరికీలు కొట్టసాగాయి. అవి ఆ పక్షిపిల్లల అమ్మ, నాన్న పక్షులైవుండాలి. పిల్లలను కాపాడుకోవడానికే అవి అంత తొందరగా వచ్చాయని వాణతి గ్రహించింది. రెండూ పొడవాటి ముక్కులున్న పక్షులు - వడ్రంగి పిట్టలంటే ఇవే కాబోలు. ఒక పక్షి గూడు చుట్టూ వేగంగా తిరగసాగింది. రెండవ పక్షి తన ముక్కుతో అడవి పిల్లిని పొడిచి తరిమేయ ప్రయత్నించసాగింది! ఆ పక్షులు ఆ అడవి పిల్లినేమీ చేయలేవు. పిల్లి నోటికి

దొరికితే మరుక్షణం దానికాహారం కావలసిందే. కానీ తన పిల్లలను కాపాడుకోవడం కోసం ఆ పక్షి అంత ధైర్యంగా పోరాడింది. తల్లిని, తర్వాత తండ్రిని చిన్న వయసులోనే కోల్పోయిన వాణతికి ఆ దృశ్యం చాల మనఃక్లేశాన్ని కలిగించింది.

పిల్లి కాసేపు ఊరకుండి, ఉన్నట్లుండి తన ముంగాళ్లలో ఒకదాన్ని గూటివైపు చాచింది. పిల్లలున్న  గూటి ఒక అంచును తాకింది కూడాను.

వాణతి మళ్ళీ కేకలేసింది. ఇంతలో ఆ యువకుడు దగ్గరకొచ్చేశాడు. అతన్ని అంత దగ్గరగా చూసేందుకు వాణతికి చాల సిగ్గేసింది! బదులు ఏమీ చెప్పలేకపోయింది. చేతిసైగతో పక్షి గూటిని చూపించింది.

ఆ యువకుడు అంతవరకు ఆ అమ్మాయికే ఏదో ఆపద కలిగిందనుకొన్నాడు. వాణతి చూపించిన వైపుగా చూశాడు. మళ్ళీ వాణతిని చూసి చిరునవ్వు నవ్వాడు. అతని చూపు, చిరునవ్వు వాణతిని మైమరపింపజేసి, పక్షిపిల్లల పరిస్థితిని కూడ మరిచిపోయేలా చేశాయి.

కానీ ఆ యువకుడు వెంటనే అక్కడినుంచి పరుగెత్తి వెళ్ళి చెట్టుకొమ్మలో పక్షిగూడున్న చోటికి నేరుగా కింద నిలబడ్డాడు.

అడవి పిల్లిని గద్దించాడు. అది కిందకు వంచి చూసి ఉరిమింది. “మా చెడ్డ పిల్లిలాగుందే!” అని చెబుతూనే ఒక రాతిని తీసి బలంగా విసిరాడు. రాయి పిల్లికి తగలకుండ కొమ్మకు తగిలింది. పిల్లి వెంటనే ఇంకొక కొమ్మ మీదికి దూకింది. అక్కడినుంచి ఇంకొక దట్టమైన చెట్టు మీదికి దూకి మరుగైంది.

కానీ ఇంతలో ఇంకొక విపరీతం జరిగిపోయింది. పిల్లి ఒక కాలితో పక్షి గూటిని పట్టి లాగింది కద?  కాబట్టి కాస్త కదిలిపోయిన గూడు, యువకుడు బలంగా విసిరిన రాతి దెబ్బకు ఆ కొమ్మ కదలగా, ఇప్పుడు చాల కదిలిపోయి, కింద పడిపోయే స్థితికి వచ్చింది. గూడు పూర్తిగా జారి కిందపడిపోతే అడవి పిల్లి నోటినుంచి తప్పుకొన్న ఆ పిల్లలు కింద పడి మరణిస్తాయి! అదృష్టవశాత్తు గూటి ఒక మూల కొమ్మకు బాగ కరుచుకొనివుంది. గూడు, అందులోవున్న పక్షిపిల్లలతోబాటు వేలాడుతూ ఊగిసలాడసాగింది. పక్షిపిల్లల ప్రాణాలు కూడ ఊగిసలాడాయి. వాటి తలిదండ్రులైన వడ్రంగిపిట్టలు మునుపటికన్న అధికమైన భీతితో గూటి చుట్టూ తిరగసాగాయి. గాలి కాస్త గట్టిగా వీస్తే గూడు కింద పడిపోతుంది. అంత ఎత్తునుంచి ఆ పిల్లలు కింద పడితే బతకడం కష్టమే.

యువకుడు ఒక క్షణంపాటు ఆలోచించాడు. మొదట ఆ చెట్టుపైకి ఎక్కే ఆలోచన చేసినవాడిలాగ కనిపించాడు. మరుక్షణం మనసు మార్చుకొన్నట్లు తోచింది.

వాణతిని చూసి, “అమ్మాయీ! కాస్త ఇలా రా! గూడు కింద పడితే నీ కొంగులో పట్టుకో! ఇదిగో నేను ఒక్కక్షణంలో తిరిగి వచ్చేస్తాను!” అని చెప్పేసి పరుగెత్తాడు.

అతడు చెప్పినట్లే చాల త్వరగా తిరిగి వచ్చాడు. కానీ ఇప్పుడు నడిచి రాలేదు. ఏనుగెక్కి

వచ్చాడు. వాణతికి అతడిప్పుడేం చేయబోతాడని ఒకింత తెలిసింది. కాబట్టి అవతలికి జరిగింది. దగ్గరేవున్న తామరకొలను మెట్లను సమీపించి, కొన్ని మెట్లు దిగి ఒక మెట్టుపైన కూర్చొని, ఏనుగు మీద తిరిగి వచ్చిన ఆ యువకుడు ఏం చేయబోతున్నాడా అని చూడసాగింది.

ఏనుగు చెట్టు కిందకు రాగానే ఆగింది. దాని వీపు మీద నిలబడి ఆ యువకుడు పక్షి గూటిని జాగ్రత్తగా తన చేతుల్లోకి తీసుకొని ఇంతకు మునుపు చెట్టు కొమ్మ మీద ఉన్న చోట పెట్టాడు. తల్లి పక్షి, తండ్రి పక్షి మునుపటి కన్న ఎక్కువగా ఇప్పుడు కూతలేశాయి. కానీ వాటి కూతల్లో ఉత్సాహం, సంతోషం తొణికిసలాడుతున్నట్లు తోచింది.

~

యువకుడు వెనుదిరిగి అటూ ఇటూ చూసి, "అమ్మాయీ! ఎక్కడకు వెళ్ళావు?" అని పెద్దగా అన్నాడు. వాణతి చాల సిగ్గుపడి మౌనందాల్చింది. యువకుడు ఏనుగు పైనుంచి కిందకు దిగాడు. మళ్ళీ చుట్టు పక్కల పరికించి చూశాడు.

వాణతి మనసులో ఏదో తోచింది. ఆ జ్ఞాపకం ఆమెకు చాల వింతగా అనిపించింది. తనకు తెలియకనే నవ్వొచ్చేసింది. పెద్దగా గలగలమని నవ్వింది.

అది విని యువకుడు కొలను మెట్లవద్దకు వచ్చాడు. వాణతిని చూసి, "అమ్మాయీ! ఎందుకు నవ్వుతున్నావు? నీవింత పెద్దగా నవ్వేందుకు ఇప్పుడేం జరిగింది?" అని అడిగాడు.

~

యువకుని గొంతు వాణతి చెవిన పడగానే ఆమె మళ్ళీ మైమరచింది; మనసు ఉప్పొంగింది. సిగ్గు మునుపటికన్న అధికమైంది. అతన్ని తలెత్తి చూడలేకపోయింది కాబట్టి, అటూ ఇటూ దిక్కులు చూడసాగింది.

"అమ్మాయీ! ఎందుకు నవ్వావు? చెప్పవా?" అని మళ్ళీ అడిగాడు యువకుడు.

వాణతి మనసు దిటవు చేసుకొని, "ఏమీ లేదు. నీవు పెద్ద వీరుడివిలాగున్నావని ఎంచి నవ్వాను. పిల్లితో పోరాడేందుకు ఏనుగెక్కి వచ్చావు కద?" అని అడిగింది.

అది విని యువకుడు కూడ నవ్వాడు.

"అమ్మాయీ! అది ఒట్టి పిల్లేనా? నీవు వేసిన కేకలు విని పులే అనుకొని భయపడిపోయాను!" అన్నాడు.

ఇంతలో వాణతికి ధైర్యం వచ్చేసింది. సిగ్గుకూడ తగ్గిపోయింది.

"ఆహా! అలాగా? పులిజెండా ఎగిరే చోళనాడులో నేను పులిని చూసి భయపడాలా? నీవు పాండ్యదేశస్థుడివా?" అన్నది.

"అమ్మాయీ! నేను పరదేశస్థుడిని కాను; ఈ చోళనాడుకు చెందినవాడినే! ఏనుగెక్కి

యుద్ధరంగాలకు వెళ్ళినవాడిని. నీవెవరివి? ఏవూరి అమ్మాయివి? పెద్ద నోరులాగుందే నీది?" అన్నాడు.

'ఏనుగుమావటీ! మర్యాదతో మాట్లాడు! నేనెవరినైతే నీకెందుకు? ఎందుకని అడుగుతున్నావు?" అన్నది వాణతి.

"సరే. అలాగైతే అడగను. పెద్దింటి అమ్మాయిలాగున్నావు. వెళ్తున్నాను!" అని చెప్పేసి ఆ యువకుడు మెట్లెక్కి వెళ్ళనారంభించాడు.

వాణతి మళ్ళీ పరిహాసం, వేళాకోళం కలగలిసిన గొంతుతో, "ఏనుగు మావటీ! ఏనుగు మావటీ! నన్ను కూడ నీ ఏనుగు మీద ఎక్కించుకొని వెళతావా?" అన్నది.

"సరే. ఎక్కించుకొని వెళతాను. ఏం కూలి ఇస్తావు?" అని అడిగాడు యువకుడు.

"కూలి మాత్రమేనా? నా పెదనాన్న కొడుంబాళూర్ మాళిగలో ఉద్యోగం ఇప్పిస్తాను. లేకపోతే, ఏనుగుల సైన్యానికి సేనాధిపతిగా చేస్తాను!" అన్నది వాణతి.

"ఓహో! కొడుంబాళూర్ రాకుమారిగారా తమరు?" అన్నాడు యువకుడు. ఇంతవరకు విప్పారివున్న ముఖం ఇప్పుడు కుంచించుకుపోయింది. చిరునవ్వు మరుగైంది/మాయమైంది. కనుబొమలు ముడివడ్డాయి.

"ఏం? కొడుంబాళూర్ రాకుమారంటే అంత లోకువా? నీ ఏనుగెక్కి రాకూడదా?" అన్నది వాణతి.

"లేదు, లేదు! కొడుంబాళూర్ కొట్టంలో ఎన్నో ఏనుగులున్నాయి; ఎందరో మావటీలున్నారు. నేనెందుకు?" అని చెప్పేసి యువకుడు గబగబ నడిచి వెళ్ళాడు. అతడేమైనా తిరిగి చూస్తాడేమోనని కాసేపటి వరకు ఎదురు చూసింది వాణతి. కానీ అతడు తిరిగి చూడక ఏనుగెక్కి వెళ్ళిపోయాడు.

ఈ సంభవం వాణతి మనసులో చాల గట్టిగా పదిలమైంది. తరచూ గుర్తుకొచ్చేది. ఆ ఏనుగు మావటి రూపమూ, విప్పారిన ముఖమూ, ఇంపైన గొంతు గుర్తుకొచ్చినప్పుడల్లా మనసులో ఇదీ అని తెలియని ఒక భావం కలిగేది. అతడు పక్షి పిల్లలను కాపాడేందుకు ఏనుగెక్కి వచ్చిన విషయం గుర్తుకొచ్చినప్పుడల్లా ఆమెకు తెలియకనే నవ్వొచ్చేది. తనకు తానే నవ్వుకొనేది; తర్వాత అందుగురించి సిగ్గుపడేది కూడాను. ఆ ఏనుగు మావటి అహంభావాన్ని, కొడుంబాళూర్ అన్న మాట వినగానే ముఖం ముడుచుకొని వెనుదిరిగిన వైనాన్ని తలచుకొన్నప్పుడల్లా అతడిమీద కోపమొచ్చేది. మొత్తానికి, అతడి గురించి తరచూ ఆలోచిస్తుండేది.

~

తిరునల్లానికి తమ అక్కగారిని చూసేందుకు పొన్నియిన్ సెల్వన్ రాబోతున్నారని అంతఃపురంలో అందరూ మాట్లాడుకోసాగారు. చోళనాడు ప్రజల కనుపాపగా విరాజిల్లిన యువరాజును చూడాలన్న ఆసక్తి అంతఃపుర స్త్రీలందరికీ ఉన్నట్లు వాణతికీ ఉండేది. దానికి తగిన సందర్భం అంత తేలికగా

దొరకలేదు. యువరాజు వచ్చేశాడన్న మాటేమో వినిపించిందిగాని ఆయన అంతఃపురానికి రానేలేదు. సహజంగా బిడియస్తురాలైన వాణతి తక్కిన చెలికత్తెలలాగ నెపం కల్పించుకొని వెళ్ళి యువరాజును చూడాలని కోరుకోలేదు. యువరాజు తిరునల్లం నుంచి బయలుదేరిన రోజే వాణతి అంతఃపురం పైమేడ మీద నిలబడి ఆయనను చూసే అవకాశం కలిగింది. ఆయన ఏనుగు మీద ఎక్కి ప్రయాణానికి సిద్ధమవుతున్నారు. వాణతి తన కళ్ళను తానే నమ్మలేకపోయిందంటే, అది అతిశయోక్తి కాదు. ఏనుగు మావటి అని తాను గేలి చేసి నవ్వి, అధికారం చెలాయించేందుకు కూడ తెగించిన ఆ యువకుడే యువరాజు అరుళ్మొళి వర్మ అంటే, ఆమె తన కళ్ళను తాను ఎలా నమ్మగలదు? తర్వాత పక్కనున్న చెలికత్తెలను అడిగి ఖచ్చితం చేసుకొంది. అందువల్ల వాణతి పొందిన అవమానం, మనోవేదన చెప్పనలవి కాదు.

లోకాన్నేలేందుకు పుట్టిన ఆయనకు తమ కొడుంబాళూర్ కొట్టంలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పింది తలుచుకొంటే ఒకవైపు నవ్వొచ్చేది; అదే సమయాన కళ్ళలో నీళ్ళు తిరిగేది. తన మూర్ఖత్వాన్ని తలుచుకొని తలుచుకొని విచారించేది. అప్పుడు ఆయన ముఖం కుంచించుకుపోయిన కారణం తాను 'ఏనుగు మావటి' అని పిలవడమే అనుకొంది. సిగ్గు, బిడియం, వినయంలాంటి గుణాల్లో తనకేవీ లేవని ఆయన భావించివుంటారు! అది తలుచుకొన్నప్పుడు ఆమె పడ్డ వేదనకు అంతే లేదు. ఏట్లోనే, చెరువులోనో పడి చచ్చిపోదామా అని కూడ చాలసార్లనుకొంది. యువరాకుమారి కుందవై వద్ద తాను చేసిన తప్పును చెప్పేద్దామని చాలసార్లు ప్రయత్నించింది. కానీ అందుకు ధైర్యం చాలలేదు. యువరాజే ఆ విషయాన్ని తమ అక్కగారికి చెప్పివుంటే ఆమె తనని అడిగేది. కుందవైదేవి తననడగలేదు కాబట్టి ఆయన ఆ విషయాన్ని తమ అక్కగారికి చెప్పుకోలేదన్న ముగింపుకు వచ్చింది. ఎన్నో మనోవేదనల మధ్య ఈ తలపే ఆమెకు కాస్త ఊరటనిచ్చేది. ఎప్పుడైన ఒకరోజు పొన్నియిన్ సెల్వన్‌ని ప్రత్యక్షంగా క్షమాపణ కోరిన తర్వాత ప్రాణాలు విడవాలని నిశ్చయించుకొంది. కానీ అందుకు కూడ ధైర్యం చాలలేదు.

పళైయారైకి తిరిగి వచ్చిన తర్వాత యువరాజును కలిసే సందర్భం రావచ్చని తోచినప్పుడల్లా పరుగెత్తి వెళ్ళి దాక్కొనేది. యువరాజు సముఖానికి వెళ్ళడం కన్న ప్రాణత్యాగమే మేలని భావించనారంభించింది. తిరునల్లంలో జరిగింది తెలియని యువరాకుమారి, ఆమె చెలికత్తెలు, "ఈ పిల్ల ఎందుకింత సిగ్గుపడుతోంది?" అని మాత్రం ఆశ్చర్యపడ్డారు. ఆమె భయపడే స్వభావానికి ఇది కూడ తోడయ్యిందనుకొన్నారు.

పొన్నియిన్ సెల్వన్ తనమీద అయిష్టభావం కలిగివుండడానికి ఇంకొక కారణం కూడ ఉందని వాణతి త్వరలోనే తెలుసుకొంది. యువరాజు అరుళ్మొళి వర్మ లోకాన్నేలేందుకు పుట్టారని ప్రజలందరూ నమ్మినట్లుగానే ఆమె పుట్టింటివారు కూడ నమ్మారు. కాబట్టి వాణతిని ఆయనకిచ్చి పెళ్ళి చేసేయాలని ఆమె పెదనాన్న ఒక ప్రణాళిక/పథకం వేసుకొన్నారని ఆమెకు చూచాయగా తెలుసు. ఆ ఉద్దేశంతోనే ఆమె పెదనాన్న బూది విక్రమకేసరి ఆమెను పళైయారైకి పంపించారని కుందవైదేవి తక్కిన చెలికత్తెలు తరచూ

మాట్లాడుకొనేవారు. కొన్నిసార్లు వాణతికే నేరుగా చెప్పేసేవారు; చెప్పి పరిహసించేవారు. "అందుకే నీవు యువరాజు సమక్షానికే వెళ్ళనంటున్నావు! మాకు తెలియదా నీ దొంగతనం?" అనేవారు. ఈ మాటలు వాణతి చెవులకు చేదుగా అనిపించేవి. తాను కొడుంబాళూర్ అమ్మాయి అని తెలిసిన వెంటనే ఏనుగు మావటి ముఖం కుంచించుకుపోవడానికి అదే కారణం కావచ్చు కదా?

ఇలా వాణతి లేత మనసు కల్లోలితమై ఉన్న సమయానే ఒకనాడు యువరాజు లంకా యుద్ధానికి బయలుదేరారు. అంతఃపురంనుంచి చెలికత్తెలందరూ చేత మంగళదీపాలతో ఆయనను దీవించి సాగనంపేందుకు ఏర్పాట్లు చేయబడ్డాయి. ఈ సమయాన కూడ రానని చెప్పేందుకు వాణతికి సాధ్యం కాలేదు. పోరుకు వెళుతున్న యువరాజును ఒకసారి చూడాలన్న ఆశ ఆమె మనసులో కూడ ఉప్పొంగింది. నోరు తెరిచి మాట్లాడకపోయినా, తన ముఖభావాలతోను, కళ్ళతోను ఆయనను క్షమాపణ కోరవచ్చని కూడ అనుకొంది. కానీ ఆమె అనుకొన్నదానికి తారుమారుగా ఒక సంభవం జరిగిపోయింది. యువరాజు ఆమె దగ్గరకొచ్చి, ఆమెను ఎగాదిగా చూడగానే వాణతి స్పృహతప్పి, దీపాన్ని కూడ పడేసి కింద పడిపోయింది. దాని తర్వాత జరిగినదంతా పాఠకులకు తెలిసిందే కదా?

~

పెంకుటింటి కప్పుమీద కూర్చొని నదివెల్లువలో తేలుతూ వెళుతున్న వాణతి తిరునల్లం క్షేత్రాన్ని సమీపించినప్పుడు పైన వివరించిన సంభవాలు ఒకదాని తర్వాత ఒకటి ఆమె మనసులో తోచి మరుగైనాయి. పొన్నియిన్ సెల్వన్‌కి తన మీద ప్రేమ, ఆర్ద్రత ఉన్నాయని ఆమె ఇప్పటికే గ్రహించింది. దాన్ని ఆయన యువరాకుమారి ద్వారాను, ప్రత్యక్షంగాను కూడ తెలియజేశారు కూడాను. కానీ ఆయన ప్రేమ పూర్ణ స్థితికి చేరక ఒక అడ్డు పుల్లకూడ ఉండేది. అది ఏమని కూడ ఆమెకు తెలుసు. యువరాజు ఒకానొకప్పుడు చక్రవర్తి కావచ్చనే ఉద్దేశంతో ఆమెను ఆయన మెడకు కట్టబెట్టేయ చూస్తున్నారన్నదే ఆ అడ్డుపుల్ల. దాన్ని ఆయన నమ్మేందుకు కారణం లేకపోలేదు. వాణతి పెదతండ్రి దీని గురించి చాలసార్లు ప్రస్తావించడం జరిగింది. అంతెందుకు? యువరాకుమారి కుందవైదేవే ఆ కుట్రాలోచనలో పాలు పంచుకొంది కదా? అది ఇంకా చాలా మందికి తెలుసు. ఆ పడవ నడిపే పిల్ల పూంగుళలి కూడ దాన్ని సూచిస్తూ పరిహాసం చేయలేదా? కాబట్టి యువరాజు మనసులో ఆ భావం గట్టిగా నెలకొని ఆయనకు తనమీదున్న ప్రేమకు అడ్డుగోడగా మారడంలో/ఉండడంలో ఆశ్చర్యం లేదు కదా?

~

కానీ కాసేపటి క్రితం తాను చేసిన శపథం ఆయనకు తెలియవచ్చినప్పుడు ఆ అడ్డుగోడ / అడ్డుపుల్ల తొలగిపోతుంది కదా? అది ఆయనకు తెలిసేటట్లు ఒక సందర్భం వస్తుందా? లేక తానే ఆయనకు చెప్పేస్తే? ఒసే పిచ్చి వాణతీ! నీకాయన ముందు నోరే పెగలదు కదా? ఆయనను నీవు ఏనుగు మావటి

అనుకొన్నప్పుడు, ఈ తిరునల్లంలో గర్వంతో మాట్లాడి, ఆయన చేత 'పెద్ద నోరున్న అమ్మాయి' అనిపించుకొన్నావు. తర్వాత ఆయనను తలెత్తి చూసేందుకు, నోరు తెరిచి మాట్లాడేందుకు నీవల్ల కావడం లేదు కద? అనాధ వాణతీ! ఇంకొకసారి నీవు యువరాజును కలిసే సందర్భం వచ్చినప్పుడు అలా మోసపోవద్దు! ధైర్యంగా, తెంపరితనంతో నీ మనసులో ఉన్నది చెప్పేయి! "మీరు సింహాసనమెక్కినా నేనెక్కను! మీరు ఒట్టి ఏనుగు మావటిగానే ఉండి, నన్ను మీ ఏనుగు మీద ఎక్కించుకొని తీసుకొని వెళితే, దాన్ని స్వర్గం కన్న మిన్నగా భావిస్తాను!" అని ధైర్యంగా చెప్పు!

అంతా సరే! కానీ అలా చెప్పేందుకు సందర్భం దొరకాలి కద? ఈ నది వరద నన్నెక్కడికి తీసుకొని వెళ్ళి చేర్చబోతుందో తెలియదు! దరిజేరకనే మునిగి చావబోతానా? ఏనాడూ అలా జరగదు. అదిగో తీరం కనిపిస్తోంది! తిరునల్లం మాళిగ మకుట శిఖరం కనిపిస్తోంది! ఆహా! యువరాజు ఏనుగెక్కి వచ్చింది, తనతో హితంగా మాట్లాడింది నిన్న జరిగినట్లు కద అనిపిస్తోంది!

~

ఇదేమి? అదిగో, ఒక ఏనుగు కనిపిస్తోంది! దాని పైన ఒక మావటి! వెల్లువ వేగాన్ని ఆ ఏనుగు ఎంత నిర్లక్షంగా త్రోసిపుచ్చి గుండ్రాయి దొర్లినట్లు వెళుతూంది! అదిగో గట్టెక్కేసింది! తీరం వెంబడి పశ్చిమంగా వెళుతూంది!

ఏనుగు మీద గంభీరంగా కూర్చొనివున్నది ఎవరై ఉండవచ్చు? ఒకవేళ.. ఛీఛీ! ఇదేం పిచ్చితనం? యువరాజు ఒంటరిగా ఇక్కడ ఎందుకు ఏనుగెక్కి వస్తారు?

ఒకసారి ఏనుగుమీద వచ్చిన యువరాజును చూసి మావటి అని నేననుకొన్నందువల్ల, తర్వాత ఏ మావటిని చూసినా యువరాజైవుండవచ్చని సందేహించడం ఎంతటి బుద్ధిహీనత?

అయినప్పటికీ, ఇతడు ఒట్టి ఏనుగు మావటి మాత్రమే అయినా కూడ, నాకు బహుశ సహాయం చేయవచ్చు కద? నన్నీ పెంకుటింటి కప్పు పడవ నుంచి, ఈ నదీప్రవాహం నుంచి గట్టెక్కించవచ్చు కద? నేనెవరని చెబితే, నన్ను ఏనుగు మీదెక్కించుకొని పొన్నియిన్ సెల్వన్ దగ్గరకు తీసుకొని వెళ్ళవచ్చు కద?

ఈ ఆలోచన రాగానే, వాణతి, "ఏనుగు మావటీ! ఏనుగు మావటీ!" అని గట్టిగా పిలిచింది.

అది అతని చెవిన పడలేదో, లేక పడ్డాకూడ పట్టించుకోలేదో తెలియదు. ఏనుగు ఆగనూ లేదు; ఏనుగు మావటి తిరిగి చూడనూ లేదు! ఏనుగు నడక వేగం పుంజుకోసాగింది. అతి శీఘ్రంగా నదీ తీరపు మలుపు ఒకదాని వెంబడి తిరిగి ఏనుగు, ఏనుగు మావటి కను మరుగైనారు.

వాణతి ఈ ఆశాభంగం గురించి ఆలోచించేలోపు అతిభయంకరమైన ఇంకొక ఆలోచన ఆమె మనసులో తలెత్తింది. పెంకుటింటి కప్పు ఉన్నట్లుండి అతివేగంగా సుడులు తిరుగుతున్నట్లనిపించింది. అవును; అక్కడ నదీప్రవాహపు వేగం హెచ్చింది. నదీతీరం, దాని వెంబడి ఎత్తుగా పెరిగిన మహావృక్షాలు,

వాటి బలమైన వేర్లు ఆమెను అతివేగంగా సమీపించసాగాయి. ఆ మూలను చేరగానే ఈ పెంకుటింటి కప్పు ఆ  చెట్ల వేర్లను గుద్దుకోవడం తథ్యం. గుద్దుకొని ముక్కలు, ముక్కలై నీట మునిగిపోతుంది. తర్వాత తన గతి ఏమి? తప్పించుకొని, బతికి బయటపడగలనా? లేక, సుడిగుండాల్లో చిక్కుకొని చెట్ల వేర్ల మధ్య చిక్కుకొని చావబోతూందా?

అయ్యో! ఇదేమి? ఆ చెట్ల వేర్ల మధ్య ఒక భయంకరమైన మొసలి నోరు తెరుచుకొని ఉంది కద? లేక తోలుబొమ్మ మొసలా? లేక నా చిత్త భ్రమా?

ఇదిగో తీరాన్ని సమీపిస్తున్నాం! చెట్ల వేర్లకు ఈ కప్పు గుద్దుకోబోతూంది!

వాణతి తన కళ్ళను గట్టిగా మూసుకొంది!

“తల్లీ! దుర్గా పరమేశ్వరీ! తలిదండ్రులను కోల్పోయిన ఈ అనాధకు నీవే గతి! నన్ను నీ పాదాల చెంతకు చేర్చుకో!” అని ప్రార్థించింది.

~~~
~~~

# అధ్యాయము - 21

## ప్రాణం ఊగిసలాడింది!

**ఒక్కొక్క** క్షణం ఒక్కో యుగంలాగ అనిపించే సందర్భాలున్నాయి. వాటిలో ఒకటి ఇప్పుడు వాణతి అనుభవానికి వచ్చింది. ఆమె తన కళ్ళను మూసుకొని దుర్గాపరమేశ్వరిని ప్రార్థిస్తూ కప్పు పడవ మీద ఉన్న ఫళంగా సుడులు తిరిగింది కొన్ని క్షణాలు మాత్రమే. కానీ అది కొన్ని యుగాలుగా తోచిందామెకు. కానీ అవి కొన్ని యుగాలుగా తోచిందామెకు. తర్వాత జరిగిన ఒక అదిరిపాటు ఆమె దేహాన్నంతా ఒక్క ఊపు ఊపినప్పుడు ఆమె కళ్ళు తెరుచుకొన్నాయి. పెంకుటింటి కప్పు తీరానున్న చెట్టు వేర్లను గుద్దుకొన్నందువల్ల ఆ అదిరిపాటు కలిగిందని ఆమె గ్రహించింది. అందువల్ల ఆ కప్పు ముక్కలు ముక్కలైనప్పుడు వాణతి సగం శరీరం వంగిన ఒక చెట్టు కొమ్మలో చిక్కుకొంది. అందువల్ల ఆమె చెట్టువేర్లను గుద్దుకోక తప్పించుకొంది. వెల్లువ సుడిగుండాలు ఆమె కాళ్ళను పట్టి అతివేగంగా లాగసాగాయి. ఆ వేగానికి కాళ్ళు ఆమె ఒంటినుంచి పీక్కొని వచ్చేస్తాయేమోననిపించింది. ఆమె కట్టుకొన్న చీర కూడ ఆమెను లాగి వెల్లువలో పడేస్తుందేమోనని తోచింది.

అప్పుడు వాణతికి విచిత్రమైన ధైర్యమూ, మనసులో గట్టిదనమూ ఎక్కడినుంచో వచ్చాయి. పళ్ళు గిట్ట కరుచుకొని తన పూర్తి బలాన్ని ఉపయోగించి తనను తాను పైకి లేపుకొని కొమ్మమీదికెక్కింది. వంగి ఊగిసలాడుతున్న సన్నటి కొమ్మలకు పైభాగానున్న ఒక బలమైన కొమ్మమీద అనుకూలమైన చోట భద్రంగా కూర్చొంది. చీర కొంగునుంచి నీటిని పిండింది.

అప్పుడు పటపటా నీరు కొడుతున్న శబ్దం వినిపించింది. కాసేపట్ క్రితం, కళ్ళు మూసుకోవడానికి మునుపు చూసిన మొసలి జ్ఞాపకమొచ్చింది.

~

కిందకు వంగి నలువైపులా పరికించి చూసింది. మొదట, నీటిని తపతపా కొడుతున్న మొసలి తోక కనిపించింది. దాని ఒంట్లో చాలభాగం, విరిగి చెదరిన కప్పు భాగాలచేత కప్పబడివుంది. మెల్లగా తన తోక సహాయంతో ఒంటిని అటూ ఇటూ కదిలిస్తూ చివరికి కప్పు నుంచి తన శరీరాన్ని పూర్తిగా విడిపించుకొంది. అలా విడిపించుకొని బయటపడ్డ సంతోషాన్ని తెలియజేసేందుకు మొసలి తన నోటిని పెద్దగా తెరిచింది. వాణతిని చూసి అది, "రా! రా! నీవెలాగూ నానోట పడాల్సిందే!" అంటున్నట్లనిపించింది.

వాణతి కూడ తాను బతికి బయటపడ్డ విధాన్ని తలుచుకొని ఉత్సాహంగొనివుంది. "ఓహో! అలాగా అంటున్నావు? నన్ను మింగేస్తాననా అంటున్నావు? ఓ మొసలీ! నీ పప్పులేం నా దగ్గర ఉడకవు! నీవు పళ్ళు చూపించి ఏం ప్రయోజనం లేదు. నీ ఆకలి తీర్చుకోవడానికి నన్ను నమ్ముకోకు! ఇంకెవరినైనా

పెతుక్కొంటూ వెళ్ళు!" అని వాణతి మొసలితో మాట్లాడింది. ఆ గొంతు వినగానే మొసలి తన రెండు భయంకరమైన కళ్ళతో వాణతిని గుచ్చి చూడసాగింది.

వాణతి, "ఓహో! నీ చపలబుద్ధి నిన్ను విడిచిపోదులాగుంది!" అని చెప్పేసి చుట్టూ పరికించి చూసింది. ఆమె పరిస్థితి కూడ కాస్త భీతిగొల్పేలాగే ఉంది. ఆ చెట్టు కొమ్మలు నీటిపైపు వంగివున్నాయి. కానీ గట్టువైపు అలా కిందకు వంగిన కొమ్మలే కనిపించలేదు. చెట్టు కింది భాగం వెంబడి దిగితే అక్కడ వేళ్ళతో వేరులాగ ఉన్న మొసలి కాచుకొని ఉంది. నదివైపు వంగిన కొమ్మమీదుగా నీట దూకితే సుడిగుండాలు ఆమెను పాతాళానికి లాక్కొని వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాయి. ఆ సుడిగుండాన్ని కాసేపు చూస్తేనే తల తిరుగుతున్నట్లనిపిస్తూంది. "గట్టువైపు కొమ్మలు ఎత్తుగా ఉన్నా కూడ ఫరవా లేదు; ఎలాగో దూకి సంభాళించుకొందాం" అని తలచి, కొమ్మల మీదుగా నడిచి అటువైపు వెళ్ళేందుకు లేచింది.

~

అప్పటికే చాలసేపటి నుంచి ఆమె శరీరపు కింది భాగం నీట మునిగివుండడం వల్ల ఆమె కాళ్ళు చాల చల్లబడ్డాయి. లేచి నిలబడేందుకు ప్రయత్నించినప్పుడు కాళ్ళు గడగడ వణికాయి. "ఛీఛీ! మీకేమైంది?" అని తన కాళ్ళను తానే మందలించుకొంటూ వాణతి మళ్ళీ కూర్చొంది. ఎవరికి ఓర్పెక్కువ? తనకా, మొసలికా? - అని ఆలోచించి చూడాల్సిందే కాబోలు!

ఈ సమయాన గజేంద్రుని ఘీంకారం విని వాణతి అదిరిపడింది. కాసేపటి క్రితం నదికడ్డం పడి వెళ్ళి గట్టెక్కి పశ్చిమంగా వెళ్ళిన ఏనుగు తిరిగి వస్తూ కనిపించింది. అదే సమయాన నదీతీరం వెంబడి ఒక పడవ వస్తుండడాన్ని కూడ గమనించింది. ఆ పడవలో ఇద్దరున్నారు. అవునవును! ఆ ఇద్దరిలో ఒకడు జ్యోతిష్కుల శిష్యుడు; ఇంకొకరు పూంగుళలి! చివరికి తనను కాపాడి తీసుకొని వెళ్ళేందుకు పూంగుళలా రావాలి?

పడవ చెట్టు కిందకు వచ్చింది. చెట్టు కొమ్మపైన కూర్చొనివున్న వాణతిని చూసేసింది పూంగుళలి. నవ్వుతూనే, "రాకుమారీ! మంచి చోటు చూసి దాక్కొన్నారు. వేగంగా దిగి రండి! అదిగో ఆ ఏనుగు మీద వస్తున్నదేవరో తెలుసా?" అని అడిగింది.

వాణతి మనసులో చటుక్కున నిజం తళుక్కున మెరిసింది. అయినా కూడ దాన్ని రూఢి చేసుకోవడానికి, "తెలియడం లేదే! ఎవరు?" అని అడిగింది.

"మీరెవరిని వెతుక్కొంటూ వెళ్ళారో, ఆయనే! యువరాజే!" అన్నది పూంగుళలి.

~

వాణతి ఆపుకోలేని ఆశ్చర్యంతో కొన్ని క్షణాలపాటు ఏనుగుపైన వస్తున్న ఆయనను చూస్తూండిపోయింది. ఆయన దగ్గరకొచ్చినప్పుడు తాను చెట్టు కొమ్మమీద కూర్చొనివుండడం అసందర్భంగా / అనుచితంగా ఉంటుందని అనుకొంది. పూంగుళలి చెప్పినట్లు ఆమె పడవలోకి

దిగేయాల్సిందే అని తలచి కిందకు చూసింది.

ఆ సమయాన పడవ వెల్లువ వేగానికి చెట్టుకింద ఆగలేక ముందుకు జరుగుతుండడాన్ని గమనించింది. పడవలో వెళ్ళడానికిష్టపడక పూంగుళలి దూకడాన్ని కూడ చూసింది.

“అయ్యో! ఇదేమి? పక్కన ఆ భయంకరమైన మొసలి ఉండడన్ని ఈ పిల్ల చూడలేదా, ఏమి?”

ఒక్కక్షణంలో పదివేల ఆలోచనలు ఆమె మనసులో ఉవ్వెత్తున లేచాయి!

ఆమె నోటినుంచి ఏవో మాటలు దొర్లాయి.

“మొసలి!” అన్న మాట మాత్రం పూంగుళలి చెవిన పడింది. ఆమె తిరిగి చూసింది. అవును; ఆమెకు అతి సమీపాన ఒక బ్రహ్మాండమైన మొసలి తన నోటిని తెరిచివుండడం కనిపించింది. పూంగుళలి తిరిగి చూసినప్పుడు మొసలి తన తోకను పైకెత్తి నీటిని బలంగా కొట్టింది.

పూంగుళలి చాల ధైర్యశాలి. ఎన్నో అపాయాలను ఎదుర్కొంది. కానీ పదడుగుల దూరాన నోరు పెకలించుకొని ఉన్న మొసలి ముందు ఒట్టి మనోధైర్యం ఏం ఉపయోగపడుతుంది? ఒక్క క్షణంలో తప్పించుకోకపోతే, దాని నోట పడవలసిందే! ఎలా తప్పించుకోవడం? మళ్ళీ పడవలోకెక్కవలసిందే!

ఇలా ఆలోచించి పూంగుళలి నీట దూకింది. పడవ అంతలో కాస్త ముందుకు వెళ్ళిపోయింది. శిష్యుడు పడవను ఆ చోట ఆపలేమని తీర్మానించుకొని, కాస్త దిగువకు వెళ్ళి తీరం వెంబడి ఒక వారగా పడవను ఆపుదామని వెళ్ళాడు. పూంగుళలి చిక్కుకొన్న అపాయాన్ని అతడు గమనించలేదు.

పడవను పట్టుకోవడానికి నీట దూకి ఈదుకొంటూ వెళ్ళిన పూంగుళలి అలలు లేచే కడలి కన్న కావేరి వెల్లువలో గట్టు దగ్గరి సుడిగుండాలు చాల అపాయకరమైనవని గ్రహించింది. సుడి గుండపు వేగం ఆమెను లోతుకు లాగింది. మొసలి తన వెనకే తనను పట్టుకోవడానికి కదిలి వస్తూందని గ్రహించింది. ఈ పరిస్థితిలో ఆమె చీర కొంగు కిందకు వంగిన ఒక చెట్టు కొమ్మకు చిక్కుకొని ఆమె పరిస్థితిని మరింత అపాయకరంగా మార్చింది.

~

ఇదంతా పైకొమ్మ మీదున్న వాణతి గమనించింది. తన మీద పూంగుళలికి ఉన్న చేదు భావం, కాసేపటి క్రితం ఆమె కఠినమైన మాటల వల్ల తాను చేసిన శపథం, ఆమె తనను చేయిచ్చి పైకెత్తనవసరం లేదని తానామె చేతిని విదిలించి నీట పడ్డ విషయం మెరుపు వేగాన ఆమె మనసులో మెరిసి మాయమైనాయి. దానికి తోడు ఆమె యువరాజును కాపాడి చూడామణి విహారానికి చేర్చిన విషయం, అందువల్ల చోళనాడు, తాను ఆమెకు ఋణపడివున్న విషయం గుర్తుకొచ్చాయి. అదిగో, ఏనుగు మీద ఆయన వస్తున్నారు. ఆయన వచ్చేలోపు ఈ అమ్మాయి మొసలి నోట పడితే ఆయన మనసెంత బాధపడుతుంది? తనను గురించి ఆయనేమనుకొంటారు? చూడబోతే, తనను కాపాడేందుకే కద ఆమె తన వెన్నంటి వచ్చి ఈ అపాయానికి లోనైంది?

ఇన్ని ఆలోచనలు, పాఠకులు ఇక్కడ చదివేందుకు పట్టే సమయంలో నూట ఒక వంతు సమయం లోపల వాణతి మనసులో తోచాయి. “వాయువేగం, మనోవేగం" అన్నది ఒట్టి మాట కాదు. అన్ని వేగాలకన్న మనోవేగమే అధికమైనది.

ఇలా ఆలోచిస్తున్నప్పుడే తన కర్తవ్యం ఇదీ అని వాణతి నిశ్చయించుకొంది. పై కొమ్మనుంచి కిందకు దిగి, దానిపైన పడుకొన్న ఫళంగా చేతులను కిందకు చాచింది. పూంగుళలి జుట్టును లాగి పట్టుకొంది. పూంగుళలి పైకి చూసింది. వాణతి చేతి పట్టునుంచి తప్పించుకోవడానికి ఆమె ప్రయత్నించలేదు. ఒక చేతిని పైకి చాచింది. వాణతి ఇప్పుడు ఆ చేతిని పట్టుకొని, పూంగుళలిని పైకి లాగనారంభించింది. ఇంకొక చేత్తో చెట్టుకొమ్మనొకదాన్ని పట్టుకొని వెల్లువనుంచి పైకి రానారంభించింది పూంగుళలి. వాణతి ఉన్న కొమ్మ మీదికే దూకి ఎక్కింది. ఇద్దరి భారాన్ని మోయలేక ఆ కొమ్మ వంగింది. అది గమనించి పూంగుళలి పైకెక్కడానికి ప్రయత్నించింది. ఆ ప్రయత్నంలో ఆమె కాళ్ళు తడబడ్డాయి. మరుక్షణం ఆమె చెట్టు కొమ్మకు, నది వెల్లువకు మధ్య వేలాడసాగింది. ఆమె ఒక్క చేతిని మాత్రం వాణతి రెండు చేతులతో గట్టిగా పట్టుకొనివుంది.

చెట్టు వేళ్ళ మధ్యనున్న మొసలి బయటకు రావడానికి కాసేపు పట్టింది. ఇప్పుడది బయటికొచ్చేసింది.

చెట్టు కొమ్మనుంచి వేలాడుతున్న ఆకారాన్ని చూడగానే మళ్ళీ నోరు పెద్దగా తెరిచింది.

పూంగుళలి ఒడలు, ప్రాణమూ ఊగిసలాడసాగాయి.

~

వాణతి మెత్తని చేతులు పూంగుళలి వజ్రంలాంటి శరీర భారానికి పీక్కొని వచ్చేస్తాయనిపించింది. ఆమె మనసేమో పూంగుళలి తన చేతులనుంచి జారి మొసలి నోట పడిపోతుందేమోనన్న భావంతో విలవిల్లాడింది.

అలాంటి అపాయం జరిగితే, తర్వాత తాను యువరాజు ముఖాన్ని తలెత్తి చూడలేదు. పూంగుళలి పడిపోయేటప్పుడు తాను కూడ దూకేసి ప్రాణత్యాగం చేయడమే ఉత్తమం. అలాగే చేయాలి, అనుకొంది వాణతి.

అదిగో, ఏనుగు దగ్గరికొచ్చేసింది. యువరాజు దానిమీద వస్తున్నారు. ఆయన వచ్చి కాపాడేంతవరకు, పూంగుళలిని చేజార్చకుండేందుకు ఈ చేతుల్లో శక్తి ఉంటుందా...?

ఏనుగు నదీతీరానికి వచ్చి చెట్టుకింద ఆగింది. మళ్ళీ ఒకసారి ఘీంకరించింది. ఆ శబ్దం విని మొసలి అటువైపు తిరిగి చూసింది. ఏమనుకొందో ఏమో, మళ్ళీ చెట్టు వేళ్ళ మధ్యకెళ్ళి పడుకొంది.

వాణతి కూడ పూంగుళలి మీదికి వంగిన ఫళంగానే ఏనుగును చూసింది. దానిపైనున్న వారిని కూడ చూసింది. అవును, ఆయన యువరాజే! పొన్నియిన్ సెల్వన్‌గారే!

"ఏనుగు మావటీ! ఏనుగు మావటీ! ఆ రోజొకసారి పక్షిపిల్లలను కాపాడినట్లు ఈ రోజు ఈ అమ్మాయిలను కాపాడు!" అని తనకు మాత్రమే వినిపించేటట్లు మెల్లగా చెప్పుకొంది.

వల్లకాదు; ఇక ఈ పడవ నడిపేపిల్లను మోయలేను!

ఒక ఒక్క నిమిషం ఆలస్యం చేసినా, భుజాలనుంచి చేతులు ఊడి వచ్చేస్తాయి!

అబ్బ! ఈమె పేరు పూంగుళలి! కానీ ఎంత బరువుంది! ఉక్కుతో చేసిన శరీరంలాగ కద ఉంది!

ఏనుగు మావటీ! ఏనుగు మావటీ! త్వరగా రావా...?

పూంగుళలి 'కీచు'మని కేకవేసింది. అది విన్న వాణతి ఆమెను మొసలి పట్టేసుకొందనుకొంది. చెప్పలేని భీతి ఆమె మనసులో కలిగింది. కళ్ళను గట్టిగా మూసుకొంది.

ఆమె చేతులను పట్టుకొని కిందకు లాగుతున్న భారం ఇంకా ఎక్కువైంది.

మొసలే పూంగుళలిని పట్టుకొని లాగుతున్నట్లు అనుకొని కళ్ళు గట్టిగా మూసుకొన్న వాణతి ఆమెను ఇంకా బలంగా పైకి లాగజూసింది.

"చేతులు వదులు, వాణతీ! చేతులు వదులు!" అని చెవిలో అమృతంలాంటి మధురమైన యువరాజు స్వరం వినిపించింది. తాను చేస్తున్నది ఇదీ అని తెలియకనే చేతిపట్టు విడిచింది.

ఆమె చేతులు ఊడిపోయేలాగ లాగిన భారం తొలగింది.

కళ్ళను తెరిచి చూసింది.

గజేంద్రుడు పూంగుళలిని తొండంతో చుట్టి పైకెత్తి గట్టుమీద దింపడాన్ని చూసింది.

పూంగుళలి కళ్ళు మూసుకొనివున్నాయి. ఏనుగు తొండం ఆమెను చుట్టినప్పుడే ఆమె అలా 'కీచు'మని అరిచివుండాలి.

తాను కూడ అలా ఒకసారి అరిచేసి మూర్ఛబోయిన విషయం వాణతికి గుర్తొచ్చింది.

ఇప్పుడు దానికి పదిరెట్లు అపాయకరమైన పరిస్థితిలో ఉన్నాకూడ తాను భయపడకుండ ప్రజ్ఞ కోల్పోకుండ ఉండడం తలుచుకొంటే ఆమెకే ఆశ్చర్యం వేసింది.

తన ధైర్యాన్ని చూసి మెచ్చుకొని సంబరపడేందుకు యువరాకుమారి ఇక్కడ లేదు కద? అయినా ఫరవాలేదు. ఎలాగూ ఒకరోజు వారికి తెలియకపోదు. ఇప్పుడు తన గతి ఏమి? పూంగుళలిని మాత్రం  కాపాడి తీసుకొని వెళ్ళి తనను ఇక్కడే వదిలి వెళ్ళిపోతారా యువరాజు?

ఆయనలా చేస్తే అది తన ధూర్త ప్రవర్తనకు సరైన శిక్షగా ఉంటుంది.

లేదు, లేదు! గజరాజు తన తొండాన్ని (మళ్ళీ) తనవైపు చాస్తూంది.

వాణతి మళ్ళీ కళ్ళు మూసుకొంది.

~

మరుక్షణం తాను చెట్టుకొమ్మమీది నుంచి ఎత్తబడి గట్టి నేల మీద మెత్తగా దింపబడిందని

గ్రహించింది.

కళ్ళు తెరిచి చూసినప్పుడు తాను నది గట్టున పూంగుళలి సమీపాన నిలబడివుండడాన్ని గమనించింది.

పూంగుళలి నీళ్ళు నిండిన కళ్ళతో, గద్గద స్వరంతో, "రాకుమారీ! ఈ రోజు నా ప్రాణాలు కాపాడారు. నేను మీరు నదివెల్లువలో మునిగిపోకుండ కాపాడేందుకు వచ్చాను. దానికి బదులు నన్ను మీరు మొసలి నోట పడకుండ కాపాడారు. ఈ మేలు నేనెన్నటికీ మరువను!" అన్నది.

"పూంగుళలీ! నేనా నిన్ను కాపాడాను? నిన్ను, నన్ను ఆ ఏనుగు మావటి కద కాపాడారు? ఆయనకు నీ కృతజ్ఞతలు తెలుపు!" అన్నది వాణతి.

"నా ప్రాణాల మీద నాకంతగా ఆశ లేదు. కానీ నా అత్త ఆమె ముద్దుల కుమారులకు ఒక ముఖ్యమైన వార్తను తొందరగా చేరవేయాలని నన్ను పంపించింది. అది ఆయనకు చెప్పేందుకు ముందు నేను చావగోరుకోను!" అన్నది పూంగుళలి.

ఏనుగుపైనున్న వారిని వాణతి తలెత్తి చూసింది. ఏదో ఒక చిలిపి ఆలోచన ఆమె మనసులో పుట్టింది.

"ఏనుగు మావటీ! ఏనుగు మావటీ! మమ్మల్ని నీ ఏనుగు మీద ఎక్కించుకొని వెళతావా?" అని అడిగేసి గొల్లున నవ్వింది.

~~~
~~~

# అధ్యాయము - 22

## సంతోషమూ - దుఃఖమూ

**వాణతి** నవ్వుతోబాటు ఆమె మాటలు కూడ విని యువరాజు తాను కూడ నవ్వేసి ఏనుగు మీదినుంచి కిందకు దిగారు.

"ఆహా! ఏనుగు మీదెక్కడడం / గజారోహణం అన్నది చాల కష్టమైన కార్యం. రాజ్య సింహాసనాన్ని అధిష్టించడం లాంటిదే. ఏనుగు మీదికెక్కడమూ కష్టమే; దానిపైన కూర్చొనివుండడమూ కష్టమే; తర్వాత దానిమీదినుంచి దిగడం కూడ కష్టమే. కానీ ఆ కష్టాలన్నిటినీ కొన్ని సార్లు ఒకడు అనుభవించవలసివుంది!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

"కొందరు ఆ కష్టాలను చాల అల్పకారణాల కోసం అనుభవిస్తున్నారు. పక్షిపిల్లలను కాపాడడం కోసం ఏనుగెక్కి పరుగెత్తి రావడమూ కద్దు!" అన్నది వాణతి.

"ఆ సంభవం నీకింకా గుర్తుందా, వాణతీ? నీవు అందు గురించి ఇప్పటివరకు మాటెత్తకపోవడంతో మరిచిపోయావనుకొన్నాను!" అన్నారు యువరాజు.

"లోకమంతా తిరుగుతూ, వీరకృత్యాలలో నిమగ్నమయ్యేవారు మరిచిపోతారు. అంతఃపురంలో ఉండే అమ్మాయిలకు అటువంటి సంభవాలను గుర్తు పెట్టుకోవడం తప్ప ఇంకేం పని? మీరు ఆ రోజు ఏనుగెక్కి వచ్చిందీ గుర్తుంది. నేను కొడుంబాళూర్ అమ్మాయిని అన్న వెంటనే మీరు ముఖాన్ని చిన్నబుచ్చుకొని తిరిగి వెళ్ళిందీ జ్ఞాపకముంది!"

"అందుకప్పుడు కారణం ఉండేది, వాణతీ!"

"ఆ కారణం ఇప్పుడు కూడ ఉందయ్యా! లోకమేలే చక్రవర్తి కుమారులు మీరు; చోళనాడు ప్రజల కనుపాప లాంటివారు మీరు. నేనేమో అడవిప్రాంతంలో పుట్టి పెరిగినదాన్ని. ఒక చిన్న రాజు కుమార్తెను; అందులోను పోరులో మరణించినవారి అనాధ కూతురిని!"

"వాణతీ! నీవు నాకు అన్యాయం చేస్తున్నావు! పోతే పోనీ! నేను తంజావూరుకు అత్యవసరంగా వెళ్ళాలి. తొందరగా చెప్పు! నీవెలా ఇక్కడికి వచ్చి చేరావు? ఒంటరిగా ఎందుకొచ్చావు? పెంకుటింటి కప్పు మీద తేలి వచ్చావట! ఈ అమ్మాయి అక్కడికెందుకొచ్చింది? ఎలా ఇటువంటి ప్రాణాపాయంలో చిక్కుకొన్నావు?"

"నేనొకతెను ఇక్కడున్నానని గుర్తొచ్చినందుకు చాల సంతోషం. ఒక్క నిమిషం ఏకాంతంగా మాట్లాడేందుకు అవకాశమిస్తే నేను చెప్పవలసింది చెప్పేసి వెళ్ళిపోతాను!" అన్నది పూంగుళలి.

~

ఆ ఇద్దరమ్మాయిలూ యువరాజు ముందు ఎదురెదురుగా నిలబడితే, ఎలాగో అసాధారణ ధైర్యమూ, వాచాలతా వచ్చేస్తాయి.

"సముద్రకుమారీ! నిన్ను మరిచిపోయాననా అనుకొన్నావు? అదెలా సాధ్యం? నీవే నేనెంత పిలిచినా, ఆగి బదులు కూడ చెప్పకుండ వచ్చేశావు! అలా తొందరగా వచ్చినదానివి చెట్టుకొమ్మలకు, మొసలి నోటికి మధ్య చిక్కుకొని ఊగిసలాడిన దృశ్యాన్ని నేను జీవితాంతం మరువలేను, మరువను!" అని చెప్పి నవ్వారు యువరాజు.

"నిన్ను ఎత్తలేక ఎత్తి పట్టుకొని వాణతి పడ్డ అవస్థను కూడ మరువలేను. కానీ మీరిద్దరూ ఇక్కడికెలా వచ్చి చేరారు? ఎందుకని? ఎవరైనా ఒకరు తొందరగా చెప్పండి!"

"పొన్నియిన్ సెల్వ! నేను, మీ పూజ్య సహోదరి మిమ్మల్ని దారిన కనిపెట్టి ఆపి, తంజావూరుకు వెళ్ళడాన్ని అడ్డుపడి ఆపాలని బయలుదేరాం. మీరిప్పుడు తంజావూరుకు వస్తే, అక్కడ పెద్ద యుద్ధమే జరుగుతుందని మీ అక్కగారు భయపడుతున్నారు. దానికి ముందు మిమ్మల్ని కలిసి మాట్లాడాలని కోరుకొంటున్నారు...."

"యువరాకుమారి ఇప్పుడెక్కడ?"

"కుడందైలో ఉన్నారు..."

"నీవు మాత్రం ఇక్కడికెలా వచ్చావు?"

"దారిలో కుడందై జ్యోతిష్కుల ఇంట నేను, యువరాకుమారి కాసేపు గడిపాము. ఆ సమయాన కావేరి నది గట్లు తెగి పొంగి పొర్లి వచ్చింది. ఆ వెల్లువలో జ్యోతిష్కుల ఇల్లే కొట్టుకుపోయింది. యువరాజా! మీరు చిన్నబిడ్డగా ఉన్నప్పుడు ఈ కావేరి నది మిమ్మల్ని కాపాడిందని అందరూ చెబుతారు. ఈ పొన్ని నది అంటే మీకు చాల ఇష్టమని కూడ నాకు తెలుసు. కానీ ఈ నది వల్ల దేశమంతటా ప్రజలు, పశుపక్ష్యాదులు పడుతున్న కష్టనష్టాలు తలుచుకొంటేనే భయంకరంగా ఉంది. కావేరి తల్లి చాల క్రూరమైనదని తోస్తూంది..."

"వాణతీ! కావేరి తల్లి మీద అలాంటి నింద మోపకు! ఈ మహాతల్లికి చోళనాడంటే అంత ప్రేమ. ఆ ప్రేమ పెల్లుబికినప్పుడు గట్లు తెంచుకొని వస్తూంది. ఇది ఎరగనివారు తల్లిమీద లేనిపోని అభాండాలు వేస్తున్నారు! ఏల? గట్లు తెంచుకొని పారడం గురించి కొందరు సముద్రరాజు మీద కూడ నిందలు మోపుతున్నారు. కానీ పూంగుళలి సముద్రరాజు గురించి అలా కోపంగా మాట్లాడదు!" అన్నారు యువరాజు.

"క్షమించండి! నేను కూడ ఇక కావేరి తల్లి మీద నిందలు మోపను. నేను, మీ అక్కగారు జ్యోతిష్కుల ఇంట ఉన్నప్పుడు, ఉన్నట్లుండి కావేరి మాత ప్రేమ పెల్లుబికింది. తమ సహోదరి తదితరులు పరుగెత్తి వెళ్ళి ఒక కోవెల మంటపం మీదికెక్కారు. నేను, నా బుద్ధితక్కువతనం వల్ల మంటపం మీదికెక్కలేక జారిపోయాను. జ్యోతిష్కుల ఇంటి కప్పుమీద తేలుతూ వచ్చాను..."

"నిన్ను కాపాడేందుకోసం పూంగుళలి పడవెక్కి వచ్చింది కాబోలు. భలేవుంది! మీ ఇద్దరినీ చేర్చి గజేంద్రుడు కాపాడవలసి వచ్చింది. ఈ ఏనుగు తెలివే తెలివి! మీ ఇద్దరినీ తన తొండంతో పూమాలను ఎత్తి పెట్టినట్లు సుతారంగా కదలకుండ నలగకుండ తీసి గట్టు మీద పెట్టింది! ఈ రోజు ఇదే ఏనుగు చేత అంకుశంతో ఆలస్యంగా వచ్చిన మావటిని ఎత్తి దూరాన విసిరేసింది! వాడు బతకడమే కష్టం!"

"అయ్యో! అదేమిటి! నేనే మిమ్మల్ని ఆ విషయం గురించి అడగాలనుకొంటున్నాను..."

"నన్ను నీవేమడగాలనుకొన్నావు?"

"ఏనుగు మావటి వల్లగాని, వాడి అంకుశం వల్లగాని మీకు ఏదైన అపాయం కలిగిందా అని అడగాలనుకొన్నాను."

"అపాయం కలగవలసి ఉండేదన్నది నిజమే. అది నీకెలా తెలిసింది? జ్యోతిష్కులు చెప్పారా, ఏమి? ఆ పిచ్చి యువరాకుమారినింకా వదల్లేదా?"

"జ్యోతిష్కులు చెప్పలేదు! చెప్పినా మేము నమ్మేవారము కాము. పెద్ద పళువేట్టరయ్యర్ చెప్పారు!"

"ఏమి? ఏమి? ఎవరు చెప్పారు?"

"అవును, యువరాజా! ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యరే చెప్పారు! మేము జ్యోతిష్కుల ఇంట ఉన్నప్పుడు ఆయన ఉన్నట్లుండి ప్రవేశించారు. మీకు రాగల ఆపద గురించి హెచ్చరించారు. విషం పూసిన అంకుశం గురించి కూడ చెప్పారు..."

"ఆహా! ఇది చాల విచిత్రమైన విషయం! అయనకెలా తెలిసింది? ఆయన కూడ జ్యోతిష్కులైనారా? లేక, అందరూ అంటున్నట్లు ఆయనే ఈ ఏర్పాటు చేశారా?"

"లేదు, యువరాజా! ఆయనకీ కుట్రలో భాగం లేదు. పాండ్యదేశపు శత్రు కుట్రదార్రులు రహస్యంగా మాట్లాడుకొంటుండగా దాక్కొని విని తెలుసుకొన్నారు..."

"ఓహో! ఆయనింకేమైనా చెప్పారా?"

"తలుచుకోవడానికి, చెప్పడానికి కూడ భయం కలుగుతూంది. మిమ్మల్ని, తమ తండ్రిని, ప్రధమ యువరాజైన మీ అన్నగారు ఆదిత్య కరికాలన్‌వారిని ఒకే రోజున యమలోకానికి పంపించేటందుకు ఆ కుట్రదారులు పన్నాగం పన్నుతున్నారని చెప్పారు. ఆయన ఆదిత్య కరికాలన్‌గారిని కాపాడేందుకు కడంబూరుకు తిన్నగా వెళ్ళిపోయారు. మిమ్మల్ని, చక్రవర్తిని హెచ్చరించాలని యువరాకుమారికి చెప్పి వెళ్ళారు..."

"ఆహా! ఆయన హెచ్చరిక నా విషయంలో నిజమైనందువల్ల తక్కినవారి విషయంలోను నిజమే అయివుండాలి...! సముద్రకుమారీ! నీవేదో చెప్పాలన్నావు కద?"

"అవును, యువరాజా! లంకాదేశపు మూగరాణి మిమ్మల్ని వెంటనే తంజావూరుకు

పిలుచుకొని రమ్మని నన్ను పంపించింది..."

"ఆహా! అందుగురించి నిన్ను అడిగేందుకు మరిచేపోయాను. ఆమె కోసమే నేనింత తొందరగా బయలుదేరి వచ్చాను. ఆమెను తంజావూరుకు ఎవరో బలవంతంగా కట్టి లాక్కొని వచ్చారట కద? అది నిజమేనా?"

"నిజమేనయ్యా! కానీ ముఖ్యమంత్రి అనిరుద్ధులు మంచి ఉద్దేశంతోనే అలా చేశారు..."

"ఓహో! అనిరుద్ధులు చేసిన పనా ఇది? నా తండ్రితో కలిపేందుకు అలా తీసుకొని వచ్చివుండాలి. పూంగుళలీ! ముఖ్యమంత్రి ఉద్దేశం నెరవేరిందా? వారు... చక్రవర్తి, లంకారాణి కలుసుకొన్నారా?"

"అవునయ్యా! కలుసుకొన్నారు!"

"నా జీవిత మనోరథం నెరవేరింది! దానికన్న సంతోషకరమైన వార్త నాకింకేమీ లేదు. నా పెదతల్లి చెంతనున్నంతవరకు మా తండ్రి ప్రాణాలకు ఏ అపాయమూ రాదు. ఆ స్త్రీమణికి అపూర్వమైన భవిష్యదృష్టి ఉందన్న విషయం నీకు తెలుసు కద, పూంగుళలీ?"

"అవును, నాకది తెలుసు! ఆమె ఉన్నంతవరకు చక్రవర్తికి ఏ అపాయమూ కలగదు. కానీ..."

"కానీ, ఏమి? ఎందుకు ఆగిపోయావు సముద్రకుమారీ?"

"చెప్పేందుకు కష్టంగా ఉంది; నోరు పెగలడం లేదు. లంకారాణి తమ చివరిరోజులు / అంతిమ ఘడియలు దగ్గరపడుతున్నాయని భావిస్తూంది. చివరిగా కన్ను మూసే మునుపు మిమ్మల్ని ఒకసారి చూడాలనుకొంటున్నారు!" అన్నది పూంగుళలి.

"దైవమా! ఇదేం విపరీతం? సంతోషకరమైన వార్త తెలియజేసి, దాని వెంటనే ఈ పిడుగులాంటి వార్తను కూడ చెబుతున్నావు కద! ఇక నేను ఒక్క క్షణం కూడ ఆలస్యం చేయలేను. వాణతీ! యువరాకుమారిని క్షమించమని అడిగానని చెప్పు!" అన్నారు యువరాజు అరుళ్మొళి వర్మ.

~~~
~~~

# అధ్యాయము - 23

## సైన్యాలొచ్చేశాయి!

**తంజావూరు** నగరం ఆ రోజు చాల అల్లకల్లోగంగా ఉంది. సుడిగాలిని, వానను, వాటివల్ల కలిగిన కష్టనష్టాలను పూర్తిగా మరిచిపోయారు ప్రజలు. లంకను జయించిన వీరాధివీరుడు, చోళనాడు ప్రజల హృదయాన్ని చూరగొన్న యువరాజైన పొన్నియిన్ సెల్వన్ నాగపట్టణంలో సుడిగాలి వీచినరోజు అజ్ఞాతం నుంచి బయటికొచ్చేశారు; ఇప్పుడు తంజావూరుకే తిన్నగా వస్తున్నారు; ఆయనను సింహాసనమెక్కించి చక్రవర్తిని చేసేందుకు ప్రజలు తండోపతండాలుగా తరలి వస్తున్నారు! అన్న వార్తలు మొదట వదంతులుగా గాలిమీదొచ్చాయి. తర్వాత ప్రత్యక్షంగా యువరాజును నాగపట్టణంలో చూసినవారు వచ్చి చెప్పారు. ఈ వార్త కారణంగా, రెండు రోజుల క్రితం బయట వీచిన సుడిగాలి లాగ, ఇప్పుడు నగరప్రజల హృదయాలలో ఉద్వేగపు సుడిగాలి వీచనారంభించింది. తంజావూరు నగరం ఇదివరకెన్నడూ కనీ వినీ ఎరుగనంతటి గొప్ప స్వాగతాన్ని యువరాజుకివ్వాలని ప్రజలు తీర్మానించారు. కోటకు బయటున్న నగరవీధులను అలంకరించనారంభించారు. గుంపులు గుంపులుగా వీధుల్లో నిలబడి మాట్లాడుకోసాగారు. మేళ తాళాలు, డోలు, తప్పెట మొదలైన వాద్యాలు సేకరించబడ్డాయి. ఆటపాటల్లో ఆరితేరినవారు ఈ సందర్భంలో తమ నైపుణ్యతను ప్రదర్శించేందుకు సిద్ధమైవున్నారు. స్త్రీలు, చిన్న పిల్లలు తమని తాము ఎలా అలంకరించుకోవాలని ఆలోచించసాగారు. ఇంకొందరు అవకాశవాదులు యువరాజును స్వాగతించడంలో తామే ముందుండాలని తంజావూరునుంచి నలువైపులా వెళుతున్న రాజబాటల్లో కాస్త దూరం వెళ్ళి వేచివుండనారంభించారు. అలా ముందుగా వెళ్ళిన వారిని చూసి ఇంకొందరు పరిహసించారు.

పురనగరం (=కోట బయటి నగరం) ఇంత గందరగోళమైందంటే, కోట లోపల కూడ ఏవో ముఖ్యమైన సంభవాలు జరగనున్నాయనడానికి సూచనలు త్వరలోనే గోచరించాయి.

~

పొద్దున సంప్రదాయం ప్రకారం కోట వాకిలి తెరవబడింది. కూరగాయలు, పళ్ళు, పాలు, పెరుగు మొదలైనవి అమ్మేవారు, అంతఃపురంలో పనిచేసేవారు అలవాటు ప్రకారం లోపలికి వెళ్ళసాగారు. సుడిగాలి, వాన వల్ల కలిగిన నష్టాల గురించి మొరపెట్టుకోవడానికి ఈ రోజు చాల తక్కువ మంది వచ్చారు. వారు కూడ కోట లోపలికి వెళ్ళారు. అలవాటు ప్రకారం వేళక్కార దండు కూడ కోట లోపల ప్రవేశించింది.

తర్వాత కోట వాకిలి తలుపులన్నీ టపటపా మూసివేయబడ్డాయి. పెద్ద పెద్ద తాళాలతో వాటికి తాళం వేసే శబ్దం కూడ వినిపించింది. తర్వాత ఆలస్యంగా వచ్చినవారిని లోపలికి వెళ్ళడానికి అనుమతించక కాపలావాళ్ళు అడ్డగించారు. ప్రాతఃసమయాన కోట తలుపులనిలా తాళం వేసి మూయడానికి కారణం

ఏమైవుండవచ్చని ప్రజలు మాట్లాడుకోసాగారు. అదే సమయాన ఇంకొక విచిత్రం జరిగింది. కోట చుట్టూ ఉన్న అగడ్తను దాటేందుకు వేయబడ్డ బల్లలు కూడ పైకి లేవనెత్తబడ్డాయి. ఆ తర్వాత ఎవరూ కోట వాకిలిని సమీపించడమే అసాధ్యమైంది.

కోటకు ప్రధాన ద్వారమైన ఉత్తర ద్వారం వద్ద ఉన్నవారు పడమటి వాకిలి గురించి, దక్షిణపు వాకిలి గురించి విచారించారు. అవి కూడ మూయబడ్డాయని, బల్లలు ఎత్తివేయబడ్డాయని తెలియగానే చాల ఆశ్చర్యపోయారు.

“ఇదేమి? యుద్ధమేమీ జరగడం లేదు కద? పగవారి సైన్యాలు దండెత్తి వస్తున్నట్లు కనిపించడం లేదే? అలా దండెత్తి రాగల పగవారు ఉత్తరాన, దక్షిణాన, పశ్చిమాన, తూర్పున – ఎక్కడా సమీపాన లేరు కద? అలా ఒక వేళ ఉత్తరాన ఉన్న రెట్టిమండలంనుంచి పగవారు ఉన్నట్లుండి దండెత్తి రావాలన్నా కూడ దారిన ఉన్న కొళ్ళిడం నదిని, కావేరిని ఇప్పుడు దాటలేరు కద? ఆ మహానదుల్లో వెల్లువ పొంగి పొర్లుతూంది కద?” - ఇలా తంజావూరు కోట బయటి నగరప్రజలు చర్చించుకోసాగారు. ఒకవేళ పొన్నియిన్ సెల్వన్ని కోట లోపల ప్రవేశించకుండ అడ్డుపడేందుకే ఇలాంటి ఏర్పాట్లు చేయబడుతున్నాయేమోనని ప్రశ్నించుకొని, “బహుశ అలాగే ఉండాలి" అని తమకు తామే సమాధానం చెప్పుకొన్నారు. ఈ వదంతి విస్తరిస్తూ పోగా, నగరప్రజల ఉద్వేగం అధికం కాసాగింది. “విజయాలయ చోళుల వంశపరంపరలో వచ్చిన యువరాజును కోట లోపలికి వెళ్ళనివ్వకుండ అడ్డుకోవడానికి ఈ పళువేట్టరయ్యర్లెవరు? అలా వారు నిజంగానే ప్రయత్నిస్తుంటే కోట గోడల్ని పడగొట్టేయాల్సిందే!” అన్న ధోరణిలో కొంత మంది మాట్లాడుకోసాగారు.

~

వదంతి అన్న మాయాభూతం ఎలా పుడుతుంది, ఎలా ప్రయాణం చేస్తుంది అన్నది ఎవరూ కనిపెట్టి తెలుసుకోలేని మర్మం. ఉన్నట్లుండి ఇంకొక భయంకరమైన వదంతి ప్రజల మధ్య విస్తరించనారంభించింది. చాలకాలంగా ఎదురు చూస్తున్న సుందర చోళ చక్రవర్తి మరణం ఆసన్నమైందన్నదే ఆ వదంతి. “చక్రవర్తి కాలమైనారట! అది నిజమేనా?” అని మొదట అడిగారు. ఆరోజు ప్రాతఃకాలసమయాన తోకచుక్క ఒక్క వెలుగు వెలిగి కిందకు వచ్చి మాయమైన సంభవాన్ని చూసిన కొందరు, దాన్నే ఆధారంగా తీసుకొని చక్రవర్తి దివంగతులైనారని నిర్ధారించేశారు. “ఇది నిజమైతే, ఇక ముందు ఏం జరగబోతూంది?” అన్న విషయం గురించి వివాదించుకోసాగారు. రాజ్యాధికారం గురించి తగాదాలు, వివాదాలు వస్తాయా? చిన్న రాజులు రెండు పక్షాలుగా విడిపోయి అంతర్యుద్ధానికి దిగుతారా? ఇలాంటి అంతర్యుద్ధాల వల్ల చోళసామ్రాజ్యమే ఛిన్నాభిన్నమైపోతుందా? నూరేళ్ళుగా వర్ధిల్లుతూ వస్తున్న చోళసామ్రాజ్యంలో పగవారి సైన్యాలు మళ్ళీ దూరుతాయా?

ఇలా ప్రజలు రకరకాలుగ మాట్లాడుకొంటున్నప్పుడే "అదిగో సైన్యం వస్తూంది!” అన్న కేక

వినిపించింది. పలువురు అటూ ఇటూ పరుగెత్తి వెళ్ళి చూశారు. ఎత్తైన కట్టడాలమీదికి, చెట్లమీదికి ఎక్కి చూశారు. అలా వారు చూసిన దృశ్యం ఒక్క దెబ్బలో ఆశ్చర్యాన్ని, భయంతో కూడిన విస్మయాన్ని కలిగించింది.

ఆ కాలంలో తంజావూరు నుంచి పశ్చిమంగాను, నైఋతిగాను మూడు పెద్ద బాటలు వెళుతుండేవి. ఒకటి కొడుంబాళూర్ గుండా రామేశ్వరానికి వెళ్ళే దారి; ఇంకొకటి మదురై గుండా దక్షిణ పాండ్య దేశానికి వెళ్ళే దారి; మూడవది ఉరయూర్ గుండా కరూర్‌కి, చేరనాడుకు వెళ్ళే పొడవైన, వెడల్పైన రాజ బాట.

ఆ రోజు ఉత్తరోదయాన పైన వివరించిన మూడు రాజ మార్గాల వెంబడి సేనలు వస్తున్నాయి. వాటిలో ముందు వస్తున్న శ్రేణులు కంటికి కనిపించాయే గాని, వెనుక వస్తున్న శ్రేణులు ఎక్కడ ముగుస్తున్నాయో అర్థం కాలేదు.

అదృష్టం కొద్దీ ఆ సైన్యం ముందు వరుసలో పెద్ద పులి జెండాలు ఎగురుతుండడం వల్ల అవి శత్రుసైన్యాలు కావచ్చేమోనన్న సందేహం వీడిపోయింది. చోళ సామ్రాజ్యసైన్యాలే అవి. కానీ ఎందుకు వస్తున్నాయి? ఎక్కడినుంచి వస్తున్నాయి?

~

ఆ సైన్యాలు ఇంకాస్త  దగ్గరగా వచ్చినప్పుడు ఆ పులి జెండాలలో చిన్న చిన్న రాజలాంఛనాలు కూడ అగుపించాయి. వాటినుంచి కొడుంబాళూర్ నాయకత్వం కిందనున్న పరాంతక చోళ మహాసైన్యమూ, దక్షిణ పాండ్యనాడులోని తెరింజకై (=తెలిసిన చేయి) కోళార్ మహాసైన్యమూ, అంకాయుద్ధంలో పాల్గొన్న అరింజయ చోళ మహాసైన్యం ఒక్కటిగా చేరి వస్తున్నట్లు తెలిసింది. ఇంకాసేపటికి దక్షిణ సైన్యాధిపతియైన బూది విక్రమకేసరే ఆ సైన్యాలతో వస్తున్నారని తంజావూరు నగరప్రజలకు తెలిసిపోయింది. ఇందునుంచి ఆ సైన్యాలెందుకు వస్తున్నాయో ఊహించుకోవడం కూడ సులభసాధ్యమైంది. కొడుంబాళూర్ పెద్ద వేళారైన బూది విక్రమకేసరి, లంకాయుద్ధంలో వీరస్వర్గం పొందిన చిన్న వేళార్ ముద్దుల కూతురైన వాణతిని పొన్నియిన్ సెల్వన్కిచ్చి పెళ్ళి చేసి, వారినే చోళనాడు సింహాసనంమీద కూర్చోబెట్ట ఆశిస్తున్నారని చోళనాడులో అందరికీ తెలిసిన విషయమే. తూర్పు దిశనుంచి యువరాజు అరుళ్మొళి వర్మను సాధారణ ప్రజలు మహోత్సాహంతో పిలుచుకొని రావడం, పశ్చిమదిశనుంచి సేనాధిపతి బూది విక్రమకేసరి మహాసైన్యంతో అదే సమయాన తంజావూరు వైపు వస్తూండడమూ ఒకదానికొకటి పొందిగ్గా ఉన్నాయి.

పళువేట్టరయ్యర్లు, వారితో చేరిన చిన్న రాజులు మధురాంతకునికి పట్టం కట్టేందుకు ప్రయత్నిస్తున్నారన్న విషయం ప్రజలప్పటికే ఎరుగుదురు.

కాబట్టి వారి (ప్రజల) ప్రేమాభిమానాలను చూరగొన్న పొన్నియిన్ సెల్వన్ని సింహాసనమెక్కించేందుకే సేనాధిపతి బూది విక్రమకేసరి తన కిందనున్న మహాసైన్యంతో వస్తున్నారని

ప్రజలు ఊహించుకొన్నారు. ఇందువల్ల వారి ఉత్సాహం ఇంకా పొంగి పొర్లసాగింది. సముద్రంలాగ పొంగి వస్తున్న ఆ సైన్యవీరులకు పెద్దగా స్వాగతం చెప్పి ఉపచారాలు చేసి విందుభోజనాలు వడ్డించేందుకు తగిన ఏర్పాట్లు చేయనారంభించారు.

ఆ కాలంలో తంజావూరు నగరంలో పలువురు వర్తక సంఘాలు నడిపే సత్రాలుండేవి. కొడుంబాళూర్ మణి గ్రామస్థులు, తిరుప్పురంపయం వళంజియార్, ఉరయూర్ ధర్మ వణీకర్ మొదలైన నానాదేశ వర్తక సంఘాలు నడిపే సత్రాలలో ఆ రోజు వేలాది ప్రజలకు, సైనికులకు విందు భోజనాలు ఇచ్చేందుకు ఏర్పాట్లు జరగసాగాయి.

ఇది తెలియగానే నగర ప్రజల ఉత్సాహమూ, ఉల్లాసమూ అధికమైనాయి. అటూ ఇటూ తిరుగాడడం, గుంపులుగా చేరి మాట్లాడుకోవడం కానవచ్చింది. వారిలో నూటికి నూరుమంది అరుళ్మొళి వర్మ పక్షాన చేరినవారు కావడం వల్ల రాబోయే సంభవాల గురించి మాట్లాడడంలో దాగుడుమూతలేవీ అవసరమనిపించలేదు. సైన్యవీరులు తంజావూరు నగరాన్ని సమీపించి అక్కడక్కడా గుడారాలు వేయనారంభించగానే నగరప్రజలు ఆ గుడారాలకే వెళ్ళి వారితో పరాచికాలు/సల్లాపాలు మొదలుపెట్టేశారు.

~

సూర్యుడస్తమించి బాగా చీకటి పడేలోపు తంజావూరు మూడు వైపుల సేనావీరులు చుట్టుముట్టేశారు. నాలుగోవైపున ఉత్తరనది తంజావూరు కోటను తాకుతూ ప్రవహిస్తుండడం వల్లను, అప్పుడా నదిలో వెల్లువ పొంగి పారుతుండడం వల్లను వీరులు ఆ వైపు వెళ్ళేందుకు అనుకూలంగా లేకపోయింది. అందుకవసరం లేదని వదిలిపెట్టేశారు.

తంజావూరు కోట ప్రధాన ద్వారమైన ఉత్తర ద్వారాన్ని మనమింతకు మునుపే చూశాం కద? మొదట నందినీదేవిని వెన్నంటి వచ్చిన వంతిదేవుడు ప్రవేశించిన ద్వారం కద? ఆ కోట వాకిలి కంటికి కనిపించే చోట సేనాధిపతి బూది విక్రమకేసరి విడిది ఏర్పాటు చేయబడింది.

చీకటి పడ్డ ఒక జాము  తర్వాత సేనాధిపతి కోట చుట్టూ చూసి వచ్చి తమ విడిదిని చేరుకొన్నారు. ఆయనకు ముందుగానే అక్కడ ఇంచుమించు వందమంది వచ్చి చేరివున్నారు. వారిలో వేళార్ సైన్య నాయకులు, కైకోళార్ దండు నాయకులు, పాండ్యమండలపు నాయకులు, కొంగునాడు నాయకులు ఉన్నారు. లంకా యుద్ధంలో గెలుపొందిన పలు సేనా నాయకులు కూడ ఉన్నారు. వీరుగాక, పలు వర్తక మహాసభల నాయకులు కూడ ఉన్నారు. ముఖ్యంగా 'నానాదేశ పదిహేనువందల వారు' అని ప్రపంచ విఖ్యాతమైన వర్తక మండలపు నాయకులు ఆ కూటమిలో ఉన్నారు. వీరు విదేశాలతో సముద్రమార్గాన ఓడవ్యాపారాలు చేసే బహు ధనవంతులైన వర్తకులు; సరుకులను తీసుకొని వెళ్ళే ఓడలకు రక్షణగా తామే యుద్ధనౌకలను పంపగల వసతులు ఉన్నవారు. వీరుగాక, తంజావూరు నగరపు పెద్ద కుటుంబాలవారు అక్కడికి ఆహ్వానించబడి ఆ విడిదికి వచ్చి చేరారు.

# అధ్యాయము - 24

## మంత్రాలోచన!

**మొదట** సంప్రదాయ ప్రకారం యోగక్షేమాలు విచారించిన తర్వాత కొడుంబాళూర్ పెద్ద వేళార్ సమావేశమైన పెద్దలను, ప్రముఖులను ఉద్దేశించి ఇలా చెప్పారు:-

"నేను ఎవరెవరికి సందేశం పంపానో వారిలో ఇంచుమించు అందరూ వచ్చి చేరడమైనది. తిరుక్కోవలూర్ ముది వయస్కులైన మలైయమాన్ మాత్రం రాలేదు. ఆయన రానందుకు తగిన కారణం ఉండే ఉంటుందని భావిస్తున్నాను. చాల అపాయకరమైన కార్యమని పలువురు ఎంచదగ్గ కార్యం గురించి ఆలోచించేందుకు మనమిక్కడ సమావేశమయ్యాము. చోళ వంశస్థుల పట్ల, సుందర చోళ చక్రవర్తి పట్ల మనమంతా ఎంతటి భక్తిగొన్నవారమన్నది లోకవిదితం. దాన్ని ఎన్నోసార్లు ఎన్నో కార్యాలలో నిరూపించాము కూడ. అయినా కూడ మనమిక్కడ చక్రవర్తి కోరికకు విరుద్ధంగా సమావేశమయ్యామని మన విరోధులు నిందారోపణ చేయవచ్చు. చక్రవర్తిని ఎదిరించి యుద్ధం చేసేందుకు సైన్యాలను తరలించుకొని వచ్చామని కూడ ఆరోపించవచ్చు. కానీ చక్రవర్తి కోరిక ఇదీ అని ప్రత్యక్షంగా / ముఖాముఖి తెలుసుకోవడానికి కొంత కాలంగా మనకు అవకాశం లభించడం లేదు. చక్రవర్తిని మనం ఏకాంతంగా కలిసేందుకు సాధ్యం కావడం లేదు. వారి అంతరంగ మనోరథాన్ని తెలుసుకోవడానికి ఒక నిమిషం కూడ వారితో ఏకాంతంగా మాట్లాడ వీలు కావడం లేదు. ఎందుకు అన్నది అందరికీ తెలిసిందే. చక్రవర్తి దేహారోగ్యాన్ని ఎంచి ఆయనను తంజావూరు కోట లోపల ఉంచారని చెప్పబడుతూంది. నిజానికి పళువేట్టరయ్యర్లు ఆయనను చెరలో ఉంచారనే నాకనిపిస్తోంది. మీరంతా ఏమనుకొంటున్నారో, తెలియదు..."

సేనాధిపతి తన భాషణలో ఈ చోట ఆగినప్పుడు, "అవును, అవును", "అదే నిజం!", "చక్రవర్తిని చెరలోనే ఉంచారు" అని ఆ కూటమి నుంచి పలు స్వరాలు లేచాయి,

"మీరు ఆమోదించడం వల్ల మనమందరమూ ఒకే విధంగా ఆలోచిస్తున్నామని, ఒకే ఉద్దేశంతోను ఉన్నామని నిర్ధారమవుతోంది. విజయాలయ చోళుల కాలం నుంచి ఎందరో వేలకొద్ది వీరులు యుద్ధభూమిలో తమ ప్రాణాలను బలివ్వడం చేత ఈ చోళసామ్రాజ్యం ఇలా విస్తరించి మహోన్నత స్థితికి చేరుకొంది. చోళనాడుకు చెందినవారమని చెప్పుకోవడమే మనకు చాల గర్వకారణమైన విషయం. అటువంటి చోళ సామ్రాజ్యానికి, చోళకులానికి ఎటువంటి ఆపద కలగకుండ కాపాడేందుకే మనమిప్పుడు సమావేశమయ్యాము; చక్రవర్తికి విరుద్ధంగా కుట్ర చేసేందుకు కాదు. చక్రవర్తి విరోధులు మూడేళ్ళుగా ఆయనను చెరలో పడేసివున్నారు. ఆయనకు దేహారోగ్యం బాగలేదని కారణం చెబుతున్నారు. తొంబైయారు

యుద్ధగాయాలు భరించిన విజయాలయ చోళులు, ఎనభైయ్యోయేట తిరుప్పురంపయం పోరులో రెండు చేతులా రెండు ఖడ్గాలను ఎత్తి వాటిని చక్రాకారంలో తిప్పుతూ ఆయన దూసుకు వెళ్ళిన చోటల్లా శత్రువుల తలలను గుట్టలు పోశారు! అటువంటి వీరవంశంలో పుట్టిన సుందర చోళ చక్రవర్తి దేహానారోగ్యాన్ని కారణంగా చెప్పుకొని బయటకు రావడానికే నిరాకరిస్తున్నారంటే, అది నమ్మదగిన విషయమేనా? ఆయనను చెరలో ఉంచిన ద్రోహులు, మాయమంత్ర విద్యల మూలంగా ఆయనకు చిత్తభ్రమ కలిగించారని తోస్తూంది. చక్రవర్తి చిత్తం స్థిమితంగానే ఉంటే తమకు భీమార్జునుల వంటి వీరాధివీరులైన కుమారులున్నప్పుడు, యుద్ధరంగాన్నే చూసెరుగని మధురాంతకునికి పట్టం కట్టాలని కోరుకొంటారా?"

అప్పుడు పలువురు ఒకే సమయాన, "చక్రవర్తి కోరిక అదేనని మనకెలా తెలుసు?" అని అడిగారు.

"మనకు ప్రత్యక్షంగా తెలియదు, నిజమే. పళువేట్టరయ్యర్లు కట్టిన కట్టుకథైవుండవచ్చు. కానీ మన ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు కూడ దాన్ని నమ్ముతున్నారు..."

"అనిరుద్ధులు కూడ వారి పక్షం చేరిపోయారేమో, ఎవరికి తెలుసు?" అన్నారు కూటమిలో ఒకరు.

"అలానూ ఉండవచ్చు. దానిలోని నిజాన్ని తెలుసుకోవడం మనమిక్కడ సమావేశం కావడానికి ఒక ముఖ్యమైన కారణం. ఈ దినం తంజావూరులో వ్యాపించిన వదంతులు మీరు కూడ వినేవుంటారు. నేనది నమ్మడం లేదు. చక్రవర్తిని సజీవంగా చూసే భాగ్యం మనకందరికీ లభిస్తుందనే నమ్ముతున్నాను. అలా ఆయనను కలిసినప్పుడు పట్టం గురించి ఆయన కోరిక ఏమని ప్రత్యక్షంగా అడిగి తెలుసుకొందాం. ఒకవేళ చక్రవర్తే మధురాంతకునికి పట్టం కట్టాలని కోరుకొంటే, అందుకు మీరందరూ ఒప్పుకొంటారా?"

"ఒప్పుకోము! ఒప్పుకోము!" అన్న మహాఘోష లేచింది.

"నేనూ ఒప్పుకోను. ఎందుకంటే చక్రవర్తి చిత్తం తేటగా ఉంటే ఏనాడూ ఆయన అలాంటి నిర్ణయాన్ని తీసుకోరు. పరాంతక చక్రవర్తి కాలంలోనే పట్టం గురించిన విషయం తీర్మానించేయబడింది. సుందర చోళ చక్రవర్తి, ఆయన సంతతే తంజావూరు సింహాసనాన్ని అధిష్ఠించాలని ఆ రాజే ప్రాణాలు విడిచే తరుణంలో చెప్పడం నా చెవులారా నేనే విన్నాను. విన్నవారు పలువురు ఈ సభలో ఉన్నారు. కాలం చేసిన మహానుభావులైన గండరాదిత్యులు తమ కుమారునికి రాజ్యమేలే ఆశ పుట్టకుండ ఉండేటట్లు అతడిని పెంచేందుకు ప్రయత్నించారు. ఆయన ధర్మపత్నియైన పెద్ద రాణి - శివభక్తే రూపంగొన్న శెంబియన్ మహాదేవి - మధురాంతకునికి పట్టం కట్టకూడదని హఠం పట్టివుండడం మనందరికీ తెలుసు. దీనికంతటికీ ఏదో ఒక ముఖ్య కారణం ఉండే తీరాలి. అలా ఉన్నప్పుడు, చక్రవర్తి ఎందుకు మధురాంతకునికి పట్టం కట్టాలని ఆశపడుతున్నారు? ఆయన చిత్తం సరిగా లేదనేందుకు ఇంకొక ఉదాహరణ కూడ చెబుతాను. వీర పాండ్యుని చంపి, పాండ్య సైన్యాన్ని నిర్మూలం చేసిన తర్వాత, వీర పాండ్యునికి సహాయం చేసేందుకు

ముందుకొచ్చిన లంకాధిపతిని శిక్షించేందుకు నా సహోదరుడు దండెత్తి వెళ్ళాడు. అతడికి చాలినంత సైన్యాలను, సామగ్రిని పంపకుండ పొరబాటు చేశాం. కాబట్టి అతడు పోరులో వీరమరణం చెందవలసివచ్చింది. చోళ దేశపు వీర శౌర్య కీర్తికి కలిగిన ఆ కళంకాన్ని తుడిచిపెట్టే బాధ్యతను నేను, పొన్నియిన్ సెల్వన్ తీసుకొన్నాము. ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ మాతో సహకరించలేదని మీకందరికీ తెలుసు. మీలో ఇక్కడున్న వర్తక మహానాయకులు ఆహార సామగ్రి పంపించి మహోపకారం చేశారు. అయినా కూడ మన వీరులు ఎన్నో కష్టాలను అనుభవించవలసి వచ్చింది. అంతటనీ భరించి మహీంద్రుని దండును నిర్మూలం చేసింది ఎందుకని? చోళకులపు మహావీరుల్లో సాటి లేని మేటి వీరుడైన పొన్నియిన్ సెల్వన్ ఉత్సాహపరిచినందువల్లేనే / ఇచ్చిన ఉత్సాహ స్ఫూర్తి వల్లనే! అటువంటి వీర కుమారునికి తండ్రియైన చక్రవర్తి ఇచ్చిన బహుమతి ఏమి? రాజద్రోహం చేసినట్లు అభాండం వేసి యువరాజును చెరపట్టి బంధించి తెమ్మని ఆజ్ఞాపించడమే! చిత్త స్వాధీనం ఉన్న ఒకరు ఇలాంటి ఆజ్ఞ జారీ చేయడం సాధ్యమా...?"

"సేనాధిపతీ! మళ్ళీ చక్రవర్తి ఆజ్ఞ గురించే మాట్లాడుతున్నారు. చక్రవర్తే ఆ ఆజ్ఞను రాసి పంపించారని ఋజువేమి?" అని సభికుల్లో ఒకరు ప్రశ్నించారు.

"అందుకు ఋజువేమీ లేదు. దానిలో నిజమేమిటో ప్రత్యక్షంగా (చక్రవర్తిని) అడిగి తెలుసుకోవాలని మనమిప్పుడు ఇక్కడ సమావేశమయ్యాము. చక్రవర్తి సమ్మతం లేకుండ ఇటువంటి ఆజ్ఞ పుట్టడం సాధ్యమంటే, ఈ చోళ సామ్రాజ్యం ఎంతటి భయంకరమైన పరిస్థితిలో ఉందో ఆలోచించి చూడండి. మునుపు జరిగిన సంఘటనలను కూడ ఎంచి చూడండి. యువరాజును చెరపట్టి బంధించేందుకు వెళ్ళిన వీరులు ఆయనను బంధించేందుకు నిరాకరించేశారు. యువరాజు తమకు తామే చక్రవర్తి ఆజ్ఞను శిరసావహించి పార్థిబేంద్ర పల్లవుని ఓడలో ఎక్కి వచ్చారు. ఆ ఓడ సుడిగాలిలో చిక్కుకొందట. అప్పుడు యువరాజు కడలిలో మునిగి మరణించారని ఒక వదంతి లేచింది. దాన్ని నేను నమ్మనే లేదు. పొన్నియిన్ సెల్వన్‌గారిని సముద్రరాజు అపహరించి ఉండడని నేను దృఢంగా నమ్మాను. ఆ ఓడలో వచ్చిన తక్కిన వారందరూ బతికి బయటపడ్డప్పుడు ఆయన మాత్రం ఎలా మరణించ సాధ్యం? - కాబట్టి యువరాజు గట్టెక్కగానే ఆయనను చెరపట్టేందుకు ప్రయత్నాలు మొదలైవుండాలి. ఆ కుట్రను తెలుసుకొన్న యువరాజు తప్పించుకొని వెళ్ళి ఎక్కడో భద్రంగా ఉన్నారు. తగిన సమయాన అజ్ఞాతం నుంచి బయటకు వస్తారని నమ్మాను. మీలో పలువురు అలా నమ్మారని తెలియజేశారు. మన నమ్మకం వమ్ము కాలేదు. నాగపట్టణంలో సుడిగాలి వీచినప్పుడు యువరాజు బయటపడ్డారని, చోళనాడు ప్రజలు ఆయనను విజయ కోలాహలంతో స్వాగతించి తంజావూరుకు పిలుచుకొని వస్తున్నారని తెలుసుకొన్నాము. వారికి పక్క బలంగా ఉండే ఉద్దేశంతోనే మనం కూడ ఇక్కడికి వచ్చి చేరాము. కానీ కుట్ర దారులు మళ్ళీ తమ చేతివాటాన్ని చూపించేశారు..."

"ఏమది? ఏమైంది?" అని పలువురు గాభరాగా అడిగారు.

"నేనీ సభకు వచ్చేందుకు కొన్ని నిమిషాలకు ముందే ఆ వార్త అందింది. ఈ రోజు ఉదయం యువరాజు తిరువారూరు నుంచి బయలుదేరే సమయాన ఆయన ఎక్కి వచ్చిన ఏనుగుకు మదపిచ్చి పట్టి ఏనుగు మావటిసే ఎత్తి విసిరేసిందట. అప్పుడు పుట్టిన గందరగోళంలో యువరాజు మళ్ళీ కనిపించకుండ పోయారట...!"

"అయ్యయ్యో!", "ఇదేం విపరీతం?", "దైవం కూడ వంచకుల పక్షాన చేరిపోయాడా?" అని పలువురు గగ్గోలు పెట్టసాగారు. వారిని సేనాధిపతి చేయెత్తి శాంతింపజేశారు.

"వార్తను మొదట విన్న వెంటనే నేను కూడ మతి పోగొట్టుకొన్నాను. కాస్త సంభాళించుకొనే ఈ సభకు వచ్చి చేరాను. యువరాజు అరుళ్మొళి వర్మ యుద్ధరంగంలో ఎంతటి సాటిలేని మేటి వీరులో, అలాగే తెలివితేటల్లోను, బుద్ధిచాతుర్యంలోను ఆరితేరినవారు. వంచకుల కుట్ర అనే వలలో అంత సులభంగా చిక్కుపడరు. త్వరలోనే ఆయన గురించిన మంచి వార్త వస్తుందని ఎదురు చూస్తున్నాను! అంత లోపల మనం తదుపరి ఏం చేయాలి, ఈ ఇక్కట్టైన పరిస్థితిలో ఎలా నడుచుకోవాలన్న విషయమై మీ అభిప్రాయాలను తెలుసుకోగోరుతున్నాను!"

~

ఇలా సేనాధిపతి తాము చెప్పదలుచుకొన్నది, చెప్పవలసింది చెప్పి ముగించగానే, తక్కినవారు తమ అభిప్రాయాలను తెలియజేశారు. వారి అభిప్రాయాలు ముఖ్యమైన విషయాల్లో ఇంచుమించు ఒకేలాగ ఉన్నాయి. చిల్లర విషయాల్లో మాత్రమే వేరుగా ఉన్నాయి. అక్కడున్న వారి ప్రతినిధులు రేపటిరోజే చక్రవర్తిని చూసి మాట్లాడేందుకు ఏర్పాటు చేయగోరాలని, అందుకు అవకాశం కలిగితే చక్రవర్తితో, "మధురాంతకుడు సింహాసనమెక్కడం మాకిష్టం లేదని" స్పష్టంగా చెప్పేయాలని పలువురు నొక్కి చెప్పారు. "పళువేట్టరయ్యర్లను సర్వాధికార పదవులనుంచి తొలగించాలి, లేదా చక్రవర్తి తంజావూరు వదిలి పళైయారైకి వెళ్ళిపోవాలి" అని ఇంకొందరు నొక్కి వక్కాణించారు.

ఆదిత్య కరికాలన్‌గారికి ఇప్పటికే యువరాజు పట్టాభిషేకం చేయబడడం వల్ల ఆయనే చక్రవర్తి తర్వాత పట్టానికి అర్హులు. ఆయనే పట్టం వద్దని తిరస్కరిస్తే, ఆయన తర్వాత పట్టానికి అర్హులు యువరాజు అరుళ్మొళి వర్మగారే. దీన్ని సందేహానికి తావు లేనట్లు చక్రవర్తికి తెలియజేసి ఆయనను కూడ ఒప్పించాలి" అన్నారు ఇంకొందరు. చక్రవర్తిని కలిసేందుకే అవకాశం దొరకకపోతే, కోట తలుపులను తెరిచేందుకు నిరాకరిస్తే, కోటను ముట్టడించవలసిందేనని ఇంకొందరు చెప్పారు. "ముట్టడించడం ఎందుకు? వెంటనే కోట తలుపులను, బురుజులను ధ్వంసం చేయమని మన వీరులను పురికొల్పవలసిందే" అని ఇంకొందరు ఘోషించారు. యువరాజు గురించి వార్త తెలిసేవరకు ఓపికగా ఉండడం మంచిదని, ఆదిత్య కరికాలన్‌గారికి దూతను పంపించి ఆయనను కూడ పిలిపించుకోవడం మంచిదని అభిప్రాయపడ్డారు.

"అందుకోసం వేచివుండడం వల్ల ప్రయోజనమేమి? పళువేట్టరయ్యర్ల అధీనంలో ఉన్న పెద్ద

సైన్యం కొళ్ళిడం నదికి అవతలి తీరాన ఉంది. ప్రస్తుతం కొళ్ళిడం నదిలోను, తక్కిన నదుల్లోను పెద్ద వెల్లువ పారుతుండడం వల్ల ఆ సైన్యాలు ఇక్కడకు రాలేవు. కాబట్టి కోటను ముట్టడించి చక్రవర్తిని పళువేట్టరయ్యర్ల చెరనుంచి విడిపించేందుకు ఇదే తగిన సమయం!" అని నొక్కి చెప్పారింకొందరు.

ఆ సమయాన గుడారం వాకిట కాపలా కాస్తున్న వీరుడు తొందర తొందరగా సేనాధిపతిని సమీపించి ఆయన చెవిలో ఏదో చెప్పాడు. ఆయన సభికులను చూసి, "ఇదిగో ఒక్క నిమిషంలో వచ్చేస్తాను. మీరు కాస్త మాట్లాడుతుండండి" అని చెప్పి గుడారం నుంచి బయటకు వచ్చారు.

~~~
~~~

# అధ్యాయము - 25

## కోట వాకిట

**మంత్రాలోచన** జరుగుతున్న గుడారం నుంచి బయటకు వచ్చిన సేనాధిపతి, అక్కడున్న గుర్రం మీదికి ఎగిరి కూర్చొని, తంజావూరు కోట ఉత్తర ద్వారం వైపు వేగంగా వెళ్ళారు. అదే సమయాన ఏనుగొకటి ఉత్తర ద్వారాన్ని సమీపిస్తుండడాన్ని గమనించారు. ఏనుగు పైన మావటి ఒకడు, ఇద్దరు స్త్రీలు వస్తున్నారు. మావటి తన చేతనున్న కొమ్ముబూరాను నోట పెట్టుకొని కాసేపు ఊదాడు. తర్వాత, ఉచ్ఛస్థాయిలో ధ్వనించిన స్వరంతోను, స్పష్టంగాను, ఇలా ఘోషించాడు:- "ఈలం దేశపు పట్టాన్ని జయించిన పరాంతక చిన్న వేళార్ ప్రియపుత్రిక, కొడుంబాళూర్ పెద్ద వేళార్ సేనాధిపతి బూది విక్రమ కేసరి పెంపుడు కుమార్తె, పళైయార్రై యువరాకుమారి కుందవై దేవి అనుంగు చెలికత్తె వాణతీదేవి వస్తున్నారు! పరాక్! బహు పరాక్! దారి వదలండి!"

కోట వాకిలి సమీపాన అగడ్త గట్టును చేరగానే ఆ మావటి మళ్ళీ కొమ్ము బూరా ఊదాడు. దాని ప్రతిధ్వని ఆగేలోపు ఆ మావటి మళ్ళీ మునుపటిలాగ గంభీరస్వరంతో ఇలా ఘోషించాడు:- "కొడుంబాళూర్ రాకుమారి వాణతీదేవి యువరాకుమారి వద్దనుంచి చక్రవర్తికి ఒక ముఖ్యమైన వార్తను తీసుకొని వస్తున్నారు. పెద్ద పళువేట్టరయ్యర్‌నుంచి చిన్న పళువేట్టరయ్యర్‌కి ఒక ముఖ్యమైన వార్త తీసుకొని వస్తున్నారు! కోట వాకిలి తెరవండి! పరాక్! బహు పరాక్! కొడుంబాళూర్ రాకుమారికి, వారి స్నేహితురాలు పూంగుళలి అమ్మగారికి దారి విడవండి! కోట తలుపులను తెరవండి!"

~

ఇలా ఏనుగు మావటి పెద్దగా కూసింది విన్న సేనాధిపతి బూది విక్రమ కేసరి పొందిన ఆశ్చర్యం అంతా ఇంతా కాదు! ఆ ఏనుగు మావటి గొంతు ఎక్కడో ఎప్పుడో విన్నట్లుందే? అతడెవరు? మావటి ఎవరై ఉంటేనేమి? ఏనుగుపైనున్నది వాణతేనా అన్నది కద మొదట చూసి రూఢి చేసుకోవాలి? ఆమె కోట లోపలికి పోకుండ అడ్డుపడి ఆపాలి కద? వాణతే అయితే చాల మంచిది! ఈ చిక్కులన్నీ తీరేవరకు బిడ్డ మనతో ఉండడమే మంచిది...! ఇలా ఆలోచిస్తూనే సేనాధిపతి గుర్రాన్ని వేగంగా నడుపుకొంటూ వెళ్ళి ఏనుగును సమీపించారు. ఆయన వెంబడే వచ్చిన వీరుల్లో ఒకడు దివిటీని తీసుకొని వచ్చాడు. దాని వెలుతురులో ఏనుగుపైనున్నవారిని చూసినప్పుడు వారు చిన్న వేళార్ కుమార్తె వాణతి, పూంగుళలే అని తెలియవచ్చింది.

"బిడ్డా! వాణతీ!" అని ఆయన ఏదో చెప్పే లోపల మావటి మళ్ళీ కొమ్ముబూరాను ఊదనారంభించాడు. వాడినెలా ఆపడం?

మంచివేళగా ఇంతలో ఏనుగుపైనున్న అమ్మాయిలు తమను సమీపించిన గుర్రంపైనున్నదెవరని పరికించి చూశారు.

~

వెంటనే వాణతి మావటి చెవిలో ఏదో చెప్పి అతని కొమ్ము బూరా మోతను ఆపించి, "పెదనాన్నా! మీరేనా? నేను విన్నది నిజమేనా?" అన్నది.

"అవును, బిడ్డా! నేనే! అయితే ఇదేం విచిత్రం? వార్త తీసుకొని వచ్చేందుకు నీవేనా దొరికావు? యువరాకుమారికి ఇంకెవరూ దూతలు దొరకలేదా? అందులోను ఇటువంటి పరిస్థితిలో?" అన్నారు సేనాధిపతి.

"అవును, పెదనాన్నా! ఇటువంటి పరిస్థితి కాబట్టే నన్ను సందేశం తీసుకొని వెళ్ళమని పంపారు. మీరు సైన్యంతో వచ్చి తంజావూరు కోటను చుట్టుముట్టారని వార్త వచ్చింది. ఇంకెవరినైనా పంపిస్తే మీ సైన్యపు వీరులు అడ్డగించి ఆపేయవచ్చు. మీరు అనుమతించినా, కోట లోపలివారు కోట తలుపు తీసేందుకు నిరాకరించవచ్చు. నన్ను పంపిస్తే రెండు కార్యాలకూ అనుకూలంగా ఉండవచ్చని ఆలోచించి యువరాకుమారి నన్ను పంపారు. తోడుగా పూంగుళలిని కూడ పంపారు..."

"అవునవును! ఈ పడవ నడిపే పిల్ల చాల గట్టిది, తెలివైనది. అది నాకింతకు మునుపే తెలుసు. కానీ నీవలాంటి వార్త ఏం తీసుకొని వచ్చావు? రాత్రికి రాత్రే దూతను పంపవలసిన అంతటి అత్యవసర వార్త ఏమి?"

"అత్యవసరమైన వార్తే, పెదనాన్నా! పొన్నియిన్ సెల్వన్ గురించి చక్రవర్తికి వార్త తీసుకొని వెళుతున్నాను."

"ఆహా! పొన్నియిన్ సెల్వన్ గురించా? ఆయన గురించి నీకేమైనా తెలుసా?"

"ఏం? ఆయన గురించి నాకెంతో తెలుసు. ఆయన వీరాధివీరులు, శూరాధిశూరులు, కావేరిలో మునిగిపోనివారు, కడలిలో పడ్డా మునగనివారు, ఆపదలో సహాయం చేసినవారిని మరువని వారు, తలిదండ్రుల పట్ల భక్తి కలిగినవారు, అక్కగారి మాట మీరనివారు, రాజ్యం మీద ఆశలేనివారు, ..."

"చాలు, చాలు! అదంతా నాకూ తెలిసిందే. ఆయనిప్పుడు క్షేమమేనా? ఆయనిప్పుడు ఎక్కడున్నారని నీకు తెలుసా?"

"క్షేమంగానే ఉన్నారు, పెదనాన్నా! ఇప్పుడెక్కడున్నారని కూడ తెలుసు. కానీ అది మీకు చెప్పలేను."

"ఏమి? చెప్పలేవా? నాకు కూడానా చెప్పలేవు? నీవేనా మాట్లాడుతున్నది, వాణతీ?"

"అవును, పెదనాన్నా! నేనే మాట్లాడుతున్నాను. యువరాజు ఉన్నచోటు ఎవరికీ చెప్పనని మాటిచ్చాను."

~

సేనాధిపతి బూది విక్రమకేసరికి కోపం, ఆక్రోశం, ఉక్రోషం పొంగుకొచ్చాయి. "అమ్మాయీ! యువరాకుమారి వద్దకు పంపిస్తే నిన్ను మంచి దారిలో పెంచుతుందని నమ్మాను. ఇంతటి హఠమారిగా చేసిందా నిన్ను? చాలు, చాలు! నీవు పళైయార్లైలో ఇంతవరకు ఉన్నది చాలు. కిందకు దిగు! నిన్ను కొడుంబాళూరుకు పంపించేసి తదుపరి కార్యక్రమం చూస్తాను!" అన్నారు.

"పెదనాన్నా! నాకూ ఈ తంజావూరు మట్టిమీద ఇష్టం లేదు. అందుకే ఏనుగుపైకెక్కి కూర్చొనివున్నాను. ఈ ఏనుగుకు తరచూ మదపిచ్చి పడుతోంది. ఈరోజు ఉదయాన ఒకడిని ఎత్తి విసిరేసింది. కాబట్టి చాల దగ్గరగా రాకండి. నేను తీసుకొని వచ్చిన వార్తలను అందజేసిన తర్వాత నేనే మీ దగ్గరకు వచ్చేస్తాను. నన్ను కొడుంబాళూరుకు పంపించండి. లేక, నా తండ్రి ఉన్నచోటికే పంపించేయండి. ఇప్పుడు మాత్రం నాకడ్డుపడి ఆపకండి!" అన్నది వాణతి.

బూది విక్రమకేసరి కాసేపు ఆలోచించిన తర్వాత, "సరేనమ్మా! నేను నిన్ను అడ్డగించి ఆపకుండ విడిచిపెడతాను. కోట తలుపులు తెరవకపోతే ఏం చేస్తావు?" అన్నారు.

"పెదనాన్నా! మీరింత పెద్ద సైన్యంతో వచ్చారు కద? ఎందుకని? కోట తలుపులు తెరవకపోతే, మీ సైనికులను పురిగొల్పి కోట తలుపులను విరగగొట్టించండి!" అన్నది వాణతి.

బూది విక్రమకేసరి ఇది విని చాల గర్వపడ్డారు. "కూతురా! కొడుంబాళూర్ రాకుమారి మాట్లాడవలసినట్లు మాట్లాడావు. అవసరం వస్తే అలాగే చేస్తాను. కానీ అందుకవసరం రాదు. యువరాకుమారి కుందవైదేవినుంచి వార్త తీసుకొని వచ్చిన నిన్ను ఆపేందుకు ఈ చిన్న పళువేట్టరయ్యర్ ఎవరు? అతడలా ఏనాడూ చేయడు. కానీ నా తరఫున కూడ చిన్న పళువేట్టరయ్యర్‌కి ఒక వార్త అందజేయి! నీవు కోట లోపలున్నప్పుడు నీకేదైనా చిన్న హాని కలిగినా వాడి కులాన్ని సమూలంగా తుడిచేస్తానని చెప్పు! నేను, నాతో ఉన్నవారు చక్రవర్తిని ప్రత్యక్షంగా చూసి ఆయన కోరికేమిటో ఆయన నోటినుంచే విని తెలుసుకోవడానికి వచ్చామని చెప్పు! రేపు పొద్దు గడిచేలోపు చక్రవర్తిని దర్శించేందుకు అతడు వసతి చేయకపోతే, కోట ముట్టడి ప్రారంభిస్తామని కూడ తెలియజెప్పు!" అన్నారు.

"అలాగే, పెదనాన్నా!" అన్నది వాణతి.

మళ్ళీ ఏనుగు మావటి కొమ్ముబూరా ఊదాడు.

"కొడుంబాళూర్ రాకుమారికి దారివ్వండి! కోట తలుపులను తెరవండి!" అని ఘోషించాడు.

~~~
~~~

# అధ్యాయము - 26

## వాణతి ప్రవేశం

**కోట** లోపల చిన్న పళువేట్టరయ్యర్ మనసు కల్లోలితమైవుంది. వీర, ధీరత్వాలలో ఆయన ఎవరికీ తీసిపోరు. కానీ అన్నగారి సలహా తీసుకోకుండ ఏ కార్యమూ చేసి అలవాటు లేని వారు కాబట్టి ఈ క్లిష్టపరిస్థితిలో రెక్కలు కోల్పోయిన పక్షిలాగ విలవిల్లాడారు.

ఆ రోజు ఉదయం నుంచి ఒకదాని వెంట ఒకటిగా విపరీతమైన వార్తలు ఆయన చెవిన పడుతున్నాయి.

పెద్ద పళవేట్టరయ్యర్ కడంబూరునుంచి బయలుదేరి రెండు రోజులపైనే అయిందని వార్త వచ్చింది. సుడిగాలి వీచిన రోజు కొళ్ళిడం నది వెల్లువలో అనేకమైన పడవలు మునిగిపోయాయని కూడ ఆయనకు అప్పటికే తెలుసు. కాసేపటికల్లా పెద్ద పళువేట్టరయ్యర్ ఎక్కివున్న పడవనుంచి ఒక్కడు మాత్రమే వచ్చి చేరాడు. ఆయన వచ్చిన పడవ మునిగిపోయిందనీ, తానెలాగో అష్టకష్టాలు పడి గట్టెక్కి వచ్చి చేరానని తెలియజేశాడు.

అంతవరకు నాగపట్టణపు చూడామణి విహారంలో అజ్ఞాతంగావున్న యువరాజు అరుళ్మొళి వర్మ ఆ రోజు బయటపడ్డారని, మహాజనకూటమే వెంటరాగా తంజావూరు వైపు వస్తున్నారని ఇంకొక గూఢచారి వచ్చి సమాచారమందించాడు. తాను రాత్రికి రాత్రే బయలుదేరి వెల్లువమయమైన ప్రదేశాలను దాటుకొని వచ్చానని చెప్పాడా గూఢచారి.

ఇంకాసేపటికి శంబువరయ్యర్ పంపిన మనిషి ఒక్కడు మాత్రమే వచ్చి చేరాడు. తిరుక్కోవలూర్ మలైయమాన్ ఒక పెద్ద సైన్యాన్ని సమకూరుస్తున్నారని, ఆదిత్య కరికాలన్‌గారి ఆవేశం పెరిగిపోతూందని, కాబట్టి పెద్ద పళువేట్టరయ్యర్‌ని వెంటనే బయలుదేరి రమ్మని శంబువరయ్యర్ సందేశం పంపారని చెప్పాడు.

పెద్ద్ పళువేట్టరయ్యరేమో ఇంకా తంజావూరుకు వచ్చి చేరలేదు. ఆయన వెంటనే బయలుదేరి వెళ్ళడమెలా సాధ్యం? యముడు దగ్గరకొచ్చేందుకు కూడ భయపడే ఆ వీరవృద్ధుని కొళ్ళిడం వెల్లువ ఒకవేళ పొట్టనబెట్టుకొందా? - అని చిన్న పళువేట్టరయ్యర్ కలతజెందారు.

వీటి తర్వాత అన్నిటికన్న పెద్దదైన పిడుగుపాటి వార్తను దక్షిణం నుంచి వచ్చిన గూఢచారులు పరుగెత్తి వచ్చి అందజేశారు. దక్షిణంనుంచి తంజావూరుకు వస్తున్న మూడు ప్రధానమార్గాలలోను సైన్యపు వీరులు బయలుదేరి వస్తున్నారని, ఆ మూడు సైన్యాలకు కొడుంబాళూర్ బూది విక్రమకేసరి స్వయంగా నాయకత్వం వహించి వస్తున్నారని తెలియజేశారు.

దీన్ని విన్న తర్వాతే చిన్న పళువేట్టరయ్యర్ కోట తలుపులన్నిటినీ మూసేయడానికి ఆజ్ఞ జారీ

చేశారు. లోపలినుంచి బయటకు ఎవరూ వెళ్ళడంగాని, బయటినుంచి ఎవరూ లోపలికి రావడంగాని పూర్తిగా ఆపించేశారు.

అలవాటు ప్రకారం ఆ రోజు ఉదయం కోట లోపలికొచ్చిన వేళక్కార దండును చక్రవర్తి అంతఃపురం చుట్టూ కాపలావుంచి, తమ సొంత దండు వీరులను కోట కాపలాకు నియమించారు.

ఈ వివరాలన్నీ చక్రవర్తికి కూడ తెలియజేయాలని భావించారు. దానికి ముందు ముఖ్యమంత్రి అనిరుద్ధులను కలిసి మాట్లాడాలనుకొన్నారు. అనిరుద్ధులమీద ఆయనకంతగా నమ్మకం లేదు. అయినా కూడ, ఈ సమయాన ఆయన కోట బయటకన్న, కోట లోపల ఉండడమే మంచిది. తమకు తెలియకుండ ఆయన ఏదీ చేయలేరు కద? ఆయనను సలహా అడిగి కార్యాలు చేసేటట్లు నటించడం కూడ మంచిదే. తర్వాత ఏదైనా పొరబాటు జరిగితే, నింద తమ ఒక్కరిమీద మాత్రమే పడకుండ ఉంటుంది.

చక్రవర్తికి తాము మాత్రమే వెళ్ళి ఈ వార్తలను తెలియజేయడం కన్న అనిరుద్ధులను కూడ తోడు తీసుకొని వెళ్ళి విషయాలను వివరించడం సులభంగా ఉంటుంది.

యువరాజు అరుళ్మొళి వర్మ, అతడికి తన పెంపుడు కూతురునిచ్చి పెళ్ళి చేయగోరుతున్న సేనాధిపతి బూది విక్రమ కేసరి చేరి కుట్రాలోచన చేసి తంజావూరును కైవసం చేసుకోవడానికే ఇరువైపుల నుంచి వస్తున్నారని చిన్న పళువేట్టరయ్యర్ నమ్మారు. ఇందు గురించి తాము ఒక్కరే చెబితే చక్రవర్తి నమ్మడం కూడ సందేహమే. ముఖ్యమంత్రి అనిరుద్ధులు కూడ చేరి చెబితే నమ్మే తీరాలి కద?

~

ముఖ్యమంత్రి అనిరుద్ధులు కూడ ఒకింత కలవరపాటుతో ఉన్నారు. యువరాకుమారి కుందవై ఆ రోజు ఉదయం తంజావూరు వదిలి వెళ్ళిందే ఆయనకు అంతగా నచ్చలేదు. లంకారాణి, పూంగుళలి ఉదయం నుంచి కనిపించకపోవడం ఆయన నెమ్మదిని చాలవరకు కలచివేసింది. “వారెక్కడికి వెళ్ళారు? ఎందుకని? ఎలా?” అని ఎంతగానో ఆలోచించి కూడ ఒక తీర్మానానికి రాలేకపోయారు. సేనాధిపతి బూది విక్రమకేసరి పెద్దసైన్యంతో వస్తున్నారన్న విషయం ఆయనకు చాల కలవరపాటును కలిగించింది.

అయినా కూడ ఇదంతా చక్రవర్తికి తెలియజేయవలసిన అవసరం లేదని ఆయన చిన్న పళువేట్టరయ్యర్కి మంత్రాలోచన చెప్పారు.

“చక్రవర్తి మనసు ఈరోజు ఇంకా కల్లోలితమైవుందని విన్నాను. మహారాణి అంతరంగ సేవకురాలు వచ్చి చెప్పి వెళ్ళింది. ఈ పరిస్థితిలో బూది విక్రమకేసరి గురించి చెబితే, చక్రవర్తి మెదడులోని రక్తనాళాలు పేలిపోయి ఆయన ప్రాణానికే ఆపద కలుగుతుంది. ఇప్పటికే తంజావూరు నగరంలో చక్రవర్తి కాలంచేశారన్న వదంతి వ్యాపించిందట. నిజంగానే అలా జరిగితే ఎన్ని విపరీతాలు జరుగుతాయో ఆలోచించి చూడండి. చక్రవర్తిని మీరే చంపేశారని వదంతి లేస్తుంది. మీ విరోధులకు అది చాల అనుకూలంగా ఉంటుంది. కాబట్టి ఓపికతో వేచివుండి ఏం చేయాలో తీర్మానిద్దాం. బూది విక్రమకేసరి ఉద్దేశమేమిటో మొదట

తెలుసుకొందాం. అంతలోపల పొన్నియిన్ సెల్వన్ గురించి, పెద్ద పళువేట్టరయ్యర్ గురించి ఏదైన నిర్దుష్టమైన వార్త రావచ్చు/అందవచ్చు. అంతవరకు ఓపిక పట్టండి" అని ముఖ్యమంత్రి అనిరుద్ధులు చెప్పింది చిన్న పళువేట్టరయ్యర్కి కూడ ఉచితమని తోచింది.

"అలాగైతే తగిన సమయం చూసి చక్రవర్తికి చెప్పే బాధ్యతను మీకే వదిలి పెట్టేస్తాను. కోట కాపలా కార్యక్రమాలను నేను చూసుకొంటాను" అని చెప్పేసి చిన్న పళువేట్టరయ్యర్ ముఖ్యమంత్రి వద్ద సెలవు తీసుకొన్నారు.

అది మొదలు కోట ప్రాకారపు గోడ చుట్టూ వెళ్ళి చూస్తూ కోట కాపలాకు కావలసిన ఏర్పాట్లను చేస్తూ వచ్చారు. దీర్ఘకాలపు ముట్టడింపును తట్టుకోవడానికి కూడ కోటను సిద్ధం చేయాలి; కొడుంబాళూర్ సైన్యం వీరులు కోట తలుపులు విరగగొట్టి, గోడపైకెక్కి దూకి కోటను కైవసం చేసుకోవడానికి ప్రయత్నిస్తే, ఆ ప్రయత్నాలను తిప్పికొట్టేందుకు కూడ సిద్ధంగా ఉండాలి. ఇందుకోసం తమకు నమ్మకస్తులైన వీరులను అక్కడక్కడా నిలబెట్టివుంచాలి. కోట గోడ ఎక్కడైనా బలహీనంగా ఉంటే అక్కడ బలపరచాలి.

ఈ ఏర్పాట్లలో చిన్న పళువేట్టరయ్యర్ నిమగ్నమైవున్నప్పుడే, బయటినుంచి వార్తలను తెలుసుకోవడానికి దారి ఏమి అనికూడ ఆయన ఆలోచించసాగారు.

~

తంజావూరు కోటకు రెండే రెండు రహస్య సొరంగ మార్గాలున్నాయి - మొదటిది పెద్ద పళువేట్టరయ్యర్ మాళిగనుంచి నేలమాళిగ గుండా బయటకు వెళుతూంది. ఈ రహస్య మార్గాన్ని కొన్ని రోజులవరకు ఎవరూ ఉపయోగించలేరు. ఎందుకంటే, ఆ దారి కోట బయట చేరే చోట ఉత్తర నది పొంగి పారుతూంది. ఆ దారిని ఇప్పుడు తెరిస్తే వెల్లువ నేలమాళిగ లోపలికి వచ్చేస్తుంది.

ఇంకొక రహస్యమార్గం ముఖ్యమంత్రి అనిరుద్ధుల అంతఃపురంనుంచి బయలుదేరుతూంది. కానీ ఆ దారిగుండా చిన్న పళువేట్టరయ్యర్కి తెలియకుండ ఎవరూ బయటకు వెళ్ళడంగాని, లోపలకు రావడంగాని సాధ్యం కాదు. ఆ దారి కోట గోడను దాటి బయటకు వెళ్ళే చోట ఆయన తమ కాపలావారిని నియమించారు. ఆ సొరంగమార్గం గుండా రాత్రి రెండవ జాము తర్వాత తమ ఆంతరంగికులను పంపాలని చిన్న పళువేట్టరయ్యర్ నిర్ణయం తీసుకొన్నారు. కడంబూరుకు, పళైయారైకి తమ మనుషులను పంపించి పెద్ద పళువేట్టరయ్యర్ గురించి, పొన్నియిన్ సెల్వన్ గురించి నిర్దుష్టమైన సమాచారం తెలుసుకోవాలని భావించారు.

ఇలా కాలాంతక గండరు (చిన్న పళువేట్టరయ్యర్ గారి అసలు పేరు) తీర్మానించుకొన్నప్పుడే ఒక వీరుడు వేగంగా పరుగెత్తుకు వచ్చి, ఉత్తర ద్వారం వద్ద ఒక ఏనుగు మీద ఇద్దరు స్త్రీలు ఆగమించారని, వారికోసం కోట ద్వారాన్ని తెరవాలని మావటి ఘోషించాడని తెలియజేశాడు. వచ్చిన స్త్రీలలో ఒకరు వాణతి అని తెలిసిన వెంటనే చిన్న పళువేట్టరయ్యర్ అమితాశ్చర్యం చెందారు. వాణతి పెదనాన్న తమ సైన్యంతో

వచ్చి కోటను చుట్టుముట్టిన ఈ సమయాన కోట తలుపులను తీయమని అడిగేందుకు అ అమ్మాయికి ఎంతటి తెంపరితనం? మొదట "ఖచ్చితంగా కోట తలుపులను తీయడానికి వీల్లేదు" అని చెప్పేయాలనే అనుకొన్నారు. ఉత్తర ద్వారం చేరేలోపు ఆయన ఆలోచన మారిపోయింది.

'కేవలం ఒక చిన్న పిల్లకు భయపడి కోట తలుపులను తీయ నిరాకరించడమా? అది నా వీర, ధీరత్వాలకు అవమానకరం కాదా?' అని అనుకొన్నారు. అలా ఆ అమ్మాయి కోట లోపలికి ఎందుకు రావాలని కోరుకొంటూందే అడిగి తెలుసుకోవాలని ఆయన కుతూహలపడ్డారు.

~

కోట వాకిలిపైనున్న వేదిక మీదెక్కి చూశారు. ఏనుగుమీద మావటిగాక ఇద్దరమ్మాయిలు మాత్రమే ఉన్నారన్న విషయం స్పష్టంగా తెలిసింది. వారిలో ఒకరు వాణతి అని కూడ చూసి తెలుసుకొన్నారు. ఆ సమయాన కొడుంబాళూర్ పెద్ద వేళార్ వారితో మాట్లాడుతున్నారు. ఆ సంభాషణలో ఒక భాగం ఆయన చెవిన కూడ పడింది. పెద్ద వేళార్ వాణతిని కోట లోపలికి వెళ్ళవద్దనడమూ, వాణతి వెళతానని పంతం పట్టడమూ విన్నారు. కాబట్టి వాణతికి కోట తలుపులు తెరుద్దామని అనుకొన్నారు.

పెద్ద వేళార్ అవతలికి వెళ్ళగానే ఏనుగు ఇంకొన్నిఅడుగులు ముందుకు వేసి అగడ్త అంచుకు వచ్చి నిలబడడాన్ని గమనించారు.

ఏనుగు మావటి  కొమ్ము బూరా ఊది, మునుపటిలాగే, "కొడుంబాళూర్ రాకుమారికి కోట తలుపులు తెరవండి! పెద్ద పళువేట్టరయ్యర్‌నుంచి చిన్న పళువేట్టరయ్యర్కి, యువరాకుమారి కుందవైదేవి నుంచి చక్రవర్తికి వార్తలు తీసుకొని వస్తున్న వాణతీదేవికి వెంటనే దారి విడవండి!" అని ఘోషించాడు.

ఇది వినగానే చిన్న పళువేట్టరయ్యర్ మనసులో కాస్తో కూస్తో ఉన్న సందేహం కూడ వీడిపోయింది. పెద్ద పళువేట్టరయ్యర్ వాణతి ద్వారా తమకు సందేశం పంపడం విచిత్రమే. కానీ ఏదైనా కుట్ర, కుతంత్రం ఉండవచ్చు. ఉంటే, దాన్ని తాము కనిపెట్టలేమా? ఈ చిన్న పిల్ల తమను మోసగించి తప్పించుకోగలదా? చూద్దాం!

ఏనుగు మావటి ఊదిన కొమ్ముబూరా ఘోషకు ప్రతిఘోష కోట వాకిలిపైనుంచి వినిపించింది. దివిటీ వెలుతురు కనిపించింది. ఆ వెలుతురులో శూలాల మొనలు తళతళ మెరిశాయి. విల్లులకు సంధించిన బాణాలు రివ్వున దూసుకు వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాయి. వాటికి మధ్య ఒక మనిషి రూపం బయటకు వచ్చింది.

"కొడుంబాళూర్ రాకుమారికి కోట తలుపులు తెరవబడతాయి. ఏనుగు, ఏనుగు మీదున్నవారు తప్ప ఇంకెవరైనా వారిని వెన్నంటి లోపలకు రావడానికి ప్రయత్నిస్తే వారు తక్షణం యమలోకానికి పంపబడతారు!" అని ఆ మనిషి పిడుగు పడ్డట్లు గర్జించాడు.

ఇది వినగానే బూది విక్రమ కేసరి, ఆయన వెంట వచ్చిన వీరులు ఇంకాస్త అవతలికి వెళ్ళారు.

కోట తలుపులు తెరవబడ్డాయి. అగడ్త మీద బల్ల దించబడింది. ఏనుగు బల్లమీదుగా నడిచి వెళ్ళినప్పుడు, బల్ల అదిరింది. వాణతి కాస్త భయపడింది. కానీ ఆపదేమీ కలగలేదు. ఏనుగు అగడ్తను దాటి అవతలికి చేరి, తెరిచిన కోట ద్వారంగుండా లోపలికి ప్రవేశించింది. మరుక్షణమే బల్ల ఎత్తి వేయబడింది. కోట తలుపులు కూడ మూయబడ్డాయి.

వాణతి ఎక్కివున్న ఏనుగు సమీపాన చిన్న పళువేట్టరయ్యర్ ఏనుగు వచ్చి నిలిచింది.

“రాకుమారీ! స్వాగతం! తమ పెదనాన్న వెళ్ళవద్దని చెప్పినా వినకుండ రాగోరినందుకు సంతోషం! ఇక్కడ మీకేదైనా హానీ కలుగుతుందేమోనని భయపడకండి! నేను హామీ ఇస్తున్నాను!” అని చిన్న పళువేట్టరయ్యర్ గంభీరంగా అన్నారు.

“అయ్యా! నాకెటివంటి భయమూ లేదు. నేను తెలియజేయ వచ్చిన వార్తలను అందజేసిన తర్వాత నన్ను మీరు పాతాళ చెరసాలలో బంధించినా దిగుల్లేదు!” అన్నది వాణతి.

~~~
~~~

# అధ్యాయము - 27

## "నిలు ఇక్కడ!"

**వాణతి** పాతాళ చెరసాల మాట ఎత్తగానే చిన్న పళువేట్టరయ్యర్కి పాత జ్ఞాపకాలొచ్చాయి. సంప్రదాయపు మర్యాదలను పక్కకు పెట్టి ఇలా అన్నారు:- "అవును; మీరొకసారి పాతాళ చెరసాలకు వెళ్ళారు, యువరాకుమారి వెంట. లోగుట్టు తెలుసుకోవడానికి వచ్చి తప్పించుకొని పారిపోయిన గూఢచారి గురించి విషయం తెలుసుకోవడానికి వెళ్ళారు కద?"

"లేదయ్యా! మీరు చెబుతున్నది సరికాదు. మేమా రోజు పాతాళ చెరసాలకు వెళ్ళింది గూఢచారిని గురించి తెలుసుకోవడానికి కాదు. పట్టపు యువరాజు ఆదిత్య కరికాలన్ తాళపత్ర సందేశం ఇచ్చి పంపించిన దూత గురించి తెలుసుకోవడానికి వెళ్ళాము."

"మీరలా అనుకొని వెళ్ళారు. అతడు దూతా, లేక గూఢచారా అని మీకెలా తెలుసు? నీవేమీ తెలియని చిన్న పిల్లవు. నీతో అందుగురించి వివాదించి ప్రయోజనం లేదు. వెళ్ళిందెలాగూ వెళ్ళారు కద? అతడి గురించి ఏమైనా తెలుసుకొన్నారా?"

"లేదు. మేము ఎవరిని చూడ వెళ్ళామో, అతడు మీకు కూడ తెలియకుండ విడుదల చేయబడి వెళ్ళిపోయాడు. పళువూర్ రాణి ఆజ్ఞ మాకన్న ముందుంది. పాపం మీరేం చేస్తారు?"

చిన్న పళువేట్టరయ్యర్ తమ పెదవులను కొరుక్కొన్నారు. తమ అన్నగారు తమ హెచ్చరికలను పట్టించుకోక యువరాణికి అధికంగా చనువివ్వడం ఈ చిన్న అమ్మాయిలకు కూడ తెలిసిపోయి పరిహాసాస్పదమైంది కద? ఇలా తమ మనసులో కలిగిన అవమాన భావాన్ని పైకి చూపించుకోక, "మీరేం తీసిపోలేదు కద? ఒక సగం పిచ్చివాడిని విడుదల చేశారు!" అన్నారు.

"అయ్యా! సగం పిచ్చి అని ఆ పుష్ప సేవ చేసే సేందన్ అముదన్నే కద సూచిస్తున్నారు? మేమా రోజు అతన్ని విడుదల చేయడం వల్ల ఈ చోళనాడుకు ఎంతో మేలు కలిగిందని తెలుసుకొంటే ఆశ్చర్యపోతారు!" అన్నది వాణతి.

"అమ్మాయీ! ఇక నాకేదీ ఆశ్చర్యం కలిగించబోదు. ఈ చోళరాజ్యం ఎవరెవరికి ఋణపడివుందోనని ఎంచి, ఆశ్చర్యపడి, పడి అలిసిపోయాను. నీవు కూడ చోళనాడుకు ఒక పెద్ద మేలు చేసేందుకే వచ్చావు కద?"

"అవునయ్యా! ముఖ్యమైన కార్యం లేకపోతే తమ అన్నగారు పంపుతారా? అందులోను ఏమీ తెలియని ఒక అబలను పంపుతారా?"

"నా అన్నగారి బుద్ధిచాతుర్యం రోజురోజుకు అధికమవుతూంది. అది నిన్ను పంపించినందునే

తెలుస్తూంది. నీవు తీసుకొని వచ్చిన వార్తను త్వరగా చెప్పేయి!"

"పాండ్యనాడు కుట్రదారులను నిర్లక్ష్యం చేసింది పొరబాటని మీకు చెప్పమన్నారు. వీరపాండ్యుని ఆపత్కాల సహాయకులు నిజంగానే ఒక భయంకరమైన కుట్రను పన్నుతున్నారు. చోళకులం మీద పగ తీర్చుకోవడానికి ఈ రోజును గడువుగా ఎంచుకొన్నారు. చక్రవర్తిని భద్రంగా కాపాడమని హెచ్చరించారు.."

~

ఇది విని చిన్న పళువేట్టరయ్యర్ నవ్వారు. "ఈ విశేషమైన వార్తనేనా చెప్పి పంపారు? ఒక వేళ మీ పెదనాన్న దండెత్తి వస్తున్న విషయం తెలిసి అందుగురించి వార్త పంపారేమోననుకొన్నాను. ఆయన బయటే ఉండి కొడుంబాళూర్ సైన్యాన్ని చూసుకొంటే, నేను కోట లోపల చక్రవర్తిని చూసుకొంటాను. దాని గురించి ఆయన, నీవు, యువరాకుమారి కూడ దిగులుపడనవసరం లేదు!" అన్నారు.

"అయ్యా! మీరీ వార్తను ఇలా నిర్లక్ష్యం చేస్తారని తెలిసే ఆయన ఇంకొక సంగతి కూడ చెప్పి పంపారు. పళువూర్ యువరాణి అంతఃపురానికి ఎవరో ఒక మాంత్రికుడు తరచూ వస్తూ పోతుండడాన్ని గమనించి మీరు హెచ్చరించారట. దాన్ని ఆయన చెవిన వేసుకోక, మీమీద కోపగించుకొన్నారట. 'తమ్ముడూ! పెద్ద పొరబాటు చేశాను. ఆ రవిదాసు అనబడే మాంత్రికుడే పాండ్యదేశపు ప్రధాన కుట్రదారుడు. వీరపాండ్యుని ఆపత్కాల సహాయకుల నాయకుడు. చోళకులాన్ని సమూలంగా తుడిచిపెట్టేసేందుకు కంకణం కట్టుకొన్నవాడు. వాడి మనుషుల్లో ఒకడు ఈ రోజు రాత్రి చక్రవర్తిమీద పగతీర్చుకోవడానికి ప్రయత్నిస్తాడు. నిర్లక్ష్యం చేయకు. సర్వ జాగరూతతో ఉండు' - ఇదే పెద్ద పళువేట్టరయ్యర్ మీకు పంపిన వార్త! నా కర్తవ్యాన్ని నేను నెరవేర్చేశాను..."

కాలాంతక గండర్ నిజంగానే కాస్త ఆశ్చర్యపోయారు. ఇలాంటి వార్తను పెద్దాయన తప్ప ఇంకెవరూ పంప సాధ్యం కాదు.

"అమ్మాయీ! ఇది నిజమైతే ఆయన వెంటనే ఇక్కడికెందుకు రాలేదు? నిన్నెందుకు పంపించారు?"

"నన్నాయన పంపించలేదు. ఆయన యువరాకుమారికి చెప్పారు. యువరాకుమారి నన్ను పంపించారు. ఆదిత్య కరికాలన్‌గారికి కూడ ఈ రోజే ఆపద రాబోతూంది. కాబట్టి ఆయనను కాపాడేందుకు ఆయన తిరిగి వెళ్ళారు!"

"ఎక్కడినుంచి? ఆయన మిమ్మల్నెక్కడ చూశారు?"

"కుడందైలో జ్యోతిష్కుల ఇంట చూశారు. మీకింకా సందేహం తీరలేదంటే ఇది కూడ వినండి. మీ అన్నగారు కొళ్ళిడం నదిని దాటుతున్నప్పుడు సుడిగాలికి పడవ మునిగిపోయింది. తప్పించుకొని, బతికి బయటపడి పళ్ళిప్పడైలో పడుకొనివున్నప్పుడు కుట్రదారులు మాట్లాడుకొన్న కొన్ని విషయాలను రహస్యంగా విని తెలుసుకొన్నారు. అయ్యా! ఇంకా ఇక్కడే నిలబడి మాట్లాడుకోవాలా? లేక అంతఃపురానికి

వెళదామా?"

"అమ్మాయీ! నీవు చెప్పినదంతా నిజమే కానీ, ఎలాంటి కుట్రదారులైనా కూడ కోట లోపలికి, నా కాపలా దాటి రాలేరు. నీవమ్మాయివి కాబట్టి రానిచ్చాను..."

"బయట నుంచి రావాలని ఏముంది? కుట్రదారులు కోట లోపలే ఉంటే...?"

"ఏనాడూ సాధ్యం కాని విషయం..."

"సరే. అది మీ బాధ్యత. నా కర్తవ్యం..."

"నెరవేర్చేశావు. ఇక నీవు తిరిగి వెళ్ళవచ్చు."

"లేదయ్యా! నా కర్తవ్యంలో సగభాగం మాత్రమే నెరవేర్చాను. చక్రవర్తిని కలిసి యువరాకుమారి చెప్పి పంపిన వార్తను చెప్పేస్తే నా పూర్తి కర్తవ్యాన్ని నెరవేర్చినదాన్నవుతాను..."

"ఆ వార్తను కూడ నాకే చెప్పేయవచ్చు."

"సాధ్యం కాదు. చక్రవర్తికి మాత్రమే ముఖాముఖి తెలియజేయాలని యువరాకుమారి ఆజ్ఞ. ఇదిగో యువరాకుమారి రాజముద్ర పొదిగిన ఉంగరం..."

"ఆ! ముద్ర పొదిగిన ఉంగరం ఎవరెవరి చేతికో దొరుకుతూంది. అది యువరాకుమారి ఇచ్చిందేనని ఏం నమ్మకం? నీ పెదనాన్న ఈ కోటను చుట్టుముట్టినప్పుడు నిన్ను నమ్మడమెలా...?"

"ఒక అబల వల్ల ఏం అపాయం కలుగుతుందని భయపడుతున్నారు?"

"అమ్మాయీ! పళువూర్ వంశస్థులు భయమంటే ఎరుగనివారు...."

"అలాగైతే నన్ను అంతఃపురంవరకు వెళ్ళనివ్వండి. మీరూ నాతోబాటు రండి..."

"ఈ రోజంతా చక్రవర్తి మనఃక్లేశం చాల అధికంగా ఉంది..."

"ఆ కలతను తీర్చే వార్తతో నేనిప్పుడు వచ్చాను. అయ్యా! విషయమిదీ అని తెలిస్తే నన్ను అడ్డగించి ఆలస్యం చేసినందుకు మీరే పశ్చాత్తాపపడుతారు."

చిన్న పళువేట్టరయ్యర్ కాస్త ఆశ్చర్యం చూపించి, "ఒకవేళ చిన్న యువరాజు పొన్నియిన్ సెల్వన్ గురించి వార్త తీసుకొని వచ్చావా?"

"అవును, దళపతీ!"

"ఆహా! చిన్న యువరాజు క్షేమంగా ఉన్నారా? ఇప్పుడు ఎక్కడ వస్తున్నారు? ఆయనకు...కుట్రదారులవల్ల, ఆయనకు కూడ..."

"అవును; పాండ్యదేశపు కుట్రదారుల వల్ల ఆయనకు కూడ ఆపద వచ్చింది. కానీ దైవకృప వల్ల విపత్తేమీ కలగలేదు. క్షేమంగానే ఉన్నారు. ఇది మీకు సంతోషం కలిగిస్తూంది కద?"

"భలే ప్రశ్న! చిన్న యువరాజు క్షేమంగా ఉండడం గురించి సంతోషపడక, దుఃఖపడుతారా? రామ్మా! రా! నీతో వృధాగా పొద్దు గడపడం నాకిష్టం లేదు. అంతఃపురానికి వచ్చి చక్రవర్తితో ముఖాముఖి

చెప్పవలసిందేదో చెప్పేయి...”

~

ఇలా చెప్పి చిన్న పళువేట్టరయ్యర్ తమ ఏనుగును ముందుకు నడిపారు. యువరాజు గురించి తెలుసుకోవాలన్న ఆదుర్దా, ఆసక్తి ఆయనకు అధికమైనాయి. ఆయన అల్లుడైన మధురాంతకుడు సింహాసనమెక్కేందుకు అరుళ్మొళి వర్మ ఒక పోటీ అని ఏనాడూ ఆయన భావించలేదు. చక్రవర్తికి ఆ ఉద్దేశమే లేదని ఆయన ఎరుగును. అరుళ్మొళి వర్మ తండ్రి మాటను జవదాటేవాడు కాదు కూడాను. కుందపై తల దూర్చి ఏదైనా సమస్య/అడ్డంకి కలిగించకూడదన్నదే ఆయన దిగులు. ఆమె ఇప్పుడు ఏమైనా పన్నాగం పన్ననారంభించిందా, ఏమి? అరుళ్మొళిని తన వశంలో ఉంచుకొని తండ్రికి ఏదైనా తారుమారుగా సందేశం పంపించిందా ఇప్పుడు? యువరాజు గురించి ఈ కొడుంబాళూర్ అమ్మాయి నిజంగానే వార్త తీసుకొని వచ్చివుంటే, ఆయనకు చెబితే, దాన్ని ఆయన తమకు చెప్పకపోరు. అరుళ్మొళి వర్మ ఉద్దేశం ఇదీ అని తెలుసుకొంటే, దానికి తగినట్లు తాము చేయవలసిందేమని తీర్మానించుకోవచ్చు కద? ఆ సమయాన బూది విక్రమ కేసరి కోటమీదికి దండెత్తి వచ్చివున్న విషయాన్ని కూడ చక్రవర్తికి తెలియజేసేయవచ్చు కద...?

రెండు ఏనుగులూ అంతఃపురం వాకిట వచ్చి ఆగాయి.

చిన్న పళువేట్టరయ్యర్ సునాయాసంగా ఏనుగు మీది నుంచి కిందకు దూకారు.

రెండవ ఏనుగు కొండ కదిలేటట్లు కదిలి మోకాళ్లమీద పడుకొంది. ఇద్దరమ్మాయిలు, ఏనుగు మావటి కిందకు దిగారు.

అంతఃపురకాపలాదారును పిలిచి చిన్న పళువేట్టరయ్యర్ ఏదో చెప్పాడు. వాడు అంతఃపుర ముఖద్వారాన్ని తెరిచాడు.

ఆయన మనసులో అన్నగారు చెప్పి పంపినట్లు వాణతి తెలియజేసిన వార్త తొలిచేస్తూంది. దాన్ని ఆయన తన ఆలోచనాస్రవంతినుంచి తొలగించలేకపోయారు. ముఖ్యంగా మాంత్రికుడు రవిదాసు గురించి తెలిసిన విషయం ఆయన మనసును చాల కల్లోలపరిచింది. వీరపాండ్యుని ఆపత్కాక సహాయకుల గురించి ఆయనకింతకు మునుపే తెలుసు. కానీ వారికి తంజావూరు కోట లోపలే తావు దొరికిందన్న విషయం ఆయనకింతవరకు తెలియదు. పళువూర్ యువరాణి మాంత్రికుడిని తరచూ పిలిపించుకోవడం ఆయనను ఇంకా తన వశం చేసుకోవడానికే అని ఆయన భావించారు. అన్నదమ్ముల మధ్య విరోధాన్ని పెంచడం కూడ ఆమె ఉద్దేశమని ఆయన నమ్ముతూ వచ్చారు. ఇప్పుడు ఈ అమ్మాయి చెప్పిన విషయం భయం కలిగించేలాగుంది. కానీ ఏ మాంత్రికుడు గాని, కుట్రదారుడు గాని ఏం చేయగలడు? తమ అనుమతి లేక ఈగ కూడ చక్రవర్తి అంతఃపురం లోపల చొరబడలేదు. చక్రవర్తి బయటకు రావడం లేదు కూడాను. అయినా కూడ చక్రవర్తి అంతఃపురం చుట్టూ కాపలా ఇంకా గట్టిపరచడం మంచిది. సుడిగాలి పేర, చక్రవర్తిని

చూసే నెపంతోను, గత రెండు రోజులుగా చాలమంది కోట లోపలికి వచ్చివున్నారు. వారందరూ బయటకు వెళ్ళిపోయారో లేదో తెలియదు. ఈ రోజు ఉదయం ఉన్నట్లుండి కోట తలుపులను మూసింది కూడ మంచిదే. దురుద్దేశం కలిగినవారు, - ఎవరైనా ఈ కోట లోపలికి వచ్చివున్నారా అని క్షుణ్ణంగా పరిశోధించి చూడాలి.

~

ఇలా, ఏనుగుమీద అంతఃపురంవైపు వస్తున్నప్పుడే ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చారు దళపతి. అంతఃపురం వాకిట ఒకవైపు ఎప్పుడూ సిద్ధంగా ఉండే తమ మనుషులను సైగచేసి పిలిచారు. వారికి, కోటలోపల బాగా పరిశోధించి సందేహాస్పదంగా ఎవరు కనిపించినా పట్టుకు రమ్మని చెప్పి పంపించారు.

తర్వాత, వేళక్కార దండును ఆ రోజు రాత్రంగా మెలకువగా ఉండి అంతఃపురాన్ని, చుట్టుపక్కల ప్రదేశాలను బాగా కాపలా కాయమని ఆజ్ఞాపించారు.

ఈ పరిస్థితిలో, ఏనుగుమీద వచ్చిన అమ్మాయిలెక్కడని తిరిగి చూశారు. వారప్పుడు అంతఃపురపు ముందు భాగానున్న వెన్నెల డాబాను దాటి మొదటి వాకిలి గడపను సమీపిస్తున్నారు. కానీ... వీడెవడు? వారి వెంబడి వెళుతున్న ఆ మూడో ఆకారం? తలపాగా చూస్తే ఏనుగు మావటి లాగుంది! ఆఁ! ఏనుగు మావటెందుకు వారి వెంబడి వెళుతున్నాడు? అంతఃపురంలోపల వాడికేం పని? చక్రవర్తి దగ్గర వాడికేం పని?

అతి భయంకరమైన ఒక ఆలోచన ఆయన మనసులో మెరుపులాగ మెరిసి చెప్పలేని వేదనను కలిగించింది! కోపాగ్నిని రగిలించింది. ఒకవేళ ఈ మావటే కుట్రదారుడా? ఈ అమ్మాయిలను మోసం చేసి ఏనుగుమావటి వేషంలో వచ్చాడా? మనం కూడ మోసపోయామా? తమ కంటి ముందే చక్రవర్తిని చంపవస్తున్న వీరపాండ్యుని ఆపత్కాల సహాయకుడు అంతఃపురంలోకి వెళుతున్నాడా? లేక ఇది బూది విక్రమకేసరి కుట్రలో భాగమా? ఏదేమైనా ఈ క్షణమే తేలిపోతుంది.

నాలుగంగల్లో వెన్నెల డాబాను దాటి ఏనుగు మావటి దగ్గరకు చేరారు కోట దళపతి. “నిలు ఇక్కడ!” అని ఒక గర్జన చేశారు. “నీవెందుకు లోపలికి వెళుతున్నావు? ఏనుగు మావటికి అంతఃపురంలో ఏం పని?” అని అంటూనే ఆ మావటి ఒక చేతిని తన వజ్రాయుధంవంటి చేత్తో పట్టుకొన్నారు.

ఆయన కోపగర్జనను విని, ముందు వెళుతున్న అమ్మాయిలిద్దరూ తిరిగి చూశారు. వారి ముఖాల్లో కాస్త భయం, ఆశ్చర్యం మొదలైన భావాలన్నీ ప్రతిబింబించాయి. అదే సమయాన వారి ముఖాలు చిరునవ్వుతో విప్పారాయి. వాణతి "అయ్యా! ఆయన...ఆయన...” అని ఏదో చెప్పబోయి కాస్త జంకింది.

క్రోధశిఖరాన్ని చేరుకొన్న చిన్న పళువేట్టరయ్యర్ ఆమెను తిరిగి చూడను కూడ లేదు; ఆమె మాటలను పట్టించుకోలేదు కూడాను.

ఏనుగు మావటి తడబాటు ఆయన సందేహాన్ని మరింత బలపరిచింది.

మునుపటిసారి తన కళ్ళలో కారం కొట్టి తప్పించుకొని పారిపోయిన వాణర్ కులవీరుడా అన్న సందేహం ఒక్కక్షణం తోచింది. మళ్ళీ తమను ఏమార్చేసి లోపలకు వెళదామని ఇంతటి తెంపరితనంతో వచ్చాడా...?

పట్టిన పట్టును ఇంకా బిగించి చిన్నపళువేట్టరయ్యర్, "ఒరే! నిజం చెప్పు! నీవెవరివి? ఏనుగు మావటివేనా? లేక కుట్రదారుడివా? మునుపొకసారి నానుంచి తప్పించుకొన్న గూఢచారివా? ఈసారి తప్పించుకోలేవు!" అని చెబుతూనే, పట్టిన పట్టును సడలించకుండ 'ఏనుగు మావటి' ముఖాన్ని తమవైపు తిప్పుకొన్నారు.

అంతఃపురం వాకిలి ముందు వెలుగుతున్న దీపాల వెలుతురు లేతగా/సన్నగా ఆ 'ఏనుగు మావటి' గంభీరమైన ముఖం మీద పడింది.

"దళపతీ! నేను ఏనుగు మావటిని కూడాను. తమ దగ్గరినుంచి ఏనాడూ తప్పుంచుకొని పోలేదు. పైగా, తమకు నన్ను ఒప్పజెప్పేందుకే వచ్చాను!" అన్నాడు ఏనుగు మావటి.

కాలాంతక గండర్ ఆ ముఖాన్ని చూశారు. ఆ స్వరాన్ని విన్నారు. పై ఏడు లోకాలు ఒకేసారి ఆయన తలమీద పడ్డట్లు అదిరిపోయారు. ఆయనకు తెలియకనే చిత్తరువులాగ నిలబడిపోయారు. చేతి పట్టును విడవాలని కూడ తోచలేదు. చేతిపట్టు తనంతట తానే సడలి యువరాజు అరుళ్మొళి వర్మను విడుదల చేసింది.

~~~
~~~

# అధ్యాయము - 28

## ఘోష లేచింది!

**యువరాజు** అరుళ్మొళి వర్మ లేత బంగారు మోములో ఏం మాయ, మంత్రవశీకరణ శక్తివుందో తెలియదు. ఇంతకీ ఆ సమయాన యువరాజు ముఖం చిన్నబుచ్చుకోనూ లేదు, కోపగించుకోనూ లేదు. వెన్న దొంగలించి పట్టుబడ్డ చిన్నికృష్ణునిలాగ చేసిన తప్పునుఒప్పుకోనే భావం ముఖంలో కనిపించేటట్లు నిలబడ్డారు. చిన్న పళువేట్టరయ్యర్ని తప్పుబట్టి శిక్షించే ఉద్దేశంగాని, ఆయనను ఎదిరించి పోరాడే ఉద్దేశంగాని అణుమాత్రం కూడ యువరాజు ముఖంలో అగుపించలేదు.

అయినా కూడ భయం తెలియని మనసు, ఎనలేని మనోధైర్యం కలిగిన వారయిన కాలాంతక గండరి కాళ్ళు చేతులు ఆ సమయాన వెలవెలబోయాయి. ముఖాన చెమట పట్టింది. ఏం చేయాలో తోచక రెండు చేతులూ జోడించి నమస్కరిస్తూ, "పొన్నియిన్ సెల్వా! ఈలం (లంక) జయించిన వీరా! చోళదేశపు ప్రియపుత్రా! ఇదేం పరిస్థితి? ఇదేం కార్యం? ఇలా శిక్షించేందుకు నేనేం తప్పు చేశాను? కాసేపటి క్రితం నేను చేసిన పొరబాటును క్షమించి కరుణించాలి. 'క్షమించాను' అన్న కరుణావాక్కు ఇవ్వాలి. కళ్ళుండీ చూడలేని గుడ్డివాడినయ్యాను..." అని నాలుక తడబడగా, వణుకుతున్న గొంతుతో అన్నారు.

ఇలా ఇదే ధోరణిలో మాట్లాడబోతున్న ఆయనను యువరాజు ఆపి, "దళపతీ! ఇదేమి? మీరేమిటి? నేరం చేయడమేమిటి? ఏమీ తెలియని ఈ చిన్నవాడిని క్షమాపణ కోరుతున్నారెందుకు?" అన్నారు.

"తమను పట్టి ఆపిన ఈ చేతిని తెగగొట్టినా చాలదు. 'ఒరే' అని పిలిచిన ఈ నాలుకను కోసి పారేసినా చాలదు..."

"తమ మాటలు నా చెవికి అయిష్టంగా తోస్తున్నాయి. ఇక ఆపండి. మీ బాధ్యతను నెరవేర్చేందుకు మీ కర్తవ్యాన్ని మీరు చేశారు. అందులో నేరమేమి? తప్పేమీ లేదు. నేనీ వేషంలో...ఏనుగు మావటిగా వస్తానని..."

"నేను ఎదురు చూడనే లేదు. మీరిలా చేయవచ్చా? ఎందుకని? చోళదేశపు మహావీరుని నేను ఇలాగా స్వాగతించాలి? ఆచార ఉపచారాలతో ముఖద్వారం వద్ద నిలబడి విజయధ్వానాలు అష్టదిక్కులూ అదిరిపోయేలాగ ఘోషించగా స్వాగతించనా...?"

"మీరలా చేస్తారని తెలిసే నేనిలా వచ్చాను. దానికంతా ఇది తగిన సమయం కాదు. మీకు తెలియదా? కుట్రదారుల దుష్టప్రయత్నాలను గురించి కాసేపటి క్రితం కొడుంబాళూర్ రాకుమారి చెప్పింది కదా? అది నిజమే కావచ్చునని నాకూ తోచింది."

"యువరాజా! నన్ను కూడ ఆ పాండ్యదేశపు కుట్రదారుల కూటమిలో చేర్చేశారా...??"

"భగవాన్! నా తండ్రి చక్రవర్తిని కాపాడేందుకు మీరు చేసిన ఏర్పాట్లు చూసి మనసులోనే చాల సంతసించాను. మొదట నా తండ్రిని దర్శించి, తర్వాత..."

"అయ్యా! చక్రవర్తిని మీరు చూడకూడదని నేనడ్డగిస్తాననుకొన్నారా? నేనటువంటి పాపినని మీకెవరైనా చెప్పివుంటే..."

"ఏనాడూ నేనది నమ్మేవాడిని కాను, దళపతీ!"

"మరెందుకీ వేషం?"

"ఇంకేవిధంగానైనా నేను కోట లోపలికి రాగలిగేవాడినా, మీరే ఆలోచించి చూడండి! కోటను అన్నివైపులా దక్షిణసైన్యం చుట్టుముట్టింది. పెద్ద వేళార్ కూడ వచ్చివున్నారు. ఎందుకు వచ్చారని మీకు తెలిసే ఉంటుంది..."

"కోట తలుపులను నేను మూయించింది న్యాయమే కద? అందులో నేరమేమైనా ఉందా?"

"చాల న్యాయమైన పని. పెద్ద వేళార్ బుద్ధి చెడిపోయివుంది, ప్రస్తుతం. ఆయన వల్లే కోట లోపలికి రావడానికి ఆటంకం కలుగుతుందని ఈ వేషంలో వచ్చాను. ఆయన కుమార్తెను కూడ పిలుచుకొని వచ్చాను. మంచివేళగా ఆయన నన్ను గుర్తు పట్టలేదు. మీ చురుకైన కళ్ళు నన్ను గుర్తుపట్టేశాయి..."

"నాకళ్ళు మూసుకుపోయాయి. అందుకే చూడగానే తెలుసుకోలేకపోయాను. తమను ఏనుగు మావటి అనియెంచి ఆడిన మాటలను తమరు దయవుంచి మన్నించాలి."

"అలా చెప్పవద్దు. మీరు వేరని, నా తండ్రి వేరని నేను భావించను. నన్ను చెరపట్టి తక్షణమే తీసుకొని రమ్మని మీ మనుషులను పంపారు..."

"దైవమా? ఇదేం వార్త? నేనా మిమ్మల్ని చెరపట్ట మనుషులను పంపాను? తమను వెంటనే చూడాలని తమ తండ్రి...చక్రవర్తి...పంపారు!"

"అది నాకు తెలియదా, దళపతీ! నేను లంకలో ఉన్నప్పుడు వారు వచ్చారు. 'చక్రవర్తి ఆజ్ఞకాదు; పళువేట్టరయ్యర్ల ఆజ్ఞ' అని నాదగ్గరున్న వారు చెప్పారు..."

"మా విరోధులు అలా చెప్పివుంటారు.."

"నేను వారికి 'నా తండ్రి ఆజ్ఞ ఎలాగో, అలాగే పళువేట్టరయ్యర్ల ఆజ్ఞ కూడ శిరసావహించదగినది' అని చెప్పాను. కడలిని, సుడిగాలిని, వానను, వెల్లువను దాటి వచ్చాను. అంతఃపురపు ముఖద్వారం దాటి లోపలకు వెళ్ళగానే మీ కోరికను తెలుసుకొందామనుకొన్నాను. మీ అనుమతి లేనిదే నా తండ్రిని కూడ చూడగోరను..."

"యువరాజా! ఇంకా నన్ను శోధిస్తున్నారా? తమ తండ్రిని కలిసేందుకు నేననుమతి ఇవ్వడమేమిటి? మీతో రమ్మంటే వస్తాను. ఇక్కడే ఆగమంటే ఆగిపోతాను! యువరాజు కోరికే నేను

శిరసావహించే ఆజ్ఞ!" అని భక్తితో చెప్పారు చిన్న పళువేట్టరయ్యర్.

"దళపతీ! మీరిక్కడే ఆగిపోవలసిన పరిస్థితి వస్తుంది కాబోలు. చాలసేపు మనమిక్కడే నిలబడి మాట్లాడుతుండిపోయాము. అదిగో అక్కడ చూడండి!" అన్నారు యువరాజు.

~

చిన్న పళువేట్టరయ్యర్ తిరిగి చూశారు. కాసేపటి క్రితం కాస్త దూరాన నిలబడ్డ వారి మనుషులందరూ ఇప్పుడు సమీపానికొచ్చేశారని గమనించారు. వారు మాత్రం కాదు; అంతఃపురపు కాపలా భటులు కూడ వచ్చేశారు. ఇంకాస్త దూరాన నిలబడ్డ వేళక్కార దండునుంచి కొందరు విడివడి ఇటుపైపు రాసాగారు.

దగ్గరకొచ్చిన వారందరూ కళ్ళార్పకుండ అమితాసక్తితో పొన్నియిన్ సెల్వన్‌ని చూస్తున్నారు. చిన్న పళువేట్టరయ్యర్ తిరిగి చూసినప్పుడు, యువరాజు దివ్యవదనం మీద దీపం వెలుతురు బాగా పడుతుండగా చాల ప్రకాశవంతంగా కనిపించింది.

వీరుల్లో ఒకడు, "యువరాజుకు జయహో!" అన్నాడు. "పొన్నియిన్ సెల్వన్‌కి జయహో!" అన్నాడింకొక వీరుడు.

"మహీంద్రుని తరమగొట్టి లంకను జయించిన వీరాధివీరునికి నూరేళ్ళు!" అన్నాడు మరొక వీరుడు.

ఈ ఘోష వినగానే వేళక్కార దండు వీరులందరూ వేగంగా అక్కడికి వచ్చి చేరసాగారు.

పలు కంఠాలనుంచి "పొన్నియిన్ సెల్వన్‌కి నూరేళ్ళు!" అన్న ఘోషలు లేచాయి.

అంతఃపురం వాకిలి కావడం వల్లను, చిన్న పళువేట్టరయ్యర్ అక్కడే ఉండడం వల్లను ఆ ఘోష చాల మెల్లగానే లేచింది. పిల్లగాలి అప్పుడే చిగురించిన రావి చెట్టు ఆకుల మధ్య వీచినప్పుడు వినిపించే 'గలగల'మనే మెత్తని శబ్దంలాగే ధ్వనించింది. కానీ పోనుపోను ఆ మెత్తని శబ్దం పెరిగి పెద్దదై సముద్రఘోషలాగ ఎలా ఉచ్ఛస్థాయిని చేరుతూందో రాబోయే అధ్యాయాలలో చూస్తాము.

"దళపతీ! మనమిక్కడే నిలబడి మాట్లాడుకొన్నది పొరబాటైపోయింది. అంతఃపురం లోపల ప్రవేశించేవరకు నన్ను నేను బహిరంగపరుచుకోకూడదన్న నా కోరికకు కారణం ఇప్పుడు తెలుస్తోంది కద?" అన్నారు యువరాజు.

"తెలుస్తోంది, యువరాజా! నేను వీరిని సమాధానపరిచి వస్తాను. మీరు దయచేసి వేగంగా లోపలకు వెళ్ళండి!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

~~~
~~~

# అధ్యాయము - 29

## సందేహ విపరీతం

**పొన్నియిన్** సెల్వన్ అంతఃపురం లోపలికి వెళ్ళిన తర్వాత కాలాంతక గండరు వేళక్కార దండు వీరులను సమీపించి,

"ఇవేం కేకలు? అంతఃపురంలో చక్రవర్తి జబ్బుతో మంచంపట్టి ఉండడం మీకు తెలియదా? కోట చుట్టూ పగవారు చుట్టుముట్టివుండడం తెలియదా?" అని అడిగారు.

వేళక్కార దండు నాయకుడు, "అయ్యా! కోటను చుట్టుముట్టినవారు పగవారేనా? కొడుంబాళూర్ పెద్ద వేళార్ మనకెలా పగవారైనారు?" అని అడిగాడు (అమాయకంగా).

చిన్న పళువేట్టరయ్యర్ పొంగి వస్తున్న కోపాన్ని అదిమి పెట్టి, "అది ఆయన్నే అడగాలి. పగవారు కాకపోతే, సైన్యంతో ఎందుకు కోటను చుట్టుముట్టారు?" అని బదులు ప్రశ్న వేశారు.

"చిన్న యువరాజును సింహాసనమెక్కించి పట్టం కట్టేందుకని విన్నాము" అన్నాడు వేళక్కార దండు నాయకుడు.

"అది మీకందరికీ సమ్మతమేనా?" అని చిన్న పళువేట్టరయ్యర్ అడిగారు.

వేళక్కార దండు నాయకుడు తన వీరులవైపు చూసి, "మీరే చెప్పండి!" అన్నాడు.

వీరులు వెంటనే "సమ్మతం! సమ్మతం! పొన్నియిన్ సెల్వన్ నూరేళ్ళు జీవించుగాక! ఈలం (లంక) యువరాజుకు జయహో!" అని ఘోషించారు.

ఈసారి ఆ ఘోష మునుపటికన్న బలంగా ఉంది.

చిన్నపళువేట్టరయ్యర్ ముఖం కందిపోయింది. మీసం కంపించింది. కానీ పళ్ళు గిట్ట కరుచుకొని, "పట్టం కట్టడం పెద్ద వేళార్ చేతిలో ఉందా? చక్రవర్తి ఉద్దేశానికి విలువేమీ లేదా?" అని అడిగారు.

వీరుల్లో ఒకడు, "దళపతీ! చక్రవర్తి క్షేమంగానే ఉన్నారా? ఖచ్చితమేనా?" అని అడిగాడు.

చిన్న పళువేట్టరయ్యర్, "ఇదేం ప్రశ్న?" అని కోపంతో అడిగారు.

"చక్రవతర్తి గురించి ఊళ్ళో ఏవేవో వదంతులు వినవస్తున్నాయి. మేము కూడ ఈరోజు ఆయనను చూడలేకపోయాము. కాబట్టి ఆయన క్షేమం గురించి అందరూ దిగులు పడుతున్నాము!" అన్నాడు వేళక్కార దండు నాయకుడు.

"చక్రవర్తిని మీరు ఇవాళ చూడలేకపోయినందుకు కారణమేమిటో అప్పుడే చెప్పాను కద? ఆయన మనసు ఈరోజు చాల కలతబారింది. సభామంటపానికి రావడానికి కూడ నిరాకరించారు..."

"చక్రవర్తి మనోవేదనకు కారణమేమి? ఎందుకు మాకు దర్శనమివ్వడానికి నిరాకరించాలి?

మేమదైనా తెలుసుకోవచ్చు కద?"

"మంచిది; చెబుతాను వినండి. లంకకు వెళ్ళిన యువరాజు క్షేమ సమాచారాలేమీ తెలియకపోవడమే ఆయన దిగులు అధికం కావడానికి కారణం. ఇప్పుడు యువరాజే వచ్చేసినందువల్ల..."

"యువరాజును మేము చూడాలి. బాగా వెలుతురులో చూడాలి!" అని ఆ దండు వీరుల్లో ఒకడన్నాడు.

"అవును; చూడాలి! లంకనుగొన్న యువరాజుకు జయహో!" అని అందరూ చేరి ఘోషించారు.

"యువరాజు మొదట చక్రవర్తిని దర్శించాలి కద? తర్వాత ఇష్టమైతే మిమ్మల్ని వచ్చి చూస్తారు!"

"తప్పకుండానా? ఒక వేళ పాతాళ చెరసాలకు పంపబడతారా?"

~

ఇంకొక వేళ, ఇంకొక సందర్భాన వేళక్కార దండు వీరులు ఇంత దుడుకుగా మాట్లాడితే చిన్న పళువేట్టరయ్యర్ వీరులు వేళక్కార దండు వీరులతో పోట్లాటకు దిగేవారే; పెద్ద రగడైవుండేది. కానీ యువరాజు దివ్యవదనాన్ని కాసేపటి క్రితమే చూసినందువల్లో ఏమో, చిన్న పళువేట్టరయ్యర్‌గారి వీరులు మౌనంగా నిలబడిపోయారు.

చిన్న పళువేట్టరయ్యర్ చేయి తన నడుంలో ఉన్న కత్తిమీదికి వెళ్ళింది. అలా మాట్లాడుతున్న వీరుని ఒక్క వేటుతో చంపేయాలనుకొన్నారు. వెంటనే ఆ ఉద్దేశాన్ని మార్చుకొని పెద్దగా నవ్వారు.

"వీడడిగిన ప్రశ్న మీ అందరి చెవిన పడింది కద? యువరాజు పాతాళ చెరసాలకు పంపబడుతారా అని అడుగుతున్నాడు. యువరాజును సింహాసనమెక్కించడం గాని, చెరసాలలో వేయడంగాని నా చేతుల్లో లేదు. చక్రవర్తి కోరిక ప్రకారం జరుగుతుంది. యువరాజును పాతాళ చెరసాలకు తీసుకొని వెళ్ళేటట్లయినా కూడ, ఈ దారినే వెళ్ళాలి. అప్పుడు మీరాయనను చూడవచ్చు!" అని కాలాంతక గండర్ కళ్ళనుంచి కోపాగ్ని జ్వాలలు దూకిస్తూ చెప్పేసి, అంతఃపురంవైపు తిరిగారు. వీరులు మళ్ళీ ఘోషిస్తుండడాన్ని కూడ పట్టించుకోక అంతఃపురం ముందు వాకిలివైపు వేగంగా నడిచారు.

అక్కడ పూంగుళలి ఒంటరిగా నిలబడివుండడాన్ని చూశారు.

"అమ్మాయీ! నీవెందుకిక్కడ నిలబడిపోయావు? నిన్ను లోపలికి రావద్దని ఆపేశారా?" అని అడిగారు.

"నన్నెవరూ అడ్డగించలేదు; నేనే ఇక్కడ ఆగిపోయానయ్యా!" అన్నది పూంగుళలి.

"ఏల?"

"చాల రోజుల తర్వాత కలిసిన తండ్రీకొడుకుల మధ్య నేనెందుకు?"

"పోనీలే; నీవైన చక్రవర్తి సజీవంగా ఉన్నారని నమ్ముతున్నావు కద, అంత వరకు సంతోషం!"

"నమ్మడం మాత్రమే కాదు; చక్రవర్తి క్షేమంగా ఉండడాన్ని కళ్ళారా చూసిన తర్వాతే వెనుదిరిగాను."

"అదిగో నిలబడ్డారు చూడు, ఆ వేళక్కార దండు వీరులకు నీవు చూసింది చెప్పు! వాళ్ళు సంతోషపడుతారు!" అన్నారు.

"వారి సంతోషానికి ఈ నిమిషం వరకు ఆధారం లేదు. మరు నిమిషం అది నిజం కాబోదు అని ఎవరు చెప్పగలరు?"

"అమ్మాయీ! నీవు కూడ నన్ను కలవరపరుస్తున్నావు కద? మీకందరికీ పిచ్చి పట్టిందా?"

"దళపతీ! నన్ను పలువురు 'పిచ్చిది' అంటారు. నేనే నన్ను పిచ్చిది అని చెప్పుకోవడం కద్దు. కానీ ఈ పిచ్చిదాని మాట విన్నందువల్లే ఈ రోజు యువరాజు ఏ అపాయం కలగకుండ కోట లోపలికి రాగలిగారు. చక్రవర్తి సజీవంగా ఉన్నప్పుడే ఆయనను కలవడం సాధ్యమైంది..."

"ఆహా! నీవు కూడ చక్రవర్తి ప్రాణానికి గడువు పెడుతున్నావా? మూర్ఖజనాలు, వెర్రిబాగుల జ్యోతిష్కుల ప్రేలాపనలను నీవు కూడ నమ్ముతున్నావా? లేక నీకేమైన తెలుసా?"

"ప్రజలు, జ్యోతిష్కులు మాత్రమేనా గడువు పెట్టారు? మీ అన్నగారు చెప్పి పంపిన సందేశాన్ని కాసేపటి క్రితం విన్నారు కద?"

"అది నిజమని ఏం నమ్మకం?" అన్నారు కాలాంతక గండర్.

"దళపతీ! కొడుంబాళూర్ రాకుమారి ఎందుకు అబద్ధం చెప్పాలి?"

"ఎవరు చూడవచ్చారు? తక్కినవారిలాగ సింహాసనమెక్కి పట్ట మహిషి కావాలనే ఆశ ఉండవచ్చు...."

"దళపతీ! నేనూ అలాగే అనుకొన్నాను. రాకుమారి ఈరోజు ఉదయం చేసిన శపథాన్ని విన్న తర్వాత నా అభిప్రాయాన్ని మార్చుకొన్నాను" అన్నది పూంగుళలి.

"అమ్మాయీ! ఒకవేళ నీకు కూడ అటువంటి ఆశ ఉందా, ఏమి?" అని అడిగేసి చిన్న పళువేట్టరయ్యర్ చిన్నగా నవ్వారు.

"దళపతీ! నిజంగా నేను పిచ్చిదాన్నే! మీతో మాట్లాడేందుకు నిలబడ్డాను కద?" అని చెప్పేసి పూంగుళలి తిరిగి వెళ్ళ ప్రయత్నించింది.

~

కాలాంతక గండర్‌లో వెంటనే ఒక మార్పు కనిపించింది.

"అమ్మాయీ! కోపగించుకోకు! నీవు చెప్పవలసింది చెప్పేసి వెళ్ళు!" అన్నారు.

పూంగుళలి మళ్ళీ తిరిగి, "అవును; చెప్పి తీరాలి. లేకపోతే తర్వాత నేనూ విచారిస్తాను; మీరు కూడ విచారపడవలసివస్తుంది. అయ్యో! చక్రవర్తికి ప్రాణాపాయం కలిగితే ఊరూ వాడా మీమీదే నింద

మోపుతారు. మీ వీరులు కూడ మిమ్మల్నే నిందిస్తారు!" అన్నారు.

చిన్న పళువేట్టరయ్యర్ ముఖం చిన్నబోయింది. "అలా జరిగితే ఇతరులు నింద వేసేవరకు వేచివుండను. నిందారోపణ నా చెవిన పడ్డ మరుక్షణం నా ప్రాణాలు నా దేహాన్ని విడుస్తాయ్! ఈ వేళక్కార దండు వీరులు దుర్గా పరమేశ్వరి ఆలయంలో సత్యప్రమాణం చేసినప్పుడు, అందరికన్న ముందు సత్యప్రమాణం చేసి దారి చూపించిన వాడిని నేను!" అన్నారు.

"అందువల్ల ఏం ప్రయోజనం? చోళరాజ్యం చక్రవర్తినీ, ఒక మహావీరుని కోల్పోతుంది! దానికన్న ముందు జాగ్రత్తలు తీసుకోవడం మంచిది కద?"

"అమ్మాయీ! నేను ముందు జాగ్రత్తలో లేనన అంటున్నావు? ఇదిగో, ఈ అంతఃపురం చుట్టూ ఇంతమంది వీరులు కళ్ళలో ఒత్తులేసుకొని కాపలా కాస్తున్నారు కద? అంతెందుకు? ముఖ్యమంత్రి అనిరుద్ధులు కూడ నాకు తెలియకుండ అంతఃపురం లోపలికి వెళ్ళలేరు, తెలుసా?"

"తెలుసు, దళపతీ! కానీ అంతఃపురం లోపలినుంచే అపాయం రావచ్చు కద?"

"ఏం ప్రేలాపన? అంతఃపురస్త్రీలు చక్రవర్తికి విషమిచ్చి చంపేస్తారనుకొంటున్నావా? లేక, ఇప్పుడు యువరాజుతో లోపలికి వెళ్ళింది కద, ఆ కొడుంబాళూర్ అమ్మాయినే సందేహిస్తున్నావా?" అన్నారు.

"భగవాన్! ఆ సాధువైన అమ్మాయిని సందేహించినవారికి మంచి గతి ఉండదు. ఆమెకు అంతటి  సామర్థ్యం లేదు కూడాను. అయ్యా! ఈ అంతఃపురంలోపలికి వచ్చేందుకు ఒక సొరంగ మార్గముంది కద?"

చిన్న పళువేట్టరయ్యర్ అదిరిపడి, "అమ్మాయీ! దాని గురించి నీకెలా తెలుసు? ఏం తెలుసు? ముగ్గురు నలుగురికి తప్ప ఆ సొరంగ మార్గం గురించి ఇంకెవ్వరికీ తెలియదు కద? తెలిసినవారు ప్రాణాలతో తిరిగి వెళ్ళలేరు కద?" అని గాభరాగా అడిగారు.

"దళపతీ! దాని గురించి నేనీరోజు ఉదయమే తెలుసుకొన్నాను. అక్కడ చేత పదునైన ఒక శూలాన్ని పట్టుకొని ఒక పాండ్యదేశపు కుట్రదారుడు నిలబడివుండడాన్ని కూడ చూశాను..."

"భగవాన్! ఇదేమి భయంకరమైన వార్తను చెబుతున్నావు? ఆ దారి...ఆ దారి... ఎక్కడకు వెళ్ళి ముగుస్తుందో తెలుసా?"

"బొక్కసపు నేలమాళిగ గుండా వెళుతూంది!" అన్నది పూంగుళలి.

"ఆహా! నీవు చెబుతున్నది నిజమే కావచ్చు. మానవరూపం దాల్చిన ఆ మాయమోహిని పనే ఇది! నా అన్నను తన బానిసగా చేసుకొన్న ఆ ఆడ దెయ్యం పనే ఇది! అయ్యో! ఎన్ని సార్లు నేను హెచ్చరించాను! అమ్మాయీ! నీవు చెబుతున్నది నిజమేనా? నీవే చూశావా? అ దారి ఉన్నచోటు నీకెలా తెలిసింది?"

"నా అత్త ఈరోజు ఉదయం తీసుకొని వెళ్ళి చూపించినప్పుడు తెలిసింది."

"అదెవరు నీ అత్త?"

"ముఖ్యమంత్రి ఆజ్ఞానుసారం మీ మనుషులు కోడిక్కరైనుంచి పల్లకిలో పిలుచుకొని వచ్చిన ఆవిడే, అయ్యా! మనం దీని గురించి ఇంకా ఇక్కడే మాట్లాడుతున్నప్పుడు..."

"నిజమే. నేను వెంటనే పెద్ద పళువూర్ మాళిగకు వెళ్ళి కావలసిన ఏర్పాట్లు చేసి వస్తాను. అంతలోపల నీవు..."

"నేనీ చివర నిలబడి చూస్తూంటాను."

"ఆహా! నేను నిన్నిలా నమ్మడం? నీవు కూడ ఆ పాండ్యనాడు కుట్రదారులతో చేరినదానివి కావని ఎలా నమ్మడం? నన్ను పోనిచ్చి ఆ తర్వాత నీవు..."

"దళపతీ! అలాగైతే మీరు కూడ నాతో రండి! ఒక దివిటీ తీసుకొని రండి! ఇద్దరమూ వెళ్ళి చూద్దాం. దారిన నాకు తెలిసిన ఇంకొన్ని వివరాలను కూడ చెబుతాను."

~

చిన్న పళువేట్టరయ్యర్ వెంటనే అంతఃపురం వాకిలి దగ్గరకు వెళ్ళి అక్కడున్న తమ వీరులు కొందరిని పిలిచి వారికి ఏదో పురమాయించారు. వారు పళువూర్ అంతఃపురానికి వెళుతున్నారని పూంగుళలి ఊహించుకొంది. వీరులలో ఒకడి చేతనున్న దివిటీని తీసుకొని తిరిగి వచ్చారు కోట దళపతి.

"అమ్మాయీ! దారి చూపిస్తూ ముందు వెళ్ళు! నీవు చెప్పినదంతా నిజమేనా అని చూస్తాను!" అన్నారు దళపతి.

అప్పుడు కూడ ఆయన మనసులో పూంగుళలి మీది సందేహం వీడలేదు. ఈ అమ్మాయి అబద్ధాలు, కట్టుకథలు చెప్పి మోసగించేందుకు చూస్తూందేమో? సొరంగమార్గం గురించి తన మూలంగా తెలుసుకోవడానికి పన్నాగం పన్నిందేమో? దాని గుండా కొడుంబాళూర్ సైనికులను లోపలికి తీసుకొచ్చేందుకు ఇదొక పన్నాగమేమో...? అలా తనని అంత సులభంగా మోసగించలేదు ఈ పిల్ల. ఈ అమ్మాయి తనని అటువంటి దురుద్దేశంతో తీసుకొని వెళితే తగిన శిక్ష విధించాలి. పెద్ద పళువేట్టరయ్యర్లాగ తాను కూడ మోసపోతాడా ఏమి? ఇవన్నీ ఆలోచించే ఆయన పూంగుళలిని ముందుండి దారి చూపించమన్నారు. సొరంగ మార్గం ఈమెకు నిజంగానే తెలుసా అని మొదట తెలుసుకొందాం. తర్వాత అక్కడ కుట్రదారులు దాక్కొనివుండడం నిజమా అని పరిశోధించి తెలుసుకొందాం. భగవాన్! ఎంతటి ఆపద! అదృష్టవశాత్తు దాన్ని అడ్డుకొని ఆపడం అంత కష్టమేమీ కాదు. బొరియలో దాక్కొన్న నక్కను పట్టుకొన్నట్లు పట్టేసుకోవచ్చు!...

ఇలా ఆలోచిస్తూ చిన్న పళువేట్టరయ్యర్ పూంగుళలి వెంట నడిచారు. ఆమె నడక వేగం చూసి ఆశ్చర్యపడ్డారు.

అవును; పూంగుళలి మనసులోని గాభరా ఉఛ్చస్థాయికి చేరుకోగా, దానికి తగినట్లు ఆమె నడక వేగం కూడ అధికమైంది.

~

పూంగుళలి జీవితంలో కొంత కాలంగా అపూర్వమైన సంఘటలు జరుగుతున్నాయి. కానీ ఆరోజు జరిగినట్లు ఇంతకు మునుపెన్నడూ సంభవించలేదు.

ప్రాతఃకాలాన ఆమెను నిద్రనుంచి ఆమె అత్త తట్టి లేపింది. వారు పడుకొన్న భాగంలో పైమేడ గవాక్షంలో ఒక భయంకరమైన ముఖం కనిపించి, వెంటనే మరుగైంది. మందాకిని శబ్దం చేయకుండ లేచి పూంగుళలిని వెంట తీసుకొని మూసివున్న శిల్ప మంటపం లోపలకు వెళ్ళింది. పైమేడలో కనిపించిన ఆ భయంకరమైన ముఖం రావణుని పది తలల మధ్య మళ్ళీ ఒకసారి కనిపించి మాయమైంది.

ఇద్దరూ ఆ శిల్పం దగ్గరికి వెళ్ళి చూశారు. రావణుని తలల మధ్య సొరంగమార్గం ఆరంభమై వెళుతూందని పూంగుళలి గ్రహించింది. మందాకిని ముందు, పూంగుళలి ఆమె వెనుక రాగా, ఇద్దరూ ఆ సొరంగమార్గంలో దిగి వెళ్ళారు. పూంగుళలికి మొదట కళ్ళు కనిపించనే లేదు. అటువంటి అంధకారం ఆ సొరంగమార్గంలో గూడు కట్టుకొనివుంది.  అత్త చేయి పట్టుకొని తడబడుతూ వెళ్ళింది. మార్గం నుంచి కొన్ని మెట్లెక్కి ఇద్దరూ ఒక మంటపం లోపలికి ప్రవేశించారని తెలిసింది. అక్కడ కూడ చీకటి గుయ్యారంగా ఉంది. చేత్తో తడిమి చూసుకొంటూ, గోడలకు, స్తంభాలకు గుద్దుకోకుండ ముందుకు వెళ్ళడమే కష్టసాధ్యమైంది. కాసేపటికల్లా పైన ఏదో ఒక గవాక్షం నుంచి కాస్త వెలుతురు లోపలికి రాసాగింది. బాగా తెల్లారివుండాలని పూంగుళలి ఊహించింది. దానితోబాటు వారి చుట్టూ ఉన్నది బొక్కసపు నేలమాళిగ అని కూడ గ్రహించింది. కానీ మందాకిని అత్త ఏ మనిషిని వెతుక్కొంటూ వచ్చిందో, వాడు కనిపిస్తాడని తోచడం లేదు. చీకటి కమ్ముకొన్న ఆ నేలమాళిగలో దాక్కోవడానికి ఎన్నో చోట్లున్నాయి. వాడు ఎక్కడ దాక్కొనివున్నాడో, ఏమో? మనం వాడిని కనిపెట్టేముందు, వాడే మనని కనిపెట్టేసి, వెనకనుంచి వచ్చి పొడిచి చంపేయవచ్చు; ఈ నేల మాళిగలో అడిగేవాళ్ళుండరు.

పూంగుళలి ఇలా ఆలోచిస్తుండగా, మందాకిని తన అపూర్వమైన గొంతుతో - మనుషుల గొంతో, ప్రాణుల గొంతో తెలుసుకోలేని గొంతుతో - కేకవేసింది. దాని వెంటడే భీతిగొన్న ఒక మానవస్వరం వినిపించింది. నీడలాంటి ఒక ఆకారం దడదడమని పరుగెత్తింది. పైమేడ గవాక్షంలో ముఖం చూపించిన ఆకారమే ఉండి తీరాలని పూంగుళలి తీర్మానించుకొంది. అత్త గొంతు విని అది దెయ్యమో, పిశాచో అని భయపడి పరుగెత్తుతున్నాడని పూంగుళలి గ్రహించింది. ఆ ఆలోచన ఆమెకు నవ్వు తెప్పించింది. కాసేపటికి ఒకసారి అలా మళ్ళీ మళ్లీ కేకవేసి మందాకిని ఆ మనిషి మతి పోగొట్టి అటూ ఇటూ భీతితో పరుగెత్తేలా చేసింది. చివరిగా వాడు వెళ్ళి ఒక తలుపును గుద్దుకొన్నాడు. తర్వాత ఆ తలుపును దడదడమని తట్టాడు. తర్వాత తలుపు తెరుచుకొంది. తెరిచిన చోట ఒక స్త్రీ ఆకారం కనిపించింది. ఆమెకు వాడేమో చెప్పాడు. ఆమె

కాస్త జంకినట్లు, వాడు ఆమెను భయపెట్టినట్లు తోచింది. తర్వాత ఆమె వెనుదిరిగి వెళ్ళింది. ఆ మనిషి వాకిటే తొంగి చూస్తూ నిలబడ్డాడు. కాసేపటికల్లా ఆ స్త్రీ చేత ఒక దీపంతో తిరిగి వచ్చింది. ఇద్దరూ నేలమాళిగ లోపలికి దూరారు. మందాకిని పూంగుళలి చేయి పట్టుకొని వెళ్ళి ఒక స్తంభం వెనక మరుగ్గా నిలబడింది. దీపం వెలుతురులో ఇద్దరూ ఆ మనిషి ముఖాన్ని బాగా/స్పష్టంగా చూడగలిగారు.

ఆ మనిషి, ఆ స్త్రీ - ఇద్దరూ నేలమాళిగ లోపలి భాగంలోకి వెళ్ళారు.

"దెయ్యమేమిటి? పిశాచమేమిటి? బాగా భయపడిపోయావు! ఇంతటి బెదురుగొట్టువి ఇలాంటి పనికి ఎందుకు రావాలి?" అని ఆ స్త్రీ అడగడం పూంగుళలి చెవిన బాగా పడింది. 'ఎలాంటి కార్యం' అన్నది పూంగుళలికి సరిగ్గా అర్థం కాలేదు.

నేలమాళిగ లోపలికి చేత దీపంతో వారిద్దరూ వెళ్ళి కనుమరుగైపోగానే మందాకిని పూంగుళలి చేయి పట్టుకొని చరచరా లాక్కొని వెళ్ళి తెరిచివున్న తలుపు గుండా బయటకు చేరింది. తర్వాత ఇద్దరూ కాలిబాటకు అడ్డంపడి నడిచివెళ్ళి ఒక తోటలోకి ప్రవేశించారు. అక్కడ ఏకాంతమైన ఒక ప్రదేశంలో పూంగుళలికి సంజ్ఞాభాషలో తాను చెప్పదలుచుకొన్నది చెప్పింది ఆమె అత్త. "నా అంతిమ కాలం సమీపిస్తూంది. నేను చివరిగా కళ్ళు మూసేముందు యువరాజును ఒకసారి చూడాలి. నీవెళ్ళి ఈ వార్తను తెలియజేసి నీతోబాటు పిలుచుకొని రావాలి" అన్నదే ఆ సందేశం.

~

పూంగుళలికి తన అత్తమీదున్న ప్రేమ/ప్రీతి ఎలాంటిదో మనకెరుకే. అలాంటి పరిస్థితిలో ఆమెను వదిలిపెట్టి వెళ్ళడానికి కూడ మనసు రాలేదు. ఆమె మాటను త్రోసిపుచ్చడం కూడ సాధ్యం కాలేదు. కానీ పొన్నియిన్ సెల్వన్‌ని చూసేందుకు ఇదొక మంచి సందర్భమన్న ఆలోచన ఆమెను త్వరితంగా ఒక నిర్ణయం తీసుకొనేటట్లు చేసింది. అత్త దగ్గర సెలవు తీసుకొని బయలుదేరింది. తోట గోడెక్కి దూకి అవతలకు చేరి, తంజావూరు కోట వాలికి కూడ దాటింది. అక్కడ ఆళ్వార్ కట్టియాన్ని కలిసింది. అతడు కూడ ముఖ్యమంత్రి ఆజ్ఞానుసారం పొన్నియిన్ సెల్వన్ని చూసి కలిసేందుకే వెళుతున్నాడని తెలుసుకొంది. ఆ వీర వైష్ణవుని సహాయం వల్ల ఆమె ప్రయాణం కూడ సౌకర్యంగా నడిచింది.

ఆరోజు అదృష్టం దారిపొడుగునా ఆమె పక్కనేవుంది. కుడందై జ్యోతిష్కుల ఇంటి వాకిట యువరాకుమారి రథాన్ని చూశారు. యువరాజు గురించి కుందవైదేవికి సమాచారమేదైనా తెలిసివుండవచ్చని ఎంచి జ్యోతిష్కుల ఇంట ప్రవేశించారు. అక్కడ పెద్ద పళువేట్టరయ్యర్ నోటినుంచే పాండ్యదేశపు కుట్రదారుల గురించి తెలుసుకోవడమైంది. బొక్కసపు నేలమాళిగలో దాక్కొనివున్నవాడు ఆ కూటమికి చెందినవాడేనని పూంగుళలి దృఢపరుచుకొంది. అదే సమయాన యువరాజుకు కూడ కుట్రదారుల వల్ల అపాయం కలగవచ్చని తెలిసి చాల వేదనపడింది. వాణతి చేసిన శపథం ఆ వేదనకు ఒక పరిహారమైంది. రాకుమారి వాణతిని కాపాడేందుకు వెళ్ళిన చోట యువరాజును కూడ కలవగలిగింది.

అన్నిటికన్న ఆమెకు తృప్తినిచ్చిన విషయం, తంజావూరుకు వెళ్ళడం గురించి ఆమె ఇచ్చిన సలహాను యువరాజు పాటించడమే. లంకలో తమను బయటపరుచుకోకుండ ఏనుగు మావటి వేషంలో యాత్రలు చేశారు యువరాజన్న విషయం ఆమెకు తెలిసిందే. అక్కడ (లంకలో) సేనాధిపతిని, సైన్యాలను వదిలిపెట్టి తనను మాత్రం ఏనుగుమీదెక్కించుకొని కడలి తీరానికి వేగంగా వచ్చింది కూడ ఆమె మరిచిపోలేదు. కాబట్టి ఇప్పుడు కూడ యువరాజు ఆ ఉపాయాన్ని ఉపయోగపరుచుకోవడమే మంచిదని, ఆయన ఒంటరిగా వెళితే తంజావూరు కోట లోపలికి వెళ్ళడం సాధ్యం కాదని, తనను, వాణతిని పిలుచుకొని వెళితే, ఏనుగు మావటి అనుకొని వదిలిపెడతారని సలహా ఇచ్చింది.

"సముద్రకుమారీ! మంచి ఉపాయం చెప్పావు! నీవొక పెద్ద సామ్రాజ్యానికి ముఖ్యమంత్రిగా ఉండదగినదానివి!" అని యువరాజన్న మాటలను తలుచుకొని ఆమె మనసు మళ్ళీ మళ్ళీ ఉప్పొంగింది.

కానీ, ఇలా ఆ నిమిషం వరకు ఆమె అనుకొన్నట్లే అన్నీ జరిగినా ఏం ప్రయోజనం? ఆమె ఎదురుచూసినట్లు మందాకిని చక్రవర్తి పడుకొన్న గదిలో లేదు. ఆమె గురించి అక్కడ ఎవరినీ విచారించలేకపోయింది. 'నా అంతిమకాలం సమీపించేసింది' అని సైగతో అత్త చెప్పింది తలుచుకొన్నప్పుడల్లా పూంగుళలి గుండె గుభేలుమంది. ఇంత శ్రమపడి, తెలివిగా మాటలాడి యువరాజును ఇక్కడకు తీసుకొని వచ్చి కూడ ఏం ప్రయోజనం? అత్త కనిపించలేదే అని ఆమె మనసు విలవిల్లాడింది. నేలమాళిగలోనే ఇంకా ఉందేమోనని సందేహించింది. ఒకవేళ ఆ పాపిష్టి కుట్రదారుని చేత చంపబడిందేమోనని ఎంచినప్పుడు ఆమె గుండె పగిలిపోయినట్లనిపించింది.

~

సొరంగమార్గం గుండా నేలమాళిగ లోపలికి వెళ్ళి చూడాలనుకొంది. కానీ అంతఃపురంలో యువరాజు రాక వల్ల చాల కోలాహలంగా ఉంది. అంతఃపురస్త్రీలు అటూ ఇటూ పరుగెడుతున్నారు. గుంపులు గుంపులుగా వచ్చి చక్రవర్తి ఉన్న గదిలోకి తొంగి చూసేసి వెళుతున్నారు. వీటన్నిటి మధ్య తాను ఒంటరిగా శిల్పమంటపానికి వెళ్ళడాన్ని ఎవరైనా చూస్తే ఏమనుకొంటారు? ఆ కుట్రదారుడు ఇంకా అక్కడే ఉంటే, తాను ఒంటరిగా వెళ్ళి వాడి చేత చిక్కుబడడం కూడ క్షేమం కాదు. ఎంతో గుండె ధైర్యం, తెంపరితనమున్న పూంగుళలికి కూడ ఆ బొక్కసపు నేలమాళిగ కాస్త భయాన్ని కలిగించింది.

అందుకే చిన్న పళువేట్టరయ్యర్‌కి చెప్పి ఆయనను కూడ తోడు తీసుకొని వెళ్ళి బొక్కసపు నేలమాళిగలో వెతికి చూడాలని నిశ్చయించుకొంది.

చిన్న పళువేట్టరయ్యర్తో వాదించి ఆయన మనసు మార్చి, తనతో పిలుచుకొని వెళ్ళడానికి కాసేపు పట్టింది. అది తలుచుకొనే ఆమె ఇప్పుడు వేగంగా నడవసాగింది. త్వరలో ఏదో విపరీతం జరగబోతూందని ఆమెకు లోలోపల గట్టిగా అనిపించింది (ఆరోజ్ఞానం). అందువల్ల తనకు ఏ అపాయం కలిగినా ఫరవాలేదు. అత్తకు ఏమీ కాకూడదని మనఃపూర్వకంగా కోరుకొంది.

శిల్పమంటపం లోపల ప్రవేశించేటప్పుడు, అంతఃపురపు పైమేడనుంచి ఏదో నల్లని నీడ పడుతున్నట్లు తోచింది; గోడవారగా ఒక ఆకారం వెళుతున్నట్లు అగుపించింది. అది నిజమేనా లేక భ్రమా అని తెలుసుకోవడానికి ఆమె కాస్త ఆగింది.

"అమ్మాయీ! ఎందుకాగావు? అబద్ధం బయటపడిపోతుందేమోనని భయపడుతున్నావా?" అని చిన్న పళువేట్టరయ్యర్ అన్నది చెవిన పడగానే ఆమె ఇంకా వేగంగా నడిచింది.

శిల్పమంటపం లోపలికి ప్రవేశించగానే రావణుని తలలకు, చేతులకు మధ్యనున్న రహస్య ద్వారాన్ని చూపించింది.

"సరే, సరే! దిగు ముందు!" అన్నారు దళపతి.

పూంగుళలికి ఉన్నట్లు ఏదో భయం కలిగింది. ఆమె ఒళ్ళు వణికింది.

అదే సమయాన 'కీచు'మన్న ఒక అమానుష స్వరమొకటి ఎలుగెత్తి కూయడం వినిపించింది.

అది తన అత్త మందాకిని గొంతేనని వెంటనే గ్రహించింది పూంగుళలి. అది అంతఃపురంలో చక్రవర్తి పడుకొన్న గదినుంచి వస్తూందని కూడ గ్రహించింది.

వెంటనే ఆమె జంకు వీడిపోయింది. చిన్న పళువేట్టరయ్యర్ని ఏ మాత్రం పట్టించుకోకుండ అంతఃపురం వైపు వేగంగా పరుగెత్తింది. మళ్ళీ మళ్ళీ ఆ భయంకరమైన ఆర్తనాదం వినిపించసాగింది.

చక్రవర్తి పడకగదిలో ఆమె ప్రవేశించినప్పుడు అక్కడ కనిపించిన దృశ్యం ఆమె మనసులో ఒక చిత్ర పటంలాగ తోచింది.

చక్రవర్తి ఆనుకొని పడుకొన్న పళంగా తమ అనుంగు పుత్రుని చేతులను పట్టుకొనివున్నారు. వారిద్దరి ముందు మందాకిని అత్త నిలబడి భీతితో కేకలేస్తూంది. ఇంకొకవైపు వాణతి, ఆమెను కోడలుగా చేసుకోబోయే పట్టమహిషియైన చక్రవర్తి భార్య నిలబడివున్నారు.

అందరూ పిచ్చిపట్టినదానిలాగ కేకలేస్తున్న మందాకినినే చూస్తున్నారు.

పైమేడ అంచునుంచి దూసుకువచ్చిన శూలాన్ని ఎవరూ గమనించలేదు.

పూంగుళలి తన అత్తవైపు ఒక్క అంగలో దూకి వెళ్ళింది.

~~~
~~~

# అధ్యాయము - 30

## దైవమైంది!

**పూంగుళలి** ఎంత వేగంగా పరుగెత్తినా పైమేడనుంచి విసరబడ్డ శూలంతో పోటీపడి గెలవలేదు కద? ఆమె మందాకిని అత్తను చేరేలోపు శూలం మందాకిని డొక్కలోపలికి దూసుకువెళ్ళింది.

కెవ్వుమని ఇంకొకసారి కేకవేసి కింద పడింది మందాకిని.

అదే సమయాన ఆ గదిలోవున్న అందరూ గొల్లుమన్నారు.

పూంగుళలి లాగే తక్కినవారందరూ మందాకినివైపు పరుగెత్తి రాసాగారు.

అదే సమయాన పైమేడనుంచి దడదడమని శబ్దం వినిపించింది. కొన్ని మట్టి కుండలు అక్కడి నుంచి కిందకు అన్నివైపులా విసరబడ్డాయి.

వాటిలో ఒకటి చక్రవర్తి సమీపాన ప్రకాశవంతంగా వెలుగుతున్న ఒక దీపం మీద పడగా, అది ఆరిపోయింది. గదిలో వెంటనే చీకటి కమ్ముకొంది.

తర్వాత కాసేపటివరకు ఆ అంతఃపురం గదిలోను, దాని చుట్టు ఉన్న వసారాలలోను విపరీతమైన గందరగోళం నెలకొంది.

దడదడమని అటూ ఇటూ పరుగెడుతున్న మనుషుల కాలి చప్పుళ్ళు వినిపించాయి.

"దీపం! దీపం!" అని చిన్న పళువేట్టరయ్యర్ గొంతు గర్జించింది.

"ఆః! అయ్యో!" అని ఒక స్త్రీ గొంతు కేకవేయడం వినిపించింది. అది మహారాణి గొంతులాగ వినిపించడంతో అందరి మనసులూ గుభేలుమన్నాయి.

ఇంతటి గందరగోళంలోను పూంగుళలి తన అత్త మందాకిని కింద పడ్డ చోటును గుర్తు పెట్టుకొని ఆ దిశగా పరుగెత్తి వెళ్ళి చేరుకొంది. అత్తను ఆమెకు మునుపే ఎవరో ఎత్తి ఒడిలో పడుకోబెట్టుకొని ఉండడాన్ని గమనించింది.

వాకిలి దగ్గర "ఎవర్రా అది? పరుగెత్తకు! ఆగు!" అని చిన్న పళువేట్టరయ్యర్ కేకవేశారు.

పరుగెత్తినవాడెవడని పూంగుళలి ఊహించుకోగలిగింది.

ఆ సమయాన ఇద్దరు దాదులు దీపాలు తీసుకొని ఆ గదిలో ప్రవేశించారు.

దీపపు వెలుతురులో కనిపించిన దృశ్యం ఎవరూ ఊహించినలేని విచిత్రమైన దృశ్యంగా తోచింది.

మూడేళ్ళుగా కాలూని నడిచి ఎరుగని చక్రవర్తి - కాళ్ళలో శక్తి పూర్తిగా కోల్పోయిన సుందర చోళ చక్రవర్తి, తాము పడుకొనివున్న పడక మీదినుంచి లేచి నడిచి వచ్చి, మందాకిని వద్ద కూర్చొని

వున్నారు.

మందాకిని డొక్కలో ఒకవైపు దూసుకువెళ్ళి ఇంకొకవైపు బయటకు వచ్చిన శూలం మొననుంచి రక్తం కారసాగింది.

చక్రవర్తి ఇప్పటివరకు పడుకొనివున్న మంచం దగ్గర మలైయమాన్ కుమార్తె వాణమహాదేవి కనిపించింది.

ఆమెకు సమీపాన చక్రవర్తి తల ఆనించి పడుకొన్న దిండులో ఒక పదునైన కత్తి దిగివుంది.

దీపం రాగానే మహారాణి మంచాన్ని పిచ్చిదానిలాగ ఒక చూపు చూసి, ఎనలేని ఆశ్చర్యంతో కింద కూర్చొనివున్న చక్రవర్తిని చూసింది. అప్పుడు పొన్నియిన్ సెల్వన్ మందాకిని తలను మెత్తగా లేపి చక్రవర్తి ఒడిలో పెట్టారు.

యువరాజు అరుళ్మొళి వర్మ కళ్ళనుంచి అశ్రువులు ధారగా ప్రవహించసాగాయి.

చక్రవర్తేమో వెక్కి వెక్కి ఏడ్వసాగారు.

~

పూంగుళలి ఇదంతా ఒక్క క్షణంలో చూసి తెలుసుకొంది. మరుక్షణమే అక్కడ జరిగిన సంఘటనలన్నింటినీ ఊహించి గ్రహించుకొంది.

పైనుంచి శూలం విసిరినవాడు ఆ శూలాన్ని మూగరాణి అడ్డుకొందని గ్రహించాడు.

వెంటనే పైనున్న పాత్ర సామాన్లను కిందకు విసిరి దీపాన్నార్పేశాడు.

అప్పుడేర్పడ్డ చీకటిలో పైనుంచి కిందకు దూకి, చక్రవర్తి పడుకొనివున్న చోటుగా గురిచూసుకొన్న చోట కత్తితో పొడిచేసి పారిపోయాడు.

చక్రవర్తి ఆపద వస్తూందని తెలియగానే తనను సమీపించిన మహారాణిని పక్కకు తోసేసి వెళ్ళినట్లు అగుపిస్తూంది. అప్పుడే మహారాణి "అయ్యో" అని కేకవేసి ఉండాలి.

తర్వాత ఆ కుట్రదారుడు వాకిలివైపు పరుగెత్తి, ఆ సమయాన లోపలికి వస్తున్న చిన్న పళువేట్టరయ్యర్ని పక్కకు నెట్టి పారిపోయివుండాలి.

ఇదంతా పూంగుళలి ఊహించి తెలుసుకొంది. ఈ పాతక కృత్యాన్ని చేసి పారిపోయిన ఆ దుష్టుడిని వెన్నంటి వెళ్ళి పట్టుకోవాలన్న ఆలోచన ఒకవైపు లేచింది. దానికన్న తన అత్త చివరి క్షణాలు ఆసన్నమైనాయన్న ఆలోచన ఆమె మనసులో మహాకల్లోలాన్ని లేపింది. కాబట్టి మందాకిని చక్రవర్తి ఒడిలో తలపెట్టి పడుకొనివుండడాన్ని కూడ పట్టించుకోక ఆమె దగ్గరకు వెళ్ళి ఆమె పక్కన కూర్చొని, "అత్తా! అత్తా!" అని విలపించింది.

"అయ్యో! నీవు చెప్పింది నిజమైపోయిందే! పాపిష్టిదాన్ని నిన్ను ఒంటరిగా వదిలిపెట్టి వెళ్ళాను కద!" అని ఏడ్చింది.

కానీ మందాకినేమో ఆమె ఉన్నవైపు తిరిగి చూడను కూడ లేదు. ఆమె కళ్ళు చక్రవర్తి ముఖాన్నే చూస్తున్నాయి.

అంతెందుకు? ఆమె ఒక చేతిని పట్టుకొని కన్నీరు విడుస్తున్న యువరాజు మీద కూడ ఆమె చూపులు మళ్ళలేదు. పూంగుళలిని గమనిస్తుందా?

పూంగుళలి ఇంకా వెక్కి వెక్కి ఏడ్వనారంభించినప్పుడు యువరాజు తమ దుఃఖాన్ని అదిమి పెట్టుకొని, "సముద్రకుమారీ! ఇదేమి? నిన్ను నీవు మరచావా? నీవున్న చోటును మరచావా?" అని చెబుతూనే లేచారు.

"రాజా! నాకు నా అత్త తప్ప ఈ లోకంలో ఇంకెవరూ గతి లేదు!" అని ఏడ్చింది.

~

యువరాజు తమ కళ్ళలో పొంగివస్తున్న కన్నీళ్ళను తుడుచుకొంటూనే, "పూంగుళలీ! ఆమె నీకు అత్త. కానీ నాకు ఆమె నన్ను కన్నతల్లి కన్న పదిరెట్లు ప్రియమైన తల్లి! నన్ను పిలుచుకొని రమ్మని నిన్ను పంపింది! కానీ నా ముఖాన్ని తలెత్తి చూడను కూడ లేదు. దీని కారణాన్ని గ్రహించావా? ముప్పై సంవత్సరాల క్రితం విడిపోయిన నా తల్లి, తండ్రి ఇప్పుడు ఒక్కటిగా చేరివున్నారు. వారి మధ్య అడ్డుగోడగా నిలిచేందుకు మనమెవరం...?" అని చెప్పి, మహారాణితో సహా అందరినీ ఒకసారి నిశితంగా చూశారు.

మళ్ళీ పూంగుళలిని చూసి, "అమ్మాయీ! మునుపు నీవు నాకు చాలసార్లు సహాయం చేశావు! ఆ సహాయమంతా అంత ముఖ్యమైనది కాదు. ఈరోజు నా తల్లి, తండ్రి ఒకచోట చేరివున్నారు. దాన్ని చూసే భాగ్యాన్ని నాకు కలిగేలా చేశావు! ఇది నేనెన్నడూ మరువను! సముద్రకుమారీ! ఈ దినం నీ అత్త ఎంతటి మహత్తరమైన పుణ్యాన్ని కట్టుకొందో చూడు! కుట్రదారుల మారణ శూలం నా తండ్రిని చంపకుండ కాపాడింది! దానికి తన శరీరాన్నే అడ్డుపెట్టి, తన ప్రాణాలనే ఒడ్డి చక్రవర్తి ప్రాణాలను కాపాడింది! ఒకసారి కాదు, రెండు సార్లు ఆయనను కాపాడింది! నీ అత్త మీదికి శూలం దూసుకురావడాన్ని చూడగానే మూడేళ్ళుగా శక్తి కోల్పోయిన నా తండ్రి కాళ్ళకు మళ్ళీ శక్తి వచ్చింది. అయన మంచం మీదినుంచి లేచి పరుగెత్తి వచ్చారు. అందువల్ల ఆయన మళ్ళీ బతికిపోయారు! కుట్రదారుడు తన గురి తప్పిందని తెలుసుకొని, దీపాన్ని ఆర్పేసి కిందకు దూకి వచ్చి మళ్ళీ తన పాతక కృత్యాన్ని నెరవేర్చజూశాడు. కానీ చక్రవర్తి లేచి వచ్చినందువల్ల వాడి ఆశయం/ఉద్దేశం నెరవేరలేదు. అదిగో, నన్ను కన్న తల్లి, మలైయమాన్ కుమార్తె, ఎల్లలు లేని ఆశ్చర్యంతో చూస్తూ నిలబడింది, చూడు! నీ అత్తమీదికి శూలం దూసుకు రావడాన్ని నా తల్లి చూసింది. మళ్ళీ ఆ హంతకుడు ప్రయత్నించవచ్చని తలచి పరుగెత్తి వచ్చింది. నీ అత్త చేసిన ప్రాణత్యాగాన్ని తాను కూడ చేయాలని/చేయవచ్చని తలచింది. తన శరీరంతో చక్రవర్తిని అడ్డుకొని తర్వాత వచ్చే మారణాయుధానికి తననే బలివ్వాలని తలచింది. మంచంలో నా తండ్రి కనిపించకపోవడంతో 'అయ్యో' అని అరిచింది. చక్రవర్తి అక్కడే ఉండివుంటే, ఈ రోజు నా తలిదండ్రులలో ఒకరు మరణించివుండేవారు.

సముద్రకుమారీ! నీ అత్త ఈ చోళసామ్రాజ్యానికి, చోళకులానికి ఈ రోజు ఎంతటి గొప్ప సేవ చేసిందో ఇప్పుడు గ్రహించావా? కుట్రదారుని మారణాయుధం వల్ల చక్రవర్తి మరణించివుంటే చోళసామ్రాజ్యమే ఛిన్నాభిన్నమై ఉండేది. పళువేట్టరయ్యర్ కులానికి ఎన్నడూ మాయని నింద ఆపాదించబడేది. నా తలిదండ్రుల ప్రాణాలను మాత్రమే కాపాడలేదు నీ అత్త. పళువేట్టరయ్యర్ల కులం పేరును కూడ కాపాడింది. చోళనాడుకే ఒక పెద్ద ఆపద రాకుండ కాపాడింది. చోళవంశానికే కులదైవమైంది. పూంగుళలీ! నీ అత్త కోసం నేనిక ఒక్క బొట్టు కన్నీరు కూడ విడవబోను. ఆమె కోసం నీవు కూడ ఏడ్వనవసరం లేదు. ఇంకెవరు కూడ దుఃఖించనవసరం లేదు! ఇటువంటి దైవమరణం ఎంతమందికి దొరుకుతుంది? ముప్ఫైయేళ్ళుగా విడిపోయిన పతి కోసం ప్రాణాలర్పించే సతి ఎవరికి దొరుకుతుంది? ఆయన ఒడిలోనే తల పెట్టుకొని నెమ్మదిగా ప్రాణాలు విడిచే భాగ్యం ఎవరికి దొరుకుతుంది?" అని చెప్పి యువరాజు మళ్ళీ ఒకసారి చుట్టూ చూశారు.

ఆ గదిలోను, వాకిలి దగ్గర ఉన్నవారు - అందరూ తమ మాటలను ఇంతసేపు శ్రద్ధగా వింటున్నారని చూసుకొన్నారు. తర్వాత ఇంకా ఇలా ముందుకు చెప్పుకొచ్చారు:-

"పూంగుళలీ! నీ అత్త మరణిస్తే నీవు అనాధవవుతావని భయపడకు. నీవీనాడు చేసిన సహాయాన్ని ఎన్నడూ మరువను! నీకెన్నడూ కృతజ్ఞుడనై ఉంటాను. నేనొక వేళ మరిచినా చిన్న పళువేట్టరయ్యర్ మరువరు. నీవు, నీ అత్త ఆయన కులానికి ఎంతటి గొప్ప సహాయం చేశారు? చక్రవర్తి మీద శూలమో, కత్తో దిగివుంటే లోకమేమంటుంది? ఆయనను కూడ కుట్రదారుల ముఠాలో చేర్చేసేవారు. కోట వాకిట కొడుంబాళూర్ పెద్ద వేళార్ వేచివున్నారు. పళువూర్ కులాన్ని సమూలంగా తుడిచిపెట్టేసేందుకు ఆయనకు తగిన కారణం దొరుకుతుంది. అంతెందుకు? ఈ రోజు నేను నీ సహాయం వల్ల కోట లోపలికి రాకుండ ఉంటే, నాకు కూడ కోట దళపతి మీద సందేహం కలిగేదే. కాబట్టి చిన్న పళువేట్టరయ్యర్ తక్కినవారికన్న అధికంగా నీపట్ల కృతజ్ఞత కలిగివుండాలి. ఆయనను నీవే బహుమానమడిగినా ఇస్తారు. ఆయన ఆస్తిలో సగభాగమడిగినా ఇచ్చేస్తారు!"

~

యువరాజిలా చెబుతున్నప్పుడు చిన్న పళువేట్టరయ్యర్ని గమనించసాగారు. ఆయన తన కర్తవ్యాన్ని సరిగా నెరవేర్చలేదన్న విషయాన్ని ఆయన గ్రహించాలనే పైవిధంగా చెప్పారు. అది చిన్న పళువేట్టరయ్యర్ గ్రహించారన్నది ఆయన ముఖంలోని వేదనే బాగా ఎత్తి చూపింది. ఆయన ముఖాన సాధారణంగా తోచే గంభీరత్వం ఇప్పుడు లేదు. ఎవరినీ లక్ష్యం చేయని, దేనికీ జంకని వీర, ధీరత్వపు ఆనవాళ్ళు ఆయన ముఖంలో ఇప్పుడు ఇసుమంతైనా లేవు.

యుద్ధరంగంలో వెన్ను చూపి పారిపోయిన వచ్చిన ఒక వీరుడు, పలువురు ఎద్దేవా చేసేటట్లు, ఎందుకీ ప్రాణాన్ని కాపాడుకొని వచ్చానా అని ఎంచి అవమానభరితమైనట్లు ఆయన ముఖం తోచింది.

యువరాజు మొదట చెప్పినదంతా విని మనసు కరిగిపోయిన పూంగుళలి, ఆయన

బహుమానం గురించి మాట్లాడిన వెంటనే మునుపటి, ఉక్రోషంగొన్న సముద్రకుమారిగా మారిపోయింది.

"యువరాజా! నాకెవరి కృతజ్ఞతా అవసరం లేదు; బహుమానం కూడ అవసరం లేదు. నాకు ఆశ్రయమిచ్చేందుకు సముద్రరాజున్నాడు. నా పడవ కూడ కాలువలో భద్రంగానే ఉంది. ఇదిగో నేనిప్పుడే బయలుదేరుతున్నాను. ఒకవేళ నా అత్త బతికితే...? లేదు. అది ఒట్టి ఆశ! పొద్దునే నా అత్త చెప్పేసింది. రాబోయేది గ్రహించే అలా చెప్పింది. ఇక ఆమె బతకదు. నాకిక్కడింకే పనీ లేదు. ఎప్పుడైనా మీరు, కొడుంబాళూర్ రాకుమారి కోడిక్కరైకి వస్తే..." అని చెప్పి వాణతి ఉన్నచోటు వైపు చూసింది. ఆ అమ్మాయి విప్పారిన కళ్ళతో తనను, యువరాజును చూస్తూండడాన్ని గమనించింది. "ఛీఛీ! ఇదేం ఆశ? నేను వెళుతున్నాను" అని చెప్పి వాకిలి వైపు తిన్నగా నడిచింది.

~

ఇంతవరకు దిగ్భ్రమించి నిలబడివున్న వాణతికి ఇప్పుడు కాస్త ప్రజ్ఞ వచ్చింది. "నా అనుంగు చెలీ! నేనూ నీలాగ అనాధనే...!" అని ఇంకా ఏదో చెప్పబోయేటంతలో పూంగుళలి అడ్డుపడింది. "దేవీ! నేను మీ అనుంగు చెలినీ కాను; మీరు నాలాగ అనాధనూ కారు. త్వరలో పళైయారై యువరాకుమారి వచ్చేస్తారు!" అన్నది.

వాణతికి అప్పుడే నిజానికి కుందవైదేవి గుర్తొచ్చింది. "అక్కకు ఇక్కడ జరిగిందంతా తెలియనే తెలియదు కద! వార్త చెప్పి పంపించాలి కద?" అన్నది.

"దానికే దిగులా? కోట వాకిట మీ పెదనాన్న ఉన్నారు కద? ఆయనకు చెబితే ఆయన చెప్పి పంపిస్తారు!" అని చెప్పేసి దారికడ్డంగా నిలబడ్డట్లు నిలబడివున్న వాణతిని కాస్త పక్కకు జరిపేసి ముందుకు వెళ్ళింది.

వాకిట చిన్న పళువేట్టరయ్యర్ ఆమెను మళ్ళీ అడ్డుపడి ఆపారు.

"అమ్మాయీ! పొన్నియిన్ సెల్వన్‌గారు చెప్పిందంతా నేను పూర్తిగా విన్నాను. అది ముమ్మాటికీ నిజం. పళువూర్ కులానికి మాసిపోని అపకీర్తి రాకుండ నీవు కాపాడావు. నేను నీకు ఎంతగానో ఋణపడివున్నాను. నీవే బహుమానం అడిగినా ఇస్తాను!" అన్నారు.

పూంగుళలి దుఃఖపూరిత లాస్యంతో (చిరునవ్వుతో), "దళపతీ! ఇక్కడున్నవారికి కొంతమందికి చక్రవర్తి బతికినందుకు సంతోషం. కొందరికి ఆయన మళ్ళీ లేచి నడవగలగడం గురించి సంతోషం. ఇంకొందరికి పళువేట్టరయ్యర్ల కులం అపకీర్తి పాలు కాకుండ కాపాడబడడం గురించి ఆనందం. నా అత్తకు కలిగిన దుర్మరణం గురించి ఎవరికీ చింత లేదు. నేనైనా అందుగురించి చింతించాలి కద? నా అత్తను చంపినవాడు ఎక్కడున్నాడో వెళ్ళి వెతికి పట్టుకోజూస్తాను. దయచేసి నాకు దారి వదలండి!" అన్నది.

పూంగుళలి మాటలు దళపతిని అదిరిపడేటట్లు చేశాయి.

"అమ్మాయీ! నీ ముందు నేనోడిపోయాను. హంతకుడిని వదిలేసి ఇక్కడ ఊరక

నిలబడివున్నాను. వాడిని వెతికి పట్టుకోకపోతే చక్రవర్తి బతికినందువల్ల మాత్రమే నా పగ తీరిపోదు. నీ మాటలను నేను నమ్మకపోవడమే నా పొరబాటు! సొరంగమార్గం లోపలికే వెళ్ళివుంటాడు. రా! నాకు సహాయంగా రా! ఇంకెవరినీ నా వెంట తీసుకొని వెళ్ళడానికి ఇష్టపడడం లేదు! వాడు నా చేతికి చిక్కితే ఏం చేస్తానో చూడు!"

ఇలా చెబుతూనే చిన్న పళువేట్టరయ్యర్ తమ ఉక్కులాంటి చేత్తో పూంగుళలిని పట్టుకొని లాగుతూ శిల్పమంటపం వైపు వేగంగా వెళ్ళారు.

~

ఆ గదిలో ఉన్న తక్కినవారంతా చిత్తరువుల్లాగ నిలబడిపోయారు. యువరాజు కోరిక గ్రహించి చక్రవర్తి సమీపంగా వెళ్ళక దూరంగా ఒదిగి నిలబడ్డారు. అందరి కళ్ళు మాత్రం చక్రవర్తి మీదను, ఆయన ఒడిలో తల పెట్టుకొని పడుకొన్న ఆ స్త్రీశిరోమణి మీదను ఉన్నాయి.

కానీ, సుందర చోళ చక్రవర్తి, మందాకిని మాత్రం ఒకరిలొకరు పరిపూర్ణంగా ఐక్యమైపోయివున్నారు. తక్కినవారి గురించిన ఆలోచనే వారి మనస్సుల్లో ప్రవేశించలేదు. ముప్పైయేళ్ళ జీవితాన్ని కొన్ని నిమిషాల్లో గడపు సాధ్యమా అన్న విషయం గురించి మనోతత్వ శాస్త్రజ్ఞులు ఏం చెబుతారో తెలియదు. కానీ సుందర చోళ చక్రవర్తి, మందాకిని ఆ సుదీర్ఘకాల సహజీవనాన్ని ఆ కొన్ని నిమిషాల్లో అనుభవించారనడంలో సందేహం లేదు. ముప్పై సంవత్సరాలలో ఏమేమి మాట్లాడుకోలేకపోయారో అదంతా అప్పుడు మాట్లాడుకొన్నారు. మందాకిని తనదే అయిన కళ్ళ భాషలోనే మాట్లాడింది. సుందర చోళులు చాల వరకు ఆ భాషను అర్థం చేసుకొన్నారు. యువప్రాయంలో భూతాల దీవిలో మందాకినితో స్వర్గజీవనం గడిపినప్పుడు ఆమె సంజ్ఞాభాషను కూడ బాగా నేర్చుకొన్నారు. దానిని ఆయన ఈనాటివరకూ మరువలేదు. కాబట్టి ఇప్పుడు మందాకిని కళ్ళతో మాత్రమే మాట్లాడినా కూడ ఆమె మనసులో ఉన్న భావాలను వెంటనే తెలుసుకోగలిగారు. అలా అధికంగా మందాకిని విషయాలేమీ చెప్పలేదు కూడాను.

"మీ గురించి నాకు ఏ దిగులూ లేదు. లోకాన్నేలే చక్రవర్తియైన మీరెక్కడ? బెస్తవాళ్ల కూతురు, మూగది, చెవిటిది అయిన నేనెక్కడ? మీ ముందుకు రాక ఇంతకాలమూ నేనే దాక్కొని తిరుగాడుతున్నాను. అప్పుడప్పుడు దూరాన నిలబడి దర్శించుకొని తృప్తిపడేదాన్ని. అసువులుబాసే సమయాన మీ ఒడిలో తలవుంచుకొని ప్రాణాలు విడిచే భాగ్యం కలిగింది కద? దీనికన్న నాకింకేం కావాలి?" - ఇంతే మందాకిని చెప్పింది. దీన్నే ఆమె మనసూ, కళ్ళూ మళ్ళీ మళ్ళీ చెప్పసాగాయి. ఆమె ముఖంమీదేమో అమితానందం తొణికిసలాడుతూంది. డొక్కలో శూలం దిగినందువల్ల ఆమె కించిత్తు కూడ బాధ అనుభవిస్తున్నట్లు తోచలేదు. ఆమె తన దేహాన్నే పూర్తిగా మరిచిపోయినట్లు అగుపించింది. పక్షి గూటినుంచి ఎగిరిపోయే తరుణం ఆసన్నమైంది. ఇక, గూడు గురించి ఆ పక్షికి ఏం దిగులుంటుంది?

సుందర చోళ చక్రవర్తి కూడ తన దేహం గురించి పూర్తిగా మరిచారు. అందుకే ఆయన తమ

కాళ్ళు శక్తి కోల్పోయిన విషయం కూడ మరిచి, మంచం దిగి మందాకిని దగ్గరకు పరుగెత్తి రాగలిగారు.

~

కానీ చక్రవర్తి మందాకినిలాగ కొన్ని మాటలు మాత్రమే చెప్పడంతో తృప్తిపడలేదు. ఎన్నెన్నో విషయాలను ఆయన చెబుతూనే ఉన్నారు. ఆయన కళ్ళు చెప్పిన మాటలను ఆయన పెదవులు మాటలుగా గొణుగుతూనే ఉన్నాయి. ఆ గదిలో ఉన్నవారికి ఆయన మాటలేవీ అర్థం కాలేదు. కానీ మందాకినికి అంతా అర్థమవుతూ వచ్చింది. ఆమోదించవలసిన చోట ఆమోదించింది; నిరాకరించవలసిన చోట తల ఆడించి తన భిన్నాభిప్రాయాన్ని తెలియజేసింది; ఆనందించవలసిన చోట ఆనందించింది; ఓదార్పు కావలసిన చోట ఓదార్పును తెలియజేసింది.

"నా ప్రాణానికి ప్రాణమా! నీవీనాడు నా కోసం ప్రాణాలు విడుస్తున్నావు! నా ఊపిరి మాత్రం ఇంకెన్ని రోజులు ఉంటుందనుకొంటున్నావు? నేను పాషాణ హృదయమున్న పాపిష్టివాడినే. ఒప్పుకొంటాను. రాజ్యమేలే విధి కోసం పుట్టిన నేను ఇలా గుండె రాయి చేసుకోవలసి వస్తోంది. లేకపోతే రాజ్యనిర్వాకం ఎలా జరపడం? భూత దీవిలో నేను నిన్ను వదిలిపెట్టి రావడం నేను చేసిన మొదటి పెద్ద నేరం. దాని పరిణామంగా ఇంకొన్ని నేరాలు చేయవలసి వచ్చింది. ఆ స్వర్గానికి సాటియైన దీవిలో మనం ఎంత ఆనందంగా జీవించాము? అది దీర్ఘకాలం నడిచే భాగ్యం లేకపోయింది కద? దేవుడే కుట్ర పన్నాడు కద? నాకు కావలసిన వారందరూ కుట్ర పన్నారు కద? యువరాజు పట్టాభిషేకం జరిగిన వెంటనే నిన్ను వెతకాలనుకొన్నాను. నిన్ను వెతుక్కొంటూ కోడిక్కరై వరకు వచ్చాను. పాపిష్టివాళ్ళు నీవు సముద్రంలో పడి చనిపోయావన్నారు. నా ప్రాణస్నేహితుడనుకొన్న అనిరుద్ధుడే నన్ను మోసం చేసేశాడు. అవును, అవును! నీవు చెబుతున్నది తెలుస్తూంది. నీవు సముద్రంలో దూకింది నిజమేనని, తర్వాత ఎవరో నిన్ను కాపాడారని చెబుతున్నావు. కానీ అది అనిరుద్ధుడికి తెలిసి కూడ వాడు నాకు చెప్పలేదు. అందువల్ల కలిగిన విపరీతాలు చూడు! నిన్ను చూడ వచ్చినప్పుడల్లా అది నీ ఆత్మ అని భ్రమపడ్డాను. నా పైన పగతీర్చుకోవడానికే నా చుట్టూ తిరుగుతున్నావనుకొన్నాను. నా ప్రియపుత్రుని నీవు కావేరి నదినుంచి కాపాడగా, నీవే వాడిని కావేరిలో తోసేశావనుకొన్నాను. ఆహా! నీవు సజీవంగానే ఉన్నావని తెలిస్తే, నా జీవితం ఎలా ఉండేదో? ఈ పెద్ద సామ్రాజ్యం కోసం నిన్ను విడిచిపెట్టాననుకొన్నావా? ఏనాడూ కాదు...!"

~

ఇలా సుందర చోళ చక్రవర్తి తమ మనసులో పొంగి వస్తున్న భావాలన్నిటినీ నోటి మాటల ద్వారా మెల్లగా చెబుతూ వచ్చారు. చివరిగా ఇలా అన్నారు:-

"రెండు రోజుల క్రితం నీవు నా ముందు వచ్చినప్పుడు నీ మీదకు దీపాన్ని విసిరేశాను. నిన్ను మళ్ళీ చూసినప్పుడల్లా చిరాకు వ్యక్తపరిచాను. దానికంతా నీవు నన్ను క్షమించాలి. చాల ఏళ్ళుగా నీవు దెయ్యం రూపంలో వచ్చి నన్ను వేధిస్తున్నావని భావించాను. మధ్యరాత్రి నీవు ఇదే గదిలో నాకు కనిపించి

ఏవేవో చెప్పావు. నా పిల్లలను నీవు శపిస్తున్నావనుకొన్నాను. అప్పుడు కలిగిన ఏవగింపు నిన్ను ప్రత్యక్షంగా చూసినప్పుడు కూడ వీడిపోలేదు. నిజానికి నీవు మా కులదైవంగా వచ్చావు! నాకు, నా పిల్లలకు హాని కలగకుండ కాపాడేందుకు వచ్చావు! అదంతా నేను గ్రహించలేదు. నా కూతురు కుందవై వివరించి చెప్పినప్పుడే తెలిసింది. అయ్యో! ఎటువంటి తప్పు చేశాను! అందుకు నన్ను క్షమించు! నీపైన నాకున్న ప్రేమను ఇక ఎలా చూపను? అందుకు దారి లేకుండ చేశావే! నా కుమారులకు పట్టం కట్టవద్దన్నావు కద? దాని న్యాయం నాకే తెలిసివచ్చింది. ఎందుకు తల ఆడిస్తున్నావు? అందులో తప్పేమీ లేదు. కానీ ఇక్కడున్నవారందరూ నాకు ఏవేవో చెప్పి నన్ను పిచ్చివాడిని చేయజూస్తున్నారు. నీకు బిడ్డ పుట్టినట్లు చెబుతున్నారు. అది నిజమైతే చెప్పు! నీ కొడుకుంటే, చెప్పేయి! వాడికి నా చేతనైంది చేసి నేను నీకు చేసిన ద్రోహానికి ప్రాయశ్చిత్తం చేస్తాను...”

సుందర చోళ చక్రవర్తి ఈ చివరి మాటన్నప్పుడు మందాకిని చాల కలవరపాటుతో చుట్టూ చూసింది. వాకిలి దగ్గర నిలబడ్డ పొన్నియిన్ సెల్వన్ మీద ఆమె చూపులు నిలిచాయి.

వెంటనే యువరాజు, తలిదండ్రులున్న చోటుకు వచ్చారు. తల్లి సమీపాన కూర్చొన్నారు.

మందాకిని యువరాజును తన చేత్తో తాకుతూ చక్రవర్తి ముఖాన్ని చూసింది. “వీడే నా కొడుకు!” అన్న అర్థం ఆ చూపునుంచి చాల తేటగా తెలియవచ్చింది.

ఇలా రెండు మూడు సార్లు మందాకిని చక్రవర్తిని, యువరాజును మార్చి, మార్చి చూసింది. తర్వాత కళ్ళు మూసుకొంది. కాస్త ఎత్తివున్న ఆమె తల చక్రవర్తి ఒడిలో వాలిపోయింది.

మందాకిని ప్రాణం ఆమె శరీరాన్ని వదిలింది.

సుందర చోళ చక్రవర్తి వెక్కి వెక్కి ఏడ్వడాన్ని ఇంతవరకు ఎవరూ చూసిందీ లేదు, విన్నదీ లేదు.

ఇప్పుడు ఆయన 'ఓ' అని అరిచి ఏడవడాన్ని విని అందరూ పిడుగుపడ్డట్లు అదిరిపడ్డారు.

యువరాజు అరుళ్మొళి వర్మ మాత్రం స్థిమితమైన మనసుతో ఉన్నారు.

ఆయన చక్రవర్తిని చూసి ఇలా అన్నారు:- “తండ్రీ! నా తల్లి మరణం గురించి నేను విచారించనవసరం లేదు. ఆమె మరణించనే లేదు. దైవంగా కద మారారు? ఎన్నటికీ ఆమె మన చోళకులానికి కులదైవంగా విరాజిల్లుతారు!” అన్నారు.

కానీ సుందర చోళ చక్రవర్తి వెక్కి ఏడ్వడం ఆపలేదు. మందాకిని మరణం గురించి అయన ఏడ్చారా? లేక అదే సమయాన చాల దూరాన జరిగిన ఇంకొక అతి దుఃఖమైన సంభవాన్ని ఎరిగి విలపించారా అన్నది ఎవరికి తెలుసు?

~

యువరాజు అరుళ్మొళి వర్మ చెప్పిన చివరి మాట మాత్రం నిజమైంది. పొన్నియిన్ సెల్వన్

తర్వాతి కాలంలో సింహాసనమెక్కినప్పుడు 'ఈలం (లంక) రాణి' అని ఆయన పిలిచిన మందాకినీదేవి ఆలయాన్ని తంజావూరులో నిర్మించారు. అది కొంత కాలం 'సింహళ నాచ్చియార్ కోవెల' అన్న పేరుతో ప్రబలంగా విరాజిల్లింది పోను పోను ఆ ఆలయం పేరు 'సింగాచ్చియార్ కోవెల' అని మారింది. ఇప్పటికీ తంజావూరు నగరంలో ఒక భాగాన 'సింగాచ్చియార్ కోవెల' అన్న పేరుతో ఒక చిన్న శిథిలమైన ఆలయం ఉండడాన్ని తంజావూరుకు వెళ్ళేవారు విచారించి తెలుసుకోవచ్చు.

~~~
~~~

# అధ్యాయము - 31

## వేళ వచ్చేసింది!

**గత** అధ్యాయంలో వివరించిన సంఘటనలతో ఈ కథను ముగించగలిగితే ఎంతో బాగుండేది. కొందరు పాఠకులు అలా ఎదురుచూడనూ వచ్చు. కానీ అది అసాధ్యమైంది. అదే రోజు, ఇంచుమించు అదే సమయాన కడంబూర్ శంబువరయ్యర్ మాళిగలో జరిగిన భయంకరమైన సంఘటనను గురించి మేమిక చెప్పవలసివుంది.

~

నందిని తన అంతఃపురం గదిలో ఒంటరిగా అటూ ఇటూ తిరుగుతూ ఉంది. ఆమె మనసులో గూడుకట్టుకొన్న ఆదుర్దా ఆమె ముఖాన కానవచ్చింది. ఆమె కళ్ళలో ఒక అపూర్వమైన మెరుపు మెరిసి మాయమైంది. ఆ గది లోపలికి వచ్చేందుకు అమర్చివున్న రెండు మూడు ద్వారాలను ఆమె పదే పదే చూడసాగింది. ఆ ద్వారాల్లో దేని దగ్గర కాలి చప్పుడు వినిపిస్తుందా అని చెవులు రిక్కించి వినసాగింది. "వేళ వచ్చేసింది!" అని తరచూ ఆమె తనకు తానే చెప్పుకోసాగింది. అలా తనకు తానే చెప్పుకొంటున్నప్పుడు కొన్నిసార్లు ఆమె పెదవులు వణికాయి. ఇంకొన్ని సార్లు ఆమె కనుబొమలు, కను రెప్పలు వణికాయి. కొన్నిసార్లు ఆమె ఒళ్ళంతా ఆవేశంగొన్నట్లు/పూనకం పూనినట్లు వణికింది.

నందిని పడుకోవడానికి మెత్తని పరుపు వేసి ఏర్పాటు చేసిన మంచానికి నాలుగువైపుల తెరలు దించబడివున్నాయి. అవి మంచాన్ని పూర్తిగా కప్పివున్నాయి. నందిని ఒకవైపు తెరను సుతారంగా ఎత్తింది. పడక మీద నిలువుగా ఉంచిన మారణ ఖడ్గాన్ని చూసింది. కమ్మరి కొలిమిలో జ్వలించే జ్వాలలాగే అది మెరిసింది. ఆ జ్వాలలో ఆ పట్టు పరుపు, మంచం, తెరలు కాలిపోలేదంటే ఆశ్చర్యమే. ఇది తలుచుకోగానే, అది ఎర్రని అగ్ని జ్వాలలతో చేయబడిన ఖడ్గం కాదని, ఉక్కుతో చేయబడిన కత్తి అని తెలుసుకోవలసివుంది.

నందిని ఆ ఖడ్గాన్ని చేతిలోకి తీసుకొని పైకెత్తి పట్టుకొంది. దీపం వెలుతురులో ఇంకా బాగా మెరిసేటట్లు ఎత్తి పట్టుకొంది. తర్వాత దాన్ని తన హృదయానికి హత్తుకొంది. చెంపలకు చేర్చి పట్టుకొని ముద్దాడింది. "దైవఖడ్గమా! నీవు నీ పని చేయవలసిన సమయమాసన్నమైంది! నన్ను నిరాశపరచవు కద? లేదు, లేదు! నీవు నన్ను నిరాశపరచవు! నా చేతులే నన్ను మోసపుచ్చవచ్చు!" అన్నది ఆ ఖడ్గంతో.

తర్వాత తన చేతులవైపు చూసి, "కరద్వయమా! మీరు దృఢంగా, స్థిరంగా ఉంటారు కద? ఛీఛీ! ఇప్పుడే ఇలా వణుకుతున్నారే! సమయం వచ్చినప్పుడు ఏం చేస్తారు? అవునవును! మిమ్మల్ని

నమ్మడం వల్ల ప్రయోజనం లేదు. వేరొక రెండు చేతులనే నేనీరోజు సంపాదించుకోవాలి!" అన్నది.

~

ఉన్నట్లుండి నందిని ఒళ్ళంతా ఒక్కసారి వణికింది. వెర్రిజ్వాలలు వీస్తున్న కళ్ళతో పైకి చూసింది. " ఆహా! నీవొచ్చేశావా? రా! రా! సరైన సమయానికే వచ్చావు! నా ప్రియతమా! నా రాజా! రా! వీరపాండ్యుని శిరమా! ఎందుకు కప్పు మూలలోనే ఉండిపోయావు? కిందకు దిగిరా! ఇక్కడ ఎవరూ లేరు! నీ దాసి తప్ప ఇంకెవరూ లేరు. ఎందుకిలా గుడ్లప్పగించి చూస్తావు? నోరు తెరిచి ఒక మాట మాట్లాడు! 'ఈ గండం గడిచి బతికితే పాండ్యసింహాసనమెక్కిస్తాను!' అన్నావు కద? దాన్ని నేను మరువలేదు. నేను నీకిచ్చిన మాటను కూడ మరువలేదు. దాన్ని నెరవేర్చే సమయం దగ్గరకొచ్చేసింది. దాని కోసమే కద నీవింతకాలం ఓపిక పట్టావు? అంతా నీవు చూస్తూండు! కళ్ళార్పకుండ చూస్తూండు! నీవేమో కళ్ళు ఆర్పనే ఆర్పవు కద? నన్ను కళ్ళు మూసుకొని నిద్రపోకుండ చేస్తున్నావు! ఈ రాత్రి నీ పగ తీర్చేస్తే, తర్వాతైనా నన్ను వదిలి పోతావు కద? అప్పుడైనా నన్ను నెమ్మదిగా నిద్రపోనిస్తావు కద? ఏమన్నావు? వదలవా? పాండ్య సింహాసనం పైన నేనెక్కి కూర్చోవడాన్ని చూసిన తర్వాతే నన్ను వదిలి వెళతావా? నా మాటను నేను నెరవేరిస్తే, నీ మాటను నీవు నిలబెట్టుకొంటానంటున్నావా....? లేదు, లేదు! నాకు సింహాసనమూ వద్దు, మణిమకుటమూ వద్దు! నీ కుమారుడని ఎవరినో ఒక పిల్లాడిని పిలుచుకొచ్చారు. వాడిని సింహాసనం మీద కూర్చోబెట్టి, తలమీద మణిమకుటం పెట్టడమూ అయింది. నీ పగ తీర్చేస్తే, దానితో నీవు తృప్తిపడతావు! తర్వాతైనా నీవు నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోతావు! పోరులో మరణించిన వీరులందరూ ఏ వీర స్వర్గానికి వెళతారో, ఆ వీర స్వర్గానికి నీవూ వెళతావు! అక్కడ నాలాగ ఎందరో అమ్మాయిలుంటారు. వారిలో ఒకతెను...ఏమి? కాదంటావా? దేవుడా! నేనూ నీతో రావాలంటున్నావా? సరే! సరే! దాని గురించి తర్వాత మాట్లాడుకొందాం! నా ప్రియతమా! ఎవరో వస్తున్నట్లుంది. నీవు దాక్కో! నేను ఈ పగ తీర్చే కత్తిని దాచిపెట్టాలి..."

~

ఆ సమయాన నిజంగానే వాకిలి దగ్గర కాలి చప్పుడు వినిపించింది. నందిని కత్తిని చుట్టి పెడుతుండగానే మణిమేఖల లోపలకు వచ్చింది.

కాసేపటి క్రితం వెర్రి ఆవేశం పట్టినదానిలాగ మాట్లాడిన నందిని, ఇప్పుడు పూర్తిగా మారిపోయి, "నీవేనా మణిమేఖలా? రా! రా!" అన్నది. ఆమె గొంతులో శాంతం ధ్వనించింది.

"అక్కా! ఇదేమి? ఎప్పుడూ చేత ఖడ్గంతో తిరుగాడుతున్నారు?" అని అడిగింది మణిమేఖల.

"మరి, ఇంకేం చేయడం? మగవాళ్ళు ఇంతటి ధూర్తులుగా ప్రవర్తిస్తుంటే మనం కత్తిని తోడుగా పెట్టుకోవాలి కద?"

"దేవీ! నేను మీకు తోడుగా ఉన్నప్పుడు, మీకు నామీద నమ్మకం లేదా?"

"నీమీద నమ్మకంలేకనా నా అంతరంగమంతా నీతో పంచుకొన్నాను? మణిమేఖలా! ఈ లోకంలోనే నేను నమ్మింది నిన్నొక్కదాన్నే. కానీ నీ తోడబుట్టిన అన్నకు విరుద్ధంగా నీవేం చేయలేవు కద?"

"అక్కా! నాతోడబుట్టిన సహోదరుడు లేడని తీర్మానించేశాను..."

"ఎందుకిలా అంటున్నావు? ఏదెలా ఉన్నా, అతడు నీ సహోదరుడు..."

"సహోదరుడట! సహోదరియట! ఆ సంబంధమంతా ఒట్టి భ్రమ అని తెలుసుకొన్నాను. గందమారన్ నా కోరికకు విరుద్ధంగా, వాడి స్వార్థం కోసం, బలవంతంగా నాకు పెళ్ళి చేయజూస్తున్నాడు! నిజమైన సహోదర భావం, ప్రేమ ఉంటే అలా చేస్తాడా?"

"చెల్లీ! నీ మంచి కోసమే అతడు నిన్ను యువరాజుకిచ్చి పెళ్ళి చేయగోరుతుండవచ్చు కద?"

"అవును! నా మంచి, చెడు వీడు చూడొచ్చాడు కాబోలు! నిజానికి నా మంచిని గురించి వాడాలోచించనే లేదక్కా!"

"లంకనుంచి ఉత్తరపెన్న వరకు విస్తరించిన చోళసామ్రాజ్యపు సింహాసనం నీవధిష్టించాలని నీ అన్న కోరుకోవడం నీ మంచి కోసం కాదా?"

"కానేకాదు! నేను తంజావూరు రాణినైతే వీడు ముఖ్యమంత్రి కావచ్చు, లేక పెద్ద పళువేట్టరయ్యర్‌లాగ ధనాధికరి కావచ్చన్న ఆశే దానికి కారణం! అక్కా...అక్కా!" అని మణిమేఖల ఇంకా ఏదో చెప్పబోయి జంకింది.

"చెప్పు, మణిమేఖలా! నీ మనసులో ఉన్నది ఏదైనా ధారాళంగా చెప్పవచ్చు. నాపైన నీకున్న ప్రేమతో నీవు చెప్పిందంతా నిజమే కద?"

"అక్కా! అందులో సందేహమేమీ లేదు. ఈ లోకంలో నేను ప్రేమగొన్నది ఇద్దరి మీదే. ఒకరు, మీరు.."

"ఇంకొకరెవరు?"

"మీకది తెలుసు. నన్నెందుకు అడుగుతున్నారు?"

"చెల్లాయ్! అది నీకు సంతోషకరంగా ఉంటుందని ఎంచాను. కథల్లోను, కావ్యాల్లోను నీవు చదవలేదా? ఒక అమ్మాయి మనసులో ప్రేమ ఉదయిస్తే దాని గురించి ఎవరికైనా చెప్పుకోవాలనిపించడం సహజమే కద? అంతరంగ స్నేహితురాలున్నది మరెందుకు?"

"అది నిజమే, అక్కా! నా అంతరంగాన్ని మీకిప్పటికే తెలియజేశాను. కానీ నేనిప్పుడు ఇంత తొందరగా మీ దగ్గరికి వచ్చింది ఒక ముఖ్యమైన వార్త తెలియజేసేందుకు. చాల దిగులు కలిగించే వార్త, అక్కా!"

~

నందిని అదిరిపడి, "ఏమది? ఏమది?" అని అడిగింది. ఎంతో కాలంగా ఎదురుచూస్తూ,

దానికోసం సిద్ధమవుతూ వస్తున్న కార్యాన్ని ఇప్పుడు ముగించేందుకు ఏమైనా అడ్డంకి వస్తుందేమో అన్న భీతి ఆమె మనసులో ఉదయించింది. దాని ఆనవాళ్ళు ఆమె ముఖంలో గోచరించాయి.

"అక్కా! ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ ఇంకా తంజావూరుకు వెళ్ళి చేరలేదట....దారిలో..."

"దారిలో ఏం జరిగింది? ఒకవేళ మనసు మార్చుకొని తిరిగి వస్తున్నారా?" అని నందిని అడిగిన ప్రశ్నలో భీతి తగ్గలేదు.

"అలా ఆయన వెనుదిరిగివున్నా మంచిదైవుండేదేమో! ఆ రోజు మనం చెరువులోని దీవిలో ఉన్నప్పుడు సుడిగాలి వీచింది కద? అది కొళ్ళిడంలోను, దానికవతల చాల భయంకరంగా వీచిందట...పెద్ద పళువేట్టరయ్యర్ కొళ్ళిడం నదిలో పడవలో వెళుతున్నప్పుడు సుడిగాలి చాల బలంగా వీస్తూందట...."

"తర్వాత?" అని నందిని ఆదుర్దాతోనే అడిగింది. కానీ దిగులు కాస్త తగ్గుముఖం పట్టింది.

"అవతలిగట్టు చేరేటప్పుడు పడవ తలకిందులైపోయిందట!"

"అయ్యో!"

"తప్పి బతికినవారు కొళ్ళిడం నదీతీరం పొడుగునా వెతికి చూశారట. మీవారు మాత్రం కనిపించలేదట!" అన్నది మణిమేఖల.

ఈ వార్త వినగానే నందిని వెక్కి వెక్కి ఏడ్వనారంభిస్తుందని ఎదురు చూసి, ఆమెను ఓదార్చేందుకు సిద్ధంగా ఉంది మణిమేఖల. కానీ నందినేమో అలా ఏం చేయలేదు. కించిత్తు గాభరా కూడ కనబరచకుండ, అపనమ్మకం ధ్వనించిన స్వరంతో, "ఈ వార్త నీకెల తెలిసింది?" అని అడిగింది.

"పళువేట్టరయ్యర్‌తో వెళ్ళిన వారిలో ఒక వీరుడు తిరిగి వచ్చి నా అన్నతో ఈ వార్త చెబుతుండగా నేనే విన్నానక్కా! ఈ వార్తను మీకెలా చెప్పడమా అని నా అన్న సంకోచించి, యువరాజును సలహా అడిగాడు. నేనే మీకు చెప్పాలని పరుగెత్తి వచ్చాను!"

ఇలా చెప్పేసి, మణిమేఖల దుఃఖం ఆపుకోలేకా ఏడ్వనారంభించింది.

నందిని ఆమెను హత్తుకొని, "నా ముద్దూ! నీవు నామీదెంత ప్రేమగొన్నావో తెలుసుకొన్నాను. అయితే నీవు విచారపడకు!" అన్నది.

~

మణిమేఖల కాస్త ఆశ్చర్యంతో తలెత్తి నందినిని చూసి,"ఈమెది ఎంతటి పాషాణ హృదయం' అని మనసులోనే అనుకొంది. కానీ అది నందిని గ్రహించేసింది.

"చెల్లీ! ఈ దుఃఖవార్తను నాకు తెలియజేసి, నన్ను ఓదార్చేందుకు పరుగెత్తి వచ్చావు. కానీ నేనే నిన్ను ఓదార్చవలసి వచ్చింది. నీవు విచారించకు. నా భర్త ప్రాణాలకు ఏ అపాయమూ రాలేదన్నది ఖాయం. అలా ఏదైనా జరిగివుంటే నా మనసే నాకు చెప్పివుండేది. అందుకే నేను దిగులుపడలేదు. కానీ నీవు విన్నది ఇంకా వివరంగా చెప్పు! నా మనసులో ఇంకొక సందేహం ఉదయిస్తూంది..."

"ఏమా సందేహమక్కా?"

"నీ అన్న, ఆ పల్లవుడు కూడబలుక్కొని నా భర్తకు ఏదైనా హాని తలపెట్టారేమో అని సందేహిస్తున్నాను. అందుకు ముందు జాగ్రత్తగా వారే ఈ వార్తను కల్పించివుండవచ్చు కద?"

"నాకర్థం కాలేదక్కా! వారు పళువేట్టరయ్యర్కి ఎందుకు హాని కలగజేయాలి?"

"నీవెంత అమాయకురాలివి, మణిమేఖలా! నీ అన్న, పార్థిబేంద్రుడు నా మీద దురుద్దేశంగొనివున్నారని నీకు చెప్పలేదా? అందుకే ఈ ఖడ్గాన్ని దగ్గరుంచుకొన్నానని కూడ చెప్పలేదా?"

"చెప్పారు. అందువల్లనే గందమారన్ని నా సహోదరుడని చెప్పుకోకూడదని కోరుకొన్నాను. ఆ పాతకుడిని నా తోడబుట్టినవాడని ఇక ఎంచను...అయినా కూడ వారు పళువేట్టరయ్యర్కి ఎందుకు హాని కలగజేయాలి?"

"చెల్లాయీ! ఇది కూడ నీకర్థం కాలేదా? ముసలాయన్ని పెళ్ళి చేసుకొని విలవిల్లాడుతున్న నేను, ఆయన తొలగిపోతే నేను చాల సంతోషపడుతాను; తర్వాత వారి దురుద్దేశానికి లొంగిపోతానని వారి ఆలోచన. నీ సహోదరుడిలాంటివాడని తెలిసివుంటే వాడికి నా గృహంలో ఉపచారాలు చేయించేదాన్ని కాను. యమలోకం వాకిలి వరకు వెళ్ళినవాడిని కాపాడేదాన్నే కాను..."

"అక్కా! ఇక నేను మిమ్మల్ని విడిచి ఒక్క క్షణం కూడ ఉండను. ఆ ఇద్దరిలో ఒకరిక్కడికి వస్తే నా చేత్తోనే వాళ్లను చంపేస్తాను!"

"మణిమేఖలా! నీకా దిగులవసరం లేదు. నన్ను నేనే కాపాడుకొంటాను. గందమారన్, పార్థిబేంద్రుడు నన్ను సమీపిస్తే, ఎన్నడూ మరువలేనట్లు బుద్ధి చెప్పి పంపిస్తాను. వారంటే నాకు కించిత్తు కూడ భయం లేదు. మొదట యువరాజు గురించే నాకు కాస్త భయంగా ఉండేది. అదృష్టవశాత్తు నీవే నన్ను కాపాడేశావు!"

"నేను మిమ్మల్ని కాపాడానా? అదెలా?"

"యువరాజు మనసును నీవు ఆకట్టుకొన్నావని తెలుసుకోలేదా, మణిమేఖలా? ఆ వాణర్ కులవీరుని పక్కకు తోసేసి నిన్నాయన చెరువునుంచి కాపాడడానికి కారణమేమి? ఆ తర్వాత కూడ ఆయన్ని నేను గమనిస్తూనే ఉన్నాను. నీ మనసుకు అది తెలియలేదా, మణిమేఖలా?"

"తెలియకేం? బాగానే తెలిసింది. యువరాజును తలుచుకొంటేనే నాకు భయంగా ఉంది. ఆయన దగ్గరకొస్తే నా ఒళ్ళు వణుకుతుంది. నా అన్న అని చెప్పుకొనే కిరాతకుడున్నాడు కద? వాడు నా ప్రాణాలు తీస్తున్నాడెప్పుడూ..."

"యువరాజును నీవు పెళ్ళాడాలనే కద?"

"అవును; నన్ను ఒంటరిగా ఒక్క క్షణం చూస్తే చాలు! వెంటనే నాకు ఉపదేశం చేయనారంభిస్తాడు. వాడి బెడద వల్లనే..."

"...యువరాజును పెళ్ళిచేసుకొందాం అని తీర్మానించుకొన్నావా?"

"మీరు కూడ ఇలా మాట్లాడుతున్నారేం?" అని మణిమేఖల్ వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

నందిని ఆమెను సమాధానపరిచింది. "ఏదో తమాషాగా అన్నాను. అందుకు ఇలా ఏడుస్తున్నావెందుకు?" అని చెప్పి ఆమె కన్నీళ్ళు తుడిచింది.

~

మణిమేఖల కాస్త సమాధానపడగానే, "నా ముద్దూ! నీ మనసును బాగ శోధించి ఉత్తరమివ్వు - నిజంగానే నీవు యువరాజు ఆదిత్య కరికాలన్‌ని కోరుకోవడం లేదా? ఆయనను పెళ్ళి చేసుకొని చోళసామ్రాజ్యానికి పట్టమహిషి కావాలని కోరుకోవడం లేదా?" అని అడిగింది నందిని.

"ఒకసారి అడిగినా, వందసార్లడిగినా, నా మాట ఒక్కటే, అక్కా! ఆ ఆశ నాకు లేనే లేదు."

"వాణర్ కులవీరునికి నీ మనసిచ్చేశావన్నది నిజమే కద?"

"అవునక్కా! కానీ ఆయన మనసెలా ఉందో?"

"ఆయన మనసెలా ఉంటేనేం? ఆయన ప్రాణాలతో ఉంటేనే కద ఆయన మనసు గురించి అడగాలి?"

మణిమేఖల్ అదిరిపడి, "ఏమంటున్నారక్కా?" అన్నది.

"మణిమేఖలా! నీవింకా నిజాన్ని తెలుసుకోలేదు. నీ పరిస్థితిని, నీ ప్రేమకు అర్హుడైనవాడి పరిస్థితిని నీవింకా గ్రహించలేదు. నన్ను గురించి నీవు దిగులుపడుతున్నావు! నా భర్త ఎలాంటివారన్నది నీకు తెలుసు. ఆయన నోరు కదిపితే ఈ దేశమే వణుకుతుంది. సుందరచోళ చక్రవర్తి ఆయన మాట దాటరు. నా భర్త మాటకు వ్యతిరేకంగా ముఖ్యమంత్రి మాట కూడ వినరు. ఆయన సొంత కొడుకుల మాటను కూడ చెవిన వేసుకోరు. పళువేట్టరయ్యర్ని వయసు మళ్ళిన ముసలాయన అని నీ అన్నవంటి మూఢులు ఎంచి పరిహాసం చేస్తున్నారు. కానీ ఆయన ఒక్కసారి ఊపిరి విడిస్తే, నీ అన్న, పార్థిబేంద్రుడిలాంటి వారు ఆ గాలికే ఎగిరిపోతారు. కాబట్టి పళువేట్టరయ్యర్‌కి ఎవరూ హాని కలిగించలేరు. నా ముద్దూ! నన్ను నేను కాపాడుకోవడం కూడ నాకు తెలుసు. దీనికన్న ఇక్కట్టైన ఎన్నో పరిస్థితుల్లో నన్ను నేను కాపాడుకొన్నాను. నిజంగానే నేనిప్పుడు దిగులుపడుతున్నదంతా నీ గురించే. నీవు కాసేపటి క్రితం ఈ గదిలోకి వచ్చే ముందు కూడ నీగురించే ఆలోచిస్తున్నాను..."

"మీరు చెబుతున్నదేమీ నాకు అర్థం కావడం లేదు. అక్కా! నాకు అంతటి అపాయం ఏం రాగలదు?"

"పిచ్చిపిల్లా! ఇష్టంలేని పురుషునికి జీవితం అర్పించడంకన్న ఒక ఆడదానికి పెద్ద అపాయం ఏం ఉండగలదు?"

"అది ఏనాడూ జరగని కార్యం!"

"నీ అన్న నిన్ను యువరాజుకిచ్చి పెళ్ళి చేయడమని తీర్మానం చేసేశారు; నీ తండ్రి కూడ ఒప్పేసుకొన్నారు."

"వారి తీర్మానమూ, ఒప్పుదలా నన్నేం చేయగలవు? నేను సమ్మతిస్తేనే కద?"

"ఇలా పసిబిడ్డలాగ మాట్లాడుతున్నావేమి? చిన్నరాజుల కుటుంబాలకు చెందిన కన్యలను పెళ్ళి, ఆ అమ్మాయిలను అడిగి చేయడం లోకంలో జరుగుతూందా? అందులోను ముల్లోకాలనేలే చక్రవర్తి ప్రధమ పుత్రులు, - పట్టపు యువరాజు - నిన్ను పెళ్ళిచేసుకోగోరితే, అందుకు ఎవరడ్డు చెప్పగలరు?"

"ఏం? నేనడ్డు చెప్పగలను. యువరాజుకే చెప్పేస్తాను."

"ఏమని చెబుతావు?"

"ఆయనను పెళ్ళి చేసుకోవడం నాకిష్టం లేదని చెబుతాను."

"కారణమడిగితే?"

"నిజమైనా కారణాన్నే చెబుతాను - నా మనస్సు ఆయన స్నేహితుడైన వల్లవరయ్యన్ మీద లగ్నమైందని చెబుతాను..."

"పిచ్చిపిల్లా! ఇది ఆయనకు నీవు చెప్పనేవద్దు! వారికి ఇప్పటికే తెలుసు..."

"తెలిస్తే మరెందుకు నన్ను బలవంతం చేస్తున్నారు? అలా ఎక్కువగా బలవంతం చేస్తే, ఇదిగో నేను కూడ ఒక కత్తిని దాచుకొన్నాను చూడక్కా!" అని చెప్పి మణిమేఖల తన బొడ్లో దోపుకన్న చురకత్తిని తీసి చూపించింది.

"నా ముద్దుల చెల్లెలా! నీ అమాయకత్వాన్ని చూసి నాకు ఒకవైపు ఏడుపొస్తూంది, మరొకవైపు నవ్వొస్తూంది..."

"అలా నేనేం చేశానక్కా?"

"నిన్ను ఎవరో బలవంతం చేయబోతున్నట్లు భావిస్తున్నావు. నీ ఆమోదాన్ని అడుగుతారని అనుకొంటున్నావు. వారలాగేం చేయబోవడం లేదు. నీవు యువరాజును పెళ్ళాడేందుకు అడ్డుగా ఉన్న కారణాన్ని తొలగించేయబోతున్నారు!"

"ఏం చెబుతున్నారక్కా!"

"నీవెవరికి నీ మనస్సునిచ్చావో వారికి అపాయం కలగబోతూందని చెబుతున్నాను."

"అయ్యయ్యో!"

"నీ అన్న ఇప్పటికే తన పాత స్నేహితుడిపైన ద్వేషంగొనివున్నాడు. ఈ మాళిగలో కొన్ని నెలల క్రితం చిన్నరాజులు కొందరు చేరి చేసిన కుట్రాలోచన గురించి యువరాజుకు చెప్పేశాడని అతని మీద కోపం. ఇంకొక కారణం వల్ల పార్థిబేంద్రునికి కూడ నీ మనోహరుని మీద ఎనలేని కోపం..."

"వీరి కోపం వారినేం చేస్తుందక్కా? ఆయన శుద్ధవీరులు కద?"

"శుద్ధవీరులైతేనేమి? ఉన్నట్లుండి పలువురు హంతకులు చుట్టుముడితే నిరాయుధుడైన ఒక వీరుడేం చేయగలడు?"

"అయ్యయ్యో! ఆయనను చంపేస్తారనా అంటున్నారు?"

"చంపరు; ముక్కలు ముక్కలుగా నరికి కుక్కలకు, నక్కలకు ఆహారంగా వేస్తారు..."

"అయ్యో! ఎంత కర్ణకఠోరం!?"

"వినేందుకే కర్ణకఠోరంగా ఉంది కద? నిజంగా జరిగితే ఎంత చిత్రవధ అనుభవిస్తావు నీవు?"

"అక్కా! ఇప్పుడే నా ప్రాణమూ, మనసూ విలవిల్లాడుతున్నాయి. నిజంగా, అలా చేస్తారా? ఆయన యువరాజుకు అతిసన్నిహితమైన స్నేహితులు కద?"

"అతిసన్నిహిత స్నేహితులు క్రూర శత్రువులుగా మారడం గురించి నీవు వినలేదా? నీ అన్న, పార్థిబేంద్రుడు యువరాజుకు అలా ధూపం వేశారు..."

"ఛండాలురు! ఇదంతా మీకు....?"

"ఎలా తెలిసిందనే కద అడుగుతున్నావు? ఈ రోజు ఉదయం నా దగ్గర సెలవు తీసుకొని వెళ్ళే నెపంతో వచ్చాడు..."

"ఆ పాతకుడు ఎక్కడికి వెళుతున్నాడు?"

"చాల దూరం వెళ్ళడం లేదు. తిరుక్కోవలూర్ ముసలాడు మలైయమాన్ ఒక పెద్ద సైన్యాన్ని కూడదీసుకొని ఈ ఊరివైపే వస్తున్నాడని నీవు విన్నావు కద?"

"విన్నాను. విని ఎందుకని ఆశ్చర్యపడ్డాను..."

"అది కూడ నీగురించేనట! ఇవాళ మధ్యాహ్నం యువరాజు ప్రస్తావించారట. 'మణిమేఖలను నాకిచ్చి పెళ్ళిచేయకపోతే ఈ కోటను, అంతఃపురాన్ని నేలమట్టం చేసేస్తాను!' అన్నారట. అప్పుడే నీ అన్న 'అందుకు అడ్డుగా ఉన్నది మేము కాదు, మీ స్నేహితుడు వంతిదేవుడే' అన్నాడట. 'ఆ అడ్డును తొలగించ మీకు చేతకాదా?' అన్నారట యువరాజు. 'ఆజ్ఞాపిస్తే సాధ్యమవుతుంది' అన్నాడట నీ అన్న. నా ప్రియతమ సహోదరీ! పార్థిబేంద్రుని నోరు పెకలించి ఇంకొన్ని వివరాలను సేకరించాను. నీ ప్రేమికునికి ఆపద మూడిందనడం తథ్యం. నీవు వెంటనే నీ ప్రయత్నాలు మొదలుపెట్టకపోతే, పెళ్ళి కాక మునుపే పెనిమిటిని కోల్పోతావు!" అన్నది నందిని.

~

ఇది వినగానే మణిమేఖల ఒడలు, మనసు విలవిల్లాడాయంటే అందులో ఆశ్చర్యం లేదు కద?

"అయ్యో! ఆయన్ని ఎలాగైనా హెచ్చరించాలి కద?" అని తడబడుతూ అన్నది.

"హెచ్చరించవచ్చు. కానీ నీ ప్రేమికుడు శుద్ధ వీరుడని నీవే కద అన్నావు? తన ప్రాణానికి అపాయం అని వినగానే పారిపోతాడా? పోడు! ఇంకా అతని హఠం/మొండిపట్టు అధికమవుతుంది!"

అన్నది నందిని.

"మీరే ఏమైనా ఉపాయం చెప్పాలి. నా తల తిరుగుతూంది..ఏం చేయాలో తోచడం లేదు!" అన్నది మణిమేఖల.

"నీవిక్కడికి వచ్చేముందు ఆ విషయం గురించే ఆలోచిస్తున్నాను. నాకూ ఏమీ తోచడం లేదు. మంచివేళగా నీవొక వార్త తీసుకొని వచ్చావు. అందునుంచి వల్లవరయ్యన్ని కాపాడేందుకు ఒక ఉపాయం తోస్తూంది..."

"నేను తీసుకొని వచ్చిన వార్తనుంచా? అదేమి?"

"పళువేట్టరయ్యర్ వారి పడవ తలకిందులైపోయిందనీ, ఆ తర్వాత ఆయన గురించి ఏమీ సమాచారం తెలియరాలేదని చెప్పావు కద?"

"అవును..."

"వంతిదేవుని నేను బ్రతిమాలుకొంటాను. నా కోసం నా భర్త గురించి తెలుసుకొని వచ్చేందుకు వెళ్ళాలని వేడుకొంటాను. నీవూ నాతోడుగా మాట్లాడు. ఇద్దరు అమ్మాయిలు దీనంగా వేడుకొంటే ఆ వీరుడు నిరాకరించడు. ఆయన్ను వెంటనే ఈ ఊరినుంచి బయటకు పంపేయడమే ఆయన్ను కాపాడేందుకు దారి. ఇంకే ఉపాయమూ లేదు. ఆయన వెళ్ళిన తర్వాత నీవు నీ అన్న దగ్గర, నీ తండ్రి దగ్గర, యువరాజు ముందు ధైర్యంగా నీ మనసులోని మాటను చెప్పవచ్చు. నేనూ నీకోసం మాట్లాడుతాను. ఇష్టం లేని అమ్మాయిని బలవంతం చేయడం చోళకులంలో పుట్టినవారికి ఉచితం కాదు అని చెబుతాను!"

"మీమాట కూడ వారు వినకపోతే, నా చురకత్తి ఉండనే ఉంది!"

"సరే, సరే! మొదట నీ ప్రియుని బయటకు పంపించే ప్రయత్నం చేద్దాం. ఆయన ఉండే చోటు నీకు తెలుసు కద? నీవు ఆయనను ముఖాముఖి చూడడం సాధ్యం కాకపోతే నీ చెలికత్తె చంద్రమతిని పంపించు. లేకపోతే ఇడుంబన్‌కారిని పంపు. ఎలాగైనా ఆయనను ఇక్కడికి రప్పించు."

"ఆయన ఈ చోటు వదిలి వెళ్ళిపోయేందుకు సమ్మతిస్తే ఇక్కడినుంచి ఎలా బయటకు వెళ్ళాలక్కా? నా అన్న అడ్డుపడి ఆపేస్తే..."

"నీ అన్నకు ఎందుకు తెలియాలి? మణిమేఖలా! మొట్టమొదటిసారి ఆయన ఈ గదిలోకి దూరి నిన్ను అదరగొట్టారు కద? ఆ సొరంగమార్గం ద్వారానే పంపించేస్తే సరి. శీఘ్రంగా వెళ్ళు! వంతిదేవులు ఈ కోటలో ఉన్న ఒక్కొక్క క్షణమూ ఆయన ప్రాణానికి అపాయాన్ని అధికం చేస్తుంది. నీ అన్న పురిగొల్పే హంతకులు ఎప్పుడు ఆయనను ముట్టడిస్తారో మనకేం తెలుసు?"

"ఇదిగో వెళుతున్నానక్కా! ఎలాగైనా ఆయనను పిలుచుకొని వస్తాను" అని చెప్పేసి మణిమేఖల వేగంగా తిరిగి వెళ్ళింది.

ఆమె కాలి చప్పుడు మరుగైన వెంటనే పక్కనున్న వేటమంటపం రహస్యద్వారాన్ని ఎవరో

తడుతున్న శబ్దం వినిపించింది.

నందిని రహస్యద్వారం దగ్గరకు వెళ్ళి, దాని లోపలి తలుపును తెరిచింది. చీకటిలో ఒక భయంకరమైన ముఖం కనిపించింది.

"మాంత్రికా! వచ్చేశావా?" అన్నది నందిని.

"వచ్చేశాను, రాణీ! వేళ కూడ వచ్చేసింది!" అన్నాడు రవిదాసు.

~~~
~~~

# అధ్యాయము - 32

## చివరి ఘట్టం

**నందిని** తిరిగి వెళ్ళి తన గదిలోకి వచ్చే ద్వారానికి తాళం పెట్టి వచ్చింది. తర్వాత చేత దీపంతో వేటమంటపం రహస్యద్వారాన్ని తెరుచుకొని లోపలికి వెళ్ళింది.

మాంత్రికుడు రవిదాసు మామూలుగానే ఘోరమైన ముఖంగలవాడు. తల మీద, ముఖం మీద కొత్తగా ఏర్పడిన గాయాలతో ఇంకా ఘోరంగా కనిపిస్తున్నాడిప్పుడు.

నందిని అది గమనించి, "మంత్రవాదీ! ఇదేమిటి నీ ఒళ్ళంతా ఈ కొత్త గాయాలు?" అని అడిగింది.

"రాణీ! ఇందు గురించి మీకాశ్చర్యమేల? మీలాగ మేము షడ్రసోపేతంగా భోంచేసి పట్టుపానుపు మీద సుకుమారంగా కాలం గడుపుతున్నామనుకొంటున్నారా? నేను, పరమేశ్వరుడు ఈరోజు బతికి బయటపడిందే ఒక అద్భుతం. చచ్చిపోయిన పాండ్య చక్రవర్తి ఆత్మే మమ్మల్ని ఈరోజు కాపాడింది..."

"లేదు, రవిదాసూ, లేదు! ఆయన ఆత్మ సదా నాతోనే ఉంటూంది. ఒక ఘడియ ముందు కూడ నా ముందు కనిపించి, 'శపథాన్ని నెరవేర్చబోతున్నావా, లేదా?' అని అడిగింది..."

"రాణీ! దానికి మీరేం బదులు చెప్పారు?"

"శపథాన్ని ఈరోజు నెరవేరుస్తాను. లేకపోతే ప్రాణత్యాగం చేస్తానని చెప్పాను."

"అలాగైతే మేము పడి లేచి పరుగెత్తి వచ్చింది మంచిదైంది. ఇన్నాళ్ళ తర్వాత, ఇప్పుడు మీరు ప్రాణత్యాగం చేస్తే అందువల్ల ఎవరికేం లాభం? చేబట్టిన కార్యాన్ని కద ముగించాలి? మీరు వల్ల కాదంటే...."

"కాదని ఎవరన్నారు? శపథాన్ని నెరవేరుస్తాను; అ తర్వాత నా ప్రాణాలను విడుస్తాను..."

"వద్దు, వద్దు! శపథం నెరవేర్చిన తర్వాత మీరు చేయదగిన, చేయవలసిన కార్యాలు చాల ఉన్నాయి. మదురైలో వీరపాండ్యుని కుమారునికి లోకమెరుగ పట్టాభిషేక చేయాలి..."

"అదంతా మీరు చూసుకోండి. ఈ రాత్రి నా పని ముగిసిపోతుంది. నా జీవితమూ ముగిసిపోతుంది..."

"రాణీ! పళువేట్టరయ్యర్ బొక్కసంలో ఉన్న ధనాన్నంతా మలైనాడుకు చేరవేయాలి. అందుకు మీ సహాయం కావలసివుంది....!"

"శపథం నెరవేర్చిన తర్వాత కూడ నా భర్తను మోసగిస్తూ బతకమంటావా, మంత్రవాదీ?"

"అమ్మణీ! తమ భర్త ఎవరు?"

"లోకమెరుగ నన్ను వివాహమాడి, దేశ ప్రజల పరిహాసాలను లెక్కచేయక, నా ఒక్కొక్క

శపథాన్ని నెరవేరుస్తూ వస్తున్న ఉత్తముల గురించే చెబుతున్నాను..."

"రాణీ! పళువేట్టరయ్యర్ మీ పతి కాడు. ప్రతి రాత్రీ వీర పాండ్య చక్రవర్తి నా కలలో వచ్చి తమను ఆయన పట్టమహిషిగా చేయాలని ఆజ్ఞాపిస్తున్నారు..."

"మంత్రవాదీ! ఆయన మాట వద్దు. ఈ గాయాలన్నీ ఎలా తగిలాయని చెప్పలేదేం?"

"నిన్న రాత్రి కొళ్ళిడం నదీతీరాన ఉన్న అడవిలో ఒక ముసలి పులి అటకాయించింది. ముసలిపులైనా, పళ్ళూ, గోళ్ళూ చాల పదునుగా ఉన్నాయి...."

"ఎలా తప్పించుకొన్నారు?"

"పాండ్య కుమారునికి పట్టాభిషేకం చేశాం కద? ఆ పళ్ళిప్పడై గోపురంలో ఒక విరిగిన భాగాన్ని ఆ ముసలి పులి మీదికి తోసేసి తప్పించుకొన్నాం...."

"అయ్యో, పాపం! ముసలి పులిని కూడ మీరు ఎదురుగా నిలబడి పోరాడలేకపోయారు....!"

"అవును, రాణీ! ఒప్పుకొంటున్నాము. అలా ఉన్నప్పుడు వయసు పులైన ఆదిత్య కరికాలన్ని ఎలా ఎదిరించడం? అందుకే (కు)తంత్రమంత్రాలను ఉపయోగించవలసి వస్తూంది. దేవీ! ఈ రాత్రి తప్పిపోతే, మనకిలాంటి సదవకాశం మనకు దొరకదు. సుందర చోళుని గురించి, అరుళ్మొళి వర్మ గురించి వార్త వచ్చేస్తే ఆ తర్వాత ఆదిత్య కరికాలన్ మనకు దొరకడు..." అన్నాడు రవిదాసు.

"రవిదాసా! వారి గురించి ఏదైనా రూఢిగా వార్త తెలిసిందా?" అని అడిగింది నందిని.

"ఇంతసేపటికి వారి ఆయువు తీరివుంటుంది. సందేహం లేదు...."

"నీవూ, దేవరాళన్ లంకకు వెళ్ళినప్పుడు ఇలాగే చెప్పి వెళ్ళారు."

"అక్కడ ఆ పిచ్చి మూగది నిర్విరామంగా మమ్మల్ని వెన్నంటి వచ్చి, మాకు చాల ఇబ్బంది కలిగించింది. అందుకే సాధ్యం కాలేదు...."

"వాణర్ కులవీరుడు కడలిలో మునిగి చనిపోయాడన్నారు. అతడు కూడ తప్పించుకొని బతికి బయటపడి వచ్చేశాడు...."

"పళ్ళిప్పడై అడవిలో వాడి పని ముగించేసే సందర్భం దొరికింది. మీరు అడ్డుపడ్డారు...!"

"అందుకొక ముఖ్యమైన కారణముందని చెప్పాను...."

"అదేం ముఖ్యమైన కారణమో తెలియదు. వాడిక్కడికి వచ్చి ఆదిత్య కరికాలన్‌కి ఇనుప కవచంలా కాపలా కాస్తున్నాడు."

"అందు గురించి నీవు కించిత్తూ దిగులుపడవద్దు."

"దిగులుపడే తీరాలి. ఈ రోజు కాకపోతే ఎన్నటికీ అసాధ్యం. దేవీ! ఏం ఏర్పాటు చేశారు? మేమేం చేయాలి?"

"ఈ సమయాన మీరెవ్వరూ ఇక్కడికి రాకుంటే నాకు చాల పెద్ద సహాయం చేసినవారవుతారు."

"అది ఏనాడూ వీలుకాని పని!"

"నామీద మీకంత మాత్రం నమ్మకం లేదు..."

"నమ్మకం ఉండడం వల్లనే వచ్చాము. శపథం తీర్చిన తర్వాత మిమ్మల్ని భద్రంగా/క్షేమంగా ఇక్కడినుంచి తరలించేందుకే వచ్చాము. ఎదురు చూడని ఆటంకం ఏదైనా కలిగితే దానికి కూడ సిద్ధంగా ఉంటాము. ఏ నిమిషమైన మీరు మమ్మల్ని సహాయానికి పిలవచ్చు."

"నేను వేసిన పథకంలో ఎలాంటి ఆటంకమూ కలగదు. శపథం తీర్చిన తర్వాత నేను ప్రాణాలతో ఉండేందుకు కూడ ఇష్టపడడం లేదు."

"కూడనే కూడదు! మీరు మాతో వచ్చే తీరాలి. లేకపోతే..."

"మంత్రవాదీ! శపథం నెరవేర్చిన తర్వాత నేను ఒక్క నిమిషం కూడ పళువేట్టరయ్యర్ ఇంట ఉండను."

"అలాగైతే మీరు మాతో వచ్చేయండి!"

"నన్నెలా పిలుచుకొని వెళతారు?"

"ఈ సొరంగమార్గం చివర అయ్యనార్ కోవెల ఉంది. దాని సమీపాన పళువూర్ రాణి పల్లకిని సిద్ధంగా ఉంచాము. ఇడుంబన్‌కారి దాన్ని మరమ్మత్తు చేయించాలని పొద్దునే దాన్ని బయటకు తీసుకొచ్చేశాడు. వీరపాండ్యుని తలను తెగకోసినవాడి మీద పగ తీర్చిన దేవిని మేమే పల్లకిలో ఉంచి మోసుకొని వెళతాము. పొద్దు పొడిచేలోపు కొల్లిమలైకి (మలై=కొండ) వెళ్ళి చేరిపోతాము."

"మీరెంతమంది ఇక్కడున్నారు?"

"ఇక్కడ నలుగురున్నాము!" అని చెప్పి రవిదాసు చేతులను మెత్తగా చరిచాడు.

~

ఆ మంటపంలో ఉన్న భయంకరమైన మృగాల మృతదేహాల వెనుక దాక్కొన్నవారు కాస్త బయటకు వచ్చారు.

"పరమేశ్వరన్ ఎక్కడ?" అని అడిగింది నందిని.

"వాడిని బయటే నిలబెట్టాము. అయ్యనార్ కోవెలలో ఒక కాళాముఖుడు నిష్ఠలో ఉన్నాడు. వాడిని అక్కడినుంచి అవతలికి వెళ్ళగొట్టడం చాల కష్టమైంది. వాడు మళ్ళీ వస్తే చూసుకోమని దేవరాళన్ని కోవెల వాకిట నిలబెట్టి వచ్చాను..."

"కాళాముఖుని గురించి మనకేం దిగులు? మంత్రవాదీ! పెద్ద పళువేట్టరయ్యర్ గురించి సమాచారమేమైనా తెలిసిందా?" అని అడిగింది నందిని.

రవిదాసు అదిరిపడి, "ఏం సమాచారం?" అన్నాడు.

"ఆయన తంజావూరు ప్రయాణమై వెళ్ళారు కదా? దారిలో కొళ్ళిడాన్ని పడవలో

దాటుతున్నప్పుడు సుడిగాలి వీచి పడవ మునిగిపోయిందట. పళువేట్టరయ్యర్ గట్టెక్కలేదని, నీట మునిగిపోయారని శంబువరయ్యర్‌కి ఈ రోజు సాయంత్రం వార్త అందిందట!"

"దైవమా! ఆయనకా గతా పట్టింది? ఇంతసేపు మీరు ఈ ముఖ్యమైన విషయాన్ని చెప్పనే లేదే?"

"అది నేను నమ్మడం లేదు, మంత్రవాదీ! పెద్ద పళువేట్టరయ్యర్ కొళ్ళిడంలో మునిగి చనిపోయివుంటారని నేను నమ్మడం లేదు."

"నాకూ ఆ వార్త మీద నమ్మకం లేదు, రాణీ!"

"ఆయన కొళ్ళిడపు ఇవతలి తీరానికి ఈదుకొని వచ్చివుంటే ఏం చేయడం? ఒకవేళ ఈ రాత్రి ఇక్కడకు వచ్చేస్తే...? దాని గురించే నేను కాస్త దిగులుపడుతున్నాను..."

"రాణీ! దాని గురించి మీకు దిగులు వద్దు. నాకిప్పుడే జ్ఞాపకం వస్తూంది. కొళ్ళిడపు అటువైపు తీరాన తంజావూరు బాటలో ఆజానుబాహువైన ఒక మనిషిని చూశాను నిన్న రాత్రి. ఆభరణాలు, రాజలాంఛనాలు, రాజ వస్త్రాలు ఏవీ ఆయన ధరించిలేdu. చీకటిగా ఉన్నందువల్ల గుర్తు తెలియలేదు. ఇప్పుడాలోచిస్తే, ఆ బాటసారి ఒకవేళ పెద్ద పళువేట్టరయ్యరేమో అని తోస్తూంది."

"అలాగైతే ఖచ్చితంగా ఈరోజు రాత్రి ఆయనిక్కడికి రారు కద?"

"రానే రారు! దాని గురించి మీరు ధైర్యంగా ఉండవచ్చు. ఇప్పుడు మాకేం ఆజ్ఞ విధిస్తున్నారు?"

"మంత్రవాదీ! మీరిక్కడే ఓపిగ్గా వేచివుండాలి. నాగదిలో ఏమేమో జరుగుతున్నట్లున్నా కూడ, ఎంతో మంది మాట్లాడుతున్నట్లు వినిపించినా కూడ తొందరపడి లోపలికి రాకండి. వస్తే కార్యం చెడిపోతుంది. నేను సూచన ఇచ్చిన తర్వాత వచ్చి చేరండి."

"రాణీ! మీరెలా సూచన ఇస్తారు?"

"మంత్రవాదీ! నేను గలగలమని నవ్వి చాల ఏళ్ళయిందని తెలుసు కద? నేను నవ్వడం నీవు వినే ఉండవు!"

"దేవీ! ఒకే ఒక్కసారి ఆ దుష్ట యువకుడు వంతిదేవునితో మాట్లాడుతున్నప్పుడు మీరు నవ్వగా విన్నాను..."

"ఆహా! అది కూడ జ్ఞాపకముంచుకొన్నావా? మంచిది! ఈరోజు నేను గలగలమని పెద్దగా నవ్వడం వినిపిస్తే మీరు రహస్య ద్వారాన్ని తెరుచుకొని లోపలకు రండి. కార్యం ముగిసిందనడానికి అది సూచన. ఇప్పుడు కూడ నేను వంతిదేవుని చూసి నవ్వితే ఆశ్చర్యపోకండి."

"దేవీ! తమ ఉద్దేశం ఏమని ఒకింత అర్థమవుతూందిప్పుడు..."

"కాస్త ఓపిక పడితే అంతా విశదంగా అర్థమవుతుంది. ఎదురుచూడని ఆటంకం ఏదైనా కలిగితే, నా ఏడుపు గొంతు వినిపిస్తుంది. అప్పుడు వెంటనే వచ్చి చేరండి."

“అలాగే చేస్తాం, రాణీ! కానీ తమ ఏడుపు గొంతును మేము వినగోరడం లేదు. నవ్వే గొంతే వినాలని కోరుకొంటున్నాము!” అన్నాడు రవిదాసు.

~~~
~~~

# అధ్యాయము - 33

## "అయ్యో! పిశాచి!"

**అదే** సమయాన వంతిదేవుడు చాల దిగులుతో కడంబూర్ మాళిగ నందనవనంలో పచార్లు చేస్తున్నాడు. ఆ నందనవనం మాళిగ బయటి ప్రాకారపు గోడ పక్కనుంది. రాత్రి పూచే పూలు అప్పుడప్పుడే వికసిస్తున్నాయి. పన్నీరు, పారిజాతం, మల్లె, జాజి మల్లి మొదలైన పూల సువాసనలను ఆశ్వయుజమాసపు మలయమారుతం అతనివైపు వీచసాగింది. "ఆహా! ఈ సమయాన మనం పళైయార్రై నందనవనంలో ఉండకూడదా? అప్పుడు ఉన్నట్లుండి కుందవైదేవి కాలి గజ్జెలు శబ్దం చేయకూడదా?" అని అతని మనసు ఊహలల్లింది. "ఇక్కడికొచ్చి ఈ కడంబూర్ మాళిగలో చిక్కుకొన్నాం కదా? వెర్రి పట్టిన యువరాజు వద్ద చిక్కుబడి ఏం చేయాలో తోచక అవస్థపడుతున్నాం కదా?" అని వాపోయాడు. ఆదిత్య కరికాలన్ ఎన్నడూ లేనట్లు అతడి మీద విరుచుకు పడ్డాడు. "ఇక ఈ రోజు నాకు నీ ముఖం చూపించకు! రేపు పొద్దు పొడవగానే నీ గురించి నా తీర్మానం చెబుతాను!" అన్న యువరాజు మాటలు అతడి మనసును చాల గాయపరిచాయి. ఏనాడూ లేనట్లు ఆయనీరోజు కోపగించుకొన్నారు! పాపం! ఆయనను తప్పుబట్టి ఏం ప్రయోజనం? ఆయన మనసలా కల్లోలితమైవుంది. ఆయన పరిస్థితిని గురించి ఆలోచించినప్పుడు ఆయన మీద జాలి కలిగింది వంతిదేవునికి.

~

ఈ రోజు యువరాజు ఉన్మత్తం ఉఛ్ఛస్థితినే చేరుకొందని చెప్పాలి. ఉత్సాహం, నీరసం, కోపం, కుతూహలం, స్నేహభావం, క్రూరమైన పగ ఆయనను ఒకదాని తర్వాత ఇంకొకటి పట్టి పీడించాయి. అంతేగాక ఆయన చుట్టూ ఉన్నవారిని కూడ అదే విధంగా ఒక ఆట ఆడించేశారు. మరు నిమిషం ఆయన పోకడ ఎలా ఉంటుందో, ఏం చేస్తారో అని దగ్గరున్నవారు గాభరా పడుతూ కూర్చొన్నారు.

ఆరోజు ఉదయం నుంచి వస్తున్న వార్తలు ఆయన ఉన్మత్తాన్ని అధికం చేశాయి.

మొట్టమొదట శంబువరయ్యర్ ఆయన దగ్గరికొచ్చి తిరుక్కోవలూర్ మలైయమాన్ ఒక పెద్ద సైన్యాన్ని తరలించుకొని వస్తున్నారని తెలియజేశారు. అందుకు తమ ఆక్షేపణను/అభ్యంతరాన్ని కూడ తెలియజేశారు.

"మలైయమాన్ పండు ముసలి; వయసు ఎనభై పైనే. ఆయన రావడం గురించి మీకేం భయం?" అన్నారు యువరాజు.

"అయ్యా! కొల్లిమలై వల్విల్ ఓరి వంశపరంపరలో వచ్చినవారం మేము. భయమంటే ఏమని తెలియని వాళ్ళం. మీరిక్కడికి విజయం చేసివున్న విషయాన్ని దృష్టిలో ఉంచుకొనే జంకుతున్నాను. మీరు

గనక అనుపతిస్తే..."

"ముసలాయనతో పోరుకు దిగేందుకు వెంటనే ఆయత్తమైనారు. అంతే కద? శంబువరయ్యరే! నా తాతను దండెత్తి రమ్మని నేనే సందేశం పంపాను!"

"ఎందుకని, యువరాజా?"

"నేనిక్కడ ఒంటరిగా చిక్కుపడ్డాను కద? ఇక్కడున్నప్పుడు నాకేమైనా అయితే..."

"యువరాజా! అటువంటి సందేహం మీ మనసులో ఇసుమంతైన ఉంటే, ఈ క్షణమే..."

"ఈ క్షణమే నన్ను ఇక్కడినుంచి బయలుదేరి వెళ్ళిపొమ్మంటారు కాబోలు!"

"అయ్యా! ఇది తమ రాజ్యం; ఇది తమ మాళిగ, అంతఃపురం. దీని శిఖరాన పులి జెండా ఎగురుతూంది. ఇక్కడినుంచి వెళ్ళమనేందుకు నేనెవరిని? మీరు అనుమతిస్తే, నేను, నా కుటుంబీకులు ఇక్కడినుంచి వెళ్ళిపోతాము. మలైయమాన్ని పిలిపించుకొని ఇక్కడ నిర్భయంగా ఉండవచ్చు..."

"ఓహో! వల్‌విల్ ఓరి వంశంలో పుట్టిన మీరు భయమెరుగని వారని, విజయాలయ చోళుని వంశంలో పుట్టిన నేను బెదురుగొట్టని అంటున్నారా?"

"యువరాజు వజ్రహృదయమూ, వీర, ధీర శూరత్వాలు లోకవిదితం. పన్నెండో ఏటనే శేవూర్ పోరులో దూసుకొని వెళ్ళి శత్రువులను ఛిన్నాభిన్నం చేసి వీరాధివీరుడన్న బిరుదు పొందారు. మళ్ళీ పద్దెనిమిదో ఏట వీరపాండ్యుని వెన్నంటి తరుముకొని వెళ్ళి, వాడు దాక్కొన్న చోటు కనిపెట్టి, వాడి శిరస్సును ఖండించి తెచ్చారు..."

ఇది విన్న ఆదిత్య కరికాలన్, "తెలుసయ్యా, తెలుసు. పారిపోయిన వాడిని తరుముకొని వెళ్ళిన వీరపులిని నేనని, చచ్చిన వీరపాండ్యుని తలను తెగగొట్టి తీసుకొని వచ్చినవాడని మీరందరూ నన్ను పరిహసించి మాట్లాడడం నాకు తెలుసు. ఆ పళువూర్ మాయ మోహినీపిశాచి అటువంటి వదంతులను పుట్టించిందని కూడ తెలుసు!" అనేసి భయంకరంగా నవ్వాడు.

శంబువరయ్యర్‌కి ఎందుకీ పిచ్చిపట్టిన యువరాజుతో మాటల్లోకి దిగారా బాబోయ్ అనిపించింది.

"యువరాజా! నేనేం చెప్పినా తప్పయిపోతూంది. మీకుచితమని తోచిన రీతిగా చేయండి. నేను వెళ్ళివస్తాను" అన్నారు శంబువరయ్యర్.

"వెళ్ళి రావడం సరే; ఈ కోటను విడిచివెళ్ళే ఉద్దేశాన్ని మాత్రం విడిచిపెట్టేయండి. ఈ అంతఃపురంలో నాలుగు నెలల క్రితం జరిగిన కుట్రాలోచన గురించిన నిజాన్ని తెలుసుకోకుండ నేను కూడ ఈ చోటు వదిలి వెళ్ళను; మిమ్మల్ని వెళ్ళనివ్వను కూడ!" అన్నాడు ఆదిత్య కరికాలన్.

శంబువరయ్యర్ పెదవులు వణికాయి. ఒళ్ళు వణికింది. ఆయన కళ్ళలో నీళ్ళుబికాయి.

~

ఈ పరిస్థితిని పక్కనేవున్న పార్థిబేంద్రుడు గమనించాడు.

"యువరాజా! చోళవంశస్థులు వీరత్వానికి పేరుగాంచినట్లే న్యాయానికి పేరుగాంచినవారు. ఈ పెద్దాయనకు మీరు న్యాయం చేయలేదు. మీ మాటలవల్ల ఆయన మనసు చాల గాయపడింది. ఇక్కడ జరిగిన చిన్నరాజుల సమావేశం గురించి ఇంతకు మునుపే తగిన సమాధానం చెప్పారు; మీరు ఒప్పుకొన్నారు. మీరు రాజ్యం వద్దని చెప్పడం వల్లను, తంజావూరుకు వెళ్ళేందుకే నిరాకరించడం వల్లను చిన్నరాజులు చోళరాజ్యం మేలు ఎంచి తదుపరిగా పట్టానికెవరు రావాలని ఆలోచించారు. మీరు రాజ్యభారాన్ని వహించేందుకు సమ్మతిస్తే, వారెందుకు ఇతరమైన ఆలోచనలు చేయాలి? వీరాధివీరుడని దేశమంతటా పేరుగాంచిన ఆదిత్య కరికాలన్ ఉన్నప్పుడు, యుద్ధరంగాన్నే చూసెరుగని మధురాంతకుని గురించి వీరు కలలోనైనా తలుస్తారా?"

ఆదిత్య కరికాలన్ అడ్డుపడి, "అవునవును! నేను ప్రాణాలతో ఉన్నపుడు ఇంకెవరూ చోళసింహాసనాన్ని అధిష్టించడం సాధ్యం కాదు. అందుకే నన్ను ముగించేయాలని చూస్తున్నారు!" అని చెప్పేసి హహ్హాహ్హా అని పెద్దగా నవ్వాడు.

"పార్థిబేంద్రా! నీవు కూడ వీరి పక్షాన చేరావని నేను గ్రహించలేదనుకొన్నావా? మనం ఆ రోజు వేటకు వెళ్ళినప్పుడు నీవు, గందమారన్ నా వెనకే వస్తూ శూలాన్ని నా మీదికే గురి పెట్టిన విషయం నాకు తెలియదనుకొన్నావా? నా నిజమైన స్నేహితుడైన వంతిదేవుడు కాకతాళీయంగా ఇక్కడికి వచ్చి చేరకపోయివుంటే, ఇప్పటికి నన్ను యమలోకానికి పంపించివుండరా?" అన్నారు యువరాజు.

పార్థిబేంద్రుడు కళ్ళతోనే వంతిదేవుని ఒక్క చూపు చూసేసి, "అయ్యా! ఈ పాతకుడు ఏవేవో చెప్పి మీ మనసును చెడగొట్టేశాడు. తమకు మనసులోనైనా ద్రోహం చేసే ఉద్దేశంగొన్నానని వీడు నిరూపిస్తే, ఈ క్షణమే..." అని చెప్పి ఆగాడు.

"పార్థిబేంద్రా! నీవు మనసులో ఎంచిన ద్రోహాన్ని ఎవరు నిరూపించగలరు? నేనడిగే ప్రశ్నకు సమాధానం చెప్పు! నీవు, గందమారన్ పళువూర్ రాణి మాటలకు మతి పోగొట్టుకొనే కద నన్ను ఇక్కడికి రప్పించేందుకు భగీరథ ప్రయత్నం చేశారు? అది నిజం కాదని నీవు ఖండించగలవా?"

"దాన్ని ఖండించడం లేదు, యువరాజా! ఆ అవసరం కూడ లేదు. పళువూర్ రాణి మంచి ఉద్దేశంతోనే ఈ కార్యానికి పూనుకొన్నారని నేను ఘంటాపథంగా చెప్పగలను. మిమ్మల్ని ఇక్కడికి రప్పించి, గందమారన్ సహోదరిని మీకిచ్చి పెళ్ళి చేయించి చోళనాడులో ఎలాంటి అంతఃకలహం రాకుండ చేయడమే వారి ఉద్దేశం. తమ శిరస్సుమీద చోళసామ్రాజ్య మణిమకుటాన్ని చూడడం కన్న మాకందరికి ఎక్కువ సంతోషాన్ని ఇవ్వగలిగిన విషయమింకేదీ లేదు. నామీదెవరైనా నింద మోపితే సహిస్తాను; పళువూర్ రాణి మీద నింద మోపితే వాడిని ఈ క్షణమే ఈ కత్తికి ఎర చేస్తాను!" అని పార్థిబేంద్రుడు వంతిదేవుని చూస్తూ చెప్పి, అదే సమయాన ఒర నుంచి కత్తిదూశాడు.

“ఆహా! నా వీర మిత్రమా! కత్తిని ఒరలో ఉంచు! మంచి తరుణం వచ్చినప్పుడు చెబుతాను. అప్పుడు దాన్ని బయటకు తీయవచ్చు. వంతిదేవుడు పఙువూర్ రాణి మీద ఏ నిందా మోపలేదు. మీలాగ మతిపోగొట్టుకొని నిలబడివున్నాడు. నిజానికి, పళువూర్ రాణి నా సహోదరి అని సత్యప్రమాణం చేస్తున్నాడు. దాన్ని నాకు చెప్పేందుకే పరుగెత్తి వచ్చాడు. నీమీద అతడింకొక నింద మోపుతున్నాడు. నా సహోదరుని లంకనుంచి తీసుకొని వస్తూ కడలిలో తోసి ముంచేశావని చెబుతున్నాడు కద? అందుకు నీ బదులేమి?” అన్నాడు ఆదిత్య కరికాలన్.

ఆ సమయాన, “దానికి నేనుత్తరమిస్తాను!” అని చెబుతూనే గందమారన్ అక్కడికొచ్చాడు.

“యువరాజా! చాల సంతోషకరమైన వార్త తీసుకొని వచ్చాను. చిన్న యువరాజు కడలిలో మునిగి మరణించలేదు. పొన్నియిన్ సెల్వన్ ఇన్నిరోజులూ నాగపట్టణపు చూడామణి విహారంలో అజ్ఞాతంగా ఉంటూ వచ్చారు. సుడిగాలి వీచి కడలి పొంగి నాగపట్టణం లోపలికి దూసుకొని వచ్చినప్పుడు ఆయన బయటపడవలసి వచ్చిందట. లక్షల కొద్ది ప్రజలు ఆయనతో ఇప్పుడు తంజావూరు వైపుగా వెళుతున్నారట!” అని గందమారన్ కుతూహలంతో చెప్పాడు.

~

ఇది విన్న కరికాలన్ చాల సంతోషపడుతారని ఎదురుచూసిన గందమారన్ నిరాశపడవలసి వచ్చింది. కరికాలన్ క్రోధం అప్పుడు ఇంకొకవైపు మళ్ళింది.

“ఏమేమి? అరుళ్మొళి తంజావూరు వైపు వెళుతున్నాడా? లక్షలకొద్ది ప్రజలు వెంటరాగా తంజావూరుకు వెళుతున్నాడా? ఎందుకని? వల్లవరయ్యా! నీవేం చెప్పావు? ఇప్పుడు జరుగుతున్నదేమి? నా అభిప్రాయం తెలుసుకొనేవరకు నాగపట్టణంలోనే ఉంటాడన్నావు కద? ఇప్పుడెందుకు తంజావూరుకు వెళుతున్నాడు?”

వంతిదేవుడు, “యువరాకుమారి కుందవైదేవి నాకు అలాగే చెప్పారు. తర్వాత ఏం జరిగిందో, ఎందుకాయన నిర్ణయం మారిందో తెలియడం లేదు. కావాలంటే నేను వెళ్ళి...”

“ఆహా! నీవు కూడ వెళ్ళిపోతానంటున్నావు కద! అందరూ నాకు విరోధులైపోయారిప్పుడు. మీ పన్నాగమంతా నాకు తెలుస్తోంది. అరుళ్మొళి ఎందుకు తంజావూరువైపు వెళుతున్నాడని తెలుసు. అది ఆ కొడుంబాళూర్ పెద్ద వేళార్ కుట్ర. అతడి తమ్ముడి కూతురిని నా సహోదరునికి అంటగట్టి వారిని చోళసింహాసనమెక్కించాలన్నదే అది. అదే ఆ ముసలాడి కోరిక/ఆశ. కొడుంబాళూర్ పెద్ద వేళార్ కూడ దక్షిణసైన్యాన్ని తరలించుకొని తంజావూరువైపు వస్తున్నాడని విన్నాను. నా సహోదరి కుందవై కూడ ఈ కుట్రలో భాగస్వామే. అవును. నీవు కూడ...”

వంతిదేవుడు, “యువరాజా! క్షమించండి! పొన్నియిన్ సెల్వన్‌కి గాని, యువరాకుమారికి గాని అటువంటి ఉద్దేశం కించిత్తు కూడ లేదు. ఇది సత్యం. నేను కావాలంటే వెళ్ళి నిజం తెలుసుకొని వస్తాను!”

అన్నాడు.

"అవును! నీవు కూడ వెళ్ళి వారి కుట్రలో చేరిపోతానంటున్నావు! గందమారా! వీడిని వెంటనే బంధించి ఈ మాళిగలో ఏదైనా పాతాళ చెరసాల ఉంటే దాంట్లో పడేయ్!" అనగానే గందమారన్ కుతూహలంతో వంతిదేవుని సమీపించాడు.

వెంటనే కరికాలన్ తన ఆజ్ఞను మార్చేసి, "వద్దు, వద్దు! చోళవంశస్థులు నీతి తప్పనివారు. నేరం నిరూపించబడేవరకు శిక్షించరు. వల్లవరయ్యా! ఇక ఈ రోజంతా నాకు ముఖం చూపించకు! అదే నీకు శిక్ష! నిన్ను తంజావూరుకు పంపుతానా, లేక చెరసాలకు పంపుతానా అన్న విషయం రేపు చెబుతాను! పో! పో! ఇక ఒక్క క్షణం కూడ ఇక్కడ నిలబడకు!" అన్నాడు.

~

తర్వాత ఆరోజు ఉత్తరోదయాన యువరాజు ఆజ్ఞమేరకు శంబువరయ్యర్, పార్థిబేంద్రుడు తిరుక్కోవలూర్ ముసలాయనకు ఎదురేగి స్వాగతించేందుకు వెళ్ళారని వంతిదేవుడు తెలుసుకొన్నాడు.

యువరాజు, గందమారన్ చాలసేపు ఏకాంతంగా మాట్లాడుకొన్నారని కూడ తెలుసుకొన్నాడు.

ఈ సంభవాలన్నీ వంతిదేవునికి చాల మనఃక్షోభను కలిగించాయి. మరునాడు యువరాజు ఏం ఆజ్ఞ వేస్తారు? తంజావూరుకు వెళ్ళమని ఆజ్ఞాపిస్తారా? దారిలో పళైయారైకి కూడ వెళ్ళమని చెబుతారా? అలా ఆజ్ఞాపిస్తే ఎంత బాగుంటుంది? ఈ కడంబూర్ మాళిగ జీవితం అతడికి నచ్చనే లేదు. ఇక్కడ ఎవరూ ఉత్సాహంగా ఉండడం లేదు. అందరూ ఎప్పుడూ ఏదో పోగొట్టుకొన్నవారిలాగ అగుపిస్తున్నారు. సూర్యుడస్తమించిన తర్వాత ఈ మాళిగ మనుషులు నివసించే మాళిగలాగ అనిపించడం లేదు. దెయ్యాలు, భూతాలు నివసిస్తున్న పాడుబడ్డ మాళిగలాగ తోస్తూంది. ఇక్కడినుంచి ఎప్పుడు, ఎలా బయటపడబోతున్నాం...?

ఇలా వంతిదేవుడు ఆలోచిస్తున్నప్పుడు ఒక అమ్మాయి "అయ్యో! పిశాచి!" అని అరవడం అతని చెవిన పడింది.

~~~
~~~

# అధ్యాయము - 34

## "వెళ్ళి పొండి!"

"**అయ్యో**! పిశాచి!" అన్న భీతిగొన్న ఆర్తనాదం వినిపించిన దిశగా పరుగెత్తాడు వంతిదేవుడు. పరుగెడుతున్నప్పుడే అతని మనసులో, "ఇది మణిమేఖల గొంతు కద? ఈ సమయాన ఆమె ఇక్కడికెందుకొచ్చింది? దేన్ని చూసి ఇలా అరుస్తోంది? పిశాచమన్నది లేదు. మరింకేమై ఉంటుంది? గొంతులో నిజమైన భయం ధ్వనిస్తూంది కద? మనం అక్కడికి వెళ్ళకపోతే ఆమెకేమైన అపాయం కలుగుతుందా? ఆమె అన్నేమో మనని నమిలి మింగేయాలని చూస్తున్నాడు. ఆదిత్య కరికాలన్‌గారికేమో పిచ్చి పట్టినట్లుంది. పళువూర్ రాణి మనసులో ఏం వంచన ఉందో తెలియడం లేదు...!" అన్న ఆలోచనలు అతివేగంగా తోచి మరుగైనాయి. ఇలా మనసు కలతబారడంతో అతని అప్రమత్తత సడలింది. ఉన్నట్లుండి ఒక పన్నీరు చెట్టు వేరు కాలికి తగిలి కిందపడ్డాడు. పైబట్ట పక్కనున్న పూపొదకు చిక్కుకొంది. కిందపడ్డవాడు మెల్లగా లేచి కూర్చొని అంగవస్త్రాన్ని మెల్లగా పొదనుంచి విడిపించి తీసుకోవడానికి ప్రయత్నించాడు. ఎందరో శత్రువులు, కుట్రదారులు చేయలేని పని ఈ చిన్న చెట్టు చేసేసింది కద, మనని కింద పడేసింది కద? ఇదేమైన అపశకునమా, లేక ఈ చెట్టు మనని ఆపదకు గురి కాకుండ అడ్డుపడి కాపాడేందుకు ప్రయత్నిస్తూందా అని తలచి వంతిదేవుడు తనలో తానే నవ్వుకొన్నాడు.

ఆ సమయాన, "అమ్మా! అమ్మా! ఎక్కడున్నారు?" అన్న గొంతు వినిపించింది. అది చంద్రమతి గొంతు.

"ఇక్కడే ఉన్నానే! కలువ కొలను దగ్గరున్నాను. త్వరగా రా!" అన్నది మణిమేఖల గొంతు.

కాలి చప్పుళ్ళు వినిపించాయి. కాలిగజ్జెల ఇంపైన శబ్దం కూడ వినిపించింది.

కలువకొలనని మణిమేఖల చెప్పింది ఆ పూదోట మధ్యనున్న గుట్టపక్కగా ఉన్న చిన్న పాలరాతి తటాకాన్నే. ఆ కొలను కలువపూవు ఆకారంలో నిర్మించబడివుంది. దాంట్లో కొన్ని కలువ కాడలు, తామర కాడలు ఉన్నాయి. ఈ కొలన్ని వంతిదేవుడు ఇంతకు మునుపే చూసివున్నాడు. దాని సమీపానే తాను కింద పడివుండాలి! మంచివేళ, ఆ అమ్మాయిలిద్దరూ అతన్ని చూడలేదు. పగటివేళైతే వారు అతడు కింద పడ్డం చూసి గలగలమని నవ్వి అతన్ని సిగ్గుపడేలా చేసేవారేమో. ఇప్పుడు మణిమేఖలకు చంద్రమతి తోడు వచ్చినందువల్ల, వారికి తెలియకుండ అక్కడినుంచి జారుకోవచ్చు.

అతడిలా ఆలోచిస్తుండగా, వారి మాటలు అతని చెవిన పడ్డాయి.

"అమ్మా! దేన్ని చూసి భయపడ్డారు? ఎందుకలా అరిచారు?" అని అడిగింది చంద్రమతి.

"ఆ ప్రాకారం గోడను చూడవే! దానిపైన ఏదో ఒక ఆకారం కనిపిస్తూంది. తలమీద జరలతో,

ముఖాన పొడవైన గడ్డంతో ఒక ఆకారం కనిపిస్తూంది. దాని మెడలో - చెప్పేందుకే భయమేస్తూందే! - ఒక పుర్రెల మాల వేలాడుతూంది! నేను కేకవేయగానే అది మరుగైపోయింది!" అన్నది మణిమేఖల.

"బాగుంది, రాకుమారీ! మీ మనోభ్రాంతే అది! దెయ్యమూ లేదు, పిశాచమూ లేదు! ఎత్తైన ఆ గోడ మీద ఎవరూ ఎక్కి కూర్చోవడం కూడ సాధ్యం కాని పని!" అన్నది చంద్రమతి.

"లేదే! నా మనోభ్రాంతి కాదు. నాకలా  దెయ్యమూ, పిశాచే కనిపించలేదు..."

"అవును! మన్మధుడిలాంటి అందగాడే మీ కళ్ళలో, కలలో కనిపించడం అలవాటు..."

"ఛీఛీ! ఇప్పుడు కూడ నీకు పరాచికాలేనా?"

"మరి, ఇంకెప్పుడు? సాయంత్రమే ఈ నందనవనానికి వచ్చి, కలువ కొలను దగ్గర వేచి చూస్తున్నారు. మల్లెపూల సువాసన ఘుమ్మని వీస్తూంది. కానీ, పాపం! ఏం చేయడం? మీరు వాణర్ కుల యువరాజును ఎదురుచూస్తుండగా, మీసాలు, గెడ్డమూ ఉన్న పిశాచి వచ్చింది!"

"చాలు! చాలు!"

"నన్ను చూసి ఆ పిశాచి భయపడి పారిపోయిందేమో? కడంబూర్ మాళిగ పనిపిల్ల చంద్రమతిని చూసి దెయ్యాలు, భూతాలు, బేతాళాలు అన్నీ భయపడి పారిపోతాయన్న విషయం జగత్ప్రసిద్ధం కద?"

"చంద్రమతీ! నీ వేళాకోళం మాటలన్నీ ఇప్పుడొద్దు. నిజంగానే ఆ ప్రాకారం గోడమీద నేనొక భయంకరమైన ఆకారాన్ని చూశాను. నీవు నమ్మకపోతే పో! నీవెళ్ళిన కార్యం ఏమైందని చెప్పు!"

"వెళ్ళిన కార్యం ఫలించలేదు రాకుమారీ!"

"ఎందుకు? ఏమైంది??"

"కంచి యువరాజు, కడంబూర్ యువరాజు మాత్రమే అక్కడ చేరి మాట్లాడుకొంటున్నారు. వాణర్ కుల యువరాజు కనిపించనే లేదు..."

"ఒకవేళ ఆయనను కూడ ఎక్కడికైన పంపించారా, ఏమి?"

"అలానూ అనిపించడం లేదు. మీ నాన్నగారు, పార్థిబేంద్రపల్లవులు మాత్రమే మలైయమాన్ రాజుగారికి ఎదురేగి పిలుచుకొని వచ్చేందుకు వెళ్ళారు. ఇడుంబన్‌కారిని అడిగాను. ఇవాళ సాయంత్రం కరికాలన్‌గారు వంతిదేవులమీద ఎందుకో విరుచుకు పడ్డారట!"

"ఆయనకు నిజంగానే పిచ్చిపట్టింది. అందరి మీద ఎగిరిపడుతున్నారు. తర్వాత...?"

"'ఇక ఈ రోజు నాకు నీ ముఖం చూపించకు! రేపు పొద్దు పొడిచిన తర్వాత రా!' అని కోపంగా చెప్పి పంపించేశారట!"

"మరి ఆయనెక్కడికి వెళ్ళివుంటారు?"

"ఈ మాళిగ ప్రాకారం లోపలే ఎక్కడో తిరుగాడుతుండాలి. అందుకే చెప్పాను, ఒకవేళ ఆయనే

పిశాచిలాగ వేషం వేసుకొని మిమ్మల్ని భయపెట్టారేమోనని."

"కాదు; ఈ మాళిగలో పలువురు వేషగాళ్ళున్న విషయం నాకు తెలుసు. కానీ ఆయన వేషం వేసుకొని ఏమార్చేవారు కాదు..."

"ఇలాగే మనలాంటి అబలలు మగవాళ్ళను నమ్మి మోసపోవడం అలవాటు..."

"అలాగే ఉండనీ. నీవు మళ్ళీ వెళ్ళి వెతికి చూడు. అంతఃపురం, మాళిగ ప్రాకారం లోపలే కద ఎక్కడో ఉండాలి? ఇడుంబన్‌కారిని కూడ వెతికి చూడమను!"

"రాకుమారీ! ఆ ఇడుంబన్‌కారి నాకు నచ్చనే లేదు. గుడ్లప్పగించి చూస్తాడు. వాడిని చూస్తే నాకు కాస్త భయం కూడాను..."

"భూతాలకు, దెయ్యాలకు భయపడనిదానివి ఇడుంబన్‌కారిని చూసి భయపడతావేం? పోతే పోనీ. వాడికి ఏమీ చెప్పకుండడమే మంచిది. నీవే ఇంకొకసారి వెళ్ళి వెతికి చూసి రా!"

"అంతవరకు..."

"నేనిక్కడే ఉంటాను."

"మళ్ళీ ఆ పిశాచి ఇక్కడికి వస్తే...?"

"నీ పేరు చెప్పి తరిమేస్తాను!"

చంద్రమతి అక్కడినుంచి వెళుతూందనడానికి సూచనగా ఆమె కాలి గజ్జెల శబ్దం మెత్తగా వినిపించింది.

~

పైన వివరించిన సంభాషణను వింటూన్న వంతిదేవుని మనసులో పలువిధాలైన ఆలోచనలు తలెత్తాయి. గోడపైనుంచి తొంగి చూసిన 'పిశాచి' ఎవరై ఉండవచ్చు? ఆళ్వార కట్టియాన్ కాళాముఖుని వేషం వేసుకొచ్చి తనని కాపాడిన విషయం గుర్తుకొచ్చింది. ఒకవేళ ఆ వీరవైష్ణవుడే మళ్ళీ అలా వచ్చాడా? తంజావూరునుంచి తనకోసం ఏదైనా ముఖ్యమైన సమాచారం తీసుకొచ్చాడా? ఇక్కడున్నవారికి గుర్తు తెలియకూడదని అలా వేషం వేసుకొచ్చాడా?

మణిమేఖల తనని చూడాలని ఇంతగా ఆసక్తి కనబరిచేందుకు కారణమేమి? ఎందుకని ఆమె తన చెలికత్తెను పంపించి తనను వెతికి పిలుచుకొని రమ్మంది? తనమీద ఆమెకున్న మనోభావం గురించి వంతిదేవునికి ఒకింత తెలుసు. అందుకే తననుంచి కాస్త దూరంగానే ఉంటూంది. గందమారన్ తనమీదగొన్న వైరుధ్యాన్ని/శత్రుత్వాన్ని ఇంకా ఎగదోయకూడదని కూడ కోరుకొంది. అయినా కూడ, ఇప్పుడు నందనవనంలో ఒంటరిగా కూర్చొని, తనని పిలుచుకొని రమ్మని తన చెలికత్తెకు పురమాయించింది. ఏదో ముఖ్యమైన కారణం లేకపోతే ఇంతటి సాహసానికి దిగదు. పాపం, ఆమెకు కూడ ఏదైన సంకట పరిస్థితి ఎదురైందేమో! లేక, నందిని ఆమెకేదైనా వార్త చెప్పి పంపివుండవచ్చు. భగవాన్! ఈ

కడంబూర్ మాళిగలో ఒక్కొక్కరు తమ మనసులో ఏదో దాచుకొని ఇంకొక విధంగా ప్రవర్తిస్తున్నారు. కాసేపటి క్రితం మణిమేఖల చెప్పింది చాల నిజం. అందరూ వంచక వేషధారులే. వీరి మధ్య, ఈ అమాయకమైన పిల్ల చిక్కుబడి కష్టపడుతూంది. పళువూర్ రాణి ఈ అమ్మాయిని ఏ దుష్టకార్యానికి ఉపయోగించుకోవాలని పథకం వేసుకొందో తెలియదు. అవును; మణిమేఖల మనసులో ఏదో సందేహం కలిగివుండాలి. ఏదో ఒక అపాయాన్ని ఆమె ఎదురుచూస్తూండాలి. అందుకే ఆమె తన సహాయాన్ని ఆశిస్తూంది.

ఆ కల్లాకపటమెరుగని అమాయకురాలు మునుపొకసారి తనకు చేసిన సహాయాన్ని గుర్తుచేసుకొన్నాడు వంతిదేవుడు. ఆమెకు నిజంగానే ఏదైనా అపాయం ఎదురై తనని సహాయం కోరుతుంటే, దాన్ని అందజేయననడం కృతఘ్నత అవుతుంది. ఏదెలా ఉన్నా కూడ, నిజం తెలుసుకోవడానికి ఇది ఒక మంచి సందర్భం. చంద్రమతి వెళ్ళిపోయింది; మణిమేఖల ఒంటరిగా ఉంది. ఆమె సహాయం తనకు మళ్ళీ కావలసి రావచ్చు... ఎవరికి తెలుసు? ఆమె సహయం వల్ల ఈ కుట్రలతో కూడుకొన్న మాళిగనుంచి బయటపడగలిగితే చాల మంచిది. కాబట్టి, ఇప్పుడు ఆమె దగ్గరకు వెళ్ళి నిజం తెలుసుకొందాం....

~

కలువ కొలను ఒడ్డునున్న పాలరాతి బల్లమీద మణిమేఖల కూర్చొనివుంది. మేఘాలు కమ్ముకొన్న ఆకాశంలో అక్కడక్కడా మెరుస్తూ కనిపించే చుక్కల్లాగ, దట్టంగా పరుచుకొన్న ఆకుల మధ్య కొన్ని పూలు తలెత్తి నిలబడ్డాయి. చుట్టూ కమ్ముకొన్న చీకటిలో రాత్రి పూచే ఆ పూల తెల్లదనం కొట్టవచ్చినట్లు కనిపిస్తూంది. కొలనుకవతల మల్లెపొదల్లో అరవిరిసిన పూలు, మొగ్గలు నీలిరంగు కంబళిలో ముత్యాలు పొదిగినట్లు కనిపించాయి.

వీటిని చూస్తూన్న మణిమేఖల తన వెనుక కాలిచప్పుడు వినగానే అదిరిపడి వెనక్కి తిరిగి చూసింది. అతిసమీపానికొచ్చేసిన ఆ ఆకారాన్ని చూసి (తడబడుతూ) లేవబోయినప్పుడు కాలు తడబడి కొలనులో పడబోయింది.

"రాకుమారీ! రాకుమారీ!" అని పిలుస్తూనే వంతిదేవుడు వంతిదేవుడు మణిమేఖలను పట్టుకొని, కొలనులో పడిపోకుండ ఆపాడు.

మణిమేఖల మేను పులకరించింది. సహజంగా కలిగిన సిగ్గువల్ల అతని చేతులను పట్టి అవతలికి తోసేయజూసింది. కాని దానికి కావలసినంత బలం అప్పుడు ఆమె చేతుల్లో లేకపోయింది.

ఆ ప్రయత్నంలో మళ్ళీ వెనక్కి వాలిపోవలసి వచ్చింది.

~

వంతిదేవుడామెను ఇంకా గట్టిగా పట్టుకొని ఆపాడు.

మణిమేఖల ఒక పెద్ద ప్రయత్నం చేసి తనని నిలదొక్కుకొని, "నన్ను వదలండి! నన్ను

తాకకండి!" అని కోపంగా అన్నది.

వంతిదేవుడు ఆమెను వదిలిపెట్టి, "రాకుమారీ! నన్ను క్షమించండి!" అన్నాడు.

మణిమేఖల ఇంకా గాభరా వీడని గద్గద స్వరంతో, "నేను మిమ్మల్నెందుకు క్షమించాలి?" అని అడిగింది.

"ఉన్నట్లుండి వెనక నుంచి వచ్చి మిమ్మల్ని ఉలిక్కిపడేలా చేసినందుకే!"

"వచ్చిందేమో వచ్చారు! ఎందుకని నన్ను తాకి పట్టుకోవాలి?" అని మణిమేఖల అడిగిన గొంతులో ఆమె ఇప్పటికి తనని తాను బాగ సంభాళించుకొన్నదని తెలిసింది.

"తమరు కొలనులో పడిపోకుండ పట్టుకొన్నాను!"

"భలే బాగుంది! ఆరోజు నేను చెరువులో పడిపోయి మునిగి అవస్థ పడుతుంటే ఇంతటి దయ చూపించలేదేం? ఈ మోకాటిలోతు నీరున్న కొలనులో పడి మునిగిపోకుండ కాపాడేందుకు వచ్చేశారు?"

"అది నా తప్పే!"

"మీరేం తప్పు చేయలేదు; తప్పంతా నాదే."

"అదెలా? మీరు తప్పేం చేయలేదు. నా మీద కోపంతోనే ఇలా అంటున్నారు!"

"మునుపొకసారి మీరు వేటమంటపంనుంచి ఉన్నట్లుండి నేనున్న గదిలోకి దూరారు. ఆ రోజు నన్ను అదిరిపడేలా చేశారు. ఆ రోజే నేను కేకలేసి మిమ్మల్ని నా నాన్నగారికి పట్టిచ్చి ఉండవలసింది!"

"ఆ రోజు నన్ను పెద్ద అపాయంనుంచి కాపాడారు. అది నేనెన్నడూ మరువను."

"అందుకు మీరు కృతజ్ఞత తెలియజేసిన విధాన్ని కూడ నేను మరువను. కృతజ్ఞత లేనివారిలో మీకు సాటి ఇంకెవరూ లేరు."

"రాకుమారీ! ఇది చాల పెద్ద అభాండం! ఏవిధంగా నేను కృతఘ్నుడిని? చెప్పండి!"

"మిమ్మల్నెవరో హంతకులు తరుముకొని వస్తున్నట్లు అబద్ధం చెప్పారు. నేను వేట మంటపం లోపలికి వెళ్ళి చూసి వచ్చేలోపు నా దగ్గర సెలవు తీసుకోకనే దొంగలాగ పారిపోయారు!"

"దొంగలాగ పారిపోయాననా అంటున్నారు?"

"దొంగలాగ అని చెప్పింది తప్పే; దొంగలాగ కాదు, దొంగే!"

"రాకుమారీ! నేనారోజు ఎంతటి ఇక్కట్టైన పరిస్థితిలో ఉన్నానో మీకు తెలియదు..."

"తెలియనివారికి మీరు తెలియజేసి ఉండవచ్చు కద? ఎవరు వద్దని అడ్డుపడ్డారు?"

"మీ చెలికత్తె చంద్రమతే. మీరు వేటమంటపం లోపలికి వెళ్ళగానే ఆమె ఇంకొక వాకిలిగుండా లోపలికి వచ్చేసింది. ఆమె కంట పడకుండేందుకు సంగీత వాద్యాల గదిలో దాక్కొన్నాను..."

"తర్వాత అక్కడినుంచి మాయమైపోయారు!"

"లేదు; మెట్లెక్కి మేడలు, డాబాలన్నీ దాటి ప్రాకారం గోడ కూడ దాటి అవతలికి దూకే వెళ్ళాను.

రాకుమారీ! ఆ రోజు నన్నెవరైనా కనిపెట్టి చూసివుంటే, నేను చేబట్టిన కార్యం చెడేది; మీకు కూడ చెడ్డపేరు వచ్చేది...."

"ఈ పేదపిల్ల గురించి మీకేం దిగులు?"

"నిజంగానే దిగులే!"

"అలాగైతే మీరిక్కడికి తిరిగివచ్చి ఇన్ని రోజులు గడిచాయి కద? చెప్పకుండ పారిపోయినందుకు కారణం చెప్పివుండవచ్చు కద?"

"దానికి తగిన సందర్భం కోసం ఎదురుచూస్తున్నాను..."

"ఎందుకయ్యా ఒట్టిమాటలు? నావైపు కూడ మీరు తిరిగి చూడడం లేదు కద?"

"సహోదరీ!"

"నేను మీ సహోదరిని కాను!"

"మీరు నా స్నేహితుడైన గందమారన్ సహోదరి. కాబట్టి నాకూ సహోదరే."

"గందమారన్ నాకిక సహోదరుడు కాదు; మీరు వాడి స్నేహితులూ కారు. మనిద్దరికీ వాడు శత్రువు."

"రాకుమారీ! ఆ విషయం మీకు తెలిసిందే కద? ఇటీవలివరకు గందమారన్ నా ప్రాణస్నేహితుడుగా ఉండేవాడు. ఇప్పుడు పూర్తిగా మారిపోయాడు. పార్థిబేంద్రుడు నాకెప్పుడు ఎసరు పెడదామా అని చూస్తున్నాడు. యువరాజేమో నిమిషనిమిషానికీ మారిపోతున్నారు. ఈ నిమిషం ఆప్యాయంగా మాట్లాడుతారు. మరునిమిషం మండిపడుతున్నారు. ఎప్పుడు ఏ ఆపద వస్తుందోనని ఆందోళనపడుతూ కాలం గడుపుతున్నాను. ఈ పరిస్థితిలో తమకు కృతజ్ఞతలు తెలుపుకోవడానికి వస్తే, మీరేమో..."

"అయ్యా! మిమ్మల్ని మీరు కాపాడుకోవడంలో మీరింత అప్రమత్తంగా ఉండడం గురించి చాల సంతోషపడుతున్నాను....!"

"రాకుమారీ! నా గురించి నేను దిగులుపడడం లేదు. నావల్ల మీకేమీ హాని కలగకూడదనే దిగులుపడుతున్నాను..."

"దిగులుపడి కరిగిపోతూనే ఉన్నారు. మగవాళ్ళంతా వంచకులే అని చంద్రమతి చెబుతుంది. అది నిజమని ఇప్పుడే తెలిసింది."

"ఎవరేమన్నా సరే, నా ప్రాణాలున్నంతవరకు నేను మిమ్మల్ని మరువను; మీరు నాకు చేసిన సహాయాన్ని కూడ మరువను!"

~

మణిమేఖల కాసేపు ఆలోచనలో మునిగి, తర్వాత, "అయ్యా! ఇప్పుడు మీరు చెప్పింది

ఇంకొకసారి చెప్పండి!" అన్నది.

"వెయ్యిసార్లు చెప్పమన్నా చెబుతాను. నా ప్రాణాలున్నంతవరకు మీరు చేసిన సహాయాన్ని మరువను!" అని వంతిదేవుడు నొక్కి చెప్పాడు.

"వెయ్యిసార్లు చెప్పినా కూడ ఏం ప్రయోజనం? దాన్ని నెరవేర్చేందుకు ప్రయత్నించాలి కద?"

"ఏవిధంగా ప్రయత్నించాలి? చెప్పండి రాకుమారీ!"

"మీ ప్రాణాలున్నంతవరకే మీరు నాకు కృతజ్ఞతలు తెలియజేయగలరు కద? కాబట్టి మొదట మీ ప్రాణాలను కాపాడుకోవడానికి ప్రయత్నించండి; మీకోసం కాకపోయినా, నాకోసం కాపాడుకోండి!"

"రాకుమారీ! ఇదేమి...?"

"అయ్యా! నిజం చెప్పండి! కాసేపటి క్రితం నేను, నా చెలికత్తె మాట్లాడుకొన్నదంతా మీరు విన్నారా?"

"క్షమించాలి, రాకుమారీ! 'అయ్యో! పిశాచి!' అని మీరు కేకవేసింది విని పరుగెత్తి వచ్చాను. అంతలోపల మీ చెలికత్తె చంద్రమతి వచ్చేసింది. మీ సంభాషణను వినే పరిస్థితి ఏర్పడింది..."

"మిమ్మల్ని ఎలాగైనా వెతికి పిలుచుకొని రమ్మని ఆమెకు చెప్పి పంపించిన విషయం మీకు తెలుసు కద?"

"చెవిన పడింది. అందుకే మీ సమీపానికి వచ్చాను..."

"లేకపోతే నా దగ్గరికి కూడ వచ్చేవారు కాదు కద. అరెరె! ఏమా కనికరం! మీరు ఎంతటి పాషాణ హృదయులైనా, నా మనసు వినలేదు. మీకు ఆపద అంటే నేనూరుకోలేకపోయాను...."

"రాకుమారీ! నా ఆపద్భూయిష్టమైన పరిస్థితి నాకు తెలిసిందే. నాకు తెలియని కొత్త ఆపద ఏమైనా కలగబోతూందా?"

"అయ్యా! మీరు వెంటనే ఈ అంతఃపురం, మాళిగ విడిచి వెళ్ళిపొండి!"

"నన్ను వెన్ను చూపి పారిపొమ్మంటున్నారా??"

"యుద్ధరంగంలో వెన్నుచూపి పారిపోకూడదు. కుట్రదారులనుంచి తప్పించుకొని పారిపోవడంలో తప్పేమి?"

"ఎవరు కుట్రదారులు?"

"ఇంకెవరు? గందమారన్, పార్థిబేంద్రులే..."

"వారికి భయపడి నేనీ మాళిగ విడిచి వెళ్ళిపోలేను..."

"నా అన్న వల్ల మీకు హాని కలగబోతూందని నేను దాన్ని సహిస్తూ ఊరుకోలేను..."

"రాకుమారీ! గందమారన్ చేసే పనులకు మీరెలా బాధ్యవుతారు?"

"నా కారణంగానే వాడు, పార్థిబేంద్రులు మీకు హాని చేయబోతున్నారు!"

"మీకోసం నేను కష్టాలనుభవిస్తే అది నా భాగ్యం. మీరు చేసిన సహాయానికి ప్రత్యుపకారం చేసినట్లు భావిస్తాను...."

"నందినీదేవి చెప్పింది నిజమే..."

"ఆఁ! ఫళువూర్ రాణి మీకేం చెప్పారు?"

"మిమ్మల్ని మీ ప్రాణాలు కాపాడుకోమని చెబితే మీరు వినరు; - ఇంకొక యుక్తి పన్నాలి అన్నారు. అయ్యా! మీరు దయచేసి నాతో రండి. పళువూర్ రాణి మిమ్మల్ని ఏదో ఒక ముఖ్యమైన విషయమై చూడాలట."

"ఆ ముఖ్యమైన కార్యం ఏమని మీకు తెలుసు కద?"

"తెలుసు. పళువేట్టరయ్యర్ కొళ్ళిడాన్ని దాటుతున్నప్పుడు వారి పడవ తలకిందులై మునిగిపోయిందని వార్త వచ్చింది..."

"నేనూ విన్నాను..."

"మీరు వెంటనే వెళ్ళి అందు గురించిన నిజాన్ని తెలుసుకొని రావాలట. అలాగని పళువూర్ రాణి ముఖాముఖి చూసి అడగాలంటున్నారట."

~

వంతిదేవుడు కాసేపాలోచించి, "పళువూర్ రాణి ఇదంతా నాకు మునుపే చెప్పవద్దని హెచ్చరించలేదా?" అని అడిగాడు.

"అవును!"

"మరి, ఇదంతా నాకెందుకు చెప్పేశారు?"

"నా మనసు చాల కల్లోలితం కావడమే కారణం. అయ్యా! కొన్నాళ్ల క్రితం వరకు నేను నిజంగానే కల్లాకపటం తెలియని అమ్మాయినానే ఉండేదాన్ని. ఎవరి గురించి ఏ విధమైన సందేహమూ కలిగేది కాదు నాకు. ఎవరి గురించైనా నా చెలికత్తెలు అవహేళనగానో, సందేహాస్పదంగానో మాట్లాడితే నమ్మేదాన్ని కాను. ఇప్పుడు అందరినీ సందేహిస్తున్నాను. అన్నింటినీ సందేహిస్తున్నాను..."

"నా ముఖం చూసిన వేళ ఏర్పడ్డ వైపరీత్యంలాగుంది."

"ఒక విధంగా అది నిజమే! పళువూర్ యువరాణి మిమ్మల్ని పిలుచుకొని రమ్మని నన్ను పంపారు. వారితో మాట్లాడుతున్నప్పుడు ఏ సందేహమూ కలగలేదు. అంతా సరి అనిపించింది. ఇవతలికి వచ్చిన తర్వాత వారిమీదే సందేహం కలుగుతూంది..."

"ఏం సందేహం, రాకుమారీ? నందినీదేవి మీద మీకు ఏం సందేహం?"

"వారు కూడ వీరితో కూడబలుక్కొని మీకు హాని చేయజూస్తున్నారేమోనని."

"ఈ సందేహం ఎందుకు వచ్చింది? వారు నాకేం కీడు చేయగలరు?"

“అదేమని నేను నిర్దుష్టంగా చెప్పలేకపోతున్నాను. కానీ వారి మాటలు, నడవడిక గురించి ఆలోచించి చూస్తే, సందేహం కలుగుతూంది. తరచూ ఒక పొడపైన కత్తిని చేతబట్టుకొని ఏవేవో మాట్లాడుతున్నారు…”

“ఒక స్త్రీ చేతిలో కత్తి చూసి నేను భయపడను. దాని కన్న…”

“ముఖంలోని కళ్ళనే కత్తులకు భయపడతారు. అందరూ చెప్పే కథే అది. అయ్యా! నందినీదేవి కత్తికి మాత్రమే భయపడమని చెప్పడం లేదు. మొట్టమొదటిసారి మీరు వేటమంటపంనుంచి నేనున్న గదిలోకి ఎలా వచ్చారో గుర్తు తెచ్చుకోండి…”

“బాగా గుర్తుంది!”

“హంతకులు కొందరు మిమ్మల్ని వెన్నంటి వస్తున్నారని చెప్పారు. మొదట నేనది నమ్మలేదు. తర్వాత వేట మంటపంలోకి నేనే వెళ్ళి చూశాను. అక్కడవున్న చచ్చిన మృగాల వెనక ఎవరో కొందరు దాక్కొనివున్నట్లు తోచింది. వారు మిమ్మల్ని చంపవచ్చినవారా, లేక మీతోబాటే వచ్చినవారా అని అప్పుడు తెలుసుకోలేకపోయాను. అందుకే దాని గురించి నేనెవరికీ  చెప్పలేదు. వారి గురించి చెబితే మీ గురించి కూడ చెప్పవలసి వస్తుంది కద?”

“నాకు మీరు చేసిన సహాయం చాల పెద్దదని ఇప్పుడు గ్రహింపుకొచ్చింది"

“నేను అందుకని ఆ విషయాన్ని ఇప్పుడు ప్రస్తావించడం లేదు. కాసేపటి క్రితం నందినీదేవి మిమ్మల్ని పిలుచుకొని రమ్మని నన్ను పంపించారు. వెంటనే వారిని ఇంకేదో అడిగేందుకు తిరిగి వెళ్ళాను. తలుపు లోపలినుంచి తాళం వేసివుంది. లోపల, వేట మంటపంనుంచి ఎవరో మాట్లాడుతున్న శబ్దం మెల్లగా వినిపించింది. అయ్యా! నా సందేహాన్ని మీకిప్పుడు చెప్పేస్తాను. వేట మంటపంలో ఎవరో ఆగంతకులు/దుండగులు దాక్కొని ఉన్నారు. వారికి, పళువూర్ రాణికి ఏదో సంబంధముందని సందేహిస్తున్నాను.”

~

వంతిదేవుడు ఇప్పుడు పరిస్థితి తీవ్రతను బాగా గ్రహించాడు. ఈరోజు ఏదో ఒక విపరీత సంభవం జరగబోతూందని అతని మనసు లోలోపల అనిపించింది. మణిమేఖల చెప్పిన విషయాలు అతని సందేహాన్ని రూఢి చేశాయి.

“రాకుమారీ! మీరు నాకొక సహాయాన్ని వెంటనే చేయాలి!”

“ఏమని చెప్పండి!”

“వేటమంటపానికి, బయటినుంచి రావడానికి ఒక సొరంగమార్గం ఒకటుంది. ఇప్పుడు నందినీదేవి ఉన్న గదినుంచి వెళ్ళేందుకు కూడ ఒక రహస్యద్వారముంది. ఇవి తప్ప, మూడో దారి లేదు కద?”

"ఉంది. పనిమనుషులు వెళ్ళేందుకు ఒక దారివుంది. అంతఃపురానికి కొత్తగా వచ్చే అతిథులను ఆ దారిగుండానే మా నాన్నగారు పిలుచుకొని వెళ్ళడం అలవాటు."

"రాకుమారీ! ఆ దారిగుండా వేటమంటపానికి నన్నిప్పుడే పిలుచుకొని వెళ్ళండి!"

"ఎందుకని?"

"అక్కడ దాక్కొన్నవారెవరు, ఏ ఉద్దేశంతో అని తెలుసుకోవడానికే!"

"మిమ్మల్ని అపాయం నుంచి తప్పించేందుకు వచ్చాను. అపాయంవైపే తీసుకొని వెళ్ళమని అడుగుతున్నారు..."

"నా బొడ్లో ఎప్పుడూ ఒక కత్తివుంది, రాకుమారీ! చెప్పకుండ వచ్చే అపాయం కన్న తెలిసి వచ్చే అపాయాన్ని ఎదుర్కోవడం తేలిక. అపాయానికి మనమే ఎదురేగి వెళితే ఇంకా మేలు..."

"ఒక నిబంధనకు సమ్మతిస్తే నేను మిమ్మల్ని వేటమంటపానికి పిలుచుకొని వెళతాను."

"ఏమది?"

"నేనూ మీతోబాటు వస్తాను. నా బొడ్లోను ఒక చురకత్తి ఉంది" అని మణిమేఖల తన చురకత్తిని తీసి చూపించింది.

వంతిదేవుడు ఆ నిబంధనకు సమ్మతం తెలిపాడు.

"అలాగైతే వెంటనే నాతో రండి. చంద్రమతి నన్ను వెతుక్కొంటూ ఇక్కడికి వచ్చేలోపు వెళ్ళిపోవాలి!" అన్నాడు వంతిదేవుడ్.

~

మణిమేఖల వంతిదేవుని నందనవనం దాటి అవతలికి తీసుకొని వెళ్ళింది. తర్వాత మాళిగ వారగా గోడల నీడలు దట్టంగా ఉన్న దారిగుండా పిలుచుకొని వెళ్ళింది. ఆ తర్వాత మాళిగ లోపల ప్రవేశించి జనసంచారం లేని వరాండాలు, కాలిబాటల వెంబడి వెళ్ళారు. చివరికి వాకిలి మూయబడ్డ ఒక ద్వారం దగ్గరికొచ్చింది. వంతిదేవుని అక్కడే ఉండమని చెప్పి, వేగంగా వెళ్ళి ఒక చేతి దీపాన్ని తీసుకొచ్చింది. తలుపు తెరిచి, దీపాన్ని ఎత్తి పట్టుకొని చూసినప్పుడు మెట్లున్న ఒక ఇరుకైన దారి కనిపించింది. ఇద్దరూ ఆ మెట్లు దిగి వెళ్ళారు. కాసేపలా మెట్ల వెంబడి వెళ్ళిన తర్వాత ముందు వెళుతున్న మణిమేఖల చటుక్కున ఆగి, మెల్లని గొంతుతో, "ఆగండి! ఏదో కాలి చప్పుడులాగుంది. మీకు వినిపిస్తూందా?" అన్నది.

~~~
~~~

# అధ్యాయము - 35

## కోతి పట్టు!

**వంతిదేవుడు** శ్రద్ధగా చెవులు రిక్కించి విన్నాడు. ఒక నిమిషంపాటు కాలి చప్పుడు వినిపించినట్లనిపించింది. చటుక్కున అది ఆగిపోయింది. మళ్ళీ వినిపించింది. ఇలా ఆ శబ్దం వెనుదిరిగి వెళుతున్నట్లు రానురాను సన్నగిల్లింది.

"అయ్యా! ఇంకా ముందుకు వెళ్ళే తీరాలా? వెనుదిరగడం మంచిది కద?" అన్నది మణిమేఖల.

"రాకుమారీ! ముందుంచిన కాలు వెనుదీయడం నాకలవాట్లేదు!" అన్నాడు వంతిదేవుడు.

"పడితే కోతిపట్టే అనండి!"

"మునుపొకసారి మీ చెలికత్తె చంద్రమతి నన్ను 'కోతిమూతి' అని వర్ణించింది కద? ముఖానికి తగినట్లే పట్టు కూడ ఉంటుంది!"

ఇలా చెబుతూనే వంతిదేవుడు, ఇందాక మణిమేఖల వెనక వస్తున్నవాడు, ఇప్పుడు ఆమెను దాటుకొని ముందుకు వెళ్ళడానికి ప్రయత్నించాడు. ఆ ప్రయత్నాన్ని మణిమేఖల అడ్డుకోజూసింది.

ఇద్దరూ ఒకరినొకరు గుద్దుకొన్నారు.

మణిమేఖల చేతనున్న దీపం కింద పడింది. రెండు మూడు మెట్లు దొర్లుకొంటూ వెళ్ళి ఆరిపోయింది.

తర్వాత ఎత్తుపల్లాలుగా ఉన్న ఆ దారిలో కారు చీకటి కమ్ముకొంది.

"రాకుమారీ! ఇదేమి ఇలా చేసేశారు?" అన్నాడు వల్లవరయ్యన్.

"మీరెందుకు నన్ను దాటుకొని ముందుకు పోజూశారు?" అని ఎదురు ప్రశ్న వేసింది మణిమేఖల.

"అపాయం ఎదురయ్యేటప్పుడు ఆడవాళ్ళను ముందుంచుకొని వెళ్ళడం నాకలవాట్లేదు!" అన్నాడు వంతిదేవుడు.

"మీకు ఏవేవి అలవాటో, అలవాటు కాదో నాకు కాస్త తెలియజేస్తే మంచిది. నేనూ దానికి తగినట్లు నడుచుకొంటాను."

"అలాగే కానివ్వండి. అవకాశం చిక్కినప్పుడు చెబుతాను."

"ఇప్పుడు అవకాశం లేకేమి? రండి! తిరిగి నందనవనానికి వెళదాం. అక్కడ తీరిగ్గా కూర్చొని చెప్పండి."

"చీకట్లో వచ్చేందుకు మీకు భయమైతే మీరు తిరిగి వెళ్ళండి!"

"మీలాంటి వీరులు చెంతనున్నప్పుడు నాకేం భయం?"

"నావెనకే రండి, వెళదాం! దారిలో నిలబడి ఏం ప్రయోజనం?"

~

ఇలా అంటూనే ముందుకు వెళ్ళబోయిన వంతిదేవుడు కాలికి ఏదో తగిలి పడబోయాడు.

మణిమేఖల అతన్ని పడిపోకుండ పట్టుకొంది.

"అయ్యో! ఈ దారిలో మిట్టపల్లాలెక్కువ. మెట్లెక్కడ, సమతలమెక్కడ అని ఈ చీకటిలో కనిపెట్టలేం. నేన్నోసార్లు ఈ దారిన వెళ్ళినదాన్ని. మెట్లు, మలుపులు అన్నీ బాగా తెలుసు. కాబట్టి మీరు ఎంతటి వీరాధివీరులైనా కూడ నా చేయి పట్టుకొని నా వెనకే రావడం మంచిది. లేకపోతే వేటమంటపానికి వెళ్ళి చేరలేరు. దారిన కాలు విరిగి పడిపోతారు!" అన్నది మణిమేఖల.

"రాకుమారీ! తమ ఆజ్ఞ ప్రకారమే నడుచుకొంటాను. వందనం!" అన్నాడు వంతిదేవుడు.

చీకటిలో మణిమేఖల వంతిదేవుని చేయి పట్టుకొంది. అతని చేయి చల్లబడివుండడాన్ని గమనించింది. 'ఈయన పగవారికి జంకనివారు; కుట్రదారులకు కూడ భయపడనివారు. ఈ అమాయకపు పిల్ల చేయి పట్టుకోవడానికి ఎందుకింత భయపడుతున్నారు?' అని తనలో తానే అనుకొంది.

కాస్త దూరం ఇద్దరూ మౌనంగా వెళ్ళారు. వంతిదేవుడు తరచూ కాలు తడబడి కింద పడబోయాడు. ప్రతి ఒక్కసారి అతడు కింద పడకుండడం కోసం మణిమేఖల అతడి చేతిని గట్టిగా పట్టుకోవలసి వచ్చింది.

"నరకానికి వెళ్ళేదారి ఇలాగే చీకటి కమ్ముకొనివుంటుంది!" అన్నాడు వంతిదేవుడు.

"ఓహో! తమరు నరకానికి వెళ్ళి తిరిగి వచ్చారా?" అని అడిగింది మణిమేఖల.

"నేను నరకానికీ వెళ్ళలేదు, స్వర్గానికీ వెళ్ళలేదు. పెద్దలలా చెప్పారు!"

"వారికి వారి పెద్దవారు చెప్పివుంటారు!"

~

కొన్నాళ్ళ క్రితం వరకు నలుగురి ముందుకు రావడానికే సిగ్గుపడే ఈ పిల్లకు ఇప్పుడు ఇంతటి వాచాలత అబ్బింది అని వంతిదేవుడు అనుకొని ఆశ్చర్యపోయాడు.

"నరకానికి వెళ్ళే దారేమో చీకటిగా ఉంటుంది. మరి స్వర్గానికి వెళ్ళేదారెలా ఉంటుంది?" అని మళ్ళీ అడిగింది మణిమేఖల.

"అది జ్యోతిర్మయంగా ఉంటుంది! కోటి సూర్యప్రకాశంగా ఉంటుంది!"

"అలాగైతే నరకానికి వెళ్ళే దారే నాకిష్టం! ఒక సూర్యుడినే కన్నెత్తి చూడలేను! కోటి సూర్యుల కాంతి నన్ను గుడ్డిదానిగా చేసేస్తుంది కద!" అన్నది మణిమేఖల.

"నరకానికి వెళ్ళే దారిన వెళితే చివరికి నరకానికే కద వెళ్ళి చేరాలి?" అని అడిగాడు వంతిదేవుడు.

"తమలాంటి వీరపురుషుల వెంట వెళితే, నరకానికి వెళ్ళే దారి గుండా స్వర్గానికి వెళ్ళి చేరినా చేరవచ్చు!" అన్నది మణిమేఖల.

"తమలాంటి రాకుమారి చేయి పట్టుకొని వెళితే నరకమే స్వర్గమైపోతుంది!" అన్నాడు వంతిదేవుడు.

వెంటనే నాలుక కరుచుకొని, 'ఇలా నోరుజారాం కద? ఈ పిల్ల మనని అపార్థం చేసుకొంటే...' అని దిగులుపడ్డాడు వంతిదేవుడు.

"మీ చేయి చల్లబడివుండడం చూస్తే మీరు స్వర్గానికి వెళ్ళేవారిలాగ అనిపించడం లేదు. వధ్యస్థలానికి వెళ్ళేవారిలాగ మీ ఒళ్ళు వణుకుతోంది!" అన్నది మణిమేఖల.

"రాకుమారీ! ఈ ప్రయాణం ముగిసేటప్పుడు నాకు వధ్యస్థలమే రాసివుందేమో!"

"మీరే కద ముందుంచిన కాలు వెనుదీయనని పట్టుబట్టారు? వేటమంటపంలో ఎటువంటి హంతకులున్నారో ఏమో?"

"వారెంతమందైనా ఉండనీ. వారికి నేను భయపడడం లేదు. మీరు, నేనూ ఇలా చీకట్లో చెట్టాపట్టాలేసుకొని వెళ్ళడాన్ని గందమారన్ చూసేస్తే...దాని గురించే దిగులుగా ఉంది..."

"అయ్యా! నేను బతికున్నంతవరకు నా అన్న వల్ల మీకెటువంటి హానీ కలగదు. నేను కనే కలలో సగం ఇప్పుడు నిజమైంది; మిగిలిన సగం కూడ నిజమౌతుందేమో, ఎవరికి తెలుసు?" అన్నది మణిమేఖల.

~

ఈ సమయాన ఏదో ఒక ద్వారం తాళం వేయబడే శబ్దం వినబడి ఇద్దరూ ఉలిక్కిపడి ఆగారు.

"వేటమంటపానికి సమీపంగా వచ్చేశాం!" అని మెల్లగా అన్నది మణిమేఖల.

ఇంతలో కాస్త దూరాన చిన్న వెలుతురు కనిపించింది. రానురాను అది పెద్దది కావడమే గాక, వారి దగ్గరకు వస్తున్నట్లు తోచింది. మణిమేఖల వంతిదేవుని చేయి వదిలి కాస్త జరిగి నిలబడింది.

మరు నిమిషాన, ఒక చేత ఎత్తి పట్టుకొన్న దీపంతోను, ఇంకొక చేత కత్తితోను ఇడుంబన్‌కారి వారికెదురుగా తోచాడు.

ఇద్దరినీ చూడగానే వాడు ఆశ్చర్యంతో అవాక్కయినవాడిలాగ నిలబడిపోయాడు. కానీ వాడలా నటిస్తున్నాడని ఇద్దరికీ తెలిసిపోయింది.

"అయ్యా! అమ్మా! ఇదేమి? చీకటిలో ఒంటరిగా ఇలా బయలుదేరారు? ఈ సేవకుడికి చెబితే దీపం పట్టుకొని రానా? ఎక్కడికి బయలుదేరారు?" అని అడిగాడు.

"ఇడుంబా! మలైయమాన్ దండెత్తి వస్తున్నారని వార్త వచ్చింది కద? కాబట్టి ప్రాకారపు ద్వారాలు, సొరంగమార్గాలు అన్నీ భద్రంగా తాళం వేసివున్నాయా అని పర్యవేక్షించేందుకు వాణర్ కుల యువరాజును తోడు తీసుకొని బయలుదేరాను!" అన్నది మణిమేఖల.

"విచిత్రంగా ఉంది, తల్లీ! నేనూ అదే పరీక్షించి వస్తున్నాను!" అన్నాడు ఇడుంబన్‌కారి.

"నేనూ అలాగే అనుకొన్నాను. మేము వచ్చేటప్పుడు తెచ్చిన దీపం కింద పడి ఆరిపోయింది. ఇక్కడ కాస్త వెలుతురు కనిపించింది. నీవే అయివుండాలని ఎంచి ముందుకొచ్చాము."

"చిన్న యజమాని చూడమన్నారు. అందువల్ల వెళ్ళి చూసేసి వచ్చాను. సొరంగమార్గాలన్నీ సరిగ్గా మూయబడి తాళం వేయబడివున్నాయి. తిరిగి వెళదామా, తల్లీ?"

"నీ చేతనున్న దీపాన్నిచ్చేసి నీవెళ్ళు! ఈయన వేటమంటపం నుంచి ఒక శూలాన్ని ఏరుకొని తీసుకోవాలట. వీరి శూలం కొళ్ళిడం నది వరదలో పడి కొట్టుకుపోయిందట. ఒకవేళ యుద్ధం వచ్చినా రావచ్చు కద...?"

"అవును, తల్లీ! యుద్ధం వచ్చినా రావచ్చు. కాబట్టి అన్యులను (బయటివారిని) వేటమంటపంలోకి పిలుచుకుకొని వెళ్ళకుండడమే మంచిది. మీకు నేను చెప్పనవసరం లేదు. మీకది తెలిసిందే."

"అది నిజమే, కారీ! కానీ వీరు అన్యులు కారు. చిన్న యజమానికి ప్రాణస్నేహితులు కద? ఇంకా ఏదైనా కొత్త సంబంధం ఏర్పడినా ఏర్పడవచ్చు. నీవు దీపాన్నిచ్చేసి వెళ్ళు!" అన్నది మణిమేఖల.

ఇడుంబన్‌కారి అయిష్టంగా దీపాన్ని రాకుమారికిచ్చేసి వెళ్ళాడు.

వంతిదేవుడు ,మణిమేఖల వేటమంటపాన్ని సమీపించారు.

"ఇదేమి? అంతఃపురంలో గుడ్లగూబెలా వచ్చింది?" అని ఆశ్చర్యంతో అడిగింది మణిమేఖల.

"ఒకవేళ వేటమంటపంలోవున్న చచ్చిన గుడ్లగూబకు ప్రాణమొచ్చిందేమో? మునుపొకసారి రాకుమారిని చూడగానే చచ్చిన కోతి బతికి రాలేదా?" అన్నాడు వంతిదేవుడు.

వేటమంటపపు ద్వారం బయటినుంచి తాళం వేయబడివుంది.

మణిమేఖల తాను తీసుకొని వచ్చిన తాళం చెవితో ఆ తాళాన్ని తెరిచింది. తర్వాత తలుపును మెత్తగా తెరిచింది.

ఇద్దరూ లోపలికి వెళ్ళారు.

~

మొదట వారి చుట్టూ చచ్చిన ఏనుగులు, పులులు, మొసళ్ళు, గద్దలు, గుడ్లగూబలు - వీటి భయంకరమైన శరీరాలే కనిపించాయి.

దీపాన్ని ఎత్తి పట్టుకొని బాగా చూసినప్పుడు, ఆ మృతదేహాల వెనక సగం మరుగై, సగం

కనపడేటట్లు ఎవరో కొందరు దాక్కొని ఉండడం తెలియవచ్చింది.

అప్పుడు వారు తెరుచుకొని వచ్చిన పేటమంటపం వాకిలి ధడేల్మని మూయబడింది.

ఎవరంత బలంగా తలుపును మూశారో చూద్దామని వంతిదేవుడు వెనక్కి తిరిగాడు.

అదే సమయాన అతడు వెనకనుంచి బలంగా ముందుకు తోయబడ్డాడు. మునుపొకసారి ఏ తోకలేని కోతి వెనక దాక్కొన్నాడో అదే కోతికి వెళ్ళి గుద్దుకొన్నాడు.

రెండు చేతులతన్ని బలంగా పట్టుకొన్నాయి. 'కోతి పట్టు' ఎంత బలమైనదో అప్పుడే అతడు బాగా, అనుభవపూర్వకంగా తెలుసుకొన్నాడు.

అతడు తన ఒరలో ఉన్న కత్తిని తీసేందుకు చేసిన ప్రయత్నం ఏమాత్రం ఫలించలేదు. అటూ ఇటూ కదిలేందుకే వీలుకాలేదు.

కోతి చేతులు - అంటే కోతి చేతులతోబాటు వచ్చిన మనిషి చేతులు - అతన్ని అంత బలంగా, బిగిగా పట్టుకొన్నాయి.

ఇంకా రెండు చేతులు అతని కత్తిని లాగేసుకొన్నాయి.

"అయ్యో!" అని భయంతో అరుస్తూ దగ్గరికి పరుగెత్తుకు వచ్చిన మణిమేఖల గుండెలవైపు ఆ కత్తి చాచబడింది.

"శబ్దం చేయవద్దు. కాసేపు ఊరుకొంటే, మేము చెప్పినట్లు వింటే - మీ ఇద్దరి ప్రాణాలకు ఏ అపాయమూ రాదు. శబ్దం చేస్తే ఇద్దరూ ప్రాణాలు కోల్పోతారు. మొదట, ఈ అధిక ప్రసంగం చేసే యువకుడు చనిపోతాడు" అన్నదో గొంతు.

అది రవిదాసు గొంతని వంతిదేవుడు గ్రహించాడు.

"రాకుమారీ! కాసేపు నిశ్శబ్దంగా ఉండండి! వీళ్ళు ఎందుకొచ్చారో, ఏం మాట్లాడుకొంటారో విని తెలుసుకొందాం!" అన్నాడు వంతిదేవుడు.

~~~
~~~

# అధ్యాయము - 36

## పాండ్య మహాదేవి!

**వంతిదేవుని** తోకలేని కోతితో చేర్చి కట్టారు. అతని సమీపాన గోడకు వేలాడదీసిన జింక కొమ్ములతో చేర్చి మణిమేఖలను కట్టారు.

"మంత్రవాదీ! నేను మాత్రమే మీకు శత్రువుని. కడంబూర్ రాకుమారినెందుకు కట్టేశారు? వెంటనే వదిలి పెట్టండి!" అన్నాడు వంతిదేవుడు.

రవిదాసు అతన్ని చూసి, "ఓపిక పట్టు తమ్ముడూ! చాల రోజులుగా నీవు మా కార్యాలకు అడ్డొస్తున్నావు! ప్రతిసారీ మేము నిన్ను ప్రాణలతో వదిలేస్తున్నాము. కానీ నీవు మా వెన్నంటే రావడాన్నాపడం లేదు!" అన్నాడు రవిదాసు.

వంతిదేవుడు నవ్వాడు.

"ఏమోయ్ నవ్వుతున్నావు? తోకలేని కోతి ఆలింగనం అంత సుఖంగా ఉందా?" అని అడిగాడు రవిదాసు.

"కాదు. నీవు చెప్పింది విని దాని గురించి ఆలోచించగా నవ్వొచ్చింది!" అన్నాడు వంతిదేవుడు.

"నేను చెప్పినదాంట్లో అలా నవ్వొచ్చే విషయమేముంది?"

"మిమ్మల్ని వెన్నంటి నేనొస్తున్నానన్నావు కద? మీరు నన్ను వదలకుండ వెన్నంటి వస్తున్నారని కూడ భావించవచ్చు కద? నా కార్యానికి మీరడ్డొస్తున్నారని చెప్పవచ్చు కద? ఇప్పుడు చూడు! నేను కడంబూర్ రాకుమారిని పిలుచుకొని ఒక ముఖ్యమైన పని మీద బయల్దేరాను. నీవు అడ్డొచ్చి ఈ తోకలేని కోతితో చేర్చి నన్ను కట్టేశావు!"

"ఓహో! అలాగా సంగతి! నీ కార్యానికి మేమడ్డొచ్చామనే అనుకో. కానీ అలా అడ్డు రావడం ఇది చివరిసారి. ఈ రోజు నీవు ప్రాణాలతో బతికి బయటపడితే ఇక మీదట నీవు మమ్మల్ని చూడనే చూడవు!"

"అలాగైతే నేను ప్రాణాలతో ఉండేవరకు ప్రయత్నించవలసిందే! నేను ప్రాణాలతో బయటపడేందుకు నీవే ఒక మంత్రం చెప్పు!" అన్నాడు వంతిదేవుడు.

"భేష్షుగా చెబుతాను. ఈ మంటపంలోను, పక్కగదిలోను ఏం జరిగినా దాని గురించి పట్టించుకోక ఊరుకో! బెదిరిపోయి ఏమీ చేయకు! నీ ప్రాణానికి ఏ అపాయమూ రాదు" అన్నాడు రవిదాసు.

"ఎందుకు నా మీద నీకింత అభిమానం, కనికరం? ఎందుకు నన్ను చంపక వదిలి వెళుతున్నారు?"

"అలా చెప్పు! అది పెద్ద వెర్రిబాగులతనమే! కానీ మా దేవి ఆజ్ఞ అది!"

"ఎవరు మీ దేవి?"

"నీ కింకా తెలియదా? పాండ్య మహాదేవే! పెద్ద పళువేట్టరయ్యర్ ఇంట వెలసిన పాండ్య చక్రవర్తి వీరపత్ని నందినీదేవే!"

"భలే వీరపత్ని!"

"ఛీ! దుష్ట బాలకా! మా దేవి గురించి నీవేదైనా అంటే నీ ప్రాణాలు దక్కవు!"

"మీరే కద పళువూర్ రాణి మీద నింద మోపుతున్నారు? ఇంకొక పురుషుని ఇంటికి వచ్చిన స్త్రీని వీరపాండ్యుని దేవి అంటున్నారు?"

"అయితేనేమి? రాముడి పత్ని సీత; రావణుని ఇంట కొంతకాలం ఉండలేదా?"

"రాముడు నకిలీ సీతాదేవిని తీసుకొచ్చేశాడు కద?"

"మేము కూడ మా పాండ్య మహాదేవిని పిలుచుకొని వెళ్ళేందుకే వచ్చాము. వారు దేని కోసం తమను తామే పళువూర్ అంతఃపురంలో బందీగా చేసుకొన్నారో ఆ కార్యం ఈ రోజు నెరవేరబోతూంది!"

"ఆహా! అదేం కార్యం?"

"కాసేపు ఓపిక పట్టు! నీవే తెలుసుకొంటావు! నీ దుష్టగుణాన్ని చూపిస్తే నీకు మాత్రం కాదు, ఈ అమ్మాయికి కూడ అదే దుర్గతి పడుతుంది!"

~

ఇలా చెప్పేసి రవిదాసు ఎదురుగా ఉన్న గోడవైపు వెళ్ళేందుకు ముందుకడుగు వేశాడు.

"మంత్రవాదీ! ఇంకా ఒకే ఒక్క విషయం చెప్పేసి వెళ్ళు!" అన్నాడు వంతిదేవుడు.

రవిదాసు తిరిగి చూసి, "తమ్ముడూ! ఇక నన్ను 'మంత్రవాది' అని పిలవకు!" అన్నాడు.

"మరి, తమరిని ఏమని పిలవాలి?"

"ముఖ్యమంత్రి అని పిలు!"

"అయ్యో! మీరు ఏ మహారాజ్యానికి ముఖ్యమంత్రి?"

"ఇంకా తెలియలేదా? పాండ్యమహారాజ్యానికి ముఖ్యమంత్రిని! పళ్ళిప్పడై సమీపాన జరిగిన పట్టాభిషేక మహోత్సవాన్ని చూశావు కద?"

"చూశాను, చూశాను! కానీ అది నా మనోభ్రాంతి అనుకొన్నాను!"

"అందుకే కాబోలు దాని గురించి నీవెవరికీ చెప్పలేదు!"

"ఒకరిద్దరికి చెప్పాను. వారు నన్ను పిచ్చివాడన్నారు. నేనేదో పీడకలగనివుండాలని కూడ అన్నారు...."

"ఆహా! వాళ్ళలాగే అనుకొంటూ ఉండనీ. నీవు బయట ఎవరికి చెప్పినా నమ్మరని నమ్మే మేము నిన్ను ప్రాణాలతో విడిచిపెట్టాం!"

"మంత్రవాదీ! మీరు నన్ను ప్రాణాలతో విడిచి పెట్టేందుకు అదొకటేనా కారణం?"

"ఇంకేమి?"

"మీ రాణి...నాకోసం వత్తాసు పలకలేదా?"

"అందువల్లనేమి?"

"ఇప్పుడు కూడ వారి వత్తాసు నాకు దొరుకుతుంది."

"దొరికేవరకు ఓపిక పట్టు."

"మంత్రవాదీ! మీరాణి నన్ను వెంటనే పిలుచుకొని రమ్మని ఈ కడంబూర్ రాకుమారికి చెప్పి పంపించారు. అందుకే మేమిద్దరం ఒంటరిగా వచ్చాము..."

"అబ్బాయీ! రాణిగారి గదికి వెళ్ళేందుకు ఇంకొక దారి ఉంది కద? ఈ దారిన రానేల?"

"దాని గురించి నేను నీకు చెప్పనవసరం లేదు. మీరాణి అడిగితే చెప్పుకొంటాను."

"రాణి వచ్చి అడిగేంతవరకు ఓపిగ్గా ఉండు!"

"మంత్రవాదీ! నన్ను, శంబువరయ్యర్ కుమారిని కట్లు విప్పించమని చెప్పు. లేకపోతే...!"

"ఏం చేస్తావు?"

"ఈ మంటపం అదిరేలా కేకలేస్తాను!"

"నీవలా కేకలేస్తే మరుక్షణం మూడు శూలాలు నీమీదికి దూసుకొస్తాయి. జాగ్రత్త!"

~

వంతిదేవుడు చుట్టూ పరీక్షగా చూశాడు.

అవును. ముగ్గురు కుట్రదారులు చేత శూలాలతో సిద్ధంగా నిలబడివున్నారు. "తమ్ముడూ! నీవు చాల తెలివైన అబ్బాయివి. నిన్ను మాతో చేర్చుకొందామన్న ఆశ కూడ ఒకప్పుడుండేది. కానీ నీవు ఆ పళైయారై మోహిని పాశంలో చిక్కుకొనేశావు. అది పోతేపోనీ. ఇప్పుడు బుద్ధి ఉపయోగించి బతుకు! శబ్దం చేస్తే మటుకు చావడం తథ్యం!"

ఇలా చెప్పేసి రవిదాసు ఎదురుగా ఉన్న గోడ దగ్గరికి వెళ్ళి దానిపైన ఉన్న ఏనుగు తలకు చెవి ఆనించి శ్రద్ధగా విన్నాడు. తర్వాత దాని పొడవాటి దంతాలను పట్టి తిప్పాడు.

అక్కడ ఒక చిన్న ద్వారం తెరుచుకొంది. లోపలి గదిలో ప్రకాశంగా జ్వలిస్తున్న దీపం వెలుతురు తిన్నగా పూర్ణచంద్రుని వెండికిరణాలలాగ వేటమంటపంలోకి ప్రవేశించి ప్రకాశింపజేసింది.

~

వంతిదేవుడు పక్కకు తిరిగి చూశాడు. రాకుమారి మణిమేఖల తన బొడ్లోవున్న చురకత్తిని తీసి తన చేతి కట్లను తెంచేసుకొందని గ్రహించాడు.

మణిమేఖల ఇడుంబన్‌కారి వద్దనుంచి తీసుకొన్న దీపం వేటమంటపంలో ఒక మూల మిణుకు

మిణుకుమంటూంది. దాని వెలుతురు మణిమేఖల మీద పడడమే లేదు. అదీగాక, కుట్రదారులు వంతిదేవునే గమనిస్తూండడం వల్ల, కడంబూర్ రాకుమారి మణిమేఖలను వారు గమనించనే లేదు.

మణిమేఖల కట్లు తెంచుకొని తనని తాను విడుదల చేసేసుకొందని వంతిదేవుడు గ్రహించాడు.

వెంటనే నోటిని పూరించి గుడ్లగూబలాగ కూత వేశాడు.

మొదట కుట్రదారులు ముగ్గురూ భ్రమించి నిలబడిపోయారు. తెరిచిన ద్వారంగుండా లోపలికి తొంగి చూస్తున్న రవిదాసు కూడ అదిరిపడి తిరిగి చూశాడు.

“ఆహ్! నీపనేనా ఇది?” అంటూనే వంతిదేవునివైపు వేగంగా వచ్చాడు.

అతడు ఏనుగు దంతాలమీదినుంచి చేయి తీయగానే ద్వారం మూసుకొంది. మళ్ళీ వేటమంటపంలో చీకటి కమ్ముకొంది.

కుట్రదారులు ముగ్గురూ చేత శూలాలతో వంతిదేవునివైపు వేగంగా పరుగెత్తుకొచ్చారు.

వారిలో ఒకడిని వంకీలు తిరిగిన జింక కొమ్ములు కొట్టాయి. ఇంకొకడిమీద బ్రహ్మాండమైన ఎలుగుబంటి పడి వాడిని కింద పడదోసింది. మూడోవాడిమీద తెరిచిన నోరు, భయంకరమైన పళ్ళు ఉన్న మొసలి దూకింది. రవిదాసు తలమీద ఒక పెద్ద గబ్బిలం ధడేల్మని పడింది.

~

ఇలా ఉన్నట్లుండి మీద పడ్డ అటకాయింపుల వల్ల వారు ఒక నిమిషం చేష్టలుడిగి నిలబడిపోగా, మణిమేఖల వేగంగా వంతిదేవుని వద్దకు వచ్చి అతని కట్లను తెంపేసింది.

వంతిదేవుడు ఇంతవరకు తనను పట్టుకొన్న తోకలేని కోతిని వారిమీదికి విసిరేశాడు.

నలుగురూ తమ మీద పడ్డ చచ్చిన మృగాల దేహాలను పక్కకు తోసి మెల్లగా సంభాళించుకొని లేచారు. ఇంతలో వంతిదేవుడు చేత ఒక శూలాన్ని తీసి పట్టుకొని యుద్ధానికి సిద్ధమయ్యాడు.

ఆ సమయాన నందిని గది తలుపు బాగా తెరవబడింది.

వేటమంటపంలోకి వెలుతురు వచ్చి బాగా ప్రకాశవంతమైంది.

మరుక్షణం నందిని కూడ వేటమంటపంలోకి ప్రవేశించింది,

“మంత్రవాదీ! ఇదేం మూర్ఖత్వం? ఇక్కడేం గడబిడ/గలాటా చేస్తున్నారు?” అని అడుగుతూనే ముందుకు వచ్చింది.

~~~
~~~

# అధ్యాయము - 37

## పాషాణ హృదయం కరిగింది!

**వేటమంటపంలో** వంతిదేవుని, మణిమేఖలను చూసి, నందిని కూడ కాస్త ఆశ్చర్యపోయింది. "ఓహో! మీరిక్కడికెలా వచ్చారు?" అని అడిగింది.

"దేవీ! మీ ఆజ్ఞ అని మీ స్నేహితురాలు చెప్పినందువల్ల వచ్చాను. ఆడబుద్ధిని వినిపించుకోకూడదని ఇక్కడికి వచ్చిన తర్వాత తెలుసుకొన్నాను" అన్నాడు వంతిదేవుడు.

"అక్కా! నేనీయనకు ఏమీ సలహా ఇవ్వలేదు. నాతో మిమ్మల్ని చూసేందుకు రమ్మని వేడుకొన్నానంతే!" అన్నది మణిమేఖల.

నందిని తనకు మొదట కలిగిన ఆశ్చర్యాన్ని సంభాళించుకొని చిరునవ్వు నవ్వింది.

"నా ముద్దుల చెల్లాయ్! ఆడవాళ్ళమైన మనం పురుషులను వేడుకొంటే అది వారికి సలహా ఇచ్చినట్లే!" అన్నది.

"బుద్ధి చెప్పడం మాత్రమేనా? ఆజ్ఞాపించడంలాగ అని కూడ చెప్పండి, దేవీ! మీరు పిలిచారని చెప్పి రాకుమారి చేయి పట్టుకొని లాక్కొని వచ్చింది. దాని ఫలితంగానే ఈ హంతకుల చేత చిక్కుబడవలసి వచ్చింది!"

"అయ్యా! ఇక్కడ జరిగింది చూస్తే వీరు హంతకుల్లాగ కనిపించడం లేదే? నేనిప్పుడు ఇక్కడికి వచ్చివుండకపోతే మీరు కద వారిని చంపేసేవారు లాగుంది?"

"అక్కా! వీరు హంతకులే! కాసేపటి క్రితం వీళ్ళు ఈయనను తోకలేని కోతితో చేర్చి కట్టేశారు!"

నందిని చిన్నగా నవ్వేసి, "మణిమేఖలా! మునుపొకసారి ఈయన ఆ తోకలేని కోతి వెనక దాక్కొన్నారని చెప్పావు కద? అది వీళ్ళకెలాగో తెలిసిపోయింది!" అన్నది.

"ఎలాగో కాదక్కా! మీరు వచ్చేందుకు ఒక రోజు ముందు ఈ వేటమంటపంలో చూశానని చెప్పాను కద? వారే వీరు! ఆరోజే ఈయనను తరుముకొని వచ్చారు వీళ్ళు. మంచివేళగా వీరు వారి దగ్గరినుంచి తప్పించుకొని పారిపోయారు..."

"మళ్ళీ ఈ రోజు ఈయనను నీవే పిలుచుకొని వచ్చి వీళ్ళకు ఒప్పజెప్పావెందుకు, మణిమేఖలా? ఈ దారిన వీరిని ఎందుకు పిలుచుకొని వచ్చావు?"

"అక్కా! కాసేపటి క్రితం నా అన్న గందమారన్ మిమ్మల్ని చూసేందుకు వెళతానని చెప్పాడు. వాడి కంట పడకూడదనే ఈ దారిన పిలుచుకొని వచ్చానu. అదే మంచిదైంది. లేకపోతే, ఈ హంతకులు..."

"చెల్లాయ్! వీరు హంతకులు కారు. ఈయనను చంపేందుకు రాలేదు. రెండు మూడుసార్లు

ఈయన వీరిచేత ఒంటరిగా చిక్కుబడ్డారు. అయినా కూడ ప్రాణాలతో విడిచి పెట్టారు. అందు గురించిన నిజాన్ని నీవు ఆయననే అడిగి తెలుసుకోవచ్చు."

"అలాగైతే వీరెవరక్కా? కాసేపటి క్రితం వీరు చెప్పిందేమైనా నిజమా? వీళ్ళు మీకు తెలిసినవారా? మిమ్మల్ని పిలుచుకొని వెళ్ళడానికి వచ్చారా?" అని మణిమేఖల ఆశ్చర్యంతో అడిగింది.

"అవును, చెల్లీ! నన్ను కాపాడి పిలుచుకొని వెళ్ళడానికి వచ్చారు. అంతా వివరంగా చెబుతాను. మీరిద్దరూ నాతో పక్కగదిలోకి రండి! వీళ్ళిక్కడే ఉండనీ!" అన్నది నందిని.

తర్వాత రవిదాసుని చూసి, "మంత్రవాదీ! ఇక మీదట మీరు వీరిద్దరిలో ఏ ఒక్కరికి ఏ హాని చేసినా, అది నాకు చేసినట్లే భావిస్తాను. ఇక మీదట మీరు వీరిని ఎక్కడ, ఎప్పుడు చూసినా కూడ చాల మర్యాదతో నడుచుకోవాలి!" అన్నది.

రవిదాసు, "దేవీ! క్షమించాలి. ఈ యువకుడికి మన రహస్య సంకేతం తెలిసిపోయింది. కాసేపటి క్రితం గుడ్లగూబలాగ కూసింది వీడే!" అన్నాడు.

"అందునుంచే ఈ వీరయువకుడు మనతో చేరినవాడని తెలియడం లేదా? మంత్రవాదీ! నీ కుశాగ్రబుద్ధి ఎక్కడికి పోయింది? పోయింది పోనీ. ఇక, నేను మళ్ళీ తెలియజేసేవరకు ఇక్కడ శబ్దమేమీ చేయకూడదు! జాగ్రత్త!" అన్నది నందిని.

తర్వాత నందిని, మణిమేఖల, వంతిదేవుడు ఏనుగు ముఖం ద్వారంగుండా నందిని గదిలోపలికి ప్రవేశించారు. వెంటనే ఆ ద్వారం మూసుకొంది.

~

"చెల్లాయ్! నీవు చాల తెలివైనదానివి. నీవు ఈయనను వేటమంటపం దారిగుండా పిలుచుకొని వచ్చింది చాల మంచిదైంది. నీ అన్న ఇప్పుడే ఇక్కడినుంచి వెళ్ళాడు. ఆదిత్య కరికాలన్‌గారిని పిలుచుకొని వస్తానని వెళ్ళాడు. అంతలోపల నేను మిమ్మల్ని పంపించేయాలి. మీ దగ్గర సెలవు తీసుకోవాలి కూడాను!" అన్నది నందిని.

"అక్కా! ఇదేమి? మీవారి గురించిన నిజాన్ని తెలుసుకొని రావడానికి ఈయనను పంపిస్తానని కద అన్నారు? ఇప్పుడు సెలవు తీసుకొంటానని అంటున్నారేమి?" అన్నది మణిమేఖల.

"మీ అన్నతో మాట్లాడిన తర్వాత ఆ ఆలోచనను మార్చుకొన్నాను. చెల్లాయ్! పళువేట్టరయ్యర్ ప్రాణాలతో ఉన్నా, లేకున్నా నేనిక ఇక్కడ ఉండ సాధ్యం కాదు. ఈ వీరులు ఇక్కడ ఉండడం కూడ అపాయమే. అయ్యా! మీరు వెంటనే ఇక్కడినుంచి బయలుదేరండి. మీ ప్రాణాలమీద మీకు ఆశ లేకపోయినా, ఈ అమ్మాయి కోసమయినా వెళ్ళిపొండి!" అన్నది నందిని, వంతిదేవుని ఉద్దేశించి.

"రాకుమారీ! పళువూర్ రాణి ఉద్దేశాన్ని మీరు గ్రహించలేదు. నేనిక్కడినుంచి వెళ్ళిపోతే, మీరు ఆదిత్య కరికాలన్‌గారిని పెళ్ళిచేసుకొని, పట్టమహిషిగా విరాజిల్లవచ్చని వారి ఉద్దేశం!" అన్నాడు

వల్లవరయ్యన్.

"లేదు; నేనా ఉద్దేశంతో చెప్పలేదు. ఆదిత్య కరికాలన్‌గారిని పెళ్ళిచేసుకొనే దౌర్భాగ్యం ఏ అమ్మాయికీ కలగకూడదని నేను కోరుకొంటున్నాను. అందులోను, నా ప్రాణానికి ప్రాణమైన మణిమేఖలకు ఆ గతి పట్టాలా? అయ్యా! మీరు కావాలని నా ఉద్దేశాన్ని మార్చి చెబుతున్నారు. మీరిప్పుడు తప్పించుకొంటే, తర్వాత రాబోయే కాలంలో ఈ అమ్మాయిని పెళ్ళిచేసుకొనే భాగ్యం కలగవచ్చు! మణిమేఖలా! నీకీయన మీదున్న ప్రేమ నిజమైతే, వెంటనే ఈయనను ఇక్కడినుంచి వెళ్ళిపొమ్మను!" అన్నది నందిని.

"రాణీ! నేను వెళ్ళేందుకు సిద్ధంగా ఉన్నాను. మీ దగ్గరున్న ఒక వస్తువును యాచిస్తున్నాను. అది ఇచ్చేస్తే, నేను వెళ్ళిపోతాను!" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యా! మీరు నా దగ్గర కోరి పొందగల వస్తువేముంది? చెప్పండి!"

"మీనలాంఛనం పొదిగిన ఖడ్గమొకటుంది మీ దగ్గర. అది నాకిచ్చేస్తే వెళ్ళిపోతాను. నా ఖడ్గాన్ని కొళ్ళిడం నది వరదలో పోగొట్టుకొన్నానని మీకు తెలుసు కద?" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యా! వేటమంటపంలో ఎన్నో కత్తులు, శూలాలు ఉన్నాయి. కావలసింది తీసుకొని ఇప్పుడే బయలుదేరవచ్చు కద? ఆడదాన్నయిన నేను నన్ను కాపాడుకోవడానికి ఉంచుకొన్న ఆ ఒకే ఒక ఆయుధాన్నే ఎందుకడగాలి?"

"దేవీ! తమ ప్రాణాలను మాత్రమేనా కాపాడుకోవడానికి ఆ కత్తిని మీ దగ్గరుంచుకొని పూజిస్తున్నారు? నిజం చెప్పండి!"

"నా ప్రాణానికన్న ముఖ్యమైన నా శీలాన్ని కాపాడుకోవడానికి కూడ దాన్ని నాదగ్గర పెట్టుకొన్నాను."

"దేవీ! ఇంకే ఉద్దేశమూ లేదు కద?"

"ఇంకే ఉద్దేశం ఉండగలదు?"

"వీరపాండ్యుని మరణానికి పగ తీర్చుకోవడానికి కూడ కావచ్చు కద?"

"మణిమేఖల ఉన్నప్పుడు మీరా విషయాన్ని ప్రస్తావించరనుకొన్నాను. నేను కూడ దాన్ని దాచివుంచనవసరం లేదు. చెల్లాయ్! నీవూ తెలుసుకో. నేనీ కడంబూర్ అంతఃపురానికి వచ్చిన ఉద్దేశమేమిటో తెలుసుకో!"

~

ఇలా అంటూనే నందిని మంచంమీదున్న మీనలాంఛనం పొదిగిన కత్తిని చేతికి తీసుకొంది.

"చోళసామ్రాజ్యపు అంతఃకలహాన్ని తీర్చేందుకు నేనిక్కడికి రాలేదు. మధురాంతక దేవరికి, ఆదిత్య కరికాలన్‌గారికి రాజ్య విభజన చేసి పెట్టేందుకు కూడ నేనిక్కడికి రాలేదు. కడంబూర్ అంతఃపురంలో

విందుభోజనమారగిస్తూ కాలం వెళ్ళబుచ్చేందుకూ నేనిక్కడికి రాలేదు! చెల్లాయ్! నీ పెళ్ళి కుదిర్చేందుకూ రాలేదు. వీరపాండ్యుని శిరచ్ఛేదం చేసిన పాతకుని మీద పగ తీర్చుకోవడానికే ఇక్కడికి వచ్చాను. ఇది పాండ్యకులానికి చెందిన ఖడ్గం! దీనిమీద ఆన చేసి శపథం చేశాను. ఆ శపథాన్ని నెరవేర్చేందుకే వచ్చాను. ఈ రాత్రి నా శపథాన్నైనా నెరవేరుస్తాను; లేదా నా ప్రాణాన్ని బలిస్తాను!" అని నందిని ఆవేశం పూనినట్లు అన్నది.

"అందుకు నేనడ్డుగా ఉంటాననే కద నన్ను వెళ్ళిపొమ్మంటున్నారు? నా ప్రాణాలకు ఆపద వస్తుందని భయపెడుతున్నారు?" అన్నాడు వంతిదేవుడు.

"ఆహా! నా పగ తీర్చుకొనే ప్రయత్నానికి మీరడ్డు రాబోతున్నారా? మంచిపని! ఎవరు వద్దన్నారు? మీ స్నేహితుల దగ్గరికి వెళ్ళి ఇదంతా వివరించి చెప్పి ఇక్కడికి రావద్దని అడ్డుపడవచ్చు కద?"

"దేవీ! ఆయనకిదంతా చెప్పి అడ్డుకోవడం సాధ్యం కాదు. అందుకే మీకాళ్ళమీదైనా పడి వేడుకోవాలని వచ్చాను. మీరీ పాపకార్యం చేయకుండ అడ్డుకోవాలని వచ్చాను..."

"ఆహా! పాపకార్యమా? ఏది పాపకార్యం? నా చెలికత్తెను అడిగి చూద్దాం! మణిమేఖలా! నీవు చెప్పు! నీవు నీ మనసును ఒకరికి అర్పించావనుకో. ఆయన గాయపడి నిరాయుధులుగా ఉన్నప్పుడు ఆయన శత్రువు అక్కడికి వస్తాడు. నీవా పగవాని కాళ్ళమీద పడి నీ ప్రేమికుని చంపవద్దని వేడుకొంటావు. వాడు అప్పటికీ వినిపించుకోక నీ ప్రేమికుని చంపేసి వెళతాడు. అటువంటి పాతకుని మీద పగ తీర్చుకోవడం పాపమని నీవంటావా, నా ముద్దూ/కన్నా?"

"ఏనాడూ అననక్కా! కానీ మీలాగ వాడి కాళ్ళమీద పడి బతిమాలుకొనే దాన్ని కాను. నేనే కత్తి తీసుకొని వాడిని ముందుగానే చంపేసేదాన్ని!" అన్నది మణిమేఖల.

వంతిదేవుడు మణిమేఖలను చూసి, "రాకుమారీ! ఆ పగవాడు సాక్షాత్తు మీ సహోదరుడని తెలియవస్తే...?" అని అడిగాడు.

"సహోదరుడైన గాని, ఇంకెవరైన గాని నాకు ఒకటే!" అన్నది మణిమేఖల.

"అలా చెప్పు, నా బంగారు!" అన్నది నందిని.

"రాకుమారీ! మీరు ఏమంటున్నారో తెలియకుండ చెబుతున్నారు. వీరి సహోదరుడు గందమారన్ వీరికెంతటి విరుద్ధమైన కార్యం చేసినా కూడ, వాడిని చంపేందుకు వీరికి మనసొప్పుతుందా?" అని వంతిదేవుడడిగాడు.

నందిని, మణిమేఖల ఒకరినొకరు చూసుకొన్నారు.

~

తర్వాత నందిని వంతిదేవుని చూసి, "ఇదేమి అనవసర ప్రశ్న? నేను నా తోబుట్టిన సహోదరుని చంపబోవడం లేదు. మొట్టమొదట మీరు నన్ను కలిసినప్పుడు నా అన్న తిరుమలై పేరు చెప్పారు.

అందుకే నాకు మీమీద అభిమానం కలిగింది. ఆళ్వార్ కట్టియాన్ మిత్రులు కాబట్టే చాలసార్లు మీరు అపాయంనుంచి తప్పుకోవడానికి సహాయం చేశాను. అయ్యా! నేనీరోజు నా శపథాన్ని తీర్చకుండ నా ప్రాణాలు విడవవలసివస్తే, తిరుమలైని నేను క్షమాపణ కోరానని చెప్పండి. అతడు చెప్పినట్లు నేను నడుచుకోకపోయినా, అతన్ని పూర్తిగా మరిచిపోలేదని చెప్పండి!" అన్నది.

"అమ్మా! ఈ కపట నాటకం ఇంకా ఎందుకు? ఆళ్వార్ కట్టియాన్ మీ అన్న కాదు; మీరు ఆ వీరవైష్ణవుని సహోదరి కూడ కారు..."

"మరి ఎవరు నా అన్న? ఎవరి సహోదరిని నేను?"

"మీ అన్న ఆదిత్య కరికాలనే. అందుకే మీరు సహోదర హత్యాదోషానికి పాలు కాకూడదని వేడుకొంటున్నాను. వీరపాండ్యుని కులానికి చెందిన ఆ మారణఖడ్గాన్ని నాకిచ్చేయమని బతిమాలుకొంటున్నాను!"

"కరికాలన్, నేను తోడబుట్టినవారమన్న అపూర్వ కల్పనను మీరు యువరాజుకు చెప్పారు కద? దాన్ని ఆయన నమ్మారా?" అని హేళనగా నవ్వుతూ అడిగింది నందిని.

"నమ్మినట్లే తోచింది. కానీ ఆయన మనసులో ఏముందో నేనెరుగను..."

"ఆయన మనసులో ఏముందో నాకు తెలుసు. ఆ పళైయారై మోహినికున్న కల్పనాశక్తి గురించి ఆశ్చర్యపోతున్నాను..."

"దేవీ! నేను చెప్పింది కల్పన కాదు. పళైయారై రాకుమారి కల్పన కానేకాదు. ఈలంలో (లంకలో) కళ్ళారా నేనే చూశాను..."

"ఏం చూశారు?"

"నోరు తెరిచి మాట్లాడలేని ఒక స్త్రీదైవాన్ని చూశాను. నన్ను, ఆళ్వార్ కట్టియాన్ని, అరుళ్మొళివర్మని ఆ దేవతాస్త్రీ ఒక మహాపాయం నుంచి కాపాడింది. అనురాధపురంలో అర్ధరాత్రి ఒక పాడుబడ్డ మాళిగ పక్కగా నడిచి వెళుతున్నప్పుడు వారు వీధిలో మాకెదురుగా నిలిచి సైగతో మమ్మల్ని పిలిచారు. మేము వారివైపు నడిచి వెళ్ళగానే ఆ భవనం ముందుభాగం విరిగిపడింది. పొన్నియిన్ సెల్వన్ ఆ వనితామణిని తమ కులదైవమని ఎంచి నమస్కరించారు..."

"అయ్యా! ఈ కథకు, నాకు ఏం సంబంధం? అరుళ్మొళివర్మని చోళసింహాసనం మీద కూర్చోబెట్టాలని కోరుకొంటున్న యువరాకుమారికి ఇదంతా చెప్పివుండవచ్చు; ఆమె కూడ ఆశ్చర్యపడి ఆనందించేది. నాకెందుకు చెబుతున్నారు?"

"అందుకు కారణముంది. అనురాధపురం వీధుల్లో మసక వెన్నెల వెలుతురులో ఆ స్త్రీమణిని నేను కాస్త దూరంనుంచి చూసినప్పుడు, 'తంజావూరులో మనం సెలవు తీసుకొని వచ్చిన పళువూర్ రాణి ఇక్కడికెలా వచ్చారు?' అని ఆశ్చర్యపోయాను. దేవీ! మీకు వారికి రూపురేఖల్లే అణుమాత్రం కూడ

వ్యత్యాసం లేదు. మీరు రాజరికపు వస్త్రాభరణాలు త్యజించి మామూలు బట్టలు ధరించి జుట్టు విరబోసుకొంటే అచ్చు ఆమెలాగే ఉంటారు!"

"మీ మాట నేనెందుకు నమ్మాలి? మీరు కల్పనాశక్తి అధికంగా ఉన్నవారని నేనెరుగుదును. ఇది కూడ మీ అపూర్వ కల్పనలలో ఒకటి కావచ్చు కద?"

"దేవీ! సత్యప్రమాణం చేసి చెబుతున్నాను."

"మీరెంత సత్యప్రమాణం చేసి చెప్పినా నేను నమ్మలేను!"

"రాణీ! 'నమ్మలేను' అని మీరు చెబుతున్నది అబద్ధం! నేను చెబుతున్నది నిజమేనని మీకే తెలుసు. మేము తెలుసుకోక మునుపే మీకు తెలుసు. ఆ నిజాన్ని మీ కార్యానికి ఉపయోగపరుచుకొన్నారు కూడాను. మొట్టమొదట మిమ్మల్ని తంజావూరులో కలిసి మాట్లాడుతున్నప్పుడు ఈ మంత్రవాది గుడ్లగూబలాగ కూస్తూ వచ్చాడు. నన్ను అవతలికి వెళ్ళి ఉండమన్నారు. యధాలాపంగా తెరిచివున్న బొక్కసపు నేలమాళిగ లోపలికి వెళ్ళి దాక్కొన్నాను. అప్పుడు కొన్ని వింతైన దృశ్యాలను నేను చూడడం జరిగింది..."

"ఆహా! ఏమో అపూర్వ దృశ్యాలు?"

"గందమారన్ మధురాంతకులతో ఆ నేలమాళిగ మార్గం గుండా వెళ్ళడం చూశాను..."

"అందువల్లనేమి?"

"కాసేపటికల్లా మీరు, పెద్ద పళువేట్టరయ్యర్ కూడ వెళ్ళడం చూశాను. అప్పుడు మీరెక్కడికి వెళుతున్నారన్నది నాకు తెలియలేదు. తర్వాతే ఊహించి తెలుసుకొన్నాను. తమ తల్లి ఆత్మారూపంలాగ నటించి చక్రవర్తిని వేధించేందుకే వెళుతున్నారని గ్రహించాను..."

~

ఇంతవరకు దిటవుగా నిలబడి మాట్లాడుతున్న నందిని ఇప్పుడు ఉన్నట్లుండి అలిసిపోయినట్లు  పక్కనున్న ఆసనం మీద కూర్చొంది.

"అయ్యో! ఇంకా ఏం తెలుసుకొన్నారు?"

"మీరు, పళువేట్టరయ్యర్ నేలమాళిగ మార్గంలో వెళుతున్నప్పుడు మధురాంతకులను పిలుచుకొని వచ్చిన గందమారన్ తిరిగి వస్తున్నాడు. పళువేట్టరయ్యర్ వాడికేదో చెప్పారు. ఆయన తమతో దివిటీ పట్టుకొని వచ్చిన కాపలావాడికి ఏదో సంజ్ఞ చేశారు..."

"అది ఏం సంజ్ఞ?"

"మీకది తెలిసేవుండాలి. గందమారన్ని వెన్నుపోటు పొడిచి చంపేయమని ఆజ్ఞాపించారు. దానికి నేను అడ్డుపడి గందమారన్ ప్రాణాలను నేను కాపాడాను. దానికి ఫలితంగా వాడిని వెన్నుపోటు పొడిచిన నింద నామీద పడింది..."

నందిని మణిమేఖలవైపొకసారి చూసేసి, “అయ్యా! ఏవేవో చెప్పి, ఎందుకీ పిల్ల మనసు కల్లోలితం చేస్తున్నారు?” అన్నది.

“దేవీ! ఇంతకాలమూ నేనిదంతా ఎవరికీ చెప్పలేదు. మీచేతనున్న ఖడ్గాన్ని నాకిచ్చేస్తే ఇక మీదట కూడ ఎవరికీ చెప్పను...”

“ఖడ్గాన్ని ఇవ్వజాలను. అయ్యా! ఎందుకివ్వాలి? ఎవరికైనా వెళ్ళి చెప్పుకోండి. ఇంకా ఏమైనా కల్పనలు చేర్చి చెప్పుకోండి. ఏల? ఇప్పుడే కరికాలన్‌గారి వద్దకు వెళ్ళి ఆయన ఇక్కడకు రాకుండ ఆపేయండి! నన్నెందుకు ఇబ్బంది పెడుతున్నారు? వెళ్ళండి! వెళ్ళిపోండి!” అన్నప్పుడు నందిని కళ్ళలో నీరుబికింది.

“అమ్మా! యువరాజు స్వభావం నాకు బాగా తెలుసు. ఆయనను నేనడ్డుకోలేను. అడ్డుకోజూస్తే ఆయన హఠం ఇంకా అధికమౌతుంది. అందుకే నేను మిమ్మల్ని వేడుకొంటున్నాను...”

“నన్ను వేడుకోవడానికి మీకేం హక్కు? మీరు చెప్పినదంతా నిజమే కావచ్చు. లంకలో మీరు నన్ను పోలిన తల్లిని చూశారే అనుకొందాం. అందుకని నేనెందుకు నా శపథాన్ని వదిలిపెట్టాలి? నా తల్లికి చక్రవర్తి చాల పెద్ద ద్రోహం చేశారు. వారి మీద, ఆయన పిల్లల మీద నేనెందుకు కనికరం చూపాలి? పగ తీర్చుకోవడానికి ఇంకా కారణాలు అధికం కద అవుతున్నాయి?”

“లేదు, రాణీ! లేదు! మీ పగ తీర్చుకొనే ఉద్దేశాన్ని మీ తల్లి ఒప్పుకొంటుందేమో ఒక్కసారి ఆలోచించి చూడండి/ చక్రవర్తి పిల్లలను ఆ మూగరాణి తమ ప్రాణానికి ప్రాణంగా భావిస్తున్నారు. వారిలో ఒకరిని మీరు మీ చేత్తో చంపడాన్ని ఆమె కోరుకొంటారా అని ఒక్కసారి ఆలోచించి చూడండి! ఏనాడూ అలా కోరుకోరు. మీ ఉద్దేశం తెలిస్తే మిమ్మల్ని అసహ్యించుకొంటారు. వారు సజీవంగా ఉన్నంతవరకు మిమ్మల్ని శపిస్తూ ఉంటారు. చనిపోయిన తర్వాత కూడ ఆత్మరూపంలో వచ్చి మీ చుట్టూ తిరుగుతుంటారు. వారు నోరు తెరిచి మాట్లాడలేరు. కానీ వారి కంటిచూపులే ఎన్నటికీ మిమ్మల్ని నరకంలోను వేధిస్తూంటాయి...”

~

నందిని కళ్ళనుంచి ఇప్పుడు కన్నీళ్ళు ధారగా ప్రవహించసాగాయి. కన్నీళ్ళు తుడుచుకొని తలెత్తి చూసింది. అక్కడ ఏదో దుఃఖపూరితమైన దృశ్యాన్ని చూసినట్లు ఆమె ముఖం వేదనతో నిండింది. “అమ్మా! అమ్మా! వీరపాండ్యుని తల, మొండెం విడివిడిగా వచ్చి నన్ను వేపుకు తినడం చాలదా? నీవు కూడ వచ్చి నన్ను చుట్టుకోవాలా?” అంటూనే ఆ దృశ్యాన్ని చూడలేనట్లు కళ్ళను చేతులతో కప్పుకొంది. కాసేపు ఆ గదిలో నందిని వెక్కి వెక్కి ఏడ్చే శబ్దం మాత్రమే వినిపించింది.

మణిమేఖల వంతిదేవుని చూసి, “అయ్యా! మీరింత క్రూరులని నాకు తెలియకపోయింది!” అన్నది.

ఇది విన్న నందిని కళ్ళమీదినుంచి చేతులను తీసేసి, “ఆయన తప్పేమీ లేదు. నా

మంచికోసమే చెబుతున్నారు. నన్నొక మహాపాతకచర్యనుంచి కాపాడేందుకే చెబుతున్నారు! కానీ అది నన్నింతగా బాధిస్తోంది!" అన్నది.

తర్వాత, కన్నీళ్ళు నిండిన కళ్ళతో వంతిదేవుని చూసి, "అయ్యా! ఇంతవరకు ఎవరూ సాధించలేని కార్యాన్ని మీరు సాధించారు. నా ఉక్కు హృదయాన్ని కరిగించారు. ఇదిగో మీ కోరిక ప్రకారమే ఈ ఖడ్గాన్ని మీకే ఇచ్చేస్తున్నాను. స్వీకరించండి!" అని కత్తిని చాచింది.

~

వంతిదేవుడు దాన్ని స్వీకరించేందుకు చేయి చాచగా మళ్ళీ వెనక్కి తీసేసుకొంది.

"కాస్త ఓపిక పట్టండి! ఈ ఖడ్గాన్ని స్వీకరించే ముందు నాకొక సహాయం చేయగలరేమో చెప్పండి. నేను నా శపథాన్ని నెరవేర్చకుండ ఇక్కడినుంచి బయటపడజూస్తే వేటమంటపంలో ఉన్నవారు నన్ను ఊరకే వదలరు. సజీవంగా చితిమీద పెట్టి కాల్చేస్తారు. అందుకు కూడ నేను జంకడం లేదు. కానీ నేను చనిపోయేముందు నా తల్లిని ఒక్కసారి చూడాలని కోరుకొంటున్నాను. వాణర్కులవీరా! మీరు చెప్పినదంతా నేను నమ్మలేదన్నాను. అది పొరబాటు. లంకలోని అడవుల్లో తలవిరబోసుకొని తిరుగుతున్న నా తల్లిని గురించి మీరు చెప్పినదంతా నేను నమ్ముతున్నాను. ఒక్కొక్కమాటా నమ్ముతున్నాను. నేనే ఆమెను చూశాను కూడాను..."

"ఎప్పుడు? ఎలా?" అని అడిగాడు వంతిదేవుడు.

"చిన్నబిడ్డగా ఉన్నప్పుడు పడుకొని నిద్రపోయేటప్పుడు ఒక్కొక్కసారి ఉలిక్కిపడి కళ్ళు తెరిచేదాన్ని. అప్పుడు ఒక స్త్రీముఖం నా ముఖంమీదికి వంగి నన్నే కళ్ళార్పకుండ చూస్తూండేది. నేను కళ్ళు తెరవగానే ఆ రూపం మరుగైపోయేది. నాకది చాల ఆశ్చర్యాన్ని, భయాన్ని కూడ కలిగించేది. అద్దంలో నా ముఖాన్ని చూసుకోవడంలో చిన్నప్పటినుంచే చాల ఆశ ఉండేది. కాబట్టి నా ముఖం నా మనసులో పదిలమైంది. నేను నిద్రపోయేటప్పుడు వంగి నన్నే పరీక్షగా చూసే ఆ రూపం గురించి చాల ఆశ్చర్యపడేదాన్ని. నా ముఖమూ, ఆ ముఖమూ ఒకేలా ఉండేవి. గూడు వదిలి గూడు దూరే కథలు నేను వినేవున్నాను. నా ప్రాణమే నా శరీరాన్ని వదిలి వేరుగా నా మీద తేలుతూ నన్నే చూస్తూందేమో అనుకొనేదాన్ని. కొన్నిసార్లు నేను చనిపోయానేమో, పడుకొనివున్నది నా జీవం లేని శరీరమేమో అని ఎంచి అదిరిపడేదాన్ని. ఇదంతా నిజమా, కలా లేక నాకు మతిభ్రమణం కలిగిందా అని ఎంచి వేదనపడేదాన్ని. నాకు యుక్తవయస్సు వచ్చిన తర్వాత నేనలా చూసిందంతా నిజమేనని పలుకారణాల వల్ల నిర్ధారించుకొన్నాను. ముఖ్యంగా సుందర చోళ చక్రవర్తి నన్ను చూసి పొందిన సంక్షోభాన్ని చూసి దాన్ని రూఢి చేసుకొన్నాను. ఇంకొన్ని కారణాల వల్లను, ఆళ్వార్ కట్టియాన్ కొన్నిసార్లు పొరబాటున నోరుజారి చెప్పిన మాటల వల్లను నాలాంటి రూపంగొన్న నా తల్లి ఉండే తీరాలని నిశ్చయించుకొన్నాను. ఆమెను ఒక్కసారి చూడాలి, ఆమె ఒడిలో పడుకొని వెక్కి వెక్కి ఏడ్వాలి అని నా మనసులో ఒక గాఢమైన ఆకాంక్ష

నెలకొంది. అయ్యా! ఈ రోజు మీరు చెప్పిన వార్తల వల్ల అది పదిరెట్లైంది. మీరు నన్ను నా తల్లి దగ్గరకు తీసుకొని వెళతానంటే నా పగ తీర్చుకొనే ఉద్దేశాన్ని వదిలిపెట్టేస్తాను! ఈ వీరపాండ్య ఖడ్గాన్ని ఇప్పుడే మీకిచ్చేస్తాను!" అని వెక్కి ఏడుస్తూనే అన్నది నందిని.

వంతిదేవుడు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు. 'ఇదేంట్రా బాబు! బావి తవ్వబోతే దెయ్యం బయలుదేరినట్లుంది కద?' అనుకొన్నాడు.

మణిమేఖల, "అయ్యా! నేను కూడ మిమ్మల్ని వేడుకొంటాను. అక్క కోరిక నెరవేరుస్తానని మాటివ్వండి!" అన్నది.

వంతిదేవుడు జంకుతూ, "నావల్ల వీలైతే చేస్తాను" అన్నాడు.

"అలాగైతే ఇప్పుడే బయల్దేరాలి. ఆదిత్య కరికాలన్ ఇక్కడికి వచ్చేలోపు బయల్దేరాలి. ఇక్కడినుంచి ఎలా బయటపడడం? వాకిలి గుండా వెళ్ళడం అపాయకరం. ఎదురుగుండా గందమారన్, కరికాలన్ వచ్చినా రావచ్చు!" అన్నది నందిని.

"వేటమంటపం లోపలినుంచి సొరంగమార్గం గుండా పిలుచుకొని వెళతాను, రండి!" అన్నాడు వంతిదేవుడు.

"అక్కా! నేనూ వచ్చేస్తాను. నన్ను కూడ వెంట పిలుచుకొని వెళ్ళండి!" అన్నది మణిమేఖల.

నందిని అది గమనించకనే, "వేటమంటపం గుండా వెళ్ళడం నాకిష్టంలేదు. రవిదాసు, వాడి మనుషులు మనని ప్రాణాలతో వదలరు..." అన్నది.

"దేవీ! మీ చేతనున్న కత్తిని నాకిస్తే చాలు. వాళ్ళను నేను చూసుకొంటాను!" అన్నాడు వంతిదేవుడు.

"వద్దు! అందువల్ల అనేకమైన సంకటాలు కలుగుతాయి. మణిమేఖలా! ఇక్కడినుంచి బయటపడేందుకు ఇంకేదారీ లేదా?" అని అడిగింది నందిని.

~

మణిమేఖల భృకుటి ముడివేసి కాసేపాలోచించింది. "అక్కా! నాకింకొక దారి ఉన్నట్లు తోచడం లేదు. కానీ వీరినే అడగండి. మునుపొకసారి ఈయన ఈ గదినుంచి మాయమైపోయారు. ఎలా వెళ్ళారని అడగండి!" అన్నది.

నందిని వంతిదేవుని ముఖాన్ని చూసింది.

వంతిదేవుడు, "అవును, దేవీ! ఇంకొక దారి ఉంది. కాకతాళీయంగా దాన్ని నేను కనుగొన్నాను. కానీ ఆ దారిగుండా వెళ్ళడం సులభం కాదు. మెట్లనుంచి మెట్లకు, డాబానుంచి డాబాకు ఎగిరి దూకాలి. తర్వాత ప్రాకారం గోడ కూడ దాటాలి. మీవల్ల అవుతుందో కాదోనని సందేహిస్తున్నాను. దాని కన్న మంత్రవాదిని, వాడి ముఠా మనుషులను ఒక చూపు చూసేసి సొరంగమార్గం గుండా వెళ్ళడం

సులభం!" అన్నాడు.

అప్పుడు మణిమేఖల, "అయ్యో! వారు వచ్చేస్తున్నట్లుందే" అని అదిరిపడి అన్నది.

ఇద్దరూ చెవులు రిక్కించి విన్నారు.

అవును. అప్పుడు అంతఃపురం ముందు భాగం నుంచి ఆ గదికి ఎవరో వస్తున్న కాలి చప్పుడు/సవ్వడి వినిపించింది.

"అయ్యో! త్వరగా పేటమంటపంలోకి వెళ్ళిపొండి!" అన్నది నందిని.

"దాక్కోవడానికి నాకు ఇంకొక మంచి చోటు దొరికింది. దేవీ! ఆ ఖడ్గాన్ని ఇలా ఇవ్వండి!" అన్నాడు వంతిదేవుడు.

నందిని అతడికి కత్తిని ఇచ్చేందుకు ముందుకు చాచింది. అప్పుడు అది ఆమె చేతినుంచి జారి కింద పడి, ఝుణఝుణమని శబ్దం చేసింది.

~~~
~~~

# అధ్యాయము - 38

## జరిగినదంతా నాటకమా?

**కత్తి** జారిపడ్డందువల్ల పుట్టిన శబ్దంతోబాటు నందిని దుఃఖపూరితలాస్యం కూడ మిళితమైంది.

ఆమె ఆదుర్దాగా, "అయ్యా! దైవం ఇంకొక విధంగా తలచినట్లుంది. కత్తి ఇక్కడనే ఉండనీ. మీరు వెంటనే వెళ్ళి దాక్కోండి!" అన్నది.

దాన్ని చెవిన వేసుకోక వంతిదేవుడు వంగి కత్తిని ఎత్తబోయాడు. దాని మొనభాగాన్ని పట్టుకొని ఎత్తడానికి ప్రయత్నించాడు.

అదే సమయాన ఆ కత్తి పిడిని ఒక కాలితో తొక్కి పట్టుకొంది నందిని.

"వద్దు! కత్తి కింద పడ్డ శబ్దం యువరాజు చెవిన పడేవుంటుంది. ఇక్కడ కత్తి లేకపోతే ఆయన మనసులో సందేహం కలుగుతుంది. ఇప్పటికే ఆయనకు మీమీద సందేహముంది. వెళ్ళిపోండి! మునుపొకసారి ఇక్కడినుంచి మాయమైనట్లు ఇప్పుడు కూడ మాయమై మరుగైపోండి!" అన్నది.

వంతిదేవుడు కత్తి మొనను పట్టుకొని ఎత్తజూసినప్పుడు అతడి చేతికి చిన్న గాయమైంది. అతడు కత్తిని వదిలేసి నిటారుగా నిలబడ్డాడు. అతడి అరచేతిలో సన్నగా రక్తం స్రవిస్తుండడాన్ని నందిని గమనించింది.

"నేను మీకిచ్చిన మాటను నిలబెట్టుకొంటాను. నా చేతులతో నా తోడబుట్టినవాడిని చంపను. మీరు తప్పించుకొండి. మిమ్మల్ని ఆయన ఇక్కడ చూస్తే...!"

"వెళ్ళిపొండి! వెంటనే వెళ్ళిపొండి!" అని మణిమేఖల కూడ బతిమాలుకొంది.

కాలి అడుగుల చప్పుడు ఇంకా దగ్గరైంది.

వంతిదేవుడు అయిష్టంగానే వాద్యాలు భద్రపరిచే అరవైపు వేగంగా వెళ్ళాడు. ఆ వాద్యాల అర తలుపు తెరిచి లోపలికి వెళ్ళి దాక్కొన్నాడు.

అడుగుల చప్పుడు అతిసమీపాన, వాకిలి దగ్గర వినిపించింది.

వంతిదేవుడు మరుగైన చోటును ఆశ్చర్యంతో చూస్తున్న మణిమేఖలను చూసి, "చెల్లాయ్! నీవూ దాక్కో! మంచం తెరల వెనక దాక్కో! మేము మాట్లాడుతున్నప్పుడు, తెలియకుండ వెళ్ళిపో!" అన్నది నందిని.

~

మణిమేఖల మంచం తెరల వెనక మరుగైన మరుక్షణం ఆదిత్య కరికాలన్, గందమారన్ గది లోపల ప్రవేశించారు.

కరికాలన్ చుట్టూ పరికించి చూస్తూనే నందినిని సమీపించాడు.

మంచం తెరలు కాస్త కదలడాన్ని అతడు గమనించాడు. కానీ గమనించనట్లున్నాడు.

నందినిని సమీపించగానే, నేలమీద పడి కాంతులీనుతున్న కత్తిని చూశాడు. తర్వాత నందిని ముఖాన్ని పరీక్షగా చూశాడు.

నందిని మనసును పిండేసే ఆ తీక్షణదృక్కులను తట్టుకోలేక కత్తిని తీసుకోవడానికన్నట్లు ముందుకు వంగింది.

నందిని ఉద్దేశాన్ని గ్రహించి ఆమెకన్న ముందుగా కరికాలన్ కత్తిని చేతిలోకి తీసుకొన్నాడు. దాని పిడినుంచి మొన వరకు పరీక్షగా చూశాడు. చివర కొత్త రక్తం ఉండడాన్ని కూడ గమనించాడు.

తర్వాత నందినిని చూసి, "దేవీ! నేనిక్కడికి వచ్చేటప్పుడు విన్న శబ్దం ఈ కత్తి కిందపడ్డ శబ్దం లాగుంది. మీ చేతినుంచి జారి కిందపడ్డట్లుంది! మమ్మల్ని స్వాగతించేందుకు చేత కత్తి పట్టుకొని ఆయత్తమైనట్లు తోస్తూంది!" అన్నాడు.

"వీరత్వం మిక్కిలిగొన్న యువ వ్యాఘ్రాలను, ధీరత్వంలో ఆరితేరిన సింహాలను స్వాగతించేందుకు అదే ఉచితరీతి కద?" అన్నది నందిని.

"మూర్ఖ పులులకు, సింహాలకు పదునైన గోళ్ళు, పళ్ళు కావాలి. కానీ తుళ్ళుతూ గెంతుతుండే జింకకు అవి అవసరం లేవనే కద దేవుడు ఇవ్వలేదు?" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"జింక కూడ తన కొమ్ములను ఉపయోగించవలసిన పరిస్థితి రావచ్చు కద? తనకు కొమ్ములిచ్చిన దేవునికి కృతజ్ఞత తెలుపుకొనే సందర్భం కూడ రావచ్చు కద? దయచేసి ఆ కత్తిని నాకిచ్చేయండి!" అన్నది నందిని.

"లేదు, లేదు! మీ చేతికి ఇది తగదు. పూలు కోసి మాలలు కట్టే సున్నితమైన చేతులు కత్తిని ఎలా పట్టుకోగలవు?" అన్నాడు కరికాలన్.

"యువరాజా! ఈ పేదరాలి చేతులు పూలు కోసి, మాలలు కట్టిన కాలం కూడ ఒకటుండేది. ఆ మాలను వేసేందుకు తగినవారు ఎప్పుడు వస్తారని ఎదురుచూసి, చూసి ఆశాభంగమైన కాలంకూడ ఉండేది. అలా పగటి కలలు కన్న కాలం దాటిపోయి ఎన్నో యుగాలు గడిచిపోయాయి. ఇప్పుడు ఈ దిక్కులేని అనాధ కత్తినే తోడు తీసుకోవలసిన పరిస్థితి వచ్చింది. అయ్యో! ఆ తోడును కూడ నానుంచి లాగేసుకొంటున్నారా?" అన్నది నందిని.

"దేవీ! ఇదేం మాట? మిమ్మల్నా దిక్కులేని అనాధ అని చెప్పుకొంటున్నారు? మీరు కాలితో విధించిన పనిని శిరసావహించి చేసేందుకు ఎందరో వీరయువకులు వేచివున్నారు కద? ఇది మీకు తెలియదా?" అన్నాడు కరికాలన్.

"పొరబాటున నా కాలు ఆ ధూర్తుల తలలను తాకితే నా కాలును తెగగొట్టేసుకోవడానికి ఆ కత్తి

కావలసివుంటుంది. అయ్యా! అందుకైనా కత్తి అవసరం కద?"

"అయ్యో! ఇదేం కర్ణకఠోరమైన మాటలు? గజ్జెలు ఘల్లుఘల్లుమని మోగగా అంతఃపురంలో నడయాడవలసిన కాళ్ళను తెగగొట్టడమా? ఈ మాటలు పెద్ద పళువేట్టరయ్యర్ చెవిన పడితే ఎంత బాధపడతారు?"

"అయ్యా! ఆయన గురించి దిగులుపడేవారెవరు? ఆ వృద్ధసింహం ఒక్కసారి గర్జిస్తే అది విని వణుకుతూ పారిపోయి దాక్కొన్న యువ వ్యాఘ్రాలు ఇప్పుడు ఎంత ధైర్యంగా బయటికొచ్చి నడయాడుతున్నాయి? ఆయన కొళ్ళిడం వరదలో కొట్టుకొని పోయారన్న వార్త విన్న తర్వాతనే కద యువ వ్యాఘ్రాలకు ఇంతటి తెగింపు వచ్చింది? ఆ పులులు నాకు చాల దగ్గరగా రాకుండ చూసుకోవడానికే ఈ ఆయుధాన్ని నాదగ్గరుంచుకొన్నాను. చెత్త కుప్పలో పడివున్న నన్ను లోకమెరుగ పెళ్ళాడి అంతఃపురజీవితమిచ్చి, రాజభోగం కూడ ఇప్పించిన ఆ మహాపురుషుని గౌరవాన్ని కాపాడేందుకు ఈ కత్తి సహాయాన్ని కోరాను. మీరు కాసేపటి క్రితం చెప్పినట్లు, పూలు కోసే చేతితో కత్తిని తిప్పేందుకు నేర్చుకొన్నాను..."

"దేవీ! నిజంగానే అందుకేనా? ఈ కత్తిని మీరు పెట్టెలో పెట్టి పూజ చేయడమూ, దీన్ని పుష్పాలకన్న మెత్తనైన మీ చెంపలకు ఆనించుకొని ముద్దాడడమూ పెద్ద పళువేట్టరయ్యర్ గౌరవాన్ని కాపాడేందుకేనా? లేక, మిమ్మల్ని చూసి వెకిలి నవ్వులు నవ్వుతూ దగ్గరికి వచ్చే ఆ మూర్ఖులను దగ్గరికి రానీకుండ అడ్డుకోవడానికా? ఇంకే ఉద్దేశమూ లేదా?"

"ఇంకే విధమైన ఉద్దేశం ఉండ సాధ్యమయ్యా!?"

"ఏల? ఇంకెన్నో ఉద్దేశాలుండవచ్చు కద? పగ తీర్చుకొనే ఉద్దేశం ఉండవచ్చు. మీరు బతిమాలి, చేతులు జోడించి వేడుకొన్న విన్నపాన్ని తిరస్కరించి తమ మనసులో ఆరని గాయాన్ని కలిగించిన పాతకుని చంపి శపథం నెరవేర్చుకొనే ఉద్దేశం కూడ కావచ్చు కద?"

~

నందిని తల వంచుకొని పెద్దగా నిట్టూర్చింది. తర్వాత యువరాజును తలెత్తి చూసి, "యువరాజా! అలాంటి ఉద్దేశం కూడ నాకొకప్పుడుండేది. అది నిజమే. అందుకే ఈ వీరఖడ్గాన్ని పూజిస్తూ వచ్చాను. ఎప్పుడు ఆ వేళ వస్తుందా అని వేచివుండేదాన్ని. కానీ వేళ వచ్చినప్పుడు నా చేతులు శక్తిని కోల్పోయాయి. మనసులో దృఢత్వం కూడ సడలిపోయింది. ఇక ఈ ఖడ్గాన్ని నా శీలాన్ని, నా భర్త గౌరవాన్ని కాపాడుకోవడానికి మాత్రమే ఉపయోగిస్తాను. దయచేసి దాన్ని నాకిచ్చేయండి!" అన్నది.

"దేవీ! ఆ బాధ్యతను నేను వహించకూడదా? మీకో, మీ భర్తకో హాని చేయబూనిన పాతకుని శిక్షించే కర్తవ్యాన్ని, బాధ్యతను నేను నెరవేర్చకూడదా?" అన్నాడు ఆదిత్య కరికాలన్.

"మీవల్ల సాధ్యమయ్యే కార్యం కాదది. ఈ అనాధ స్త్రీ కోసం మీ స్నేహితులను మీరు

శిక్షించగలరా?"

"ఎందుకు సాధ్యం కాదు? తప్పక సాధ్యమవుతుంది! నందినీ! నీవు ఆ రోజు చెరువు దీవిలో వంతిదేవుని గురించి చెప్పినదంతా నేను పూర్తిగా నమ్మలేదు. తర్వాత గందమారన్ చెప్పగా అదంతా పూర్తిగా నిజమని నమ్మాను. ఆ పాతకుని నీవు క్షమించినా, నేను క్షమించజాలను. వాడెక్కడున్నాడో చెప్పు! చెప్పవా...? వద్దు! నా కళ్ళు గుడ్డి కాలేదు...! ఇదిగో చూడు!" అంటూనే ఉద్రేకంతో ఆదిత్య కరికాలన్ గర్జిస్తూ మంచాన్ని కప్పివున్న తెరల వైపుగా కాలెత్తి అడుగు ముందుకు వేశాడు.

నందిని అతడి కాలు తాకి, పైకి లేచి మోకాళ్లమీద కూర్చొని జోడించిన చేతులతో, "యువరాజా! వద్దు! వద్దు!" అని ప్రార్థించింది.

"నందినీ! నీ కరుణను ఇంకెవరికోసమైనా దాచిపెట్టుకో! నా స్నేహితుడిగా నటిస్తూ కుట్రకు పాల్పడే ఛండాలునిపైన కరుణ చూపకు!" అంటూనే కరికాలన్ నందినిని దాటుకొని ముందుకు నడిచాడు.

~

నందిని దిగ్భ్రమతో నలువైపులా పెర్రిదానిలా చూసింది. ఇంతసేపూ వాకిలి గడప దగ్గర శిలలాగ నిలబడివున్న గందమారన్ని చూసి, "అయ్యా! ఆయనను ఆపండి!" అని అరిచింది,

గందమారననే శిలకు ప్రాణం వచ్చింది. కానీ అతడు ఉన్నచోటినుంచి కదల్లేదు. మెల్లగా ఒక వెకిలి నవ్వు నవ్వేసి, మళ్ళీ శిలగా మారిపోయాడు.

కరికాలన్ ఒక చేత్తో కత్తిని ఎత్తి పట్టుకొని మంచాన్ని సమీపించి ఇంకొక చేత్తో తెరను తొలగించాడు.

వెంటనే, చేత చురకత్తితో అక్కడ నిలబడ్డ మణిమేఖల 'కెవ్వు'మని కేకవేసింది.

కరికాలన్ పైకెత్తిన కత్తితో అలాగే కాసేపు స్తంభించి నిలబడిపోయి, ఆ తర్వాత మంచం తెరలను చించి పారేశాడు.

"ఆహా! ఈ ఆడపులా ఇక్కడుంది? అరెరె! దీని గోళ్ళు చాల పదునుగా ఉన్నాయి కద?" అని చెప్పేసి 'హహ్హహ్హా' అని నవ్వాడు.

తర్వాత గందమారన్ని చూసి, "మిత్రమా! నీ చెల్లెలిని పిలుచుకొని వెళ్ళి ఆమె తల్లివద్ద ఒప్పజెప్పేసి రా! ఈమె కడుపులో ఎన్ని పులి పిల్లలు పుడతాయో తెలియదు! ఈమె ఈ వీరపాండ్యుని ఖడ్గానికి ఎరై మరణించివుంటే చోళనాడు ఎన్ని వీరకుమారులను, వీరకుమార్తెలను కోల్పోయేదో కద?" అన్నాడు.

కాసేపటి క్రితం నిజంగానే ఆడపులిలాగ కేకవేసిన మణిమేఖల కరికాలన్ మాటలు విని సిగ్గుపడింది. గందమారన్ ఆమెను సమీపించి పిలుచుకొని వెళ్ళేలోపు ఆమే ఆ గదినుంచి బయలుదేరేందుకు సిద్ధమైంది.

~

అన్నాచెల్లెళ్ళు అక్కడినుంచి వెళ్ళగానే కరికాలన్ నందినిని చూసి, "దేవీ! ఒక నాటకం నటించి వారిద్దరినీ ఇక్కడినుంచి వెళ్ళిపోయేలా చేశాను. ఇకనైనా మనం మనసు విప్పి నిజం మాట్లాడుకోవచ్చు కద?" అన్నాడు.

నందిని నిజంగానే ఆశ్చర్యంగొని, "అయ్యా! మీరు నటించింది నాటకమా? అలాగైతే అది ఆశ్చర్యకరమైన నాటకమే! నేను కూడ అది నిజమేనని నమ్మి మోసపోయాను!" అన్నది.

"నందినీ! నటించడంలో నీకు సాటి ఈ లోకంలో ఎవరూ లేరని నా అభిప్రాయం. నీవే మోసపోయావంటే, నా నటనాసామర్థ్యాన్ని తప్పక మెచ్చుకోవలసిందే! కానీ, నేను కత్తిని పైకెత్తి మణిమేఖల దాక్కొనివున్న మంచంవైపు వేగంగా వెళ్ళినప్పుడు నీవు నన్ను అడ్డుకోలేదేమి? అదెందుకు? నేను ఇప్పటికే చేసిన దోషాలు, పాపాలకు స్త్రీహత్యాదోషం కూడ చేరనీ అని ఊరకొన్నావా?" అని అడిగాడు కరికాలన్.

"శివశివా! ఈ లోకంలోనే ఆ అమ్మాయి ఒక్కదానిమీదే నేను ప్రేమగొన్నాను .ఆమె కూడ చావనీ అని ఊరక చూస్తూ ఉంటానా? తెరను తొలగించగానే మీరే తెలుసుకొంటారని భావించాను..."

కరికాలన్ నవ్వాడు.

"ఆ నవ్వుకర్థమేమిటో తెలియడం లేదు!" అన్నది నందిని.

"మణిమేఖలను చంపేందుకు నీవు చెప్పిన కారణమే చాలు!" అన్నాడు కరికాలన్.

"ఇంకా అర్థం కావడం లేదు!"

"నీవెవరిమీద ప్రేమగొంటే అతడే/ఆమే నాకు పరమ విరోధి అవుతారు. అది నీకు తెలియదా?"

"తెలుసు; అటువంటి దురదృష్టశాలిని నేనని తెలుసు. అయినా కూడ, మీ క్రోధం ఆ కల్లాకపటం ఎరుగని పిల్లమీదికి మళ్ళుతుందని నేనూహించలేదు!"

"లేక, నీ ఉద్దేశం ఇంకొక విధంగా కూడ ఉండవచ్చు. నేను మణిమేఖలను చంపేస్తే, అందుకోసం గందమారన్ నామీద పగ తీర్చుకొంటాడని భావించవచ్చు. లేక, నేనామెను చంపేలోపు ఆమే తన చేతిలోవున్న చురకత్తిని విసిరి నన్ను చంపేస్తుందని కూడ భావించవచ్చు..."

"అయ్యయ్యో! ఇదేమి? ఎంతటి భయంకరమైన కల్పనలు?"

"కల్పనా? నా కల్పనలకన్న భయంకరమైన ఉద్దేశాన్ని నీ మనసులో ఉంచుకొన్నావు. నిజం చెప్పు! నా హృదయంలో రగులుతున్న జ్వాలను ఇంకా పెంచకు! నన్నెందుకు కడంబూర్ మాళిగకు రమ్మన్నావు? ఎందుకని పళువేట్టరయ్యర్ని తంజావూరుకు పంపించావు? చోళసామ్రాజ్యాన్ని రెండు భాగాలు చేసి సమరసం నెలకొల్పేందుకు గాని, నాకూ, మణిమేఖలకు పెళ్ళి చేసి చూసి ఆనందించేందుకు గాని ఇంతటి బృహత్ప్రయత్నాలు చేశావని చెప్పకు! ఆ కథలన్నీ నేను నమ్మను. నమ్మివుంటే ఇక్కడికి

వచ్చేవాడిని కాను..."

"మరెందుకు ఇక్కడికి వచ్చారు, యువరాజా? ఏ నమ్మకంతో ఇక్కడికి వచ్చారు?"

"నమ్మకమా? నాకేవిధమైన నమ్మకమూ లేదు. నా మనసులో నిండివున్నదంతా నిరాశ, అపనమ్మకమే. ఈ నాడును, ఈ లోకాన్నే విడిచి వెళ్ళిపోవాలని కోరుకొంటున్నాను. దానికి ముందు నిన్నొకసారి చూసి సెలవు తీసుకొందామనే వచ్చాను. ఒకసారి నీవు నన్నొక వరం కోరావు. కాళ్ళమీద పడి బతిమాలావు. చేతులెత్తి దండం పెట్టావు. నా వెర్రికోపం వల్లనూ, మూర్ఖత్వం వల్లను నీకావరాన్నివ్వలేదు. తర్వాత ఒక్కొక్క క్షణమూ దాన్ని తలుచుకొని విచారిస్తున్నాను. దానికేదైనా పరిహారముంటే, దాన్ని చేసి తీర్చేసి వెళదామని వచ్చాను. ఏవిధంగానైనా దానికి పరిహారం చేయగలనేమో చెప్పు!"

~

ఇలా జాలిగొలిపే గొంతుతో మాటలాడిన కరికాలన్ని చూసి నందిని, "అయ్యా! అందుకు పరిహారం లేదు. చనిపోయినవారు చనిపోయినవారే! వారిక తిరిగి రాలేరు. కథల్లో, కావ్యాల్లో సాధ్యమేమోగాని, మనం చూడలేదు!" అన్నది.

"చనిపోయినవారిని బతికించలేము, అది నిజమే! కానీ ప్రాణానికి ప్రాణమిచ్చి పరిహారాన్ని వెతకవచ్చు కద...? ఇదిగో చూడు! నా దగ్గర ఇంకా దాచకు! నీవు నన్నిక్కడికెందుకు పిలిపించావు, నీవెందుకిక్కడికి వచ్చావు, పెద్ద పళువేట్టరయ్యర్ని ఎందుకు తంజావూరుకు పంపించావు అన్నది నాకు తెలియదనుకోకు! నీవూ, నేనూ చిన్న పిల్లలుగా ఉన్నప్పటినుంచి నీ మనసులో పుట్టే ఆలోచనలు తెలుసుకొనే శక్తి నాకుంది. నన్ను పురిగొల్పి ఒక నీచమైన కృత్యం నాచేత చేయించేందుకే నీవు నన్ను వీరపాండ్యుని ప్రాణాల కోసం బతిమాలావు. నా పక్కనేవుండి, నన్ను తన్నుతూండేందుకే పెద్ద పళువేట్టరయ్యర్ని పెళ్ళాడి తంజావూరుకు వచ్చావు. నేను తంజావూరులో నెమ్మదిగా ఉండడాన్ని నీవు ఓర్చుకోలేకపోయావు. అందుకే ఈ కడంబూర్ అంతఃపురానికి రమ్మన్నావు. వీరపాండ్యుని కత్తితో నన్ను చంపి పగ తీర్చుకోవడానికే నన్నిక్కడికి రప్పించావు. ఆ నీ ఉద్దేశాన్ని నిరాటంకంగా నెరవేర్చుకో! అందుకే గందమారన్ని, వాడి చెల్లెలిని బయటికి పంపించేశాను. ఇదిగో! ఈ ఖడ్గాన్ని తీసుకో! నీ పగ తీర్చుకో!" అనేసి కరికాలన్ ఆ కత్తిని చాచాడు.

~

నందిని కత్తిని తీసుకొంది. కత్తిని పట్టుకొన్న ఆమె చేతులు వణికాయి. తర్వాత ఆమె ఒళ్ళంతా వణికింది. కళ్ళలో నీళ్ళుబికాయి. హృదయ విదారకమైన స్వరంలో ఏడ్పు, వెక్కిళ్ళు కలిసి వచ్చాయి.

"నందినీ! ఇదేం అధైర్యం? ఈ సడలింపెందుకు? నీవు భట్టారకుల కుటుంబంలో పెరిగినదానివి. కానీ వీర/క్షత్రియ కులంలో పుట్టినదానివి కద? మేకల మందలో పెరిగినందువల్ల సింహం పిల్ల తన ప్రకృతిని కోల్పోతుందా? ఇదిగో చూడు! నీ పగ తీర్చుకోవడానికి గందమారన్నో, పార్థిబేంద్రుడినో,

వంతిదేవుడినో పురికొల్పనవసరం లేదు. వారి మీద నాకు కోపాన్ని పుట్టించనవసరం లేదు. నీ శపథాన్ని నీవే నెరవేర్చుకో! నీ పగను నీ చేత్తోనే తీర్చుకో! ఎవరైనా మళ్ళీ ఇక్కడికి వచ్చేయవచ్చు. గందమారన్ తన చెల్లెలిని తల్లి దగ్గర ఒప్పజెప్పి తిరిగి వచ్చే వేళైంది. వారితోబాటే నా తాత మలైయమాన్ కూడ వచ్చినా రావచ్చు. పళువేట్టరయ్యర్ కొళ్ళిడం వరదలో కొట్టుకుపోయారని నేను నమ్మను. ఆయన కూడ ఉన్నట్లుండి వచ్చినా రావచ్చు. నీ పగ తీర్చుకొని నీ శపథాన్ని నెరవేర్చుకోవడానికి ఇంత కన్న మంచి సందర్భం దొరకబోదు. నీవు నన్ను చంపినందువల్ల నీవెలాంటి కీడు చేసినదానివి కాబోవు! మహోపకారం చేసినదానివవుతావు!" అన్నాడు కరికాలన్.

నందిని పొంగివస్తున్న ఏడ్పును అదిమి పెట్టి, "యువరాజా! మీనుంచి నేనేమీ దాచనూ లేదు; దాచాలని కోరుకోవడమూ లేదు. నేనిక్కడికి వచ్చిన ఉద్దేశం గురించి మీరు చెప్పినదంతా నిజమే. మిమ్మల్ని ఇక్కడికి రమ్మన్న ఉద్దేశమూ అదే. కానీ సందర్భం కూడివచ్చిన సమయాన నా చేతుల్లో బలం లేదు; నా మనసులో ధైర్యమూ లేదు. మీరు నన్ను వెతుక్కొంటూ వచ్చే కాలి చప్పుడు వినగానే కత్తి చేయి జారి పడిపోయింది. ఇదిగో చూడండి. కత్తిని పట్టుకొన్న నా చేతులెలా వణుకుతున్నాయో!" అన్నది.

"అవునవును! అది చూస్తూనే ఉన్నాను. కానీ దానికి కారణం నాకు తెలియకుంది. నీ మనసు ఒకప్పుడు ఎంత దృఢంగా ఉండేదో నేనెరుగుదును. దేవేంద్రునికి వజ్రాయుధాన్ని చేసిచ్చిన తర్వాత మిగిలిన లోహంతో బ్రహ్మదేవుడు నీ హృదయాన్ని సృష్టించి ఉండాలని నేననుకొనేవాడిని. అలాంటి నీ మనసు కరగడానికి కారణమేమి...?"

"మీ మిత్రులు వంతిదేవులు చెప్పిన వార్తలే కారణం!"

"ఆహా! నీవూ, నేనూ తోడబుట్టినవారమని వాడు కనిపెట్టి తీసుకొని వచ్చిన వార్తనే కద చెబుతున్నావు? ఆరోజు మనం చెరువు దీవిలో మాట్లాడుకొంటున్నప్పుడు నీవదంతా నమ్మలేదన్నావే? మనిద్దరినీ మళ్ళీ విడదీసేందుకే ఎవరో పన్నిన కుట్ర అన్నావే?"

"నేనది నమ్మకూడదనే చూశాను. అందుకని ఎంతో ప్రయత్నం చేశాను. కానీ ఈరోజు ఆయన చెప్పిన ఇంకొక వార్త నా మనోదృఢత్వాన్ని అడుగంటా కూల్చేసింది!"

"ఆహా! అదేమి? ఇంకా ఏదైనా కొత్త కల్పనా? కొత్తగా ఇంకేం చెప్పాడు?"

"నన్ను కన్న తల్లిని గురించి చెప్పారు. ఆమెను లంకలో చూసినట్లు చెప్పారు. దాన్ని నేను నమ్మకపోవడానికి ఏ కారణమూ లేదు. యువరాజా! మునుపొకసారి నేనొక వరం కోరాను. దాన్ని మీరివ్వలేదు. అందువల్ల ఈ రోజు వరకు పశ్చాత్తాపపడుతున్నారని చెప్పారు. ఈరోజు ఇంకొక వరాన్ని కోరుతాను. దాన్నైనా ఇస్తారా?"

"వరం ఇదీ అని చెబితే, ఇవ్వగలనో లేనో చెబుతాను."

"యువరాజా! వీరపాండ్యుని మరణం గురించి నేను శపథం చేసిన మాట నిజమే.

మీనలాంఛనం పొదిగిన ఈ ఖడ్గంతో మిమ్మల్ని చంపడమో, లేక నన్ను నేనే చంపేసుకోవడమో చేస్తానని శపథం పూనాను. మిమ్మల్ని చంపేందుకు నా మనసులోను తెగింపు లేదు! నా చేతుల్లో బలం కూడ లేదు. నన్ను నేనే పొడుచుకొని మీముందే చనిపోదామని అనుకొంటే, అందుకు కావలసిన బలం నా చేతుల్లో లేదు. చేసిన ప్రయత్నం విఫలమై నా ప్రాణం పోకపోతే, ఏం చేయడమా అని భయంగా ఉంది. అయ్యా! నా శపథాన్ని నెరవేర్చేందుకు సహాయం చేయండి! ఈ కత్తిని తీసుకొని నన్ను మీ చేతులతోనే చంపేయండి! అప్పుడు నా శపథం తీరిపోతుంది/ముగుస్తుంది. ఈ జన్మలోనే కాదు, జన్మజన్మలకూ మీకు ఋణపడివుంటాను!"

ఇలా చెబుతూనే నందిని కత్తిని కరికాలన్‌కి ఇవ్వడానికి ముందుకు చాచింది. కరికాలన్ దాన్ని మళ్ళీ తీసుకొని, 'హహ్హాహ్హా' అని అంతఃపురం అదిరిపోయేలా నవ్వాడు.

~~~
~~~

# అధ్యాయము - 39

## కారుచీకటి కమ్ముకొంది!

**ఆదిత్య** కరికాలన్ భయంకరంగా నవ్విన ఆ నవ్వు వాద్యాల అరలో దాక్కొనివున్న వంతిదేవుని చెవిన పడి అతడి వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. త్వరలోనే ఏదో ఒక విపరీతం జరగబోతూందని అతని మనసు లోలోపల స్ఫురించింది. క్రీనీడ ఆకారంలో యమధర్మరాజు చేత పాశంతో ఆ గదిలో ప్రవేశించి సిద్ధంగా ఉన్నాడు. పాశాన్ని విసిరేందుకు తగిన సమయంకోసం వేచివున్నాడు. కానీ ఎవరి మీదికి విసరబోతున్నాడు? ఎవరి ప్రాణాన్ని తీసుకొని పోబోతున్నాడు? కరికాలన్ ప్రాణాన్నా? లేక, నందినీదేవి ప్రాణాన్నా? లేక, వారిద్దరినీ మరణం సమీపిస్తూందా? కరికాలన్ తన సహోదరిని చంపబోతున్నాడా? లేక ఇద్దరూ ఒకరినొకరు చంపుకొని చావబోతున్నారా? - ఇలా ఏదీ జరగకుండ అడ్డుకోవడానికే కద యువరాకుమారి తనని వేగంగా పంపించింది? తనకు సాధ్యమైనదంతా చేయడమైంది. ఇద్దరికీ వారి మధ్యనున్న సంబంధాన్ని చెప్పడమైంది. ఇద్దరి మనసులూ కరిగేలా చేశాం. అయినా కూడ, ఫలితం దక్కుతుందా, దక్కదా? వెర్రి ఆవేశంగొన్న కరికాలన్ని గాని, భ్రమించివున్న నందినిని గాని ఏదైన క్రూరకృత్యం చేయకుండ ఆపడం సాధ్యమా? ఈ సమయాన తాను మధ్య వెళ్ళి అడ్డుపడడం వల్ల ఏదైన మంచి జరుగుతుందా? ఒకవేళ ఇద్దరికీ మధ్య తనని బలివ్వడం వల్ల వారి క్రోధం చల్లారుతుందా? - ఇంకా ఏవేవో ఆలోచనలతో వంతిదేవుని మనసు అల్లకల్లోలమైంది. ఇంకాసేపు ఓపిక పట్టి చూద్దాం, - తాను తొందరపడి అడ్డుపడడం వల్ల కార్యం చెడిపోకూడదని పళ్ళు గిట్టకరుచుకొని ఓపికగా వేచి చూడసాగాడు.

~

కరికాలన్ వెర్రి ఆవేశపు నవ్వు ఆగిన తర్వాత, వారి మధ్య సంభాషణ ఇలా కొనసాగింది:-

"అయ్యో! నా జీవితకాలంలో మీకు సంతోషమిచ్చే కార్యమేదీ చేయలేదు నేను. చచ్చేటప్పుడైనా మీరు నవ్వుతూ సంతోషపడేందుకు నేను కారణం కావడం గురించి సంతోషం!" అన్నది నందిని.

"అవును, నందినీ! నేడు నాకు చాల సంతోషకరమైన దినమే. ఇన్నేళ్ళుగా నీవు నన్ను వేధించిన వేధింపులకంతా ఈరోజు ముగింపు రాబోతూంది. ఈసారి నేను కంచినుంచి బయలుదేరేటప్పుడు నా మనసును ఒకింత దిటవు పరచుకొనే బయల్దేరాను. ఒకవేళ నిన్ను ప్రత్యక్షంగా చూసిన తర్వాత నా మనసు సడలిపోతుందేమో అని భయపడ్డాను. అందుకు ఆస్కారం లేకుండ నీవే కత్తిని నా చేతికిచ్చేశావు!" అని చెప్పేసి కరికాలన్ మళ్ళీ నవ్వాడు.

"యువరాజా! నాకూ ఈ దినం సుదినమే. మీ చేతులారా చంపబడడం కన్న ఇంపైన మరణం

నాకు దొరకబోదు. ఒకానొకప్పుడు మీరు నా మెడలో పూమాల వేయబోతున్నారని కలలు కన్నాను. అది నెరవేరలేదు. మీ చేతనున్న ఖడ్గాన్నైనా నా మెడలో వేసుకోనే భాగ్యాన్నైనా నాకు దొరికేటట్లు చేయండి. అయ్యా! సమయం మించిపోతూంది. ఎందుకింకా ఆలస్యం చేస్తున్నారు?" అన్నది నందిని.

"చాల ఏళ్ళు ఆలస్యమైపోయింది. ఇంకొన్ని నిమిషాలు ఆలస్యం చేసినందువల్ల నష్టమేమీ లేదు. నందినీ! కాస్త తలెత్తి నన్ను చూడు! చివరిసారిగా అడుగుతున్నాను. నా ప్రశ్నకు ఉత్తరమివ్వు! పూలమాల వేయవలసిన చేతితో నేనెందుకు కత్తిని నీ మెడమీద వేయాలి? నీవు ఒకప్పుడు కన్న కలలు నిజమైతే, వాటిని ఇప్పుడు ఎందుకు నెరవేర్చుకోకూడదు? అందుకడ్డంగా నిలబడివున్నవారెవెరో చెప్పు! నిన్ను చంపేందుకు బదులు వాళ్ళని తొలగించి తదుపరి కార్యం చూస్తాను!" అన్నాడు కరికాలన్.

"వద్దయ్యా, వద్దు! మీకు కోటిపుణ్యాలుంటుంది. నావల్ల ఇక ఎవరూ చావకూడదు. ఎవరూ అడ్డు నిలవడంలేదు కూడాను. నా తలరాతే అడ్డుగా ఉంది!"

"ఆ అడ్డును ఒక్క క్షణంలో నేను తొలగించేస్తాను. తలరాత మీద భారాన్ని వేయకు! బ్రహ్మ రాసిన రాతను నేను మార్చి రాస్తాను, చూడు...!"

~

నందిని అడ్డుపడి, "బ్రహ్మ రాసిన రాతను మార్చి రాయవచ్చు. కానీ ఒకరి పుట్టుకను మార్చ సాధ్యమా?" అని అడిగింది.

"దేని గురించి అడుగుతున్నావు, నందినీ? మన చిరుప్రాయంలో నీవు భట్టుగారి ఇంటి పిల్లవని, అందువల్ల నీతో స్నేహం చేయకూడదని నా కుటుంబీకులు చెప్పారు కద, దాని గురించా? లేదు! నీవా భట్టుగారి కులంలో పెరిగావు గాని నీవా కులంలో పుట్టలేదని మనమిద్దరమూ ఎరుగుదుము."

"దాని గురించి ఇప్పుడు చెప్పడం లేదయ్యా! మీ ప్రియమిత్రుడు - వాణర్‌కులవీరుడు - తీసుకొచ్చిన వార్త గురించే చెబుతున్నాను. పళైయార్రై యువరాకుమారి చెప్పి పంపించిన వార్త గురించే చెబుతున్నాను. నేను మీ సహోదరినన్న ముఖ్యమైన వార్తను ఇంతలోపల మరిచిపోయారా?"

"నందినీ! నేనారోజు నీతో ఆ విషయం చెప్పినప్పుడు నీవు నమ్మలేదు. నిన్నూ, నన్నూ వేరు చేసి ఉంచేందుకే ఎవరో పన్నిన ఇంకొక కుట్ర అన్నావు. తర్వాత నేను కూడ ఆలోచించి అదే ముగింపుకు వచ్చాను. దాన్ని నిర్ధారించుకోవాలంటే..."

"వద్దు, వద్దు! దాని గురించి నాకు సందేహం లేదు. యువరాజా! మీకూ నాకూ రక్త సంబంధమేమీ లేదు..."

"మరి, ఏమడ్డు నందినీ?"

"నేను, మీకు తాతగారైన పెద్ద పళువేట్టరయ్యర్ని పెళ్ళి చేసుకొన్నదాన్ని. మీకు అమ్మమ్మ/నానమ్మ స్థానంలో ఉన్నదాన్ని. ఇది చాలదా?"

"నందినీ! మళ్ళీ ఆ కథ చెప్పి ఏమార్చేందుకు ప్రయత్నించకు. ప్రజలముందు నీవు పెద్ద పళువేట్టరయ్యర్ యువరాణిగా చెలామణి అవుతూండవచ్చు. కానీ నిజానికి నీవు ఆయన్ని పెళ్ళాడలేదు. ఏదో ఒక కారణం వల్లనే ఆయన్ అంతఃపురానికి వచ్చి చేరావు. మునుపొకసారి నేను తంజావూరులో అడిగినప్పుడు, అలాగే చెప్పావు. అప్పుడు నేను నీకు మన ఆశాస్వప్నాన్ని గుర్తు చేశాను. దాన్ని నెరవేర్చేందుకు నీవు భయంకరమైన నిబంధనలు విధించావు! పళువేట్టరయ్యర్ని చంపి, నా తండ్రిని, సహోదరిని చెరలోవేసి, నిన్ను చోళసింహాసనం మీద కూర్చోబెట్టాలన్నావు. పిచ్చిపట్టిన రాక్షసివి నీవని తీర్మానించుకొని నేను కాంచీపురానికి వెళ్ళిపోయాను. తర్వాత నీవు నన్ను విడిచిపెట్టావా? లేదు! రాత్రింబగళ్ళు ఎడతెరపి లేకుండ కలలోను, జ్ఞాపకాల్లోను వచ్చి నన్ను వేపుకు తింటున్నావు. కొన్నిసార్లు ఏడ్చి నన్ను బాధించావు; ఇంకొన్ని సార్లు మోహనమైన చిరునవ్వుతో నన్ను వేధించావు; కొన్నిసార్లు పిచ్చిదానిలాగ నవ్వి నన్ను కూడ పిచ్చివాడిని చేశావు!"

"యువరాజా! తమ మనోభ్రాంతికి నన్నెందుకు నిందిస్తున్నారు? మీరు నాకు చేసిన అన్యాయానికి, కలిగించిన బాధలకు తగిన ఫలితాన్ననుభవించారు. అందుకు నేనేం చేయను? నేను మాత్రం కష్టపడలేదని భావిస్తున్నారా? పళువేట్టరయ్యర్ మాళిగలో సుఖభోగాలనుభవిస్తూ హాయిగా జీవిస్తున్నానని భావిస్తున్నారా?" అని నందిని అడిగినప్పుడు ఆమె గొంతులో క్రోధమూ, ఆక్రోశమూ పెల్లుబికాయి.

ఇది విన్న వంతిదేవుడు భీతిగొన్నాడు. అతని ఒళ్ళు గడగడలాడింది.

~

ఆదిత్య కరికాలన్ స్వరమూ హెచ్చింది.

"నీవు కూడ కష్టపడ్డావనా చెబుతున్నావు? అలాగైతే మనమెందుకిప్పుడు ఏవేవో మాట్లాడుతూ కాలం వెళ్ళబుచ్చాలి? నాతో వెంటనే బయలుదేరి వచ్చేందుకు నీ సమ్మతాన్ని తెలియజేయి; వెంటనే వెళదాం. నీకోసం నేనీ చోళసామ్రాజ్యాన్ని త్యాగం చేసి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. పుట్టిన నాడును, తలిదండ్రులను, తోడబుట్టినవారిని, బంధువులను త్యజించి వస్తానంటున్నాను. ఓడెక్కి సముద్రాలు దాటి వెళదాం. సముద్రాలకవతల ఎన్నెన్నో అద్భుతమైన ద్వీపాలు, ద్వీపాంతరాలు ఉన్నాయి. వాటిలో ఒకదానికి చేరుకొందాం. నీకన్న ఈ రాజ్యం నాకు పెద్దది కాదు."

"యువరాజా! మీరు రాజ్యాన్ని త్యజించినా త్యజిస్తారు! కానీ ఈ కింది కులం అమ్మాయి చోళసింహాసనం ఎక్కేందుకు సమ్మతించరు కద?" అని చెప్పేసి నందిని నవ్విన నవ్వులో నిప్పురవ్వలు ఎగిరాయి.

"అమ్మాయీ! దీన్ని ఇంకొక విధంగా చూడు! నీకు నాకన్న చోళసింహాసనం ఎక్కువా? నీవు ఆనాటినుంచి నాపైన చూపిస్తూ వచ్చిన ప్రేమంతా చోళసింహాసనం మీద కూర్చోవడానికి చేసిన నటన మాత్రమేనా?" అన్నాడు కరికాలన్.

"ఆహా! అలాగే ఉండనివ్వండి! నాకు రాజభోగమూ, అంతఃపురవాసమూ, రాజసింహాసనమూ కావాలి. వాటికోసమే పళువేట్టరయ్యర్ని పెళ్ళాడాను. వాటికోసమే వీరపాండ్యుని కాపాడేందుకు ప్రయత్నించాను..."

"ఒసే పాతకీ! వాడి పేరెందుకు ఇప్పుడెత్తావు?" అని గర్జించాడు కరికాలన్. నందిని బదులు చెప్పేలోపు ఇంకా ఇలా చెప్పసాగాడు:-

"ఆహా! నాకిప్పుడు తెలిసింది. నీ పన్నాగమంతా నాకిప్పుడు బాగా తెలుస్తూంది. వీరపాండ్యుని పేరు చెబితే నాకు ఆక్రోషం వస్తుంది. నేను నిన్ను నిజంగానే చంపవస్తాను. వెంటనే నీవు కాలితో చెప్పింది తలమీద పెట్టుకొని చేసే యువసింహాలలో ఒకడు వచ్చి నన్ను చంపేస్తాడన్నదే నీ ఉద్దేశం. ఒసే ఛండాలీ! ఆ వంతిదేవుడెక్కడ? వాడినెక్కడ దాచావో చెప్పు! ఇక్కడే ఎక్కడో దాక్కొనివుండాలి. నీవు నాతో రానని చెప్పేందుకు కారణం కూడ అర్థమవుతూంది. అవును, వాడే కారణం! వాడితో నీవు పారిపోవాలనుకోవడమే కారణం. పళువేట్టరయ్యర్ని ఇక్కడినుంచి తంజావూరుకు పంపించేసినందుకు కూడ అదే కారణం. మీరిద్దరూ చేరి మాట్లాడుకొనే ఇలా కుట్ర పన్నారు....ఆహా! నేనెంతగా మోసపోయాను! ఎక్కడ ఆ పాతకుడు? ఎక్కడ నీ కొత్త ప్రేమికుడు...?"

~

ఇలా వెర్రి ఆవేశంతో ఆదిత్య కరికాలన్ అరుస్తూ కత్తిని తిప్పుతూ ఆ గదిలో అటూ ఇటూ పరుగెత్తనారంభించాడు. ఒకసారి వాద్యాల అరను సమీపించాడు. అప్పుడు నందిని ఒక్కదూకులో వెళ్ళి అతని పాదాల మీద పడి, "యువరాజా! ఇది వినండి! మీకు కోటి పుణ్యాలు. నేను చెప్పేది వినేసి ఆ తర్వాత ఏమైనా చేసుకోండి. వాణర్‌కుల వీరుల మీద మీరు నిరాధారమైన నింద మోపుతున్నారు. అటువంటి నిందను భూదేవి సహించదు. మీరాయనకు ఏదైనా హాని కలిగిస్తే, నా ప్రియస్నేహితురాలు మణిమేఖల ప్రాణాలే విడిచేస్తుంది! మీకు మహాపాపం చుట్టుకొంటుంది. వద్దు! ఇదిగో నా గుండెను చీల్చి చూడండి. వీరపాండ్యుని ఖడ్గంతోనే నా గుండెను చీల్చి చూడండి. దాని లోపల మీ దివ్య రూపం తప్ప ఇంకేమీ ఉండదు. ఇది సత్యం! సత్యం! సత్యం!" అని చెప్పేసి నందిని ఏడ్వసాగింది.

ఆదిత్య కరికాలన్ వెర్రి ఆవేశం మళ్ళీ కాస్త చల్లారినట్లు తోచింది.

అలాగైతే నాతో రావడానికి నీవెందుకు నిరాకరిస్తున్నావు? అదైనా చెప్పేయి! ఎందుకు నా చేత్తోనే నిన్ను నరికి చంపడానికి పురిగొల్పుతున్నావు? నిజం చెప్పు!" అని అరిచాడు కరికాలన్.

"కానివ్వండి. ఇదిగో చెబుతున్నాను. నా హృదయంలో మీకు తప్ప ఇంకెవరికీ చోటు లేదు. ఇది సత్యమైన మాటే. కానీ నేను మీతో రావడం సాధ్యం కాదు. మిమ్మల్ని పెళ్ళాడడమూ సాధ్యం కాదు. అందుకు అడ్డుగా ఒక పెద్ద కారణముంది. దాన్ని చెప్పేందుకే నాకు భయమేస్తూంది. యువరాజా! నిజానికి దాన్ని మీకు చెప్పేందుకే నేనిక్కడికి వచ్చాను; మిమ్మల్నీ రమ్మన్నాను. దాన్ని మీకు చెప్పేసి నన్ను

క్షమించమని వేడుకోవడానికి వచ్చాను. ఈ దౌర్భాగ్యశాలిని మరిచిపోయి, మీ కులానికి, పదవికి తగిన అమ్మాయిని పెళ్ళిచేసుకోమని బతిమాలుకోవడానికి వచ్చాను. కానీ దాన్ని చెప్పేందుకు జంకుతున్నాను. దాన్ని చెబుదామని అనుకొన్నప్పుడల్లా భయం కలుగుతోంది. మీ కోపాన్ని ఇంకా రగిలించేలా చేస్తానేమో, దాని వల్ల ఇంకా ఏమేమి విపరీత పరిణామాలు ఏర్పడుతాయోనని భయం కలుతుతూంది. మీరు శాంతంగా ఉంటారని మాటిస్తే..."

~

"చెప్పు, నందినీ! చెప్పు! ఎంతటి చేదు విషమైనా విని ఓర్చుకొంటాను. కాసేపటి క్రితం, నిన్ను మరిచిపోయి, ఇంకొక అమ్మాయిని పెళ్ళిచేసుకోమని మంచిమాటలు చెప్పావు! దానికే నేను కోపగించుకోలేదు కద? ఇంకేం చెబితే నేను కోపగించుకోబోతాను? కానీ కట్టు కథలు మాత్రం కల్పించి చెప్పకు!"

"యువరాజా! నా జీవితమే ఒక కల్పన. నా పుట్టుకే ఒక కట్టు కథ. నా జీవితాన్ని కొంత కాలం పొడిగించుకోవడానికో, నా కర్మను ముగించేందుకో చాలసార్లు కట్టు కథలు చెప్పవలసి వచ్చింది. ఇక ఆ అవసరమేమీ  లేదు. ఈ రోజుతో నా బూటక జీవితాన్ని ముగించేయబోతున్నాను. మీ మనోవేదనను అధికం చేయకూడదనే కొన్ని నిజాలను నేనెరిగిన తర్వాత కూడ మీకు చెప్పలేదు. మీరు నన్ను అసహ్యించుకోవాలని, విసిగించుకోవాలనే ఎన్నో కట్టు కథలు కల్పించి చెప్పాను. చాల భయంకరమైన కార్యాలను చేయమన్నాను. నా మనసులో నిరవధిక పోరాటం కొనసాగుతూనేవుంది. నా కర్తవ్యం, నేను చేసిన శపథం, నేను మీమీదగొన్న ప్రేమ నా మనసులో ఎడతెరపి లేకుండ ఒకదానితోనికటి పోరాడుతుండేవి. వీటివల్ల నేను పడ్డ బాధ చెప్పనలవి కాదు. చివరికి, ఈ పోరాటమంతా ముగిసే తరుణమాసన్నమైంది. నా గురించిన నిజాన్ని చెప్పేస్తాను. అది విన్న తర్వాత నన్ను మీచేత్తోనే చంపేయండి! కానీ ఇంకెవరికీ మీరు హాని చేయవద్దు. అనవసరంగా పాపానికి, నిందకు పాలుగాకండి...!"

"పాపం! నింద! ఇక కొత్తగా నేను గురికాగల నింద, పాపం ఏమున్నాయి, చెప్పు! అయినా కూడ, చెప్పు నందినీ! నీవు నాతో వచ్చేందుకు - మన చిన్నప్పటి కల నిజమయ్యేందుకు - అడ్డుగా ఉన్న నిజమైన కారణమేమో చెప్పు! అది ఎంతటి భయంకరమైన నిజమైనా కూడ చెప్పు! అదిగో ఆ మంచం తెర వెనుక ఎవరో  దాక్కొని ఉన్నారని నేను భావిస్తున్నంత వరకు, దాక్కొనివున్నవారు ఎవరని తెలియనంతవరకు నా మనసుకు నెమ్మది లేకపోయింది. నీతో మాట్లాడుతున్నంతవరకు నా మనసు దాని గురించే ఆలోచిస్తూంది. దాక్కొనివున్నది మణిమేఖల అని తెలిసిన తర్వాత నా మనసులోని కల్లోలం తొలగిపోయింది. నిజం తెలియనంతవరకే కోపం, భయం, ఆందోళన – అంతాను! ఎంతటి చేదు నిజమైనా, అది తెలిసిపోయిన తర్వాత మనసు నెమ్మదిగొంటుంది కద?"

"యువరాజా! నేను చెప్పబోతున్న నిజాన్ని విని మీ మనసు నిజంగానే నెమ్మదిగొంటుంది.

అదే నా ప్రార్థన. కానీ ఆ వార్త నేను మీతో రావడమో, మిమ్మల్ని పెళ్ళిచేసుకోవడమో సాధ్యం కాని పని అని నిరూపిస్తుంది. నా జీవితానికి ముగింపు, నా దుఃఖాలనుంచి విమోచనం - మరణం ఒక్కటే అన్న విషయాన్ని కూడ నిరూపిస్తుంది. వంతిదేవులు నా తల్లిని గురించిన వార్తను తీసుకొని వచ్చారు. అది నిజమని నాకు తెలుసు. ఈలం నాడులో పిచ్చిపట్టి తిరుగాడుతున్న ఒక స్త్రీమణి గురించి నాకు తెలుసు. ఆమె నా తల్లి అని నాకు తెలుసు. ఇది చాలమందికి తెలుసు. ఎందుకంటే ఆమెకు నాకు రూపురేఖల్లో ఉన్న పోలికలను చాలమంది చూడగలగడమే కారణం. నన్ను నా తల్లి అని కొందరు సందేహించడం కూడ జరిగింది. కానీ నా తల్లిని అలా పిచ్చిదాన్ని చేసిన కారణమేమిటో అది కూడ కొంత కాలం క్రితం నేనే తెలుసుకొన్నాను. అది నాకు తప్ప ఇంకెవరికైన తెలుసో తెలియదో నేనెరుగను. ఇంతవరకు నేనెవరికీ చెప్పలేదు కూడాను. ఇప్పుడు మొట్టమొదటగా మీకే చెప్పబోతున్నాను. అయ్యా! నా తండ్రి ఎవరని మీకు చెప్పబోతున్నాను. దయవుంచి కాసేపటి క్రితం మీరు నాకిచ్చిన మాటను గుర్తు చేసుకోండి. ఉద్రేకానికి, క్రోధానికి చోటివ్వకండి..."

~

ఇలా బలమైన ఉపోద్ఘాతం/పీఠిక వేసుకొని నందిని ఆదిత్య కరికాలన్‌కి అతి దగ్గరగా వచ్చి అతని చెవి దగ్గర అతి మెత్తని స్వరంలో, "నన్ను కన్న తండ్రి .... గారే!" అన్నది. చెప్పేసి వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

ఆదిత్య కరికాలన్ వెయ్యి తేళ్ళు ఒక్కసారిగా కుట్టినట్లు విలవిల్లాడిపోయాడు.

"లేదు, లేదు, లేదు! నీవు చెబుతున్నది అబద్ధం! అబద్ధం! పెద్ద అబద్ధం!" అని అరిచాడు.

మరు నిమిషమే అతడి ఆవేశం చల్లారిపోయింది. వేదన నిండిన గొంతుతో, "అవును, నందినీ! అవును! నీవు చెబుతున్నది నిజమే అయివుండాలి. ఇప్పుడు నాకంతా అర్థమవుతోంది. నీ మనసులో జరిగిన పోరాటం గురించిన నిజం కూడ తెలుస్తూంది. నీవెంత బాధపడివుండాలన్నది తెలుస్తోంది. నీ మనఃకల్లోలానికి, నీ భయంకరమైన కోరికలకు కారణం ఇప్పుడర్థమవుతోంది. ఆరోజు నీవు నా కాళ్ళమీద పడి కోరుకొన్న వేడుకోలును తిరస్కరించింది ఎంత పెద్ద క్రూరత్వమో తెలుస్తూంది! నందినీ! లోకంలో ఎన్నెన్నో క్రూరకృత్యాలకు ప్రాయశ్చిత్తం ఉంది. కానీ నేను చేసిన పాతక కృత్యానికి ప్రాయశ్చిత్తం లేదు. మనిద్దరికీ మధ్య ఉన్న అడ్డును తొలగించడానికి దారే లేదు! అయ్యో! ఇంతటి పెద్ద భారాన్ని ఎలా నీ మనసులో భరించావు? ఎలా ఈ పాతకుడు ఈ లోకంలో బతికుండడాన్ని సహిస్తూ వచ్చావు? మంచిది; మనిద్దరి జీవితాలకూ పరిహారమొకటే; విమోచనం ఒకటే. ఇదిగో నందినీ! నా ప్రాయశ్చిత్తం...!"

~

వాద్యాల అరనుంచి వంతిదేవుడు పైన వివరించిన సంభాషణంతటినీ వింటూ వచ్చాడు. మధ్య మధ్య కరికాలన్ వెర్రి ముదిరిపోయి శిఖరానికి చేరినప్పుడు వారిద్దరి మధ్యకు వెళదామనుకొన్నాడు.

తర్వాత దానివల్ల ఏం విపరీతం జరుగుతుందోనని జంకాడు. వారి భావోద్వేగపూరితమైన మాటలు అతన్ని ఒకవైపు అచేతనుడిగా చేయసాగాయి. నందిని తన తండ్రి ఎవరని చెప్పింది మాత్రం అతడి చెవిలో సరిగ్గా పడలేదు. కానీ ఆమె ఏం చెప్పివుంటుందని ఊహించుకోగలిగాడు. అది అతన్ని 'అదిరిపడేటట్లు' చేసిందని చెప్పినా, ఇంకేవిధంగా చెప్పినా అది ఒట్టి సంప్రదాయమే అవుతుంది. అటువంటి పెద్ద అదిరిపాటు అతని జీవితంలో అతడెప్పుడూ అనుభవించనే లేదు.

చివరిగా, ఆదిత్య కరికాలన్ మెత్తని, గద్గద స్వరంతో, నందిని చెప్పింది ఒప్పుకొనే భావంతో మాట్లాడుతున్నప్పుడు, అతని ఆదుర్దా కూడ ఎల్లలు దాటింది. పెద్దగా మాట్లాడుకొంటున్నంతవరకు అతడంతగా భయపడలేదు; కానీ ఇప్పుడు చాల భీతిగొన్నాడు. ఏం చేయబోతారోనన్న పెద్ద దిగులు వల్ల వాద్యాల అరనుంచి తలను కాస్త బయటకు చాచి చూశాడు. చూపుకందే చోట నందిని, కరికాలన్ లేరు. కానీ ఇంకొక దృశ్యాన్ని చూశాడు. గోడలో పొదిగివున్న అద్దంలో ఆ దృశ్యం కనిపించింది. వేటమంటపం రహస్య ద్వారం గుండా ఒక ఘోర, భయంకరమైన ముఖం కనిపించింది. అది మంత్రవాది రవిదాసు ముఖమే! మరుక్షణం వేటమంటపం రహస్యద్వారం తెరుచుకోవడాన్ని వంతిదేవుడు చూశాడు. తెరిచిన ద్వారం గుండా మొదట ఒక పులి తల, తర్వాత దాని శరీరం బయటకు రావడాన్ని గమనించాడు. వెంటనే, అతని శరీరానికి ప్రాణమొచ్చింది; మనసులో స్ఫూర్తి/ప్రేరణ పుట్టింది; కాళ్ళు చేతులు చేతనమైనాయి. వాద్యాల అరనుంచి ఒక్క దూకులో బయటకు దూకడానికి ప్రయత్నించాడు.

ఆ సమయాన వెనుకవైపు నుంచి అతడి మెడ చుట్టూ వజ్రాయుధంలాంటి ఒక చేయి పట్టుకొంది. తలెత్తి చూశాడు. కాళాముఖుని రూపంగున్న ఒక ఆజానుబాహువైన ఒక ఆకారం అతని కళ్ళముందు కనిపించింది. ఆః! వీడెవడు? ఇక్కడికెలా వచ్చాడు? ఇదేం ఉక్కు పట్టు? గొంతు నొక్కేస్తూందే! ఊపిరాడడం లేదు కద? గుడ్లు వెళ్ళుకొస్తున్నాయే! ఇంకొన్ని క్షణాలు పోతే ప్రాణమే ఎగిరిపోతుంది కద? వంతిదేవుడు ఒక పెద్ద ప్రయత్నం చేసి ఆ ఉక్కుపట్టునుంచి విడిపించుకొని బయటకు దూకాడు. దూకిన వేగానికి నేలమీద పడ్డాడు. తలమీద ఒక పెద్ద బండను వేసినట్లనిపించింది. ఒక్క క్షణం అతని కళ్ళముందు కోటి సూర్యులు ప్రకాశించారు. మరుక్షణం అందరు సూర్యులూ మరుగైనారు. నలువైపులా చీకటి కమ్ముకొంది. వంతిదేవుడు ఆ క్షణమే స్పృహతప్పాడు.

~

వాద్యాల అరనుంచి, దాని వాకిట స్పృహతప్పి పడివున్న వంతిదేవుని తొక్కుకొంటూ దాటి, ఒక ఘోర భయంకరమైన ఆకారం బయటికొచ్చింది.

వాద్యాల అర దగ్గర ధడేల్మన్న శబ్దం విన్న నందిని తిరిగి చూసింది. కాళాముఖుని ఆకారం చేత కత్తిదూసి తనవైపు రావడాన్ని గమనించింది. గుడ్లు వెళ్ళుకొచ్చేటట్లు ఆశ్చర్యంతో ఆ ఆకారాన్ని చూసింది. ఆమె కడుపులోని ప్రేగులు పైకొచ్చి గొంతును పూడ్చినట్లనిపించింది. కళ్ళు నులుముకొని

ఎదురుగా చూసింది. కరికాలన్ కింద పడివుండడాన్ని చూసింది. అతడి శరీరంలో వీరపాండ్యుని కత్తి దిగివుండడాన్ని కూడ గమనించింది.

అప్పుడామె గొంతు నుంచి ఏడ్పు, నవ్వు కలగలిసిన ఒక భయంకరమైన ధ్వని వెలువడింది. అది ఆ గదిలోని మంచంలాంటి అచేతన వస్తువులను కూడ వణికేటట్లు చేసింది.

"ఒసే పాతకీ! ఛండాలీ! నీ పగను తీర్చేసుకొన్నావా?" అంటూనే ఆ కాళాముఖ ఆకారం ఆమెను ఇంకా సమీపించింది.

అదే సమయాన పేట మంటపపు రహస్యద్వారం గుండా పులివేషం చాటు చేసుకొని రవిదాసు లోపలికి వచ్చాడు. కాళాముఖుని చూడగానే పులి తోలును తీసి విసిరేశాడు. ఆ గదిలో మసగ్గా వెలుతురునిస్తున్న దీపాన్ని ఆ చచ్చిన పులి తోలు వెళ్ళి కొట్టింది.

ఆ దీపం కింద పడింది. అది ఆరిపోయేముందు భయభ్రాంతులుగొన్న మణిమేఖల ముఖాన్ని చూపించింది. 'కీచు'మని అరుస్తూ మణిమేఖల అక్కడినుంచి పరుగెత్తింది.

ఆ కారుచీకటిలో శోకం నిండిన వెక్కిళ్ళు, పిచ్చి నవ్వు, మరణానంతరం వినబడే వెక్కిళ్ళ ఏడ్పు, మనుషులు వేగంగా అటూ ఇటూ పరుగెత్తే కాలి చప్పుడు కలగలిసి వినిపించాయి.

~~~
~~~

# అధ్యాయము - 40

## "నేనే చంపాను!"

**తిరువిలంగాడు** తామ్ర పత్రాలలో చోళవంశావళిని వివరించేటప్పుడు, "ఆకాశలోకాన్ని చూడాలనే ఆశవల్ల ఆదిత్య కరికాలన్ భూలోకంలో అస్తమించారు. లోకాన్ని కలి అనే కారుచీకటి కమ్ముకొంది!" అని రాయబడివుంది. వీరపాండ్యుని తలనుగొన్న వీరాధివీరుడైన చోళసామ్రాజ్యపు పట్టపు యువరాజు ఆదిత్య కరికాలన్ అకాల మరణం చెందడం గురించే తిరువిలంగాడు తామ్ర పత్రాలలో లిఖించబడింది.

ఆదిత్య కరికాలన్ అసువులుబాసి నేలమీద పడివున్న ఆ కడంబూర్ అంతఃపురం గదిలో నిజంగానే అప్పుడు కారుచీకటి కమ్ముకొంది.

కాళాముఖుని ఆకారంగొన్నవాని చేత గొంతునొక్కబడి ధడేల్మని కిందపడ్డ వల్లవరయ్యన్ మనసులోను అలాగే కాసేపు చీకటి గూడు కట్టుకొంది. క్రమక్రమంగా ఆ మనసులో వెలుతురు కానవచ్చింది. తెలివి రాగానే అతడి కళ్ళు కూడ తెరుచుకొన్నాయి. కానీ అతడి చుట్టూ కమ్ముకొన్న చీకటి వల్ల అతడి కళ్ళకేమీ గోచరించలేదు. కాబట్టి, తానెక్కడున్నాడు, ఏ పరిస్థితిలో ఉన్నాడని కూడ స్పష్టంగా తెలియలేదు. మొదట తల నొప్పిపెడుతుండడం తెలియవచ్చింది. గొంతు నొక్కబడ్డ చోటు కూడ నొప్పి పెట్టసాగింది. ఊపిరి వదిలడం కష్టంగా ఉండడాన్ని గ్రహించాడు. ఈ తలనెప్పి ఎలా వచ్చింది? ఈ గొంతు నెప్పి ఎందుకు, ఎలా కలిగింది? ఊపిరి వదిలేందుకు ఎందుకింత కష్టంగా ఉంది? ఆహా! ఆ కాళాముఖుడు! వాడిని తాను చూసింది నిజమా? వాడు తన గొంతును నొక్కి చంపజూసింది నిజమేనా? ఎందుకని తన గొంతును నొక్కాడు? తాను సద్దు చేయకుండేందుకా? ఎందుకు? ఎందుకు? వాడి ఉక్కు పట్టునుంచి విడిపించుకొని తాను వెళ్ళజూసింది ఎక్కడికి? ఆహా! ఇప్పుడు గుర్తుకొచ్చింది! ఆదిత్య కరికాలన్ వద్దకు వెళ్ళేందుకే! అయ్యో! అయన గతి ఏమైంది? నందిని ఏమైంది? రవిదాసు ఏం చేశాడు? తనని అడ్డుకోజూసి నేలమీదికి తోసిన కాళాముఖుడు తర్వాత ఏం చేశాడు? తానిప్పుడు ఎక్కడున్నాడు? పాతాళ చెరసాలలోనా? సొరంగ మార్గంలోనా? కనుగుడ్లు వెళ్ళుకొచ్చేటట్లు చుట్టూ పరీక్షగా చూశాడు వంతిదేవుడు. ఏమీ తెలియలేదు! దేవుడా! ఇలాంటి గాఢాంధకారం కూడ ఉంటుందా? తాను కింద పడింది నందిని అంతఃపురం గదిలో, వాద్యాల అర దగ్గర అని గుర్తుకొచ్చింది. అక్కడే ఇంకా పడివున్నాడా...? ఇంకెక్కడికైనా తీసుకొని వెళ్ళి పడేశారా? ఇదెలా తెలుసుకోవడం?

~

రెండు చేతులనూ చాచి చుట్టూ తడిమి చూశాడు. ఒక వస్తువు చేతికి తగిలింది. అదేమి? కత్తిలాగ ఉందే? అవును! కత్తే! వంకీలు తిరిగిన కత్తి! సాధారణమైన కత్తులకన్న అతి శక్తివంతమైనది! ఎవరిమీదికైనా దూసుకుపెళితే వాడు చచ్చినట్లే! ఇలాంటి విచిత్రమైన కత్తిని ఎక్కడో చూశాం కద? ఎక్కడ? ఎవరి చేతిలో చూశాం...? అవును! ఇడుంబన్‌కారి చేతిలో కద చూశాం! ఆరోజు రాత్రి తొలిజాము వేళలో జరిగినవన్నీ ఒకదాని తర్వాత ఒకటి గుర్తుకు రాసాగాయి! ఈ కత్తి ఇక్కడికెలా వచ్చింది? ఓ! దీని పిడి తడిగా ఉందేమి? తడి ఎలా వచ్చింది? నీళ్ళా? కాదు, కాదు! నూనా? అది కూడ కాదు! రక్తమే అయివుండాలి! అయ్యో! ఎవరి రక్తం? ఒకవేళ తన రక్తమేనా? వంతిదేవుడు తన తల వెనుక భాగాన్ని తడిమి చూసుకొన్నాడు. అక్కడ నొప్పి పెట్టిందే తప్ప, రక్తం కారుతున్నట్లనిపించలేదు. ఒంట్లో ఎక్కడా కత్తి గాయాల నొప్పి లేదు...! మరి, ఈ వంకీల కత్తి ఎవరి రక్తాన్ని తాగేసి తన దగ్గర పడివుంది? దీనితో తానెవరినీ గాయపరచలేదు. ఇంతకు మునుపు తాను దీన్ని చేతికి తీసుకొన్నదీ లేదు! మరి దాన్నెవరు ఎవరిమీద ప్రయోగించారు? ఇడుంబన్‌కారి కావచ్చా? వాడు దీన్ని ఎవరి మీద ప్రయోగించివుండవచ్చు? ఒకవేళ ఇడుంబన్‌కారే ఆ భయంకర కాళాముఖవేషంలో వచ్చాడా? లేదు! లేదు! అలా ఉండ సాధ్యం కాదు! ఇడుంబన్‌కారి అంతటి ఎత్తరి కాదు...!

ఇదేమి? కాలి చప్పుడా? ఎవరయినా వస్తున్నారా? నిశ్శబ్దంగా ఉందామా? మాట్లడించి చూద్దామా? వస్తున్నవారు చేత దీపంతో రాకూడదా? ఎక్కడున్నామన్నదైనా తెలుసుకోవచ్చు కద? చీకటిలో తెలియక తనను తొక్కేస్తారు కద...!

~

ఈ ఆలోచన రాగానే వంతిదేవుడు చటుక్కున లేచి కూర్చొన్నాడు. చేత ఆ కత్తిని సిద్ధంగా పట్టుకొని, "ఎవరక్కడ?" అన్నాడు.

అతని గొంతు శబ్దం అతడికే విచిత్రంగా వినిపించింది. తన గొంతును తానే గుర్తుపట్టలేకపోయాడు. అతని గొంతును కాళాముఖుడు నొక్కిన నొక్కువల్ల ఇంతటి చేటు కలిగింది. గొంతునుంచి శబ్దం బయటకు రావడమే కష్టంగావుంది.

~

మళ్ళీ ఇంకొకసారి "ఎవరక్కడ?" అని గట్టిగా అడిగేందుకు ప్రయత్నించాడు. అది కూడ ఏదో ఒక ఉరుము శబ్దంలాగ వినిపించిందే తప్ప, అతని గొంతులాగ వినిపించనేలేదు.

మళ్ళీ వేగమైన కాలి అడుగుల చప్పుడు వినిపించి ఆగిపోయింది. వచ్చినవారు అతని గొంతు విని దెయ్యమో, భూతమో అని భయపడి వచ్చినదారినే తిరిగి వెళ్ళిపోయారు కాబోలు.

ఆ ఆలోచన అతడిని నవ్వు తెప్పించింది. కానీ అతడి నవ్వే అతడికి విచిత్రంగ వినిపించింది.

సరే; ఇక కూర్చొని ఉండడం వల్ల గాని, పేచివుండడం వల్ల గాని ప్రయోజనం లేదు. లేచి

ఎక్కడున్నామని శోధించి తెలుసుకోవలసిందే.

లేచి నిలబడ్డాడు. కాళ్ళు తడబడ్డాయి. కానీ నిలదొక్కుకొని ముందుకు నడిచాడు. చేతులను ఎంత చాచినా ఏమీ తగల్లేదు.

దూరాన ఏదో తళతళమని మెరుస్తూ కనిపించింది. ఆహా! అది గోడ అద్దంలాగ కద ఉంది? దాని మీద ఎక్కడినుంచో సన్నని కాంతికిరణాలు పడుతుండడంవల్ల అది తళతళమని మెరుస్తూంది. రవిదాసు పులితోలును తీసుకొని దూరిన దృశ్యం ఆ అద్దంలోనే తాను చూశానన్న విషయం గుర్తుకొచ్చింది. సరే, సరే! మనమింకా నందిని అంతఃపురంలోనే ఉన్నామన్నమాట. కానీ ఎందుకిక్కడ ఇంకా చీకటి కమ్ముకొంది? ఎందుకు నిశ్శబ్దం గూడు కట్టుకొంది? ఈ గదిలో కాసేపటివరకు ఉన్నవారంతా ఏమైనారు?

~

ఇలా ఆలోచిస్తూనే వంతిదేవుడు చీకటిలో తడబడుతూ ముందుకు నడిచాడు. వాకిలి దగ్గరకు వెళితే ఒకవేళ వెలుతురుండవచ్చు, - లేక అక్కడినుంచి బయటపడి ఎవరినైనా అడిగి జరిగింది తెలుసుకొందామని భావించి ముందుకు నడిచాడు.

కాలికి ఏదో తగలగా మళ్ళీ ధడేల్మని కింద పడ్డాడు. కానీ ఈసారి ఏదో మెత్తని వస్తువు మీద పడడంవల్ల దెబ్బ తగలలేదు. ఆ మృదువైన వస్తువు పులితోలని తెలిసింది. రవిదాసు తీసుకొని వచ్చి విసిరేసిన పులితోలే అయివుండాలి.

తడబడి కిందబడ్డప్పుడు చేతిలోకి కత్తి జారి పడిపోయింది. దాన్ని వెతికి తీసుకోవడం కోసం చేతితో చుట్టూ తడిమి చూశాడు. చేతికి ఏదో మృదువుగా తగిలింది. వంతిదేవుని ఒళ్ళంతా వణికింది. వెంట్రుకలు నిక్కబొడుచుకొన్నాయి. మనసులో భీతి ఆవహించింది.

అలాగూ ఉండవచ్చా అనుకొంటూ మళ్ళీ తడిమి చూశాడు.

అవును; అది మనుష్యదేహమే! అతని చేతికి తగిలింది ఆ మనుష్యుని అరిచేయి! పులితోలును వెంటనే అవతలికి విసిరేశాడు. తర్వాత పరీక్షగా చూశాడు. అద్దంమీద పడిన సన్నటి వెలుతురు ప్రతిఫలించి కింద పడివున్న శరీరాన్ని కూడ కాస్త చూపించింది. అయ్యో!

యువరాజు ఆదిత్య కరికాలన్ కద కింద పడివున్నారు? ఆయన కాదు! ఆయన ప్రాణంలేని దేహం మాత్రమే ఉంది!

వంతిదేవుని గుండె గొంతులో కొట్టుకొంది. కళ్ళలో అతనికి తెలియకనే కన్నీళ్ళుబికాయి.

~

వణుకుతున్న చేతులతో కరికాలన్ దేహంలో పలుభాగాలను తడిమి చూశాడు. ఏమాత్రం సందేహానికి తావులేదు. ప్రాణం ఎగిరిపోయిన ఒట్టి గూడు మాత్రమే మిగిలివుంది!

ఆ నిర్జీవదేహాపు డొక్కనుంచి ఉబికి పక్కకు ప్రవహించిన రక్తం అతని చేతిని తడిపింది.

ఆ సమయాన అతనికి కుందవై రాకుమారి గుర్తుకొచ్చింది. ఆ స్త్రీమణి తనను ఎందుకు పంపించిందో, ఆ కార్యంలో అతడు గెలుపొందలేదు. పూర్తిగా ఓడిపోయాడు. ఇక ఆమె ముఖాన్ని చూడడమెలా?

అతడు తన చేత ఎంతవరకు సాధ్యమో అంతా ప్రయత్నం చేశాడు. కానీ ఫలితం దక్కలేదు. విధి గెలిచింది.

యువరాజు నిర్జీవదేహాన్ని తీసి తన ఒళ్ళో పెట్టుకొన్నాడు. ఇక ముందుకేం చేయాలో తోచలేదు. ఆలోచించే శక్తిని కూడ కోల్పోయాడు. గట్టిగా అరిచేందుకు గొంతులో శక్తి కూడ లేకపోయింది.

"యువరాజు మరణించారు; ఒప్పుకొన్న కార్యాన్ని నెరవేర్చడంలో మనం ఓడిపోయాం; కుందవై దేవికి మనమిక ముఖం చూపించలేము!" అన్న ఆలోచనలే మళ్ళీ మళ్ళీ అతని మనసులో లేవసాగాయి.

ఇలా చింతిస్తూ అతడక్కడ ఎంతసేపు కూర్చుండిపోయాడో అతడికే తెలియదు.

దివిటీల వెలుతురులో కొందరు మనుషులు ఆ గదిని సమీపిస్తున్నారని గమనించిన తర్వాతే అతడికి ఇహ ప్రజ్ఞ వచ్చింది.

కరికాలన్ దేహాన్ని తన ఒడిలోనుంచి తీసి కింద పెట్టి లేచి నిలబడ్డాడు.

~

పదిపన్నెండుమంది ముందు వాకిలి గుండా లోపలికి వచ్చారు. వారిలో ఇద్దరు దివిటీలు పట్టుకొనివున్నారు. ఇంకొందరు శూలాలు పట్టుకొని వచ్చారు.

అందరికన్న ముందు గందమారన్, అతడి పక్కన పెద్ద శంబువరయ్యర్ వచ్చారు.

వచ్చిన వారందరి ముఖాల్లోను భయభ్రాంతులు గోచరించాయి. దివిటీ వెలుతురులో దెయ్యం కొట్టినవారిలాగ కనిపించారు.

గందమారన్ ముఖంలో మాత్రం కోపం, ఉద్రేకం పెల్లుబుకుతున్నాయి.

అతడు వంతిదేవుని చూడగానే, "ఒరే పాతకుడా! హంతకుడా! మిత్రద్రోహి! రాజద్రోహి! నీవు తప్పించుకొని పారిపోలేదా! పారిపోయావని కద అనుకొన్నాను!" అని గర్జించాడు.

తర్వాత పెద్ద శంబువరయ్యర్ని చూసి, "తండ్రీ! అదిగో చూడండి హంతకుడిని! స్నేహితుడిలా నటించి మహాపాతకాన్ని చేసిన వంచకుడిని చూడండి! మనవంశానికి మాసిపోని కళంకాన్ని కలిగించిన ఛండాలుని చూడండి! వాడు చేసిన భయంకరమైన నేరం వాడి ముఖాన్నే రాసినట్లు ప్రతిఫలిస్తూంది చూడండి!" అన్నాడు.

శంబువరయ్యర్ దానికంతా బదులేమీ చెప్పక కిందపడివున్న ఆదిత్య కరికాలన్ దేహాన్ని సమీపించారు. ఆ మృతదేహపు శిరస్సు దగ్గర కూర్చొని, కాసేపు పరీక్షగా చూసి, "అయ్యో! విధీ! ఇది నా ఇంట్లోనేనా జరగాలి? విందుకని పిలిచి అతిథిని చంపిన నింద నా తలమీదా పడాలి!" అని విలపిస్తూ తమ

తలనే కొట్టుకొన్నారు.

గందమారన్ "తండ్రీ! మన కులానికి ఆ నింద ఏనాడూ రాబోదు! ఇదిగో హంతకుని పట్టేసుకొన్నాం! వీడు యువరాజును చంపేందుకు ఉపయోగించిన కత్తి అదిగో పడివుంది చూడండి! దానిమీద రక్తం గడ్డకట్టివుండడాన్ని చూడండి! మునుపు నేను వచ్చినప్పుడు వీడిక్కడ లేడు. కత్తి కూడ లేదు. పారిపోజూసి, వీలుగాక తిరిగి వచ్చేశాడు! ఒకవేళ యువరాజు దేహంలో ఇంకా ప్రాణం ఉందేమోనని చూసేందుకు వచ్చాడు కాబోలు! తండ్రీ! ఇటువంటి మహాపాతకునికి, ద్రోహికి ఏం శిక్ష విధించాలి? ఏ శిక్ష విధించినా చాలదు కద?" అని గందమారన్ (నోటికొచ్చినట్లు) మాట్లాడుతూనే ఉన్నాడు.

~

వంతిదేవుడు అప్పటికే గొంతు నొక్కబడి మాట్లాడలేకున్నాడు. గందమారన్ మాటలతన్ని దిగ్భ్రమింపజేశాయి. తనను ఇతరులు హంతకుడని భావించి నిందారోపణ చేయగల పరిస్థితిలో తానున్నానని అప్పుడే అతడికి స్ఫురణకొచ్చింది. యువరాజును తాను పొడిచి చంపానన్న నిందను కద వీడు తనమీద మోపుతున్నాడు? మునుపు వీడిని తాను వెన్నుపోటుపొడిచానన్నాడు. ఇప్పుడు యువరాజును తానే చంపేశానని అంటున్నాడు! మన పరిస్థితి అలా ఉంది! ఎవరైనా తనని సందేహించేటట్లుంది మన పరిస్థితి! ఆహా! ఆ పళువూర్ యువరాణి - అందమే రూపుగొన్న ఆ విషసర్పం - దీనికోసమే ప్రణాళిక వేసింది కాబోలు! ఇందుకే తనని కొన్నిసార్లు కాపాడింది కాబోలు! కుందవై రాకుమారి మీదున్న క్రోధాన్ని ఇలా తీర్చుకొంది! ఆహా! ఆ మాయమోహిని, సౌందర్యమే రూపుగొన్న ఆడదెయ్యం ఎక్కడ? ఎలా తప్పించుకొంది? కార్యం ముగియగానే మంత్రవాది మొదలైనవారితో సొరంగమార్గం గుండా తప్పించుకొని పారిపోయింది కాబోలు!

ఇలా ఆలోచిస్తున్న వంతిదేవుని చింతన చటుక్కున మరొకవైపు మళ్ళింది! ఆదిత్య కరికాలన్‌గారిని తాను చంపలేదన్నది నిజం. కానీ ఇంకెవరు చంపారు? నందినా? లేక రవిదాసా? లేక కాళాముఖుడా? - ఒకవేళ తాను తెలివితప్పి పడిపోయే తరుణంలో ఒక క్షణం కనిపించి మరుగైన మణిమేఖలే కావచ్చా? లేక ఈ వంకీల కత్తితో వచ్చిన ఇడుంబన్‌కారి కావచ్చా? లేక, గందమారనే, నందిని పైగొన్న మోహం వల్ల ఈ మహాపాతకాన్ని చేసేసి తన మీద నింద మోపుతున్నాడా? లేక నందిని చెప్పిన విచిత్ర రహస్యాన్ని వినేసి, యువరాజు తనని తానే పొడుచుకొని చనిపోయారా?

గందమారన్ తన పక్కన నిలబడ్డ మనుషులను చూసి, "దద్దమ్మల్లారా! ఎందుకు ఊరక నిలబడ్డారు? ఈ హంతకుడిని పట్టి బంధించండి!" అని అరవడమే వంతిదేవునికి తన ఇక్కట్టైన పరిస్థితిని గుర్తు చేసింది.

~

గందమారన్ని అతడు జాలి, దుఃఖమూ కలగలిసిన చూపులతో చూశాడు. ఒక పెద్ద ప్రయత్నం

చేసి తన గొంతులోకి జీవాన్ని రప్పించుకొని, "గందమారా! ఇదేమి? నేనిటువంటి క్రూరకృత్యాన్ని చేశానని నీవు నమ్ముతున్నావా? ఎందుకని నేనిది చేయాలి? ఇందువల్ల నాకేం లాభం? మిత్రమా...!" అనే లోపు, గందమారన్, "ఛీఛీ! నేను నీ మిత్రుడిని కాను. అలా అన్న నీ నాలుకను తెగగోయాలి. నీకు ఏం లాభం అనా అడుగుతున్నావు? ఎందుకు లాభం లేదు? నందిని కడగంటి కటాక్షం పొందుదామనే! ఒరేయ్! ఆ పళువూర్ మోహిని ఇప్పుడెక్కడ?" అన్నాడు.

"గందమారా! నిజంగా నాకు తెలియదు. నేనిక్కడ తెలివితప్పి పడివున్నాను. మీరు వచ్చేందుకు కాసేపటి క్రితమే నాకు తెలివొచ్చింది. నందిని ఏమైందని నాకు తెలియదు. ఒకవేళ సొరంగమార్గం గుండా బయట పడివుండవచ్చు. వేట మంటపంలో ఆమె మనుషులు - వీరపాండ్యుని ఆపత్కాల సేవకులు - నలుగురు వేచివుండేవారు. వారితోబాటు నందిని పారిపోయివుండవచ్చు!"

గందమారన్ "ఓహో! నిన్ను కూడ ఏమార్చేసి పారిపోయిందా? కానీ నీకేం తెలియదని దబాయించకు. దాన్నెవరు నమ్ముతారు? నీవు దాని మోహపు వలలో పడిపోయావు, కాలితో చెప్పిన పనిని తలతో చేసేందుకు సిద్ధమయ్యావని నాకు తెలియదా? ఆదిత్య కరికాలన్‌గారే చెప్పారు కద? నందిని కూడ నీ గురించిన నిజాన్ని ఆయనకు చెప్పింది. ఆమె పురిగొల్పిగాని, ఆమెను సంతృప్తి పరచాలనో గాని ఎంచి నీవే ఈ పాతకాన్ని చేశావు! నీ ముఖాన్ని చూస్తేనే పాపం చుట్టుకొంటుంది!" అన్నాడు.

"గందమారా! సత్యప్రమాణం చేసి చెబుతున్నాను. నేను యువరాజును చంపలేదు. ఆయన ప్రాణాన్ని కాపాడే బాధ్యతను తీసుకొన్నవాడిని..."

"ఇలా చెప్పే యువరాజును మోసం చేశావు! లేకపోతే ఈ గదిలోకెలా వచ్చి చేరావు? ఎందుకని వచ్చావు?"

"గందమారా! యువరాజుకు ఆపద రాబోతూందని గ్రహించి ఆయనను కాపాడేందుకు వచ్చాను. ఆ ప్రయత్నంలో ఓడిపోయాను. కానీ అది నా నేరం కాదు. కావాలంటే నీ చెల్లెలు మణిమేఖలను అడిగి చూడు. ఆమే నన్ను...."

"ఛీఛీ! నా చెల్లెలిగురించి మాట్లాడకు! ఆమె పేరెత్తకు! జాగ్రత్త! ఇక నీవామె పేరెత్తితే ఏమవుతుందో తెలుసా? ఇప్పుడే నీ గొంతు పిసికి చంపేస్తాను!"

~

ఇలా చెబుతూ గందమారన్ వంతిదేవుని మీదికి దూకి అతని చేతులను, శరీరాన్ని చేర్చి కట్టివుంచిన తాళ్ళను పట్టుకొని ఒక్కఊపు ఊపాడు.

తర్వాత ఆదిత్య కరికాలన్ మృతదేహం పక్కన కూర్చొని వేదన పడుతున్న శంబువరయ్యర్ని చూసి, "తండ్రీ! వీడినేం చేయాలో చెప్పండి! మన కులానికి మాసిపోని మచ్చను కలిగించిన ఈ హంతకుడిని ఏం చేయాలో చెప్పండి! మీరు అనుమతిస్తే వీడిని ఇక్కడే, ఇప్పుడే ముక్కలు ముక్కలుగా నరికి పోగులు

వేస్తాను! తండ్రీ! చెప్పండి!” అని అరిచాడు.

కరికాలన్ మృతశరీరాన్ని తడిమిచూస్తూ దిగ్భ్రమించినట్లు కూర్చొనివున్న శంబువరయ్యర్ అతడి కేకలు విని తలెత్తి చూశారు.

ఆయన చూపు గందమారన్ని దాటి వెళ్ళి ఆ గదిలోవున్న మంచం తెర కదలడాన్ని గమనించారు. ఆ మంచం తెరను తొలగించుకొని ఒక ఆకారం బయటకు రావడాన్ని చూశారు. కళ్ళలో నీళ్ళు నిండివుండడం వల్ల అదెవరూ వెంటనే తెలుసుకోలేకపోయారు. ఆ ఆకారం ఇంకాస్త దగ్గరికి రాగానే అది తన ప్రియపుత్రిక మణిమేఖలే అని గ్రహించారు. అందువల్ల ఆయనకు కలిగిన ఆశ్చర్యం, అసహ్యం ఆయన వేదనాపూరితమైన వదనంలో ప్రతిఫలించాయి.

“మణిమేఖలా! నీవిక్కడికెలా వచ్చావు?” అని ఆయన అడిగిన మాట గందమారన్ని కూడ తిరిగి చూసేలా చేసింది.

“నాన్నా! నేనిక్కడే ఉన్నాను. ఆయన్నేమీ చేయొద్దని అన్నకు చెప్పండి! ఆయన తప్పేమీ లేదు!” అన్నది.

గందమారన్ " నాన్నా! చూశారా! ఈ పాతకుడు నా చెల్లెలి మనసును ఎలా చెడగొట్టేశాడో, చూశారా? వీడి తప్పేమీ లేదట!” అని చీదరిస్తూనే నవ్వాడు.

“అవునన్నయ్యా! నిశ్చితంగా ఈయన ఏ నేరమూ చేయలేదు!” అని మణిమేఖల దృఢంగా చెప్పింది.

గందమారన్ని ఒకవైపు ఉద్రేకమూ, ఇంకొకవైపు సిగ్గూ పట్టి పీడించాయి.

“చెల్లాయ్! నోరు మూసుకో! నిన్నెవరు ఇక్కడికి పిలిచారు? నీవిక్కడికి వచ్చేవుండకూడదు. నీ బుద్ధి నీ స్వాధీనంలో లేదు. వెంటనే ముందు గదికి వెళ్ళు!” అని అరిచాడు గందమారన్.

“లేదన్నా! నా బుద్ధి స్వాధీనంలోనే ఉంది. నీ బుద్ధే చలించింది. లేకపోతే ఈయన యువరాజును చంపారని నిందించేవాడివి కావు!” అన్నది మణిమేఖల.

గందమారన్ "బుద్ధిలేనిదానా! ఈ హంతకుడిని నీవెందుకు వెనకేసుకొస్తున్నావు?” అన్నాడు.

“ఆయన హంతకులు కారు! అందుకే!” అన్నది మణిమేఖల.

గందమారన్ ఉక్రోషం నిండిన నవ్వుతో, “వీడు హంతకుడు కాకపోతే, మరింకెవ్వరు? యువరాజును హత్య చేసిందెవరు? నీవు చంపావా?” అని అడిగాడు.

“అవును! నేనే చంపాను! ఈ కత్తితో చంపాను!” అన్నది మణిమేఖల.

ఈ మాటలు విని అక్కడున్నవారందరూ ఆశ్చర్యంతో అవాక్కైనారు. వారు ఆశ్చర్యంతో ఒకరిముఖాలొకరు చూసుకొన్నారు.

~

ఒక్క క్షణం ఆశ్చర్యం తర్వాత గందమారన్ వంతిదేవుని వదిలేసి, ఒక్క దూకులో మణిమేఖల వైపు వెళ్ళాడు. ఆమె చేతనున్న ఖడ్గాన్ని లాక్కొన్నాడు. దాని మొనని పరీక్షగా చూశాడు.

"నాన్నా! ఇది వినండి! ఈమెకు ఈ కత్తి ఎత్తడమే సాధ్యం కాలేదు. ఈమె యువరాజును ఈ కత్తితో చంపానంటూంది. ఇది యువరాజు శరీరంలో దూసుకొని వెళ్ళివుంటే దాన్ని తిరిగి తీసేందుకు ఈమె చేతనవుతుందా? వల్లవరయ్యన్ని కాపాడేందుకు ఇలా అంటూంది! వీడిమీద ఈమెకెందుకింత అభిమానం? అంత దూరానికి వీడీమె మనసును చెడగొట్టేశాడు. మాయమంత్రాలు వేసి మైమరపించేశాడు! వాడి ముఖాన్ని చూడండి! వాడు చేసిన నేరం వాడి ముఖానే రాసినట్లుంది, చూడండి!" అన్నాడు.

నిజంగానే వంతిదేవుని ముఖాన ఆశ్చర్యమూ, దిగ్భ్రమ, వేదన గూడు కట్టుకొనివున్నాయి. ఇంతసేపూ మౌనంగా ఉన్నవాడు ఇప్పుడు నోరు తెరిచి, "గందమారా! నీవు చెబుతున్నది నిజమే! నేనే నేరస్థుడిని. నీ సహోదరి నన్ను కాపాడేందుకే ఇలా కల్పించి చెబుతూంది! రాకుమారీ! మీకు కృతజ్ఞతలు! నేను అసువులుబాసిన తర్వాత కూడ మీరు నాపైగొన్న సహోదరభావాన్ని మరువను. కానీ ఇప్పుడు మీ అన్న చెబుతున్నది వినండి! అంతఃపురానికి వెళ్ళిపొండి!" అన్నాడు.

ఇది విన్న గందమారన్ క్రోధం ఉచ్ఛస్థాయికి చేరుకొంది. అప్పటికే ఎర్రబడ్డ అతని కళ్ళు ఇప్పుడు నిప్పులుగక్కాయి.

"ఒరే! నాకోసం సిఫారసు చేసే స్థితికి వచ్చేశావా? నేను చెబితే విననిది నీవు చెబితే వింటుందా? ఇది నీమీద అంతటి సహోదర భావంగొనివుందా? ఇది నాతోడబుట్టిందా? నీతోడబుట్టిందా? నాకంటే నీవంటే దీనికి గౌరవం, మర్యాద ఎక్కువా? అదెందుకు? ఏం మాయమంత్రం వేసి మచ్చిక చేసుకొన్నావు? నిన్ను నేను చంపేందుకు ఇదే చాలు కద? ఇదిగో నిన్ను యమలోకానికి పంపించేసి తదుపరి కార్యం చూస్తాను! నీ ప్రియ సహోదరి చేతనున్న కత్తితోనే నిన్ను చంపుతాను; అది నీకు సంతోషాన్నిస్తుంది కద?"

ఇలా అరుస్తూనే గందమారన్ కత్తినెత్తిపట్టుకొని వంతిదేవుని మీదకు దూకాడు.

~~~
~~~

# అధ్యాయము - 41

## ఎగసాయి అగ్నిజ్వాలలు!

**ఇంతసేపూ** కదలకుండ కూర్చొనివున్న శంబువరయ్యర్ ఒక్క ఉదుటున లేచి గందమారన్ చేయి పట్టుకొన్నారు.

“ఒరే మూర్ఖుడా! ఏం వెధవ పని చేయ తెగించావు?” అని గద్దించారు.

"తండ్రీ! ఈ మిత్రద్రోహిని చంపడంలో తప్పేమి?" అన్నాడు గందమారన్.

“ఏం తప్పా? అందువల్ల నీవూ, నేనూ, ఈ పురాతనమైన శంబువరయ్యర్ కులమూ తుడిచిపెట్టుకుపోతాము. వీడిని చంపేస్తే, యువరాజును, వీడిని చేర్చి మనమే చంపేశామని కద నింద మోపుతారు? ఇది కూడ నీవు గ్రహించలేకపోయావా?” అన్నారు తండ్రి.

“అలా మనమీద నింద మోపగల మొనగాడెవ్వడు? నింద మోపేసి వాడు ప్రాణాలతో ఉండగలడా?” అని గొప్పలు పోయాడు గందమారన్.

“ఒరే దద్దమ్మా! నీ వీరత్వాన్ని, తెగింపును ఇందులోనా చూపించాలి? మొదటినుంచీ నీ మాట వింటూ వచ్చినందువల్లే ఈ విపరీతం మన ఇంట జరిగింది! పెద్ద పళువేట్టరయర్ని, తక్కిన చిన్నరాజులను నీవే ఈ ఇంటికి పిలిచావు. మధురాంతక దేవరు రహస్యంగా వచ్చింది కూడ నీ వల్లనే. అది నీ ఈ ప్రియస్నేహితుడి వల్ల అందరికీ తెలిసిపోయింది. తర్వాత ఆదిత్య కరికాలన్‌గారిని కంచి నుంచి పిలుచుకొని వచ్చింది కూడా నీవే! అయ్యో! దాని పరిణామం ఇలా ఉంటుందని నేను కలలో కూడ అనుకోలేదు కద! మలైయమాన్ - మన కులానికి పురాతన శత్రువు - ఒక పెద్ద సైన్యంతో సమీపిస్తున్నాడు. వాడికేం చెప్పబోతున్నాను...!” అని చెప్పి శంబువరయ్యర్ మళ్ళీ తల బాదుకోసాగారు.

గందమారన్ కళ్ళలో నీళ్ళుబుకగా, “తండ్రీ మీరు ఊరకనే వేదన పడకండి. నావల్ల జరిగిన విపరీత పరిణామాలకు శిక్ష నేనే అనుభవిస్తాను. మీరెలా ఆజ్ఞాపిస్తే అలా చేసేందుకు సిద్ధంగా ఉన్నాను!” అన్నాడు.

“మొట్టమొదట ఈ పిల్లను తీసుకొని వెళ్ళి అంతఃపురంలో విడిచిపెట్టి రా! ఇదేమైనా పేలితే నోట బట్ట కుక్కి, కాళ్ళు చేతులు కట్టిపడేసి రా! లేకపోతే రహస్యగదిలో వేసి తాళం వేసేసి రా!” అన్నారు శంబువరయ్యర్.

మణిమేఖల అప్పుడు తన తండ్రిగొన్న రౌద్రకారాన్ని చూసి గడగడ వణికింది. వంతిదేవునికిప్పుడు ఏ ఆపదా రాబోదని గ్రహించింది.

“తండ్రీ! క్షమించాలి. మీ ఆజ్ఞ ప్రకారం నడుచుకొంటాను. గందమారన్ నన్ను తాకొద్దు. నేనే

ఇదిగో తల్లులుండే అంతఃపురానికి వెళ్ళిపోతున్నాను!" అని చెప్పేసి వడివడిగా అక్కడినుంచి నడిచి వెళ్ళింది. గందమారన్ కూడ ఆమె వెంబడే వెళ్ళాడు.

వారలా వెళ్ళగానే శంబువరయ్యర్ తమతో వచ్చిన మనుషులను చూసి, "వీడిని ఆ మంచం కాలితో చేర్చి గట్టిగా కట్టండి!" అని ఆజ్ఞాపించారు.

~

ఆజ్ఞప్రకారం ఆ మనుషులు వంతిదేవుని సమీపించినప్పుడు అతడు శాంతంగానే ఉన్నాడు. మంచం కాలితో చేర్చి కట్టినప్పుడు కూడ ఏ విధంగానే అడ్డు రాలేదు. తర్వాత, అతడు, "అయ్యా! కాస్త ఆలోచించి చూడండి! కరికాలన్ అంతరంగ స్నేహితుడిని నేను. ఆయనను చంపడం వల్ల నాకేం లాభం? నిజానికి ఆయనను చంపిన పాతకులు సొరంగమార్గం గుండా పారిపోయారు. వారిని వెన్నంటి వెళ్ళి వారిని పట్టుకొనే ప్రయత్నం చేయండి. వారిని నేను చూసివున్నాను. నన్ను విడుదల చేస్తే నేనే మీతోబాటు వచ్చి వారిని పట్టుకోవడానికి సహాయం చేస్తాను! దేవుని మీద ఆన చేసి చెబుతున్నాను. మీ దగ్గరినుంచి తప్పించుకోవడానికి నేను ప్రయత్నించను!" అన్నాడు.

"ఒరే! నీవు చెప్పేది నిజమైతే, యువరాజును వారు చంపేటప్పుడు నీవేం చేస్తున్నావు? నిలబడి చోద్యం చూస్తున్నావా?" అని అడిగారు శంబువరయ్యర్.

"అయ్యా! పళువూర్ రాణి, యువరాజు మాట్లాడుకొంటున్నప్పుడు ఉన్నట్లుండి హంతకులు ప్రవేశించారు. వారిని అడ్డుకోవడానికి నేను ప్రయత్నిస్తున్నప్పుడు భయంకర రూపంగొన్న ఒక కాళాముఖుడు నా గొంతు పట్టుకొని నొక్కేశాడు. నేను తెలివి తప్పి పడిపోయాను. మళ్ళీ తెలివి వచ్చి చూసినప్పుడు కరికాలన్ నిర్జీవులై పడివుండడాన్ని చూశాను!" అన్నాడు వంతిదేవుడు.

అప్పుడా మాళిగ ప్రాకారం బయట ఏదో పెద్ద కలకలం రేగడం వినిపించింది. వేవేలమంది గొంతెత్తి చేస్తున్న ఘోషలాగ తోచింది.

శంబువరయ్యర్ దాన్ని చెవులు రిక్కించి విన్నారు. తర్వాత వంతిదేవుని చూసి, "సరే, సరే! నీవు చెబుతున్నది నిజమైనా, నీవు కాసేపు ఇక్కడే ఉండు! నీ ప్రియ మిత్రుడైన యువరాజుకు తోడుగా ఉండు! అవేం కేకలని చూసి తెలుసుకొని వస్తాను!" అని చెప్పేసి శంబువరయ్యర్ బయలుదేరారు. ఆయనతోబాటు ఆయన మనుషులు కూడ వెళ్ళారు. వెళ్ళేటప్పుడు శంబువరయ్యర్ ఆజ్ఞ ప్రకారం ఆ గదిని బయటినుంచి తాళంవేసి వెళ్ళారు.

~

మళ్ళీ ఆ గదిలో చీకటి కమ్ముకొంది. వంతిదేవుని మనసులోనేమో చెప్పలేనంత వేదన గూడుకట్టుకొంది! కొన్ని నెలల క్రితం తాను ఆ కడంబూర్ మాళిగకు వచ్చినప్పటినుంచి జరిగినదంతా గుర్తు చేసుకొన్నాడు. ఆకాశంలో తాను ధూమకేతువును చూసింది, దాని గురించి మాట్లాడుకొన్న మాటలు

గుర్తొచ్చాయి. ఆకాశాన తోకచుక్క కనిపించడంవల్ల సుందర చోళ చక్రవర్తి అంతిమదినం సమీపించిందని అందరూ అనుకొన్నారు. చక్రవర్తి చాల రోజులుగా జబ్బుపడి మంచం పట్టడం వల్ల అందరూ అలా అనుకోవడం సహజమే. అందువల్లనే ఆయన తర్వాత సింహాసనం మీదికి రాబోయేవారెవరని ప్రజలందరూ ఊహాగానాలు చేయ మొదలుపెట్టారు. ఈ మాళిగలోనే చిన్నరాజులందరూ సమావేశమై దాని గురించి మాట్లాడుకొన్నారు. కానీ అందరూ ఎదురుచూసిందొకటి, జరిగిందింకొకటిగా అయ్యింది. యవ్వనప్రాయంలోనే వీరాధివీరులైన ఆదిత్య కరికాలన్ మరణించారు. ఆయన నిర్జీవదేహం ఇదిగో ఈ గదిలోనే పడివుంది. జబ్బుపడ్డ సుందర చోళ చక్రవర్తి ఇంకా బతికేవున్నారు. కానీ ఇంక చాలకాలం ఉంటారా? తమ ప్రియపుత్రుని అకాలమరణవార్తను విన్న తర్వాత ఇంకా ప్రాణాలతో ఉంటారా? అయ్యో! కొడుకును చూడాలని తండ్రి ఎంతగా ఎదురుచూసేవారు? తండ్రి వచ్చి ఉండాలని కరికాలన్ కంచిలో బంగారు మాళిగ కట్టించారు కద? ఆ స్వర్ణ మాళిగకు తండ్రిని స్వాగతించి ఉపచారాలు చేయడానికి నోచుకోక ఆయన కుమారుడు చనిపోయారు కద? దీనివల్ల ఇంకెన్ని విపరీత పరిణామాలు కలగబోతాయో తెలియదు. చోళరాజ్యమంతా దుఃఖసాగరంలో మునిగిపోబోతూంది. అది మాత్రమేనా? ఎన్ని విధాల అంతఃకలహాలు లేవబోతాయో, ఎవరికి తెలుసు? చిన్నరాజుల మధ్య పెద్ద యుద్ధం జరగడం తథ్యం. కాసేపటి క్రితం బయట వినిపించిన శబ్దం మలైయమాన్ సైనికులు చేసిన మహాఘోషే అయివుండాలి! వారెందుకని అలా ఘోషిస్తున్నారు? ఈ కడంబూర్ మాళిగను ముట్టడించబోతారా, ఏమి? ఎందుకని? కరికాలన్ మరణవార్త అప్పటికే వారికి అందిందా? ఆహా! శంబువరయ్యర్ దీన్ని ఎదుర్కొని తట్టుకోగలరా? యువరాజును హత్య చేసిన నిందను తనమీద పడేసి తప్పించుకోజూస్తారు. కానీ అది మలైయమాన్ నమ్ముతారా? నమ్మినా, శంబువరయ్యర్ మాళిగలో ఇది జరిగింది కాబట్టి, ఆయన్ని ఊరకే వదులుతారా? మునుపు జరిగిన కుట్రాలోచన మలైయమాన్‌కి తెలిసేవుండాలి. తెలియకపోయినా, ఆళ్వార్ కట్టియాన్ వెళ్ళి హెచ్చరించివుంటాడు. అందుకే దండెత్తి వచ్చారు. మలైయమాన తమ మనుమడిమీద ఎంతటి ప్రేమగొన్నారో వంతిదేవునికి బాగా తెలుసు. ఈ వార్త వినగానే ఆయనేం చేస్తారో ఎవరికి తెలుసు? శంబువరయ్యర్ కుటుంబాన్ని నాశనం చేసేసి, ఈ మాళిగను నేలమట్టం చేసినా చేయవచ్చు.

పాపం, గందమారన్! వాడు మంచివాడే! మనతో ఎంత స్నేహంగా ఉండేవాడు? అంతటి గాఢస్నేహం కూడ క్రూరద్వేషంగా మారిపోయింది కద? అంతా ఆ పళువూర్ మోహిని కారణంగానే. చూడబోతే ఆమె కథ కూడ శోకమయంగానే ఉంది. ఆమె మీద తానెలా నింద మోపవచ్చు? అంతా విధివిలాసం...!

విధి! విధి! మణిమేఖల విధిని ఏమని చెప్పడం? నామీద ఆమె ఎందుకంత ఆప్యాయత, అనురాగం చూపాలి? తనను తప్పించేందుకు తాను ముందుకు వచ్చి 'నేనే చంపాను' అన్నది కద? ఇటువంటి ప్రేమకు సాటి ఏది? - ఇందుకు తాను ప్రత్యుపకారం ఏం చేయబోతున్నాడు?

వంతిదేవుడు తనలో తానే నవ్వుకొన్నాడు. ప్రత్యుపకారం చేయడం గురించి ఆలోచించడం ఎంత పిచ్చితనం? ఇతరుల పరిస్థితి గురించి విచారించడంలో అర్థం ఏముంది? తన పరిస్థితి కన్న భయంకరమైన పరిస్థితిలో ఇంకెవ్వరూ లేరు. ఆదిత్య కరికాలన్ని చంపానని తనమీద నింద మోపబోతున్నారు! తానా పాతక కృత్యాన్ని చేయలేదని నిరూపించేందుకు ఏ సాక్ష్యమూ లేదు. నందిని, రవిదాసు కూటమి పారిపోయారు. వారిని వెన్నంటే వెళ్ళి పట్టుకోవడానికి ఎవరూ ప్రయత్నించలేదు. వారిని ఒకవేళ పట్టుకొన్నా, తాను కూడ ఇక వారితో చేరలేదని ఎలా నిరూపించడం? అది సాధ్యం కాదు!

పట్టపు యువరాజును హత్య చేసిన రాజద్రోహానికి ఎలాంటి శిక్ష విధిస్తారు? ఊరకే హత్యకు శిక్ష అని విధించరు. ఇక ఇలాంటి పాతక కృత్యాన్ని ఎవరూ కలలో కూడ చేసేందుకు తెగించనట్లు భయంకరమైన చిత్రవధను శిక్షగా విధిస్తారు. ఎలాంటి శిక్ష విధించినా విధించనీ. కరికాలన్‌గారిని తాను హత్య చేసినట్లు పళైయార్రై యువరాకుమారి, పొన్నియిన్ సెల్వన్ అనుకొంటారు కద? దాని కన్న ఇంకే చిత్రవధ కఠినంగా ఉండగలదు? భగవాన్! గత మూడు నాలుగు నెలలుగా తానెన్నో ఇక్కట్లను తప్పించుకొని వచ్చింది ఈ భయంకరమైన అపకీర్తిని భరించేందుకా...?

~

ఇలా అలల్లాగ వంతిదేవుని మనసులో ఎన్నెన్నో ఆలోచనలు పైకి లేచి మరుగైనాయి. ఎంతసేపలా కాలం గడిచిందో అతడికి తెలియలేదు. చీకటి కమ్ముకొన్న ఆ గదిలో ఉన్నట్లుండి పొగ ప్రవేశించగా అతడి ఆలోచనాస్రవంతి చెదరిపోయింది. అది ఏం పొగ, ఎక్కడినుంచి వస్తోంది అని ఆలోచించనారంభించాడు. కాసేపటికల్లా అతి స్వల్పంగా వెలుతురు కూడ ఆ గదిలో పరుచుకోసాగింది. ఆ వెలుతురులో ఆదిత్య కరికాలన్ నిర్జీవ శరీరం కనిపించింది. తలుపులు మూసినవి మూసినట్లే ఉన్నాయి. కాబట్టి అది దీపం వెలుతురు కాజాలదు. మరి, ఏం వెలుతురు? నలువైపులా పరీక్షగా గమనించాడు. పొగ, వెలుతురు పకనున్న వేటమంటపం నుంచి వస్తున్నాయని గ్రహించాడు. వేటమంటపం నుంచి పొగ రావడానికి కారణమేమి? ఒకవేళ నిప్పంటుకొందా? వేటమంటపం గుండా సొరంగమార్గంలో తప్పించుకొని పారిపోయినవారు కావాలనే నిప్పంటించేసి వెళ్ళారా? లేక, తాను, మణిమేఖల తీసుకొచ్చిన దీపం ఈ విపత్తుకు కారణమా?

రాను రాను పొగ అధికం కాసాగింది. వేడి కూడ అధికం కాసాగింది. కాసేపటికల్లా వేటమంటపానికి, ఆ గదికి మధ్యనున్న చెక్క బల్లల సందుల్లో నుంచి అగ్ని జ్వాలలు నాలుకలు కానరాసాగాయి. ఇంకాసేపటికల్లా అగ్ని భగవానుడు తన జ్యోతిర్మయమైన చేతులను చాస్తూ ఆ గదిలోకి వచ్చేశాడు...!

అగ్నిదేవుని ప్రవేశాన్ని కాసేపు వంతిదేవుడు కళ్ళార్పకుండ విస్మయంతో చూస్తూండిపోయాడు. మొదట అతడికి చాల ఉత్సాహం, కుతూహలమే కలిగాయి. 'మన దిగుళ్ళన్నీ అగ్ని

భగవానుడే తీర్చేయబోతున్నాడు. ఆదిత్య కరికాలన్‌కి, మనకు ఒకేసారి, ఒకేచోట దహన సంస్కారం జరగబోతూంది!' అని భావించాడు. ఇది కాసేపు మాత్రమే. కరికాలన్‌ని తాను చంపానన్న నిందతో తాను ఈ లోకాన్ని విడిచి వెళ్ళడానికి ఇష్టపడలేదతడు. శంబువరయ్యర్, ఆయన కొడుకు ఆ విధంగానే అందరికీ చెబుతారు. కొందరు దాన్ని నమ్ముతారు కూడాను. ఎవరు నమ్మినా, నమ్మకపోయినా పొన్నియిన్ సెల్వన్, కుందవైదేవి అలా నమ్మకూడదు. తానా భయంకరమైన కృత్యాన్ని చేయలేదని వారిద్దరి కోసమైనా నిరూపించే తీరాలి. అది మాత్రం కాదు; వీరాధివీరుడైన ఆదిత్య కరికాలన్ అంతిమ క్రియలు ఇలా జరిగేందుకు ఆస్కారం ఇవ్వవచ్చా? ఆయన తలిదండ్రులు, బంధువులు కనీసం ఆయన నిర్జీవ దేహాన్నైనా చూడవద్దా...? అవునవును! ఆయన ప్రాణాన్ని కాపాడలేకపోయినా, ఆయన శరీరాన్నైనా కాపాడాలి. చక్రవర్తి ప్రియపుత్రుని అంతిమ క్రియలను జరిపించేందుకు దారి వెతకాలి...!

~

అంతవరకు వంతిదేవుడు తనని తాను కట్లనుంచి విడిపించుకోవడానికి ప్రయత్నించలేదు. తనని మంచానికి ఏ విధంగా కట్టివుంచారన్నది కూడ గమనించలేదు. మొదట అతని చేతులను కట్టి ఆ తాటితోనే అతని ఒళ్ళంతటినీ మంచం కాలికి చేర్చి కట్టారు. వంగడానికి గాని, ఒంటిని నిటారుగా చేసుకోవడానికిగాని సాధ్యం కావడం లేదు. తన పూర్తి బలాన్ని ఉపయోగించి కట్లను లాగి, పళ్ళతో కొరికి విడిపించుకోజూశాడు; అది కూడ సాధ్యం కాలేదు. కానీ అలా ఒంటిని సడలించుకోజూసినప్పుడు మంచం కాస్త కదిలింది. వెంటనే ఒక ఆలోచన తట్టింది. మంచాన్ని లాక్కొంటూ వేటమంటపం రహస్యద్వారం వైపు వెళ్ళాడు. అది అంత సులభం కాలేదు. ఒక్కొక్క అంగుళమే ముందుకు జరగవలసి వచ్చింది. మంచాన్ని లాగినప్పుడు కట్టిన ముళ్ళు ఇంకా గట్టిగా బిగించుకొని అతన్ని బాధించాయి. అయినా కూడ ఆ బాధని సహిస్తూ ముందుకు జరిగాడు. వాకిలిని సమీపించినప్పుడు సందుల్లోనుంచి అగ్నిజ్వాలలు లోపలికి వస్తున్నాయి. ఆ జ్వాలలకు చేతికట్లను చూపించాడు. కట్లకు నిప్పంటుకొంది. అదే సమయాన ఆ అగ్ని జ్వాలలు అతడి చేతులను కూడ కాల్చి భరించరాని బాధను కలిగించాయి. అయినా సహించుకొని చేతి కట్లు విడిపోగానే ఒంటిని కట్టివున్న కట్లను గబగబా విప్పుకొన్నాడు. ఆ కట్లను విప్పుకోక మునుపే మంచం తెరలకు నిప్పంటుకొంది. గదిలో పొగ పూర్తిగా కమ్ముకొంది. వంతిదేవుని ఒళ్ళంతా నిప్పంటుకొని కాలుతున్నట్లు అనిపించింది. అతని కళ్ళు మండనారంభించాయి. తర్వాత కన్నీళ్ళు ధారగా రాసాగాయి. కంటిచూపు మసకబారింది.

ఎక్కడ? ఎక్కడ? నేనూ యువరాజుతోబాటు ఇక్కడే కాలి మరణించవలసిందే! ఒకవిధంగా ఇది కూడ మన మంచికే కద? యువరాజును ఎలాగూ కాపాడలేకపోయాము. అయనతోబాటు చనిపోయే అవకాశమైనా దొరకనీ...! ఛీఛీ! ఇదేం ఆలోచన? తాను మరణించడం గురించి దిగుల్లేదు. యువరాజు మృతదేహం ఇక్కడే కాలి బూడిదైపోతే తనమీద ఎన్నటికీ మాసిపోని నింద పడుతుంది కద?

తన్నెరిగినవారు తాను గుర్తొచ్చినప్పుడల్లా తనని శపిస్తారు కద? తానెందుకు నిందకు తావిచ్చి మరణించాలి? యువరాజు శరీరాన్ని ఎలాగైనా బయటకు తీసుకొని వెళ్ళాలి. ఆయన తాతగారైన మలైనమాన్‌కి ఒప్పజెప్పాలి. తాను యువరాజును చంపలేదని, చంపినవారిని వెతికి పట్టిస్తానని వారు నమ్మేటట్లు చెప్పాలి.  అలా ఒప్పుకొన్న కార్యాన్ని నెరవేర్చిన తర్వాత తాను చనిపోయినా ఫరవాలేదు. అంతవరకు ఎలాగైనా బతికే ఉండాలి.

వంతిదేవుడిప్పుడు అన్ని కట్లను విప్పదీసుకొని విడుదలైనాడు. కానీ, ఇదేమి? మంచం నిప్పంటుకొని కాలుతూందే! వేడిని తట్టుకోలేకపోతున్నామే! కళ్ళను తెరిచేందుకే సాధ్యం కావడం లేదేమి? తెరిచినా, పొగ కమ్ముకొని ఏమీ కనిపించడం లేదు కద? అయినా కూడ యువరాజు శరీరాన్ని కనిపెట్టి తీరాలి. వంతిదేవుడు నేలమీద కూర్చొన్న ఫళంగానే చేతులు చాచి అన్ని వైపులా గాభరాగా తడిమి చూశాడు. వెతికిన సమయం కొన్ని నిమిషాలే కావచ్చు, కానీ కొన్ని యుగాలనిపించిందతనికి. చివరికి యువరాజు శరీరం అతడి చేతులకు తగిలింది. వెంటనే దాన్ని తీసుకొని భుజాన వేసుకొన్నాడు. అప్పటివరకు ఎలా బయటపడాలన్న ఆలోచన రాలేదు. వేటమంటపం గుండా వెళ్ళడం అసాధ్యం. ఆహా! అక్కడ శంబువరయ్యర్ ఎంతో కాలంగా కూడబెట్టిన చనిపోయిన మృగాల తోళ్లన్నీ ఇప్పటికి కాలి బూడిదైవుంటాయి...! ఆ గదినుంచి సాధారణంగా అందరూ బయటకు వెళ్ళేందుకు అమర్చిన ప్రధాన ద్వారాన్ని చేరుకొన్నాడు. ఒక చేత్తో తలుపును గుద్ది చూశాడు. “నిప్పు! నిప్పు! తలుపు తెరవండి!” అని కేకలేసి చూశాడు. ఏమీ ప్రయోజనం కనిపించలేదు. ఛీఛీ! ఏం తెలివితక్కువతనం! వాద్యాల అర గుండానే తాను బయటపడి తీరాలి! అయ్యో! అంతలోపల దానికి నిప్పంటుకోకుండ ఉండాలి కద? ఇంతసేపూ వృధా కాలక్షేపం చేశాం!

ఇప్పుడా గది చాల ప్రకాశవంతంగా ఉంది. కానీ ఆ వెలుతురు పొగ వల్ల నిరుపయోగంగా ఉంది. కళ్ళు తెరిచి చూసేందుకే సాధ్యం కావడం లేదు. కష్టపడి చూసినా, దిక్కూ, మొక్కూ తెలియడం లేదు. వాద్యాల అర ఉన్న చోటును గురిపెట్టుకొని అటువైపు పరుగెత్తాడు వంతిదేవుడు. దారిన కాలికి ఏదో తగిలి ’ధనేల్మ’న్న శబ్దం చేసింది. ఆహా! అది తనకు తెలివి వచ్చినప్పుడు తన పక్కన చేతికి తగిలిన వంకీల కత్తే అయివుండాలి! ఆ కత్తిలో ఏదో ఒక మర్మముంది. దాన్ని తీసుకొందాం. దారిలో తననెవరైనా అడ్డగిస్తే అది పనికి రావచ్చు.

~

ఇలా ఆలోచించి వంతిదేవుడు వంగి ఆ కత్తిని తీసుకొన్నాడు. అప్పుడు కాలుతున్న మంచం జ్వాలనుంచి ఒక నిప్పు రవ్వ ఎగిరి వచ్చి అతని భుజంమీద పడింది. దాన్ని తట్టి విదిలించేసి వేగంగా వెళ్ళి వాద్యాల అరను చేరుకొన్నాడు. ఇంతసేపు అతడి భుజంమీదున్న యువరాజు కరికాలన్ దేహాన్ని అతని ఒక చేయి గట్టిగా పట్టుకొంది. కానీ ఇప్పుడు అలా భుజం మీద పెట్టుకొనే వాద్యాల అర మెట్లెక్కి లోపలికి

వెళ్ళడం అసాధ్యం. పైగా, పైనున్న తలుపు మూయబడివుంది. కాబట్టి కరికాలన్ దేహాన్ని కింద పెట్టి, మెట్లెక్కి పైకి వెళ్ళి ఆ తలుపును తెరిచాడు. సగం వాద్యాల అరలో నిలబడి వంగి లేచాడు. అయ్యో! అంతలోపల అగ్ని జ్వాలలు ఆ వాద్యాల అర లోపలికి కూడ వచ్చేశాయి! ఇంకాస్త ఆలస్యం చేస్తే ఈ దారి కూడ లేకుండపోతుంది...!

వంతిదేవుడు కరికాలన్ దేహాన్ని డాబామీదికి ఎత్తి పడేసి తాను కూడ పైకెక్కి వచ్చేటప్పటికి సగం ప్రాణం పోయినట్లనిపించింది. ఇంతసేపు నిప్పులోను, పొగలోను ఉడికిన అతడి మీద ఇప్పుడు చల్లని గాలి వీచింది. కాసేపక్కడే ఉండి సేదదీర్చుకొందామా అనుకొన్నాడు. వద్దు! వద్దు! ఒక్క నిమిషం కూడ తాను తామసించకూడదు! నిప్పంటుకొన్న ఆ కట్టడం ఎప్పుడు కూలిపోతుందో ఎవరికి తెలుసు? మళ్ళీ కరికాలన్ మృతదేహాన్ని భుజాన వేసుకొని వేగంగా ముందుకు వెళ్ళాడు. మునుపొకసారి ఇటే వెళ్ళి తప్పించుకొన్నాడు. కానీ అప్పుడు తానొక్కడే కావడం వల్ల వెన్నెల డాబా మీదుగా వెళ్ళి, ప్రాకారం గోడనెక్కి దూకి తప్పించుకోగలిగాడు. ఇప్పుడది వీలవుతుందా? అతడు చాల అలిసిపోయి ఉండడమేగాక, ఆదిత్య కరికాలన్ దేహాన్ని కూడ మోసుకొని వెళ్ళాలి కద?

అప్పుడా మాళిగ నలువైపులనుంచి లేచిన హాహాకారాల మీదికి అతని ధ్యానం మళ్ళింది. ఆహా! మలైయమాన్ సైనికవీరులు ఈ కోటను ముట్టడించనారంభించేశారు లాగుంది! ముఖ్యద్వారాన్ని ముట్టడించి తెరిచేందుకు ప్రయత్నిస్తున్నారు లాగుంది కద! ప్రాకారపు గోడ మీదికి చాలమంది వీరులెక్కి లోపలికి దూకుతున్నారు! యువరాజు హత్య చేయబడ్డారన్న వార్త తెలిసే మలైయమాన్ కడంబూర్ మాళిగను ముట్టడించేందుకు ఆజ్ఞాపించారా? అలాగైతే కరికాలన్ మృతదేహాన్ని తీసుకొస్తున్న తనని వారేం చేస్తారు? ఏల? తానే ఆయనని చంపానని భావిస్తారు! తనని ముక్కలు ముక్కలుగా నరికేస్తారు. కాబట్టి తాను చాల జాగ్రత్తగా మసలుకోవాలి. ఎవరికంటా పడకుండ జారుకోవాలి. మలైయమాన్ ఉన్నచోటు కనిపెట్టి ఆయనకు ఆయన మనుమడి దేహాన్ని అప్పజెప్పాలి. ఆ తర్వాత జరిగేది జరగనీ...!

~

తర్వాత వంతిదేవుడు అతిజాగ్రత్తగా, మేడమీది గవాక్షాలు మొదలైనవాటి నీడలను చాటుచేసుకొని ఒదిగి ఒదిగి నడిచి వెళ్ళాడు.

చివరికి, మొట్టమొదటిసారి వచ్చినప్పుడు ఎక్కడ నిలబడి కింద జరిగిన చిన్నరాజుల కుట్రాలోచన సమావేశాన్ని గమనించాడో ఆ చోటికి వచ్చి చేరాడు.

కిందకెలా దిగడమా అని అతడు ఆలోచిస్తూ అటూ ఇటూ పరికించి చూసినప్పుడు గోడవారగా నిచ్చెన ఒకటి నిలబెట్టివుండదం కనిపించింది. అది మాత్రం కాదు, నిచ్చెన పక్కన ఒక మనిషి ఆకారం కూడ కనిపించింది. అది ఎవరై ఉండవచ్చు? నిచ్చెనను సిద్ధం చేసుకొని ఎవరికోసం వేచివున్నాడు? తానా నిచ్చెన వెంబడి కిందికి దిగితే ఏం జరుగుతుంది? ఏం జరిగినా సరే! ఆ నిచ్చెనను ఉపయోగించే తీరాలి!

మంచివేళగా చేత ఒక కత్తి ఉంది! ఏమెదురైనా చూసుకోవచ్చు!

~

ఈ సమయాన ప్రధాన ద్వారం దగ్గర కలకలం అధికమైంది. అదేమని తెలుసుకోవాలనో ఏమో, నిచ్చెన పక్కన నిలబడ్డవాడు కాస్త అవతలికి వెళ్ళాడు.

చాలమంచిదైందని ఎంచి వంతిదేవుడు నిచ్చెన వెంబడి చకచకా దిగాడు. అతడు కిందకు దిగి నేలమీద కాలుపెట్టడానికి, ఆ మనిషి తిరిగి రావడానికి సరిగ్గా సరిపోయింది.

“స్వామీ! ఇంతాలస్యం చేసేశారు కద?” అని ఆ మనిషి అడగ్గానే ఆ మనిషి ఇడుంబన్‌కారి అని గ్రహించాడు వంతిదేవుడు. అదే క్షణాన ఇడుంబన్‌కారి అక్కడ నిలబడి ఎవరిని ఎదురుచూస్తున్నాడన్నది కూడ కొంతవరకు ఊహించుకోగలిగాడు.

ఇడుంబన్‌కారి వంతిదేవుని సమీపించగానే ఆశ్చర్యంతో, “అరె! నీవా? ఎవరిని భుజాన వేసుకొని వస్తున్నావు?” అని అడిగాడు.

“అవునయ్యా! నేనే! కాళాముఖ స్వాముల శిష్యుడిని! రణభద్రకాళి బలితోబాటు నన్ను ముందు పంపించారు. ఆయన వెనక వస్తున్నారు. నిన్ను ఇక్కడే నిచ్చెనతో ఉండమన్నారు! ఇదిగో చూడు! ఈ కత్తిని నీకు గుర్తుగా చూపమన్నారు!” అని చెప్పి వంతిదేవుడు వంకీల కత్తిని చూపించాడు.

ఇడుంబన్‌కారి కాస్త సందేహిస్తూనే, “ఇన్నాళ్ళూ నీవు నాకు చెప్పనే లేదేమి? పోతేపోనీ. స్వాములు ఇంతాలస్యం చేస్తున్నారేం? ఎలా ఇక్కడినుంచి బయటపడబోతున్నాము? తిరుక్కోవలూర్ వీరులు మాళిగను చుట్టుముట్టి లోపలికి కూడ రానారంభించేశారు!” అన్నాడు.

“అందువల్లనేమి? గుంపు అధికమైతే మనం తప్పించుకోవడం సులభం. అదంతా పెద్ద స్వాములకు మనం నేర్పాలా? ఆయన ఎలాగో ఒక దారి వెతుకుతారు. నీవిక్కడే ఆయన వచ్చేంతవరకు వేచివుండు! నేను నందనవనంలో ఉన్నట్లు చెప్పు!” అన్నాడు వంతిదేవుడు.

ఇడుంబన్‌కారి ఉత్తరంకోసం ఆగకుండ గబగబా ముందుకు నడిచాడు వంతిదేవుడు. ఇడుంబన్‌కారి కనుచూపు మేర దాటగానే ఆ మాళిగ ప్రధాన ద్వారపు గోపురం వైపు నడిచాడు.

~~~
~~~

# అధ్యాయము - 42

## మల్లైయమూస్ దుఃఖం

**శంబువరయ్యర్** ముందు వసారాకు రాగానే గందమారన్ని చూసి, "కుమారా! మన కులానికి ఎన్నడూ రాని ఆపద ఈరోజు వచ్చింది! ఈ ఆపదనుంచి తప్పించుకోవడానికి నేనిప్పుడు చెప్పేది ఏ మాత్రం ఆలస్యం చేయకుండ అమలు చేయాలి!" అన్నారు.

కరికాలన్ మరణం గందమారన్ని చాల గాఢంగా కలతబారజేసింది. తాను వంతిదేవుని చంపేయాలనుకొన్నది ఎంత పెద్ద పొరబాటో అది కూడ గ్రహించాడు. "తండ్రీ! మూఢుడనైన నా మూలంగానే మన కులానికి ఇప్పుడింత పెద్ద ఆపద ఎదురైంది. అందుకు మన్నించండి. ఇప్పుడు మీరేం ఆజ్ఞాపించినా కూడ దాన్ని వెంటనే నెరవేరుస్తాను!" అన్నాడు.

"నీవు వెంటనే ఎవరికీ తెలియకుండ ఈ మాళిగనుంచి బయటపడాలి. నా పడక గదిలో మంచం కిందినుంచి ఒక సొరంగమార్గముంది. అది నీకు తెలుసు కద? అది వేటమంటపంనుంచి వెళ్ళే సొరంగమార్గాన్ని ప్రాకారపు గోడ వద్ద కలుస్తుంది..."

"తండ్రీ! ఈ ఇక్కట్టైన పరిస్థితిలో మిమ్మల్ని ఒంటరిగా వదిలిపెట్టి నన్ను సొరంగమార్గంగుండా బయటపడమంటున్నారా?" అన్నాడు గందమారన్.

"కొడకా! అంతలోపల నీవిచ్చిన మాటను మరిచావా? అవును, నీవు వెళ్ళే తీరాలి; కొల్లిమల్లై నాయకుడు వల్విల్ ఓరికి ఇప్పుడు నీవొక్కడివే వారసుడివిగా మిగిలావు. అవసరమైతే, నీవా కొండకే వెళ్ళి దాక్కొని బతకాలి, కొంతకాలం పాటు. మధురాంతక దేవరికి పట్టం కడతారని నిశ్చయమై, నేను నీకు వార్త పంపిన తర్వాతే తిరిగి రావాలి!" అన్నారు శంబువరయ్యర్.

"క్షమించాలి, తండ్రీ! దాక్కొని బతకడం నావల్ల కాని పని. వల్విల్ ఓరి కులానికి అటువంటి పిరికిపందను కన్న అపకీర్తి కలగాలా? అంతకన్న ఈ క్షణమే నా ప్రాణాలను బలివ్వమంటే అందుకు సిద్ధంగా ఉన్నాను. కానీ పిరికిపందలాగ దాక్కొని బతకడానికి ఒప్పుకోను!" అన్నాడు గందమారన్.

~

శంబువరయ్యర్ కాసేపాలోచించి, "కుమారా! నిన్ను పరీక్షించేందుకే అలా అన్నాను. తప్పించుకొని పారిపోవడానికి గాని, దాక్కొని బతకడానికి గాని నీకిష్టంలేదని తెలిసింది. ప్రాణాపాయం రాగల కార్యానికే నేను నిన్ను ఇప్పుడు ప్రోత్సాహిస్తున్నాను. సొరంగమార్గం గుండా వెంటనే బయటపడు! కానీ కొల్లిమల్లైకి వెళ్ళవద్దు! తిన్నగా తంజావూరుకు వెళ్ళు! అక్కడ పెద్ద పళువేట్టరయ్యర్ బహుశ ఉండవచ్చు. ఉంటే ఆయనకు ఇక్కడ జరిగిందంతా చెప్పు! ఆయన లేకపోతే, చిన్న పళువేట్టరయ్యర్కి,

మధురాంతకులకు చెప్పు...!"

"తండ్రీ! ఇక్కడ ఏం జరిగిందని ఆయనకు చెప్పాలి?"

"ఇదేం ప్రశ్న? కరికాలన్ మరణం గురించి చెప్పు! మనం ఉద్దేశించిన కార్యం, విధివశాత్తు ఇంకొక విధంగా జరిగిపోయింది! కరికాలన్ మరణించారు! మధురాంతకులకు పట్టం కట్టేందుకు ఇదే తగిన సమయం అని ఆయనకు చెప్పు. మలైయమాన్, కొడుంబాళూర్ పెద్ద వేళార్ ఇద్దరూ అందుకు అడ్డొస్తారు. మన సైన్యాన్నంతటినీ వెంటనే కూడదీసుకొని ఆ ఇద్దరినీ సమూలంగా తుడిచిపెట్టేయాలని చెప్పు...!" అన్నారు శంబువరయ్యర్.

"కరికాలన్ ఎలా మరణించారు అని వారడిగితే ఏం బదులు చెప్పను?" అని అడిగాడు గందమారన్.

"ఇంకేం చెబుతావు? ఆ వాణర్‌కులానికి చెందిన వంతిదేవుడే ఆయనను చంపాడని చెప్పు! ఇంకా ఒక ముఖ్యమైన విషయం - దీన్ని బాగా జ్ఞాపకం పెట్టుకో! వంతిదేవుడు లంకకు వెళ్ళి తిరిగి వచ్చినప్పుడు అక్కడ అరుళ్మొళి వర్మను, తర్వాత పళైయారైలో యువరాకుమారిని చూసి, మాట్లాడి వచ్చాడు. అరుళ్మొళి నాగపట్టణంలో అజ్ఞాతంగా ఉండి, ఇప్పుడు బయటపడ్డాడని వార్త వచ్చింది. అరుళ్మొళి, చోళ సింహాసనం మీది ఆశవల్ల అన్నను వంతిదేవుని పంపించి చంపించాడన్న వదంతిని చోళనాడులో వ్యాపింపజేయాలి. పళైయారై యువరాకుమారి కూడ ఇందులో భాగం వహించిందన్న సందేహాన్ని కూడ పుట్టించాలి. ఇదంతా పెద్ద పళువేట్టరయ్యర్కి, మధురాంతకులకు చెప్పు!"

"తండ్రీ! మీరు చెప్పిందే నిజమైవుండవచ్చు కద? మిత్రద్రోహియైన వంతిదేవుడు అటువంటి భయంకరమైన ఉద్దేశంతోనే ఈ మాళిగకు వచ్చివుండవచ్చు కద?"

"ఉండవచ్చు, కుమారా! కానీ పళువూర్ యువరాణి ఉన్నట్టుండి మాయమైపోయినందుకు కారణం వెతికి తెలుసుకోవాలి కద? ఆమె మీద, పాండ్యరాజు ఆపత్కాల సహాయకుల మీదనే కద వంతిదేవుడు ఆ నిందను మోపుతున్నాడు?"

"నేరం చేసినవాడు దాన్ని ఇతరుల మీదికి తోసేందుకే చూస్తాడు. ఇప్పుడు నాకంతా అర్థమవుతోంది, నాన్నగారూ! పళువూర్ యువరాణి అంటే పళైయారై యువరాకుమారికి ఎప్పుడూ అయిష్టంగానే ఉండేది. కరికాలన్ని హత్య చేసి, అదే సమయాన పళువూర్ యువరాణిని అపహరించి తీసుకొని వెళ్ళడానికి కూడ ఆమే ఏర్పాట్లు చేసివుండాలి. ముఖ్యమంత్రి అనిరుద్ధులు కూడ ఇందులో భాగస్వాముల్లాగుంది. అందుకే ఈ వంతిదేవుని వారు పంపించినట్లుంది! అయ్యో! వారి కుట్ర తెలిసి కూడ మనం మోసపోయాం కద!"

"గందమారా! జరిగిపోయినదాని గురించి విచారించి ప్రయోజనం లేదు. ఇకమీదట జరగవలసిందేమో దాని గురించి చూడాలి. నీవు వెంటనే బయలుదేరి వెళ్ళు! కరికాలన్ మరణవార్తను

సుందర చోళులకు చెప్పేముందు, తంజావూరులో ఇంకెవరికీ తెలిసేముందు, పళువేట్టరయ్యర్కి, మధురాంతకులకు తెలియజేయాలి. కాబట్టి నీవు వేగంగా వెళ్ళు! తంజావూరు కోట లోపలికి వెళ్ళేందుకు రహస్య మార్గముందని నీకు తెలుసు కద?"

"తెలుసు, తెలుసు!"

"అలాగైతే వెంటనే బయలుదేరు!"

"బయల్దేరుతున్నాను, నాన్నగారూ! నా చెల్లెలు - మణిమేఖల – ఆమె గురించే కాస్త దిగులుగా ఉంది."

"వద్దు నీకా దిగులు! మన దగ్గర ఆమె ప్రేలాపించినట్లు ఇంకెవరి ముందూ అలా పేలేందుకు నేను చోటివ్వను. అలా ప్రేలాపించేందుకు ప్రయత్నిస్తే నా చేతులతోనే చంపేస్తాను....!"

"అయ్యో! అందుకే భయపడుతున్నాను. మీ కోపం గురించే భయపడుతున్నాను..."

"వద్దు! దాని మనసును మార్చేసే దారి నాకు తెలుసు. ఆహా! విధి చాల విచిత్రమైనదే! మొదట దాన్ని మధురాంతక దేవరికిచ్చి పెళ్ళి చేద్దామనుకొన్నాము. తర్వాత ఆ ఆలోచనను మార్చేసుకొని కరికాలన్‌కిచ్చి పెళ్ళి చేద్దామనుకొన్నాము. కరికాలన్ ఇప్పుడు నిర్జీవులై పడివున్నారు. అదృష్టవశాత్తు మణిమేఖల తన మనసును ఆయనవైపు మళ్ళించలేదు. మన పాత ఉద్దేశాన్నే నెరవేర్చాల్సిందే..."

"కానీ, నాన్నగారూ! మణిమేఖల మనసు ఆ ఛండాలుడు వంతిదేవుని మీద కద మళ్ళింది?"

"అదంతా ఏమీ లేదబ్బాయ్! మణిమేఖలకు తన మనసును తాను తెలుసుకొనే ప్రాయమే ఇంకా రాలేదు. దాన్ని నేను చూసుకొంటాను. నీవిక ఒక్క క్షణం కూడ ఆలస్యం చేయవద్దు!"

~

ఆ సమయాన ఆ మాళిగ ప్రాకార కుడ్యాలకవతల అతి సమీపాన వినిపించిన హాహాకారాన్ని విన్న గందమారన్, "నాన్నా, ఇదేమి? మలైయమాన్ సైన్యాలు దగ్గరకొచ్చేసినట్లున్నాయే? మలైయమాన్ని మీరు సాయంత్రం కలిసినప్పుడు ఆ ముసలాయనేమన్నాడు?" అని అడిగాడు.

"మంచి మంగళకరమైన వార్తనే చెప్పాడు. మణిమేఖలను ఆదిత్య కరికాలన్‌కిచ్చి పెళ్ళిచేయనున్న వార్తను విని చాల సంతోషించాడు ఆ ముసలాడు. అదే పెళ్ళి పందిరిలో అతడి కూతురి కడుపున పుట్టిన మనుమరాలొకదానికి కూడ పెళ్ళి చేద్దాం అని పిలుచుకొని వచ్చాడట! భలే ఉంది కద? మాళిగకు రమ్మని నేను ఆహ్వానించగా, రేపు ఉదయించగానే మంచి ముహూర్తముందని చెప్పాడు. అతడి సైనికులు ఇప్పుడే రాబోయే పెళ్ళి సంబరాలు చేసుకొంటునట్లున్నారు!" అని చెప్పేసి శంబువరయ్యర్ నవ్వజూశారు. కానీ ఆయన నవ్వు సగంలోనే ఆగిపోయింది.

"రా! రా! నేనే నిన్ను సొరంగమార్గంలో వదిలిపెట్టి వస్తాను. దారిలో ఒక్కక్షణం కూడ నీవు ఆలస్యం చేయకూడదు. దారిలో ఎక్కడైనా ఒక గుర్రాన్ని సంపాదించుకొని వేగంగా వెళ్ళాలి!"

~

శంబువరయ్యర్ చేత ఒక దీపాన్ని తీసుకొన్నారు. ఇద్దరూ సొరంగ మార్గంలో ప్రవేశించి వేగంగా ముందుకు సాగారు. మాళిగ ప్రాకారాన్ని గందమారన్ దాటగానే ఆయన అతన్ని కౌగలించుకొని, తల నిమిరి ఆశీర్వసించి వెనుదిరిగారు. “దీపం కావాలా?” అని అడిగినందుకు గందమారన్, “వద్దు, నాన్నా! నాకీ దారి బాగా తెలుసు కద? కళ్ళు మూసుకొని వెళ్ళగలను!” అన్నాడు.

అతడు సొరంగమార్గంలో కనుమరుగైన తర్వాత వెనుదిరిగారు శంబువరయ్యర్. దారిలో వేటమంటపంలోకి దూరారు. పక్కగదిలో ఏదైనా శబ్దం వినిపిస్తూందా అని చెవులు రిక్కించి విన్నారు. ఏమీ వినిపించలేదు. కొన్ని క్షణాలపాటు తాత్సారం చేస్తూ నిలబడ్డారు. తర్వాత ఒక తీర్మానానికి వచ్చినవారిలాగ పెద్దగా నిట్టూర్చారు. దీపాన్ని బాగా ఎగదోసి, పెట్టవలసిన చోట పెట్టేసి వెనుదిరిగారు.

మళ్ళీ శంబువరయ్యర్ ముందు వసారాకు వెళ్ళగానే అంతఃపురపు స్త్రీలందరినీ సమావేశపరిచారు.

వారందరూ అప్పటికే కలతబారివున్నారు. కన్నీరుమున్నీరుగా ఏడుస్తూ గందమారన్ చేత అంతఃపురానికి చేర్చబడ్డ మణిమేఖలను అడిగి కొంతవరకు సమాచారాన్ని తెలుసుకొన్నారు (కరికాలన్ మరణం గురించి).

“అమ్మలారా! ఈరోజు మన కులానికి ఏనాడూ రానంత పెద్ద ఆపద వచ్చింది. ఏ క్షణమైనా మీరు ఈ మాళిగను వదిలి బయలుదేరేందుకు సిద్ధంగా ఉండాలి. చాల రోజులపాటు కొండల్లో జీవించేందుకు ధైర్యం కలిగివుండాలి. అందరూ వారివారి వస్త్రాభరణాలను తీసుకొని వెన్నెలడాబాకు వచ్చి చేరండి. ఏడుపు శబ్దంగాని, వెక్కిళ్ళ శబ్దంగాని ఏ మాత్రం వినిపించకూడదు! తెలిసిందా?” అని హెచ్చరించారు.

తర్వాత శంబువరయ్యర్ మాళిగ ముందు భాగానికి వచ్చారు. ప్రధాన ద్వారపు గోపురంమీదికెక్కి ఏమా కోలాహలం/హాహాకారం అని తెలుసుకోవాలనుకొన్నారు. అందుకవకాశం దొరకలేదు. ఎందుకంటే, ఆయన ప్రధానద్వారాన్ని సమీపించగానే బయటినుంచి వీరులు ప్రధాన ద్వారాన్ని పడగొట్టి దడదడమని లోపలికి రానారంభించేశారు. ప్రధానద్వారాన్ని కాపలా కాస్తున్న భటులు వారినాపలేక కింద పడిపోసాగారు.

ఇదిగాక, కోట గోడను కూడ ఎక్కి లోపలికి రాసాగారు కొందరు సైనిక వీరులు.

~

శంబువరయ్యర్ మనసులో పెనుభీతి, కలత ఏర్పడ్డాయి. కరికాలన్ హత్య గురించిన వార్త ఒకవేళ మలైయమాన్‌కి తెలిసిపోయిందా? ఆఁ! ఇంతలోపల ఎలా తెలిసిపోయింది? తెలిస్తే తెలియనీ. ఎలాగూ తెలిసే తీరుతుంది కద? కానీ ఇంకాసేపు వీరిని ఇక్కడే ఆపి ఆలస్యం చేయాలి. అర్ధ ఘడియపాటు ఆలస్యం చేయిస్తే చాలు. అంతలోపల మనం ఉద్దేశించిన కార్యం నెరవేరుతుంది.

కోట వాకిలికి, మాళిగ ముఖ్యద్వారానికి మధ్యవున్న వెన్నెలడాబా మధ్యకు వెళ్ళి గంభీరంగా నిలబడ్డారు శంబువరయ్యర్. ఆయన చేతిలో ఒక పదునైన కత్తి మెరిసింది. ఆయన వెనక ఏడెనిమిది మంది వీరులు పొడవైన శూలాలను పట్టుకొని నిలబడ్డారు. వారిలో కొందరు చేత దివిటీలు పట్టుకొన్నారు.

కోటవాకిలి తలుపులను పగలగొట్టి లోపలికొచ్చిన వీరుల వెంబడే మలైయమాన్, పార్థిబేంద్రుడు వచ్చారు.

వెన్నెల డాబా మధ్య నిలబడ్డ శంబువరయ్యర్ని చూసి పార్థిబేంద్రుడు మలైనమాన్‌కి ఆయనను వేలెత్తి చూపించాడు. ఇద్దరూ శంబువరయ్యర్ వైపు నడిచారు.

దగ్గరికొచ్చేటప్పుడే మలైనమాన్, "శంబువరయ్యరే! నేను వింటున్న వార్త నిజమేనా? అటువంటి ఘాతుక కృత్యాన్ని కూడ మీరు చేస్తారా? చేత కత్తితో నిలబడ్డారేల? మీ ఉద్దేశమేమి?" అని అడుగుతూ వచ్చారు.

"ఆ వార్త గురించి మిమ్మల్ని అడిగేందుకే ఇక్కడ నిలబడ్డాను. మీ ఉద్దేశం ఏమి? కోట వాకిలి తలుపు పగలగొట్టి లోపలికి రావడంలో మీ ఉద్దేశమేమి? కాసేపటి క్రితం నేను వచ్చి మిమ్మల్ని ఆహ్వానించాను. రేపు మంచి ముహూర్తం చూసుకొని వస్తానని చెప్పారు..."

"శంబువరయ్యరే! మంచి ముహూర్తం ఇప్పుడే వచ్చేసింది. అందుకే వచ్చాను. ఆదిత్య కరికాలన్ ఎక్కడ? వీరపాండ్యుని శిరచ్ఛేదం చేసిన ఆ వీరాధివీరుడెక్కడ? శేవూర్ యుద్ధాన్ని గెలిచిన వీరుడెక్కడ? నా మనుమడెక్కడ?" అని మలైయమాన్ అడిగారు.

"నన్నడిగితే, నాకేం తెలుసు? యువరాజుకు ఇష్టం వచ్చిన చోట ఆయనుంటారు. ఆ మొరటు అబ్బాయితో నేను ఎలాంటి మాటామంతీ పెట్టుకోలేదని మీకు ముందుగానే చెప్పాను కద? పార్థిబేంద్రునికి కూడ అది తెలిసిన విషయమే!"

"ఒరే శంబువరయ్యా! ఇలా ఒట్టి మాటలతో దబాయించేసి నన్ను మోసపుచ్చేందుకు చూడకు! ఆదిత్య కరికాలన్ని వెంటనే తీసుకొచ్చి నాకు ఒప్పజెప్పు! లేకపోతే నీ ఈ కోటను, మాళిగను ఇప్పుడే నేలమట్టం చేసేస్తాను!" అని తిరుక్కోవలూర్ మలైయమాన్ గర్జించారు.

"పార్థిబేంద్రా! ఈ ముసలాడు ఏం పేలుతున్నాడు? వీడికి ఉన్నట్లుండి పిచ్చి పట్టిందా? యువరాజును ఇలా తీసుకొచ్చి ఒప్పజెప్పేందుకు నేనెవరిని? వీడు మాత్రం ఎవడు? యువరాజును నేను చెరలో పెట్టానా? లేక వీడు యువరాజును చెరపట్టి బంధించి తీసుకొని వెళ్ళబోతున్నాడా?" అన్నారు శంబువరయ్యర్.

~

పార్థిబేంద్రుడు కాస్త శాంతంగా, "శంబువరయ్యరే! ఊరక వదరకండి! ముసలాయనకు కోపం రావడానికి కారణం ఉంది. ఇదిగో ఈ తాళపత్ర సందేశాన్ని చూడండి, మీకే తెలుస్తుంది!" అని చెప్పి ఒక

చిన్న తాళపత్రాన్ని శంబువరయ్యర్ చేతికిచ్చాడు.

ఆయన దాన్ని తన వెనుక సైనికులు పట్టుకొన్న దివిటీల వెలుతురులో బాగా పరీక్షగా చూశారు.

"యువరాజు ఆదిత్య కరికాలన్ ప్రాణాలకు ఆపద. వెంటనే దండెత్తి వచ్చి కాపాడండి!" అని ఆ తాళపత్రంలో రాసివుంది.

దాన్ని చదువుతున్నప్పుడే శంబువరయ్యర్ ముఖాన చెమటలు పట్టనారంభించింది. కాసేపటి క్రితం కరికాలన్ నిర్జీవదేహాన్ని చూసి ఆయన ఒళ్ళాంతా ఎలా వణికిందో ఇప్పుడు కూడ అలా గడగడ వణికింది.

"ఇదేం పన్నాగం? ఇదేం కుట్ర? ఇలా ఎవరు రాసి పంపివుండవచ్చు?" అని తడబడుతూ అడిగారు.

"తాళపత్రం ఎవరు రాసి పంపించివుంటేనేమి? ఆదిత్య కరికాలన్ని వెంటనే ఇక్కడికి పిలుచుకొని రా! లేక వాడున్న చోటికి నన్ను పిలుచుకొని వెళ్ళు! లేక నా వీరుల్ని పంపి వెతికించనా?" అన్నారు మలైయమాన్.

"అలాగే కానివ్వండి! కరికాలన్ ఉన్నచోటికి మిమ్మల్ని పిలుచుకొని వెళతాను/ పార్థిబేంద్రా! నీకా చోటు తెలుసు. పళువూర్ యువరాణి అంతః;పురానికి కాసేపటి క్రితం వెళ్ళారని తెలిసింది. అక్కడికి నీవే ఈయనను తీసుకొని వెళ్ళు..." అన్నారు శంబువరయ్యర్.

పార్థిబేంద్రుడు, "అవును, తాతా! రండి! నేనే మిమ్మల్ని పిలుచుకొని వెళతాను" అన్నాడు.

~

ఇలా చెప్పి పార్థిబేంద్రుడు పళువూర్ యువరాణి నందిని విడిది చేసిన అంతఃపురంవైపు చూశాడు.

"అయ్యో! ఇదేమి?" అని గాభరాగా అడిగాడు పార్థిబేంద్రుడు. ఎందుకంటే అతడు చూసిన దిక్కున మాళిగ నిప్పంటుకొని ఉవ్వెత్తున కాలుతూంది. అగ్నిజ్వాలల పైన నల్లటి పొగ లేస్తూంది.

అతడు చూసిన వైపు అందరూ తిరిగి చూశారు. "నిప్పు! నిప్పు!" అన్న భీతావహమైన హాహాకారం అందరి కంఠాలనుంచి లేచింది.

పార్థిబేంద్రుడు ఆ దిగ్భ్రాంతినుంచి కాస్త తేరుకొని, "శంబువరయ్యరే! మొదట నేనీ పత్రాన్ని నమ్మలేదు. ఇప్పుడు నమ్ముతున్నాను. ఏదో కుట్ర పన్నారు మీరు..! తాతా! ఈ కుట్రదారులను వెంటనే పట్టి బంధించమనండి! నేను వెళ్ళి యువరాజున్న చోటు వెతికి ఆయనను పిలుచుకొని వస్తాను!" అన్నాడు.

శంబువరయ్యర్ మళ్ళీ పాత ధైర్యాన్ని గొంతులోకి తెచ్చుకొని, "అవును, పార్థిబేంద్రా! కుట్ర పన్నాగాలు జరిగాయి. కానీ చేసినవారు మీరు. నా కోట తలుపులు పగలగొట్టి లోపలికి దూరారు. మీ

వీరులను పురిగొల్పి నా అంతఃపురానికి నిప్పంటించేలా పురమాయించారు. యువరాజుకు ఏదైన ఆపద అంటే, అది కూడ మీవల్లే జరిగివుండాలి! జాగ్రత్త! దీనికంతా పగ తీర్చుకొనే కాలం వస్తుంది!" అన్నారు.

పార్థిబేంద్రుడు ఆయన మాటలను పట్టించుకోక వేగంగా పరుగెత్తాడు.

అదే సమయాన శంబువరయ్యర్ ఇంటి ఆడవాళ్ళందరూ గుంపుగా అంతఃపురంనుంచి వెన్నెలడాబాకు వచ్చి చేరారు. వారి మనసులు చాల కలతబారివున్నాయని వారి ముఖాలు చెబుతున్నాయి. కానీ ఎవరి నోటినుంచి కూడ ఏ మాత్రం చిన్న శబ్దం కూడ వెలువడలేదు.

వారిలో కొందరి చూపులు మాళిగ వెనుక బాగా కాంతివంతంగా ఉన్న భాగంపైపు మళ్ళాయి. ఒకరికొకరు ఆ దిక్కున దేదీప్యమానంగా కాలుతున్న ఆ మాళిగ భాగాన్ని చూపించుకొన్నారు. మణిమేఖల కూడ దాన్ని గమనించింది. వెంటనే "అయ్యో! ఆయనక్కడున్నారే!" అని అరుస్తూ ఆ దిక్కున పరుగెత్తనారంభించింది. శంబువరయ్యర్ ఆమెకడ్డుపడి ఆమె చెంప మీద ఒక్క దెబ్బ కొట్టారు. పుట్టినప్పటినుంచి ఎవరి చేతా దెబ్బ తినని మణిమేఖల – శంబువరయ్యర్ ముద్దుల కూతురు - తండ్రిని అసహ్యంతో చూస్తూ స్తంభించి నిలబడిపోయింది.

శంబువరయ్యర్, "వెర్రిపిల్లా! నేను నిన్ను ఇంతకు ముందే హెచ్చరించాను కద? నాకెందుకు కోపం తెప్పిస్తున్నావు?" అని చెప్పేసి, "అదిగో చూడు! నీవు కేకలేస్తూ పరుగెత్తవలసిన అవసరం లేదని తెలుసుకో!" అన్నారు.

శంబువరయ్యర్ వేలెత్తి చూపిన దిశలో వంతిదేవుడు తడబడుతూ, పడుతూ లేస్తూ వస్తుండడం కనిపించింది. అతడు తన భుజాన ఆదిత్య కరికాలన్ నిర్జీవదేహాన్ని మోసుకొంటూ వస్తున్నాడు.

శంబువరయ్యర్‌కి, ఆయన కుమార్తెకు మధ్య జరిగిన వాగ్వివాదం మీద ధ్యాస మళ్ళించిన మలైయమాన్ కూడ ఇప్పుడు అటుపైపు చూశారు. అతడు మెల్లగా తడబడుతూ వస్తుండడాన్ని, భుజాన ఎవరినో మోసుకొంటూ వస్తుండడాన్ని కళ్ళార్పకుండ చూస్తూ నిలబడ్డారు. ఎందుకో ఆయన ముదుసలి శరీరం వణికింది. మనసులో ఒక విధమైన దిగులు పుట్టింది. దగ్గరికొచ్చిన వంతిదేవుని చూసి ఏదో అడగాలనుకొన్నారు. కానీ నాలుక లేవలేదు. గొంతు పూడుకుపోయింది.

వంతిదేవుడు మలైయమాన్ని చూస్తూ ఆయన్ని సమీపించాడు.

"అయ్యా! ఇదిగో యువరాజు ఆదిత్య కరికాలన్! వీరపాండ్యుని తలగొన్న ఈ వీరాధివీరుని సజీవంగా తీసుకొని వచ్చి మీకు ఒప్పజెప్పలేకపోయాను. శరీరాన్ని మాత్రం అగ్నికి ఎరకాకుండ తీసుకొని వచ్చాను. విధివల్ల, కుట్ర వల్ల చంపబడ్డ మీ మనుమడిని ఇక మీరు స్వీకరించండి!" అని చెప్పి వంతిదేవుడు కరికాలన్ దేహాన్ని మెత్తగా కిందకు దించి పడుకోబెట్టాడు.

వెంటనే తాను కూడ కింద పడిపోయి స్పృహ కోల్పోయాడు.

~

వృద్ధులైన మలైయమాన్ యువరాజు మృతదేహం పక్కన కూర్చొన్నారు. అతని వీరవదనాన్ని కాసేపు పరీక్షగా చూశారు. ఉన్నట్లుండి కొండ కదిలినట్లు ఆయన ఒళ్ళంతా వణికింది! అలల కడలినుంచి లేచే ఉధృత ఘోషలాగ "అయ్యో!" అన్న శోకఘోష లేచింది.

తమ ఉక్కులాంటి హస్తాలతో తలమీద ఎదమీద బాదుకోసాగారు.

“నా ముద్దుల బిడ్డా! నిన్ను పెళ్ళి పందిరిలో చూడ వచ్చాను కద? నిన్ను పెళ్ళి కొడుకు ముస్తాబులో చూడవచ్చాను కద? దానికి బదులు పీనుగు వేషంలో చూస్తున్నానే!” అని అష్టదిక్కులూ అదిరిపోయేలా గగ్గోలుపెట్టారు.

తర్వాత ఆ వీర వృద్ధులు కరికాలన్ పుట్టినప్పటినుంచి జరిగిన సంభవాలన్నింటినీ చెప్పి విలపించారు. అతడు పుట్టినరోజు జరిగిన వేడుకలన్నీ చెప్పారు. అతడు చిన్న బిడ్డగా ఉన్నప్పుడు తమ ఒడిలో, తమ చేతుల్లో, భుజాలమీద ఆటలాడినదంతా చెప్పి ఏడ్చారు. అతడికి శూలం విసరడం, కత్తి యుద్ధం చేయడం తామెలా నేర్పారో చెప్పారు. పదహారో ఏట శేవూర్ యుద్ధంలో అతడు చేసిన అసహాయ శూర, వీరకృత్యాలనన్నింటినీ ఒక్కొక్కటిగా చెప్పి దుఃఖించారు.

“అయ్యో! వీరపాండ్యునితో జరిగిన యుద్ధంలో వీర స్వర్గం పొందివుండకూడదా? ఈ ఛండాలుడు శంబువరయ్యర్, వీడితో చేరిన కుట్రదారులు చేసిన కుట్రకు బలి కావాలా? అయ్యో! నిన్ను నేనే ఇక్కడికి అతిథిగా పంపించాను కద! నాకేమో వయసు మళ్ళింది. నీకిక్కడ స్నేహితులు కావాలని ఎంచి, వీడి కూతురిని నీవు పెళ్ళిచేసుకొంటే వీడు నీ పక్షాన ఉంటాడని నమ్మి పంపాను కద? శంబువరయ్యన్ మాళిగకు అతిథిగా పంపిస్తున్నానని ఎంచి, యముడి మాళిగకు అతిథిగా పంపాను కద? నేను కద పాతకుడిని? నేను కద నిన్ను చంపాను?” అని చెప్పి మళ్ళీ మళ్ళీ తల బాదుకొన్నారు.

తర్వాత, ఉన్నట్లుండి శోకంనుంచి బయటపడి, రౌద్రాకారందాల్చి చుట్టూ చూశారు. “ఒరే శంబువరయ్యా! నిజం చెప్పు! యువరాజు ఎలా మరణించాడు? ఏం కుట్ర పన్నావురా? దేవేంద్రుడే దిగివచ్చి ఎదురుగా నిలబడి యుద్ధం చేసినా వీడిని ఓడించలేడు కద? ఎంతమందిని యువరాజు మీదికి పురిగొల్పావు? వారెక్కడ దాక్కొని ఎలా ఈ వీరాధివీరుని చంపారు? నిజాన్ని చెప్పేసెయి!” అని గర్జించారు.

శంబువరయ్యర్ కూడ కోపంతో, “ముసలాడా! నీ ముసలితనం చూసి ఊరుకొంటున్నాను. యువరాజు ఎలా చనిపోయారన్న విషయం గురించి నీకెంత తెలుసో నాకూ అంతే తెలుసు. యువరాజు మృతదేహాన్ని తీసుకొచ్చాడే, వాడిని అడిగితే బహుశ చెబుతాడు! నన్నడిగి ఏం ప్రయోజనం?” అన్నారు.

"ఒరేయ్! నీ మాళిగలో అతిథిగా ఉన్నప్పుడు ఈ సంభవం జరిగింది. నీవు ఏమీ తెలియనివాడిలాగ మాట్లాడుతున్నావు. అదంతా ఎవరు నమ్ముతారు? సరే! నిన్ను సుందర చోళ చక్రవర్తి అడిగేటప్పుడు ఇదే ఉత్తరమివ్వు! వీరులారా! ఈ శంబువరయ్యర్ని చెరపట్టి బంధించండి! వీడి మాళిగను, అంతఃపురాన్ని పడగొట్టి నేల మట్టం చేయండి!” అని ఆ వీరవృద్ధులు పిడుగులాంటి కంఠంతో ఆజ్ఞాపించారు.

~

అప్పుడే తిరిగివచ్చిన పార్థిబేంద్రుడు మలైయమాన్ని చూసి, "అయ్యా! ఈ మాళిగను మనం నేల మట్టం చేయనవసరం లేదు. అగ్నిభగవానుడు ఆ పనిని చేపట్టేశాడు! అదిగో చూడండి!" అన్నాడు.

మలైయమాన్ అటువైపు చూశారు. ఆ మాళిగ ఒక మూల కాసేపటి క్రితం చిన్నదిగా కనిపించిన మంట వేగంగా అన్నివైపులా విస్తరిస్తుండడాన్ని గమనించారు. బ్రహ్మాండంగా పెరిగి ఆకాశాన్నంటుతున్న ఆ మహాగ్ని మేడలను, డాబాలను, గోపుర కలశాలను స్వాహా చేసి భస్మీపటలం చేస్తూ తన వేవేల జ్వాలాహస్తాలను ముందుకు చాస్తూ ఎక్కడెక్కడ తావు దొరుకుతుందో అక్కడల్లా విస్తరిస్తూ ముందుకు రాసాగింది. ఆ ఘోర, భయంకర దృశ్యాన్ని చూస్తు తిరుక్కోవలూర్ వీరులు భ్రమించి నిలబడివుండడాన్ని కూడ గమనించారు.

"సరే, సరే! అగ్ని భగవానుడు మన పనిని చేసేస్తున్నాడు. మంచిది, పార్థిబేంద్రా! మనం వెంటనే బయల్దేరుదాం. ముల్లోకాలనేలే సుందర చోళ చక్రవర్తి తమ ముద్దుల కుమారుని చూడాలని పత్రం మీద పత్రం రాసి పంపిస్తున్నారు. నా కూతురు వాణమాదేవి తన కొడుకును చూడాలని సిఫారసు మీద సిఫారసు పంపిస్తూంది. జీవం లేని యువరాజు శరీరాన్నైనా వారు చివరిగా చూడనీ. ఈ వీరాధివీరుని శరీరాన్ని ఛండాలుడు ఈ శంబువరయ్యన్ మాళిగను మింగిన అగ్నికి ఎర వేయవద్దు. తంజావూరుకు తీసుకొని వెళదాం. చక్రవర్తి సమక్షానికి/సన్నిధానానికి తీసుకొని వెళదాం. అసువులుబాసిన కుమారుని దివ్యవదనాన్నైనా చూసి ఆ తలిదండ్రులు విలపించనీ. యువరాజును హత్య చేసిన ఛండాల పాతకులకు చక్రవర్తే తగిన శిక్ష విధించనీ!" అన్నారు మలైయమాన్.

~~~
~~~

# అధ్యాయము - 43

## మళ్ళీ కొళ్ళిడం తీరాన!

**కొళ్ళిడం** నది ఉత్తరతీరాన తిరునారైయూర్ అనే గ్రామంలో నంబి ఆండార్ నంబి అనే మహాశివభక్తుని మఠాలయం ఉండేది. ఇప్పుడు దాని వాకిట ఒక పల్లకి, ఆ పల్లకి బోయీలు, కాపలా వీరులు నిలబడివున్నారు. వీరుగాక ఆ గ్రామస్థులు కొందరు కాస్త దూరాన గుమిగూడి నిలబడివున్నారు. ఆ గుంపులో ఇద్దరి మధ్య ఏదో పెద్ద వాగ్వివాదం జరుగుతున్నట్లు, దాన్ని తక్కినవారు చాల కుతూహలంతో గమనిస్తున్నట్లు తోచింది.

గుంపును కాస్త దాటుకొని లోపలికి తొంగి చూస్తే మనకు చిరపరిచితులైన ఇద్దరే అక్కడ నిలబడి వాగ్వివాదం చేస్తున్నారని తెలియవస్తుంది. వారిలో ఒకడు తిరుమలై అనబడే ఆళ్వార్ కట్టియాన్ నంబి. ఇంకొకరు మన కథ ఆరంభంలోనే అతడితో పడవలో వాగ్వివాదం చేసిన వీరశైవుడు - నంబియాండార్ నంబి మఠంలో ప్రధాన కార్యకర్త.

నంబియాండార్ని చూడవచ్చిన పెద్ద రాణి శెంబియన్ మహాదేవి ఆ మహానుభావునితోనే ఏకాంతంగా ఏదో మాట్లాడగోరుతున్నారని తెలియగానే ఆ వీరశైవులు మఠంనుంచి బయటికొచ్చారు. ఆళ్వార్ కట్టియాన్ని చూడగానే ఆయనకు సహజంగానే కోపం పొంగుకొచ్చింది. మునుపొకసారి ఆ వీరవైష్ణవునితో వాగ్వివాదంలో ఓడిపోయామన్న సంగతి ఆయనకు ఉక్రోషాన్ని పుట్టించింది.

"ఒరే! నామాలేసుకొని ఊరూరూ తిరిగే వేషధారి వైష్ణవుడా! ఇక్కడికెందుకు వచ్చావు? ఎక్కడైన పొంగల్, పులిహోర దొరికే చోటు వెతుక్కొని వెళ్ళవచ్చు కద?" అన్నారు.

"పొంగల్ - పులిహోర కావలసినంత తిన్న తర్వాతే వస్తున్నాను. ఇక్కడున్న శైవమఠంలో మీరందరూ బూడిద తిని ఒళ్ళు వాచిపోయారని తెలిసివచ్చాను. పాపం! మీరేం చేయగలరు? మీ శివపరమాత్మ తినేందుకు అన్నం దొరక్కనే కద విషం మింగారు? అప్పుడు గనక మా నారాయణుని సహోదరి పార్వతి శివుని గొంతు నొక్కకపోయివుంటే మీ శివుని గతి ఏమైవుండేది?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఒరే వీరవైష్ణవుడా! ఆపు నీ కథ! ఇంకా ఇంకా పైకెగరకు! మీ పెరుమాళ్ళు (=విష్ణువు) ఎంత పైకెగిరినా మా శివపరమాత్మ జుట్టును కనిపెట్టలేక తిరిగి వచ్చారు కద?"

"అదేం కథయ్యా? మా మహావిష్ణువు వామనావతారమెత్తి వచ్చి భూమిని ఒక పాదంతో, ఆకాశాన్ని ఇంకొక పాదంతో కొలిచినప్పుడు మీ శివుని జుట్టు ఆ పాదం కిందే కద ఉండివుండాలి?" అని సవాలు విసిరాడు ఆళ్వార్ కట్టియాన్.

"మీ విష్ణువు భూమి మీద పదిసార్లు పుట్టడం నుంచి ఆయన బండారం బయటపడడం లేదా? అందులోను ఎటువంటి జన్మాలు? చేపగాను, తాబేలుగాను, పందిగాను కద పుట్టారు?" అన్నారు వీరశైవులు.

"మీకు తెలిసిందంతే! భగవానుడు చేపగా పుట్టిందెందుకు? సముద్రంలో మునిగిపోయిన నాలుగు వేదాలను తిరిగి తీసుకొని రావడానికే కద? అందుకే మా ఆళ్వార్ కూడ దాని గురించి పాడారు!"

"అయ్యా! మీ ఆళ్వార్లు పన్నెండుమంది మాత్రమే! మ నాయన్మార్లు అరవైమూడు మంది! అది గుర్తుంచుకో!"

"ఓహో! ఇలా ఇంకొక విధంగా గొప్పలు చెప్పుకొంటున్నారా? పంచపాండవులు అయిదుమంది మాత్రమే; దుర్యోధనాదులు వంద మంది అని గొప్పగా చెప్పుకొంటారు కాబోలు!"

"అధికప్రసంగి! మా నాయన్మార్లను కౌరవులతో పోలుస్తున్నావా? మీ ఆళ్వార్లలో మాత్రమే దెయ్యం ఆళ్వార్, భూతాళ్వార్ ఉన్నారు; మా నాయన్మార్లలో లేరు!"

"మీ శివపరమాత్మ గణాలే భూతగణాలు కద? అది మరిచిపోయినట్లున్నారు...?"

~

ఇలా ఆ వీరవైష్ణవుడు, వీరశైవులు వాగ్యుద్ధం కొనసాగిస్తుండగా ఇరువైపులా శ్రద్ధగొన్నవారు వారిని ఉత్సాహంతో ప్రోత్సహించసాగారు. ఈ సమయాన, మఠాలయంనుంచి శివజ్ఞాని గండరాదిత్యుల ధర్మపత్నియైన శెంబియన్ మహాదేవి, ఆమెను సాగనంపేందుకు నంబియాండార్ బయటకు రావడాన్ని చూసి ఆ కూటమిలో నిశ్శబ్దం నెలకొంది.

మళవరయ్యర్ కుమార్తె నంబియాండార్ నంబివద్ద సెలవు తీసుకొని వచ్చి ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "తిరుమలై! ఇక్కడ కూడ నీ యుద్ధాన్ని మొదలు పెట్టేశావా?" అన్నారు.

"లేదు, దేవీ! మేము శస్త్రయుద్ధం చేయడం లేదు; ఒట్టి వాగ్యుద్ధమే చేస్తున్నాము. ఈ వీరశైవశిఖామణే మొదట యుద్ధాన్ని ఆరంభించారు! మా వాగ్యుద్ధం ఇక్కడ గుమిగూడినవారికంతా చాల ఉత్సాహాన్నిచ్చినట్లుంది. అందుకే మఠాలయం లోపలికి రాకుండ ఇక్కడే ఉండిపోయారు!" అన్నాడు తిరుమలై.

"అబ్బాయీ! దేవతల మధ్య హెచ్చుతగ్గులు చెప్పి పరిహాసానికి కూడ వాగ్వివాదం చేయకూడదు. అందువల్ల సాధారణప్రజల మనసులు గందరగోళమవుతాయి! నా మామగారైన పరాంతక దేవరు తిల్లై గోపురానికి బంగారు తొడుగు చేయించారు. అలాగే మీ నారాయణ పురంలోవున్న అనంతీశ్వరుని ఆలయానికి కూడ కైంకర్యం చేసి మాన్యమిచ్చారు. ఆయన చూపిన దారిలోనే మనమందరం నడుచుకోవాలి!" అన్నారు శెంబియన్ మహాదేవి.

తర్వాత శెంబియన మహాదేవి పల్లకెక్కగా అది పశ్చిమదిశగా వెళ్ళింది. కాపలా వీరులు పల్లకి

ముందు, వెనక కాపలా కాస్తూ వెళ్ళారు. ఆళ్వార్ కట్టియాన్ శెంబియన్ మహాదేవి పల్లకి పక్కగా నడుస్తూ వెళ్ళాడు.

~

పల్లకి కాస్త దూరం వెళ్ళిన తర్వాత ఆళ్వార్ కట్టియాన్ పెద్ద రాణిని చూసి, "దేవీ! నంబియాండార్‌ని నమ్మి వచ్చిన కార్యమేమైంది?" అని అడిగాడు. "నా మనసులోని కలత తొలగిపోయి, నా మనసు తేట పడింది, తిరుమలై! మధురాంతకుడు సింహాసనమెక్కడాన్ని ఇంకేవిధంగాను ఆపడం సాధ్యం కాకపోతే, లోకమెరుగ నిజాన్ని చెప్పేయడమే ఉచితమని నంబియాండార్ చెప్పేశారు. నేనూ దాన్ని మనఃపూర్వకంగా ఒప్పుకొని మనసు దిటవు పరచుకొన్నాను!" అన్నారు శెంబియన్ మహాదేవి.

"నంబియాండార్ అలా చెబుతారనే ముఖ్యమంత్రి కూడ ఎదురుచూశారు. కానీ మీరు ఈ ప్రయాణం చేసి వచ్చింది చాల మంచిదైంది, తల్లీ! మీరు ఈ విషయం గురించి వెంటనే ఒక తీర్మానానికి వచ్చేందుకు ఇంకా బలమైన అవశ్యకత కలిగిందిప్పుడు. కడంబూర్‌నుంచి అతిభయంకరమైన వార్త వచ్చింది. అది ఇంకా ఈ ఊరివాళ్ళకు తెలియదు. తెలిస్తే ఇక్కడ ఒక్కరూ ఉండేవారు కారు. అందరూ యువరాజు అంతిమయాత్రను చూసేందుకు వెళ్ళేవారు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"తిరుమలై! ఏమంటున్నావు? ఏమా భయంకరమైన వార్త? ఏ యువరాజు? ఏ అంతిమయాత్ర?" అని చాల గాభరాతో అడిగారు పెద్దరాణి.

"క్షమించాలి, తల్లీ! చోళకులంలో ఇంతవరకు ఇటువంటి దుర్ఘటన సంభవించలేదు. కడంబూర్ అంతఃపురంలో ఆదిత్య కరికాలన్ కాలం చెందారు. దుర్మరణం అని చెబుతున్నారు. ఎవరివల్ల కలిగింది, ఎలా జరిగింది అని మాత్రం తెలియడం లేదు. పలువురు పలువిధాలుగా చెబుతున్నారు. ఆదిత్య కరికాలన్‌గారి అకాలమరణం తర్వాత కడంబూర్ మాళిగ మొత్తం నిప్పంటుకొని కాలిపోయిందట. యువరాజు శరీరాన్ని ఊరేగింపుగా తంజావూరుకు తీసుకొని వస్తున్నారట. తిరుక్కోవలూర్ మలైయమాన్ శంబువరయ్యర్ని, ఆయన కుటుంబీకులను చెరపట్టి బంధించి తీసుకొని వస్తున్నారట. ఊరేగింపులో ఒక లక్షకన్న ఎక్కువ ప్రజలు ముందు వెనుక వస్తున్నారట! వారు కొళ్ళిడం నదీతీరాన్ని చేరేలోపు మనమా నదిని దాటేయాలి!"

"తిరుమలై! నీవు చెబుతున్నది నిజంగానే భయంకరమైన వార్త! ఆకాశాన ధూమకేతువు కనిపించిన కారణంగా ప్రజలెదురుచూడని విపరీతం జరిగిపోయింది! అయ్యో! ఆ అసహాయశూరుని గతి ఇలాగా ముగియాలి! అయ్యో! సుందర చోళ చక్రవర్తికి ఈ వార్తవల్ల ఏదీ  జరగకూడదు కద అని నాకు పెద్ద దిగులు పుడుతోంది. దయాసాగరుడైన శివపరమాత్మే చోళవంశాన్ని కాపాడాలి!" అన్నారు మళవరయ్యర్ కుమార్తె.

"తల్లీ! చోళకులానికి ఎదురైన ఆపద ఒకవైపుండనీ. ఈ దుర్ఘటన వల్ల చోళసామ్రాజ్యమే ఛిన్నాభిన్నమైపోగలదని నాకు భయం పుడుతోంది!"

"నీకెందుకా ఆలోచన కలుగుతూంది, తిరుమలై?"

"చోళసామ్రాజ్యపు నాయకులు, చిన్నరాజుల మధ్య పెద్ద యుద్ధం పుట్టవచ్చు. ఇలా చోళనాడులో అంతర్యుద్ధం పుట్టి రక్తపుటేరులు పారుతున్నప్పుడు పగవారు ధైర్యం పుంజుకొని దండెత్తి రావచ్చు! దాని పరిణామాల గూర్చి చెప్పాలా, తల్లీ?"

"తిరుమలై! చిన్నరాజుల మధ్య అంతర్యుద్ధం పుడుతుందని ఎందుకనుకొంటున్నావు?"

"మీకు తెలిసిన కారణమే, తల్లీ! కొందరు మీ కుమారుడైన మధురాంతకులు సింహాసనం మీదికి రావాలంటున్నారు. ఇంకొందరు అరుళ్మొళిగారే సింహాసనమధిష్టించాలంటున్నారు. ఇప్పటికే కొడుంబాళూర్ వేళార్‌గారి సైన్యాలు తంజావూరు కోటను చుట్టుముట్టాయి. యువరాజు శరీరాన్ని తీసుకొని మలైయమాన్ తంజావూరును సమీపిస్తున్నారు. పళువేట్టరయ్యర్ పక్షం చేరిన చిన్నరాజులు తమ సైన్యాలను కూడదీస్తున్నారు. కాబట్టి తంజావూరులోను, తంజావూరు చుట్టుపక్కల చోళనాడు వీరులు ఒకరినొకరు చంపుకొని రక్తప్రవాహాలు పారబోతున్నాయి. కావేరి, కొళ్ళిడం మొదలైన అయిదు నదుల్లోను నీటిప్రవాహానికి బదులు రక్తప్రవాహం పారబోతూంది! మహావివేకి అయిన ముఖ్యమంత్రి అనిరుద్ధులే గాభరా పడుతున్నారు. విజయాలయులు, ఆదిత్యులు, పరాంతకులు, తమ పతియైన గండరాదిత్యులు స్థాపించి, విస్తరించి ఏలిన చోళ మహారాజ్యం మనకాలంలో తుడిచిపెట్టుకొని పోగలదని భయపడుతున్నారు. దీన్ని అడ్డుకోవడానికి అనిరుద్ధులకే ఏదారీ తోచడం లేదు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"తిరుమలై! దేవుని దయవల్ల ఈ మహాసామ్రాజ్యానికి అటువంటి ఆపద రాకుండ నేనడ్డుకొంటాను. దానికి దారి నాకు తెలుసు. ఆ దారిన వెళదామా అని మనసును దిటవు చేసుకోవడానికే నంబియాండార్ వద్దకు వచ్చాను. మధురాంతకునికి, అరుళ్మొళివర్మకు మధ్య సింహాసనం గురించి పోటీ వస్తేనే కద అంతర్యుద్ధం వస్తుందంటున్నావు?"

"అవును, తల్లీ! అటువంటి అంతర్యుద్ధం కలగకుండ ఎలా అడ్డుకోసాధ్యం? ఆదిత్య కరికాలన్‌గారు ప్రాయంలో కాస్త పెద్దవారని ఇంతవరకు చెప్పే అవకాశం ఉండేది! ఇప్పుడు ఆయన కూడ లేరు. మీ కుమారుని కన్న అరుళ్మొళి వర్మ చిన్నవారు. కానీ మలైయమాన్, వేళార్, చోళనాడు ప్రజలు ఇక అరుళ్మొళి వర్మగారికే పట్టం కట్టాలని గట్టిగా చెప్పబోతున్నారు. పళువేట్టరయ్యర్లు అందుకు ఒప్పుకోరు..."

"తిరుమలై! ఎవరొప్పుకొన్నా, ఒప్పుకోకపోయినా నేనొప్పుకొంటాను మహాపురుషులైన నా పతిదేవుల మనోరథాన్ని (=కోరిక) నేను నెరవేరుస్తాను. మధురాంతకునికి పట్టం లేదని తీర్మానమైతే అంతర్యుద్ధం కూడ లేదు కద?"

"అవును, తల్లీ! చోళమహాసామ్రాజ్యం సర్వనాశనం కాకుండ ఇప్పుడు మీరు కాపాడితేనే గతి; ఇక వేరే దారే లేదు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"నాచేత కాగలిగిందేమీ లేదు; మహేశ్వరుడే అంతటి శక్తినిచ్చి కరుణించాలి!" అన్నారు

మహారాణి.

~

కాసేపు ఇద్దరూ మౌనంగా ప్రయాణం కొనసాగించారు. కొళ్ళిడపు పడవ రేవు కాస్త దూరాన కనిపించింది.

"తిరుమలై! కాసేపటి క్రితం ఒక భయంకరమైన వార్తనందించావు. ఆదిత్య కరికాలన్ మరణించాడన్నావు. మూడులోకాలను ఏలవలసిన ఆ వీరాధివీరుడు మరణించడమే ఒక విపరీతమైన వార్త. యువరాజు దుర్మరణం పాలయ్యాడన్నావు కద? అదెలా? తన ప్రాణాలను తానే తీసుకొన్నాడా? లేక ఎవరైనా అతన్ని హత్య చేశారని చెబుతున్నారా?" అని పెద్దరాణి విలపించారు.

"దేవీ! అందుగురించి పలువిధాలైన ఉవాచలు ప్రచారంలోకొస్తున్నాయి. శంబువరయ్యర్ ఇంట జరిగినందువల్ల ఆయన మీద సందేహంగొని, ఆయనను, ఆయన కుటుంబీకులను మలైయమాన్ చెరపట్టి బంధించి తీసుకొస్తున్నారట. శంబువరయ్యర్ కొడుకు గందమారన్ మాత్రం ఎలాగో తప్పించుకొన్నాడట..."

"శంబువరయ్యర్ ఇందుకు కారణభూతుడని నేను నమ్మడం లేదు. ఆయన ఇంటికి అతిథిగా వచ్చిన చక్రవర్తి కుమారుని హత్య చేసేందుకు ఎవరికి మనసొప్పుతుంది? శంబువరయ్యర్ అలా చేసివుండరు. ఆయన దీని గురించి ఏమంటున్నారట? యువరాజు కరికాలన్ మరణం ఎలా జరిగివుండవచ్చని అంటున్నారట?"

"దేవీ! పళైయారైకి మునుపొకసారి వాణర్ కులవీరుడొకడొచ్చాడు కద, గుర్తుందా? అతడిని కుందవై యువరాకుమారి తాళపత్రమిచ్చి లంకకు పంపించారు కద?"

"అవునవును; జ్ఞాపకముంది. అతడి గురించేమిప్పుడు?"

"యువరాజు నిర్జీవదేహం దగ్గర అతడే ఉన్నాడట. కాబట్టి అతడే యువరాజును చంపివుండాలని శంబువరయ్యర్ చెబుతున్నారట..."

"తిరుమలై! అలా ఏనాడూ జరగదు. ఆ అబ్బాయిని నాకు బాగా గుర్తుంది..."

"నేనూ అలాగే అనుకొంటున్నాను, తల్లీ! కానీ సందర్భం, సాక్ష్యాలు అతనికి వ్యతిరేకంగా ఉన్నాయి!"

"అయ్యో, పాపం! యువరాకుమారి ఆ యువకుని మీద చాల నమ్మకం, విశ్వాసంగొంది. ఈ వార్త తెలిస్తే విలవిల్లాడిపోతుంది!"

"తల్లీ! మిమ్మల్ని అందు గురించి సలహా అడిగాలనే అనుకొంటున్నాను. మీరు కుడందైకి వెళ్ళగానే యువరాకుమారిని కలిసి మీతోబాటు తంజావూరుకు పిలుచుకొని వెళ్ళడం మంచిది..."

'అదే నా ఉద్దేశం కూడాను. యువరాకుమారి నాకోసం అక్కడ వేచివుంది..."

"ఇతరుల మూలంగా యువరాకుమారికి ఈ వార్త తెలిసే ముందు మీరే చెప్పడం మంచిది."

"అలాగైతే ఇప్పుడు నీవు నాతో రాబోవడం లేదా, తిరుమలై?"

"దేవీ! మీరు అనుమతిస్తే కొళ్ళిడం దగ్గర దక్షిణతీరాన మీ దగ్గర సెలవు తీసుకోగోరుతున్నాను..."

"ఎక్కడికి వెళ్ళబోతున్నావు?"

"యువరాజు కరికాలన్ మరణంలో ఏదో ఒక మర్మముంది. దాన్ని కనిపెట్టి తెలుసుకోవడానికి వెళ్ళబోతున్నాను. దేవీ! పాండ్యనాడు కుట్రదారుల గురించి మునుపొకసారి మీకు చెప్పాను. వారిలో ఒకడిని కొళ్ళిడం నది దక్షిణతీరాన మనం వచ్చేటప్పుడు చూశాను..." అన్నాడు తిరుమలై.

"వెంటనే నీవెందుకు వాడిని వెన్నంటి వెళ్ళలేదు?"

"కొళ్ళిడపు ఉత్తరతీరానికి వచ్చిన తర్వాతే యువరాజు మరణం గురించి తెలిసింది. మహారాణీ! నాకు సెలవివ్వండి! కుట్రదారులు సాధారణంగా సమావేశమయ్యే చోటు నాకు తెలుసు..."

"సరే, వెళ్ళిరా! యువరాకుమారికి ఏం చెప్పను? ఆమెను తలుచుకొంటేనే నాకు దిగులు ముంచుకొస్తూంది."

"వంతిదేవుని మీద నింద మోపబడితే అందు గురించి విచారించవద్దని చెప్పండి. నిజమైన నేరస్థుడిని నేను కనిపెట్టి తీసుకొస్తానని చెప్పండి!"

"దేవుని దయవల్ల నీవు వెళుతున్న కార్యం విజయవంతం కానీ!" అన్నారు శివభక్త శిరోమణియైన శెంబియన్ మహాదేవి.

ఇంతలో కొళ్ళిడం నదీతీరానికొచ్చేశారు వారు. శెంబియన మహాదేవి, ఆమె పరివారం ఎక్కి వెళ్ళేందుకు పడవలు సిద్ధంగా ఉన్నాయి.

ఆళ్వార్ కట్టియాన్ ఇంకొక చిన్న పడవ పట్టుకొని వారి కన్న ముందు వేగంగా నడపమని ఆ పడవ నడిపేవాడికి చెప్పి, అక్కడినుంచి బయలుదేరాడు.

~~~
~~~

# అధ్యాయము - 44

## కొండ గుహలో!

**కొళ్ళిడం** నది దక్షిణతీరాన్ని చేరగానే ఆళ్వార్ కట్టియాన్ పైన పేర్కొన్న దిశగా వెళ్ళాడు. కొళ్ళిడం నది గట్లు తెగడంవల్ల ఎటుచూసినా వరదమయంగా ఉండడాన్ని గమనించాడు. కానీ కొళ్ళిడం నదిలో నీటిమట్టం తగ్గినట్లే గట్లు తెగడంవల్ల వరదనీరు పారుతున్నచోట్ల కూడ నీటి మట్టం వేగంగా తగ్గుముఖం పడుతూంది. చివరికి తిరుప్పురంపయం గ్రామానికి చేరుకొన్నాడు. ఆ గ్రామం మాత్రం వరద వల్ల అంతగా బాధింపబడకుండడాన్ని చూసి ఆశ్చర్యపడ్డాడు. ఆదికాలంలో లోకమంతా ప్రళయంలో మునిగినప్పుడు తిరుప్పురంపయం మాత్రం మునిగిపోలేదని ఇందుకే పురాణాల్లో చెప్పారు కాబోలు అనుకొన్నాడు. అలా ఆలోచిస్తూ పళ్ళిప్పడై అడవిని సమీపించాడు. అక్కడ సుడిగాలి వల్ల చాల చెట్లు పడిపోయినా, అతడు దాక్కొని గమనించేందుకు/నిఘా వేసేందుకు కావలసినంత దట్టమైన చెట్ల మరుగు లేకపోలేదు. అలా దాక్కొని చూసినప్పుడు పళ్ళిప్పడై కోవెల వాకిట ముగ్గురు మగవాళ్ళు, ఒక ఆడది నిలబడి మాట్లాడుకొంటుండడం కనిపించింది. అందరూ తనకు ఇంత క్రితం తెలిసినవారేనని గ్రహించాడు. అదే పళ్ళిప్పడై అడవిలో మొట్టమొదటగా కుట్రాలోచనకు సమావేశమైన వారిలో ఈ ముగ్గురు మగవాళ్ళు ఉన్నారు. ఒకడు సోమన్ శాంభవన్. ఇంకొకడు [క్రమ విత్తన్], మూడోవాడు ఇడుంబన్‌కారి. స్త్రీ, పడవ నడిపే మురుగయ్యన్ పెళ్ళాం. వారిలో ఇడుంబన్‌కారి తక్కినవారికేదో చెబుతున్నాడు. ఆ వార్త వారికి ఉత్సాహాన్ని కలిగించినట్లు తోచింది. "సరే! అలాగైతే మనం కూడ పచ్చమలై [మలై=కొండ] పాదం వద్దకు వెంటనే బయల్దేరుదాం. వెళ్ళి చేరేందుకు రెండు రోజులు పడుతుంది..." అని సోమన్ శాంభవన్ చెప్పింది ఆళ్వార్ కట్టియాన్ చెవిన పడింది.

~

వారికన్న ముందే అక్కడినుంచి బయల్దేరుదామని వెనుదిరిగాడు ఆళ్వార్ కట్టియాన్. అతడి గుండెలకెదురుగా ఒక చిన్న కత్తిని చూసి అదిరిపడ్డాడు. దాన్ని పట్టుకొన్న చేయి పూంగుళలిదని తెలిసి నెమ్మదిగొన్నాడు. ఇద్దరూ ఒకరినొకరు తెలుసుకోగానే చిరునవ్వుతో తమ ఆశ్చర్యాన్ని వెలిబుచ్చారు. మాట్లాడకుండ సైగలతోనే ఇంకాసేపు అక్కడ వేచివుండవలసిన అవశ్యకతను ఒకరికొకరు తెలియజేసుకొన్నారు.

కుట్రదారులు అక్కడినుంచి వెళ్ళిపోయారని తెలియగానే ఆళ్వార్ కట్టియాన్, "పూంగుళలీ! తంజావూరునుంచి నీవిక్కడికెలా వచ్చావు? ఎందుకు వచ్చావు?" అని అడిగాడు.

"పగ తీర్చుకోవడానికి వచ్చాను" అన్నది పూంగుళలి.

"ఏం పగ? ఎందుకని?"

"వీరిలో ఒకడు నా అత్తను చంపేసి పారిపోయి వచ్చిన పాతకుడు. వాడిని వదలక వెన్నంటి తరుముకొంటూ వచ్చి పట్టుకొన్నాను. ఇక్కడ ఇంకా ముగ్గురు వాడికన్న ముందే వచ్చి చేరారు. అందులోను నా వదినను చూసి అవాక్కైనాను! అంతలో నీవొకడివి అడ్డొచ్చేశావు! ఇప్పుడేం చేద్దాం? నీవు నాకు సహాయం చేసేటట్లయితే వీరిని వదలక వెన్నంటి వెళ్ళి, నా అత్తను చంపినవాడిని చంపి వస్తాను!" అన్నది.

"అయ్యో, పాపం! నీ అత్త అంటే మూగరాణి మందాకినే కద? ఆమెను ఎందుకని వీరిలో ఒకడు చంపాడు?" అని ఆదుర్దాగా అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

"అత్తను చంపాలని ఎంచి చంపలేదు. చక్రవర్తిని చంపాలని ఎంచి ఆయన మీదికి విసిరిన శూలనికి నా అత్త అడ్డు వెళ్ళింది!"

"ఓహో! అలాగా! మూగరాణి తన ప్రాణాలిచ్చి చక్రవర్తిని కాపాడిందా? ఇదంతా ఎలా జరిగింది? కాస్త వివరంగా చెప్పు!"

"వివరంగా చెప్పేందుకు ఇదేనా సమయం, సందర్భం? వాళ్ళు తప్పించుకొని పారిపోతారు కద?"

"పూంగుళలీ! వాళ్ళు వెళ్ళే చోటు / వారి గమ్యస్థానం నాకు తెలుసు. ఎవరిని కలవడానికి వెళుతున్నారన్నది కూడ కొంతవరకు ఊహించి తెలుసుకొన్నాను. దారిలో వారినడ్డుకోకపోవడమే మంచిది. వాళ్ళు వెళ్ళే చోటికి మనం కూడ వెళదాం. అక్కడ నేను ఏం తెలుసుకోగోరుతున్నానో అది తెలుసుకొన్న తర్వాత నీవు నీ పగ తీర్చుకోవచ్చు" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అలాగైతే బయల్దేరు! దారిలో తంజావూరులో జరిగిందంతా వివరంగా చెబుతాను!" అన్నది పూంగుళలి.

~

ఇద్దరూ పడవెక్కి కొళ్ళిడం నది అవతలి గట్టుకు చేరుకొని, వాయవ్యదిశగా ప్రయాణం సాగించారు. మూడు రాత్రులు, మూడు పగళ్ళు ప్రయాణం చేసిన తర్వాత పచ్చకొండ పాదాన్ని చేరుకొన్నారు. కొండ పాదం వద్ద దట్టమైన అడవి వల్ల వారు వెంబడించి వచ్చినవారు ఎక్కడ ఉండవచ్చన్నది వెతికి కనిపెట్టడం అంత తేలికగా సాధ్యంకాలేదు. ఇంత ప్రయాసపడి ప్రయాణం చేసి వచ్చింది వృధా అయింది కద అని నిరాశపడ్డారు.

ఉన్నట్లుండి గుడ్లగూబ కూత వినిపించింది. బదులుగా ఇంకొక గొంతు అదేలాగ వినిపించింది. ఆళ్వార్ కట్టియాన్ ముఖం విప్పారింది. పూంగుళలికి సైగ ద్వారా మాట్లాడకుండ తనతో రమ్మని తెలియజేశాడు. గుడ్లగూబల కూతలు వినిపించిన చోట కాస్త బయలు కనిపించింది. అక్కడ ఏడెనిమిది

మంది ఉన్నారు. కొందరు నిప్పు రాజేసి వంట చేస్తున్నారు. ముందుగానే అక్కడున్నవారు, ఇప్పుడు వచ్చినవారు ఒకరికొకరు ఏదో ఆశ్చర్యకరమైన వార్త చెప్పుకొంటున్నారని తెలిసింది.

ముందుగానే అక్కడున్నవారిలో రవిదాసు ఒకడు. అతడు అప్పుడు కొత్తగా వచ్చి చేరినవారికి కాస్త దూరాన ఉన్న కొండ గుహనొకదాన్ని వేలెత్తి చూపించి ఏదో చెబుతున్నాడు. మెల్లని గొంతుతో, "పూంగుళలీ! నేను వెతుక్కొంటూ వచ్చినవారు ఆ గుహలో ఉండాలి. నేను మెల్లగా గుహలోకి దూరి చూస్తాను. వీరెవరైనా గుహను సమీపిస్తే ఒక కూత వేయి!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"గుడ్లగూబలాగ నేను కూత వేయలేను. కోయిలలాగ కూస్తాను!" అన్నది పూంగుళలి.

~

కొండ గుహలోపలికి గాలి, వెలుతురు వచ్చేందుకు కొన్ని పెద్ద ద్వారాలు నిర్మించబడివున్నాయి. కాబట్టి లోపల బాగ వెలుతురుగా/కాంతివంతంగా ఉంది.

ఆ వెలుతురులో ఆళ్వార్ కట్టియాన్ ఒక అపూర్వమైన దృశ్యాన్ని చూశాడు. పెద్ద పళువేట్టరయ్యర్ కాళాముఖులలాగ పులితోలును ధరించివున్నారు. ఆయన పక్కన ఒక పుర్రెల మాల ఉంది. ఆయన చాల రక్తం కోల్పోయారని పాలిపోయిన ఆయన ముఖం చెబుతోంది. కింద పడుకొన్నవారు అప్పుడే స్పృహ వచ్చి లేచి కూర్చోవడానికి ప్రయత్నిస్తున్నట్లు తోచింది. ఏదో ఒక భయంకరమైన స్వప్నలోకం నుంచి అప్పుడే మేలుకొన్నట్లు కనిపించారు. ఆయన కళ్ళు దిక్కు తోచక అటూ ఇటూ తిరిగాయి.

ఆయన పక్కన నందిని ఉంది. ఆమె ఆభరణాలన్నీ విసర్జించి తల విరబోసుకొనివుంది. కానీ ఆమె సమ్మోహన సౌందర్యం పది రెట్లు అధికంగా ప్రకాశిస్తూంది. ప్రేమ, ఆదరణ, పరితాపం, పశ్చాత్తాపం కూడిన గొంతుతో, "అయ్యా! ఈ గంజిని ఆరగించండి!" అని చెబుతూ ఒక మట్టిపాత్రను ఆయనకు అందించింది.

పళువేట్టరయ్యర్ ఆమెను తిరిగి చూశారు. ఆయన ముఖంలో ఒక్కక్షణంపాటు ఎల్లలెరుగని సంతోషాన్ని సూచించే చిరునవ్వు పూచి మాయమైంది.

"నందినీ! నా ముద్దులరాణీ! నీవేనా ఇప్పుడు మాట్లాడింది? నీ గొంతేనా అది? మనమిప్పుడెక్కడున్నాము? మరణం వాకిలి దగ్గరికి వెళ్ళిన నన్ను నీవేనా తిరిగి తీసుకొని వచ్చింది? ఆనాడు సావిత్రి సత్యవంతునికి చేసింది నీవీరోజు నాకు చేశావా? నాకు తెలివి వచ్చినప్పుడు నీవు నీ మెత్తని చేతులతో నా ఎదను తాకి చూస్తున్నట్లనిపించింది కద? అది నిజమేనా? మూడేళ్ళుగా నన్ను తాకడానికి కూడ నిరాకరించినదానివి ఇప్పుడు నామీద కనికరం చూపిస్తున్నావా? ఏదీ? ఇవ్వు! గంజినివ్వు! నీచేత్తో ఇస్తే అదే నాకు దేవామృతమౌతుంది!" అన్నారు.

ఇలా చెబుతూనే నందిని అందించిన మట్టిపాత్రను తీసుకొన్నాయన ఉన్నట్లుండి వెర్రెత్తినట్లు

చూడసాగారు. భయంకరంగా మారిన స్వరంతో, "ఒసే! పాతకీ! రాక్షసీ! నీవేనా? నన్ను తాకడానికి నీకు ధైర్యం వచ్చిందా? నా గుండెలో కత్తితో పొడవజూశావా? అప్పుడు నేను మేలుకొన్నానా? ఈ పాత్రలో ఉన్నది నిజంగా గంజేనా?  లేక నన్ను చంపేందుకు ఉద్దేశించిన విషమా? నీ చేత్తో ఇచ్చింది దేవామృతమైనా నాకది విషం కద?" అనేసి ఆ మట్టిపాత్రను విసిరికొట్టారు. అది వెళ్ళి గుహ గోడకు కొట్టుకొని ముక్కలుముక్కలైంది.

~~~
~~~

# అధ్యాయము - 45

## "సెలవివ్వండి"!

పళువేట్టరయ్యర్ కోపం నందినికి ఏమాత్రం ఆశ్చర్యాన్ని కలిగించినట్లు తోచలేదు. మూడేళ్ళుగా మహావీరుడైన ఆ వృద్ధుని తన చేతి కీలుబొమ్మగా ఆడిస్తూంది. మొట్టమొదటిసారిగా ఈరోజు ఆ కీలుబొమ్మను ఆడిస్తున్న ఆ దారం తెగిపోయింది. ఆడించినట్లు ఆడిన ఆ కీలుబొమ్మకు ఊపిరి, స్వయప్రజ్ఞ వచ్చేశాయి. దీన్ని నందిని ఎదురు చూసిందనే అనిపించింది. ఇక ఆ కీలుబొమ్మనుంచి ఆమెకు కావలసిన కార్యం కూడ ఏదీ లేదు.

ఏమాత్రం వణుకు, బెదురు చూపించుకోక నందిని లేచి పెద్ద పళువేట్టరయ్యర్ ముందు నమస్కరించింది. భావోద్వేగం వల్ల గద్గదమైన స్వరంతో ఇలా అన్నది:-

"స్వామీ! నా మాటలు మీకు తేనెకన్న, దేవామృతం కన్న ఇంపైనవని చాలసార్లు చెప్పారు. కానీ ఈ రోజు నేను మీకిచ్చిన గంజిలాగే నా మాటలు కూడ విషం కన్న చేదుగా ఉంటాయి. కానీ, నాపైన దయవుంచి నేను మీ దగ్గర చివరిగా సెలవు తీసుకొనేముందు కొన్ని మాటలు చెప్పేందుకు అనుమతివ్వండి. సెచ్చెలి అని, ఆశించిన ప్రేయసి అని పిలిచిన అదే నోటితో నన్నీరోజు పాతకి అని, ఛండాలి అని, రాక్షసి అని పిలిచారు. నేను పాతకినే, ఛండాలినే, రాక్షసినే! మూడేళ్ళుగా మిమ్మల్ని వంచించి, మోసగిస్తూ వచ్చాను. అడవిలో అనాధగా నిలబడ్డ నన్ను పిలుచుకొని వచ్చి అంతఃపురంలో పెట్టారు. మహారాణులు, రాకుమార్తెలు నాకు మర్యాదలు చేసేలా చేశారు. మీ ప్రాణానికి ప్రాణమైన చిన్న పళువేట్టరయ్యర్ని విరోధించేందుకు కూడ తెగించారు. దేశప్రజలు, నగరప్రజలు మీమీద మోపిన నిందలు, ఆడిన పరిహాసపు మాటలు మిమ్మల్ని బాధించలేదు. ఇలా ఎంతగానో నా మీద నమ్మకం ఉంచి ఎనలేని చనువిచ్చిన మిమ్మల్ని ఇన్నాళ్ళూ వంచిస్తూ వచ్చాను; అది నిజమే. నేను చేపట్టిన కార్యాన్ని నెరవేర్చుకోవడానికే మీ అంతఃపురంలో వసిస్తూ వచ్చాను. మీకు తెలియకుండ అనేక కార్యాలను కొనసాగించాను. కుట్రదారులతో సంబంధం ఏర్పరచుకొన్నాను. గందమారన్, పార్థిబేంద్రుడిలాంటి యువకుల మతిపోగొట్టి వారిని నా కార్యానికి ఉపయోగించుకొన్నాను. కానీ, అయ్యా! ఒకే ఒక విషయంలో నేను మిమ్మల్ని వంచించలేదు. మిమ్మల్ని లోకమెరుగ పెళ్ళాడిన రోజునుంచి మిమ్మల్ని నా పతిగా ఎంచాను. తరతరాలుగా మహావీరులను అందించిన మీ పురాతనకులానికి నా ప్రవర్తనాలోపం వల్ల ఎటువంటి కళంకం కలిగించలేదు. ఇంకా నేను సజీవంగా ఉంటే అటువంటి కళంకం మీకు ఏనాడూ కలగదు..."

"నందినీ! ఇదేమంటున్నావు? నా కులానికి ఏర్పడగల కళంకం ఇంకేముంది? అయ్యో! ఈ చేతితో... నా ఈ చేతితో... ఒసే పాతకీ! నీవొక కత్తివుంచుకొన్నావు కద? అదెక్కడ? దానితో నా చేతిని నీవే

తెగగొట్టేయి! నాకు నీవు చేయగల సహాయం అదొక్కటే! లేదు, లేదు! ఈ చేతికి ఇంకా ఒక పని మిగిలివుంది! అతిముఖ్యమైన పని. నేను చెప్పింది నిజమని ఎంచి అలాంటిదేమీ చేయబోకు...!"

"స్వామీ! నేనలాగేం చేసేయను. ఎంతో కాలంగా పగతీర్చుకోవాలనుకొన్నవారి మీదే ఆ కత్తిని ప్రయోగించలేకపోయాను సందర్భం చేజారిపోతుందేమోనని నేను భయపడుతున్నప్పుడు మీరు నాకు సహాయంగా వచ్చారు..."

"ఒసే పాతకీ! నీకు సహాయం చేసేందుకా నేను వచ్చాను? ఏం ప్రేలుతున్నావు? ఛండాలీ! స్త్రీరూపంగొన్న దెయ్యమా! ఇలా జరుగుతుందని తెలిస్తే నేనక్కడికి వచ్చేవాడినే కాను! దైవమా! కొళ్ళిడం వరదలో మునిగి విలవిల్లాడుతున్నప్పుడే ఆ పాపిష్టి యముడు నన్నెందుకు తీసుకొని పోలేదు?"

"స్వామీ! మీరు నాకు సహాయం చేసేందుకు రాలేదు. నా కార్యసాధనకు సహాయం చేయమని కూడ మిమ్మల్ని నేను కోరలేదు. మీరు చోళరాజ కులానికి విశ్వాసపాత్రులుగాను, చోళకులసేవలో ప్రాణాలర్పించేందుకు పరంపరగా దృఢసంకల్పంగొన్న కులానికి చెందినవారు. నేనేమో చోళకులం మీద పగ తీర్చుకోవడానికి వచ్చినదాన్ని. అందుకే నేను మీకు నా నిజమైన ఉద్దేశాన్ని చెప్పలేదు. కొన్నిసార్లు అలా మీ మూలంగా నా కార్యాన్ని నెరవేర్చుకొందామా అని కూడ అనుకొన్నాను. ఆలోచించి చూడండి! మీరీనాడు 'రాక్షసి' అని, 'స్త్రీరూపంగొన్న దెయ్యం' అని పిలుస్తున్న ఈ పేదరాలి ముఖసౌందర్యం ముందు ఎన్నిసార్లు మతి పోగొట్టుకొని నిలబడలేదు మీరు? అప్పుడల్లా మీ ద్వారానే నా పగ తీర్చుకొందామా అని ఆలోచించాను. కానీ మిమ్మల్ని అటువంటి ద్రోహకార్యానికి పురిగొల్పి మీ కులానికి కళంకం తేవడానికి నేనిష్టపడలేదు. అందుకే మిమ్మల్ని కడంబూర్‌నుంచి తంజావూరుకు పంపేసేందుకు అన్ని పాట్లు పడ్డాను. మీరూ వెళ్ళారు. కానీ విధి, సమయానికి మిమ్మల్ని తీసుకొని వచ్చి అక్కడ వదిలిపెట్టింది! మీకు మీరే నాకు సహాయం చేయ ప్రయత్నించలేదు. కానీ విధి మిమ్మల్ని తగిన సమయానికి నాకు సహాయం చేసేందుకు అక్కడికి తీసుకొని వచ్చి చేర్చింది! అవునయ్యా! విధే నా నడవడి గురించి మీ మనసులో సందేహాన్ని పుట్టించింది. నేను పగ తీర్చుకోవడాన్ని అడ్డుకోవడమే మీ ఉద్దేశమైతే, బహిరంగంగానే వచ్చేవారు. నేను తప్పుగా నడుచుకొని మీకు ద్రోహం చేస్తున్నానేమోనని సందేహించడం వల్లనే రహస్యమార్గం ద్వారా మారువేషంలో వచ్చారు... ఆ విషయంలోనైనా మీ సందేహం తీరివుండాలి! లేకపోతే, ఇప్పుడైనా తీర్చుకోండి. భార్యాభర్తలు జీవితంలో ఒకరికొకరు తోడుగా ఉండవలసినవారని పెద్దలు చెబుతారు. నేను మీకు నిజమైన పత్నిని కాబట్టే తోడుగా ఉండేందుకు తగిన సమయాన విధి మిమ్మల్ని నా దగ్గరకు తీసుకొని వచ్చి చేర్చింది..."

"నందినీ! చాలు, ఇక ఆపు! నీ మాటలు నన్ను చిత్రవధ చేస్తున్నాయి. దాని కన్న నన్ను ఒకేసారిగా చంపేయి! అడ్డుకోవడానికి కూడ నా చేతిలో కత్తి లేదు! ఒంట్లో బలం కూడ లేదు. కత్తితో చంపేందుకు నీకు ధైర్యం చాలకపోతే, నిజంగానే గంజిలో విషం కలిపి నాకివ్వు!"

"రాజా! నన్ను క్షమించాలి! లేదు... మీరు నన్ను క్షమించలేరు. ఈ జన్మలో నన్ను క్షమించలేరు, నిజమే! ఒక విషయం చెబుతాను, వినండి! మనమిద్దరం మరుజన్మెత్తి ఈ భూమి మీద పుడితే ఈ జన్మ జ్ఞాపకాలు ఏవీ ఉండవు. నేను మీ అంతఃపురంలో మిమ్మల్ని వంచించి కాలం గడిపిన విషయం, మీ బొక్కసం నుంచి ధనాన్ని నా కార్యం నెరవేర్చుకోవడానికి ఉపయోగించుకొన్న విషయం, చివరిగా కడంబూర్ అంతఃపురంలో విధివశాత్తు జరిగిన విపరీత సంఘటన – ఇవేవీ మీకు గుర్తుండవు; నాకూ గుర్తుండవు. ఈ జన్మలో నేను మీకు చేసిన ద్రోహానికి మరుజన్మలో ప్రాయశ్చిత్తం చేసుకోగోరుతున్నాను. మరుజన్మలో నేను మిమ్మల్నే పెళ్ళాడుతాను; మీకు నిజమైన జీవిత సహచరిగా ఉంటాను. ఈ వరాన్నే నేను సజీవంగా ఉన్నంతవరకు అన్ని దేవతలను కోరుకొంటాను..."

~

ఈ మాటలు విన్న పెద్ద పళువేట్టరయ్యర్ ఒడలు, మనసు విరిగిపోగా/కుంగిపోగా, "నందినీ! వెళ్ళిపో! ఇక్కడినుంచి వెంటనే వెళ్ళిపో! నీవింకా ఇలా మాట్లాడుతుంటే నా బుద్ధి గతి తప్పి నా కర్తవ్యాన్ని చేయి జారవిడిచేలా చేస్తాయి! ఇంతకాలం నీ వల్ల కలిగిన అనర్థాలు చాలు! ఇంకా నా బుద్ధిని చెడగొట్టి నాకు పిచ్చిపట్టేలా చేయకు! వెళ్ళిపో! ఇప్పుడే వెళ్ళిపో!" అన్నారు.

"స్వామీ! క్షమించండి! నాతో వచ్చినవారి మాట వినివుంటే ఇప్పటికి కొల్లిమలైని దాటి కొంగునాడును చేరేవారం. మీతో మాట్లాడి, సెలవు తీసుకోకుండ వెళ్ళడానికి నా మనసొప్పలేదు. కడంబూర్ కోట బయటకు రాగానే మీరు మూర్ఛబోయారు. మిమ్మల్ని అక్కడే పడేసి రమ్మని వారు చెప్పారు. దానికి కూడ నేను సమ్మతించలేదు. వాళ్ళే మిమ్మల్ని మోసుకొని వచ్చేలా చేశాను. రాత్రింబగళ్ళు విరామం లేకుండ మేము నడిచివచ్చినా కూడ మూడు రోజులు పట్టింది. ఇక్కడికి వచ్చిన తర్వాత కూడ మిమ్మల్ని వదిలిపెట్టి వెళ్ళిపోదామన్నారు. మీకు తెలివి వచ్చిన తర్వాత మీకు చెప్పి సెలవు తీసుకొని వస్తానని మొండిపట్టు పట్టాను. ఆ నా ఉద్దేశం నెరవేరింది. మీరు నన్ను చంపజూశారు. అది న్యాయమే కూడాను. కానీ విధి వశాత్తు ఇంకొక విధంగా జరిగిపోయింది. నా ప్రాణాలు తీయజూసిన మిమ్మల్ని నేనే బతికించాను. కాసేపటి క్రితం నేనందించిన గంజిని విషమని ఎంచి విసిరేశారు. కానీ మూడు రోజులుగా స్పృహ లేకుండ పడివున్న మీ నోట నీరు పోసి కాపాడుతూ వచ్చాను. మూడేళ్ళుగా మీరు నన్ను మీ అంతఃపురంలో పెట్టుకొని సాటిలేని అంతస్తునిచ్చి మురిసిపోయారు. దానికి ప్రత్యుపకారం నేనీ జన్మలో చేయలేను. కానీ ఈ మూడు రోజులు మీకు శైత్యోపచారాలు చేసే భాగ్యం నాకు కలిగింది. ఈ విషయం నేనూపిరితో ఉన్నంతవరకు నాకు తృప్తినిస్తుంది. వెళ్ళొస్తానయ్యా! సెలవివ్వండి!"

"నందినీ! నన్ను సెలవివ్వమని ఎందుకడుగుతున్నావు? అడగకనే వెళ్ళిపో! నీవిక్కడ ఆలస్యం చేయ, చేయ నా బుద్ధి తడబడుతుంది/చెడుతుంది!"

"అవును! నన్ను మళ్ళీ చంపాలనిపించినా అనిపించవచ్చు. మీ చేత ప్రాణాలు విడిచేటట్లయితే

అది నా భాగ్యంగా భావిస్తాను. కానీ మొదట నన్ను చంపేందుకే కద మీరు మారువేషంలో వచ్చారు?"

"ఎందుకని మారువేషం వేసుకొని వచ్చానా? నీవేదో కారణం చెప్పావు కద – నీ నడవడికను, శీలాన్ని సందేహించి నిజం తెలుసుకోవడానికి వచ్చానన్నావు. అది సరి కాదు. నేను నీ ముందు పెద్ద పళువేట్టరయ్యర్‌గా కనిపించి, నీవు నాతో రెండు మాటలు మాట్లాడేస్తే, నా మనసు కరిగిపోతుందని భయపడే మారువేషం వేసుకొని రహస్యమార్గం గుండా వచ్చాను. నీకు మాట్లాడేందుకు అవకాశమే ఇవ్వకుండ, నీవు భ్రమించి నిలబడిపోయినప్పుడు, నీమీద కత్తి విసిరి చంపాలని వచ్చాను. కడంబూర్ మాళిగ పనివాడు ఇడుంబన్‌కారిని భయపెట్టి వాడి చేతినుంచి కత్తిని లాక్కొని వచ్చాను. అంతేకాదు, నందినీ! ముసలాడు పళువేట్టరయ్యర్ అసూయగొని తన పడుచు పెళ్ళాన్ని చంపాడన్న అపనింద రాకూడదని ఎంచి కాళాముఖుని వేషం వేసుకొని వచ్చాను. కానీ కాసేపటి క్రితం నీవన్నట్లు నేనొకటి తలిస్తే, విధి ఇంకొకటి తలచింది. ఇక నావల్ల అటువంటి ప్రయత్నం చేయ సాధ్యం కానేకాదు. కాబట్టి నీవెళ్ళిపో! ఈ ఒక్కటి మాత్రం చెప్పేసి పో! ఆ సమయాన నేను వచ్చి అడ్డుపడకపోతే, ఏం జరిగివుండేది? నీ ఉద్దేశాన్ని ఎలా నెరవేర్చుకొనేదానివి?"

"అవునవును! అది కూడ చెప్పాలనే వేచివున్నాను. మీ కోపం నా బుద్ధిని కూడ గందరగోళం చేసేసింది. స్వామీ! మీరు తంజావూరుకు వెళ్ళేటప్పుడు 'మీ కులానికి నావల్ల ఏ కళంకమూ రాదు' అని మాటిచ్చాను. దాన్ని నిలబెట్టుకోవడానికి చాల పెద్ద ప్రయత్నం చేశాను. మణిమేఖల, గందమారన్, వంతిదేవుడు - వీరిలో ఒకరి మూలంగా నా శపథాన్ని నెరవేర్చడానికి ఎన్నెన్నో (కు)యుక్తులు పన్నాను. ముఖ్యంగా, మణిమేఖల మీద చాల నమ్మకం పెట్టుకొన్నాను. వేరే కారణం వల్ల అక్కడ దాక్కొన్న వంతిదేవుని చంపేందుకు కరికాలన్ వెర్రి ఆవేశంతో పరుగెత్తుతారు; అప్పుడు మణిమేఖల ఆయన్ను చంపుతుంది; మణిమేఖల మీద నింద రాకుండేందుకు వంతిదేవుడు 'నేనే చంపాను' అని ఒప్పుకొంటాడు; అందుమూలంగా పళైయార్రై రాకుమారి మీద కూడ నా పగ తీర్చుకొన్నట్లవుతుంది; ఇంకా ఎంతెంతో పన్నాగం పన్నాను. కానీ దానికంతా అవశ్యకతే లేకపోయింది. యువరాజు తమ చేత్తోనే తమ ప్రాణాలు తీసుకొన్నారు..."

"లేదు, నందినీ! లేదు! కరికాలన్ తన ప్రాణాలను తానే తీసుకోలేదు. నన్ను కూడానా మోసం చేయజూస్తున్నావు?"

"స్వామీ! ఇడుంబన్‌కారి కత్తిని ఆ సమయాన విసరకుంటే, మరుక్షణమే కరికాలన్‌గారు వీరపాండ్యుని కత్తితో తమను తామే చంపేసుకొనేవారు..."

"అవును! నేనింకొక్క క్షణం ఆలస్యంగా వచ్చివుంటే ఈ ద్రోహకార్యాన్ని చేసివుండేవాడిని కాను. దానికి బదులు నీమీద సందేహంగొనేవాడిని. నందినీ! విధి ప్రకారం జరిగిపోయింది. ఇక దాన్ని మార్చలేము. విధి ఒక విధంగా నాకు కూడ మంచి చేసింది. ఇద్దరూ మరోజన్మ ఎత్తితే, నీవు నన్నే నీ జీవిత

సహచరుడిగా స్వీకరిస్తావు కద? దానికన్న ఇంపైన మాట నా జీవితంలో ఇంతవరకు వినలేదు. నా ప్రాణాలు ఈ శరీరాన్ని విడిచే సమయాన నేనా మాటలనే తలుచుకొంటూ ప్రాణాలు విడుస్తాను. అవును, నందినీ! ఈ జన్మలో మనమిక ఒకటిగా జీవించలేము. కాబట్టి నీవెళ్ళిపో! గంజి లేకపోతే నీ చేత్తో కాసిని నీళ్ళిచ్చి వెళ్ళు! నేను మునుపు చెప్పినదంతా మరిచిపోయి క్షమించాననడానికి ఆనవాలుగా గంజో, నీళ్ళో ఇచ్చేసి పో!" అన్నారు పళువేట్టరయ్యర్.

"అలాగే కానివ్వండి, స్వామీ! మీరింత కరుణ చూపినందుకు నా ప్రాణాలున్నంతవరకు కృతజ్ఞత కలిగివుంటాను!" అని చెప్పి నందిని పొయ్యిమీదినుంచి గంజి తీసుకొని రావడానికి వెళ్ళింది.

ఆళ్వార్ కట్టియాన్ గుహనుంచి జారుకోవడానికి ఇదే తగిన సమయమనుకొన్నాడు. అతడు తెలుసుకోవలసినదంతా తెలుసుకొన్నాడు. ఇక అక్కడ ఉండడం వల్ల ప్రయోజనం లేదు; అపాయం కూడాను. ఇకమీద చేయవలసిందేమని బయటకు వెళ్ళి ఆలోచిద్దామని ఎంచి గుహనుంచి బయటపడ్డాడు.

~~~
~~~

# అధ్యాయము - 46

## ఆళ్వార్‌కి ఆపద!

**ఆళ్వార్** కట్టియాన్, పూంగుళలి కొండపాదాన ఒక చెట్టు కింద కూర్చొన్నారు.

"అమ్మాయీ! నేనొచ్చిన కార్యం ముగిసింది. బయలుదేరుదామా?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"వైష్ణవులుగారూ! మీపని ముగిసిందంటే మీరు వెళ్ళవచ్చు. నేను వచ్చిన పని ఇంకా పూర్తి కాలేదు!"

"నీవేకార్యం మీద వచ్చావు?"

"నా అత్తను చంపిన పాతకుడిని వెతుక్కొంటూ వచ్చాను."

"వాడిని కనిపెట్టలేదా? అదిగో ఆ కుట్రదారుల కూటమిలో వాడు లేడా?"

"ఉన్నాడు!"

"మరి?"

"వాడి దర్శనం చేసుకొని పుణ్యం కట్టుకొని వెళ్ళడానికి వచ్చానా? హత్యకు హత్య, పగ తీర్చుకోవడానికి వచ్చాను!"

"పూంగుళలీ! నేరం చేసినవారిని శిక్షించడానికి మనమెవరు? దానికి దేవుడున్నాడు!"

"దేవుడున్నాడా? ఉంటే మనుషుల ద్రోహకృత్యాలకు తగిన శిక్ష విధిస్తాడా అన్న విషయం గురించి నాకు చాల సందేహం."

"దేవుణ్ణి వదిలేద్దాం. ఈ లోకంలో నేరం చేసినవారిని శిక్షించే బాధ్యత రాజులది; రాజులు నియమించే అధికారులు చేయవలసిన పని."

"రాజులు, వారి అధికారులు వారి కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహించకపోతే?"

"నిర్వహించలేదని మనమెలా చెప్పగలం?"

"వైష్ణవులుగారూ! అదిగో అన్నడున్న పాతకుల్లో ఒకడు అంతఃపురం పైమేడ నుంచి శూలం విసిరి ప్రేమమూర్తియైన నా అత్తను చంపాడు. మాట్లాడలేని మూగది, ఎవరికీ కీడెంచనిది, జీవితమంతా దౌర్భాగ్యశాలిగా బతికినదీ అయిన ఒక పేదరాలిని చంపాడు. చక్రవర్తి, ఆయన రాణులు, కోట కాపలా అధికారియైన చిన్న పళువేట్టరయ్యర్ చూస్తూ నిలబడ్డారు కాబట్టి వాడు తప్పించుకొని పారిపోయాడు...."

"పూంగుళలీ! సోమన్ శాంభవన్ని పట్టుకోవడానికి వారెలాంటి ప్రయత్నమూ చేయలేదా?"

"జీవితకాలమంతా నా అత్తను నిరాకరించి, తిరస్కరించిన చక్రవర్తి అప్పుడామెను ఒడిలో

వేసుకొని ఏడ్చారు. తక్కినవారందరూ దిగ్భ్రమించి నిలబడ్డారు. 'హంతకుడిని నేను వెంబడించి నేను వెళతాను' అని నేననగానే చిన్న పళువేట్టరయ్యర్ మేలుకొని లేచి వచ్చారు. కానీ సొరంగ మార్గంలో ఆయన వచ్చిన దారినే తిరిగి వెళ్ళవలసి వచ్చింది."

"అదేల?"

"సొరంగమార్గంలో నేను, ఆయన వేగంగా వెళుతున్నప్పుడు ఒక ఆర్తనాదం వినిపించింది. చిన్న పళువేట్టరయ్యర్ ఆ గొంతు వినిపించిన దిక్కుగా దూకి అక్కడున్న వాడిని పట్టుకొన్నారు. 'ఇదిగో హంతకుడు దొరికిపోయాడు!' అని అరిచారు. 'లేదు, లేదు! నేనే హత్యా చేయలేదు!' అన్నదా గొంతు. అది ఎవరి గొంతని చిన్న పళువేట్టరయ్యర్‌కి తెలియగానే ఆయన ఆశ్చర్యపోయి 'అయ్యో! మీరిక్కడికెందుకు వచ్చారు?' అన్నారు. 'బొక్కసంలో అంతా భద్రంగా ఉందా అని చూసేందుకు వచ్చాను' అన్నదా గొంతు చీకటిలో. 'అయ్యో, దైవమా! మిమ్మల్ని ఇక్కడెవరైనా చూస్తే ఏమనుకొంటారు? మీరే కద చక్రవర్తిని చంపజూశారనుకొంటారు?' అన్నారు కోట దళపతి. 'చక్రవర్తి చనిపోయారా?' అని కుతూహలంతో, ఉత్సుకతతో అడిగారు చిన్న పళువేట్టరయ్యర్‌గారి ప్రియమైన అల్లుడుగారైన మధురాంతకులు. 'దద్దమ్మా! నాతో రా! ఎవరూ చూడకమునుపే నాతో రా' అని చిన్న పళువేట్టరయ్యర్ తమ అల్లుడిని చేయి పట్టి లాక్కొంటూ వెళ్ళిపోయారు. తర్వాత నేను మాత్రం ఈ హంతకులను వెంబడించి వచ్చాను. ఇంతదూరం శ్రమపడి వచ్చి, నా ఉద్దేశాన్ని నెరవేర్చకుండ తిరిగి వెళ్ళమంటారా?" అన్నది పూంగుళలి.

"అమ్మాయీ! నీవు మగపిల్లాడిగా పుట్టివుండాలి. అప్పుడు ఒక పెద్ద సామ్రాజ్యానికి సర్వాధికారిగా ఉండేదానివి. అది పోతేపోనీ. ఇది విని, న్యాయం చెప్పు! ఒకరిని చంపవచ్చి అనుకోకుండా ఇంకొకరిని చంపినవాడి మీద హత్యానేరం మోపవచ్చా?"

"మీ ప్రశ్న నాకర్థం కావడంలేదు. చంపినవాడు హత్యానేరం చేసినవాడే కద?"

"అదెలా చెప్పగలం? రామాయణం వినేవుంటావు. దశరథుడు ఏనుగు నీళ్ళు తాగుతూందని ఎంచి బాణం వదిలాడు. అది ఋషికుమారునికి తగిలింది. ఋషికుమారుని చంపిన నేరానికి దశరథుడు శిక్షించబడ్డాడా? లేదు! ఇప్పుడు నీవు వెన్నంటి వచ్చిన సోమన్ శాంభవన్ని తీసుకో. వాడు చక్రవర్తిని చంపేందుకు శూలాన్ని విసిరాడు. కానీ చక్రవర్తి సజీవంగానే ఉన్నారు. నీ అత్త అడ్డుపడి శూలం దెబ్బ తిని మరణించింది. ఆమె ఆత్మహత్య చేసుకొన్నట్లే కద? మరి సోమన్ శాంభవన్ మీద హత్యానేరం ఎలా మోపగలం?"

"వైష్ణవులుగారూ! మీ న్యాయశాస్త్రం చాల విచిత్రంగా ఉంది..."

"నా న్యాయశాస్త్రం మాత్రం కాదు. సర్వలోక నాయకుడైన నారాయణమూర్తి న్యాయశాస్త్రమే విచిత్రమైనది. ఈ లోకంలో పాపం చేసేవారు మంచి వాళ్ళు. పుణ్యాత్ములు - కష్టాలనుభవించి ప్రాణాలు కోల్పోతున్నారు. దీనికంతా దేవుని న్యాయం ఉండే తీరాలి కద?"

"మీరూ, మీ నారాయణుడూ నాకప్రస్తుతం. నేను నాకు తెలిసిన న్యాయాన్ని నెరవేర్చే తీరుతాను."

"పూంగుళలీ! నేను నీకోసం మాత్రం ఈ విషయాన్ని ప్రస్తావించలేదు. అదిగో ఆ కొండగుహాలో ఇద్దరున్నారు. వారిలో ఒకరు ఆదిత్య కరికాలన్‌గారిని చంపినవారు. కానీ కరికాలన్‌గారిని చంపాలని ఎంచి చంపలేదు. ఇంకొకరిని చంప ఉద్దేశించి విసిరిన కత్తి యువరాజు మీద పడి ఆయనను చంపింది. వారిని హంతకులని చెప్పగలమా?"

"వైష్ణవులుగారూ! నా బుద్ధిని గందరగోళం చేయకండి. కొండగుహాలో ఎవరున్నారు?"

"చోళసామ్రాజ్యపు ధనాధికారి, తంజావూరు అంతఃపురానికి సర్వాధికారి, ఇరవైనాలుగు యుద్ధాల్లో పాల్గొని అరవైనాలుగు గాయాలను భరించిన వీరాధివీరులు, పన్ను విధించే దేవరు, సామంతరాజుల మహానాయకులు, నందినీదేవి పతి...పెద్ద పళువేట్టరయ్యర్ ఆ గుహాలో ఉన్నారు....!"

~

ఇలా ఆళ్వార్ కట్టియాన పెద్దగా/ఢంకా భజాయించినట్లు, అందరికీ వినిపించేటట్లు చెప్పాడు. అదే సమయాన రవిదాసు, దేవరాళన్, సోమన్ శాంభవన్ మొదలైనవారు గబగబా పరుగెత్తుకొంటూ వచ్చారు. పూంగుళలి చటుక్కున అవతలికి జరిగి/ఒదిగి నిలబడింది. వచ్చినవారు ఆళ్వార్ కట్టియాన్ని చుట్టుముట్టారు. రవిదాసు చేత ఒక చిన్న బడితె పట్టుకొనివున్నాడు. దాన్ని పైకెత్తి రవిదాసు, "ఒరే వేషధారి వైష్ణవా! అనిరుద్ధుని గూఢచారీ! చివరికి మాచేత చిక్కుబడ్డావు కద? మేము చేసిన మూడు ప్రయత్నాల్లో ఒక్క దాంట్లో మాత్రమే గెలుపొందాము. తక్కిన రెండింటా ఓడిపోయాము. ఆ ఓటముల గురించి మాకిక దిగుల్లేదు. మూడేళ్ళుగా వెతుకుతున్న నిన్ను పట్టేసుకొన్నాం కద? ఈసారి మానుంచి తప్పుకోలేవు!" అన్నాడు.

వెంటనే ఆళ్వార్ కట్టియాన్ మునుపటి కన్న పెద్ద గొంతుతో, "అయ్యా! [అప్పనే] వెతికే వాళ్ళెవరు? తప్పించుకొని పారిపోయేవారెవరు? అందరూ సాక్షాత్తు ఆ నారాయణమూర్తి బిడ్డలే కద? అతని అనుమతి లేనిదే ఈ లోకంలో ఒక్క అణుపైన కదలగలదా? రవిదాసా! నీవూ విను! నీతోటివారు కూడ విననీ. చిల్లర దేవుళ్ళను వదిలి, సాక్షాత్తు మహావిష్ణువును శరణు కోరండి! భగవంతుడు మీ పాపాలన్నిటినీ క్షమించి కాపాడుతాడు! మానవమాత్రుల కోసం కష్టపడి/ఊడిగం చేసి మీ జీవితాన్ని వృధా చేయకండి. నారాయణుని కొలిచి, నరజన్మనెత్తిన ఫలాన్ని పొందండి. పరమపదంలో మీకు చోటు వెతకండి! ఏదీ! అందరూ నాతో చేరి పాడండి, చూద్దాం..."

"నారాయణుడే దైవం....
మనమందరమూ స్తుతిద్దాం!"

అని పాడనారంభించాడు.

~

రవిదాసు గలగల నవ్వేసి, "ఏమయ్యా! వైష్ణవా! సాక్షాత్తు పరమశివుడు మాత్రం దైవం కాడా? పరమశివుని స్తుతిస్తే పరమపదం దొరకదా?" అన్నాడు.

ఆళ్వార్ కట్టియాన్ ఉత్సాహంతో, "పరమశివుడు లయకారుడు. నారాయణుడే కాపాడే దైవం! ఆనాడు మొసలి నోట చిక్కుకొన్న గజేంద్రుని మా నారాయణుడు కాపాడిన విషయాన్ని మరిచిపోయావా?" అన్నాడు.

"అయ్యా! గజరాజును కాపాడిన నారాయణమూర్తి మొసలిని చంపే కద గజేంద్రుని కాపాడాడు? అలాగే రావణుడు, కుంభకర్ణుడు, హిరణ్యాక్షుడు, హిరణ్యకశ్యపుడు, దంతవక్రుడు మొదలైనవారిని మీ నారాయణుడు నాశనం చేయలేదా?" అన్నాడు రవిదాసు.

"మా పెరుమాళ్ళ చేత చంపబడినవారు సాక్షాత్తు శ్రీవైకుంఠానికి చేరుకొన్నారు. నీవు చెప్పిన రాక్షసులను వధించిన తర్వాత వారికి భగవానుడు వైకుంఠప్రాప్తిని ఇచ్చాడు. మీ పరమశివుడేమో త్రిపురాసురులను ఒకేసారిగా తన మూడోకన్ను తెరిచి కాల్చి భస్మం చేసేశాడు. వారికి మోక్షాన్నిచ్చాడా?"

"సరే, సరే! నీ కథలన్నీ ఆపు! నీ నారాయణుడు ఇప్పుడు వచ్చి నిన్ను కాపాడనీ, చూద్దాం!" అని చెబుతూనే రవిదాసు తన చేతనున్న బడితెను ఎత్తాడు.

~

అప్పుడు పూంగుళలి అతడికి సహాయం చేయదలిచి, తన బొడ్లో దోపుకొన్న చురకత్తిని తీసింది. అదే సమయాన కొండగుహలోనుంచి తల విరబోసుకొని ఒక స్త్రీరూపం పరుగెత్తి రావడాన్ని గమనించింది. ఒక్క క్షణం ఆమెను తన అత్త మందాకిని అనుకొని దిగ్భ్రమించి నిలబడిపోయింది. తర్వాత, "లేదు, లేదు! ఈమె పళువూర్ రాణి నందిని" అని గ్రహించింది.

ఇంతలో నందిని ఆళ్వార్ కట్టియాన్ దగ్గరికొచ్చేసింది. రవిదాసు పైకెత్తిన బడితెను తన చేతులతో అడ్డుకొంది.

"వద్దు! నా సహోదరునేమీ చేయకండి! రవిదాసా! నేను మీ రాణినన్న మాట నిజమైతే ఆ కర్రను కింద పడవేయి!" అన్నది.

ఆళ్వార్ కట్టియాన్ అప్పుడు, "సహోదరీ! నీకు కృతజ్ఞతలు. కానీ వీరు నాకేవిధమైన హానీ చేసివుండలేరు. నేను నిత్యం పూజించే నారాయణమూర్తి నన్ను కాపాడేవారు!" అన్నాడు.

రవిదాసు నవ్వేసి, "ఎలా కాపాడేవారు? ఆనాడు ప్రహ్లాదుని కాపాడేందుకు స్తంభాన్ని బద్దలు కొట్టి బయటికి వచ్చినట్లు ఈ చెట్టును చీల్చుకొని వచ్చేవారా?" అన్నాడు.

"మంత్రవాదీ! నా మాట మీద నీకు నమ్మకం లేదా? సరే, మంచిది. అదిగో, చూడు! కాస్త దూరాన కనిపించే అయ్యనార్ కోవెలను చూడు! ఆ కోవెల ముందు మట్టి గుర్రాలున్నాయి కద?

శ్రీమన్నారాయణుని కరుణ/కృప వల్ల ఆ గుర్రాలకు ప్రాణమొస్తుంది! వాటి మీద శూలాలు పట్టుకొన్న వీరులు వచ్చి మిమ్మల్ని పట్టి బంధించి తీసుకొని వెళతారు!"

ఆళ్వార్ కట్టియాన్ పైన పేర్కొన్నట్లు చెబుతూనే వేలెత్తి చూపించిన దిశగా అందరూ చూశారు. తమ కళ్ళను తామే నమ్మలేక సతమతమైపోయారు! ఎందుకంటే, ఆ మట్టి గుర్రాలకు నిజంగానే ప్రాణం వచ్చి నిజంగానే వారివైపు దూసుకొని వస్తున్నట్లు తోచింది. ఒక్కొక్క గుర్రం మీదా శూలం పట్టుకొన్న ఒక వీరుడు వస్తున్నాడు!

~~~
~~~

# అధ్యాయము - 47

## నందిని అంతర్ధానం!

**దూసుకొస్తున్న** గుర్రాలను చూసి మొదట తేరుకొన్నది రవిదాసే.

"దేవీ! ఈ బూటకపు వైష్ణవుడు తన పనితనాన్ని చూపించేశాడు. 'వీడు గూఢచారి వీడిని నమ్మవద్దు' అని నేను చాలసార్లు హెచ్చరించాను. మనని పట్టుకోవడానికి వీడే మనుషులను తీసుకొచ్చాడు. కానీ వీడు మనని పట్టుకోలేడు. వీడి దైవమైన నారాయణుడే దిగి వచ్చినా సాధ్యం కాదు. రండి వెళదాం. గుర్రాలు వచ్చేలోపు కొండెక్కి పారిపోదాం!" అన్నాడు రవిదాసు నందినిని ఉద్దేశించి.

ఆళ్వార్ కట్టియాన్, "నందినీ! ఈ పాతకులతో నీవెళ్ళకు! నీవు వీళ్ళతో చేరినందువల్ల కలిగిన విపరీతాలు చాలు!" అన్నాడు.

నందిని ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "తిరుమలై! నేను చాలరోజులుగా ఒకటడుగుతున్నాను. అది గుర్తుందా? నా తల్లి వద్దకు నన్ను పిలుచుకొని వెళ్ళమని నిన్ను వేడుకొన్నాను. ఇప్పుడైనా నన్ను నా తల్లి వద్దకు తీసుకొని వెళతానని మాటిస్తే నీతో వస్తాను. లేకపోతే వీరితో వెళతాను!' అన్నది.

"నందినీ! ఇక అది నావల్ల సాధ్యం కాని పని" అని తిరుమలై చెప్పి ముగించేలోపు రవిదాసు అడ్డుపడి, "వీడు మిమ్మల్ని పిలుచుకొని వెళ్ళడమేమి? నేను పిలుచుకొని వెళతాను, రండి!" అన్నాడు.

"అవునవును! వీడు నిన్ను నీ తల్లి వద్దకి యమలోకానికి పిలుచుకొని వెళతాడు! నీ తల్లిని చంపినట్లు నిన్ను కూడ చంపి యమలోకానికి పంపేస్తాడు! నందినీ! ఈ పాతకుల సహవాసం ఇంకా నీకొద్దు! వీరిలో ఒకడు నీ తల్లిని చంపినవాడు! మంత్రవాది ముఖాన్ని చూడు! హత్యచేసినవాడని వాడి ముఖాన రాసివుంది చూడు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

రవిదాసు ముఖం కోపంతో ఎర్రబారగా, "అబద్ధం! అబద్ధం!" అని అరిచాడు.

~

కాసేపటి క్రితం శాంతమే రూపుగున్న నందిని కళ్ళలో ఇప్పుడు వెర్రి ఆవేశం కానవచ్చింది.

"తిరుమలై! ఇది నిజమేనా? నా తల్లి నిజంగానే చనిపోయిందా? ఆమెను నేనిక చూడలేనా?" అని అడిగింది.

"సందేహముంటే, ఇదిగో ఈ పిల్లనడిగి తెలుసుకో. వీరిలో ఒకడైన సోమన్ శాంభవన్ శూలం విసిరి నీ తల్లిని చంపాడు. ఈమె దాన్ని ప్రత్యక్షంగా చూసింది. తన అత్తను చంపినవాడిని వెన్నంటి తరుముకొంటూ వచ్చింది! పూంగుళలీ! చెప్పు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"అవును! నేనే నా కళ్ళారా చూశాను! నా అత్తను చంపినవాడి మీద పగతీర్చుకోవడానికే

వచ్చాను!" అన్నది పూంగుళలి.

~

నందిని పిచ్చిపట్టినదాని లాగ ఒక వెర్రి నవ్వు నవ్వింది. "పగ తీర్చుకోవడానికి వచ్చావా? పగ! పగ! నేనొకదాన్ని పగ తీర్చుకొన్న తీరు చాలదా?" అని చెప్పేసి రవిదాసును చూసి, "ద్రోహి! ఛండాలుడా! ఇలాగా చేశావు!" అన్నది.

"రాణీ! నీవనుకొంటున్నది పొరబాటు! నేనే ద్రోహమూ చేయలేదు. సోమన్ శాంభవన్ చక్రవర్తి మీదికి శూలాన్ని విసిరాడు. ఆ పిచ్చి మూగది అడ్డొచ్చి పడి చచ్చింది! ఆమె తలరాత! ఇప్పుడు నీవేమంటావు? మాతో వస్తావా, రావా? అదిగో, గుర్రాలు దగ్గరకొచ్చేశాయి!" అన్నాడు.

అతడి మాటలను నందిని చెవిన వేసుకొన్నట్లు అగుపించలేదు. ఉన్నట్లుండి కింద కూలబడింది. ముఖాన్ని రెండు చేతులతో కప్పుకొని, తన ఒళ్ళంతా ఎగసి పడేటట్లు వెక్కి వెక్కి ఏడ్వసాగింది. ఏడ్పుతోబాటు వెర్రినవ్వు కూడ కలగలిసి వినిపించింది.

రవిదాసు తన కూటమి సభ్యులను చూసి, "పరుగెత్తండి! పరుగెత్తి వెళ్ళి ఆ కొండెక్కి పారిపొండి! ఇక రాణిని నమ్మడం వల్ల ప్రయోజనం లేదు!" అన్నాడు.

అందరూ పరుగెత్తారు.

రవిదాసు, "వైష్ణవా! ఇదిగో నీ చేష్టలకు బహుమానం!" అని చేతనున్న బడితెతో ఆళ్వార్ కట్టియాన్ తలమీద ఒక దెబ్బ వేసి పరుగెత్తాడు.

ఆళ్వార్ కట్టియాన్ "నమో నారాయణ!" అంటూ తలను ఒకసారి తడుముకొన్నాడు.

పరుగెత్తినవారందరూ కొండ గుహ లోపలికి దూరారు. కాసేపటికల్లా కొండ గుహ పైనున్న పెద్ద గుండ్రాయి మీద నిలబడ్డారు.

~

అదే సమయాన గుర్రాలు కొండ పాదాన వచ్చి చేరాయి. సరైన దారి లేక పెద్ద పెద్ద బండరాళ్ళు దారి పొడుగునా ఉండడం వల్ల గుర్రాలు వచ్చి చేరేందుకు ఇంతసేపు పట్టింది.

గుర్రాల మీద వచ్చినవారిలో ముందున్నవారు చిన్న పళువేట్టరయ్యర్, గందమారనే అని చూసి గ్రహించాడు ఆళ్వార్ కట్టియాన్. వారి వెనక సేందన్ అముదన్ ఒక గుర్రంమీద తాటితో కట్టబడి రావడాన్ని కూడ గమనించాడు.

"రండి! రండి! మంచి సమయానికి వచ్చి చేరారు!" అన్నాడు.

చిన్న పళువేట్టరయ్యర్, గందమారన్ గుర్రాలమీదినుంచి కిందకు దూకారు.

కింద కూర్చొని వెక్కి వెక్కి ఏడుస్తున్న నందిని మీదికి వారి చూపు మళ్ళింది.

గందమారన్ నందినిని సమీపించి ఆమెకు ఏదో చెప్పాలని ప్రయత్నించాడు. కానీ అతడి నోరు

పెగల్లేదు.

చిన్న పళువేట్టరయ్యర్ ఆళ్వార్ కట్టియాన్ని చూసి, “వైష్ణవా! నీవెలా ఇక్కడికి వచ్చావు? ఎందుకు వచ్చావు?” అని అడిగారు.

“దళపతీ! మీరు ఎవరిని వెతుక్కొంటూ వచ్చారో, నేనూ వారినే వెతుక్కొంటూ వచ్చాను. పెద్ద పళువేట్టరయ్యర్, అదిగో ఆ గుహలో ఉన్నారు!” అన్నాడు.

“నిజంగానా? సజీవంగానే ఉన్నారా" అని చిన్న పళువేట్టరయ్యర్ ఆదుర్దాగా అడిగారు.

“అవును. ఇంకా సజీవంగానే ఉన్నారు. మీ అన్నగారిని సమీపించేందుకు యముడు కూడ జంకుతాడు కద? కాబట్టి, అదిగో ఆ హంతకులు చేసిన ప్రయత్నం మీ అన్నగారి విషయంలో ఫలించలేదు!” అని చెప్పి తిరుమలై కొండ శిఖరాన నిలబడ్డ రవిదాసు మొదలైనవారిని వేలెత్తి చూపించాడు.

“వారెవరు? ఎందుకని వారిని హంతకులంటున్నావు?”

“వారే మంత్రవాది రవిదాసు, వాడి కూటమిలో చేరినవారూను. వీరపాండ్యుని ఆపత్కాల సహాయకుల దండుకు చేరినవారు. చక్రవర్తిని చంప ప్రయత్నించింది వారే; యువరాజు ఆదిత్య కరికాలనిగారిని చంపింది కూడ వారే!” అన్నాడు తిరుమలై.

గందమారన్ అడ్డుపడి, “అబద్ధం! అబద్ధం! యువరాజును చంపింది వంతిదేవుడు! నీ స్నేహితుడు చేసిన నేరాన్ని కప్పిపుచ్చేందుకు ప్రయత్నించకు!” అన్నాడు.

“మూర్ఖుడా! నోరు మూసుకో!” అని చిన్న పళువేట్టరయ్యన్ అతన్ని గద్దించారు. తర్వాత ఆళ్వార్ కట్టియాన్ని చూసి, “ ధనాధికారిని కూడ చంపజూశారా? ఎలా తప్పించుకొన్నారు?” అని అడిగారు.

“ఇదిగో, ఇక్కడ కూర్చొని ఏడుస్తున్న పళువూర్ యువరాణి సహాయం వల్లనే తప్పించుకొన్నారు!”

“యువరాణి ఎందుకేడుస్తూంది?”

“ఆమె తల్లి మరణించిందని తెలిసి ఏడుస్తూంది. ఇదంతా తర్వాత విచారించి తెలుసుకోవచ్చు కద?”

“అవునవును! పెద్ద పళువేట్టరయ్యర్ని మొదట చూడాలి. నీవెళ్ళి నేను వచ్చానని చెప్పు!”

~

చిన్న పళువేట్టరయ్యర్కి తమ అన్నగారి పట్ల ఉన్న భయభక్తులు అప్పుడు కూడ కించిత్తు తగ్గలేదు. కాబట్టి ఉన్నట్లుండి అన్నగారిని వెళ్ళి చూసేందుకు కాస్త జంకారు.

“అయ్యా! మీ అన్నగారు ఇక ఎక్కడికీ వెళ్ళిపోరు. ఇక్కడే ఉంటారు. నేను వెళ్ళి మీరు వచ్చారని చెబుతాను. అదిగో, ఆ హంతకులను పట్టుకోవడానికి మీరే ప్రయత్నమూ చేయబోవడం లేదా?”

చిన్న పళువేట్టరయ్యర్ తలమీద చేతులేసుకొని, “అవునవును! మునుపొకసారి నా బుద్ధి

ఇలాగే తప్పింది! చక్రవర్తిని చంప ప్రయత్నించిన హంతకుని పారిపోనిచ్చాను!” అన్నారు.

“వాడూ తప్పించుకొని పారిపోలేదు. అదిగో ఆ కొండపైనే ఉన్నాడు. మీ మనుషులను వెంటనే ఆజ్ఞాపించండి!”

వెంటనే దళపతి తమతో వచ్చిన వీరులను అలాగే ఆజ్ఞాపించారు. వారు గుర్రాలమీదినుంచి దిగి కాణారి నది కొండమీదినుంచి జలపాతంగా పడే చోటికి కాలినడకనే వెళ్ళి చేరుకొన్నారు.

వారక్కడికి చేరుకోగానే పైనుంచి పెద్ద పెద్ద గుండ్రాళ్ళు దొర్లి పడసాగాయి. వీరులు అవి తమ మీద పడకుండ తప్పించుకోవడానికి అటూ ఇటూ పరుగెత్తసాగారు. ఒకరిద్దరు ఆ గుండ్రాళ్ళు తగిలి కింద పడ్డారు.

చిన్న పళువేట్టరయ్యర్, “వారు పైకెలా ఎక్కారు? తెలుసా?” అని ఆళ్వార్ కట్టియాన్ని అడిగారు.

“గుహలోపలికి దూరి పైకెక్కారు. గుహ లోపల ఒక రహస్యమార్గమున్నట్లుంది. రండి, వెళ్ళి చూద్దాం!” అని ఆళ్వార్ కట్టియాన్ ముందుకు దారి తీశాడు. దళపతి, గందమారన్ అతని వెంట వెళ్ళారు.

~

గుహ లోపలినుంచి ఒక ఎత్తైన, గంభీరమైన ఆకారం పడుతూ లేస్తూ బయటకు వచ్చింది. గుహ వాకిట నిలబడి వస్తున్నవారిని పరీక్షగా చూసింది.

అన్నగారిని గుర్తు పట్టేందుకు తమ్ముడికి కాస్త సమయం పట్టింది.

ఒళ్ళంతా గాయాలతో, ముఖం పాలిపోయి ప్రేతకళ ఉట్టిపడుతున్న పెద్ద పళువేట్టరయ్యర్‌ని గుర్తు పట్టగానే, “అన్నా!” అని అరుస్తూ పరుగెత్తి వెళ్ళి అన్నగారిని కౌగలించుకొన్నారు.

అన్నగారి కళ్ళనుంచి కన్నీరు పొంగుకొచ్చింది. ఆయన, “తమ్ముడూ! నీవు చాలసార్లు హెచ్చరించావు! ఆ హెచ్చరికలను నేను పట్టించుకోక మోసపోయాను" అని పలవరించారు.

ఆ సమయాన ఆళ్వార్ కట్టియాన్, గందమారన్ గుహ లోపలికి రాజూశారు.

పెద్ద పళువేట్టరయ్యర్ వారిని అడ్డగించి ఆపి, “ఎక్కడికి వెళుతున్నారు?” అని అడిగారు.

“హంతకులు ఈ గుహ లోపలికి ప్రవేశించారు...”

“ఏ హంతకులు?”

“మంత్రవాది రవిదాసు, వాడి కూటమిలో చేరినవారు...”

“వాళ్ళు హంతకులు కారు!” అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్.

“చూశారా? వంతిదేవుడే హంతకుడని నేను చెప్పలేదా?” అన్నాడు గందమారన్.

పెద్ద పళువేట్టరయ్యర్ అతన్ని పరీక్షగా చూసి, “ఈ మూర్ఖుడు ఇక్కడికెలా వచ్చాడు?” అన్నారు.

"గందమారన్ కడంబూర్ నుంచి వార్త తీసుకొని వచ్చాడు."

"ఏం వార్త?"

"యువరాజు ఆదిత్య కరికాలన్ మరణించారన్న వార్త. మన బలగాన్ని వెంటనే కూడదీసుకొని మధురాంతకులను సింహాసనమెక్కించేందుకు ఏర్పాట్లు చేయాలని శంబువరయ్యర్ ఇతడి ద్వారా చెప్పి పంపించారు."

"ఆహ్! అలాగా?" అని పెద్ద పళువేట్టరయ్యర్ నిరాసక్తంగా అన్నారు.

తర్వాత, "తంజావూరులో పరిస్థితి ఎలా ఉంది?" అని విచారించారు.

"అన్నా! వివరంగా చెప్పాలి. మీరు చాల బలహీనంగా ఉన్నారు. దయచేసి కూర్చొని మాట్లాడుకొందామా?" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

~

ధనాధికారి గుహ వాకిటనే కూర్చొన్నారు.

"అయ్యా! కాస్త దారి వదిలితే గుహ లోపలికి వెళ్ళి కొండ పైకెక్కేందుకు దారి ఉందా అని చూడవచ్చు" అన్నాడు వైష్ణవుడు.

"ఎందుకని?" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్.

"రవిదాసు కూటమి ఈ గుహ లోపల దూరే కొండ పైకెక్కారు!" అన్నాడు తిరుమలై.

పెద్ద పళువేట్టరయ్యర్ తల అడ్డంగా ఆడించి, "గుహ లోపలికి వెళ్ళడం వల్ల ప్రయోజనం లేదు, తమ్ముడూ! వాళ్ళు పైనుంచి కొండరాళ్ళను దొర్లించి, పైకి వెళ్ళే మార్గాన్ని మూసేశారు. ఆ రాళ్ళు నా మీద పడవచ్చాయి. నేను బతికి బయటపడిందే దేవుని దయవల్ల! వెళ్ళండి! మీరిద్దరూ వెళ్ళండి! కొండమీదికెక్కడానికి ఇంకేదైనా దారి ఉంటే చూడండి!" అన్నారు.

ఆళ్వార్ కట్టియాన్, గందమారన్ అవతలికి వెళ్ళగా, పెద్ద పళువేట్టరయ్యర్ చూపు సేందన్ అముదన్, పూంగుళలిల మీద పడింది.

"వారెవరు? ఎక్కడికొచ్చారు?" అని అడిగారు.

"ఆ అమ్మాయి కోడిక్కరై త్యాగ విడంగర్‌గారి అమ్మాయి పూంగుళలి. తన అత్తను చంపినవారిని వెతుక్కొంటూ వచ్చింది. ఆమెను వెతుక్కొంటూ సేందన్ అముదన్ వచ్చాడు. అతడు మాకు దారి చూపడం వల్లనే మేమిక్కడికి వచ్చి మిమ్మల్ని కనిపెట్టగలిగాము!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

"తంజావూరులో జరిగినదంతా వివరంగా చెప్పు!" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్. చిన్న పళువేట్టరయ్యర్ అలాగే చెప్పనారంభించారు. మంత్రవాది కూటమికి చేరిన ఒకడు బొక్కసపు నేలమాళిగలో దాక్కొని, చక్రవర్తిని చంపేందుకు తగిన సమయం కోసం వేచివుండి శూలాన్ని విసిరింది, చక్రవర్తిని కాపాడేందుకు మూగరాణి మందాకినీదేవి అడ్డొచ్చి ప్రాణం విడిచిన విషయాన్ని వివరించారు. తర్వాత

ఆయన ఇంకా ఇలా ముందుకు చెప్పసాగారు:-

"అన్నా! వీటన్నిటి మధ్య కొడుంబాళూర్ వేళార్ ఒక పెద్ద సైన్యాన్ని కూడదీసుకొని వచ్చి తంజావూరు కోటను ముట్టడించనారంభించారు. మీరు లేనందువల్ల వేళార్ని ఎదుర్కొని యుద్ధం చేయడమా వద్దా అని నిశ్చయించుకోలేకపోయాను. చక్రవర్తిని సలహా అడిగేందుకు కూడ వీలు పడలేదు. ముఖ్యమంత్రి అనిరుద్ధులు కోట లోపలే ఉన్నారు. ఆయన మీరు వచ్చిన తర్వాత చూసుకొందామని, అంతవరకు కోటను కాపాడితే చాలని అన్నారు. మంచివేళగా ఇదే సమయాన యువరాజు అరుళ్మొళివర్మగారు, కొడుంబాళూర్ వేళార్ రాకుమార్తె వాణతి కోట లోపలికి వచ్చి చేరారు. యువరాజు ఏనుగు మావటి వేషంలో వచ్చారు. వాణతి పళైయారై యువరాకుమారి వద్దనుంచి అతి ముఖ్యమైన, అత్యవసరమైన వార్తను తీసుకొచ్చానని చెప్పింది. వేళార్ కుమార్తె కోట లోపల ఉండడం మనకనుకూలమే కద అని ఎంచి ఆమె ఎక్కి వచ్చిన ఏనుగును లోపలికి వదిలాను. చక్రవర్తి అంతఃపురం వాకిట ఏనుగుమావటే యువరాజు అని తెలిసింది. నేను కాస్త అదిరిపడ్డానన్నది నిజమే! అన్నా! చిన్న యువరాజు వద్ద ఏదో ఒక అతీత శక్తి ఉందనిపిస్తుంది. ఆయన దివ్యవదనాన్ని చూసిన వెంటనే నా కాళ్ళు చేతులాడలేదు; మనసు కరిగిపోయింది. నాకు తెలియకనే చేతులు జోడించాను. ఆయనకు నమస్కరించి స్వాగతించవలసి వచ్చింది. చోళనాడు ప్రజలు చిన్న యువరాజు అరుళ్మొళి వర్మను చూసి తలాతోకా తెలియక గెంతులేయడంలో ఆశ్చర్యం లేదు కద!"

"చాలు, చాలు! అది తెలుస్తూనే ఉంది కద? అరుళ్మొళి వర్మ కడలిలో మునిగిపోయారన్నది కట్టుకథ అని నేననుకొన్నది నిజమే. తర్వాత ఏం జరిగిందో చెప్పు! యువరాజు ఎందుకని ఏనుగు మావటి వేషంలో కోట లోపలికి వచ్చారు?" అని పెద్ద పళువేట్టరయ్యర్ అడిగారు.

"యువరాజని తెలిస్తే కొడుంబాళూర్ వేళార్ ఆయనను అడ్డుకొని ఆపేసేవారు. వేళార్ సైన్యం వీరులు కూడ పెద్దగా ఆర్భాటం చేస్తారని ఎంచి అలా మారువేషంలో వచ్చారట. ఆ విషయంలో యువరాజును మెచ్చుకోవలసిందే. యువరాజు చక్రవర్తిని కలిసి మాట్లాడుతున్నప్పుడే పైనుంచి హంతకుడు శూలాన్ని విసిరాడు. దైవాధీనంగా అది ఆ మూగదానికి తగిలి ఆమె మరణించింది. చక్రవర్తికి తగిలి ఆయన మరణించివుంటే, మన కులానికి ఎన్నటికీ మాసిపోని కళంకం కలిగేది!"

~

పెద్ద పళువేట్టరయ్యర్ తమలోతామే, "ఇప్పుడు మాత్రం కళంకం రాలేదా, ఏమి? తీరని కళంకం జరిగిపోయింది!" అని గొణుక్కొన్నారు.

"అన్నా! ఏమన్నారు?" అని అడిగారు చిన్న పళువేట్టరయ్యర్.

"ఏం లేదు. తర్వాతేం జరిగిందో చెప్పు" అన్నారు ధనాధికారి.

"తర్వాత ఒక పెద్ద అద్భుతం జరిగింది. చాలకాలంగా నడవలేక మంచం పట్టిన చక్రవర్తి కాళ్ళకు శక్తి వచ్చేసింది. మంచం నుంచి లేచి పరుగెత్తి వెళ్ళి ఆ మూగదాన్ని తీసి ఒడిలో వేసుకొని

విలపించనారంభించారు. కాసేపు మేమంతా ఆ దృశ్యాన్ని చూస్తూ భ్రమించి నిలబడిపోయాము. పూంగుళలి అనబడే ఈ పడవ నడిపే పిల్లే 'హంతకుడిని పట్టుకోవడానికి వెళుతున్నాను' అంటూ పరుగెత్తింది. ఆమె బాగుండాలి. ఆమె మూలంగానే నేను మిమ్మల్ని ఈ స్థితిలోనైనా చూసే భాగ్యం కలిగింది..."

పెద్ద పళువేట్టరయ్యర్ కళ్ళ నీళ్ళు పొంగగా, "తమ్ముడూ! పురాణాల్లో అన్న పట్ల భక్తిగొన్న తమ్ముళ్ళ గురించి చదివాను, విన్నాను. కానీ నీలాంటి భక్తిగొన్న తమ్ముడు వారిలో ఎవరూ లేరు. అదలా ఉండనీ. తర్వాతేం జరిగిందో చెప్పు!" అన్నారు.

"పూంగుళలిని వెన్నంటి నేను కూడ బొక్కసపు నేలమాళిగలోని సొరంగమార్గంలో చొరబడ్డాను. అక్కడ చీకటిలో ఒకడిని పట్టుకొన్నాను. వాడే హంతకుడనుకొన్నాను. కానీ గొంతు వినగానే మధురాంతకుడని తెలిసింది."

"వాడెందుకు నేలమాళిగ మార్గంలో వచ్చాడట?"

"అది నాకు తెలియలేదు. అడిగితే బదులు చెప్పలేదు కూడాను. వాడే హంతకుడని ఎవరికైనా సందేహం కలిగితే ఏం చేయడమని నాకు భయమేసింది..."

"ఒకవేళ అదే నిజమేమో?"

"లేదన్నా, లేదు! ఆ సాధుపిల్లాడు అంతదూరం వెళ్ళలేడు. అదీగాక, శూలాన్ని విసిరి పారిపోయినవాడిని నేనే కళ్ళారా చూశాను. మధురాంతకుడు బొక్కసపు నేలమాళిగనుంచి బయటకు రావడానికి అంత సులభంగా ఒప్పుకోలేదు. వాడికి మెల్లగా నచ్చజెప్పి అంతఃపురానికి తీసుకొని వచ్చి చేర్చి కాపలా కూడ పెట్టి మళ్ళీ బొక్కసపు నేలమాళిగకు వెళ్ళాలనుకొన్నాను. అంతలోపల, ఇంకొన్ని పెద్ద సంభవాలు జరిగిపోయాయి. 'చక్రవర్తి చనిపోయారు' అని, వారిని ఎవరో హత్య చేసేశారని బయట వదంతి వ్యాపించేసింది. వెంటనే కొడుంబాళూర్ వేళార్ కోటను ముట్టడించమని ఆజ్ఞాపించారట. వేళార్ దండుతోబాటు కైక్కోళార్ దండు కూడ వచ్చి చేరింది. మన వీరులు ఆ సమయాన యుద్ధానికి ఆయత్తంగా లేరు. వారికి ఆజ్ఞ ఇవ్వడానికి నేను కూడ కోట ముఖద్వారం దగ్గర లేను. కాబట్టి వేళార్ వీరులు, కైక్కోళార్ దండు వీరులు కోట ద్వారాన్ని విరగగొట్టి, కోట గోడమీదెక్కి దూకి లోపలికి రానారంభించారు. ఈ వార్త విని నేను కోట వాకిలి చేరే లోపు పదహారువేలమంది వీరులు లోపలికొచ్చేశారు. మనవీరులేమో రెండువేలమంది మాత్రమే. వారు బయటినుంచి వచ్చినవారిని ధైర్యంగా ఎదిరించి పోరాడారు. నేను వెళ్ళి ఆజ్ఞాపించి యుద్ధాన్ని ఆపించాను. మనవీరులందరినీ ఒకచోట సమీకరించాను. ఇక కోట లోపల ఉండడం వల్ల ప్రయోజనం లేదని ఎంచి మన వీరులను తీసుకొని కోట నుంచి బయటపడ్డాను. వేళార్, కైక్కోళార్ వీరులు మమ్మల్ని అడ్డుకొని ఆపజూశారు. అడ్డుకొన్నవారందరినీ తెగనరికి బయటకొచ్చేశాము. 'పళువూర్ కుటుంబీకులకు గాని, మధురాంతక దేవరికి గాని కించిత్తు హాని కలిగించినా, కొడుంబాళూర్ వంశాన్ని సమూలంగా నాశనం చేసేస్తాను' అని బూది విక్రమకేసరికి వార్త పంపించాను. తర్వాత మీరు కడంబూర్‌లో

ఉంటారని ఎంచి మిమ్మల్ని కలిసేందుకు వేగంగా వచ్చాను. ఎదురుగా కుడమురుట్టి నదీతీరాన గందమారన్ గుర్రంమీద అఘమేఘాలమీద వస్తుండడాన్ని చూశాను. పళువూర్ చిహ్నం పొదిగిన జెండాను చూడగానే ఆగాడు. అతడు తీసుకొచ్చిన వార్త నన్ను మరింత ఆశ్చర్యానికి గురిచేసింది. మీరు తంజావూరుకు బయలుదేరి కొన్నాళ్ళు గడిచాయని, మీకు శంబువరయ్యర్ వార్త పంపించారని చెప్పాడు. మీరు తంజావూరుకు వచ్చి చేరనేలేదని తెలిసి అతడు కూడ అవాక్కైనాడు. తర్వాత శంబువరయ్యర్ ఏం సందేశం చెప్పి పంపారో అదైనా తెలియజేయమని అడిగాను. యువరాజు కరికాలన్ మరణించారని, వంతిదేవుడే ఆయనని చంపాడని, కాబట్టి మధురాంతకులను సింహాసనమెక్కించేందుకు ఇదే తగిన సమయమని, అందుకు కావలసిన ప్రయత్నాలను వెంటనే చేయాలని, మన పక్షానికి చెందినవారికందరికీ తాళపత్ర సందేశం పంపి సైన్యాన్ని తరలించుకొని రావాలని పెద్ద శంబువరయ్యర్ చెప్పి పంపారు. ఇది కూడ నాకు సబబేననిపించింది. మీరు కూడ మన సైన్యాన్ని కూడదేసే ప్రయత్నంలోనే నిమగ్నమైవున్నారని, త్వరలోనే వచ్చేస్తారని అనుకొన్నాను. మన పళువూర్ సైన్యాలను మణ్ణి నదికి, కొళ్ళిడం నదికి మధ్య తిరుప్పురంపయం మెట్ట మీదకు తీసుకొని వెళ్ళి నిలిపాను. వెంటనే తాళపత్రాలు రాయమని చెప్పి, మళపాడి మళవరాయర్, కుండ్రత్తూర్ కిళార్, ముమ్ముడి పల్లవరాయర్, తానత్తొంగి కళింగరాయర్, వణంగాముడి మునైతరయ్యర్, దేవసేనాధిపతి పూవరయ్యర్, సింగముత్తయ్యర్, రెట్టైకుడై రాజాళియార్ మొదలైనవారందరికీ తమ సైన్యాలను కూడదీసుకొని వీలైనంత త్వరగా తిరుప్పురంపయానికి వచ్చి చేరమని అశ్వారూఢులైన దూతల ద్వారా సందేశాలు పంపాను. అన్నా! మీరు ఏమాత్రం దిగులుపడకండి! కొడుంబాళూర్ వేళార్ని, తిరుక్కోవలూర్ మలైయమాన్ని మళ్ళీ తలెత్తనట్లు తుడిచిపెట్టేద్దాం. తంజావూరు కోటను మళ్ళీ చేజిక్కించుకొందాం. మధురాంతక దేవరిని సింహాసనమెక్కిద్దాం!" అని చిన్న పళువేట్టరయ్యర్ ఉత్సాహంతో గర్జించారు.

~

కానీ ఆయన మాటలు పెద్ద పళువేట్టరయ్యర్కి ఏమాత్రం ఉత్సాహాన్ని కలిగించినట్లు తోచలేదు. ఆయన చూపులు ఉన్నట్లుండి ఇంకొకవైపు మళ్ళాయి!

"తమ్ముడూ! అదెవరు? ముఖాన్ని చేతులతో కప్పుకొని ఏడుస్తున్నదెవరు?" అని అడిగారు.

"అన్నా! తెలియలేదా? ఆమే పళువూర్ యువరాణి! పాపం! మిమ్మల్ని కాపాడడంలో చాల కష్టపడినట్లున్నారు కాబోలు! ఆమె గురించి నేను లోటుగా చెప్పిందంతా మరిచి, నన్ను క్షమించండన్నా! మంత్రవాది రవిదాసు, వాడి కూటమి సభ్యులు మిమ్మల్ని చెరపట్టి తీసుకొచ్చారని, యువరాణే వారిని వెన్నంటి వచ్చి మిమ్మల్ని కాపాడిందని తెలుసుకొన్నాను. అది నిజమే కద?" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

పెద్ద పళువేట్టరయ్యర్, "అవునవును! యువరాణే నన్ను కాపాడింది. నందిని నాకు

శైత్యోపచారాలు చేసివుండకపోతే నీవు నన్ను ప్రాణాలతో చూడగలిగేవాడివి కావు. లోకానికి నిజం తెలిసేదే కాదు!" అన్నారు.

"యువరాణి సాటిలేని సద్గుణం నాకే తెలియకపోయింది కద? లోకానికెలా తెలుస్తుంది?" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

పెద్ద పళువేట్టరయ్యర్ దాన్ని పట్టించుకోక, "నందిని ఇంకా ఇక్కడినుంచి వెళ్ళిపోలేదా? గుహ లోపలి మెట్లగుండా పారిపోయినవారితోబాటు వెళ్ళిపోయి ఉంటుందని కద అనుకొన్నాను?" అన్నారు.

"మిమ్మల్ని వదిలేసి యువరాణి ఎలా వెళుతుందన్నా?" అని అడిగారు చిన్న పళువేట్టరయ్యర్.

"అది పోనీ. మీరు నేనిక్కడున్నానని ఎలా కనిపెట్టుకొని వచ్చారు?" అని పెద్దాయాన అడిగారు.

"తిరుప్పురంపయం పళ్ళిప్పడై దగ్గర మేము విడిది చేశాము. గందమారన్ కొళ్ళిడం నదీతీరం వెంబడి కాపలా కాస్తున్నాడు. అక్కడ సేందన్ అముదన్ పడవెక్కజూస్తుండగా అతన్ని పట్టుకొని వచ్చాడు. సేందన్ అముదన్ మునుపొకసారి వంతిదేవుడు తప్పించుకొని పారిపోవడానికి సహాయం చేసినందుకు వాడిని నేను కొంతకాలం చెరలో ఉంచిన విషయం మీకు గుర్తుండే ఉంటుంది. వాడిమీద గందమారన్‌కి ఇప్పటికీ చాల కోపం. ఇప్పుడు కూడ ఏదో గూఢచారి పని చేస్తున్నాడని సందేహించి పట్టుకొచ్చాడు. వాడిని విచారించినప్పుడు మీగురించి తెలిసింది. వాడి మామ కూతురు పూంగుళలి ఒంటరిగా ఎవరో హంతకుని వెతుక్కొంటూ వెళ్ళిందని విని వీడు ఆమెను వెతుక్కొంటూ బయల్దేరాడట. పూంగుళలి వాడు తనతో రాకూడదని చెప్పి వెనక్కి పంపించేసిందట. అయినా వీడు ఆమెకు తెలియకుండ వెంబడించి వెళ్ళాడట. అప్పుడు పళ్ళిపడై సమీపాన కొందరు కుట్రదారులు గుమిగూడి మాట్లాడుకొంటుండడాన్ని చూసి, వారికి తెలియనట్లు దాక్కొని వారి మాటలను విన్నాడట. అప్పుడే రవిదాసు కూటమి మిమ్మల్ని చెరపట్టి పచ్చమలై ప్రాంతానికి తీసుకొని వెళ్ళారని తెలుసుకొన్నాడట. పూంగుళలి, వైష్ణవుడు ఆళ్వార్ కట్టియాన్ పచ్చమలైకి వెళుతున్నారని తెలుసుకొని, వారికి తెలియకుండ వారిని వెంబడించి వెళ్ళేందుకు ప్రయత్నించాడట. ఇది వినగానే నేను, గందమారన్ యాభై వీరులను వెంట తీసుకొని బయలుదేరాము. సేందన్ అముదన్ తాను కూడ వస్తానని పట్టుబట్టాడు. అది కూడ మంచిదని వాడిని ఒక గుర్రం మీద కట్టిపడేసి పిలుచుకొని వచ్చాము! వచ్చింది మంచిదైంది. మిమ్మల్ని వెతికి కనిపెట్టాం! ఇక ఏం దిగులు? అన్నా! వెంటనే బయలుదేరండి. మీకు ఏమాత్రం శ్రమ కలగకుండ మిమ్మల్ని మోసుకొని వెళ్ళడానికి మనుషులను ఏర్పాటు చేశాను. ఇప్పటికి తిరుప్పురంపయంలో పెద్ద సైన్యం వచ్చి చేరి ఉంటుంది. తంజావూరు కోటను ఒక జాము సమయం లోపల మళ్ళీ చేజిక్కించుకోవచ్చు!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

"అవును! తంజావూరుకు వెంటనే వెళ్ళవలసిందే!" అని చెబుతూనే పెద్ద పళువేట్టరయ్యర్ లేచి

నిలబడ్డారు. నందిని కూర్చొనివున్న చోటువైపు మెల్లమెల్లగా నడిచారు.

~

ఇంతసేపూ ఒక రాతిబండ మీద కూర్చొని వెక్కి వెక్కి ఏడుస్తున్న నందిని, పెద్ద పళువేట్టరయ్యర్ గొంతు సవరించుకొన్న గర్జనను విని అదిరిపడి లేచి నిలబడింది. అటూ ఇటూ వెర్రిచూపులు సారించింది.

ఆమెకు అతిసమీపాన నిలబడివున్న ఆళ్వార్ కట్టియాన్ మెల్లని గొంతుతో, “నందినీ! ఇప్పటికీ మించిపోలేదు. నీ సమ్మతాన్ని తెలియజేయి! నాతో వస్తానని ఒక్క మాట చెప్పు! ఈ నాడును వదిలి ఉత్తరదేశానికి వెళదాం. బృందావనం, ఉత్తర మధుర, అయోధ్య, కాశి, హరిద్వారం మొదలైన పుణ్యక్షేత్రాలకు యాత్ర వెళ్దాం. శ్రీమన్నారాయణుని దివ్యనామాన్ని జపిస్తూ, ఆళ్వారుల పాశురాలను పాడుతూ మన జీవితాన్ని ఆనందమయంగా గడుపుదాం. నేను నా రాజకీయ కార్యాలను వదిలిపెట్టి నీతో రావడానికి సిద్ధంగా ఉన్నాను!” అన్నాడు.

నందిని నీళ్ళు నిండిన కళ్ళతో అతన్ని చూస్తూ, “తిరుమలై! నేను నీకింత ద్రోహం చేసినా నీవు నాపైగొన్న ఆప్యాయత, అభిమానం తరగలేదు. నిన్ను నీవు పూజించే నారాయణుడు కరుణిస్తాడు!” అన్నది.

అదే సమయాన పూంగుళలి సేందన అముదన్‌తో, “అదిగో! పళువూర్ యువరాణిని చూడు! నా అత్తలాగే ఉంది కదూ?” అని అడిగింది.

“అవును. తల విరబోసుకొంటే అచ్చం నీ అత్తలాగే ఉంది!” అన్నాడు సేందన్ అముదన్.

“ఇక మీదట ఈమే నా అత్త. అత్త మీద ఇన్నాళ్ళు నాకున్న ప్రేమను పళువూర్ రాణి మీద చూపుతాను!” అన్నది పూంగుళలి.

“నన్ను కూడ చేర్చుకో, పూంగుళలీ!” అన్నాడు అముదన్.

~

ఇంతలో పెద్ద పళువేట్టరయ్యర్ నందిని నిలబడ్డ చోటికి వచ్చేశారు.

అది చూసిన నందిని ఆయన ముందు నేలమీద సాష్టాంగంగా నమస్కరించింది. ఆయన పాదాలను తాకి కళ్ళకొత్తుకొంది.

నేలమీది నుంచి లేవగానే నందిని పెద్ద పళువేట్టరయ్యర్‌ని ఒక్కసారి చూసింది. వెంటనే చటుక్కున తిరిగింది. కాస్త దూరాన చిన్న పళువేట్టరయ్యర్ వీరులు ఎక్కి వచ్చిన గుర్రాలమీద ఆమె చూపు నిలిచింది. అవి నిలబడ్డ చోటు వైపు అతివేగంగా పరుగెత్తింది. అన్నింటికన్న ముందు నిలబడ్డ గుర్రం మీదికి ఒక్కదూకుతో ఎగిరి కూర్చొంది. గుర్రపు ముక్కుతాడును చేత పట్టుకొని ఒక్కసారి విదిలించి గుర్రాన్ని తట్టింది. గుర్రం ముందుకు దూసుకొని వెళ్ళింది.

అంతవరకు నందిని ఉద్దేశమిదని తెలియక చేష్టలుడిగి నిలబడ్డవారు ఇప్పుడు ఆమెను వెంబడించ ప్రయత్నించారు. చిన్న పళువేట్టరయ్యర్, ఆళ్వార్ కట్టియాన్, పూంగుళలి, అముదన్ - అందరూ ఒకడుగు ముందుకు వేశారు.

పెద్ద పళువేట్టరయ్యర్ "ఆగండి!" అని గర్జించారు.

అందరూ మళ్ళీ చేష్టలుడిగి నిలబడిపోయి ఆయన్నే చూడసాగారు.

అతివేగంగా దూసుకెళ్ళిన ఆ గుర్రం త్వరలోనే కొండపాదాన ఒక మలుపు తిరిగింది.

గుర్రం వారి కనుచూపు మేర దాటి మరుగైంది.

అవును. పళువూర్ యువరాణి నందిని కూడ మరుగైంది. ఇక ఆమెను మనం ఈ కథలో చూడబోము.

ఒకవేళ, చాల ఏళ్ళ తర్వాత, ఇంకొక చోట, ఇంకొక సందర్భంలో చూడవచ్చేమో. ఎవరు చెప్పగలరు?

~~~
~~~

# అధ్యాయము - 48

## "నీవు నా కొడుకువి కావు!"

**ఆదిత్య** కరికాలన్ అంతిమయాత్ర కావేరి నదీతీరం వెంబడి తంజావూరు వైపు వెళుతున్నప్పుడు ఆ ఊరేగింపులో లక్షలాది చోళదేశప్రజలు చేరారు. ఆ రోజుల్లో తమిళనాడులో వీరులకు నివాళులర్పించి కొనియాడే సంప్రదాయం ప్రబలంగా ఉండేది. మధ్యలో చోళవంశం కాస్త సన్నగిల్లి, విజయాలయ చోళుని కాలం నుంచి మళ్ళీ తలెత్తి బలీయం కావడాన్ని చూశాం కద? నూరేళ్ళుగా ఆ వంశంలో పుట్టిన వీరులు శౌర్యప్రతాపాల్లో ఒకరినొకరు మించినవారుగా ఉంటూ వచ్చారు. విజయాలయుని కుమారుడైన ఆదిత్య వర్మ పల్లవుల కీర్తిప్రతిష్ఠలను తుడిచిపెట్టి తొండైమండలాన్ని కైవసం చేసుకొన్నాడు. అతని కొడుకు పరాంతక చక్రవర్తి మధురైని, ఈలాన్ని (లంకను) జయించి దక్షిణనాడునంతటినీ తన పాలన కిందకు తీసుకొచ్చాడు. పరాంతక చక్రవర్తి కొడుకులు నలుగురూ వీరశౌర్యలలో ఒకరినొకరు మించినవారు. వారిలో ఒకడు పాండ్యనాడు పోరులో మరణించాడు. ప్రథమపుత్రుడైన రాజాదిత్యుడేమో సముద్రంలాగ పొంగి వచ్చిన కణ్ణరదేవుని మహాసైన్యంతో తక్కోలం వద్ద యుద్ధం చేసి ఆ మహాసైన్యాన్ని నాశనం చేసిన తర్వాత యుద్ధరంగంలోనే వంచన వల్ల చంపబడి, 'ఏనుగుమీద మరణించిన దేవర'య్యాడు. గండరాదిత్యులు శివభక్తులైనా కూడ వీరత్వంలో ఏం తక్కువ కారు. తర్వాత ఆట్రూర్‌లో మరణించిన అరింజయుని గురించి చెప్పనవసరం లేదు. అరింజయుని కుమారుడైన సుందర చోళుని కాలంలో తక్కోలం పోరు తర్వాత కాస్త సన్నగిల్లిన చోళవంశకీర్తి మళ్ళీ మహోన్నతశిఖరాలనందుకొంది.

ఇలా తరతరాలుగా వచ్చిన వీరపరంపరలో పుట్టిన ఆదిత్య కరికాలన్‌కి ఏడ్చేవారు లేరు, శత్రువులూ లేరు అని ఏకకంఠంతో అన్నమాటే ఎక్కడ చూసిన వినిపించసాగింది. పన్నెండోయేట అతడు శేవూర్ యుద్ధంలో చేసిన వీరధీరకృత్యాలు అర్జునకుమారుడైన అభిమన్యుని కీర్తిని కూడ వెలతెలాపోయేటట్లు చేశాయి కద?

~

ఇటువంటి వీరాధివీరుడు కొన్నేళ్ళుగా తంజావూరుకు రాక కంచిలోనే ఉండడానికి కారణం గురించి పలువిధాలైన వదంతులు ప్రచారంలో ఉండేవి. సామంతరాజులు కుట్ర పన్ని మధురాంతకునికి పట్టం కట్టే ఉద్దేశంతో ఆదిత్య కరికాలన్ని తంజావూరువైపు రాకుండ చేశారన్నది ఒక వదంతి. గతంలో కరికాల్ వళవన్ ఉత్తరదేశం మీద దండెత్తి వెళ్ళి హిమాలయ పర్వతం మీద పులిజెండాను నాటి వచ్చినట్లు, అదే పేరుగొన్న ఆదిత్య కరికాలన్ కూడ అదేలాగ చేయగోరుతున్నానని శపథం చేశాడని, ఆ శపథాన్ని నెరవేర్చక తంజావూరుకు తిరిగి రాగోరడం లేదని, అందుకు పళువేట్టరయ్యర్ మొదలైనవారు అడ్డు

నిలబడ్డారని ఇంకొక వదంతి.

కాబట్టి ఉన్నట్లుండి ఒకరోజు ఆదిత్య కరికాలన్ మరణించారని, కడంబూర్ మాళిగలో వంచనతో చంపబడ్డారని వార్త రాగా, చోళనాడు ప్రజల మనఃస్థితి ఎంత కల్లోలమైవుంటుందో చెప్పనవసరం లేదు కద?

ఆ వీరపురుషునికి అంతిమ గౌరవమర్యాదలు చేసేందుకు చోళనాడు ప్రజలు లక్షల సంఖ్యలో తరలి వచ్చారనడంలో కూడ ఆశ్చర్యం లేదు కద?

ఊరేగింపు తంజావూరును సమీపించే కొద్దీ, జనకూటమి జనసముద్రమే అయ్యింది. తంజావూరు నగరప్రజలు, తంజావూరు కోటను చుట్టుముట్టిన దక్షిణసైన్యవీరులు, ఆ కూటమిలో చేరారు. కోట లోపలికి అనుమతిస్తే, పలువిపరీతాలు జరగవచ్చని ముఖ్యమంత్రి అనిరుద్ధులు హెచ్చరించగా, దుఃఖసముద్రంలో మునిగివున్న చక్రవర్తి, ఆయన కుటుంబీకులు కోట బయటకే వచ్చేశారు.

సుందరచోళ చక్రవర్తిని చూడగానే ఆ మహాకూటమిలో ఒక పెద్ద హాహాకారం లేచింది. "సుందర చోళ చక్రవర్తి చోళనాడును ఏలేటప్పుడు 'హా' అన్న శబ్దమే వినపడలేదు" అని కొన్ని శాసనాలు చెబుతున్నాయి. ఆదిత్య కరికాలన్ మరణానికి మునుపున్న పరిస్థితిని ఆ శిలాశాసనాలు వర్ణిస్తున్నాయి.

ఈరోజేమో "హా! హా!", "అయ్యో!" అన్న శబ్దాలు లక్షలకొద్దీ ప్రజల గొంతులనుంచి వెలువడ్డాయి. అభిమన్యుని బలి ఇచ్చిన అర్జునుని జ్ఞాపకం చాలమందికి వచ్చింది. అయితే అభిమన్యుడేమో శత్రుసైన్యాల వ్యూహం మధ్య అసహాయ వీరశూర కృత్యాలు చేసి మరణించాడు.

ఇక్కడేమో ఆదిత్య కరికాలన్ మధురాంతకుని రాజ్యకాంక్ష వల్లను, చిన్నరాజుల అధికారదాహం వల్లను కుట్రకు గురై హత్యచేయబడ్డాడు. ప్రజల మనసుల్లో గూడుకట్టుకొన్న ఈ అభిప్రాయాన్ని దృఢపరిచే కార్యాలు కూడ కోట బయటే జరిగాయి.

~

ఆదిత్య కరికాలన్ నిర్జీవదేహం కోట బయట అందరూ చూడగలిగేటట్లు పెట్టబడింది. అందరూ వచ్చి చూసి కన్నీరు విడిచి వెళ్ళారు. కానీ మధురాంతకుడు మాత్రం రాలేదు. పళువేట్టరయ్యర్లు కూడ రాలేదు.

పళువేట్టరయ్యర్లు తమ మిత్రులను సైన్యాలతోబాటు ఒక్కుమ్మడిగా సమీకరిస్తున్నారని వదంతి కూడ మొదలైంది.

కాబట్టి ఆదిత్య కరికాలన్ వీరమరణానికి తగిన మర్యాదలు చేయబడి, చక్రవర్తి కుటుంబీకులు కోట లోపలికి తిరిగి వెళ్ళిన తర్వాత కూడ జనకూటమి త్వరితంగా చెదరిపోలేదు.

మధురాంతకుని, పళువేట్టరయ్యర్లను నిరసించే నినాదాలు మొదట మెల్లగా మొదలై, రాను రాను బలం పుంజుకొన్నాయి.

ఉన్నట్లుండి జనకూటమిలో కొందరు కోట వాకిలిని విరగగొట్టి తంజావూరు నగరం లోపలికి

ప్రవేశించారు. మొదట వాళ్ళు పళువేట్టరయ్యర్ల మాళిగకు వెళ్ళారు. బయట నిలబడి, "పళువేట్టరయ్యర్లు చావాలి!" అని ఘోషించారు.

ముఖ్యమంత్రి అనిరుద్ధుల ఆజ్ఞ ప్రకారం వేళక్కార దండు వీరులు వచ్చి వారిని చెదరగొట్టవలసి వచ్చింది.

ఇంతలో మధురాంతకుడు ముఖ్యమంత్రి ఇంట్లో దాక్కొని ఉన్నాడన్న వదంతి లేచింది. ప్రజలు వెళ్ళి అనిరుద్ధుల ఇంటిని చుట్టుముట్టారు.

"ఎక్కడ ఆ పేడి మధురాంతకుడు? బయటకు రమ్మనండి!" అని కేకలేశారు.

~

ఆ సమయాన మధురాంతకుడు నిజంగానే అనిరుద్ధుల ఇంట్లోపలున్నాడు. బయట ప్రజలు చేస్తున్న ఘోష విని, అతడు గడగడ వణికాడు. అనిరుద్ధులను చూసి, "ముఖ్యమంత్రీ! నన్నెలాగైనా కోట బయటకు పంపించేయండి. రహస్య సొరంగమార్గం గుండా పంపించేయండి. నన్నాదరించే స్నేహితుల దగ్గరికి వెళతాను. మీరు నాకీ సహాయం చేస్తే, నేను చోళసింహాసనమధిష్టించే పక్షాన మిమ్మల్నే నా ముఖ్యమంత్రిగా నియమించుకొంటాను" అన్నాడు.

"అయ్యా! సింహాసనమెక్కే విషయం గురించి ఇప్పుడెందుకు మాట్లాడాలి? ఇంకా సుందర చోళ చక్రవర్తి సజీవంగానే ఉన్నారు కద?" అన్నారు ముఖ్యమంత్రి అనిరుద్ధులు.

"సుందర చోళులు తమ కుమారుని అంతిమ క్రియలు చేసి తిరిగి రావడాన్ని మీరు చూడలేదా?ఆయన ముఖంలో ప్రేతకళను గమనించలేదా? నేనీ మేడ మీదినుంచి చూస్తూనే ఉన్నాను. ఆయన ఇక చాలకాలం బతకరు. నేను గాని, అరుళ్మొళిగాని సింహాసనమెక్కి రాజ్యమేలాలి. సుందర చోళ చక్రవర్తి నాకే పట్టం కట్టేందుకు ఇష్టపడుతున్నారు. మీరు, అమ్మ అందుకు అడ్డొస్తున్నారు!" అన్నాడు మధురాంతకుడు.

"యువరాజా! మీ అమ్మగారు అడ్డు నిలవడానికి కారణం లేకుండపోతుందా? అదిగో, వినండి ఈ ఇంటిని చుట్టుముట్టిన ప్రజల ఘోషను. సుందర చోళ చక్రవర్తి మాత్రం ఇష్టపడితే చాలా? చోళనాడు ప్రజలు ఇష్టపడవద్దా?" అని చెప్పేసి, "ఆహా! ఇదేమి?" అని అనిరుద్ధులు వీధిలోకి తొంగి చూశారు.

మునుపటి ఘోషకు బదులుగా, "అరుళ్మొళివర్మగారికి జయహో", "పొన్నియిన్ సెల్వన్‌కి జయహో!", "లంకను జయించిన వీరాధివీరునికి జయహో!" అన్న జయఘోషలు లేచాయి.

అరుళ్మొళివర్మ ఒక గంభీరమైన గుర్రాన్నెక్కి అక్కడికి వస్తూ కనిపించారు. ఆయన వెంబడే ప్రజలందరూ ఘోషిస్తూ వెళ్ళారు. కాసేపటికల్లా ముఖ్యమంత్రి ఇంటిముందు నిర్మానుష్యమైంది. అనిరుద్ధుల ముందేవున్న మధురాంతకుడు కూడ ఆ దృశ్యాన్ని చూశాడు. అతడి కళ్ళు ఈసుతో ఎర్రబారాయి. "ఆహా! ఆ అబ్బాయి దగ్గర ఎలాంటి వశీకరణ శక్తి ఉందో కద?" అని తనలో తానే చెప్పుకొని కుతకుతలాడాడు.

అనిరుద్ధులు, "యువరాజా! ఈలం రాణిని చంపినవాడిని పెన్నంటి చిన్న పళువేట్టరయ్యర్ పరుగెత్తినప్పుడు మీరు ఆ పాతాళ సొరంగమార్గంలోకి ఎందుకు వెళ్ళారు?" అని అడిగారు.

"పొన్నియిన్ సెల్వన్ ఏనుగు మావటి వేషంలో అంతఃపురానికి వచ్చిన తర్వాత నాకు చాల మనఃక్లేశం కలిగింది. వాడు, నేను ఒకే సమయాన ఈ కోట లోపల ఉండడాన్ని నేనిష్టపడలేదు. పళువేట్టరయ్యర్ ఇంతకు మునుపే నాకు రహస్య సొరంగమార్గాన్ని చూపించారు. ఆ దారి గుండా వెళ్ళిపోదామా అని ఆలోచిస్తూ అంతఃపురం తోటలో పచార్లు చేస్తున్నప్పుడు, ఒక ఆగంతకుడు సొరంగ మార్గం గుండా బయటకు రావడాన్ని చూశారు. వాడు నా దగ్గరకు వచ్చి, 'యువరాజా! మిమ్మల్ని కలిసేందుకే వచ్చాను. పెద్ద పళువేట్టరయ్యర్, గందమారన్ మిమ్మల్ని వెంటనే పిలుచుకొని రమ్మని నన్ను పంపించారు. మీ సింహాసనపు హక్కును ఆదరించి మీకండగా నిలిచేందుకు మహాసైన్యాలు సిద్ధంగా ఉన్నాయి!' అన్నాడు. అతని తీరుతెన్నులు, వాలకం నాకు కాస్త సందేహాన్ని కలిగించాయి.

" 'పెద్ద సైన్యం సిద్ధంగా ఉంటే నేనెందుకు బయటకు రావాలి? వాళ్ళే ఇక్కడికొచ్చి కొడుంబాళూర్ సైన్యాన్ని ఓడించి నన్ను సింహాసనమెక్కించనీ!' అన్నాను.

"ఆ మనిషి, 'యువరాజా! అది మాత్రమే కాదు. మీ పుట్టుకలో ఒక భయంకరమైన మర్మముంది. దాన్ని ఇంకెవరూ మీకు తెలియజేయ తెగించరు. నేను చెబుతాను!' అన్నాడు.

" 'అలాగైతే రా! వెంటనే వెళదాం' అన్నాను నేను. అందుకు వాడు 'ముఖ్యమంత్రి అనిరుద్ధులకు ఒక ముఖ్యమైన వార్తను అందజేయవలసి ఉంది. అది చెప్పేసి వస్తాను. మీరు వెళ్ళి సొరంగమార్గంలో దాక్కోండి' అన్నాడు.

"అదే విధంగా నేను బొక్కసపు నేలమాళిగలో వెళ్ళి దాక్కొన్నాను. ముఖ్యమంత్రీ! వాడు మిమ్మల్ని వచ్చి చూశాడా? నా పుట్టుక గురించిన భయంకరమైన రహస్యం ఏమైవుండవచ్చు?" అని అడిగాడు మధురాంతకుడు.

"యువరాజా! మీకా రహస్యాన్ని తెలియజేసే హక్కు మిమ్మల్ని కన్నతల్లి శెంబియన్ మహాదేవికి మాత్రమే ఉంది. నాకది ఒకింత తెలిసివున్నా, నేనది చెప్పకూడదు" అన్నారు అనిరుద్ధులు.

~

ఈ సమయాన ఆ మాళిగ వాకిట మళ్ళీ ఏదో కలకలం వినిపించింది. ముఖ్యమంత్రి మళ్ళీ తొంగి చూశారు. "ఆహా! ఇదిగో, మీ తల్లిగారే వచ్చేశారు" అన్నారు.

కాసేపటికల్లా శెంబియన్ మహాదేవి అనిరుద్ధుల ఇంటి స్త్రీలను చూసి మాట్లాడించిన తర్వాత పైమేడకు వచ్చారు. ఆ దేవి ముఖాన అప్పుడు శోకం గూడుకట్టుకొనివుంది. అనిరుద్ధులు లేచి నిలబడి వారికి మర్యాదలు చేసి ఆసనాన్ని చూపించగా వారు ఆసీనులైనారు. కాసేపు మౌనంగా నేలను చూస్తూ కూర్చొన్నారు. ఆ పైమేడలోను, మాళిగ బయట వీధిలోను నిశ్శబ్దం నెలకొనివుంది. తర్వాత శెంబియన్

మహాదేవి అనిరుద్ధులను, మధురాంతకుని ఒకసారి చూసి, "అయ్యా! నా భర్త ఈ భారాన్ని నా తలమీద పెట్టేసి స్వర్గస్థులైనారు. తప్పు చేసిందేమో నేనే. కానీ ఈ సమయాన ఆయనిక్కడ ఉంటే నేనిలా బాధపడవలసిన అవసరం వచ్చేది కాదు" అన్నారు.

అప్పుడు మధురాంతకుడు కళ్ళనుంచి కోపాగ్నిని కురిపిస్తూ, "నీవెందుకు ఇలా వేదన పడుతున్నావు? ఎందుకు తరచూ నా తండ్రి పేరెత్తుతున్నావు? తంజావూరు సింహాసనాన్ని నేనధిష్టించడమేమో తథ్యం. అందుకడ్డుగా ఉన్నవారిలో ఒకడు చచ్చాడు. అరుళ్మొళివర్మేమో వయసులో నాకన్న చిన్నవాడు. నేనూపిరితో ఉన్నంతవరకు వాడికి పట్టం కట్టబోరు. నీవు మాత్రమే అడ్డు నిలవక కరుణించాలి. అమ్మా! కన్నకొడుకుకు ద్రోహం చేసే తల్లి గురించి ఎవరైనా విన్నారా? శివభక్త శిఖామణియైన నీవు నాకెందుకు ద్రోహం చేయజూస్తున్నావు?" అన్నాడు.

"నా బిడ్డా! కన్నకొడుకుకు తల్లి విరుద్ధంగా ఉండడం భయంకరమైన ద్రోహమే. కానీ నా భర్త నాకటువంటి ఆజ్ఞ వేసి వెళ్ళారు. ఆయన ఆజ్ఞను నెరవేర్చడం నా కర్తవ్యం. చెబుతాను, విను! రాజ్యకాంక్ష చాల చెడ్డది. తలమీద కిరీటం ధరించినవారి కన్న ఈ లోకంలో ఎక్కువ దిగులు పడేవారుండరు. సింహాసనం మీద ఆసీనులైనవారిలాగ మనశ్శాంతిని కోల్పోయేవారు కూడ ఇంకెవరూ లేరు. తలమీద కిరీటం ధరించినందువల్లనే కద వీరపాండ్యుడు ప్రాణాలు కోల్పోయాడు? భూలోక సామ్రాజ్యం కన్న శివలోక సామ్రాజ్యం చాల మేలైనది. మనమీ ఊరినే వదిలిపెట్టి వెళ్ళిపోదాం రా. క్షేత్రదర్శనం చేసుకొంటూ కైలాసగిరి వరకు వెళదాం. సాక్షాత్తు కైలాసనాధుని కరుణకు పాత్రులవుదాం."

"ఆహా! కైలాసయాత్రకు వెళ్ళేందుకు నీది తగిన వయసే. నాకింకా ఆ ప్రాయం రాలేదు. ఈ లోకంలో సుఖదుఃఖాలేవీ నేనింకా అనుభవించలేదు. ఒళ్ళంతా బూడిద రాసుకొని 'శివశివ' అని పిచ్చివాడిలాగ తిరుగాడేటట్లు నన్ను పెంచావు. ఆ పరమశివుని మహాకరుణ వల్లనే రాజ్యం ఇప్పుడు నా దగ్గరకొస్తూంది. దాన్నెందుకు జారవిడుచుకోవాలి?" అని అడిగాడు మధురాంతకుడు.

"అబ్బాయీ! నిన్ను సమీపిస్తున్న రాజ్యం ఎన్నో అపాయాలతోబాటు వస్తూంది. నీవు సింహాసనమెక్కేందుకు ఒక అడ్డు తొలగిపోయింది. ఆదిత్య కరికాలన్ చనిపోయాడన్నావు. కాసేపటి క్రితం ఈ ఇంటిని చుట్టుముట్టిన ప్రజల కేకలు నీవు వినలేదా? మధురాంతకా! ఆదిత్య కరికాలన్ మరణానికి నీవు, పళువేట్టరయ్యర్లే కారణమని ప్రజలు భావిస్తున్నారు. నిన్ను వాళ్ళెలా చక్రవర్తిగా ఒప్పుకొంటారు?"

"అమ్మా! ప్రజలు అదంతా అతిత్వరలోనే మరిచిపోతారు. నన్ను సింహాసనమెక్కిస్తే నన్నే చక్రవర్తిగా ఒప్పుకొంటారు. ఇంకా ఇది విను. కరికాలన్ మరణానికి కారణం ఎవరు తెలుసా? అరుళ్మొళి వర్మ ప్రియస్నేహితుడైన వంతిదేవుడే. కడంబూర్ మాళిగలో కరికాలన్ మరణించి పడివున్న చోట వంతిదేవుడు మాత్రమే ఉన్నాడట. వంతిదేవుని, శంబువరయ్యర్‌ని పాతాళ చెరసాలలో బంధించివున్నారు. తనకు సింహసనం దక్కాలని అన్నను చంపేందుకు కుతంత్రం పన్నినవాడు అరుళ్మొళి. ఇది ప్రజలకు తెలవనీ.

తర్వాత పొన్నియిన్ సెల్వన్ గతి ఏమిటో చూద్దాం."

~

శెంబియన్ మహాదేవి తమ కళ్ళనుంచి నిప్పులు కురిపిస్తూ, "ఒరే, పాపీ! కరుణే రూపంగొన్న అరుళ్మొళిని ఏం మాటలన్నావు? నీలాంటి దురాశాపరుణ్ణి గుళ్ళో పెట్టి పూజించేందుకు తయారుగా ఉన్నాడే వాడు? నీవిలా ఇంకొకసారి మాట్లాడితే నరకానికే పోతావు. నీకు, ఈ జన్మలోను, మరుజన్మలోను మోక్షం దక్కదు!" అన్నారు.

ఇది వినగానే మధురాంతకుడు ఎగిరి లేచి నిలబడ్డాడు. "ఒసే దెయ్యమా! నీ సొంత కొడుకునే శపిస్తున్నావు. నా విరోధిని ఆశీర్వదిస్తున్నావు. నీవు తల్లివేనా? కానే కాదు!" అని మధురాంతకుడు కుతకుతలాడుతున్న మనసునుంచి మాటలను కక్కాడు.

"అబ్బాయీ! నేను నీకిది చెప్పదలచనే లేదు. చెప్పవద్దనుకొన్నాను. నీ పిడివాదం వల్ల ఇప్పుడు చెప్పవలసివస్తూంది. నిజంగానే నేను నీ కన్నతల్లిని కాను. నీవు నా కొడుకువే కావు" అన్నారు.

మధురాంతకుడు గొంతు తగ్గించి, "ఆహా! నేను సందేహించింది నిజమే. నీవు నా తల్లివి కాకపోతే, నా తల్లి ఎవరు? నేను నీ కొడుకుని కాకపోతే, మరి నేనెవరి కొడుకుని?" అన్నాడు.

దేవి ముఖ్యమంత్రి అనిరుద్ధులను చూసి, "అయ్యా! మీరు చెప్పండి. నా అవమానాన్ని దయచేసి నేనే చెప్పుకొనేటట్లు చేయకండి" అన్నది.

ముఖ్యమంత్రి అనిరుద్ధులు మధురాంతకుని చూసి ఇలా చెప్పారు:- "యువరాజా! మిమ్మల్ని చిన్న బిడ్డ ప్రాయంనుంచి పెంచి పెద్ద చేసిన తల్లి మనసును గాయపరిచారు. ఎలాగూ మీరొకనాడు నిజాన్ని తెలుసుకోవలసిందే. ఇప్పుడే దాన్ని తెలుసుకోండి" అన్నారు.

~

శెంబియన్ మహాదేవికి పెళ్ళైన కొత్తలో తన కడుపున ఒక బిడ్డ పుట్టాలని, ఆ బిడ్డ చోళసామ్రాజ్యానికి చక్రవర్తి కావాలని ఆశపడేది. ఆమె గర్భంనుంచి బిడ్డను ఎదురుచూస్తున్న సమయాన ఆమె భర్త వేరే ఊరికి వెళ్ళివున్నారు. అదే సమయాన మూగవారైన అక్కచెళ్ళెల్లిద్దరు అంతఃపురం తోటలో కాపురమున్నారు. వారిలో ఒకతె గర్భం ధరించి ప్రసవాన్ని ఎదురుచూస్తూంది. శెంబియన్ మహాదేవి క్షేత్రయాత్రలకు వెళ్ళినప్పుడు అనాధగా అగుపించిన ఆ గర్భిణిగా ఉన్న మూగదాన్ని పిలుచుకొని వచ్చి ఆశ్రయమిచ్చింది. ఆమె సహోదరి తంజావూరు సమీపాన ఉన్నదని విని, గర్భిణికి సహాయంగా ఉండేందుకు ఆమెను పిలిపించుకొన్నది.

శెంబియన మహాదేవికి బిడ్డ పుట్టింది. ముఖ్యమంత్రి అనిరుద్ధులు రాజ్యానికి కుమారుడు పుట్టిన శుభసందర్భంగా ఆశీర్వదించ వచ్చారు. అప్పుడు శెంబియన్ మహాదేవి 'ఓ' అని ఏడ్చింది. పుట్టిన బిడ్డ నిర్జీవంగా కట్టెలాగుండడమే ఆమె దుఃఖానికి కారణం.

"అయ్యా! నా భర్త వచ్చి అడిగితే నేనేం బదులివ్వను" అని వెక్కి వెక్కి ఏడ్చింది. ఆమె దుఃఖాన్ని చూసి తట్టుకోలేక అనిరుద్ధులు ఒక ఉపాయం ఆలోచించారు. తోటలో కాపురమున్న మూగదానికి ఒక ఆడపిల్ల, ఒక మగపిల్లాడు కవలలుగా పుట్టారన్న విషయాన్ని ఆయనెరుగుదురు. ఆ మూగదాని చెంతకు వెళ్ళి ఆ ఇద్దరు బిడ్డలను అక్కడే వదిలి వెళ్ళిపోతే, వాళ్ళు అంతఃపురంలో పెరుగుతారని సైగలతో తెలియజేశారు. ఆ మూగది పిచ్చిదానిలాగ అగుపించింది. మొదట ఆమె పిల్లలనివ్వడానికి ఒప్పుకోలేదు. కాసేపటి తర్వాత ఇద్దరు పిల్లలను అక్కడే వదిలిపెట్టి పరుగెత్తి వెళ్ళిపోయింది! వెంటనే అనిరుద్ధులు ఆమె చెల్లెలి ద్వారా మగబిడ్డను శెంబియన్ మహాదేవి వద్దకు తీసుకొని వెళ్ళి ఇచ్చేలా చేశారు. ఆడబిడ్డను తమ ఇంటికి తీసుకొని వెళ్ళి అక్కడున్న తన శిష్యుడు ఆళ్వార్ కట్టియాన్ చేతికిచ్చి పాండ్యనాడుకు పంపించేశారు.

ఇలా బిడ్డల పంపిణీ/మార్పిడి చేసింది శెంబియన్ మహాదేవి మనసులో తొలుస్తూనే ఉండేది. ఒకరోజు తమ భర్త గండరాదిత్యులకు నిజాన్ని చెప్పేసింది. ఆ మహానుభావుడు "అందువల్ల పాతకమేమి? అమ్మాయీ! ఎవరి కడుపున పుట్టిన బిడ్డైతేనేమి? శివపరమాత్మ ప్రసాదించిన బిడ్డే. నీ కడుపున పుట్టిన బిడ్డలాగే పెంచు. కానీ ఇంకొక కులంలో పుట్టిన బిడ్డ చోళసింహాసనమెక్కకూడదు. అలా చేయడం కులద్రోహమవుతుంది. కాబట్టి ఈ బిడ్డను చిన్న ప్రాయంనుంచే శివభక్తుడయ్యేలాగ పెంచుదాం. 'చోళసామ్రాజ్యం వద్దు. శివభక్తి సామ్రాజ్యమే చాలు!' అని వీడే చెప్పేటట్లుగా పెంచుదాం. కానీ ఏ కారణం వల్ల కూడాను మనమీ బిడ్డను చోళసింహాసనం మీద కూర్చోబెట్టేందుకు ప్రయత్నించకూడదు. ఆ సందర్భం వచ్చినప్పుడు నేను ప్రాణాలతో లేకుంటే, నీవు దృఢచిత్తంతో చోళకులాన్ని కాపాడాలి!" అని చెప్పారు.

~

"మధురాంతకా! నీవు గండరాదిత్యుల కుమారుడివి కావు. శెంబియన్ మహాదేవి కడుపున పుట్టిన బిడ్డవూ కావు. పిచ్చిదానిలాగ ఊర్లు తిరుగుతుండిన ఒక అనాధ మూగదాని కొడుకువి. ఈ దేవి నిన్ను తన సొంత బిడ్డకన్న నూరు రెట్లు అధికంగా ముద్దాడి, లాలించి, ప్రేమించి పెంచారు. ఇప్పుడు వారి మాటకు వ్యతిరేకంగా నడుచుకోకు. దేవి చెప్పేది విను. అందువల్ల నీకు మంచే జరుగుతుంది" అన్నారు ముఖ్యమంత్రి అనిరుద్ధులు.

~~~
~~~

# అధ్యాయము - 49

## దౌర్భాగ్యశాలి

**మధురాంతకుడు** కాసేపలాగే దిగ్భ్రమించి కూర్చొండిపోయి, తర్వాత ఉన్నట్లుండి లేచి నిలబడి అనిరుద్ధులను చూసి, "ముఖ్యమంత్రీ! ఇదంతా మీ కుట్ర! నాకప్పుడే తెలుసు! సుందరచోళుల బిడ్డల మీద, అందులోను అరుళ్మొళి మీద, మీకు చాల ప్రేమ. వాడికే పట్టం కట్టాలన్నది మీ కోరిక. అందుకని ఇలా కట్టుకథలు చెప్పి నా తల్లి మంచి మనసును చెడగొట్టేశారు! అణ్బిల్ బ్రహ్మరాయలుగారూ! నేను మీకేం కీడు చేశాను? ఎందుకని నాకీ ద్రోహం చేయజూస్తున్నారు? మీ ఉద్దేశాన్ని నెరవేర్చుకోవడం కోసం నేను నా తల్లికి పుట్టిన బిడ్డని కాకుండపోవాలా? ఇలాంటి ఒక భయంకరమైన కుట్ర లోకంలో ఎవరూ చేసివుండరేమో! విష్ణుభక్తుల కులంలో పుట్టి మీరు ఇలా చేయవచ్చా? లేదు, లేదు! మీ తప్పేమీ లేదు! యువరాకుమారి కుందవై, అరుళ్మొళి కూడబలుక్కొని మిమ్మల్ని ఇటువంటి ఘాతుకానికి పురిగొల్పారు!" అని అరిచాడు.

అనిరుద్ధులు శాంతంగా, "యువరాజా! నాకు మీమీద అంత ద్వేషముంటే, కుండపోతగా కురుస్తున్న వర్షంలో చెట్టుకింద పడివున్న మిమ్మల్ని తీసుకొని వచ్చి కాపాడేవాడిని కాను. అరుళ్మొళి వర్మ గురించి కూడ మీరేం కొరత చెప్పకండి. లంకను జయించిన ఆ వీరాధివీరుడు ఈ నిమిషాన ఏం చేస్తున్నాడో తెలుసా? తంజావూరు కోటను చుట్టుముట్టిన సైనికులను, ప్రజలను మంచిమాటలతో నచ్చజెప్పి సమాధానపరుస్తున్నాడు. ఆయన చిన్నాన్న అయిన మీరు సజీవంగా ఉన్నప్పుడు తాను సింహాసనమధిష్టించడం ధర్మం కాదని, అలా సైన్యపు వీరులు, ప్రజలు కోరకూడదని చెప్పి వారి మనసును మార్చి సరిచేసేందుకు ప్రయత్నిస్తున్నాడు" అన్నారు.

"అలాగైతే… మీరింత క్రితం చెప్పిన విషయం అరుళ్మొళికి తెలియదు కద?"

"అరుళ్మొళికీ తెలియదు, ఇంకెవరికీ తెలియదు."

"ఇక మీదట మాత్రం ఎందుకు తెలియజేయాలి? ముఖ్యమంత్రీ! మీరు నోరు తెరవనని మాటివ్వండి. చక్రవర్తి మీకు ఒక గ్రామంలో పది ఎకరాల భూమి మాత్రమే కద మాన్యంగా రాసిచ్చారు? నేను మీకు పాండ్యనాడునే బహుమానంగా రాసిస్తాను…"

"అయ్యా! మీరు నన్ను నోరు మూసుకొని ఉండమనడానికి పాండ్యనాడును బహుమతిగా ఇవ్వనవసరం లేదు. మీ తల్లిగారి ఆజ్ఞ ఒక్కటే చాలు. వారికి చెప్పండి!"

~

మదురాంతకుడు తనను పెంచిన తల్లిని సానుభూతితో చూశాడు.

“బిడ్డా! మధురాంతకా! ముఖ్యమంత్రి అనిరుద్ధులు చెబుతున్నది సరియైనదే. ఆయనకు ఇరవైయేళ్ళ క్రితమే నా రహస్యం తెలుసు. ఆనాడాయన, ’మహారాణీ! ఇది మీ రహస్యం. మీకై మీరే ఎవరికైన చెబితే తప్ప ఇంకెవరికీ తెలియబోదు. నా నోటినుంచి అది ఎన్నడూ బయటపడదు. నేను సత్యప్రమాణం చేసి చెబుతున్నాను!’ అన్నారు. ఆ మాటను ఆయన ఈనాటి వరకూ నిలబెట్టుకొంటూ వస్తున్నారు. చోళకులానికి ఈయన నిజంగానే సత్యప్రమాణం చేసిన మిత్రులు. కానీ సుందర చోళ చక్రవర్తికి కూడ చెప్పలేదు. నీవు చోళసింహాసనమధిష్టించేందుకు నేను సమ్మతిస్తే ఈయన కూడ మాట్లాడకుండ ఉండేవారు.”

“అవును, తల్లీ! మాట్లాడక ఊరకుండేవాడినే. కానీ మనసులో అబద్ధం పెట్టుకొని ముఖ్యమంత్రి పదవిలో కొనసాగేవాడిని కాను. శ్రీరంగనాధునికి సేవ చేసేందుకు వెళ్ళిపోయేవాడిని!” అన్నారు అనిరుద్ధులు.

“కానీ దాని అవశ్యకత రాబోదు. మధురాంతకుడు సింహాసనమెక్కడు. నా కోరికను నెరవేరుస్తాడు. వాడే రాజ్యం వద్దని చెప్పేస్తాడు. కుమారా! ’అవును’ అని ఒప్పుకో!” అన్నారు మహారాణి శెంబియన్ మహాదేవి.

“తల్లీ! అయితే నేను సింహాసనమెక్కేందుకు అడ్డుగా ఉన్నది మీరొక్కరేనా? నేను మీ కడుపున పుట్టిన బిడ్డని కాదనే అనుకొందాం. ఇరవైయేళ్ళుగా మీ కడుపున పుట్టిన బిడ్డ కన్న మిన్నగా పెంచారు. ఇప్పుడు నాకెందుకీ ద్రోహం చేస్తున్నారు? నేను మీకేం కీడు చేశాను?”

“బిడ్డా! నీవు నాకేం కీడు చేయలేదు. నేనే నీకు పెద్ద హాని చేసేశాను. ఇన్నాళ్ళూ నిన్ను నా కడుపున బిడ్డలాగే పెంచి, ఇప్పుడు ’నీవు నా కొడుకువి కావు’ అంటున్నాను. ఇందువల్ల నీ మనసెంత గాయపడుతుంతో నాకు తెలియదా? నా ప్రాణాలున్నంత వరకు నేనీ రహస్యాన్ని వెలిబుచ్చేదాన్ని కాను. ముఖ్యంగా, నీకు చెప్పేదాన్ని కాను. కానీ నా భర్తకు నేనిచ్చిన మాటను నేను నెరవేర్చాలి. నేను పుట్టిన చోళకులానికి నేనే ద్రోహం చేయకూడదు. చోళకులంలో పుట్టని వాడిని నేను సింహాసనమెక్కించకూడదు. అటువంటి కార్యానికి నేను భాగస్వామిని కూడ కాకూడదు. నా మనసు దీని గురించి వేదనపడలేదనా భావిస్తున్నావు? ’నీవు నా కొడుకువి కావు’ అని కాసేపటి క్రితం నీకు చెప్పినప్పుడు నా మనసే బద్దలైపోయింది. చివరిదాక చెప్పేందుకు జంకాను. మనసు అల్లకల్లోలమైంది. నా కర్తవ్యమేమి, నా ధర్మమేమి అని తెలుసుకోవడానికే నంబియాండార్ వద్దకు వెళ్ళాను. ఆ మహాత్ములు ధర్మసూక్ష్మాన్ని విడమరిచి చెప్పారు. ’లోకంలోని ప్రజలందరూ ఆ మహాదేవుని బిడ్డలే. శివభక్తశిఖామణులైన మీరు ’సొంత కొడుకు’,’పెంపుడు కొడుకు’ అని భేదభావం చూపరు. తమ సొంత సొత్తంతా తమ పెంపుడు కొడుకుకే ఇస్తారు. కానీ రాజ్యం సంగతి వేరు. మన అసత్యం వల్ల ఇంకొకరి న్యాయమైన హక్కుకు అడ్డు వెళ్ళడం పాపం, అధర్మం. తెలిసి, తెలిసి చోళకులంలో పుట్టనివాడిని చోళసింహాసనమెక్కించడం

చోళకులద్రోహమవుతుంది. తమ కుమారునికి, చక్రవర్తికి నిజాన్ని చెప్పడమే ధర్మం' అని ఉపదేశించారు. అది శిరసావహించే తిరిగి వచ్చాను. కుమారా! నీవు నా సొంత కొడుకువి కావని చెప్పడం నాకు సంతోషాన్నిస్తుందా? చక్రవర్తికి చెప్పేటప్పుడు కూడ ఈ విషయాన్ని గర్వంతో చెప్పగలనా?"

అప్పుడు మధురాంతకుడు ఉన్నట్లుండి లేచి శెంబియన్ మహాదేవి కాళ్ళమీద పడి, "తల్లీ! నాకు రాజ్యం వద్దు; సింహాసనం కూడ వద్దు. ఇక్కడే ఉండమంటే ఉంటాను. లేకపోతే దేశం వదిలి వెళ్ళిపొమ్మంటే వెళ్ళిపోతాను. కానీ నేను మీ కొడుకుని కాను అని మాత్రం అనకండి! ఎవరికీ చెప్పకండి! చెబితే ఆ అవమానంతోనే నా మనసు బద్దలై చనిపోతాను!" అని విలపించాడు.

~

శెంబియన్ మహాదేవి నీళ్ళు నిండిన కళ్ళతో, పెల్లుబికిన మమకారంతో మధురాంతకుని లేపి హత్తుకొని తమ పక్కన కూర్చోబెట్టుకొన్నారు.

"కుమారా! నీవీ దుఃఖానికి లోనుకాకూడదనే నిన్ను ఈ ఇహలోకపు రాజ్యం మీద కాంక్షలేని వాడివిగాను, శివలోకసామ్రాజ్యమైన భక్తిలోకం మీద ప్రేమగొన్నవాడివిగాను పెంచాలని ప్రయత్నించాను. ఆ ప్రయత్నంలో ఓడిపోయాను. ఎవరో పాపిష్ఠివాళ్ళు నీ మనసును చెడగొట్టేశారు. ఇప్పటికీ మించిపోయింది లేదు. నీకై నీవే మనఃపూర్వకంగా 'నాకీ రాజ్యం వద్దు; సుందర చోళ చక్రవర్తి కుమారుడైన అరుళ్మొళి వర్మే రాజ్యమేలనీ' అని లోకమెరిగేలా చెప్పేశావంటే, 'నీవు నా కుమారుడివి కావు' అని చెప్పవలసిన అవసరం రానేరాదు. నీ మనసును ఇప్పుడు గాయపరిచిందే నాకు ఎనలేని వేదనను కలిగిస్తూంది. ఈ రోజు ముఖ్యమంత్రి అనిరుద్ధుల సమక్షాన ఒప్పుకో. మూడురోజుల్లో సామంత రాజుల సమావేశం జరగబోతూంది. ఆ సభ సమక్షంలో కూడ ఒప్పుకో. చోళ సామ్రాజ్యానికి విరుద్ధంగా ఎవరైన దుర్బోధలు చేసినా కూడ చెవిన వేసుకోనని సత్యప్రమాణం చేయి! అలా చెప్పేస్తే నేను గాని, ముఖ్యమంత్రి అనిరుద్ధులుగాని నీ జన్మరహస్యాన్ని బహిరంగపరచవలసిన అవశ్యకత రానేరాదు. నీవెప్పటికీ నా ముద్దుల కుమారుడివిగానే విలసిల్లుతావు. మనమిద్దరం ఈ విశాల భారతదేశమంతా తిరిగి తీర్థయాత్రలు చేద్దాం. అక్కడక్కడా శివాలయాలకు కైంకర్యం చేద్దాం. అరుళ్మొళివర్మ నా పట్ల ఎనలేని భక్తిగొన్నవాడు. నీలాగ వాడిని కూడ నేనే చాలవరకు పెంచాను. నా మాటకు వాడెప్పుడూ ఎదురు చెప్పడు!" అన్నారు మళవరయ్యర్ కుమార్తెయైన శెంబియన్ మహాదేవి.

~

ఇది విన్న మధురాంతకుడు తలను రెండు చేతులతోను పట్టుకొని కాసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయాడు.

"ఆహా! నాకు బుద్ధి తెలిసినప్పటినుంచి ఏవేవో రూపం తెలియని నీడల్లాంటి జ్ఞాపకాలు తరచూ తోచి నాకు ఎనలేని వేదనను కలిగిస్తూ వచ్చాయి. వాటన్నిటికీ కారణం ఇప్పుడర్థమవుతూంది. నాలాంటి

దురదృష్టశాలి ఈ లోకంలో ఇంకెవరుంటారు? ఏ వేళలో ఏ జాతకంతో పుట్టానో తెలియదు. ఒకే రోజు, ఒకే క్షణంలో తలిదండ్రులను కోల్పోయాను; కులగోత్రాలు కోల్పోయాను; ఒక పెద్ద రాజ్యాన్ని కోల్పోయాను; వెయ్యేళ్ళ వీరపరంపరలో వచ్చిన చోళసింహాసనాన్ని కోల్పోయాను; స్నేహితులందరినీ కోల్పోయాను. అవును, ఈ నిజం తెలిస్తే ఎవరు నాకు స్నేహితులుగా ఉంటారు? నాకు పట్టం కట్టేందుకు ప్రాణాలైనా ఇస్తామని ప్రమాణం చేసిన సామంతరాజులందరూ ఒక్క క్షణంలో నన్ను వదిలిపెట్టేస్తారు...! అవును. నావంటి దౌర్భాగ్యశాలి ఈ లోకంలో ఎప్పుడూ ఉండివుండరు. అమ్మా! నా బుద్ధి అస్తవ్యస్తమవుతూంది. స్పష్టంగా ఆలోచించలేకపోతున్నాను. రెండురోజులు గడువివ్వండి! నా తీర్మానమేమిటో చెబుతాను" అన్నాడు.

"బిడ్డా! నీవాలోచించేందుకు ఏముంది? నా మనసును రాయి చేసుకొనే దీన్ని చెబుతున్నాను. ఒకటి, నీకై నీవే రాజ్యం మీది హక్కును వదులుకోవడానికి ఒప్పుకోవాలి. లేదా, నీవు నా కడుపున పుట్టిన బిడ్డవి కావని లోకానికంతటికీ తెలిసేలా నేనొప్పుకోవాలి. ఎలాగూ నీవు సింహాసనమధిష్టించలేవు. నీవాలోచించి చెప్పేందుకేముంది?" అన్నారు అ ఉత్తమురాలు.

~

అప్పుడు అనిరుద్ధులు, "అమ్మా! రెండురోజులు అవకాశమివ్వడంలో తప్పేమీ లేదు. మంత్రాలోచన సభ, మహాజనసభ సమావేశమయ్యేందుకు ఇంకా మూడురోజుల గడువుంది. అంతవరకు యువరాజు నెమ్మదిగా ఆలోచించి చూడనీ!" అన్నారు.

"అమ్మా! అమ్మా! ఈ రహస్యం మీకు, ముఖ్యమంత్రికి తప్ప ఇంకెవరికైనా తెలుసా?" అని మధురాంతకుడు ఉన్నట్లుండి పుట్టుకు వచ్చిన కుతూహలంతో అడిగాడు. అతడి మనసులో ఏం చెడు ఆలోచన తోచిందో, ఏం కుట్ర, పన్నాగం మొలకెత్తాయో మనకు తెలియదు.

మధురాంతకుని గాభరా శెంబియన మహాదేవికి కాస్త ఆశ్చర్యాన్ని కలిగించింది. "మాకుగాక, అది ఇంకా ముగ్గురికి తెలుసు కుమారా! వారిలో ఒకరైన నీ తండ్రి పరమపదించారు. అక్కచెళ్ళెళ్ళైన ఆ ఇద్దరు మూగ స్త్రీలకు తెలుసు. వారిలోను ఒకతె - నిన్ను కన్నది - సుందరచోళుల అంతఃపురంలో దుర్మరణం పాలైంది. ఆమె నిర్జీవదేహానికి అంతిమ క్రియలు చేయక మునుపు నీకు నిజాన్ని చెప్పేద్దామా అనుకొన్నాను. కానీ మనసు రాలేదు. నీ మనసును గాయపరిచేందుకు ఇష్టపడక ఊరకుండిపోయాను. బిడ్డా! నిన్ను కన్నతల్లిని తలుచుకొని ఏడ్వాలనిపిస్తే ఏడ్వు! నిన్నామె కన్న వేళలో తప్ప నీకూ ఆమెకూ ఇంకే సంబంధమూ లేదు. నిన్ను వచ్చి చూడాలని కూడ ప్రయత్నించలేదు. ఆమె చిత్త స్వాధీనం కోల్పోయి పిచ్చిదయిపోయింది. ఆమెను తలుచుకొని నీవు కన్నీళ్ళు విడిచేటట్లయితే కన్నీళ్ళు విడు!" అన్నారు ఆ మహాతల్లి.

"లేదు, లేదు! మిమ్మల్ని తప్ప ఇంకెవరినీ తల్లిగా భావించలేను. మీరింతకు మునుపే నాకీ

విషయం చెప్పివుంటే ఆమె చెంతకు కూడ వెళ్ళేవాడిని కాను. రహస్యం తెలిసిన ఇంకొకరెవరమ్మా? ఈ ఇంకొక మూగ వనిత ఎవరు?" అని అడిగాడు.

"ఆమె చెల్లెలే ఈ తంజావూరు కోట బయట నందనవనాన్ని పెంచుతూ అక్కడే నివసిస్తూంది. నా కడుపున నిర్జీవంగా కట్టెలాగ పుట్టిన బిడ్డను, నిన్ను మార్పిడి చేసింది ఆమే. పుట్టు మూగది, చెవిటిదీ కావడం వల్ల ఎవరికీ చెప్పలేదు, చెప్పదు. ఆమెకు ఒక కొడుకున్నాడు. తల్లీకొడుకులు తంజావూరు తళికులత్తూర్ ఆలయానికి పుష్పసేవ చేస్తున్నారు. వారికి మాన్యమిచ్చి ఆదరిస్తున్నది నేనే!"

"ఆహా! వారు నాకు తెలుసు. తల్లీకొడుకులిద్దరూ తెలుసు. కొడుకు పేరు సేందన్ అముదన్. వంతిదేవుడనే గూఢచారి ఇక్కడినుంచి పారిపోవడానికి సహాయం చేసినవాడు. అమ్మా! ఆ అబ్బాయికి దీని గురించి ఏమైనా తెలుసా?"

"తెలియదు, బిడ్డా! తెలియదు. వాడి తల్లి ఈ రహస్యాన్ని ఇంకెవరికీ చెప్పనని సత్యప్రమాణం చేసింది. అందుగురించి నీకు దిగులు వద్దు. ఆమె తప్ప, నేను, ముఖ్యమంత్రి మాత్రమే!"

~

ఆ సమయాన మధురాంతకుని మనసులో పలు భయంకరమైన ఆలోచనలు తలెత్తాయి. ఈ ఇద్దరూ ఈ లోకాన్ని వదిలితే, నిజాన్ని వెలిబుచ్చగలిగేవారెవరూ ఉండరని ఆలోచించాడు. ముఖ్యమంత్రికి తానేవిధంగానూ ఋణపడి లేడు.ఈ మహారాణిమో నిజానికి తన తల్లే కాదు. వీరి మీద తానెందుకు దయ చూపాలి? ఆహా! నా జన్మరహస్యాన్ని తెలియజేస్తానని సుందర చోళ చక్రవర్తి తోటలో ఒకడన్నాడు కద. వాడెవడు? వాడిని తాను కలవగలిగితే? చక్రవర్తిని చంపవచ్చి ఆ మూగదాన్ని చంపేశాడు వాడు. వాడి తప్పేమీ లేదు ఆమే నా తల్లని వీళ్ళు చెబుతున్నారు. ఆమె నా తల్లయితే, నా తండ్రెవరు? ఒకవేళ...ఒకవేళ...ఈ వంచనే రూపుగొన్న ఈ ముసలిది, ఈ వేషధారి ముఖ్యమంత్రి నన్ను వంచింపజూస్తున్నారా? నిజానికి తాను సుందరచోళ చక్రవర్తి కుమారుడా...? ఆహా! ఈ నిజాన్ని ఎలా తెలుసుకోవడం?

"కుమారా! నేను వెళ్ళొస్తాను. బాగా ఆలోచించి ఒక తీర్మానానికి రా. కన్నతల్లి కన్న మిన్నగా నిన్ను ఇరవై రెండేళ్ళు ప్రేమతో పెంచిన నేను నీకు కీడు చేయను. అశాశ్వతమైన ఈ భూలోకసామ్రాజ్యాన్ని త్యాగం చేయి! ఎన్నటికీ నాశనం కాని శివలోక సామ్రాజ్యాన్ని పొందే దారి వెతుకు!" అన్నారు పెద్దరాణి.

~

ఆ సమయాన వారెవరూ ఎదురుచూడని సంభవం ఒకటి జరిగింది. అరుళ్మొళి వర్మ ఆ గదిలోకి ప్రవేశించాడు. తిన్నగా శెంబియన్ మహాదేవిని సమీపించి నమస్కరించాడు.

"దేవీ! మీరు మీ ప్రియపుత్రునికి చెప్పిన మంచిమాటలను నాకు కూడ చెప్పినట్లే తీసుకొన్నాను. ఈ చోళసామ్రాజ్యం మీద నాకు హక్కున్న పక్షాన, దాన్ని నేను త్యాగం చేసేందుకు సిద్ధంగా

ఉన్నాను. మీ ఆశీర్వాదం వల్ల నా మనసు శివపరమాత్ముని పాదాల వైపు మళ్లనీ. శివలోక సామ్రాజ్యంలో ఒక చిన్న చోటు - తమ భర్తయైన గండరాదిత్యులు ఉన్నచోటుకు దగ్గరలోనే - నాకు దొరకనీ! అలాగ నన్ను ఆశీర్వదించండి!" అన్నాడు.

ఇది విన్న శెంబియన్ మహాదేవి, ముఖ్యమంత్రి అనిరుద్ధులు ఒకరినొకరు చూసుకొని అవాక్కై నిలబడిపోయారు.

"దేవీ! కాసేపటి క్రితం మీరు మీ ప్రియపుత్రునికి చెప్పిన మాటలు నేను అయిష్టంగానే వినవలసివచ్చింది. అందుకు క్షమించాలి. ఈ మాళిగ చుట్టూ గుమిగూడిన ప్రజలను కోట బయటకు పంపించేసి తిరిగి వచ్చాను. ముఖ్యమంత్రిని దర్శించి ఇక మీదట చేయవలసిందేమని సంప్రదించేందుకు ఈ మాళిగ లోపల ప్రవేశించాను. మీరు కూడ ఇక్కడున్నట్లు తెలియగానే 'పండు జారి పాలలో పడ్డట్లయింది' అని భావించి వచ్చాను. మీరు మామూలు కన్న పెద్ద గొంతుతో మాట్లాడుతున్నారు. మధురాంతక దేవరు కూడ పెద్దగా మాట్లాడుతున్నారప్పుడు. లోపలికొద్దామా వద్దా అని ఆలోచిస్తున్నప్పుడు మీ సంభాషణలో ఒక భాగం నా చెవిన పడింది. దేవీ! బ్రతికి ఉన్నవారిలో మీకు, ముఖ్యమంత్రికి, సేందన్ అముదన్ తల్లికి మాత్రం మధురాంతకుల జన్మరహస్యం తెలుసు అని మీరు కాసేపటి క్రితం చెప్పారు. అది సరి కాదు. నాకు, నా అక్కగారైన యువరాకుమారికి కూడ అది తెలుసు. చక్రవర్తిని కాపాడేందుకు తన ప్రాణాలను బలిచ్చిన మందాకినీదేవిని నేను ఈలంనాడులో తరచూ కలిసేటట్లు సందర్భాలు వచ్చాయి. చిత్రభాష మూలంగా వారు నాకిదంతా చెప్పారు. నేను నా అక్కగారికి చెప్పాను. ఇద్దరూ ఆలోచించి ఒక తీర్మానానికి వచ్చాము. నా చిన్న తండ్రైన మధురాంతక దేవరే చోళసింహాసనాన్ని అధిష్టించాలి. వారు తమ సొంత బిడ్డకన్న వెయ్యి రెట్లు ఆదరంతో పెంచబడ్డారు. నేను కావేరి వెల్లువలో మునిగిపోకుండ కాపాడడమేగాక, తర్వాత చాలసార్లు నన్ను కాపాడిన మందాకినీదేవి కడుపున పుట్టిన కుమారులు. కాబట్టి ఎలా చూసినా చోళసింహాసనాన్ని అధిష్టించ హక్కుగలవారు. వారి హక్కు గురించి ఏదైనా సందేహం ఉంటే, నేను తీరుస్తాను. చోళసింహాసనం మీద నాకున్న హక్కును మీ పాదాల మీద ఆనగా త్యాగం చేస్తాను. కాబట్టి మధురాంతక దేవరు మీ కుమారులు కారని చెప్పనవసరం లేదు. మధురాంతకులు చోళసింహాసనాన్ని త్యాగం చేయవలసిన అవసరం కూడ లేదు!"

~

ఇలా పొన్నియిన్ సెల్వన్ చెప్పగా ఆ గదిలోని ముగ్గురూ తమ జీవితకాలంలో ఎన్నడూ పొందనంత ఆశ్చర్యానికి లోనై, దిగ్భ్రమించి నిలబడిపోయారు.

వారిలో అనిరుద్ధులే మొదట తేరుకొన్నారు.

"యువరాజా! మీరు చెప్పిన వాక్కులు కావ్యాల్లోను, ఇతిహాసాల్లోను లిఖించబడాలి. శిలాశాసనాల్లోను, తామ్ర, స్వర్ణ పత్రాల మీద చెక్కించబడాలి. కానీ ఈ విషయాన్ని ఇక్కడున్న మనం

మాత్రమే తీర్మానం చేయ సాధ్యం కాదు. చక్రవర్తిని, తక్కిన సామంతరాజులను సంప్రదించవలసివుంది. రాబోయే కాలంలో నిజం బయటపడితే ప్రజలు ఏమనుకొంటారన్నది కూడ ఆలోచించాలి. యువరాజా! మహాసభ సమావేశానికి ఇంకా మూడురోజుల గడువు మాత్రమే ఉంది. అంతవరకు మనం ఒక్కొక్కరూ దీర్ఘంగా ఆలోచిద్దాము!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 50

## కుందపై మనఃక్లేశం

**సిరిలో** పుట్టి సిరిలో పెరిగినది యువరాకుమారి కుందవైదేవి. అందంలో రతిని, బుద్ధిలో కలైమగళ్‌ని, అదృష్టంలో తిరుమగళ్‌ని మించినది. సుందర చోళ చక్రవర్తి (ఆమె తండ్రి) మొదలు సాధారణ ప్రజల వరకు అందరూ ఆమెను కొనియాడారు. అంతఃపురంలో ఆమె కాలితో చెప్పింది తలతో చేసేందుకు ఎందరో వేచివుండేవారు. చిన్న/సామంతరాజులు తమ కుమార్తెలకు కుందవైదేవికి చెలికత్తెలుగా ఉండే భాగ్యం కలగదా అని తపస్సు చేసేవారు. భారతదేశంలో ఆనాడు మహారాజులుగా విరాజిల్లిన పలువురి పట్టపు రాకుమారులు యువరాకుమారి కుందవైదేవిని వివాహమాడేందుకు తపస్సు చేసేవారు.

అలా సకలభాగ్యాలు కలిగిన యువరాకుమారి అప్పుడు ఎల్లలులేని దుఃఖసముద్రంలో మునిగివుంది. అన్న ఆదిత్య కరికాలన్‌కి తాను చెప్పి పంపిన హెచ్చరికలన్నీ నిష్ప్రయోజనమైనాయి. శంబువరయ్యర్ మాళిగకు వెళ్ళవద్దని అతడికి ఆమె అత్యవసర సందేశం పంపింది. ఆమె మాటకు ఎప్పుడూ విలువిచ్చే ఆమె ప్రియసహోదరుడు ఈసారి ఆమె మాటను పట్టించుకోక, కడంబూర్ శంబువరయ్యర్ మాళిగకు వెళ్ళాడు. అక్కడ మర్మభూయిష్టమైన పరిస్థితిలో అకాల మరణం పాలయ్యాడు నందిని తనకు, కరికాలన్‌కి, అరుళ్మొళికి సహోదరి అనే నమ్మింది. నందిని ఏదో ఒక కారణం వల్ల అతడి మీద పగబూనింది. నందిని చేతనే కరికాలన్ అకాల మరణం జరిగిందంటే దానికన్న చోళకులానికి రాగల అపకీర్తి, నింద ఇంకేదీ ఉండబోదు. కరికాలన్ మరణం తర్వాత నందిని ఏమైందో తెలియదు.

తన ప్రియసహోదరుని బలివ్వవలసి రావడం ఆమెకు ఎనలేని దుఃఖాన్ని కలిగించింది. ప్రాణాలు వీడి రెండురోజుల తర్వాత కూడ అతడి దివ్యవదనంలో ప్రకాశించిన వీరకళను తలుచుకొని, తలుచుకొని విలపించింది. ఆహా! ఆ మహావీరుడు ఏమేం కలలు కన్నాడు కద? కరికాల్ వళత్తాన్ లాగ హిమపర్వతం వరకు దిగ్విజయం చేసి ఆ మహాపర్వతం మీద పులిజెండా నాటుతానన్నాడు కద? అటువంటి వీరుడి శరీరం అర్ధఘడియలో కాలి బూడిదైపోయింది. చోళనాడు మట్టిలో మట్టిగా కలిసిపోయింది. ఆ మట్టినుంచి రాబోయే కాలంలో వేలాది వీరాధివీరులు ఉదయిస్తారు. చోళనాడునుంచి నలుదిశలా వెళదారు. సముద్రాలు దాటి దూరదేశాలకు వెళతారు. వీరయుద్ధాలు చేసి చోళసామ్రాజ్యాన్ని ఇంకా విస్తరింపజేస్తారు. వెళ్ళినచోటల్లా ఆకాశాన్నంటే గోపురాలను, దేవాలయాలను నిర్మిస్తారు. అవి చోళనాడు గొప్పతనాన్ని ప్రపంచానికి ఎలుగెత్తి చాటుతాయి. తమిళాన్ని, తమిళ కళలను, శైవ, వైష్ణవ, జైన మతాలను ప్రచారం చేస్తారు. దేవార పద్యాలు సముద్రాంతర దేశాలలో మారుమోగుతాయి.

~

ఇవన్నీ ఒట్టి కలలుగావు. నిజంగా జరగదగినవే. అరుళ్మొళి పుట్టిన వేళావిశేషం గురించి పెద్దలు, జ్యోతిష్కులు, అనుభవం కలిగిన తల్లులు చెప్పినదంతా నిజమైతే, కరికాలన్ కలగన్నదంతా అరుళ్మొళి మూలంగా నిజం కావచ్చు.

కానీ దానికి ఎన్ని అడ్డంకులు? ఆహ్! ఈ చిన్న/సామంతరాజులు తమలో తాము మంత్రాలోచన చేసుకొని ఏం విపరీతాలు, అవాంతరాలు తేబోతారో తెలియదు. మలైయమాన్, వేళార్ అరుల్మొళినే సింహాసనమెక్కించాలని పిడివాదం పడుతున్నారు. పళువేట్టరయ్యర్లు, వారి స్నేహితులు మధురాంతకుని కోసం సైన్యాలు తరలించుకొని వస్తున్నారు. చక్రవర్తేమో వెంటవెంటనే సంభవించిన రెండు విపరీత సంభవాల వల్ల దుఃఖసముద్రంలో మునిగివున్నారు. ఎవరితోను, ఏ విషయం గురించి కూడ మాట్లాడేందుకు నిరాకరిస్తున్నారు. యువ ప్రాయంలో తాను చేసిన పాపాన్ని తలుచుకొని పశ్చాత్తాపపడుతున్నారు. ఆయనకు ఓదార్పు మాటలు చెప్పేందుకు కూడ ఎవరికీ ధైర్యం చాలడం లేదు. ఆయన ప్రియపుత్రిక తనకే ఆయనను సమీపించేందుకు భయమేస్తూందంటే తక్కినవారిని గురించి అడగనేల?

అరుళ్మొళి రాజ్యాన్ని త్యాగం చేసేందుకు సిద్ధంగా ఉన్నాడు. మధురాంతకునికి పట్టం కట్టేసి, తాను చోళసైన్యాన్ని తీసుకొని సముద్రాలు దాటి దిగ్విజయం చేయగోరుతున్నాడు. కానీ దానికి కూడ ఎదురుచూడని ఆటంకం ఒకటి ఏర్పడిందిప్పుడు. చోళదేశమే కొనియాడే శెంబియన మహాదేవే తమ కుమారునికి పట్టం కట్టేందుకు ఒప్పుకోవడం లేదు. కాలం చేసిన తమ భర్త ఆజ్ఞ అంటున్నారు.

ఈ చిక్కులన్నీ ఎలా విడిపోబోతున్నాయో తెలియడం లేదు.

~

ఇలా చోళకులం గురించి, చోళసామ్రాజ్యం గురించి ఉన్న దిగుళ్ళన్నీ చాలవన్నట్లు, కుందవైని ఇంకొక పెద్ద దిగులు వేధించసాగింది. ఆమె మనసునాకట్టుకొన్న వాణర్‌కులవీరుని పాతాళ చెరసాలలో బంధించారు. ఆదిత్య కరికాలన్ మరణానికి అతడే కారణమంటున్నారు. ఇందులో ఆ పల్లవ కులవీరుడు పార్థిబేంద్రుడు చాల పిడివాదంగా ఉన్నాడు. తాతగారైన మలైయమాన్ ఒకవేళ తాను చెబితే వినవచ్చు. కానీ నిందారోపణ చేయబడిన ఒకని విషయంలో స్త్రీ అయిన తాను ఎలా తలదూర్చగలదు? అది సబబా? అన్నగారైన ఆదిత్య కరికాలన్ కన్న దారిన పోయే వంతిదేవుని మీద తనకెక్కువ అభిమానమన్న అభిప్రాయమేర్పడితే, దానికన్న అపకీర్తి ఇంకేముంటుంది? పార్థిబేంద్రుడు కావాలనే అటువంటి అపకీర్తిని ప్రచారం చేయగలిగినవాడు. కరికాలన్ మరణించిన చోట శంబువరయ్యర్, గందమారన్ వంతిదేవుని అతడా హత్యానేరం చేసిన వెంటనే పట్టుకొన్నారని పార్థిబేంద్రుడు చెబుతున్నాడు. కానీ కరికాలన్ని ఒక్క నిమిషం కూడ విడిచిపెట్టిపోకూడదని తాను చెప్పిన మాటనే వంతిదేవుడు పాటించివుండాలి. కాపాడేందుకు ప్రయత్నించి, అందులో గెలవలేక, ఓడిపోయివుండాలి.

కానీ ఇందు గురించిన నిజాన్ని ఎల కనిపెట్టడం? వంతిదేవుని తాను వెళ్ళి చూసేందుకు ప్రయత్నించినా, ఆయనను ఇక్కడికి పిలిపించినా, అపార్ధాలకు, సందేహాలకు దారి తీస్తుంది. తన గురించి ఎవరూ ఏమీ చెప్పేందుకు తెగించరు; అలా అన్నా దిగుల్లేదు! కానీ కరికాలన్ మరణానికి అరుళ్మొళి వర్మనే కారణభూతునిగా చేసేందుకు కొందర వంచకులు ప్రయత్నిస్తున్నారు. తాను తొందరపడి ఏదైనా చేయడం వల్ల వారి పక్షానికి బలం ఇవ్వకూడదు కద?

దైవమా! దేవీ! జగన్మాతా! పుట్టినప్పటి నుంచి ఒక్క దిగులూ లేక ఆనందంగా పెరిగిన నన్ను ఎటువంటి పరీక్షకు గురి చేస్తున్నావు...!

ఇలా ఆలోచించి, ఆలోచించి కుందవై మనసు చాల గాయపడింది. కరికాలన్ మరణవార్త, అందులో వంతిదేవులు చిక్కుకొన్న వార్త వచ్చినప్పటినుంచి ఆమె రాత్రుల్లో ఒక్క క్షణం కూడ నిద్రపోలేకపోతూంది. ఈ ఇక్కట్టైన పరిస్థితి నుంచి గట్టెక్కేందుకు దారులు ఆలోచించి, ఆలోచించి ఒక్కొక్క దారినీ తిరస్కరిస్తూ వచ్చింది.

ఆమె నెచ్చెలియైన వాణతి వద్ద కూడ మనసు విప్పి మాట్లాడ నిరాకరించింది.

వాణతి కూడ ఆమె మనోస్థితిని ఒకింత అర్థం చేసుకొని ఏమీ మాట్లాడకుండ, ప్రశ్నించక ఊరుకొంది. చాలవరకు కుందవై వెంట నీడలాగ మసలుతూ, ఆ నీడలాగే మౌనంగా ఉంటూ వచ్చింది.

~

ఇలా సమయోచితంగా కుందవైదేవి చింతనాలోకానికి అడ్డుపడక సర్వ జాగరూకతతో ఉంటూ వచ్చిన వాణతి ఆ రోజు ఉన్నట్లుండి యువరాకుమారి వద్దకు వచ్చి, "అక్కా! అక్కా! మిమ్మల్ని చూసేందుకు ఒక అమ్మాయి వచ్చింది. కన్నీరు మున్నీరుగా ఏడుస్తూంది. చూస్తే చాల జాలిగొలిపేటట్లుంది!" అనగానే కుందవై కూడ కాస్త ఆశ్చర్యానికి లోనైంది.

"ఎవరా అమ్మాయి? విషయమేమని అడగలేదా?" అన్నది కుందవై.

"అడిగానక్కా! అది చెబితే మీకు కోపం, చిరాకు కలుగుతాయేమో! శంబువరయ్యర్ కూతురు మణిమేఖలట! చిన్న పళువేట్టరయ్యర మాళిగలో శంబువరయ్యర్ కుటుంబాన్ని చెరపట్టివుంచారు. ఈమె ఎవరికీ తెలియకుండ తప్పించుకొని, దారి విచారించుకొని వచ్చిందట. ఏ కార్యం మీద వచ్చిందన అడగగా, మీ సమక్షంలో మాత్రమే చెబుతానని అంటూంది. ఆమె కన్నీళ్ళతో తడిసిన ముఖాన్ని చూస్తే మీ మనసు కూడ కరిగిపోతుంది!" అన్నది వాణతి.

"అలాగైతే నా మనసు రాతి మనసనా అంటున్నావు?" అన్నది కుందవై కాస్త కోపంగా.

"మీది నిజంగానే రాతి గుండె అక్కా! లేకపోతే వంతిదేవులను పాతాళచెరసాలలో వదిలిపెట్టేసి ఊరకుంటారా?" అన్నది వాణతి.

"సరే, సరే! ఆ అమ్మాయిని ఇక్కడికి రమ్మను!" అన్నది కుందవై.

వాణతి జింకలాగ గెంతుతూ వెళ్ళి మరునిమిషమే మణిమేఖలను పిలుచుకొని వచ్చింది.

~~~
~~~

# అధ్యాయము - 51

## మణిమేఖల కోరిన వరం

**చిత్తభ్రమ** పట్టినదానిలాగ అటూఇటూ వెర్రిచూపులు చూస్తూ లోపలికి వచ్చింది మణిమేఖల. వాణతి చెప్పినట్లే ఆమె చూసేందుకు దీనపరిస్థితిలో ఉంది. ఏడ్చి, ఏడ్చి ఆమె కళ్ళు, ముఖమూ వాచిపోయివున్నాయి.

కానీ ఏ కారణం వల్లనో ఆమెమీద కుందవైకి జాలి, కనికరం కలగలేదు. ఇటీవలి కాలంలో చోళకులానికి కలిగిన విపత్తులన్నింటికీ శంబువరయ్యర్ మాళిగలో జరిగిన కుట్రపన్నాగాలే మూలకారణమన్న విషయాన్ని ఆమె మరువలేకపోయింది. చివరిగా, వీరాధివీరుడైన తన అన్న కరికాలన్ ఆమె ఇంటనే దుర్మరణం పాలయ్యాడన్న విషయం కూడ ఆమె కోపానికి కారణమైంది.

చటుక్కున ఇంకొక విషయం జ్ఞాపకం వచ్చింది. ఈమె అన్న గందమారన్, వాణర్కులవీరుడు పాత స్నేహితులు. ఆ స్నేహం ఆధారంగానే వంతిదేవులు కడంబూర్ మాళిగకు వెళ్ళారు. గందమారన్ తన సహోదరిని వాణర్కులవీరునికిచ్చి పెళ్ళి చేయాలని కూడ ఒకప్పుడు కోరుకొన్నాడు. ఆ అమ్మాయి ఈమే అయివుండాలి...!

ఈ సంగతి గుర్తుకు రాగానే కుందవైకి మణిమేఖల మీద ఒక కొత్త ఆసక్తి పుట్టుకొచ్చింది. ఆహా! ఈమె తననెందుకు వెతుక్కొంటూ వచ్చింది? తండ్రి కోసం గాని, అన్న కోసం గాని వేడుకోవడానికి వచ్చిందా? శంబువరయ్యర్ మాళిగకు తన అన్నను ఆహ్వానించినప్పుడు అతడికి ఈమెనిచ్చి పెళ్ళి చేయడమన్న ప్రస్తావన వచ్చింది. ఒకవేళ ఈ అమాయకురాలు కరికాలన్‌కి తన మనసునర్పించేసిందా? తాను పెళ్ళి చేసుకోవాలనుకొన్నవాడు అకాల మరణం చెందగా, ఈమె మనసు విరిగిపోయిందా? అందుగురించే ఏమైనా చెప్పవచ్చిందా? లేక...లేక...ఒకవేళ అలాగూ ఉండ సాధ్యమా? గందమారన్ ఈమెకు తన స్నేహితుని గురించి చెప్పేవుండాలి. వంతిదేవులు ఈమె ఇంట విడిది చేశారు. మునుపొకసారి కూడ విడిది చేశారు. ఈసారి చాలరోజులున్నారు. ఈమె మనసు ఒకవేళ వంతిదేవుల మీదికి మళ్ళిందా? అలాగైతే ఆయన ఈమెను తిరస్కరించివుంటారనడంలో సందేహం లేదు. అందుకు పగ తీర్చుకొనే ఉద్దేశంతో లేనిపోని నిందలను ఆయన మీద మోపేందుకు వచ్చిందా...?

ఇన్ని ఆలోచనలు కుందవై మనసులో అతివేగంగా తోచి మరుగైనాయి.

మణిమేఖల మనసును పరీక్షించి ఆమె మనసులో ఏముందో తెలుసుకోవాలని ఆమెను నిశితంగా చూసింది కుందవై. ఆ చూపు తీవ్రతను తట్టుకోలేక మణిమేఖల తల వంచుకొంది. ఆమె కళ్ళనుంచి రెండు కన్నీటి బొట్లు కింద రాలి చెదిరాయి.

"అమ్మాయీ! నీవెందుకేడుస్తున్నావు? నీ అన్న ప్రాణాలతోనే ఉన్నాడు కద? నా అన్న కద మీ మాళిగలో ఘోరహత్యకు గురయ్యాడు? ఏడిస్తే నేను కద ఏడ్వాలి? కానీ నన్ను చూడు! నేను ఏడ్వడం లేదు; కన్నీరు విడవడం లేదు. క్షత్రియ కులస్త్రీలు వీరమరణం పొందినవారి గురించి ఏడ్వడం సంప్రదాయం కాదు!" అన్నది కుందవై.

~

మణిమేఖల తలెత్తి యువరాకుమారిని చూసి, "దేవీ! నా అన్న కత్తివల్ల మరణించివుంటే నేను కూడ ఏడ్చేదాన్ని కాను. కానీ, మరణించినవారు...మరణించినవారు..." అని ముందుకు చెప్పలేక వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

కుందవై తాను మొదట సందేహించిందే నిజమయివుండాలని అనుకోసాగింది. ఈమె ఆదిత్య కరికాలన్‌కి తన మనసునర్పించేసిందేమో. అదే నిజమైతే - అయ్యో!, పాపం! తానీమెను ఓదార్చవలసిందే. "అమ్మాయీ! మనసును దిటవు పరచుకో. మనసులో ఉన్నది ధైర్యంగా చెప్పు! చనిపోయినవారు నీ అన్న కాదు; నా అన్నే. అందుకే నీవెందుకేడ్వాలి? ఒకవేళ మీ ఇంట అతిథిగా ఉన్నప్పుడు ఇలా జరిగిపోయింది కద అని దుఃఖిస్తున్నావు కాబోలు! అందుకు నీవేం చేయగలవు? ఇంట్లో పలువురు పెద్దలున్నారప్పుడు. బాధ్యత వారిదే..."

"లేదు, దేవీ! లేదు! బాధ్యత నాదే! అందుకే ఎంత అదిమిపెట్టినా కూడ నా దుఃఖం ఆగడం లేదు. నా కళ్ళనుంచి కన్నీరు పొంగడం కూడ ఆగడం లేదు. ఈ చేత పట్టిన కత్తితో ఆ వీరాధివీరులను చంపానని తలచినప్పుడు నా మనసు బద్దలై ముక్కలు ముక్కలవుతూంది...."

కుందవై అదిరిపడి, "అమ్మాయీ! నీవేం ప్రేలాపిస్తున్నావు? నీకేమైన చిత్తభ్రమ పట్టిందా?" అన్నది.

"లేదు, లేదు! నాకు చిత్తభ్రమ పట్టలేదు. పడితే, ఇకమీద పడుతుందేమో. నిజంగా జరిగిందే చెబుతున్నాను. అదిత్య కరికాలన్‌గారిని చంపింది నేనే. మీకు నిజం చెప్పి తగిన శిక్ష పొందడానికే వచ్చాను..."

"ఛీఛీ! ఇదేం అపనింద? వీరాధివీరుడైన నా అన్న ఒక పిల్ల చేత చంపబడ్డాడని నన్ను నమ్మమంటావా? ఇలా చెప్పమని నీకెవరు నేర్పించి పంపారు?"

"ఎవరూ నాకలా నేర్పించి పంపలేదు, దేవీ! నేను చెబుతున్నది ఎవరూ నమ్మడంలేదు కూడాను. నా అన్న, నాన్నగారు కూడ నమ్మడంలేదు."

"ఎందుకు ఊరకే కట్టుకథలు చెబుతున్నావు? వారే నీకిలా చెప్పమని నేర్పించివుండాలి. లేక, నీవే నీ తండ్రిని, అన్నను కాపాడేందుకు ఇలా కల్పించి చెబుతున్నావు కాబోలు....!"

"దేవీ! వారిని నేనెందుకు కాపాడ ప్రయత్నించాలి? నా ఇష్టానికి విరుద్ధంగా వారు నా పెళ్ళి

చేయజూశారు. మొదట, మధురాంతక దేవరిని కట్టుకో అన్నారు. తర్వాత ఉన్నట్లుండి ఆదిత్య కరికాలన్‌గారిని పిలుచుకొని వచ్చి, 'యువరాజునే నీవు పెళ్ళాడాలి. ఆయనను పెళ్ళాడితే చోళ సింహాసనమెక్కుతావు!' అన్నారు. అలా నన్ను బలిచ్చేందుకు చూసిన వారిని నేనెందుకు  వెనకేసుకు రావాలి? వారు చేసిన నేరాన్ని నేనే చేశానని ఎందుకొప్పుకోవాలి? లేనే లేదు!" అన్నది మణిమేఖల.

"అమ్మాయీ! నీవు చెబుతున్న విషయాలు ఒకదానికన్న ఇంకొకటి విచిత్రంగా ఉన్నాయి. నా అన్న కరికాలన్ని పెళ్ళాడేందుకు ఎందరో రాజాధిరాజుల కుమార్తెలు తపస్సు చేస్తున్నారు. అలా ఉన్నప్పుడు, నీ తండ్రిగారు, నీ అన్న నిన్ను బలిచ్చేందుకు చూస్తున్నారననేల? చోళకులంలో జీవనం అంత కష్టభూయిష్టంగా ఉంటుందని నీవనుకోనేల?"

"దేవీ! నాకు తోడబుట్టిన అక్కచెల్లెళ్ళెవరూ లేరు. మిమ్మల్నే నా తోడబుట్టిన సహోదరిగా ఎంచి చెబుతున్నాను..." అన్నది మణిమేఖల.

"నా అన్నను చంపానని చెబుతున్నావు; నాతోడబుట్టిన సహోదరి అని చెప్పుకోవడానికి ఎంత ధైర్యం నీకు?" అని యువరాకుమారి కాస్త కఠినంగా అన్నది.

"నాకా హక్కుంది. మీ సహోదరులు కరికాలన్‌గారు కూడ నన్ను తమ సహోదరిగానే భావించారు. అలా తమ స్వీయహస్తాలతో రాశారు కూడాను. అది తలుచుకొన్నప్పుడే ఆయనను నేను చంపవలసి రావడం గురించి నా మనసు విలవిల్లాడిపోతూంది. అందుకు ప్రాయశ్చిత్తం ఏమని అడిగేందుకే వచ్చాను!" అనేసి మళ్ళీ ఏడ్వసాగింది మణిమేఖల.

కుందవైదేవి వాణతితో మెల్లని స్వరంతో, "పాపం! ఈ పిల్లకు నిజంగానే చిత్తభ్రమ పట్టింది. ఈ సమయాన పిలుచుకొని వచ్చావు కద! ఉన్నట్లుండి పిచ్చి ముదిరితే ఏం చేయడం?" అన్నది.

వాణతి, "అక్కా! నాకూ దిగులుగానే ఉంది. దయచేసి కోపంగా మాట్లాడకండి. మంచిమాటలతో ఆమెను తిరిగి పంపించేద్దాం!" అన్నది.

కుందవై మణిమేఖలను చూసి, "అమ్మాయీ! జరిగింది జరిగిపోయింది/ గతం గతః. అంతా విధివిలాసం. విచారపడకు. నన్ను నీ అక్కగానే భావించవచ్చు. ఏదో చెప్పాలన్నావు కద? అదేమి? లేక, నీకిష్టమైతే ఇంకొక సందర్భంలో చెప్పవచ్చు!" అన్నది.

"లేదు, లేదు! ఇప్పుడే చెప్పేస్తాను. అక్కా! మీరు స్త్రీగా పుట్టినవారు. కాబట్టి నేను చెప్పేది అర్థం చేసుకొంటారు. పురుషులకెంత చెప్పినా అర్థం చేసుకోరు. ఒక ఆడపిల్ల తన మనసును ఒకరికిచ్చేసిందనుకోండి. అటువంటి వారి చేత ఆయుధమేమీ లేక, నిరాయుధులగా ఉన్నప్పుడు ఇంకొకడు తన చేత ఒక పెద్ద కత్తిని పట్టుకొని ఆయనను చంపబోతున్నాడనుకోండి. అప్పుడు ఆ అమ్మాయి నిజమైన ప్రేమగలదైతే, ఏం చేస్తుంది? చూస్తూ ఊరుకొంటుందా...?"

~

కుందవైకి వెంటనే మందాకిని గుర్తొచ్చింది. ఆమె కన్నీళ్ళు పొంగాయి.

"అదెలా చూస్తూ ఊరుకొంటుంది? అడ్డం వెళ్ళి తన ప్రాణాలను బలిచ్చైనా తన ప్రేమికుని కాపాడజూస్తుంది!"

ఇది విన్న మణిమేఖల, "ఆహ్! ఇలా మంచి ఆలోచన చెప్పేవారు నాకు లేకపోయారు కద? ఆ పాతకి పళువూర్ యువరాణి నందిని మాట విని కద మోసపోయాను? నన్ను తన సహోదరిగా ఎంచి నా పెళ్ళి నేను ప్రేమించినవారితో చేసి పెడతానని చెప్పిన ఉత్తములను ఈ పాపిష్టి చేతులతో చంపేశాను కద?" అని మళ్ళీ వెక్కి వెక్కి ఏడ్వసాగింది.

యువరాకుమారి వాణతివైపు తిరిగి చూసి, "పిచ్చి ముదురుతోంది!" అని మెల్లగా అన్నది.

తర్వాత, మణిమేఖలను చూసి, "అమ్మాయీ! ఏడవకు! జరిగిందేమని చెప్పు! లేకపోతే ఇంకొకప్పుడు చెబుతావా?" అన్నది.

"లేదు, లేదు! ఇప్పుడే చెప్పేస్తాను! నా అన్న గందమారన్ తన స్నేహితులొకరి గురించి నాకు చాలకాలంగా చెబుతూ వచ్చాడు. ఆయన కొన్ని మాసాల క్రితం కడంబూర్‌లో ఉన్న మా మాళిగకు వచ్చారు. ఆయనను చూడగానే 'ఈయనే నా నాధుడు/నాయకుడు/రాజు' అని నా మనసు తీర్మానం చేసింది..."

కుందవై కాస్త తడబడుతున్న గొంతుతో, "అలా నీ మనసును చూరగొన్న ఆ భాగ్యశాలి ఎవరు?" అని అడిగింది.

"ఆయనను భాగ్యశాలి అనా అంటున్నారు? లేదు, లేదు. నా మనసు ఆయన మీదికి మళ్ళినప్పుడు నా దురదృష్టం ఆయనను చుట్టేసుకొంది. ఈ రోజు తంజావూర్ కోట పాతాళ చెరసాలలో ఆయన బంధించబడివున్నారు. అక్కా! పళువేట్టరయ్యర్ ఇంటి ఆడవాళ్ళు చెప్పారు - ఈ కోట లోపలున్న పాతాళ చెరసాల చాల భయంకరమైనదట కద? అందులో చిక్కుబడ్డవారు మళ్ళీ ప్రాణాలతో బయటకు రారట కద?"

"అదంతా అబద్ధం. అమ్మాయీ! నేనూ, ఇదిగో ఇక్కడ నిలబడ్డ వాణతి కొంతకాలం క్రితం పాతాళ చెరసాలకు వెళ్ళాము..."

"దేవీ! నేను పాతాళ చెరసాలకు వెళ్ళ సాధ్యమా? ఒక్కసారి ఆయనను చూడవచ్చా?"

"ఆయనెవరని నీవింకా చెప్పలేదమ్మాయీ!"

"ఆయన వాణర్‌కులవీరులు; పేరు వంతిదేవులు!"

~

కుందవై, వాణతి ఒకరినొకరు చూసుకొన్నారు.

ఇప్పుడు వాణతి కలగజేసుకొని, "ఆయన గురించి నీకెందుకింత దిగులు? ఆయనకు, నీకు

ఏం సంబంధం?" అన్నది.

మణిమేఖల వాణతిని చూసి, "నీవెవరు దాన్నడిగేందుకు?" అని ఉక్రోషంతో అడిగింది.

వెంటనే చల్లబడి, "కోపగించుకోకమ్మా! నీవు కడంబూర్ రాకుమారి వాణతివి కద? నీ పెదనాన్నే కద ఈ కోటకు ఇప్పుడు అధిపతిగా ఉన్నారు? నాకొక వరమివ్వు! నీ పెదనాన్నగారికి చెప్పి వంతిదేవులను పాతాళచెరసాల నుంచి విడుదల చేయించు! ఆయనకు బదులుగా నన్ను పాతాళ చెరసాలలో వేయమని చెప్పు! యువరాజు కరికాలన్‌గారిని చంపిన పాతకిని నేను! నా నేరాన్ని నేనే ఒప్పుకొంటున్నప్పుడు ఇంకొకరి మీద నేరం మోపడం ఏం న్యాయం? దేవీ! మిమ్మల్ని కూడ వేడుకొంటున్నాను. కొడుంబాళూర్ పెద్ద వేళార్ న్యాయం చేయకపోతే, మీ తండ్రి చక్రవర్తికే మొర పెట్టుకోగోరుతున్నాను. అందుకు మీరు సహాయం చేయాలి!" అన్నది మణిమేఖల.

~

కుందవై మనసు పలు అనుభూతులకు లోనై కల్లోలితమైంది. వంతిదేవుని పాతాళ చెరసాలకు వెళ్ళి చూసేందుకే ఆమె జంకుతూంది. ఈ అమ్మాయేమో ఆయన మీదగొన్న ప్రేమ వల్ల హత్యానేరాన్నే తన మీద మోపుకోవడానికి ముందుకొచ్చింది.

కానీ ఈమె చెబుతున్నదాంట్లో నిజం ఎంత? కల్పన ఎంత? ప్రేమికుని కాపాడేందుకు ఇలా కల్పించి చెబుతోందా? ఒక వేళ నందిని దుర్బోధ గురించి చెప్పింది కద? అందువల్ల మతిపోగుట్టుకొని ఆ ఘోరకృత్యాన్ని ఈమే చేసివుండ సాధ్యమా?

లేదు, లేదు; ఈమె అటువంటి పాతక కృత్యం చేయజాలదు; చేసివుండదు. వంతిదేవులను హత్యానేరం నుంచి తప్పించేందుకే ఇలా చెబుతూంది. ఈమె మాట్లాడే తీరునుంచే అది బాగా తెలుస్తూంది. ఈమె మాటలను ఎవరూ నమ్మరు. నమ్మి ఆయనను విడుదల చేయరు కూడాను.

అయినా కూడ, ఈమె వద్దనుంచి ఇంకా ఏమైనా తెలుసుకోవడానికి సాధ్యమైతే అది ప్రయత్నించి చూడాలి. కరికాలన్ అకాల మరణంలో ఏదో మర్మముంది. తప్పక దాన్ని ఈ అమ్మాయి మూలంగా బహిరంగపరచ సాధ్యమా?

"మణిమేఖలా! నీ మనోదృఢత్వాన్ని మెచ్చుకొంటున్నాను. నీవు ప్రేమించినవారిని కాపాడేందుకు ఆ నేరం నీవే చేశావని ముందుకొచ్చిన విషయంగా నిన్ను మెచ్చుకొంటున్నాను. ఇలాంటి అపురూపమైన కార్యాలను కావ్యాల్లోను, ఇతిహాసాల్లోను మాత్రమే విన్నాము. నీగురించి ఆశుకవిత్యం పాడేందుకు ఈ నాడులో కవులెవరూ లేకపోయారు. కానీ నీ మాటలను నేను నమ్మినా, ఇతరులు నమ్మాలి కద? కరికాలన్ నిర్జీవదేహం పక్కనే వంతిదేవులను చూశామని నీ తండ్రి, అన్న చెబుతున్నారు కద? వారి మాటలను నమ్ముతారా, లేక నీ మాటను నమ్ముతారా? నీ మాటను నమ్మేందుకు ఇంకొక ఆటంకం కూడ ఉంది. వాణర్‌కుల యువరాజును నేనే అత్యవసరంగా నా అన్న వద్దకు పంపాను. కడంబూరుకు వెళ్ళకుండ

అడ్డుపడి ఆపమని చెప్పి పంపాను. అలా వెళ్ళినా, కరికాలన్ని ఒక్క క్షణం కూడ వదలక నీడలా ఆయన వెన్నంటి రక్షగా ఉండమని నేనే చెప్పి పంపాను. అలా కరికాలన్ అంగరక్షకులుగా ఉన్న వంతిదేవులు కరికాలన్ మరణించినప్పుడు ఆయన పక్కనే ఉన్నారు. తమ ప్రాణాలిచ్చయినా కరికాలన్ని ఆయన కాపాడివుండాలి. ఈయనే చంపలేదని నిరూపించబడినా కూడ, కర్తవ్యపాలనలో తప్పారన్న నేరానికి తగిన శిక్ష పడుతుంది కద?"

"దేవీ! ఆయన తమ కర్తవ్యపాలనను ఏమాత్రం తప్పలేదు."

"దానికి నీ మాట తప్ప ఇంకేమైనా సాక్ష్యముందా?"

"ఇదిగో సాక్ష్యం! తమ అన్నగారు స్వయంగా రాసి పంపించిన సాక్ష్యమే ఉంది!" అని చెప్పి మణిమేఖల తన ఒొడ్లో దోపుకొన్న ఒక తాళపత్రాన్ని తీసి ఇచ్చింది.

~

కుందవై ఎనలేని ఆతురతతో, ఉద్వేగంతో ఆ తాళపత్రాన్ని చదివింది. అవును; ఆదిత్య కరికాలన్ సొంత చేతిరాతే అది. ఇంకెవరికీ తెలియకూడదని అతడే రాశాడు. తన చెల్లెలు కుందవైనే ఉద్దేశించి ఇలా రాశాడు:-

"నా ప్రియసహోదరి, చక్రవర్తి ముద్దుల కుమార్తె, యువరాకుమారి కుందవైదేవికి ఆదిత్య కరికాలన్ రాయునది.

"ఎంతో కాలంగా నాకు రాత్రుల్లో నిద్రలేదు. మూడేళ్ళ క్రితం ఒక ఘోరపాపం చేశాను. శరణు కోరి లొంగిపోయిన పగవాడిని చంపాను. అతడు, అతడి కోసం ప్రాణభిక్ష కోరిన ఒక ఆడది నన్ను పీపుకు తింటున్నారు. వారు నన్ను నెమ్మదిగా నిద్రపోనివ్వడం లేదు.

"ఈరోజు ప్రాతఃకాలసమయానికి కాసేపటికి మునుపు నిద్రపట్టక బయటికొచ్చినప్పుడు తోక చుక్క ఆకాశం నుంచి కింద పడి మాయం కావడాన్ని చూశాను. నా దేహం నుంచి అప్పుడు ఏదో విడివడి వెళ్ళిపోయింది. ఇప్పుడు ఒట్టి గూడు మాత్రమే ఉంది. సహోదరీ! ఈ << దుర్నిమిత్తం >> నాతో తొలగిపోతుంది. మన ప్రియతమ పితృలకు, అరుళ్మొళికి ఏ ఆపదా కలగకుండ ఆ ఏకాంబర నాధుడు కాపాడనీ. నేను, నీవు మన చిరుప్రాయంలో చోళసామ్రాజ్యపు ఔన్నత్యం గురించి ఎన్నో కలలు కన్నాము. వాటిని నేను నెరవేర్చలేకపోయాను. నా తమ్ముడు నెరవేరుస్తాడు. వాడు ముల్లోకాలను ఏలేందుకు పుట్టినవాడు. వాడికి వాణర్కుల యువరాజు వంతిదేవుడు తోడుగా ఉంటాడు.

"దేవీ! వంతిదేవుడు నీవు ఒప్పజెప్పిన కార్యాన్ని బాగ నెరవేర్చాడని తెలిసి తృప్తిపడ్డాను. లేకపోతే అతన్ని ఇంతటి ముఖ్యమైన కార్యం మీద ఇక్కడికి పంపేదానివి కావు. నన్ను, నా విధి నుంచి తప్పించి కాపాడేందుకు పంపేదానివి కావు.

"సహోదరీ! ఇక్కడ నాకేమైనా జరిగితే, దానికి నా విధి, నా హఠమారితనమే/మొండిపట్టే

కారణం తప్ప వంతిదేవుడు బాధ్యుడు కాడు. వాడు నీవు చెప్పి పంపినట్లే నేనీ కడంబూర్ మాళిగకు రాకుండ అడ్డుకోవడానికి ఎంతెంతో ప్రయత్నించాడు. ఈ మాళిగకు వచ్చిన తర్వాత నీడలాగ నన్ను వెన్నంటి వస్తున్నాడు. అందుకోసమే ఈ ఇంటి ఆడపడుచు మణిమేఖలతో స్నేహం పెంపొందించుకొన్నాడు. ఆమె సహాయంతో నేను వెళ్ళడానికి ఉద్దేశించిన చోటికి నాకన్న ముందే వెళ్ళి దాక్కొనివున్నాడు. అంతా నన్ను కాపాడేందుకే.

"పడగెత్తి ఆడే నాగుపాము మోహనశక్తి చేత ఆకర్షించబడి చిన్న చిన్న ప్రాణులు తమకు తామే దాని మోహపువలలో పడి మరణిస్తాయన్న విషయాన్ని నీవు వినేవుంటావు.

"అలాగే నేను కూడ నందిని చెంతకు వెళుతున్నాను. ఆమె మన సహోదరి అని నీవు నాకు హెచ్చరిక పంపించావు. దాన్ని నమ్మలేకున్నాను. కానీ ఆమె విషయంలో ఏదో ఒక మర్మముంది. దాన్ని తెలుసుకోవడానికే వెళుతున్నాను. ఎలాగూ ఈ రోజు నిజాన్ని తెలుసుకొంటాను.

"నా విధి ఏమైనా, వంతిదేవుని మీద ఏ నిందా లేదు. అతడు నీ ఆజ్ఞను సరిగ్గా నెరవేరుస్తూ వస్తున్నాడు. సహోదరీ! ఆ మాయమోహిని వలలో గందమారన్, పార్థిబేంద్రుడు పూర్తిగా పడిపోయారు. అలా పడిపోక తప్పించుకొని బయటపడ్డవాడు వంతిదేవుడొక్కడే.

"అతడికేం బహుమానం ఇవ్వాలో తోచడం లేదు. ఈ ఇంట్లో ఒక చురుకైన అమ్మాయి ఉంది. నా తోబుట్టువులాగ నాకామె మీద ప్రేమ పుట్టింది. మణిమేఖలను వంతిదేవునికిచ్చి పెళ్ళి చేస్తే అతడికది మంచి బహుమానమవుతుంది. కానీ, సహోదరీ! నీకది సమ్మతమో కాదో తెలియదు.

"నా ముద్దుల చెల్లెలా! ఈ తాళపత్రాన్ని ఆ అమ్మాయి చేతికే ఒప్పజెప్పబోతున్నాను. అదృష్టవశాత్తు ఆమె చదవలేదు. ఆమె గురించి నీకెలా ఇష్టమో అలా చేయి! మన కుటుంబంలో నీవే మహా బుద్ధిశాలివి. నీ మాటను తోసిపుచ్చి నడుచుకొన్నాను. దాని ఫలితాన్ని అనుభవించబోతున్నాను. తమ్ముడు అరుళ్మొళియైనా నీ మాట విని చోళసామ్రాజ్యాన్ని మహోన్నత స్థితికి తీసుకొని వెళ్ళుగాక..."

~

ఈ చోట లేఖాప్రవాహం ఆగిపోయింది. తాళపత్రాన్ని చదివి ముగించినప్పుడు కుందవై కళ్ళనుంచి అశ్రుధారలు ప్రవహించనారంభించాయి.

కళ్ళను చటుక్కున తుడుచుకొని, మణిమేఖలను చూసి, "అమ్మాయీ! ఈ తాళపత్రం నీచేతికెలా వచ్చింది? ఎవరిచ్చారు?" అని అడిగింది.

"దేవీ! యువరాజే నా చేతికిచ్చారు. ఆయన గురించి నందిని ఏవేవో తప్పుగా చెప్పింది. కాబట్టి మొదట నాకే ప్రేమలేఖ రాశారనుకొన్నాను. దీన్ని కాల్చేద్దామనుకొన్నాను. తర్వాత ఏం రాసివుండవచ్చో చూద్దామని ఎంచి భద్రపరిచాను. నా చెలికత్తె చంద్రమతికిచ్చి చదివించాను. నన్ను తన తోడబుట్టిన సహోదరిగా భావిస్తున్నానని రాసిన ఆ వీరపురుషుని ఈ చేతులతో చంపేశానని తెలుచుకొన్నప్పుడు నా

మనస్సు విలవిల్లాడిపోయింది. దేవీ! ఘోరహత్య చేసిన పాతకికి ఎటువంటి శిక్ష విధించాలో ఆ శిక్ష నాకు విధించేలా చేయండి!" అని వేడుకొన్నది మణిమేఖల.

ఆమె ఆదుర్దా, ఆమె మాట్లాడిన తీరు చూస్తే ఆమె ఇదంతా కల్పించి మాట్లాడుతూందని, వంతిదేవుని కాపాడేందుకే ఇలా చెబుతూందని స్పష్టంగా తెలియవచ్చింది. కుందవై అది గ్రహించింది. కానీ ఆమె తీసుకొచ్చిన తాళపత్రం కల్పన కాదు. అది కరికాలన్ సొంత చేతిరాత. వంతిదేవులను చెరవిడిపించడానికి, ఆయన మీద భయంకరమైన హత్యానేరం మోపబడకుండ చేసేందుకు ఈ తాళపత్రమే చాలు. ఈ పిల్ల నోరు మూసుకొనివుంటే చాల అనుకూలంగా ఉంటుంది. కానీ ఈమె నోటినెలా మూయించడం?

"మణిమేఖలా! ఇంకా నీవే కరికాలన్ని హత్య చేశావని హఠం పడుతున్నావా?" అని అడిగింది.

"అవును, దేవీ!"

"ఈ తాళపత్రాన్ని చదివించుకొని విన్నానన్నావు. అందులో నిన్ను తోడబుట్టిన సహోదరిగా భావిస్తున్నానని కరికాలన్ సూచించాడు. నీ మీద అంతటి సహోదర ప్రేమగొన్నవాడిని నీవెందుకు చంపాలి?"

"తాళపత్రాన్ని ముందుగానే చదివించుకొనివుంటే ఆ భయంకర కృత్యాన్ని చేసేదాన్ని కాను. ఆయన మనసు తెలుసుకోక చేసేశాను. ఆ వంచకి నందిని నా మనసును చెడగొట్టేసింది."

"ఏ విధంగా చెడగొట్టింది?"

"వంతిదేవుల మీద కరికాలన్‌గారు ద్వేషంగొన్నారని, ఆయనను చంపినా చంపేయవచ్చని తరచూ చెప్పేది. దానికి తగినట్లు, కరికాలన్‌గారు కూడ చేత కత్తినెత్తి పట్టుకొని, 'ఎక్కడ ఆ వంతిదేవుడు? వాడినిప్పుడే చంపేస్తాను!' అని కేకలేయగా, నేను అది నిజమని నమ్మేశాను. వెంటనే నా చేతనున్న చురకత్తితో..."

"అమ్మాయీ! ఆ మాటను వదిలిపెట్టు. వీరాధివీరుడైన ఆదిత్య కరికాలన్ని ఒక అబల చంపిందని చెబితే, నేను నమ్మినా, లోకం నమ్మనే నమ్మదు."

"దేవీ! ఇంకెవరు చంప సాధ్యం? ఆయన నిర్జీవ దేహం పడివున్న చీకటి గదిలో వంతిదేవులు, నేను మాత్రమే ఉన్నాము. ఆయన చంపలేదు. మరి, నేనే కద చంపివుండాలి?"

"నీవిలా మాట్లాడడం వల్ల మరణించిన నా అన్నకు అపకీర్తి తెస్తున్నావు. పైగా, ఇంకొక విషయం ఆలోచించి చూడు! వాణర్‌కుల వీరులైన వంతిదేవులు నీవు ఆ హత్యానేరం చేశావని ఒప్పుకొని ఊరకొంటారా? ఆయన నిన్ను కాపాడాలనుకోరా? నీవు ఘంటాపథంగా చెబుతున్నట్లు ఆయన కూడ 'నేనే చంపాను' అంటారు. నీవు ఆడపిల్లవు కాబట్టి బహుశ నిన్ను క్షమించి వదిలేస్తారేమో. ఆయనను క్షమించరు. రాజవంశస్థులను చంపిన ద్రోహులకు ఎంతటి భయంకరమైన శిక్ష విధించబడుతుందని నీకు

తెలుసు కద? నాలుగు వీధుల కూడలిలో నిలబెట్టి..."

ఇది విన్న మణిమేఖల భోరున ఏడ్చేసింది. వెక్కి వెక్కి ఏడుస్తూనే, "అక్కా! మీరే ఆయనను కాపాడాలి!" అన్నది.

~~~
~~~

# అధ్యాయము - 52

## విడుదలకు ఆటంకం

**మణిమేఖలను** ఎలా ఓదార్చాలని దీర్ఘంగా ఆలోచించింది కుందవై రాకుమారి. ఆమె మనసు ఎనలేని దుఃఖంతోను, బాధతోను కుంగిపోయివుండడంతో, ఏమీ తోచలేదామెకు.

ఆ సమయాన అంతఃపురం వాకిట ఒక పెద్ద ఘోష లేచింది.

"వాణతీ! అదేమని చూడు! చక్రవర్తి మనోస్థితి, దేహపరిస్థితి కూడ ఈ ప్రజలు మరిచిపోయి, ఇలా కేకలు వేస్తున్నారు!" అన్నది.

వాణతి అంతఃపురం ముంగిట వెళ్ళి తొంగి చూసి, వెంటనే తొందరగా తిరిగి వచ్చింది. చాల ఆదుర్దాతో, "అక్కా! ఆయన వస్తున్నారు!" అన్నది.

"ఆయనంటే ఎవరు?" అని చిరునవ్వుతో అడిగింది కుందవై.

"ఆయనే అక్కా! మీ తమ్ముడు!"

వెంటనే కుందవై, "సరే, అలాగైతే నీవీ పిల్లను కాస్త అవతలికి తీసుకొని వెళ్ళు!" అన్నది.

వాణతి జంకడాన్ని గమనించి, "వెంటనే వెళ్ళు! వాడు నిన్ను చూడకుండ తిరిగి వెళ్ళడు. నేను నీకు చెప్పి పంపిస్తాను!" అన్నది కుందవై.

వాణతి మణిమేఖల చేయి పట్టుకొని అవతలికి పిలుచుకొని వెళ్ళగానే, పొన్నియిన్ సెల్వన్ ప్రవేశించారు.

"తమ్ముడూ! ఇదేమి? నీవెళ్ళే చోటల్లా ప్రజలు గుమిగూడి ఘోషిస్తున్నారని విన్నాను. వారిని అంతఃపురం వాకిలికే పిలుచుకొని వచ్చేశావే! మనసు దెబ్బతిని చాల కుంగిపోయివున్న చక్రవర్తి చెవిన ఈ ప్రజల కేకలు పడితే ఆయన ఇంకెంత బాధపడతారు?" అన్నది

"నేనేం చేయనక్కా! నాకు మాత్రం మనోవేదన లేదా ఏమి? వీరాధివీరులైన అన్నగారి దివ్యదేహం కాలి మసైపోయే లోపలే ఈ జనాలు 'అరుళ్మొళికి పట్టం' అని కేకలు వేయనారంభించారు. ఈ కేకలు, ఘోషలు నాకు కర్ణకఠోరంగా ఉన్నాయి. ఒక్కోసారి ఎవరికీ చెప్పకుండ పారిపోదామా అనిపిస్తుంది. అలా చేస్తే సంక్షోభం, కల్లోలం ఇంకా అధికమవుతుందేమోనని భయమేస్తూంది. మధురాంతకులు, చిన్నరాజులు కుట్ర పన్ని నన్ను కూడ హత్యచేసేశారని నమ్మినా నమ్మేయవచ్చు. అందువల్ల ఏర్పడగల వైపరీత్యాలను తలుచుకొంటే నా మనసు అదిరిపడుతోంది..."

"అవును! అలా ఏనాడూ చేయకు! ఆ ఉద్దేశాన్నే వదిలిపెట్టు! ప్రజలేమనుకొంటారన్నది ఒకవైపుండనీ. చక్రవర్తి హృదయం నిశ్చితంగా బద్దలైపోతుంది. మందాకినీదేవిని, కరికాలన్ని తలుచుకొని,

తలుచుకొని ఆయన బాధపడుతున్నది చాలు!" అన్నది యువరాకుమారి కుందవై.

"అందుకే నేను పారిపోవడానికి జంకుతున్నాను. ఎలాగైనా ప్రజలకు, సైన్యవీరులకు మంచిమాటలతో నచ్చజెప్పి మధురాంతకులకు పట్టం కట్టేందుకు వారందరి సమ్మతాన్ని పొందడానికి ప్రయత్నిస్తున్నాను. నేనిటు తిరగ్గానే మళ్ళీ పాతపాటే మొదలుపెడుతున్నారు - నేను వారి మనస్సులను మార్చాననుకొని ఇటు తిరుగుతాను. వెంటనే తిరుక్కోవలూర్ తాత, కొడుంబాళూర్ మామ వెళ్ళి మళ్ళీ సైన్యవీరుల మనస్సులను మార్చేస్తున్నారు! అక్కా! వారి గురించి నీతో చెప్పేందుకే వచ్చాను. మలైయమాన్ తాతను, కోళార్ మామను నీవు రప్పించి మాట్లాడాలి. నేనేం చెప్పినా వారు చెవిన వేసుకోవడం లేదు. నీవు చెబితే బహుశ వినవచ్చు..."

"నేనూ ఎంతగానో చెప్పి చూశాను, తమ్ముడూ! వారి మొండిపట్టు విడవడం లేదు. ఇంకేమైన ఉపాయం వెతకాలి..."

"అక్కా! వేళార్‌కి నీవు ఒక వార్త చెప్పివుండవు. దాన్ని చెబితే వారు బహుశ నాకు పట్టం కట్టడం గురించి ఇంత మొండిపట్టు పట్టకపోవచ్చు..."

"అదేమి, తమ్ముడూ?"

"నీ చెలికత్తె వాణతి చేసిన శపథమే. ఆమె నాతో సింహాసనంమీద పట్టమహిషిగా కూర్చోనని శపథం చేసివుంది కద? అది తెలియజేస్తే పెద్ద వేళార్‌కి నాకు పట్టం కట్టడంలో ఉన్న శ్రద్ధ తగ్గిపోతుంది!"

"తమ్ముడూ! ఆ విషయాన్ని నేనాయనకు చెప్పలేదనా అనుకొంటున్నావు? ఎప్పుడో చెప్పేశాను. అందుకాయన ఏం చెబుతున్నారో తెలుసా? 'ఒక చిన్న పిల్ల మూఢత్వానికి ఒక పెద్ద సామ్రాజ్యాన్ని నాశనం చేయమంటారా? వాణతి లేకపోతే, ఈ భారతదేశంలో వందమంది రాకుమార్తెలు యువరాజును వివాహమాడేందుకు సిద్ధంగా ఉన్నారు. సింహాసనమెక్కమన్నా ఎక్కుతారు; ఉరికంబమెక్కమన్నా ఎక్కుతారు!' అని చెప్పేసి సేనాధిపతి వాణతివైపు ఒక కోపదృక్కును విసిరారు; ఆ అమ్మాయి గడగడ వణికిపోయింది!"

అరుళ్మొళి చిరునవ్వుతో, "మంచివేళగా అప్పుడు మూర్ఛవచ్చి పడిపోలేదు కద!" అని చెబుతూనే చుట్టుపక్కల పరికించి చూశారు.

"వాణతిని ఒక కార్యంమీద పంపాను" అన్నది కుందవై.

"అక్కా! నీవు, వాణతి నా పక్షముంటే నేను కొంతవరకు సంభాళించవచ్చు. మనమిద్దరం చక్రవర్తి వద్దకు వెళదాము. చక్రవర్తి తప్పనిసరి ఆజ్ఞకు మాత్రమే ఈ ముసలివాళ్ళు బద్ధులై నడుచుకొంటారు..."

"దానికి కూడ ఒక అడ్డంకి ఉంది కద, తమ్ముడూ! శెంబియన్ మహాదేవి అడ్డు నిలుస్తున్నారు కద? మనమాటకు విరుద్ధంగా పెద్దరాణి మొండిపట్టు పడితే, తండ్రి మాత్రం ఏం చేయగలరు? ఆయనకు

పిచ్చి పట్టినా ఆశ్చర్యం ఉండబోదు. కాబట్టి ఈ విషయంలో చక్రవర్తిని ఇబ్బంది పెట్టడం గురించి నాకు భయంగా ఉంది."

"అలాగైతే మనిద్దరం చేరి శెంబియన్ మహాదేవినే ప్రార్థించి వేడుకోవాలి. వారి మనసును మార్చేందుకు ప్రయత్నించాలి. మధురాంతకులకు పట్టం కట్టకూడదని వారు హఠం పట్టడానికి కారణం మనమూహించిందే. కాసేపటి క్రితం ముఖ్యమంత్రి అనిరుద్ధులను వారింట కలిశాను. మధురాంతకులకు ఆయన ఈరోజే నిజాన్ని చెప్పారు. 'నీవు నా కొడుకువి కావు' అన్న వెంటనే, మన చిన్నాన్న ముఖాన్ని నీవు చూసివుండాలి. మంచిక కళతో అందంగా ఉండే ఆయన ముఖం ఘోర రాక్షసుని ముఖంలాగ మారిపోయింది. మంచివేళగా అప్పుడు నేనక్కడికి వెళ్ళి చేరాను..."

"అలాగా? తర్వాతేమైంది?" అని ఆతురతతో అడిగింది కుందవై.

"బామ్మ ముందు చేతులు జోడించి నిలబడి, 'అమ్మా! మధురాంతకులు మీ కడుపున పుట్టిన కొడుకు కాడని నేను కూడ ఎరుగుదును. అందువల్లనేమి? మీరు ప్రేమతో పెంచిన కొడుకు మీ కొడుకే కద? అందువల్ల ఆయనే పట్టం కట్టుకోవాలి' అన్నాను..."

"అందుకు పెద్ద మహారాణి శెంబియన్ మహాదేవి ఏం ఉత్తరమిచ్చారు?"

"వారు బదులు చెప్పేలోపు తిరిగి వచ్చేశాను."

"తమ్ముడూ! మధురాంతకులు శెంబియన్ మహాదేవి కుమారుడు కాకపోయినా, ఇంకొకవిధంగా ఆయనకు చోళసింహాసనం మీద హక్కుందని నీవు చెప్పలేదా? ఆయన కూడ మన తండ్రికి కుమారుడే, మనకు అన్న అని చెప్పలేదా?"

"చెప్పలేదక్కా!"

"ఎందుకు, తమ్ముడూ? అందువల్ల మన తండ్రికి కళంకమేర్పడుతుందని జంకావా? లేక, తర్వాత చెప్పుకొందాములే అనుకొన్నావా?"

"లేదక్కా! నీవు, నేను ఇన్నాళ్ళు ఆ విషయం గురించి అనుకొన్నది ఆధారం లేదని తెలుసుకొన్నాను. అందుకే దాని గురించి ఏమీ మాట్లాడలేదు..."

"అదెలా, తమ్ముడూ?"

"అవునక్కా! ముఖ్యమంత్రి అనిరుద్ధులకు ఆ విషయమంతా బాగ తెలుసు. మన తండ్రి లంక దీవిని వదిలిపెట్టి వచ్చేసిన రెండేళ్ళ తర్వాత మధురాంతకుడు, నందిని కవలలుగా పుట్టారట. కాబట్టి వారు మన తోబుట్టువులవడం సాధ్యం కాదు కద?"

కుందవై కాసేపు దీర్ఘంగా ఆలోచించిన తర్వాత, "అరుళ్మొళీ! ఇది తెలిసి కూడ నీవు మధురాంతకులకు సింహాసనం ఇవ్వడానికి ఇష్టపడుతున్నావా?" అని అడిగింది.

"అవునక్కా! ఎలాగూ మధురాంతకులు మందాకినీదేవి కడుపున పుట్టిన కుమారులు,

శెంబియన్ మహాదేవి పెంచి పెద్ద చేసిన కుమారులు. నాకేమో రాజ్యమేలడంలో ఏమాత్రం ఆశ లేదు. నీ చెలికత్తె కూడ సింహాసనమెక్కడానికి ఇష్టపడడం లేదు..."

"తమ్ముడూ! రామాయణంలో భరతుడు తనకు వచ్చిన రాజ్యాన్ని వద్దని చెప్పి అన్నను పిలుచుకొని రావడానికి వెళ్ళాడు. గుహుడు ఇది వినగానే, 'వెయ్యి మంది రాముళ్ళు నీకు సాటి కారు' అన్నాడట. 'వెయ్యిమంది భరతులు నీకు సాటి కారు' అని చోళదేశ ప్రజలు ఘోషించబోతున్నారు."

"తర్వాత వాళ్ళేమైనా చెప్పనీ. ప్రస్తుతం నన్ను వదిలిపెడితే చాలనిపిస్తోందక్కా! చివరిగా నేనొక యుక్తి ఆలోచించి పెట్టాను. దాన్ని గురించి నీ అభిప్రాయాన్ని తెలుసుకోగోరుతున్నాను.."

"అదేం యుక్తి, తమ్ముడూ?"

"కుడందై వద్ద పళువేట్టరయ్యర్లు సైన్యాన్ని సమీకరించారన్నది నీకు తెలుసు కద?"

"అవును; వారితో చాలమంది చిన్న రాజులు కూడ వచ్చి చేరారని కూడ తెలుసు. కానీ అది చాల చిన్న దండు అని విన్నాను. మన తాతగారు, వేళార్ తీసుకొచ్చిన సైన్యాలతో వెళితే మూడే ఘడియల్లో ఆ దండును తుడిచిపెట్టేయవచ్చని చెబుతున్నారు కద?"

"అలా ఏం జరగకూడదనే ఒక యుక్తి పన్నుతున్నాను. ఎవరికీ తెలియకుండ నేను మాత్రం ఒక గుర్రం మీద వెళ్ళి పళువేట్టరయ్యర్లకు నన్ను నేను ఒప్పజెప్పుకోబోతున్నాను. వారు నన్ను చెరపట్టి బంధించేస్తారు. తర్వాత మన తాత మలైయమాన్, సేనాధిపతి పెద్ద వేళార్ ఏమీ చేయలేరు కద?"

కుందవై ముక్కుమీద వేలేసుకొని ఆశ్చర్యంతో, "అద్భుతమైన యుక్తే. కానీ, తమ్ముడూ! అందులోను ఒక అపాయముంది!"

"ఏమక్కా, అది?"

"నీవు పళువేట్టరయ్యర్లు సమీకరించిన సైన్యాన్ని చేరిన వెంటనే, ఆ సైన్యం వీరులు, 'అరుళ్మొళివర్మకు జయహో! పొన్నియిన్ సెల్వన్ నూరేళ్ళు జీవించుగాక! పొన్నియిన్ సెల్వన్‌కే పట్టం!' అని ఘోషించడానికి మొదలుపెడతారు. తర్వాత పళువేట్టరయ్యర్లను వాళ్ళే చెరపట్టి బంధించినా ఆశ్చర్యపడనవసరం లేదు!"

పొన్నియిన్ సెల్వన్ కాసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయారు. "అవును. ఆ అపాయం కలగవచ్చని నాకు తోచనేలేదు. మంచివేళగా మీరు హెచ్చరించారు. ఈ తంజావూరు కోటలో మారువేషంతో ప్రవేశించినట్లు అక్కడ కూడ మారువేషంలో వెళతాను..."

"ఎంత మారువేషం వేసుకొని వెళ్ళినా కూడ, ఎంతసేపని నిజం బయటపడకుండ ఉంటుంది, తమ్ముడూ? ఒకరికి తెలిస్తే చాలు కద? కొన్ని క్షణాల్లో అందరికీ తెలిసిపోతుంది. చుట్టుపక్కలున్న ప్రజలు కూడ వచ్చి చేరిపోతారు!"

అరుళ్మొళి ముఖం కుంచించుకుపోయింది.

"అక్కా! మరి నన్నింకేం చేయమంటారు? ఈ లోకంలో నేనెందుకని పుట్టాను? ఇతరులకు ఇబ్బందులు కలిగించేందుకా? కావేరిలో నేను పడి మునిగిపోయినప్పుడే చనిపోయివుంటే బాగుండేది కద?"

"తమ్ముడూ! ఎవరు చూడవచ్చారు? జ్యోతిష్కులు, రేఖా శాస్త్రజ్ఞులు చెప్పిందంతా నిజమేనేమో? నీవు వద్దని తోసిపుచ్చినా కూడ రాజ్యలక్ష్మి నిన్ను వరిస్తుందిలాగుంది. నీవు పుట్టిన వేళ అలాంటిది!"

"అక్కా! మీరు కూడ మన తాతగారితో చేరిపోయారా? మీ మనసు కూడ మారిపోయిందా?"

"తాతగారి హితబోధలు నన్నేం చేయలేవు, తమ్ముడూ! కానీ అన్న కరికాలన్ తాళపత్రం వల్ల నా మనసు కాస్త మారిందనడం నిజం. అతడు కన్న కలలన్నీ నీవు నిజం చేస్తావని రాశాడు. అది చదవగానే..." అంటున్నప్పుడు కుందవై కళ్ళలో నీళ్ళుబికి గొంతు కూడ జీరవోయింది.

పొన్నియిన్ సెల్వన్ తన అన్న ఆదిత్య కరికాలన్ రాసిన పత్రాన్ని తీసి చదివాడు. అతడి కళ్ళలోనుంచి కూడ అశ్రుధారలు ప్రవహించాయి.

అతడు తాళపత్రాన్ని చదివి ముగించగానే కుందవై ఇలా అన్నది: "తమ్ముడూ! నీవేమనుకొన్నా సరే, నా మనసులో ఉన్నది చెప్పేస్తాను. నందిని, మధురాంతకుడు మన చోళకులానికి చెందినవారు కారన్నది తెలుసుకోగానే నా మనసు ఒకింత నెమ్మదిగొంది. చోళకులంలో పుట్టనివాడిని, చోళసింహాసనమెక్కించడం నాకిష్టం లేదు. శెంబియన్ మహాదేవి పట్ల, మందాకినీదేవి పట్ల నాకెంత భక్తి ఉన్నా కూడ, అంత దూరం మన విలువలను వదిలిపెట్టేసుకోవడానికి నా మనసొప్పడం లేదు. మధురాంతకునికి పట్టం కట్టడాన్ని నేనిక ఒక్క క్షణం కూడ సహించలేను..."

"అక్కా! అక్కా! మధురాంతకుల ముందు, శెంబియన్ మహాదేవి ముందు, ముఖ్యమంత్రి అనిరుద్ధుల ముందు, 'నాకు సింహాసనం వద్దు' అని చెప్పేసి వచ్చాను. వేవేల వీరుల ముందు, మహాజనుల ముందు కూడ అలాగే చెప్పి వచ్చాను. ఇప్పుడు నేనిచ్చిన మాటను మీరమంటున్నారా?" అని అడిగాడు అరుళ్మొళి.

"తమ్ముడూ! నీకు, నాకు, మనందరికి కులదైవమైన దుర్గాపరమేశ్వరే దారి చూపాలి. నీకేం ఆలోచన చెప్పాలో నాకు కూడ తోచడం లేదు. ఆదిత్య కరికాలన్ నా మాట వినివుంటే, ఇలాంటి పరిస్థితి వచ్చేదే కాదు! ఆ మహావీరునికి ఇటువంటి గతా పట్టాలి?" అని విలపించింది కుందవై.

"ఈ తాళపత్రం మీకెలా వచ్చింది? ఎవరు, ఎప్పుడు తీసుకొని వచ్చి ఇచ్చారు? నాకెందుకు ఇంతకు మునుపే చెప్పలేదు?" అని అడిగారు అరుళ్మొళి.

"కాసేపటి క్రితమే నాకందింది. శంబువరయ్యర్ కూతురు మణిమేఖల తీసుకొని వచ్చి ఇచ్చింది..."

"అవును; నేను కూడ మణిమేఖల గురించి విన్నాను. ఆమె దగ్గరికి ఈ తాళపత్రమెలా వచ్చింది?"

"ఆమే ఇక్కడుంది, తమ్ముడూ! నీవే ఆమెను అడిగి తెలుసుకో. ఆమె మాటలను ఎంతవరకు నమ్మడమో నాకే అర్థం కావడం లేదు" అన్నది యువరాకుమారి.

అరుళ్మొళివర్మ లోపలికి వచ్చిన వెంటనే మణిమేఖలను అతని ముందు నిలబెట్టి వంతిదేవుల గురించి ప్రస్తావింపజేయాలని యువరాకుమారి ఇంతకు మునుపే తీర్మానించుకొంది. ఇన్ని సంభాషణల మధ్య కూడ ఆమె మనసు లోలోపల చెరసాలలో ఉన్న వంతిదేవుల గురించే చాల చింతిస్తూంది. ఆయన గురించి  తానే ప్రస్తావన తేవడానికి ఇష్టపడలేదామె. మణిమేఖలను పిలిపించడానికి తగిన సందర్భాన్ని ఎదురు చూస్తూంది. ఇప్పుడా సందర్భం దొరకగానే, వాణతిని పిలిచి, మణిమేఖలను పిలుచుకొని రమ్మంది.

మణిమేఖల వచ్చేటప్పుడే కళ్ళ నీళ్ళతో శోకమయమైన ముఖంతో వచ్చింది. ఇది చూసిన పొన్నియిన్ సెల్వన్ అమె దుఃఖానికి కారణముందని నమ్మారు.

"తమ్ముడూ! ఈ అమ్మాయే మణిమేఖల. తాళపత్రాన్ని ఈమే తీసుకొచ్చింది. అది ఈమె దగ్గరికెలా వచ్చిందని నీవే అడిగి తెలుసుకో!"

"సహోదరీ! మా అన్న చివరిగా రాసి పంపిన తాళపత్రాన్ని నీవు భద్రంగా తీసుకొని వచ్చి ఒప్పజెప్పావు. అందుకు మేము నీకెప్పుడూ కృతజ్ఞులైవుంటాము!" అని అరుళ్మొళి ఇంకా ముందుకు చెప్పబోయేలోపు, మణిమేఖల ఉన్నట్లుండి అతడి ముందు పడి నమస్కరించింది.

"యువరాజా! పొన్నియిన్ సెల్వా! మీరిప్పుడు చెప్పిన మాట సత్యమేనా? మీరు నాపట్ల కృతజ్ఞతగొన్నవారైతే..."

ఇలా చెప్పేసి, ఇక ముందుకు మాట్లాడలేక వెక్కి వెక్కి ఏడ్వసాగింది మణిమేఖల.

"అక్కా! ఇదేమి? ఈ అమ్మాయి ఎందుకిలా ఏడుస్తూంది? ఒకవేళ ఈమె ఇంట్లో మన అన్న మరణించడం జరిగినందువల్ల విచారిస్తూందా?"

"లేదు, తమ్ముడూ! ఈమె మనసులో ఉన్నది ఇంకొక విషయం. మణిమేఖలా! నా దగ్గర చెప్పింది యువరాజుకు కూడ చెప్పు!" అని యువరాకుమారి ఆమెను ధైర్యపరిచింది.

"అయ్యా! తమ అన్నగారిని చంపిన పాపి నేనే. నన్ను పాతళ చెరసాలలో బంధించేసి, ఆయన్ని విడుదల చేయండి!" అని ఏడుస్తూనే అన్నది.

అరుళ్మొళివర్మ అదిరిపడి కుందవైదేవిని చూసి, "అక్కా! ఈమె ఏమంటూంది? ఈమెకు పిచ్చిగాని పట్టిందా?" అని అడిగారు.

"ఈమెకింకా పిచ్చి పట్టలేదు, తమ్ముడూ! కానీ వంతిదేవులను పాతాళ చెరసాలనుంచి విడుదల చేయించకపోతే, నిజంగానే పిచ్చిపడుతుందీ పిల్లకు!" అన్నది కుందవై.

"ఏమేమి? ఎవరు పాతాళ చెరసాలలో ఉన్నది?" అని అడిగారు అరుళ్మొళి.

"లంకకు నేను తాళపత్రమిచ్చి పంపిన వాణర్‌కుల వీరులను అడుగంటా మరిచిపోయావా, తమ్ముడూ?"

ఒక దీర్ఘస్వప్నంనుంచి అప్పుడే బయటికొచ్చి ఇహలోక ప్రజ్ఞగొన్నవారిలాగ ఒక నిమిషంపాటు అగుపించారు యువరాజు. తంజావూరు కోటలోపల ప్రవేశించినప్పటినుంచి ఒకదాని తర్వాత ఒకటిగా జరిగిన సంభవాలు ఆయన ధ్యాసను పూర్తిగా ఆక్రమించుకొన్నాయి. కరికాలన్ మరణవార్త వచ్చిన తర్వాత, మధురాంతకుని చోళసింహాసనమెక్కించడానికి దారులు వెతకడంలోనే ఆయన మనసంతా పూర్తిగా నిమగ్నమైంది.

వంతిదేవుని గురించి ఆయన నిజంగానే మరిచిపోయారప్పుడు. ఇప్పుడతని పేరు వినగానే ఉలిక్కిపడి, "ఎవరు? నా ప్రియస్నేహితులు వంతిదేవులా పాతాళ చెరసాలలో ఉన్నారు? ఎందుకని? ఎవరాయనను చెరసాలలో బంధించింది?" అని అడిగారు.

మణిమేఖల చెప్పిన వివరాలను కుందవై తన తమ్మునికి విశదీకరించింది.

అంతా విన్న తర్వాత పొన్నియిన్ సెల్వన్, "అక్కా! నాలాంటి కృతఘ్నులెవరూ ఉండరు. వాణర్‌కులవీరులను గురించి నేను విచారించనే లేదు. అది నా తప్పే! ఆయన్ని పాతాళ చెరసాలలో బంధించడానికి తెగించినవారు నాకన్న పెద్ద నేరస్థులు. మన అన్నగారిపట్ల ఆయనకెంత భక్తివిశ్వాసాలున్నవన్నది నేనెరుగుదును. కరికాలన్ మరణానికి ఆయన్ని బాధ్యులను చెయడానికి తెగించింది ఎవరు? ఇదేం మూఢత్వం? ఆయన్ని తప్పించేందుకు ఈ అమ్మాయి తన మీద ఆ నేరాన్ని వేసుకోవడం మనకందరికీ ఒక పాఠాన్ని నేర్పిస్తున్నట్లుంది. ఈ అమ్మాయిని చూసేందుకే నాకు సిగ్గుగా ఉంది. తక్కిన కార్యాలు తర్వాత చూద్దాం. ఇప్పుడే పాతాళ చెరసాలకు వెళ్ళి వంతిదేవులను విడిపించుకొని వస్తాను. నీవు శంబువరయ్యర్ కుమార్తెను ఓదార్చు!" అని చెప్పేసి, వెనుదిరిగి గబగబా నడిచి వెళ్ళనారంభించారు.

ఆయన వాకిలి దగ్గరికి రాగానే, అక్కడ తిరుక్కోవలూర్ మలైయమాన్, కొడుంబాళూర్ పెద్ద వేళార్ ప్రత్యక్షమైనారు.

వారి తీరే యువరాజు మనసులో ఒక సందేహాన్ని కలిగించింది.

పెద్ద వేళార్ తమ చేతనున్న శూలాన్ని వాకిలికి అడ్డంగా, యువరాజును అడ్డుకొనే ఉద్దేశంతోనా అన్నట్లు పట్టుకొని నిలబడ్డారు. ఆయన వెనక మలైయమాన్ కూడ తమ చేతి ఖడ్గాన్ని నేలకానించి, యువరాజు ముందుకెళ్ళడాన్ని అడ్డుకోజూస్తున్నట్లు నిలిచారు.

పొన్నియిన్ సెల్వన్ అమితాశ్చర్యంతోను, కాస్త కోపంగాను, "సేనాధిపతీ! ఇదేమి? నన్ను కూడ చెరపట్టి బంధించబోతున్నారా?" అని అడిగారు.

"యువరాజా! ఇప్పుడు పాతాళచెరసాలకు వెళ్ళకుండ తమను అడ్డుకొంటున్నాము. అవసరమైతే చెరపట్టి బంధించడమూ చేస్తాము!" అన్నారు సేనాధిపతి బూది విక్రమకేసరి.

ఆయన చెబుతున్నది నిజమా, వేళాకోళానికా అని పొన్నియిన్ సెల్వన్‌కి అర్థం కాలేదు. కానీ వేళాకోళాన్ని సహించే స్థితిలో లేదాయన మనసిప్పుడు. కాబట్టి మునుపటికన్న ఎక్కువ కోపంగొన్న గొంతుతో, "ఏ అధికారంతో నన్నాపడానికి ముందుకొచ్చారు?" అని అడిగారు.

"మీరు ఏ అధికారంతో పాతాళ చెరసాలలో ఉన్నవాడిని విడుదల చేసేందుకు ముందడుగు వేశారు?" అని ఎదురు ప్రశ్న వేశారు సేనాధిపతి.

"సేనాధిపతీ! నాకా అధికారం లేదా? నేనెవరన్నది మరిచిపోయారా? లేక, మిమ్మల్ని మీరే మరిచిపోయారా?"

"నన్ను నేను మరువలేదు; మీరెవరన్నది కూడ మరిచిపోలేదు. నేనిప్పుడు తంజావూరు కోట దళపతిని. కాబట్టి పాతాళ చెరసాలకు కాపలావాడిని కూడాను. తమరు చక్రవర్తి దివ్యకుమారులు, పొన్నియిన్ సెల్వర్. అయినా కూడ, తమ అన్నగారిని హత్యచేశాడన్న నిందమోపబడ్డవాడిని విడుదల చేసేందుకు అధికారం లేదు. చక్రవర్తికి మాత్రమే ఆ అధికారం ఉంది. లేక, చక్రవర్తి స్థానంలో పట్టం కట్టుకోబోయేవారికి మాత్రమే ఆ అధికారం ఉంది. మీరేమో చోళసింహాసనమెక్కనని దండోరా చాటి చెబుతున్నారు. కాబట్టి చక్రవర్తి ఆజ్ఞ లేనిదే ఎవరినీ పాతాళ చెరసాలనుంచి విడుదల చేయడం సాధ్యం కాదు!" అన్నారు కొడుంబాళూర్ పెద్ద వేళార్ సేనాధిపతి బూది విక్రమకేసరి.

"బిడ్డా! వేళార్ చెబుతున్నది నిజం. చిన్న పళువేట్టరయ్యర్ పారిపోయినందువల్ల పెద్ద వేళార్‌ని కోట దళపతిగా నియమించారు చక్రవర్తి. కాబట్టి పాతాళ చెరసాలనుంచి ఎవరినీ విడిపించడానికి నీకు అధికారం లేదు!" అని మలైయమాన్ ఆమోదించారు.

పొన్నియిన్ సెల్వన్ వారికి బదులేం చెప్పాలో తోచక మౌనంగా నిలబడ్డారు.

మణిమేఖల వెక్కిళ్ళ ఏడ్పు మాత్రమే అక్కడ వినిపించిందప్పుడు.

~~~
~~~

# అధ్యాయము - 53

## వాణతి ఆలోచన

**అరుళ్మొళివర్మకు**, సామంతరాజులకు మధ్య జరిగిన వాగ్వివాదాన్ని వింటూ నిలబడ్డ కుందవై దేవి ఇప్పుడు కాస్త ముందుకు వచ్చి, "తాతా! మామా! వాకిట నిలబడే మాట్లాడాలా? లోపలకు రండి! మీ మాటను మీరి పొన్నియిన్ సెల్వన్ ఏమీ చేయబోడు!" అన్నది.

మలైయమాన్, పెద్ద వేళార్ లోపలికి వచ్చారు. యువరాకుమారిని చూసి పెద్ద వేళార్, "తల్లీ! యువరాజు గనక పట్టానికి ఒప్పుకొంటే ఏ తంటా ఉండదు. ఆయన ఆజ్ఞను నెరవేర్చవలసినవారమవుతాము. చక్రవర్తేమో రాజ్యభారాన్ని ఎప్పుడు కిందకు దించుదామా అని చూస్తున్నారు. కంచికి వెళ్ళి తమ కోసం కరికాలన్ నిర్మించిన బంగారు మాళిగలో తమ చివరి రోజులను గడపాలనుకొంటున్నారు!" అన్నారు.

"మామా! మీరిద్దరూ వచ్చినప్పుడు నేనూ అదే చెబుతున్నాను యువరాజుకు. ఈ అమ్మాయి అడ్డొచ్చి మొర పెట్టుకొంది. అది విని యువరాజు కనికరించి చెరసాలకు వెళ్ళి ఆయనను విడుదల చేయగోరుతున్నారు..."

"ఈ అమ్మాయెవరు? ఎందుకని ఇలా వెక్కి వెక్కి ఏడుస్తూంది?" అని అడిగారు వేళార్.

"తెలియలేదా మామా? ఈమే శంబువరయ్యర్ కూతురు మణిమేఖల..."

"ఓహో! శంబువరయ్యర్ చెరసాలలో ఉండడాన్ని ఎంచి ఏడుస్తూంది కాబోలు. ఏడవకమ్మాయి! నీ తండ్రిని విడుదల చేసి పిలుచుకొని రమ్మని చక్రవర్తి ఆజ్ఞ జారీ చేసేశారు. పాతాళ చెరసాలకు పార్థిబేంద్ర పల్లవుడు వెళ్ళాడా కార్యం మీద!" అన్నారు మలైయమాన్.

"తాతా! ఈ అమ్మాయి తన తండ్రిని గురించి మాత్రమే దిగులు పడడం లేదు. వాణర్కుల వీరుని గురించి దిగులుపడుతోంది. 'ఆయనను విడుదల చేయండి. యువరాజును నేనే చంపాను!' అని ఏడుస్తూంది!" అన్నది యువరాకుమారి.

"ఓహో! ఈమె అలా చెబుతూంటే, ఈమెను కూడ తీసుకొని వెళ్ళి పాతాళ చెరసాలలో వేసేద్దాం. వాణర్కుల వీరుని విడుదల చేయలేం!" అన్నారు పెద్ద వేళార్.

మణిమేఖల వెక్కి ఏడుస్తూనే కుందవైని చూసి, "అదే నేనూ కోరుకొంటున్నాను/వేడుకొంటున్నాను, రాకుమారీ! నన్ను కూడ ఆయనున్న చోటికి తీసుకొని వెళ్ళి బంధించమని చెప్పండి!" అన్నది.

సేనాధిపతి పెద్ద వేళార్ తమ నెత్తిని వేలితో తాకి చూపుతూ, మెత్తగా, "ఈ పిల్లకు చిత్తభ్రమ

పట్టినట్లుంది!" అన్నారు.

~

ఇంతవరకు మౌనంగా ఉన్న వాణతి ఇప్పుడు కలిగించుకొని, "పెదనాన్నా! మణిమేఖల చిత్తం సరిగానే ఉంది. మీకూ, తిరుక్కోవలూర్ తాతగారికే చిత్తం సరిగ్గా లేనట్లుంది. చెరసాలలో ఉన్న వల్లవరయ్యర్ పొన్నియిన్ సెల్వన్‌గారి ప్రియమిత్రులు. యువరాకుమారి ఇచ్చిన తాళపత్రాన్ని తీసుకొని లంకకు వెళ్ళి యువరాజును పిలుచుకొని వచ్చారు. వీరస్వర్గం పొందిన యువరాజుగారి పూర్తి నమ్మకానికి పాత్రులయినవారు. ఆయన మీద నేరం మోపి చెరసాలలో బంధించినవారికే చిత్తస్వాధీనం లేకుండాలి!" అన్నది.

"ఆహా! ఈ పిల్ల ఎప్పుడు ఇంత మాటలకోరుగా తయారయ్యింది? యువరాకుమారినుంచి నీవు నేర్చుకొన్నదిదేనా? పెద్దల ముందు నోరు తెరవకుండ ఊరుకోవడానికి నీవింకా నేర్వలేదా? నిన్నేమైనా అడిగితే మాత్రం సమాధానం చెప్పాలి. లేకపోతే నోరు మూసుకొని ఉండాలి!" అన్నారు పెద్ద వేళార్.

మలైయమాన్, "సేనాధిపతీ! ఈ బిడ్డమీద ఎందుకు కోపగించుకొంటున్నారు? ఇక్కడున్నవారందరి మనసుల్లో ఉన్నదే చెబుతూంది!" అన్నారు.

కుందవై, "అవును, మామా! వాణతిని ఇక మీరు, నేను గద్దించడం ఉచితంగా ఉండదు. రేపామె చోళసామ్రాజ్య సింహాసనం మీద కూర్చోబోతూంది. అప్పుడామె ఆజ్ఞను మీరూ, నేనూ శిరసావహించవలసి ఉంటుంది.!" అన్నది.

"అరుళ్మొళి గనక అందుకు ఒప్పుకొంటే ఏ దిగులూ ఉండదు కద? మకుటాభిషేకం రోజు పాతాళ చెరసాలలో ఉన్నవారందరినీ విడుదల చేయమని ఆజ్ఞాపించవచ్చు కద?" అన్నారు మలైయమాన్.

"మిమ్మల్ని, నన్ను, బయట ఉన్నవారందరిని కూడ చెరసాలలో వేయమని కూడ ఆజ్ఞాపించవచ్చు!" అన్నారు సేనాధిపతి.

"అయ్యో! మీరిద్దరూ పెద్దలు. మిమ్మల్ని ఎదిరించి మాట్లాడవలసి వస్తూంది కద అని విచారిస్తున్నాను. కానీ అత్యవసరంగా చేయవలసిన కార్యాలను వదిలిపెట్టి ఏవేవో మాట్లాడుతున్నారు..." అని యువరాజు చెప్పేలోపు సేనాధపతి, "యువరాజా! చోళనాడు సింహాసనానికి ఎవరు అర్హులు, హక్కుగలవారన్నది నిశ్చయించి, సంక్షోభమేమీ కలగకుండ అడ్డుకోవడం అత్యవసరమైన కార్యం కద?" అన్నారు.

"చక్రవర్తి ఒకరున్నారన్న విషయాన్నే మరిచిపోయి మాట్లాడుతున్నారు!" అన్నారు అరుళ్మొళి.

"మేము మరిచిపోలేదు. కాసేపటి క్రితం చక్రవర్తిని దర్శించే వస్తున్నాము. ఆయన రాజ్యం గురించిన ప్రశ్నను తీర్మానించేందుకు చాల తొందర పడుతున్నారు. తీర్మానించేసి కంచికి వెళ్ళి అక్కడ కరికాలన్ కట్టిన బంగారు మాళిగలో నివసించేందుకు ఇష్టపడుతున్నారు."

"ఇదిగో ఇప్పుడే చక్రవర్తి వద్దకు వెళుతున్నాను - వంతిదేవుల విడుదలకు ఆజ్ఞ తీసుకొని వస్తాను. తర్వాత మీరు అభ్యంతరం చెప్పరు కద?"

"యువరాజా! చక్రవర్తి సమక్షంలో మీరు వంతిదేవుని గురించి ప్రస్తావించడమే ఉచితం కాదు. పాండ్యనాడు ఆపత్కాల సహాయకులతోను, నందినీదేవితోను కుమ్మక్కై/కూడబలుక్కొని వంతిదేవుడే కుట్ర చేసి పెద్ద యువరాజును హత్య చేసివుండాలని చక్రవర్తి భావిస్తున్నారు..."

"ఆఁ! ఆ అభిప్రాయాన్ని చక్రవర్తి మనసులో పుట్టించిందెవరు?"

"మేము కాదు, యువరాజా! ఆ పార్థిబేంద్రుడే అటువంటి సందేహాన్ని చక్రవర్తి మనసులో పుట్టించాడు."

"అలాగైతే నేను తిన్నగా వెళ్ళి పార్థిబేంద్రపల్లవులతోనే మాట్లాడుతాను. దేన్ని ఆధారంగా తీసుకొని అటువంటి నింద మోపుతున్నారని అడుగుతాను."

"పార్థిబేంద్రుని మీరిప్పుడు కలవలేరు. చక్రవర్తి ఆజ్ఞ మేరకు అతడు శంబువరయ్యర్‌ని విడుదల చేసుకొని కుడందైకి వెళ్ళాడు. అక్కడ చిన్న పళువేట్టరయ్యర్‌ని, తక్కిన చిన్నరాజులను కలిసి, వెంటనే వారందరిని పిలుచుకొని రమ్మని చక్రవర్తి చెప్పి పంపారు. రాజ్యం హక్కు గురించి సమరసభావంతో మాట్లాడి తీర్మానిద్దామని సందేశం పంపారు. మధురాంతకునికే పట్టం కట్టేందుకు సమ్మతిస్తున్నామని కూడ తెలియజేసి ఉన్నారు."

~

పొన్నియిన్ సెల్వన్ విప్పారిన ముఖంతో యువరాకుమారిని, వాణతిని చూసేసి, "చాల మంచి వార్త చెప్పారు" అన్నారు.

"ఏమాత్రం మంచి వార్త కాదు. ప్రజల కోరికకు, సైన్యవీరుల మాటకు ఎదురుగా మధురాంతకుడు ఏనాడు చోళ సింహాసనాన్ని అధిష్టిస్తాడో, ఆరోజే నూరేళ్ళుగా విరాజిల్లుతూ వస్తున్న చోళ సామ్రాజ్యానికి వినాశకాలం ఆరంభమౌతుంది" అన్నారు సేనాధిపతి.

"అందులో సందేహం లేదు. ఈలంనాడు మొదలు ఉత్తరపెన్న వరకు కల్లోలం, ఆందోళన మొదలవుతాయి" అన్నారు మలైయమాన్.

"దానికంతా మీరిద్దరే నాయకత్వం వహించి జరిపిస్తున్నారు కాబోలు. అది మీ ఇష్టం. అంతలోపు నేను చక్రవర్తికి నా విన్నపం తెలియజేసి వంతిదేవులను విడుదల చేయజూస్తాను!" అని అరుళ్మొళి వర్మ అక్కడి నుంచి బయటకు వెళ్ళేందుకు తిరిగారు.

"యువరాజా! చక్రవర్తి వద్దకు మీరు ఈ కోరికతో వెళ్ళవద్దు. అందువల్ల పెద్ద వైపరీత్యం కలుగుతుంది. అమ్మా! మీ తమ్మునికి అడ్డుపడి ఆపండి!" అన్నారు సేనాధిపతి పెద్ద వేళార్ కుందవైని ఉద్దేశించి.

"అందువల్ల ఎటువంటి వైపరీత్యం కలుగుతుందంటున్నారు?" అని అడిగింది కుందవై.

"ఎవరో కొందరు పాపిష్టివాళ్ళు ఒక బూటకపు వదంతిని పుట్టించారు. దాన్ని చెప్పడానికి కూడ నోరు పెగలడంలేదు. పొన్నియిన్ సెల్వన్‌గారు రాజ్యకాంక్షగొని, వంతిదేవుని పంపించి కరికాలన్‌గారిని చంపించారని నిన్న మన సేనావీరులు ఇద్దరు వచ్చి చెప్పారు..."

"దైవమా! ఇదేం భయంకరమైన నింద" అని ఆక్రోశించింది కుందవై.

"ఆ ఇద్దరినీ మన వీరులేం చేశారో తెలుసా? నది వెల్లువలో నొక్కేసి మళ్ళీ పైకెత్తి మళ్ళీ నొక్కసాగారు. నేను యధాలాపంగా అటు వెళుతూ ఆ దృశ్యాన్ని చూసి వారిని కాపాడాను..."

పొన్నియిన్ సెల్వన్ కలిగించుకొని, "ఇంతటి క్రూరమైన అపనిందను చోళనాడులో ఎవరూ నమ్మబోవడం లేదు. మన వీరుల చేతలనుంచే తెలియడం లేదా?" అన్నారు.

"ఈరోజు నమ్మరు, యువరాజా! ప్రజల స్వభావం మీకు తెలియదు. కొంతకాలం తర్వాత మళ్ళీ ఈ వదంతి తలెత్తుతుంది. మిమ్మల్ని ఎరగనివారు కొందరు నమ్మవచ్చు. అన్యదేశాలలో రాజ్యం కోసం బంధువులే ఒకరినొకరు చంపుకోవడం సర్వసాధారణంగా ఉంది. లంకారాజ్యపు రాజవంశ చరిత్ర మీకు తెలిసిందే కద?"

"సేనాధిపతీ! భవిష్యత్తులో ఒక పెద్ద వదంతి పుట్టబోతుందని నా ప్రాణస్నేహితుని పాతాళ చెరసాలలో వదిలిపెట్టమంటున్నారా?"

"పిదపకాలంలో కాదు, యువరాజా! ఇప్పుడు మీరు వంతిదేవుని విడుదల చేయించడంలో ఆసక్తి చూపిస్తే, రేపే ఆ వదంతిని నమ్మనారంభించేస్తారు. చక్రవర్తి చెవిలో కూడ అది పడుతుంది. అందువల్ల మీ తండ్రిగారి మనసు ఎంత గాయపడుతుందో ఆలోచించి చూడండి!"

~

పొన్నియిన్ సెల్వన్ దివ్యవదనం కారుమేఘులతో కప్పబడిన చంద్రునిలాగ మారింది. కుందవైదేవిని చూసి, "అక్కా! మీరేమంటారు?" అన్నారు.

యువరాకుమారి వదనం అతివేదనాభరితమై తోచింది. ఆమె పెద్ద వేళార్‌ని చూసి, "సేనాధిపతీ! ఇంతటి భయంకరమైన, క్రూరమైన వదంతిని పుట్టించేందుకు ప్రయత్నించినవారు ఎవరై ఉండవచ్చు?" అని అడిగింది.

"నదిలో మన వీరులు ముంచి, ముంచి ఎత్తిన ఆ ఇద్దరిని నేను పక్కకు తీసుకొని వెళ్ళి నయానా, భయానా అడిగి చూశాను. శంబువరయ్యర్ కొడుకు గందమారనే వాళ్ళకిలా చెప్పి పంపాడని నిజాన్ని కక్కేశారు!"

అప్పుడు మణిమేఖల ముందుకొచ్చి, "నా అన్న చేసిన పనికి నేను సిగ్గుపడుతున్నాను. మంచిగావున్న నా అన్న పళువూర్ యువరాణి దుర్బోధలవల్లనే ఇలా పాపిష్టివాడయ్యాడు. నిజానికి

ఆదిత్య కరికాలన్‌గారిని చంపింది నేను. నన్ను చెరలో వేయండి. వల్లవరయ్యర్‌ని వెంటనే విడుదల చేయండి!" అని ఆవేశం, దుఃఖమూ పొంగిరాగా అన్నది.

కుందవైదేవి ఆమె వెన్ను నిమిరి, "మణిమేఖలా! శాంతంగా ఉండు! నీవు చెబుతున్నది ఎవరూ నమ్మరు. పైగా ఏదైనా అపనింద పుట్టిస్తారు. ఈ ఇక్కట్టును దాటేందుకు దారి వెతుకుదాం" అన్నది.

తర్వాత సేనాధిపతిని చూసి, "అయ్యా! మీ హితబోధను నేను, నా తమ్ముడు ఒప్పుకొంటున్నాము. ఇప్పుడు వంతిదేవులను విడుదల చేయ ప్రయత్నిస్తే అది లేనిపోని అపనిందలకు, వదంతులకు దారితీస్తుందన్నది నిజమే. నిజమైన నేరస్థుడిని మొదట వెతికి కనిపెట్టండి. ఇందుగురించి ముఖ్యమంత్రి అనిరుద్ధులను కలిసి మాట్లాడుతాను. ఆయన శిష్యుడు ఆళ్వార్ కట్టియాన్ పాండ్యనాడు ఆపత్కాల సహాయకులను వెతుక్కొంటూ వెళ్ళాడు. అతడేమైనా వార్త తీసుకొని వస్తాడు. పెద్ద పళువేట్టరయ్యర్, పళువూర్ యువరాణి ఏమయ్యారో తెలియడం లేదు. వారు కనిపెట్టబడినా కూడ నిజం బయటపడవచ్చు. అంతలోపల నేనీ అమ్మాయిని అడిగి కడంబూరులో జరిగినదంతా తెలుసుకొంటాను! అంతవరకు పాతాళ చెరసాలలో వంతిదేవులు సౌకర్యంగా ఉండేందుకు ఏర్పాట్లు చేయండి. ఆయన ఈ ఘోర భయంకర హత్యానేరాన్ని చేయలేదన్నది మాత్రం నిజం!" అన్నది.

ఈ సమయాన, "నాకో ఉపాయం తోస్తూందక్కా!" అన్నది కొడుంబాళూర్ రాకుమారి.

"చెప్పు, వాణతీ!" అన్నది కుందవై.

"మునుపొకసారి మనమిద్దరం పాతాళ చెరసాలకు వెళ్ళి వచ్చాం, గుర్తుందా? అదేలాగ మనమందరం ఈరోజు కూడ వెళ్ళి చూసివద్దాం. కడంబూర్ రాకుమారిని కూడ పిలుచుకొని వెళదాం!" అన్నది వాణతి.

కుందవై పెద్ద వేళార్‌ని చూసి, "సేనాధిపతీ! మీ కుమార్తె ఆలోచన గురించి మీరేమంటారు?" అని అడిగింది.

"నా కూతురు కూడ తెలివితేటలు కలదని తెలుస్తూంది. కరికాలన్‌గారు మరణించిన రాత్రి అదే చోట ఆయనతో ఉన్నవాడు ఆ వాణర్‌కుల వీరుడు. అతన్ని విచారించినా కూడ నిజం తెలియరావచ్చు" అన్నారు పెద్ద వేళార్.

వెంటనే అందరూ పాతాళ చెరసాలకు వెళ్ళారు. చిన్న పళువేట్టరయ్యర్ కోటను విడిచి వెళ్ళక ముందే బంగారు నాణాలను అచ్చు వేసే పనిని ఆపించేశారు. కాబట్టి నాణ్య కర్మాగారం నడవడం లేదు. కాపలావాళ్ళు కూడ కొంతమంది మాత్రమే ఉన్నారు. పులులు బోనుల్లో బంధించివున్న చోటును కూడ దాటి సొరంగమార్గం గుండా ముందుకు వెళ్ళి వంతిదేవుడు బంధించబడివున్న గదిని చేరారు.

కానీ అక్కడ వారికి వంతిదేవుడు కనిపించలేదు. అతడి గదిలో గోడనుంచి వేలాడదీసిన

వలయాలకు గొలుసుతో కట్టబడివున్న వైద్యకుమారుడు పినాకపాణి కనిపించాడు. అతడు వీరిని చూడగానే, "అయ్యో! అయ్యో! నన్ను విడుదల చేయండి! విడుదల చేయండి!" అని దీనంగా గోలపెట్టాడు.

~~~
~~~

# అధ్యాయము - 54

## పినాకపాణి

**వైద్యకుమారుడు** పినాకపాణి రాజ్యాంగంలో పెద్ద పదవికి చేరుకోవాలని తీర్మానించుకొన్నాడు. వంతిదేవుని మొట్టమొదట కలిసినప్పటినుంచి ఈ ఆశ అతని మనసులో పుట్టు పెరిగి పెద్దది కాసాగింది.

ఇంతకు మునుపు అతడు చేపట్టిన కార్యాల్లో అంతగా గెలుపొందలేదు. నందినీదేవి అతడిమీద కాస్త కరుణ చూపించినట్లు తోచింది. తర్వాత పళువూర్ రాణి అతన్ని పూర్తిగా మరిచిపోయింది. కుందవైదేవిని చూడ వెళ్ళినప్పుడు ఆమె అతన్ని సరిగ్గా చూడను కూడ లేదు, మాట్లాడలేదు కూడాను. పళైయార్లై అంతఃపురం ముందు వంతిదేవుని మీద 'గూఢచారి' అని నిందారోపణ చేసినందుకు తనకు దొరికింది దెబ్బలే తప్ప లాభమేమీ లేదు.

కానీ ముఖ్యమంత్రి అనిరుద్ధులు అతన్ని పిలిపించి కోడిక్కరైకి వెళ్ళి మూగరాణిని పిలుచుకొని రమ్మని పంపినప్పుడు, ఇక తనకు పెద్ద పదవి దొరకడం తథ్యం అని అనుకొన్నాడు. ఆ కార్యాన్ని ఎలాగైనా సజావుగా ముగించేస్తే చాలు; ముఖ్యమంత్రి దయ వల్ల తాను పొందలేనిదేదీ ఉండబోదు. తర్వాత మొట్టమొదటి కార్యంగా వంతిదేవునికి తగిన శాస్తి చేసి, తర్వాత ఆ పూంగుళలి గర్వాన్ని అణచి, బుద్ధి చెప్పాలి.

ఇలా గాలిమేడలు కట్టుకొంటూ పినాకపాణి కోడిక్కరైకి వెళ్ళాడు. అక్కడ రాక్కమ్మను మెల్లగా మచ్చిక చేసుకొన్నాడు. ఆమె అతని మాటలకు మోసపోయి, అతడు కూడ పాండ్యనాడు ఆపత్కాల సహాయకుల కూటమికి చెందినవాడని నమ్మేసింది. అనా నమ్మి, వారి ప్రయత్నాలు, పన్నాగాల గురించి అతడికి చెప్పింది. ఆమె సహాయంతో మూగరాణిని వెతికి పట్టుకొని తంజావూరు కోట వాకిలి దాకా తీసుకొని వచ్చి చేర్చాడు.

ఈ ప్రయాణం పొడుగునా పినాకపాణి బుర్ర పనిచేస్తూనే ఉంది. మూగరాణికి సంబంధించిన రహస్యాలను ఎలాగైనా తెలుసుకోవాలనుకొన్నాడు. తంజావూరు పాతాళ చెరసాలలో తానొక రోజు బంధించబడివున్నప్పుడు అక్కడ ఒక పిచ్చివాడు చెప్పిన మాటలు గుర్తుకొచ్చాయి. అప్పుడు అతని మాటలు ఒక పిచ్చివాడి ప్రేలాపనలని తోచాయి. ఇప్పుడు ఆ మాటల్లో నిజముండవచ్చని అనుకొన్నాడు.

~

మూగరాణి ఎక్కివచ్చిన పల్లకి తంజావూరు కోట సమీపానికి వచ్చినప్పుడు సుడిగాలి, వానవల్ల చెట్టొకటి విరిగి అతడి మీద పడింది కద? అందువల్ల ఏర్పడ్డ గాయాలు మానిన తర్వాత

ముఖ్యమంత్రి అనిరుద్ధులను చూడవెళ్ళాడు. అంతలోపల ముఖ్యమైన సంఘటనలు చాల జరిగిపోయాయి. మూగరాణి చక్రవర్తిని కాపాడబోయి తన ప్రాణాలనే కోల్పోయింది. ఆదిత్య కరికాలన్ ఘోరహత్యకు పాలై మరణించారు. తదుపరి పట్టపురాజెవరన్న విషయం గురించి దేశమంతా అల్లకల్లోలంగా ఉంది. తంజావూరు కోట కడుంబాళూర్ వేళార్ అధీనంలోకి వచ్చేసింది. పళువేట్టరయ్యర్లు, వారికి పక్షాన ఉన్న చిన్న సామంతరాజులు సైన్యాలను కూడదీస్తున్నారన్న వార్త వ్యాపించింది. పెద్ద అంతర్యుద్ధం జరగవచ్చన్న సూచనలు గోచరించసాగాయి.

ఇటువంటి కల్లోలిత పరిస్థితిలో పినాకపాణి వెళ్ళి ముఖ్యమంత్రి అనిరుద్ధులను దర్శించాడు. పెద్ద దిగులులో మునిగివున్న బ్రహ్మరాయలు పినాకపాణితో ఎక్కువసేపు మాట్లాడి సమయం వృధా చేయదలచలేదు. తాము విధించిన కార్యాన్ని నెరవేర్చాడు కాబట్టి, అతడికి తగిన బహుమానమిచ్చి వెంటనే పంపించేయాలనుకొన్నారు.

కానీ పినాకపాణి పిచ్చివాడు పాతాళ చెరసాలలో చెప్పిన వివరాలను చెప్పనారంభించగానే ఆయన శ్రద్ధ దాని మీదికి మళ్ళింది. పాండ్యరాజ్యపు పురాతన మణిమకుటం, దేవేంద్రుడే స్వయంగా ఇచ్చినట్లు చెప్పబడే రత్నహారం లంకలో ఎక్కడున్నాయన్న రహస్యం ఆ పిచ్చివాడికి తెలుసని వినగానే అనిరుద్ధుల ఆసక్తి పెరిగింది. ఆ రత్నహారాన్ని, మణిమకుటాన్ని పరాంతక చక్రవర్తి కాలం నుంచి వెతుకుతున్నా, ఫలితం దక్కలేదు. వాటిని కైవసం చేసుకొనే వరకు, 'పాండ్యవంశానికి చెందినవాడు' అని చెప్పుకొనేవారు ఎవరైనా ఒకరు మొలకెత్తుతూనే ఉంటారు. తిరుప్పురంపయంలో అర్ధరాత్రి ఒక చిన్న పిల్లాడిని పాండ్యసింహాసనమెక్కించి, మణిమకుటం ధరింపజేసిన నాటకాన్ని ఆళ్వార్ కట్టియాన్ ద్వారా ఆయనెరుగుదురు. ఇలా ఎవరైనా ఒకరు అప్పుడప్పుడూ తలెత్తుతూ ఉంటారు. వారికి లంక రాజులు, చేరదేశపు రాజులు సహాయం చేస్తూంటారు. పాండ్యరాజ్యం శాశ్వతంగా చోళసామ్రాజ్యంలో విలీనం కావాలంటే, చోళ చక్రవర్తే మదురైలో కూడ పట్టాభిషేకం చేసుకోవాలి. ఆ వైభవసమయంలో పాండ్యరాజు రత్నహారాన్ని కూడ చోళ చక్రవర్తి ధరించాలి.

~

ఇదంతా ముందుగానే అనిరుద్ధులు తీర్మానించిన విషయాలు. అందుకే లంక మీద దండెత్తి వెళ్ళిన ప్రతి చోళ దళపతికీ అనిరుద్ధులు పైన వివరించిన మణిమకుటాన్ని, రత్నహారాన్ని వెతికి తెసుకొని రమ్మని చెప్పి పంపేవారు. ఇంతవరకు ఆ కార్యంలో ఎవరూ గెలుపు సాధించలేదు.

ఇప్పుడు పాతాళ చెరసాలలో ఉన్న ఒకడికి అవెక్కడున్నాయో తెలుసని వినగానే అనిరుద్ధ బ్రహ్మరాయలకు ఆసక్తి పొంగి రావడం సహజమే కద?

~

వైద్యకుమారుడు ఇంకొకవార్త కూడ చెప్పాడు. అది ముఖ్యమంత్రి ఉత్సుకతను

హెచ్చించడమేగాక, చాల దిగులు కలిగించింది కూడాను. ఆ పిచ్చివాడు చోళవంశానికి చెందిన ఒక మహత్తరమైన రహస్యం తనకు తెలుసనీ, చోళ సింహాసనానికి హక్కు తనదేనని గొప్పలు చెప్పుకొంటున్న యువరాజు మధురాంతకుడు అసలు చోళవంశానికి చెందినవాడే కాడని చెప్పాడని పినాకపాణి చెప్పాడు.

ఇదంతా విన్న తర్వాత అనిరుద్ధులు తాము పాతాళ చెరసాలకు వెళ్ళి ఆ పిచ్చివాడిని చూడాలనుకొన్నారు. తర్వాత ఆ ఆలోచనను మార్చుకొన్నారు. తామక్కడికి వెళితే ఎందుకు, ఏల అన్న ప్రశ్నలు తలెత్తుతాయి. మలైయమాన్, వేళార్ తమను పూర్తిగా నమ్మినవారు కారు. ఆయన (ముఖ్యమంత్రి) చక్రవర్తి కోరిక మేరకు మధురాంతకుని పక్షాన్నే ఆదరిస్తున్నారని వారు భావిస్తున్నారు. తాము పాతాళ చెరసాలకు వెళితే అందునుంచి ఏవైనా కొత్త సందేహాలు పుట్టవచ్చు. శంబువరయ్యర్ని చూడబోతున్నామని కూడ భావించవచ్చు. ఈ అంశం గురించి కూడ బాగా ఆలోచించిన తర్వాత, అనిరుద్ధులు వైద్యకుమారుడు పినాకపాణినే ఉపయోగించుకోవాలనుకొన్నారు. తమ రాజముద్ర పొదిగిన ఉంగరాన్ని ఇచ్చి పాతాళ చెరసాలకు వెళ్ళి ఆ పిచ్చివాడిని చూసి రమ్మని చెప్పి పంపారు.

పినాకపాణి ఆ విధంగానే పిచ్చివాడిని చూసేందుకు పాతాళ చెరసాలకు వెళ్ళాడు. పక్కగదిలో వంతిదేవుడు బంధించబడి ఉండడాన్ని చూడగానే అతడికి ఉత్సాహం, సంతోషం పొంగి వచ్చాయి. ఆ గది ముందు నిలబడి వంతిదేవునితో మాట్లాడ ప్రయత్నించాడు. వంతిదేవుడు అతడితో మాట్లాడలేదు. అందువల్ల కోపగించుకొని అతన్ని బాగ తిట్టేసి పక్కగదికి వెళ్ళాడు. పిచ్చివాడు అతడితో సుముఖంగానే మాట్లాడాడు. నిజానికతడు పిచ్చివాడు కాదని పినాకపాణి గ్రహించాడు. తర్వాత పాండ్యదేశపు మణిమకుటం, రత్నహారాల గురించి అడిగాడు. పిచ్చివాడు వెంటనే మౌనందాల్చాడు. చోళవంశపు రహస్యాన్ని చెప్పేందుకు కూడ నిరాకరించాడు. 'నాకు మొదట విడుదల ఉత్తర్వు తీసుకొని రా! తర్వాతే అదంతా చెబుతాను!' అని చెప్పేశాడు.

పినాకపాణి తిరిగివచ్చి ముఖ్యమంత్రితో తన ఓటమి గురించి చెప్పాడు. అతన్ని విడిపించుకొని వస్తే తప్పక ఫలితం దక్కుతుందన్నాడు. ముఖ్యమంత్రికి కూడ అది ఉచితమని తోచింది. ఇలా రాజ్యహక్కు గురించి గందరగోళంగా ఉన్నప్పుడు అపాయకరమైన రహస్యాల గురించి మాట్లాడే పిచ్చివాడిని చెరలో ఉంచడం మంచిది కాదని భావించారు. అతన్ని తమ మాళిగకే పిలుచుకొని నిజాన్ని తెలుసుకోవాలనుకొన్నారు.

ఆ విషయంగా కొడుంబాళూర్ పెద్ద వేళార్ని చూసి ఈ వార్తను తెలియజేశారు. చిన్న పళువేట్టరయ్యర్ వల్ల చాల ఏళ్ళ క్రితం చెరలో బంధించబడ్డ ఒక ఖైదీని విడుదల చేయడం ఆయనకు అభ్యంతకరమనిపించలేదు. కాబట్టి ఆ పిచ్చి ఖైదీని విడుదల చేసేందుకు ఆజ్ఞ రాసిచ్చారు.

~

దాన్ని తీసుకొని పినాకపాణి గర్వంతో పాతాళ చెరసాలకు వెళ్ళాడు. మొదట వంతిదేవుని గది

ముందు నిలబడి అతన్ని విడుదల చేసేందుకు ఆజ్ఞ తీసుకొచ్చినట్లు చెప్పాడు. వంతిదేవుడు అది నిజమని నమ్మి అతనికి కృతజ్ఞతలు తెలియజేయ మొదలుపెట్టాడు. వెంటనే పినాకపాణి తన నిజస్వరూపాన్ని చూపించాడు. వంతిదేవుని బాగా తిట్టి, 'నీకు నాలుగు వీధుల కూడలిలో ఉరి కంబం మీదే విడుదల' ని ఎగతాళి చేశాడు. తర్వాత పక్కగదికి వెళ్ళి పిచ్చివాడితో సుముఖంగా మాట్లాడాడు. అతన్ని గోడకు చేర్చి కట్టివున్న గొలుసును విప్పాడు. 'ఇదిగో నిన్ను విడుదల చేసేందుకు ఉత్తర్వు తీసుకొచ్చాను. ఇప్పుడైనా నీకు తెలిసిన రహస్యాలను చెబుతావా?' అని అడిగాడు.

ముఖ్యమంత్రి అనిరుద్ధుల వద్దకు పిలుచుకొని వెళ్ళేముందు తానె మొదట ఆ రహస్యాలను తెలుసుకోవాలని తహతహలాడాడు వైద్యకుమారుడు.

పిచ్చివాడు తన విడుదల గురించి అంతగా ఉత్సాహంగొన్నవాడిలాగ అగుపించలేదు. బయటపడేందుకు కూడ అంతగా తొందరపడుతున్నవాడిలాగ కనిపించలేదు. పినాకపాణి మాటలమీద అంతగా నమ్మకంగొన్నట్లు కూడ తోచలేదు. 'ఏదీ? ఉత్తర్వు ఎవరు జారీ చేశారు? చెరసాలనుంచి విడుదల నిశ్చయమా? కోట నుంచి బయటపడేందుకు వదులుతారా?' అని అడగసాగాడు.

ఉన్నట్లుండి పక్కగోడనుంచి కొన్ని రాళ్ళు పెకలించుకొని పడ్డాయి. పినాకపాణి అదేమని తిరిగి చూసినప్పుడు వంతిదేవుడు అతని వెనక నిలబడివుండడాన్ని గమనించాడు. పినాకపాణి వెంటనే బొడ్లో దోపుకొన్న చురకత్తిని తీశాడు. వంతిదేవుడు అతడి మీదికి లంఘించి అతడి గొంతును గట్టిగా పట్టుకొన్నాడు. అతడి చేతనున్న కత్తిని కూడ కొట్టి కింద పడేశాడు. కాసేపు ఇద్దరూ కింద దొర్లి ద్వంద్వ యుద్ధం చేశారు. అప్పుడు పిచ్చివాడు గోడమీదనున్న గొలుసును తీసి పినాకపాణి గొంతు చుట్టూ మెలిదిప్పాడు.

~~~
~~~

# అధ్యాయము - 55

## "పిచ్చాడు!"

**కడంబూర్** నుంచి తంజావూరు ప్రయాణంలో వంతిదేవుడు చాలభాగం స్పృహలేని స్థితిలోనే ఉన్నాడు. ఒక కొయ్యబండిలో అతన్ని కట్టిపెట్టారు. కరికాలన్ మరణించిన రాత్రి అతన్ని పొగ, మంటలు చాల బాధించాయి. ప్రయాణంలో కాస్త తెలివి వచ్చినప్పుడల్లా కళ్ళలో మంట, ఒళ్ళంతా నొప్పులు అతనికి ఎనలేని బాధను కలిగించాయి. సగం స్పృహ వచ్చినప్పుడు ఏవేవో భయంకరమైన దృశ్యాలు అతని ముందు కనిపించి వేపుకు తిన్నాయి. పాండ్యుని తల మాత్రం అతని ముందుకొచ్చి, "ఒరే! నీవా నా పగ తీర్చుకోవడానికి అడ్డు నిలబడుతున్నావు?" అనేసి కోపంగా చూసింది. నందిని కొన్నిసార్లు ఆభరణాలంకారాలతో అతని ముందు నిలిచి, చిరునవ్వు చిందిస్తూ అతన్ని తన మాయవలలో వేసుకోజూసింది. ఇంకొకసారి తలవిరబోసుకొని ఏడుస్తూ నిలబడింది. మరొకసారి దెయ్యంలాగ కనిపించి భయంకర వికటాట్టహాసం చేసింది. ఆదిత్య కరికాలన్ని వెంబడిస్తూ ఒక నీడ చేత కత్తితో రాసాగింది. వంతిదేవుడు దాన్ని అడ్డుకోవడానికి ప్రయత్నించినపుడల్లా ఇంకొక రాక్షస నీడ అతని వెనకనుంచి వచ్చి అతని గొంతు పిసికింది. జ్వాలలు లేస్తున్న నిప్పుల్లోకి అతన్ని రవిదాసు, అతని అనుచరులు ఎత్తి పడేశారు. అతని ఒళ్ళు నిప్పంటుకొని కాలుతున్నప్పుడు గందమారన్ అతన్ని చూసి, "ఒరే, మిత్రద్రోహీ! నీకిలాగే జరగాలి!" అన్నాడు. పార్థిబేంద్రుడు అతన్ని చూసి, "ఒరే! నీకు, యువరాకుమారికి వివాహం నిశ్చయమైపోయిందా? ముహూర్తం ఎప్పుడు?" అని అడిగేసి పడిపడి నవ్వాడు. సేందన్ అముదన్ అతన్ని నిప్పుల్లోంచి కాపాడేందుకు ఎక్కడినుంచో పరుగెత్తుకొని వచ్చాడు. వైద్యకుమారుడు ఒక చెట్టు వెనక దాక్కొని అతని తలమీద ఒక పెద్ద కర్రతో బాదాడు.

ఒళ్ళంతా నిప్పంటుకొని కాలుతున్నప్పుడు అతనికి విపరీతంగా, తట్టుకోలేనంతగా దాహం వేసింది. "నీళ్ళు! నీళ్ళు!" అని అరవాలనుకొన్నాడు. కానీ నోటినుంచి శబ్దమే బయటకు రాలేదు. గొంతెండిపోయి, నాలుక పిడచ కట్టుకొనిపోయి పైనోటికంటుకొని, అతన్ని మాట్లాడనివ్వకుండ చేసింది. ఈ పరిస్థితిలో మణిమేఖల ఒక బంగారు గిన్నెలో దేవామృతాన్ని తీసుకొని వచ్చి అతని నోట పోసింది. అతడామెకు కృతజ్ఞతలు తెలియజేసేలోపు ఆమె చీకటిలో మాయమైంది...! ఆహా! ఈ అమ్మాయి ప్రేమకు ప్రతిఫలంగా ముల్లోకాలను బహుమతిగా ఇవ్వవచ్చు! కానీ తనదీ అని ఒక్క జాన రాజ్యం కూడ లేనప్పుడు, మణిమేఖలకు ముల్లోకాలను ఇవ్వాలనుకోవడం ఎంత బుద్ధిహీనత?

అదిగో పూంగుళలి! "నా ప్రేమికులు!" అని కొరివి దెయ్యాలను చూపిస్తూంది; ఎంత విచిత్రమైన పిల్ల! "ఈ భూలోకంలో ఎందుకు యాతన పడుతున్నావు? నిన్ను బంగారు లోకానికి తీసుకువెళతాను

చూడు!" అన్నది. "పొన్నియిన్ సెల్వన్ ఉన్న లోకానికే కద తీసుకొని వెళుతున్నావు?" అని అడిగాడు తాను. వెంటనే నలువైపుల నుంచి కొరివి దెయ్యాలు వచ్చి అతన్ని చుట్టుముట్టాయి. వంతిదేవుడు భీతిగొని కళ్ళు మూసుకొన్నాడు. పిశాచాలు అతన్ని పట్టి లేపుకొని వెళ్ళి కోడిక్కరైలోని ఇసుక దిబ్బల మీదినుంచి కిందకు దొర్లించాయి.

వంతిదేవుడు అదిరిపడి కళ్ళు తెరిచి చూశాడు. చేత దివిటీలు పట్టుకొన్న కాపలా వీరులు అతన్ని ఒక పడవలోకెక్కించినట్లు తెలుసుకొన్నాడు. ఇదేం నదో తెలియడం లేదు. కొళ్ళిడం, కావేరి, లేక కుడమురుట్టి కావచ్చు... ఇంతలో చీకటి కమ్ముకొని అతని తెలివిని మరుగుపరిచింది.

~

ఇలా ఎన్నెన్నో అనుభవాల తర్వాత ఉన్నట్లుండి ఏడు సముద్రాలు కల్లోలితమైనట్లు ఒక పెద్ద శబ్దం వినిపించింది. అతని మీద ఒక పెద్ద అల గుద్ది అతన్ని ముంచేస్తూంది....ఇప్పుడు వంతిదేవునికి పూర్తిగా తెలివొచ్చి కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా కాస్త దూరాన తంజావూరు కోట వాకిలి కనిపించింది. అతడు కట్టబడ్డ బండి ముందు, వెనక, నలువైపుల జనసముద్రం కనిపించింది. అంతమందీ ఒక్కటిగా గోల పెడుతున్న శబ్దమే తనకు ఏడు సముద్రాలు పొంగుతున్నట్లు వినిపించిందని గ్రహించాడు.  కరికాలన్ అంతిమ యాత్ర తంజావూరు కోటను సమీపించినందువల్లనే అంతటి జనసందోహం అని తెలుసుకొన్నాడు.

కాసేపటికల్లా అంత పెద్ద గుంపూ ఆ చోటు విడిచి తొలగింది. అతడు, శంబువరయ్యర్ మాత్రమే కొంతమంది కాపలావాళ్ళు వెంట రాగా కోట లోపలికి తీసుకొని వెళ్ళబడ్డారు. ఆహా! ఆ మహావీరుని అంత్యక్రియలు జరుగుతున్నప్పుడు అతని అంతరంగ, ప్రియస్నేహితుడైన తాను అతని చెంత ఉండే భాగ్యం కూడ లేకుండపోయింది. తన దురదృష్టం అంతేనా? చివరిదాక ఆయన ప్రాణాలకు ఆపద రాకుండ కాపాడేందుకు ఎంతగానో ప్రయత్నించిన తనమీద, ఆయనను తానే చంపానన్న నింద మోపారు! ఆయన దివ్యదేహం ఆ కడంబూర్ మాళిగకు పట్టుకొన్న మంటల్లో కాలిపోకుండ తప్పించి, ఇటువంటి మహావీరునికి తగిన మర్యాదలను ఈ ప్రజలందరూ చేసేందుకు అవకాశం కల్పించిన తాను, అటువంటి తనను ఇప్పుడు హంతకులను, రాజద్రోహులను, కుట్రదారులను బంధించి పడేసే పాతాళ చెరసాలకు తీసుకొని వెళుతున్నారు. తీసుకొని వెళితేనేమి? త్వరలోనే తన గురించి యువరాకుమారి, పొన్నియిన్ సెల్వన్ విచారిస్తారు. తాను చెరలో ఉన్నానని తెలియగానే గాభరాపడి చెరసాల తాళం చెవి తీసుకొని పరుగెత్తి వస్తారు. కరికాలన్ ప్రాణాలను తాను కాపాడలేకపోయినా, ఆయనను కాపాడేందుకు తాను చేసిన ప్రయత్నాలన్నీ తెలుసుకొని తనని మెచ్చుకొంటారు.

కానీ నిజంగానే మెచ్చుకొంటారా? అసలు తనను వారు జ్ఞాపకం చేసుకొంటారా? సహోదరుని కోల్పోయినవారు ఆ దుఃఖంలో తక్కిన విషయాలన్నీ మరిచిపోరా? తాను నేరస్థుడిని కానని చెబితేనే నమ్ముతారా? నమ్మినా మునుపటిలాగ తనతో స్నేహంగా మసలుకొంటారా?

బంగారు నాణ్య కర్మాగారం గుండా అతన్ని పాతాళ చెరసాలకు తీసుకొని వెళుతుండగా, అతని నమ్మకం రాను రాను సన్నగిల్లసాగింది. ఆ టంకశాలను కాసేపటి క్రితమే చిన్న పళువేట్టరయ్యర్ మూసేశారు. ఆ దారిన అక్కడక్కడ కొందరు మాత్రమే కాపలా వీరులున్నారు. వారు తాటి చిహ్నం పొదిగిన పట్టీలను ధరించిలేదు. కొడుంబాళూర్ వేళార్ పాత చెరసాల కాపలా వీరులందరినీ పంపించేసి, తమ మనుషులను అక్కడ కాపలాకు నియమించారు. కొత్తగా చెరసాల లోపలికి వచ్చిన వారిద్దరనీ ఆ కాపలా వీరులు చిరాగ్గా చూశారు. ఒకరికొకరు, "వీడే కడంబూర్ శంబువరయ్యర్; వీడు వాణర్‌కులపు వంతిదేవుడు. యువరాజును చంపిన ఛండాలుడు" అని మాట్లాడుకొంటుండడం వంతిదేవుని చెవిన పడింది. పులిబోనులున్న దారిన వారిని తీసుకొని వెళ్ళినప్పుడు, చోళకుల రాజుల కరుణకు అవి చిన్నాలుగా తోచాయి. మళ్ళీ కిందకు వెళుతున్న మెట్ల వెంబడి వంతిదేవుని తీసుకొని వెళ్ళి ఒంటరిగా ఉన్న ఒక గదిలో బంధించి గదికి తాళం వేసి కాపలా వీరులు వెనుదిరిగినప్పుడు, అతడు నమ్మకాన్ని పూర్తిగా కోల్పోయాడు. అక్కడినుంచి తాను విడుదల కాబోవడం లేదు. చనిపోయిన తర్వాతే తన నిర్జీవదేహాన్ని అక్కడినుంచి బయటకు తీసుకొని వెళతారని భావించాడు. చిన్న పళువేట్టరయ్యర్‌కి ముందస్తుగానే తన మీద సందేహం. పార్థిబేంద్రునికేమో తనమీద ఎనలేని ద్వేషం. ముసలాయన మలైయమాన్‌కి పార్థిబేంద్రుని మాట మీదే నమ్మకం. పళువేట్టరయ్యర్లు వత్తాసు పలికి శంబువరయ్యర్ మీద నేరం లేదని త్వరలోనే విడుదల చేయించేందుకు శ్రద్ధ చూపుతారు. కానీ తన గురించి అలా ఎవరూ శ్రద్ధ తీసుకోరు. ఏకంగా హత్యానేరాన్నే మోపుతారు. నేరం మోపి, బహిరంగంగా నేర విచారణ జరుపుతారా? అలా విచారణ చేస్తే తాను నిజాన్ని చెప్పవచ్చు. లేదు, లేదు! విచారణే జరపరు. విచారణ జరిపితే, నందిని గురించి, రవిదాసు గురించి నిజం బయట పడవలసివస్తుంది. అదంతా ఎవరూ ఇష్టపడరు. తనని ఆ చెరసాలలోనే పడి చావమని వదిలేస్తారు. లేక, విచారణ ఏమీ జరపక, కరికాలన్‌ని చంపినవాడని తీర్మానించి నాలుగు వీధుల కూడలిలో ఉరి కంబమెక్కిస్తారు.

దైవమా! మొట్టమొదట తాను తంజావూరు కోటకు వచ్చినప్పుడు తన మనసులో పొంగిన ఉత్సాహమేమి? ఏమేం కలలు కన్నాడు? ముఖ్యంగా, కుడందై జ్యోతిష్కుల ఇంట యువరాకుమారి కుందవైని, వాణతిని చూసినప్పుడు ఎంతటి కుతూహల సముద్రంలో తేలియాడుతూ తంజావూరుకు వచ్చాడు! అప్పుడు చిన్న పళువేట్టరయ్యర్ తనని గూఢచారి అని అనుమానించి పాతాళ చెరసాలలో పడేస్తారేమోనని తాను కాస్త భయపడ్డాడు. అది ఇప్పుడు ఇంకొక విధంగా నిజమైంది! ఆకాశవీధిలో ఉల్లాసంగా తిరిగుతూ కాలం గడుపుతున్న తనను ఈ చీకటి గుయ్యారంలో బంధించేశారు కద! ఇందులో తానెంతకాలం ఉండగలడు? కానే కాదు! ప్రాణం విడిచేందుకు ఇంకేదైనా దారి వెతకాల్సిందే...

ఇలా ఎన్నో ఆలోచనలతో మనసు డీలా పడిపోయి నిశ్చేష్టుడై కూర్చొనివున్నాడు వంతిదేవుడు.

~

ఆ సమయాన పక్క గదిలో ఎవరో గొంతు సవరించుకొనే శబ్దం వినిపించింది. వెన్వెంటనే కర్ణకఠోరమైన గొంతుతో...

"పొణ్ణార్ మేనియనే...! [బంగారు వన్నె మేనుగలవాడా...!]..."

అన్న భక్తిగీతం కూడ వినిపించింది.

వంతిదేవునికి వెంటనే సేందన్ అముదన్ గుర్తుకొచ్చాడు. కానీ పాడుతున్నవాడతను కాడు. సేందన్ అముదన్ గొంతు చాల ఇంపైనది. ఇప్పుడు పాడుతున్నది కర్ణకఠోరమైనది. కానీ అదే పాటను ఇక్కడ పాతాళ చెరసాలలో ఉన్నవాడు పాడేందుకు కారణమేమి?

శివ, శివా! తన చెవులతో వినలేకపోతున్నాడు. పాతాళ చెరసాలలో బంధించబడడం చాలదన్నట్లు ఈ అపూర్వ సంగీతాన్ని వినే శిక్ష కూడానా?

"ఎవరు బాబూ, అక్కడ?" అని అడిగాడు వంతిదేవుడు.

"నేనే, పిచ్చివాడిని" అని సమాధానం వచ్చింది.

"అయ్యా! పిచ్చివాడా! దయ చేసి నీ పాటను ఆపు!"

"ఏం? నా పాట నీకు నచ్చలేదా?"

"నచ్చకేం? నీ పాట నాకు చాల బాగ నచ్చింది!"

"పాట ఆపిన తర్వాత చాల నచ్చింది కాబోలు!"

"అలా ఏం నీవు పిచ్చివాడిలాగ అనిపించడం లేదు. ఈ పాటను నీకెవరు నేర్పించారు?"

"నీవిప్పుడున్న గదికి కొంతకాలం క్రితం ఇంకొక యువకుడొచ్చాడు. కొన్ని రోజులు మాత్రమే ఉన్నాడు. అప్పుడతడు ఎడతెరపి లేక ఈ పాటనే ఎప్పుడూ పాడుతుండేవాడు! నాకది కంఠాపాఠమైపోయింది!" అన్నాడు పిచ్చివాడు.

వంతిదేవుడు ఆ యువకుడు సేందన్ అముదనే అని తీర్మానించుకొన్నాడు. తాను తప్పించుకోవడానికి సహాయం చేశాడని చిన్న పళువేట్టరయ్యర్ సేందన్ అముదన్ని పాతాళ చెరసాలలో బంధించి ఉంచారని వంతిదేవుడు విన్నాడు. ఈ గదిలోనే అతన్ని బంధించి ఉండాలి. ఆహా! సేందన్ అముదన్ బంగారంలాంటి అబ్బాయి! ఎంతటి మంచి స్నేహితుడు!

"ఈ గదిలో కొన్నాళ్ళున్న ఆ కుర్రాడెవరు? నీకు తెలుసా?" అని అడిగాడు.

"తెలియకేం? అతడి పేరు సేందన్ అముదన్. ఎవరో ఒక మూగదాని కొడుకట! నిజానికతడు ఎవరని లోకానికి తెలిస్తే..."

"తెలిస్తే ఏమవుతుంది?"

"లోకమే తలకిందులైపోతుంది!"

"లోకం తలకిందులైతే మనకి ఈ పాతాళ చెరసాలనుంచి విడుదల దొరుకుతుందా?"

"తప్పక దొరుకుతుంది!"

"అలాగైతే అతడెవరన్నది చెప్పవేం!"

"నీకంత తేలిగ్గా చెబుతానా? దాన్ని చోళ చక్రవర్తి చెవిలో మాత్రమే చెబుతాను! ఇంకా సుందర చోళులే కద చోళసామ్రాజ్య చక్రవర్తిగా ఉన్నారు?"

"అవును. అందుగురించి నీకెందుకు సందేహం?"

"కొన్ని రోజుల క్రితం ఇక్కడ కొన్ని మార్పులు జరిగాయి. పాత చెరసాల కాపలావాళ్ళు మారి కొత్త కాపలా మనుషులు వచ్చారు. టంకశాలను మూసేశారు. అది తెరిచివుండి, పని చేస్తున్నప్పుడు బంగారు నాణ్యాలు ముద్రించేవారు పనిచేసే శబ్దం ఎడతెరపి లేకుండ వినిపించేది."

"ఎందుకు మూసేశారు? ఎందుకు కాపలావాళ్ళు మారారు?"

"చిన్న పళువేట్టరయ్యర్ కోట కాపలా వదిలి పారిపోయారట. కొడుంబాళూర్ పెద్ద వేళార్ కోటను కైవసం చేసుకొన్నారట. కాపలావాళ్ళ మాటలనుంచే నేనిదంతా తెలుసుకొన్నాను."

"ఓహో! అలాగా!" అన్నాడు వంతిదేవుడు.

~

కొడుంబాళూర్ బూది విక్రమ కేసరి తనని బాగా పరిశోధించి తెలుసుకొన్నవారు. ఆయన ఒకవేళ తన మాటని నమ్మి తనని విడుదల చేస్తారా? - ఆయనకది ఎలా సాధ్యం? ఎవరికి మాత్రం సాధ్యం? యువరాజు కరికాలన్ని చంపినవాడన్న నేరం మోపబడ్డవాడిని ఎవరు అంత తేలిగ్గా విడుదల చేయగలరు?

"ఏం తమ్ముడూ! మౌనందాల్చావు? మళ్ళీ పాడనా?" అని పిచ్చివాడు గొంతు సవరించుకొన్నాడు.

"వద్దు, వద్దు! నీవు చెప్పిన విషయాల గురించి ఆలోచిస్తున్నాను. సేందన్ మూగదాని కొడుకు కాదని చెప్పావు కద? మరి అతడెవరై ఉండవచ్చని ఆలోచిస్తున్నాను."

"ఆ మాటను విడిచిపెట్టి ఇంకేదైనా చెప్పు!"

"నిన్నెందుకని పిచ్చివాడని చెప్పుకొంటున్నావు?"

"ఇక్కడికి వచ్చినవారందరూ నన్ను పిచ్చివాడనడం వల్లే."

"ఎందుకు వారందరూ ఇలా నిన్ను పిచ్చివాడంటున్నారు?"

"లంకలో పాండ్యవంశపు మణిమకుటం, రత్నహారం ఉన్నచోటు నాకు తెలుసు. నన్ను విడుదల చేస్తే అవి ఉన్నచోటు చెబుతానని ఇక్కడికి వచ్చినవారందరికీ నేను చెప్పేవాడిని. అందుకే నన్ను పిచ్చివాడంటున్నారు."

"నిన్ను పిచ్చివాడంటున్న వాళ్ళే నిజానికి పిచ్చివాళ్ళు."

“నీవు నా మాటలను నమ్ముతున్నావా?”

“పరిపూర్ణంగా నమ్ముతున్నాను. కానీ నేను నమ్మి ఏం ప్రయోజనం? నేను నీకే సహాయమూ చేయలేను కద!”

“అలా చెప్పకు! నీవిప్పుడు బంధించబడివున్న గదికి వచ్చినవారందరూ త్వరలోనే విడుదల చేయబడడం సంప్రదాయమైపోయింది!” అన్నాడు పిచ్చివాడు.

“అదేం సంప్రదాయం? కొన్ని ఉదాహరణలు చెప్పు, చూద్దాం.”

“ఎవరో వైద్యకుమారుడొకడు, పినాకపాణి అన్నవాడు, నీ గదిలో బంధించబడ్డాడు. అతన్ని పళువూర్ యువరాణి నందిని విడుదల చేయించి తీసుకొని వెళ్ళింది. ఆ గదిలోనే సేందన్ అముదన్ బంధించబడ్డాడు. అతన్ని కుందవైదేవి, కొడుంబాళూర్ రాకుమారి విడుదల చేశారు....”

వంతిదేవుడు పెద్దగా నిట్టూర్చి, “అలా నన్ను విడుదల చేసేందుకు ఏ రాణిగాని, రాకుమారిగాని రారు!” అన్నాడు.

“అలాగైతే నేనే నిన్ను విడుదల చేస్తాను" అన్నాడు పిచ్చివాడు.

“ఇప్పుడు నీవు నిజంగా పిచ్చివాడిలాగ మాట్లాడుతున్నావు!” అన్నాడు వంతిదేవుడు.

“లేదు, నా మాటలను నమ్ము!”

“ఇక వేరే దారి లేదు; నీ మాటను నమ్మే తీరాలి.”

“అలాగైతే ఈ రాత్రి కాపలావాళ్ళు వచ్చి మనకు భోజనమిచ్చి వెళ్ళేవరకు ఓపిగ్గా ఉండు!” అన్నాడు పిచ్చివాడని పిలవబడుతున్నవాడు.

~~~
~~~

# అధ్యాయము - 56

## సమయ సంజీవని

**ఆ** రాత్రి చివరి కాపలావాడు వచ్చి వెళ్ళిన తర్వాత, వంతిదేవుడు పక్కగదిలోనున్న పిచ్చివాడు ఏం చెప్పబోతున్నాడా అని చాల ఆసక్తితో, ఆతురతతో వేచివున్నాడు.

ఆ గదిలో ఒక పక్క గోడను ఎలుక తొలుస్తున్నట్లు ఏదో శబ్దం వినిపించింది. వంతిదేవునికి పులులు, సింహాలంటే భయం లేదు. కానీ పిల్లులు, ఎలుకలంటే భయం. రాత్రంతా చీకటి కమ్ముకొన్న ఆ గదిలో ఎలుకలతో కాలం గడపాలా అని దిగులుపడుతున్నవాడై, "పిచ్చివాడా! నిద్రపోయావా?" అని అడిగాడు.

అందుకు బదులేమీ రాలేదు.

ఎలుక తొలిచే శబ్దం మాత్రం వినిపించసాగింది.

కాసేపటికల్ల గోడనుంచి కొన్ని రాళ్ళు పెకలించుకొని కింద పడి ద్వారం ఏర్పడింది.

దానిగుండా పిచ్చివాని గొంతు, "అబ్బాయీ! నిద్రపోయావా?" అని అడిగింది.

"లేదు; నిద్రపోలేదు. నీకోసమే వేచివున్నాను. ఇదేం పని?" అన్నాడు వంతిదేవుడు.

"ఇది ఆరు మాసాల పని. దానికి ముందు నా చేతి సంకెలను విడిపించుకోవడానికి ఆర్నెల్లు పట్టింది" అన్నాడు పిచ్చివాడు.

కాసేపటికల్లా ద్వారాన్ని ఇంకా పెద్దది చేసుకొని వంతిదేవుని గదిలోకి దూరాడతను.

వంతిదేవుడు అతని చేతులు పట్టుకొని కిందకు దింపిన తర్వాత, "ఇంత కష్టపడి ఈ గోడలో ద్వారం తొలిచావు కద? ఇందువల్ల ఏం ప్రయోజనం? బయటి గోడకు కన్నం వేస్తేనైనా ప్రయోజనముంటుంది!" అన్నాడు.

"ఇక్కడినుంచి బయటి గోడన్నదే లేదు. పులిబోనులున్న గదులనుంచే బయట పడాలి. ఈ గది కొన్నిసార్లు ఖాళీగా ఉంటుంది. అప్పుడు తాళం కూడ వేయబడకుండ ఉంటుంది. కాబట్టి నా గదినుంచి తప్పుకోవడం కన్న ఈ గదినుంచి తప్పుకోవడం సులభం."

"ఈరోజు వచ్చిన నన్ను నమ్మి ఈ రహస్యం చెప్పేశావు కద? నేను నిన్ను పట్టిస్తే ఏం చేస్తావు?"

"ఒకడిని నమ్మవచ్చు, నమ్మకూడదనేది అతని గొంతునుంచే కనిపెట్టవచ్చు/పసికట్టవచ్చు. సేందన్ అముదన్ని నమ్ముతాను. కానీ పినాకపాణిని నమ్మను. నీ గొంతునుంచి నిన్ను నమ్మవచ్చని తీర్మానించాను. పైగా తప్పించుకోవడమనేది ఇప్పుడు జరిగితేనే సరి! ఇదే సరైన సమయం!"

"అదేల?"

"కాపలావాళ్ళు మారారని చెప్పాను కద? వారిలో ఇద్దరు మాట్లాడుకొంటుండగా విన్నాను. పులిబోనును తెరవడం గురించి మాట్లాడుకొన్నారు. 'పులిబోనును తెరిచేటప్పుడు అవి మనమీదికే దూకితే ఏం చేయడం?' అని ఒకడు అడిగాడు. అందుకు రెండోవాడు 'చావాల్సిందే!' అన్నాడు. అందునుంచి వాళ్ళు పులిబోనును తెరవరన్నది తథ్యం. కొత్త కాపలావాళ్ళు కాబట్టి ఉన్నట్లుండి దూకి తప్పించుకొని పారిపోవచ్చని నా అభిప్రాయం. ఎలావున్నా, ఇక్కడే పడివుండి చావడం కన్న, విడుదలకు ఒక ప్రయత్నం చేసి చూడడం మేలు కద?"

"నిజమే!"

"ఒక్కడినే ప్రయత్నించడం కన్న ఇద్దరూ కలిసి ప్రయత్నించడం మంచిది. నీవు నాలాగ కాదు; కొత్తగా వచ్చినవాడివి. బాగ బలిష్టంగా ఉన్నావు. ఇద్దరు కాపలావాళ్ళని మనమిద్దరం కొట్టిపడేసి తాళం చెవులను లాగేసుకొని తప్పించుకోవచ్చు కద?"

"మంచి ఆలోచనే. ఎప్పుడు బయల్దేరుదాం?"

"కాస్త ఓపిక పట్టు; సరైన సమయం చూసి చెబుతాను."

"నేనూ చాల అలిసిపోయివున్నాను. ఒకటి రెండు రోజుల తర్వాతైనా మంచిదే."

~

తర్వాత ఆ పిచ్చివాడు అతడు చెరసాలలో ఉన్నప్పుడు బయట జరిగిన సంభవాలను వంతిదేవుని అడిగి తెలుసుకొన్నాడు.

ఆదిత్య కరికాలన్ మరణించారని తెలియగానే, "ఆహా! మనమిప్పుడు బయటపడడం చాల ముఖ్యం!" అన్నాడు.

"ఎందుకలా అంటున్నావు?"

"ఇక యువరాజుకెవరికైనా పట్టం కట్టాలి కద?"

"యువరాజు పట్టమేమి? చక్రవర్తి ఒంట్లో జబ్బు వల్లను, మనఃక్లేశం వల్లను పీడించబడివున్నారు. రాజ్యభారాన్ని పూర్తిగా త్యజించగోరుతున్నారు!"

"ఎవరికి పట్టం కట్టడమని మాట్లాడుకొంటున్నారు?"

"సామంతరాజులు కొందరు మధురాంతకులకు పట్టం కట్టాలని కోరుకొంటున్నారు. ఇంకొందరు పొన్నియిన్ సెల్వన్‌గారికే పట్టం కట్టాలంటున్నారు!"

"చక్రవర్తి మాట ఏమి?"

"రాజ్యంలో అనవసరంగా యుద్ధం రాకూడదని, దాన్ని అడ్డుకోవాలని ఎంచి మధురాంతకులు సింహాసనమధిష్టించడమే ఉచితమని చక్రవర్తి భావిస్తున్నారట."

"అలాగైతే మనం అతి త్వరలో బయటపడడం చాల అవశ్యం!" అన్నాడా పిచ్చివాడు.

తర్వాత అతడు ఈలం దేశంలో పాండ్య వంశపు మణిమకుటం, రత్నహారం ఎక్కడున్నదీ తానెలా తెలుసుకొన్నాడని వివరంగా చెప్పాడు.

చోళ వంశపు రహస్యం గురించి వంతిదేవుడు మళ్ళీ అడగగా, "అదిప్పుడు చెప్పను. ఇద్దరూ తప్పించుకొని బతికి బయటపడితే చెబుతాను. లేకపోతే ఆ రహస్యం నాతోనే మట్టి కావలసిందే!" అన్నాడు.

వంతిదేవుని మనసు తీవ్రచింతనలో మునిగింది. ఆ పిచ్చివాడు చెప్పదగ్గ రహస్యం ఏమై ఉండవచ్చని ఊహించి తెలుసుకోవడానికి ప్రయత్నించాడు. ఎన్నెన్నో నీడల్లాంటి జ్ఞాపకాలు అతని మనసనే తెరమీద కనిపించి మరుగైనాయి.

~

ఉన్నట్లుండి వైద్యకుమారుడు అక్కడ అగుపించగానే అదిరిపడ్డాడు. తాను, పక్కగదిలోనివాడు చేరి ఆలోచించిన ఉపాయానికి వీడు అడ్డొస్తాడేమోనని దిగులుపడ్డాడు. పినాకపాణి నయవంచకపు మాటలనతడు నమ్మలేదు. అతడు, పిచ్చివాడు ఈ విషయంలో ఒకే రీతిగా అభిప్రాయం కలిగివున్నట్లు తోచింది. ఏదో దురుద్దేశంతోనే ఆ వైద్యకుమారుడు ఇప్పుడిక్కడికి వచ్చాడని ఇద్దరూ మనసులో తీర్మానించుకొన్నారు. ఒకరిని చెరలో వదిలిపెట్టి ఇంకొకరు బయటపడరని శపథం చేసుకొన్నారు. మళ్ళీ పినాకపాణి వస్తే ఏం చేయాలో మాట్లాడి తీర్మానించుకొన్నారు.

కాబట్టి, రెండవసారి పినాకపాణి వచ్చినప్పుడు ఇద్దరూ ముందు జాగ్రత్త తీసుకొన్నారు. పిచ్చివాడికి రాజముద్ర పొదిగిన ఉంగరాన్ని చూపించి రహస్యం చెప్పమని అడుగుతున్నప్పుడు వంతిదేవుడు రెండు గదులకు మధ్యనున్న గోడలో అప్పటికే చేసిన కన్నం గుండా సద్దు చేయకుండ ఈ గదిలోకి వచ్చాడు.

పినాకపాణి తిరగబడి అతన్ని అటకాయించగా, ఇద్దరూ ద్వంద్వయుద్ధంలోకి దిగారు. ఇంకొక సందర్భంలోనైతే వంతిదేవుడు వైద్యకుమారుని ఒక్కక్షణంలో పడగొట్టేసేవాడే. ఒంటిమీద కాల్పుల వల్ల ఏర్పడిన గాయాలు ఇంకా పూర్తిగా ఆరలేదు. అదీగాక కాళాముఖ రాక్షసుడు అతన్ని గొంతు పిసికిన చోట ఇంకా నొప్పెడుతోంది. కాబట్టి ఆ ద్వంద్వయుద్ధం పొడిగించవలసివచ్చింది. ఆ సమయాన పిచ్చివాడు చేత గొలుసుతో వచ్చి పినాకపాణి మెడ చుట్టూ వేసి మెలిదిప్పాడు. పినాకపాణి కిందపడ్డాడు.

~

తర్వాత ఇద్దరూ పినాకపాణిని ఆ గది గోడల్లో పొదిగిన వలయాలకు చేర్చి కట్టారు. అలా కట్టేటప్పుడే వంతిదేవుడు, "మనమిద్దరం చక్రవర్తి కోలుకోవడానికి కావలసిన సంజీవని మూలికను వెతుక్కొంటూ లంకకు బయల్దేరాం, గుర్తుందా? అప్పుడు మనం సంజీవనిని తీసుకొని రావడంలో గెలుపొందలేదు. కానీ నీవు మాకిప్పుడు 'సమయ సంజీవని'గా వచ్చావు! ఈ సహాయానికి చాల

ధన్యవాదాలు. వైద్యకుమారుడిపైన నీవు ఇక వైద్యంతో సరిపెట్టుకోవడం మంచిది. గూఢచారి పనిలో తలదూర్చి ఎందుకు లేనిపోని కష్టాలను కొనితెచ్చుకొంటున్నావు?" అన్నాడు.

పినాకపాణి అందుకేమీ బదులు చెప్పలేదు. ఉన్నట్లుండి ఎదురైన ఈ విపత్తు వల్ల అతడు మాటలుడిగి, ఏం చేయాలో తోచక, నిలబడ్డాడు. కానీ అతడి కళ్ళు మాత్రం కోపజ్వాలలు కక్కుతున్నాయనడం అతడు తీసుకొచ్చి కింద పడేసిన దివిటీ వెలుతురులో బాగా తెలియవచ్చింది.

తర్వాత ఇద్దరూ వైద్యకుమారుడు తీసుకొని వచ్చిన అధికార ముద్రను కైవసం చేసుకొన్నారు. పినాకపాణి తలపాగాను తీసి వంతిదేవుడు తన తలకు కట్టుకొన్నాడు.

ఆ గదినుంచి బయటకు వచ్చి తలుపుకు తాళం వేశారు. తర్వాత మెల్లమెల్లగా తడుముకొంటూ వెళ్ళి పాతాళ చెరసాల మెట్లెక్కారు. దారి సరిగ్గా తెలియనివారు కాబట్టి మెల్లగా అటూ ఇటూ చూసుకొని వెళ్ళారు. పులుల గాండ్రింపులు వినిపించగానే ఇద్దరూ ముందుకు వెళ్ళడానికి కాస్త జంకారు. ఒకవేళ తాము తప్పించుకొంటున్నామని తెలిసి కాపలావాళ్ళు పులులను బోనుల్లోనుంచి వదిలిపెట్టారా?

వంతిదేవుడు, పిచ్చివాడు పులిబోనులోకి మెల్లగా తొంగి చూశారు.

ఆ సమయాన ఆ గదిలో ఒకేఒక కాపలావాడు మాత్రమే ఉన్నాడు. ఉరిమిన పులులున్న బోనుల్ని అతడు పరీక్షగా చూస్తున్నాడు. ఒకవేళ పులిబోను తెరిచి, వాటిని తమ మీదికి వదిలిపెట్టాలని ఆలోచిస్తున్నాడా, ఏమి? ఆ సమయాన వైద్యకుమారుడు కేకలేయనారంభించాడు. ఆ కేకలు ఈ కాపలావాడి తలలో సందేహాలను పుట్టించివుండవచ్చు కదా? పినాకపాణి నోట ఒక బట్టను కుక్కకుండ రావడం ఎంత పొరబాటైపోయింది?

~~~
~~~

# అధ్యాయము - 57

## విడుదల

**వంతిదేవుడు** కాసేపు వాకిట దిగులుపడుతూ నిలబడ్డాడు. పులుల్ని చూస్తూ మీసం మెలిపెడుతున్న కాపలావాడి మీదికి ఒక్క దూకు దూకి వాడిని ముగించేసి ముందుకు వెళదామా అని ఒక్క క్షణంపాటు అనుకొన్నాడు. కానీ పులిబోనులకవతల ఉన్న వాకిలి దగ్గర ఇంకా ఇద్దరు కాపలావాళ్ళుండడాన్ని గమనించాడు. వారిలో ఒకడు ఈ కాపలావాడికి సైగలతో ఏదో తెలియజెప్పేసి అవతలికి వెళ్ళాడు. ఒకవేళ తన గురించే వారు సైగలతో మాట్లాడుకొంటున్నారా? ఈ కాపలావాడిని అటకాయించి, ఓడించి ముందుకు వెళ్ళినా కూడ, అవతల ఇలాంటి వాకిళ్ళు, వాటి దగ్గర కాపలావాళ్ళు ఉంటారు. వారందరినీ ఓడించి బయటపడడం సాధ్యమా? దానికన్న ఒక్క దూకులో వెళ్ళి పులిబోన్లను తెరిచి వదిలేస్తేనేం? అప్పుడేర్పడే గందరగోళంలో తప్పించుకోవడం తేలిగ్గా ఉంటుంది కద...?

వంతిదేవుడిలా ఆలోచిస్తుండగా కాపలావాడు, "ఓహో! తప్పించుకోవడానికి చూస్తున్నావా?" అన్నది విని వంతిదేవుడు అదిరిపడ్డాడు.

పులుల్లో ఒకటి గుర్రుమంది.

"ఒసే కుక్కా! ఊరుకో!"

అతడు పులితో మాట్లాడుతున్నాడని అర్థంకాగానే వంతిదేవుడు నవ్వుకొన్నాడు.

కాపలావాడు తిరిగి చూశాడు.

"తిరిగి చూడండయ్యా! ఈ పులి నన్ను బెదిరించజూస్తూంది. ఇలాంటి పులుల్ని నేనెన్నో చూశాను! ఈ సింహం ముందు దాని పప్పులుడకవు!" అనేసి మళ్ళీ మీసం మెలిదిప్పాడు.

వంతిదేవుడు, "బోనులో ఉన్నంతవరకు పులి, ఎలుకా ఒక్కటే. దాని గర్వం ఎలా అణుగుతుంది?" అని చెప్పేసి చేతనున్న పెద్ద వేళార్ రాజముద్రను చూపాడు.

"వెళ్ళండయ్యా! వెళ్ళండి! ముఖ్యమంత్రి మనుషులు మీకోసం వాకిట వేచివున్నారట. తొందరగా వెళ్ళండి!" అని వారు వచ్చిన దిక్కుగా చూసి, "ఒరే పిచ్చోడా! ఊరుకోలేవా?" అన్నాడు.

~

ఆ సమయాన వంతిదేవుడు పిచ్చివాడి చేయి పట్టుకొనివున్నాడు. వాడి చేయి వణుకుతుండడాన్ని గమనించి, అతడి చేతిని గట్టిగా నొక్కి ధైర్యం చెప్పాడు.

తర్వాత కాపలావాడిని దాటి ఇద్దరూ ముందుకు నడిచారు.

"విడుదల కావాలట, విడుదల! అందరినీ విడుదల చేసేస్తే తర్వాత మా బతుకేం కావాలి?" అని

ఆ కాపలావాడన్నది వారి చెవిన పడింది.

వంతిదేవుడు ఎంతటి తెంపరితనమున్నవాడైనా, ఆ సమయాన అతడి గుండె దడదడ కొట్టుకోసాగింది. వాకిట ముఖ్యమంత్రి మనుషులు వేచివున్నారని కాపలావాడన్న మాట అతని మనసులో బాగా పదిలమైంది. చెరసాల లోపలేమో చీకటి మయం; కాబట్టి ఇక్కడున్న కాపలావాళ్ళను ఏమార్చేసి తప్పించుకోవడం తేలిక. బయట వెలుతురుగా ఉంటుంది కద? ముఖ్యమంత్రి మనుషులు ఈ శాల్తీ మార్పిడిని కనిపెట్టేస్తే ఏం చేయాలి? ఏమవుతుందో చూద్దాం! అన్నిటికీ సిద్ధంగా ఉండాల్సిందే! ఈ పిచ్చివాడు కూడ భలే జిత్తులమారిలాగున్నాడు. సమయం చూసి ఢోకా ఇస్తాడు...!

పాతాళ చెరసాలలో అనేక వాకిళ్ళు దాటి, టంకశాలలో కూడ ఎన్నో వాకిళ్ళను దాటి వేగంగా ముందుకు సాగారు వారిద్దరూను. అక్కడక్కడ కాపలా కాస్తున్న వీరులు వారిదగ్గరున్న సేనాధిపతి రాజముద్రను చూడగానే పక్కకు ఒదిగి దారి వదిలారు. ఎవరూ వీరినిద్దరిని సందేహించలేదు. పరీక్షగా చూడనూ లేదు.

వెళుతున్నప్పుడే వంతిదేవుడు అతివేగంగా ఆలోచించి ఒక ఉపాయాన్ని సిద్ధం చేసుకొన్నాడు. పొడవైన ఒక గది గుండా నడిచి వెళుతున్నప్పుడు అతడు తన తోటి వాని చెవిన, “నీవు ముఖ్యమంత్రి ఇంటికి వెళుతున్నావా? నాతో వస్తున్నావా?” అని అడిగాడు.

“ముఖ్యమంత్రి ఇంటికి వెళితే మళ్ళీ పాతాళ చెరసాలే గతి! నీతోనే వస్తాను. నీవెక్కడికి వెళ్ళాలనుకొంటున్నావు?” అన్నాడు.

“దేవుని దయవుంటే లంకకే వెళ్ళిపోదాం! ముఖ్యమంత్రి మనుషుల ముందు నీవు నన్ను 'పినాకపాణి' అని పిలు. నీ పేరేమి?”

“పిచ్చివాడు!”

“నిజం పేరు? నీ తలిదండ్రులు పెట్టిన పేరు?”

“ఆ! అదా? కన్నవాళ్ళు నాకు 'కరియ తిరుమాళ్ [నల్ల తిరుమాళ్ళు]' అని పేరు పెట్టారు. చుట్టాలు, ఊరివాళ్ళు నన్ను 'కరుత్తిరుమన్' అని పిలిచేవారు.”

“మంచి పేరే! కరుత్తిరుమా! తంజావూరు వీధుల్లో మనం నడిచి వెళ్ళేటప్పుడు నీ భుజాన్ని తాకుతాను. వెంటనే నీవు నాతో పరుగెత్తి వచ్చేందుకు సిద్ధంగా ఉండాలి. బాగా పరుగెడుతావు కద?”

“ఓ! పరుగు పందెంలో లంకరాజు మహీంద్రుడు కూడ నాతో పోటీ పడలేడు!”

వంతిదేవుడు నవ్వాడు.

“నీవు మంచి పిచ్చోడివే!” అన్నాడు.

బంగారు నాణాల టంకశాలను దాటి వారు బయటపడ్డారు.

~

వంతిదేవుడు భయపడ్డట్లు అక్కడ ముఖ్యమంత్రి మనుషులు చాలమంది లేరు. ఇద్దరే ఇద్దరు మాత్రం ఉన్నారు. వారిలో ఒకడు చాల లావుపాటి మనిషి. వంతిదేవునికి అతన్ని ఎప్పుడో ఎక్కడో చూసినట్లనిపించింది. సరిగ్గా గుర్తుకు రాలేదు.

"మీరే కద ముఖ్యమంత్రి మనుషులు?" అని అడిగాడు వంతిదేవుడు.

"ఏం తమ్ముడూ! అంతలోపల నన్ను మరిచిపోయావా?" అని అడిగాడు వారిలో ఒకడు.

"లేదు, లేదు! మీరే కద మమ్మల్ని ముఖ్యమంత్రి ఇంటికి పిలుచుకొని వెళ్ళబోతున్నారు?" అన్నాడు వంతిదేవుడు.

"అవును, మేమే! నీవు ముఖ్యమంత్రి ఇంటికి వెళ్ళే దారి కూడ మర్చిపోగలవు!"

అప్పుడు కరుత్తిరుమన్, వంతిదేవుడు చెప్పింది గుర్తు తెచ్చుకొని, "అయ్యా! పినాకపాణీ! నాకు భయంగా ఉంది! ముఖ్యమంత్రి నన్ను మళ్ళీ పాతాళ చెరసాలలోకి తోసేస్తారేమో!" అన్నాడు.

"అలా ఏం చేయరబ్బీ! మా ముఖ్యమంత్రి గురించి నీకు తెలియదు లాగుంది. కానీ తప్పించుకోవడానికి మాత్రం ప్రయత్నించకు! అలా ఏమైనా చేస్తే, మనం మళ్ళీ పాతాళ చెరసాలలో ఉండవలసి వస్తుంది!"

ఆ మనుషుల్లో లావుపాటి మనిషి ఇలా చెప్పి ముందుకు నడిచాడు. రెండోవాడు వంతిదేవునికి, కరుత్తిరుమన్‌ని వెనక కాపలాగా నడిచాడు.

~

తంజావూరు వీధుల్లో కళే లేదు. జన సంచారం కూడ లేదు. ఆదిత్య కరికాలన్ అంతిమ క్రియలవల్ల ఏర్పడ్డ కోలాహలం సద్దు మణిగిన తర్వాత కోట లోపల కాపురమున్నవారు వారి వారి పనుల్లో నిమగ్నమైవున్నారు. కోట బయట, కొడుంబాళూర్ సైనికులు చాల గట్టిగా కాపలా కాస్తున్నారు. కోట బయటినుంచి లోపలికి రావడానికి కూడ ఎవరినీ అనుమతించడం లేదు.

వంతిదేవుడు రెండువైపులా పరీక్షగా చూసుకొంటూ నడిచి వెళ్ళాడు. ఆ ఇద్దరు మనుషుల నుంచి తప్పించుకోవడం ఏమంత కష్టం కాదు. కానీ, మళ్ళీ పట్టుబడకుండ ఉండాలి కద? కోట నుంచి బయటపడేందుకు కూడ అనుకూలంగా ఉండాలి కద? ఈ ఆలోచనలవల్ల, వంతిదేవుడు వీధి రెండువైపులా పరీక్షగా చూస్తూ వెళ్ళాడు.

పెద్ద పళువేట్టరయ్యర్ మాళిగ వాకిలి దాటగానే, వంతిదేవుని గాభరా అధికమైంది. తర్వాత ఆ సందు రాబోతూంది! మునుపొకసారి చిన్న పళువేట్టరయ్యర్ల మనుషుల నుంచి తప్పించుకొన్న సందే అది! దాన్నే అతడు ఎదురుచూస్తున్నాడు. మలుపులు తిరిగిన ఆ సందులో మూలలు ఎక్కువే. రెండువైపులా తోటల ప్రహరీ గోడలు. గోడల మీదుగా కిందికి వంగిన చెట్లు. అక్కడే ఈ కాపలావాళ్ళనుంచి తప్పించుకోవడం సాధ్యమవుతుంది. లేకపోతే లేదు. మునుపటిలాగే పెద్ద పళువేట్టరయ్యర్ తోట లోపలికి

దూకవచ్చు. అక్కడ దూకేస్తే దట్టమైన చెట్ల మధ్య దాక్కోవడానికి అనువుగా ఉంటుంది. మునుపటిలాగే బొక్కసపు నేలమాళిగ గుండా కోట బయటకు చేరుకోవడం కూడ సులభమవుతుంది. ఇంకే దారి గుండా కూడ తప్పించుకోవడం సాధ్యం కాదు.

~

ఇదిగో ఆ సందు, మునుపొకసారి అతడు తప్పించుకొన్న సందు, వచ్చేసింది. వంతిదేవుడు కరుత్తిరుమన్ భుజాన్ని తట్టి సంకేతమిద్దామా అనుకొన్నాడు. అయితే ఇదేమి? అక్కడ ఎవరు గుంపుగా వస్తున్నారు? గుర్రాలు! పల్లకీలు! చేత శూలాలు పట్టుకొన్న కాపలా వీరులు!

ఇంతటి ఆర్భాటంతో వస్తున్నవారు రాజకుటుంబానికి చెందినవారు గాని, పెద్ద అధికారులు గాని అయివుండాలి.

దీన్ని గ్రహించి ముఖ్యమంత్రి మనుషులు కూడ చుట్టుపక్కల పరికించి చూశారు. వంతిదేవుని ఆసక్తిని చూరగొన్న ఆ ఆర్భాటపు ఊరేగింపును వాళ్ళు కూడ గమనించారు. వెంటనే అవతలికి వెళ్ళి ఒదిగి నిలబడ్డారు. తాము కాపలా కాస్తూ పిలుచుకొని వస్తున్న ఇద్దరినీ ఎవరూ చూడకుండ వారిని మరుగుపరుస్తూ నిలబడ్డారు.

ఎదురుగా గుంపుగా వస్తున్నవారు వేగంగా వారిని దాటి వెళ్ళిపోయారు.

ముందుగా శూలాలు ధరించిన వీరులు నడిచి వెళ్ళారు.

తర్వాత మూడు గంభీరమైన తెల్లగుర్రాల మీద మలైయమాన్, పెద్ద వేళార్ వారి మధ్య ఇంకొకరు వస్తున్నారు. మధ్య వస్తున్నది పొన్నియిన్ సెల్వన్ అని వంతిదేవుడు గ్రహించాడు.

ఆహా! ఎంత సమీపాన ఉన్నారు? కానీ ఎంత దూరమైపోయారు?

వంతిదేవుడు ఒక్క క్షణంపాటు కాపలావాళ్ళను దాటి పరుగెత్తి వెళ్ళి ఆయన ముందు నిలబడదామా అనుకొన్నాడు. వెంటనే ఆ ఆలోచనను విరమించుకొన్నాడు/వదిలేసుకొన్నాడు. అన్నగారిని హత్యచేశాడన్న నేరం మోపబడ్డవాడి మీద పొన్నియిన్ సెల్వన్ మాత్రం ఎలా కరుణ చూపగలరు? లేక, తమ స్నేహాన్ని చూపించుకోవడం మాత్రం సాధ్యమా? తనను చూడగానే ఆయన అసహ్యించుకోవచ్చు కూడాను. పక్కనున్న మలైయమాన్, పెద్ద వేళార్ ఏం చేస్తారో చెప్పలేము.

ఇంతలో వారి వెనుక వస్తున్న పల్లకిమీదికి అతడి చూపులు మళ్ళాయి.

ఆహా! యువరాకుమారి కుందవైదేవి! కొడుంబాళూర్ రాకుమారి వాణతి! శంబువరయ్యర్ కుమార్తె మణిమేఖల!

వంతిదేవుని మనసు పడరాని పాట్లు పడి విలవిల్లాడింది.

ఇంకే సందర్భంలోనైనా, ఈ ముగ్గురు వనితామణుల్లో ఏ ఒక్కరినైనా సహాయం కోరవచ్చు! వారు కూడ మనసు కరిగి సహాయం చేస్తారు. కానీ ఇప్పుడు? ఆదిత్య కరికాలన్ని వంచక ద్రోహంతో

చంపాడన్న నింద ఆరోపించబడినవాడిని చూసి యువరాకుమారి, వాణతి ఎంతగా అసహ్యించుకొంటారు?

పోనీ ఈ అమాయకురాలు మణిమేఖలను తమతో చేర్చుకొన్నారు కద! అందుకు సంతోషపడాలి. మణిమేఖల కడంబూర్లో జరిగిందంతా వీరికి చెప్పివుంటుందా? తనను కాపాడేందుకు 'నేనే చంపాను' అన్నది కద? అలా వీరి దగ్గర కూడ చెప్పిందా? లేదు, చెప్పివుండదు. అలా చెప్పివుంటే, వీరామెను తమతో ఇంతటి ఆదరాభిమానాలతో తమతో పిలుచుకొని వెళ్ళరు.

~

పల్లకీలు వారు (దాక్కొని) నిలబడ్డ సందును దాటి వెళ్ళాయి, వెనక వచ్చిన కాపలా వాళ్ళు కూడ దాటి ముందుకు వెళ్ళారు.

"సరే, రండి! ఇక మనం వెళ్ళవచ్చు!" అనేసి ముఖ్యమంత్రి మనుషులు ముందుకు నడిచారు.

వంతిదేవుడు ఒక్కక్షణంలో ఇదే మంచి సమయమని నిశ్చయించుకొన్నాడు. కరుత్తిరుమన్ భుజాన్ని తట్టేసి సందు గుండా పరుగు లంకించుకొన్నాడు. కరుత్తిరుమన్ కూడ అతడి వెనకే పరుగెత్తాడు.

కాపలావాళ్ళిద్దరూ వెనక పరుగెత్తి వస్తున్న శబ్దం వినిపించింది. కాసేపటి వరకు వెనక్కి తిరిగి కూడ చూడకుండ పరుగెత్తారు ఇద్దరూ. మొదట కరుత్తిరుమన్ తిరిగి చూశాడు.

"ఒకడు వెనకబడ్డాడు! ఇంకొకడు మాత్రమే వస్తున్నాడు!" అన్నాడు.

వంతిదేవుడు కూడ వెనక్కి తిరిగి చూసి లావుపాటివాడు వెనకబడి నిలబడిపోయాడని గ్రహించాడు. ఒక్కడే అయినా, వాడితో వీధిన నిలబడి దెబ్బలాడడం అంత మంచిది కాదని అనుకొన్నాడు. కాబట్టి కరుత్తిరుమన్‌కి సైగచేసి ముందుకు పరుగెత్తాడు.

మునుపొకసారి ప్రాకారం గోడ దూకిన చోటును చేరుకొన్న తర్వాతే పరుగునాపాడు. బాగా పెరిగి కిందకు వంగిన చెట్టు కొమ్మలు ఇంకా అలాగే ఉన్నాయి. వాటిని పట్టుకొని ఎగిరి గోడమీదికెక్కాడు. కరుత్తిరుమన్ని కూడ చేయిచ్చి పైకి లేపి గోడపైకెక్కించాడు.

ఇద్దరూ కూడబలుక్కొని బాగా వంగిన ఆ చెట్టు కొమ్మలను విరిచి సిద్ధంగా పట్టుకొన్నారు.

వారిని వెన్నంటి వస్తున్న కాపలావాడు దగ్గరకు రాగానే వాడి మీదికి ఆ కొమ్మలను విసిరేశారు.

చెట్టు కొమ్మలు వాడి మీదికి పడ్డాయా లేవా అని చూడకుండ ప్రాకారపు గోడ మీదినుంచి తోట లోపలికి దూకారు. దట్టమైన చెట్లు, పొదల మధ్య దూరి దాక్కొని నిలబడి, గోడను పరీక్షగా చూడసాగారు.

ఎవరూ తమను వెన్నంటి తోట లోపలికి దూకి రాలేదని దృఢపరుచుకొని ముందుకు సాగారు.

"అమ్మయ్య! బతికిపోయాం!" అన్నాడు వంతిదేవుడు.

"ఇంతలో ఏమైంది? కోట దాటి బయటకు వెళ్ళడమెలా?" అన్నాడు కరుత్తిరుమన్.

"దానికి దారివుంది. కాస్త ఓపిక పట్టు!"

~

పళువేట్టరయ్యర్ మాళిగను సమీపించగానే వంతిదేవుడు ఆగాడు. మాళిగలో మునుపటిలాగ సందడి లేదు, నిజమే. కానీ మనుషుల సంచారం ఉంది. చీకటి పడ్డ తర్వాతే బొక్కసపు నేలమాళిగలోకి దూరడం మంచిది.

ఇలా తీర్మానించుకొని ఒక కొయ్యదిమ్మ మీద కూర్చొన్నాడు. కరుత్తిరుమన్ని కూడ కూర్చోబెట్టాడు.

"ఇక చీకటి పడ్డ తర్వాతే మన ప్రయాణాన్ని ముందుకు కొనసాగించగలం. అంతవరకు నీ కథను చెప్పు, విందాం!" అన్నాడు.

"అదే చెప్పసాధ్యం కాదని ముందే చెప్పానుగా?"

"అలాగైతే నిన్ను బయటకు తీసుకొని వెళ్ళడం కూడ సాధ్యం కాదు."

"నేను నిజాన్ని చెప్పకుండ ఏదైనా కల్పించి చెబితే ఏం చేస్తావు?"

"కథ – కల్పన – ఏదైనా చెప్పు! కాసేపు పొద్దు పుచ్చాలి కద?"

కరుత్తిరుమన్ చెప్పనారంభించాడు. నిజంగానే అది అపూర్వమైన పలు సంభవాలు నిండిన కల్పనాకథలాగే తోచింది.

~~~
~~~

# అధ్యాయము - 58

## కరుత్తిరుమన్ కథ

**కరుత్తిరుమన్** కోడిక్కరైకి కాస్త ఉత్తరాన సముద్రతీరాన ఉన్న తోప్పుత్తురై అన్న ఊరికి చెందినవాడు. అక్కడినుంచి లంకకు పడవ నడిపి జీవనం సాగించేవాడు. సుమారు ఇరవైయైదేళ్లకు మునుపు అతడొకసారి లంక నుంచి తోప్పుతురైకి తిరిగి వస్తున్నప్పుడు సుడిగాలి వీచి కడలి అల్లకల్లోలమైంది. పడవ తలకిందులైపోకుండ తీసుకొచ్చి చేర్చేందుకు చాల ప్రయాసపడ్డాడు. కోడిక్కరై స్తంభదీపాన్ని సమీపిస్తున్నప్పుడు ఒక అమ్మాయి ఆ కల్లోలితమైన కడలిలో తేలుతుండడాన్ని చూశాడు. ఆమె మీద జాలి కలిగి ఆమెను పడవలోకెక్కించుకొన్నాడు. ఆమె అప్పుడు స్పృహలేని స్థితిలో ఉంది. ఆమె బతికివుందో లేదో కనిపెట్టడం కూడ సాధ్యం కాలేదు. అక్కడే పడవను గట్టెక్కించడం కూడ వీలుకాలేదు. చివరికి గాలి వీస్తున్న దిక్కుగా పడవను నడుపుకొంటూ వెళ్ళి తిరుమరైక్కాడు [కాడు = అడవి] అనే చోట పడవను గట్టుకు చేర్చాడు. స్పృహలేని ఆమెను తీసుకొని వెళ్ళి గట్టుమీద ఉంచి దిగాలుగా చూస్తున్నప్పుడు, గుర్రాలమీద కొందరు పెద్ద మనుషులు అక్కడికొచ్చారు. వాళ్ళు సహాయం చేసి ఆమెకు తెలివి తెప్పించారు. కానీ ఆమె మాట్లాడనూ లేదు; వారి మాటలను చెవిన వేసుకొన్నట్లు కూడ అగుపించలేదు. 'ఈమె పుట్టు మూగ, చెవిటిది' అని వారిలో ఒకడన్నాడు. వారి నాయకుడిలాగ కనిపించిన అతడు కరుత్తిరుమన్ని పక్కకు తీసుకొని వెళ్ళి, ఒక వింతైన వార్తను తెలియజేశాడు. సుడిగాలి తగ్గిన తర్వాత ఆమెను తీసుకొని వెళ్ళి ఈలం దేశంలోనో, లేక దగ్గరున్న ఒక దీవిలోనో వదిలేసి రావాలని అందుకు ప్రతిగా పెద్ద బహుమానమిస్తానని చెప్పాడు. అలాగే కరుత్తిరుమన్ ఒప్పుకొని ఆ ధనాన్ని కూడ స్వీకరించాడు. కడలిలో కల్లోలం తగ్గగానే ఆమెను పడవలోకెక్కించుకొని తీసుకొని వెళ్ళాడు. సముద్రం మధ్య కొయ్యముక్కనొకదాన్ని పట్టుకొని ఒకడు తేలుతుండడాన్ని గమనించాడు. చాల అలిసిపోయిన అతన్ని కూడ పడవలోకెక్కించుకొన్నాడు. మొదట, ఆ కొత్త మనిషిని చూసి ఆమె బెదిరింది. తర్వాత అతన్ని గమనించనట్లుంది. ఇద్దరినీ తీసుకొని వెళ్ళి లంకకు దగ్గరగా ఉన్న ఒక దీవిలో విడిచిపెట్టాడు.

ఆ దీవిలో ఒక పెద్దాయన ఉండేవారు. ఆయన ఈ అమ్మాయిని తన కూతురని చెప్పారు. ముందుగానే ఆమె మూగదని, ఇప్పుడు ఆమె తమను కూడ గుర్తుపట్టలేదని అన్నారు. తర్వాత ఆమెను సముద్రంలో మునిగిపోకుండ కాపాడిన వివరాలను చెప్పాడు కరుత్తిరుమన్ ఆ పెద్దాయనకు.

~

నడిసముద్రంలో పడవెక్కిన మనిషి ఒక తాళపత్రాన్ని కరుత్తిరుమన్‌కిచ్చి దాన్ని లంకాధిపతికిచ్చి రమ్మని పంపాడు. అందునుంచి ఆయన చాల పెద్దమనిషైవుండాలని తీర్మానించుకొన్నాడు

కరుత్తిరుమన్. లంకరాజుకు ఆ తాళపత్రాన్నిచ్చిన తర్వాత అతని మాటలనుంచి తనవల్ల కాపాడబడ్డ వ్యక్తి పాండ్యదేశరాజని తెలుసుకొన్నాడు. పాండ్యదేశరాజును పిలుచుకొని రావడానికి లంకాధిపతి తన పరివారాలను పంపాడు. కరుత్తిరుమన్ చాల అలిసివుండడం వల్ల వారితో వెళ్ళలేదు. పాండ్యరాజు కొన్నాళ్ళ తర్వాత లంకాధిపతి అంతఃపురానికి వచ్చి చేరాడు. ఇద్దరూ లంకారాజ్యపు దక్షిణ సరిహద్దు వద్ద ఉన్న రోహణానికి వెళ్ళారు. అక్కడ వారు కొన్నాళ్ళు విడిది చేశారు. కరుత్తిరుమన్ మీద అభిమానంగొన్న పాండ్యరాజు అతన్ని కూడ తనతోబాటు తీసుకొని వెళ్ళాడు. రోహణంలో చాల చోట్లను లంకాధిపతి పాండ్యరాజుకు చూపించాడు. చివరగా ఎవరూ తేలికగా సమీపించలేని ఒక లోయకు పిలుచుకొని వెళ్ళాడు. అక్కడ ఒక కొండ గుహలో లెక్కలేనన్ని బంగారు కాసులు, నవరత్నాలు, అమూల్యమైన ఆభరణాలు దాచబడివున్నాయి. వాటన్నిటినీ చూసిన తర్వాత, లంకాధిపతి ఒక బంగారు పేటికను తెరిచి చూపించాడు. అందులో దేదీప్యమానంగా ప్రకాశిస్తున్న మణిమకుటం, రత్నహారం ఉన్నాయి. ఆ ఇద్దరు రాజుల సంభాషణ నుంచి ఆ మణిమకుటం పాండ్యవంశస్థుల పురాతన కిరీటమని, ఆ రత్నహారం పాండ్యవంశ మూలపురుషునికి దేవేంద్రుడే స్వయంగా ఇచ్చినట్లు చెప్పబడే రత్నహారమని తెలుసుకొన్నాడు. వాటిని తీసుకొని వెళ్ళమని లంకరాజు పాండ్యరాజును బలవంతం చేశాడు. పాండ్యరాజు ఒప్పుకోలేదు. చోళులను పూర్తిగా తుడిచిపెట్టేసి తాను మదురైలో పట్టాభిషేకం చేసుకొనే రోజు వచ్చినప్పుడు, లంకాధిపతే వాటిని తీసుకొని మదురైకి వచ్చి వాటిని లోకమెరుగ తనకివ్వాలని చెప్పాడు.

తర్వాత పాండ్యరాజు కరుత్తిరుమన్‌కి అతడు మోసుకొని వెళ్ళగలిగినన్ని బంగారు కాసులిచ్చి ఆ మూగది క్షేమంగా ఉండేందుకు అన్ని ఏర్పాట్లూ చేసి పెట్టేసి, మళ్ళీ పాండ్యదేశానికి వచ్చి తనతో ఉండమని చెప్పి పంపాడు.

~

కరుత్తిరుమన్ భూతదీవికి వెళ్ళినప్పుడు ఆ మూగది కనిపించలేదు. ఆమె తండ్రి కూడ కనిపించలేదు. ఇద్దరినీ వెతుక్కొంటూ కోడిక్కరైకి వెళ్ళాడు. అక్కడ ఆ మూగదాన్ని చూశాడు. కానీ ఆమె అతన్ని గుర్తు పట్టలేదు. ఆమె ఇంటివారినుంచి కొన్ని వివరాలను తెలుసుకొన్నాడు. ఆమె తండ్రి ఒంట్లో బాగుండకపోవడం వల్ల ఆమెను ఇక్కడికి తీసుకొని వచ్చి వారికప్పగించి ప్రాణాలొదిలాడు. దీపస్తంభపు కాపలావాడు ఆమె సహోదరుడని తెలిసింది. మొదట ఆమెకు సహోదరుడు - సహోదరి ఎవరూ గుర్తుకు రాలేదు. మళ్ళీ ఇంకొకసారి కాలు జారి సముద్రంలో పడి కాపాడబడ్డ తర్వాత అందరూ గుర్తొచ్చారు. ఆమె గర్భవతిగా ఉందని తక్కినవారు తెలుసుకొన్నారు. అది ఆమె కూడ గ్రహించి పెనుభీతికి లోనైంది. కోడిక్కరై విష్ణువాలయానికి తరచూ వెళ్ళి స్వామికి పూజలు చేస్తూ కాలం గడపసాగింది. కరుత్తిరుమన్ ఇప్పుడెంత ప్రయత్నించినా, అతన్నిప్పుడు గుర్తుపట్టనే లేదు.

కోడిక్కరైలో ఉన్నప్పుడు ఆ మూగదాని చెల్లెలిని అతడు కలిశాడు. ఆమె కూడ మూగదని

తెలిసి అతడు చాల జాలిపడ్డాడు. ఆమెను పెళ్ళిచేసుకొని జీవిద్దామని కూడ అనుకొన్నాడు. దానికి ముందు పాండ్యరాజు వద్దకు వెళ్ళి విషయాన్ని తెలియజెప్పేసి రావాలనుకొన్నాడు.

ఈ సమయాన చోళ చక్రవర్తి గండరాదిత్యుల పట్టమహిషి, శివభక్తశిఖామణియైన శెంబియన్ మహాదేవి కోడిక్కరై కుళకర్ (విష్ణువు) ఆలయానికి స్వామి దర్శనం కోసం వచ్చారు. అక్కడ ఆ మూగ మందాకినిని చూసి, తమతో తీసుకొని వెళ్ళారు. ఆమెతో ఆమె చెల్లెలు వాణి కూడ వెళ్ళిపోయింది.

~

కరుత్తిరుమన్ పాండ్యనాడుకు వెళ్ళాడు. అక్కడ పాండ్యరాజు యుద్ధరంగానికి వెళ్ళాడని తెలిసింది. యుద్ధరంగానికి వెళ్ళి పాండ్యరాజును కలిసినప్పుడు, ఆయన అతన్ని మళ్ళీ లంకకు వెళ్ళి లంకరాజుకు తాళపత్రం ఇచ్చి రమ్మని పంపాడు. తిరిగి వచ్చేటప్పుడు ఆ మూగదాన్ని పిలుచుకొని రావడానికి మళ్ళీ ప్రయత్నించమని చెప్పాడు.

కరుత్తిరుమన్ లంకనుంచి తిరిగివచ్చి పళైయారైకి వెళ్ళాడు. వాణి జ్ఞాపకాలు అతని మనసును వీడలేదు. ముఖ్యంగా ఆమెను కలిసే ఆశతోనే అతడు పళైయారైకి వెళ్ళాడు. కానీ అక్కడ ఆమెను చూసినప్పుడు అదిరిపడి, ఆశ్చర్యపడి, దిగ్భ్రమించి, భీతిగొనే పరిస్థితి ఎదురైంది. అరిసిలా నది వెంబడి అతడు పళైయారైని సమీపిస్తుండగా నదీతీరాన ఒక స్త్రీ ఇసుకలో గుంట తవ్వుతుండడాన్ని చూశాడు. అది కూడ అతడికంత ఆశ్చర్యాన్ని కలిగించలేదు. ఆమె పక్కన ఒక బట్టల మూట కనిపించింది. దాని లోపలినుంచి ఒక అతి మెల్లని, బలహీనమైన గొంతు - ఒక పసిబిడ్డ ఏడుపు గొంతు - వినిపించింది.

ఏ ఛండాల పాతకి ప్రాణాలతో ఉన్న పసిబిడ్డను సజీవంగా పూడ్చిపెట్టేందుకు చూస్తోందా అన్న కోపమూ, అసహ్యంతో ఆమెను సమీపించినప్పుడు, గుంట తవ్వుతున్న స్త్రీ లేచి నిలబడింది. ఆమే వాణి అని కరుత్తిరుమన్ గ్రహించాడు.

~

“తమ్ముడూ! అప్పుడు నాకెలా ఉంటుంది? నీవే ఊహించుకో!” అన్నాడు కరుత్తిరుమన్.

“దాన్ని ఊహించుకొన్నాను. తర్వాత కథ చెప్పు!” అన్నాడు వంతిదేవుడు.

“తర్వాత జరిగిన కథను చెప్ప సాధ్యంకాదు. రాజకులానికి చెందినవారి చెవిన మాత్రమే చెప్పసాధ్యం! నేను గనక అప్పుడు పళైయారైకి వెళ్ళకుంటే నాకు తర్వాత కలిగిన కష్టాలేవీ కలిగివుండేవి కావు!” అన్నాడు కరుత్తిరుమన్.

“అలాగైతే బయల్దేరు! తిన్నగా రాజకులానికి చెందిన వారివద్దకు వెళ్ళి చెబుదాం!” అని చెప్పేసి నవ్వుతూనే వంతిదేవుడు లేచాడు.

కరుత్తిరుమన్ని కూడ వెంట తీసుకొని బొక్కసపు నేలమాళిగను సమీపించాడు. అక్కడ అప్పుడు ఎవరూ లేరు. నేలమాళిగ తలుపుకు పెద్ద తాళం వేసి ఉంది. కానీ తెలియనివారు కనిపెట్టలేనట్లు

అమర్చబడివున్న దాని లోపలి తలుపును వంతిదేవుడు నొక్కగానే అది తెరుచుకొంది. ఇద్దరూ లోపలకు దూరి లోపలినుంచి గడియ వేశారు.

దారిలో బంగారు, రత్నమాణిక్యాలు, నవరత్నాలు కుప్పలు, కుప్పలుగా పోసివున్న చోట వంతిదేవుడు ప్రవేశించాడు. కరుత్తిరుమన్ని చూసి, "నీ రోహణ నాడు కొండగుహలో ఇంతటి ధనరాసులు కలవా?" అని అడిగాడు. "దీని కన్న నూరు రెట్లున్నాయి!" అన్నాడు కరుత్తిరుమన్.

~

వంతిదేవుడు కొన్ని బంగారు నాణాలను తీసి నడుం బట్టలో కట్టుకొని మళ్ళీ బయల్దేరాడు. నేలమాళిగ కాలిబాట వెంబడి వంతిదేవుడు దారితీశాడు. ప్రాకారపు గోడలో అమర్చిన రహస్యద్వారాన్ని కూడ తెరిచాడు. అక్కడ ఇప్పుడు కాపలావాళ్ళెవరూ లేరు. మొదట తల మాత్రం బయటకు చాచి అటూ ఇటూ పరికించి చూశాడు. ఉత్తరనది వెల్లువ ఇరువైపులా గట్లను తాకుతూ పారుతూంది. చాల దూరాన దివిటీ వెలుతురు కనిపించింది. చుట్టుపక్కల ఎవరూ లేరని దృఢపరుచుకొన్న తర్వాత వంతిదేవుడు బయటికొచ్చాడు. కరుత్తిరుమన్ కూడ బయటకు వచ్చిన తర్వాత రహస్యద్వారాన్ని మూశాడు. ఉత్తరనదిని ఎలా దాటడమా అని ఆలోచిస్తున్నప్పుడు పక్కన ఉన్న ఒక చెట్టు కింద ఒక పడవ ఆ చెట్టు వేర్లలో చిక్కుబడివుండడాన్ని గమనించాడు.

~~~
~~~

# అధ్యాయము - 59

## అపశకునం

**చెట్టు** కింద ఒద్దికగా ఉన్న పడవను చూడగానే వంతిదేవుడు అదృష్టదేవత మళ్ళీ తనవైపుకు వచ్చినట్లు భావించి ఉత్సాహంగొన్నాడు. తనకు పడవ నడపడం రాకున్నా, కరుత్తిరుమన్ అదే జీవనవృత్తిగాగొన్నవాడు. అతని సహాయంతో ఉత్తరనది ప్రవాహం వెంబడి పడవ నడుపుకొంటూ వెళితే అది కోడిక్కరైకి సగం దూరం వరకు తీసుకొని వెళ్ళి చేర్చేస్తుంది.

"చూశావా, కరుత్తిరుమా! ఈ పడవ వరదలో కొట్టుకొనిపోకుండ తేలుతూ వచ్చి మనకోసమే ఇక్కడ వేచివుంది. నీ పడవ నడిపే సామర్థ్యాన్ని కాస్త చూపిస్తే పొద్దు పొడిచే సమయానికి సగం దూరం వెళ్ళిపోవచ్చు. తర్వాత ఎవరైనా గుర్రాల మీద వచ్చినా కూడ మనని పట్టుకోలేరు!" అన్నాడు వంతిదేవుడు.

కరుత్తిరుమన్ కాస్త అనుమానంగా చుట్టుపక్కల చూశాడు. నదీతీరాన కోట గోడ వారగా ఏపుగా పెరిగిన పొదల్లో ఏదో కదలిక తోచింది.

కరుత్తిరుమన్ ఒక చిన్న రాయి తీసి ఆ పొదల మధ్యకు విసిరాడు. అక్కడినుంచి ఒక పిల్లి ఒక్కదూకులో బయటికొచ్చి పడవెక్కింది.

వంతిదేవుడు నవ్వుతూనే, "పడవ నడిపేవాడా! నాకన్న పెద్ద ధైర్యశాలిగా ఉన్నావే?" అని చెప్పి, ఇంకొక చిన్న రాయి తీసి పడవ లోపలికి విసిరాడు.

పిల్లి మళ్ళీ పడవనుంచి బయటకు దూకి వారిద్దరి వైపుగా పరుగెత్తుకు వచ్చి ఇద్దరి మధ్య దూరి పరుగెత్తింది.

ఇప్పుడు వంతిదేవుడు గాభరాపడి రెండడుగులు వెనక్కి వేశాడు.

"నీవేమీ నాకన్న ధైర్యశాలిగా కనిపించడం లేదు కదా?" అని ఎగతాళిగా అన్నాడు కరుత్తిరుమన్.

"నాకు పిల్లులంటే భయం. అది నన్ను తాకితేనే నా ఒళ్ళంతా గగుర్పొడుస్తుంది. మంచివేళగా, అది వెళ్ళిపోయింది కదా! రా, పోదాం!" అన్నాడు వంతిదేవుడు.

"పిల్లి నామీద పడ్డా నాకేమీ భయం లేదు. కానీ అది నాదారికడ్డమొస్తే అపశకునం!" అన్నాడు కరుత్తిరుమన్.

"శకునమేమిటి, అడ్డేమిటి?" అంటూనే వంతిదేవుడు కరుత్తిరుమన్ చేయి పట్టుకొని లాక్కొంటూ వెళ్ళి పడవెక్కాడు.

~

కరుత్తిరుమన్ పడవ ఒక మూలకు వెళ్ళి దాన్ని చెట్టు వేర్లనుంచి ఇవతలికి లాగజూశాడు.

పడవ కాస్త జరిగిందో లేదో, ఉన్నట్లుండి నలుగురు ఒక్క ఉదుటున పొదల మాటునుంచి దూకి వచ్చి పడవలోకెక్కేశారు.

వారిలో ఇద్దరు వంతిదేవుని మీదికి దూకి అతన్ని పడవ లోపలికి తోసేసి పడవ అడ్డ పలకలతో చేర్చి కట్టేశారు. తక్కిన ఇద్దరూ చేత శూలాలతో కరుత్తిరుమన్ దగ్గరికి వెళ్ళి అతనికిరువైపులా కాపలాగా నిలబడ్డారు.

వచ్చిన  నలుగురిలో నాయకుడిలాగ ఉన్నవాడు పాతాళ చెరసాల వాకిలినుంచి తమను వెన్నంటి వచ్చినవాడేనని వంతిదేవుడు గ్రహించాడు. అక్కడినుంచి అంతలోపల అతడు అంతవేగంగా వచ్చి పడవను ఎలా చేరుకొన్నాడా అని ఎంచి వంతిదేవుడు ఆశ్చర్యపోయాడు. అతడు మామూలు కాపలావాడు కాడు, చాల ఆరితేరిన గూఢచారి అయివుండాలని తీర్మానించుకొన్నాడు వంతిదేవుడు. అతడు ఎవరైవుండవచ్చు, ఎక్కడో చూసినట్లుంది కద అనుకొంటున్నప్పుడే అతని మాటలు వినిపించాయి.

కరుత్తిరుమన్ని చూసి ఆ కాపలా వీరుడు, “ఏమయ్యా! ఇన్నాళ్ళు చెరసాలలో గడిపి, ఇప్పుడు బయటికొచ్చావు. ఇప్పుడు ఈ దుర్మతి మాటలు విని ఎందుకు పారిపోజూశావు? పోతేపోనీ. నిన్ను మళ్ళీ కట్టి పడేయడానికి మనసు రావడం లేదు. నేను చెప్పినట్లు విని ఆ ప్రకారం చేశావంటే నీకే హానీ కలగదు!” అన్నాడు.

కరుత్తిరుమన్ కూడ, “అలాగేనయ్యా! ముఖ్యమంత్రి నన్ను విడుదల చేసేందుకు మనిషిని పంపారు. కానీ ఈ మూఢుని మాట విని నేను చెడిపోయాను. ఇక మీరు చెప్పినట్లు నడుచుకొంటాను. ఇక నన్ను పాతాళ చెరసాలకు మాత్రం పంపించకండి!” అన్నాడు.

“అవును. ముఖ్యమంత్రి నీనుంచి కొన్ని వివరాలను తెలుసుకోగోరుతున్నారు. వాటిని నిజంగా చెప్పేస్తే మళ్ళీ పాతాళ చెరసాలకు పంపించరు. కావలసినంత బంగారం, మణులు, మాణిక్యాలు ఇచ్చి పంపుతారు. మీరెక్కడికి వెళ్ళాలని బయల్దేరారు?”

“లంకకు వెళ్ళాలని బయల్దేరాము.”

“భలే బాగుంది. ముఖ్యమంత్రిని ఏమార్చేసి, సేనాధిపతి వేళార్‌గారి కాపలావీరులను తప్పించుకొని అంతదూరం వెళ్ళిపోదాం అనుకొన్నారా? కానీ ఈ మొరటు యువకుడు అలాంటి దుస్సాహసపుటాలోచన చేయగలవాడే. మునుపొకసారి చిన్న పళువేట్టరయ్యర్ కాపలా నుంచి తప్పించుకొన్నవాడు కద? పోతేపోనీ. ఇప్పుడు పడవను నదీప్రవాహానికి ఎదురుగా నడపాలి. నాతో వచ్చినవారిలో ఒకడికి మాత్రమే పడవ నడపడం వచ్చు. కాబట్టి నీవు ఇప్పుడు నీ హస్తలాఘువాన్ని కాస్త చూపించాలి. అవతలి గట్టు చేరి అక్కడినుంచి కోట ఉత్తర ద్వారం వైపు పడవను నడపాలి!”

“అవతలి గట్టుకు చేరిన తర్వాత నడిచే వెళ్ళిపోవచ్చు కదయ్యా! ప్రవాహం చాల

వేగంగా/ఉధృతంగా ఉంది. దానికెదురుగా పడవను చాలదూరం నడపడం కష్టమవుతుంది...!"

"అవతలి గట్టు మీద కాలు పెడితే ఈ మొరటు యువకుడు మళ్ళీ ఏదైనా చేష్ట చేస్తాడు! కాబట్టి నది మీదుగానే ముందుకు వెళ్ళాలి!" అన్నాడు కాపలావీరుల నాయకుడు.

~

పడవను కరుత్తిరుమన్, ఇంకొక కాపలావాడు చేరి నడపనారంభించారు. కాపలావారి నాయకుడు వంతిదేవుని సమీపించి, "అబ్బాయీ! నీ హస్తలాఘవాన్ని మళ్ళీ చూపడానికి ప్రయత్నించకు!" అన్నాడు.

"అయ్యా! నాగురించి మీకు చాల తెలుసులాగుందే?" అన్నాడు వంతిదేవుడు.

"ఎందుకు తెలియదు? వైద్యకుమారుని నీకు బదులు చెరసాలలో నొక్కేసి బయటకు రావడాన్ని చూశాను కద? తర్వాత మమ్మల్ని ఏమార్చి పారిపోజూశావు కద?"

వంతిదేవుడు చాల ఆశ్చర్యపడినవాడిలాగ, "అయ్యా! నాకన్న తెలివిమంతులే మీరు! పాతాళ చెరసాలలో జరిగింది ఎవరూ గమనించలేదనుకొన్నాను!" అన్నాడు.

"తమ్ముడూ! మా ముఖ్యమంత్రి చెవులకు, కళ్ళకు అందని చోటు ఈ చోళసామ్రాజ్యంలో లేదు. అవి లంకలోనూ ఉన్నాయి; కంచిలోనూ ఉన్నాయి; కడంబూర్ మాళిగలో కూడ ఉన్నాయి. ఆ వైద్యకుమారుడు పినాకపాణి శుద్ధ మూర్ఖుడన్న విషయం ముఖ్యమంత్రికి తెలుసు. అందుకే అతడి వెనక నన్ను కూడ పంపించారు!"

"నేనీ దారిన బయటపడేందుకు ప్రయత్నిస్తానన్నది కూడ ముఖ్యమంత్రికి తెలుసు కాబోలు. ఆయన చెవులు, కళ్ళు విచిత్రమైనవే. అలాగైతే, నేను నిరపరాధినన్నది, నన్ను పాతాళ చెరసాలలో బంధించింది తప్పని కూడ ఆయనకు తెలిసే ఉండాలే?"

"అది ముఖ్యమంత్రి బాధ్యత కాదు. నీవు అపరాధివా కాదా అన్నది తీర్మానించడం చక్రవర్తి బాధ్యత. నీవు పాతాళ చెరసాలనుంచి తప్పించుకోవడానికి ప్రయత్నించినందుకు శిక్ష విధించడం కొడుంబాళూర్ పెద్ద వేళార్ బాధ్యత!" అన్నాడు కాపలావారి నాయకుడు.

"అయ్యా! ఇప్పుడు నన్నెక్కడికి తీసుకొని వెళ్తున్నారు?"

"మొదట కొడుంబాళూర్ వేళార్ వద్దకు తీసుకొని వెళ్తాను. ఆయన కోట ఉత్తరద్వారం దగ్గర వేచివున్నారు."

"నాకోసమా పెద్ద వేళార్ వేచివున్నారు?"

"ఆహా! నీ గర్వం చూడు! దక్షిణసైన్యానికి మాతండ నాయకుడు, చోళ నాడు సామంతరాజుల్లో మొదటివారు, చోళకులానికి పరంపరగా తోడున్నవారు, పాండ్యకులాన్ని సమూలంగా తుడిచిపెట్టినవారు, లంకనుగొన్న వీరాధివీరులు అయిన కొడుంబాళూర్ వేళార్ సేనాధిపతి బూది విక్రమకేసరి నీ కోసం కోట

వాకిట వేచివుంటారనుకొన్నావా?"

"మరి, ఎవరి కోసం?"

"పళువేట్టరయ్యర్లను, ఇంకా తిరుప్పురంపయంలో సమావేశమైన చిన్నరాజులను పార్థిబేంద్రుడు పిలుచుకొని వస్తున్నాడు..."

"పెద్ద పళువేట్టరయ్యర్ కూడానా?"

"అవును; ఆయన కూడాను. యువరాజు కరికాలన్ మరణం గురించిన నిజం ఆయనకు తెలుసునట. ఆయన వచ్చిన తర్వాత చక్రవర్తి సమక్షాన విచారణ జరుగుతుంది. నీవు అపరాధివి కాకపోతే, అప్పుడు దాన్ని నిరూపించాలి."

~

వంతిదేవుడు ఇక మహాదిగుల్లో మునిగిపోయాడు. పళువేట్టరయ్యర్లు, పార్థిబేంద్రుడు కూడబలుక్కొని తనమీదే నిందను మోపబోతున్నారు. భగవాన్! ఆ నిందారోపణతో చక్రవర్తిని, యువరాజు అరుళ్మొళి వర్మను ఎలా తలెత్తి చూడడం? ఏ సాక్ష్యాన్ని చూపించి తాను నిరపరాధినని నిరూపించడం?

"అయ్యా! నేను మీకే కీడు చేయలేదు కద? నన్ను తప్పించుకొని పారిపోనివ్వండి! నిజానికి నేను అపరాధిని కాను. మరణించిన యువరాజుకు అత్యంత సన్నిహిత స్నేహితుడిని. సందర్భవశాన ఇటువంటి భయంకరమైన నేరం మోపబడినవాడిని. మీరు ముఖ్యమంత్రి సేవకులు. చెరలో ఉన్న పిచ్చివాడిని మాత్రమే కద విడిపించుకొని పిలుచుకొని రమ్మని ముఖ్యమంత్రి మిమ్మల్ని ఆజ్ఞాపించారు? ఇతన్ని పిలుచుకొని వెళ్ళండి. నన్ను విడిచి పెట్టండి! మీకు పుణ్యముంటుంది!" అని వంతిదేవుడు జాలిగా అడిగాడు.

"నిన్ను వదిలేస్తే, నాకేమిస్తావు?" అని అడిగాడు కాపలావారి నాయకుడు.

"తర్వాత సమయం, సందర్భం వచ్చినప్పుడు ప్రత్యుపకారం చేస్తాను."

"అలా ఒక సమయం, సందర్భం రాబోవడమూ లేదు; వచ్చినా నీ సహాయం నాకవసరం లేదు. ఇప్పుడు వెంటనే ఏమిస్తావో చెప్పు!"

వంతిదేవునికి తన నడుంబట్టలో దాచుకొన్న బంగారు నాణాలు గుర్తుకొచ్చాయి.

"మీ రెండు చేతులనిండా బంగారు కాసులిస్తాను!"

"ఆహా! అలాగా! బంగారు కాసులా? ఏదీ, చూపించు!" అన్నాడు నాయకుడు.

"నా కట్లను సడలించండి. నడుం బట్టలో ఉన్నాయి. తీసి చూపిస్తాను!" అన్నాడు వంతిదేవుడు.

"మళ్ళీ నీ హస్తలాఘవాన్ని చూపకేం!" అంటూనే ఆ కాపలావారి నాయకుడు వంగి వంతిదేవుని కట్లను సడలించాడు.

వంతిదేవుడు అతని ముఖాన్ని గుచ్చి చూస్తూనే బంగారు కాసుల్ని తీసిచ్చాడు.

కాపలా నాయకుడు ఆ బంగారు కాసుల్ని చేత పట్టుకొని, “తమ్ముడూ! ఈ నాణ్యాలను నీవు పెద్ద పళువేట్టరయ్యర్ బొక్కసంనుంచి దొంగిలించి తీసుకొని వచ్చావా? లేక టంకశాలనుంచే ఎత్తుకొని వచ్చేశావా? నీమీద ఇప్పుడు మూడు నేరాలున్నాయి. హత్యానేరం ఒకటి; చెరసాలనుంచి తప్పించుకోజూసిన నేరం ఇంకొకటి; రహస్య బొక్కసం నుంచి దొంగతనం చేసిన నేరం మూడోది. మొత్తం మూడు నేరాలు. ఒక్కొక్క నేరానికి నిన్ను వేర్వేరుగా ఉరికంబమెక్కించవచ్చు!” అన్నాడు.

“అయ్యా! చోళరాజ్యానికి నేనెన్నో సేవలు చేశాను. చాలసార్లు దూతగా వెళ్ళాను. నా ప్రాణాలొడ్డి కరికాలన్‌గారిని కాపాడేందుకు ఎంతగానో ప్రయత్నించాను. ఈ కొన్ని కాసులను నా సేవలకు కూలీగా పొందేందుకు నాకు హక్కుంది. అది కూడ దారి ఖర్చులకోసమని తీసుకొన్నాను" అన్నాడు వంతిదేవుడు.

“ఇదంతా నిన్ను విచారణ చేసేటప్పుడు చెప్పుకో!” అన్నాడు కాపలావారి నాయకుడు.

“అలాగైతే మీరు నా కట్లు విప్పబోవడం లేదా?” అని అడిగాడు వంతిదేవుడు.

“తూర్పున ఉదయించే సూర్యుడు పడమట ఉదయించినా, పెరుమాళ్ళకన్న పరమశివుడు పెద్ద దైవం అని నిరూపించబడినా కూడ నేను కొన్ని బంగారు కాసుల కోసం రాజద్రోహం చేయను" అన్నాడు కాపలావారి నాయకుడు.

~

కరుత్తిరుమన్ ఏం చేస్తున్నాడని ఓరకంట చూశాడు వంతిదేవుడు. అతడు ఆసక్తితో తననుంచి సంజ్ఞ కోసం ఎదురుచూస్తుండడాన్ని గమనించాడు.

వెంటనే ఆ వీరయువకుడు అప్పటికే సడలించబడ్డ కట్లను ఇంకాస్త సడలించుకొని చటుక్కున ఆ కాపలావాడి మీసాన్ని, తలపాగాను పట్టి లాగాడు.

అవి ఊడి అతని చేతికొచ్చేశాయి. సాక్షాత్తు ఆళ్వార్ కట్టియాన్ దర్శనమిచ్చాడు.

“వేషధారి వైష్ణవా! నీవేనా?” అన్నాడు వంతిదేవుడు.

ఆళ్వార్ కట్టియాన తన మీసాన్ని, తలపాగాను కాపాడుకోవడానికి ప్రయత్నించినప్పుడు అతని చేతనున్న బంగారు కాసులు కింద పడ్డాయి.

వంతిదేవుడు ఒక్కక్షణంలో తన కట్లను విప్పదీసుకొని ఆళ్వార్ కట్టియాన్ని కింద పడదోశాడు.

కాసేపటి క్రితం తనను కట్టివుంచిన తాడునే ఉపయోగించి ఆళ్వార్ కట్టియాన్ని పడవ అడ్డు బల్లలకేసి కట్టేశాడు.

తన నడుమున కట్టివున కత్తిని ఒరనుంచి దూశాడు.

వంతిదేవుడు ఈ కృత్యాల్లో నిమగ్నమైవున్నప్పుడు కరుత్తిరుమన్ ఊరకలేడు. అతని దగ్గరగా నిలబడివున్న కాపలావీరుని అధాటున అటకాయించి నది వెల్లువలోకి తోసేశాడు. అతడు నదిలో పడి కొట్టుమిట్టాడసాగాడు.

తక్కిన ఇద్దరిలో ఒకడు వంతిదేవుని వైపు, ఇంకొకడు కరుత్తిరుమన్ వైపు రాసాగారు. ఇద్దరూ భయపడుతూనే జంకుతూ వారిని సమీపించారు. వంతిదేవుడు తనని సమీపిస్తున్న కాపలావీరుని వైపు కత్తిని ఝుళిపించగానే అతడు తనకు తానే వెల్లువలోకి దూకేశాడు.

ఇంతలో రెండవవాడిని కరుత్తిరుమన్ తన చేతనున్న తెడ్డుతో ఒక్క దెబ్బ కొట్టి పడవలో పడేశాడు.

ఇద్దరూ చేరి ఆ కాపలావీరుడిని కూడ పడవ అడ్డు బల్లలకు కట్టి పడేశారు.

పడవ నదీప్రవాహం వెంబడి వెళుతూంది. వెల్లువలో పడ్డ ఇద్దరు కాపలావీరులు కూడ అవతలి గట్టువైపు ఈదనారంభించారు.

వంతిదేవుడు ఆళ్వార్ కట్టియాన్ దగ్గరికి వెళ్ళి, "వీరవైష్ణవ శిఖామణీ! ఇప్పుడేమంటావు?" అన్నాడు.

"ఏం చెప్పను? అంతా ఆ నారాయణమూర్తి లీల. కట్టేవాడూ వాడే. కట్లు విప్పేవాడూ వాడే. తోసేవాడూ వాడే; తోయబడేవాడూ వాడే; ధూళిలోనూ ఉన్నాడు; నీ చేతి కత్తిలోనూ ఉన్నాడు; నా భుజాన కూడ ఉన్నాడు!"

"అలాగైతే ఈ నది వెల్లువలోనూ ఉన్నాడు! నిన్ను కట్లతోబాటు నది వెల్లువలో పడేయవచ్చు కద?"

"ప్రహ్లాదుని రాతితో కట్టి కడలిలో పడేశారు. వాడిని ఆ నారాయణమూర్తి కాపాడి గట్టుకు చేర్చలేదా? అలా భగవానుడు వచ్చి నన్ను గట్టెక్కించలేకపోతే, సాక్షాత్తు వైకుంఠానికే నన్ను పిలిపించుకొంటాడు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

~

అది విన్న వంతిదేవుడు కాస్త ఆలోచించి, "ఇదిగో చూడు! నీవు నన్ను కొన్నిసార్లు కాపాడావు. ఏ ఉద్దేశంతో కాపాడావో తెలియదు! ఎలా ఉన్నా, నేను నిన్ను చంపాలనుకోవడం లేదు. అయినా కూడ, నీ ప్రాణాన్ని కాపాడాలంటే, నీవు నాకొక సహాయం చేయాలి!" అన్నాడు.

"అబ్బాయీ! పరోపకారార్థం ఇదం శరీరం అన్న నీతి వాక్యాన్ని పాటించేవాడిని నేను. నీకేం సహాయం కావాలో అడుగు! కట్లు విప్పితే చేస్తాను!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"నీ శరీరం వల్ల నాకిప్పుడే సహాయమూ అవసరం లేదు. నాకు, ఇతడికి రెండు గుర్రాలు కావాలి. ఎందుకని అడుగుతున్నావా? తప్పించుకొని పారిపోవడానికే! అందుకు దారేదైనా చెబితే, నిన్నిలాగే పడవలో తేలడానికి వదిలిపెట్టి మేము గట్టు మీదికి దిగేస్తాము. పడవ తీరాన్ని చేరే చోట నీ సామర్థ్యాన్ని ఉపయోగించి బతికి బయట పడు!"

"నావల్ల సాధ్యమయ్యే సహాయాన్ని కోరుతున్నావు కద, అందుకు సంతోషపడుతున్నాను."

"నాకు గుర్రాలు దొరికే దారి చెప్పగలవా, లేదా?"

"చెప్పగలను! మీ ఇద్దరికీ రెండు గుర్రాలున్న చోటు నాకు తెలుసు. వాణి అమ్మగారి ఇల్లు నీకు తెలుసు కద?"

"ఏ వాణి అమ్మగారు?"

"తంజావూరు తళి కుళత్తార్ ఆలయానికి నిత్యం పుష్పకైంకర్యం చేసే వాణి అమ్మగారు. పుట్టు మూగది. సేందన్ అముదన్ తల్లి."

~

ఇలా ఆళ్వార్ కట్టియాన్ చెబుతున్నప్పుడు కరుత్తిరుమన్ దగ్గరికొచ్చి చాల ఆసక్తితో వినసాగాడు.

"తెలుసు. ఆ ఇల్లు నాకు తెలుసు. నందనవనంలో ఉంది."

"అక్కడ రెండు గుర్రాలు ఈ క్షణాన నిలబడివున్నాయి."

"అదెలా??"

"ఒకటి, నా గుర్రం! వాణి అమ్మగారి గుడిసె దగ్గర దాన్ని కట్టేసి ఈ పడవలో ఎక్కి వచ్చాను. రెండోది సేందన్ అముదన్ ఎక్కి వచ్చిన గుర్రం. పాపం! అముదన్ గుర్రమెక్కే అలవాటు లేనివాడు. దారిన అది మొరాయించి అతన్ని కింద పడేసింది. అప్పటికే జ్వరం వల్ల బలహీనమైవున్నవాడు, కింద పడ్డ అదిరిపాటు వల్ల మళ్ళీ మంచం పట్టాడు. బతికితే పునర్జన్మ అంటున్నారు. కాబట్టి గుర్రం అతనికింక అవసరం లేదు."

వంతిదేవుడు చాల దిగులుతో, "అతన్ని చూసుకోవడానికి ఎవరున్నారు?" అని అడిగాడు.

"అతని తల్లి, పూంగుళలి ఉన్నారు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

కరుత్తిరుమన్ ఉన్నట్లుండి ఆ సంభాషణలో పాల్గొని "ఏ తల్లి?" అని అడిగాడు.

ఇద్దరూ ఒక క్షణంపాటు అతన్ని ఎగాదిగా చూశారు.

"ఏమడిగావు?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"సేందన్ అముదన్ ప్రాణానికి అపాయం అని పెద్దరాణి శెంబియన మహాదేవికి తెలుసా అని అడిగాను."

"అవును; శెంబియన్ మహాదేవే వారికి పుష్పకైంకర్యం చేసేందుకు మాన్యం ఇచ్చి ఆదరిస్తూ వస్తున్నారు. కానీ ఇప్పుడు అంతఃపురానికి చెందినవారందరూ కరికాలన్ మరణం వల్ల కలిగిన దుఃఖసముద్రంలో మునిగివున్నారు కద? అముదన్ని ఎక్కడ గమనించబోతున్నారు?"

వంతిదేవుడు కరుత్తిరుమన్ని చూసి, "నీవేమంటావు? సేందన్ అముదన్ని, అతని తల్లిని వెళ్ళి చూసేసి వెళదామా?" అన్నాడు.

కరుత్తిరుమన్ తలాడించి సమ్మతాన్ని తెలియజేశాడు.

"అలాగైతే పడవను గట్టువైపు నడిపించు!" అని కరుత్తిరుమన్‌కి చెప్పేసి వంతిదేవుడు ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "వైష్ణవా! ఇందులో ఏదైనా కుతంత్రం ఉంటే, జాగ్రత్త! నా గతేమైనా, నిన్ను మొదట కైలాసానికి పంపించేసి తదుపరి కార్యం చేపడతాను!" అన్నాడు.

"వద్దు, తమ్ముడూ! వద్దు! నీకు పుణ్యముంటుంది! నన్ను శ్రీమన్నారాయణమూర్తి మహాలక్ష్మి సమేతంగా విలసిల్లిన వైకుంఠానికే పంపించేయి!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

~~~
~~~

# అధ్యాయము - 60

## అముదన్ విచారం

**నందనవనం** మధ్య ఉన్న గుడిసెలో సేందన్ అముదన్ జబ్బుతో మంచాన పడుకొనివున్నాడు. పూంగుళలి అతనికి ప్రేమతో శైత్యోపచారాలు చేస్తూంది. వాణి అమ్మ వండిచ్చిన గంజిని తీసుకొని వచ్చి అముదన్‌కి తాగిస్తూంది.

కాసేపటి క్రితమే సుందర చోళ చక్రవర్తి వైద్యశాలనుంచి వైద్యులు వచ్చి సేందన్ అముదన్ని చూసి పరీక్షించి మందులిచ్చి వెళ్ళారు. వెళ్ళేటప్పుడు వారిని పూంగుళలి పక్కకు పిలిచి విచారించింది - అముదన్ పరిస్థితి ఎలా ఉంది, బతికి లేచి నడుస్తాడా అని.

"మునుపే ఒకసారి జ్వరం వచ్చి బలహీనమైనవాడు. దానికి తోడు దీర్ఘప్రయాణం చేసి వస్తూ గుర్రంమీదినుంచి కిందపడ్డాడు. దానివల్ల ఏమీ ఫరవాలేదు. కానీ అతని మనసులో ఏదో దిగులు పెట్టుకొన్నాడు. అందుకే ఒళ్ళు కోలుకోవడం ఆలస్యమవుతూంది!" అన్నారు వైద్యులు.

దీన్ని మనసులో ఉంచుకొని పూంగుళలి, "అముదా! నీ మనసులో ఏం దిగులు? ఎందుకు నిరుత్సాహంగా ఉన్నావు? నీవు మనసులో దిగులు కలిగివుండడం వల్లనే నీవు త్వరగా కోలుకోవడం లేదని వైద్యులు చెప్పారు కద?" అన్నది.

అముదన్, "పూంగుళలీ! నిజం చెప్పనా? లేక మనసులో ఒకటుంచుకొని, బయటికి ఇంకొకటి చెప్పనా?" అన్నాడు.

పూంగుళలి, "నేనలా లోపలొకటి, బయటికింకొకటిగా మాట్లాడేదాన్నని దెప్పి పొడుస్తున్నావా?" అని అడిగింది.

"పూంగుళలీ! నీతో మాట్లాడడమే అపాయకరంగా ఉంది. నీవు మాట్లాడక ఊరకుంటేనే నీ ముఖాన్ని చూస్తూ సంతోషపడుతుంటాను."

"బహుశ నా అత్తల్లాగ నేను కూడ మూగదాన్నయితే నీకు చాల సంతోషంగా ఉండేదేమో కద?"

"ఏనాడూ కాదు. నీవు పాడేటప్పుడు నేను పొందే ఆనందానికి అంతే లేదు. వట్టి మాటల్లో ఏముంది? ఒక దేవారం పాడు!"

"అదంతా వీలుపడదు. నీ మనసులో ఉన్న దిగులేమిటో చెబితేనే పాడుతాను."

"అలాగైతే చెబుతాను విను - నా దిగులంతా నా ఒళ్ళు చాల త్వరగా కోలుకోబోతూంది కద అనే!"

"ఇదేం ఇలా అంటున్నావు? నీవు త్వరగా కోలుకోవాలని అన్ని దేవుళ్ళకూ

మొక్కుకొంటున్నాను కద? నీవు త్వరగా కోలుకొంటావని దిగులుపడనేల?"

"నేను కోలుకొంటే నీవు నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోతావు కద? దాన్ని తలుచుకొనే దిగులుపడుతున్నాను, పూంగుళలీ!"

~

పూంగుళలి ముఖం ప్రాతఃకాల హిమబిందువులతో మెరిసే తామరపూవులాగ విప్పారి వెలిగింది. ఆమె పెదవుల మీద చిరునవ్వు విరిసింది. కళ్ళలో కన్నీళ్ళుబికాయి.

"అముదా! నీ ప్రేమతో నా మనసు కరుగుతూంది. నిన్ను వదిలిపెట్టి వెళ్ళేందుకు మనసు రావడం లేదు. వెళ్ళకుండ ఉండేందుకు కూడ సాధ్యం కావడం లేదు."

"అవును. అలల కడలి నిన్ను పిలుస్తూంది. దానివల్లనేమి? నేనూ నీతో వస్తాను. అందుకు నీ సమ్మతాన్ని తెలియజేయి. నా ఒళ్ళు కూడ త్వరగా కోలుకొంటుంది."

"అముదా! నేను నా మనసు లోపల చేసుకొన్న శపథమే అందుకడ్డొస్తూంది."

"ఏమా శపథం?"

"పులి(ని) ఏలే రాజును పెళ్ళాడి ఆ రాజుతో సింహాసనం మీద కూర్చోవాలన్నది నా మనోరథం. ఇది సాధ్యం కాకపోతే కన్యగానే కాలం గడపాలని నా మనసులో శపథం చేసుకొన్నాను."

"అవును; పొన్నియిన్ సెల్వన్ నీ మనసులో చోటు చేసుకొన్నారు. కానీ పూంగుళలీ! అది సాధ్యమా?"

"నీవు తప్పుగా అర్థం చేసుకొన్నావు. ఆయన మీద ఈ చోళనాడులో పుట్టినవారందరూ ప్రేమగొన్నారు. స్త్రీలు, పురుషులు, వయోవృద్ధులు, పిల్లలు - అందరూ అరుళ్మొళి వర్మగారి నెయ్యం కోరుకొనేవారే. అలాగే నేను కూడ ఆయన మీద అభిమానంగొన్నాను. ఆయన జ్వరంతో పడవలో పడుకొనివున్నప్పుడు నేనూ, నీవూ ఇద్దరూ కలిసే ఆయనకు శైతోపచారాలు చేసి కాపాడాము..."

"అలాగైతే, ఆయన మీద ... ఆయన మీద .. ఇంకే విధమైన అభిప్రాయమూ నీకు లేదా?"

"అముదా! పొన్నియిన్ సెల్వన్‌గారిని పెళ్ళాడేందుకు పుట్టింది ఇంకొకతె ఉంది. ఆమె కొడుంబాళూర్ రాకుమారి వాణతి. నేనేదో ఆమెతో తమాషాగా మాట్లాడగా అమె 'నేను సింహాసనమెక్కను' అని శపథం చేసింది..."

"రాజకులంలో పుట్టినామె అలా శపథం చేసింది. నీవేమో 'సింహాసనం ఎక్కే తీరుతాను' అని అంటున్నావు. లేకపోతే కన్యగానే ఉండిపోతానంటున్నావు."

"అముదా! నా అత్త రాజవంశంలో పుట్టినవారిని ప్రేమించింది. అందువల్ల ఆమె జీవితమే దుఃఖమయమైంది. నా అత్త పొందలేకపోయిన భాగ్యాన్ని నా జీవితకాలంలో నేను పొందుతాను. ఎందుకు పొందకూడదు?"

"నీకా ఆశ కలిగింది నా అభాగ్యం వల్లనే!" అన్నాడు సేందన్ అముదన్.

"అలా నేనెందుకు నిరాశ చెందాలి? రాజవంశంలో పుట్టినవారు మాత్రమే రాజ్యమేలవచ్చని నియమమేమీ ఏమీ లేదు. నీలాగ సాధారణ కుటుంబంలో పుట్టినవారు తమ వీరపరాక్రమ కృత్యాలవల్ల రాజ్యాలను స్థాపించి సింహాసనమెక్కిన సందర్భాలున్నాయి. నీవు కూడ అలాంటి శపథం చేయి. ఈ బృహత్ భారతదేశంలోగాని, సముద్రాలకవతల ఉన్న విదేశాల్లోగాని నీ భుజబల పరాక్రమం వల్ల రాజ్యాన్ని స్థాపించేందుకు తీర్మానం చేసుకో. నేను నిన్ను విడిచి వెళ్ళక నీకు తోడుగా ఉంటాను" అన్నది పూంగుళలి.

"పూంగుళలీ! అటువంటి కార్యాలు చేసేందుకు నేను పుట్టలేదు. నా మనసు కత్తి పట్టి యుద్ధం చేయడంలో ధ్యాసగొనలేదు. ఒక చిన్న ప్రాణికి కూడ హాని కలిగించడం నేను కోరుకోను. మణిమకుటం, సింహాసనం నా మనసునాకట్టుకోలేవు. శివపరమాత్మను పూజిస్తూ, శివభక్తిలో మునిగి శివ భక్తి గీతాలను పాడుతూ కాలం గడపాలనే కోరుకొంటున్నాను. కాబట్టి నీకు, నాకు పొందిక లేదు! నిన్ను నేను పెళ్ళాడాలనుకోవడం దురాశపడడమే. పూంగుళలీ! నీవు ఇక్కడ కాలయాపన చేయడంవల్ల ప్రయోజనం లేదు. నీవు వెళ్ళిపో! నేను కోలుకొనే వరకు వేచివుండకు!" అన్నాడు సేందన్ అముదన్.

అప్పుడు ఆ గుడిసె వాకిట కాలి చప్పుడు వినిపించగా ఇద్దరూ మాటలాపారు.

~~~
~~~

# అధ్యాయము - 61

## నిశ్చితార్థం

**బయట** కాలి చప్పుడు వినిపించగానే పూంగుళలి ఆ చిన్న గుడిసె వాకిలివైపు వెళ్ళింది.

ఆమె తనను (పూర్తిగా) విడిచిపెట్టి శాశ్వతంగా వెళ్ళిపోయిందని ఎంచి సేందన్ అముదన్ పెద్దగా నిట్టూర్చాడు. ఆమె ఆ వాకిలి గడప దాటి వెళుతున్నప్పుడు తన ప్రాణమే శరీరాన్ని విడిచి వెళ్ళిపోతుందని భావించాడు.

పూంగుళలి తలుపును కాస్త తెరిచి బయటకు తొంగి చూసేసి మళ్ళీ గట్టిగా గొళ్ళెం పెట్టడాన్ని గమనించాడు సేందన్ అముదన్. ఇదేం వింత? తలుపును మూసి గొళ్ళెం పెట్టడమేగాక తనవైపే వస్తూందే?

ఆమె మనసు గనక కాస్త కరిగిందా? కరిగితేనేమి? మళ్ళీ తనను వీరుడివి కావాలని, రాజ్యాన్ని చేబట్టాలని, సింహాసనమెక్కి రాజ్యమేలాలని, - లౌకిక వాంఛలనే సుడిగాలి వల్ల అల్లకల్లోలితమవుతున్న కడలి ఆమె మనసు. శివపరమాత్మ భక్తిలో మునిగి ప్రశాంతంగా ఉన్నటువంటిది అతడి మనసు. అందులో లేచిన చిన్న కలకలం/కల్లోలం ఈమె వల్ల కలిగిందే. పూంగుళలికి, తనకు ఏనాడూ పొందిక కుదరదు. అందుగురించి అనవసరంగా ఆశలు పెంచుకోవడంలో ప్రయోజనమేముంది?

పూంగుళలి అతన్ని సమీపించగానే తన విప్పారిన కలువల్లాంటి కళ్ళతో పరీక్షగా చూసింది. అతని హృదయం తల్లడిల్లింది.

"తలుపును ఎందుకు మూశావు? ఎవరొచ్చారు? ఒకవేళ ఆ మహారాణి కాబోలు!" అన్నాడు సేందన్ అముదన్.

"ఎవరైనా కూడ, కాసేపు వేచివుండనీ. మన సంభాషణ ముగిసేవరకు బయటే ఉండనీ. రాజు, రాణి ఏకాంతంలో మాట్లాడుకొంటున్నప్పుడు మధ్య ఎవరూ అడ్డు రాకూడదు కద?" అన్నది

"రాజు, రాణి; ఎవరు రాజు? ఎవరు రాణి?" అని తడబడుతూ అడిగాడు అముదన్.

"నీవు రాజు, నేను రాణి! ఇంతసేపూ నేను చెప్పిందంతా నీ మనసుకెక్కలేదా?"

"లేదు, పూంగుళలీ! నీవు నాకు బోధ చేయడం వల్ల ఎలాంటి ప్రయోజనమూ లేదు - అని చెబుతున్నాను కద? నీ మనసు పోకడ, నా మనసు పోకడకు పూర్తిగా వ్యతిరేకం. అవి ఒకదానికొకటి పొందిక కావు!" అన్నాడు అముదన్.

"పొందికయ్యేటట్లు మనమే చేయాలి!" అన్నది పూంగుళలి.

"అది సాధ్యం కాని కార్యం!"

"నీవల్ల కాకపోతే, నాకు సాధ్యమౌతుంది, అముదా! నేను తీర్మానించేశాను - రాకుమారుని

పెళ్ళి చేసుకొని సింహాసనమెక్కే ఉద్దేశాన్ని వదిలిపెట్టేశాను. అంతఃపుర జీవితం, రాజభోగాల కన్న నాకు నీ ప్రేమ వేయి రెట్లు పెద్దది. నీవు నా దారికి వస్తే సరి, లేకపోతే నేను నీ దారికి వస్తాను. నిన్నే నేను పెళ్ళి చేసుకొంటాను....”

~

సేందన్ అముదన్ పరవశించిపోయాడు. “పూంగుళలీ! పూంగుళలీ! నాకిప్పుడు జ్వరం పూర్తిగా నయమైపోయింది. నేను కలగంటున్నానా? ఇప్పుడు నీవు చెప్పిన మాటలు నా చెవిన పొరబాటున పడలేదు కద? నేను పొరబాటుగా అర్థం చేసుకోలేదు కద?” అన్నాడు.

“ఇంకొకసారి చెబుతున్నాను, విను! నీవు నా దారికి రా నిరాకరిస్తే, నేనే నీ దారికి వచ్చేందుకు సిద్ధంగా ఉన్నాను. నిన్నే పెళ్ళిచేసుకొంటాను. నా పెద్దత్త జీవితం గురించి నేను తెలుసుకొన్న వివరాలు నా మనసులో లేనిపోని ఆశలను పుట్టించాయి. న్యాయప్రకారం ఆమే సింహాసనం మీద కూర్చోవాలి కద అని ఎంచి, నేను కూడ ఎందుకు సింహాసనంమెక్కకూడదని ఉక్రోషం పుట్టుకొచ్చేది. నా అత్త హంతకుని శూలంచేత చంపబడినప్పుడు, నా ఆశ కూడ చచ్చిపోయింది. అంతఃపురంలో నివసించేవారు పడేపాట్లు, పడే వేదనలను తెలుసుకొన్నాను. అలల కడలిలో పడవ నడుపుకొంటూ ఆనందంగా గడిపే జీవితానికి అంతఃపురజీవితం ఎన్నడూ సాటిరాదు అని తెలుసుకొన్నాను. అముదా! నీవు కోలుకోగానే ఇద్దరమూ కోడిక్కరైకి వెళదాం. అక్కడ అడవి మధ్య కుళకర్ (విష్ణువు) ఎవరూ తోడులేక ఒంటరిగా ఉన్నారు. మనమిద్దరం కుళకర్‌కి పుష్పకైంకర్యం చేద్దాం. అప్పుడప్పుడు పడవెక్కి సముద్రంలో వెళదాం. లంక సమీపాన ఎన్నో అందమైన దీవులున్నాయి. ఆ దీవుల్లో ఒకదాంట్లో కొంతకాలం ఉందాం. అక్కడ నీవు రాజుగాను, నేను రాణిగాను ఉందాం. ఆ రాజ్యానికి ఏదీ సాటి రాదు. అముదా! దీనికంతా నీకభ్యంతరమేమీ లేదు కద?”

“ఒకే ఒక ఆక్షేపణ, పూంగుళలీ! ఇంత పెద్ద భాగ్యానికి నేను అర్హుడనేనా అన్న భావమే. ఇదంతా నీవు నిజంగానే కద చెబుతున్నావు? తర్వాత నన్ను మోసపుచ్చవు కద? లేదు, లేదు! నీవు నిజమే చెబుతున్నావు. ఎప్పుడు కోడిక్కరైకి బయల్దేరుదాం?”

“నీవు కోలుకొన్న వెంటనే బయల్దేరుదాం.”

“నాకు నయమైపోయింది, పూంగుళలీ! కావాలంటే ఇప్పుడే లేచి నడుస్తాను, చూస్తావా?” అని చెప్పి సేందన్ అముదన్ లేచి నిలబడేందుకు ప్రయత్నించాడు.

పూంగుళలి అతని చేయి పట్టుకొని లేవకుండ ఆపి, “వద్దు! ఈ ఒక్కరోజు మాత్రం ఓపిక పట్టు!” అన్నది.

తలుపును ఎవరో మెత్తగా తడుతున్న శబ్దం వినిపించింది.

“అమ్మ తలుపు తడుతోంది, తెరువు! అమ్మకు ఈ సంతోషకరమైన వార్తను చెబుదాం!”

అన్నాడు సేందన్ అముదన్.

~

పూంగుళలి వెళ్ళి తలుపు తెరిచింది. బయట కనిపించిన దృశ్యాన్ని చూసి కాస్త ఉలిక్కిపడింది. ఆమె ఎదురు చూసినట్లు తలుపు తట్టింది అముదన్ తల్లి వాణి కాదు.

అంతఃపురసేవకుడొకడు తలుపు తట్టివుంటాడని తోచింది. తలుపు తెరవగానే సేవకుడు పక్కకు ఒదిగి నిలబడ్డాడు.

అవతల, శెంబియన మహాదేవి, యువరాజు మధురాంతకులు నిలబడివున్నారు.

ఇంకాస్త దూరాన రెండు పల్లకీలు దించబడివున్నాయి. పల్లకి బోయీలు, కాపలావీరులు చెట్టు కింద నిలబడివున్నారు. వారిలో ఒకడు పట్టుకొన్న దివిటీ వెలుతురులో ఇదంతా చూసిన పూంగుళలి శెంబియన్ మహాదేవి ముందు తలవొగ్గి నమస్కరించి, "తల్లీ! రండి!" అన్నది.

"నీ అత్త కొడుకుకెలా ఉంది, పూంగుళలీ? వాణి అమ్మ ఎక్కడ?" అని అడుగుతూనే పెద్ద మహారాణి ఆ గుడిసెలో ప్రవేశించారు.

మధురాంతకుడు బయటే నిలబడ్డాడు. కానీ అతని క్రోధం పెల్లుబికిన కళ్ళు గుడిసె లోపలికి చూశాయి.

వస్తున్నవారు శివభక్తశిరోమణి, తమకు మాన్యమిచ్చి కాపాడుతూ, ఆదరిస్తున్న శెంబియన్ మహాదేవి అని తెలియగానే అముదన్ లేచాడు.

"తల్లీ! మంచి సమయానికి వచ్చారు. మొట్టమొదట సంతోషకరమైన వార్తను మీకు చెప్పి మీ ఆశీర్వాదాన్ని పొందే భాగ్యం మాకు కలిగింది. శివపరమాత్మ లీల వల్లే ఇది జరిగివుండాలి. ఇంకా నా అమ్మకు కూడ చెప్పలేదు. తల్లీ! ఇంతకాలానికి పూంగుళలి మనసు కరిగి నన్ను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకొంది. మీరే దగ్గరుండి మా పెళ్ళిని జరిపించాలి. మేము పెళ్ళి చేసుకొన్న తర్వాత కోడిక్కరై కుళకర్ కోవెలకు వెళ్ళి అక్కడ పుష్పకైంకర్యం చేస్తూ జీవితం గడపదలుచుకొన్నాము!" అన్నాడు.

శెంబియన్ మహాదేవి ఈ వార్తను విని సంతసించారా, లేక దిగులుపడ్డారా అని తెలుసుకోవడం సాధ్యం కాలేదు. ఆమె పెదవుల మీద ఆనందలాస్యం వికసించింది. కానీ కళ్ళలోనేమో కన్నీళ్ళుబికాయి.

అముదన్, పూంగుళలి ఆమెకు నమస్కరించినప్పుడు, ఆ స్త్రీమణి గద్గద స్వరంతో, "బిడ్డలారా! దేవుని దయవల్ల మీ జీవనం ఇంపుగా ఉండనీ!" అని ఆశీర్వదించారు.

ఆ సమయాన వాణి అమ్మ అక్కడికి వచ్చింది. ఆమెతో శెంబియన్ మహాదేవి సంజ్ఞాభాషలో తాను సేందన్ అముదన్ ఆరోగ్యం గురించి విచారించేందుకు వచ్చానని తెలియజేశారు. వచ్చిన చోట వారికి పెళ్ళి జరగబోతున్న మంచి వార్త తెలిసి చాల సంతోషించినట్లు తెలియజేశారు.

అప్పుడు వాణి అమ్మ ముఖం కలతను, సంతోషాన్ని ఒకేసారి ప్రతిబింబించాయి.

ఇంకాసేపు సేందన్ అముదన్‌తోను, పూంగుళలితోను మాట్లాడిన తర్వాత శెంబియన్ మహాదేవి బయలుదేరారు.

ఆమె, మధురాంతకుడు పల్లకీలు నిలిపివుంచిన వైపు వెళ్ళారు.

~

దారిన ఒక చెట్టు కింద పెద్ద మహారాణి నిలబడి చుట్టూ చూశారు. చుట్టు పక్కల ఎవరూ లేరని నిర్ధారించుకొన్న తర్వాత మధురాంతకుని చూసి, "చూశావా, మధురాంతకా! నేను పది మాసాలు నా కడుపులో మోసి కన్న కొడుకు అదిగో ఆ గుడిసెలో బతుకుతున్న సేందన్ అముదన్. వాడికి అయిదేళ్ళ ప్రాయం వచ్చినప్పుడే నాకీ సంగతి తెలిసిపోయింది. వాడు ఎనిమిదిరోజుల బిడ్డగా ఉన్నప్పుడు ఊపిరాడక పడివుండడాన్ని చూసి చనిపోయాడని అనుకొన్నాను. తల్లికి బిడ్డమీది ప్రేమ వల్ల నిన్ను నా కొడుకుగా స్వీకరించి, వీడిని తీసుకొని వెళ్ళి పూడ్చేయమన్నాను. వీడిని తీసుకొని వెళ్ళిన వాణి చాల కాలం తిరిగి రానేలేదు. ఐదేళ్ళ తర్వాత ఈమెను, ఈ పిల్లాడిని చూడగానే నిజం తెలుసుకొన్నాను. కానీ నేను నిన్ను తోసిపుచ్చలేదు. వాడు నా కడుపున పుట్టిన కొడుకని అంతఃపురానికి పిలిపించుకోనూ లేదు. అంతా దేవుని లీల అని భావించి నిన్ను నా కడుపున పుట్టిన బిడ్డ కన్న పదిరెట్లు ఎక్కువ ప్రేమతో పెంచాను. దానికంతా నీవు ఇప్పుడు నాకీ వరాన్నివ్వు! చోళసింహాసనం వద్దని చెప్పేయి! నీవు సింహాసనమధిష్టించేందుకు కూడ నేను అభ్యంతరం చెప్పను. కానీ నీ వంశంలో పుట్టే పిల్లలు మూగవారైతే ఏం చేయడమా అనే జంకుతున్నాను!" అన్నారు.

శెంబియన్ మహాదేవి ఇలా చెబుతున్నప్పుడు మధురాంతకుని ముఖం దెయ్యం కొట్టినవాడి ముఖంలాగ కనిపించింది. అతడు పెళ్ళి చేసుకొన్న చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తెకు ఒక ఆడబిడ్డ పుట్టివుంది. ఆ బిడ్డకు రెండేళ్ల ప్రాయం వచ్చినా ఇంకా మాట రాలేదు అన్న విషయం అతనికి గుర్తుకొచ్చింది.

భ్రమించి చెట్టుతో చెట్టుగా నిలబడ్డ మధురాంతకుని చూసి అతడి పెంపుడు తల్లయిన మహారాణి, "బిడ్డా! ఎందుకిలా నిలబడిపోయావు? రా, వెళదాం! అంతఃపురానికి వెళ్ళి బాగా ఆలోచించి రేపు ఉత్తరమివ్వు!" అన్నారు.

మధురాంతకుడు తడబడుతూ, "తల్లీ! ఆలోచించడానికి ఇంకేముంది? ఏమీ లేదు. మీరు వెళ్ళండి! నా స్థానంలో అంతఃపురంలో పెంచివుండవలసిన మీ కుమారునితో కాసేపు మాట్లాడేసి తర్వాత వస్తాను!" అన్నాడు.

"అలాగే చేయి! వచ్చేటప్పుడు పల్లకి తెరను బాగా మూసుకొని రా! కొడుంబాళూర్ వీరులు నిన్ను చూస్తే ఏమైనా కేకలు వేసినా వేయవచ్చు!" అని చెప్పి ఆ మహారాణి తమ పల్లకివైపు నడిచారు.

మధురాంతకుని ముఖం క్రోధ, మాత్సర్యాలతో భయంకరంగా మారడాన్ని ఆ తల్లి చూడకనే

ముందుకు సాగారు.

~~~
~~~

# అధ్యాయము - 62

## ఈటె దూసుకొచ్చింది!

**కాసేపు** నిలబడ్డ చోటే నిలబడ్డాడు మధురాంతకుడు. గుడిసె లోపలికి వెళదామా, లేక కోటకు తిరిగి వెళదామా అని అతడి మనసులో ఒక పెద్ద పోరాటం జరిగినట్లు తోచింది. తర్వాత అతడు తనను మోసుకొచ్చిన పల్లకిని సమీపించి, పల్లకి బోయీలకు, కాపలావీరులకు ఏదో చెప్పాడు. పల్లకీ లోపలినుంచి ఏదో ఒక వస్తువును తీసుకొన్నాడు. పల్లకిని ఎత్తుకొని వచ్చిన బోయీలు వెళ్ళిపోయారు. వారితోబాటు దివిటీ వెలుతురు కూడ వెళ్ళిపోయింది.

మధురాంతకుడు మళ్ళీ గుడిసెవైపు వచ్చినప్పుడు, అతడు, మహారాణి ఏ చెట్టు కింద నిలబడి మాట్లాడుకొన్నారో అదే చెట్టు వెనకవైపు నుంచి ఒక మనిషి ఇవతలికి రావడాన్ని గమనించి మధురాంతకుడు ఒక్క క్షణం అదిరిపడ్డాడు.

అతడెవరో కాదు, పాతాళ చెరసాలనుంచి తప్పించుకొని వంతిదేవునితో వచ్చిన పిచ్చివాడు కరుత్తిరుమనే!

ఇంకా అతడు చూసేందుకు పిచ్చివాడిలాగే కనిపిస్తున్నాడు. అతడి రూపమూ, హఠాత్తుగా అక్కడ ప్రత్యక్షం కావడమూ మధురాంతకునికి భయం కలిగించడంలో ఆశ్చర్యం లేదు కద?

మరుక్షణం మధురాంతకుడు పల్లకినుంచి తీసుకొని వచ్చిన చురకత్తిని పైకెత్తాడు.

కరుత్తిరుమన్ అతడికి చేతులు జోడించి నమస్కరించి, "అయ్యా! ఆగండి! నేను మీకు విరోధిని కాను!" అన్నాడు.

"విరోధివి కాకపోతే, మరి నీవెవరివి? నా స్నేహితుడివా?" అని అడిగాడు మధురాంతకుడు.

"అవునయ్యా! స్నేహితుడినే!"

మధురాంతకుడు క్రోధమూ, దుఃఖమూ నిండిన ఒక నవ్వు నవ్వేసి, "మంచి స్నేహితుడివే దొరికావు! లోకమే నన్ను వదిలిపెట్టి వెళ్ళిపోతున్నప్పుడు నీవొకడివి దొరికావు కద!" అన్నాడు.

"అవునయ్యా! లోకంలో మీకెవ్వరూ చేయలేని సహాయాన్ని నేను మీకు చేయగలను!" అన్నాడు కరుత్తిరుమన్.

"అదేమిటో చెప్పు, విందాం! ఆలస్యమైపోతూంది .చెప్పేదేమిటో తొందరగా చెప్పు!"

"దేనికి ఆలస్యమైపోతూంది?" అని అడిగేసి కరుత్తిరుమన్ మధురాంతకుని పరీక్షగా చూశాడు.

"అంతఃపురానికి వెళ్ళేందుకే. ఇంకెందుకు?"

"మీకు హక్కులేని అంతఃపురానికి మీరు తిరిగి వెళ్ళబోతున్నారా?"

మధురాంతకుడు మళ్ళీ అదిరిపడి, "ఒరే! ఏమంటున్నావు? నీకేం తెలుసు? ఎలా తెలుసు? వేగంగా చెప్పు! లేకపోతే..." అని చేతనున్న చురకత్తిని ఎత్తాడు.

"అయ్యా! కత్తిని ఎత్తకండి. మీ పగవారెదురైనప్పుడు ఉపయోగించేందుకు పదునుచేసి పెట్టుకోండి. కాసేపటి క్రితం మీరు, మిమ్మల్ని పెంచిన పెద్ద మహారాణి ఈ చెట్టు కింద నిలబడి మాట్లాడుకొన్నారు. నేను చెట్టు వెనక నిలబడివుండడాన్ని మీరిద్దరూ గమనించలేదు..."

"ఆహా! దాక్కొని విని రహస్యాన్ని తెలుసుకొన్నావా? ఆ తెంపరితనంతోనే నాదారికడ్డుపడి ఆపావా?"

"లేదు, లేదు! మహారాణి మీకు చెప్పిన సంగతి నాకింతకు మునుపే తెలుసు. దానికన్న అధికంగానే తెలుసు. ఆ మహారాణి మీ కన్నతల్లి కాదని, గండరాదిత్యులు మీ తండ్రి కాదని వారు మీతో చెప్పారు. మీ తల్లి ఎవరని కూడ చెప్పేవుంటారు. కానీ మీ తండ్రి ఎవరని చెప్పివుండరు."

మధురాంతకుడు అతన్ని వెర్రిచూపులతో చూస్తూ, "నీకది తెలుసా?" అని అడిగాడు.

"అవును, తెలుసు."

~

మధురాంతకుడు పిచ్చివాడిలాగ కనిపిస్తున్న వాడే తన తండ్రి అని చెప్పి తనమీద హక్కు చెలాయించబోతున్నాడేమో అని భీతిగొన్నాడు. అసహ్యం, కోపం కలగలిసిన గొంతుతో, "నీకెలా తెలుసు? నీవెవరివి?" అని అడిగాడు.

"నేను మీ తండ్రి సేవకుడిని" అని కరుత్తిరుమన్ చెప్పగానే మధురాంతకుని ముఖం తేటబడింది.

కరుత్తిరుమన్ కాస్త దగ్గరికొచ్చి, "అయ్యా! మీ తండ్రి..." అని చివరి మాట అతిమెల్లగా చెప్పాడు.

మధురాంతకుని చెవిన అతడు చెప్పింది వినబడింది. అతడి తల తిరిగినట్లైంది. కింద పడబోయి, తమాయించుకొని కరుత్తిరుమన్ భుజాలను పట్టుకొని నిలదొక్కుకొని, "నీవు చెప్పింది నిజమేనా? నిజంగానే నేను రాకుమారుడినేనా?" అని అడిగాడు.

"అవునయ్యా! ఇది చెప్పేందుకే చాల ఏళ్ళ క్రితం నేనిక్కడికి వచ్చాను. మిమ్మల్ని ఏకాంతంగా కలిసి మాట్లాడేందుకు తగిన సందర్భం కోసం వేచి చూశాను. దురదృష్టవశాత్తు చిన్న పళువేట్టరయ్యర్ నన్ను అంతఃపురపు తోటలో చూసేశారు. పట్టుకొని పాతాళ చెరసాలలో పడేశారు."

"ఎప్పుడు తప్పించుకొన్నావు? ఎలా?"

"ఈ రోజే; వంతిదేవుడనే యువకుని సహాయం వల్ల తప్పించుకొని బయటపడ్డాను."

"ఆహా! నేనూ విన్నాను. కరికాలన్ని చంపబడ్డట్లు నేరం మోపబడ్డవాడే కద?"

"అవునయ్యా! కానీ ఆదిత్య కరికాలన్‌గారిని చంపింది అతడు కాడు!"

"అందుగురించి మనకెందుకు దిగులు? చంపాడనే ఉండనీ. ఇప్పుడెక్కడ వాడు?"

"అదిగో కాస్త దూరాన కనబడుతున్న కంచె మరుగున ఉన్నాడు. నాకు, అతడికి రెండు గుర్రాలను సిద్ధం చేసుకొని వేచివున్నాడు. నేను ఆలస్యం చేస్తూండడం గురించి కోపంగానివుంటాడు. అందుగురించి నేను కించిత్తు దిగులుపడడం లేదు. ఎదురుచూడని విధంగా మిమ్మల్ని చూసి కలిశాను."

"మీరు ఇక్కడికెప్పుడు వచ్చారు?"

"కాసేపటి క్రితమే వచ్చాము. ఈ గుడిసె దగ్గర రెండు గుర్రాలున్నాయని తెలిసి వచ్చాము. గుర్రాలెక్కడున్నాయని వెతుకుతున్నప్పుడు మీరు, మీ పెంపుడు తల్లి దివిటీలతో ఈ బాట వెంబడి వచ్చారు. ఆ వెలుతురులో గుర్రాలను కనిపెట్టాము. నేను చాలయేళ్ల తర్వాత వాణిని చూశాను. ఆమెతో నేను మూగభాషలో మాట్లాడుతున్నప్పుడే మీరీ గుడిసెవైపు వచ్చారు. మీరీ గుడిసెకే వస్తున్నారన్నది మేమెదురుచూడని విషయం. వంతిదేవుడు కంచె మరుగుకు పరుగెత్తాడు. నేను, వాణి ఈ చెట్టు వెనక కాసేపు నిలబడ్డాము. దాని ఫలితంగా మిమ్మల్ని చూసే అవకాశం దొరికింది..."

"సరే. ఇక మీదట నీవేం చేయబోతున్నావు?"

"మీరెలా చెబితే నేనలా చేస్తానయ్యా! మీ పుట్టుక గురించిన నిజం తెలుసుకొన్న తర్వాత కూడ తంజావూరు అంతఃపురానికి వెళ్ళబోతున్నారా? ఒకటి జ్ఞాపకముంచుకోండి. మీరు చోళవంశపు యువరాజు కాదన్నది ఇంకా కొంతమందికి తెలుసు. ముఖ్యమంత్రికి, ఆయన గూఢచారి ఆళ్వార్ కట్టియాన్ అనేవాడికి కూడ తెలుసు. ఎప్పుడైనా ఒకరోజు..."

"అవునవును! తంజావూరు అంతఃపురానికి వెళ్ళేందుకు నాకూ ఇష్టం లేదు. నేవేం ఉపాయం చెబుతావు?"

"ఆ కంచె మరుగున రెండు గుర్రాలున్నాయి. మీరు గుడిసెవైపు వెళుతున్నట్లు వెళ్ళి ఆ కంచె దగ్గరికి రండి. నేను వంతిదేవునితో కాసేపు మాట్లాడి కాలయాపన చేస్తాను. మీ చేతనున్న కత్తిని విసిరి వాడిని చంపేయండి. రెండు గుర్రాల మీద మనమిద్దరం ఎక్కి వెళ్ళిపోదాం. కోడిక్కరైకి వెళ్ళి అక్కడినుంచి లంకకు వెళదాం. లంకరాజు చోళకులానికి శత్రువు; పాండ్యకులానికి పరంపరగా మిత్రుడు. నాకు లంకరాజు బాగా తెలుసు. పాండ్యవంశపు మణిమకుటం, రత్నహారం ఉన్నచోటు ఎరుగుదును. ఏమంటారు?"

~

మధురాంతకుడు కాసేపాలోచించాడు. అతని మనసు ఆ కొన్ని క్షణాల్లో ఎన్నెన్నో కోటలు కట్టింది.

"అయ్యా! సమయం మించిపోతూంది. మీ తీర్మానమేమి? వంతిదేవుడిక ఇక్కడికే వచ్చేస్తాడు."

"వాడిని చంపాలనా అంటున్నావు?"

"మీకు భయమైతే ఉంటే మీ చేతనున్న చురకత్తిని నాకివ్వండి!"

"వద్దు; ఈ కత్తికి ఇంకొక పనివుంది. వంతిదేవుని గురించి నాకు తెలుసు. వాడు మంచి వీరుడు. వాడిని కూడ మనతోబాటు తీసుకొని వెళితేనేం?"

"పిలుచుకొని వెళ్లవచ్చు. కానీ ఇంకొక గుర్రం?"

"గుర్రాలకేం కొరత? నేనింకా పట్టపు యువరాజు మధురాంతకుడినే కద?" అని చెప్పేసి కోపంతో ఒక నవ్వు నవ్వాడు.

తర్వాత, "నీవెళ్ళు. వాడిని కాసేపు ఓపిగ్గా ఉండమని చెప్పు! ఈ గుడిసెలోని వాడితో ఒకసారి మాట్లాడేసి వేగంగా తిరిగి వచ్చేస్తాను!" అన్నాడు మధురాంతకుడు.

కరుత్తిరుమన్ వంతిదేవుడు దాక్కొనివున్న కంచెవైపు వెళ్ళాడు. చిమ్మ చీకటి, రాజబాటలో అప్పుడు కొందరు దివిటీలు పట్టుకొని వెళుతుండగా కాస్త వెలుతురు పడింది. ఆ మసక వెలుతురులో రెండు  గంభీరమైన గుర్రాలు కంచెకు కట్టబడివుండడం కనిపించింది. కానీ వంతిదేవుడు కనిపించలేదు. మెల్లగా పిలిచి కూడ చూశాడు. బదులేమీ రాలేదు.

"సరే; వాడే తొలగిపోతే మనకింకా మంచిదే" అనుకొన్నాడు కరుత్తిరుమన్.

~

వంతిదేవుడు, కరుత్తిరుమన్ నందనవనంలోని గుడిసె దగ్గరికి వచ్చినప్పుడు అక్కడ చిమ్మ చీకటి కమ్ముకొనివుంది. గుడిసె లోపల వెలుగుతున్న చిన్న దీపం నుంచి కొన్ని కాంతి కిరణాలు బయటికి తొంగి చూశాయి.

తామర కొలనుకు నీళ్ళు తీసుకొని రావడానికి వెళ్ళిన వాణి అమ్మ ఎవరో ఇద్దరు చీకటిలో రావడాన్ని గమనించి కాస్త జంకుతూ నిలబడింది. మొదట వంతిదేవుని ముఖం ఆమెకు కనిపించింది. వెంటనే ఆమె ముఖం విప్పారింది. మునుపొకసారి సేందన్ అముదన్ అతన్ని పిలుచుకొని వచ్చిన విషయం ఆమె మరిచిపోలేదు. స్వాగతాన్ని సూచిస్తున్నట్లు తలాడించింది.

వెనుక వస్తున్న కరుత్తిరుమన్ని చూడగానే దెయ్యాన్ని చూసినట్లు భీతిగొని చేష్టలుడిగి నిలబడింది.

కరుత్తిరుమన్ ఆమెతో సైగభాష మూలంగా మాట్లాడి ఆమె భయాన్ని ఒకింత పోగొట్టాడు.

వారిద్దరినీ ఏకాంతంగా మాట్లాడుకోవడానికి వదిలిపెట్టి వంతిదేవుడు గుడిసెను సమీపించాడు. అప్పుడే వాకిలి తలుపు మూయబడి గొళ్ళెం వేయబడింది. కిటికీ గుండా తొంగి చూశాడు. సేందన్ అముదన్ కొసవూపిరితో కొట్టుమిట్టాడుతుండడానికి బదులు చాల విప్పారిన ముఖంతో పూంగుళలితో మాట్లాడుతుండడాన్ని చూసి కాస్త స్థిమితపడ్డాడు/నెమ్మదిగొన్నాడు.

వారి మాటల మధ్య అడ్డుపడి సెలవు తీసుకొని వెళ్ళడానికి ప్రయత్నించడం ఉచితం కాదని ఎంచి ఆలోచిస్తుండగా, శెంబియన్ మహాదేవి, మధురాంతకుడు వారి పరివారంతో వచ్చేశారు.

వెంటనే అతడు గుడిసె వద్దనుంచి అవతలికి జరిగి కంచె దూకాడు. అక్కడ ఆ రెండు గుర్రాలను చూడగానే ఆళ్వార్ కట్టియాన్ తనను మోసం చేయలేదని గ్రహించాడు. కరుత్తిరుమన్ కోసం అక్కడే వేచి చూస్తూ నిలబడ్డాడు.

పల్లకీలు, పరివారాలు, దివిటీలు అన్నీ వెళ్ళిపోయిన తర్వాత కూడ కరుత్తిరుమన్ రాకపోయేసరికి వంతిదేవుడు ఓర్చుకోలేకపోయాడు.

మళ్ళీ కంచెను దాటి ఇటువైపుకు వచ్చాడు. చెట్టు కింద మధురాంతకుడు, కరుత్తిరుమన్ మాట్లాడుకొంటుండడాన్ని గమనించాడు. మధురాంతకుని కంట పడేందుకు అతడిష్టపడలేదు. మధురాంతకునికి, కరుత్తిరుమన్‌కి మధ్య ఏమంత రహస్య, ఆంతరంగిక విషయం ఉండగలదు అన్న సందేహం అతడి మనసులో ఉదయించింది. వారి మాటల్లో ఒక భాగం అతని చెవిన పడింది.

~

మధురాంతకుడు గుడిసెను సమీపించి, తలుపును విరగ్గొట్టడమా, వద్దా అని జంకుతూ నిలబడ్డాడు. అప్పుడు లోపలినుంచి గలగలమని నవ్వుల శబ్దం వినిపించింది. ఆ నవ్వుల శబ్దం వల్ల మనసు మారిపోయిందో, లేక ఉద్దేశించిన కార్యాన్ని చేసేందుకు ధైర్యం రాలేదో తెలియదు. వెంటనే వెనుదిరిగి కరుత్తిరుమన్ వెళ్ళిన వైపు నడక సాగించాడు.

వంతిదేవుడు అతడి (మధురాంతకుడి) కంట పడకూడదని అవతలవున్న ఒక చెట్టు చాటుకు దూకాడు. అలా దూకినప్పుడు అతడికి ఒక విపరీతమైన దృశ్యం కనిపించింది. గుడిసె వెనక వైపు గోడలో ఒక కిటికీ ఉంది. దాని గుండా గుడిసె లోపల వెలుగుతున్న దీపం వెలుతురు కాస్త బయటికి పడుతూంది. అ వెలుతురులో ఒక మనిషి ఆకారం చేత ఒక చిన్న ఈటెతో భయంకరంగా నిలబడివుండడాన్ని గమనించాడు.

కిటికీ గుండా ఆ ఆకారం గుడిసె లోపలికి పరీక్షగా చూస్తూంది.

ఈటెను కిటికీ గుండా లోపలికి విసిరే ఉద్దేశంతో గురి చూడనారంభించింది. కానీ వెంటనే విసరలేదు. గురి చూడడం, మళ్ళీ కిందికి దించడంగా ఉంది.

అదే సమయాన గుర్రాలు బయలుదేరే శబ్దం వినిపించింది.

వంతిదేవుడు ఒక్క క్షణం తల్లడిల్లాడు. గుర్రాలు రెండూ వెళ్ళిపోతే తాను తప్పించుకోవడం అసాధ్యమైపోతుంది.

గుర్రాన్ని కాపాడుకోవడానికి వెళితే ఇక్కడ ఈ నల్లటి ఆకారం ఏ క్రూర కృత్యం చేయబోతూందో దాన్ని అడ్డగించలేం. వంతిదేవుని ఈ మనోపరిస్థితి ఒక నిమిషం కన్న ఎక్కువసేపు ఉండలేదు.

గుర్రాలు పోతే పోనీ. తన కర్తవ్యం ఇప్పుడు ఇక్కడే.

చేత చిన్న ఈటెతో నిలబడ్డ ఆకారం వైపు మెల్లగా కదిలాడు.

గుడిసె లోపలినుంచి కెవ్వుమన్న ఒక కేక, భీతిగొన్న ఒక స్త్రీ ఆర్తనాదం వినిపించాయి.

వంతిదేవుడు జాగ్రత్తలన్నీ గాలికొదిలేసి ఒక్క దూకు దూకాడు.

ఈటెను లోపలికి విసరజూసినవాడు, వంతిదేవుడు ముందుకు పరుగెత్తి రావడాన్ని వినగానే అటు తిరిగాడు.

తిరిగిన అదే వేగంతో ఈటెను అతడి మీదికి విసిరాడు.

ఈటె వంతిదేవుని డొక్క లోపలికి దూసుకొని వెళ్ళింది. అతడు కింద పడిపోయాడు.

అతడు ఏమైనాడని కూడ చూడకుండ ఈటె విసిరినవాడు అక్కడినుంచి పరుగు లంకించుకొన్నాడు.

~~~
~~~

# అధ్యాయము - 63

## పినాకపాణి చేసిన వంచన

**పొన్నియిన్ సెల్వన్** కుందవైదేవి, వాణతి తదితరులతో పాతాళ చెరసాలకు వెళ్ళి చూసినప్పుడు అక్కడ వారికి వంతిదేవుడు కనిపించలేదు. అతడికి బదులు వైద్యకుమారుడున్నాడు - గోడలో అమర్చబడిన ఇనుప వలయాలకు గొలుసుతో కట్టబడి. "అయ్యయ్యో! హంతకుడు తప్పించుకొని పారిపోయాడు!' అని కేకలు కూడ వేస్తున్నాడు. అతడు కుందవైదేవికి, వాణతికి చాల బాగ గుర్తుంది. మొట్టమొదటిసారిగా అతన్ని కోడిక్కరైకి వంతిదేవునికి తోడుగా పంపారు కద? పినాకపాణిని విడుదల చేయించి విచారించినప్పుడు అతడు కాసేపటి క్రితం జరిగిన సంఘటనలను క్లుప్తంగా వివరించాడు. తప్పించుకొని పారిపోయినవారిని వేగంగా వెన్నంటి పట్టుకోవాలని కూడ ఉద్రేకపడ్డాడు.

కానీ అతని వృత్తాంతం విన్నవారెవ్వరూ అంతగా గాభరా పడనూ లేదు, ఉద్రేకపడలేదు కూడాను. వంతిదేవుని సామర్థ్యాన్ని వారు మనసులో మెచ్చుకోవడమేగాక, ఆ సమయాన అతడు తప్పించుకొని పారిపోయిందే మంచిదనుకొన్నారు. మణిమేఖల తన ఆలోచనను బహిరంగంగా వెలిబుచ్చనారంభించినప్పుడు కుందవై అడ్డొచ్చి, "చెల్లెలా! మాట్లాడక ఊరుకో! ఇది పెద్ద రాజకీయ విషయం. ఆడవాళ్ళయిన మనకు దాని గురించి ఏం తెలుసు? నీ మనసులో ఉన్నది నాకు ఏకాంతంలో చెప్పు!" అన్నది.

అందరూ పాతాళ చెరసాల వాకిలికి వచ్చేటప్పటికి సేనాధిపతి బూది విక్రమకేసరి కూడ అక్కడికి వచ్చి చేరారు. చెరసాలలో ఏదో తప్పు జరిగిందన్న వార్త ఆయన చెవులకు అప్పటికే చేరింది. జరిగిన సంఘటనలను తెలుసుకొన్నప్పుడు సేనాధిపతి కూడ తప్పించుకొని పారిపోయినవారిని పట్టుకోవడం గురించి అంతగా ఆసక్తి కనబరచలేదు. నిజానికి ఆయన మనసులో కూడ వంతిదేవుని మీద ఆరోపించబడిన నింద మీద ఏ మాత్రం నమ్మకం లేదు. అరుళ్మొళి వర్మగారు, కుందవైదేవి వంతిదేవుని మీద గొన్న అభిమానాన్ని ఆయనెరుగుదురు. కాబట్టి కోపగించుకోవడానికి బదులు వంతిదేవుని తెలివిని మెచ్చుకొంటున్నట్లు చిన్నగా నవ్వారు.

"ఆ వాణర్‌కుల యువకుడు చాల సమర్థుడు! లంకలో మామిడితోపు చెరసాల నుంచి కూడ ఇలాగే ఒకసారి తప్పించుకొన్నాడు!" అన్నారు.

వైద్యకుమారుడు అడ్డుపడి, "అయ్యా! తప్పించుకొని పారిపోయిన వారిని పట్టుకోవడానికి ఏర్పాట్లు చేయవద్దా?" అన్నాడు.

"ఆః! వారెక్కడికి తప్పించుకొని పారిపోతారు? ఈ కోట లోపలే కద ఉండాలి? చూసుకొందాం!"

అన్నారు సేనాధిపతి పెద్ద వేళార్.

“లేదు, లేదు! ఆ హంతకుడికి సొరంగ మార్గం తెలుసు. దానిగుండా వాడు బయటకు పారిపోతాడు!” అని గగ్గోలు పెట్టాడు పినాకపాణి.

సేనాధిపతి ఇందుకు కోపగించుకొని, “మూర్ఖుడా! నీవు నాకు బుద్ధి చెబుతున్నావా? వాళ్ళు తప్పించుకొని పారిపోవడానికి నీవే కద కారణం? కావాలనే నీవు వారితో కూడబలుక్కొని ఇలా కుట్ర పన్నావో, ఏమో? వీడిని బంధించి మళ్ళీ పాతాళ చెరసాలలో పడేయండి!” అని పక్కనున్న వీరులను చూసి ఆజ్ఞాపించారు.

పినాకపాణి గడగడ వణికిపోయాడు. “లేదయ్యా! సత్యప్రమాణంగా నేను వారితో చేరి ఏ కుట్రా పన్నలేదు. ముఖ్యమంత్రి పంపగా వచ్చాను!” అని మొరపెట్టుకొన్నాడు.

పొన్నియిన్ సెల్వన్ అడ్డుపడి, “ఇతడు ముఖ్యమంత్రి మనిషి కద? తగిన కాపలాతో ఆయన వద్దకు పంపించేద్దాం. ముఖ్యమంత్రే వీడికి తగిన శిక్ష విధించనీ!” అన్నారు.

ఆ విధంగానే సేనాధిపతి వైద్యకుమారుని ముఖ్యమంత్రి వద్దకు తీసుకొని వెళ్ళి ఒప్పజెప్పమని తమ వీరులు నలుగురికి ఆజ్ఞ విధించారు.

~

ముఖ్యమంత్రి పినాకపాణిని విచారించి చెరసాలలో జరిగిన సంఘటనలను తెలుసుకొన్నప్పుడు ఆయన కూడ అంతగా ఆదుర్దా కనబరచలేదు.

అనిరుద్ధులు ఏ ముఖ్యమైన కార్యంమీదను ఒక్క మనిషిని పంపించరు. ఎక్కడికైన ఒక గూఢచారిని పంపిస్తే, వాడిని గమనించడానికి వాడి వెనక ఇంకొకడిని పంపించడం ఆయన అలవాటు. అలాగే ఇప్పుడు కూడ ఆళ్వార్ కట్టియాన్ని పంపించినందువల్ల ఆయన అంతగా దిగులు పడలేదు. తప్పించుకొని పారిపోయినవారిని అతడు పట్టుకొని వస్తాడు, లేదా వారి గురించి సమాచారమైనా తీసుకొని వస్తాడని నమ్మారు. పరారీలిద్దరూ చివరికి దొరక్క పారిపోతే చాల ఇబ్బందులు తీరే అవకాశం ఏర్పడుతుందన్న ఆలోచన కూడ ఆయన మనసులోవుంది.

కాబట్టి పినాకపాణి పాతాల చెరసాలలో జరిగిందంతా చెప్పేసి, “అయ్యా! నా వెంట నలుగురు మనుషులను పంపిస్తే నేనే వెళ్ళి వారిని మళ్ళీ పట్టుకొస్తాను!” అన్నప్పుడు, అనిరుద్ధులు కూడ వాడిమీద మండిపడ్డారు.

“మూర్ఖుడా! కార్యాన్ని పూర్తిగా చెడగొట్టావు! అ పిచ్చివాడి గురించి బయట ఎవరికీ తెలియకూడదనే కద నిన్ను పంపాను? లేకపోతే నేనే వెళ్ళి పిలుచుకొని వచ్చేవాడిని కద? ఇప్పుడు అంతఃపురంలో ఉండే పలువురికి వాడి గురించి తెలిసిపోయింది. అది చాలదని నీవు మళ్ళీ దాన్ని ప్రచారం చేయగోరుతున్నావా? చాలు నీ సేవ! నీవు గూఢచారి పనికి ఏ మాత్రం తగవు! ఇక నాకు నీ ముఖం

చూపించకు! ఈ రోజు జరిగిన విషయాలు ఎవరికీ చెప్పకు! చెప్పినట్లు తెలిస్తే నిన్ను ఉరికంబమెక్కించ ఆజ్ఞ జారీ చేస్తాను!" అన్నారు అనిరుద్ధులు.

~

పినాకపాణి తలొంచుకొని ముఖ్యమంత్రి ఇంటినుంచి బయటికొచ్చాడు. అతడి మనసులో ఆశాభంగం వల్ల కలిగిన క్రోధమంతా వంతిదేవుని మీదికి మళ్ళింది. అతడి వల్లే తాను చేపట్టిన ప్రతి కార్యంలోను ఓటమి, అపకీర్తి కలిగాయి. సేనాధిపతి, ముఖ్యమంత్రి తనని చీదరించుకొనేలా అయ్యింది. వీరందరూ అలక్ష్యంగా ఉంటే ఉండనీ. వంతిదేవుని కనిపెట్టి పగ తీర్చే కర్తవ్యం తనది. పిచ్చివాడు తప్పించుకొని పారిపోతే పోనీ. వంతిదేవుని మాత్రం వదలకూడదు. కోడిక్కరైకి ప్రయాణం మొదలుపెట్టిన నాటినుంచి తన విరోధి వాడు. చివరిగా తనకీ పెద్ద కీడును చేశాడు. వాడిని కనిపెట్టి పగ తీర్చుకోవలసిందే...!

ఇలా తీర్మానించుకొని పినాకపాణి తంజావూరు కోటనుంచి బయటపడ్డాడు. వంతిదేవుడు కోట లోపల ఉండడనీ, రహస్య సొరంగమార్గం గుండా పారిపోయివుంటాడని అతడు నిజంగానే నమ్మాడు. కానీ సొరంగమార్గమెక్కడుందని గాని, దాని బయటి వాకిలి ఎక్కడుందని గాని అతడికి తెలియదు. కానీ కోట గోడ వారగా ఎక్కడో ఒక చోట ఆ రహస్య మార్గపు బయటి వాకిలి ఉండే తీరాలి. గోడ వారగా చుట్టూ వెళ్ళి చూస్తే బహుశ దాన్ని కనిపెట్టవచ్చు. అంతెందుకు? వంతిదేవుడు, ఆ పిచ్చివాడు ఆ రహస్యమార్గం గుండా బయటికొచ్చేటప్పుడు అక్కడే పట్టేసుకొన్నా పట్టేసుకోవచ్చు...

ఇటువంటి ఆలోచనలతో పినాకపాణి కోట గోడను తాకుతూ పారుతున్న ఉత్తరనది అవతలి గట్టు వెంబడి నడిచి వెళుతున్నాడు. కోట గోడను పరీక్షగా చూస్తూ వెళ్ళసాగాడు. కొడుంబాళూర్ వీరులు కొందరు చేత దివిటీలు పట్టుకొని కోట చుట్టూ పహరా కాస్తున్నారు. వైద్యకుమారుని వద్ద ఇంకా అతడు ముఖ్యమంత్రి మనిషని నిరూపించేందుకు రాజముద్ర ఉంది. కాబట్టి వీరులు ఎదురొచ్చి అతన్ని ఆపితే వారిని దాటుకొని వెళ్ళడం సులభమే. కానీ, అందువల్ల తాను చేబట్టిన కార్యం ఆలస్యమవుతుంది. కాబట్టి దివిటీలతో వీరులు ఎదురొచ్చినప్పుడల్లా బాట వెంబడివున్న చెట్లు, పొదల మరుగున దాక్కొని, వాళ్ళు అవతలికి వెళ్ళిన తర్వాత బయటికి వచ్చాడు. ఇలా ఒకసారి పొదల వెనక దాక్కొనివున్నప్పుడు కాస్త దూరాన ఇద్దరు దాక్కొని నిలబడివుండడం గమనించి అదిరిపడ్డాడు. వారిలో ఒకడి చేత కత్తివుంది. పొదల మధ్యనుంచి దివిటీల కాంతి కాస్త దాని మీద పడ్డప్పుడు అది తళుక్కున మెరిసింది. కానీ దాక్కొని ఉన్నవారు ఎవరన్నది మాత్రం తెలియలేదు.

కాపలావీరులు అవతలికి వెళ్ళిన తర్వాత ఆ ఇద్దరూ నది ఒడ్డుకు వచ్చి పినాకపాణి వెళ్ళిన దిశకు వ్యతిరేక దిశలో నడిచి వెళ్ళారు. పినాకపాణి తాను వెళుతున్న దారినే కాస్త దూరం వెళ్ళాడు. ఉన్నట్లుండి అతడికి ఒక సందేహం కలిగింది. వారిద్దరూ బహుశ తప్పించుకొని పారిపోయిన వంతిదేవుడు,

పిచ్చివాడేనేమో? ఎందుకు కాకూడదు? - వారు కోట వాకిలి వైపు వెళ్ళినందువల్ల, అతడికా సందేహం కలగలేదు. కానీ వంతిదేవుడు చాల తెలివైనవాడు; తెంపరితనం కలవాడు కూడాను. కాబట్టి ఏ ఉద్దేశంతో వెళుతున్నాడో, ఏమో...?

కాబట్టి పినాకపాణి వెనుదిరిగి వారిని కాస్త దూరంగా వెంబడించనారంభించాడు. ఒకడి చేత కత్తి ఉండడం వల్ల, వెళ్ళి వారినెదిరించడానికి ధైర్యం చాల్లేదు. అనవసరంగా ఒక అన్యుడితో దెబ్బలాటకు దిగడానికి అది సందర్భం కాదు. వారు తప్పించుకొని పారిపోయినవారేనని నిర్ధారించుకొన్న తర్వాతే ఏదైనా చేయాలి. అతడి చేత ఒక చిన్న ఈటె ఉండనే ఉంది. దాన్ని హఠాత్తుగా ప్రయోగించి తన జన్మవిరోధిని ముగించేయడమే మంచిది. అదిగో కోట ఉత్తర ద్వారం కనిపిస్తూంది. అరెరె! అక్కడ ఏమంత పెద్ద గుంపు, ఆర్భాటమూను? పల్లకీలు, దివిటీలు, ముందు వెనక అంతఃపుర సేవకులు! - ఎవరో ముఖ్యమైన మనుషులు బయటికి వెళుతున్నారో, లేక తిరిగి వస్తున్నారో తెలియడం లేదు!

దేవుడా! వీరెక్కడ? చటుక్కున మాయమైపోయారు కద? అడ్డదారిన లోపలికి దూరేశారు కాబోలు! ఎక్కడికి వెళ్ళివుంటారు? రాజబాటకా? తప్పించుకొన్న ఖైదీలు అంత ధైర్యంగా రాజబాటకు వెళతారా? లేక ఎక్కడికి వెళ్ళ సాధ్యం...? సేందన్ అముదన్ నందనవనం, గుడిసె అక్కడికి సమీపానే ఉండడం అతడికి గుర్తొచ్చింది. మునుపొకసారి వంతిదేవుడు అక్కడ దాక్కొన్నాడన్న విషయం కూడ గుర్తొచ్చింది. అవును! వారు వంతిదేవుడు, పిచ్చివాడే! సందేహం లేదు! సేందన్ అముదన్ ఇంటికే వెళుతున్నారు. అక్కడ రాత్రి మరుగ్గా తలదాచుకోవడానికి వెళుతున్నారు కాబోలు! లేక తంత్రాలలో ఆరితేరిన వంతిదేవుడు ఇంకే ఉద్దేశంతో వెళుతున్నాడో, ఏమో!

~

సేందన్ అముదన్ నివసిస్తున్న నందనవనం వైపుగా సాగాడు పినాకపాణి. చీకటిలో దారి కనిపెట్టుకొని వెళ్ళడం అంత సులభం కాలేదు. పడుతూ లేస్తూ నందనవనాన్ని చేరుకొన్నప్పుడు అక్కడ పల్లకీలు, కాపలా వీరులు ఉండడం చూసి ఆశ్చర్యపడ్డాడు. ఏం చేయాలో తోచక అక్కడ నిలబడివున్నప్పుడు పల్లకీలు అక్కడినుంచి బయల్దేరేశాయి. కాపలావాళ్ళు కూడ వెంబడే వెళ్ళిపోయారు.

నందనవనంలో చుట్టూ పరికించి చూశాడు. ఒక కంచె వారగా రెండు గుర్రాల తలలు కనిపించాయి. వైద్యకుమారుని ఆదుర్దా, ఆసక్తి అధికమైనాయి. అడుగులో అడుగేసుకొంటూ గుడిసెను సమీపించాడు. ఒక చెట్టు కింద ఇద్దరు నిలబడి మాట్లాడుకొంటూండడాన్ని గమనించాడు. వారు తాను వెతుక్కొంటూ వచ్చిన ఆసామీలే అయివుండాలి. రెండు గుర్రాలు సిద్ధంగా ఉన్నాయి కద? అదెలా సాధ్యం? వారు తప్పించుకొని పారిపోవడానికి ఎవరైన పెద్ద మనుషులు రహస్యంగా సహాయం చేస్తున్నారా? వారు తప్పించుకోవడంలో రాజకుటుంబీకులే భాగస్వాములా? ఆ పిచ్చివాడు తనకేవో రహస్యాలు తెలుసని పేలుతున్నాడు కద? అవి బయటపడుతాయని ఒకవేళ ఇలాంటి పన్నాగం జరుగుతూందా?

చెట్టు వెనక మరుగ్గా నిలబడి మాట్లాడుకొంటున్నవారెవరని గుచ్చి చూశాడు. వారిలో ఒకడు పిచ్చివాడు. సందేహం లేదు. వాడి గరుకు గొంతు బాగ తెలుస్తూంది. అలాగైతే రెండోవాడు వంతిదేవుడే అయివుండాలి కద? కానీ వాడి లాగ తోచడం లేదేమి? ఇదేం విచిత్రం? యువరాజు మధురాంతకులలాగ కద ఉన్నారు? తలమీద యువరాజు కిరీటం! భుజాలమీద పట్టు పీతాంబరం! మెడలో ముత్యాల మాల! చేతులకు ఆభరణాలు...! మధురాంతకులకు, ఈ పిచ్చివాడికి మధ్య ఏం అంతరంగ విషయం గురించి చర్చ జరుగుతూంది?

అదెలాగైనా పోనీ. తన జన్మవిరోధి వంతిదేవుడెక్కడ? చుట్టుపక్కల ఎక్కడో ఉండాలి. సందేహం లేదు. చేత కత్తితో వెళ్ళింది వాడే! ఒకవేళ, కంచె వారగా గుర్రాలను చూశాం కద? వాటిలో ఒకదానిమీద పారిపోయేందుకు సిద్ధంగా కూర్చొనివున్నాడా? పిచ్చివాడు తిరిగిరావడం కోసం వేచివున్నాడా....? ఆఁ! అలాగే ఉండాలి. వారు తప్పించుకొని పారిపోవడానికి కారణం మధురాంతకులు కాబోలు! మధురాంతకులు పురిగొల్పినందువల్ల వంతిదేవుడు కరికాలన్‌గారిని హత్య చేశాడు కాబోలు! ఇప్పుడు వాళ్ళు తప్పించుకొని పారిపోయేముందు వారేదో సందేశం చెప్పి పంపిస్తున్నారు కాబోలు! ఆహా! ఇదంతా నిజమని నిరూపించగలిగితే....?

~

ఇలా పినాకపాణి వంకరబుద్ధి ఆలోచించసాగింది. దేనికీ గుర్రాల దగ్గరకు వెళ్ళి చూడడం మంచిది. అక్కడ ఒకవేళ వంతిదేవుడుంటే తన చేతనున్న చిన్న ఈటెతో వాడిని ముగించేయాలి. తర్వాత ఈ పిచ్చివాడిని పట్టుకొని భయపెట్టి నిజం తెలుసుకోవచ్చు.

మధురాంతకులు, పిచ్చివాడు మాట్లాడుతూ నిలబడ్డ చెట్టుకెదురుగా కంచెకవతల గుర్రాలు నిలబడివున్నాయి. వారిని దాటుకొని అక్కడికి వెళ్ళడం వీలుకాదు. దారిలో తామరకొలను కూడ ఉంది. కాబట్టి గుడిసె వెనుక భాగాన్ని చేరుకొని అక్కడ కంచె దాటి వెళ్ళి గుర్రాలు నిలబడ్డ చోటును చేరుకోవడమే మంచిది.

పినాకపాణి ఆ విధంగానే గుడిసె వెనుక భాగాన్ని చేరుకొన్నప్పుడు సేందన్ అముదన్, పూంగుళలి మాట్లాడుకొంటుండడం అతడి చెవిన పడింది. కోడిక్కరైలో మొట్టమొదట పూంగుళలిని చూసినప్పుడే పినాకపాణి ఆమె మీద మోహంగొన్నాడు. ఆమె కారణంగానే వంతిదేవుని మీద క్రోధమధికమైంది. తర్వాత మందాకినిని వెతికి పట్టుకొని వచ్చేందుకు వెళ్ళినప్పుడు, సేందన్ అముదన్‌కి పూంగుళలికి మధ్యవున్న అనుబంధం గురించి తెలుసుకొని అతడి మనసు కుతకుతలాడింది. సేందన్ అముదన్ మీద కూడ అతడికి క్రోధం పుట్టుకొచ్చింది.

ఇప్పుడు అముదన్, పూంగుళలి ఆనందం పెల్లుబికి, విప్పారిన వదనాలతో ఉల్లాసంగా మాట్లాడుకొంటుండడాన్ని గుడిసె వెనుకవైపున్న గోడ కిటికీనుంచి చూశాడు. సేందన్ అముదన్ మీద అతడి

క్రోధమిప్పుడు ఇంకా పది రెట్లు పెరిగింది. ఇంకాస్త దగ్గరికి వెళ్ళి చెవులు రిక్కించి వారి మాటలను విన్నాడు. పెళ్ళి చేసుకొని కోడిక్కరైకి వెళ్ళడం గురించిన వారి మాటలు అతడి చెవిన పడ్డాయి. గలగలమని వారు నవ్విన నవ్వుల శబ్దం అతడి క్రోధానలాన్ని ఇంకా రగిలించింది! ఛీఛీ! చివరికి ఈ మూగపూలమ్మి కొడుకా పూంగుళలిని పొందబోతున్నాడు? ఆ ఆలోచననే పినాకపాణి సహించలేకపోయాడు. వంతిదేవుని, పిచ్చివాడిని, వారిని పట్టుకొనే ఉద్దేశాన్ని ఆ క్షణాన పూర్తిగా మరిచిపోయాడు. మొదట ఈ దేవారాలు పాడే సేందన్ అముదన్ని ఈ భూలోకంనుంచి పంపేయాలి. తక్కిన కార్యాలన్నీ తర్వాత చూసుకోవచ్చు....

~

ఇలా తీర్మానించుకొని కిటికీ బయట కాస్త దూరాన గోడవారగా నిలబడి సేందన్ అముదన్ మీదికి విసిరేందుకు ఈటెను గురి చూడసాగాడు పినాకపాణి. యధాలాపంగా ఆ ఈటెను, ఈటెను పట్టుకొన్న చేతిని మాత్రం చూసేసిన పూంగుళలి 'కెవ్వు'మని కేకపేసింది. వెంటనే సేందన్ అముదన్ కూడ కిటికీవైపు తిరిగి చూశాడు! ఆహా! అతడి గుండెలవైపు ఈటెను విసిరేందుకు సరైన సందర్భం!

పినాకపాణి ఈటెను విసిరేందుకు చేయెత్తిన్నప్పుడు, వెనక దడదడమని కాలి చప్పుడు వినిపించింది. తిరిగి చూస్తే ఒక మనిషి అతిసమీపానికొచ్చేశాడు. చీకటిలో ఎవరని తెలియలేదు. ఎవరైనా సరే, తన ఉద్దేశాన్ని తెలుసుకొని తనని పట్టుకోవడానికే పరుగెత్తి వస్తున్నాడు. సేందన్ అముదన్ మీదికి విసిరేందుకు ఎత్తిన ఈటెను ఆ ఆగంతకుడి మీదికి విసిరాడు. ఆగంతకుడు కింద పడ్డాడు.

అదే సమయాన రెండు గుర్రాలు బయలుదేరిన శబ్దం వినిపించింది. వారు వంతిదేవుడు, పిచ్చివాడే అయివుండాలి. అలాగైతే చీకటిలో తనను అడ్డుకోవడానికి వచ్చి తన ఈటెకు ఎరైనది యువరాజు మధురాంతకులు కావచ్చా...? ఈ ఆలోచనలు పినాకపాణి మనసులో మెరుపు వేగాన తోచి భీతిగొల్పాయి.

గుడిసె లోపలినుంచి 'ఆ!' 'అయ్యో!' అన్న కేకలు లేచాయి. తలుపు తెరుచుకొని ఎవరో బయటికొస్తున్న శబ్దం కూడ వినిపించింది.

పినాకపాణి పరుగు లంకించుకొన్నాడు. అక్కడినుంచి తప్పించుకొని పారిపోవడమే మొట్టమొదట చేయవలసిన పని. గుర్రాల మీద పారిపోతున్న వారిని వెన్నంటి పట్టుకోవడం తర్వాతి పని. తలా తోకా తెలియకుండ పడుతూ లేస్తూ పరుగెత్తాడు పినాకపాణి.

~

కొన్ని క్షణాల్లో పూంగుళలి, సేందన్ అముదన్ దీపంతోబాటు బయటికొచ్చారు. వంతిదేవుడు ఈటె దెబ్బతిని రక్తపు మడుగులో పడివుండడాన్ని చూశారు. అప్పుడు వారుగొన్న భీతిని, దుఃఖాన్ని చెప్పనలవికాదు. చాల అక్కరతో వారిద్దరూ అతన్ని మెల్లగా ఎత్తుకొని వెళ్ళి గుడిసె లోపల చేర్చారు. అతడు చనిపోలేదని గ్రహించి కాస్త ఊరట చెందారు.

వాణి అమ్మ మునుపొకసారి గందమారన్‌కి చేసిన ఆకుల వైద్యం ఈరోజు వంతిదేవునికి

చేయవలసి వచ్చింది.

~~~
~~~

# అధ్యాయము - 64

## "నిజం చెప్పు!"

**ఆళ్వార్** కట్టియాన్ని వంతిదేవుడు కట్టిపడేసిన పడవ నదీప్రవాహం వెంబడి కాస్త దూరం తేలుతూ వెళ్ళిన తర్వాత ఒక చోట ఒడ్డుకు ఒరిగింది. నది వెల్లువలోకి తోయబడ్డ వీరులిద్దరూ ఎలాగో పడుతూ లేస్తూ గట్టుకు చేరుకొని ఆ పడవ ఒడ్డుకు ఒరిగిన చోటికి వచ్చి చేరారు. ఆళ్వార్ కట్టియాన్ని, ఇంకొక కాపలావీరుని కట్లు విప్పి విడుదల చేశారు. కానీ ఆళ్వార్ కట్టియాన్ పడవనుంచి దిగలేదు. అతడు ఇంకా కట్టబడి ఉన్నట్లు నటిస్తూ, తక్కినవారిని మరుగ్గా ఉండమని చెప్పాడు.

నిజం ఏమంటే, వంతిదేవుడు, కరుత్తిరుమన్ తప్పించుకొని పారిపోవాలన్నదే ఆళ్వార్ కట్టియాన్ ఉద్దేశం. ముఖ్యమంత్రి ఉద్దేశం కూడ అదేనని అతడికి తెలుసు. ఆ సమయాన ఆ ఇద్దరూ తంజావూరులో ఉంటే పాత సంభవాల గురించి పరిశోధన జరపవలసి వచ్చేది. వంతిదేవుడు నిరపరాధి అన్న విషయం గురించి ముఖ్యమంత్రికి, ఆళ్వార్ కట్టియాన్‌కి సందేహమే లేదు. అయినా కూడ, అతడి మీద విచారణ జరగపడమంటూ జరిగితే చాల సంకటాలు ఏర్పడతాయి; పలువురు మనోవేదన పొందుతారు. ఆ మాట ప్రజల చెవిన పడడమే ఒక పెద్ద కీడుగా మారుతుంది. అరుళ్మొళివర్మ ఒక మంచి స్నేహితుడిని కోల్పోవడం, చోళ సామ్రాజ్యం ఒక విశిష్టమైన వీర, రాజ తంత్రజ్ఞుడిని కోల్పోవడం జరుగుతుంది. వంతిదేవుని గురించి కుందవైదేవి మనోభావాల గురించి, మణిమేఖల బాహాటమైన ఆసక్తి గురించి ముఖ్యమంత్రి ఎరుగుదురు. అన్నింటినీ ఉద్దేశించే వంతిదేవుడు ఆ సమయాన తప్పించుకోవడానికి సహాయం చేయడమే ఉచితమని తీర్మానించారు ముఖ్యమంత్రి.

సేందన్ అముదన్ నందనవనంలో ఆ రెండు గుర్రాలను కనిపెట్టిన తర్వాత వంతిదేవుడు, కరుత్తిరుమన్ ఈ ఉత్తరనదీతీరం వెంబడే ప్రయాణం చేస్తారని ఆళ్వార్ కట్టియాన్ ఎదురు చూశాడు. కరుత్తిరుమన్ చెప్పినట్లే ఆ నదీతీరం వెంబడి వెళితే పామణ నదిలో కలిసే చోటు వరకు వెళ్ళవచ్చు. కోడిక్కరైకి సగం దూరం వెళ్ళినట్లవుతుంది. అందుకే ఆ దిశగా వారు వస్తారు. వెళ్ళేటప్పుడు దారిలో అడ్డుపడి అపి, వంతిదేవునికి ఒక వార్త చెప్పి పంపాలని ఆళ్వార్ కట్టియాన్ అక్కడ వేచివున్నాడు.

అతడు ఎదురు చూసినదానికన్న కాస్త ఎక్కువే ఆలస్యమైంది. 'మనం అనుకొన్నది పొరబాటు. వారు ఇంకొక దారిన వెళ్ళివుండాలి. లేక ఏదైనా ఎదురుచూడని సంఘటన జరిగివుండాలి' అని తీర్మానించుకొని తిరుమలై పడవనుంచి ఒడ్డుకు దిగేందుకు ప్రయత్నించినప్పుడు దూరాన గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది. కాబట్టి మళ్ళీ కట్టి పడేయబడ్డట్లు ఉండిపోయాడు.

గుర్రాలు దగ్గరికి రాగానే, "ఓ! ఎవరక్కడ? కాస్త ఆగండి! నా కట్లు విప్పేసి వెళ్ళండి!" అని కేక

వేశాడు.

కానీ గుర్రాలు నిలవకనే ముందుకు సాగాయి. మొదట వచ్చిన గుర్రం మీది వాడు కరుత్తిరుమనే అని చూసి తెలుసుకొన్నాడు. కాబట్టి రెండో గుర్రం వచ్చినప్పుడు, "వంతిదేవా! వంతిదేవా! కాస్త ఆగు!" అని పెద్దగా అరిచాడు.

రెండో గుర్రం కూడ ఆగకుండ ముందుకు దూసుకు వెళ్ళింది. అప్పుడు దాని మీదున్న వ్యక్తిని చూశాడు ఆళ్వార్ కట్టియాన్. చూసి, ఎనలేని ఆశ్చర్యసముద్రంలో మునిగాడు. 'నా కళ్ళలో ఏదో లోపం ఉంది; నా బుద్ధి నన్ను మోసం చేస్తూంది" అనుకొన్నాడు.

~

అతన్ని దాటి కాస్త దూరం వెళ్ళి గుర్రాలు ఆగాయి. ఒక గుర్రం మాత్రం తిరిగి వచ్చింది. దానిమీదినుంచి కరుత్తిరుమన్ దిగి పడవ దగ్గరికొచ్చాడు. "పాపం! ఇంకానా బంధించబడివున్నావు? మాకెంతో పెద్ద సహాయం చేశావు! అందుకు ప్రత్యుపకారంగా నీ కట్లు విప్పి వెళతాను. కానీ నీ తంత్రాలేవీ నా దగ్గర చూపించకు!" అని చెబుతూనే అతడు వంగినప్పుడు, తిరుమలై ఉన్నట్లుండి గట్టుమీదికి దూకి అతడి మెడ పట్టుకొని కిందకు తోశాడు.

దీన్ని ఏమాత్రం ఎదురుచూడని కరుత్తిరుమన్ దిగ్భ్రాంతుడై కాసేపు చేష్టలుడిగి ఉండిపోయాడు.

తర్వాత, "అయ్యో! బాబూ! నన్ను వదిలేయి! నీకు పుణ్యముంటుంది. నీకు సహాయం చేయవచ్చినందుకు ఇలా నమ్మకద్రోహం చేస్తావా? అదిగో నీ స్నేహితుడు వంతిదేవుడు వేచివున్నాడు. అవును; అతడు నిన్ను తన ప్రియమిత్రుడని ఎంతగానో మెచ్చుకొంటున్నాడు. ఇక్కడికొచ్చి నీవు చేసిన ఘనకార్యాన్ని చూస్తే ఏమనుకొంటాడు? నీవు ప్రాణాలతో తప్పించుకోలేవు! నన్ను వదిలేయి బాబూ, నన్ను వదిలేయి!" అని దీనంగా బతిమాలాడు.

ఆళ్వార్ కట్టియాన్, "ఒరేయ్! ఎంత ధైర్యంగా బొంకుతున్నావు? ఆ గుర్రం మీదున్నది ఎవరు? నిజం చెప్పు! చెబితే వదులుతాను. లేకపోతే మరునిమిషం నీ ప్రాణాలు నీవి కావు!" అన్నాడు.

"అవును, అవును! అబద్ధమే చెప్పాను. ఆ గుర్రం మీదున్నది వంతిదేవుడు కాదు. యువరాజు మధురాంతకులు. నన్ను వదిలేయి! ఆయన దగ్గర నీకు కావలసినన్ని బహుమానాలు ఇప్పిస్తాను!"

"బహుమతులలా ఉండనీ! వంతిదేవుడెక్కడ?"

"ఆ నందనవనంలోని గుడిసె వెనక గుర్రం దిగి వెళ్ళాడు. తర్వాత వాడు కనిపించలేదు."

"మీరెక్కడికి వెళుతున్నారు?"

"వంతిదేవునితో నేను వెళ్ళేందుకు ఉద్దేశించిన చోటికే!"

"అంటే లంకకు."

"అవును!"

"మధురాంతకులు ఎందుకు లంకకు వస్తున్నారు?"

"నాకేం తెలుసు? ఆయన్నే అడుగు! నాతో వస్తానని బయల్దేరి వచ్చారు."

~

ఆళ్వార్ కట్టియాన్ కరుత్తిరుమన్ గొంతును ఒక నొక్కు నొక్కి, "నిజం చెప్పు! మధురాంతకులు ఎవరి కుమారులు?" అని అడిగాడు.

"ఇదేం ప్రశ్న? శెంబియన మహాదేవిగారి... కాదు, కాదు! గొంతు నొక్కకు! నా ప్రాణం ఎగిరిపోతుంది! నిజం...మందాకిని కొడుకు."

"మధురాంతకుల తండ్రి ఎవరు? నిజం చెప్పు! లేకపోతే నీవు ప్రాణాలతో తప్పించుకోలేవు!"

కరుత్తిరుమన్ బదులుగా చాల మెల్లని గొంతుతో ఉత్తరమిచ్చాడు.

"మంచిది! బతికిపోయావు! చివరిగా ఇంకొకటి చెప్పు! సేందన్ అముదన్ ఎవరి కుమారుడు?"

"నన్నెందుకడుగుతావు? నీవే ఇంతకు మునుపే తెలుసుకొన్నావు కద?"

"గండరాదిత్యులు..శెంబియన్ మహాదేవి కుమారుడే!"

"అవును; కానీ వాడీరోజు ప్రాణాలతో బతికివుండడానికి నేనే కారణం. చెవిటిది, మూగదీ అయిన వాణి ఆ బిడ్డ చనిపోయిందని ఎంచి పూడ్చెయజూసింది. బిడ్డ ఏడ్పు విని నేనే వెళ్ళి కాపాడాను. అందుకోసమైనా నన్నిప్పుడు ప్రాణాలతో వదిలి పెట్టు!"

"నిజానికి, ఆ ఒక్క కారణం వల్ల మాత్రమే నిన్నిప్పుడు ప్రాణాలతో వదిలి పెడుతున్నాను!" అని చెప్పేసి ఆళ్వార్ కట్టియాన్ లేచాడు.

కరుత్తిరుమన్ ఒక్క దూకున లేచి పరుగెత్తి వెళ్ళి గుర్రమెక్కాడు.

రెండు గుర్రాలూ ఆ వర్షాకాలపు చీకటిలో నదీతీరం వెంబడి దూసుకెళ్ళాయి.

~~~
~~~

# అధ్యాయము - 65

## "అయ్యో పిశాచి!"

**ఆళ్వార్** కట్టియాన్ అంతవరకు మరుగున ఉన్న తన మనుషులను కూడదీసుకొని తంజావూరు కోట ఉత్తర ద్వారంవైపు నడిచాడు. కరుత్తిరుమన్‌తో అతడు ద్వంద్వయుద్ధం చేసినప్పుడు ఎందుకు తన మనుషులను పిలిచి వారి సహాయం తీసుకోలేదో పాఠకులు ఊహించి తెలుసుకొనేవుంటారు. అతడు తెలుసుకోగోరిన అతిముఖ్యమైన రహస్యాలు తక్కినవారి చెవిన పడకూడదు కద? అందులో ఆశ్చర్యమేమీ లేదు కద?

సగం దూరం వెళ్ళిన తర్వాత ఒక ఒంటరి మనిషి పిచ్చిపట్టినవాడిలాగ పరుగెత్తుకొంటూ రావడాన్ని చూశాడు. అలా పరుగెత్తి వచ్చినవాడు చీకటిలో ఆళ్వార్ కట్టియాన్ని గుద్దుకొని, మళ్ళీ పరుగెత్తజూశాడు. తిరుమలై నంబి, అతన్ని వదిలిపెట్టక గట్టిగా పట్టుకొన్నాడు. ముఖాన్ని పరీక్షగా చూసేసి, "అరెరె! వైద్యకుమారుడా? ఎక్కడికిలా తలా తోకా తెలియనట్లు పరుగెడుతున్నావు?" అని అడిగాడు.

"ఓహో! వీర వైష్ణవుడా? పిశాచో, దెయ్యమో అనుకొని భయపడిపోయాను. మంచిది. నీవెంత దూరం నుంచి ఈ తీరం వెంబడి వస్తున్నావు? ఎదురుగా రెండు గుర్రాల మీద ఇద్దరు మనుషులు వెళ్ళారా?" అని అడిగాడు.

"అవును, వెళ్ళారు! వాళ్ళ గురించి నీకేల?"

"నాకేలనా? మంచి ప్రశ్న! వారెవరని తెలిస్తే ఇలాంటి పిచ్చి ప్రశ్నలడగవు! అవునూ, వారిలో ఒక్కరిని కూడ నీవు గుర్తుపట్టలేకపోయావా?"

"ఒకడు మాత్రం నాకు తెలిసిన మనిషిలాగే కనిపించాడు. కానీ..."

"ఎవరు? ఎవరు? ఎవరిలాగ కనిపించాడు?"

"వంతిదేవుడిలాగ అగుపించాడు. కానీ అది సాధ్యం కాదని తీర్మానించుకొన్నాను."

"ఒరే పాపిష్టీ! అలాగా తీర్మానించావు? వాడు సాక్షాత్తు వంతిదేవుడే!"

"ఏమోయ్ పేలుతున్నావు? వంతిదేవుడు పాతాళ చెరసాలలో కద ఉన్నాడు?"

"ఉండేవాడు; కానీ ఇప్పుడు లేడు! వంతిదేవుడు, ఇంకొక పిచ్చివాడు చెరసాల నుంచి తప్పించుకొన్నారు. నన్ను కట్టిపడేసి వాళ్ళు పారిపోయారు!"

"అరెరె! మంచిపని చేశారు! వారు నిన్ను కట్టిపడేసేటప్పుడు నీ చేతులేం చేస్తున్నాయి? అసలు, నీవెందుకు పాతాళ చెరసాలకు వెళ్ళావు?"

"ముఖ్యమంత్రి ఆజ్ఞ మేరకు వెళ్ళాను. అదంతా ఇప్పుడు చెబుతూ కూర్చోవడానికి తీరిక లేదు.

నీవు కూడ ముఖ్యమంత్రి సేవకుడివే కద? నాతో రా! వాళ్ళను పట్టుకొని వద్దాం..."

"ఎందుకని వాళ్ళను పట్టుకొని రావాలి? పారిపోతే పోనీ! నీకూ, నాకూ దాని గురించెందుకు దిగులు?"

"ముఖ్యమంత్రి మంచివాడినే సేవకుడిగా ఎంచుకొన్నారు! నీలాగే అందరూ ఉంటే ఈ చోళసామ్రాజ్యం బాగుపడ్డట్లే! వంతిదేవుడు యువరాజు కరికాలన్‌గారిని హత్యచేశాడన్న నింద మోపబడ్డవాడని నీకు తెలియదా? అది మాత్రం కాదు; కాసేపటి క్రితం సేందన్ అముదన్ గుడిసె దగ్గర ఇంకొకరిని కూడ ఈటెతో పొడిచేసి పారిపోయి వచ్చేశాడు..."

"దైవమా! ఇదేమి? అక్కడ పొడవబడ్డవారెవరు?"

"అదెవరని నేను చూడలేదు. వంతిదేవుని వెన్నంటే నేను పరుగెత్తి వచ్చాను...సరే, సరే! నీవు నాతో రాకపోతే పో! దారికడ్డు రాకు! నీకు పుణ్యముంటుంది! వదులు!"

"వైద్యకుమారా! ఈ లోకంలో నేనెందరో మూర్ఖులను చూశాను. నీవు వారందరినీ మించిపోయావు! వాళ్ళు గుర్రాల మీద వెళుతున్నారు. నీవొక్కడివి కాలి నడకన వెళ్ళి వాళ్ళను పట్టేసుకొంటావా? నాకెందుకు దాని గురించి? పో! పో!"

"నీవు చెప్పేది నిజమే. అందుకే నిన్ను కూడ తోడు రమ్మన్నాను. నీవు రానంటున్నావు!"

"నేనొచ్చి ఏం చేయాలి? వారికి అడ్డుపడి ఆపజూశాను. ఒకడు చేతనున్న బడితెతో బాగా వాయించాడు. దెబ్బలు తిని వచ్చాను. ఇంకా ఆ నొప్పులు పోలేదు. నాకంతగా దెబ్బలాడి అలవాటు లేదు. నీవొకవేళ...అవునూ, నీ చేతిమీద ఏమది? రక్తపు మరకలాగ కద ఉంది?"

"చెరసాలలో వాళ్ళు నన్ను అటకాయించి గాయపరిచారు. మాచెడ్డ రాక్షసులు!"

"మరి, ఆ రాక్షసులను ఒంటరిగా కాలినడకన వెళ్ళి పట్టుకొంటానంటున్నావే? చెరసాలలో బంధించబడ్డప్పుడే నిన్ను వాళ్ళు అంతగా బాదారంటే..."

"అలాగైతే...ఏం చేయమంటున్నావు?"

"నేను నిన్నేమీ చేయమనడం లేదు. నామీద ఎందుకు నింద వేస్తున్నావు? నేను నీ పరిస్థితిలో ఉంటే, తిరిగి వెళ్ళి ఎవరైనా తగిన వారికి చెప్పి ఐదారు అశ్వవీరులను తోడు తీసుకొని వెళ్ళి మళ్ళీ వాళ్ళను వేటాడేందుకు బయల్దేరుతాను. నేనూ గుర్రమెక్కి చేత శూలమూ, ఖడ్గమూ పట్టుకొని బయల్దేరుతాను..."

~

వైద్యకుమారుడు కాసేపాలోచించాడు. సేందన్ అముదన్ గుడిసె దగ్గర ఒకడిని పొడిచేసి వచ్చాడు. ఒకవేళ రాజవంశానికి చెందిన మధురాంతకులు కావచ్చేమోనన్న సందేహం అతన్ని చాల పీడించి, కలవరపరిచింది. కానీ ఈ వైష్ణవుడు చెప్పినట్లు, ఒంటరిగా కాలినడకన వెళ్ళడం కూడ అంత

మంచిది కాదు. అలా ఈటెతో తాను పొడిచింది మధురాంతకులే అయిన పక్షాన ఆ నిందను కూడ వంతిదేవుని మీదికే తోసేయడమే మంచిది. ఒక యువరాజును చంపినవాడు ఇంకొక యువరాజును కూడ చంపేందుకు కూడ తెగించవచ్చు కద? శిక్ష రెండింటికీ ఒకటే కద....? ఇలా ఆలోచించినప్పుడు 'ఇద్దరు యువరాజులనూ చంపింది వంతిదేవుడే!' అని నమ్మనారంభించాడు.

"వైష్ణవా! నీవు చెబుతున్నదేమో సరిగానే ఉంది. నేను నీతోనే వస్తాను. నీవు నాకు సహాయం చేయాలి. ఎవరైనా తగిన పెద్ద మనిషి వద్దకు వెళ్ళి నాతోబాటు అశ్వవీరులను పంపించమని సిఫారసు చేయాలి. పెద్దమనుషుల స్వభావం నాకెందుకో అంతగా నచ్చలేదు. వారితో ఎలా నడుచుకోవాలో తెలియడం లేదు. ఇదిగో విను! నేను సేనాధిపతి పెద్ద వేళార్‌కి, ముఖ్యమంత్రికి చెప్పి చూశాను. పారిపోయినవారిని వెళ్ళి వెతికి పట్టుకోవడానికి కొందరు వీరులను నాతో పంపమని వేడుకొన్నాను. ఇద్దరూ నన్ను మూర్ఖుడని తిట్టి వెళ్ళగొట్టారు. వారి ఉద్దేశమేమని నాకర్థం కావడంలేదు..."

"ఇంకేం ఉద్దేశం? నీమీద వారికి నమ్మకం లేదు. నీకీ కార్యాన్ని ఒప్పజెప్పేందుకు వారిష్టపడలేదు. చెరసాల లోపలే మోసపోయి, వారు తప్పించుకొని పారిపోవడానికి అవకాశం కల్పించావు. ఇక బయట వారినింకేం పట్టుకోబోతావని అనుకొనివుంటారు..."

"వారి అభిప్రాయాన్ని తప్పని నిరూపించేందుకే ఒంటరిగానైనా వెళదామని బయల్దేరాను. ఎలాగూ వారు కోడిక్కరైలో ఆగే తీరాలి కద? అక్కడ వంతిదేవుడు దాగివుండగల స్థలాలన్నీ నాకు తెలుసు. అక్కడ నాకు సహాయం చేసేవారు కూడ ఉన్నారు..."

"అలాగైతే వెళ్ళు! నీ సామర్థ్యాన్ని చూపించు!"

"అయినా కూడ ఇంకొందరు అశ్వవీరులను తోడు తీసుకొని వెళ్తే మంచిది. నీవు నాకు సహాయం చేస్తావా?"

~

ఇంతలో వారిద్దరూ కోట ఉత్తరద్వారం వద్దకు వచ్చేశారు.

రాజబాటలో ఉత్తరంగా కాస్త దూరాన అంబారీలు అమర్చిన ఏనుగులు, గుర్రాలు, పదాతివీరులు గుంపులు గుంపులుగా ఊరేగింపు వస్తుండడం కనిపించింది.

కోట వాకిటా ఒక గుంపు నిలబడివుంది. దివిటీల వెలుతురులో కొడుంబాళూర్ వేళార్, మలైయమాన్, ముఖ్యమంత్రి అనిరుద్ధులు నిలబడివుండడం స్పష్టంగా కనిపించింది.

"నీకూ, నాకూ యజమాని అదిగో కోట వాకిట నిలబడివున్నారు. వారి వద్దకు వెళదాం వస్తావా?" అని అడిగాడు ఆళ్వార్ కట్టియాన్.

వైద్యకుమారుడు జంకాడు.

"నేనొకసారి అడగడమైంది. ప్రయోజనం లేదు. ఒకవేళ నీవు వారిద్దరూ తప్పించుకొని

పారిపోవడం చూశావు కాబట్టి నీమాటను నమ్మవచ్చు. కానీ నన్ను తోడు పంపుతారో లేదోనని సందేహిస్తున్నాను" అన్నాడు.

"అదీ నిజమే. పైగా వారిప్పుడు ఏదో ఒక ముఖ్యమైన కార్యంమీద కోట వాకిట వేచివున్నారు. ఈ సమయాన ఏం చెప్పినా వారి చెవికెక్కదు. ఇటువైపు పళువేట్టరయ్యర్లు వస్తున్నట్లు కనిపిస్తూంది. వారితో శంబువరయ్యర్ కూడ వస్తున్నారు. అదిగో పార్థిబేంద్రుడు, గందమారన్ కనిపిస్తున్నారు. వారికి చెప్పిచూద్దాం. వంతిదేవుని పట్టుకోవడంలో వారికే ఎక్కువ ఆసక్తి ఉంటుంది!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

ఊరేగింపు వారిని వేగంగా సమీపించింది. ముందుగా వందిమాగధులు పళువేట్టరయ్యర్ల పురాతన కులవైభవాన్ని, అలాగే శంబువరయ్యర్, మళపాడి మళవరయ్యర్, పార్థిబేంద్ర పల్లవుడు, నీల తంగయ్యర్, జోడు గొడుగుల రాజాణియార్ మొదలైనవారి బిరుదులను, వీరకృత్యాలను వరుసక్రమంలో చెప్పుకొచ్చారు. మధ్య మధ్య కొమ్ముబూరాలు, శంఖాలు మోగాయి.

ఊరేగింపు ముందుభాగాన ఉన్న చిన్న పళువేట్టరయ్యర్, పార్థిబేంద్రుడు, గందమారన్ తెల్లని గుర్రాల మీద గంభీరంగా ఆసీనులై వస్తున్నారు. తర్వాత వచ్చిన మత్తగజం మీద అంబారీలో పెద్ద పళువేట్టరయ్యర్, శంబువరయ్యర్ ఆసీనులైవున్నారు. వారి వెనుక తక్కిన చిన్న చిన్న రాజులు ఏనుగుల మీద, గుర్రాల మీద వస్తున్నారు. ముందు, వెనుక ఇంచుమించు వంద మంది వీరులు శూలాలు, ఖడ్గాలు పట్టుకొని నడిచివస్తున్నారు.

~

ఈ ఊరేగింపు ముందు ఆళ్వార్ కట్టియాన్, పినాకపాణి బాటలో నిలబడివుండడాన్ని చూడగానే, చిన్న పళువేట్టరయ్యర్ తన గుర్రాన్ని కాస్త ఆపి, "వైష్ణవా! ముఖ్యమంత్రి నుంచి ఏమైన ముఖ్యమైన వార్త ఉందా?" అని అడిగారు.

"దళపతీ! ముఖ్యమంత్రి నాకే వార్తనూ చెప్పి పంపలేదు. చెప్పవలసిన వార్తను కోట ద్వారం వద్ద మీకే చెబుతారు. కానీ ముఖ్యమైన వార్త ఒకటుంది..." అని చెప్పి ఆళ్వార్ కట్టియాన్ ఆగాడు.

"ఏమది? ఏమది?" అని ముగ్గురూ చాల ఆదుర్దాగా అడిగారు.

"పాతాళ చెరసాలనుంచి వంతిదేవుడు తప్పించుకొని పారిపోయాడు..."

"అదెలా సాధ్యం? వాడేమైన ఇంద్రజిత్తా, మాయమైపోవడానికి?" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

"ఇందులో ఏదో కుట్ర ఉంది. ఇంకెవరైనా వాడికి సహాయం చేసివుండాలి!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"అంతా ఆ కొడుంబాళూర్ వేళార్ నిర్వాకమే!" అన్నాడు గందమారన్.

"అలా తప్పించుకొని పారిపోయినా, ఎక్కడికి పారిపోగలడు? కోట లోపలే కద ఉండాలి?"

అన్నారు కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్.

“అలాగనే చెబుతున్నారు పెద్ద వేళార్. ముఖ్యమంత్రి నన్ను ముందు జాగ్రత్తగా కోట చుట్టూ తిరిగి రమ్మని ఆజ్ఞాపించారు. కడంబూర్ వంశంమీద ఎటువంటి అపనింద రాకూడదని ముఖ్యమంత్రి దిగులు పడుతున్నారు...”

“అలా దిగులు పడుతున్నవారు ఒక్కరైన ఉన్నారు కద, అంత వరకు సంతోషం" అన్నాడు గందమారన్.

“వైష్ణవా! నిజం చెప్పు! వాడు తప్పించుకొని పారిపోకుండ అడ్డుకోవడానికి నీవు కోట చుట్టూ తిరిగి వస్తున్నావా? లేక వాడు తప్పించుకోవడానికి సహాయం చేసి వస్తున్నావా?” అని అడిగాడు పార్థిబేంద్రుడు. అతడికి ఈ వైష్ణవుడిమీద ఎప్పుడూ సందేహమే.

“అయ్యా! ఇంకొక సందర్భంలోనైతే ఇంకోరీతిగా మీకు బదులు చెప్పేవాడిని. ఇప్పుడు మనం దెబ్బలాడుకొనే సమయం కాదు. ఈ వైద్యకుమారుడు పినాకపాణి ఒక విచిత్రమైన సంగతిని తెలియజేశాడు. రెండు గుర్రాలమీద ఇద్దరు వెళ్ళారని, వాళ్ళు చెరసాల నుంచి తప్పించుకొని పారిపోయిన వంతిదేవుడు, కరుత్తిరుమన్ అని చెబుతున్నాడు. ఇద్దరు గుర్రాలమీద ఈ బాట వెంబడి వేగంగా వెళ్ళడాన్ని నేను కూడ చూశాను.”

“పినాకపాణీ! ఈ వైష్ణవుడు చెబుతున్నది నిజమేనా?” అని అడిగారు చిన్న పళువేట్టరయ్యర్.

“సత్యం, అయ్యా!”

“మరి వెంటనే వెళ్ళి ముఖ్యమంత్రికిగాని, సేనాధిపతి పెద్ద వేళార్‌కిగాని ఎందుకు చెప్పలేదు?”

“వారిద్దరికీ నామీద చెప్పలేనంత కోపం.”

“ఎందుకని?”

“వాళ్ళను నేనే తప్పించుకొని పారిపోనిచ్చానని.”

“అదెలా?”

“పాండ్యవంశపు కిరీటం, రత్నహారం ఉండేచోటు తెలుసునని ఒక పిచ్చివాడు పాతాళ చెరసాలలో చెబుతుండేవాడు కద? వాడిని పిలుచుకొని రమ్మని ముఖ్యమంత్రి నన్ను పంపారు. అందుకోసం వెళ్ళినప్పుడు వారిద్దరూ కూడబలుక్కొని నన్ను పాతాళ చెరసాలలో కొట్టి, కట్టి పడేసి తప్పించుకొని పారిపోయారు!”

“మన ముఖ్యమంత్రికి ఇలాంటి ముఖ్యమైన కార్యాన్ని నెరవేర్చేందుకు నీలాంటి మూర్ఖుడా దొరకాలి?” అనేసి పార్థిబేంద్రుడు నవ్వాడు.

~

వైద్యకుమారుడు కోపంగా, “అయ్యా! మీరు నన్ను చూసి నవ్వేందుకు నేనిక్కడికి రాలేదు.

సహాయం చేసేటట్లయితే, చేయండి!" అన్నాడు.

"ఏం సహాయం కోరుతున్నావు?"

"నాతో నలుగురు అశ్వారూఢులైన వీరులను పంపండి. నాకూ ఒక గుర్రాన్నిప్పించండి. తప్పించుకొని పారిపోయినవారిని పట్టి తీసుకొని రావడం నా బాధ్యత. ఇప్పటికే నాకొప్పజెప్పిన కార్యాలను నేను నెరవేర్చలేదా? దళపతి చిన్న పళువేట్టరయ్యర్‌కి తెలుసు కద?" అన్నాడు పినాకపాణి.

"నీవేమంటావు?" అని దళపతి పార్థిబేంద్రుని అడిగారు.

"పంపించవలసిందే. చక్రవర్తి మిమ్మల్ని మళ్ళీ పిలుచుకొని వచ్చే బాధ్యతను నాకప్పగించారు. లేకపోతే నేనే వీడితో వెళ్ళేవాడిని. వంతిదేవుని పట్టుకోవలసింది చాల ముఖ్యమైన కార్యం" అన్నాడు పార్థిబేంద్రుడు.

అప్పుడు గందమారన్, "ఆ బాధ్యతను నాకొప్పజెప్పండి. ఇతడితో నేను కూడ వెళతాను. వంతిదేవుడు యమలోకం వాకిట ఉన్నాకూడ, తిరిగి పట్టుకొని వస్తాను" అన్నాడు.

చిన్న పళువేట్టరయ్యర్ కూడ అందుకు సమ్మతించారు. శంబువరయ్యర్ మొదలైనవారికి జవాబు చెప్పే బాధ్యతను కూడ తమ మీద వేసుకొన్నారు.

వెంటనే గందమారన్, వైద్యకుమారుడు, ఇంకా నలుగురు వీరులు ఉత్తర  నదీతీరం వెంబడి వేగంగా వెళ్ళగల గుర్రాలెక్కి వాయువేగ మనోవేగాలతో దూసుకొళ్ళారు.

~

మధురాంతకుడు గుర్రపు స్వారీలో అంతగా సామర్థ్యం లేనివాడు. కరుత్తిరుమన్ గుర్రపు స్వారీ అలవాటున్నవాడైనా, పాతాళ చెరసాలలో చాలకాలం బంధించబడ్డాడు కాబట్టి బలహీనంగా ఉన్నాడు. కానీ ఇద్దరి మనసుల్లోను ఒక కొత్త ఉత్సాహం పొంగుతూంది. మనోబలం వల్ల దేహబలహీనతను గెలిచి ముందుకు సాగారు.

మధ్యరాత్రి వరకు ప్రయాణం చేసిన తర్వాత ఇద్దరూ ఆగారు. అక్కడ నదికడ్డంగా వెదురుబొంగులను చేర్చి కట్టి అమర్చబడిన వంతెన ఒకటి కనిపించింది. ఎలాగూ తమను వెన్నంటి పట్టుకోవడానికి మనుషులు వస్తారని కరుత్తిరుమన్ ఎదురు చూశాడు. కాబట్టి ఆ చోట నదిని దాటి అవతలి గట్టు చేరుకోవడం మంచిదని ఎంచాడు. నది దక్షిణతీరం వెంబడి కాస్త దూరం వెళ్ళి, ఆ తర్వాత కోడిక్కరై బాటకు మళ్ళవచ్చు.

అక్కడే నదిని దాటేందుకు ఇంకొక కారణముంది. మధురాంతకుడు గుర్రాన్ని నడుపుతూ నది వెల్లువను దాటగలడా అని కరుత్తిరుమన్ సందేహించాడు. వెల్లువ ఉధృతంగా ఉంటే దాటలేడు. మధురాంతకుని కాలినడకన వంతెన మీదుగా అవతలి గట్టుకు వెళ్ళమని చెప్పి, తానే రెండు గుర్రాలను ఒకదాని తర్వాత ఒకటిగా అవతలి గట్టుకు చేర్చవచ్చు.

~

ఈ ఆలోచనలు మధురాంతకునికి కూడ ఆమోదకరంగా అనిపించాయి. నది వెల్లువను దాటేందుకు ముందు ఇద్దరూ కాస్త సేదదీరేందుకు చెట్టు కింద కూర్చొన్నారు. నది వెల్లువ హోరుమని శబ్దం చేస్తూ ప్రవహిస్తూంది. నలువైపుల నుంచి కప్పల బెకబెకలు మొదలైనాయి. ఆకాశాన వేగంగా చెదరిపోతున్న మేఘాల మధ్యనుంచి చుక్కలు తొంగి చూస్తున్నాయి.

జీవితకాలమంతా అంతఃపురంలో పట్టుపరుపుల మీద సుఖంగా గడిపిన మధురాంతకునికి ఇప్పుడు నడిరాత్రి చెట్టు వేర్లమీద కూర్చోవలసి రావడం చాల మనస్తాపాన్ని, రాబోయే కాలం గురించిన భీతిని కలిగించింది.

అతడి మనఃస్థితిని గ్రహించిన కరుత్తిరుమన్ అతడికి ధైర్యం చెప్పజూశాడు. లంకరాజు మహీంద్రుడు పాండ్యవంశానికి తరతరాలుగా మిత్రుడని, అతని చెంతకు మధురాంతకుడు వెళ్ళి చేరిపోతే తర్వాత ఏ దిగులూ ఉండదని తెలియజేశాడు. పాండ్యవంశపు మణిమకుటం, ఇంద్రుడిచ్చిన రత్నహారం లంకలోనే ఉన్నాయి; అవి ఉన్నచోటు తనకు తెలుసు; అక్కడే మహీంద్రుడు మధురాంతకునికి పట్టాభిషేకం చేస్తాడు! అంతలోపల చోళదేశపు చిన్నరాజుల మధ్య అంతర్యుద్ధం మొదలై, చోళసామ్రాజ్యం ఛిన్నాభిన్నం కాబోతూంది. ఆదిత్య కరికాలన్ని హత్య చేశారని పళువేట్టరయ్యర్ల మీద, శంబువరయ్యర్ల మీద తక్కినవారు నింద మోపుతారు. మధురాంతకుడిప్పుడు తనతో వచ్చేశాడు కాబట్టి, అతన్ని చంపేసినట్లు వేళార్ పక్షం మీద పళువేట్టరయ్యర్లు నింద మోపుతారు. ఈ ఘోరహత్యల్లో అరుళ్మొళివర్మకు కూడ భాగం ఉందన్న వదంతి కూడ లేచి ప్రజల మధ్య వ్యాపించబోతుంది. కాబట్టి అతన్ని కూడ ప్రజలు అయిష్టపడి, తిరస్కరిస్తారు. ఇలా చోళసామ్రాజ్యం సంక్షోభంలో మునిగివున్నప్పుడు లంకాధిపతి మహీంద్రుడు ఒక పెద్ద సైన్యాన్ని కూడదీసుకొని పాండ్యనాడుమీద దండెత్తి వస్తాడు. మదురైని వశపరుచుకొంటాడు. మధురాంతకునికి లోకమెరుగ రెండవసారి పట్టాభిషేకం చేస్తాడు. 'మధురాంతకుడు' అన్న పేరును కూడ మార్చి, 'చోళ కాలాంతక మహారాజు' అన్న బిరుదును కూడ ఇచ్చి సన్మానిస్తాడు...!

~

ఇలా కరుత్తిరుమన్ చెప్పుకొచ్చినప్పుడు మధురాంతకుని మనసు ఉప్పొంగింది. తన జీవితంలో అంతవరకు కని, విని ఎరుగని ఉత్సాహాన్ని అతడిప్పుడు పొందాడు. యుద్ధరంగంలో వినిపించే భేరీలు అతని చెవుల్లో ఇప్పుడు మారుమోగాయి. పట్టాభిషేక మధుర సంగీతనాదాలు ఇంకొకవైపు వినిపించాయి. వేవేల ప్రజలు "పాండ్య చక్రవర్తికి జయహో", "చోళ కాలాంతక మహారాజుకు జై!" అని ఘోషించారు.

ఇలాంటి తీయని కల్పనాలోకంలో మధురాంతకుడు తేలియాడుతున్నప్పుడు, ఆ స్వప్నాలను కలచివేస్తూ గుర్రపు డెక్కల చప్పుడు వినిపించింది.

కరుత్తిరుమన్ అంత త్వరలో తమను ఎవరైనా వెన్నంటి రావచ్చని ఎదురు చూడలేదు. కాబట్టి అదిరిపడి లేచి, “యువరాజా! లేవండి! గుర్రమెక్కండి! వారు వచ్చేలోపు నదిని దాటేద్దాం!” అన్నాడు.

ఒక్కక్షణంలో అతడు ఎగిరి గుర్రంమీదెక్కి కూర్చొన్నాడు. మధురాంతకుడు గుర్రమెక్కడానికి కష్టపడుతుండడాన్ని చూసి, “అయ్యా! ఒక పని చేయండి. వంతెన మీదుగా కాలినడకన అవతలి గట్టుకు వెళ్ళిపొండి. నేను మీ గుర్రాన్ని కూడ అవతలి గట్టుకు తీసుకొని వచ్చి చేరుస్తాను!” అన్నాడు.

“బాగుంది! నన్ను పిరికిపందనుకొన్నావా? గుర్రమెక్కి ఈ నదిని దాటలేకపోతే, తర్వాత సముద్రం దాటి లంకకు వెళ్ళడమెలా? పాండ్యదేశాన్ని చేజిక్కించుకొని సింహాసనమెక్కడమెలా?” అని గొప్పలు చెప్పుకొంటూ మెల్లగా గుర్రమెక్కాడు.

రెండు గుర్రాలూ నదిలోకి దిగాయి. మధురాంతకుని గుర్రం నీటిలోకి దిగిన వెంటనే ఉన్నట్లుండి ముంగాళ్ళు మడిచి పడుకొనేసింది. “అయ్యో!” అని అరిచాడు కరుత్తిరుమన్. అదృష్టవశాత్తు గుర్రం ఎలాగో తమాయించుకొని లేచి ముందుకు నడిచింది.

మధురాంతకుని మనసులో దిగులే. కానీ బయటకు చూపించుకోలేక "ఇదేం పెద్ద అపాయమా? అంతగా భయపడ్డావేం?” అన్నాడు.

మధురాంతకుని గుర్రం కాలికేమైనా గాయమైందో ఏమో, అది రెండో గుర్రంలాగ వెల్లువలో వేగంగా వెళ్ళలేకపోయింది. తరచూ అది వెల్లువతో వెల్లువగా పరుగెత్తజూసింది. దాన్ని మళ్ళించి అవతలి తీరం వైపుగా నడిపించేందుకు మధురాంతకుడు చాల కష్టపడవలసి వచ్చింది.

తీరం వెంబడి వస్తున్న గుర్రాల డెక్కల చప్పుడు మరింత దగ్గరపడుతూంది.

నదిని సగం దాటేవరకు కరుత్తిరుమన్ యువరాజు కోసం ఆగి ఆగి మెల్లగా సాగాడు. తర్వాత అతడి మనసులో ఒక ఉపాయం పుట్టింది. మధురాంతకునికి ధైర్యం చెప్పేసి అవతలి గట్టుకు దూసుకెళ్ళాడు. గట్టెక్కి గుర్రాన్ని ఒక చెట్టు కింద నిలిపాడు. గుర్రంమీదినుంచి ఒక్కదూకున కిందికి దూకి వంతెన మీదుగా మళ్ళీ ఉత్తరతీరం చేరాడు. మధురాంతకుని దగ్గరున్న చురకత్తిని అప్పటికే తీసి తన దగ్గరుంచుకొన్నాడు. దాన్ని తీసి తొందర తొందరగా వంతెన నుంచి వేలాడుతున్న తాళ్ళను కోసి ముడివేశాడు. అది చాలినంత పొడవున్నట్లనిపించగానే, ఒక చివరను వంతెనకు చేర్చి కట్టేసి, ఇంకొక చివరను బాటకవతల ఉన్న చెట్టు అడుగు భాగానికి చేర్చి కట్టాడు.

చెట్టు నీడవల్ల, చిమ్మచీకటిలో దారికడ్డంగా కట్టిన ఆ తాడును ఎవరూ గమనించలేరు కద? అందులోను గుర్రాల మీద వేగంగా వచ్చేవారు తప్పక చూడలేరు.

~

ఈ ఉపాయాన్ని అతడు చేసి ముగించగానే వంతెన మీదుగా మళ్ళీ పరుగెత్తి వెళ్ళిపోదామా అనుకొన్నాడు. ఆ ఆలోచనను మార్చుకొని అక్కడే ఉన్న చెట్టెక్కి కొమ్మల మధ్య దాక్కొని కూర్చొన్నాడు.

మధురాంతకుని గుర్రం ఇంచుమించు నదిని దాటి అవతలి గట్టును సమీపిస్తూంది.

ఇంకొన్ని నిమిషాల అవకాశం దొరికితే, మధురాంతకుని గుర్రం అవతలి గట్టెక్కేస్తుంది.

ఈ ఆలోచన అతడి మనసులో తోచి మరుగయ్యే లోపల గుర్రాలు చెట్టు దగ్గరికొచ్చేశాయి. ఐదారు గుర్రాలుండవచ్చు. వాటిలో రెండు గుర్రాలు ముందు వరుసలో ఉన్నాయి. అవి రెండూ ఒకదాని తర్వాత ఒకటి కరుత్తిరుమన్ కట్టిన తాడు అడ్డుపడగా తలకిందులై పడ్డాయి.

కరుత్తిరుమన్ చెట్టు మీద కూర్చొన్న ఫళంగా తనకు తెలియకనే 'హహ్హహ్హా' అని పెద్దగా నవ్వాడు.

గుర్రాల మీది నుంచి కింద పడ్డవారిలో ఒకడు "అయ్యో! పిశాచి!" అని అరిచాడు.

గొంతునుబట్టి అది వైద్యకుమారుడు పినాకపాణి అని గ్రహించాడు కరుత్తిరుమన్. కిందపడ్డవాడు మెడ విరిగి చావలేదేమి అనుకొన్నాడు.

ఇంకొక గుర్రం మీదినుంచి కిందపడ్డవాడు కించిత్తు అదిరిపాటు లేకుండ నేల మీదినుంచి లేచాడు. అతడెవరో కాదు, మనకు చిరపరిచితుడైన గందమారనే.

~~~
~~~

# అధ్యాయము - 66

## మధురాంతకుని అంతర్ధానం

**గుర్రంతోబాటు** తాను కూడ ఉన్నట్లుండి కింద పడ్డా ఏ మాత్రం గాభరా పడని గందమారన్ లేచేటప్పుడే చేత శూలంతో లేచి నిలబడ్డాడు. అతడి గురి అప్పటికే అవతలి గట్టుకు చేరుకొన్న గుర్రంమీదికి మళ్ళిపోయింది. ఆ గుర్రంమీదున్నవాడు నిస్సందేహంగా వంతిదేవుడే అని నమ్మాడు.

గందమారన్ ఒకప్పుడు వంతిదేవుని మీదగొన్న స్నేహభావం ఇప్పుడు గాఢమైన పగగా మారివుంది. పలువిధాలుగా వంతిదేవుడు మిత్రద్రోహం చేసినట్లు భావించాడు. తనకు, తన కుటుంబానికి కలిగిన అపకీర్తికంతా కారణం వంతిదేవుడే! తన ఇంట అతిథిగా విడిది చేసినప్పుడు తెలుసుకొన్న రహస్యాలను చాలమందికి చెప్పేశాడు. రాజకుటుంబీకులకు కూడ చెప్పేశాడు. ఎందుకని? చోళకులం పట్లవున్న భక్తివిశ్వాసాల కారణంగానా? కానే కాదు! ఈ రహస్యాలన్నీ తెలియజేసి, వారి అభిమానాన్ని చూరగొని, తర్వాత వారికి కూడ ద్రోహం చేసేందుకే! పాండ్యరాజు ఆపత్కాల సహాయకులకు వాడు సహాయం చేశాడనడంలో సందేహమే లేదు. ఈ రెండు ద్రోహాలను నందిని పురిగొల్పడంవల్ల చేశాడా, లేక తన స్వలాభం కోసం చేశాడా అన్నది తెలియడం లేదు. నందిని మాయవలలో తాను కూడ కొంతకాలం చిక్కుకొన్నాడన్నది నిజమే! కానీ ఇటువంటి భయంకరమైన ద్రోహాలను కలలో కూడ చేయదలచేవాడా?

వీటన్నిటికన్న తన ప్రియ సహోదరి మణిమేఖల మనసును చెడగొట్టేసినందుకు గందమారన్‌కి వంతిదేవుని మీద అలవిగాని కోపం పొంగుకొస్తూండేది. మణిమేఖల చోళసామ్రాజసింహాసనం మీద మణిమకుటం ధరించి ఆసీనురాలైతే చూసి ఆనందించాలని ఆశపడుతుండగా, ఆ కల్లాకపటమెరుగని పిల్లను 'కరికాలన్‌గారిని నేనే చంపాను' అని పలువురెరుగ పిచ్చిపిచ్చిగా మాట్లాడేటట్లు చేసిన క్రూరవంచకుడు కద వాడు?

అంత పెద్ద ఘాతుకాలను చేసినవాడిని ప్రాణాలతో తప్పించుకని పారిపోనివ్వడమా? దాన్ని తాను చూస్తూ ఊరుకోవడమా? ఏనాడూ జరగదు! వంతిదేవుని సజీవంగా పట్టి తీసుకొని వెళ్ళలేకపోతే ఫరవాలేదు! వాడిని చంపి తొలగించేశామన్న ఓదార్పుతో ఇక్కడినుంచి తిరిగివెళ్ళాలి...ఈ తీర్మానంతోనే గందమారన్ ఆ మనుష్యవేటకు బయలుదేరాడు.

ఇప్పుడు అతడి గుర్రం ఎదురు చూడని విధంగా ఎదురు దెబ్బ తగిలి పడిపోయింది. అదిక బతకడమే దుర్లభం. వైద్యకుమారుడు పినాకపాణి గుర్రానికీ అదే గతి!

వంతిదేవుడేమో అవతలి గట్టును సమీపించేస్తున్నాడు.!

వెనక వస్తున్న వీరులు అక్కడికొచ్చి చేరేందుకు ఇంకాసేపు పడుతుంది. వారు వచ్చినా,

నదివెల్లువను దాటి అవతలి గట్టుకు చేరుకొని వంతిదేవుని పట్టుకోవడం జరిగేపని కాదు. కాబట్టి వాడిని చంపేయడమే చేయదగిన పని.

ఇన్ని ఆలోచనలు గందమారన్ తలలో కొన్ని క్షణాల్లో తోచి మరుగైనాయి. కాబట్టి నేలమీదినుంచి లేవగానే, కాళ్ళను బాగా ఊని, చేతపట్టిన శూలాన్ని పైకెత్తి గురిచూసి తన బలాన్నంతా ఉపయోగించి విసిరాడు.

శూలం సర్రున శబ్దం చేస్తూ గాలిని చీల్చుకొని కన్ను మూసి తెరిచేలోపు మధురాంతకుని మీదికి దూసుకెళ్ళింది.

'కెవ్వు'మని కేకవేసి మధురాంతకుడు నీటిలో పడ్డాడు.

గుర్రం మాత్రం తడబడుతూ గట్టెక్కడానికి ప్రయత్నించసాగింది.

~

అతి స్వల్పావధిలో జరిగిపోయిన ఈ సంఘటనలను చెట్టు కొమ్మల మధ్య కూర్చొని చూస్తున్న కరుత్తిరుమన్ బెంబేలు పడిపోయాడు; ఒళ్ళూ వణకసాగింది.

ఇలా జరుగుతుందని అతడు ఎదురు చూడనేలేదు.

వేగంగా వచ్చి ఉన్నట్లుండి తాడు తగిలి కింద పడ్డ గుర్రాల కింద చిక్కుకొన్నవారు ప్రాణాలతో లేచినా, కాళ్ళు చేతులు విరిగి వెంటనే లేవలేరని అనుకొన్నాడు.

అతడు కించిత్తు కూడ ఎదురుచూడనట్లు అంతా జరిగిపోయింది. కింద పడ్డవారిలో ఒకడు లేచి నిలబడి శూలం విసిరి, అది కూడ గురి తప్పకుండ మధురాంతకుని మీదికి విసిరి, అతన్ని నది వెల్లువలో పడిపోయేలా చేశాడు. ఇందువల్ల ఏర్పడ్డ అదిరిపాటును సంభాళించుకొని భయంకరంగా కేకవేస్తూ కిందకు దూకాడు.

ఉక్రోషం వల్ల పొంగుకొచ్చిన రాక్షసబలంతో గందమారన్ మీదకు దూకి కిందకు తోసేసి అవతలికి వెళుతున్నప్పుడు, అప్పుడప్పుడే తడబడుతూ లేస్తున్న పినాకపాణి అతన్ని అడ్డుకోజూశాడు. పినాకపాణికి ఇంతలోపల దెయ్యం భయం వదిలి చెట్టు మీదున్నవాడు కరుత్తిరుమన్ అని తెలిసిపోయింది.

కరుత్తిరుమన్ తన కోపాన్నంతా ప్రయోగించి చేతనున్న చురకత్తితో పినాకపాణిని పొడిచేసి వంతెనవైపు పరుగెత్తాడు.

~

వెదురు బొంగుల వంతెన మీదుగా ఒక మనిషి పరుగెత్తుతుండడాన్ని అప్పుడే అక్కడికి వచ్చిన వీరులు చూశారు.

తాము రాక మునుపు జరిగినదంతాఒకింతవరకు  వారు ఊహించి తెలుసుకొని గుర్రాలను అక్కడే ఆపారు.

గందమారన్ "పట్టుకోండి! పట్టుకోండి! వంతెన మీద పరుగెడుతున్నవాడిని పట్టుకోండి!" అని అరిచాడు.

నలుగురు వీరులు గుర్రాలమీదినుంచి దడదడమని కిందకు దూకి వంతెనమీద పరుగెడుతున్న కరుత్తిరుమన్ని వెంబడించారు.

ఉన్నట్లుండి రెండవసారి కూడ తలకిందులుగా తోసేయబడ్డందువల్ల చేష్టలుడిగి కాసేపు నిలబడిపోయిన గందమారన్ త్వరగానే మళ్ళీ నిలదొక్కుకొని లేచి ఆ నలుగురు వీరుల వెనక తాను కూడ పరుగెత్తాడు.

కత్తితో పొడవబడి తీవ్రంగా గాయపడ్డ పినాకపాణి కూడ ఆవేశంతో లేచి వారి వెంట వంతెన మీద పరుగెత్తాడు.

కానీ అయిదారు అడుగులు వేసేలోపు అతని జీవశక్తి సన్నగిల్లిపోయింది. కళ్ళు మసకబారాయి. తల తిరగసాగింది. కాళ్ళూని నిలబడలేక నది వెల్లువలో పడ్డాడు.

అతడలా వెల్లువలో పడిపోవడాన్ని ముందు వెళుతున్నవారెవరూ గమనించలేదు.

పాపం! ఎన్నెన్నో గాలిమేడలు కట్టుకొన్న వైద్యకుమారుడు పినాకపాణి తన దురాశవల్ల అవేవీ నెరవేరక ప్రాణాలు కోల్పోయాడు! అతడు కట్టుకొన్న ఆకాశ హర్మ్యాలన్నీ ఆ నదిలో మునిగి మాయమైనాయి! ఆ నదే అతడికి సమాధిగా మారింది!

~

గందమారన్ని కిందికి తోసేసి, పినాకపాణిని కత్తితో పొడిచేసి వెదురు వంతెన మీదుగా వేగంగా పరుగెత్తిన కరుత్తిరుమన్, ఆ వంతెన మూడు వంతుల దూరం దాటిన తర్వాత ఒక క్షణం ఆగి, తిరిగి చూశాడు. అప్పుడే గుర్రాలమీదినుంచి కిందకు దూకి వంతెనఎక్కుతున్న వీరులను గమనించాడు.

వెంటనే అతడొక వింతైన పని చేశాడు. అతడు నిలబడ్డ చోట వెదురు బొంగులను ఒకదానితోనికటి చేర్చి కట్టడమేగాక కింద ఊత కూడ ఉంది. పినాకపాణిని పొడిచిన అదే కత్తితో ఆ కట్లను కోసేశాడు. కింద ఊతగా ఉన్న కొయ్యలను కూడ కాలితో తన్ని పడదోసేసి ముందుకు వేగంగా పరుగెత్తాడు.

అవతలి గట్టు చేరగానే అక్కడ కూడ వెదురు బొంగుల్ని చెట్టు వేర్లతో చేర్చి కట్టివున్న తాళ్ళను కోసేశాడు. వెంటనే వంతెన చివరిభాగాన్ని అలాగే చేత్తో ఎత్తి నది వెల్లువలోకి తోశాడు.

మరుక్షణం ఆ వెదురు బొంగుల వంతెన మూడింట ఒక వంతు విడివడి నది వెల్లువలో తేలుతూ వెళ్ళసాగింది.

వంతెన మీద పరుగెత్తుకొంటూ వచ్చినవారు, అలా అక్కడే వంతెన తెగిపోయి కొట్టుకొని వెళ్ళడాన్ని గమనించక పైపైకి పరుగెత్తి వచ్చి ఒకరి తర్వాత ఒకరుగా నది వెల్లువలో పడ్డారు!

వారందరి కన్న చివరగా వచ్చిన గందమారన్ మాత్రం నదిలో పడిపోక తప్పించుకొన్నాడు.

ఎదురు చూడని విధంగా వెల్లువలో పడ్డ వీరులు నీళ్ళు తాగేసి ఊపిరాడక కాసేపు సతమతమైన తర్వాత నీటినుంచి తలలను పైకి చాచారు.

గందమారన్ వారిని చూసి అవతలి తీరానికి ఈదుతూ వెళ్ళి గట్టెక్కమని పెద్దగా అరిచి ఆజ్ఞాపించాడు. అందులో ఇద్దరు అది గ్రహించి అవతలి గట్టువైపు ఈదనారంభించారు.

తక్కిన వారిద్దరు అతిప్రయాస పడి వెల్లువకు ఎదురీది వచ్చి విరిగిన వంతెనను పట్టుకొని దానిపైకెక్కారు.

గందమారన్ మొదట వారిని బాగా తిట్టాడు. కానీ వారిని మళ్ళీ ఈదుకొంటూ వెళ్ళమని ఆజ్ఞాపించడం వల్ల ప్రయోజనం లేదని గ్రహించాడు.

కాబట్టి వంతెన నుంచి కొన్ని వెదురు బొంగులను పీకి తెప్పలాగ కట్టేటట్లు చేశాడు. దాన్ని తేలేటట్లు వదిలి దానిమీదెక్కి గందమారన్, తక్కిన ఇద్దరు వీరులు అవతలి గట్టుకు చేరుకొన్నారు.

కాసేపటి క్రితం తడబడుతూ అవతలి గట్టుకు చేరిన తక్కిన ఇద్దరినీ కలిశారు.

వారు తాము గట్టెక్కేందుకు కాస్త మునుపే అవతలి గట్టు చేరుకొన్న ఆ మనిషి చీకటిలో మరుగైపోయాడని, రెండు గుర్రాలు వేగంగా వెళ్ళే డెక్కల శబ్దం వినిపించిందని, గుర్రాలను కాలినడకన వెంబడించడం వల్ల ప్రయోజనం లేదని తాము ఆగిపోయామని చెప్పారు.

కానీ గందమారన్ అలా ఆగిపోవడానికి ఇష్టపడలేదు. వైద్యకుమారుడు చెప్పిన చెరసాలలోని పిచ్చివాడే చెట్టు మీదినుంచి కిందకు దూకి తనను కిందకు తోసేసినవాడయివుండాలి. వంతిదేవుని తప్పించేందుకే వాడలా బాటకు అడ్డంగా తాడును కట్టి చెట్టు మీదికెక్కి కాచుకొని కూర్చొనివుండాలి. తన శూలానికి ఎరైనవాడు వంతిదేవుడే అనడంలో సందేహం లేదు. వాడు గుర్రం మీదినుంచి తలకిందులుగా వెల్లువలో పడడాన్ని తన కళ్ళతో తానే చూశాడు. కానీ అసువులుబాసిన వాడి శరీరాన్ని కనిపెట్టి చూసేస్తే, తన మనసు ఇంకా తృప్తిపడుతుంది. వీలైతే తంజావూరుకే వాడి శరీరాన్ని తీసుకొని వెళ్ళవచ్చు. చోళవంశానికి మహాద్రోహాన్ని చేసిన ఒకడిని చంపి తీసుకొని వచ్చిన పేరు పొందవచ్చు కదా? దాని మూలంగా శంబువరయ్యర్ కులానికి కలిగిన అపకీర్తిని ఒకింత కడిగేయవచ్చు. వంతిదేవుడు తప్పించుకొని పారిపోవడానికి చేసిన ప్రయత్నమొక్కటి చాలు వాడి నేరాన్ని నిరూపించడానికి. ఆదిత్య కరికాలన్‌గారిని చంపింది వాడేనని నిరూపించబడితే, ఆ భయంకరమైన నిందను శంబువరయ్యర్ కులం మోయవలసిన అవసరం ఉండదు!

ఇలా ఆలోచిస్తూ గందమారన్ ఉత్తరనది తీరం వెంబడి దిగువగా వెళ్ళాడు. వీరులు నలుగురూ అతడి వెంబడే వెళ్ళారు.  వంతిదేవుని శరీరం ఎక్కడైనా తీరానికి కొట్టుకొని వచ్చిందేమోనని చూస్తూ వెళ్ళారు. చీకటి కమ్ముకొన్న ఆ రాత్రివేళ అది అంత సులభసాధ్యం కాదు. కానీ గందమారన్ నమ్మకం కోల్పోక ముందుకు సాగాడు. ఇలా చాలదూరం వెళ్ళిన తర్వాత ఒక పెద్ద జలపాతం కొండ మీదినుంచి

పడుతున్న శబ్దం వినిపించింది. ఆ శబ్దం వినవచ్చిన చోటుకు వెళ్ళి చూసినప్పుడు, అక్కడ నదికడ్డంగా ఒక గట్టు కట్టబడివుండడం కనిపించింది. అక్కడ నీరు నిలిచి, తర్వాత పల్లంలోకి అతివేగంగా దూకి సుడులు తిరుగుతూ వెళ్ళింది.

వంతిదేవుని శరీరం అంతదూరం వచ్చివుంటే ఆ పెద్ద పల్లంలో పడి మునిగిపోయివుంటుంది. మళ్ళీ బయటకు రావడానికి చాల రోజులు పడుతుంది. ఒక వేళ బయటకు రాక మరుగైపోయినా పోవచ్చు. కాబట్టి ఇక వెతుక్కొంటూ ముందుకు వెళ్ళడంలో అర్థం లేదు.

గందమారన్ ఇలా ఆలోచిస్తుండగానే, గట్టును దాటుకొని ఏదో ఒక నల్లని వస్తువు నీటిప్రవాహంతోబాటు పడడం కనిపించింది. ఆహా! అదే వంతిదేవుని శరీరమైవుండాలి! ఈ భూలోకాన్ని విడిచి ఒక మహాద్రోహి తొలగిపోయాడు! వాడి పాపాలను దేవుడు మన్నించుగాక! - కానీ అది సాధ్యమా? వాడి పాపాలను దేవుడు కూడ మన్నించలేడు! ఆ పాపాల ఫలితాన్ని వాడు మరుజన్మలో అనుభవించే తీరాలి కద?

ఏదేమైనా కానీ, ఈ లోకంలో వాడి జీవితం ముగిసింది! ఇకమీదట వాడి గురించి మనం దిగులుపడనవసరం లేదు. తంజావూరుకు తిరిగి వెళ్ళి తదుపరి కార్యాలను చూసుకోవచ్చు.

ఇలా తీర్మానించుకొని గందమారన్ వచ్చినదారినే వెనుదిరిగాడు. ఆహా! తంజావూరులో అతడి కోసం ఎంత పెద్ద నిరాశ వేచివుంది! తాను శూలం విసిరి చంపి నది వెల్లువలో పడేలా చేసినవాడు వంతిదేవుడు కాడు, - యువరాజు మధురాంతకుడు అని తెలిసినప్పుడు గందమారన్ ఎలా అదిరిపడతాడు? అతడికి తన కాళ్ళ కింది భూమి బద్దలైపోతున్నట్లనిపించినా ఆశ్చర్యపడనవసరం లేదు కద?

~~~
~~~

# అధ్యాయము - 67

## "నేను రాజ్యం వద్దన్నాను!"

**పళువేట్టరయ్యర్లు**, శంబువరయ్యర్ మొదలైన చిన్న/సామంతరాజుల బృందం ముందుకు వెళ్ళగానే ఆళ్వార్ కట్టియాన్ తన మనుషులను తీసుకొని సేందన్ అముదన్ పూలతోటవైపు నడిచాడు. పూలతోటకు సమీపాన ఒక చెట్టు కింద మధురాంత దేవరు ఎక్కివచ్చిన పల్లకీ, దాని బోయీలు నిలబడివున్నారు. వారిని విచారించి, యువరాజు తిరిగి వచ్చేంతవరకు వారక్కడ వేచివున్నారని తెలుసుకొన్నాడు. తర్వాత ముందుకు వెళ్ళి పూలతోటలో ప్రవేశించాడు. తనతో వచ్చిన మనుషులకు మెల్లని గొంతులో ఆ తోటనంతా చుట్టి వచ్చి వెతికి చూడమని చెప్పి, తాను మాత్రం గుడిసె వాకిలి ముందు వెళ్ళి నిలబడ్డాడు. లోపల గొళ్ళెం పెట్టిన తలుపుకు చెవి ఆనించి విన్నాడు. సేందన్ అముదన్, పూంగుళలి దిగులుతో మాట్లాడుకోవడం వినిపించింది. మధ్య మధ్య, ఎవరో మరణావస్థలో మూలుగుతున్న శబ్దం కూడ వినవచ్చింది.

తోటను చుట్టి వెతికడానికి వెళ్ళినవారిలో ఒకడు అతిత్వరలో తిరిగి వచ్చాడు. అతడు తీసుకొని వచ్చిన వస్తువులను తిరుమలై నంబి తలుపు సందునుంచి వస్తున్న వెలుతురులో గుచ్చి చూశాడు. అవి యువరాజు మధురాంతకులు అలవాటుగా ధరించే కిరీటం, రత్నహారం, బాహువలయం మొదలైన ఆభరణాలని గ్రహించాడు. వాటితోబాటు మధురాంతకులు ఉత్తరీయంగా ధరించే పట్టు పీతాంబరం కూడ ఉంది. వీటిని చూడగానే ఆళ్వార్ కట్టియాన్ మనసులో కలిగిన తృప్తి అతడి ముఖంలో ప్రతిఫలించింది.

"సరే; వెతికింది చాలు. తక్కినవారిని కూడ ఇక్కడికి పిలు. అందరూ చేత ఆయుధాలు ధరించి సిద్ధంగా ఉండండి!" అని చెప్పేసి, అళ్వార్ కట్టియాన్ గుడిసె తలుపును మెత్తగా తట్టాడు.

లోపలినుంచి ఉత్తరం రాకపోగా, మళ్ళీ తలుపును బలంగా తట్టాడు.

"ఎవరక్కడ? ఇక్కడేం పని?" అని పూంగుళలి ప్రశ్నించడం వినిపించింది.

"అమ్మా! నేనే ఆళ్వార్ కట్టియాన్ అనబడే తిరుమలై నంబి. దయచేసి తలుపు తెరిచి కరుణించాలి. ముఖ్యమైన కార్యముంది!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

వెంటనే కాలి చప్పుడు వినిపించింది. పూంగుళలి తలుపు దగ్గరకొచ్చి, "అలా ఏమంతటి ముఖ్యమైన కార్యముంది మీకిక్కడ? మీరేమో వీరవైష్ణవులు. ఇదేమో శివభక్తుల గుడిసె. ఈ ఇంటి యజమానికి ఒంట్లో బాగలేదు. రాత్రిపూట వచ్చి ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు?" అన్నది.

ఆళ్వార్ కట్టియాన్, "సముద్రకుమారీ! నేను వీరవైష్ణవుడినే. అందుకే దుష్ట శిక్షణ, శిష్టపాలన చేయవచ్చాను. తలుపును వెంటనే తెరవకపోతే, విరగగొట్టి తెరవవలసి వస్తుంది!" అన్నాడు.

"వైష్ణవా! అలాంటి వీరాధివీరులా మీరు? మీ వీరత్వాన్ని మాదగ్గర చూపేందుకా వచ్చారు?" అని పూంగుళలి గుడిసె తలుపును ధడాల్మని తెరిచింది. ఆమె గుండ్రటి కళ్ళనుంచి కోపాగ్ని జ్వాలలు వీచాయి.

~

ఆళ్వార్ కట్టియాన్ మీద కోపం చూపదలచిన పూంగుళలి అతడి వెనక కొందరు వీరులు నిలబడివుండడాన్ని చూసి అదిరిపడింది. వెంటనే కోపాన్ని తమాయించుకొని, "అయ్యా! ఇదేమి? వీరెవరు? ఎందుకని ఇక్కడికి వచ్చారు? మీతోబాటే వచ్చారా?" అని అడిగింది.

"అవును, నాతోబాటే వచ్చారు. రాజకార్యంమీద వచ్చారు. వీరి కార్యాన్ని అడ్డుకొనేవారు రాజ్యాంగ శిక్షకు లోనుగావలసి వస్తుంది!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"భలే రాజకార్యం! భలే రాజ్యాంగ శిక్ష! ఇలాంటి మాటలు వినే అవసరం తప్పి ఎప్పుడు కోడిక్కరైకి వెళ్ళి సముద్రపుటలల శబ్దాన్ని వింటూ నెమ్మదిగా కాలం గడుపబోతున్నామోననిపిస్తూంది. అదలా ఉండనీ. వీరందరినీ కాస్త దూరాన నిలబడమని చెప్పి మీరు మాత్రం లోపలకు రండి. ఈ పూరి గుడిసెలో ఏం రాజ్యాంగ కార్యముందో నాకు తెలియడం లేదు. దాన్ని చూసేందుకు మీరొక్కరే చాలా? బావ అదిగో మంచం మీద పడుకొని వేదనపడుతున్నాడు. వీళ్ళు లోపలికి వస్తే ఆయన అదిరిపడతాడు, అందువల్ల ఆయన ఆరోగ్యం ఇంకా దెబ్బ తింటుంది!" అన్నది పూంగుళలి.

అళ్వార్ కట్టియాన్ గుడిసె లోపలికి ప్రవేశించగానే తానే తలుపు మూసి గొళ్ళెం పెట్టాడు.

"పూంగుళలీ! నీ మాటలు చాల ఆశ్చర్యకరంగా ఉన్నాయి. రాజ్యాంగ విషయాలమీద నీకెప్పుడు ఇంతటి చిరాకు పుట్టింది? పట్టపు యువరాజును పెళ్ళి చేసుకొని సింహాసనమెక్కే ఉద్దేశం ఏమైంది? అలాంటప్పుడు రాజ్యాంగ కార్యాలలో పూర్తిగా శ్రద్ధ చూపే తీరాలి కద?" అన్నాడు తిరుమలై.

"అయ్యా, వైష్ణవా! ఆ ఉద్దేశాన్ని నేను పూర్తిగా వదిలేశాను. గత కొన్నిరోజుల్లో రాజ్యభారం ఎంతటి కష్టమైన కార్యం, ఎంతటి మనోవేదన కలిగించే విషయం అన్నది తెలుసుకొన్నాను. పట్టపు సింహాసనానికి పది కోసుల దూరం కూడ నేను సమీపించడానికి ఇష్టపడడం లేదు. వైష్ణవా! మీకు ఒక సంతోషకరమైన వార్తను తెలియజేస్తాను. నేను నా బావ సేందన్ అముదన్ని పెళ్ళి చేసుకోవడానికి నిర్ణయించుకొన్నాను. కాసేపటి క్రితం ఇక్కడికి వచ్చిన శెంబియన్ మహాదేవికి కూడ తెలియజేసి వారి ఆశీర్వాదాన్ని పొందాము. అముదన్ కాస్త కోలుకొన్న తర్వాత ఇద్దరమూ కోడిక్కరైకి వెళ్ళిపోతాము."

ఆళ్వార్ కట్టియాన్, "ఆహా! మంచి తీర్మానం చేశారు.

<< ఇహలోక కార్యాల కన్న దైవనామ స్మరణమే గొప్పదన్న ఆళ్వార్ పాశురం >>

అలా ఆళ్వార్ చెప్పారు కద? అలాగ మీరు కూడ 'రాజ్యపాలన వద్దు' అని తీర్మానించి కోడిక్కరై కడలిలో చేపలతో చేపలై బతుకుదాం అని తీర్మానించారు కాబోలు! కానీ ఎవరు చూడవచ్చారు? శిరస్సున

కిరీటం ధరించి సింహాసనం మీద ఆసీనులు కావాలని విధి లిఖితమైతే అలాగే జరిగి తీరుతుంది. వద్దంటే కూడ వదలదు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"చాలయ్యా, పరిహాసం! ఎందుకని ఇక్కడికొచ్చారని చెప్పండి!" అన్నది పూంగుళలి.

"అమ్మా! మీరు 'రాజ్యమేలే' ఆశను మాత్రం వదిలిపెట్టారా? లేక, మీరు, సేందన్ అముదన్ ఈ భూలోకంలో జీవించే ఆశనే వదిలిపెట్టేశారా? ఇది తెలుసుకొని వెళ్ళేందుకే వచ్చాను!" అన్నాడు వైష్ణవుడు.

"ఇదేం ప్రశ్న? ఈ భూలోకంలో ఇంకొంత కాలం జీవించే ఆశ మా ఇద్దరికీ ఉంది. ఈరోజే కద పెళ్ళి చేసుకోవాలని నిర్ణయించుకొన్నాము? వైష్ణవులుగారూ! మమ్మల్ని దీవించండి! బావ త్వరలో కోలుకోవాలని ఆశీర్వదించండి!" అన్నది పూంగుళలి.

"నేను దీవించేందుకు, ఆశీర్వదించేందుకు సిద్ధంగా ఉన్నాను. కానీ నా ఆశీర్వాదం వృధా కాకూడదు. మీకిద్దరికీ ఈ లోకంలో ప్రాణాలతో జీవించే ఆశ ఉంటే, పాతాళ చెరసాలలో ఉన్నవారు తప్పించుకొని పారిపోవడానికి ఎందుకు సహాయం చేశారు?" అని అడిగాడు తిరుమలై.

~

పూంగుళలి ముఖాన ఆశ్చర్యాన్ని తెప్పించుకొని, "ఇదేమి? మాకేమీ తెలియదే? ఎవరూ తప్పించుకొని పారిపోవడానికి మేము సహాయం చేయలేదే?" అన్నది.

"కరికాలన్‌గారిని హత్య చేశాడన్న నింద మోపబడి పాతాళ చెరసాలలో బంధించబడ్డ వంతిదేవుడు, ఇంకొక పిచ్చివాడు ఈరోజు తప్పించుకొని పారిపోయారు. వారి నందనవనం వరకు వచ్చారని తెలిసింది. తర్వాత రెండు గుర్రాలమీద ఇద్దరు పారిపోయారు. ఈ గుడిసె పక్కన ఒక చోట మట్టిలో రక్తం చింది వుంది. చాల మంది ఇక్కడికి వచ్చి వెళ్ళిన గురుతులు కూడ ఉన్నాయి. కాబట్టి మీరే వారు తప్పించుకొని పారిపోవడానికి సహాయం చేశారని అనుమానించవలసి వస్తుంది. ముఖ్యమంత్రి అనిరుద్ధులకు మీమీద ఉన్న అభిమానం వల్ల నన్ను పంపించారు. కొడుంబాళూర్ వేళార్ మనుషులు వచ్చివుంటే మిమ్మల్ని వెంటనే బంధించివుండేవారు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ముఖ్యమంత్రికి, మీకు చాల కృతజ్ఞతలు వైష్ణవులుగారూ! బావకు ఇక రెండు రోజుల్లో నయమైపోతుంది. వెంటనే మేము బయలుదేరి కోడిక్కరైకి వెళ్ళిపోతాము. తర్వాత ఈ తంజావూరు వైపే తొంగిచూడము. అంతవరకు రాజసేవకులెవరూ మాకిబ్బంది కలిగించకుండ మీరే సహాయం చేయాలి!" అని వేడుకొంది పూంగుళలి.

"నాకు సహాయం చేయడానికి అభ్యంతరం లేదు. కానీ మీరు నిజం చెప్పాలి. ఇక్కడ మీరు ముగ్గురు తప్ప ఇంకెవరూ రాలేదా?" అని అడిగాడు తిరుమలై.

"ఎందుకు రాలేదు? ఇప్పుడు మీరొచ్చారు! కాసేపటి క్రితం శెంబియన్ మహాదేవి, యువరాజు మధురాంతకులు వచ్చి బావ ఆరోగ్యం గురించి విచారించి వెళ్ళారు. ఇప్పుడేమో తంజావూరు కోట చుట్టూ

ఎక్కడ చూసినా యుద్ధవీరులు తిరుగాడుతున్నారు కద? ఎవరు వచ్చారో, ఎవరు వెళ్ళారో మాకెలా తెలుసు? వైష్ణవులుగారూ! మీరు మొదట అడిగిన ప్రశ్నకు మాత్రం తప్పక జవాబు చెబుతాను. ఇక్కడినుంచి తప్పించుకొని పారిపోవడానికి మేమెవ్వరికీ సహాయం చేయలేదు."

"అది సత్యవాక్యమా?"

"అవును; సత్యాన్నే చెబుతున్నాను. ఇక్కడినుంచి తప్పించుకొని పారిపోవడానికి ఎవరికీ సహాయం చేయలేదు!"

"అలాగైతే, చెరసాల నుంచి తప్పించుకొన్న వంతిదేవుడు ఇప్పుడు ఈ గుడిసెలోనే ఉండాలి!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

అతడలా చెప్పి నోరు మూసేలోపు సేందన్ అముదన్ పడుకొనివున్న కుక్కి మంచం కిందినుంచి బాధాపూరితమైన మూలుగు వినిపించింది.

~~~
~~~

# అధ్యాయము - 68

## "ఒకరోజు యువరాజు"

**సేందన్** అముదన్ పడుకొన్న మంచం కిందినుంచి వచ్చిన మూలుగును వినగానే ఆళ్వార్ కట్టియాన్, "ఆహా! అలాగా సంగతి? శివభక్తశిఖామణులారా! పాత పరమశివునిలాగ మోసం చేయనారంభించేశారా?" అంటూనే ముందుకు రాసాగాడు.

పూంగుళలి తన బొడ్లో దోపుకొన్న చురకత్తిని చటుక్కున తీసి, "వైష్ణవా! శివపరమాత్మను నిందించిన పాతకుడవైన నీవు ఇక ఒక్కక్షణం కూడ ఈ లోకంలో ఉండబోవు. ఇక ముందుకు ఒక్క అడుగు వేశావంటే వైకుంఠానికి చేరుకొంటావు!" అన్నది.

"తల్లీ! మహాశక్తీ! నీ మాటకు ఎదురుందా? వైకుంఠపదవి దొరకడం అంత సులభం కాదు. నీ చేతులారా నన్నక్కడికి పంపించేశావంటే , దాన్ని మించిన భాగ్యం నాకింకేం ఉండగలదు?" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

ఈ సమయాన సేందన్ అముదన్ లేచి వచ్చి, "పూంగుళలీ! వద్దు! చురకత్తిని బొడ్లో దోపుకో! ఈ వైష్ణవుడు శివపరమాత్మను దూషించినందువల్ల ఆయనకేమీ కొరత రాదు. అబద్ధాల వల్ల, మోసంవల్ల మంచిదేమీ జరగదు. ఈ వైష్ణవుడికి నిజం చెప్పి సహాయం కోరుదాం. ఇతడు కూడ వంతిదేవునికి స్నేహితుడే!" అన్నాడు.

"అలా రండి దారికి! కపట నాటక సూత్రధారియైన శ్రీకృష్ణపరమాత్మను కేవలం శివభక్తులు మోసం చేయగలరా? కరుణామయుడైన శ్రీమన్నారాయణుని శరణు కోరితే, ఆయన తప్పక కాపాడి కరుణిస్తాడు. 'ఆదిమూలమా!' అని ఎలుగెత్తి మొరపెట్టుకొన్న గజేంద్రుని మొసలినోటినుంచి కాపాడిన పెరుమాళ్ళు కద మా విష్ణుపరమాత్మ?"

"అవునవును! మీ పెరుమాళ్ళు వైకుంఠం నుంచి ఇక్కడికి వచ్చేలోపు మీ స్నేహితుడు ఈ భూలోకాన్నే విడిచి వెళ్ళిపోతారు!" అని చెప్పేసి పూంగుళలి మంచంవైపు వేగంగా వెళ్ళింది.

తక్కినవారు కూడ అమె వెంటనే వెళ్ళారు. మంచంకింద బట్టలతో చుట్టబడివున్న వంతిదేవుని తీసి మంచం మీద పడుకోబెట్టారు.

~

వంతిదేవుడు స్పృహలేని స్థితిలో ఉన్నాడు. కానీ అప్పుడప్పుడు బాధతో మూలుగుతున్నాడు. అందుమూలంగానే అతడింకా బతికేవున్నాడని తెలుసుకోవలసివుంది.

వాణి అమ్మ మూలికలను ఉడకబెట్టి, పసుప్పొడి చేర్చి గాయానికి కట్టేందుకు తీసుకొని

వచ్చింది. ఆళ్వార్ కట్టియాన్, సేందన్ అముదన్ వంతిదేవుని కాళ్ళు, చేతులను గట్టిగా పట్టుకొన్నారు. పూంగుళలి, వాణి అమ్మ వంతిదేవుని గాయంలో ఔషధాన్ని వేడివేడిగా పెట్టి బట్టతో కట్టారు.

అప్పుడు కలిగిన బాధవల్ల వంతిదేవునికి కాస్త స్పృహ వచ్చి కళ్ళు తెరిచి చూశాడు. ఎదురుగా ఆళ్వార్ కట్టియాన్ని చూడగానే, "వైష్ణవా! ఇలా వంచించేశావు కద! నన్నిక్కడికి రమ్మని చెప్పి, వెనకనే నన్ను పొడిచి చంపేందుకు మనుషులను పంపావా?" అని అస్పష్టంగా అనేసి మళ్ళీ స్పృహ తప్పాడు.

~

ఆళ్వార్ కట్టియాన్ మనసులో కలుగుతున్న సంకటం ముఖంలో ప్రతిఫలించింది. సగం స్పృహలో వంతిదేవుడన్న మాటలు సేందన్ అముదన్‌కి, పూంగుళలికి మళ్ళీ తన మీద సందేహం కలిగించి ఉండవచ్చని ఎంచి వారి ముఖాలను చూశాడు.

పూంగుళలి ముఖాన విరిసిన చిరునవ్వు అతడికి కాస్త ధైర్యాన్నిచ్చింది.

"వైష్ణవులుగారూ! వంతిదేవుని ఇక్కడికి పంపించింది మీరేనా?" అని అడిగింది పూంగుళలి.

"అవును, తల్లీ! కానీ వీడిని చంపేందుకు ఎవరినీ వెంట పంపలేదు."

"అదలా ఉండనీ. ఇక్కడికి ఈయననెందుకు పంపించారు?"

"తప్పించుకొని పారిపోవడానికే పంపించాను. ఈ నందనవనం పక్కనే వీడి కోసం, వీడి స్నేహితుడి కోసం రెండు గుర్రాలను కూడ సిద్ధంగా ఉంచాను..."

"మరి, ఆయన తప్పించుకొని పారిపోలేదని ఎలా తెలిసింది? ఈ గుడిసెలో ఉన్నారని ఎలా తెలుసుకొన్నారు?"

"ఇతడికోసం నేను ఉంచిన గుర్రాలమీద ఇంకొకరు ఎక్కి వెళ్ళడాన్ని చూశాను. అందుకే సందేహం కలిగింది..."

"పెరుమాళ్ళు (విష్ణువు) ఒకటి తలిస్తే, శివుడు ఇంకొకటి తలిచాడు."

"ఇదేం విచిత్రం, తల్లీ! ఇతడెలా గాయపడ్డాడు?"

""వైష్ణవులుగారూ! మీరే ఉద్దేశంతో ఈయననిక్కడికి పంపారో నాకు తెలియదు. కానీ ఈయన సరైన సమయానికి వచ్చి నేను పెళ్ళికి మునుపే విధవను కాకుండ కాపాడారు!"

పూంగుళలి ఇలా చెబుతున్నప్పుడే ఆళ్వార్ కట్టియాన్, సేందన్ అముదన్ ఇద్దరూ "ఏమది? ఏమది?" అని ఆశ్చర్యంతో అడిగారు.

సేందన్ అముదన్, "అయ్యో! నాకోసమా నా స్నేహితుడు ఈ ఆపదకు గురైనాడు?" అని వాపోయాడు.

"అందువల్లనేమి? మీరు ఈయనను తప్పించేందుకు ఎంతటి ఆపదకు లోనైవున్నారిప్పుడు?" అన్నది పూంగుళలి.

"అమ్మా! ఈ లోకంలో ఒకరు చేసిన ఉపకారానికి వెంటనే ప్రత్యుపకారం చేయడం చాల అపూర్వమైన విషయం. మంచి చేసిన వారికి చెడు చేయకుండడమే పెద్ద విషయం. వంతిదేవుడు ఇక్కడికి సరైన సమయానికి వచ్చి సేందన్ అముదన్ని కాపాడింది విచిత్రమైన విషయమే! కానీ పెళ్ళి గురించి ఏదో చెప్పారు కద? విధవ కాకుండ కాపాడాడని కూడ చెప్పారు!"

"అవును, వైష్ణవులుగారూ! కాసేపటి క్రితమే నేను, ఈయన పెళ్ళి చేసుకోవాలని నిశ్చయించుకొన్నాము. శెంబియన్ మహాదేవి ఆశీర్వాదాన్ని కూడ పొందాము. పెద్ద మహారాణి తిరిగి వెళ్ళిన పావు ఘడియకల్లా ఈయన మీదికి ఒక ఈటె దూసుకొని రానుంది. దాన్ని నేను కూడ అడ్డుకోవడానికి సాధ్యమయ్యేది కాదు. అందు వల్ల ఈయన ప్రాణానికి ఆపద వస్తే నా గతేమి? పెళ్ళికాకుండానే విధవనయ్యేదాన్ని కద?"

"కరుణామూర్తియైన పెరుమాళ్ళ దయవల్ల అలా ఏం జరగదు. శెంబియన్ మహాదేవి ఆశీర్వాదం కూడ వృధాకాదు. మీరీ ఉత్తమ పురుషుని పెళ్ళాడి చాలకాలం సంతోషంగా జీవిస్తారు. కానీ ఈ పరమసాధువైన అబ్బాయిని ఈటెతో పొడిచి చంపజూసిన పాతకుడు ఎవరై ఉండవచ్చు? వాడిని మీరు చూశారా? గుర్తు తెలిసిందా?"

"చూడకేమి? తెలియకేమి? ఆ వైద్యకుమారుడు పినాకపాణి అనబడే పాతకుడే! నా అత్త మందాకినిని అక్రమంగా పట్టుకొని వచ్చి హంతకులకు బలిచ్చింది వాడే! చోళసామ్రాజ్యంలో ఇలాంటి అక్రమాలన్నీ జరుగుతున్నాయి..."

"అదేమంత అక్రమం? దీనికన్న వెయ్యిరెట్లు జరగబోతూంది. చోళరాజ్యంలో ఈ రాత్రి అరాచకం ప్రారంభం కాబోతూంది. చిన్న, సామంతరాజుల మధ్య అంతర్యుద్ధం మొదలవబోతూంది. రాజ్యమంతటా ప్రజలు ఒకరితోనొకరు దెబ్బలాడుకొని చావబోతున్నారు! శ్రీమన్నారాయణుని దయవల్ల ఏమైన అద్భుతం జరగకపోతే ఈ నాడుకు కలగబోయే విపత్తును ఎవరూ ఆపలేరు!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"వైష్ణవులుగారూ! ఇదేమి శపిస్తున్నట్లు మాట్లాడుతున్నారు? చోళనాడు బాగుపడాలని ఆశీర్వదించకూడదా?" అన్నాడు అముదన్.

"నాడు ఏట్లో కొట్టుకు పోనీ! మనం కోడిక్కరైకి వెళ్ళిపోదాం!" అన్నది పూంగుళలి. "మనం వెళ్ళిపోవచ్చు; నా ప్రాణం కాపాడిన ఈ ఉత్తమ స్నేహితుని ఏం చేయడం?" అని సేందన్ అముదన్ అడిగాడు.

"మీరెలాగూ ఇతన్ని కాపాడలేరు. మీరిక్కడే ఉన్నా ప్రయోజనం లేదు. చెరనుంచి తప్పించుకొని పారిపోయినవారిని మళ్ళీ పట్టుకోవడానికి భటులు ఇప్పటికే నలువైపులా గాలిస్తున్నారు. త్వరలో ఇక్కడికీ వస్తారు. వాకిట నిలబడ్డ కాపలావీరులకు నేనేం సమాధానం చెప్పి తిరిగి తీసుకొని వెళ్ళాలో తెలియడం లేదు!" అన్నాడు ఆళ్వార కట్టియాన్.

"అయ్యా, వైష్ణవులుగారూ! మీరు చాల తెలివైనవారు. ముఖ్యమంత్రి అనిరుద్ధులకే మంత్రాలోచన చెప్పగలవారు. హంతకుని చేత తీవ్రంగా గాయపడ్డ ఈ వాణర్కుల వీరుని కాపాడేందుకు ఒక ఉపాయం చెబితే మీకు చాల పుణ్యముంటుంది. మేమిద్దరం మీకెన్నటికీ కృతజ్ఞులమై ఉంటాము!"

"దేవీ! అది అంత సులభంకాదు!"

"అయ్యా! నిమిషనిమిషానికి నాకు మర్యాద అధికమౌతుందేమిటి? నిన్నటివరకు నన్ను 'పడవ నడిపే పిల్ల' అని పిలిచారు. కాసేపటి క్రితం 'అమ్మణీ/అమ్మా' అని పిలిచారు. ఇప్పుడు 'దేవీ' అని సంబోధిస్తున్నారు. కాసేపైన తర్వాత 'రాకుమారీ' అని పిలుస్తారు కాబోలు!"

"అవును, రాకుమారీ! ఇదిగో ఇక్కడ స్పృహ తప్పిపడివున్న ఈ వీరుని కాపాడాలంటే దానికి ఒకే ఒకదారి మాత్రమే ఉంది. మిమ్మల్ని పెళ్ళాడబోయే ఈ భాగ్యశాలి 'ఒకరోజు యువరాజు' కావాలి! ఆయన యువరాజైతే మీరు రాకుమారే కద?"

"వైష్ణవులుగారూ! ఇదేం పరిహాసం! నేనేమిటి? ఒకరోజు యువరాజును కావడమేమిటి? ఎందుకని?" అని అడిగాడు అముదన్.

"నాకొక్కడికి మాత్రం తెలిసిన రహస్యాన్ని ఇప్పుడు మీకిద్దరికీ చెప్పబోతున్నాను, వినండి:- లేదు! మొదట ఇది చూడండి!" అని చెప్పి ఆళ్వార్ కట్టియాన్ తనతో తీసుకొని వచ్చిన మూటను విప్పి వారికి చూపించాడు.

~

మధురాంతకుడు మునుపు ధరించిన రత్నకిరీటం, రత్నహారం, బాహువలయం ధగధగ మెరిశాయి.

"ఆహా! ఇవి యువరాజు మధురాంతకులు ధరించినవి కద? కాసేపటి క్రితం మేమే ఇక్కడ చూశాం కద?" అన్నాడు అముదన్.

"ఇవి ఎక్కడ దొరికాయి?" అని అడిగింది పూంగుళలి.

"ఈ నందనవనం కంచె పక్కన దొరికాయి. నేను చెప్పబోతున్న రహస్యాన్ని వినండి. ఉత్తరనదీతీరం వెంబడి నేను వస్తున్నప్పుడు రెండు గుర్రాల మీద ఇద్దరు వేగంగా వెళుతుండడాన్ని చూశాను. అవి నేనిక్కడ వంతిదేవుని కోసం, అతడితోబాటు చెరసాల నుంచి తప్పించుకొన్న ఒక పిచ్చివాడి కోసం ఇక్కడ వదిలిపెట్టి వెళ్ళిన గుర్రాలు. ఆ పిచ్చివాడు మీకు కూడ తెలుసు కద?"

"అవును, తెలుసు. పాండ్యవంశపు మణిమకుటం, రత్నహారం గురించి కనిపించినవారందరికి చెబుతుండేవాడు..."

"వాడే! ఉత్తరనదీతీరం వెంబడి వెళ్ళిన ఆ రెండు గుర్రాల్లో ఒకదానిమీద వాడున్నాడు. ఇంకొక గుర్రంమీదున్నది యువరాజు మధురాంతకులలాగ తోచింది. ఇక్కడికి వచ్చిన తర్వాత అది నిర్ధారమైంది."

“ఇదేం వింత? యువరాజు మధురాంతకులు ఎందుకని తమ ఆభరాణలను తీసి విసిరేసి పరుగెత్తాలి?”

“అదే నాకూ తెలియడం లేదు. ముఖ్యమంత్రికి చెప్పి పరుగెత్తి పారిపోయినవారిని వెంబడించేందుకు మనుషులను పంపబోతున్నాను. కానీ అంతలోపల ఇక్కడ ఒక పెద్ద వైపరీత్యం జరగబోతుందని భయపడుతున్నాను...”

“ఏం వైపరీత్యం జరుగుతుంది?”

“పళువేట్టరయ్యర్లు, వారి పక్షానికి చెందిన చిన్న/సామంతరాజులు ఇదిగో ఇప్పుడు తంజావూరు కోటను సమీపిస్తున్నారు. కొడుంబాళూర్ వేళార్, ముఖ్యమంత్రి, మలైయమాన్ వారిని స్వాగతించేందుకు కోట వాకిట వేచివున్నారు. రాజ్యహక్కు గురించి సమరసంగా చర్చించి తీర్మానించాలని చక్రవర్తి కోరిక, ఆజ్ఞ. కానీ, పళువేట్టరయ్యర్లు సమరస సంభాషణ ప్రారంభించేందుకు ముందు, 'మధురాంతకులెక్కడ?' అని అడుగుతారు. వారు కనిపించడం లేదనగానే కొడుంబాళూర్ వేళార్ మీదికి దూకుతారు! సేనాధిపతే పొన్నియిన్ సెల్వన్‌కి పట్టం కట్టాలని మధురాంతకులను చంపించేశారని నిందారోపణ చేస్తారు. కొడుంబాళూర్ వేళార్ అందుకు తగిన ఉత్తరమిచ్చినా, దాన్ని నిరూపించలేరు. వెంటనే భయంకరమైన అంతర్యుద్ధం మొదలౌతుంది. చోళనాడు అతిత్వరలో ఛిన్నాభిన్నమవుతుంది!”

“అంతలోపల మనమిక్కడినుంచి బయల్దేరి వెళ్ళిపోదాం!”

'దేవీ! అది జరగని కార్యం!”

“మరి, ఏం చెబుతున్నారు?”

“ఈ కిరీటాన్ని, ఆభరణాలను సేందన్ అముదన్ కాసేపు ధరించనీ. పొన్నియిన్ సెల్వన్‌గారిని ఎక్కించుకొని వచ్చిన ఏనుగును నేను తీసుకొని వస్తాను. దానిమీద ఈయన ఆసీనులు కానీ. నా మనుషులను 'మధురాంతకులకు జయహో!' అని ఘోషిస్తూ ఏనుగు ముందు, వెనక వెళ్ళమని చెబుతాను. మధురాంతకులు ఎక్కి వెళ్ళిన పల్లకి కూడ ఇక్కడే ఉంది. అందులో వంతిదేవుని దాచిపెట్టి తెర వేద్దాం. దేవీ! మీరు పల్లకి పక్కనే నడిచి రండి. తక్కినదంతా నాకు వదిలిపెట్టండి!” అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

“ఇదేం పిచ్చి ఆలోచన?” అన్నాడు సేందన్ అముదన్.

“ఈయన కిరీటం ధరిస్తే ఎవరూ గుర్తుపట్టలేరా, ఏమి?” అన్నది పూంగుళలి.

“రాత్రివేళ ఏనుగు మీద కూర్చొన్నవారిని ఎవరు గుర్తుపట్టగలరు? సందేహం కలిగితేనే కద పరీక్షగా చూడబోతారు? మీతోబాటు నేనూ రాబోతాను. మీ అందరినీ కోట లోపల ముఖ్యమంత్రి ఇంటికి భద్రంగా చేర్చడం నా బాధ్యత. ఈ వాణర్కులవీరుని కాపాడేందుకు ఇంకేదారీ లేదు!”

ఇంకాసేపు వాదించిన తర్వాత సేందన్ అముదన్, పూంగుళలి ఆళ్వార్ కట్టియాన్ ఆలోచనకు

సమ్మతం/ఆమోదం తెలిపారు.

~~~
~~~

# అధ్యాయము - 69

## "కత్తికి కత్తి!"

**పళువేట్టరయ్యర్లు**, శంబువరయ్యర్ల గోష్టి తంజావూరు కోట వాకిలిని సమీపించినప్పుడు కడలి-కడలి గుద్దుకొన్నట్లు తోచింది.

"చోళనాడు ధనాధికారి, పన్ను విధించే దేవరు, ముప్పైయారు యుద్ధాలలో అరవైనాలుగు గాయాలను భరించిన వీరాధివీరులు పెద్ద పళువేట్టరయ్యర్ విజయం చేస్తున్నారు!" లాంటి బిరుదులను ఒక్కొక్క సామంతరాజు గురించి వందిమాగధులు ఘోషించారు. అలాగే కొడుంబాళూర్ వేళార్, మలైయమాన్ల బిరుదులు మారుమోగాయి. మధ్యమధ్య కొమ్ము బూరాలు, శంఖాలు మోగాయి.

కోట వాకిట ఉన్న సేనాధిపతి పెద్ద వేళార్, మలైయమాన్, ముఖ్యమంత్రి అనిరుద్ధులు మొదలైనవారు కింద నేలమీద నిలబడివుండడం వల్ల పళువేట్టరయ్యర్లు కూడ తమ తమ వాహనాల మీది నుంచి కిందకు దిగవలసివచ్చింది.

తమను వాహనాల మీదినుంచి దిగేలా చేసి కోట లోపలికి నడిపించి పిలుచుకొని వెళ్ళేందుకే అలా సేనాధిపతి మొదలైనవారు స్వాగతపు ఏర్పాట్లు చేశారని చిన్న పళువేట్టరయ్యర్ భావించారు. అలాగే తక్కిన వారివద్ద కూడ చెప్పారు. సేనాధిపతి బృందంతో మాట్లాడే బాధ్యతను తమకు వదిలిపెట్టమని కోరారు.

చిన్న/సామంతరాజులు తమ వాహనాలు దిగి తమను సమీపించగానే, సేనాధిపతి పెద్ద వేళార్, "స్వాగతం! స్వాగతం! చోళసామ్రాజ్యాన్ని భరించి నిలిచే అష్టదిగ్గజాలవంటి సామంతరాజులారా! స్వాగతం! మీ రాకవల్ల చోళసామ్రాజ్యానికి, చోళకులానికి మేలు కలుగుగాక!" అన్నారు.

వెంటనే చిన్న పళువేట్టరయ్యర్, "అవునయ్యా! మా రాకవల్ల చోళరాజ్యానికి మేలు కలగనీ! అలాగే మీ పోకవల్ల కూడ మేలు కలగనీ!" అనగానే పెద్ద వేళార్ కళ్ళు ఎర్రబారాయి.

"అయ్యా! చోళసామ్రాజ్యం అభివృద్ధి కోసం, చోళకులం కీర్తిప్రతిష్టల కోసం నలువైపులా వెళ్ళడమే కొడుంబాళూర్ వేళార్ కుల సంప్రదాయం. నా ప్రియసహోదరుడు చిన్న వేళార్ లంక యుద్ధంలో అసువులుబాసిన విషయం జగద్విదితం. నేను కూడ కొన్ని రోజుల మునుపటి వరకు లంకలోనే ఉన్నాను. కోట గోడల మధ్య భద్రంగా ఉంటూ అంతఃపురాలను, బొక్కసాలను కాపాడుతూ కాలక్షేపం చేయడం కూడ మేమెరుగం. మీ రాకవల్ల, నా పోకవల్ల చోళకులానికి మేలు కలుగుతుందని నిశ్చయమైతే, ఒక ఒక్కక్షణం కూడ నేనిక్కడ ఉండను!" అని గర్జించారు పెద్ద వేళార్.

~

అప్పుడు ముఖ్యమంత్రి కలగజేసుకొని, "రాజకుల దీపికలారా! మీ అందరి రాకవల్ల

చోళకులానికి మేలే కలుగుతుందనడంలో సందేహమేమి? మీరొక్కొక్కరూ చోళకులం కోసం తరతరాలుగా కష్టపడ్డవారు, చోళకులం కోసం ప్రాణాలర్పించినవారు మీ ఒక్కొక్కరి పరంపరలోను ఉన్నారు. ఇప్పుడు, ఎప్పుడూ చోళనాడుకు మీ సహకారం, సేవ కావలసివుంటాయి. ఇందువల్లనే పరాంతక సుందరచోళ చక్రవర్తి మీ ఇద్దరి మధ్య కలిగిన భేధభావం గురించి విచారిస్తున్నారు. తమ ప్రియపుత్రులు, వీర పాండ్యుని తలగొన్న వీరాధివీరుడైన ఆదిత్య కరికాలన్ అకాలమరణం వల్ల కలిగిన మహాదుఃఖాన్ని కూడ పక్కకు పెట్టి మీ అందరి మధ్య ఐకమత్యం నెలకొల్పేందుకు ఆహ్వానించారు. పట్టపు హక్కు గురించి, తక్కిన విషయాల గురించి కూడ చక్రవర్తి సమక్షాన సమరసంగా మాట్లాడి పరిష్కరించుకొందాం. రాజకుల పెద్దలారా! మీ అందరినీ చాల వేడుకొంటున్నాను. ప్రధమ పుత్రుని కోల్పోయిన దుఃఖంలో మునిగివున్న చక్రవర్తి మనసును మీ ఎత్తిపొడుపు మాటలతో గాయపరచకండి!" అని వేడుకొన్నారు.

ఈ మాటలు అక్కడ సమావేశమైన అందరి మనసుల్లోను బాగ పదిలమైనాయి. తమ సొంత కోపతాపాలను వెలిబుచ్చుకోవడానికి అది తగిన సమయం కాదని గ్రహించారు.

వెంటనే చిన్న పళువేట్టరయ్యర్, "ముఖ్యమంత్రీ! చక్రవర్తి కోరిక మేరకే నడుచుకోవడానికి సిద్ధంగా ఉన్నాము. చక్రవర్తి దర్శనం మాకెప్పుడు దొరుకుతుంది? ఈ రాత్రే చూడగలమా? చక్రవర్తి కోరికను ఆయన నోరార తెలుసుకోగోరుతున్నాము!" అన్నారు.

"దళపతీ! మీ కోరిక న్యాయమైనదే! అది నెరవేరుతుందనడంలోను  సందేహం లేదు. కానీ చక్రవర్తి దేహారోగ్యం, మనఃస్థితి మీరందరూ ఎరుగుదురు. రాత్రి కాగానే చక్రవర్తి శరీర బాధలు, మనోవేదన అధికమౌతున్నాయి. అదీగాక, సామంతరాజులతో పట్టపు హక్కు గురించి మాట్లాడేముందు చక్రవర్తి శెంబియన్ మహాదేవితో చివరిమాటగా మాట్లాడగోరుతున్నారు. వారి మనసును మార్చేందుకు ఒక చివరి ప్రయత్నం చేయగోరుతున్నారు. దేని గురించి అని మీకు తెలుసు. కాబట్టి రేపు పగలు గడిచేలోపు చక్రవర్తి మీ అందరినీ ఆహ్వానిస్తారు. ఈ రాత్రి మీరందరూ కోట లోపలికొచ్చి తమ తమ అంతఃపురాల్లో నెమ్మదిగా గడపాలని కోరుకొంటున్నాను. కోట లోపల అంతఃపురాలు లేని వారికి పెద్ద వేళార్ తగిన ఏర్పాట్లు చేయిస్తున్నారు."

~

చిన్న పళువేట్టరయ్యర్ మళ్ళీ అడ్డొచ్చి, "ముఖ్యమంత్రీ! మాకు విడిది వసతులవసరం లేదు. యుద్ధరంగాల్లో బయలు ప్రదేశాల్లో విడిది చేసి అలవాటుపడ్డవాళ్ళం  మేము. చక్రవర్తి మమ్మల్ని రేపే చూడబోతున్నారంటే, ఈ రాత్రి మేము కోట లోపలికి రావలసిన అవసరమేమి?" అన్నారు.

"మీమీ అంతఃపురాలలో మీరు విడిది చేయక, బయట ఉండవలసిన అవసరమేమి?" అని ప్రశ్నించారు ముఖ్యమంత్రి.

"దళపతి కాలాంతక గండరు కోట లోపలికి వచ్చి విడిది చేసేందుకు భయపడుతున్నారు

కాటోలు!" అన్నారు సేనాధిపతి.

"భయమా? అదెలా ఉంటుంది? నలుపా? ఎరుపా? దానికి కొమ్ములుంటాయా? రెక్కలుంటాయా? లంకాయుద్ధం నుంచి పరుగెత్తి వచ్చిన పెద్ద వేళార్‌కి బహుశ తెలిసి ఉండవచ్చు!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

ఇదేమిటి? వీరిద్దరూ ఒకరితోనొకరు దెబ్బలాడకుండ అడ్డుకోవడమెలాగో తోచక ముఖ్యమంత్రి మాటలుడిగి నిలబడగా, పెద్ద పళువేట్టరయ్యర్ ఆకాశం దద్దరిల్లేటట్లు హుంకరించి ముందుకు వచ్చారు.

ఆయనను అందరూ చాల గౌరవమర్యాదలతో వీక్షించారు.

"తమ్ముడూ! కొడుంబాళూర్ వేళార్ ఒక విశిష్టమైన వంశపరంపరలో వచ్చినవారు. వేళార్ కులస్థులు ఇచ్చిన మాట తప్పరు. పెద్ద వేళార్ మనకు రక్షణ ఇస్తామని చెబుతున్నప్పుడు, మనం కోట లోపలికి వెళ్ళడానికి అభ్యంతరమేమి?" అని అడిగారు పెద్ద పళువేట్టరయ్యర్.

"అన్నా! మనకు ఇంకొకరి రక్షణ అవసరం లేదు. వాగ్దానం కూడ అవసరం లేదు. మన ఒరల్లో ఉన్న కత్తులు, ముప్పైయారు వేల వీరుల శూలాలు ఉన్నాయి. ఈ తంజావూరు కోట దళపతిని నేను; కోట మళ్ళీ నా చేతికి వస్తే తప్ప మనం కోట లోపల వెళ్ళేందుకు సమ్మతించను!" అన్నారు కాలాంతక గండరు.

సేనాధిపతి పెద్ద వేళార్ పెద్ద పళువేట్టరయ్యర్ని చూసి, "అయ్యా! చక్రవర్తి ఆజ్ఞాపిస్తే ఆ విధంగానే చేయ సిద్ధంగా ఉన్నాను!" అన్నారు.

"చక్రవర్తి ఆజ్ఞ మేరకేనా ఈయన కోట కైవసం చేసుకొన్నారు?" అని అడిగారు పెద్ద పళువేట్టరయ్యర్.

"లేదు; ఖడ్గబలంతోనే కోటను కైవసం చేసుకొన్నాను!" అన్నారు పెద్ద వేళార్.

"ఖడ్గబలంతో మళ్ళీ కోటను కైవసం చేసుకొంటాను! ఇప్పుడే పరీక్షించి చూద్దాం!" అని చెబుతూనే చిన్న పళువేట్టరయ్యర్ కత్తి పిడి మీద చేయి వేశారు.

~

పెద్ద పళువేట్టరయ్యర్ తమ తమ్ముని చేతితో ఆపి, "తమ్ముడూ! కత్తి దూసేందుకు ఇది కాదు సమయం! చక్రవర్తి కోరిక మేరకు మనమిక్కడికి వచ్చాం!" అన్నారు.

"అన్నా! కోట లోపల ప్రవేశించగానే ఈయన మనని చెరపట్టి బంధించరని నమ్మకమేమి? చక్రవర్తి ఆజ్ఞ కోసం వేచివుండక, ఉన్నట్లుండి కోటను ముట్టడించి ఆక్రమించిన ఈయనను ఎలా నమ్మమంటారు?" అని అడిగారు చిన్న పళువేట్టరయ్యర్.

"ఈయనను నమ్మే కద మన స్త్రీకులాన్నంతటినీ ఈ కోట లోపల వదిలిపెట్టి బయటికి వచ్చావు? యువరాజు మధురాంతకులను కూడ వదిలిపెట్టి వచ్చావు?" అన్నారు పెద్దాయన.

"అది పొరబాటేమోనని ఇప్పుడు సందేహిస్తున్నాను. యువరాజు మధురాంతకులకు గనక ఒక

చిన్న హాని కలిగిందని తెలిస్తే కొడుంబాళూర్  వంశాన్ని సమూలంగా తుడిచి పెట్టేస్తాను!" అని గర్జించారు చిన్న పళువేట్టరయ్యర్.

ఇంతవరకు నిర్లక్ష్యంగా మాట్లాడుతున్న సేనాధిపతి బూది విక్రమ కేసరికి ఇప్పుడు కొండంత కోపమొచ్చింది. ఆ స్థలంలో మరుక్షణం ఒక పెద్ద విపరీతమైన యుద్ధం జరగబోతుందేమోననిపించింది.

అదృష్టవశాన అదే సమయాన కోట వాకిట ఏదో కలకలం వినవచ్చింది. అందరి ఆసక్తి, ధ్యాస అటువైపు మళ్ళింది.

కాసేపటి క్రితం ముఖ్యమంత్రి అనిరుద్ధులు తమను సైగచేసి పిలిచిన ఆళ్వార్ కట్టియాన్ వద్దకు వెళ్ళారు. అతడాయనకు ఒక రహస్య సమాచారం తెలియజేశాడు. అది విని ఆయన పళువేట్టరయ్యర్లు, పెద్ద వేళార్ నిలబడ్డ చోటికి వచ్చారు. వస్తున్నప్పుడు, చిన్న పళువేట్టరయ్యర్ మధురాంతకుల గురించి అన్న మాటలు ఆయన చెవిన పడ్డాయి.

"దళపతీ! యువరాజు మధురాంతకుల గురించి ఎందుకు దిగులు? ఆయనకు ఎవరి వల్లనూ ఎటువంటి హానీ కలగబోదు. కాసేపటికి మునుపు కూడ మధురాంతకులు, ఆయన తల్లి శెంబియన్ మహాదేవి కోట బయటకు వెళ్ళారు. కోవెలలో పుష్పకైంకర్యం చేసే సేందన్ అముదన్ని చూడవెళ్ళారు..." అని చెప్పి ముగించేలోపు దళపతి అడ్డొచ్చారు.

"అవును. తల్లీకొడుకులు కోటనుంచి బయటికొచ్చారు. కానీ తల్లిగారు మాత్రమే కోట లోపలికి తిరిగి వెళ్ళారు!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

"ఆహా! అది మీకెలా తెలిసింది?" అని అడిగారు ముఖ్యమంత్రి.

"ముఖ్యమంత్రీ! మీవద్ద మాత్రమే తెలివైన గూఢచారులున్నారనుకొంటున్నారా? బయటికొచ్చిన మధురాంతకులు తిరిగి కోట లోపలికి వెళ్ళలేదు. దానికి కారణాన్ని నేను తెలుసుకోవాలి!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

~

ముఖ్యమంత్రి వదనం చిరునవ్వుతో విరిసింది. అదే సమయాన కోట వాకిట, "యువరాజు మధురాంతకులకు జయహో!" అన్న ఘోష వినిపించింది.

అందరూ ఆ ఘోష వినిపించిన దిక్కున చూశారు.

కోట వాకిలి గుండా లోపల ప్రవేశిస్తున్న ఏనుగు మీద యువరాజు కిరీటం, తక్కిన ఆభరణాలు ధరించిన "మధురాంతకులు" ఆసీనులైవున్నారు.

ఏనుగు పక్కన మూసిన పల్లకి వస్తూంది.

"దళపతీ! యువరాజు మధురాంతకులు కోట లోపలికి తిరిగి వెళ్ళేందుకు కాస్త ఆలస్యమైంది. వాణి అమ్మగారి కుమారుడు సేందన్ అముదన్ గుర్రం మీదినుంచి కింద పడి తీవ్రంగా గాయపడ్డాడు.

అతన్ని పల్లకిలో ఎక్కించుకొని కోట లోపలికి తీసుకొని రమ్మని శెంబియన్ మహాదేవి చెప్పేసి తాము ముందుగా వెళ్ళిపోయారు. తల్లి కోరికను కుమారులు నెరవేరుస్తున్నారు. అముదన్ని పల్లకిలో ఎక్కించుకొని తాము ఏనుగు మీద వెళుతున్నారు. త్వరలోనే పట్టాభిషేకం జరిగేటప్పుడు పట్టపుటేనుగు మీద ఊరేగింపు రావలసివుంటుంది కదా? అందుకోసం ఇప్పుడే అభ్యాసం చేస్తున్నారు!" అన్నారు ముఖ్యమంత్రి.

~~~
~~~

# అధ్యాయము - 70

## కోట కాపలా

**కోట** లోపల ప్రవేశించిన ఏనుగును, పల్లకిని దళపతి కాసేపు నిశితంగా పరీక్షించి చూశారు.

"విచిత్రంగా ఉందే!" అన్నారు.

"ఏది విచిత్రం? ఏం విచిత్రం?" అని అడిగారు ముఖ్యమంత్రి.

"యువరాజు మధురాంతకులు ఇంతటి ఆర్బాటంతో కోట లోపలికి వెళ్ళడమే! యువరాజు చాల సంకోచస్తులు కద? పల్లకిలో తెర దించి కద ప్రయాణం చేసేవారు?"

"ఏనాడైనా ఒకరోజు సంకోచం విడవాలి కద? అతిత్వరలో పట్టం కట్టుకోబోతున్నారు కద?"

"మధురాంతకులకు పట్టం కట్టడమని తీర్మానం చేయబడిందా? ఎవరు తీర్మానించారు?"

"ఏల? చక్రవర్తే! మనమందరం చక్రవర్తి వద్దకు వెళ్ళి మన సమ్మతం తెలియజేయగానే..."

"చక్రవర్తి తీర్మానించాక, మనం సమ్మతం తెలిపి ఏం ప్రయోజనం? కొడుంబాళూర్ సైన్యాలు కద సమ్మతం తెలియజేయాలి? వాళ్ళు కాపలా కాస్తున్న ఈ కోట లోపలికి ఆయన ఇంతటి కుతూహలంతో ఏనుగెక్కి వెళ్ళడం విచిత్రమే!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

ఏనుగు వెళ్ళిన దిక్కున కొన్ని అడుగులు నడిచి తిరిగి వచ్చారు.

తర్వాత పెద్ద పళువేట్టరయ్యర్ని చూసి, "అన్నా! మీరందరూ కోట లోపలికి వెళ్ళేందుకు నేనడ్డురాను. కానీ నేను మాత్రం రాను. నిన్నటివరకు నా కాపలా కిందవున్న కోట లోపలికి ఇప్పుడు ఇంకొకరి అధికారానికి కట్టుబడి నేను రాలేను. నా మనసొప్పదు. మీరు కోట లోపలికి వెళ్ళి చక్రవర్తిని దర్శించి ఆయన కోరిక ఏమని తెలుసుకోండి. నేను మన సైన్యంతోబాటు బయటే ఉండబోతున్నాను. పైగా, వంతిదేవుని వెతుక్కొంటూ గందమారన్ వెళ్ళాడు. అతడే వార్త తీసుకొని వస్తాడని తెలుసుకోవడానికి నేను చాల ఆసక్తితో ఎదురుచూస్తున్నాను. వంతిదేవుడు ఎలా పాతాళ చెరసాలనుంచి తప్పించుకొన్నాడు, ఎవరి సహాయంతో బయటపడ్డాడన్నది తెలుసుకోవాలి. నన్ను మన్నించి/క్షమించి మీరందరూ కోట లోపలికి వెళ్ళండి!" అన్నారు.

కొడుంబాళూర్ ఏదో చెప్పబోయారు. అంత లోపల పెద్ద పళువేట్టరయ్యర్ అడ్డొచ్చి, "సేనాపతీ! ఈ మూఢునికి బుద్ధి చెడింది. వాడెక్కడికైనా ఏగనీ. మనం వెళదాం, రండి!" అన్నారు.

~

కానీ మరునాడు చక్రవర్తి సమక్షాన ఈ వివరాలన్నీ తెలియజేయబడ్డప్పుడు ఆయన పెద్ద పళువేట్టరయ్యర్ అభిప్రాయాన్ని ఒప్పుకోలేదు. కాలాంతక గండరు వచ్చే తీరాలని పట్టుబట్టారు.

"నా ప్రియమైన దళపతులారా! మీరందరూ నా నమ్మకానికి పాత్రులు. కానీ మీరందరి కన్న అధికంగా కోట దళపతి కాలాంతక గండరి మీదే నమ్మకంగొనివున్నాను. ఆయన ఎందుకు రాలేదు? ఆయన రానంతవరకు మీ అందరినీ నేను ఆహ్వానించిన కార్యం నెరవేరదు!" అన్నారు.

పెద్ద పళువేట్టరయ్యర్, "చక్రవర్తీ! క్షమించాలి. నేనొప్పుకొనే ఏ తీర్మానాన్ని నా సహోదరుడు ఒప్పుకొంటాడు! అతడు స్వయంగా వచ్చే తీరాలనేం లేదు!" అన్నారు.

"ధనాధికారీ! రామునికి లక్ష్మణుడు ఎలా వినయవిధేయుడో, మీకు కాలాంతక గండరు అంతే విధేయులన్న విషయం లోకమెరిగినదే. అయినా కూడ, ఆయనీరోజు ఎందుకిక్కడికి రాలేదు? ఇంతకు మునుపు నేనిక్కడ జరిపిన మంత్రలాలోచనలన్నిటిలోను ఆయన తప్పక పాల్గొనేవారు. ఆయనను సంప్రదించకుండ  మనం ఏ తీర్మానమూ తీసుకోము. అటువంటి ధీమంతుడైనా వీరులు ఇప్పుడు మాత్రం ఎందుకు రాకుండాలి?" అని అడిగారు చక్రవర్తి.

ముఖ్యమంత్రి అనిరుద్ధులు "మహారాజా! అందుకు నేను ఉత్తరమిస్తాను. కాలాంతక గండరిప్పుడు గురువును మించిన శిష్యుడైపోయారు. అన్నను మించిన తమ్ముడూ అయ్యారు. చక్రవర్తి ఆహ్వానిస్తున్నారని చెబుతున్నా కూడ, రావడానికి ఒప్పుకోలేదు. పెద్ద పళువేట్టరయ్యర్ ఎంతో బుద్ధి చెప్పినా కూడ వినలేదు! కోట లోపలికి రావడానికి ఒప్పుకోలేదు!" అన్నారు.

"కానీ ఒకటి మాత్రం మరిచిపోవద్దు! చక్రవర్తి కోరిక మేరకు మనం ఇక్కడ తీసుకొనే ఏ నిర్ణయమైనా తమకు సమ్మతమని చెప్పారు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"అయినా కూడ, చిన్న పళువేట్టరయ్యర్ ఇక్కడికి రావడానికి అభ్యంతరం చెప్పడానికి కారణమేమి? ఆయన మనసులో ఇంకా ఏమైనా విపరీత సందేహాలుదయించాయా?"

"భీతిగొన్నవాడికి నల్లనిదంతా దెయ్యమని చెబుతారు కద? ఆయనకిప్పుడు ప్రతి ఒక్క విషయం మీద కూడ సందేహమే! ఇక్కడ మధురాంతకులు భద్రంగా ఉన్నారా అని సందేహం. వంతిదేవుడు పాతాళ చెరసాల నుంచి తప్పించుకొన్న విషయమై సందేహం..."

"కాలాంతక గండరి మనసులో ఏదైనా సందేహం ఉదయిస్తే అందుకు తగిన కారణం ఉండకపోదు!" అని చక్రవర్తి అనగానే, కాసేపు అక్కడ మౌనం నెలకొంది. ఒక్కొక్కరి మనసులోను వేర్వేరు ఆలోచనలు తోచాయి.

పెద్ద పళువేట్టరయ్యర్ గొంతు సవరించుకొని, "మహారాజా! నా సహోదరుని సందేహాలకు కారణాలు ఉండవచ్చు; లేకపోనూ వచ్చు. వాడిమీద నేను నింద మోపడమూ లేదు. కానీ వాడు కోట లోపలికి రా నిరాకరించేందుకు నిజమైన కారణాన్ని చెప్పేస్తాను. ఈ తంజావూరు కోట చాలకాలం వాడి కాపలా కింద ఉందట! ఇప్పుడు పెద్ద వేళార్ అధికారం కిందికి వెళ్ళిపోయిందట! కాబట్టి వాడు ఈ కోట లోపలికి రాలేడట! వాడి ఇటువంటి అధిక ప్రసంగానికి ఎవరు మాత్రం ఏం చేయగలరు?" అన్నారు.

"ఏల? న్యాయం చేకూర్చవచ్చు!" అన్నారు సుందర చోళ చక్రవర్తి.

~

చక్రవర్తి ఇలా చెప్పగానే అందరూ మౌనందాల్చారు.

మళ్ళీ సుందర చోళ చక్రవర్తి, "అమాత్యులారా! చోళవంశ కీర్తిప్రతిష్టలకంతా మూలాధారమైన కారణం ఈ చోళవంశ రాజులు న్యాయమైన ఋజుమార్గంలో నడుచుకొంటూ రావడమే. నా కుల పూర్వీకులలో ఒకరు తమ ప్రియపుత్రుడు లేగదూడ మీదికి తన తేరును తోలి చంపాడన్న కారణానికి అతడికి మరణదండన విధించిన వృత్తాంతం మీరందరూ ఎరుగుదురు. ప్రజలకు న్యాయం చేకూర్చినవారు తమ కుటుంబీకులకు ఎటువంటి న్యాయం చేకూర్చివుంటారు? తమ పరిపాలనకు తోడుగా నిలబడ్డ దళపతికి ఎటువంటి న్యాయం చేకూర్చివుండాలి? నేను మాత్రం ఆ సంప్రదాయానికి విరుద్ధంగా నడుచుకొని చోళవంశానికి, చోళకులానికి అపకీర్తి తేవాలా? చిన్న పళువేట్టరయ్యర్‌నుంచి కోట కాపలాను పెద్ద వేళార్ కైవసం చేసుకొన్నది పెద్ద పొరబాటు. నా ప్రియపుత్రుని అకాల మరణం వల్ల కలిగిన దుఃఖంలో మునిగివుండడం వల్ల, చిన్న పళువేట్టరయ్యర్‌కి జరిగిన అన్యాయాన్ని గురించి నేను చింతించలేదు! సేనాపతీ! కోట కాపలాను మీరు మళ్ళీ చిన్న పళువేట్టరయ్యర్‌కి ఒప్పజెప్పేయాలి!" అన్నారు.

~

కొడుంబాళూర్ పెద్ద వేళార్ తెల్లముఖం వేశారు. అప్పుడు తిరుక్కోవలూర్ మలైయమాన్ ముందుకొచ్చి, "అయ్యా! తంజావూరు కోట కాపలా చిన్న పళువేట్టరయ్యర్ అధిపత్యంలో ఉన్నప్పుడు, ఆ బాధ్యతను ఆయన సరిగ్గా నెరవేర్చినట్లు కనిపించడం లేదు కద? ఒక కుట్రదారుడు ఈ కోట లోపలికి దూరి, అంతఃపురం వరకు వచ్చి, మీమీద శూలం విసిరేంతవరకు తావిచ్చారు కద? ఎవరో ఒక మూగది అడ్డువచ్చి మీ ప్రాణాలను కాపాడవలసివచ్చింది కద? అమె ఆ సమయాన అక్కడ లేకపోయివుంటే ఏం జరిగేది? ఈ తంజావూరు ఆయుధశాలలో లెక్కలేనన్ని కత్తులు, శూలాలు, ఈటెలు పేర్చి పెట్టి ఏం ప్రయోజనం? ఇక్కడ ఈ కోట కాపల కోసమని ఇంతమంది వీరులు, వేళక్కార దండు ఉండి ఏం ప్రయోజనం? దళపతి చిన్న పళువేట్టరయ్యర్ తమ బాధ్యతను సరిగ్గా నెరవేర్చారని చెప్పగలమా? ఆయననుంచి మన పెద్ద వేళార్ కోట కాపలా కైవసం చేసుకొన్నది ఎలా తప్పవుతుంది?" అని అడిగారు.

"మామా! విధి క్రూరత్వానికి ఎవరి మీద నింద మోపి ఏం ప్రయోజనం? మీ ముద్దుల మనుమడు ఆదిత్య కరికాలన్‌ని మీరు కాపాడగలిగారా? మీరందరూ చేరి ఎన్నో ప్రయత్నాలు చేశారు కద?" అని ఎదురు ప్రశ్నించారు చక్రవర్తి.

"దాని గురించి విచారించడం చాల అవశ్యం చక్రవర్తీ! కడంబూర్ మాళిగలో జరిగిన ఆ ఘాతుకానికి కారణమెవరని ఇంకా విచారణ జరగలేదు. దాని గురించిన నిజం కూడ ఇంకా బయట పడలేదు!" అన్నారు మలైయమాన్.

"పెద్ద పళువేట్టరయ్యర్ రాక కోసం వేచివున్నాము. ఆయన వచ్చేశారు కాబట్టి ఇక విచారణ మొదలుపెట్టాలి!" అన్నారు పెద్ద వేళార్.

"విచారణ ప్రారంభించే ముందు, హత్యానేరం మోపబడ్డ వంతిదేవుడు పాతాళ చెరసాల నుంచి ఎలా తప్పించుకొన్నాడు? దానికి బాధ్యులు ఎవరు అన్నది కూడ ఇప్పుడే విచారించాలి!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"అవును; అది కూడ విన్నాను. సేనాధిపతీ! వంతిదేవుడు పాతాళ చెరసాల నుంచి ఎలా తప్పించుకొని పారిపోయాడు? దానికి ఎవరు బాధ్యులు?" అని అడిగారు చక్రవర్తి.

"చక్రవర్తీ! దానికి ముఖ్యమంత్రి అనిరుద్ధులు జవాబివ్వాలి!" అన్నారు పెద్ద వేళార్.

"ప్రభూ! ఆ బాధ్యతను నేనే తీసుకొంటాను. వంతిదేవుడు తప్పించుకొని పారిపోయింది నేను చేసిన ఒక చిన్న పొరబాటు వల్లనే. కానీ అతన్ని మళ్ళీ తీసుకొచ్చి ఒప్పజెప్పే బాధ్యతను కూడ నేనే తీసుకొంటాను. దానికి తగిన శిక్షను అనుభవించేందుకు నేను సిద్ధం" అన్నారు అనిరుద్ధులు.

"ఆ బాధ్యతను ముఖ్యమంత్రిగారికన్న ముందు నా స్నేహితుడు గందమారన్ అప్పటికే తీసుకొన్నాడు! పాతాళ చెరసాలనుంచి తప్పించుకొని పారిపోయినవారిని తరుముకొంటూ వెళ్ళాడు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

~

ఈ సంభాషణలు కొనసాగుతున్నప్పుడు ఆ గదిలో స్త్రీమణులిద్దరున్నారు. వాళ్ళు చక్రవర్తిని వాణమాదేవి, యువరాకుమారి కుందవైదేవిగార్లే.

వంతిదేవుని తరుముకొని గందమారన్ వెళ్ళాడన్న వార్త వినగానే కుందవైదేవి ముఖంలో కలిగిన మార్పును ముఖ్యమంత్రి అనిరుద్ధులు మాత్రమే గమనించారు.

ఆయన పార్థిబేంద్రుని చూసి, "పల్లవకుమారా! నీ స్నేహితుడు గందమారన్ చాల సమర్థుడే! కానీ కొన్ని కార్యాలను అతన్ని నమ్మి ఒప్పజెప్పడం వల్ల ప్రయోజనం లేదు. అతని సొంత కడంబూర్ మాళిగలో విడిది చేసిన చోళదేశపు కంటిపాపలాంటి యువరాజును అతడు కాపాడలేకపోయాడు కద? చెరసాలనుంచి పారిపోయిన వంతిదేవుని అతడు వెతికి పట్టుకోగలడా? నాకలా తోచడం లేదు!" అన్నారు.

తమ చివరి వాక్యంలోని నిగూఢార్థాన్ని కుందవై రాకుమారి తెలుసుకొందని కూడ గమనించారు.

"పైగా, వంతిదేవుడు, గందమారన్ గాఢస్నేహితులని కద విన్నాను?" అన్నారు పెద్ద వేళార్.

"అది పాత కథ, సేనాపతీ! చోళకులానికి ద్రోహం చేసినవారెవ్వరూ శంబువరయ్యర్ కులానికి స్నేహితులు కానేరరు!" అన్నారు శంబువరయ్యర్.

"దాని గురించి ఇప్పుడేల? వంతిదేవుని తిరిగి పట్టుకొని వచ్చి ఒప్పజెప్పే బాధ్యతను

ముఖ్యమంత్రి తీసుకొన్నారు కద? సేనాధిపతీ! తంజావూరు కోట కాపలాను మళ్ళీ చిన్న పళువేట్టరయ్యర్‌కి ఒప్పజెప్పవలసిందే!" అన్నారు సుందరచోళులు.

"చక్రవర్తి ఆజ్ఞ అదే అన్న పక్షాన, దాన్ని శిరసావహించి నెరవేర్చడానికి సిద్ధంగా ఉన్నాను!" అన్నారు సేనాధిపతి పెద్ద వేళార్. ఆయన మనసులో పొంగుతున్న కోపం ఆయన మాటల్లో ధ్వనించింది.

"కొడుంబాళూర్ మామా! మీరు నాకన్న వయసులోను, అనుభవంలోను చాల పెద్దవారు. నా తండ్రిలాగ మీమీద భక్తిగొన్నవాడిని. మిమ్మల్ని సేనాజ్ఞాపించగలనా? నా అభిప్రాయాన్ని చెప్పాను. ఈ విషయంలో ఇక్కడున్న తక్కినవారి అభిప్రాయాన్ని తెలుసుకొని ఇక ముందు చేయవలసిన కార్యం గురించి తీర్మానం తీసుకొందాం కద?" అన్నారు చక్రవర్తి.

"నాకది ఇష్టం లేదు! చిన్న పళువేట్టరయ్యర్ తమ కర్తవ్యాన్ని నెరవేర్చడంలో తప్పారు! కాబట్టి కోట కాపలా బాధ్యతను మళ్ళీ ఆయనకు ఇవ్వకూడదు!" అని ఖండించి చెప్పారు తిరుక్కోవలూర్ మలైయమాన్.

"ముఖ్యమంత్రి అభిప్రాయమేమి?" అని అడిగారు చక్రవర్తి.

"జరిగింది జరిగిపోయింది/గతం గతః ఇప్పుడు కోట కాపలాను మార్చడం వల్ల కొన్ని కష్టాలు రావచ్చు. రాజ్యహక్కును గురించి చర్చించి తీర్మానం చేసేందుకు మీరు మా అందరినీ పిలిపించారు. ఆ విషయం ముగిసిన తర్వాత ఈ విషయాన్ని తీసుకొందాం" అన్నారు ముఖ్యమంత్రి.

"చిన్న పళువేట్టరయ్యర్ లేకుండ మనం ఏ నిర్ణయమూ తీసుకోవడం సాధ్యం కాదు! ధనాధికారీ! మీ మాటేమి?" అని అడిగారు సుందర చోళ చక్రవర్తి.

"మలైయమాన్ మాటను నేను ఒప్పుకొంటాను. నా సహోదరుడు తన కర్తవ్యపాలనలో విఫలుడైనాడు. బాధ్యతను సరిగ్గా నెరవేర్చలేదు. కాబట్టి కోట కాపలా బాధ్యతను అతడికి తిరిగి ఇవ్వనవసరం లేదు" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్.

~

ఆయన సహోదరవాంఛ అక్కడున్నవారందరూ ఎరుగుదురు. కాబట్టి ఆయన వెలిబుచ్చిన అభిప్రాయం అందరికీ ఆశ్చర్యాన్ని కలిగించింది. దాని కన్న, చక్రవర్తి ఇంకా ముందుకు చెప్పుకొచ్చిన మాటలు ఇంకా ఆశ్చర్యాన్ని, దిగ్భ్రాంతిని కలిగించాయి.

"ధనాధికారీ! చిన్న పళువేట్టరయ్యర్ ఆయన కర్తవ్యపాలనలో తప్పలేదు. నేనూ, మీరే అయన మాట వినలేదు. ఆయన అప్పుడప్పుడు చేస్తూ వచ్చిన హెచ్చరికలను మనమిద్దరమూ పట్టించుకోలేదు. అందరూ వినండి:- మదురై వీరపాండ్యుని ఆపత్కాల సహాయకుల గురించి చిన్న పళువేట్టరయ్యర్ తరచూ నన్ను హెచ్చరించేవారు. వాళ్ళు ఈ కోట లోపలే సంపర్కాలు ఏర్పరచుకొన్నారని కూడ చెప్పారు. కాబట్టి నా మాళిగకు, అంతఃపురానికి కూడ ఇంకా గట్టి కాపలా పెట్టాలని నొక్కి చెప్పారు. ధనాధికారి అంతఃపురానికి,

నా అంతఃపురానికి మధ్యవున్న రహస్యమార్గాన్ని మూసేయాలని కూడ హెచ్చరించారు. పెద్ద పళువేట్టరయ్యర్ పట్ల ఆయన సహోదరుడు ఎంతటి భక్తిభావంగొన్నవారన్న విషయం మీకందరికీ తెలిసిందే/విదితమే. కానీ ధనాధికారి మీద ఆయన నాకు చాడీ చెప్పారు. తమ అన్నగారు మోసపోతున్నారని, ఆయన అంతఃపురం లోపలికే కుట్రదారులు వస్తున్నారని సందేహం వెలిబుచ్చారు. పెద్ద పళువేట్టరయ్యర్ని తమ అంతఃపురంనుంచి ఇంకొక అంతఃపురానికి వెళ్ళిపొమ్మని చెప్పాలని, బొక్కసాన్ని కూడ ఇంకొక చోటికి మార్చేయాలని కూడ సలహా ఇచ్చారు. ఆ హెచ్చరికలనన్నింటినీ నేనుచెవిన వేసుకోనే లేదు..."

ఈ సమయాన పెద్ద పళువేట్టరయ్యర్ తమ గొంతునొకసారి సవరించుకొన్నారు. అది విని సుందర చోళులు తమ మాటలను ఆపారు.

"చక్రవర్తీ! నామీద మీకున్న కరుణాభావం వల్ల మీరు చెప్పకుండ వదిలేసిన విషయాలను నేను చెబుతాను. నా అవమానాన్ని మీరు బయటపెట్టగోరుకోలేదు. దాన్ని నేనే వెలిబుచ్చుతాను. వృద్ధాప్యంలో మోహపువలలో పడి నేను పెళ్ళి చేసుకొన్న నందిని గురించి నా సహోదరుడు నన్ను హెచ్చరించాడు. మాంత్రికుడు/మంత్రవాది అని చెప్పుకొంటూ ఆమె దగ్గరకు వస్తూ పోతున్న ఆ కుట్రదారుల నాయకుడిని గురించి కూడ నన్ను హెచ్చరించాడు. మాయ మోహపువలలో పడి, కళ్ళుండీ గుడ్డివాడినైన నేను ఆ హెచ్చరికలను చెవిన వేసుకోలేదు. అయినా కూడ వాడు తన కర్తవ్యాన్ని పాలించడంలో తప్పినవాడే! వాడికంత ఖచ్చితంగా తెలిసినప్పుడు ఆ పాతకిని, ఆమె దగ్గరకు వస్తూ పోతున్న కుట్రదారులను కనిపెట్టి హతమార్చివుండాలి. నేను అడ్డుపడితే, అన్న అని చూడక చేతనున్న కత్తితో నన్నుకూడ చంపివుండాలి. అలా చేయకపోవడం తన కర్తవ్యాన్ని సరిగా నిర్వహించనట్లే కద?" అని పెద్ద పళువేట్టరయ్యర్ తమ పెద్ద, గంభీరమైన గొంతుతో చెప్పింది విన్నవారందరికీ ఒళ్ళు జలదరించింది. ఆయన మాటల్లో తొణికిన మనోవేదనను గ్రహించి ప్రతిఒక్కరు వేదన పడ్డారు.

"ధనాధికారీ! కాస్త ఓపిక పట్టండి! తమ సహోదరుడు చిన్న పళువేట్టరయ్యర్ తమ కర్తవ్యపాలనను దృష్టిలో ఉంచుకొని అలా చేయదగినవారే. అందుకు నేనే అడ్డు వచ్చాను. మీ గురించి గాని, మీ యువరాణి గురించి గాని ఏదైనా చాడీలు చెప్పేటట్లయితే నా ముఖమే చూడవద్దని ఆజ్ఞాపించాను. మిమ్మల్ని మీ అంతఃపురంనుంచి ఇంకొక చోటికి మార్చేసి, అక్కడ వేళక్కార దండును నియమించే ఆలోచనను కూడ తిరస్కరించాను. అలా భయపడుతూ బతుకుతూ ఈ ప్రాణాలనెందుకు కాపాడుకోవాలని ఎదురు ప్రశ్న వేశాను. నా మనసులో గూడుకట్టుకొన్న వేదన, నా దేహాన్ని పట్టి పీడిస్తున్న అనారోగ్యం నాకు నా జీవితంమీదే విసుగు, విరక్తిగొనేలాగ చేశాయి. పళువూర్ మామా! నాకుగాని, నా కుటుంబానికిగాని కలిగిన ఎటువంటి హానికీ మీరు బాధ్యులు కారు; మీ సహోదరులు కూడ బాధ్యులు కారు. వాటిని నేనే కొని తెచ్చుకొన్నాను!"

~

ఇలా చక్రవర్తి చెప్పుకొస్తూంటే, పెద్ద పళువేట్టరయ్యర్ కళ్లనుంచి ధారగా అశ్రువులు స్రవించసాగాయి.

"అవును; చిన్న పళువేట్టరయ్యర్ మీద అణుమాత్రం నింద కూడ లేదు; వంతిదేవుడనే యువకుడు మొట్టమొదట ఇక్కడికి వచ్చినప్పుడే నా సహోదరుడు హెచ్చరించాడు. అతడు ఈ కోట బయట పల్లకిలో వచ్చిన పళువూర్ రాణితో ఏదో రహస్యంగా మాట్లాడినట్లు కూడ చెప్పాడు. వాడు కూడ చోళకుల శత్రువులతో చేరి కుట్ర చేస్తూండవచ్చని సందేహపడ్డాడు. పళువూర్ ముద్ర చూపించి ఆ అబ్బాయి కోట లోపల ప్రవేశించిన వైనం, పళువూర్ మాళిగలోని అంతఃపురపు రహస్యమార్గం ద్వారానే అతడిక్కడినుంచి తప్పించుకొని పారిపోయివుండాలని చెప్పారు. అదంతా నేను పట్టించుకోక నిర్లక్ష్యం చేస్తూ వచ్చాను. బుద్ధిలో సాటిలేని మేధావి మన ముఖ్యమంత్రి అనిరుద్ధులు, నా ప్రియపుత్రిక కుందవై కూడ వంతిదేవుని విషయంలో మోసపోయారు. అతడి మూలంగా ముఖ్యమైన తాళపత్ర సందేశాలు పంపారు..."

అప్పుడనిరుద్ధులు, "చక్రవర్తీ! ఒకవేళ నేను మోసపోయినా పోవచ్చు. కానీ యువరాకుమారి కుందవైదేవి అలా మోసపోదు. వంతిదేవుని ద్వారా తాళపత్ర సందేశాలు పంపించి, అతని నడవడికను గమనిస్తూ, అతడి మీద నిఘా వేసివుంచమని చెప్పారు. నేను ఆవిధంగానే నా శిష్యుడు ఆళ్వార్ కట్టియాన్ని లంకకు కూడ పంపించాను; కంచికి కూడ అతన్ని వెన్నంటి వెళ్ళమని పంపాను..."

"అలాగే ఉండనీ. మీరిద్దరూ అతడి చేత మోసగించబడలేదనే అనుకొందాం. పాతాళ చెరసాల నుంచి అతడు, ఇంకొకడు తప్పించుకొని పారిపోయిన విషయం నిజమే కద? దాన్ని మీరెవ్వరూ కాదనలేరు కద? చిన్న పళువేట్టరయ్యర్ అధీనంలో ఈ కోట ఉండివుంటే, అది జరిగేదా? కాబట్టి సేనాధిపతీ! చిన్న పళువేట్టరయ్యర్‌ని రప్పించి వెంటనే ఆయనకు తంజావూరు కోట కాపలా బాధ్యతను ఒప్పజెప్పండి! కావాలంటే నా ఆజ్ఞ అని కూడ భావించండి!" అన్నారు చక్రవర్తి.

"అలాగే ప్రభూ! మేమిప్పుడు సెలవు తీసుకోవచ్చా?" అని అడిగారు సేనాధిపతి బూది విక్రమకేసరి. ఆయన స్వరంలో ఉక్రోషం ధ్వనించింది. పళువేట్టరయ్యర్ల విషయంలో చక్రవర్తి చూపిన ప్రేమాదరాలు, నేరాన్ని ఓర్చుకొని గుణాలను మెచ్చుకొన్న తీరు సేనాధిపతి మనసును కదిలించేశాయి. ఆయన ఒక్కక్షణం నిశ్చేష్టులైపోయారు.

"అవును. ఇప్పుడందరూ సెలవు తీసుకోవచ్చు. చిన్న పళువేట్టరయ్యర్ కూడ వచ్చిన తర్వాత మళ్ళీ సమావేశమై ఇక మీదట జరగవలసిన కార్యక్రమాల గురించి మాట్లాడుదాం. రాజ్యహక్కు గురించి నా పెదతల్లి పెద్ద మహారాణితో నేనింకా మాట్లాడలేదు. దానికి కూడ కాస్త అవకాశం కావాలి!" అన్నారు చక్రవర్తి.

అందరూ నిష్క్రమించే సమయాన పార్థిబేంద్రుడు, "అయ్యా! మిత్రద్రోహి, రాజద్రోహియైన వంతిదేవుని పట్టి తెచ్చి ఒప్పజెప్పే బాధ్యతను ముఖ్యమంత్రి ఒప్పుకొన్నారు. దాన్ని ఆయనకు

గుర్తుచేయగోరుతున్నాను. నా ప్రాణానికి ప్రాణమైన, నా ఆప్తమిత్రుడైన యువరాజు ఆదిత్య కరికాలన్‌గారి ఘోరమరణాన్ని ఇంకెవ్వరు మరిచిపోయినా కూడ, నేను మరువను, మరువలేను. ఆయన మరణానికి కారణమైన నేరస్థుడిని శిక్షించే తీరాలి!" అన్నాడు.

పెద్ద పళువేట్టరయ్యర్ వృద్ధసింహం గర్జనలాగ ఒక్కసారి గొంతు సవరించుకొన్నారు. ఏదో చెప్పబోయినవారు మళ్ళీ మనసు మార్చుకొన్నట్లు తోచింది. ఏమీ మాట్లాడక నిష్క్రమించారు. తక్కినవారు కూడ ఆయన వెంబడే వెళ్ళారు.

~

ఆ రోజు సాయంత్రమే తంజావూరు కోట కాపలా బాధ్యత చక్రవర్తి ఆజ్ఞ మేరకు చిన్న పళువేట్టరయ్యర్‌కి ఒప్పజెప్పబడింది. మొదట ఆయన దాన్ని తీసుకోవడానికి వెనుకాడారు. ఆక్షేపణలు కూడ వెలిబుచ్చారు. ఇందులో కూడ ఏదైన కుట్ర ఉండవచ్చని సందేహించారు. ఇది చక్రవర్తి విధించిన తప్పని సరి ఆజ్ఞ అని ఆయన అన్నగారు ప్రత్యేకంగా చెప్పిన తర్వాత కోట కాపలా బాధ్యతను మళ్ళీ స్వీకరించారు.

కొడుంబాళూర్ వీరులలో కొందరు తప్ప మిగిలిన వారందరూ కోట బయటకు పంపబడ్డారు. కోట వాకిట, కోట గోడల మీద కూడ పళువూర్ వీరులు మునుపటిలాగ కాపలా కాయనారంభించారు.

ఈ మార్పు విపరీత పరిణామాలకు దారి తీసింది. కొడుంబాళూర్ వీరులకు, పళువూర్ వీరులకు మధ్య తరచూ వివాదాలేర్పడి, పరిస్థితి గందరగోళమైంది.

"పొన్నియిన్ సెల్వన్‌గారికి జయహో!" అన్న ఘోషలు, "యువరాజు మధురాంతకులకు జయహో!" అన్న ఘోషలు ఒకదాని తర్వాత ఒకటిగా పోటీ పడసాగాయి.

ఈ విచిత్ర పరిణామాలు దేశమంతటా వ్యాపించాయి; సాధారణప్రజలు కూడ అందులో పాల్గొనసాగారు.

తర్వాత మూడురోజుల్లోపల చోళదేశమంతా అల్లకల్లోలమైపోయింది.

వాగ్యుద్ధాలు దెబ్బలాటలుగా మారాయి. బెత్తాలు, బడితెలు పోయి, కత్తులు శూలాలు ముందుకొచ్చాయి.

కొన్ని రోజుల క్రితం చోళదేశపు సారవంతమైన ప్రదేశాలను పడరాని పాట్లకు గురిచేసిన సుడిగాలి, నది వరదల్లాగ ఇప్పుడు ఉక్రోష పర్జన్యాలు, ఉన్మాదపు వరదలు నలువైపులా వ్యాపించి సామ్రాజ్యమే నాశనమైపోతుందనే భయాన్ని కలిగించసాగాయి,

~~~
~~~

# అధ్యాయము - 71

## దివ్యగర్భాన ఉదయించిన దేవరు!

**శెంబియన్** మహాదేవిని చూసి మాట్లాడాలని సుందర చోళ చక్రవర్తి చాలసార్లు చెప్పి పంపిన తర్వాత, ఆ మహిళామణి చక్రవర్తిని చూసేందుకు వచ్చారు. వారు వస్తున్న వార్త తెలిసి వాకిలి వరకు నడిచి వెళ్ళి వారి రాక కోసం వేచివుండి, వారు రాగానే వారిని స్వాగతించి పిలుచుకొని వెళ్ళారు. తమ పక్కన సింహాసనం మీద ఆసీనులు కమ్మని కోరారు.

"రారాజా! ఒకదాని మీద ఒకటిగా దుఃఖకారకమైన వార్తలను విని గాయపడిన నా మనసు మీ దేహం మళ్ళీ ఆరోగ్యంగానివుండడాన్ని చూసి తృప్తిపడుతూంది. దేవుని దయవల్ల మీరు చాలకాలం జీవించి ఈ భూలోకాన్ని పరిపాలించాలి!" అని పెద్ద మహారాణి అన్నారు.

"తల్లీ! నా కాళ్ళు మళ్ళీ జీవం పోసుకొని నేను నడవగలుగుతున్న విషయం గురించి చెబుతున్నారు మీరు. దాని గురించి నాకు కూడ తృప్తే! ఈ చోళనాడంతా వేనోళ్ళ స్తుతించే మీరు నన్ను చూసేందుకు వచ్చేటప్పుడు కూడ లేచి వచ్చి స్వాగతించలేని స్థితిలో ఉండేవాడిని. మూగది, చెవిటిది అయిన ఒక మహాత్మురాలు కనబరిచిన ప్రేమానురాగాల శక్తి వల్ల నా కాళ్ళు కోల్పోయిన శక్తిని తిరిగి పొందాయి. కాబట్టి లేచి వచ్చి మిమ్మల్ని స్వాగతించగలిగే భాగ్యం పొందాను. కానీ దేవీ! నేను ప్రాణాలతో సజీవంగా బ్రతికివుండడం గురించి తృప్తిగొనడం లేదు; ఇక చాలకాలం జీవించివుండాలనీ కోరుకోవడం లేదు. మీరు నన్నలా ఆశీర్వదించకండి. త్వరలోనే పరమశివుని పాదాలను చేరుకోవాలని ఆశీర్వదించండి!" అన్నారు సుందరచోళులు.

"చక్రవర్తీ! మీ కులపూర్వీకులందరూ వీరస్వర్గాన్నో శివపాదాలనో చేరుకొన్నారు. మీకు కూడ పరలోకంలో వారు చోటు వెతికి పెట్టివుంటారు. తగిన సమయం వచ్చినప్పుడు శివగణాలు వచ్చి మిమ్మల్ని పిలుచుకొని వెళతారు. కానీ అటువంటి పరలోకప్రాప్తికి మీరు తొందరపడితే అది సాధ్యం కాదు. ఈ లోకంలో మీరు నెరవేర్చవలసిన బాధ్యతలెన్నో ఇంకా ఉన్నాయి. ఋజువర్తనులైన మీ పరిపాలనలో ప్రజలు సంతోషంగా జీవిస్తున్నారు. శివాలయ కైంకర్యాలు దేశమంతటా జరుగుతున్నాయి. శైవులు, వైష్ణవులు, బౌద్ధులు, జైనులు మొదలైన మతస్థులందరూ మీరు దీర్ఘాయుష్కులై జీవించాలని ప్రార్థిస్తున్నారు..."

"తల్లీ! వారెవ్వరూ ఇక అటువంటి ప్రార్థనలు చేయకూడదు. నా ఆయుష్షును పొడిగించే ప్రార్థనలు నా మనోవేదనను పొడిగించే ప్రార్థనలే అవుతాయి. చోళనాడు ప్రసాదించిన వీరుల్లో వీరాధివీరుడైన ఆదిత్య కరికాలన్ని బలిచ్చేసి, నేనీ లోకంలో దీర్ఘకాలం జీవించి ఉండాలా? వాడు మరణించక మునుపే నేను మరణించివుండకూడదా...?"

"చక్రవర్తీ! పుత్రశోకం చాల క్రూరమైనది. కానీ విధి వైపరీత్యం గురించి నేను మీకు చెప్పనవసరం లేదు. కృష్ణభగవానుడు అర్జునునితో ఎన్నడూ వీడని మిత్రుడై ఉండేవాడు. రక్షించే పెరుమాళ్ళ అవతారం కృష్ణపరమాత్మ. ఆయన కూడ అరవాన్ని, అభిమన్యుని కాపాడలేకపోయాడు. అటువంటి వీరపుత్రులను కోల్పోయిన తర్వాత కూడ అర్జునుడు జీవించలేదా? కన్న కొడుకుల మీద ఆశలేనివాడా అర్జునుడు? భూమిని కాపాడేందుకు నీవు నీ ప్రాణాలను కాపాడాలి' అని శ్రీకృష్ణపరమాత్మ బోధించగా, ఆ విధంగానే అర్జునుడు జీవించాడు. చక్రవర్తీ! కృష్ణపరమాత్మ బోధ మీకు కూడ వర్తిస్తుంది."

"తల్లీ! అభిమన్యుడు యుద్ధరంగంలో అపూర్వ వీరకృత్యాలు చేసి వీరమరణం పొంది వీరస్వర్గం చేరాడు!"

"మీ కుమారుడు పరాక్రమంలో అభిమన్యునికి ఏమాత్రం తీసిపోడు కద! పన్నెండోయేట శేవూర్ యుద్ధంలో, పద్దెమినిదో ఏట వీరపాండ్యునితో చివరి యుద్ధంలోను ఆదిత్య కరికాలన్ చేసిన వీరకృత్యాలు ఈ లోకమెన్నడూ మరిచిపోదు కద! అభిమన్యుని చివరికి పలువురు శత్రువులు చుట్టుముట్టి, నిరాయుధుని చేసి, అధర్మంగా చంపారు. అదే విధంగా ఆదిత్యకరికాలన్ని కూడ కుట్రపన్ని ఒంటరివాడిగా చేసి కుట్రదారులు పలువురు చుట్టుముట్టి హత్య చేశారు..."

"తల్లీ! వాడు ఎలా మరణించాడన్నది నిశ్చయంగా తెలుసుకోగలిగితే నా మనసు ఒకింత నెమ్మదిగొంటుంది."

"జరిగిపోయినదాని గురించి ఎందుకు మనసు గాయపరుచుకోవాలి? కరికాలన్ విధి ముగిసింది;; తోకచుక్క జారి పడింది; చోళనాడు ఒక మహావీరుని కోల్పోయింది. ఎందుకు, ఎలా అని విచారించి ఏం సాధించబోతున్నాము?"

"నిజం తేటబడనందువల్ల ఎవరెవరి మీదనో సందేహం కలుగుతూంది. తల్లీ! భూమిని మోసిన ఆదిశేషునిలాగ చోళసామ్రాజ్యాన్నే భరిస్తూ వచ్చిన పెద్ద పళువేట్టరయ్యర్ మీదే కొందరు సందేహం పుట్టిస్తున్నారు; అనవసర నింద మోపుతున్నారు."

"ఆయన్నే అడిగి నిజం తెలుసుకోవచ్చు కద?"

"ఆయన్ని అడిగేందుకు ఎవరికి ధైర్యముంది? నాకు లేదు, తల్లీ! ఎలాగో ఆయన ఇందులో చిక్కుబడి మనోవేదనతో తీవ్రంగా బాధపడుతున్నారు. ఏం జరిగిందని ఆయనే చెప్పేంతవరకు ఆయనను ఎవరు ప్రశ్నించగలరు? తల్లీ! తక్కోలం యుద్ధరంగంలో నా పెదతండ్రి రాజాదిత్యులు ఏనుగు మీద మరణించి వీరస్వర్గం చేరిన తర్వాత చోళసైన్యం ఛిన్నాభిన్నమై చెదరి పరుగెత్తసాగింది. పారిపోతున్న వీరులను అడ్డగించి ఆపి మళ్ళీ సైన్యబలం కూడదీసుకొని కణ్ణరదేవుని సైన్యాలను తరిమికొట్టిన మహావీరులు పెద్ద పళువేట్టరయ్యర్. ఆనాడు ఆయన అలా ఒక మహావీరకృత్యం చేసివుండకపోతే ఈనాడు చోళసామ్రాజ్యమే ఉండేది కాదు. తక్కోలం యుద్ధంలో ఆయన శరీరాన్ని అరవైనాలుగు గాయాలు తీవ్రంగా బాధించాయి.

అయినా కూడ ఆయన అలిసిపోక యుద్ధరంగంలో నిలబడి విజయం సాధించారు. ఆ తర్వాత ఆయన యుద్ధరంగానికే వెళ్ళకూడదని కట్టుబాటు చేసి ధనాధికారిగా నియమించాము. అటువంటి పెద్దాయనను - నా తండ్రికి సమానమైనవారిని - నేనేం అడగగలను?"

"నిజం బయటపడేందుకు వేరే దారే లేదా?"

"వాణర్‌కుల యువకుడు వంతిదేవుడు కరికాలన్ (మృత)శరీరం చెంత ఉండగా చూశామంటున్నారు కొందరు. అతన్ని అడిగి నిజం తెలుసుకొందామనుకొన్నాను. వాడు కూడ పాతాళ చెరసాలనుంచి తప్పించుకొని పారిపోయాడు. దీనిగురించి చిన్న పళువేట్టరయ్యర్ ముఖ్యమంత్రి మీద నింద మోపేందుకు ఆస్కారం ఉంది."

~

ఇంతవరకు మౌనంగా ఉన్న కుందవై ఇప్పుడు కలిగించుకొని, "తండ్రీ! ఆ వీరుని ఎలాగైనా తీసుకొని వచ్చి ఒప్పజెప్పే బాధ్యత ముఖ్యమంత్రి తీసుకొన్నారు కద?" అన్నది.

"బిడ్డా! ముఖ్యమంత్రి ఇలా చాలసార్లు బాధ్యత తమ మీద వేసుకొన్నారు. కానీ నెరవేరుస్తారని నమ్మకం లేదు. శంబువరయ్యర్ కొడుకు గందమారన్ పారిపోయినవారిని తరుముకొంటూ వెళ్ళాడని విన్నాను. గందమారన్ అంతగా ముందాలోచన కలవాడు కాడు; తొందరపాటెక్కువ. అందులోను శంబువరయ్యర్ కులానికి కళంకం రాకూడదన్న ఉక్రోషంగొన్నవాడు. వాడు వంతిదేవుని వెన్నంటి వెళ్ళడం నా దిగులును అధికం చేస్తూంది..."

"అయ్యా! జరిగిపోయినదాని గురించి మరిచిపోవడమే మంచిది. ఇక జరగవలసిన వాటి గురించి ఆలోచించండి."

"తల్లీ! అందుకోసమే మిమ్మల్ని పిలిపించాను. ఇక జరగవలసిన కార్యం గురించి నాకు సలహా ఇచ్చి సహాయం చేయాలి..."

"చక్రవర్తీ! మహామేధావులైన మంత్రులు పలువురు మీకు మంత్రాలోచన చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. ఈ అమాయకురాలు ఏం సలహా చెప్పగలదు? నన్ను వివాహం చేసుకొని నా జీవితాన్ని పావనం చేసిన మహాపురుషులు ఈ లోకాన జీవించివున్నప్పుడు కూడ నేను రాజ్యాంగ విషయాల్లో ధ్యాసగొనలేదు. ఆయన దేవలోకానికి పయనించిన తర్వాత శివకైంకర్యంలోనే నిమగ్నమైవున్నాను. నేనేం సలహా ఇవ్వగలను?"

"దేవీ! కోపించుకోకండి. మా చోళకులంలో ఉదయించిన స్త్రీలందరూ అమాయకులైవుండలేదు. ఇదిగో నా ప్రియపుత్రిక కుందవైని తీసుకోండి - తెలివిలో ఆమెకు సాటి నేనెవరినీ కనలేదు..."

"క్షమించాలి, చక్రవర్తీ! నేను చోళకులంలో పుట్టినదాన్ని కాను కద? మళవరయ్యర్ కులంలో పుట్టినదాన్ని కద?" అన్నారు వృద్ధ మహారాణి.

"ఏ కులంలో పుట్టినవారైనా, స్త్రీలు తెలివిమంతులై ఉండవచ్చు; పుట్టిన కులానికి, మెట్టిన కులానికి కూడ మేలు చేయవచ్చు. కొందరు స్త్రీలు ఒట్టి మొండిపట్టు పట్టేవారై ఉండవచ్చు; మెట్టినిల్లు తుడిచిపెట్టుకుపోవడానికి  కారణం కూడ కావచ్చు, తల్లీ! మీరటువంటి కులనాశనానికి కారణం కాబోతున్నారా...??"

~

చక్రవర్తి ఇలా అడగగానే, శెంబియన్ మహాదేవి నిప్పుతొక్కినట్లు విలవిల్లాడిపోయి, "చక్రవర్తీ! ఇదేం మాట? నావల్ల చోళకులం ఎందుకు నాశనం కావాలి? నేనంతటి శక్తిమంతురాలిని కాను కద?" అని కన్నీళ్ళ పర్యంతం వాపోయారు.

"దేవీ! కాస్త కఠినంగా మాట్లాడుతున్నందుకు మన్నించాలి. నా ప్రధమపుత్రుడు మరణించి, నేనింకా జీవించేవున్నానన్న నిజం నన్నింకా బాధిస్తూనే ఉంది. కానీ దీనికన్న పెద్ద దుఃఖం ఇంకొకటి సంభవించే అవకాశం ఉంది. నా ముత్తాతల కాలం నుంచి బలంగా విస్తరించి విరాజిల్లుతున్న ఈ చోళ సామ్రాజ్యం నా పరిపాలనాకాలంలో ఛిన్నాభిన్నమైపోతే, దానికన్న కఠినమైన శిక్ష నాకింకొకటి లేదు. మూడేళ్ళుగా నా ముద్దులకొడుకు కరికాలన్ని చూడకనే ఉండిపోయాను. నాకోసం వాడు కంచిలో బంగారు మాళిగను కట్టాడు. అక్కడికొచ్చి ఉండమని తరచూ సందేశం పంపి వేడుకొన్నాడు. నేను వెళ్ళలేదు. నా అనారోగ్య కారణాన్నే చెబుతూ వచ్చాను. నిజమైన కారణం అది కాదు. నేను వెళితే పళువేట్టరయ్యర్ల మీద అపనమ్మకం వల్లనే వెళ్ళానని వాళ్ళు అనుకోవచ్చు. తక్కిన చిన్నరాజులు, పెద్ద పెద్ద అధికారులు కూడ అలా భావించవచ్చు. అందువల్ల ఏం తగాదాలు వస్తాయో, ఈ చోళసామ్రాజ్యంలో ఏమేం విపరీత పరిణామాలు వస్తాయోనని సందేహించే నేను కంచికి వెళ్ళలేదు. ఒకవేళ నేను కంచికి వెళ్ళివుంటే ఈరోజు నా ముద్దులకొడుకు సజీవంగా ఉండేవాడేమో..."

"రారాజా! మీరెంతో తెలివిమంతులు; వివేకవంతులు. కానీ విధిని మీరు మార్చలేరు...!"

"అవును, తల్లీ! విధిని నేను మార్చలేను. కానీ నా కుమారుని అంతిమకాలంలో చూడలేకపోయాను కద! వాడి మనసులో గూడు కట్టుకొన్న వేదనను తెలుసుకోలేకపోయాను కద అని నేనీనాడు పశ్చాత్తాపపడకుండ ఉండేవాడిని. ఇదంతా ఎందుకు చెబుతున్నాను? విజయాలయ చోళులు, ఆయన పరంపరలో వచ్చిన వీరాధివీరులు తమ రక్తం చింది, ప్రాణాలర్పించి స్థాపించిన ఈ చోళ సామ్రాజ్యపు క్షేమం కోసం నా ఆశాపాశాలనన్నింటినీ కూకటివేళ్ళతో పెకలించి వేశానని మీకు తెలియజేసేందుకే. ఆదిత్య కరికాలన్ ఏ కారణంవల్లనో పళువేట్టరయ్యర్లకి, వారి పక్షానికి చెందిన చిన్నరాజులకు నచ్చకుండపోయాడు. మీ కుమారుడు, నా సహోదరుడైన మధురాంతకుని నా తర్వాత సింహాసనమెక్కించడానికి  ప్రయత్నాలు చేశారు. వారలా ప్రయత్నం చేయడంలో తప్పేమీ లేదు. మహాపురుషులు, శివజ్ఞాన సంపన్నులైన గండరాదిత్యుల కుమారుడు అన్ని విధాలా సింహాసనమధిష్టించడానికి అర్హుడు.. నిజానికి నేను పట్టం

కట్టుకొన్నదే పొరబాటు. అప్పుడు పెద్దలందరూ చెప్పారు కద అని వారి మాట కాదనలేక తలవొగ్గాను. దాని ఫలితాన్ని ఇప్పుడు అనుభవిస్తున్నాను. నా ప్రియపుత్రుని బలి ఇచ్చేసి నేనింకా ప్రాణాలతో ఉన్నాను! ఇంత దుఃఖమే నాకు చాలు. ఇక ఈ మహారాజ్యం అంతర్యుద్ధం వల్ల నాశనం కావడాన్ని నేను నా కళ్ళారా చూడలేను. తల్లీ! అటువంటి నాశనం చోళసామ్రాజ్యానికి కలగకుండ మీరు అడ్డుపడి సహాయం చేయాలి!" అన్నారు సుందర చోళ చక్రవర్తి.

~

శెంబియన్ మహాదేవి తన కళ్ళలో ఉబికిన కన్నీళ్ళను తుడుచుకొని, "రారాజా! మీరు చెప్పిందేమీ నా బుద్ధికి సరి అని తోచలేదు. నా భర్త తర్వాత నా మరిది, మీ తండ్రి అయిన అరింజయ దేవరు సింహాసనమధిష్టించారు. నా పతి కోరిక మేరకే అది జరిగింది. అరింజయుల తర్వాత మీరే సింహాసనమెక్కాలన్నది కూడ ఆయన కోరికే. ముల్లోకాలను ఒక ఛత్రం కింద ఏలిన మీ తాతగారు పరాంతక చోళులు కూడ అలాగే ఏర్పాటు చేసి వెళ్ళారు. కాబట్టి మీరు చోళసింహాసనమధిష్టించడంలో అనుచితమేమీ లేదు. నా పతి శివభక్తిలో నిమగ్నులై ఆత్మానుభూతి సంపన్నులై విరాజిల్లారు. రాజకీయ కార్యాలలో ఆయన మనసు నిమగ్నం కాలేదు. కాబట్టి ఆయన కాలంలో చోళసామ్రాజ్యం కుంచించుకొంటూ రాసాగింది. మీరు పట్టానికి వచ్చిన తర్వాత మళ్ళీ రాజ్యం విస్తరించి బలం పుంజుకొంది. ఉత్తరాన, దక్షిణాన కూడ తలెత్తిన శత్రువులు తుడిచిపేయబడ్డారు. ఇలా రాజ్యం బలపడి, విస్తరింపబడి పైకి రావడానికి ముఖ్యకారణం  మీ ముద్దుల కుమారుడు ఆదిత్య కరికాలన్. లోకమెరుగ అతడికి యువరాజు పట్టాభిషేకం చేయబడింది. దాన్ని మార్చి నా కుమారునికి రాజ్యాధికారమివ్వడానికి నేను సమ్మతించడమెలా సాధ్యం? నేను సమ్మతించినా, లోకం సమ్మతిస్తుందా? రాజ్యప్రజలు సమ్మతిస్తారా? చక్రవర్తీ! అంతర్యుద్ధం వల్ల రాజ్యం ఛిన్నాభిన్నం కావడాన్ని అడ్డుకోవడం గురించి కాసేపటి క్రితం చెప్పారు. ఆదిత్య కరికాలన్ని తోసిపుచ్చి నా కుమారునికి పట్టం కట్టివుంటే, అదే అంతర్యుద్ధానికి దారి తీసివుండదా? రాజ్యం ఛిన్నాభిన్నమైవుండదా?" అని అడిగారు.

"అవును, తల్లీ! అందుకనే నేను కూడ వెనుకంజ వేస్తున్నాను. అందరినీ సమాధానపరిచినా, అందరూ సమ్మతించదగ్గ ఏర్పాటు చేయడానికి ప్రయత్నిస్తున్నాను. అది కలిసి వచ్చేలోపు విధి అడ్డం వచ్చేసింది; కరికాలన్ ఆయువు తీరింది. తల్లీ! ఇప్పుడు నా కర్తవ్యమేమి? మీరే చెప్పండి! ఈ రాజ్యభారాన్ని నేనిక మోయలేను. ఎవరికైనా ఈ రాజ్యభారాన్ని ఒప్పజెప్పేసి, కరికాలన్ చివరి కోరిక నెరవేర్చబోతున్నాను. కంచిలో నాకోసమని నా ముద్దుల కుమారుడు కట్టించిన బంగారు మాళిగలో నా చివరి రోజులు గడపాలనుకొంటున్నాను. ఇప్పుడు ఎవరికి పట్టం కట్టాలో చెప్పండి. అరుళ్మొళి వర్మ కన్న మధురాంతకుడు ప్రాయంలో పెద్దవాడు. నాకన్న చిన్నవాడైనా, వాడికి పినతండ్రి స్థానంలో ఉన్నాను. కొడుంబాళూర్ వేళార్, తిరుక్కోవలూర్ మలైనమాన్ అరుళ్మొళికి పట్టం కట్టాలంటున్నారు. ధర్మానికి,

న్యాయానికి, కులసంప్రదాయానికి విరుద్ధంగా ఈ కార్యాన్ని నేనెలా చేయగలను? లేక మీరు మాత్రం దానికెలా భాగస్వాములు కాగలరు? తల్లీ! నాకు సహాయం చేయండి! మధురాంతకునికి పట్టం కట్టేందుకు మీరు సమ్మతించండి. దాన్ని ఆధారం చేసుకొని, నేను సేనాధిపతి పెద్ద వేళార్‌ని, మలైయమాన్ని ఒప్పిస్తాను! మీ సమ్మతాన్ని, అనుమతిని తెలియజేసి ఈ చోళసామ్రాజ్యాన్ని కాపాడి పుణ్యం కట్టుకోండి!" అని వేడుకొన్నారు సుందరచోళ చక్రవర్తి.

శెంబియన్ మహాదేవి, "అయ్యా! నా సమ్మతాన్నడగకండి. శివపాదాలను చేరుకొన్న నా నాధుడు విధించిన ఆజ్ఞకు వ్యతిరేకంగా నేను నడుచుకోలేను. కానీ, రాజ్య వ్యవహారాలలో నేనిక అడ్డురాను. మధురాంతకుని పిలిపించి, వాడి సమ్మతాన్ని కోరి తెలుసుకొని ఏది ఉచితమనిపిస్తే అలాగే చేయండి!" అన్నారు.

"అవునవును. మధురాంతకుని పిలిపించి అతడి సమ్మతాన్ని అడిగి తెలుసుకొన్న తర్వాతే ఈ విషయాన్ని తీర్మానించాలి. దానికి కూడ తమ సహాయం కావాలి. దేవీ! మధురాంతకుడెక్కడ?" అని అడిగారు చక్రవర్తి.

శెంబియన్ మహాదేవి తమ గొంతు పూడుకుపోగా, నాలుక తడబడగా, "మధురాంతకుడెక్కడ? గత మూడు రోజులుగా నేనూ అడుగుతున్నాను. ఎవరూ జవాబు చెప్పడం లేదు. రారాజా! నా కుమారుడెక్కడ? కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్ని పిలిపించి అడగండి!" అన్నారు.

"చిన్న పళువేట్టరయ్యర్ మిమ్మల్నే అడగాలంటున్నారు. మీరు, ముఖ్యమంత్రి అనిరుద్ధులు కూడబలుక్కొని ఏదో పన్నాగం పన్ని మధురాంతకుని దాచిపెట్టారని నింద మోపుతున్నారు. తల్లీ! ఇప్పుడు ముఖ్యమంత్రిని, చిన్న పళువేట్టరయ్యర్ని పిలిపిస్తాను. అనుమతి ఇవ్వండి!" అన్నారు చక్రవర్తి.

"అలాగే పిలిపించండి. నేను కూడ వారిని అడుగుతాను!" అన్నారు శెంబియన్ మహాదేవి.

~

కుందవై వెంటనే వాకిలివైపు వెళ్ళి అక్కడున్న కాపలా భటులకు చెప్పి పంపించింది. కాసేపటికల్లా చిన్న పళువేట్టరయ్యర్, ముఖ్యమంత్రి వచ్చారు.

చక్రవర్తి చిన్న పళువేట్టరయ్యర్ని చూసి, "దళపతీ! చోళనాడు వేనోళ్ళ స్తుతించి గౌరవించే పెద్ద మహారాణిగారు మీరడిగిన అదే ప్రశ్నను అడుగుతున్నారు. 'మధురాంతకుడెక్కడ?' అని విలపిస్తున్నారు. మధురాంతకుల గురించి మీకు తెలిసింది చెప్పండి. మీ సందేహాన్ని కూడ దాచకుండ వెలిబుచ్చండి!" అన్నారు.

చిన్న పళువేట్టరయ్యర్ ఇలా సమాధానం చెప్పారు:- "దేవిగారి శివభక్తి, ఋజుప్రవర్తన జగద్విదితమే. చోళనాడు ప్రజలు వారిని నడయాడే దైవమని స్తుతిస్తున్నారు. అలాగే నేనూ భావిస్తున్నాను. నేనిప్పుడు తెలియజేయబోయే విషయాన్ని నింద మోపుతున్నట్లు భావించకూడదు. ఏ కారణం వల్లనో

దేవిగారు తమ కుమారులు చోళ సింహాసనమధిష్టించేందుకు సమ్మతించడం లేదు; ఇష్టపడడం లేదు కూడాను. ఇది కూడ అందరూ ఎరిగినదే. మహారాణిగారికన్న నాకుగాని, తక్కినవారికి గాని తమ కుమారులమీద అధిక ప్రేమ ఉండజాలదు. కానీ మర్మభూయిష్టమైన ఈ విషయాలను వారు విడమరిచి చెప్పవలసివుంది. అందులోను చక్రవర్తి "మధురాంతకులను పిలుచుకొని రండి!" అని ఈ సేవకుని ఆజ్ఞాపించడం వల్ల నాకున్న కొన్ని సందేహాలను కూడ వెలిబుచ్చవలసి వస్తూంది. మూడు రోజుల క్రితం పెద్ద రాణిగారు, మధురాంతకులు కోటనుంచి బయటకు వెళ్ళారు. పుష్పకైంకర్యం చేసే సేందన్ అముదన్ గుడిసెకు వెళ్ళి అతడి క్షేమసమాచారాలు విచారించారు. తర్వాత దేవిగారు మాత్రమే కోటకు తిరిగి వచ్చారు. కాసేపటి తర్వాత నేను, నా అన్నగారు కోట వాకిలికి కాస్త దూరాన నిలబడి కొడుంబాళూర్ వేళార్‌తో మాట్లాడుతూ ఉన్నాము. మధురాంతకుల గురించి నేను విచారించినప్పుడు ఏనుగు - పల్లకి పరివారంతో కొందరు కోట లోపల ప్రవేశించారు. 'మధురాంతక దేవరికి జయహో!' అన్న ఘోష కూడ వినిపించింది. ముఖ్యమంత్రిగారే మాకు ఆ విశేషాన్ని చూపించారు. ఏనుగు మీదున్నది మధురాంతకులన్నారు. నాకు దాని గురించి కాస్త సందేహమేర్పడింది. తర్వాత, చక్రవర్తి ఆజ్ఞ మేరకు కోట కాపలా మళ్ళీ నా అధీనంలోకి వచ్చింది. మధురాంతకులు నా అంతఃపురంలోనే విడిద చేయడం పరిపాటి. ఆరోజు అందుగురించి విచారించలేదు. మరునాడు విచారించినప్పుడు నా అంతఃపురానికి రాలేదని తెలిసింది. తర్వాత కోటంతా వెతికి చూసి, ఎవరెవరినో విచారించి కూడ ఏమీ తెలియలేదు! కోట లోపల ప్రవేశించినవారు ఎలా మాయమైనారు? దేవిగారు, ముఖ్యమంత్రిగారు ఇప్పుడు నేను చెప్పబోయేదాని గురించి నన్ను మన్నించాలి. వారిద్దరూ ఏదో పన్నాగం పన్ని, మధురాంతకులు భీతిగొనేటటువంటి వార్తను ఆయనకు తెలియజేసి, ఈ నగరాన్ని, ఈ నాడునే వదిలి పారిపోయేటట్లు చేశారని నేను సందేహిస్తున్నాను. నేను చెబుతున్నది తప్పయితే మళ్ళీ పెద్దరాణిగారు నన్ను క్షమించాలి."

~

శెంబియన్ మహాదేవి గద్గద స్వరంతో, "దళపతీ! మీరిప్పుడు చెప్పినదంతా పూర్తిగా తప్పు. శివపరమాత్మ పాదాలమీద ఆనచేసి చెబుతున్నాను. ముఖ్యమంత్రి అనిరుద్ధులతో ఇటీవల నా కుమారుని గురించి మాట్లాడనూ లేదు; ఏ పన్నాగమూ పన్నలేదు. ఆ రోజు సాయంత్రం నేను, మధురాంతకుడు సేందన్ అముదన్ని చూడడానికి వెళ్ళింది మాత్రం నిజమే. నేనక్కడినుంచి బయలుదేరినప్పుడు మధురాంతకుడు కాసేపటి తర్వాత వస్తానన్నాడు. ఆ తర్వాత వాడిని నేను చూడనే లేదు. మూడురోజులుగా నేను కూడ వాడి కోసం వెతుకుతూనే ఉన్నాను!" అన్నారు.

"దేవిగారు చెబుతున్నదంతా ఒప్పుకొంటాను. అలాగైతే ముఖ్యమంత్రిగారే ఈ మర్మాన్ని విప్పాలి!" అన్నారు దళపతి.

"ఏ మర్మాన్ని?" అని అడిగారు ముఖ్యమంత్రి.

"దేవిగారి కుమారులు కనిపించకుండ పోయిన మర్మాన్నే!"

"దళపతీ! ఈ కోటనంతటినీ మీరు బాగా శోధించారన్నది నిజమేనా?"

"అవును; మీ అంతఃపురం తప్ప మిగిలిన అన్ని చోట్లా వెతికి చూడడమైంది."

"నా అంతఃపురాన్ని మాత్రం వదిలిపెట్టడానికి కారణం?"

"మీరు చోళసామ్రాజ్యపు ముఖ్యమంత్రి అన్న మర్యాదే కారణం!"

"ఆహా! అలాగైతే మీరు మీ కర్తవ్యాన్ని సరిగ్గా నిర్వహించలేదని చెప్పాలి. పోతే పోనీ! చక్రవర్తీ! మీకు పెదతల్లి, చోళనాడు వేనోళ్ళ స్తుతించే శివభక్త శిరోమణియైన పెద్ద మహారాణి తమ కుమారుని గురించి నాకేమీ చెప్పలేదు. నేను వారితో కూడబలుక్కొని ఏ కుట్రా పన్నలేదు. కానీ ఒకటి చెబుతాను. దేవిగారి దివ్యగర్భంనుంచి ఉదయించిన దేవరు మూడు రోజులుగా నా అంతఃపురంలోనే ఉన్నారు. ఇప్పుడు ఈ గది వాకిట వచ్చి, మిమ్మల్ని, తమ తల్లిగారిని దర్శించేందుకు వేచివున్నారు. అనుమతిస్తే పిలుచుకొని వస్తాను!"

~

ముఖ్యమంత్రి ఇలా చెప్పగానే, అక్కడున్న వారందరూ పొందిన ఆశ్చర్యం చెప్పనలవికాదు.

చక్రవర్తి, "ముఖ్యమంత్రీ! ఇదేం విచిత్రం? దేవిగారి కుమారుని పిలుచుకొని రావడానికి అనుమతి కోరనేల? శీఘ్రంగా పిలిపించండి!" అన్నారు.

మరుక్షణమే సేందన్ అముదన్ ముందు రాగా, ఆళ్వార్ కట్టియాన్ అతని వెనకే వచ్చాడు.

చిన్న పళువేట్టరయ్యర్ ఉక్రోషంతో, "ముఖ్యమంత్రిగారి పరిహాసానికి ఒక హద్దంటూ ఉండనవసరం లేదా?" అన్నారు.

కానీ శెంబియన్ మహాదేవి తమ రెండుచేతులనూ చాచి, తమ ముఖంలోను, కళ్ళలోను ప్రేమ పెల్లుబుకగా, "కుమారా!" అని పిలవగానే, దళపతి మనసులో గాభరా మొదలైంది.

సేందన్ అముదన్, "తల్లీ! నన్ను పిలిచేందుకు ఇప్పటికైనా మీ మనసు కరిగింది కద? అది నా తపస్సు ఫలం!" అంటూ కళ్ళలో నీరు పెల్లుబుకగా, శెంబియన్ మహాదేవిని సమీపించాడు.

మధురాంతక ఉత్తమ చోళుడు అని చరిత్రలో ప్రసిద్ధిగాంచిన శివభక్త శిరోమణిని కన్న దేవి ప్రేమతో అతన్ని హత్తుకొని మైమరచి ఆనందబాష్పాలు రాల్చింది.

~~~
~~~

# అధ్యాయము - 72

## త్యాగంలో పోటీ

**మళవర్** కులంలో పుట్టి, శివజ్ఞాన సంపన్నులైన గండరాదిత్యుల జీవన సహచరియైన శెంబియన్ మహాదేవిని 'శ్రీ మధురాంతక దేవరైన ఉత్తమ చోళ దేవరిని కన్న మహారాణి' అని వారి కాలానికి చెందిన శిలాశాసనాలలో చెక్కబడింది. సాధారణంగా తల్లులు తమ బిడ్డలను పదినెలలు తమ కడుపులో మోసే కంటారు. కొందరు స్త్రీలు వేరొక స్త్రీల కడుపులో పుట్టిన బిడ్డలను తమ బిడ్డలుగా భావించి పెంచుకోవడమూ కద్దు.

శెంబియన్ మహాదేవి ఇంకొకరి బిడ్డను తమ బిడ్డగా చాలకాలం పెంచినందువల్ల ఆ నిజాన్ని ఎరిగిన ఒకరు పైన వివరించినట్లు 'ఉత్తమ చోళులను తమ దివ్యగర్భాన మోసి కన్నవారు' అని శిలాశాసనంమీద చెక్కించారు కాబోలు!

~

ఉత్తమ చోళులు ఐదేళ్ళ ప్రాయంలో ఉన్నప్పుడే శెంబియన్ మహాదేవి అతన్ని, వాణి అమ్మను చూసే సందర్భం కలిగింది. చాలయేళ్ళ తర్వాత ఆమెను కలవగానే క్షేమసమాచారాలను గురించి చాల ప్రేమతో విచారించారు. వాణి బిడ్డ అని ఎంచిన సేందన్ అముదన్ మీద సహజవాత్సల్యం పొంగి వచ్చింది. బిడ్డ గురించి విచారించినప్పుడు ఆమె ముఖంలో ఆశ్చర్యం భయం చోటుచేసుకోవడాన్ని గమనించారు. వాణి మూగది కాబట్టి ఆమెను విచారించి ఆమె భయానికి, ఆశ్చర్యానికి నిజమైన కారణం తెలుసుకోలేకపోయారు.  కానీ వాణి ఒకప్పుడు చేసిన సహాయాన్ని ఎంచి, ఆమె బిడ్డ మీద తనకేర్పడిన వాత్సల్యం వల్ల తల్లీకొడుకులు ఏ దిగులు లేకుండ జీవించేందుకు తగిన ఏర్పాట్లు చేశారు. తంజావూరు నగరం సమీపాన నివసిస్తూ 'తళికుత్తూర్' కోవెలకు నిత్యపుష్పకైంకర్యం చేయడానికి మాన్యం కూడ ఇచ్చారు.

సేందన్ అముదన్ విద్యాబుద్ధుల్లోను, వినయంలోను శివభక్తిలోను మేటిగా పెరుగుతూ వచ్చాడు. తల్లికి పుష్పకైంకర్యంలో చేదోడు వాదోడుగా ఉంటూ వచ్చాడు. ఇది చూడగా, చూడగా శెంబియన్ మహాదెవికి అతడిమీద సహజంగా ఏర్పడిన వాత్సల్యం పెరుగుతూ వచ్చింది. ఒక రోజు ఆమె మనసులో ఒక విచిత్రమైన సందేహం కలిగింది. అది ఆమెకు ఒకే సమయాన సంతోషాన్ని, వేదనను, ఇదీ అని తెలియని భీతిని కలిగించింది. ఎన్నో విధాలుగా ఆ సందేహాన్ని నివృత్తి చేసుకోవడానికి ప్రయత్నించినా కూడ ఫలితం దక్కలేదు. పుట్టిన కొన్ని రోజులకే చనిపోయిన తన బిడ్డ జ్ఞాపకం తరచూ వస్తూండడం వల్ల ఆమె మనసు నెమ్మదిగొనలేకపోయింది.

చివరిగా ఒకరోజు వాణిని అడిగి తెలుసుకోవాలని నిశ్చయించుకొన్నారు. వాణిని ఒంటరిగా రమ్మని చెప్పి పిలిపించుకొన్నారు. చనిపోయిన తన బిడ్డను ఎవరికీ తెలియకుండ పూడ్చిపెట్టి రమ్మన్నారు కద? అలా పూడ్చిన చోట ఆ బిడ్డ జ్ఞాపకార్థం ఒక పళ్ళిప్పడై (జ్ఞాపకార్థపు గుడి) కట్టించాలని చెప్పి, ఆ పూడ్చిన చోటు ఎక్కడ అని అడిగారు. ఈ పాత సంఘటన గురించిన జ్ఞాపకమే వాణికి చాల దుఃఖాన్ని కలిగించింది. చెవిటిది, మూగది అయిన వాణిని సంజ్ఞాభాష మూలంగా ఇదంతా అడగవలసి వచ్చింది. అది ఆమెకు ఇంకా చెప్పలేనంత దుఃఖాన్ని కలిగించింది.

వారి ప్రశ్నలకు జవాబివ్వడానికి వాణి చాల జంకింది. చివరికి ఆ మహారాణి ఆజ్ఞ మీరలేక నిజం చెప్పేసింది. పూడ్చేయడానికి తనకు ఒప్పజెప్ప బిడ్డ నిజానికి చనిపోలేదని, దాన్ని కరుత్తిరుమన్ అనేవాడు ఎత్తి చూపించాడని, తర్వాత రాణిగారి వద్దకు తిరిగి వెళితే ఏం విపరీతం జరుగుతుందోనని భయపడి కరుత్తిరుమన్‌తోబాటు తిరుమరైక్కాడుకు వెళ్ళిందని, కొంతకాలం తర్వాత కరుత్తిరుమన్ తనని విడిచిపెట్టి వెళ్ళిపోయినందువల్ల తాను పళైయారైకి తిరిగి వచ్చానని వివరంగా సైగభాష మూలంగా చెప్పింది.

~

సేందన్ అముదన్ నిజంగానే తన కడుపున పుట్టిన బిడ్డ అని తెలుసుకొన్న శెంబియన్ మహాదేవికి ఒకవైపు ఎనలేని ఆనందం కలిగింది. ఆమె ఒళ్ళంతా పులకరించింది. కళ్ళనుంచి అశ్రుధారలు స్రవించాయి. 'బిడ్డా!' అని సేందన్ అముదన్ని హత్తుకొని ముద్దాడాలని ఉత్సాహపూరిత వాత్సల్యం పొంగి వచ్చింది. కానీ ఆ కుతూహలాన్ని అదిమి పెట్టుకొంది. ఆ నిజం బయటపడితే, దాని వల్ల ఏర్పడగల విపరీత పరిణామాలను ఎంచి భీతిగొంది. 'లోకంలో పుట్టే బిడ్డలన్నీ దేవుని బిడ్డలే' అని చెప్పగల ఉన్నత జ్ఞానపరిపక్వతను వారి మనసు పొందివుండడం వల్ల కన్న బిడ్డ మీద తల్లికి కలిగే సహజవాత్సల్యాన్ని, మమకారాన్ని కట్టుబాటులో ఉంచుకోగలిగారు. 'అంతఃపురంలో పెరిగితేనేమి? గుడిసెలో పెరిగితేనేమి? ఈ అశాశ్వతమైన మానవజీవితంలో సుఖభోగాలన్నీ ఒట్టి మాయేకద? లౌకికజీవితాన్ని దాటిన తర్వాత ప్రాప్తి కలగబోయే పరలోకం కద ముఖ్యమైనది? నా పతి రాజభోగాలను త్యజించి శివపరమాత్మ పాదాల వద్ద జీవితం సాగించారు కాబట్టి ఆయనకు పుట్టిన బిడ్డ ఇలా గుడిసెలో జీవిస్తూ దేవునికి సేవ చేస్తూ జీవిస్తే చాలు!' అని తరచూ తనకు తానే చెప్పుకొని సమాధానపడేవారు.

కానీ, సేందన్ అముదన్ తన కడుపున పుట్టిన బిడ్డ అని తెలుసుకొన్నారు కాబట్టి తమ పెంపుడు కొడుకైన మధురాంతకుని చోళ సింహాసనమెక్కించకూడదన్న అభిప్రాయం వారి మనసులో బలపడింది. ముందుగానే ఆమెగారు గండరాదిత్యుల వద్ద తమ నేరాన్ని ఒప్పుకొని క్షమాపణ తీసుకొన్నారు. 'నీ కడుపున పుట్టిన బిడ్డయితేనేమి? అనాథస్త్రీకి పుట్టిన బిడ్డయితేనేమి? దేవుని కళ్ళముందు ఇద్దరూ సమానమే. కాబట్టి మధురాంతకుని నీ కొడుకుగానే పెంచు! కానీ వాడు చోళ

సింహాసనమధిష్టించడానికి ఆశపడకు! అందుకు ఒప్పుకోవద్దు కూడ! అలా చేస్తే నేను పుట్టిన చోళకులానికి ద్రోహం చేసినట్లవుతుంది. అటువంటి పరిస్థితి ఏర్పడితే, నీవు నిజం ఒప్పుకోవడానికి వెనుకంజ వేయకు!" అని దేవికి చెప్పి అలాగే మాట తీసుకొన్నారు. ఆ మాటను ఎటువంటి పరిస్థితుల్లోను నెరవేర్చేందుకు శెంబియన్ మహాదేవి సిద్ధమైనారు.

కానీ తమ సొంత బిడ్డ వాణి గుడిసెలో పెరుగుతుండడాన్ని ఎరుగకనే ఆ మహానుభావులు పరమపదించారు. ఇది తెలిసివుంటే ఆయనేం చేసేవారు? సేందన్ అముదన్ విషయంలో ఎలా నడుచుకోవాలని ఆజ్ఞాపించేవారు? - ఇందు గురించి శెంబియన్ మహాదేవి చాలసార్లు ఆలోచించారు. 'దైవేఛ్ఛ వల్ల ఇలా జరిగిపోయింది. మూగదాని కొడుకు అంతఃపురంలో పెరగాలని, మహారాణి కొడుకు గుడిసెలో పెరగాలని దేవుని ఇఛ్ఛ. దానికి మనం అడ్డుపోకూడదు. దాన్ని మార్చేందుకు ప్రయత్నించడం వల్ల అనేక విపరీత పరిణామాలు కలుగుతాయి. తమ పెంపుడు కొడుకు మనసు అందువల్ల చాల బాధపడుతుంది. అటువంటి పాపాన్ని మనం చేయకూడదు!' అని తీర్మానించుకొన్నారు.

భగవంతుని సంకల్పంలో ఆ మహాదేవిగొన్న అపారనమ్మకం వల్లనే వారు పైన వివరించిన విధంగా నిర్ణయం తీసుకొని దాన్ని నెరవేర్చగలిగారు.

కానీ సేందన్ అముదన్ గురించి తరచూ తలుచుకోకుండ ఉండలేకపోయారు. అతడి జ్ఞాపకం వచ్చినప్పుడల్లా వారి హృదయంలో సహజమైన మాతృవాత్సల్యం పొంగేది. ఈ పోరాటం వారి మనసులో చాల కాలం సాగింది.

~

చాలకాలంగా ఆనకట్ట కట్టి ఆపబడ్డ వెల్లువ ఉన్నట్లుండి ఆ ఆనకట్టను తెంచుకొని ఉరకలు వేయడం జరుగుతుంది కద? అప్పుడా వెల్లువ ఎంత వేగంగా, ఎంత బలంగా ఉరకలు వేస్తూ ముందుకు దూకుతుందన్నది పలువురు చూసే ఉంటారు.

శెంబియన్ మహాదేవి హృదయంలో ఆనకట్ట వేసి ఆపివుంచిన మాతృప్రేమ అనే వెల్లువ ఇప్పుడు కట్ట తెంచుకొని ముందుకురికింది.

ముఖ్యమంత్రి అనిరుద్ధులు 'దేవి దివ్యగర్భాన ఉదయించిన దేవరు' అన్నమాటే మహారాణి మనసులోని ఆనకట్ట తెగడానికి కారణమైంది.

ముఖ్యమంత్రిగారు ఆ మాట అనగానే శెంబియన్ మహాదేవి తమ బిడ్డను పదిమాసాలు తమ కడుపున మోసిన అనుభవాన్ని మళ్ళీ ఒక్క క్షణం అవధిలో అనుభవించారు. తమను మరచి, తమ సంకల్పాన్ని మరచి సేందన్ అముదన్ని "నా బిడ్డా!" అని నోరారా పిలుస్తూ, అతన్ని హత్తుకొని కన్నీర్లు ధారావాహినిగా విడవసాగారు.

ఇలా శెంబియన్ మహాదేవి అనుభూతుల ఉధృతప్రవాహం వల్ల మైమరచివున్న స్థితిలో

అముదన్ అన్న మాటలు వారి మనసులో చాల బలంగా పదిలమైనాయి. “తల్లీ! నన్ను 'కుమారా!' అని పిలిచేందుకు ఇప్పుడైనా మనసు వచ్చింది కద?” అన్నాడు కద? ఆ మాటల అర్థమేమి? అముదన్‌కి తనని కన్నతల్లి ఎవరని అప్పటికే తెలుసా? తెలిసినా, ఇంతవరకు ఆ నిజాన్ని ఇంతవరకు బయటకు చెప్పుకోకుండా ఉన్నాడా?

కాసేపు మాట్లాడలేక పరవశస్థితిలో ఉన్న తర్వాత శెంబియన్ మహాదేవి తమ మనసును దిటవు పరచుకొని, “కుమారా? నీకు ముందుగానే తెలుసా, నేనే నిన్ను పదిమాసాలు మోసి కన్న తల్లినని? తెలిసి నా మీద కోపం తెచ్చుకొన్నావా? కాబట్టి నన్ను అందుగురించి అడగకున్నావా?” అని గద్గద స్వరంతో అడిగారు.

~

అప్పుడు సేందన్ అముదన్ కడలి ఒడ్డును తెంచుకొన్నట్లు భావోద్వేగపూరితంగా ఇలా మాటల వర్షాన్ని కురిపించాడు:-

“తల్లీ! నేను మీ కడుపున పుట్టిన భాగ్యశాలినని కొంతకాలం క్రితం తెలియవచ్చింది. లోకమంతా స్తుతించే మీరు ఒకరోజు నన్ను నోరారా 'కుమారా!' అని పిలవాలని తపస్సు చేస్తూ వచ్చాను. మీ కొడుకని చెప్పుకోవడానికి తగిన అర్హతలను పెంపొందించుకొంటూ వచ్చాను. రాత్రింబగళ్ళు శివపరమాత్మను ధ్యానిస్తూ వచ్చాను. మీరే నన్ను పిలిపించకపోయినా, నేనే మీ దగ్గరికి రావాలనుకొన్నాను. కానీ ఈ రాజ్యపు హక్కు గరించిన చర్చలు ముగియనీ అని ఊరకున్నాను. మిమ్మల్ని 'తల్లీ' అని పిలిచే హక్కును మాత్రమే కోరుకొన్నాను. తల్లీ! రాజ్యం ఎవరికి చెందాలన్నది తీర్మానించబడిన తర్వాత మీ వద్దకు వచ్చి 'తల్లి' హక్కును కోరుదామనుకొన్నాను. అమ్మా! తమ మనసు నొచ్చుకోకుండ ఉండడానికి నా మనసును దోచుకొన్న పూంగుళలిని కూడ త్యాగం చేసేందుకు సిద్ధపడ్డాను. అదృష్టవశాత్తు ఆమె కూడ తన మనసును మార్చుకొంది. తల్లీ! మూడు రోజుల క్రితం నా ప్రాణానికి పెద్ద అపాయం ఎదురైంది. నేను, పూంగుళలి తమకు నమస్కరించి తమ ఆశీర్వాదం పొందిన కాసేపటికల్లా అ అపాయం ఎదురైంది. ఆ అపాయం నుంచి నా ఉత్తమ మిత్రుడొకడు నన్ను కాపాడాడు. అందుగురించి నేనప్పుడు అంతగా సంతోషపడడం లేదు. ఇప్పుడు నేనతడికి ఎంతగా ఋణపడివున్నానో గ్రహించాను. మీరు నన్ను 'కుమారా!' అని మీ నోరార పిలిచారు కద? ఈరోజు కోసం నేను ప్రాణాలతో ఉన్నాను కద? అదే చాలు! నేను చాల భాగ్యశాలిని. నాకింకేమీ వద్దు. ఇప్పుడిక్కడ జరిగింది ఇక్కడ ఉన్నవారికి మాత్రం తెలిసివుండనీ. ఇంకెవ్వరికీ తెలియవద్దు. రాజ్యంలో ఇంకా సంక్షోభం ఎక్కువ కాకూడదు! కోడిక్కరైకి వెంటనే బయలుదేరి వెళ్ళేందుకు నాకు, పూంగుళలికి అనుమతివ్వండి!”

~

ఈ మాటలు శెంబియన్ మహాదేవి మదిలో రేపిన అనుభూతులను, కల్లోలాన్ని మాటల్లో

వర్ణించనలవికాదు.

"బిడ్డా! నీవే నా ఉత్తమ పుత్రుడివి! నీవే దైవాంశసంభూతులైన నా నాధుని పుత్రుడివి!" అన్నారు.

ఇంతసేపు సుందర చోళ చక్రవర్తి, చిన్న పళువేట్టరయ్యర్, యువరాకుమారి కుందవై దిగ్భ్రమించి ఉండిపోయారు. అక్కడే బయటపడ్డ రహస్యం, అందువల్ల రాగల ఫలాఫలాలు వారి మనస్సుల్లో పెద్ద ఆందోళనను పుట్టించింది.

వారిలో కుందవై దేవే మొదట తేరుకొంది. "తండ్రీ! పెద్ద మహారాణి మధురాంతకులకు పట్టం కట్టకూడదని మొండిపట్టు పట్టడానికి ఇప్పుడే కద కారణం తెలుస్తూంది!" అన్నది.

సుందర చోళులు కూడ అప్పుడు ఆ దిగ్భ్రమాశ్చర్యాలనుంచి తేరుకొని, "అవును, బిడ్డా! కానీ ఆ కారణం ఇప్పుడు తీరిపోయింది. నా పెదతల్లి దివ్యగర్భాన ఉదయించిన ఉత్తమ పుత్రునికి పట్టం కట్టేందుకు వారికి కూడ ఇప్పుడు అభ్యంతరం ఉండబోదు కద?" అన్నారు.

శెంబియన్ మహాదేవి కాస్త కంగారుతో చక్రవర్తిని చూసి, "చక్రవర్తీ! నా కుమారుడు కాసేపటి క్రితం అన్న మాటలు వినలేదా? నా కుమారుడు రాజ్యహక్కు కోరడం లేదు. దాన్ని మీ సమక్షాన తన నోటినుంచే తెలియజేశాడు కద?" అన్నారు.

"అవును, ప్రభూ! ఈ చోళరాజ్యంలో ఇప్పటికే ఉన్న చిక్కులు, సమస్యలు చాలు! నావల్ల ఇంకొక పెద్ద సమస్య పుట్టడం వద్దు. నాకు సెలవివ్వండి! నన్ను, నన్ను పెళ్ళి చేసుకోవడానికి ఒప్పుకొన్న పూంగుళలిని ఆశీర్వదించి పంపండి! పూంగుళలీ! ఇక్కడికి రా!" అన్నాడు సేందన్ అముదన్.

~

వాకిలి దగ్గర నిలబడ్డ పూంగుళలి ఇప్పుడు లోపలికొచ్చింది. సేందన్ అముదన్, పూంగుళలి మొదట శెంబియన్ మహాదేవికి నమస్కరించారు. తర్వాత చక్రవర్తికి నమస్కరించారు.

సేందన్ అముదన్ లేవగానే, "ప్రభూ! మేము కోడిక్కరైకి వెంటనే వెళ్ళడానికి సెలవివ్వండి! తల్లీ! సెలవివ్వండి!" అన్నాడు.

శెంబియన్ మహాదేవి చక్రవర్తిని చూసి, "అవునయ్యా! వీరికి సెలవిచ్చి పంపుదాం. నాకిష్టమైనప్పుడు నేను కోడిక్కరైకి వెళ్ళి వారిని చూసుకొంటాను!" అన్నారు.

సుందర చోళులు, "అది ఏనాడూ జరగని కార్యం! నేను వారికి సెలవివ్వను!" అన్నారు.

ముఖ్యమంత్రి అడ్డుపడి, "చక్రవర్తీ! ఇప్పుడేదీ తీర్మానించకండి. ఇంకొన్ని రోజులు వీరు నాఇంటే ఉండనివ్వండి. పెద్ద మహారాణి కుమారుడు దొరికేశారు. కానీ చిన్న పళువేట్టరయ్యర్ అల్లుడుగారింకా దొరకలేదు. ఆయన గురించిన సమాచారం దొరికేవరకు వీరిక్కడ ఉండనీ. అంతవరకు ఇక్కడున్నవారికి తప్ప ఇంకెవ్వరికీ ఈ రహస్యం తెలియవద్దు!" అన్నారు.

"అరుళ్మొళికైన తప్పక చెప్పే తీరాలి!" అన్నది కుందవై.

"వద్దు, వద్దు! అది మాత్రం చేయవద్దు!" అని వేడుకొన్నాడు సేందన్ అముదన్.

చివరిగా చక్రవర్తి, "దేవీ! ఏదెలా జరిగినా జరగనీ. ఇన్నాళ్ళ తర్వాత ఈరోజు మీ దివ్యగర్భాన ఉదయించిన మీ కుమారుడు మీ వద్దకు వచ్చి చేరాడు. మీ ఇద్దరినీ వెంటనే విడదీసేందుకు నేను సమ్మతించను. కొన్ని రోజుల పాటైనా మీరిక్కడ ఒకటిగా ఉండండి. నా అంతఃపురంలోగాని, ముఖ్యమంత్రి అంతఃపురంలోగాని బస చేయండి. రాజ్యహక్కు గురించి తీర్మానం జరిగిన తర్వాత వీరిని కోడిక్కరైకి సాగనంపడం గురించి ఆలోచిద్దాం. అంతవరకు ఇక్కడున్న వారికి తప్ప ఈ రహస్యం ఇంకెవ్వరికీ తెలియకూడదు!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 73

## వాణతి దొంగతనం

**అరుళ్మొళి** వర్మ మనసు చాల సంక్షోభానికి లోనైవుందప్పుడు. రాజ్యహక్కు గురించి రాజ్యమంతటా లేచిన అల్లకల్లోలం రోజురోజుకూ అధికం కాసాగింది. అందువల్లనే ఆయన మనసు అంతగా కలతబారింది. ఆయన ప్రజలను శాంతపరిచేందుకు వెళ్ళిన చోటల్లా ప్రజల ఆవేశమింకా అధికమైంది. "పొన్నియిన్ సెల్వనే మా ఏలిక!", "అరుళ్మొళి వర్మగారే పట్టం కట్టుకోవాలి!" అన్న ఘోషలు లేచి నలువైపులా మారుమోగాయి.

వీటితో పోటీ పడుతున్నట్లు, "సనాతన వంశస్థులైన పళువేట్టరయ్యర్లకు జయహో!", "కొడుంబాళూర్ వేళార్ వద్దు! " అన్న ఘోషలు కొన్ని చోట్ల వినిపించసాగాయి. అటువంటి చోట్ల అధికబలం వెతుకుదాం అని యువరాజు సమీపించగానే, వెంటనే అక్కడున్నవారు కూడ, "పొన్నియిన్ సెల్వన్‌గారికి జయహో!" అని ఘోషించనారంభించారు.

అంతెందుకు? కోట కాపలా కోసం మళ్ళీ నియమించబడ్డ పళువూర్ వీరులు కూడ పొన్నియిన్ సెల్వన్ని చూడగానే తమ పాతఘోషలను వదిలేసి, "అరుళ్మొళిగారే పట్టం కట్టుకోవాలి!", "లంకను జయించిన వీరాధివీరులు, పొన్నియిన్ సెల్వన్ చిరకాలం జీవించాలి/జీవించుగాక!" అని ఘోషించసాగారు.

ఇలా తమ ప్రయత్నాలు సాధారణప్రజల వద్ద, యుద్ధవీరుల వద్ద పనిచేయకపోవడమేగాక, తమ ఉద్దేశానికి విరుద్ధంగా పరిస్థితి బలపడుతూ రావడాన్ని గమనించి పొన్నియిన్ సెల్వన్ చాల దిగులుపడసాగారు. కొన్నాళ్ళుగా మధురాంతకులు కనపడకపోవడం ఆయన దిగులును ఇంకా అధికం చేసింది. ఇందువల్ల చిన్న పళువేట్టరయ్యర్ కొడుంబాళూర్ వేళార్ మీద నేరం మోపుతుండడం ఆయనెరుగుదురు. అందుకు కారణం లేదని చెప్పసాధ్యం కాదు. అరుళ్మొళివర్మగారికే అందుగురించి కాస్త సందేహం లేకపోలేదు. తమకు పట్టం కట్టేయాలని కొడుంబాళూర్ వేళార్, తిరుక్కోవలూర్ మలైయమాన్ మొదలైనవారు చాల పట్టుబడుతున్నారు. వారితో కూడబలుక్కొని ముఖ్యమంత్రి అనిరుద్ధులు కూడ కుట్ర చేస్తున్నట్లనిపిస్తూంది. వీరందరూ ఒక్కటై/కుమ్మక్కై మధురాంతకులను ఎక్కడైనా దాచి పెట్టేశారేమో? లేక మధురాంతకుల ప్రాణానికే అపాయం కలిగించారా?

ఆయన ప్రియతమ అన్నగారైన ఆదిత్య కరికాలన్ మరణానికి పళువేట్టరయ్యర్లు, శంబువరయ్యర్లే కారణమని మలైయమాన్ నొక్కి/బల్ల గుద్ది చెబుతున్నారు. అందుకు పగ తీర్చుకోవడానికే మధురాంతకులకు హాని కలిగించారా?

ఆహా! వీరికేమి? ముందు వెనుక ఆలోచించకుండ తోచింది చేసేస్తున్నారు. చివరికి నింద

అంతా మన తలమీదే కద పడుతుంది?

ఈరోజు చోళనాడు ప్రజలు ఈయన పేరు చెప్పి దీవిస్తున్నారు. ఈయనే సింహాసనమధిష్టించాలని పట్టుపడుతున్నారు. ఈ ప్రజల మనసు ఎప్పుడూ ఇలాగే ఉంటుందా? ప్రజలు చపలచిత్తులు కద? ఇదే ప్రజలు రేపు తమ మీదే నింద మోపినా మోపవచ్చు. సింహాసనం కోసం పినతండ్రి మధురాంతకుని చంపించిన పాతకుడని అన్నా అనవచ్చు. అంతెందుకు? కడంబూర్ మాళిగలో ఆదిత్య కరికాలన్ హత్య చేయబడినందుకు కూడ తన మీద నింద మోపవచ్చు! - దైవమా! అటువంటి భయంకరమైన నిందలు మోసేందుకా కావేరిలో మునిగిపోకుండ మందాకినిదేవి కాపాడింది? ఇప్పుడు దేవతైన ఆ స్త్రీశిరోమణే తననీ ఇక్కట్టునుంచి కాపాడాలి. జీవితంలో ఒకడు పొందగల అపకీర్తుల్లో అతి ఘోరమైన అపకీర్తి తనను తాకకుండ అడ్డుకొని కాపాడాలి.

ఈలం దేశ రాజవంశస్థులలో చాల దగ్గరి సంభంధీకులే ఒకరినొకరు చంపి సింహాసనమెక్కిన వృత్తాంతాలు అరుళ్మొళి వర్మ మనసులో గాఢంగా పదిలమైన విషయం పాఠకులకు తెలుసు. కాబట్టి అటువంటి అపకీర్తి తనకు కూడ కలగవచ్చన్న ఆలోచన ఆయనకు భరించలేని వేదనను కలిగించింది.

ఎవరి దగ్గరైనా తమ అంతరంగమైన ఈ ఆలోచనలను వెలిబుచ్చి సలహా అడుగుదామన్నా అందుకు తగిన వారెవరూ తోచడం లేదు. ఆయన చుట్టూ ఉన్నవారందరూ ఆయనకు విరుద్ధంగా కుట్ర పన్నుతున్నారని తోస్తూంది. వారిలో కొందరు నిజంగానే ఆయన మీద విరోధభావం గొనివున్నారు. ఇంకొందరు వారికి మంచి చేస్తున్నామని ఎంచి భయంకరమైన నిందను ఆయన మీద మోపేందుకు ప్రయత్నిస్తున్నారు.

~

ఇటువంటి పరిస్థితిలో ఎవరిని నమ్మడం, ఎవరికి తమ అంతరంగ ఆలోచనలను చెప్పి తగిన సలహా అడగాలని ఆయన తీర్మానించుకోలేకపోయారు.

అంతెందుకు? ఆయన మీద ఎనలేని ప్రేమ, వాత్సల్యంగొన్నది ,ఆయన భక్తికి పాత్రురాలు అయిన ఆయన అక్కగారు కుందవై మీద కూడ ఆయనకు నమ్మకం సన్నగిల్లిపోయింది. ఆమె తమకు తెలియకుండ ఏదో ఒక రహస్యకార్యం చేస్తున్నట్లు తోస్తూంది. ఏల? ఆయన ప్రాణానికి ప్రాణమైన వాణతి కూడ కద ఏదో చాటుమాటుగా ఎక్కడికో వెళ్ళి మర్మభూయిష్టమైన ముఖకవళికలతో తిరిగి వస్తూంది...?

దేన్ని సహించినా సహించవచ్చు గాని వాణతి మర్మభూయిష్టమైన నడవడికను ఇక సహించడమసాధ్యం అనిఅరుళ్మొళివర్మ తీర్మానించారు. వాణతి చుట్టు పక్కల పరికించి చూస్తూ, ఒంటరిగా బయలుదేరి వెళుతుండడాన్ని గమనించారు.

అంతఃపురం పైమేడ నుంచి వరాండాలగుండా వెళ్ళి, తర్వాత కింది మేడకు దిగి, రెండువైపులా ఎత్తైన, పొడవాటి గోడలున్న రహస్యమార్గం గుండా వాణతి ముందుకు వెళ్ళింది. మధురాంతకులను

రహస్యంగా చెరపట్టివుంచిన చోటికే ఆమె వెళుతూందని భావించి అరుళ్మొళివర్మ చాల ఆతురతతోను, ఉక్రోషంతోను ఆమెను వెన్నంటి వెళ్ళారు.

చివరికి వాణతి అంతఃపురంలోని ఇంకొక పెద్ద భాగానికి చేరి, అక్కడ ఒక గదిలోకి ప్రవేశించి తలుపు మూయ ప్రయత్నించింది. అప్పుడు అరుళ్మొళివర్మ ముందుకు దూకి వాణతి తలుపు మూయ సాధ్యంకానట్లు ఒక కాలు గదిలోపల పెట్టారు.

తలుపు వేయబోయిన వాణతి చేయి పట్టుకొని, "వాణతీ! నీ దొంగతనం నా దగ్గర పనిచేయదు! ఈ గదిలో మీరెవరిని దాచిపెట్టారు?" అని కోపంగా అడిగారు.

వాణతేమో చిరునవ్వు విరిసిన ముఖంతో, "అయ్యా! నిజానికి నా దొంగతనం ఫలించింది! నేను పిలిస్తే మీరు వచ్చేవారు కారు. లోపలికొచ్చి ఇక్కడున్నది ఎవరో మీరే చూసుకోండి!" అన్నది.

~

మధురాంతకులను ఎదురుచూసి లోపలికి వెళ్ళిన అరుళ్మొళివర్మ వల్లవరయ్యన్ వంతిదేవుడు మంచంలో పడుకొని ఉండడాన్ని చూడగానే ఆశ్చర్యసంభ్రమాలకు లోనయ్యారు.

ఆయనను చూడగానే వంతిదేవుడు మంచంలో లేచి కూర్చొని, "అయ్యా! రండి! రండి! మిమ్మల్ని రెండు రోజులుగా ఎదురుచూస్తున్నాను. ఈ అమ్మాయిల చెరసాలనుంచి నన్ను ఎలాగైనా విడుదల చేయండి!" అన్నాడు.

పొన్నియిన్ సెల్వన్ వేగంగా వెళ్ళి వంతిదేవుని సమీపాన ఆసీనులై, "మిత్రమా! ఇదేమి? ఇక్కడికెలా వచ్చావు? పాతాళచెరసాల నుంచి తప్పించుకొన్నవాడివి ఈ అమ్మాయిల చెరసాలలో ఎలా చిక్కుకొన్నావు? ఇప్పటికి నీవు లంకకు చేరుకొని ఉంటావని కద నేననుకొన్నాను? ఇంకొన్ని రోజులకు నేను  కూడ అక్కడికి వచ్చి నీతోనే చేరుకొందామని అనుకొన్నాను కద?" అన్నారు.

"అవును, యువరాజా! ఇప్పటికి నేను లంకలో ఉండవలసినవాడినే! అక్కడ పాండ్యదేశపు మణిమకుటాన్ని, వారికి ఇంద్రుడిచ్చిన రత్నహారాన్ని వెతుకుతుండవలసినవాడినే. శివపిచ్చి పట్టిన సేందన్ అముదన్ని వైద్యకుమారుడు చంపకుండ అడ్డుకోబోయి ఈ దుర్గతి పొందాను. పినాకపాణి విసిరిన ఈటె నామీదకు దూసుకు వచ్చి తాకగానే స్పృహ తప్పి పడిపోయాను. తెలివి వచ్చి కళ్ళు తెరిచి చూస్తే ఇక్కడున్నాను. ఈ స్త్రీమణుల చెరసాలలో ఎలా చిక్కుకొన్నానో తెలియదు. కరుణ చూపి నేనిక్కడినుంచి తప్పించుకొని పారిపోయేందుకు సహాయం చేయండి. లేకపోతే, మీ ప్రియసహోదరుడు, నా ప్రియతమ నాయకుడు అయిన ఆదిత్య కరికాలన్‌గారిని నేనే చంపానని నా మీద నింద మోపుతారు!" అన్నాడు వంతిదేవుడు.

~

అప్పుడు వాణతి అడ్డుపడి, "అయ్యా! వీరు చెబుతున్నది పొరబాటు. వీరు తప్పించుకొని

పారిపోతేనే వీరిమీద అటువంటి నింద మోపుతారు. నిజం బయటపడే వరకు వీరిక్కడ రహస్యంగా ఉండాలని మీ అక్కగారి కోరిక!" అన్నది.

"ఈమె మాటల్లో కూడ నిజం ఉంది. నీవు తప్పించుకొని పారిపోతేనే అటువంటి నింద నీమీద పడుతుంది; అది నాకు కూడ వర్తిస్తుంది. దానికన్న నిజంగా జరిగిందేమన్నది లోకమెరుగ నిరూపించడమే మంచిది. మొదట, నాకు చెప్పు! కడంబూర్లో జరిగిందంతా చెప్పు!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

అలాగే వంతిదేవుడు తనకు తెలిసినంతవరకు జరిగిందంతా చెప్పాడు.

అంతా విన్న తర్వాత కూడ ఆదిత్య కరికాలన్ మరణం ఎలా జరిగిందని యువరాజు నిర్ణయించలేకపోయారు.

~~~
~~~

# అధ్యాయము - 74

## "నేనే పట్టం కట్టుకొంటాను!"

**వంతిదేవుడు** చివరిగా ఇలా చెప్పాడు:- "యువరాజా! ఒకే ఒక వ్యక్తి నిజంగా మనసు చేసి నిజంగా ఏం జరిగిందని చెప్పి నన్ను నిరపరాధి అని నిరూపించవచ్చు. ఆ ఒక్కరు పెద్ద పళువేట్టరయ్యరే. కడంబూర్ మాళిగలో నేను వాద్యాలగదిలో దాక్కొనివున్నప్పుడు ఉన్నట్లుండి నా గొంతు నొక్కి మూర్ఛపోయేలా చేసింది ఆ వీరాధివీరులే అయివుండాలని నేను ఊహిస్తున్నాను. ఆ సమయాన ఇంకెవ్వరూ అక్కడికి వచ్చే అవకాశం లేదు. నందినీదేవిని సందేహించిన ఆ వీరవృద్ధులే అలా కాళాముఖుని వేషం వేసుకొని రహస్యప్రదేశంలో దాక్కొని అక్కడ ఏం జరగబోతోందో చూడాలని వచ్చివుండాలి. కాళాముఖుల బృందానికి చెందిన ఇడుంబన్‌కారి ఆయనకు ఆ రహస్యమార్గం ద్వారా రావడానికి సహాయం చేసివుండాలి. కానీ ఆ మహావీరులకు నన్ను మొట్టమొదట చూసినప్పుడే అంతగా నచ్చలేదు. ఆ విసుగు తర్వాత్ రోజురోజుకూ అధికమవుతూ వచ్చింది. ఆయన నా ప్రాణాలను కాపాడేందుకోసం ముందుకొచ్చి అక్కడ నిజంగా జరిగిందేమని చెప్పబోవడం లేదు. నేనీ భయంకరమైన నిందవల్ల మరణిస్తే బహుశ ఆయన సంతోషపడతారేమో. కాబట్టి, యువరాజా! నేను తప్పించుకొని పారిపోవడానికి అనుమతినివ్వండి! వీలైతే నేను లంకకు వెళ్ళి అక్కడ పాండ్యరాజుల మణిమకుటాన్ని, రత్నహారాన్ని వెతికి కనిపెడతాను. లేక, ఇక్కడే మీచేతి ఖడ్గంతో నన్ను నరికేయండి! నాపట్ల ఎనలేని ప్రేమగొన్న తమ అన్నగారిని చంపిన నేరాన్ని మోసి నాలుగువీధుల కూడలిలో ఉరికంబమెక్కే దుర్గతి నాకు రానివ్వకండి! దానికన్న మీ చేత మరణించడమే నాకెంతో ఓదార్పునిస్తుంది! లేక ఈ కొడంబాళూర్ రాకుమారి చేత విషం తిని మరణించినా ఫరవాలేదు. మీరు, మీ గౌరవనీయులైన అక్కగారే ఈ పేదవాడిమీద దయగొని యమలోకం వాలికి దగ్గరకు వెళ్ళినవాడిని తిరిగి తీసుకొని వచ్చి చేర్చారు. అందు నిమిత్తం నేను వారికి కృతజ్ఞతలు తెలుపబోవడం లేదు!"

వంతిదేవుడిలా అన్నప్పుడు వాణతి యువరాజును చూసి, "వినండయ్యా! మీరే వినండి! ఈ శుద్ధ వీరులకు యుద్ధరంగంలో శత్రువుల ముందు నిలబడి పోరాడి వీరస్వర్గం పొందే ఆశ లేదట! అమ్మాయిల చేత విషం తిని చావాలని పరితపిస్తున్నారు!" అన్నది.

"యువరాజా! వీరు, తమ సహోదరి నన్నిటువంటి నిందావాక్యాలతోనే చంపేస్తారులాగుంది! దాని కన్న వీరి చేత విషం తిని చావడమే విశేషం కద?" అన్నాడు వాణర్ కులవీరుడు వంతిదేవుడు.

~

అరుళ్మొళివర్మ ఈ మాటలన్నీ సగం ధ్యానంతోనే వింటున్నారు. ఆయన ఇంకేదో విషయం

గురించి తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు తోచింది.

చటుక్కున ఒక్క దూకుతో లేచి నిలబడి, “ఆహా! నేనొక తీర్మానం తీసుకొన్నాను. నేనే చోళనాడు చక్రవర్తిగా పట్టం కట్టుకొంటాను. నాడు, నగరం 'అరుళ్మొళివర్మే పట్టం కట్టుకోవాలి!' అని ఘోషిస్తున్నారు. యుద్ధవీరుల కోరిక కూడ అదే! వారందరి ఆశయాన్ని నెరవేరుస్తాను. ఎందుకో తెలుసా? నిన్ను నిరపరాధి అని విడుదల చేసేందుకే. అందువల్ల ఎవరికైనా అపకీర్తి వస్తే రానీ! అది నన్ను బాధించదు. ఒకవేళ నామీద విరోధభావంగొన్న కొందరు సామంతరాజులు ఆ అపకీర్తిని ఇంకా విస్తరింపజేసేందుకు ప్రయత్నించవచ్చు. కానీ ప్రజలది నమ్మరు. చిన్న/సామంతరాజులు నామీద నింద మోపేందుకు తెగిస్తే అది వారిమీదికే తిప్పి కొడుతుంది! కడంబూర్ మాళిగకు చిన్నరాజులు యువరాజును ఆహ్వానించి ఆయనను చంపేశారని నేను తిప్పికొట్టగలను. అటువంటి నమ్మకద్రోహానికి, రాజకుల ద్రోహానికి వారిని శిక్షించడానికి నాకధికారం ఉంటుంది. ఏదెలా ఉన్నా, నేనే పట్టం కట్టుకోబోతున్నాను. నా తండ్రి, అక్కగార్ల కోరికకు విరుద్ధంగా నడుచుకొన్నా ఫరవాలేదు. కానీ నీకు ఎలాంటి హాని కలగడాన్ని చూస్తూ నేను ఊరుకోలేను!” అన్నారు.

వాణతి అమిత కుతూహలంతో, “మీ ఈ మాటలను వినేందుకు మీ అక్కగారు ఇక్కడ లేకపోయారు కద! వారి సమక్షాన కూడ ఒకసారి ఈ మాట చెప్పండి!” అన్నది.

“ఒక్కసారేమి? పదిసార్లు చెబుతాను! చేతల్లోను చేసి చూపిస్తాను!” అన్నారు పొన్నియిన్ సెల్వన్.

వంతిదేవుడు తన కళ్ళల్లో ఉబికిన కన్నీళ్ళను తుడుచుకొని, “అయ్యా! పేదవాడిని, అనాధను అయిన నన్ను కాపాడేందుకు మీ మనసును మార్చుకొని పట్టం కట్టుకోవడానికి ముందుకు వస్తే, అది చోళనాడు చేసిన భాగ్యమే అవుతుంది. నిజం చెప్పాలంటే, నాకు తెలిసినంతవరకు మధురాంతక దేవరు సింహాసనమధిష్టించేందుకు ఏమాత్రం తగినవారు కారు. ఆడవారిలాగ మూసిన పల్లకిలో ప్రయాణం చేస్తూ, రాజ్యకాంక్షవల్ల కుట్రలు చేసేవారు ఒక మహాసామ్రాజ్యాన్ని ఏలేందుకు అర్హులవుతారా? విజయాలయ చోళులు, పరాంతక చోళులు అలంకరించిన చోళ సింహాసనం మీద ఇటువంటి పిరికిపంద ఆసీనులు కావడం న్యాయమా? ఇది చోళనాడు ప్రజలు ఇష్టపడకపోవడంలో ఆశ్చర్యం లేదు!” అని గద్గద స్వరంతో అన్నాడు.

“దీన్ని గ్రహించే మధురాంతక దేవరు మాయమైపోయారు కాబోలు!” అన్నది వాణతి.

“అవునవును! ఆయనను వెతికి కనిపెట్టే ప్రయత్నాన్ని విడిచిపెట్టేయబోతున్నాను. నేనే పట్టం కట్టుకోబోతున్నాను!” అన్నారు అరుళ్మొళివర్మ.

~

ఈ మాటలను వింటూ ఆ గదిలో ప్రవేశించిన కుందవై "తమ్ముడూ! ఆ ఆశను పూర్తిగా వదిలిపెట్టేయి! నీకు సింహాసనమూ లేదు, మణిమకుటమూ లేదు. నా అనుంగు చెలికత్తె వాణతి

తంజావూరు సింహాసనమెక్కనని చేసిన శపథాన్ని మరిచిపోయావా? ఆమెను తప్ప ఇంకే అమ్మాయినైనా పెళ్ళాడి నీవు సింహాసనమధిష్టిస్తే అది నా కళ్ళారా నేను చూడలేను!" అన్నది.

"అక్కా! అప్పుడు మాత్రం మీరు కళ్ళు మూసుకొంటే చాలు. కావాలంటే నేనే ఆ సమయాన మీ కళ్ళుగప్పి సహాయం చేస్తాను!" అన్నది వాణతి.

పొన్నియిన్ సెల్వన్ కుందవైదేవిని చూసి, "సహోదరీ! మీ చెలికత్తె చేసిన శపథం కోసం చోళసామ్రాజ్యం రాజు లేకుండ నడవగలదా? మన తండ్రిగారేమో రాజ్యభారాన్ని ఎవరికైనా ఒప్పజెప్పేసి కంచికి వెళ్ళాలని పట్టుబడుతున్నారు. మధురాంతకులేమో మాయమైపోయారు. ఇంకేది దారి? ఎలాగూ నేను పట్టం కట్టుకోక తప్పదులాగుంది! రాజ్యహక్కు గురించి దేశమంతటా గందరగోళంగా ఉండడం మీకు తెలిసిందే! ఈ సంక్షోభాన్ని ఎంతకాలమని పరిష్కరించకుండ ఊరుకోవడం సాధ్యం?" అన్నారు.

"తమ్ముడూ! ఒక సంతోషకరమైన వార్త. దాన్ని తెలియజేసేందుకే నేను వేగంగా వచ్చాను. మాయమైన మధురాంతక దేవరు బయటపడ్డారు! చోళకుల పూర్వీకులు చేసిన తపస్సు వృధాపోలేదు! రాజ్యం ఏమవుతుందోనని నీవు దిగులుపడనవసరం లేదు. ఆయన వద్దన్నా మనం పట్టుబట్టి ఆయనకు పట్టాభిషేకం చేయాలి!" అన్నది యువరాకుమారి కుందవై.

~

ఆమె ఉత్సాహం తక్కిన ముగ్గురికీ కాస్త ఆశ్చర్యాన్ని కలిగించింది. కొన్ని రోజులుగా కుందవైదేవి మధురాంతకులకు పట్టం కట్టడం గురించి పట్టుబడుతుండడం నిజమే. కానీ అందు గురించి ఇంత ఉత్సాహంగొన్నారని ఇంతవరకూ పైకి చూపించుకోలేదు.

పొన్నియిన్ సెల్వన్ తమ ఆశ్చర్యాన్ని అదిమిపెట్టి, "దేవీ! ఆయనెక్కడ దాక్కొని ఉన్నారు? ఎందుకని? ఇప్పుడెలా బయటపడ్డారు?" అని అడిగారు.

"వారు మనకు అతిసమీపానే నివసిస్తూ వచ్చినా మనమే వారిని గమనించలేకపోయాము. తమ్ముడూ! శెంబియన్ మహాదేవి దివ్యగర్భాన ఉదయించిన వారే చోళసింహాసనమధిష్టించడానికి అర్హులు, తగినవారు. నీ పినతండ్రికే ఈ రాజ్యం న్యాయపరంగా దక్కాలి. నీవు మకుటం ధరించవచ్చనే ఆలోచనను పూర్తిగా మరిచిపో! ఒక విచిత్రాన్ని విను, తమ్ముడూ! నాలుగు రోజుల క్రితం మన పినతండ్రికి ఒక పెద్ద గండం ఎదురైంది. హంతకుడొకడు ఆయన మీదకు విసిరేందుకు ఒక చిన్న ఈటెను గురిపెట్టాడు. వాడు దాన్ని విసిరివుంటే మధురాంతకుల ప్రాణాలు పోయేవే. చోళకులంలో ఇంకొక అకాలమరణం కలిగేదే. అలా జరగకుండ అడ్డుపడ్డ వీరాధివీరులెవరు తెలుసా? తమ ప్రాణాలొడ్డి మన పినతండ్రిని కాపాడినవారెవరో తెలుసా?" అని చెబుతూనే యువరాకుమారి తమ విశాలనేత్రాలతో వంతిదేవుని సూచించింది. ఆమె కళ్ళలో పెల్లుబికిన/ఉప్పొంగిన ప్రేమ, కృతజ్ఞత, మెచ్చుకోలు, ఆదరభావం వంతిదేవుని మనసు లోతుల్లోకి వెళ్ళి అతన్ని ఉక్కిరిబిక్కిరి చేశాయి.

~

పొన్నియిన్ సెల్వన్ మరింత ఆశ్చర్యకడలిలో మునిగినవారై, "ఇదేమక్కా? నాకర్థం కావడం లేదే? నా మిత్రుడు కూడ దీని గురించి నాకు చెప్పలేదే?" అన్నారు.

"ఆయన చెప్పివుండరు. ఎందుకంటే ఆయన చేసిన ఘనకార్యం ఆయనకే తెలిసివుండదు. చోళకులం ఆయనకెంత ఋణపడివుందో ఆయనకే తెలియదు!"

"అక్కా! పొడుపుకథలాగ మాట్లాడుతున్నావు కద? అంతా మర్మమయంగా ఉంది కద? మమ్మల్ని ఊరకే ఆశ్చర్యసంభ్రమాలలో ముంచక విషయాన్ని విశదంగా చెబితే మంచిది! ఈ వాణర్‌కులవీరులు మధురాంతకులను ఎలా, ఎక్కడ, ఏ విధమైన అపాయం నుంచి కాపాడారు? మధురాంతకులిప్పుడెక్కడ?" అని ఆతురతతో అడిగారు యువరాజు.

"పొన్నియిన్ సెల్వా! ఇదిగో ఇంకొన్ని క్షణాల్లో ఆయనే ఇక్కడికి వస్తారు! నీవిక్కడికి వచ్చావని తెలిసి ఆయనను ఇక్కడికే పిలుచుకొని రమ్మని చెప్పి పంపాను. ఆయన నోటినుంచే విని తెలుసుకో! లేక, అంతటినీ కళ్ళారా చూసిన పూంగుళలిని అడిగి తెలుసుకో...! ఇదిగో వారు వస్తున్నారు లాగుంది!"

అవును; అప్పుడు ఆ గది బయట కాలి చప్పుడు/సవ్వడి వినిపించింది. కాసేపటికల్లా నలుగురు లోపలికొచ్చారు. ముఖ్యమంత్రి అనిరుద్ధులు, ఆళ్వార్ కట్టియాన్, సేందన్ అముదన్, పూంగుళలే ఆ నలుగురూను.

సేందన్ అముదన్ మాత్రం అలవాటుకు భిన్నంగా విచిత్రమైన దుస్తులు ధరించివున్నాడు. తలమీద యువరాజు కిరీటం ధరించి, పట్టు పీతాంబరం, రాజకులానికి తగిన ఆభరణాలు ధరించివున్నాడు.

~

గదిలోపలికొచ్చినవారిని గదిలోపలున్నవారు కాస్త ఆశ్చర్యంతో చూశారు.

"సహోదరీ! మధురాంతకులు వస్తున్నారన్నావు కద? ఆయన కనిపించడం లేదే?" అన్నారు అరుళ్మొళివర్మ.

"తమ్ముడూ! ఇదిగో నీ ముందు యువరాజు కిరీటం ధరించి నిలబడ్డారే, ఈయనే శెంబియన్ మహాదేవి దివ్యగర్భాన ఉదయించిన, శివజ్ఞాన సంపన్నులైన గండరాదిత్యుల పుత్రులు. ఈయన మనందరికీ పినతండ్రి వరసయ్యే శివభక్తి సంపన్నులు. ఇంతకాలమూ సేందన్ అముదన్ అని పిలవబడుతూ అజ్ఞాతవాసం చేస్తూ వచ్చారు. చోళకుల భాగ్యం వల్ల ఈనాడు బయటకు వచ్చారు. ఈయననే నాలుగు రోజుల క్రితం ఒక క్రూరుడు ఈటె విసిరి చంపజూశాడు. దాన్ని అడ్డగించి వాణర్‌కుల వీరులు చోళకులానికి ఎనలేని సహాయం చేశారు. మన ముఖ్యమంత్రి శిష్యులైన ఈ వీరవైష్ణవులు ఈయన శైవులని కూడ చూడకుండ కోటలోపలికి తీసుకొని వచ్చి చేర్చారు..."

అప్పుడు తిరుమలై కలిగించుకొని, "దేవీ! ఈ శైవులకు నేనేవిధమైన సహాయమూ చేయలేదు;

చేయగోరడమూ లేదు. వాణర్‌కుల వీరులను పల్లకిలో తీసుకొని రావడం సాధ్యమవుతుందనే ఉద్దేశంతో మాత్రమే ఈయనకు మారువేషం వేసి ఏనుగు మీదకెక్కించి తీసుకొచ్చాను" అన్నాడు.

కుందవై, “అవునవును! తిరుమలై నంబి రెండువిధాలుగా మహోపకారం చేశారు. మధురాంతకులకు యువరాజు కిరీటం పెట్టి ఏనుగు మీద తీసుకొని వచ్చినప్పుడు నిజంగానే చోళసింహాసనానికి అర్హులైన వారిని తీసుకొని వస్తున్నామని తెలిసివుండదు. లేక తెలిసే అలా చేశారా? అది నేనెరుగను! ఏదెలా ఉన్నా, తమ్ముడూ! ఇంతకాలం మనందరం మధురాంతక దేవరని ఎంచినవారు నిజంగా మధురాంతక దేవరు కారు. ఈయనే చోళకులం తపస్సు ఫలించి మహారాణి దివ్యగర్భాన ఉదయించినవారు. మనం అర్థం చేసుకోలేని దైవలీల వల్ల ఒక గుడిసెలో నివసిస్తూ వచ్చారు. కానీ పురాతన చోళకులంలో జన్మించినందువల్ల అబ్బిన సద్గుణాలు ఈయనలో నిండివున్నాయన్నది మనం ప్రతి సందర్భంలోను చూసి ఆశ్చర్యంగొన్నవారమే. మునపొకసారి ఈయన వంతిదేవులు తప్పించుకోవడానకి చేసిన సహాయం మనకు తెలుసు కద? నిన్ను ఈయన, పూంగుళలి కోడిక్కరైనుంచి నాగపట్టణానికి తీసుకొని వెళ్ళి చేర్చిన సంభవాన్ని మనం మరువగలమా? ఈయనే మన చిన్నానన్న అన్న నిజం ఈనాడు శెంబియన్ మహాదేవి నోట విన్నాం; ఈయన కూడ ఒప్పుకొన్నారు. తమ్ముడూ! ఈ పుణ్యదినాన ఈయనను మన మాళిగకు స్వాగతిస్తున్నాను. కాదు, కాదు! ఈయన సొంత మాళిగకు స్వాగతిస్తున్నాను. ఇంతకాలమూ మననుంచి విడివడి ఉన్నవారిని ఇప్పుడు మన కుటుంబంతో కలిసేందుకు స్వాగతిస్తున్నాను. ఈ కలయికను ఎంతో సంతోషంగా ఒక పండుగలాగ గడుపుకోవాలి. కానీ అందుకు తగిన సమయం, సందర్భం కాదిది. ఈ విషయాన్ని ఎంతవరకు బయటకు పొక్కకుండ మనలోనే రహస్యంగా ఉంచుకొంటామో అంత మంచిది. కాబట్టి మనలో మనమే ఈ వైభవాన్ని జరుపుకొందాం. చిన్నాన్నా! ఇలా రండి! చాలకాలం తర్వాత మన చోళకులంలోకి వచ్చి చేరినందుకు మా సంతోషాన్ని ఇంకేవిధంగానూ తెలియజేయడానికి వీలు కావడం లేదు. నా ప్రియ సహోదరులు ఇంకొక ఊరికి వెళ్ళేటప్పుడుగాని, తిరిగి వచ్చేటప్పుడుగాని వారి నుదుటి మీద శ్రీజలం పూసి, కుంకుమ తిలకం పెట్టడం సంప్రదాయం. అలాగే ఈనాడు తిరిగివచ్చిన మీ నుదుట శ్రీజలాన్ని, కుంకుమ తిలకాన్ని దిద్దుతాను!”

~

ఇలా చెప్పి యువరాకుమారి కుందవై దేవి ఇన్నాళ్ళు సేందన్ అముదన్ అని పిలవబడ్డ మధురాంతకుని నుదుట తిలకాన్ని, తీర్థాన్ని దిద్దింది. అప్పుడు అనిరుద్ధులు, “చోళ కుల దీపం యువరాజు మధురాంతకులు దీర్ఘాయుష్షుతో జీవించుగాక!” అని దీవించారు. “దీర్ఘాయుష్! దీర్ఘాయుష్!” అని ఆళ్వార్ కట్టియాన్ కూడ ఘోషించాడు.

కుందవై మాటలాడనారంభించినప్పుడు అరుళ్మొళివర్మ మనసులో ఆశ్చర్యం మాత్రమే ఉంది. అందులో కాస్త సందేహం కూడ కలిసివుంది. ఇదంతా తమ పూజ్యసహోదరి పన్నాగమా, లేక ఏదో ఒక

నిగూఢమైన ఉద్దేశంతోనే ఇలా మాట్లాడుతున్నారా అని అనుకొన్నారు. పోనుపోను ఆయన సందేహం తీరిపోయింది. ఆమె హృదయాంతరాళం నుంచి ప్రేమానుభూతులతో వెలువడిన మాటలవి అని గ్రహించారు. ఆయన ఎంతగానో గౌరవించి పూజించే అక్కగారి హృదయం నుంచి పొంగిన అనుభూతులు ఆయనను కూడ ముంచెత్తాయి.

కుందవై తిలకం దిద్దగానే అరుళ్మొళివర్మ సేందన్ అముదన్ దగ్గరికి వెళ్ళి, “చిన్నాన్నా! ఇంతకు మునుపు నేను మీమీద ప్రేమాభిమానాలుగొన్నాను. నా సహోదరుడు కాకూడదా అని కూడ అనుకొన్నాను. మనమధ్యనున్న రక్తసంబంధమే అటువంటి అనుభూతిని కలిగించింది కాబోలు!” అని చెప్పి సేందన్ అముదన్ని కౌగలించుకొని ఆనందబాష్పాలు విడిచారు.

వంతిదేవుడు, “ఆహా! నేనింతకు మునుపే కాస్త సందేహపడ్డాను. సేందన్ అముదన్ అనబడే ఈ శివభక్తుని లోపల పరంపరగా వస్తున్న రాజసం దాక్కొనివుండే తీరాలని భావించాను. లేకపోతే ఊరూపేరూ లేనివాడిగా వచ్చిన నన్ను ఆదరించి ఆశ్రయమివ్వడమేగాక తప్పించుకొని పారిపోవడానికి కూడ సహాయం చేస్తారా? మహారాజ కుమారా! మునుపొకసారి చేసిన సహాయాన్ని ఇంకొకసారి చేసి కరుణించండి! తమ మకుటాభిషేకవైభవాన్ని చూసే భాగ్యం నాకు లేదు కద అని విచారిస్తున్నాను. ఏం చేయను! ఒక విషయంలో నాకు చాల సంతోషంగా ఉంది. సేందన్ అముదన్‌గారికి చోళసామ్రాజ్యం సొంతం కాబోతుందన్న విషయం కూడ నాకంత తృప్తినివ్వడం లేదు. నాకు సముద్రం దాటేందుకు సహాయం చేసిన పూంగుళలి అమ్మగారు మహారాణి కాబోతున్నారన్నదే నాకు మహదానందకరం. సముద్రకుమారి ఆశాస్వప్నం ఇంత త్వరలో నెరవేరబోతూందని వారే ఎదురు చూసివుండరు!” అన్నాడు.

అప్పుడు కుందవై అడ్డొచ్చి, “అయ్యా! మీరింకొన్ని రోజులు ఎక్కువగా మాట్లాడకుంటే మంచిది. అప్పడు మీరు బాగా కోలుకొని, తప్పించుకొని పారిపోవాలన్నా వేగంగా పరుగెత్తగలరు!” అన్నది.

తర్వాత, “తమ్ముడూ అరుళ్మొళీ! ఇంతకాలం మన పెదనానమ్మగారు తమ ప్రియపుత్రునికి పట్టం కట్టేందుకు ఎందుకు అభ్యంతరం తెలుపుతూ వచ్చారో ఇప్పుడు తెలిసింది. మనకు కూడ పాత మధురాంతకులకు పట్టం కట్టడం అంతగా నచ్చలేదు. వీరచోళవంశంలో పుట్టినవారికి ఉండవలసిన సద్గుణాలు ఆయనలో లేవు. మన పెదనానమ్మగారు ఎంతగానో ప్రయత్నించి చూసినా కూడ శివభక్తి ఆయన మనసులో అంటలేదు. వీరత్వం ఆయనలో అసలే లేదు. అయినా కూడ మనం ఒకవిధంగా వారికే పట్టం కట్టేందుకు మనసును సర్దిపెట్టుకొన్నాము. ఈ కొత్త మధురాంతకులకు పట్టం కట్టడం గురించి మనకందరికీ తృప్తి మాత్రమే కాదు; కుతూహలం, ఉత్సాహం కూడాను. నిన్ను, వాణర్‌కులవీరుని నడిసముద్రంలో మునిగిపోకుండ గట్టెక్కించి కాపాడిన పూంగుళలి సింహాసనమధిష్టించడాన్ని చూసేందుకు కూడ నాకు చాల ఆశగా ఉంది. అందుకు కావలసిన ఏర్పాట్లను మన ముఖ్యమంత్రి వెంటనే చేయాలి!” అన్నది.

"దేవీ! పెద్ద పళువేట్టరయ్యర్ పెద్ద మనసు చేసి కడంబూర్ మాళిగలో ఏం జరిగిందో చెప్పాలి. పాత మధురాంతకులేమయ్యారో తెలియాలి. ఈ రెండు కార్యాలు ముగిసేవరకు మకుటాభిషేకానికి మంచి రోజు చూడడమెలా?" అన్నారు.

"పెద్ద పళువేట్టరయ్యర్ని నేనడుగుతాను. పాత మధురాంతకులను వెతికి కనిపెట్టడం మీ బాధ్యత!" అన్నది కుందవై.

~

అప్పుడు సేందన్ అముదన్ అని ఇంతవరకూ పిలవబడుతూ వచ్చిన యువరాజు మధురాంతక దేవరు పొన్నియిన్ సెల్వన్నిచూసి, ఇలా అన్నారు:- "యువరాజా! మీరు నన్ను చిన్నాన్న వరస పెట్టి గౌరవంగా పిలిచారు. వీరు కూడ నన్ను 'యువరాజు' అని పిలుస్తున్నారు. కానీ నేను మిమ్మల్ని 'కుమారా'అని సంబోధించడం సాధ్యం కాదు. ఇరవైరెండేళ్ళు ఒక పూరి గుడిసెలో పెరిగినవాడిని. ఉన్నట్లుండి ఈరోజు నన్ను రారాజుల కులంలో పుట్టిన రాకుమారుడనని చెప్పుకోవడానికి కూడ మనసు రావడం లేదు. మీ అందరికీ ఒక విన్నపం చేసుకొంటున్నాను. వంతిదేవుడు పారిపోవడానికి సహాయం చేశానని నన్ను కొన్నాళ్ళపాటు పాతాళ చెరసాలలో బంధించి పెట్టారు. అప్పుడు పక్కగదిలో ఉన్నవాడి మూలంగా ఇప్పుడు బయటపడ్డ విషయాన్ని తెలుసుకొన్నాను. మూగతల్లి కొడుకు అంతఃపురంలో రాకుమారుడిగా పెరుగుతున్నాడని, రాజవంశ కుమారుడు మూగతల్లి కొడుకుగా పెరుగుతున్నాడని అతడు చెప్పాడు. అప్పుడే నాకు నిజం తెలిసిపోయింది. లోకమంతా వేనోళ్ళ కొనియాడే శెంబియన మహాదేవి నామీదగొన్న ప్రేమానురాగాలకు నిజమైన కారణాన్ని ఊహించి తెలుసుకొన్నాను. వారు ఎప్పుడైనా ఒకరోజు నన్ను 'కుమారా' అని పిలవాలని ఆశపడ్డాను. ఆ ఆశ/ఆశయం నేడు నెరవేరింది. ఇంతకు మించి నేనింకేమీ కోరుకోవడం లేదు...!"

ముఖ్యమంత్రి అప్పుడు కలిగించుకొని, "రాకుమారా! మీరు ఇష్టపడుతున్నారా, లేదా అన్నది ఒక ప్రశ్న. ఏది న్యాయం, ఏది ఉచితం అనే కద ఆలోచించాలి?" అన్నారు.

"అయ్యా! బాగా ఆలోచించండి. నన్నడిగితే, ఆలోచించవలసిన అవసరమే లేదు. ఇప్పటికే బాగా ఆలోచించి తీర్మానించాను. పూంగుళలి నాతో చాలసార్లు, 'రాకుమారుని పెళ్ళాడి రాజపీఠం ఎక్కబోతున్నాను' అని చెప్పేది. అందుకే నా ప్రేమను నిరాకరిస్తున్నట్లు కూడ చెప్పింది. అప్పుడల్లా. 'అమ్మాయీ! నేను రాకుమారుడినే! నేను కోరుకొంటే ఈ చోళసామ్రాజ్యం నాదే అవుతుంది!' అని చెప్పాలని నా మనసు తహతహలాడేది. కానీ ఆ ఉప్పొంగే ఉత్సుకతను ఇన్నాళ్ళూ అదిమిపెట్టాను దేశాన్నేలే ఆశ నా మనసులో ఎన్నడూ ఉదయించకూడదని దేవుడిని వేడుకొన్నాను. ఆ వైరాగ్యాన్ని నెరవేర్చుకోవడం కోసం పూంగుళలిని పోగొట్టుకోవడానికి కూడ సిద్ధమయ్యాను. అదృష్టం కొద్దీ ఈ సముద్రకుమారి తనకు తగని ఆ ఆశను వదిలిపెట్టి, ఈ పేద శివాలయసేవకుని పెళ్ళి చేసుకోవడానికి అంగీకరించింది!"

అప్పుడు పూంగుళలి, "అయ్యా! నాకు 'తగని ఆశ' అని ఎలా చెబుతారు? ముల్లోకాలేలే చక్రవర్తిని కావడానికి కూడ నేను అర్హురాలినే. అలా ఉన్నా కూడ నేను మిమ్మల్ని పెళ్ళాడి పూలమాలలు కడుతూ బతికేందుకు, పడవ నడిపి జీవితం గడిపేందుకు ఒప్పుకొన్నాను!" అన్నది.

"అలా చెప్పు, పూంగుళలీ! నీ అర్హతను సెలకొల్పేందుకు ఇదే చాలు! అర్హత, అనర్హత ఎలా వస్తాయి? పుట్టుకతో కాదు కద? కాబట్టి నీ మనోరథాన్ని ఇప్పుడు చేజార్చకు. నిన్ను పెళ్ళాడబోయే ఈ మహారాజ కుమారునికి కూడ మాతోబాటు చెప్పు! చిన్నాన్నా! మీరు మీ పుట్టుక గురించిన నిజాన్ని తెలుసుకొన్న తర్వాత కూడ రాజ్యం వద్దని వైరాగ్యంగొన్నది న్యాయమే. అది మీ పుట్టుకతోనే వచ్చిన ఉన్నతగుణాన్ని చూపుతోంది. ఇప్పుడు మేమందరమూ చెబుతున్నాము. చక్రవర్తి చెబుతున్నారు; ముఖ్యమంత్రి చెబుతున్నారు. నేనూ, నా సహోదరుడూ చెబుతున్నాము; నా చెలి వాణతి చెప్పడమే కాదు, తన పెదతండ్రి మనసు మార్చడానికి కూడ ఒప్పుకొంది. ఇప్పుడెందుకు మీరు నిరాకరించాలి?" అన్నది యువరాకుమారి కుందవై.

"దేవీ! మీరందరూ చెబుతున్నారు. కానీ ఈ రాజ్యప్రజలేం చెబుతున్నారు? అది మీకు బహుశ తెలియకపోవచ్చు. దేశ ప్రజలతో మసలిన నాకు బాగ తెలుసు. ఈ తంజావూరులోను, పళైయారైలోను, కోడిక్కరైలోను, నాగపట్టణంలోను ప్రజల కోరిక ఏమని నాకు బాగ తెలుసు. పాండ్యనాడులోను, పల్లవనాడులోను, కొంగునాడులోను లంకలోను ప్రజల కోరిక ఏమని వినికిడి వల్ల ఎరుగుదును. 'అరుళ్మొళివర్మగారే పట్టం కట్టుకోవాలి!' అన్నదే ప్రజలు ఏకకంఠంతో కోరుతున్నారు. ఇంత పెద్ద ప్రజాప్రవాహానికి ఎదురుగా నేనీదగలనా? నేను ఆశపడ్డా, ఇంత పెద్ద చోళసామ్రాజ్యాన్ని నేనేలగలనా? భగవాన్! మీరందరూ 'పాత మధురాంతకులు' అని పిలిచే ఆయన మీద ప్రజలకెంత విసుగు, ఏవగింపు కొన్నారో నాకు తెలుసు. ఆ ఏవగింపుకంతా నన్ను బాధ్యుడిని చేయజూస్తున్నారా? నాకంత పెద్ద కీడును తలపెట్టకండి. నేను మీలో ఎవరికీ కీడు చేయలేదు కద?"

అందుకు తక్కినవారెవరూ బదులు చెప్పే మునుపే పొన్నియిన్ సెల్వన్ గంభీరంగా తలెత్తి నిలబడి, "ఈ మాటలు ఇంతటితో ఆగనీ! మీరీ గదిలోకి వస్తున్నప్పుడు నేను 'చోళసామ్రాజ్యానికి నేనే పట్టం కట్టుకొంటాను' అని వంతిదేవులకు చెబుతున్నాను. దాన్ని నెరవేర్చే తీరుతాను. మహారాణి దివ్యగర్భంలో ఉదయించిన ఈ ఉత్తమ స్నేహితుల మాట/ఉద్దేశం కూడ తెలుసుకొన్నాను. రాజ్యహక్కు గురించి ఇంకే మాటలు వద్దు!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 75

## విపరీత పరిణామాలు

**తంజైపురి** (తంజావూరు) అంతఃపురంలోని అంతరంగ మంత్రాలోచనా మందిరంలో పరాంతక సుందర చోళ చక్రవర్తి ధర్మ సింహాసనం మీద ఆసీనులైవున్నారు.

అంతఃపురస్త్రీలలో ముఖ్యమైనవారు వారికిరువైపులా ఆసీనులైవున్నారు.

చోళనాడు మంత్రులు, దళపతులు, రాజకుమారులు చక్రవర్తి ముందు వినయంగా నిలబడివున్నారు.

స్త్రీలలో ప్రధమ మహారాణియైన శెంబియన్ మహాదేవి, పట్టపురాణిగారైన వాణ మహాదేవి, యువరాకుమారి కుందవై, కొడుంబాళూర్ రాకుమారి ఉన్నారు. వారితోబాటు కూర్చోవడానికి కాస్త సంకోచించిన పూంగుళలి కాస్త దూరాన అగుపించింది.

పురుషుల్లో పెద్ద పళువేట్టరయ్యర్, చిన్న పళువేట్టరయ్యర్, ముఖ్యమంత్రి అనిరుద్ధులు, సేనాధిపతి పెద్ద వేళార్, మలైయమాన్, యువరాజు అరుళ్మొళివర్మ, పునర్జన్మ పొందిన మధురాంతక దేవరు, పార్థిబేంద్ర పల్లవుడు, ముఖ్యమంత్రి వెనక కాస్త ఒదిగి తిరమలై కానవచ్చారు.

చక్రవర్తి సభలో సమావేశమైన వారందరిని ఒకసారి చూసి, “ఆహ్వానించినవారందరూ వచ్చారా? కడంబూర్ రాజు కనిపించడం లేదే?” అన్నారు.

“శంబువరయ్యర్ కుమారుడు ఇప్పుడే కద తిరిగి వచ్చాడట. తండ్రీకొడుకులిద్దరూ అతి త్వరలో ఇక్కడికి వచ్చి చేరుతారు!” అన్నాడు పార్థిబేంద్రుడు.

“ఓ! గందమారన్ తిరిగి వచ్చేశాడా? ఏం వార్త తీసుకొని వచ్చాడు? తప్పించుకొని పారిపోయినవారిని పట్టుకొని వచ్చాడా?” అని అడిగారు చక్రవర్తి.

“లేదు, ప్రభూ! వారిని పట్టుకోవడం సాధ్యం కాలేదు. కానీ వంతిదేవుని చంపేశానని చెబుతున్నాడు గందమారన్. ఇంకొక పిచ్చివాడు దొరగలేదట. తప్పించుకొని పారిపోయాడట!” అన్నాడు పార్థిబేంద్రుడు.

~

పెద్ద పళువేట్టరయ్యర్ అప్పుడు ఒక్కసారి హుంకరించారు. ఆయన ఏదో చెప్పబోతున్నారని అందరూ ఎదురు చూశారు. కానీ ఆయన ఏమీ మాట్లాడలేదు.

చక్రవర్తి, “నేను చేసిన తప్పు వల్ల ఇంకా ఏమేమి విపరీత పరిణామాలు జరగబోతున్నాయో, తెలియడం లేదు! ముఖ్యమంత్రీ! నా మనసులోని ఆలోచనలను మీరు బాగా ఎరుగుదురు. నాకు, నా

కులానికి చాల ఆప్తులైనవారిని ఇప్పుడిక్కడికి ఆహ్వానించాను. ఎందుకని పిలిచానన్నది, నా మాట ఏమని మీరే సభకు వివరించి చెప్పాలి. నా కన్న తేటగా మీరు చెప్పగలరు కద?" అన్నారు.

"ఆజ్ఞ, చక్రవర్తీ!" అని చెప్పి, ముఖ్యమంత్రి సభికులందరిని ఉద్దేశించి ఇలా చెప్పారు:-

"పలు కారణాలవల్ల చక్రవర్తి మనసు గాయపడివుందన్న విషయం మీరందరూ ఎరుగుదురు. అభిమన్యుడికి, అరవాన్‌కి సాటియైన వీరాధివీరుడైన ప్రధమపుత్రుని మన ఏలిక కోల్పోయారు. యువరాజు మరణించిన కారణమేమో ఇంకా మర్మభూయిష్టంగానే ఉంది. మూడేళ్ళుగా ఆ వీరపుత్రుని మన ఏలిక చూడలేదు. కంచిలో బంగారు మాళిగ కట్టించి, అందులో తండ్రి వచ్చి ఉండాలని సందేశం మీద సందేశం రాసి పంపారు. కానీ చక్రవర్తి వెళ్ళలేదు. అందుకు కారణం మీకందరికీ తెలుసు. ఈ తంజావూరు నగరంలో చక్రవర్తి చిన్న పళువేట్టరయ్యర్ రక్షణలో ఉంటూ వచ్చారు. నగరంలోను, దేశంలోను అందు గురించి పలు వదంతులు ప్రచారమవుతూ వచ్చాయి. అటువంటి సందర్భంలో చక్రవర్తి తంజావూరు వదిలి వెళితే, పళువేట్టరయ్యర్ల మీద ఆయన నమ్మకం సన్నగిల్లిందని ఎవరైన సందేహపడవచ్చు కద? అటువంటి సందేహాలకు ఆస్కారమివ్వడం చక్రవర్తికి ఇష్టం లేదు. మన చక్రవర్తి చెప్పేందుకు కాస్త సంకోచపడగల ఒక విషయాన్ని నేను బాహాటంగా చెబుతాను. అందుకు, ఇక్కడ సమావేశమైన రాజవంశ నాయకులందరూ నన్ను క్షమించాలి. మన చక్రవర్తి కొంతకాలంగా జబ్బుపడి, కాళ్ళలో సత్తువ కోల్పోయి మంచం పట్టారు. అందువల్ల ఆయన మనసు కూడ అనారోగ్యం పాలైంది. కానీ దానికన్న అధికంగా ఆయన మనసును గాయపరిచిన మనోవ్యాధి ఒకటుంది. చోళ మహావంశానికి చాల తోడుగావున్నవారు, తరతరాలుగా ఆ కులంతో దగ్గరి సంబంధం కలిగినవారు, మహాచోళసామ్రాజ్యాన్ని వజ్రస్తంభాలుగా మోస్తున్నవారు అయిన మీరు ఒకరితొనొకరు భేధభావంగొని ఉండడమే చక్రవర్తి మనసును అధికంగా గాయపరిచి దేహారోగ్యాన్ని కూడ అధికంగా దిగజార్చుతూ వచ్చింది. ఏనుగు మీద మరణించి వీరస్వర్గం చేరుకొన్న రాజాదిత్యుల నాయకత్వంలో మీరందరూ ఐకమత్యంతో తక్కోలంలో యుద్ధం చేశారు. ఆ యుద్ధంలో రాజాదిత్యులు ఎదురు చూడని విధంగా మరణించడం వల్ల చోళసైన్యం ఓటమి పొందింది. కానీ మీ వీరత్వం వల్లను, దృఢత్వం వల్లను, ఐకమత్యం వల్లను కోల్పోయిన తొండైమండలాన్ని, గంగై మండలాన్ని తిరిగి కైవసం చేసుకొన్నారు. శేవూర్ యుద్ధంలో పాండ్యసైన్యం వెన్ను విరిచి, పాండ్యనాడును కైవసం చేసుకొని మన అధీనంలోకి తీసుకొచ్చారు. లంకలో మహీంద్రుని తరిమికొట్టి పులిజెండాను ఎగురవేశారు. ఇంతటి మహా వీరకృత్యాలను, మీరందరూ ఐకమత్యంతో, చోళరాజ్యం మేలే మీ మేలని ఎంచినందువల్లే సాధించగలిగారు.

"అటువంటి మంచి స్థితి కొన్నేళ్ళుగా మారిపోయింది. ఏ కారణం వల్లనో మీ మధ్య భేధభావం ఏర్పడింది. రెండు పక్షాలుగా విడిపోయారు. ఈ వేర్పాటును పోగొట్టి, తిరిగి అందరినీ ఒక్కటి చేయాలని మన ఏలిక ఎంతగానో ప్రయత్నించారు. తమ తర్వాత రాజ్యహక్కు ఎవరిదన్న విషయం గురించే మీ మధ్య భేధభావం పుట్టిందని గ్రహించారు. మీరెవ్వరూ దాన్ని ముఖాముఖి చక్రవర్తి ముందు చెప్పలేదు. కానీ

సాటిలేని మేధావియైన మన చక్రవర్తి దాన్ని ఊహించి తెలుసుకొన్నారు. రాజ్యహక్కు గురించి మీ అందరితోను మనసు విప్పి మాట్లాడి సమరసంగా పరిష్కరించాలని కోరుకొన్నారు. అలా సమరసంగా మాట్లాడి ముగించిన తర్వాతే కంచికి వెళ్ళాలని నిశ్చయించుకొన్నారు. శివజ్ఞాన గండరాదిత్యుల కుమారులైన మధురాంతకులకే ఈ చోళసామ్రాజ్యాన్ని అధీకృతం చేయాలని భావించారు. ఈ నిర్ణయానికి ఆదిత్య కరికాలన్ని కూడ ఒప్పించగలమని భావించారు. ఇంతలో ఆ ఎదురు చూడని దుఃఖసంభవం జరిగిపోయింది. కరికాలన్ కడంబూర్ మాళిగకు వస్తున్నారని తెలియగానే చక్రవర్తి మనసు ఉప్పొంగింది. ఇందు మూలంగా మీ మధ్య కలిగిన భేధభావం తొలగిపోతుందని ఆశించారు. కరికాలన్ శంబువరయ్యర్ కుమార్తెను పెళ్ళాడితే మీరందరూ మళ్ళీ ఒక్కటవుతారని, రాజ్యహక్కు గురించిన వివాదాన్ని సులభంగా పరిష్కరించవచ్చని భావించారు. నేను కూడ అలాగే భావించాను. మీలో పలువురు అలాగే భావించివుంటారు. మన తిరుక్కోవలూర్ రాజుగారు కూడ అందుకే ఆదిత్య కరికాలన్ కడంబూర్ వెళ్ళడానికి అడ్డు రాలేదు. కానీ మన ఆశలన్నీ అడియాసలైనాయి. కడంబూర్ మాళిగలో కరికాలన్ అకాల మరణం చెందారు..."

"అది ఎలా జరిగిందని శోధించి కనిపెట్టబోతున్నామా, లేదా? అది తెలుసుకొన్న తర్వాత మీరు ముందుకు మాట్లాడడం ఉచితంగా ఉంటుంది" అన్నారు తిరుక్కోవలూర్ మలైయమాన్.

"అవును; అది తెలుసుకోకుండ ఇంకే ఆలోచన చేయడం సాధ్యం కాదు!" అన్నారు సేనాపతి బూది విక్రమకేసరి.

"వీర మహాజనులారా! జరిగింది జరిగిపోయింది. జరిగిపోయినదాన్ని మళ్ళీ కెలకడం వద్దంటున్నారు చక్రవర్తి!" అన్నారు ముఖ్యమంత్రి.

"అదెలా ఉచితమవుతుంది? చోళవంశపు నీతి, న్యాయపరిపాలన జగత్ప్రసిద్ధమైనది. ఈ నాడులో ఒక దిక్కులేని అనాధ మరణించినా, అదెలా జరిగిందని విచారించబడుతుంది. అందుకు ఎవరైనా కారణమని నిరూపించబడిన తర్వాత, తగిన శిక్ష విధించబడుతూంది. అలా ఉండగా, పట్టపు యువరాజుగా పట్టాభిషేకం చేయబడ్డ రాకుమారుని అకాల మరణాన్ని విచారించకుండ వదిలివేయడమా?" అన్నారు సేనాధిపతి.

~

సుందర చోళ చక్రవర్తి పెద్దగా నిట్టూర్చి, "కొడుంబాళూర్ మామా! వినండి! నా కొడుకు అకాల మరణానికి నా కన్న ఇంకెవరు అధికంగా దుఃఖించ సాధ్యం? నేనే విచారణ వద్దంటున్నాను. ఎందుకు? ఇక్కడున్నవారెవ్వరూ అందుకు బాధ్యులు కారని నిశ్చయంగా ఎరుగుదును. నేను చేసిన పాపఫలితంగా నేను నా కుమారుని కోల్పోయాను. దానికి ప్రాయశ్చిత్తమేమిటో చెప్పండి! చేస్తాను! ఇంకే కారణం వెతక్కండి!" అన్నారు.

"నూట ఒక మాట! అదే నిజాయితీగా నడుచుకొనే రాజవంశస్థులకు ఉచితం. ఈ మహానేరాన్ని విచారించి శిక్షించకపోతే, దేశప్రజలకు నీతి, న్యాయపరిపాలనలో నమ్మకం సన్నగిల్లిపోతుంది!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"పెద్దలారా! దీనిగురించి ఎందుకింత వాద ప్రతివాదాలు? ఈ చిన్నవాడు చెప్పేది అధికప్రసంగమనిపిస్తే క్షమించండి. నేరస్థుడు శిక్షించబడ్డాడు! యువరాజును చంపినవాడు, నా సహోదరి జీవితాన్ని పాడు చేసి, దాన్ని పిచ్చిదానిగా చేసిన పాతకుడు వంతిదేవుని నేను నా చేతి శూలంతో చంపేసి వెనుదిరిగాను. ఇంకెందుకు విచారణ?" అన్నాడు గందమారన్.

~

ముఖ్యమంత్రి మాట్లాడుతున్నప్పుడే గందమారన్ అక్కడికి వచ్చేశాడు. అతడక్కడికి వచ్చి చేరిన విషయం అతడి గొంతు విన్న తర్వాతే తక్కినవారు గమనించారు.

వారిలో పెద్ద పళువేట్టరయ్యర్ మెల్లని స్వరంతో, "మూఢుడు! పరమమూఢుడు! కడంబూర్ శంబువరయ్యర్‌కి ఇలాంటి కొడుకు పుట్టాడు కద!" అని గొణిగారు.

ముఖ్యమంత్రి, "గందమారా! నీవు వంతిదేవుని శూలం విసిరి చంపింది నిజమేనా? అతన్ని నీవు చూశావా? రాత్రిపూట కద నీవతన్ని తరుముకొంటూ వెళ్ళావు?" అని అడిగారు.

"ముఖ్యమంత్రీ! మీకు నామీదెప్పుడూ నమ్మకం లేదని నాకు తెలుసు. రాత్రిపూటయితే మనిషిని గుర్తుపట్టడం సాధ్యం కాదా?"

"అతడూ వీరుడే కద? నీతో యుద్ధం చేయలేదా?"

"అవును, నా వీరత్వం మీద కూడ మీకు నమ్మకం లేదు, నిజమే. కాబట్టి చక్రవర్తికి విన్నవించుకొంటాను. పారిపోయినవారు ఇద్దరు. ఒకడు కొన్నేళ్ళుగా పాతాళ చెరసాలలో ఉన్న పిచ్చివాడు. వాడు నన్ను అడ్డగించ ప్రయత్నించినప్పుడు ఇంకొకడు నదిని దాటుతూ అవతలి గట్టును సమీపిస్తున్నాడు. శూలం విసిరి వాడిని చంపాను. వాడు వాణర్‌కులపు వంతిదేవుడే అయివుండాలి."

"చనిపోయినవాడి మృతదేహాన్ని నీవు నీతోబాటు తీసుకొని రాలేదా?"

"మీరిలా సందేహిస్తారని తెలిసివుంటే నేను ఆ ఉత్తరనదిలో ఇంకాస్త దూరం వెళ్ళి చూసేవాడిని. కానీ ఈ మంత్రాలోచన సభకు రాలేకపోయేవాడిని!" అన్నాడు గందమారన్.

"అవును; నీవు రాకపోయివుంటే పెద్ద నష్టమే కలిగివుండేది!" అన్నారు దళపతి చిన్న పళువేట్టరయ్యర్.

"తమ్ముడూ! వంతిదేవుని వెతికి పట్టుకోవడంలో నీకెందుకింత శ్రద్ధ?" అని అడిగారు పెద్ద వేళార్.

"ఇది కూడ అడగాలా? నా ఇంట ఆ దుర్ఘటన జరిగింది. నిజమైన నేరస్థుడు పట్టుబడకపోతే,

నా మీద, నా తండ్రిమీద మీరు సందేహపడరా?"

~

సుందర చోళ చక్రవర్తి కలిగించుకొని, "అబ్బాయీ! గందమారా! అలా ఇంకెవరు సందేహపడ్డా కూడ, నేను సందేహపడను. నీ తండ్రికి నామీదున్న భక్తివిశ్వాసాలు నేనెరుగనా? పోతేపోనీ! పెద్ద శంబువరయ్యర్ ఎక్కడ?" అన్నారు.

"చక్రవర్తీ! నా కుటుంబపు అవమానాన్ని నేనే సిగ్గు విడిచి చెప్పుకోవలసి వస్తూంది. నేను వంతిదేవుని చంపి తిరిగి వచ్చానని నా తండ్రికి చెబుతుండగా నా చెల్లెలు మణిమేఖల విన్నది. నేను చెప్పింది వినగానే ఆమె నన్నే కత్తితో పొడిచి చంపేందుకు ముందుకు వచ్చింది. ఆమెను శాంతపరచి, ఆమె వెర్రి ఆవేశాన్ని చల్లబరిచేందుకు నా తండ్రి ప్రయత్నిస్తున్నారు. త్వరలో వచ్చేస్తారు. ఈ మంత్రాలోచన సభలో ఏం తీర్మానించబడుతుందో, అదే తాను కూడ ఒప్పుకొంటానని చెప్పి పంపారు" అన్నాడు గందమారన్.

"అబ్బాయీ! నీ సహోదరి ఇంతకు మునుపే 'యువరాజును నేనే చంపాను' అని పిచ్చి పట్టినట్లు చెబుతూంది కద?" అన్నారు వృద్ధ మలైయమాన్.

"అవును! వంతిదేవుడు చేసిన నేరాన్ని కప్పిపుచ్చి వాడిని కాపాడేందుకే అలా చెప్పింది. అప్పుడు ఆమె పూర్తి పిచ్చి కాలేదు. ఇప్పుడు పిచ్చి ముదిరిపోయింది. మా కుల దురదృష్టం!" అన్నాడు గందమారన్.

"యువ శంబువరయ్యరే! వంతిదేవుడే యువరాజును చంపాడని ఘంటాపథంగా చెబుతున్నావు కద? అదెలా? నీవే నీ కళ్ళారా చూశావా? లేక చూసినవారెవరైనా చెప్పారా?" అని అడిగారు ముఖ్యమంత్రి.

"ముఖ్యమంత్రీ! ముంజేతి కంకణానికి అద్దమేల? యువరాజు మృతుడై పడివున్న స్థలంలో ఆ వంతిదేవుడు మాత్రమే ఉన్నాడు. వాడి ముఖం చూస్తేనే నేరస్థుడని రాసి ముఖం మీద అంటించినట్లు తోచింది. అదేమో పళువూర్ యువరాణి అంతఃపురం. అక్కడికి వీడెందుకు వెళతాడు? నేరం చేసినవాడు కాకపోతే, పాతాళ చెరసాల నుంచి ఎందుకు తప్పించుకొని పారిపోవాలి?" అన్నాడు గందమారన్.

"పాతాళ చెరసాలనుంచి తప్పించుకొని పారిపోయిన వాడిని వెతికి పట్టుకొని వచ్చే బాధ్యతను ముఖ్యమంత్రి తీసుకొన్నారు. దాన్ని ఈ సందర్భంలో గుర్తు చేస్తున్నాను!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"పల్లవకుల రాకుమారా! నేనా బాధ్యతను తీసుకొన్నది నిజమే. కానీ యువ శంబువరయ్యర్ తామే న్యాయపతిగా నేరవిచారణ చేసి, శిక్షకూడ తామే విధించేస్తారని నేను ఎదురు చూడలేదు. వంతిదేవులు కూడ పురాతన వాణర్‌కులానికి చెందినవారు. వారి ముత్తాతలు ఒకప్పుడు పెద్ద రాజ్యాన్ని ఏలారు. చోళకులానికి కూతురినిచ్చి సంబంధం కలుపుకొన్నవారు. సామంతరాజుల మీద నేరం మోపబడితే, చక్రవర్తే ధర్మపీఠం మీద ఆసీనులై, విచారించి తీర్మానించడమే సంప్రదాయం!" అన్నారు

ముఖ్యమంత్రి అనిరుద్ధ బ్రహ్మరాయలు.

"అయ్యా! చెరసాల నుంచి తప్పించుకొని పారిపోయినవాడిని ప్రాణాలతో పట్టుకొని రావచ్చు' లేక నిర్జీవునిగా కూడ తీసుకొని రావచ్చన్నది కూడ సంప్రదాయమే!" అన్నాడు పల్లవకుల వీరుడు పార్థిబేంద్రుడు.

"వంతిదేవుని నిర్జీవునిగా కూడ యువ శంబువరయ్యర్ తీసుకొని రాలేదు కద? ఉత్తరనదీప్రవాహంలో  విడిచిపెట్టేసి కద వచ్చారు?" అన్నారు ముఖ్యమంత్రి.

~

అప్పుడు పెద్ద శంబువరయ్యర్ సభలో ప్రవేశించగా అందరి చూపులు ఆయనవైపు మళ్ళాయి. ఆయన ముఖంలో గూడు కట్టుకొన్న ఆవేదనను అందరూ గమనించారు.

గందమారన్ ఆయన దగ్గరికి వెళ్ళి మెల్లని స్వరంతో, "మణిమేఖల ఎలా ఉంది?" అని అడిగాడు.

శంబువరయ్యర్, "అలాగే ఉంది. నీ తల్లిని ఆమెకు కాపలా ఉంచి వచ్చాను" అని గద్గద స్వరంతో కాస్త తడబడుతూ చెప్పారు.

చక్రవర్తి శంబువరయ్యర్ని చూసి, "అయ్యా! మీరు మీ ప్రియపుత్రిక చెంత ఉండడం అవశ్యమైతే అలాగే చేయండి. మన మంత్రాలోచనను రేపు పెట్టుకొందాం!" అన్నారు.

"లేదు, ప్రభూ! ఆమె చెంత నేనుండి ప్రయోజనమేమీ లేదు. నా కుమారుని చేతి శూలం చేత మరణించిన ఆ వాణర్‌కుల వీరుడు మళ్ళీ బతికి వస్తే ఏమైన ఫలితం ఉండవచ్చు!" అన్నారు శంబువరయ్యర్.

ఆయన మాటలో ధ్వనించిన వేదన, మనసులోని చేదు ఆ సభలో కాసేపు మౌనం నెలకొనేలా చేశాయి.

ముఖ్యమంత్రి అనిరుద్ధులు, "అయ్యా! తమ మాళిగలో జరిగిన విపరీత సంభవం గురించి మాట్లాడుతున్నాము. యువరాజు తమ మాళిగలో అకాల మరణం చెందినందువల్ల మీ మనసు ఎంతగా గాయపడివుందో మేమందరమూ ఎరుగుదుము. అందుకు చక్రవర్తి మిమ్మల్ని ఏ విధంగాను బాధ్యులు చేయగోరడం లేదు. కానీ, దేశంలో పలురకాల వదంతులు వ్యాపించకుండడం కోసం యువరాజు మరణం ఎలా జరిగిందని నిశ్చయంగా తెలుసుకోవడం మంచిది కద? ఈ సభలో సమావేశమైనవారందరూ అలా అభిప్రాయపడుతున్నారు. వాణర్‌కులపు వంతిదేవుని చేతనే యువరాజు మరణం సంభవించిందని నిశ్చయంగా తెలుసుకొంటే మంచిది కద? దాని గురించి సభకు తెలియజేయడానికి మీ దగ్గర ఏమైన విషయాలున్నాయా? వంతిదేవుడే యువరాజును చంపాడని యువ శంబువరయ్యర్ నొక్కి చెబుతున్నారు. మీ మాటేమి?" అని అడిగారు.

శంబువరయ్యర్ కాసేపు ఆశ్చర్యంతో అవాక్కై నిలబడిపోయారు. తర్వాత నలువైపులా చూశారు. చివరిగా ఆయన చూపు గందమారన్ మీద నిలిచింది. “అవునవును. ఈ మూఢుడు ఆరోజలాగే చెప్పాడు. దాన్ని నేను నమ్మలేదు. ఇప్పుడూ నమ్మడం లేదు. వీడి మాట విని యువరాజు కరికాలన్ నా మాళిగకు వచ్చేలా చేశాను. అందువల్ల ఇన్ని విపరీత పరిణామాలు జరిగిపోయాయి. నాకు, నా కులానికి ఎన్నటికీ మాసిపోని అపకీర్తి కలిగింది!” అన్నారు.

వృద్ధ మలైయమాన్ మెల్లని స్వరంతో, “శంబువరయ్యరే! అలా మాట్లాడకండి! జరిగింది జరిగిపోయింది. మీరు సదుద్దేశంతోనే నా మనుమడిని మీ మాళిగకు ఆహ్వానించారు. కరికాలన్ మరణానికి మిమ్మల్ని బాధ్యులు చేయాలని ఇక్కడెవ్వరూ అనుకోవడం లేదు. అందుకే నిజాన్ని తెలుసుకోగోరుతున్నాము! అందుకు మీరు సహాయం చేస్తే చాల మేలవుతుంది!” అన్నారు.

“నేనేం సహాయం చేయగలను? నా కొడుకు ఒకటి చెబుతున్నాడు. అందుకు పూర్తి వ్యతిరేకంగా నా కూతురు ఇంకొకటి చెబుతూంది. ఇద్దరి మాటలనూ నేను నమ్మలేకపోతున్నాను. నాకు నిజం తెలియడం లేదు. కళ్ళకు గంతలు కట్టి అడవిలో విడిచిపెట్టినట్లుంది. నిజంగా జరిగిందేమిటో తెలుసుకోవాలంటే, నా కన్న ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్ సహాయం చేయగలరు. వారినే అడగండి! ఆయనే అన్నిటికీ మూలకారణం. ఆయనే మొట్టమొదట మధురాంతక దేవరిని రహస్యంగా కడంబూర్ మాళిగకు పిలుచుకొని వచ్చారు. నా కుమార్తెను వారికిచ్చి పెళ్ళి చేద్దామని కూడ చెప్పారు. అప్పటినుంచి నా కుటుంబానికి శని పట్టుకొంది. ఆ మధురాంతకులే ఇప్పుడు మాయమైపోయారని తెలుసుకొన్నాను. తర్వాత, పెద్ద పళువేట్టరయ్యర్ తమ యువరాణిని పిలుచుకొని వచ్చారు. కంచినుంచి యువరాజును కూడ రప్పించారు. ఇద్దరినీ నా మాళిగలో వదిలేసి వెళ్ళిపోయారు. ఎందుకు వెళ్ళారని అడగండి! వారి యువరాణి ఇప్పుడెక్కడని అడగండి!”

~

ఇలా శంబువరయ్యర్ పిచ్చి ఆవేశంతో ఏవేవో మాట్లాడసాగారు.

చక్రవర్తి అడ్డొచ్చి, “చాలు! చాలు! ఆపండి! ఇందుకే జరిగిపోయినదాని గురించి విచారణ ఏమీ వద్దన్నాను. మీరు వినలేదు. ఇప్పటికే మీ మధ్య ఉన్న భేదభావం చాలదా? కొత్తగా దెప్పిపొడుపులెందుకు? శంబువరయ్యరే! మీ మాళిగలో జరిగినదానికి మీరు బాధ్యులు కారు. అందుకే మిమ్మల్ని వెంటనే పాతాళ చెరసాలనుంచ విడుదల చేయించాను. నా వీరపుత్రుని అకాల మరణానికి నా పాత పాపాలే కారణం. ఎవరి నేరమూ లేదు. దాని గురించి ఏమీ చెప్పకండి. పెద్ద పళువేట్టరయ్యర్ కూడ ఏమీ చెప్పనవసరం లేదు!” అన్నారు.

అప్పుడు పెద్ద పళువేట్టరయ్యర్ సింహం గర్జించినట్లు గొంతు సవరించుకొని ఇలా చెప్పారు:-
“చోళకుల కుమారా! దయచేసి క్షమించాలి. నేను మాట్లాడకుండ ఉండ సాధ్యం కాదు. నా మనసులో

ఉన్నది చెప్పే తీరాలి. నిజాన్ని నేనెరిగినట్లు చెప్పే తీరాలి. అవును, మహారాజా! నిజాన్ని ఎందుకు చెప్పాలని, చెప్పకనే నా ప్రతిజ్ఞను నెరవేర్చేద్దామని ఎంచింది నిజమే. ఒకప్పుడు నేను మన వేళక్కార దండుకు నాయకుడినిగా ఉండేవాడిని. చోళకులానికి చెందినవారిని కాపాడలేని పరిస్థితి వస్తే నా తలను నేనే నరికేసి ప్రాణాలు విడుస్తానని ప్రమాణం చేసినవాడిని. ఆదిత్య కరికాలన్‌గారిని నేను కాపాడలేకపోయాను. కాబట్టి నా ప్రతిజ్ఞను నెరవేర్చే తీరాలి. దానికి ముందు నాకు తెలిసిన నిజాన్ని చెప్పేయగోరుతున్నాను. లేకపోతే పలు సందేహాలు పుట్టి, అనవసర నిందలు మోపబడడానికి హేతువవుతుంది!"

~

పెద్ద పళువేట్టరయ్యర్ ఈ మాటలు చెప్పి ఆపినప్పుడు సభలో పరిపూర్ణ మౌనం నెలకొంది. అందరి మనసులు ఒక్కక్షణం మెత్తబడి కరిగిపోయాయి.

చక్రవర్తి గద్గద స్వరంతో, "మామా! కాస్త ఆలోచించండి! మీరెందుకని జరిగిపోయిన సంఘటనల గురించి ఆలోచించాలి? మరణించినవారు తిరిగి రాబోవడం లేదు. మీరు తెలిసి తెలిసి / బుద్ధిపూర్వకంగా చోళకులానికి ఎలాంటి ద్రోహమూ చేసివుండరు! కాబట్టి జరిగిపోయింది మరిచిపోయి, ఇక జరగవలసిందేమిటో దాని గురించి మాట్లాడుదాం!" అన్నారు.

"లేదయ్యా! జరిగిపోయినదాని గురించి నేను మాట్లాడే తీరాలి. చోళకులానికి నేనెంత పెద్ద ద్రోహం చేయబోయానన్నది చెప్పే తీరాలి. తమకు, నాకు కులదైవమైన దుర్గాదేవే అలా జరగకుండ అడ్డుకొంది. ఆ తల్లికి నా కానుక చెల్లించే తీరాలి. కరుణజూపి నేను చెప్పబోయే మాటలను శ్రద్ధగా వినండి!" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్. ఆయనను ఇక మాట్లాడక ఆపలేమని గ్రహించి చక్రవర్తి కూడ ఊరుకొన్నారు.

~

తర్వాత పెద్ద పళువేట్టరయ్యర్ మూడేళ్ళ క్రితం నందినిని ఒక బాట వారగా చూసి, మోహించింది మొదలు జరిగిందంతా ఒక్కటీ దాచకుండ చెప్పారు. తమ సహోదరుడైన చిన్న పళువేట్టరయ్యర్ చాలసార్లు హెచ్చరించినా తాము పట్టించుకోని విషయాన్ని చెప్పారు. నందిని పురిగొల్పినందువల్ల మధురాంతక దేవరికి చోళ సింహాసనం దక్కేటట్లు చేయాలని ఎంచిన విషయమూ, అందుకోసం తక్కిన చిన్నరాజులను చేరదీసి కుట్ర పన్నిన విషయాన్ని కూడ చెప్పారు. నందిన మూసిన పల్లకిలో మధురాంతకులను తీసుకొని వెళ్ళిన విషయం, శంబువరయ్యర్ మాళిగలో నడిరేయి జరిగిన సమావేశం గురించి కూడ చెప్పారు. మొట్టమొదట వంతిదేవుని కారణంగానే తమకు నందిని మీద సందేహం కలిగిందని, అందుగురించి పాండ్యనాడు కుట్రదారుల గురించి ఆలోచన మొదలైందని తెలియజేశారు. కానీ అప్పుడు నందిని మోహమాయ వల్ల తమ వివేకం మరుగైందని దుఃఖపూరితంగా వివరించారు. చివరిగా, కొళ్ళిడం నది గట్లు తెంచుకొన్న వరదలో చిక్కుకోవడం వల్ల పాండ్యనాడు

కుట్రదారుల పథకం ఇదీ అని తెలుసుకొన్న విషయాన్ని, వేగంగా కడంబూరుకు తిరిగి వెళ్ళిన విషయాన్ని చెప్పారు. దారిలో కాళాముఖ శైవులలాగ వేషం ధరించిన విషయాన్ని, ఇడుంబన్‌కారి సహాయం వల్ల రహస్యమార్గం ద్వారా అంతఃపురాన్ని చేరుకొన్న విషయాన్ని, వాద్యాల గదిలో దాక్కొని నందినికి, యువరాజుకు మధ్య జరిగిన సంభాషణను చెవులు రిక్కించి వినాలనే ఆశ వల్ల ఒక్క నిమిషం ఆలస్యం చేసిన విషయాన్ని, అంతలోపల యువరాజు మరణించి కిందపడ్డ విషయాన్ని చెప్పారు. ఆయనను పట్టుకోవడానికి తాము ముందుకు దూకినప్పుడు దీపం ఆరిపోయిన విషయాన్ని, తమను పలువురు చుట్టుముట్టి అటకాయించిన విషయాన్ని, తాము స్పృహ కోల్పోయిన విషయాన్ని, తర్వాత తిరిగి వచ్చిన విషయాన్ని తెలిపారు.

"చక్రవర్తీ! ఇలా నేను చోళకులానికి మహాద్రోహం చేసినవాడనైనాను. పాండ్యనాడు కుట్రదారులకు నా అంతఃపురంలోనే చోటిచ్చాను. మన బొక్కసంనుంచే వారి కుట్రలకు కావలసిన ధనాన్ని తీసుకోవడానికి అనుమతిచ్చాను. మిమ్మల్ని, మీ కుమారులిద్దరిని ఒకేసారి హత్య చేసేందుకు వారు పథకం వేసుకొన్నారు. తమను చెవిటిది, మూగది అయిన ఒక దైవసమానురాలైన స్త్రీమణి తన ప్రాణాలిచ్చి కాపాడింది. పొన్నియిన్ సెల్వన్ని వివేకం లేని ఒక ఏనుగు కాపాడింది. నేను ఆదిత్య కరికాలన్ని కాపాడ ప్రయత్నించి ఓడిపోయాను. ఆయన అకాల మరణానికి నేనే ఆది మధ్యాంతరాలలో కారణమైనాను. అయ్యా! దుర్గాపరమేశ్వరి సన్నిధిలో నేను చేసిన ప్రతిజ్ఞను ఇదిగో నెరవేరుస్తాను!" అని చెప్పేసి తమ ఆజానుబాహువుతో, తమ పట్టాకత్తిని ఎత్తారు. ఆయన ఉద్దేశాన్ని గ్రహించిన సభికులందరూ అదిరిపడి భ్రమించి నిలబడిపోయారు. కానీ, మెల్లమెల్లగా ఆయనను సమీపిస్తున్న పొన్నియిన్ సెల్వన్ మాత్రం చటుక్కున ముందుకు దూకి పెద్ద పళువేట్టరయ్యర్ కత్తి ఎత్తిన చేతిని గట్టిగా పట్టుకొన్నారు.

"అయ్యా! ఆగండి! పరంపరగా చోళకుల రాజుల పట్టాభిషేకవైభవంలో పళువేట్టరయ్యర్లే శిరస్సుమీద కిరీటాన్ని పెట్టడం సంప్రదాయం. నా పట్టాభిషేకంలో కూడ మీరే మీ చేతులతోనే నాకు పట్టం కట్టాలి. ఆ తర్వాత మీ కోరిక ప్రకారం చేసుకోండి! అంతవరకు ఓపిక పట్టండి!" అన్నారు.

ఈ మాటలు చక్రవర్తిని, సామంతరాజులను ఆశ్చర్యసముద్రంలో ముంచాయని చెప్పనవసరం లేదు కద?

~~~
~~~

# అధ్యాయము - 76

## ఉత్తరనది తిరిగింది!

**ఈ** సుదీర్ఘమైన కథలో వచ్చే పాత్రలలో కొందరు ముందువెనుకలుగా మాట్లాడడం, నడుచుకోవడం పాఠకులు గమనించేవుంటారు. అందుకు మేము బాధ్యులంకామని తెలియజేస్తున్నాము. మనుషుల స్వభావం ఎప్పుడూ ఒకే విధంగా ఉండడం లేదు. పరిస్థితులు, పలు సంభవాలు వారి ప్రవర్తనను, మనసు పోకడను మారుస్తున్నాయి/ప్రభావితం చేస్తున్నాయి. నిన్న ఒక విధంగా మాట్లాడి, నడుచుకొన్నవాళ్ళు నేడు పూర్తి వ్యతిరేకంగా మాట్లాడుతున్నారు, నడుచుకొంటున్నారు.

పెద్ద పళువేట్టరయ్యర్ ఈ కథ ప్రారంభంలో ఒక పెద్ద కుట్రాలోచనకు నాయకుడుగా ఉన్నారు. ఇప్పుడు పలువురెరుగ తమ నేరాన్ని తామే చెప్పుకొని దానికి ప్రాయశ్చిత్తంగా తమను తామే బలివ్వగోరుకొంటున్నారు.

పెద్ద శంబువరయ్యర్ యువరాజు కరికాలన్ మృతదేహాన్ని చూడగానే కలిగిన దిగ్భ్రమలో, ఎలాగైనా ఆ దారుణహత్యానేరం తమ కులం మీద పడకుండ ఉండాలే అన్న దిగులులో తమ పురాతనమైన మాళిగనే కాల్చేయ ప్రయత్నించారు. ఆ నిందను ఇంకెవరి తలమీదనైనా పడేయాలన్న ఆదుర్దావల్ల తమ కుమారుని కూడ ఆ ప్రయత్నంలోకి ఎగదోశారు. ఇప్పుడు నేరం తమ మీద మోపాబడడం లేదని తెలియగానే, తమ ప్రియపుత్రిక వంతిదేవుని మీదగొన్న ప్రేమను గ్రహించగానే ఇంకొక విధంగా మాట్లాడసాగారు.

ఈ కథ ప్రారంభంలో మూసిన పల్లకిలో దాక్కొని వచ్చిన నకిలీ మధురాంతకుడే నిజమైన మధురాంతకుడని, అతడే తర్వాత ఉత్తమ చోళ చక్రవర్తి కాబోతున్నాడని పాఠకులు నమ్మేలా చేశాము. కథ ముందుకు సాగేందుకు అది అవసరమైంది. అంతెందుకు? ముఖ్యమంత్రి అనిరుద్ధులకు పాత రహస్యాలు తెలిసినా కూడ, ఆయన కూడ మధురాంతకులే పట్టం కట్టుకోవాలన్నారు. ఆ కాలంలో జరిగిన సంఘటనల ముందు వెనుక వివరాలు ఆయనకు పరిపూర్ణంగా తెలియవు. కాబట్టి, నకిలీ మధురాంతకులు గండరాదిత్యుల కుమారులు కాకపోయినా, సుందరచోళులకు, మందాకినికి పుట్టిన కుమారుడని అనుకొన్నారు. కాబట్టి ఆయన కూడ తడబడి కాస్త ముందు వెనుకగా నడుచుకోవలసి వచ్చింది.

ఈ కథలోనే ఋజువర్తనలో ప్రసిద్ధిగాంచినవారని, సత్యసంధులని మనం భావిస్తూ వచ్చిన అరుళ్మొళివర్మ ముందు వెనుకగా మాట్లాడడం మనం చివరిగా చూశాము. ఇంతకాలం తమకు రాజ్యహక్కు వద్దే వద్దని చెబుతూ వచ్చినవారు, ఇప్పుడు తమ పోకడను మార్చుకొని, 'నేనే పట్టం కట్టుకొంటాను' అని పలువురెరుగ చెప్పనారంభించారు. సమయ సందర్భాలే ఆయనలో కలిగిన ఈ మార్పుకు కారణమని

మేము విశదంగా చెప్పనవసరం లేదు కద?

~

అవును; అరుళ్మొళివర్మగారి ఆ మాటలు అక్కడున్నవారందరిని సంభ్రమాశ్చర్యాలకు లోను చేశాయి. అదే సమయాన వారి మనస్సుల్లో ఒక విధమైన నెమ్మది నెలకొంది. చోళసింహాసనాన్ని అధిష్టించడానికి అరుళ్మొళివర్మే అన్నివిధాల తగినవారు, అర్హులు అన్నది అందరూ గ్రహించారు. చోళసామ్రాజ్య ప్రజల్లో చాలమంది కోరుకొంటున్నది కూడ అదే అని కూడ ఆ సభికులందరూ ఎరుగుదురు. ప్రజల సామూహిక ఇఛ్చకు విరుద్ధంగా ఇంకొకరిని సింహాసనమెక్కిస్తే అందువల్ల ఏర్పడగల విపరీత పరిణామాలు ఎలా ఉంటాయోనన్న దిగులు కూడ వారికుంది.

అయినా కూడ పలుకారణాల వల్ల అక్కడున్న వారిలో ఎవరూ పొన్నియిన్ సెల్వన్‌కి పట్టం కట్టాలని బాహాటంగా చెప్పడానికి ధైర్యం చేయలేదు.

ఇప్పుడు పొన్నియిన్ సెల్వనే ముందుకొచ్చి, 'నేనే పట్టం పట్టం కట్టుకొంటాను; మీ దివ్య హస్తాలతో మీరే నాకు పట్టం కట్టాలి!' అని పెద్ద పళువేట్టరయ్యర్ని చూసి అనగానే అందరి హృదయాల్లోను నెమ్మది, సంతోషం కలిగాయి. 'మంచి ముగింపు; ఆ తీర్మానం తీసుకోవలసిన ధర్మసంకటమైన బాధ్యత మనమీదినుంచి తొలగిపోయింది' అని ఉపశమనం పొందారు.

పొన్నియిన్ సెల్వన్‌లోని ఒక అపూర్వమైన ఆకర్షణశక్తి ఎవరూ ఆయనకెదురుగా నిలబడి ఆయనకు విరుద్ధంగా మాట్లాడలేనట్లు చేయగలదన్న విశేషాన్ని మనం చూశాం. అంతెందుకు? వజ్రహృదయులైన చిన్న పళువేట్టరయ్యర్ కూడ పొన్నియిన్ సెల్వన్ని ప్రత్యక్షంగా చూడగానే తలవంచి నమస్కరించి ఆయనకు స్వాగతం పలికి ఆహ్వానించిన సంభవాన్ని మనం చూశాం కద?

~

పెద్ద పళువేట్టరయ్యర్ తమ ఆత్మహత్యాప్రయత్నానికి పొన్నియిన్ సెల్వన్ అడ్డుపడి ఆపడాన్ని గ్రహించారు. ఆయన మాటల అర్థాన్ని కూడ గ్రహించారు. యువరాజు మాటలు, చేతలు ఆయన మనసు కరిగేలా చేశాయి. భావోద్వేగంతో ఆయన శరీరం కూడ వణికింది. కళ్ళలో నీళ్ళుబికాయి, నాలుక తడబడింది.

ఒకసారి మనసును దిటవు పరుచుకొని ఇలా అన్నారు:- చోళకుల దీపమా! పొన్నియిన్ సెల్వా! మీ కృత్యాలు నాకు ఎనలేని సంతోషాన్నిచ్చాయి. మీరే పట్టం కట్టుకోవాలని నేనే అడగాలనుకొన్నాను. చోళకులానికే ద్రోహినైపోయిన నాకు అలా వేడుకోలు తెలుపుకోవడానికే ఇక అర్హత లేదని మాట్లాడకున్నాను. తమ పెద తాతగారు, మహాపురుషులు అయిన గండరాదిత్యులు ఒక ఏర్పాటు చేసి వెళ్ళారు. తమ సహోదరుల వంశంలో జన్మించినవారే సింహాసనమధిష్టించాలని ఆ మహానుభావులు తీర్మానంగా చెప్పి వెళ్ళారు. కానీ మాలో కొందరం ఆయన చేసిన ఏర్పాటుకు విరుద్ధంగా చేయదలిచాము.

మాలో ఏర్పడ్డ మాశ్చర్యంవల్ల ఆ శివభక్త శిఖామణి కోరికకు విరుద్ధంగా మధురాంతకులకు పట్టం కట్టాలనుకొన్నాము. తమ తండ్రి కూడ అందుకు ఒప్పేసుకొని లొంగిపోయారు. మా మాట నెరవేరివుంటే ఎంత పెద్ద విపరీతం జరిగేదోనని ఆలోచించి చూసినప్పుడు నా శరీరం వణుకుతోంది! యువరాజా! తమ తండ్రిగారు అధిష్ఠించిన సింహాసనానికి అర్హతగొన్నవారు మీరు మాత్రమే. చోళసామ్రాజ్య మణిమకుటాన్ని ధరించేందుకు కూడ మీరే తగినవారు! మీరు చిన్నారిగా ఉన్నప్పుడు నా ఎదమీద, భుజాలమీద ఎక్కించుకొని ముద్దాడాను. అప్పుడల్లా తమ చేతి రేఖలను చూసి 'ఈ భూమండలాన్నే ఏలే రారాజు కాబోతారు' అని నేను కూడ చెబుతుండేవాడిని. పడవనుంచి కావేరినదీప్రవాహంలో పడిపోయినప్పుడు ఆ కావేరితల్లి తమ స్వహస్తాలతో ఎత్తి తీసుకొని వచ్చిన వృత్తాంతాన్ని నూరారు సార్లు చెప్పుకొని ఆనందించాను. ఈ మూడేళ్ళ కాలంలోనే కామ, క్రోధ, మద, మాశ్చర్యాలు నా మనసును చెడగొట్టనిచ్చి రాజద్రోహినైనాను. పొన్నియిన్ సెల్వా! మీరు చోళసింహాసనమధిష్టించి, మణిమకుటాన్ని ధరించడం ఉచితం! కానీ మణిమకుటాన్ని తమ శిరస్సున ధరింపజేసే అర్హతను కోల్పోయాను! ఈ చేతులతో నేనిక చేయగల పుణ్యకార్యం నన్ను నేను బలిచ్చుకోవడమే!"

"లేదు, లేదు! కూడనే కూడదు!" అన్న హాహాకారాలు ఆ సభలో మారుమోగాయి.

~

సుందర చోళ చక్రవర్తి ఆర్ద్రత నిండిన స్వరంతో, "మామా! ఇదేం మాట? ఇదేం పని? మీరు చోళ కులానికి అంతటి ద్రోహమేమి చేశారు? ఏమీ లేదే? నా కుమారులకు బదులు నా పెదనాన్న కుమారుని సింహాసనమెక్కించాలనుకొన్నారు. అది చోళకులానికి ద్రోహమెలా అవుతుంది? నా కుమారులకన్న నా పెదనాన్న కుమారునికి చోళ వంశపు మణిమకుటం ధరించడానికి అధికార్హత ఉంది కద? ఇప్పుడు కూడ, నా మనసులో ఉన్నది చెప్పేందుకు మీరనుపతిస్తే..."

అని ముందుకు చెప్పబోయేలోపల ముఖ్యమంత్రి అనిరుద్ధులు అడ్డుపడి, "ప్రభూ! ఈ నాడు ప్రజలంతా 'అరుళ్మొళివర్మగారే పట్టం కట్టుకోవాలి!' అని ఘోషిస్తున్నారు. ఇన్నాళ్ళు అజ్ఞాతవాసం చేసి వచ్చిన గండదాదిత్యుల కుమారులు కూడ అదే ఉచితమని వక్కాణిస్తున్నారు. పొన్నియిన్ సెల్వన్ కూడ అదే తీర్మానానికి వచ్చేశారు. ఇక, అందుకు విరుద్ధంగా ఆలోచించడంవల్ల ప్రయోజనమేమీ లేదు!" అన్నారు.

"మీరెవరైనా అలా ఆలోచించినా నేనందుకు ఒప్పుకోను!" అన్నారు సేందన్ అముదన్ అనబడే మధురాంతక దేవరు.

"నా కుమారుడు చెబుతున్నదే సరి; ఇంకే ఆలోచనా చేయనవసరం లేదు!" అన్నారు శెంబియన్ మహాదేవి.

"తల్లీ! మీ మాటకు ఎదురు చెప్పగలవారు ఇక్కడెవరూ లేరు. దైవేచ్ఛ ప్రకారం జరగనీ.

అయినా కూడ పళువూర్ మామ మన కులానికి ద్రోహం చేసినట్లు తీర్మానించుకొని తమ ప్రాణాలను బలివ్వాలన చెప్పడం సరి కాదు కద? తమ కుమారునికి పట్టం కట్టాలని ఆయన ప్రయత్నించడం చోళకులానకి ద్రోహం చేసినట్లు కాదు కద?" అన్నారు చక్రవర్తి.

పెద్ద పళువేట్టరయ్యర్ తమ గొంతును సవరించుకొని ఇలా చెప్పనారంభించారు:- "అయ్యా! వినండి! నా ప్రయత్నం ఫలించివుంటే ఎంతటి విపరీత పరిణామాలు జరిగివుండేవో వినండి! ఇది నేను బహిరంగంగా చెప్పకనే నా ప్రాణాలను బలి తీసుకోవాలనుకొన్నాను. ముఖ్యంగా చోళసామ్రాజ్యక్షేమం తప్ప ఇక దేని గురించి కూడ ఆలోచించని నా సహోదరుడు కాలాంతకుని మనసు నొప్పించేందుకు ఇష్టపడలేదు. కానీ నా మనసును రాయి చేసుకొని నిజాన్ని చెప్పేయాలని నిశ్చయించుకొన్నాను. చక్రవర్తీ! మీరు మహానుభావులైన గండరాదిత్యుల కుమారులని ఎంచి చోళ సింహాసనమెక్కించాలని ఎంచినవాడు నిజానికి చోళకులానికి వంశ పరంపరగా పగవాడైన పాండ్యరాజు కుమారుడు...!"

"అయ్యయ్యో!", "లేదు!", "అలా ఉండ సాధ్యంలేదు!" అన్న ఘోషలు ఆ సభలో లేచాయి.

"మీకు నమ్మడానికి కష్టంగానే ఉంటుంది. నేను నా చెవులారా వినకపోయివుంటే నేను కూడ నమ్మేవాడిని కాను. రారాజా! నా అవమానాన్ని నేను మళ్ళీ చెప్పుకోవలసి వస్తూంది. మూడేళ్ళ క్రితం నేను ఏ ఆడదాని ముఖసౌందర్యం చూసి మైమరచి, ఆమె మోహపు వలలో పడి నా అంతఃపురానికి సర్వాధికారిగా చేశానో, ఆమె వీరపాండ్యుని కూతురు! ఆమె తన నోరారా ఈ నిజాన్ని ఆదిత్య కరికాలన్‌గారికి చెప్పడాన్ని నేను నా చెవులార విన్నాను. వీరపాండ్యుని ఆదిత్య కరికాలన్‌గారు చంపినందుకు పగ తీర్చుకోవడానికే ఆమె పళువూర్ అంతఃపురంలోకి ప్రవేశించింది. అందుకోసమే తగిన సమయం కోసం వేచి చూడసాగింది. ఆ పాతకి, ఆమెతోటి కుట్రదారులు కరికాలన్‌గారిని చంపి, వీరపాండ్యుని కొడుకునే చోళసింహాసనమెక్కించాలని పథకం వేసుకొన్నారు. మన కులదైవమైన దుర్గాదేవి కృపవల్ల అటువంటి దారుణ పరిణామం తొలగిపోయింది. దుర్గాపరమేశ్వరి నా కళ్ళను తెరిపించేందుకే ఆ వాణర్ కుల వీరుని పంపించింది. అతడి మూలంగానే నేను ఈ భయంకరమైన రహస్యాలను తెలుసుకోగలిగాను. ఇంకా కొన్ని సంగతులను అతడి ద్వారా విని తెలుసుకోవాలనుకొన్నాను. అతన్ని ఈ యువ శంబువరయ్యర్ చంపి ఉత్తరనదిలో పడేసి వచ్చాడు! మూర్ఖుడు!"

~

ఈ మాటలను విని అక్కడున్నవారందరూ దిగ్భ్రమించిపోగా, గందమారన్ మాత్రం, "అయ్యా! ఎలాగూ ఆ వంతిదేవుడు కూడ ఆ కుట్రదారుల కూటమికి చెందినవాడే కద? వాడిని నేను శూలం విసిరి చంపినందులో నేరమేమి?" అన్నాడు.

పెద్ద పళువేట్టరయ్యర్ అతడివైపు కోపంగా తిరిగి చూశారు. ఆ సమయాన ముఖ్యమంత్రి అనిరుద్ధులు అడ్డుపడి, "అయ్యా! ఆ వాణర్‌కులవీరుని చంపానని ఇతడు చెబుతున్నాడు. అంతే కద?

ఇతడు శూలం విసిరి చంపింది వంతిదేవుడే అని ఏం నిశ్చయం?" అని అడిగారు.

పార్థిబేంద్రుడు కాస్త మెల్లగా, వ్యంగపూరిత స్వరంతో, "ఉత్తరనది వెల్లువ తిరిగి పశ్చిమంగా పారి చచ్చినవాడి శరీరాన్ని తీసుకొని వస్తే, బహుశ నిజం తెలియవచ్చేమో!" అన్నాడు.

"ఎవరు చూడవచ్చారు? ఉత్తరనది వెల్లువ దిశ తిరిగి పారినా పారవచ్చు!" అన్నారు ముఖ్యమంత్రి అనిరుద్ధులు.

ఆయన మాటలను నిజం చేస్తున్నట్లు మరుక్షణమే పూర్తిగా తడిసిన బట్టలతో వంతిదేవుడు ఆ మంత్రాలోచన సభలో ప్రవేశించాడు! అతడి ముఖాన భీతిగొన్న భావమూ, అతడు లోపలికొచ్చిన తీరు, వెల్లువలో మునిగి చనిపోయినవాడి శరీరం ఏదో ఒక ఇంద్రజాలమహిమ వల్ల లేచి వస్తున్నట్లు ఒక భ్రమను అక్కడున్నవారి మనసుల్లో పుట్టించింది.

"ఆహా! ఉత్తరనది వెల్లువ గతి తిరిగి రానేవచ్చింది! చనిపోయినవాడినే మళ్ళీ బతికించి తీసుకొని వచ్చేసింది!" అన్నారు ముఖ్యమంత్రి.

~

ఆ సమయాన వంతిదేవుడు ఆ స్థితిలోకి ఎలా వచ్చి చేరాడో పాఠకులకు మేము తెలియజేయాలి.

పొన్నియిన్ సెల్వన్, కుందవైదేవి మొదలైనవారు తనను ఒంటరిగా విడిచిపెట్టి వెళ్ళిన తర్వాత వంతిదేవుడు చాల దిగులుపడ్డ స్థితిలో ఉన్నాడు. వీరధీరకృత్యాలు చేసి లోకాన్నే భ్రమింపజేయాలని కలలుగన్న తనకు, తనను చూసి అందరూ జాలిగొనే పరిస్థితిలో తానుండడం కించిత్తు ఇష్టం కాలేదు. పాతాళ చెరసాలకన్న, ఈ అంతఃపుర చెరసాల చాల కఠినంగా తోచిందతనికి. పొన్నియిన్ సెల్వన్‌గారి దయవల్ల కరికాలన్‌గారిని చంపాడన్న నేరాన్ని తనమీద మోపక వదిలేయవచ్చు. కానీ అంతఃపురంలో ఉన్నవారందరికీ అతడిమీద ఒక సందేహం ఉంటూనే వస్తుంది. అతన్ని కళంకితుడిగానే భావిస్తారు. యువరాకుమారి అతడిమీద చూపే అభిమానం, కనికరం అంతటితో ఆగిపోతుంది. చోళసామ్రాజ్యాన్ని ఏలేందుకు పట్టం కట్టుకోబోయే పొన్నియిన్ సెల్వన్‌గారి దివ్యసహోదరిని పెళ్ళాడే కలలన్నీ అంతటితో ఆవిరైపోతాయి. అంతఃపురస్త్రీలు అతన్ని ఏదో నేరం చేసి క్షమాపణ కోరుకొన్నవాడిలాగే పరిగణిస్తారు. మంత్రులు, దళపతులు అతన్ని చూసి అసహ్యించుకొంటారు. రాజకులస్థుల మనసు చపలం. యువరాజు అరుళ్మొళివర్మ అతడిమీద ఇంకెన్నాళ్ళు అభిమానం చూపుతారని ఎవరికి తెలుసు?

ఆహా! మొదట తాను ఉద్దేశించినట్లు సేందన్ అముదన్ గుడిసెవద్ద గుర్రమెక్కివుంటే ఇప్పటికి కోడిక్కరై చేరివుండవచ్చు. ఏల? లంకాద్వీపానికే వెళ్ళి చేరివుండవచ్చు. తాను వైద్యకుమారుని చేత దెబ్బతిని కింద పడిపోయినప్పుడు గుర్రాలెక్కి పారిపోయినవారు ఎవరైవుండవచ్చు? ఒకడేమో పిచ్చివాడని పేరు పొందిన కరుత్తిరుమన్. నిజానికి వాడు పిచ్చివాడు కాదు; చాల యుక్తిపరుడు. అతడితోబాటు వెళ్ళిన

వారెవరు? పాత మధురాంతకులు కనిపించడం లేదంటున్నారు కద? ఆయనే కావచ్చేమో కద? అవునవును! అలాగే ఉండాలి! వారిద్దరూ ఒక్కటిగా తప్పించుకొని పారిపోవడంలో ఏదో గూఢార్థముంది. ఆ మధురాంతకులు నిజానికి ఎవరని ఇక్కడున్నవారికి తెలిస్తే ఎంతగా ఆశ్చర్యపడతారు? వారిద్దరూ క్షేమంగా వెళ్ళి లంకకు చేరితే దాని పరిణామమేమి? పాండ్యమణిమకుటానికి, ఇంద్రుడిచ్చిన రత్నహారానికి హక్కుగలిగినవాడు వాటిని పొందుతాడు! మహీంద్రుని సహాయంతోనే మళ్ళీ పాండ్యనాడును తిరిగి చేజిక్కించుకోవడానికి మళ్ళీ యుద్ధం ప్రారంభిస్తాడు...! అలా జరగకుండ ఆపగలిగితే...? ఆపగల శక్తి కలవాడు తానొక్కడే! ఈ అంతఃపురంలో దాక్కొని ప్రాణాలు కాపాడుకోవడం వల్ల ప్రయోజనమేమి?

~

ఇలా ఆలోచిస్తూ వంతిదేవుడు ఆ గదిలో అసహనంగా అటూ ఇటూ పచార్లు చేస్తున్నాడు. అప్పుడప్పుడు ఆ గది ఒకవైపున్న గోడలోని కిటికీ దగ్గరకొచ్చి ఆశగా బయటికి చూడసాగాడు. అంతఃపురంలో ఒక చివరున్న పైమేడ గదిలో అతడున్నాడు. దాన్ని తాకుతూ ఉత్తరనది ప్రవహిస్తూంది. అక్కడ అంతఃపురపు బయటిగోడే తంజావూరు కోట గోడగా అమరివుంది. ఆ కిటికీ గుండా దూకితే ఉత్తరనదిలోకే దూకేయవచ్చు. లేకపోతే నిటారుగా ఎత్తుగా ఉన్న గోడమీదుగా కాస్త ప్రయత్నించి కిందకు దిగి నదిలోకి దూకవచ్చు. ఆ మేడ కింద అంతఃపురస్త్రీలు నదిలోకి దిగి స్నానం చేసేందుకు వాకిలి, మెట్లు ఉన్నట్లు తోచింది. పైమేడనుంచి కిందకు దిగి ఆ వాకిలిని చేరుకోవడానికి దారేమిటో తెలియడం లేదు. అంతఃపుర దాదులకు, రాకుమార్తెలకు అది తెలిసే ఉంటుంది. తాను తప్పించుకొని పారిపోవాలంటే వారికి తెలియకుండ కద వెళ్ళాలి...!

కిటికీ వారగా నిలబడి అతడిలా ఆలోచిస్తుండగా కాస్త దూరాన కనిపించిన దృశ్యం అతన్ని అదిరిపడేలా చేసింది.

అతడున్న అంతఃపురానికి పక్కనున్న తోటలో ఒక అమ్మాయి తల విరబోసుకొని పిచ్చిదానిలాగ పరుగెడుతూ కనిపించింది. ఆహా! అది పెద్ద పళువేట్టరయ్యర్ అంతఃపురం తోటలాగ కద ఉంది? అవునవును! ఆ తోటే! ఆ తోటలో పిచ్చిదానిలాగ పరుగెడుతున్న ఆ అమ్మాయెవరు? ఈశ్వరా! మణిమేఖలలాగ కద అగుపిస్తూంది? ఆమెకేమయింది? ఎందుకని అలా పరుగెడుతూంది...? కరికాలన్ మరణించిన ఆ రాత్రి కడంబూర్ మాళిగలో ఆమె తనకు చేసిన సహాయాలన్నీ గుర్తుకొచ్చి అతడి మనసు బావురుమంది! ఆమె వెనకే, ఆమెను పట్టుకోవడానికన్నట్లు ఇద్దరు వృద్ధ స్త్రీలు పరుగెడుతూండడం కనపించింది. కానీ వారు రాను రాను వెనకబడిపోసాగారు. మణిమేఖలను వారు పట్టుకోవడం అసాధ్యం! అదిగో ఆమె బయటి ప్రాకారం గోడ దగ్గరికి వచ్చేసింది! గోడవారగా ఏపుగా పెరిగిన ఒక చెట్టును పట్టుకొని గోడపైకెక్కేసింది! అయ్యో! ఏం అఘాయిత్యం చేస్తూంది! ఆమె చేతిలో ఒక చిన్న కత్తి మెరుస్తూందే! దాంతో ఏం చేయబోతూంది? భగవాన్! కోట గోడమీదినుంచి నదిలో తలకిందులుగా పడిపోయిందే!

~

మునుపొకసారి వీరనారాయణ చెరువులో మణిమేఖల, నందిని మునిగిపోనుండగా, అతడు మొదట మణిమేఖలను కాపాడనుద్దేశించి, తర్వాత నందినిని కాపాడి గట్టెక్కించగానే అందువల్ల మణిమేఖల చెందిన నిరాశ కూడ ఆ ఒక్కక్షణంలో వంతిదేవుని మనసులోకి దూసుకు వచ్చింది.

ఇక అతడు ఊరక చూస్తూండలేకపోయాడు. అంతఃపురం పైమేడనుంచి కిటికీ గుండా బయటికొచ్చి నదిలోకి దూకాడు.

కాసేపు ఊపిరాడక ఉక్కిరిబిక్కిరయ్యాడు. తర్వాత సంభాళించుకొని నలువైపులా చూశాడు. అవును; అతడు దూకిన చోటికి దగ్గరే మెట్లున్న మంటపం, దానిలోపలినుంచి వచ్చేందుకు వాకిలి కనిపించాయి. దానికెదురుగానే కాస్త దూరాన మణిమేఖల కోట గోడ మీదినుంచి కిందికి దూకింది. అదృష్టవశాత్తు నది అతడివైపే ప్రవహిస్తూంది. మణిమేఖల కూడ వెల్లువలో తేలుతూ వస్తే, అతడివైపే రావాలి.

పడుతూ లేస్తూ వంతిదేవుడు నది గట్టుకు చేరుకొన్నాడు. నదీప్రవాహానికెదురుగా వేగంగా నడవసాగాడు. ఆహా! అదిగో మణిమేఖల తేలుతూ వస్తూంది! ఆమె ఒంట్లో ప్రాణముందా? లేక, అది నిర్జీవదేహమా? అయ్యో! మళ్ళీ తన మీద ప్రేమాభిమానాలుగొన్న ఒకరి నిర్జీవదేహాన్ని మోసుకొని వెళ్ళే దౌర్భాగ్యం కలగబోతోందా? ఆ పిల్ల తనమీద ఎంతటి అనురాగంగొన్నది? వీరనారాయణ చెరువు గట్టు మీది మంటపంలో ఆ అమ్మాయి వీణ వాయిస్తూ పాడిన పాటలాగ, వెల్లువలో ఆమె శరీరం తేలుతున్నట్లే గాలిలో తేలి వచ్చింది. వంతిదేవునికి అది ఎనలేని వేదనను కలిగించింది!

ఆ వేదనను ఎలాగో నొక్కిపెట్టి, నదిలోకి దూకి మణిమేఖలను రెండుచేతుల్లో ఎత్తుకొన్నాడు. దేవతలారా! ఈ అమ్మాయిని కాపాడండి! చోళనాడులో ఉన్న ఒక్కొక్క గుడికి వెళ్ళి దైవసన్నిధిలో సాష్టాంగంగా నమస్కరించి వేడుకొంటాను. శైవాలయం, వైష్ణవాలయం, అమ్మవారి కోవెల, అయ్యనార్ కోవెల – అన్ని గుళ్ళలోని దైవాలకు కృతజ్ఞతలు తెలుపుకొంటాను. కల్లాకపటమెరుగని ఈ అమాయకురాలిని కాపాడండి...!

ఇలా మనసులో అనేక దేవతలను ప్రార్థిస్తూ వంతిదేవుడు మణిమేఖలను మెట్ల మంటపానికి చేర్చాడు. అప్పటికే ఈటె దెబ్బ వల్ల మృత్యుద్వారం వరకు వెళ్ళి తిరిగి వచ్చినవాడు నది వెల్లువలో ఉన్నట్లుండి దూకినందువల్ల ఇంకా బలహీనుడైనాడు. నీట మునిగి నీరు తాగి బరువెక్కిన మణిమేఖలను ఎత్తుకొని నదిలో నడిచినందువల్ల అతడికి ఊపిరాడడం కష్టమైంది. ఆమెను మోస్తూ ఇంకా ముందుకు నడవడం అసాధ్యమనిపించింది. కాబట్టి మంటపం పైమెట్టు మీద మణిమేఖలను పడుకోబెట్టాడు.

తర్వాత ఏం చేయడమా అని ఒక క్షణం ఆలోచించాడు. మణిమేఖల శరీరంలో ఇంకా ప్రాణముంది. కానీ ఆమె మూర్ఛ పోగొట్టి ఆమెకు తెలివి వచ్చేలా చేయడం తన వల్ల కాదు. వెంటనే ఒక స్త్రీ

సహాయం కావాలి.

మెట్ల మంటపానికి అంతఃపురం లోపలినుంచి రావడానికి ఏర్పరచిన వాకిలి అతడి కళ్ళ ముందు కనిపించింది. దాని దగ్గరికెళ్ళి మూసివున్న తలుపును తనలో మిగిలివున్న బలాన్నంతా కూడదీసుకొని గుద్దాడు. అదృష్టవశాత్తు తలుపు లోపలి గొళ్ళెం జరిగి తలుపు తెరుచుకొంది. తెరుచుకొన్న తలుపుగుండా లోపలికి పరుగెత్తాడు. కాస్త దూరం వరకు అది ఇరుకైన దారిగానే ఉంది. తర్వాత వరాండాలు, డాబాలు కనిపించాయి. అక్కడ మనుష్య సంచారమే లేదు. “ఇక్కడెవరూ లేరా?”, “ఒక అమ్మాయిని కాపాడేందుకు ఎవరూ లేరా?” అని పెద్దగా అరుస్తూనే అటూ ఇటూ పరుగెత్తాడు. చివరికి ఒక పెద్ద మంటపం వాకిట ఇద్దరు సేవకులు అతన్ని ఆపేందుకు ప్రయత్నించగా వారిని పక్కకు తోసి లోపలికి దూరాడు. అక్కడ చక్రవర్తి ఒక ఉన్నతాసనం మీద ఆసీనులై ఉండడాన్ని, స్త్రీపురుషులు పలువురు ఆయన చుట్టూ సమావేశమై ఉండడాన్ని చూశాడు. చూసి ఆశ్చర్యపోయాడు. మొదట అతడికి కనిపించిన స్త్రీమణి పూంగుళలి అని గ్రహించగానే, అతడికి కాస్త ధైర్యం వచ్చింది. “సముద్రకుమారీ! మణిమేఖల నదిలో పడిపోయింది. వెంటనే వచ్చి కాపాడు!” అని కేకలు పెట్టాడు.

~~~
~~~

# అధ్యాయము - 77

## మహావృక్షం కూలింది!

**ఆస్థాన** మంటపంలోకి అంతఃపుర స్త్రీలు రావడానికని ఉద్దేశించిన ద్వారంగుండా వంతిదేవుడు ప్రవేశించాడు. అందువల్ల అతడు మొదట అంతఃపురస్త్రీలనే చూడడమైంది. వారిలో అందరికన్న వెనుక ఒదిగి నిలబడ్డ పూంగుళలి ఏదో శబ్దం వినిపించగా వెనుదిరిగి చూసినప్పుడు వంతిదేవుడు పూర్తిగా తడిసిన బట్టలతో అస్తవ్యస్త స్థితిలో లోపలికి దూరి రావడాన్ని గమనించి అదిరిపడింది. ఆమెను చూసిన తర్వాతే వంతిదేవుడు మణిమేఖలకు కలిగిన అపాయాన్ని గురించి చెప్పాడు. ఆమె చెవిన అది పడింది. ఆమెకు దగ్గరగానే ఉన్న యువరాకుమారి కుందవై, వాణతి చెవుల్లోను పడింది. వారు ముగ్గురు వంతిదేవుడు వచ్చిన ద్వారం గుండానే వేగంగా వెళ్ళారు. నీరు నేలమీద కారుతున్న వైనాన్ని గుర్తుగా పెట్టుకొని అతడొచ్చిన దారిని కనిపెట్టి ఆ దారినే వెళ్ళారు.

వంతిదేవుని మాటలు సభలోవున్న తక్కినవారికి స్పష్టంగా వినిపించలేదు. "..కాపాడండి!" అన్న మాట మాత్రం కొందరికి వినిపించింది. గందమారన్, పార్థిబేంద్రుడు - వీరి చెవుల్లో అది కూడ పడలేదు. ఏదో అర్థం, రూపం తెలియని ఒక అరుపు మాత్రం వారికి వినిపించింది.

మొదట ఆ ఇద్దరూ అలా అంతఃపురం గుండా లోపలికి దూరిన ఆకారం చనిపోయిన వంతిదేవుని ఆత్మ ఏమో అనుకొన్నారు. అకాల మరణం చెందినవారి ఆత్మ ఈ లోకాన్ని వదలక ఇక్కడే తిరుగాడుతుంటుందని  ఆ కాలంలో పలువురు నమ్మేవారు. "ఉత్తరనది దిశ తిరిగి పారినా పారవచ్చు!" అని ముఖ్యమంత్రి చెప్పి నోరు మూసేలోపు, వంతిదేవుడు పూర్తిగా తడిసిన బట్టలతో అక్కడ ప్రత్యక్షం కాగానే, వారికలాంటి భ్రమ కలిగింది.

కానీ వంతిదేవుని వెంబడించి వచ్చిన సేవకులు గాభరాగా లోపలికి ప్రవేశించిన వంతిదేవుని గట్టిగా పట్టుకోగానే వారి భ్రమ తొలగిపోయింది.

"చక్రవర్తీ! క్షమించాలి. ఈ పిచ్చివాడు అంతఃపురపు మెట్ల వాకిలి గుండా దూరి పరుగెత్తి వచ్చాడు. మేము అడ్డగించినా వినలేదు!" అని ఆ సేవకులు చెప్పేసి వంతిదేవుని తమతో లాక్కొని వెళ్ళ ప్రయత్నించారు.

~

అబ్బబ్బ! ఈ వంతిదేవుని ప్రాణం ఎంత గట్టిది? ఎంత పెద్ద ఆపదనుంచైనా తప్పించుకొని వచ్చేస్తున్నాడు కద! – ఈ ఆశ్చర్యం పార్థిబేంద్రుని మనసులో పుట్టింది. దానితోబాడు క్రోధం కూడ ఉప్పొంగి వచ్చింది.

ఎక్కడకు వెళుతున్నామో తెలియక అతడిక్కడికి వచ్చి చిక్కుకొన్నాడు! మళ్ళీ అతడు తప్పించుకొని పారిపోవడానికి ఆస్కారం ఇవ్వకూడదు - ఇలా ఒక్కక్షణంలో తీర్మానించుకొన్న పార్థిబేంద్రుడు చక్రవర్తి సమక్షంలో ఉన్నామన్న విషయాన్ని కూడ మరచి ముందుకు దూకి వెళ్ళి వంతిదేవున భుజాన్ని పట్టుకొన్నాడు.

"వీడు పిచ్చివాడు కాడు; హంతకుడు! ఆదిత్య కరికాలన్‌గారిని చంపిన వంచక ద్రోహి!" అని పెద్దగా అంటూనే అతన్ని పట్టుకొని లాక్కు వెళుతున్న సేవకులకు సైగ చేశాడు.

పార్థిబేంద్రుని వెన్నంటే పరుగెత్తి వచ్చిన గందమారన్ వంతిదేవుని ఇంకొక భుజాన్ని గట్టిగా పట్టుకొన్నాడు.

ఇద్దరూ అతన్ని లాక్కొని వచ్చి చక్రవర్తి ఆసీనులైన ధర్మపీఠం ముందు నిలబెట్టారు.

చక్రవర్తి వంతిదేవుని తేరిపారజూసి, "పాలుగారే పసిపాపలాగ కనిపిస్తున్న ఈ అబ్బాయా నా కుమారుని హత్య చేశాడని అంటున్నారు? నేను నమ్మలేకపోతున్నాను కద? ఈ అబ్బాయే కద నాకు ఆదిత్య కరికాలన్ వద్ద నుంచి తాళపత్ర సందేశాన్ని తీసుకొని వచ్చి ఇచ్చాడు?" అన్నారు.

"అవును, ప్రభూ! వీడే ఆ తాళపత్రాన్ని తీసుకొచ్చాడు! వీడే తంజావూరు కోట బయట మూసిన పల్లకిలో వస్తున్న నందినీదేవిని కలిసి రహస్యాలు మాట్లాడాడు. వీడే మునుపొకసారి ఈ కోటనుంచి తప్పించుకొని పారిపోయాడు. ఇప్పుడు కూడ పాతాళ చెరసాలనుంచి తప్పించుకొని పారిపోయాడు!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్.

"నన్ను వెన్నుపోటు పొడిచి పారిపోయింది కూడ వీడే!" అన్నాడు గందమారన్.

ముఖ్యమంత్రి అనిరుద్ధులు, "ఏమయ్యా! ఇతన్నే కద నీవు శూలం విసిరి చంపానని కాసేపటి క్రితం చెప్పావు?" అని అడిగారు.

"అవును, అన్నాను! మీరు ఈ హంతకుడికి సహాయం చేసి వీడిని మళ్ళీ బతికిస్తారని నేను కలగన్నానా?" అన్నాడు గందమారన్.

~

ఇంతసేపూ పొన్నియిన్ సెల్వన్ చేష్టలుడిగి నిలబడ్డారు. వంతిదేవుడు మళ్ళీ తప్పించుకోవడానికి నదిలో దూకాడని, ఈత సరిగా రాకపోవడం వల్ల మళ్ళీ గట్టెక్కి ఇలా దారి తప్పి సభలో దూరాడని ఆయన భావించారు. ఇందువల్ల ఆయనకు వంతిదేవుని మీద వచ్చిన కోపం చల్లారేందుకు కాసేపు పట్టింది.

గందమారన్ చివరి మాట వినగానే పొన్నియిన్ సెల్వన్ గంభీరంగా ముందుకు వచ్చి చక్రవర్తి ముందు నిలబడ్డారు.

"తండ్రీ! ఈ వాణర్‌కుల యువరాజు నా ప్రాణానికి ప్రాణమైన స్నేహితులు. లంకలోను,

నడిసముద్రంలోను నాకు కలిగిన అపాయాలనుంచి కాపాడినవారు. ఈయన బతికి వచ్చినందుకు నాకు చాల సంతోషంగా ఉంది. ఈయన మీద నేరం మోపడం నామీద నేరం మోపినట్లే అవుతుంది!" అన్నారు.

ఆయన మాటల్లో ధ్వనించిన అధికార ధోరణి అందరినీ కాసేపు మౌనందాల్చేలా చేసింది.

తర్వాత ముఖ్యమంత్రి అనిరుద్ధులు "పొన్నియిన్ సెల్వా! కాస్త ఆలోచించి చూడండి! యువ శంబువరయ్యర్ విసిరిన శూలానికి బలైన వంతిదేవులు ఎలాగో మళ్ళీ బతికి వచ్చేశారు. ఇప్పటికే ఆయన మీద నేరం మోపడమైంది. కాబట్టి విచారించి నిజం తెలుసుకోవడం మంచిది కద?" అన్నారు.

పార్థిబేంద్రుడు, "అవునయ్యా! మీరు రేపు చోళ సింహాసనమధిషించబోయేవారు. ఎటువంటి నేరస్థుడినైనా శిక్షించడానికి, క్షమించడానికి మీకు అధికారం ఉంటుంది. కానీ విచారణే వద్దనడం ఉచితమా? అనవసర సందేహాలకు ఆస్కారమిచ్చినట్లవుతుంది కద?" అన్నాడు.

"దానితోబాటు మన యువరాజు ఇంకొక విషయాన్ని ఆలోచించాలి. యువరాజు తాము సింహాసనమధిష్టించాలని ఈ వంతిదేవుని పంపి అన్నగారిని చంపేందుకు కుట్ర పన్నారని ఒక వదంతి వ్యాపించింది. దానికి చోటివ్వకూడదు కద? అన్నాడు గందమారన్.

~

ఇది విని అక్కడున్నవారందరూ భయోత్పాతానికి లోనయ్యారు. శంబువరయ్యర్ మాత్రం ముందుకొచ్చి గందమారన్ చెంప మీద లాగి ఒక్క దెబ్బ కొట్టారు. "ఒరే, మూర్ఖుడా! నీవల్ల పురాతనమైన మన వంశమే నిర్మూలమైపోతుంది లాగుందే! సమయ సందర్భాలు చూడక వాగడంలో నీకు నీవే సాటి!" అని కోపంగా అన్నారు.

గందమారన్ తన తండ్రివైపు వెర్రికోపంతో చూశాడు. అతడి పెదవులు వణికాయి. మరుక్షణం అతడేం చేసేవాడో, ఏం చెప్పేవాడో తెలియదు! మంచివేళగా, పెద్ద పళువేట్టరయ్యర్ ముందుకు వచ్చి పెద్ద శంబువరయ్యర్ని పట్టుకొన్నారు. "శంబువరయ్యరే! మీ కుమారుడు చేసిన మూర్ఖకార్యాలన్నిటికీ ప్రాయశ్చిత్తం చేసేశాడు. చోళసామ్రాజ్యానికి ఒక పెద్ద ఉపకారం చేశాడు. అది తెలుసుకొన్నప్పుడు మీరే వాడిని కన్నందుకు గర్వపడతారు. కాస్త ఓపిక పట్టండి! వాడిమీద కోపం తెచ్చుకోకండి!" అని చెబుతూనే శంబువరయ్యర్ని లాక్కొని వెళ్ళి కాస్త దూరాన నిలబెట్టారు. తర్వాత గందమారన్ని చూసి, "నీవీ వంతిదేవుని మీద శూలం విసిరి చంపానని చెబుతున్నావు కద? అప్పుడు గుర్రం మీద నదిని దాటుతున్నాడని చెప్పవచ్చా?" అని అడిగారు.

ముఖ్యమంత్రి, "అయ్యా! దాని గురించి నా శిష్యుడు ఒక మాట చెప్పేందుకు అనుమతివ్వాలి!" అన్నారు.

ఆళ్వార్ కట్టియాన్ ముందుకొచ్చి, "ప్రభువుల్లారా! నా నేరాన్ని నేను ఒప్పుకొంటున్నాను. ఈ వాణర్కుల యువరాజు గుర్రం మీదెక్కి పరుగెత్తే పోలేదు. ఈయన మన నిజమైన మధురాంతక దేవరిని ఒక

హంతకుడి నుంచి కాపాడి ఆ ప్రయత్నంలో తీవ్రంగా గాయపడి కింద పడ్డారు. ఈయనను నేనే మూసిన పల్లకిలో ఎక్కించుకొని కోట లోపలికి తీసుకొని వచ్చి చేర్చాను. నాలుగు రోజులుగా ఈయన ఇక్కడే ఉంటూ వస్తున్నారు. కాబట్టి యువ శంబువరయ్యర్ ఈయన మీదికి శూలం విసిరివుండడం సాధ్యం కాదు!" అన్నాడు.

పెద్ద పళువేట్టరయ్యర్, "నేనూ అలాగే జరిగివుండాలని ఊహించాను. పెద్ద శంబువరయ్యరే! మీ కుమారుని తప్పిదాలన్నింటినీ క్షమించేయండి! చోళ సామ్రాజ్యానికి ఇతడు మహత్తరమైన సేవ చేశాడు! అతడు శూలం విసిరి చంపింది వీరపాండ్యుని కొడుకే అయివుండాలి. ఆ రోజు సాయంత్రంనుంచి పాత మధురాంతకుడు కనిపించకుండ పోయాడు కద? పారిపోజూసినవాడు అతడే అయివుండాలి. దేవుడు ఎంత పెద్ద ఆపద నుంచి ఈ రాజ్యాన్ని కాపాడాడు!" అని చెప్పి ఆగారు.

ఈ మాటల వల్ల కలిగిన సంభ్రమాశ్చర్యాలు తీరక మునుపే ఆ వృద్ధవీరులు ఇలా ముందుకు సాగించారు తమ వాక్ప్రవాహాన్ని.

"చక్రవర్తీ! ఈ సేవకుని చివరి మాటలను కాస్త శ్రద్ధగా వినండి! ధూమకేతువు తన క్రూరకార్యాన్ని చేసేసి మరుగైంది. మీ ధీరపుత్రులు ఆదిత్య కరికాలన్ కూడ అస్తమించారు. కానీ మీ కులపూర్వీకులు, నా కులపూర్వీకులు తమ రక్తం చింది, ప్రాణాలొడ్డి స్థాపించిన ఈ చోళ సామ్రాజ్యానికి మంచి రోజులు రాబోతున్నాయి; ఇంకా చాలకాలం ఈ సామ్రాజ్యం నెలకొనివుంటుంది; ఇంకా విశాలంగా విస్తరించి మహోన్నతస్థితిని చేరుకోబోతుంది. అందుకే కథల్లో కూడ కనివిని ఎరుగని మహాపాయాలను మీ చోళ కులమూ, ఈ చోళ సామ్రాజ్యమూ తప్పించుకొన్నాయి. అలా తప్పేందుకు ముఖ్యకారణమైనవాడు ఈ వాణర్కుల వీరుడు వంతిదేవుడే! ఇతడివల్లే మోహపు తెరల వల్ల మూయబడ్డ నా కళ్ళు తెరుచుకొన్నాయి. శంబువరయ్యర్ మాళిగలో మేము అర్ధరాత్రి సమావేశం జరిపినప్పుడు ఈ అబ్బాయి యధాలాపంగా అక్కడికి వచ్చి చేరాడు. ఆ రోజు ఈ చిన్నపిల్లాడికి తెలియకుండ ఒక రహస్యకార్యం చేయవలసివస్తూంది కద అని సిగ్గుపడ్డాను. తర్వాత ఈ అబ్బాయి తంజావూర్ కోట బయట నందినిని కలిసి రహస్యంగా మాట్లాడాడని నా తమ్ముడు తెలియజేశాడు. నందిని సహాయంతోనే ఈ అబ్బాయి కోటనుంచి తప్పించుకొని పారిపోయాడని కూడ చెప్పాడు. అందునుంచి నా మనసులో మొలకెత్తిన సందేహం పెరిగి పెద్దది కాసాగింది. నా చుట్టూ జరుగుతున్న సంభవాలు, వాటి కారణాల గురించి ఆలోచించనారంభించాను. తరచూ మాయచీకటి నా వివేకాన్ని కప్పేస్తున్నా కూడ, నిజమనే జ్యోతి కిరణాలు సోకి ఆ మాయచీకటిని తొలగించసాగాయి / పారద్రోలసాగాయి. చివరిగా, దుర్గాపరమేశ్వరి కృపవల్ల పాండ్యరాజు ఆపత్కాల సహాయకుల కుట్ర పన్నాగాలను తెలుసుకోగలిగాను. నేనే రహస్యంగా దాక్కొని వారి మాటలను నా చెవులారా వినకుండివుంటే నమ్మేవాడినే కాను. ఆ తర్వాత కూడ, తమ ప్రియపుత్రిక కుందవై నా మనసును ఇంకొక విధంగా కలవరపరిచేశారు. నందిని వారి సహోదరి అని, ఆమెకు నేనెటువంటి కీడు

తలపెట్టకూడదని చెప్పారు. ఆమె కూడ ఒకవేళ మోసపోయారేమోనని సందేహించాను. అయినా కూడ మారువేషం ధరించి కడంబూర్ మాళిగకు వెళ్ళి నిజం తెలుసుకోవాలని నిశ్చయించుకొన్నాను. అందుకోసం కాళాముఖశైవుల వేషం ధరించాను. పులి తోలు బట్టలు, పుర్రెల మాల ధరించి వెళ్ళాను. ప్రభూ! కాళాముఖ శైవులు నన్ను వారి నాయకుడని అనుకొన్నారు. నా అవమానాన్ని వినండి. ఈ చోళ సామ్రాజ్యానికి నేనే చక్రవర్తి కావాలన్న ద్రోహదురాశను నందిని నా మనసులో నాటింది. కాళాముఖులు ఆ దురాశకు ధూపం వేసి పెద్దది చేశారు. మధురాంతకులకు పట్టం కట్టినట్లు కట్టేసి, తర్వాత వారిని కూడ తరిమి కొట్టేసి, నేనే చక్రవర్తిగా పట్టం కట్టుకోవాలని నందిని నాకు దుర్బోధలు చేసింది. ఆ కాళాముఖుల్లో ఒకడైన ఇడుంబన్‌కారి కడంబూర్ మాళిగలో సేవకుడుగా పనిచేస్తున్నాడు. మదురై ఆపత్కాల సహాయకులకు గూఢచారిగా కూడ వాడు సహాయం చేయసాగాడు. వాడిని భయపెట్టి, ఆ సమయాన మదురై (పాండ్యరాజు) ఆపత్కాల సహాయకులు వేట మందిరంలో ఉన్నారని తెలుసుకొన్నాను. ఆదిత్య కరికాలన్ నందిని గదికి వెళ్ళివుండడం, మణిమేఖల, వంతిదేవుడు అక్కడే దాక్కొని ఉండడాన్ని తెలుసుకొన్నాను. నందినికి, కరికాలన్‌గారికి మధ్య నడిచే రహస్య సంభాషణను వినాలన్న కోరిక నా మనసును కందిరీగలాగ తొలుస్తూంది. నందిని గురించిన నిజాన్ని కూడ తెలుసుకొందామన్న ఆశ పుట్టింది. నందిని గదికి వెళ్ళడానికి వాద్యాల గదిగుండా ఒక రహస్య మార్గం ఉందని తెలుసుకొని అక్కడికి వెళ్ళి చేరుకొన్నాను. నందిని గురించిన రహస్యాన్ని ఆమె నోటినుంచే విని తెలుసుకొన్నాను. ఆదిత్య కరికాలన్‌గారు ప్రవర్తనలో కళంకం లేనివారని కూడ తెలుసుకొన్నాను. నందిని, ఆమె కూటమికి చెందినవారు, పాండ్యరాజు మరణానికి పగ తీర్చుకోవడానికి ఎంతటి భయంకరమైన పథకం వేసుకొన్నారన్నది కూడ తెలుసుకొన్నాను. ఆ కుట్రను అడ్డుకోవడానికి ప్రయత్నించాను. కానీ విధిని నేను గెలవలేకపోయాను. కరికాలన్ నా కళ్ళముందే అసువులుబాసి కింద పడడాన్ని చూసే దౌర్భాగ్యం నాదయింది..."

ఇలా చెప్పి పెద్ద పళువేట్టరయ్యర్ తమ ముఖాన్ని రెండుచేతులతో కప్పుకొని వెక్కి వెక్కి ఏడ్చారు. ఆ ఏడుపు శబ్దం, సుడిగాలి వీచేటప్పుడు అలల కడలిలో లేచే మహాశబ్దంలాగ ధ్వనించింది. ఎవరూ అప్పుడు నోరు తెరిచి మాట్లాడ తెగించలేదు. అందరి మనస్సులు ఆ మహావీర వృద్ధుల దుఃఖాన్ని ఎంచి కరిగివున్నాయప్పుడు.

ఆయన ఇంకా పొంగి వస్తున్న దుఃఖాన్ని తమ వజ్రహృదయసహాయంతో అదిమిపెట్టారు. ముఖంమీదినుంచి చేతులు తీసేసి చుట్టూ పరికించి చూశారు. "విధివశాత్తు, విధివైపరీత్యం వల్ల ఆదిత్య కరికాలన్‌గారు మరణించారు. అదే సమయాన మహాపాయానికి గురైన పొన్నియిన్ సెల్వన్, విధిని తమ మదితో జయించి బ్రతికిపోయారు. ప్రభూ! చక్రవర్తీ! బ్రహ్మరాయలుగారూ! నా ప్రియ సామంతరాజుల్లారా! అరుళ్మొళివర్మగారిని చోళసింహాసనమెక్కించి పట్టం కట్టండి! ఆయన మూలంగానే ఈ చోళసామ్రాజ్యం మహోన్నతస్థితికి చేరుకోబోతూంది!" అన్నారు.

ముఖ్యమంత్రి అనిరుద్ధులు, "అయ్యా! తమ కోరిక నెరవేరబోతూంది. పొన్నియిన్ సెల్వన్‌గారే అందుకు అడ్డుగా నిలుస్తారనుకొన్నాము. చోళరాజ్యం చేసుకొన్న పుణ్యంవల్ల ఆయనే పట్టం కట్టుకోవడానికి ఒప్పేసుకొన్నారు. కానీ కరికాలన్‌గారు ఎలా మరణించారని మీరింకా చెప్పలేదు కద?" అన్నారు.

"దాని గురించి ఎందుకడుగుతున్నారు? చంపిన చేయి ఎవరి చేయైతేనేమి? నిజానికి ఆయన మరణం విధివశాత్తు సంభవించింది!" అన్నారా వీరవృద్ధులు కాస్త వణుకుతున్న గొంతుతో.

"అది తెలియకపోతే, ఇదిగో ఆ నేరం మోపబడ్డ ఈ యువకుని మీద కలిగివున్న సందేహం తొలగదు. కరికాలన్ మరణానికి ఇతన్ని శిక్షించవలసి వస్తుంది" అన్నారు ముఖ్యమంత్రి.

"ఆః! ఇతడిమీదా నింద మోపారు? ఎవరు?"

"గందమారన్, పార్థిబేంద్రుడే నింద మోపారు!"

"ఆహ్! మూర్ఖశిఖామణులు! గందమారా! పార్థిబేంద్రా! మీరీ యువకుని నీద నేరం మోపడానికి కారణమేమి? దేన్ని ఆధారంగా చేసుకొని ఇతడు ఆదిత్య కరికాలన్‌గారిని హత్యచేశాడని చెబుతున్నారు?"

దీనికి అనిరుద్ధులే ఉత్తరమిచ్చారు; "ఇతడు ఆ సమయాన నందిని అంతఃపురంలో దాక్కొనివున్నాడు. మణిమేఖల కూడ అక్కడే ఉంది. మణిమేఖల తానే కరికాలన్‌గారిని చంపిందని చెబుతున్నాకూడ అది సాధ్యం కాదు. ఆమె చూపించిన కత్తిమీద రక్తపు మరకలే లేవు. వంతిదేవుని కాపాడేందుకే ఆమె అలా చెప్పివుండాలి కద? వంతిదేవుడు తాను దాక్కొనివున్న చోటునుంచి కరికాలన్‌గారిని చంపింది ఆమె చూసివుండవచ్చు కద?"

"మణిమేఖల చంపలేదంటే, వంతిదేవుడు మాత్రం ఎలా చంపివుండ సాధ్యం? ఏ ఆయుధంతో?"

"ఈ ఆయుధంతో! రక్తంతో తడిసి ఎండిన ఈ పదునైన వంకీల కత్తితోనే!" అంటూనే పార్థిబేంద్రుడు మనమిప్పటికే చూసిన వంకీల కత్తిని చూపాడు. వంతిదేవుడు కరికాలన్ మృతదేహాన్ని నిప్పంటుకొన్న మాళిగనుంచి అతికష్టంమీద తీసుకొని వచ్చి బయటకు చేర్చిన వెంటనే మూర్ఛిల్లి పడిపోగా, పార్థిబేంద్రుడు ఆ కత్తిని వంతిదేవుని దగ్గరినుంచి కైవసం చేసుకొని తన దగ్గరే భద్రంగా ఉంచుకొన్నాడు. దాన్నే ఇప్పుడు బయటికి తీసి చూపించాడు.

పెద్ద పళువేట్టరయ్యర్ అతన్ని చూసి, "ఏదీ! ఆ కత్తినిలా ఇవ్వు!" అని అడిగి, దాన్ని తీసుకొన్నారు. దాన్ని పరీక్షగా చూసేసి, "ఆహ్! ఇది ఇడుంబన్‌కారి కత్తే!" అని మెల్లగా అన్నారు.

"గందమారా! పార్థిబేంద్రా! నేనూ, మీరూ ఈ వంతిదేవుని చుట్టూ మూడుసార్లు ప్రదక్షిణం చేసి దండం పెట్టాలి! నందిని మోహపువలలో ఈ వృద్ధుడిలాగనే మీరూ పడిపోయారు. కానీ ఈ అబ్బాయి మాత్రం ఆ మాయవలలో చిక్కుకోలేదు. ఇతడు ఈ కత్తిని విసరనూ లేదు; ఆదిత్య కరికాలన్‌గారిని చంపనూ లేదు!"

"ఎలా అంత ఘంటాపథంగా / బల్ల గుద్దినట్లు చెప్పగలుగుతున్నారు?" అని అడిగారు ముఖ్యమంత్రి.

"అవును! నిశ్చయంగా చెబుతున్నాను, ఈ కత్తిని విసిరి కరికాలన్‌గారిని చంపింది ఎవరని నాకు బాగ తెలుసు!"

"ఎవరు!? ఎవరు!?"

"అవును! దాన్ని చెప్పేతీరాలి. లేకపోతే మీ సందేహం తీరదు. అందరూ వినండి! ఈ కుర్రాడు వాద్యాల గదిలో దాక్కొనివున్నాడు. నేను దానిగుండా దిగి వచ్చాను. ఇతడు నన్ను చూసి కేకలేయకూడదని వెనక నుంచి గొంతు పట్టి నొక్కేశాను. గుడ్లు వెళ్ళుకొస్తుండగా, స్పృహతప్పి పడిపోయాడు. ఆదిత్య కరికాలన్‌గారిని చంపింది ఎవరని అప్పుడితడికి తెలిసికూడ ఉండసాధ్యం కాదు."

"ఎవరు? ఎవరు? చంపిందెవరు?"

"ఈ వంకీల కత్తిని నేనే ఇడుంబన్‌కారి దగ్గరినుంచి తీసుకొచ్చాను. దీన్ని విసిరింది నేనే! నా ఈ కుడిచేయే!చోళచక్రవర్తులకు పరంపరగా పట్టం కట్టుతూ వస్తున్న ఈ చేయే కత్తిని విసిరింది. కానీ యువరాజు కరికాలన్‌గారి మీదికి విసరలేదు! నందిని మీదికి విసిరాను. నన్ను మోహపు వలలో నొక్కి, ద్రోహపు ఊబిలో కూరేసిన ఆ మాయపిశాచిని చంప ఉద్దేశించి ఈ కత్తిని విసిరాను; గురి తప్పి, కరికాలన్‌గారిమీద పడింది..."

"అయ్యయ్యో!", "ఆఁ!" అన్న హాహాకారాలు అప్పుడా సభలో మారుమోగాయి.

"నూరేళ్ళుగా పళువూర్ వంశం చోళకులానికి చేస్తూ వచ్చిన సేవను కళంకితం చేసేశాను. ఆ కళంకాన్ని ఎలా తొలగించబోతానో, తెలియడం లేదు!"

"అన్నా! ఆ కళంకాన్ని నేను తొలగిస్తాను!" అని చిన్న పళువేట్టరయ్యర్ గర్జించి, తమ కత్తిని దూసి అన్నగారివైపు వేగంగా వెళ్ళారు.

"చోళ కులానికి ద్రోహం చేసినవారెవరైనా కూడ, వారిని శిక్షిస్తామని మనమిద్దరం శపథం చేశాము. ఆ శపథాన్ని నేనే ఇప్పుడు నెరవేరుస్తాను. నేనే నిన్ను చంపి ఆ కళంకాన్ని తుడిచేస్తాను!" అని చిన్న పళువేట్టరయ్యర్ కత్తిని ఎత్తారు.

"వద్దు! వద్దు! ఇక్కడ రక్తం చిందవద్దు!" అన్నారు సుందర చోళ చక్రవర్తి.

యువరాజు అరుళ్మొళివర్మ, ముఖ్యమంత్రి అనిరుద్ధులు ముందుకు దూకి చిన్న పళువేట్టరయ్యర్ చేతిని గట్టిగా పట్టుకొన్నారు. ఆ సమయాన పెద్ద పళువేట్టరయ్యర్ ఇలా అన్నారు: "తమ్ముడూ! మన కులానికి నా వల్ల వచ్చిన కళంకాన్ని తుడిచే పని నీకు ఇవ్వను. దానితోబాటు, 'అన్నను చంపిన తమ్ముడు' అన్న నింద నీమీద పడనివ్వను. ఇదిగో దుర్గాపరమేశ్వరి ముందు నేను చేసిన శపథాన్ని నేనే నెరవేరుస్తాను!" అని చెబుతూనే తమ చేతనున్న కత్తిని తమ గుండెలవైపు ఎత్తారు.

మునుపొకసారి ఆయన పైకెత్తిన కత్తిని మళ్ళీ ఒరలో పెట్టేసినందువల్ల ఆయన తమ ఉద్దేశాన్ని వదిలిపెట్టేశారని తక్కినవారు భావించారు. పార్థిబేంద్రుని వద్దనుంచి ఆయన తీసుకొన్న ఆ వంకీల కత్తిని

ఆయన ఉపయోగిస్తారని ఎవరూ ఎదురుచూడలేదు.

"అయ్యో! వద్దు!" అని అరుళ్మొళివర్మ అరుస్తూ ఆయన్ని సమీపించేలోపు పెద్ద పళువేట్టరయ్యర్ తమ ఉద్దేశాన్ని నెరవేర్చేశారు.

వేళ్ళూని ఎత్తుగా పెరిగిన ఒక మహావృక్షం ఉన్నట్లుండి కూకటివేళ్ళతో పెకలించుకొని కూలిపోయినట్లు ఆ మహావృద్ధవీరులు నేలకొరిగారు.

"ఆః!", "అయ్యో!" అన్న హాహాకారాలు ఆ సభలో లేచాయి.

నేలకొరిగిన పెద్ద పళువేట్టరయ్యర్వైపు కొందరు పరుగెత్తి వచ్చారు.

అదే సమయాన కళ్ళు మూసుకొని తమ ఆసనంలో వెనక్కి వాలిపోయిన చక్రవర్తివైపు ఇంకొందరు పరుగెత్తారు.

మంత్రాలోచన సభ అంతటితో ముగిసింది.

~

ఆ రోజు రాత్రి పెద్ద పళువేట్టరయ్యర్ మరణంతో పోరాడుతున్నప్పుడు పలువురు వచ్చి ఆయనను చూసి వెళ్ళారు.

ముఖ్యంగా చక్రవర్తి, అరుళ్మొళివర్మ, ముఖ్యమంత్రి అనిరుద్ధులు, యువరాకుమారి కుందవై వచ్చారు.

చోళకులానికి, చోళసామ్రాజ్యానికి పెద్ద పళువేట్టరయ్యర్ చేసిన సేవలను చక్రవర్తి, తక్కినవారు ఎంతో మెచ్చుకొని కొనియాడారు. ఆయన యుక్తవయస్సులో పలు యుద్ధరంగాలలో చేసిన మహావీరధీరకృత్యాలను గురించి చెప్పారు. తక్కోలం యుద్ధంలో ఓటమిగొని వెనుదిరిగి పారిపోతున్న సైన్యాలను మళ్ళీ కూడదీసి, ఓటమిని గెలుపుగా మార్చిన ఆయన వీరకృత్యాన్ని సంభ్రమాశ్చర్యాలతో కొనియాడారు. చోళసామ్రాజ్య ధనాధికారిగా తమ కర్తవ్యాన్ని సమర్ధవంతంగా నిర్వహించిన రీతిని పొగిడారు.

గత మూడేళ్ళ సంభవాలను ప్రస్తావించకనే సెలవు తీసుకొని బయలుదేరారు.

తర్వాత ఆ నలుగురు ఆయన పడుకొనివున్న గదిలోనే ఆయన చూడలేనటువంటి చోట దాక్కొని నిలబడ్డారు.

ఆ సమయాన ఆళ్వార్ కట్టియాన్ని చిన్న పళువేట్టరయ్యర్ పిలుచుకొని వచ్చారు. అతన్ని పెద్ద పళువేట్టరయ్యర్ ముందు కూర్చోబెట్టి తాము కూడ ఆసీనులైనారు.

చూపు అతివేగంగా సన్నగిల్లుతున్న కళ్ళతో పెద్ద పళువేట్టరయ్యర్ ఆళ్వార్ కట్టియాన్ని చూసి, "ఆహా! ఈ వైష్ణవుడిప్పుడిక్కడికెందుకొచ్చాడు? నేను వైకుంఠానికి వెళ్ళడానికి ఇష్టపడడం లేదు, తమ్ముడూ! శివపాదాలను చేరుకోగోరుతున్నాను!" అన్నారు.

"అయ్యా! రేపు ఉదయం వైకుంఠ ఏకాదశి పుణ్యదినం! మీరు కైలాసానికి వెళ్ళాలని కోరుకొన్నా

వైకుంఠం గుండానే వెళ్ళాలి!" అన్నాడు తిరుమలై.

"వద్దు! వద్దు! నీవు నీ మహావిష్ణువు వద్దకు తిరిగి వెళ్ళి..."

"అయ్యా! నేనిప్పుడు మహావిష్ణువు దూతగా రాలేదు. నా సహోదరినుంచి ఒక సందేశాన్ని తీసుకొని వచ్చాను!"

"అదెవరు నీ సహోదరి?"

"నాతో చాలయేళ్ళు తోడబుట్టిన సహోదరిలాగ పెరిగినది - నందిని గురించి చెబుతున్నానయ్యా! నందిని మీకు తన కృతజ్ఞతలు తెలియజెప్పమని నన్ను పంపించింది. కరికాలన్‌గారిని చంపిన నేరం తన మీద పడకుండ మీ మీదకు తీసుకొన్నందుకు కృతజ్ఞతలు తెలియజెప్పమంది. ఎన్ని జన్మలెత్తినా తమ ప్రేమను మరువజాలనని కూడ చెప్పమంది!" అన్నాడు ఆళ్వార్ కట్టియాన్.

"ఆహా! ఆమె ఇంకా అలా భావిస్తూందా? సరే, అలాగే అనుకొని సంతోషపడనీ. వంచనతో నాకెంతో కీడు కలిగించినా కూడ, ఆమెను నేను మరువలేకున్నాను. ఆమె మీద కోపంగొనేందుకు కూడ సాధ్యం కావడం లేదు. తన ప్రాణాలనర్పించి చక్రవర్తిని కాపాడిన ఉత్తమురాలి కుమార్తె కద ఆమె? నిజంగానే మరుజన్మలో కూడ నన్ను వెతుక్కొంటూ వచ్చేస్తుందో, ఏమో?" అన్నారు పెద్ద పళువేట్టరయ్యర్.

~

అప్పటికే మరణఛ్ఛాయలు కమ్ముకొంటున్న ఆయన ముఖంలో ఒక చిరునవ్వు విరిసింది.

"వైష్ణవుడా! ఎవరైన ఒకరి దగ్గర నా నిజాన్ని చెప్పాలి. నీకే చెప్పేస్తాను. నేను విసిరిన కత్తి యువరాజు మీద పడలేదు. దానికి మునుపే ఆయన కింద పడిపోయారు. నేనే యువరాజును చంపానని ఒప్పుకొన్నందుకు కారణం ఆ నింద నందిని మీద పడకుండ చేసేందుకు మాత్రమే కాదు; దానికన్న నూరు రెట్లు ముఖ్యమైన కారణముంది. దగ్గరకు రా, చెబుతాను! నీ స్నేహితుడు వంతిదేవుడున్నాడు కద? అతడు బంగారంలాంటి వాడు! అతడికి చోళకులం చాల ఋణపడివుంది. యువరాకుమారి కుందవై మనసును చూరగొన్నాడు. ఆమె మీద నేను అనవసరంగా కోపంగొన్నాను. దానికంతా పరిహారంగా నేరాన్ని నా మీద వేసుకొన్నాను. నేనలా బహిరంగంగా ఒప్పుకొని నన్ను నేను బలి ఇచ్చుకోకుంటే, వంతిదేవుని మీద ఎవరో ఒకరు నింద మోపుతూనే ఉంటారు! ఇక ఎవ్వరూ అలా మాట్లాడేందుకు తెగించరు. వైష్ణవా! ఎప్పుడైనా యువరాకుమారికి ఈ విషయాన్ని నేను చెప్పినట్లు చెప్పు! నందిని మాటలు విని నేనామెను ద్వేషించినందుకు దయచేసి నన్ను క్షమించమని చెప్పు!"

చాలసేపు మాట్లాడినందువల్ల ఆ వీరవృద్ధునికి ఊపిరాడడం కష్టమైంది. ఆయన మాటలన్నీ విన్న తర్వాత ఆళ్వార్ కట్టియాన్ మనసే కరిగిపోయిందంటే, ఇక మరుగున దాక్కొని వింటున్న కుందవై కళ్ళనుంచి అశ్రుధారలు ఉధృతంగా ప్రవహించసాగాయని చెప్పనవసరం లేదు కద? అందులో ఆశ్చర్యం కూడ లేదు కద?

"వైష్ణవా! ఇంకా ఒక విషయం ముఖ్యమంత్రి బ్రహ్మరాయలకు చెప్పు! లంకనుంచి పాండ్యరాజు కిరీటాన్ని, రత్నహారాన్ని ఎలాగైనా తీసుకొని రావాలి. దానికి తగినవాడు వాణర్‌కుల యువరాజు వంతిదేవుడే! అతడు, నీవు వెళ్ళి తీసుకొని రండి. తర్వాత మదురైకి వెళ్ళి అక్కడ పొన్నియిన్ సెల్వన్‌కి మకుటాభిషేకం చేయాలి. తెలిసిందా? అరుళ్మొళి వద్ద నాకోసం ఒక వేడుకోలు చేయి! నా మీద పడే నిందను నా సహోదరుని మీద మోపవద్దు! వాడిలాగ చోళకులానికి గట్టి తోడు ఇంకెవ్వారూ లేరని చెప్పు! దేవీ! దుర్గాపరమేశ్వరీ! నా శపథాన్ని నెరవేర్చేశాను! ఇదిగో వస్తున్నాను! చోళకులాన్ని కాపాడు!"

రాను రాను సన్నగిల్లుతూ వచ్చిన పెద్ద పళువేట్టరయ్యర్ స్వరం పూర్తిగా సన్నగిల్లి ఆగిపోయింది. ఆ ధీర మహావృద్ధుల ప్రాణదీపం కూడ ఆరిపోయింది.

~~~
~~~

# అధ్యాయము - 78

## స్నేహితుల ఎడబాటు

**కొళ్ళిడం** మహానది పడవ కాలువ పక్కనే నాలుగు గుర్రాలు కానవచ్చాయి. వాటిమీద నలుగురు వీరులు వస్తున్నారు. వారు మనకు బాగ తెలిసినవారే - పార్థిబేంద్రుడు, గందమారన్, పొన్నియిన్ సెల్వన్, వంతిదేవులే వారు.

వీరిలో మొదటి ఇద్దరు పడవెక్కి కొళ్ళిడం నది ఉత్తర తీరంవైపు ప్రయాణం చేయడానికి ఆయత్తమై వచ్చారు. తక్కిన ఇద్దరు వారిద్దరికి వీడ్కోలు పలికి పంపేందుకు వచ్చారు.

పడవ కాలువను చేరగానే స్నేహితులు నలుగురు గుర్రాలమీదినుంచి కిందకు దిగారు.

"గందమారా! నీ పాత స్నేహితుని మీద నీ కోపమంతా తొలగిపోయింది కద? ఇంకా ఏమైన మిగిలివుందా?" అని అడిగారు పొన్నియిన్ సెల్వన్.

"అయ్యా! వాడిమీద ఇంకా కోపంగొనడానికి కారణమేముంది? నా బుద్ధిహీనతను తలుచుకొని పశ్చాత్తాపపడేందుకే చాల కారణాలున్నాయి. నేను వాడికి చేసిన కీడంతా మరిచి నాతో మళ్ళీ స్నేహంగా ఉండేందుకు ముందుకొచ్చాడు కద, ఆ పెద్దతనానికి ఇంకేదీ సాటి రాదు. నా సహోదరి నదిలో మునిగి చనిపోకుండ కాపాడాడు కద, దానికి నేనీ జన్మలో ఋణం తీర్చుకోగలనా? నా బుద్ధి ఎందువల్ల ఎలా, ఎంతగా చెడిపోయిందో ఆలోచించి చూస్తే నాకే ఆశ్చర్యం కలుగుతుంది. మొదట అనుకొన్నట్లు నా చెల్లెలిని వీడికిచ్చి పెళ్ళిచేయకపోయాను కద? అలా చేసివుంటే ఆమె ఈరోజిలా పిచ్చిది కాకుండేది కద?" అన్నాడు గందమారన్.

"అదేం అలా అంటున్నావు? నదిలో పడ్డ అదురు వల్ల కాస్త మతిమరుపు కలిగినట్లుంది. కొన్ని రోజులు పోతే నయమైపోదా?" అన్నారు యువరాజు.

"సాధారణ మతిమరుపులాగ తోచడం లేదు. తక్కిన అందరూ ఆమెకు గుర్తున్నారు. అన్ని విషయాలూ గుర్తున్నాయి. నేను, వంతిదేవుడు మాత్రం ఆమెకు గుర్తు తెలియడం లేదు. నామీద ఆమె ఎంతటి ప్రేమానురాగాలుగొనివుండేదన్నది తలుచుకొంటే నా గుండె పేలిపోతుందనిపిస్తుంది. 'అయ్యో! నా ప్రియసహోదరుని నేనే నా చేతులారా చంపేశాను కద?' అని ఆమె ఎలుగెత్తి ఏడుస్తున్న శబ్దం నా చెవుల్లో ఇంకా మారుమోగుతూంది.."

"అదెందుకలా ఆమె ఎలుగెత్తి ఏడ్వాలి? నీవు ప్రాణాలతోనే ఉన్నావు కద?"

"నేను ప్రాణాలతోనే ఉన్నాను. చచ్చిపోయివుంటే ఎంతో బాగుండేది. అవునయ్యా! వంతిదేవుని నేను చంపేసినట్లు, అందుకు ప్రతిగా ఆమె నన్ను చంపేసినట్లు ఆమె గట్టిగా నమ్ముతోంది. ఒక్కోసారి నన్ను

తలుచుకొని ఏడుస్తుంది. ఇంకొన్నిసార్లు నా స్నేహితుని తలుచుకొని, 'నది వెల్లువ దిశ తిరిగి పారుతుందా? చనిపోయినవారిని తీసుకొని వచ్చి ఇస్తుందా?' అని ఏడుస్తుంది. ఎంత చెప్పినా నన్ను తన అన్న అని నమ్మడం లేదు. వంతిదేవుని కూడ గుర్తుపట్టడం లేదు. 'నీవెవరు? ఆ వాణర్‌కుల యువరాజును నీవు చూశావా?' అని వీడిసే అడుగుతూంది...!"

"అలాగా!" అని పొన్నియిన్ సెల్వన్ తిరిగి చూసినప్పుడు వంతిదేవుని కళ్ళలో కన్నీరు పొంగడం గమనించారు.

"అరెరె! వంతిదేవులు యువరాజు కారు, రాజుగారే అయ్యారని తెలిస్తే ఆమెకు ఎంత సంతోషం కలుగుతుంది? ఆమెకా భాగ్యం లేకపోయింది కద?" అన్నాడు పార్థిబేంద్రుడు.

~

ఇది విన్న గందమారన్ ఆశ్చర్యంతో పొన్నియిన్ సెల్వన్‌వైపు చూశాడు.

"అవునయ్యా! నీ స్నేహితునికి వాణగపాడిని మళ్ళీ ఇచ్చి రాజుగా చేసేయాలని చక్రవర్తి తీర్మానించారు. అలాగే నీకు కూడ వాణగపాడి దగ్గర పైదుంబరాయర్లు ఏలిన భాగాన్ని ఒక ప్రత్యేక రాజ్యంగా చేసి ఇవ్వాలని తీర్మానించారు. ఇక మీరిద్దరు పక్కపక్కనే ఉంటారు. మీ స్నేహానికి ఎలాంటి భంగం కలగకుండ నడుచుకోవాలి!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

"చక్రవర్తి కరుణకు ఎల్లలే లేనట్లుంది. అలాగైతే నేనిక కడంబూరుకు వెళ్ళనవసరమే లేదు కద?" అని గందమారన్ కాస్త ఉత్సాహంతో అడిగాడు.

"వెళ్ళనవసరం లేదు. అక్కడ మీ పాత మాళిగ ఇంచుమించు పూర్తిగా కాలిపోయింది కద? మళ్ళీ మీరక్కడికి వెళితే ఆ పాత జ్ఞాపకాలు వస్తూనే ఉంటాయి. పాలనది దక్షిణతీరాన కొత్త మాళిగ కట్టుకోండి. నీ సహోదరి కోలుకొన్నాక ఆమె కూడ అక్కడే వచ్చి ఉండవచ్చు."

"రాకుమారా! ఇక మణిమేఖల మాతో వచ్చి ఉంటుందని నేననుకోవడం లేదు. తమ పెదబామ్మగారు శెంబియన్ మహాదేవి ఆమెను తమతో తీర్థయాత్రలకు తీసుకొని వెళతామని చెప్పారు. మణిమేఖలకు పెద్ద మహారాణిగారు చాల నచ్చారు. ఈ రోజు కూడ వారు మణిమేఖలను తిరువైయారుకు తమతో పిలుచుకొని వెళ్ళారు."

"అవును. పెద్ద బృందంగానే వెళ్ళారు. కొత్తగా పెళ్ళిచేసుకొన్న నా పినతండ్రి, పినతల్లి కూడ వారితో వెళ్ళారు. ఈ చోద్యాన్ని వినండి. సముద్రకుమారిని ఇక నేను పినతల్లిగా ఎంచి పిలవాలి!"

"చోళకులంలో ఇంత సాధారణంగా, ఏ ఆర్భాటమూ లేకుండ ఇంతవరకు ఏ పెళ్ళీజరగలేదు, మధురాంతకులకు, పూంగుళలికి జరిగిన పెళ్ళిలాగ!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"నా పట్టాభిషేకం కూడ అంత సామాన్యంగానే జరగబోతూంది!" అన్నారు అరుళ్మొళి.

"అది ఏనాడూ జరగని కార్యం...!" అన్నాడు వంతిదేవుడు.

పొన్నియిన్ సెల్వన్ అదిరిపడ్డట్లు నటించి, "ఏది జరగని పని? నా పట్టాభిషేకమా?" అని అడిగారు.

వంతిదేవుడు కాస్త సిగ్గుపడి, "కాదయ్యా! ఆర్భాటం లేకుండ జరగదని అన్నాను. ఇప్పటికే ప్రజలు తమ మకుటాభిషేకం గురించి విచారించడం, మాట్లాడుకోవడం మొదలుపెట్టేశారు!" అన్నాడు.

"రాకుమారా! మీ మకుటాభిషేక వైభవానికి మేమిక్కడ ఉండవద్దా? ఈ సమయం చూసి మమ్మల్ని ఉత్తరనాడుకు పంపిస్తున్నారు కద? పుష్యమాసం పుట్టగానే పట్టాభిషేకానికి మంచి ముహూర్తం చూస్తారని తంజావూరులో అందరూ చెప్పుకొంటున్నారు కద? వంతిదేవుడు అదృష్టశాలి!" అన్నాడు గందమారన్.

"అలా ఏమీలేదు. వంతిదేవులను కూడ నేను త్వరలో లంకకు పంపించబోతున్నాను. మిత్రులారా! ఒకటి నిశ్చయంగా నమ్మండి! నా ప్రియమిత్రులైన మీరు లేకుండ నా పట్టాభిషేకం జరగదు!" అని దృఢంగా చెప్పారు పొన్నియిన్ సెల్వన్.

"చాల ధన్యవాదాలు యువరాజా! మకుటాభిషేకానికి ముహూర్తం పెట్టగానే దూతల ద్వారా తాళపత్ర సందేశం పంపండి. వెంటనే వచ్చి చేరుతాం!" అన్నాడు గందమారన్.

"మిత్రమా! అందుగురించి దిగులేల? మీరు రాకుండ నేను పట్టాభిషేకం చేసుకోబోవడం లేదు. ఇది నమ్మండి. నేను ఎందుకు పట్టం కట్టుకొంటున్నానన్నది మరిచిపోకండి. అంతఃపురాల్లోను, ఉద్యానవనాల్లోను ఉల్లాసంగా కాలం గడిపేందుకు కాదు. మిత్రులారా! లంకకు వెళ్ళి వచ్చినప్పటినుంచి నేను కా కలలను మీకు చెప్పుకొంటూ వస్తున్నాను. ఇంకా ఒకసారి చెబుతాను వినండి! నా తాతగారి తండ్రిగారైన పరాంతక చక్రవర్తి కాలంలో చోళసామ్రాజ్యం అందుకొన్న మహోన్నతస్థితిని మించి మనకాలంలో చేరుకోవాలి. నలువైపునా సామ్రాజ్యాన్ని విస్తరించాలి. ఉత్తరాన గంగానదీతీరం వరకు, దక్షిణాన సముద్రం దాటి శ్రీవిజయరాజ్యం వరకు చోళనాడు సైన్యాలు వెళ్ళి పులిజెండాను ఎగరవేయాలి. పశ్చిమాన కొంగునాడును దాటి సముద్రంలో ఉన్న లక్షద్వీపాలవరకు వశపరుచుకొని అక్కడ మన సైన్యాలను నెలకొల్పాలి. కొంగునాడులో 'చేర రాజు' ఒకడు ఎక్కడినుంచో పుట్టుకొచ్చాడు. పాండ్యనాడులో కూడ ఉన్నట్లుంది ఎవరైన ఒక పాండ్యరాజు మొలకెత్తుతాడు. ఈ కొత్త చేర, పాండ్యరాజులకు బలమిచ్చేవారు లంకాధిపతులు. కాబట్టి లంకలోని గుహల్లో దాక్కొనివున్న మహీంద్రుని, అతడి సైన్యాలను సమూలంగా తుడిచిపెట్టాలి. లంకాద్వీపం పూర్తిగా మన పాలన కిందికి రావాలి. రాజ్యం స్థిరపడితే మాత్రం చాలా? లంకలో ఉన్న బౌద్ధస్తూపాలను మించినట్లు పెద్ద పెద్ద శివాలయాలను, విష్ణువాలయాలను ఈ పుణ్యభూమిలో నిర్మించాలి. ఈ వీర ధీరనాడులో వెయ్యేళ్ళ తర్వాత కూడ మనకాలంలో చేసిన ఆలయ కైంకర్యాలను ప్రజలు కనిపెట్టి పొగడాలి. ఈ కలలన్నీ నా కాలంలోనే నిజం కాబోతున్నాయి. నెరవేర్చే తీరుతాను. అందుకు మీరొక్కక్కరూ సహాయం చేయాలి. పార్థిబేంద్రా! చోళదేశంలోనే అత్యుత్తమ సైన్యపదవిని, నా అన్నగారు

కరికాలన్ వహించిన ఉత్తర దిశ మాతండనాయకుల పదవిని మీకు ఇచ్చాను. ఆ బాధ్యతను మీరు సమర్థవంతంగా నిర్వహించాలి. నా అన్నగారి అకాలమరణం మన పగవారిలో పలువిధాలైన ఆశలను రేకెత్తించివుంటాయి. వేంగి రాజు, రాష్ట్రకూటుల రాజు చోళనాడులో అంతఃకలహాలు మొదలవుతాయని, చిన్న రాజుల మధ్య అంతర్యుద్ధాలు జరుగుతాయని ఎదురుచూస్తుంటారు. కాబట్టి ఉత్తర పెన్నానది తీరం వెంబడి మన వీరులు ఇనుపగొలుసులాగ నిలబడి కాపలా కాయాలి. పల్లవకుల దీపమా! ఉత్తరపెన్నానది తీరాన కావలసిన ఏర్పాట్లు చేసేసి, గందమారన్ని అక్కడ దళపతిగా నియమించి మీరు వెంటనే కంచికి తిరిగి వెళ్ళండి. అక్కడ నా ప్రియసహోదరుడు కట్టించిన బంగారు మాళిగను చక్రవర్తి నివాసానికి తగినట్లు సిద్ధం చేసివుంచండి; నా శిరస్సున కిరీటాన్ని పెట్టగానే చక్రవర్తి కంచికి బయలుదేరగోరుతున్నారు!"

~

ఇది విన్న గందమారన్ /కన్నీళ్ళు నిండిన కళ్ళతో/ అశ్రుపూరిత నయనాలతో, "రాకుమారా! యుద్ధరంగంలో నేనింకా నా సామర్థ్యాన్ని చూపలేదు కదా? కానీ ఎల్లల కాపలా దండుకు నన్ను దళపతిగా నియమిస్తున్నారు కదా? ఆ పదవికి నేను అర్హుడినేనా?" అని గద్గదస్వరంతో అడిగాడు.

"మిత్రమా! సర్వసమర్థుడైన భగవంతుడు నాకు కొన్ని శక్తులనిచ్చాడు. ఎవరెవరు ఏ కార్యానికి తగినవారని కనిపెట్టగల శక్తిని కూడ ఇచ్చాడు. నిన్ను ఉత్తరసరిహద్దు కాపలా సైన్యానికి దళపతిగ నియమించినట్లే, నీ స్నేహితుడు వల్లవరయ్యన్ని లంకాసైన్యానికి దళపతిగా నియమించాను! ఇద్దరూ మీ మీ బాధ్యతలను సమర్థవంతంగా నెరవేరుస్తారని నాకు నమ్మకముంది!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

"ఇంకా కొంతకాలం ఇద్దరిలో ఒకరిని ఉత్తరసరిహద్దు వద్ద, ఇంకొకరిని దక్షిణసరిహద్దు వద్ద ఉంచడం మంచిదే. ఎప్పుడైనా, ఎక్కడైనా మీరు లేని సమయంలో ఒకరితోనొకరు దెబ్బలాటకు దిగినా ఆశ్చర్యం లేదు!" అన్నాడు పార్థిబేంద్రుడు.

"అయ్యా! ఇక అలా ఏనాడూ జరగబోదు!" అని చెబుతూనే గందమారన్ వంతిదేవుని సమీపించాడు.

"మిత్రమా! నా తప్పులన్నీ మన్నించావు కదా?" అన్నాడు.

అందుకు వంతిదేవుడు మాటలతో బదులివ్వక రెండు చేతులు చాచి తన మిత్రుని గాఢంగా కౌగలించుకొన్నాడు.

మిత్రులిద్దరూ కాసేపు మౌనంగా కన్నీరు విడిచారు.

తర్వాత పార్థిబేంద్రుడు, గందమారన్ వెళ్ళి తమకోసం సిద్ధంగావున్న పడవెక్కారు.

పడవ నదిలో సగం దూరం వెళ్ళే వరకు చూస్తూండి తర్వాత పొన్నియిన్ సెల్వన్, వంతిదేవుడు తమ గుర్రాలను తంజావూరు వైపు మళ్ళించారు.

~~~
~~~

# అధ్యాయము - 79

## బాటలో అనుకోని కలయిక

**పొన్నియిన్ సెల్వన్** పట్టాభిషేక మహోత్సవం త్వరలోనే జరగబోతూందని దేశమంతా తెలిసిపోయింది. ప్రజలు చాల ఉత్సాహంతో ఆ వైభవాన్ని ఎదురుచూడసాగారు.

ఆదిత్య కరికాలన్ అకాల మరణం, మందాకిని ప్రాణత్యాగం, పెద్ద పళువేట్టరయ్యర్ శపథం కోసం ప్రాణత్యాగం మొదలైన సంఘటనలు చక్రవర్తి మనసును ఎంతగానో గాయపరిచాయి. అయినా కూడ రాజ్యహక్కును గురించిన చర్చలు ఒక కొలిక్కి వచ్చి, చిన్న/సామంతరాజులు, ప్రజలు కూడ ఏక కంఠంతో అరుళ్మొళి వర్మే పట్టం కట్టుకోవడానికి ఒప్పుకొని సంతోషంగా ఆదరించిన విషయం ఆయనకు కాస్త ఊరటను, ఓదార్పును కలిగించింది.

పుష్యమాసం పుట్టగానే మంచిరోజు చూసి పొన్నియిన్ సెల్వన్ తలమీద రాజ్యభారం మోపేసి కంచికి వెళదామని చక్రవర్తి తీర్మానించేశారు. అక్కడ తమ వీరపుత్రుడు ఆదిత్య కరికాలన్ తమ కోసం నిర్మించిన బంగారు మాళిగలోనే తమ శేషజీవితాన్ని గడిపేయాలని కూడ తీర్మానించేశారు.

కాబట్టి పట్టాభిషేక వైభవాన్ని అంతగా ఆర్భాటం లేకుండ జరిపి ముగించేయాలని అనుకోవడంలో ఆశ్చర్యం లేదు కద?

ఈ విషయంలో అరుళ్మొళివర్మ కూడ తండ్రి ఉద్దేశాన్ని ఆయన కోరిన రీతిగానే నెరవేర్చాలని నిశ్చయించుకొన్నారు. కాబట్టి పట్టాభిషేకం ముగిసేవరకు దేశప్రజల మధ్య అంతగా వెళ్ళడం లేదని తీర్మానించారు.

కొళ్ళిడం నది పడవ కాలువనుంచి తంజావూరుకు తిన్నగా వెళ్ళడమంటే తిరువైయారు నగరం గుండా వెళ్ళాలి. ఆ నగరం లోపల వెళితే, ప్రజలు ఆయనను చుట్టుముట్టి ఆర్భాటం చేయడం తథ్యం. కాబట్టి స్నేహితులిద్దరూ ఆ నగరంగుండా వెళ్ళక, కాస్త పశ్చిమంగా వెళ్ళి కావేరి నదిని దాటారు. కుడమురుట్టి నదిని చేరగానే ఆ నదీతీరం వెంబడి తంజావూరు రాజబాట వైపు వెళ్ళారు.

~

ఐదు నదులు ఒకదాని పక్కన ఇంకొకటిగా ప్రవహించే ఆ అద్భుతమైన ప్రదేశపు జలప్రవాహం, సారవంతమైన భూములు మార్గశిరమాసంలో చూడడానికి రెండు కళ్ళు చాలవన్నంత సుందరంగా కనిపించాయి. రెండువైపులా గట్లను తాకుతూ వెల్లువ పారే వర్షాకాలం కన్న సగం నది మెల్లమెల్లగా పారుతూ సగం నది ఇసుకమయంగా కనిపించినప్పుడు చూడడానికి మరింత ఇంపుగా ఉంటుంది.

నదికి రెండువైపులా కొబ్బరి చెట్లు, అరటి చెట్లు, చెరకు గడలు ఏపుగా పెరిగివున్నాయి.

తోపులు, తోటలు లేని చోటల్లా సారవంతమైన మడుల్లో బంగారు వన్నె వరిపైర్లు వరికంకుల భారాన్ని మోయలేక నేలకు వాలాయి.

మధ్యమధ్య కొలనుల్లో తామరపూలు, కలువలు వర్ణచిత్ర దృశ్యాలుగా కానవచ్చాయి.

వీటన్నిటినీ చూస్తూ ఆశ్చర్యపోతున్న వంతిదేవుని చూసి పొన్నియిన్ సెల్వన్, “మిత్రమా! ఇంతటి సమృద్ధమైన ప్రదేశం ఈ లోకంలో ఇంకెక్కడైనా ఉందా? ఇటువంటి సిరిసంపదలతో తులతూగే నాడులో పట్టం కట్టుకోవడం ఎంతటి మహాభాగ్యం? ఇంతటి మహాభాగ్యాన్ని ఇప్పటివరకు నేను తిరస్కరిస్తూ వచ్చిన విషయం తలుచుకొంటే నాకే ఆశ్చర్యంగా ఉంది!” అన్నారు.

“నాకందులో ఆశ్చర్యమేమీ తోచడం లేదు. అయ్యా! రాజవంశస్థుల చపల మనస్తత్వం గురించి తరచూ పెద్దలు చెప్పగా విన్నాను!” అన్నాడు వంతిదేవుడు.

“మీరు చాల చెడ్డవారు. దానితోబాటు కృతజ్ఞత లేనివారు. లంకనాడుపై దండెత్తి వెళ్ళబోయే సైన్యానికి మిమ్మల్ని దళపతిగా నియమించినందుకు మీరింకా కృతజ్ఞతలు కూడ తెలియజేయలేదు. నేను చంచల మనస్కుడనని నింద మోపుతున్నారు!”

“సాధారణప్రజల విషయంలో ఏమోగాని, రాజవంశస్థుల విషయంలో అది పొగడ్తకు కారణం కావచ్చు కద? నేడు ఒకడికి మరణశిక్ష విధిస్తారు; రేపు అతన్ని క్షమించేసి దళపతిగా నియమిస్తారు. ఇటువంటి చపలబుద్ధివల్ల రాజుల కీర్తి అధికం కాక ఇంకేమవుతుంది? 'ఆహా! మన రాజు ఎంతటి కరుణామయులు!' అని ప్రజలు పొగడుతారు కద?”

“అవునవును; నేడు దళపతిగా నియమించినవాడికి రేపు మరణదండన విధించినా విధించవచ్చు. అప్పుడు ప్రజలేమంటారు?”

“స్థితప్రజ్ఞత కోల్పోక న్యాయమొసగే రాజని, మనుచక్రవర్తి పునరవతారమని చెప్పి వేనోళ్ళ కొనియాడుతారు!”

పొన్నియిన్ సెల్వన్ గలగలమని నవ్వేసి, “అలాగైతే మీకిచ్చిన వాణగపాడి రాజ్యాన్ని, లంకమీదికి వెళ్ళే సైన్యానికి దళపతి పదవిని వెనక్కి తీసేసుకొంటే, మీకందులో విచిత్రమేమీ తోచదు కద?” అన్నారు.

“ఆశ్చర్యపడనూ పడను; దుఃఖపడను కూడాను. ఇప్పుడు కూడ మీరు నన్ను లంకకు పంపించడం నాకు పెద్ద దళపతి పదవిని ఇచ్చే ఉద్దేశంతోనా లేక నేను ఈ సుందరమైన చోళనాడులో ఉండకూడదని దేశ భ్రష్టుని చేసే ఉద్దేశంతోనా అని నాకు సందేహంగా ఉంది!”

“నిజానికి ఇంతటి సమర్థవంతులైన మిమ్మల్ని నా ముఖ్యమంత్రిగా నియమించుకొని నా దగ్గరే ఉంచుకోవాలని నాకు చాల కోరికగా ఉంది. కానీ ముఖ్యమంత్రి అనిరుద్ధులు మీకోసం తమ పదవిని వదిలి పెడదారని నాకనిపించడం లేదు.”

"అదొక్కటే కారణమైతే, నేనే ముఖ్యమంత్రి అనిరుద్ధులను అడుగుతాను."

పొన్నియిన్ సెల్వన్ నవ్వేసి, "లేదు. ఇంకొక కారణం కూడ ఉంది!" అన్నారు.

"నేనూ అలాగే అనుకొన్నాను."

"ఏమనుకొన్నారు?"

"ఇప్పుడల్లా మీరు మనసులో ఒకటి తలుచుకొని పైకి ఇంకొకటి చెబుతున్నారని."

"వాణగపాడి రాజుగారూ! మీ నిందారోపణను నిరూపించేందుకు ఒక ఉదాహరణ చెప్పగలరా?"

"ధారాళంగా చెబుతాను! మీ పట్టాభిషేక మహోత్సవానికి పుష్యమాసారంభంలోనే ముహూర్తం నిశ్చయించబడింది. అది మీకు తెలుసు. అలా ఉన్నప్పుడు, కాసేపటి క్రితం మన దగ్గర సెలవు తీసుకొని వెళ్ళిన మన మిత్రులతో, 'మీరు లేకుండ నా మకుటాభిషేకం జరగదు' అన్నారు. దాని గురించి నేనింకేమనుకోవాలి?" అని అడిగాడు వంతిదేవుడు.

~

పొన్నియిన్ సెల్వన్ మళ్ళీ నవ్వేసి, "అవును; మునుపల్లా నా మనసులో తోచింది అలాగే బహిరంగంగా చెప్పాలని ఎంచాను. వంతిదేవులతో స్నేహం కలిసిన తర్వాత మంత్రతంత్రాలలో శిక్షణ తీసుకొన్నాను!" అన్నారు.

"అనవసరంగా నన్ను పొగడుతున్నారు! తమకు తెలియని మంత్రతంత్రాలు ఈ లోకంలో ఏముండగలవు? ఏనుగు చెవిలో ఊదిన మంత్రానికి, ఏనుగు మావటి వేషం వేసుకొని లోకాన్ని మాయపుచ్చిన తంత్రానికి సాటి ఇంకేం ఉండగలవు?"

"అలాగే ఉండనీ! ఇకమీద మీరు నా వద్దనే మంత్రతంత్రాలు నేర్చుకోవచ్చు."

"అలా నేను ఎక్కువగా నేర్చేసుకోబోతున్నానే అన్న భయంతో నన్ను లంకకు తరిమికొట్టేస్తున్నారా?"

"మిత్రమా! లంకకు వెళ్ళడంలో ఒకవేళ మీకిష్టం లేదా?"

"ఎవరన్నారలా? లంకకు అవతల ఉన్న దూరదేశాలకు వెళ్ళమని ఆజ్ఞాపించినా వెళ్ళడానికి సిద్ధంగా ఉన్నాను. ఎంత శీఘ్రంగా పంపిస్తారో, అంతగా సంతోషిస్తాను!"

"నన్ను విడిచి వెళ్ళడంలో అంత ఆనందమా మీకు?"

"అవునయ్యా! మహారాజుల నుంచి ఎంత దూరంగా ఉంటే అంత మంచిదన్న తీర్మానానికి వచ్చాను. దూరంగా ఉంటే రాజుల స్నేహాన్ని కోల్పోకుండ కాపాడుకోవచ్చు."

"అలాగైతే మీరు నిరాశపడబోతున్నారు..."

"ఎంతదూరం వెళ్ళినా మీ స్నేహాన్ని దీర్ఘకాలం కాపాడుకోలేనని అంటున్నారా?"

"లేదు, లేదు. చాలకాలం మీరు నన్ను విడిచి వేరుగా ఉండడం సాధ్యంకాదంటున్నాను.

కొన్నిరోజుల తర్వాత నేను కూడ లంకకు వచ్చి మీతో చేరాలని ఉద్దేశిస్తున్నాను. మిమ్మల్ని తోడు తీసుకొని సముద్రాలకవతలున్న పెద్ద పెద్ద ద్వీపాలకు వెళ్ళాలని పథకం వేసుకొన్నాను. మనతోబాటు సముద్రకుమారిని పిలుచుకొని వెళ్ళలేకపోతున్నాం కద అని విచారంగా ఉంది!"

"అయ్యా! నాతో చేరి మీరు మంత్రతంత్రాలు నేర్చుకొన్నారు. మీతో స్నేహం కలిసిన తర్వాత నిజమే చెప్పాలని నిశ్చయం చేసుకొన్నాను. ఇప్పుడు నా మనసులో ఉన్నది మీకు చెప్పనా?"

"ధారాళంగా చెప్పండి!"

"నా స్నేహితుడు సేందన్ అముదన్ నుంచి, తమ పినతండ్రి మధురాంతకుల నుంచి చోళ సామ్రాజ్యాన్ని మీరు తీసుకొంటున్నారు. అది ఒక విధంగా న్యాయమే. మీరే పట్టం కట్టుకోవాలన్నది ప్రజల కోరిక అన్న కారణాన్ని చూపవచ్చు. కానీ ఆయన నుంచి పూంగుళలిని అపహరించివుంటే అటువంటి ద్రోహం ఇంకేదీ ఉండజాలదు. అది న్యాయమని చెప్పసాధ్యమే కాదు. సముద్రకుమారి ఇప్పుడు మధురాంతకుల ధర్మపతి అని గుర్తుంచుకోండి!" అన్నాడు వంతిదేవుడు.

పొన్నియిన్ సెల్వన్ గలగల నవ్వేసి, "నన్ను దశకంఠ రావణుడితో చేర్చేశారు లాగుందే!" అన్నారు.

తర్వాత, "మీ స్నేహితులను మీరు వెనకేసుకురావడం న్యాయమే! కానీ పూంగుళలి పరిస్థితి ఏమి? ఆమె నా పినతండ్రిని మనసారా ఒప్పుకొని పెళ్ళిచేసుకొందా?" అని అడిగారు అరుళ్మొళి వర్మ.

"అందు గురించి సందేహమేల? రాకుమారా! మీరు ఈ చోళసామ్రాజ్యానికి చక్రవర్తి కావచ్చు. ఈ భూమండలాన్నంతటినీ జయించి ఒక ఛత్రం కిందకు తీసుకొని వచ్చి ఏలవచ్చు. కానీ పూంగుళలిని మాత్రం ఆమె కోరికకు విరుద్ధంగా ఏ కార్యమూ చేయమని ఎవరూ బలవంతపెట్టలేరు. శెంబియన్ మహాదేవిగారి కుమారుని పట్ల పూంగుళలి అమ్మగొన్న అనురాగాన్ని తెలుసుకొనే భాగ్యం నాకు కలిగింది. అందుకు సాటిరాగల ప్రేమ ఇంకొకరి వద్ద మాత్రమే నేను కనుగొన్నాను!"

"అదెక్కడ కన్నారు? నాతో దాని గురించి చెప్పవచ్చంటే చెప్పండి!"

"కొడుంబాళూర్ రాకుమారి వాణతి వద్దనే అది కన్నాను! అటువంటి ప్రేమను ఇంకెక్కడ చూడగలం?"

"అబద్ధం! అబద్ధం! నిజాన్ని పలికే వ్రతాన్ని అంతలోపలే విడిచిపెట్టేశారా? మనసులో ఒకటి దాచిపెట్టి పైకి ఇంకొకటి చెబుతున్నారు!"

"లేనే లేదయ్యా! మనసులో ఉన్నదే చెబుతున్నాను!"

"ఇంకెవరిలోను మీరటువంటి ప్రేమను చూడలేదా?"

"లేదనే చెబుతున్నాను కద?"

"ఒరే పాతకుడా! కరుణలేని రాక్షసుడా! నీ కోసం ఒక అమ్మాయి తన ప్రాణాన్నే త్యాగం చేయ

ముందుకొచ్చి, తన మతిని పోగొట్టుకొని పిచ్చిదైపోయింది కద! ఆమె ప్రేమ నీకు పెద్దదిగా తోచలేదా?” అని పొన్నియిన్ సెల్వన్ నిజమైన కోపంతో అడిగారు.

~

వంతిదేవుడు కాసేపు మౌనందాల్చాడు. తర్వాత, “అయ్యా! మీరు కారణ, కార్యాలు మార్చి చెబుతున్నారు. మణిమేఖల మీద నాకు మమత, మమకారం లేకపోలేదు. ఆమెను తలుచుకొని, తలుచుకొని కన్నీరు విడుస్తున్నాను. కానీ ఆమె పిచ్చిదైపోవడానికి కారణం నేను కాదు; ఆమె సహోదరుడు గందమారనే! పైగా మేమిద్దరం ఆమెకు చనిపోయినవారి లెక్కలోకి వచ్చేశాము. ఇక దాని గురించి మాట్లాడి ప్రయోజనమేమి?” అన్నాడు.

“నేను కాసేపటి క్రితం కోపంగా మాట్లాడినందుకు విచారిస్తున్నాను...” అని పొన్నియిన్ సెల్వన్ ముందుకు చెప్పబోయారు.

“నాకందు గురించి ఆశ్చర్యమూ లేదు; విచారమూ లేదు. ఇలాంటి హఠాత్ కోపాన్ని ఎదురుచూసే, లంకకు త్వరగా బయలుదేరుదామని అనుకొంటున్నాను.”

“మిమ్మల్ని లంకకు పంపడానికి ఇంకొక కారణముందని చెప్పాను కద?”

“అవును, ప్రభూ!”

“కొంతకాలం మీరు దూరదేశాల్లో ఉండి వస్తే, ఒకవేళ మణిమేఖల మిమ్మల్ని గుర్తుపట్టవచ్చని నా అక్కగారు భావిస్తున్నారు.”

“తెలుసుకొన్నానయ్యా! నన్ను దూరదేశాలకు పంపడంలో మీకన్న యువరాకుమారికి అధికశ్రద్ధ ఉండడాన్ని తెలుసుకొన్నాను. మనం ఎవరి గురించి మాట్లాడుతున్నామో, వారే అదిగో వస్తున్నారు!” అని వంతిదేవుడు వేలెత్తి చూపించాడు.

కుడమురుట్టి నదీతీరం వెంబడి వస్తున్న ఆ మిత్రులిద్దరు ఆ సమయాన తిరువయ్యారు నుంచి తంజావూరుకు వెళ్ళే రాజబాటను సమీపిస్తున్నారు. ఆ రాజబాటలో ముందు వెనుక పరివారాలు రాగా పల్లకి ఒకటి వస్తూంది. అందులో కుందవైదేవి, కొడుంబాళూర్ రాకుమారి ఆసీనులైవున్నారు. గుర్రాలమీద వస్తున్న ఆ ఇద్దరు మిత్రులను చూడగానే ఆ స్త్రీమణుల కనులు ఆశ్చర్యంతో విరిసాయి. వారి వదనారవిందాలు ఆనందంతో విప్పారాయి.

~~~
~~~

# అధ్యాయము - 80

## పుడమిపుత్రిక మనోహరుడు

**రాకుమార్తెలు** వస్తున్న ఆ పల్లకిని పొన్నియిన్ సెల్వన్ గుర్రం సమీపించింది.

కాస్త వెనుకగా వస్తున్న వంతిదేవుడు, "జాగ్రత్త! రాకుమార్తెల పల్లకి మన సాధువైన గుర్రాలను గుద్దేయగలదు!" అన్నాడు.

ఇంచుమించు అదే చోట మునుపొకసారి నందిని ఎక్కి వస్తున్న మూసిన పల్లకికి తన గుర్రాన్ని గుద్దేసి ఆ పల్లకే తన గుర్రాన్ని గుద్దిందని తాను కేకలేసిన విషయం వంతిదేవునికి గుర్తుకొచ్చింది. ఆ సంభవం జరిగి ఆరు మాసాలు కూడ కాలేదు. కానీ ఈ అల్పకాల వ్యవధిలో ఎన్నెన్ని సంఘటనలు జరిగిపోయాయి!

కుందవై వంతిదేవుని మాటలవల్ల పొంగిన ఆనందాన్ని అదిమిపెట్టి, "తమ్ముడూ! మిమ్మల్ని చూస్తే ఏదో కుతూహలమైన విషయం గురించి మాట్లాడుకొంటూ వస్తున్నట్లుందే! మీ సుందరవదనాలు ఎంతో ఆనందంతో విప్పారివున్నాయి!" అన్నది.

"అవునక్కా! కుతూహలమైన విషయం గురించే మట్లాడుకొంటూ వస్తున్నాము. కానీ అది మీ చెలి వాణతికి అంతగా కుతూహలం కలిగించదు. నా పెళ్ళి రోజు దగ్గరపడుతూంది కద? నేను ప్రేమించి పెళ్ళాడబోయే వనితను చూసి ఆనందించాము. ఆమె రూపలావణ్యాల గురించి మాట్లాడుకొంటూ వస్తున్నాము!" అన్నారు పొన్నియిన్ సెల్వన్.

అంతవరకూ ప్రకాశవంతంగా ఉన్న ఆ స్త్రీమణుల ముఖాలు ఉన్నట్లుండి వాడిపోయాయి. వాణతి తల వంచుకొంది. కుందవై ముఖంలో కోపం, ఆశ్చర్యం, సందేహం, ఉక్రోషం మొదలైన పలురకాలైన భావాలు కనిపించి మరుగైనాయి.

"ఇదేమి సిగ్గులేని మాటలు? ఈ అమ్మాయి మనసును నొప్పించడంలో నీకేమంత సంతోషం?" అన్నది.

వాణతి దించిన తలను పైకెత్తి, "అక్కా! ఇదేం మాట? నాకెందుకు విచారం?" అన్నది.

దేనికీ బదులు చెప్పకుండ పొన్నియిన్ సెల్వన్ లాస్యవికసిత వదనంతో నిలబడడాన్ని చూసి యువరాకుమారి, "కొళ్ళిడం నదికే కద వెళ్ళి వస్తున్నారు? అక్కడ ఏ అమ్మాయిని చూశారు? ఏవూరు? ఏం పేరు? ఏ కులం?" అని ప్రశ్నల వర్షం కురిపించసాగింది.

~

అప్పుడు వంతిదేవుడు కలిగించుకొని, "దేవీ! యువరాజు పెళ్ళాడబోయే కులస్త్రీనెవరినీ మేము

చూసిరాలేదు. ఈ పంచనదీతీరంలో సమృద్ధిగా పండే పుడమితల్లి కుమార్తెనే దారిపొడుగునా చూసి ఆశ్చర్యపడుతూ వచ్చాము. సారవంతమైన చోళనాడు ప్రకృతి సౌందర్యాలను గురించి మాట్లాడుకొంటూ వచ్చాము. యువరాజు ఈ అందమైన చోళనాడుకు చక్రవర్తిగా పట్టం కట్టుకొనే రోజు దగ్గరపడుతోంది కద? ఈయన ఈ పుడమితల్లి కుమార్తెమీదగొన్న ప్రేమనే సూచిస్తున్నారు!" అన్నాడు.

"ఆహ్! నా సహోదరుడికి ఇలా కవితలల్లి మాట్లాడడం రాదు. ఇప్పుడు మీరు కాస్త నేర్పిస్తున్నారు కాబోలు!" అన్నది కుందవై.

అరుళ్మొళివర్మ నవ్వేసి, "మిత్రమా! మీకిది కావలసిందే! మీతో స్నేహం కలిసిన తర్వాత నాకు మంత్రతంత్రాలొచ్చాయని మునుపే చెప్పాను కద? ఇప్పుడు నా అక్కగారికి కూడ అలాగే అనిపిస్తూంది చూడండి!" అన్నారు.

"ఇదేం లేనిపోని నింద? అక్కతమ్ముళ్ళు కూడబలుక్కొని నా మీద నిందలు మోపుతున్నారు కద?" అన్నాడు వంతిదేవుడు.

"ఇంకా మీ పేర చాల నేరాలున్నాయి. నా తమ్ముడు చెప్పివుండలేని నేరాలు కూడ ఉన్నాయి. వాటన్నిటినీ ఈ దారిలో నిలబడి చెప్పలేను!" అన్నది కుందవై.

వంతిదేవుడు, "నా సందేహం నిజమైంది!" అన్నాడు.

"ఏమది?"

"నన్ను లంకాసైన్యానికి దళపతిగా నియమించి అక్కడికి పంపించడం నా నేరాలన్నిటికీ ద్వీపాంతర శిక్ష విధించడమే అవుతుందని సందేహించాను."

"చూశారా, అక్కా! చోళకులస్థుల కృతజ్ఞతాభావంలో ఈయనకెంత నమ్మకముందో తెలుస్తూంది కద?"

"మనకు వీరిపట్ల కించిత్తు కూడ కృతజ్ఞత లేదన్నది నిజమే!"

"ఇదేమి? మీరు కూడ ఇలా మాట్లాడుతున్నారే?"

"అన్యులు చేసే సహాయానికి కృతజ్ఞతలు చెప్పవచ్చు/తెలుపవచ్చు. స్నేహితుల మధ్య కృతజ్ఞత ప్రశ్నేమి? తిరువళ్ళువర్ చెప్పింది గుర్తు లేదా? 'జారిపోయిన బట్టను ఎత్తి కట్టినందుకు ఎడమచేతికి కృతజ్ఞతలు తెలియజేయాలా?'" అన్నది కుందవై.

"దేవీ! కృతజ్ఞతలు తెలియజేయవలసిన అవసరమే లేదు. శిక్ష విధించకపోతే, అదే మహాభాగ్యం!"

"తమ్ముడూ! నీవూ, ఈయనా ఒకరికొకరు సరిగ్గా ఉన్నారు. ఒకటి జ్ఞాపకముంచుకోండి. ఈయనను నాకు సహాయంగా ఉండే ఉద్దేశంతో మన అన్న, వీరస్వర్గం చేరుకొన్న కరికాలన్ పంపారు. ఆ బాధ్యతనుంచి నేను ఈయననింకా విడుదల చేయలేదు!" అన్నది కుందవై.

"ఈయనను విడుదల చేయనే చేయకండక్కా! జీవితాంత శిక్ష విధించినా సమ్మతమే!" అన్నారు యువరాజు.

"లంకలో ఈయన నెరవేర్చవలసిన కార్యాలు కొన్ని ఉన్నాయి!" అన్నది కుందవై.

"వెళ్ళేముందు మీ వద్ద సెలవు తీసుకొనే వెళతాను, దేవీ!" అన్నాడు వంతిదేవుడు.

"అలాగైతే, మీరు పళైయారైకి వచ్చి నా వద్ద సెలవు తీసుకొని వెళ్ళవలసివుంటుంది" అన్నది కుందవై రాకుమారి.

"అక్కా! మీరిప్పుడెక్కడికి బయల్దేరారు?" అని కాస్త ఆదుర్దా, ఆశ్చర్యంతో అడిగారు అరుళ్మొళి.

"తిరువైయారుకు వెళుతున్నాము. నేడు మార్గశిర తిరువాదిరై పుణ్యదినం కద? శెంబియన్ మహాదేవి, మధురాంతకులు, పూంగుళలి ఉదయాన్నే వెళ్ళారు. మీరూ వస్తున్నారా?" అని అడిగింది కుందవై.

"లేదు. మేమిప్పుడు రావడం లేదు. తిరువైయారు మార్గాన వెళ్ళకూడదనే ఇలా నదీతీరం వెంబడి వెళ్ళి తిరిగి వస్తున్నాము."

"అప్పర్ మహానుభావుడు తిరువైయారులో కైలాసాన్నే దర్శించి పరవశించారు. మీకు అక్కడికి వెళ్ళడమే ఇష్టంలేదులాగుంది. ఒకవేళ మీరు కూడ వీరవైష్ణవులుగా మారిపోయారా, ఏమి?"

"అలాగేం లేదు. తిరువైయారుకు వెళితే, అప్పర్ పెరుమాళ్ళు అక్కడికి ఎలా వెళ్ళారో అలా వెళ్ళాలని నా కోరిక."

"అప్పర్ ఎలా వెళ్ళారు?"

"వారి పాటలోనే చెప్పారు కద? ఏ ఆడంబరమూ లేకుండ, తాము తిరునావు రాజుగారన్నది చూపించుకోకుండ, పూజ కోసం పూలు, నీరు తీసుకొని వెళుతున్న భక్తబృందం వెనక వెళ్ళారు. కాబట్టి ఆయన తిరువైయారులో కైలాసాన్నే చూడగలిగారు. మనమక్కడికి ఈ రాజరికపు ఆడంబరాలతో వెళితే, మనమూ భగవంతుని దర్శించలేము; ప్రజలు కూడ దైవదర్శనాన్ని మరిచిపోయి మన చుట్టూ చేరుతారు..."

"అవునవును. నీ జాతక విశేషం అలాంటిది. నిన్ను చూడగానే ప్రజలు నిన్ను చుట్టుముట్టి, 'రారాజుకు జై! పొన్నియిన్ సెల్వన్‌కి జై!' అని ఘోషించనారంభిస్తారు. కానీ మాకలాంటి అపాయం లేదు. పైగా మేము జనకూటమి మధ్య వెళ్ళనే వెళ్ళము. తిరువాదిరై పుణ్యదినం కోసం స్వామి ఉత్సవం జరిగేటప్పుడు మన అంతఃపురం పైమేడనుంచే స్వామిని దర్శించుకొంటాము."

"అక్కా! ఒక పాత పాట జ్ఞాపకముందా? సకల చరాచరాలను, అఖిల భువనాలను, ఆకాశానున్న నక్షత్రాలను సృష్టించినవాడు భగవంతుడు. ఆయనను 'ఆదిదేవుడని' తిరువాదిరై నక్షత్రానికి మాత్రం తగినవాడని ప్రజలు అనుకోవడం ఎంతటి అమాయకత్వం? - ఇటువంటి అర్థమున్న ఆ పాట మీకు

గుర్తుందా?"

"గుర్తుంది, తమ్ముడూ! కానీ అన్ని నక్షత్రాలకు తగినవాడు తిరువాదిరై నక్షత్రానికి కూడ తగినవాడే కద?"

"సరే, మీరు వెళ్ళిరండి! ఎప్పుడు తంజావూరుకు తిరిగి వస్తున్నారు?"

"తంజావూరుకు మేమిప్పుడు తిరిగి రావడం లేదు. తిరువైయారునుంచి పళైయారైకి వెళుతున్నాము."

"ఏమేమి? నా మకుటాభిషేకానికి మీరు తంజావూరులో ఉండరా?" అన్నారు యువరాజు.

"అవును! నీ మకుటాభిషేకంలో నాకు, వాణతికి ఏం పని?"

"అక్కా! మీరు లేకుండ నా పట్టాభిషేకం జరగదు!"

"ఎందుకు జరగదు? అంతా జరుగుతుంది. పట్టాభిషేకానికి ముహూర్తం చూసిపెట్టినవారెవరు? రాముని పట్టాభిషేకానికి మంచిరోజు చూసిపెట్టినవారి పరంపరలో వచ్చినవారు కద?"

"నాకు దినం, నక్షత్రం, జ్యోతిష్యం, హస్తసాముద్రికం - దేనిలోను నమ్మకం లేదక్కా! మన కర్తవ్యాన్ని నెరవేర్చే అన్ని దినాలు మంచి దినాలే! సోమరితనంతో ఉండే రోజులే చెడ్డరోజులు!"

"నీ జీవితకాలమంతా అలాంటి మంచిరోజులే ఉండనీ, తమ్ముడూ! మేము వెళ్ళి స్వామివారికి, అమ్మవారికి నీ కోసం పూజలు, ప్రార్థనలు చేస్తాము!" అన్నది కుందవై.

"నా కోసం ఏం ప్రార్థన చేయబోతున్నారు?"

"పుడమి తల్లి కుమార్తెమీద నీవుగొన్న అనుగాగమే సఫలం కానీ; నీ మకుటాభిషేకం విఘ్నం లేకుండ జరగనీ అని ప్రార్థిస్తాను. నీ మనసు చోళకులానికి తగిన నీతిమార్గం నుంచి పక్కకు తొలగకుండనీ అని అమ్మవారి సన్నిధిలో ప్రార్థిస్తాను."

"అలాగైతే, మీరు నా పట్టాభిషేకానికి ఉండబోవడం లేదా?"

"పళైయారైనుంచి మనోనేత్రంతో చూసి ఆనందిస్తాము."

"అక్కా! మీ మొండిపట్టు ముందు కొడుంబాళూర్ రాకుమారి మొండిపట్టు దిగదుడుపే. ఈమె నాతో సింహాసనమెక్కకపోతే లోకమే అస్తమించిపోతుందని అనుకొంటూంది. ఈమె అనవసర హఠం విపరీత పరిణామాలకు దారితీయబోతూంది. ఈమెకు బదులు ఇంకొక వనిత చోళసింహాసనం మీద ఆసీనురాలు కాబోతూంది! ఆ తర్వాత నామీద నింద మోపి ప్రయోజనం లేదు!" అన్నారు యువరాజు పొన్నియిన్ సెల్వన్.

"నేనీయన మీద ఎప్పుడూ నిందారోపణ చేయలేదు; ఇకముందు చేయను కూడ!" అన్నది కొడుంబాళూర్ రాకుమారి.

"నీవు చెప్పినా ప్రయోజనం లేదు, వాణతీ! రాజ్యకాంక్షగొన్నవారి చెవికి ఇంకేదీ ఎక్కదు!"

అన్నది యువరాకుమారి కుందవై.

"ఈ మట్టిమీద ఆశను నాలో పుట్టించింది మీరేనని మరవకండి. స్త్రీగా పుట్టిన మీరే ఈ అందమైన చోళనాడును వదిలి వెళ్ళడానికి మనసు రావడం లేదని, అందుకే పెళ్ళి చేసుకోనని నాకు ఎన్నోసార్లు చెప్పలేదా?" అన్నారు అరుళ్మొళి.

"అప్పుడల్లా నా మాటలు నీ చెవికెక్కనే లేదు. లోకంలో ఇంకెన్నెన్నో అందమైన దేశాలున్నాయని చెప్పుకొచ్చావు! ఈ వాణర్‌కుల వీరుని బోధలే నిన్నిలా భూమాతాకుమారి ప్రేమికునిగా మార్చేశాయి!" అన్నది కుందవై.

"భగవాన్! ఆ నింద కూడ వచ్చి నామీదే పడాలా?" అని వాపోయాడు వంతిదేవుడు.

"ఎన్నో భయంకరమైన నిందలను మోశారు కద? ఈ చిన్న నిందకా భయపడుతున్నారు? తమ్ముడూ! చాలసేపు మాట్లాడుతూ ఉండిపోయాము! స్వామి కరుణించే ముహూర్తం దగ్గరకొచ్చేసింది! వెళ్ళి వస్తాము!" అని చెప్పి కుందవై పల్లకి బోయీలకు సంజ్ఞ చేసింది.

పల్లకి ముందుకు సాగింది.

కాసేపు అక్కడే నిలబడి చూస్తూండి, ఆ తర్వాత పొన్నియిన్ సెల్వన్, వంతిదేవుడు తమ గుర్రాలను ముందుకు నడిపారు.

కాస్త దూరం వెళ్ళిన తర్వాత పక్కనున్న వంతిదేవుని చూసి, "మిత్రమా! ఈ స్త్రీమణులు నిజంగా స్వామి దర్శనానికి వెళుతున్నట్లు నాకనిపించడం లేదు. కుడంద్తై జ్యోతిష్కులు ఇప్పుడు తిరువైయారుకు సమీపానే ఇల్లు చూసుకొని వచ్చేశారట! ఆయనను చూసి జోస్యం అడిగేందుకే వెళుతున్నారు!" అన్నారు.

"అయ్యా! కుడంద్తై జ్యోతిష్కుల కన్న మీరే పెద్ద జ్యోతిష్కుల్లాగ ఉన్నారే!" అన్నాడు వంతిదేవుడు.

~~~
~~~

# అధ్యాయము - 81

## పిల్లి - చిలుక

**పొన్నియిన్** సెల్వన్ ఊహించినట్లే జరిగింది.

కుందవైదేవి, వాణతి తిరువైయారులో ఉన్న చోళమాళిగకు చేరగానే పల్లకిని, పరివారాన్ని అక్కడే ఆపారు. శెంబియన్ మహాదేవి, వారి కుమారుడు, కోడలు పూంగుళలి ఆలయానికి వెళ్ళారని తెలుసుకొన్నారు. తాము కూడ కాపలావారికి చెప్పేసి ఒకే ఒక్క కాపలావీరుని తోడు తీసుకొని జ్యోతిష్కుల ఇంటిని వెతుక్కొంటూ వెళ్ళారు.

అవును; కుడంద్తై జ్యోతిష్కులు అక్కడ తమ ఇల్లు వరదలో కూలిపోగానే తిరువైయారుకు వచ్చేశారు. నగర తూర్పు శివార్లలో కావేరినది ఒడ్డున ఒక చిన్న ఇల్లు కట్టుకొని నివసిస్తున్నారు.

ఇక మీదట పళైయార్తై కన్న తంజావూరు అధిక ప్రాధాన్యతగొనవచ్చని ఆయన జ్యోతిష్యం మూలంగా తెలుసుకొన్నది కూడ బహుశ ఆయన తిరువైయారుకు రావడానికి ఇంకొక కారణమైవుండవచ్చు.

జ్యోతిష్కుల ఇంటి వాకిట కాలు పెట్టగానే లోపలినుంచి చాల ఇంపైన చిన్నపిల్లల స్వరంతో, "రండి రాకుమార్తెలారా, రండి! నాట్యశిరోమణుల్లారా, రండి!" అని ఎవరో స్వాగతం పలకడాన్ని విని రాకుమార్తెలిద్దరూ ఆశ్చర్యపోయారు. మునుపు ఒక మొరటు శిష్యుని కాపలావుంచిన జ్యోతిష్కులు ఇప్పుడు ఇలా ఉపచారం చేసి ఆహ్వానించేందుకు ఎవరిని నియమించారోనని అబ్బురపడుతూ లోపల ప్రవేశించారు.

చూరునుంచి వేలాడుతున్న ఒక పంజరంలోవున్న చిలుకను చూడగానే వారి సందేహం వీడింది. ఆ చిలుక తన తలను అటూ ఇటూ తిప్పుతూ గురివింద గింజల్లాంటి తన చిన్న కళ్ళతో వారిని చూసి, మళ్ళీ, "రండి రాకుమార్తెలారా, రండి!" అన్నది.

చిలుక గొంతును, ఆ స్త్రీమణుల కాలి గజ్జెల చప్పుడును విని జ్యోతిష్కులు కూడ లోపలి గది నుంచి ముందు గదికి వచ్చారు.

కుందవైదేవిని, వాణతిని చూసి అదిరిపడి, "రండి! రాకుమార్తెలారా, రండి! ఈ గుడిసె ఈ దినమే పావనమైంది!" అన్నారు.

చిలుక కూడ తన ముద్దులొలికే ఎర్రని నోరు తెరిచి, "ఈ గుడిసె ఈ దినమే పావనమైంది!" అన్నది.

జ్యోతిష్కులు దాన్ని చూసి, "ఛీఛీ! కాసేపూరుకో! నోరు మూసుకో!" అన్నారు.

"అయ్యా! దాన్నెందుకు కోపగించుకొంటారు? ఇంటికి వచ్చినవారికి మంచి రీతిలో ఆహ్వానం పలుకుతూంది కద? రోజూ ఇక్కడికి పలువురు వచ్చి 'ఈరోజే ఈ గుడిసెను పావనం చేస్తారు' లాగుంది!" అన్నది యువరాకుమారి కుందవై.

"రండి! నాట్యరాణుల్లారా, రండి!" అన్నది చిలుక.

జ్యోతిష్కులు మళ్ళీ దాన్ని గద్దించేసి, "అమ్మగార్లూ! మన్నించాలి! తిరుజ్ఞాన సంబంధ పెరుమాళ్ళు తిరువైయారుకు వచ్చినప్పుడు వీధి పొడుగునా నాట్య రంగస్థలాలు చూశారు. ఆ రంగస్థలాల మీద స్త్రీమణులు నాట్యమాడేటప్పుడు వారి కాలిగజ్జెలు ఘల్లుఘల్లుమని చేసే శబ్దాన్ని కూడ విన్నారు. వారి దైవపాశురాలలోను వాటి గురించి పాడారు. ఆరోజు లాగ ఇప్పుడు కూడ తిరువైయారులో ఎందరో నాట్యమణులున్నారు. వారు తరచు జోస్యం అడిగి తెలుసుకోవడానికి ఈ గుడిసెకు వస్తుంటారు! వారిని స్వాగతించేందుకు అనుకూలంగా ఉండనీ అని ఈ చిలుకకు ఇలా నేర్పించి అలవాటు చేశాను. దయచేసి మన్నించాలి!" అన్నారు.

"ఇవాళ ఆ నాట్యమణులెవరూ ఇక్కడ కానరావడం లేదే?" అన్నది కుందవై.

"దేవీ! ఈ రోజు తిరువాదిరై పర్వదినం. కాబట్టి వారందరూ దేవుని సన్నిధిలో సేవ చేసేందుకు వెళ్ళివుంటారు. కాబట్టి నిజమైన రాకుమార్తెలైన మీరే వచ్చేశారు. ఈ గుడిసె పావనమైంది. నేను భాగ్యశాలిని!" అని పరవశంతో అన్నారు జ్యోతిష్కులు.

తర్వాత, "దయచేసి ఆసీనులు కండి! ఈ పేదవాడిని ఏం అడిగేందుకు వచ్చారో అది అడగండి! తెలిసినంతవరకు చెబుతాను!" అన్నారు.

~

రాకుమార్తెలిద్దరూ కూర్చొన్నారు. కుందవై ఒకసారి పెద్దగా నిట్టూర్చి, "అయ్యా! ఏమని అడగను? ఈ జ్యోతిషశాస్త్రంలో నిజమేదైనా ఉందా? - అన్న ప్రశ్నే మొదట అడగాలనిపిస్తోంది!" అన్నది.

"దేవీ! మీరిలా అడిగితే నేనేం చెప్పను? నమ్మకం ఉన్నవారికి ఈ శాస్త్రం నిజం; లేనివారికి అది అబద్ధమే!" అన్నారు జ్యోతిష్కులు.

"నేను జ్యోతిషశాస్త్రంలో పూర్తి నమ్మకం కలిగివుండేదాన్ని. కానీ ఆ శాస్త్రమే నా నమ్మకాన్ని వమ్ము చేసేసింది కద?"

"ఏ విధంగా అది మీకు ఆశాభంగం కలిగించింది?"

"మీరు జోస్యం చూసి చెప్పినట్లు ఏం జరిగింది? నా అన్న ఇలా అకాల మరణం పొందుతాడని మీరెప్పుడైనా నాకు చెప్పారా?"

"నేను చెప్పవచ్చా, దేవీ? తెలిసినా నేను నోరు విప్పి చెప్పవచ్చా? చెబితే నన్ను కూడ పాండ్యనాడు ఆపత్కాల సహాయకుల కూటమిలో చేర్చివుండరా? రాజకుటుంబీకుల గురించి, రాజకీయ

విషయాల గురించి ఏ విషయమూ సర్వసామాన్యంగానే చెప్పగలం. 'గండం ఉంది', 'అడ్డంకులున్నాయి', 'చెడ్డ గ్రహం చూస్తూంది' అని చెప్పడమే అపాయం. పైగా ఆదిత్య కరికాలన్‌గారి జాతకం నా దగ్గర లేదు కూడాను. దాన్ని నేను చూడనూ లేదు!" అన్నారు జ్యోతిష్కులు.

"మీరు చూసినా చెప్పివుండరు. చెప్పినా, ఆ విపత్తును ఆప సాధ్యమయ్యేది కాదు కద?"

"అదెలా సాధ్యం తల్లీ! నేనేమైనా బ్రహ్మదేవుడినా? రాసిన రాతను బ్రహ్మదేవుడైనా తుడిచి రాయగలడా?"

"అలాగైతే, జ్యోతిష్యం చూడడం వల్ల ప్రయోజనమేమి, జ్యోతిష్కులుగారూ?"

"తల్లీ! ఇదేం ఇలా అడుగుతున్నారు? మీలాంటివారు జోస్యం చూడకపోతే నాలాంటివారు బతకడమెలా? ఈ పేదవాని గుడిసెలో రాకుమార్తెల పాదాలు ఆనడమెలా?" అన్నారు జ్యోతిష్కులు.

~

ఇది విని కుందవై గలగలమని నవ్వేసింది. వాణతి ముఖంలోను చిరునవ్వు విరిసింది.

"జ్యోతిష్కులుగారూ! ఇక్కడికి జోస్యం అడిగేందుకు వచ్చేవారందరికీ ఇలాగే చెబుతారా?" అని యువరాకుమారి అడిగింది.

"అందరి దగ్గరా అలా మాట్లాడుతానా? కళామతల్లి, లక్ష్మీదేవి ఒకే రూపంగొని అవతరించారని లోకమంతా తమను పొగడుతున్నారు. అలాంటి మీతో వాగ్వివాదం చేసి నేను గెలవగలనా? అందుకే అలా అన్నాను. కానీ తల్లీ! నేను జోస్యం చూసి చెప్పని విషయాన్ని ఆధారంగా తీసుకొని జ్యోతిష్యశాస్త్రమే నిజం కాదని మీరు తీర్మానించవచ్చా? చెప్పినది ఆధారంగా తీసుకొని కద ఒక నిర్ణయానికి రావాలి? పొన్నియిన్ సెల్వన్‌గారి అదృష్టజాతకం గురించి చెప్పాను. మధ్యకాలంలో ఏవేవో జరిగి, చివరికి ఆయన ఈ భూమండలానికి చక్రవర్తి కాబోయే సమయం దగ్గరకొచ్చేసింది కద? పట్టాభిషేకానికి కూడ ముహూర్తం పెట్టేశారట కద?" అన్నారు జ్యోతిష్కులు.

"అయ్యా! పొన్నియిన్ సెల్వన్ పట్టాభిషేకానికి ముహూర్తదినం చూసేందుకు మీదగ్గరికెవ్వరూ రాలేదా?"

"లేదు, తల్లీ! దానికి అంతఃపుర పురోహితులున్నారు కద? ముఖ్యమంత్రి అనిరుద్ధులు జ్యోతిష్యశాస్త్రంలో సిద్ధాంతులు కద?"

"అవును; పుష్యమాసం ఏడో రోజు ముహూర్తం నిర్ణయించారు. అది మంచిరోజేనా?"

"చాల మంచిరోజమ్మా! చాల బాగ ఆలోచించి ఆ రోజును సూచించారు."

"పట్టాభిషేకానికి తగిన మంచిరోజే కావచ్చు. కానీ ఆ రోజు పట్టాభిషేకం జరుగుతుందో లేదో చూసి చెప్పండి!"

"ఇదేం ప్రశ్న తల్లీ! ఎందుకు జరగదు?"

"శ్రీరాముని పట్టాభిషేకానికి మంచిరోజే చూసి నిర్ణయించారు. కానీ ఆ రోజు ఆయనకు పట్టాభిషేకం జరగలేదు కద?"

"దేవీ! ఒట్టి పట్టాభిషేకం చేసుకోవడానికన్న కోటి రెట్లు ఓరిమి శ్రీరామునికి ఆరోజు అబ్బింది. అందుకే రామాయణం పుట్టింది. అదలా ఉండనీ! ఇప్పుడు మీకలాంటి సందేహమెందుకు రావాలి? మీరే ఆ రోజు పట్టాభిషేకానికి ఏ అడ్డూ రాకూడదని కోరుకొంటున్నట్లు తోస్తూంది కద?"

"మీ ఊహ నిజమే!"

"పొన్నియిన్ సెల్వన్ సింహాసనమధిష్టించడంలో మీకన్న అధికంగా ఇంకెవ్వరూ సంతోషించరని కద లోకమంతా అనుకొంటున్నారు?"

"నిజానికి నేనలా సంతోషించవలసినదాన్నే. కానీ ఈ కొడుంబాళూర్ రాకుమారి మూర్ఖపు మొండిపట్టు నాకందులో ఎలాంటి ఆనందమూ లేకుండ చేసేసింది. కుడందైలో ఈ పిల్ల మీ ఇంట చేసిన శపథం గుర్తుందా?"

"శపథమా? ఆ రోజు పలు విపరీత సంఘటనలు జరిగాయి. ఏదీ స్పష్టంగా జ్ఞాపకం లేదు!" అన్నారు జ్యోతిష్కులు.

"ఈమె మీద అసూయగొన్న ఒక పడవ నడిపేపిల్ల పూంగుళలి ఏదో అన్నదని ఈమె ఒక శపథం చేసింది. తాను ప్రాణాలతో ఉన్నంతవరకు సింహాసనమెక్కనని శపథం చేసింది! ప్రాణం పోయిన తర్వాత సింహాసనమెక్కడం సాధ్యమా, జ్యోతిష్కులుగారూ?"

"అసాధ్యమే!"

"ఇటువంటి విపరీత శపథాన్ని విని కావేరిమాత కోపంగొని పొంగివచ్చి ఈ పిల్లను కొట్టుకొని తీసుకుపోజూసింది!"

"అవును. నాకిప్పుడు గుర్తుకొస్తూంది. ఆ శపథం ఏదో పరాచికం అనుకొన్నాను కద?"

"అదే ఇప్పుడు విపరీతపరిణామంలో ముగుస్తూంది! ఈమె సింహాసనమెక్కదట. నా తమ్మునితో సింహాసనమెక్కి పట్టమహిషిగా విరాజిల్లేందుకు వాడింకెవరినైన పెళ్ళి చేసుకోవాలట. ఈమె వాడి అంతఃపురంలో దాదులతోబాటు దాదిగా సేవలు చేస్తుందట! ఇదంతా నాకు వినేందుకే అసహ్యంగా ఉంది. జ్యోతిష్కులుగారూ! మీరీ పిల్ల గురించి చెప్పిందంతా గుర్తుందా?"

జ్యోతిష్కులు విప్పారిన ముఖంతో, "బాగా జ్ఞాపకముంది, తల్లీ! నేను సేకరించి పెట్టిన పలు జ్యోతిషశాస్త్ర పుస్తకాలతోబాటు ఎన్నో దేశాల రాకుమారులు, రాకుమార్తెల జాతకాలను కూడ ఆ కావేరితల్లి తీసుకొని వెళ్ళిపోయింది. కానీ ఈ స్త్రీమణి జాతకం మాత్రం నా మనసులో బాగ పదిలమైంది. వీరి చేతి రేఖలు నా కళ్ళముందున్నాయి. అమ్మా! నేను చెప్పిన జోస్యాలలో ఏది ఫలించినా, ఫలించకపోయినా నేను వీరి గురించి చెప్పింది మాత్రం తప్పక ఫలిస్తుంది!"

"ఈ పిల్ల గురించి మీరేం చెప్పారో గుర్తుందా?"

"బాగా గుర్తుంది. వీరిని పెళ్ళాడే రాకుమారుడు చాల భాగ్యశాలి. ఈ స్త్రీశిరోమణిని చూసే భాగ్యం కోసం దేశవిదేశాల్లో ఉన్న మహారాణులు తపస్సు చేస్తుంటారన్నాను. వీరి దివ్యగర్భంలో ఉదయించే పుత్రుడు పుట్టేటప్పుడే విజయధ్వజం నాటి పుడతాడన్నాను. అతడు వెళ్ళే చోటల్లా, చూపులు సారించే చోటల్లా విజయమే అన్నాను..."

"అయ్యా! మీరిలా చెబుతూ పోతుంటే, నా దిగులు అధికమవుతూంది!"

జ్యోతిష్కులు చటుక్కున నిటారుగా కూర్చొని, "దేవీ! దిగులా? ఎందుకు దిగులు? చోళకులం, చోళసామ్రాజ్యం దిగులుపడవలసిన రోజులు తీరిపోయాయి. నేడొక విశేషదినమన్నది గుర్తుంది కద?"

"అవును; ఈ రోజు మార్గశిరమాస తిరువాదిరై పర్వదినం! శివునికి చాల మంచిరోజు!"

"ఇది చోళకులానికి చాల మంచిరోజు; మహోన్నతమైన ఈ తమిళనాడుకు కూడ చాల మంచిరోజు, దేవీ! ఇది వినండి! ఇదే తిరువాదిరై పర్వదినాన రాబోయే రోజుల్లో ఒక ఏడు ఒక అద్భుతం జరగబోతూంది! చేత శంఖచక్రాలతో పెరుమాళ్ళు (విష్ణువు) పూర్ణావతారమైన ఒక బిడ్డ ఉదయించబోతూంది! ఆహా! ఏమేం అద్భుతాలు జరగబోతున్నాయి? వాటిని చూసేందుకు నేను బహుశ జీవించి ఉండనేమో! మీరు చూసి ఆనందించేందుకు దీర్ఘకాలం జీవించివుంటారు!"

ఇలా జ్యోతిష్కులు అవేశంగొన్నవారిలాగ మాట్లాడుతూ పోగా కుందవై కూడ మైమరచి వినసాగింది.

ఉన్నట్లుండి ఏదో శబ్దం వినిపించి ఇద్దరూ తిరిగి చూశారు.

పంజరంలో ఉన్న చిలుక టపటపా రెక్కలు కొట్టుకోసాగింది. దాని మీదికి దూకేందుకు ప్రయత్నిస్తున్న ఒక పిల్లి మీదికి వాణతి ఒక తాటాకుల కట్టను తీసి విసిరింది.

విసిరేసి, "అక్కా! జ్యోతిషశాస్త్రం వల్ల ప్రయోజనం ఉంది. జ్యోతిషశాస్త్ర తాళపత్ర పుస్తకాన్ని ఉపయోగించే ఈ అందమైన చిలుకను నేనిప్పుడు కాపాడగలిగాను! లేకపోతే ఈపాటికి ఆ పిల్లి దాని రెక్కలు పీకేసేదే!" అన్నది.

~~~
~~~

# అధ్యాయము - 82

## చైనా వర్తకులు

అనాదిగా పలుదేశ ప్రజలు జరగబోయే కార్యక్రమాల గురించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. పేదవారు, చదువు లేని పామర జనాలలాగే రాజకులస్థులు, పండితులు కూడ భవిష్యత్కార్యక్రమాలను ఊహించి తెలుసుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. జ్యోతిష్కులు, హస్తసాముద్రికులు, సోది చెప్పేవారు మొదలైనవారు విద్యాపాండిత్యంలోను, నాగరీకతలోను ప్రసిద్ధిగాంచిన వారితో బాగ పరిచయమున్నవారు, అదే విధంగానే జ్యోతిష్యశాస్త్రపు నిజాన్నే సందేహించి ఆ శాస్త్రాన్నే ఖండించేవారు కూడ ఉండేవారాకాలంలో.

బుద్ధి కుశలతలో సాటిలేని మేటి అని పేరుగాంచిన యువరాకుమారి కుందవై మనసులో కూడ అటువంటి పోరాటం తరచూ తలెత్తసాగింది. కానీ చోళసామ్రాజ్య భవిష్యత్తు గురించి దిగులుపడవలసినప్పుడల్లా ఆ దిగులు కుందవైదేవిని జ్యోతిష్కుల ఇంటిని వెతుక్కొంటూ వెళ్ళేలా చేసేది.

నిజంగా చూడబోతే ఇప్పుడు కుందవై మనసు కూడ సుందరచోళ చక్రవర్తి మనసు పొందిన నెమ్మదిని పొందాలి. కానీ ఎదురుచూడని సంఘటనలు ఎన్నెన్నో జరిగి, చివరికి అరుళ్మొళి వర్మ చోళ సింహాసనమధిష్ఠించి పట్టం కట్టుకోవడమని నిశ్చయమైపోయింది. చిరుప్రాయం నుంచి కుందవై తన తమ్ముని మీదగొన్న అలవిగాని వాత్సల్యాన్ని మనమెరుగుదుము. అరిచేతుల్లో శంఖచక్రరేఖలతో పుట్టిన అరుళ్మొళివర్మ వల్ల చోళసామ్రాజ్యం మహోన్నతస్థితిని చేరుకోబోతుందని ఆమె మనసులో బలమైన నమ్మకం నెలకొంది. కావేరి వెల్లువలో పడిపోయినవాడిని దైవమే రూపంగొన్నట్లు ఒక స్త్రీమణి కాపాడిన సంఘటన, ఇంకా అటువంటి ఎన్నెన్నో సంఘటనలు ఆమె నమ్మకాన్ని మరింత బలపరిచాయి. ఆ నమ్మకం నిజమయ్యే సమయం ఇప్పుడు దగ్గరకొచ్చేసింది. కానీ ఆ రాకుమారి మనసు నెమ్మదిగొనకపోవడానికి కారణమేమి?

అరుళ్మొళివర్మ గురించి చెప్పినట్లే, కొడుంబాళూర్ రాకుమారి జాతకవిశేషం గురించి కూడ పలువురు చెప్పుకొచ్చారు. నిజంగానే జన్మదినాన్ని, నక్షత్రరాశులను ఎరిగి, పరిశోధించి, భవిష్యత్తును గ్రహించి చెప్పారో, లేక ఆ సమయాన కుందవైదేవికి ఊరట కలగనీ అని చెప్పారో తెలియదు. పలువురు ఏకకంఠంతో చెప్పేది ఒక్కోసారి విచిత్రంగా నిజం కావడాన్ని మనం చూస్తున్నాము. ఇంకొందరి వాక్కులోనే ఏదో విశేషం ఉంది. వారు చెప్పింది చెప్పినట్లు ఫలిస్తూంది.

కుడందైనుంచి తిరువైయారుకు వచ్చి నివాసం ఏర్పరచుకొన్న కుడందై జ్యోతిష్కులు ఆ రోజు తిరువాదిరై పర్వదినాన్ని గుర్తుచేసి, "చోళకులానికి గొప్ప కీర్తిప్రతిష్ఠలు తేబోయే మంచి రోజిది!" అని కాస్త

గట్టిగా నొక్కి వక్కాణించారు.

రెండేళ్ళ తర్వాత అదే మార్గశిర తిరువాదిరై పర్వదినాన చోళకులంలో ఒక మగబిడ్డ పుట్టింది. ఆ బిడ్డ పెరిగి యుక్తవయస్సుకు వచ్చినప్పుడు చంద్రగుప్తుడు, అశోకుడు, విక్రమాదిత్యుడు, హర్షవర్ధనుడు మొదలైన మహాచక్రవర్తులతో దీటైన చక్రవర్తిగా వెలుగొందాడు. రాజేంద్రుడన్న అభిషేకనామంగొని లంకనుంచి గంగ వరకు, లక్షదీవుల నుంచి శ్రీవిజయ ద్వీపం వరకు జయించి పరిపాలించాడు.

జ్యోతిష్కులు చెప్పిన మాట ఇలా పిదపకాలంలో విచిత్రమైన రీతిలో ఫలించేసింది. కానీ వారు ఆనాడు అలా చెప్పినప్పుడు కుందవైకి వారి మాటల్లో పూర్తి నమ్మకం కలగలేదు. వాణతికేమో జ్యోతిష్కుల మాటలు కోపాన్నే తెప్పించాయి. ఆ కోపాన్ని చూపేందుకు వెంటనే ఒక దారి కూడ కనిపించింది. జ్యోతిష్కుల తాళపత్రగ్రంధాన్ని తీసి ఆ రాకుమారి పిల్లిమీద విసిరికొట్టి, “జ్యోతిషశాస్త్రం వల్ల ఉపయోగం ఉంది!” అన్నది.

అది విన్న జ్యోతిష్కులు తిరిగి చూసి విషయం ఇదీ అని తెలుసుకొని, “బలవంతునికి గడ్డిపోచ కూడ ఆయుధమంటారు. తాళపత్ర గ్రంధం కూడ ఒక ప్రాణిని కాపాడింది. భవిష్యత్తులో ఎన్నెన్నో ప్రాణాలకు అభయమిచ్చి కాపాడబోయే దివ్యహస్తం కద?” అన్నారు.

వాణతి, “అక్కా! ఈ జ్యోతిష్కులు ముఖస్తుతి చేయడంలో నిష్ణాతులు. పదండి వెళదాం!” అన్నది.

“దేవీ! నేనీ రోజు చెప్పేమాటలు మీకు నచ్చడంలేదు. ఒకరోజు నేను చెప్పిందంతా నిజమై తీరుతుంది. అప్పుడు ఈ పేదవాడిని మరిచిపోకండి!” అన్నారు.

కుందవైదేవి అడ్డొచ్చి, “అయ్యో! ఈ అమ్మాయికి మీమాటలు నచ్చలేదని కాదు; వినగా వినగా మనసులో సంతోషంగా ఉంది; కానీ ఆలోచించకుండ ఒక శపథం చేసేశాం కద అని ఉడికిపోతూంది. ఆ ఉక్రోషాన్ని మీ తాళపత్ర గ్రంధం మీద చూపించింది! దాన్ని మీరు పెద్దగా పట్టించుకోకండి!” అన్నది.

“మంచివారికి వచ్చే కోపం మంచే చేస్తుంది! తమను ఇంపైన మాటలతో స్వాగతించిన నా ముద్దుల చిలుక బతికిపోయింది కద!” అన్నారు జ్యోతిష్కులు.

~

తర్వాత కుందవై ఇంకాసేపు జ్యోతిష్కులతో మాట్లాడుతూ కూర్చొంది. ముఖ్యంగా అరుళ్మొళికి వివాహమెప్పుడు జరుగుతుందని అడిగింది. దాని గురించి కుందవై రాకుమారికి దిగులుపడేందుకు కారణముంది.

ఎందుకంటే, నిన్న కొడుంబాళూర్ బూది విక్రమకేసరి యువరాకుమారి వద్దకొచ్చి, “తల్లీ! నేను కొడుంబాళూరుకు వెళతాను. నా సహోదరుని కుమార్తె వాణతిని కూడ తీసుకొని వెళ్ళవచ్చు కద?” అన్నారు.

కుందవై అదిరిపడి, “మామా! ఇదేం తొందర? పట్టాభిషేకానికి ఉండకుండ వెళ్ళిపోతారా?” అన్నది.

“తల్లీ! పట్టాభిషేకం సమయానికి వచ్చేస్తాను. అంతవరకు ఇక్కడెందుకు ఊరకే వేచివుండాలి? నేను వచ్చేటప్పుడు పెద్ద సైన్యంతో వచ్చాను. దైవకృప వల్ల మన మనోరధం ఏ యుద్ధమూ లేకనే నెరవేరబోతూంది. చక్రవర్తి కుమారుడే పట్టం కట్టుకోవడానికి ఒప్పుకొన్నారు. అందుకు సామంతరాజులు కూడ సమ్మతించారు. ఇక ఇక్కడ ఇంత పెద్ద సైన్యాన్ని ఉంచవలసిన అవసరం లేదు. ఇంత మంది సైనికులకు వండి వార్చడం తంజావూరు ప్రజలకు చాల శ్రమ కలిగిస్తోంది. కాబట్టి నా సైన్యాన్ని తీసుకొని వెళ్ళి అక్కడే విడివిడిగా చేసి పంపించేసి రావలసిన పరిస్థితి ఏర్పడింది!” అన్నారు.

“అలాగే చేయండి! కానీ నా చెలి వాణతిని ఎందుకు తీసుకొని వెళ్ళాలి?” అని అడిగింది.

“దేవీ! అందుకూ ఒక కారణముంది. నిన్న మేము సామంతరాజులందరమూ సమావేశమై మంత్రాలోచన చేసి ఒక నిర్ణయానికి వచ్చాము. తమ తాతగారు అరింజయుల తండ్రిగారైన పరాంతక చక్రవర్తి రాకుమార్తెలు ఆరు మందిని వివాహమాడారు. నా కులం నుంచి, మిలాడుదురైయార్ కులం నుంచి, పళువేట్టరయ్యర్, మళవరయ్యర్, శంబువరయ్యర్ కులాల నుంచి ఒక్కొక్క వనితామణిని వివాహమాడారు. కాబట్టి సామంతరాజుల మధ్య ఎలాంటి కలహం, విరోధమూ లేకుండ ఉండేది. తమ తాతగారైన అరింజయులు కూడ పలు సామంతరాజుల కుమార్తెలను వివాహమాడారు. ఆయన జయించిన వైదుంబరాయల కులం నుంచి తమ నానమ్మగారిని వివాహమాడారు. కానీ తమ తండ్రి ఈ మంచి సంప్రదాయాన్ని అనుసరించలేదు. మలైయమాన్ కుమార్తెయైన తమ తల్లిగారిని మాత్రం వివాహమాడారు. కాబట్టి చిన్న/సామంతరాజుల మధ్య అసూయ, కలహం మొదలయ్యాయి. ఇక ఈ చోళసామ్రాజ్యానికి చక్రవర్తిగా పట్టం కట్టుకోబోయేవారు పరాంతక చక్రవర్తిలాగ పలు సామంతరాజుల కులాల నుంచి రాకుమార్తెలను పెళ్ళిచేసుకోవాలని ఏకకంఠంతో తీర్మానించాము. పొన్నియిన్ సెల్వన్ పట్టాభిషేక మహోత్సవం ముగిసిన తర్వాత ఆయనకిలా విన్నపం చేసుకోవాలని నిర్ణయించాము. వాణతిని నాతోబాటు ఎందుకు పిలుచుకొని వెళ్ళగోరుతున్నానో మీరు ఊహించుకోగలరు కద? ఆమెను ఇక్కడే విడిచి పెట్టి వెళితే నేను ఒడంబడికకు విరుద్ధంగా నడుచుకోజూస్తున్నానని తక్కిన సామంతరాజులు సందేహపడవచ్చు!” అన్నారు కొడుంబాళూర్ పెద్ద వేళార్.

ఇది విన్న కుందవై పొంగుకొస్తున్న కోపాన్ని, ఉక్రోషాన్ని అదిమి ఉంచి, “సేనాధిపతీ! తలిదండ్రులను కోల్పోయిన తమ తమ్ముని కూతురిని నేనే తల్లి, తండ్రి అయి చూసుకోవాలని మునుపొకసారి నన్ను వేడుకొన్నారు. అది మరిచిపోయారా? వాణతిని కొడుంబాళూరుకు పంపించడం వల్లకాదు. ఆమెను విడిచి ఒక్క క్షణం కూడ నేనుండలేను. కావాలంటే నేను వాణతిని పిలుచుకొని పళైయారైకి వెళ్ళిపోతాను. పట్టాభిషేకానికి కూడ రాకుండ అక్కడే ఉండిపోతాము. పెళ్ళి గురించిన మాట

ఇప్పుడు వద్దు. పట్టాభిషేకం ముగిసిన తర్వాత సామంతరాజుల కోరికను పొన్నియిన్ సెల్వన్‌కి విన్నవించుకోండి! ఆ తర్వాత చూసుకొందాం!" అన్నది.

సేనాధిపతి కూడ ఆ ప్రతిపాదనకు ఒప్పుకొని వెళ్ళిపోయారు.

కుందవై దేవి జ్యోతిష్కులను వెతుక్కొంటూ వెళ్ళడానికి ఇదొక పెద్ద కారణంగా మారింది. అందుకే పొన్నియిన్ సెల్వన్ పెళ్ళి గురించి అంత ఆసక్తితో, ఉత్కంఠతో అడిగింది.

~

అదే సమయాన వాణతి ఆలోచనలు ఒక పాత సంఘటన మీదికి మళ్ళాయి. అందులోను ఒక పక్షి, ఒక పిల్లి పాత్రధారులు. పిల్లితోబాటు ఒక ఏనుగు, ఒక ఏనుగు మావటి కూడ ఆ సంఘటనలో పాలుపంచుకొన్నారు.

చెట్టు కొమ్మలనుంచి కిందికి వేలాడుతున్న ఒక పక్షిగూడు మీదికి ఒక అడవిపిల్లి దూకి అందులోవున్న పక్షి పిల్లలను కబళించేందుకు ప్రయత్నిస్తూంది. తల్లి పక్షి గూడు చుట్టూ గిరికీలు కొడుతూ ఆ అడవి పిల్లిని తరిమికొట్టజూస్తూంది. వాణతి అది చూసి ఏం చేయాలో తోచక కేకలేసింది. నదిలో ఈదుతున్న యువకుడొకడు పరుగెత్తి వచ్చి చూశాడు. తర్వాత అతడు వేగంగా వెళ్ళి ఒక ఏనుగుమీదెక్కి వచ్చాడు. పక్షిగూటిని, అందులో ఉన్న పక్షి పిల్లలను ఆ పిల్లి నోటినుంచి కాపాడాడు.

ఆ యువకుడు ఏనుగు మావటి అని అప్పుడనుకొంది. తర్వాత అతడే పొన్నియిన్ సెల్వన్ అని తెలిసింది. ఆహా! అతడు ఒట్టి ఏనుగుమావటిగానే ఉండకూడదా? అతడు సుందర చోళ చక్రవర్తి కుమారుడైనందువల్ల కద తానిన్ని ఇక్కట్లకు గురి కావలసి వచ్చింది? తన తోటి చెలికత్తెలు, పూంగుళలి వంటివారు చోళనాడుకు పట్టమహిషి కావాలనే దురుద్దేశం కలిగినదని తన గురించి మాట్లాడే పరిస్థితి ఏర్పడింది...!

ఇలా వాణతి తన ఆలోచనల్లోను, కుందవై జోస్యం అడగడంలోను నిమగ్నమై ఉన్నప్పుడు, జ్యోతిష్కుల ఇంటి వాకిట, "చైనా పట్టుబట్టలు కావాలా? చైనా పట్టు!" అన్న పెద్ద కేక వినిపించింది. ఇంకొన్ని గొంతులు కూడ వినిపించాయి కుందవై, వాణతి తాము వచ్చి చాలసేపైందని గ్రహించి లేచారు.

అప్పుడు జ్యోతిష్కుల శిష్యుడు వచ్చి, "స్వామీ! చైనా వర్తకులిద్దరు వచ్చారు. మిమ్మల్ని జోస్యం అడగాలట! వారిని రేపు రమ్మని చెప్పనా?" అని అడిగాడు.

కుందవై, "వద్దు. ఇప్పుడే రానీ. మేము సెలవు తీసుకొని బయలుదేరుతాము"అని చెప్పేసి వాణతి చేయి పట్టుకొని బయలుదేరింది.

రాకుమార్తెలిద్దరూ వాకిలికి వచ్చినప్పుడు బయట ఒక ఏనుగు నిలబడి ఉండడం, దాని మీద ఇద్దరు చైనా వర్తకులు పెద్ద పెద్ద మూటలతో కూర్చొని ఉండడం కనిపించింది. కింద నిలబడ్డ ఏనుగు మావటిని వారేదో అడుగుతున్నట్లు తోచింది. వారినంతగా పట్టించుకోకుండ రాకుమార్తెలిద్దరూ తమతో

వచ్చిన కాపలావీరుని తోడు తీసుకొని చోళ మాళిగకు వెళ్ళి చేరారు.

~

# అధ్యాయము - 83

## అప్పర్ దర్శించిన దివ్యదృశ్యం

**ఆ** రోజు రాత్రి తొలి జామున తిరువాదిరై పర్వదినం సందర్భంగా అయ్యారప్పర్, ఆయన నాయకి తిరువైయ్యారు విశాలమైన 'మాడ' వీధిలో ఊరేగింపు వెళ్ళారు. వెండిమంచుతో కప్పబడిన హిమవన్నగాన్ని గుర్తుచేసేటట్లున్న వెండితో చేయబడిన కైలాసవాహనంలో స్వామివారు, అమ్మవారు అలంకరించబడి కటాక్షమిచ్చారు.

ఊరేగింపు ముందు వరుసలో ఏనుగులు, ఒంటెలు, పెద్ద పెద్ద వృషభాలు వెళుతున్నాయి. వాటి మీద అమర్చబడివున్న భేరీలు, భజంత్రులు అష్టదిక్కులు దద్దరిల్లేలాగ ఘోషిస్తున్నాయి. వాటి వెనక అనేక వరుసల్లో రకరకాల ఆభరణాలు, లాంచనాలు ధరించినవారు నడిచి వెళ్ళారు. నాట్యం చేసేవారు తమ నాట్యవిన్యాసాలను ప్రదర్శిస్తూ వెళ్ళారు. నంది భగవానుడు, చండికేశ్వరులు, వినాయక స్వామి, వళ్ళి, దైవానై సమేతంగా సుబ్రమణ్యస్వామి తమ తమ వాహనాల మీద వెళ్ళారు. చివరిగా, పార్వతీపరమేశ్వరులు కైలాసవాహనంమీద ఆసీనులై వచ్చారు.

ఇంకా వారి వెనక దేవార గోష్టి వారు వీణ, మద్దెల మొదలైన వాద్యసంగీతంతో అప్పర్, సంబందర్, సుందరమూర్తి మొదలైనవారు తిరువైయారు గురించి పాడిన దేవారాలను పాడుతూ వచ్చారు. ముందు వెనుక వేలకొద్ది ప్రజలు ఊరేగింపుతో మెల్లమెల్లగా వెళ్ళారు. ప్రజలు వారివారి ఇష్టప్రకారం కొందరు ఏనుగులు, ఒంటెలను చూడడంలోను, కొందరు వాద్యగోష్టిసంగీతాన్ని వినడంలోను, ఇంకొందరు దేవకన్యల నాట్యాన్ని చూడడంలోను, ఇంకా చాలమంది స్వామివారిని, అమ్మవారిని చూసి పరవశించడంలోను నిమగ్నమైనారు.

కనుచూపు మేరదాక వందలకొద్ది దివిటీలు ప్రకాశించగా, ఆ అపూర్వమైన దేవుళ్ళ ఊరేగింపు ఒక స్వప్నలోక దృశ్యంలాగ తోచింది. ఈ దృశ్యాన్ని చోళ మాళిగ పైమేడ నుంచి కుందవై, వాణతి, పూంగుళలి చూస్తూన్నారు. మొట్ట మొదట భేరీలను మోసుకొచ్చిన ఏనుగుల నుంచి, చివరిగా వచ్చిన దేవార గోష్టి వరకు అంతటినీ కుతూహలంతో చూసి ఆనందించారు. భక్తిపారవశ్యంలో మునిగిన భక్తులను, పలువిధాలైన వేడుకలను చూసి ఆనందిస్తున్న పామరులను చూశారు. నంది భగవానుడు మొదలు శివపార్వతుల వరకు అందరు దైవమూర్తులను దర్శించి ఆనందించారు.

అంతటి జనసమూహం మధ్యలో ఒక ఏనుగు మీద ఇద్దరు చైనా వర్తకులు ఎక్కి వస్తుండడాన్ని, వారప్పుడు ఏనుగు మీది నుంచి కిందకు దిగి ప్రజల మధ్య మరుగైపోవడాన్ని, మళ్ళీ వచ్చి ఏనుగుమీదికి ఎక్కడాన్ని గమనించారు. "అహా! ఈ ఇద్దరు చైనీయులు నిజంగా వర్తకులా? లేక, విదేశం

నుంచి వచ్చిన గూఢచారులా?” అన్న సందేహం కుందవై మనసులో ఏర్పడింది.

చోళ సామ్రాజ్యహక్కు గురించి కొన్ని రోజులుగా ఏర్పడిన తగాదాలు, గందరగోళాలు లోకమంతటా వ్యాపించి ఉండవచ్చు. దాన్ని ఆధారంగా తీసుకొని, శత్రురాజులు గూఢచారులను ఈ చైనా వర్తకుల వేషంలో పంపించి ఉండవచ్చు కద? ఇందు గురించి కుందవై, వాణతి మాట్లాడుకోవడం పూంగుళలి చెవిన పడింది. “దేవీ! వారు గుడి గోపురం వద్ద నన్ను సమీపించి, 'చైనా పట్టు వస్త్రాలు కావాలా?' అని అడిగారు. నేను వాళ్ళతో, 'చోళ మాళిగకు రండి. తంజావూరు నుంచి రాకుమార్తెలు రాబోతున్నారు. వారు బహుశ కొనవచ్చు' అన్నాను. కాబట్టి వారు ఇక్కడికి వచ్చినా రావచ్చు. మీ సందేహాన్ని వారినే అడిగి తీర్చుకోండి" అన్నది.

అప్పుడు కైలాసగిరి వాహనంమీద ఆసీనులైవున్న అయ్యారప్పర్, అర్ధ నాయకి చోళ మాళిగ వాకిలి దగ్గరికి వచ్చారు. అక్కడ స్వామివారిని నిలిపి, దీపారాధన మొదలైనవి చేశారు. దేవుళ్ళ ఊరేగింపుతో వచ్చిన శెంబియన్ మహాదేవి, వారి కుమారులు అక్కడినుంచి దేవుళ్ళ వాహనం ముందుకు వెళ్ళిన తర్వాత అంతఃపురంలో ప్రవేశించారు. రాకుమార్తెలు పైమేడలోవున్నారని తెలిసి అక్కడికే వచ్చారు.

ఉత్సవం గురించి కాసేపు మాట్లాడుకొన్నారు. తర్వాత శెంబియన్ మహాదేవి, తమ ప్రియపుత్రుని చూసి, “బిడ్డా! ఈ తిరువైయారులో అప్పర్ పెరుమాళ్ళు వీక్షించిన విశేషదృశ్యం గురించి ఒక పద్యం పాడారు కద? దాన్ని నీవొకసారి పాడు, విందాం! దేవార గోష్టివారు పాడగా విని నేనంతగా తృప్తి చెందలేదు!” అన్నారు.

రాకుమార్తెలు, పూంగుళలి ఆ కోరికను ఆమోదించారు. తర్వాత సేందన్ అముదన్ అని ఇంతకు మునుపు పిలువబడ్డ మధురాంతక దేవరు ఆ పద్యాన్ని తన సుమధుర స్వరంతో పాడారు.

<< ఆ పద్యాన్ని అనువదించవలసి ఉంది >>

ఈ పాటతోబాటు తర్వాత వచ్చే పది పాదాలను మధురాంతకులు మైమరచి పాడారు.

వింటున్న వారందరూ పరవశించారు. ఆ రోజు అప్పర్ మహానుభావుడు చూసిన దృశ్యాలన్నింటినీ వారు కూడ చూశారు.

పాట ముగిసిన తర్వాత కాసేపక్కడ మౌనం నెలకొంది. తర్వాత కుందవై శెంబియన్ మహాదేవిని చూసి, “అమ్మా! అప్పర్ ఈ పద్యాన్ని పాడిన వృత్తాంతాన్ని మీరు మునుపొకసారి నాకు వివరించారు. ఇప్పుడు కూడ ఇంకొకసారి చెప్పండి! వీరందరు కూడ విననీ!” అన్నది.

తక్కినవారు కూడ మరీ మరీ అడగగా శెంబియన మహాదేవి ఆ వృత్తాంతాన్ని చెప్పారు.

~

అప్పర్‌స్వామి వయసు మళ్ళి, దేహం జవసత్వాలుడినప్పుడు కైలైయంగిరి (కైలాసగిరి) కి వెళ్ళి అక్కడి దేవుని దర్శించాలని కోరుకొన్నారు. ఉత్తరదిశగ చాల దూరం ప్రయాణించారు. ఇక ముందుకు

నడవలేక పడిపోయారు. ఆ సమయాన ఒక పెద్దాయన ప్రత్యక్షమై, "అప్పర్! కైలై వెతుకుతూ మీరెక్కడికి వెళుతున్నారు? పొన్ని నది తీరానున్న తిరువైయారుకు వెళ్ళండి! భూలోక కైలాసం అదే!" అని చెప్పి అదృశ్యమైనారు. అది దైవవాక్కు అని గ్రహించి అప్పర్ మళ్ళీ తిరువైయారుకు వచ్చారు. ఆ స్థలాన్ని సమీస్తుండగానే ఆయన మనసు పరవశమైంది. చాలమంది భక్తులు చేత పూల సజ్జెలతోను, చెంబుల్లో కావేరిజలంతోను అయ్యారప్పర్ని దర్శించేందుకు వెళుతుండడాన్ని చూశారు. వారు దేవుని మహిమను పాటల రూపంలో పాడుతూ ముందుకు వెళుతున్నారు. అప్పుడు తిరువైయారు నగరవీధిలో ఒక మగ ఏనుగు, ఒక ఆడ ఏనుగు వస్తూ కనిపించాయి. అవి శివపార్వతులుగా అప్పర్‌కి దర్శనమిచ్చాయి. ఇలా ఆలయాన్ని చేరుకొనేలోపు పలుమృగాలు, పక్షులు స్త్రీపురుషరూపంలో ఆయనకు దర్శనమిచ్చాయి. కోడిపుంజు పెట్టతో సరసాలాడుతూ వచ్చింది; మగనెమలి ఆడనెమలితో ఆడుతూ వచ్చింది; దగ్గర్లోనే ఉన్న తోటలో మగకోకిక ఆడకోకిలతో యుగళగీతం పాడుతూంది; .... ఇలా స్త్రీపురుషరూపంలో అప్పర్ స్వామి కళ్ళముందు కనిపించినవన్నీ శివపార్వతులేనని ఆయన మనసుకు తోచింది. లోకమంతా ఇలా శక్తి, శివంగా వెలుగొందడాన్ని ఆయన దర్శించారు. "ఈ లోకమే కైలాసం; ప్రత్యేకంగా ఇంకొక కైలాసం లేదు!" అని గ్రహించారు. ఇటువంటి జ్ఞానోదయంతో ముందుకు సాగగా, అయ్యారప్పర్, అర్ధనాయకి కైలాస వాహనాన్ని అధిరోహించి ఊరేగింపు రావడాన్ని చూశారు. ఆనాడు ఆయన తమ బాహ్యనేత్రాలతోను, మనోనేత్రంతోను చూసి అనుభవించినదంతా పద్యరూపంలో మధురమైన తమిళభాషలో పాడారు. ఇంతకాలమూ తాము కళ్ళతో చూసి, భావంతో గ్రహించనిది ఈనాడు తిరువైయారులో చూసి గ్రహించినట్లు ఒక్కొక్క పద్యం చివరి పాదంలోను, "చూసి ఎరగనిది చూశాను" అని మళ్ళీ మళ్ళీ ఆశ్చర్యంతో చెప్పారు.

~

పెద్ద మహారాణి చెప్పుకొచ్చిన ఈ వృత్తాంతాన్ని అందరూ మైమరచి వింటూ వచ్చారు.

కథనం ముగిసిన తర్వాత కొడుంబాళూర్ రాకుమారి ఒక ప్రశ్న అడిగింది:- "అమ్మా! అప్పర్ స్వాములు మృగజాలాలు, పక్షిజాలాల్లో చూసిన ప్రేమ గురించి ఇలా ఎంతో ఆశ్చర్యంతో పాటలు పాడి వివరించారు. మరి మనుష్యజాతి గురించి ఎందుకు చెప్పలేదు?"

"మనుష్యకులంలో జన్మసార్థకత కోరుకోకుండ నిజమైన ప్రేమగొన్న స్త్రీపురుషులు లేనేలేరు. అందుకే మనుష్యజాతి గురించి ఆయన ఏమీ చెప్పలేదు!" అన్నది పూంగుళలి.

"అది సరి కాదు, బిడ్డా! నిన్ను, నా కుమారుని అప్పర్ పెరుమాళ్ళు చూసివుంటే మనుష్యజాతిలోని స్త్రీపురుషుల ప్రేమను కూడ చేర్చి పాడేవారు!" అన్నారు శెంబియన్ మహాదేవి.

"అవును! అవును!" అని ఘోషించారు తక్కిన ఇద్దరు స్త్రీమణులూను.

ఈ సమయాన ఆ మాళిగ వాకిట ఏదో కలకలం వినిపించింది. సేవకుడొకడు లోపలికొచ్చి, "చైనా పట్టు వర్తకులిద్దరు వచ్చారు. రాకుమార్తెలను చూసే వెళ్ళాలని పట్టుబడుతున్నారు!" అన్నాడు.

యువరాకుమారి కుందవై కోపమూ, ఆశ్చర్యమూగొని, "వారెవరు అంతటి అధికప్రసంగులు? ఇప్పుడేమీ వద్దని చెప్పి వాళ్ళను పంపించు!" అన్నది.

ఇంతలో పూంగుళలి, "దేవీ! వారిని నేనే రమ్మని చెప్పాను. మన్నించాలి!" అన్నది.

"అలాగైతే వచ్చేసి వెళ్ళనీ!" అన్నది యువరాకుమారి.

కాసేపట్లో ఇద్దరు చైనా వర్తకులు రెండు మూటలతో అక్కడికి వచ్చారు.

~~~
~~~

# అధ్యాయము - 84

## పట్టాభిషేక బహుమానం

ఆ ఇద్దరు చైనా వర్తకులు పెద్ద తలపాగాలతోను, దట్టమైన గడ్డాలతోను కానవచ్చారు. అంతఃపురం పైమేడలో అప్పుడు వెలుగుతున్న దీపాల మసక వెలుతురులో వారి ముఖాలు స్పష్టంగా కనిపించలేదు. వారు ఏ వయసువారన్నది కూడ తెలియలేదు.

కుందవై మనసులో తోచిన సందేహాలు ఇంకా బలపడ్డాయి. మహా తెలివిమంతురాలైన ఆ రాకుమారి, "పట్టు వస్త్రాలు చూసేందుకు ఈ వెలుతురు చాలదు. పెద్ద దివిటీని వెలిగించి తీసుకు రా!" అని ఆ వర్తకులను పిలుచుకొని వచ్చిన సేవకునికి ఆజ్ఞ జారీ చేసింది.

"నేను వెళ్ళి మంచి దీపాన్ని పంపిస్తాను!" అని మధురాంతకులు అక్కడినుంచి కదిలి వెళ్ళారు. ఆయనతో శెంబియన్ మహాదేవి కూడ వెళ్ళారు.

వారు వెళ్ళిన తర్వాత కుందవై ఆ వర్తకులను చూసి, "అయ్యా! మీకెందుకింత తొందర? మీ సరుకులను రేపు పగటిపూట తీసుకొని వచ్చి చూపకూడదా? ఈ రాత్రివేళ వచ్చారేమి?" అన్నది.

"రాకుమార్తెలారా! మన్నించాలి! మేము తంజావూరుకు వచ్చి చాల రోజులైంది. ఎంతో ప్రయత్నించి కూడ అంతఃపురం లోపలికి వచ్చి తమను చూడలేకపోయాము. రేపు నాగపట్టణం నుంచి నావ బయలుదేరుతూంది. అందులో మేము కూడ ఎక్కి వెళ్ళాలి. అందుకే ఇంత తొందరపడ్డాము!" అన్నాడు ఆ వర్తకులలో ఒకడు.

అతడి గొంతు కాస్త విచిత్రంగా ఉన్నా కూడ, అతడి తమిళభాష చాల బాగుండడం విని అక్కడున్నవారు చాల ఆశ్చర్యపడ్డారు.

"చైనా వర్తకులారా! మీకు తమిళభాష చాల బాగ వస్తుందిలాగుందే!" అన్నది కుందవై.

"నేనీ తమిళనాడుకు వ్యాపారనిమిత్తం వచ్చి కొంతకాలమైంది. కాబట్టి తమిళం మాట్లాడేందుకు కాస్త నేర్చుకొన్నాను. తమిళం, తమిళనాడు నాకు చాల నచ్చాయి!" అన్నాడా వర్తకుడు.

"మరెందుకు మీరిప్పుడు మీ దేశానికి తిరిగి వెళ్ళేందుకు తొందరపడుతున్నారు? పట్టాభిషేకం చూసి వెళ్ళకూడదా? అంత తొందరేమి?"

"ఎల్లుండి బయలుదేరే ఓడ తప్పిపోతే, తర్వాతి ఓడ ఎప్పుడు దొరుకుతుందో తెలియదు. మునుపటిలాగ ఇప్పుడల్లా నాగపట్టణం నుంచి తరచూ ఓడలు వెళ్ళడం లేదు."

"అదేల?"

"తమకు తెలియదా, దేవీ? సముద్రప్రయాణం మునుపటిలాగ సుఖంగా, క్షేమంగా లేదు; సముద్రదొంగలు ఎక్కువవుతున్నారు. అరబ్బు నాడు నుంచి ఆవేశోద్రేకాలుగొన్న వీరులు ఓడెక్కి పై సముద్రాలలోను, కింది సముద్రాలలోను సంచరిస్తున్నారు. సముద్రతీరాల వెంబడి, నదీముఖద్వారాల వద్ద కూడ ముట్టడించేందుకు, అటకాయించేందుకు వారు పొంచివుంటున్నారు. వర్తకుల ఓడలు దగ్గరకు రాగానే వాటి మీదికి దూకి అటకాయిస్తున్నారు. మూర్ఖావేశంతో పోరాడి, ఓడలో ఉన్నవారందరినీ చంపేసి, సరుకులన్నిటినీ దోచుకొని వెళుతున్నారు. ఇందువల్లనే వర్తకుల ఓడలు రక్షణ లేకుండ వెళ్ళలేకపోతున్నాయి. పది, ఇరవై ఓడలు గుంపుగా చేరి వెళ్ళవలసివస్తూంది. అలా ఎల్లుండి బయలుదేరే ఓడలు వెళ్ళిపోతే, మళ్ళీ ఎంతకాలం వేచివుండాలో తెలియదు. రాకుమార్తెలారా! పెద్ద మనసు చేసి మేము తెచ్చిన పట్టు వస్త్రాలను చూడండి!"

~

ఇలా చెబుతూనే ఆ చైనా వర్తకుడు తాను తెచ్చిన మూటను విప్పసాగాడు. అలాగే రెండో వర్తకుడు కూడ తన మూటను విప్పాడు.

"వర్తకులారా! ఇప్పుడు మీ అంగడి తెరవడంవల్ల ప్రయోజనం లేదు. మీ బట్టల నాణ్యత రాత్రి వేళ చూసి తెలుసుకోవడం సాధ్యం కాదు. మీ దగ్గర బట్టలు తీసుకొన్నా కూడ వాటి ఖరీదుకు తగిన ధనాన్ని మేము తీసుకొని రాలేదు!" అన్నది కుందవై.

మొదట మాట్లాడిన వర్తకుడు చాల ఆశ్చర్యంగొన్నవాడిలాగ లేచి నిలబడి చేతులను విశాలంగా చాచి, "రాకుమారీ! మీ దగ్గర ధర చెప్పి తీసుకొంటామా? భలే మాటన్నారు! మీరీ వస్త్రాలను తీసుకొని ధరించడానికి ఇష్టపడితే, అదే మా పూర్వజన్మ సుకృతమని భావించి సంతోషపడమా? వెల చెప్పి అమ్మేందుకని మేము మా సరుకులను ఇక్కడికి తేలేదు! పట్టాభిషేక బహుమానంగా ఇచ్చేందుకు తీసుకొని వచ్చాము!" అన్నాడు.

"అలాగైతే మీరు పొరబడి ఇక్కడికి వచ్చారు. ఇక్కడున్న మాకెవరికీ పట్టాభిషేకం జరగబోవడం లేదు. పట్టం కట్టుకోబోయేవారు యువరాజు పొన్నియిన్ సెల్వన్. ఆయనను వెతుక్కొంటూ వెళ్ళి మీ కానుకలను ఆయనకివ్వండి!"

"లేదు, దేవీ! సరైన చోటుకే వచ్చాము మేము. దేనికైన పొన్నియిన్ సెల్వన్ దయ కావాలంటే, మొదట యువరాకుమారి కుందవై దయ పొందడమే అందుకు మంచి ఉపాయమని అందరూ చెబుతున్నారు!" అన్నాడా చైనా వర్తకుడు.

~

ఇది విని అక్కడున్న స్త్రీమణులందరూ నవ్వారు.

"అందరూ అంటే ఎవరు? అలా ఎక్కడ ఎవరు మాట్లాడుకోవడాన్ని మీరు విన్నారు?"

"అదేం, తల్లీ! ఈ రోజు నగరంలో జరిగిన ఉత్సవంలో కూడ చాలమంది అలాగే మాట్లాడుకొంటుండగా విన్నాము. 'అక్కగారి మాటను తమ్ముడుగారు దాటనే దాటరు' అని చెప్పుకొంటున్నారు. ఇదిగో ఇక్కడున్న నా మిత్రుని అడగండి!"

ఇంతసేపూ మౌనంగా ఉన్న ఆ మిత్రుడు, "అవును, రాకుమార్తెలారా! అది నిజమే! 'పొన్నియిన్ సెల్వన్‌కి పట్టాభిషేకమంటే అది కుందవై యువరాకుమారికి పట్టాభిషేకం చేసినట్లే' అని ప్రజలు మాట్లాడుకొంటున్నారు. 'ఇక చోళనాడులో స్త్రీరాజ్యమే నడవబోతూంది! అది మంచి పాలనగా కూడ ఉంటుంది' అని ప్రజలు చెప్పుకొంటున్నారు"

మళ్ళీ రాకుమార్తెలు గలగలా నవ్వారు.

"కాబట్టి, రాకుమార్తెలారా! ఈ పట్టాభిషేక బహుమానాలను దయచేసి స్వీకరించండి!" అన్నాడొక వర్తకుడు.

"స్వీకరించి, పొన్నియిన్ సెల్వన్‌గారికి మా కోరికను కూడ విన్నవించాలి!" అన్నాడు రెండో వర్తకుడు.

"ఏం కోరిక? పొన్నియిన్ సెల్వన్ నుంచి మీకేం పని కావాలి? మొదట అది చెప్పండి!" అన్నది కుందవై రాకుమారి.

"దేవీ! వారి మూలంగా ఎన్నో కార్యాలు జరగవలసివున్నాయి. మాకు మాత్రం కాదు; చోళనాడు మొదలుకొని, చైనా వరకున్న అన్ని దేశాల వర్తకులు కూడ అరుళ్మొళివర్మగారినే నమ్ముకొన్నారు. పరాంతక చోళ చక్రవర్తి కాలంలో సముద్రాలన్నీ వర్తకుల పయనానికి భద్రంగ ఉండేవి. సముద్రప్రయాణంలో సుడిగాలి వల్ల కలిగే ఆపదలు తప్ప, ఇంకే విధమైన ఆపదలు లేకుండ ఉండేవి. సముద్రంలో ఓడలను అటకాయించి కొల్లగొట్టడమనేది కలలో కూడ కని ఎరుగని విషయంగా ఉండేది. చోళనాడు వర్తకులు ఓడల్లో సరుకులను భర్తీ చేసుకొని రాజబాటలో వెళ్ళేటట్లు నిర్భయంగా వెళ్ళేవారు. మానక్కవారం, మాయిరుడింగం, మాపపాళం, ఇలాముురి దేశం, శ్రీవిజయం, శావకం, గడారం, కాంభోజం మొదలైన సముద్రదేశాల తీరాలకు చోళదేశపు ఓడలు వెళ్ళి అక్కడే సరుకులను దిగుమతి, ఎగుమతి చేసుకొని మా చైనా దేశానికి వెళ్ళేవి. అలాగే మా చైనా దేశంనుంచి బయలుదేరిన ఓడలు కూడ చోళనాడుకు ఏ అడ్డంకీ లేకుండ వచ్చేవి. ఆ కాలం ఇప్పుడు పాతకాలమైపోయింది. దేవీ! మీ దగ్గర నిజం చెప్పేస్తాము. ఈ పట్టు వస్త్రాలను మా దేశానికి మళ్ళీ భద్రంగా తిరిగి తీసుకొని వెళ్ళగలమన్న నమ్మకం మాకు లేదు. దారిలో అరబ్బు సముద్రదొంగల చేతిలో ఇవి పడడంకన్న చోళరాజ్యపు రాకుమార్తెలకు కానుకగా ఇవ్వడం చాల విశేషమైన కార్యం కద....?"

~

ఇలా ఆ చైనా వర్తకుడు చెప్పుకొచ్చినప్పుడు నల్లతుమ్మెదల్లాంటి కుందవై కనులు విప్పారి

ఆసక్తితో నిండాయి.

"పొన్నియిన్ సెల్వన్ వల్ల ఆ కార్యం నెరవేరుతుందని మీరు నమ్ముతున్నారా? పరాంతక చక్రవర్తి కాలంలో ఉన్నట్లు సముద్రప్రయాణం నిరపాయకరమవుతుందని భావిస్తున్నారా? మీరు సూచించిన ఆ విదేశాలలో అతడి కీర్తి విస్తరిస్తుందని నమ్ముతున్నారా?" అని అడిగింది.

"మేము మాత్రం నమ్మడమేమి? ఈ చోళనాడు మహావర్తకులందరూ నమ్ముతున్నారు. అంతెందుకు? కాసేపటి క్రితం మేమొక జ్యోతిష్కులను చూడవెళ్ళాము. ఆయన కూడ చెప్పారు!"

"ఏం చెప్పారు?"

"పొన్నియిన్ సెల్వన్ పెద్ద పెద్ద నౌకాసైన్యాలను తీసుకొని సముద్రాలను దాటి వెళతారు; సముద్రదొంగల గుంపులను తుడిచిపెట్టేస్తారు; సముద్రప్రయాణం మునుపటిలాగ మళ్ళీ నిర్భయంగా సాగేటట్లు చేస్తారు; చోళనాడు పరాంతక చక్రవర్తి కాలంలో చేరుకొన్న కీర్తిశిఖరాలను మళ్ళీ చేరేటట్లు చేస్తారని జోస్యం చెప్పారు. కానీ దీనికంతా చోళనాడు రాకుమార్తెలు అడ్డు నిలబడకుండాలని కూడ చెప్పారు!"

"ఇంత మాత్రమే చెప్పారా? రాకుమార్తెలమీద ఇంకేమైన నిందలు మోపారా?"

"ఆహా! నిందారోపణా? అలాగేం లేదు, దేవీ! పళైయారై యువరాకుమారి గురించి, కొడుంబాళూర్ రాకుమారి గురించి నిందలు చెప్పేవారు చోళనాడులో ఎవరూ ఉండసాధ్యం కాదు. అలా ఉండగా, రాకుమార్తెల దయను ఎదురుచూసే జ్యోతిష్కులు మాత్రం అలా తెగించి మాట్లాడగలరా?"

"మరి, ఆ జ్యోతిష్కులు మాగురించేం చెప్పారు?"

"రాకుమార్తెలిద్దరూ కాసేపటి క్రితం వారిని చూసి వెళ్ళారని చెప్పారు. ఇద్దరికీ త్వరలో పెళ్ళి కాబోతూందని చెప్పారు. రాకుమార్తెల్లారా! పట్టాభిషేక కానుకగా స్వీకరించకపోయినా, పెళ్ళి కానుకగా పట్టు వస్త్రాలను మీరు స్వీకరించాలి!" అన్నాడు మొదట మాట్లాడిన వర్తకుడు..

ఇది విన్న వాణతి, "అక్కా! ఈ చైనా వర్తకులు వట్టి అధికప్రసంగుల్లాగున్నారు. వీళ్ళను పొమ్మనండి!" అన్నది.

కుందవై, "కాస్త ఓపిక పట్టు, వాణతీ! వీరి అధిక్రప్రసంగం ఇంకా ఎంతదూరం వెళుతుందో చూద్దాం!" అని చెప్పి, "వర్తకులారా! జ్యోతిష్కుల ఇంటి ముందు ఏనుగు మీద వచ్చి నిలబడ్డవారు మీరే కద?" అని అడిగింది వర్తకులను.

"అవును, దేవీ! జ్యోతిష్కుల ఇంటిని వెతుక్కొంటూ వెళ్ళిన ఫలితం వెంటనే దొరికింది. మీరు వచ్చివున్నారని తెలుసుకొన్నాము. మిమ్మల్ని దర్శించే భాగ్యం ఈ రోజు లభిస్తుందని ఆయన చెప్పిన మాట కూడ ఫలించింది. అలాగే కొడుంబాళూర్ రాకుమారి గురించి ఆయన చెప్పింది ఫలిస్తే మా దిగులంతా తీరిపోతుంది!"

వాణతి మళ్ళీ, "అక్కా! వీళ్ళను పొమ్మనండి!" అన్నది.

“వర్తకులారా! ఉత్సవకూటమి మధ్య ఏనుగెక్కి వచ్చినవారు కూడ మీరే కద? అప్పుడప్పుడూ ఏనుగు మీదినుంచి కిందకు దిగి ప్రజల మధ్య కలుసుకొన్నారు కద?” అని అడిగింది కుందవై.

“అవును, దేవీ! రాబోయే పట్టాభిషేకం గురించి ప్రజలేం మాట్లాడుకొంటున్నారో తెలుసుకోవాలనే అలా ప్రజల మధ్యకు వెళ్ళి చుట్టూ తిరిగి వచ్చాము.”

“ప్రజలేం మాట్లాడుకొంటున్నారు? పొన్నియిన్ సెల్వన్ పట్టం కట్టుకోవడం గురించి తృప్తికరంగానే కద మాట్లాడుకొంటున్నారు?”

“లేదు; పట్టం కట్టే ఉత్సవం గురించి ఎవరూ మాట్లాడనే లేదు.”

“మరి? ప్రజలు ఏ విషయం గురించి మాట్లాడుకొన్నారు?”

“మధురాంతక దేవుల భక్తిమహిమ గురించే మాట్లాడుకొన్నారు.”

“అలా మంచి మాట చెప్పండి. పూంగుళలీ! విన్నావా?” అని కుందవై పూంగుళలిని చూసి చెప్పి, “మధురాంతక దేవుల గురంచి ఇంకా ఏం మాట్లాడుకొన్నారు?” అన్నది.

“మధురాంతక దేవరు ఎవరో ఒక పడవ నడిపే అమ్మాయి మీద ప్రేమగొని ఆమెనే పట్టమహిషిగా చేసుకొంటానని పట్టుబట్టారట. కాబట్టి అప్పటికే ఆయన పక్షానున్న సామంతరాజుల మనసు మారిపోయిందట. 'అలాగైతే మధురాంతకులకు పట్టం లేదు. పొన్నియిన్ సెల్వన్‌కే పట్టం' అని సామంతరాజులు చెప్పేశారట. ప్రజలిలా మాట్లాడుకొన్నారు. రాకుమార్తెలారా! ఆ భాగ్యశాలియైన పడవ నడిపే అమ్మాయిగారు ఇక్కడుంటే, వారికి కూడ పట్టువస్త్రాల కానుక ఇవ్వగోరుకొంటున్నాము.”

అప్పుడు పూంగుళలి, “దేవీ! కొడుంబాళూర్ రాకుమారి చెప్పినట్లు ఈ వర్తకులు వట్టి తగాదాకోర్లు, అధికప్రసంగులు. వీరిని వెంటనే వెళ్ళి పొమ్మనండి!” అన్నది.

“కాస్త ఓపిక పట్టు, పూంగుళలీ! నీకెందుకు కోపం? వీరు నీ గురించి ఏమీ తప్పుగా మాట్లాడలేదు  కద? నిన్ను పొగడుతూనే కద మాట్లాడారు?” అన్నది కుందవై.

“వీరు నా గురించి పొగడ్తగా మాట్లాడడమూ వద్దు; తెగడ్తలూ వద్దు! నాకు కానుక ఇవ్వనూ వద్దు!” అన్నది పూంగుళలి.

“అమ్మా! మీరేనా ఆ పూంగుళలి? ఆహా! ప్రజలు మాట్లాడుకొన్నది చాల సబబే!” అన్నాడు చైనా వర్తకుల్లో ఒకడు.

“ఇంకా ఏం మాట్లాడుకొన్నారు?” అని చిరునవ్వుతో అడిగింది పూంగుళలి.

“మధురాంతక దేవరు మీకు ప్రాధాన్యమిచ్చి చోళసామ్రాజ్యాన్నే త్యాగం చేశారని గుంపులో ఒకాయన అన్నప్పుడు, దానికి బదులుగా ఇంకొకరు, “పూంగుళలి దేవి కోసం ఒక రాజ్యం మాత్రమేనా త్యాగం చేశారు? నా దగ్గర తొమ్మిది రాజ్యాలుంటే వాటన్నిటినీ త్యాగం చేసేవాడిని!” అన్నారు. ఆయన చెప్పింది నేనూ ఆమోదిస్తున్నాను!” అన్నాడా చైనా వర్తకుడు.

పూంగుళలి [ఉత్తుత్తి] కోపం ప్రదర్శిస్తూ, "దేవీ! ఈ అధికప్రసంగి వర్తకులను శిక్షించేందుకు మీరు వెంటనే ఏర్పాటు చేయాలి; లేకపోతే నేనే పొన్నియిన్ సెల్వన్‌కి చెప్పి వీరికి తగిన శిక్ష ఇప్పిస్తాను!" అన్నది.

~

అప్పుడు పైమేడకు వచ్చిన మధురాంతకులు ఇది విన్నారు. సంధ్యాకాలపు పూజలు ముగించి చేత పుష్పప్రసాదం తీసుకొచ్చారు. పూంగుళలి మాటలు విని, "ఈ వర్తకులు చెప్పిన మాటల్లో తప్పేమీ లేదే? ఎందుకని వారిని శిక్షించాలి? వారు చెప్పింది నేనూ ఆమోదిస్తున్నాను, పూంగుళలీ!" అన్నారు.

ఇలా చెబుతూ కిందకు వచ్చిన ఆయనను ఆ చైనా వర్తకులు తిరిగి చూసినప్పుడు పూంగుళలి, "నిజమైన వర్తకులు చెబితే సబబే; కపటవేషధారులైన వర్తకుల మాటలను ఎలా నమ్మడం, ఒప్పుకోవడం?" అని చెబుతూనే ఆ చైనా వర్తకుని తలపాగాను పట్టి లాగింది పూంగుళలి.

తలపాగా కింద పడింది; దానితోబాటు అతని ముఖానున్న మీసం, గెడ్డం కూడ కింద పడ్డాయి!

సాక్షాత్తు వంతిదేవుని ముఖం దర్శనమిచ్చింది.

"అయ్యో! రక్షించండి!" అని గోలపెడుతూ రెండో వర్తకుని గొంతు పట్టుకోవడానికి ప్రయత్నించినప్పుడు, అతడి (రెండో వర్తకుని) తలపాగా, మీసం, గెడ్డం కూడ ఊడిపడ్డాయి.

పొన్నియిన్ సెల్వన్ చిరునవ్వు విరిసిన వదనంతో ప్రత్యక్షమయ్యారు.

ముగ్గురు వనితామణులు కాసేపు పడిపడి నవ్వారు.

శెంబియన్ మహాదేవి పైమేడకు వచ్చినప్పుడు వారికి కూడ చెప్పి మళ్ళీ నవ్వారు.

పూంగుళలి, "అమ్మా! వీరిని గుడి దగ్గర చూసినప్పుడే నాకు కాస్త సందేహం కలిగింది. అందుకే ధైర్యంగా వీరిని అంతఃపురానికి రమ్మని చెప్పాను!" అన్నది.

మధురాంతకులు, "అవును; నాకు నా స్నేహితుడు తెలిసిపోయాడు. అందుకే నేను వీరిని ఇక్కడ వదిలిపెట్టి పూజ చేసేందుకు వెళ్ళాను!" అన్నారు.

"వాణతీ! నీవూ, నేనూ మాత్రమే పురుషుల దొంగవేషాలను కనిపెట్టలేని దద్దమ్మలం లాగుంది!" అన్నది కుందవై.

"వీరెందుకిలా వేషం వేసుకొని వచ్చి మనని మోసం చేయజూశారు? అడడగండక్కా!" అన్నది కొడుంబాళూర్ రాకుమారి.

"అడగనేల, వాణతీ! నా తమ్ముడు ఇలాంటి దొంగవేషాలు వేయడం ఎరగనివాడు. సహవాసదోషం వల్లనే ఇలా దొంగవేషాలు వేయడం, కట్టుకథలు చెప్పడం నేర్చుకొన్నాడు!" అన్నది కుందవై.

“దేవీ! ఈ కార్యానికి వంతిదేవులమీద నింద మోపకండి. చైనా వర్తకుల్లాగ వేషం వేసుకొని రావాలన్న అపూర్వాలోచన నా మనసులోనే ఉదయించింది!” అన్నారు అరుళ్మొళి.

“ఇలాంటి ఆలోచనలు నీ మనసులో తోచడానికి కారణం సహవాసదోషమే అని చెబుతున్నాను. పోనీ! ఇలాంటి దొంగవేషాలు ఇక మీదట వేయకు!”

“అక్కా! తిరువళ్ళువర్ నిజాయితీ గొప్పతనం గురించి ఎన్నో చెప్పారు. కానీ ఆయన కూడ...”

“...అబద్ధం కూడ ఒక్కోసారి మంచిదే.. అని చెప్పారు కద?”

“తిరువళ్ళువర్ ఆ నీతిపద్యాన్ని రాసినప్పుడు దాన్ని నీవిలా ఉపయోగించుకొంటావని కలలో కూడ ఊహించివుండరు.”

“తిరువళ్ళువర్‌ని వదిలేద్దాం. రాముడు వనవాసానికి బయల్దేరినప్పుడు వారి వెనకే వచ్చిన అయోధ్యప్రజలను వెనక్కి పంపేందుకు కాస్త నాటకమాడలేదా? ప్రజలు నిద్రపోతున్నప్పుడు లేచి రథాన్ని అయోధ్యవైపు కాస్త దూరం నడిపి, గంగానదీతీరం వైపు నడపమని సుమంత్రునికి చెప్పలేదా?”

“తమ్ముడూ! నీవన్ని కార్యాల్లోను రాముని బాటను అనుసరించేటట్లయితే నాకు చాల సంతోషమే! పోనీ! మీరీ దొంగవేషం వేసినందువల్ల ఏం 'మంచి' జరిగింది? దాన్ని చెబుతావా?” అని అడిగింది కుందవై.

“మేమెవరన్నది వెలిబుచ్చక ప్రజల మధ్యకు వెళ్ళి అటూ ఇటూ తిరిగి వారి మనసులో నిజంగా ఏముందో తెలుసుకోగలిగాం!”

కుందవై కాస్త ఆసక్తితో, “ప్రజలు నిజంగా ఏమనుకొంటున్నారని తెలుసుకొన్నావు, తమ్ముడూ?” అని అడిగింది.

“ఎన్నో తెలుసుకొన్నానక్కా! ముఖ్యంగా చోళసామ్రాజ్యం పరాంతక చక్రవర్తి కాలంలో ఉన్నట్లు మళ్ళీ మహోన్నతస్థితిని చేరుకోవాలని ప్రజలందరూ కోరుకొంటున్నారని తెలుసుకొన్నాను. కాసేపటి క్రితం నేను, నా స్నేహితుడు చైనా వర్తకుల వేషం వేసుకొనివున్నాం కద? వేషం దొంగవేషమైనా, మాటలన్నీ నిజమే! మేము మీ ఇద్దరినీ రాజబాటలో కలిసి మాట్లాడిన తర్వాత తంజావూరుకు వెళ్ళాము. కోట వాకిలి సమీపాన నిజంగానే ఇద్దరు చైనా వర్తకులను చూశాము. వారి దగ్గరినుంచి ఈ పట్టువస్త్రాలను వెల ఇచ్చి కొన్నాము. వారిలాగే వేషం వేసుకొని తిరిగి వచ్చాము. అరబ్బు సముద్రదొంగల గురించి నేను కాసేపటి క్రితం చెప్పిందంతా ఆ వర్తకులు మాకు చెప్పిందే. ఆ అరబ్బు దొంగల మూర్ఖత్వాన్ని, మొరటుతనాన్ని నేను, నా స్నేహితుడు ప్రత్యక్షంగానే అనుభవించి ఎరుగుదుము. అక్కా! ఏదెలావున్నా, పట్టాభిషేకవైభవం ముగియగానే నేను, నా స్నేహితుడు లంకకు బయల్దేరడం తథ్యం. అక్కడ కార్యం ముగియగానే సముద్రాలకవతల ఉన్న పలుదేశాలకు వెళ్ళాలని ఉద్దేశించాను. ప్రాణాలతో తిరిగి వస్తామో, లేక వెళ్ళిన చోట యుద్ధరంగంలో వీరస్వర్గం చేరుకొంటామో తెలియదు. కాబట్టి మేము బయల్దేరేవరకు మీరందరూ మాతోనే

ఉండాలని, మమ్మల్ని ఆశీర్వదించి సెలవిచ్చి పంపాలని కోరుకోవడానికే మీ వెంబడి తొందర తొందరగా వచ్చాము!"

ఇలా పొన్నియిన్ సెల్వన్ చెప్పుకొచ్చినప్పుడు కుందవైదేవి కళ్ళలో నీళ్ళుబికాయి.

పూంగుళలి గద్గద స్వరంతో, "యుద్ధమన్నది ఎందుకు కనిపెట్టారో తెలియదు. మనుషులు ఒకరితోనొకరు స్నేహంగా ఉండకూడదా?" అన్నది.

"బిడ్డా! అలా కాదు! లోకమున్నంత వరకు యుద్ధం ఉండకపోదు. పరమశివుడే యుద్ధం చేయవలసి వచ్చింది కద? లోకంలో ధర్మాన్ని స్థాపించేందుకు/సెలకొల్పేందుకు జన్మించినవారు కొందరుంటారు. వారు యుద్ధం చేయక తప్పదు!"

ఇలా శివభక్తశిరోమణి, పరమసాధువు అయిన శెంబియన్ మహాదేవి చెప్పగా విని అందరూ ఆశ్చర్యసముద్రంలో మునిగిపోయారు.

~~~
~~~

# అధ్యాయము - 85

## శిల్పాల అంతరార్థం

**సేందన్** అముదన్ అనబడ్డ మధురాంతకులు తమ తల్లిగారిని చూసి, “అమ్మా! ఈ లోకంలో యుద్ధం పిచ్చి పట్టి తిరుగుతున్నవారు ఎంతో మంది ఉన్నారు. యుద్ధం చేయని రోజులంతా వృధాగా గడిచిపోయినట్లు వారికనిపిస్తుంది. ఆ కూటమికి చేరినవారే నా మిత్రుడు వంతిదేవులు, పొన్నియిన్ సెల్వన్. మీరేమో దేవుని గురించి మాట్లాడని రోజల్లా వృధాగా గడిచిపోయిందని తలచేవారు. మీరు యుద్ధవృత్తిని ఆధారంగా తీసుకొని మాట్లాడడం చాల ఆశ్చర్యకరంగా ఉంది!” అన్నారు.

అప్పుడు శెంబియన్ మహాదేవి, “నా ముద్దుల కుమారా! ఇంకెవరు యుద్ధవృత్తిని గురించి లోకువగా మాట్లాడినా నీవు మాట్లాడకూడదు; పూంగుళలి కూడాను. వాణర్‌కుల వీరులు యుద్ధవిద్యలో ఆరితేరినవారైనందువల్లనే కద ఈరోజు నీవు సజీవంగా ఉన్నావు? దైవస్తోత్రాలను నా వీనులవిందుగ పాడుతున్నావు?” అన్నారు.

“తల్లీ! నేను మీ ప్రియపుత్రుని కాపాడింది ఒకవైపుండనీ. ఆయన, వారి పాణిగ్రహణం చేసిన తమ కోడలు నన్ను కాపాడిన విషయం నేనెన్నటికీ మరువలేను. పూంగుళలి అమ్మగారి క్షాత్ర/యుద్ధగుణం వల్లనే కద నేనీ రోజు సజీవంగా ఉన్నాను?” అన్నాడు వంతిదేవుడు.

“పరమేశ్వరుడు, దుర్గాపరమేశ్వరి మనందరినీ కాపాడారు! వారి కరుణ లేకపోతే, మనం ఒకరినొకరు ఎలా కాపాడగలం?” అన్నారు మధురాంతకులు.

“బిడ్డా! కరుణే రూపంగొన్న శివపరమాత్మ కూడ చాలసార్లు యుద్ధం చేయవలసివచ్చింది. ప్రేమ, కరుణ, శాంతమే రూపంగొన్న జగన్మాత కూడ యుద్ధం చేయక తప్పలేదు. ఈ పుణ్యస్థలంలోనున్న ఆలయంలో అంబిక అర్ధనాయికగా వెలసింది. కానీ, ఆలయం చుట్టూ ప్రదక్షిణం చేసే వీధిలో మహిషాసురమర్దినిగా దర్శనమిస్తూంది. నీవు గమనించలేదా?” అన్నారు శెంబియన్ మహాదేవి.

“అవునమ్మా! గమనించి అచ్చెరువొందాను. చరాచర జీవరాశులను రక్షించే తల్లి ఒక ఎనుబోతు తలమీద నిలబడి దర్శనమిస్తూందెందుకని ఆశ్చర్యపోయాను!” అన్నారు మధురాంతకులు.

“అవును! ఈ ఆలయంలో వెలసిన దేవి మహిషాసురుని వధించి, తొలగించేసింది. కాబట్టి మహిషాసురుని తలమీద నిలబడ్డ దేవి ముఖంలో శాంతం, కరుణ నెలకొన్నాయి. మహాబలిపురంలోని గుహశిల్పాలలో దేవి మహిషాసురునితో పోరాడుతున్న శిల్పం ఒకటుంది. అక్కడ దుర్గాపరమేశ్వరి వీరభయంకర కాళిగా దర్శనమిస్తూంది. జగన్మాతయైన పరమేశ్వరి కేవలం ఒక ఎనుబోతుతో ఎందుకు యుద్ధం చేయాలి? అందుకు ఇంతటి ఆర్భాటమేల? అని చూసినవారు అనుకోవచ్చు. మన పెద్దల

మనస్సుల్లో ఉదయించిన ఇటువంటి ఆలోచనలకన్నింటికీ అంతరార్థం ఉంది. దాన్ని అర్థం చేసుకోవడానికి తగిన పరిపక్వత కావాలి; తెలుసుకోవాలన్న జిజ్ఞాస ఉండాలి!"

"దేవీ! మాకందరికీ అటువంటి పరిపక్వత ఉందో లేదో, తెలియదు! కానీ శ్రద్ధాసక్తులు ఉన్నాయి. మీ దివ్యమైన నోటినుంచి వెలువడే ప్రతి ఒక్క వాక్కును శ్రద్ధతో వింటున్నాము! ఏల? సతతం చంచలిస్తుండే మన వాణగపాడి రాజుగారి కళ్ళు కూడ ఇప్పుడు తమనే ఏకాగ్రతతో చూస్తున్నాయి!" అన్నారు అరుళ్మొళివర్మ.

ఈ మాటలు అక్కడ కాస్త గలగల నవ్వులను పుట్టించాయి. వంతిదేవుడు తరచూ యువరాకుమారి వైపు చూస్తూండడాన్ని అరుళ్మొళివర్మ గమనించారని గ్రహించి అక్కడున్న స్త్రీమణులందరూ చిన్నగా నవ్వుకొన్నారు.

శెంబియన్ మహాదేవి, "శ్రద్ధగా వింటున్నారు కాబట్టి చెబుతున్నాను, వినండి. మన పురాణ, ఇతిహాసాల్లో దేవాసుర యుద్ధాల గురించి చాల ప్రస్తావించారు. ఈ లోకంలో పరమేశ్వరుడు అవతారమెత్తి రాక్షసులతో పోరాడిన విషయం కూడ వివరించారు. భగవంతుడు ఈ లోకాన్ని సృష్టించినప్పటి నుంచి దేవ శక్తులు, అసుర శక్తులు యుద్ధం చేస్తూనే ఉన్నాయి. అసుర శక్తులను భగవంతుడు ఎందుకు సృష్టించాడని అడిగితే, దానికి మానవమాత్రులమైన మనం ఉత్తరమివ్వలేము అది భగవంతుని లీల అని మాత్రమే చెప్పగలం. దైవశక్తులు, అసురశక్తులు నిర్విరామంగా పోరాడుతూనే ఉన్నాయని మాత్రం ఖచ్చితంగా చెప్పవచ్చు. ఒక్కొక్కసారి అసురశక్తులు పైచేయిగా ఉన్నట్లు తోస్తుంది. అవే లోకాన్ని ఎన్నటికీ ఏలతాయని కూడ తోస్తుంది. శూరపద్ముడు, హిరణ్యకశ్యపుడు, రావణుడు ఎన్ని వేల సంవత్సరాలపాటు ఏలారు! కానీ వారందరూ ఒక్కక్షణంలో తుడిచుపెట్టుకుపోయారు."

"అవును! దేవతలందరినీ తన పాదాక్రాంతం చేసుకొన్న దశకంఠ రావణుడికి పోగాలము వచ్చినప్పుడు, ఇద్దరు మానవులు, ఒకిన్ని కోతులు వాడిని, వాడి కులాన్ని సమూలంగా నాశనం చేయలేదా?" అన్నారు మధురాంతకులు. "కాబట్టి అసురశక్తులది పైచేయి కావడం చూసి మనుషులు నిరాశ చెందకూడదు. చివరికి దైవశక్తులే జయిస్తాయని నమ్మి, ధర్మం వైపు, సత్యం వైపే నిలబడి పోరాడాలి. అలా పోరాడేవారికి దైవం తప్పక తోడుంటుంది."

"తల్లీ! మహిషాసురుని గురించి చెప్పబోయారు" అని గుర్తు చేసింది పూంగుళలి.

"అవును; మంచివేళగా గుర్తుచేశావు, కూతురా! అసుర శక్తులు రెండు రకాలు. ఒక రకం మూఢ అసుర శక్తులు. రెండవ రకం చాల సూక్ష్మబుద్ధిగల శక్తులు. మహిషాసురుడు మొదటి రకానికి చెందినవాడని మన పూర్వీకులు వర్ణించారు. అడవి దున్న ఆవేశంగొని, గతి తప్పి పరుగెత్తడం మీరు చూసేవున్నారు కద? అప్పుడా ఎనుబోతుకు ఏనుగు కన్న ఎక్కువ బలం కలిగివుంటుంది. ఎదురు వచ్చిన ప్రాణులనన్నింటినీ ఛిన్నాభిన్నం చేసేస్తూంది. మూఢులు కూడ ఒక్కొక్కసారి అడవి దున్నలాగ

బలీయులైపోతున్నారు. మూఢులు కొన్నిసార్లు సింహాసనమెక్కి పరిపాలన చేస్తున్నారు. దీన్నే 'మహిషాసుర పాలన' అని మన పూర్వీకులు సూచించారు. మహిషాసురుడు దేవలోక సింహాసనమధిష్టించి పరిపాలించనారంభించినప్పుడు, ముల్లోకాలు అల్లకల్లోమైనాయి. వివేకం వద్దు; వివేకపూర్వమైన సూక్తులు వద్దు; కళలు వద్దు; సంగీతం వద్దు; శిల్ప, చిత్ర కళలు వద్దు; దేవాలయాలు, గోపురాలు ఏవీ వద్దు. అన్నిటినీ తుడుచిపెట్టండి అని మహిషాసురుడు శాసించాడు. దేవతలు, మునులు, మానవులు అందరూ గడగడ వణికిపోయారు. వారిలో చాలమంది మహిషాసురునికి లొంగిపోయి వాడి ఆజ్ఞను ఒప్పుకొన్నారు. ఇందువల్ల మహిషాసురుని అహంకారం, మూర్ఖత్వం అధికమైనాయి. అవి రెండూ జత కలిస్తే, ఇక అడగాలా? మహిషాసురుని హింసలను తట్టుకోలేక ముల్లోకాలలో ప్రజలు గగ్గోలు పెట్టారు. అసురులు కూడ అలిసిపోయి గోలపెట్టారు. దుర్గాపరమేశ్వరి అప్పుడు కళ్ళు తెరిచింది. మహాకాళి రూపంలో వచ్చి మహిషాసురుని వధించింది. మూఢశక్తిని దైవశక్తి జయించింది. ముల్లోకాలు మూఢశక్తి పరిపాలన నుంచి విడుదల పొందాయి. దేవతలు, మునులు, అసురులు కూడ పెద్దగా నిట్టూర్చి దుర్గాపరమేశ్వరిని కొనియాడారు.

"బిడ్డలారా! ఇప్పుడు కూడ ఈ లోకంలో మూఢ అసురశక్తులు లేకపోలేదు. ఈ పుణ్య భరత ఖండానికి వాయవ్యదిశలో కొన్ని మూఢాసుర శక్తులు తలెత్తుతున్నాయని విన్నాను. వారు మూఢావేశంతో దండెత్తి వచ్చి నగరాలను ధ్వంసం చేసి, అమాయకులైన ప్రజలను వధించి, గుళ్ళను, విగ్రహాలను కూడ ధ్వంసం చేస్తున్నారట. వారిని అడ్డుకోగల మహాచక్రవర్తులు ఇప్పుడు ఉత్తర భారతాన ఎవరూ లేరట. ఈ తమిళనాడుకు అటువంటి గతి పట్టకుండుగాక. అలా జరిగితే, వీర క్షత్రియ కులంలో పుట్టిన మీరు ఆ అసుర శక్తులను ఎదుర్కొని పోరాడడానికి సిద్ధంగా ఉండాలి కద?"

"తప్పక సిద్ధంగా ఉంటాము, తల్లీ! ఇంకొక విధమైన అసురశక్తులను గురించి కూడ చెప్పండి!" అని అడిగాడు వంతిదేవుడు.

"ఇంకొక విధమైన/రకమైన అసురులు బుద్ధికుశలతగొన్నవారు., వివేకవంతులు. ఆ వివేకాన్ని దుష్టకార్యాలకు ఉపయోగించేవారు. వారు తపస్సు చేసి వరాలు పొందుతారు. ఆ వరాలను కూడ దుష్టకార్యాలకే ఉపయోగిస్తారు. త్రిపురాసురులు ఏం చేశారు? ఒక్కొక్కరు ఒక్కొక్క లోకాన్నే సృష్టించుకొన్నారు. ఆకాశాన ఎగురుతూ వెళ్ళి నాడు, నగరాల మీదకు దిగి వాటన్నిటినీ నాశనం చేశారు. శూరపద్మడు ఎన్ని సార్లు తన తల నరికివేయబడినా కూడ, తిరిగి కొత్త తల మొలిచేటట్లు వరం పొందాడు. రావణుడు, ఇంద్రజిత్తు మొదలైన రాక్షసులు ఆకాశాన మేఘాల మాటున దాక్కొని కింద ఉన్నవారి మీద అస్త్రాల వర్షం కురిపించే శక్తిగొన్నవారు. ఇటువంటి అతీత శక్తిగొన్న అసురులనే 'అపస్మారాసురుడు' అని మన పూర్వీకులు చెప్పారు. భగవానుడు ఆనంద నటనం చేసేటప్పుడల్లా తన కాలి కింద అదిమిపెట్టిన అసురుని కూడ గుర్తుపెట్టుకొంటున్నాడు. కాస్త ప్రమత్తంగా ఉంటే ఆ అసురుడు మళ్ళీ బయల్దేరుతున్నాడు.

సృష్ట్యాదినుంచి అసురశక్తులతో దేవశక్తులు పోరాటం సాగిస్తున్నాయన్న విషయాన్నే ఈ అపస్మారాసురుడు మనకు గుర్తు చేస్తున్నాడు. కాబట్టి, నా ముద్దుబిడ్డలారా! యుద్ధమే వద్దని మనమెలా చెప్పగలం?"

"దేవీ! ఇంతవరకు మాకు అర్థంకాని పలువిషయాలను ఇప్పుడు తెలుసుకొన్నాము. మాకు ఏమి ఆజ్ఞ?" అని అడిగారు పొన్నియిన్ సెల్వన్.

"బిడ్డలారా! మీరెప్పుడూ దేవశక్తుల పక్షానే నిలబడి పోరాడండని మాత్రమే చెప్పగలను. మిమ్మల్ని ఆజ్ఞాపించలేను. మీ అంతరాత్మే మిమ్మల్ని ఆజ్ఞాపించగలదు. ఆ అజ్ఞ ప్రకారం నడుచుకోండి. కాసేపటి క్రితం ఈ తమిళనాడు చుట్టూ ఉన్న సముద్రాలలో దొంగలు పేట్రేగిపోతున్నారని చెప్పారు. అందువల్ల మన తమిళనాడు వర్తకులు చాల కష్టనష్టాల పాలవుతున్నారని కూడ చెప్పారు. ఆ దోపిడీదొంగలను తుడిచిపెట్టి మన దేశ వర్తకులకు రక్షణ కల్పించడం క్షత్రియకులంలో పుట్టిన మీ ధర్మం. ఇప్పుడు ఆ దోపిడీదొంగలకు తావిస్తే రేపు వారు మన నాడు లోపలికే ప్రవేశించరా? ఇప్పుడు కైలాసంలో శివగణాలతోబాటు విరాజిల్లుతున్న నా పతిదేవులు నేడు సజీవంగా ఇక్కడుంటే ఆయన కూడ మీకిదే చెప్పేవారు!"

"దేవీ! మీ మనసు తెలుసుకొన్నాము. అలాగే నడుచుకొంటాము!" అన్నారు యువరాజు అరుళ్మొళివర్మ.

"పొన్నియిన్ సెల్వా! నీవు నా కోరిక ప్రకారం నడుచుకొనేటట్లయితే, ఇంకొక విషయాన్ని కూడ చెప్పగోరుతున్నాను!" అన్నారు శెంబియన్ మహాదేవి.

"దేవీ! ఇంతవరకు మీ కోరికకు వ్యతిరేకంగా నేను నడుచుకొన్నట్లు గుర్తు లేదు కద? అలా నడుచుకొనివుంటే మన్నించండి!"

"బిడ్డా! నీవింతవరకు నడుచుకొన్నదంతా వేరు; ఇక ముందు జరగబోయేదంతా వేరు. ఇంతవరకు నీవు అంతఃపురంలో అందరి ముద్దుబిడ్డగా పెరిగావు. నీ కోరిక ప్రకారం మేము నడుచుకొన్నాము. మా కోరికను కూడ నీవు నెరవేర్చేవాడివి. ఇక, నీవు ఈ మహారాజ్యాన్ని ఏలే రారాజువి కాబోతావు. పట్టాభిషేకం తర్వాత నీ కోరిక ప్రకారమే మేమంతా నడుచుకోవాలి."

"తల్లీ! అలా చెప్పకండి; ఇకముందు కూడ నేను మీ ముద్దుబిడ్డగానే ఉంటాను. మీ కోరిక ప్రకారమే నడుచుకొంటాను."

"అలాగైతే, ఇది విను! ఈ పురాతన చోళకులం దినదిన ప్రవర్ధమానంగా పెరగాలి. రాజకులంలో పుట్టినవారు ఎప్పుడైనా వీరస్వర్గం చేరేందుకు సిద్ధంగా ఉండవలసిందే. కానీ కులం అభివృద్ధి కావడానికి ముందు జాగ్రతలు తీసుకోవాలి. నీ అన్న ఆదిత్య కరికాలన్ పెళ్ళి చేసుకోకనే కాలం చెందాడు. చోళకులం పెరిగేందుకు నీవొక్కడివే మిగిలావు! కాబట్టి నీవు మళ్ళీ ఓడెక్కి సముద్రాలు దాటి విజయలక్ష్మిని వెతుక్కొంటూ వెళ్ళేముందు కులాభివృద్ధికి తగిన ఏర్పాట్లు చేయాలి. నీ మకుటాభిషేకంతో బాటు వివాహానికి

కూడ ఏర్పాట్లు చేసుకో. వాణతిలాంటి అమ్మాయిని భార్యగా పొందేందుకు నీవెంతో తపస్సు చేసివుండాలి. ఈ స్త్రీమణి మాంగల్యబలం నీవు వెళ్ళే చోటల్లా నిన్ను మంత్రకవచం లాగ కాపాడుతుంది!"

"దేవీ! ఆ కవచాన్ని ధరించేందుకు నేను సిద్ధంగానే ఉన్నాను. వాణతే తిరస్కరిస్తూంది. 'సింహాసనమెక్కనని శపథం చేశాను' అని మొండిపట్టు పడుతూంది!" అన్నారు యువరాజు.

అప్పుడు పూంగుళలి ఎవరూ ఎదురుచూడనట్లు కలగజేసుకొని "కొడుంబాళూర్ రాకుమారి మాటను అలాగే నమ్మేయకండి. మనందరమూ ఇంకా ఉపచారం చేయాలని అనుకొంటున్నారు. పొన్నియిన్ సెల్వన్‌గారు ఇంకాస్త బతిమాలి అడగాలి!" అని చెప్పి నవ్వింది. ఇది తమాషా అని భావించి మిగిలినవారు కూడ నవ్వారు.

కానీ వాణతి మాత్రం వెక్కి వెక్కి ఏడ్వసాగింది. "పిచ్చి పిల్లా! ఎందుకిలా ఏడుస్తున్నావు?" అని చెప్పి కుందవై వాణతి చేయి పట్టుకొని కిందకు తీసుకొని వెళ్ళింది.

~~~
~~~

# అధ్యాయము - 86

## "కలా? నిజమా?"

**మరునాడు** ఉదయం శెంబియన్ మహాదేవి, మధురాంతకులు, పూంగుళలి తంజావూరుకు బయలుదేరారు. పొన్నియిన్ సెల్వన్, వంతిదేవుడు ఉరైయూరుకు, శ్రీరంగానికి వెళ్ళిరావాలని అనుకొన్నారు. వెళ్ళేటప్పుడు కరికాలచోళుల కాలంలో కావేరినది నీటిని నిలువ చేసేందుకు కట్టిన ఆనకట్టను పొన్నియిన్ సెల్వన్ వంతిదేవునికి చూపిస్తానని చెప్పారు.

వారు బయలుదేరేముందు సెలవు తీసుకోవడానికి పొన్నియిన్ సెల్వన్ కుందవై వద్దకు వెళ్ళారు. "అక్కా! తమరు పళైయారైకి తప్పక వెళ్ళే తీరాలా?" అని అడిగారు.

"తమ్ముడూ! మీరు ఉరైయూరుకు తప్పక వెళ్ళాలా? మాతోబాటు పళైయారైకి రాకూడదా?" అని యువరాకుమారి అడిగారు.

"లేదక్కా! ఉరైయూరులో ఆళ్వార్ కట్టియాన్ని ఒక ముఖ్యమైన పనిమీద కలుస్తామని కబురు చేశాము..." అన్నారు అరుళ్మొళివర్మ.

"ఆహా! నీవు మునుపటిలాగ లేవు, తమ్ముడూ! నీ మనసు చాల చెడిపోయింది. నన్ను నీవు పట్టించుకోవడమే లేదు. ఈ మార్పుకు ఆ వాణర్కుల (యువ)రాజే కారణమంటున్నాను..."

"అనవసరంగా ఆయన మీద నింద మోపకండి. నాకు యుక్తవయసొచ్చేసింది కదక్కా! ఒక పెద్ద రాజ్యానికి చక్రవర్తిగా పట్టం కట్టుకోబోతున్నాను. ఇకముందు నా ఇష్టప్రకారం నేను నడుచుకోవాలి కద?"

"బాగ నీ ఇష్టప్రకారమే నడుచుకో! నీ అధికారాన్ని నామీద చూపకపోతే చాలు! నీ ఇష్టప్రకారం నేను నడుచుకోవాలని చెప్పకుంటే చాలు..."

"మకుటాభిషేకానికి మాత్రం వచ్చేయండి. తర్వాత మీ ఇష్టప్రకారం నడుచుకోండి."

"మకుటాభిషేకం తర్వాత కావాలంటే నీవు నా మీద అధికారం చెలాయించవచ్చు. అంతవరకు నన్ను కట్టడి చేసేందుకు నీకేం హక్కుంది?"

"అలాగైతే, మీరు మకుటాభిషేకానికి రాబోవడం లేదా?"

"అది వాణతి ఇష్టం; ఆమె వెళ్ళాలంటే నేనూ వస్తాను; లేకపోతే లేదు."

"ఆ పిల్ల ఎక్కడక్కా?"

"నీ తల్లైన పొన్ని నదికి పూజకు వెళ్ళింది. నీకు మంచి బుద్ధి ఇచ్చి కరుణించాలని ప్రార్థన చేయడానికి వెళ్ళింది."

యువరాజు నవ్వేసి, “ఆమె ప్రార్థన నెరవేరనీ; నేను బయల్దేరుతానక్కా!” అన్నారు.

“తమ్ముడూ! నీలాంటి క్రూరులను నేను చూడనే లేదు. వాణతి రాత్రంతా నిద్రపోనే లేదు. తలుచుకొని, తలుచుకొని ఏడుస్తూంది. కావేరి నది మెట్ల వద్దకు వెళ్ళి ఆమె దగ్గర సెలవు తీసుకొని వెళ్ళు” అన్నది కుందవై.

“ఆమె మాత్రం నిద్రపోకపోవడమేమి? నా నిద్రను కూడ దోచేసుకొంది లాగుంది. ఒకరి మనసునొకరు తెలుసుకొని నడుచుకోకపోతే, వెక్కి వెక్కి ఏడుస్తూండవలసిందే. ఇలాంటి అమ్మాయిని కట్టుకొని నేను బతికున్నంత కాలం కష్టపడాలంటున్నారా?” అని చెప్పేసి పొన్నియిన్ సెల్వన్ ఆ అంతఃపురపు వెనుకభాగానికి వేగంగా వెళ్ళారు. తోట దాటగానే పొన్ని నది తీరాన మెట్లమీద వాణతి కూర్చొనివుండడాన్ని, పక్కనున్న పూలసజ్జనుంచి ఒక్కొక్క పూవును తీసి నది వెల్లువలో వేస్తుండడాన్ని చూశారు.

వాణతి అలా అర్చన చేస్తూండకపోతే, ఆమె ఆ నది గట్టున అమర్చబడ్డ ఒక స్వర్ణశిల్పమనే తోచేది. పొన్నియిన్ సెల్వన్ చప్పుడు చేయకుండ వెళ్ళి వాణతి వెనక పైమెట్టు మీద కూర్చొన్నారు. వాణతికి ఎవరో వస్తున్నారని తెలిసేవుండాలి. అంతరానుభూతి వల్ల అది పొన్నియిన్ సెల్వనే అని తెలుసుకొంది కాబోలు. కాబట్టి తిరిగి చూడకుండ అర్చన చేయడాన్ని ఆపేసి ఊరకే కూర్చొంది.

సజ్జలోవున్న పూలరేకుల మీద కొన్ని మంచుబిందువులు కానవచ్చాయి. వాణతి కళ్లలో కూడ ముత్యాల్లాంటి రెండు కన్నీటిబిందువులు కానవచ్చాయి. ఉదయసూర్యుని లేత బంగారు కిరణాలు పొన్నినది అలలమీద పడ్డప్పుడు, చోళసామ్రాజ్యపు మహారాణి నీలవర్ణ పట్టువస్త్రాన్ని ఉత్తరీయంగా ధరించి విరాజిల్లుతున్నట్లు తోచింది. ఆ పట్టువస్త్రం రెండు వైపులా అమరిన పచ్చటి అంచుల్లాగ ఆ నది రెండు గట్ల వెంబడి ఏపుగా పెరిగిన పచ్చటి చెట్లు కానవచ్చాయి.

కావేరినది గలగలమని వినిపించిన ఇంపైన సంగీతానికి తగినట్లు నది ఇరువైపుల ఉన్న తోటల్లోనుంచి రకరకాల పక్షులు తమ ఇంపైన గానాన్ని వినిపించసాగాయి. కల్పనాలోకంలో సంచరిస్తూ పగటి కలలు కనడానికి చోటు, సమయం చాల అనుకూలంగా ఉన్నాయి. యువరాజు కాసేపు మౌనంగా ఉన్న తర్వాత, “వాణతీ! పగటి కలలుగంటున్నావా? నేను నీ కలలను చెదరగొట్టానా?” అని అడిగారు.

“నేను పగటికలలే కంటున్నానయ్యా! కానీ నా కలల్ని మీరెలా చెదరగొట్టగలరు? రాత్రి కలగన్నా, ఆ కలలో నాయకులుగా విలసిల్లేవారు మీరే కద? అందుకే మిమ్మల్ని ప్రత్యక్షంగా చూసినప్పుడు 'ఇది కలా? నిజమా?' అని నాకు సందేహం కలుగుతూంది. 'రండి!' అని స్వాగతించడానికి కూడ వీలుకాకుండపోతూంది. అవును, స్వామీ! ఎన్నోరోజులు, ఎన్నోవిధాలుగా పగటికలలు కన్నాను. మీరు మొట్టమొదట తిరునల్లం అంతఃపురం తోటలో నన్ను కలిసినప్పుడు, మీరు ఏనుగు మావటి అనుకొన్నాను. మీరు మామూలు ఏనుగు మావటిగానే ఉండకూడదా అని చాలసార్లు అనుకొన్నాను కూడ.

మీరు ఒట్టి ఏనుగుమావటై, నన్ను మీ వెనుక ఏనుగు మీదెక్కించుకొని వెళుతున్నట్లు చాలసార్లు ఊహించుకొని, కాలం గడిపాను కూడ. అప్పుడల్లా, ఈ లోకానికి చెందిన మామూలు నల్లటి ఏనుగు మీద వెళుతున్నట్లనిపించేది కాదు. సాక్షాత్తు దేవలోకపు శ్వేతవాహనమైన ఐరావతంమీదే వెళుతున్నట్లు తోచేది. మీరే దేవేంద్రులని, నేను ఇంద్రాణి అని తలచేదాన్ని..."

"అలాగైతే ఇప్పుడు..." అని పొన్నియిన్ సెల్వన్ అడ్డుపడి ముందుకు చెప్పబోయేలోపల, వాణతి అడ్డుపడి, ఇలా ముందుకు చెప్పుకొంటూ వెళ్ళింది:- "కాస్త ఓపిక పట్టండి, రాజా! దేవేంద్రుడు, ఇంద్రాణి అన్న కల్పనను వెంటనే మార్చుకొంటాను. దేవేంద్రునికి, ఇంద్రాణికి నెమ్మది ఎక్కడ? వారిద్దరూ ఏకాంతంగా ఐరావతమెక్కి ఉల్లాసప్రయాణం చేసేందుకు అవకాశమెక్కడ? దేవతలతో ఎప్పుడూ కొలువుతీరి ఉండాలి కద? కాబట్టి ఆ ఉద్దేశాన్ని వెంటనే మార్చుకొంటున్నాను. రాజవంశంలో పుట్టక, సముద్రతీరాన జీవించే పడవ నడిపేవారి కులంలో పుట్టివుండకూడదా అని అనుకొంటాను..."

"తెలుస్తూంది, వాణతీ! నాకు బాగ అర్థమవుతూంది! నీవు పూంగుళలిని చూసి అసూయపడుతున్నావు!"

'అవును, అది నిజమే! ఈ లోకంలో నేను ఒక్క పూంగుళలిదేవిని చూసి మాత్రమే అసూయపడుతున్నాను. ఆమె మనోరథం నెరవేరింది. ఆమె, ఆమె ప్రేమికుడు కోడిక్కరైకి వెళ్ళి అలల కడలిలో పడవ నడుపుతూ, విష్ణువు ఆలయంలో కైంకర్యం చేస్తూ ఆనందంగా జీవించబోతున్నారు. వారెందుకు నన్ను చూసి నవ్వరు? తప్పక నవ్వుతారు. అయ్యా! ఇంకేవిధంగానైనా నన్ను శిక్షించండి. కానీ పూంగుళలిదేవి నన్ను చూసి నవ్వేటట్లు మాత్రం చేయకండి..."

క్రితం రాత్రి జరిగినదాన్ని గుర్తుపెట్టుకొని, పొన్నియిన్ సెల్వన్ ఇలా అన్నారు:- "వాణతీ! కాస్త ఓర్చుకో! నిన్న పూంగుళలి నిన్ను చూసి నవ్వింది కద? ఆమెను చూసి నవ్వే కాలం వస్తుంది!"

"స్వామీ! నేను పూంగుళలిదేవిని చూసి నవ్వాలని కోరుకోవడంలేదు; ఇంకెవరిని చూసి కూడ నవ్వాలని కోరుకోవడం లేదు. ఎవరైన నన్ను చూసి నవ్వితే నవ్వుకోనీ. మీ దివ్యవదనంలో కొన్నిక్షణాలైన చిరునవ్వు విరిస్తే అది చూడాలనే ఆశపడుతున్నాను. తక్కినవారు చూసేటప్పుడు, మాట్లాడేటప్పుడు మీ ముఖం విప్పారివుంది. నన్ను చూసేటప్పుడు మాత్రం తమ భృకుటి ముడిపడుతోంది. ఇప్పుడు మిమ్మల్ని చూసేందుకే నాకు భయంగా ఉంది..."

"వాణతీ! ఇది విను. నిన్ను చూసినప్పుడు నా ముఖం కుంచించుకుపోవడానికి కారణం ఉంది. తక్కినవారివల్ల నాకెటువంటి ఇబ్బందీ లేదు; వారి వల్ల నేను నా మనశ్శాంతిని పోగుట్టుకోవడం లేదు. నీ వల్ల నా మనసు నెమ్మది పోగొట్టుకొంటూంది. నిన్న రాత్రి నీవు నిద్రపోలేదని నా అక్కగారు చెప్పారు. నేను కూడ నిద్రించలేదు, వాణతీ! చాలరోజులుగానే నేను నిద్రపోలేకపోతున్నాను. అంతఃపురం పైమేడలో పడుకొని ఆకాశంలోని నక్షత్రాలను చూస్తే, నీ కనులీనే కాంతులనే ఆ చుక్కలు గుర్తుచేస్తున్నాయి. తోటల్లోని

చెట్లు గాలికి కదిలి వాటి ఆకులు గలగల శబ్దం చేసినప్పుడు, నీవు నీ ఇంపైన గొంతుతో నవ్వే శబ్దమే వినిపిస్తూంది నాకు. మృదువైన మలయమారుతం నా ఒంటిని తాకినప్పుడల్లా, నీవు నీ మృదువైన వేళ్ళతో నన్ను తాకుతున్నట్లే అనిపించి పరవశించిపోతున్నాను. వాణతీ! ఇలా నీ జ్ఞాపకాలు నన్ను వేధిస్తుండగా, నిన్ను ప్రత్యక్షంగా చూసినప్పుడు నా ముఖం కుంచించుకుపోతూంది; భృకుటి ముడివడుతూంది. నేను నా జీవితంలో సాధించగోరే కార్యాలన్నిటికీ నీవే అడ్డం వస్తావని జంకుతున్నాను...."

"స్వామీ! ఆ భయం మీకు వద్దు! మీ కార్యాలకు నేనడ్డురాను...."

"నీవడ్డుగా ఉండవు; ఎవరూ అడ్డురాలేరు! వర్షాకాలంలో దక్షిణదిశనుంచి సుడిగాలి కొట్టుకొచ్చే కారుమేఘాలను నీవు చూశావా, వాణతీ! ఆ మేఘాలు వర్షజలంతో నిండివుంటాయి. మెరుపులు, పిడుగులు ఆ మేఘాల్లో దాక్కొనివుంటాయి. చండమారుతం ఆ వర్షజలం నిండిన మేఘాలను కొట్టుకొస్తుంది. దాన్ని ఎవరైన అడ్డుకొని ఆపగలరా? ఆ మేఘాల స్థితిలో నేనున్నాను. వాణతీ! నా దేహంలో ఎప్పుడూ ఒక ఉద్రిక్తత ప్రవహిస్తూంటుంది. నా మనసు ఏదో ఒక ఉద్విగ్నతతో రెపరెప కొట్టుకొంటూంది. కంటికి తెలియని మెరుపులు మెరుస్తున్నాయి; చెవికి వినిపించని పిడుగుల శబ్దం వినిపిస్తూంది. ఏడు సముద్రాల్లోను కొండేత్తు అలలు లేచి నన్ను ఆహ్వానిస్తున్నాయి. వేవేల శంఖనాదాలు, భేరీల దిక్కులు పిక్కటిల్లే మోతలు, యుద్ధగజాల ఘీంకారాలు, నన్ను చుట్టుముట్టి లాగుతున్నాయి. నన్నెవరూ ఆపలేరు. వాణతీ! అడ్డుకోజూసి, నాకు మనశ్శాంతి లేకుండ చేయవద్దు..."

"స్వామీ! నేనలా ఏనాడూ చేయను; ఆటంకం కలిగించను కూడ. ముల్లోకాలను ఏలేందుకు పుట్టిన మీకు సహాయం చేయలేకపోయినా, ఆటంకం కలిగించను. అందుకే మీ పక్కన చోళసింహాసనం మీద కూర్చోవడానికి ఒప్పుకోనంటున్నాను."

"వాణతీ! చోళసింహాసనం మహిమలో పెద్దదైనా, కొలతలో చిన్నది. దాని మీద ఒక్కరే ఆసీనులు కాగలరు. చక్రవర్తి సింహాసనం పక్కన ఇంకొక సింహాసనం అమర్చి, దానిమీదే చక్రవర్తిని కూర్చోవాలి."

"స్వామీ! నాకు మీరు కూర్చొనే సింహాసనంలోను చోటు వద్దు; దాని పక్కన ఇంకొక ప్రత్యేక సింహాసనం మీదనూ వద్దు. తమ పట్టమహిషిగా విరాజిల్లేందుకు నేనా భాగ్యం పొందాలి. మీ మనసనే సింహాసనంలో కాస్త చోటు దొరికితే, అదే నేను ఏడేడు జన్మలు చేసిన తపస్సు ఫలితం అని ఎంచి సంతోషిస్తాను!"

"వాణతీ! నేను సులభంగా ఇవ్వగలిగేదాన్ని కోరావు. నా మనోసింహాసనంలో నీవిప్పటికే చోటు సంపాదించేసుకొన్నావు! దాన్ని నేను నీకివ్వడంలో ఏవిధమైన ఆటంకమూ లేదు! నీవు ఈ మహాచోళసామ్రాజ్యానికి చక్రవర్తినిగా కావాలని నిజంగానే కోరుకోవడం లేదా, వాణతీ?"

"ఆ ఆశ నాకు కించిత్తు కూడ లేదు! చోళకులపు పురాతన మణిమకుటాలను నేను చూశాను;

చేతిలో తీసుకొని చూశాను కూడ. వాటిలో ఒకదాన్ని నా శిరస్సున ధరిస్తే, దాని భారం నా తల, గొంతును నొక్కేసి ఊపిరాడకుండ చేసేస్తుందని భయపడుతున్నాను. అంతటి బలం నా ఒంట్లోను లేదు; అంతటి ధైర్యం నా మనసులోను లేదు. అంతటి బలం, ధైర్యం ఉన్నవారు దాన్ని ధరించనీ. మీరు సముద్రాలకవతల ఉన్న దేశాలకు ప్రయాణించే ముందు. నాకు ఇంకొక బహుమతినిచ్చి వెళ్ళండి. అంతఃపురం తోటలోనుంచి అందమైన పూలను కోసి మాల కట్టిస్తాను. నేను సులభంగా మోయగల ఆ మాలను నా మెడలో వేసి, నన్ను మీ దాసిగా స్వీకరించి బయలుదేరండి...!"

"చైనా వర్తకులనుంచి నవరత్నమాలను నీకు పట్టాభిషేక బహుమానంగా తీసుకొచ్చాను..."

"మీ పట్టాభిషేకానికి నాకెందుకు బహుమానం?"

'సరే, వద్దు! దాన్ని ఇంకెవరికైనా ఇచ్చేస్తాను, వాణతీ! నీవూ, నేనూ ఒక ఒప్పందం చేసుకొందాం. నేను బయలుదేరేముందు, నీ కోరిక ప్రకారం నీ మెడలో పూమాలను వేసి, బయలుదేరుతాను. నేను వేసే పెళ్ళిమాలకు బదులుగా, నేను ప్రతిసారి విదేశాలనుంచి తిరిగి వచ్చినప్పుడు, నీవు ఒక్కొక్క పూమాలతో వేచివుండాలి. సముద్రాలు దాటి దూరదేశాల్లో పులిజెండా ఎగురవేసి, విజయభేరి మోగించి తిరిగి వచ్చినప్పుడల్లా నీవు ఒక విజయమాలతో నాకోసం వేచివుండాలి!" అన్నారు యువరాజు.

"ఒక మాలేమి? వంద మాలలు కట్టివుంచి, మీకోసం అభిసారికగా ఎదురుచూస్తుంటాను. ఈ దేశప్రజలందరూ వేచివుంటారు!" అన్నది వాణతి.

~~~
~~~

# అధ్యాయము - 87

## కవివర్యుల ఆశ్చర్యం

**అరుళ్మొళివర్మ** పట్టాభిషేకోత్సవం దగ్గరపడగా, చోళనాడంతా చాల కోలాహలమయం కాసాగింది. అరుళ్మొళివర్మకు స్వర్ణమకుటం పెట్టడం గురించి చోళనాడులో భేదాభిప్రాయాలే వినరాలేదు. స్త్రీపురుషులు, వయోవృద్ధులు, చిన్నపిల్లలు, నగర ప్రముఖులు, వర్తకులు, రైతులు - అందరూ పొన్నియిన్ సెల్వన్ పట్టాభిషేకాన్ని ఏకాభిప్రాయంతో, కుతూహలంతో ఎదురుచూడసాగారు. ఆయన పుట్టిన వేళ గురించి, ఆయన ముఖంలోని కళ గురించి, ఆయన సుగుణాల గురించి, ప్రజలతో ఆయన కలుపుగోలుగా నడుచుకోవడం గురించి అందరూ మళ్ళీ మళ్ళీ చెప్పుకొని మురిసిపోయారు.

రామునికి పట్టాభిషేకం చేయడమని దశరథుడు తీర్మానించగానే అయోధ్య ప్రజలందరూ ఎంతగా సంతసించారో మనకు రామాయణం చాల విశదంగా చెబుతూంది.

వయసు మళ్ళిన స్త్రీమణులందరూ కౌసల్యలాగ మురిసిపోయారు. తమ తమ కుమారులకే పట్టాభిషేకం జరగబోతున్నట్లు సంతోషించారు. పడుచుపిల్లలందరూ సీతాదేవి పొందిన ఆనందాన్ని తాము కూడ అనుభూతి చెంది, తమ తమ భర్తలకే పట్టం కట్టబోతున్నట్లు భావించి తమను వస్త్రాభరణాలతో అలంకరించుకొన్నారు. చోళనాడులో నివసిస్తున్న వయోవృద్ధులైన పురుషులందరూ దశరథుడిలాగ మురిసిపోయారు.

<< అయోధ్యప్రజల ఆనందమయస్థితిని వర్ణిస్తూ కంబన్ రచించిన ఒక పద్యం >>

అలా అయోధ్యప్రజల ప్రేమాభిమానాలను, నమ్మకాన్ని చూరగొనడానికి రాముడింతవరకు ఏ ఘనకార్యమూ చేయలేదు కద? ఆయన కోదండమహిమంతా పిదపకాలంలోనే కద లోకానికి తెలియవచ్చింది? రావణుడు మొదలైన రాక్షసులను వధించి ముల్లోకాలను రాక్షసుల బారినుంచి కాపాడిన గొప్పతనం ఆ తర్వాత కద ఆయనకు చేరింది? విశ్వామిత్రమహర్షితో వెళ్ళి ఆయన యాగం నిర్విఘ్నంగా జరిగేటట్లు చేసి వచ్చాడుగాని ఆ విషయం అయోధ్యలో ఎవరికి తెలియవచ్చింది? ఆ మహర్షి తిరిగి వచ్చి అయోధ్యలో ఆ విషయాన్ని తెలియజేయలేదు కద?

ఈ లోకంలో కొందరు స్వాభావికంగానే వీరకృత్యాలను, పరోపకార కార్యాలను చేసి ప్రజల మనసు చూరగొంటున్నారు. ఇంకొందరు తమ గాన, నిత్య కళానైపుణ్యాలను ప్రదర్శించి, అద్భుతమైన కవితలు రచించి, అపూర్వ చిత్ర శిల్పకళాఖండాలను సృష్టించి ప్రజల మెప్పుకు, స్తుతికి పాత్రులవుతున్నారు. మరికొందరు పుట్టుకతోనే కీర్తిప్రతిష్ఠలతో పుడుతున్నారు. ఇదీ అని చెప్పగల ఏ కారణమూ లేకనే చూసేవారి మనస్సులను చూరగొనే శక్తిని ప్రకృతిమాత వారికి ప్రసాదిస్తుంది. ఆహా!

ప్రకృతిమాత చాల పక్షపాతి కాబోలు! కానీ దాని నిగూఢార్థమేమని మనకు తెలియదు కద? ప్రకృతిమాత అటువంటి శక్తిని వారికొసగేటప్పుడు దానికి తగ్గట్లు ఇంకే ప్రతికూలమైన అంశాలను ఇస్తూందో, మనకు తెలియదు కద?

అంతగా అయోధ్య ప్రజల అభిమానాన్ని చూరగొన్న రాముడు లోకంలో ఎవరూ అనుభవించని కష్టసుఖాలను అనుభవించవలసి వచ్చింది కద? దేశం వదిలి, అడవికి వెళ్ళి, తన ప్రియపత్నిని కోల్పోయి, చెప్పనలవిగాని మనోవేదనను అనుభవించవలసి వచ్చింది కద?

~

అరుళ్మొళివర్మ ప్రకృతిమాత పక్షపాతప్రేమకు పాత్రులైనవారు. ఆయన రూపమే ఆయనను చూసినవారందరి మనసులను వశీకరించేది. ఆయన ఇంపైన మాటలు, ఆయనతో కలిసిమెలిసి మసలినవారందరి ప్రేమాభిమానాలను చూరగొన్నాయి. లంకలో యుద్ధరంగానికి ఆయన వెళ్ళినప్పుడు అంతగా ధీరవీరకృత్యాలు చేయడానికి అవకాశాలు దొరకలేదుగాని ఆయన వీరప్రతాపాల గురించి కథనాలు చోళనాడంతా విస్తరించాయి. మనం ఒకరిమీద ప్రేమగొన్నప్పుడు వారిని గురించిన ఎంతటి ఉత్ప్రేక్షపూరితమైన పొగడ్తలను కూడ సులభంగా నమ్మేస్తాం కద?

సుందరచోళ చక్రవర్తి జబ్బుపడి, నడిచేందుకు కూడ శక్తి కోల్పోయినప్పటినుంచి, రాజ్యహక్కు గురించిన సంక్షోభాలు చోళనాడులో ఏర్పడుతాయని ప్రజలు దిగులుపడసాగారు. పళువేట్టరయ్యర్, శంబువరయ్యర్ మొదలైన చిన్న/సామంతరాజులు సుందరచోళ చక్రవర్తి కుమారులకు విరుద్ధంగా గండరాదిత్యుల కుమారునికి పట్టం కట్టేందుకు కుట్ర పన్నారన్న వదంతి కూడ వ్యాపించింది.

గండరాదిత్యుల కుమారుడైన మధురాంతకునికి విరుద్ధంగా చెప్పేందుకు ప్రజల వద్ద ఏమీ లేదు. కానీ అతడు ప్రజల మధ్య కలుపుగోలుగా మసలుకొన్నది కూడ లేదు. తండ్రిలాగ లౌకిక జీవితం మీద విరక్తిగొని శివభక్తిలో మునిగివున్నాడని మాత్రం తెలుసు ప్రజలకు. విజలాయల చోళుల కాలంనుంచి చోళరాజ్యం పెరిగి విస్తరిస్తుండడాన్ని, వర్తక వాణిజ్యాలు పెంపొంది చోళసైన్యాలు గెలిచిన దేశాలనుంచి సిరిసంపదలు చోళనాడుకు వచ్చి గుట్టలు పడుతుండడాన్ని చూసి గర్వించి ఆనందిస్తున్న ప్రజలు చోళరాజ్యం ఇంకా పెరిగి విస్తరిల్లాలని, అత్యున్నత స్థితికి చేరుకోవాలని ఆశించారు. శివభక్తిలో పూర్తిగా మునిగిపోయిన మధురాంతకులు సింహాసనమెక్కితే చోళరాజ్యప్రగతి కుంటుపడదా అని సందేహంగొన్నారు. అదీగాక, మధురాంతకులకు పట్టం కడితే, చిన్న/సామంతరాజులు పెట్టిందే చట్టమవుతుందని ప్రజలు భయపడ్డారు.

ఆదిత్య కరికాలన్ గురించి ఆయన వీరాధివీరులన్న గొప్పభావం ప్రజల్లో ఉన్నాకూడ ఆయన సింహాసనమెక్కడం గురించి అంతగా ఉత్సాహపడడానికి తావుండేది కాదు; ఆయన వద్ద ప్రజలను వశీకరించుకొనే ఇంపైన స్వభావం లేదు. అందరితో సరళంగా, కలుపుగోలుగా మసలుకోవడం లేదు.

ఇదిగాక, ఆయన గురించి నిగూఢమైన, మర్మభూయిష్టమైన పలు వదంతులు చోళనాడంతా వ్యాపించాయి. ఆయన ఏదో పెద్ద నేరం చేసేశారని, అయన మనస్సాక్షే ఆయనను అందు గురించి వేధిస్తూందని, అందుకే తండ్రి సుందరచోళుల అభిమానాన్ని కోల్పోయారని వదంతులు లేచాయి. ఇంకా పలువిధాలైన కట్టుకథలు కూడ అల్లబడ్డాయి. కాబట్టి ఆయన అకాలమరణం చెందినప్పుడు ఒక మహావీరునికి తగిన మర్యాదలను ప్రజలు చేసినా కూడ అధికంగా దుఃఖపడలేదు. తోకచుక్క మీద నేరం మోపేసి ఒకింత వరకు మనసును సమాధానపరుచుకొన్నారు.

~

పెద్ద పళువేట్టరయ్యర్ మరణం, అది జరిగిన అసాధారణ విధం ప్రజల మనసుల్లో ఒక కొత్త విధమైన అభిమానాన్ని, గౌరవాన్ని పుట్టించాయి. ఆ వృద్ధవీరులు వయసు మళ్ళిన కాలంలో పెళ్ళాడిన మాయమోహిని నిజానికి పాండ్యరాజు ఆపత్కాల సహాయకుల కూటమికి చెందినదని, ఆమె పురిగొల్పడం వల్లనే ఆయన మనసు చెడిపోయిందని, ఆదిత్య కరికాలన్ అకాలమరణానికి పాండ్యరాజు ఆపత్కాల సహాయకులే కారణమని నిజం తెలుసుకోగానే పెద్ద పళువేట్టరయ్యర్ తాము చేసిన తప్పుకు ప్రాయశ్చిత్తంగా తమను తామే బలిచ్చుకొన్నారన్న వార్త వ్యాపించిన తర్వాత, ప్రజలు, 'అయ్యో! పాపం!' అని వాపోయారు. ఆయన చనిపోక ముందు, 'మధురాంతకునికి పట్టం కట్టే ఆలోచనను విడిచి పెట్టండి. పొన్నియిన్ సెల్వన్‌కే పట్టం కట్టండి!" అని తక్కిన సామంతరాజులను ఆజ్ఞాపించి మరీ వెళ్ళారన్న విషయం కూడ ప్రజలకు ఆయనంటే కొత్తగా పుట్టిన గౌరవాన్ని అధికం చేసింది. ప్రజల మనసులో ఉన్న కోరిక నెరవేరేందుకు ఒక పెద్ద అడ్డంకిని తొలగించి కద ఆ మహావీరవృద్ధులు ప్రాణత్యాగం చేశారు? ఆయన జ్ఞాపకం చిరకాలం ఉండనీ! - ఇలా ప్రజలు కృతజ్ఞతాభావంతో ఆయన గురించి పొగడుతూ మాట్లాడుకొన్నారు.

మధురాంతకుల విషయంలో మనిషి మార్పిడి జరిగిందన్న విషయం సాధారణ ప్రజలెవరికీ తెలియనే తెలియదు. రాజ కుటుంబీకులు, వారితో దగ్గరి సంబంధమున్నవారికి తప్ప ఇంకెవరికీ ఆ విషయం తెలియదు. పాత మధురాంతకులు చాలవరకు అంతఃపురంలోనే కాలం గడిపేవారు. చాల అరుదుగా బయటకు వచ్చేవారు. ఆ సందర్భాలలో కూడ ప్రజలతో కలుపుగోలుగా మసలుకొనేవారు కారు. ఆయనకు పట్టం కట్టే మాట నడుస్తున్నప్పుడు ఆయనను మూసిన పల్లకిలో పెట్టి తీసుకొని వెళ్ళడం అలవాటుగా ఉండేది. ఆయన రూపురేఖలను గమనించేందుకు సాధారణ ప్రజలకు అవకాశం దొరికేది కాదు. కాబట్టి పాత మధురాంతకులు పోయి, కొత్త మధురాంతకులు వచ్చిన విషయం చాలమంది ప్రజలకు తెలియనే లేదు.

కాబట్టి తిరువైయారు తిరువాదిరై ఉత్సవంలో కొత్త మధురాంతకులను చూసినవారెవరూ మనిషి మార్పిడిని కనిపెట్టలేకపోయారు. ఆయన భార్య పూంగుళలి మాత్రం కొందరి ఆసక్తిని చూరగొన్నది. ఆమె 'చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తె' అని కొందరనగా, మరి కొందరు దాన్ని ఖండించారు. సముద్రంలో

పడవ నడిపిన పిల్ల ఈమె అని, మధురాంతకులు ఇటీవలే ఆమెను పెళ్ళాడారని చెప్పారు.

రాజ కుటుంబీకులు, సామంతరాజులు బహువివాహాలు చేసుకోవడం ఆ కాలంలో పరిపాటి కాబట్టి ప్రజలు అందు గురించి అంతగా ఆశ్చర్యపడలేదు. చిన్న/సామంతరాజులు పురిగొల్పినా కూడ మధురాంతక దేవరు తమకు పట్టం వద్దని చెప్పేశారన్న విషయం ప్రజలకు ఆయనమీదున్న గౌరవాన్ని పదిరెట్లు పెంచింది. శివభక్తిలో మునిగి పారవశ్యస్థితిని చేరుకొన్న ఆయనను చూసి ప్రజలకు ఆయనమీదున్న గౌరవం ఇంకా పెరిగింది. 'పడవ నడిపే అమ్మాయి పూంగుళలికే ప్రాధాన్యమిచ్చి సింహాసనాన్ని తిరస్కరించారట' అన్న మాట ఆయన ఇంకా పలువురి అభిమానాన్ని చూరగొనడానకి కారణమైంది. పొన్నియిన్ సెల్వన్‌కి పట్టాభిషేకం కాగానే మధురాంతకులకు ఏదైన పెద్ద పదవి ఇస్తారని కూడ ప్రజలు మాట్లాడుకోసాగారు.

~

పట్టాభిషేక మహోత్సవానికి రెండు రోజులకు మునుపే చోళదేశపు నలుదిక్కులనుంచి ప్రజలు తంజావూరుకు రానారంభించేశారు. తంజావూరు కోట బయట మహాజనసముద్రమే తోచింది. కోట వాకిలి తలుపులు తెరచిపేయబడ్డాయి. కోట లోపలికి వెళ్ళడానికి, బయటకు రావడానికి మునుపుండే నిబంధనలు తొలగించిపేయబడ్డాయి.

పట్టాభిషేక ముహూర్తాన్ని ఇంకా ముందుకు దాటపేస్తే ప్రజలను కట్టడి చేయడం చాల కష్టమవుతుందని పుష్యమాసం మొదటే ముహూర్తదినం పెట్టారు. ఇంకా ప్రజల సౌకర్యం కోసం చాల ఏర్పాట్లు చేయబడ్డాయి.

కొడుంబాళూర్ వేళార్ తమ దక్షిణసైన్యంలో అతి పెద్ద భాగాన్ని పొన్నియిన్ సెల్వన్ ఆజ్ఞ మేరకు వెనక్కి పంపేశారు. తమతో ఒక్క వేయిమంది వీరులను మాత్రమే దగ్గర పెట్టుకొన్నారు. అలాగే పళువేట్టరయ్యర్ పక్షానికి చెందిన చిన్న/సామంతరాజులు కుడందై సమీపాన తీసుకొని వచ్చి నిలిపిన సైన్యవీరులను కూడ వారివారి స్వస్థలాలకు పంపేశారు. చిన్న పళువేట్టరయ్యర్ కోట కాపలా కోసం మామూలుగా నియమించే కాపలావీరులు మాత్రమే ఇప్పుడున్నారు.

పళువూర్ వీరులు, కొడుంబాళూర్ వీరులు, వేళక్కార దండు వీరులు తమ తమ పాత వైరాలను, మాత్సర్యాలను మరచి ఒకరినొకరు ప్రేమతో హత్తుకొని, సరదాగా ఒకరితోనొకరు పరాచికాలాడుతూ కుతూహలంతో, ఉత్సాహంతో అటూ ఇటూ తిరుగాడసాగారు. పట్టాభిషేక మహోత్సవాన్ని చూసేందుకు తండోపతండాలుగా వచ్చి చేరుతున్న ప్రజలకు వారు తమ చేతనైనంతవరకు సహాయం చేయసాగారు. ఒక్కోసారి ఆ వీరులు కోతిచేష్టలు చేసినా ప్రజలు పట్టించుకోలేదు.

తంజావూరు కోట లోపల, బయట నగరం దేవేంద్రుని అమరావతి నగరంలాగ అలంకరించబడి దేదీప్యమానంగా వెలిగింది. తంజావూరు నగరంలోని ప్రతి ఇంటా అతిథులు దిగారు.

చివరిగా, పట్టాభిషేకం నాడు సూర్యోదయమైంది. ఉదయించేటప్పుడే తన స్వర్ణకిరణాలను పరుస్తూ ఉదయించిన సూర్యభగవానుని చూసిన ప్రజలందరూ, 'ఈ రోజు పొన్నియిన్ సెల్వన్ పట్టాభిషేకం కద? అందుకే సూర్యుడు కూడ బంగారు కిరణాలను సారిస్తూ వెలిగిపోతున్నాడు!' అని చెప్పుకొని మురిసిపోయారు.

మకుటాభిషేకానికి సూచించిన ఘడియ రావడానికి ఇంకా చాలసేపుండగానే పట్టాభిషేక మంటపం వాకిట ప్రజలు సమావేశం కాసాగారు. మంటపం లోపల సాధారణప్రజలందరికీ కావలసినంత స్థలం ఉండదు కద? ఆ వైభవం జరిగిన తర్వాత పొన్నియిన్ సెల్వన్ మంటపం నుంచి బయటకు వచ్చి పట్టపుటేనుగు మీద ఊరేగింపు వచ్చేటప్పుడే ప్రజలందరూ ఆయనను చూసి ఆనందించగలరు. దాని కోసం ఆ సమయానికి అక్కడికి వచ్చి చేరడం సాధ్యమా? అందుకు ముందస్తుగా వస్తే, పొన్నియిన్ సెల్వన్ బంగారు కిరీటం ధరించి బయటకు వచ్చేటప్పుడే ఆయనను చూడవచ్చు కద?

~

పట్టాభిషేక మంటపానికి అంతఃపురానికి చెందినవారు రావడానికి ప్రత్యేకంగా ఇంకొక దారి ఏర్పాటు చేశారు. ఆ దారి గుండా వాణమహాదేవి, సుందరచోళ చక్రవర్తి, వారి వెంబడి శెంబియన్ మహాదేవి, మధురాంతకులు, పూంగుళలి, కుందవై రాకుమారి, వాణతి మొదలైనవారు వచ్చి ఆసీనులైనారు. ముఖ్యమంత్రి అనిరుద్ధులు, చిన్న పళువేట్టరయ్యర్, శంబువరయ్యర్, సేనాధిపతి బూది విక్రమకేసరి, మలైయమాన్, తక్కిన సామంతరాజులు, వర్తక వర్గనాయకులు, పెద్ద పెద్ద అధికారులు, శివాచార్యులు, విష్ణుభట్టులు, తమిళభాషాకవులు మొదలైనవారు మంటపం వాకిట గుమిగూడిన ప్రజల మధ్యనుంచి దారి చేసుకొని వచ్చి చేరారు. చివరిగా పొన్నియిన్ సెల్వన్, వంతిదేవుడు తామరపూవులాగ నిర్మించబడ్డ స్వర్ణరధంలో ఆసీనులై మకుటాభిషేక మంటపానికి వచ్చి చేరినప్పుడు నిండు పున్నమిని చూసిన అలల కడలిలాగ జనసముద్రపు జయఘోషతో దిక్కులు మారుమోగాయి.

~

మకుటాభిషేకానికి చేయవలసిన వైదికకార్యాలన్నీ నిర్వహించబడ్డాయి. చోళకులపు రాజులు వంశపారంపర్యంగా పట్టాభిషేకం రోజు శిరస్సున ధరించే మణిమకుటం, కంఠాన ధరించే నవరత్నమాల, నడుమున ధరించే ఖడ్గం, చేతపట్టుకొనే రాజదండం మొదలైనవాటిని ఒక పెద్ద బంగారు పళ్ళెంలో పెట్టి, సభలోని పెద్దల ముందుకు తీసుకొని వెళ్ళారు. వారందరూ ఆ పళ్ళాన్ని తాకి ఆశీర్వదించారు. తర్వాత ఆస్థాన కవులైన నల్లన్ సాత్తనార్ లేచి నిలబడ్డారు. ఆయన వెనుక చేత యాళ్ (వీణలాంటి వాద్యం) పట్టుకొన్న ఒక వనిత దాన్ని వాయిస్తూ మధుర సంగీతాన్ని వినిపించింది.

ఆస్థాన కవి చోళకులపు కీర్తిప్రతిష్టలను, గొప్పతనాన్ని, ఆ కులంలో పరంపరగా వచ్చిన వీరాధివీరులైన రాజుల వృత్తాంతాలను సంగీతసమేతంగా మధుర కవిత్వంగా పాడారు. ఆ పాట చాల

దీర్ఘమైనది కావడం వల్లను, ఈ కాలంవారు సులభంగా అర్థం చేసుకోలేనిదిగా ఉండడం వల్లను దాని సారాంశాన్ని మాత్రం క్లుప్తంగా ఇక్కడ సూచిస్తున్నాము:-

"సూర్యవంశంలో ఉదయించిన మనుచక్రవర్తి కాలంలో శిబి అనే రారాజు ఉండేవాడు. ఆయన ఒక పావురానికిచ్చిన మాట నిలబెట్టి దాని ప్రాణాలను కాపాడేందుకు తన శరీరం నుంచి కండను కోసిచ్చాడు. అటువంటి శిబివంశంలో పుట్టినవారు 'శెంబియన్' అన్న కులం పేరు పెట్టుకొని గర్వపడ్డారు. శెంబియన్ కాలంలో రాజకేసరి అనే ఒక మహారాజు ఉదయించాడు. అతని కుమారుడు 'పరకేసరి' అన్న బిరుదును పొందాడు. వీరి తర్వాత ఉదయించిన రాజులు 'కోరాజకేసరి', 'కోప్పరకేసరి' అని మార్చి మార్చి బిరుదులు పొందారు. ఒక ఆవుకు న్యాయం చేసేందుకు తన ప్రియపుత్రునే బలిచ్చిన రాజు 'మనునీతి చోళుడు' అన్న పేరు పొందాడు. ఇతని తర్వాతి కాలంలో పూంపుహార్ నగరంలో 'కరికాల్ పెరువళత్తాన్' అన్న రాజు ముల్లోకాలలోను తన కీర్తిని వ్యాపింపజేసి విరాజిల్లాడు. అతడు చోళ మహాసైన్యంతో ఉత్తరాన హిమాలయాలవరకు దండెత్తి వెళ్ళి, మంచుతో కప్పబడ్డ ఆ హిమవన్నగ శిఖరాన చోళరాజ్య చిహ్నమైన పులిజెండాను నాటాడు. ఇతని వంశంలో నలంకిళ్ళి, నెడుంకిళ్ళి, పెరుంకిళ్ళి, కిళ్ళివళవన్, 'కుళమట్రత్తు తుంజియ (=మరణించిన) కిళ్ళివళవన్', శివభక్త శిఖామణియైన కోప్పెరుంచోళన్ మొదలైనవారు ఈ పురాతన కులానికి కీర్తిని, గొప్పపేరును తెచ్చి పరమపదించారు.

"లోకానికంతా వెలుగునిచ్చే సూర్యభగవానుని కూడ వర్షాకాలంలో మేఘాలు మరుగుపరిచేలాగ, సూర్యవంశపరంపరలో వచ్చిన చోళకులాన్ని కొంతకాలంపాటు పల్లవ – పాండ్య శత్రుమేఘాలు మరుగుపరిచాయి. మేఘాలను చెదరగొట్టడానికి వజ్రాయుధాన్ని చేతబూనిన ఇంద్రునికి సాటిగా/దీటుగా విజయాలయ చోళులు ఉదయించారు. ఆ చోళకుల వ్యాఘ్రాన్ని చూడగానే 'పెరుంపిడుగు' ముత్తరయ్యర్ అనే వలన్ భీతిగొని మరణించింది. ఆ తర్వాత ఆ మహావీరుడు తంజావూరు నగరాన్ని కైవసం చేసుకొని అక్కడ దుర్గాపరమేశ్వరి ఆలయాన్ని కట్టించాడు. పల్లవులు, పాండ్యులు, ఇంకా చాలమంది రాజులు ఆ విజయాలయ చోళుని స్నేహం కోరి పంపిన దూతలు ఆయన అంతఃపురం ముందు వేచివుండేవారు. అలా సహాయం కోరి వచ్చిన రాజులకు అభయమిచ్చి సహాయం చేసేందుకై విజయాలయ చోళులు పలుయుద్ధాలలో పోరాడి తమ శరీరాన తొంబైయారు గాయాలను భరించారు. ఆయన కుమారులైన ఆదిత్య చోళులు శత్రుసైన్యాలను చెదరగొట్టే మరొక సూర్యుడనే చెప్పాలి. తిరుప్పురంపయం యుద్ధంలో పల్లవరాజు అపరాజితుడు పాండ్యరాజు చేత పరాజయం పొందబోయే తరుణంలో, ఆదిత్య చోళులు కుందేళ్ళ గుంపులో పులి దూరినట్లు దూరి, పాండ్యసైన్యాన్ని ఛిన్నాభిన్నం చేశారు. తాము చేసిన సహాయన్ని మరిచి, మిత్రద్రోహం చేసిన పల్లవునికి బుద్ధి చెప్పేందుకు తొండైమండలం మీద దండెత్తివెళ్ళి అపరాజితుని, అతడెక్కివున్న ఏనుగు మీదికి దూకి వీరస్వర్గానికి పంపించారు. తమ పూర్వీకులు పాటిస్తూ వచ్చిన సంప్రదాయం ప్రకారం కావేరినది పుట్టే శైవ (?) పర్వతం నుంచి పూంపుహార్ నగరం వరకు

ఎనభైరెండు శివాలయాలను కట్టించారు. ఆదిత్య చోళుల కుమారులైన పరాంతక చోళులు పుట్టేటప్పుడే తమ రెండు భుజాలమీద విజయలక్ష్మితోను, వీరలక్ష్మితోను పుట్టారు. వెళ్ళూరు (ఇప్పటి వేలూర్?)లో పాండ్యుని పారద్రోలిన ఆ రాజు, మదురైని, లంకను జయించి కైవసం చేసుకోవడమేగాక చేరనాడు సైన్యాలకు సింహస్వపనమైనారు. ఉత్తరాన తుంగభద్రనదికవతల ఉన్న చాళుక్యులు, వేంగి మండల రాజులు పరాంతక చోళుల పేరు విని కలలో సింహాన్ని చూసినట్లు గడగడ వణికేవారు. ఆయన కీర్తి విని అసూయపడ్డ రెట్టైమండల రాజు కణ్ణర దేవన్ ఏడుసముద్రాలు ఏకమైనట్లు ఒక మహాసైన్యాన్ని కూడదీసుకొని పరాంతక చోళుల మీదికి దండెత్తి వచ్చాడు. పరాంతకుల మొదటి కుమారుడైన రాజాదిత్యులు కురుక్షేత్రంలాంటి తక్కోలం యుద్ధరంగంలో కణ్ణరదేవుని, మహాసముద్రంలాంటి అతడి సైన్యాన్ని ఛిన్నాభిన్నం చేసి తుడిచిపెట్టిన తర్వాత ఏనుగు మీద మరణించి వీరస్వర్గం చేరారు. పరాంతక చోళులు తిల్లై చిదంబరం నటరాజస్వామి ఆలయంలో స్వర్ణమంటపం కట్టిన తర్వాత ఆ స్వామి పాదాలను చేరుకొన్నారు! ఆయన కుమారుడు శివజ్ఞాన సంపన్నులు గండరాదిత్యులు శివాలయ కైంకర్యంలో నిమగ్నమై శివపదాన్ని చేరుకొన్నారు. ఆయన కాలంలో తొండైమండలాన్ని పగవారి అధీనం నుంచి విడిపించి శీతపులినాడు వరకు పులిజెండాను ఎగురవేసిన అరింజయులు కూడ తమ అన్నగారినుంచి వేర్పడి ఎక్కువకాలం ఉండలేక ఆకాశలోకానికి పయనమై వెళ్ళారు. ఆయన కుమారులైన సుందరచోళ చక్రవర్తి తర్వాత చోళసింహాసనాన్ని అధిష్టించారు. తాను దాక్కొనివున్న బొరియ నుంచి తలను బయటకు చాచిన పాండ్యరాజు మీదికి దూకి మళ్ళీ బొరియలో దాక్కొనేటట్లు చేశారు! సుందర చోళ చక్రవర్తి శ్వేతఛత్రం నీడలో ముల్లోకాలూ ఏ మాత్రం దిగుల్లేకుండ నిర్భయంగా జీవిస్తున్నాయి.

"ఇలా వేవేల సంవత్సరాలుగా వీరోచిత కృత్యాలతో కీర్తిప్రతిష్టలుగాంచి విరాజిల్లుతున్న చోళకులంలో ఉదయించిన పొన్నియిన్ సెల్వన్‌ని ఏ మాటలతో మనం వర్ణించి కొనియాడగలం? ఆయన కీర్తిని వర్ణించ కళామతల్లే దిగివస్తే బహుశ సాధ్యం కావచ్చు. మావంటి సాధారణ కవులకది సాధ్యం కానిది..."

~

ఇలా నల్లన్ సాత్తనార్ చోళవంశ కీర్తిప్రతిష్టలను పాడి ముగించారు. ఆయన తర్వాత ఉత్తరభాషాకవులు, బౌద్ధ భిక్షువులు, వైష్ణవాచార్యులు దీవెనలు చెప్పేందుకు వేచివున్నారు. వీరిని ఎలా క్లుప్తంగా ముగించేలా చేయడమన్నది పట్టాభిషేక పురోహితులకు, ఇతర ప్రముఖులకు పెద్ద దిగులై కూర్చొంది. అలా దిగులుపడ్డవారిలో చిన్న పళువేట్టరయ్యర్ కూడ ఒకరు. ఆయన తమ స్వహస్తాలతో చోళకుల పురాతన మణిమకుటాన్ని ఎత్తి పొన్నియిన్ సెల్వన్ శిరస్సున ఉంచేందుకు ఆయత్తమై ఉన్నారు. కవులను, పండితులను ఎలా త్వరగా పాడి ముగించమని చెప్పడమా అని చూసిన చిన్న పళువేట్టరయ్యర్ సమీపాన కొత్త మనిషి ఒకడు ఉన్నట్లుండి ప్రత్యక్షమైనాడు. మంటపం ముందు వీధిలో గుమిగూడివున్న

అంతమంది ప్రజలను దాటుకొని అతడెలా ఆస్థానమంటపం లోపలికి వచ్చాడన్నది పలువురికి ఆశ్చర్యాన్ని కలిగించింది. కానీ వంతిదేవునికది ఆశ్చర్యాన్ని కలిగించలేదు. మారువేషంలో వచ్చినవాడు ఆళ్వార్ కట్టియాన్ అని గ్రహించిన వంతిదేవుడు పొన్నియిన్ సెల్వన్ వైపు చూశాడు. ఆయన కూడ ఆ సంజ్ఞను గ్రహించినట్లున్నారు.

చిన్న పళువేట్టరయ్యర్ చెవిన ఆళ్వార్ కట్టియాన్ ఏం రహస్యం ఊదాడో తెలియదు. వెంటనే ఆయన ముఖాన దిగులు, కలత, కంగారు తోచాయి. ఒక్కక్షణం జంకి, ఆ తర్వాత అతన్ని పిలుచుకొని ఆ సభామంటపంలో ఎక్కువ కూటమి లేని చోటికి వెళ్ళారు.

ఇది గమనించిన పొన్నియిన్ సెల్వన్, నల్లన్ సాత్తనార్ చోళకులం గొప్పతనాన్ని చెప్పుకొచ్చినప్పుడల్లా చేతులు జోడించి వినయంగా వింటూ వచ్చారు. ఇప్పుడా కవివర్యులను చూసి, "అయ్యా! కవీంద్రా! ఇంతవరకు మీరు చెప్పుకొచ్చిన గొప్పతనమంతా నా పూర్వీకులది కద? ఈ పురాతన, ప్రతిష్టాకరమైన సింహాసనం మీద కూర్చొని, మణిమకుటాన్ని ధరించే అర్హత పొందేందుకు ఇంతవరకు నేనేం ఘనకార్యం చేశాను? దాని గురించి చెప్పేందుకు కళామతల్లి ఇప్పుడిక్కడ ప్రత్యక్షం కావడం సాధ్యం కాదు కాబట్టి వీలైనంతవరకు మీరే చెప్పవచ్చు కద?" అన్నారు.

కవిగారు అవాక్కై నిలబడగా పొన్నియిన్ సెల్వన్, "అయ్యా! మీరు ఆశ్చర్యపడి అచేతనులు కావడం సహజమే. మీ తప్పేమీ లేదు. అలా నా కీర్తిని పాటల రూపంలో కట్టి పాడేందుకు నేనింకా ఏ ఘనకార్యమూ చేయలేదు. ఈరోజే ప్రారంభించబోతున్నాను!" అన్నారు.

~~~
~~~

# అధ్యాయము - 88

## పట్టాభిషేకం

**అరుళ్మొళివర్మ** కవిపుంగవులను చూసి ఇంకా ఇలా చెప్పారు:- “అయ్యా! మిమ్మల్ని ఇంకొక ప్రశ్న అడుగుతాను. శిబి చక్రవర్తి మొదలు గండరాదిత్యుల వరకు మా చోళకుల రాజుల కీర్తిని, పేరుప్రతిష్టలను మీరు విశదంగా తెలియజేశారు. అదంతా ఈ పురాతన కాలంలో పుట్టే భాగ్యం కలిగిన నాకు ఎంతవరకు వర్తిస్తుందో, నా పినతండ్రి, మహానుభావులు గండరాదిత్య చోళుల కుమారులైన మధురాంతక దేవరికి కూడ అన్వయిస్తుంది కద?”

కవీంద్రులు "అవును" అన్నట్లు తలాడించారు. సభలో ఉన్నవారందరి కళ్ళూ సుందరచోళ చక్రవర్తికి ఇంకొకవైపు ఒద్దికగా కూర్చొనివున్న మధురాంతకులవైపు మళ్ళాయి. ఇప్పుడే కొత్తగా చూస్తున్నట్లు నిశితంగా, పరీక్షగా చూడసాగారు. అప్పటికే చాల సంకోచంతో కూర్చొనివున్న మధురాంతక దేవరు ఇప్పుడు మరింత సంకోచంతో భూదేవిని కళ్ళార్పకుండ చూస్తూ వంచిన తలెత్తకుండ కూర్చొన్నారు.

~

దీని మధ్య మారువేషంలో వచ్చిన ఆళ్వార్ కట్టియాన్ మంటపం ఒక మూలకు అతన్ని తీసుకొని వెళ్ళిన చిన్న పళువేట్టరయ్యర్‌కి దిగులు, గాభరా కలిగించే ఒక వార్త తెలియజేశాడు. పాండ్యనాడు ఆపత్కాల సహాయకుల కూటమికి చెందినది, పడవ నడిపే మురుగయ్య n భార్య అయిన రాక్కమ్మాళ్‌ని అతడు పట్టాభిషేకానికి వచ్చిన జనకూటమిలో చూశాడు. ఆమె ఇక్కడికి ఎందుకొచ్చిందని తెలుసుకోవడానికి ఆమెను వెంబడించి వెళ్ళాడు. చిన్న పళువేట్టరయ్యర్ మాళిగ వద్ద ఆమె జనకూటమిలో దూరి మాయమైంది. ఆళ్వార్ కట్టియాన్ అక్కడే నిలబడి అటూ ఇటూ చూస్తుండగా ఆమె మళ్ళీ కనిపించింది. ఆమెతోబాటు ఇంకొక స్త్రీ చంకలో ఒక బిడ్డతో వెళ్ళింది. ఆ రెండో స్త్రీ చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తెలాగ అగుపించగానే ఆళ్వార్ కట్టియాన్ ఏం చేయాలో తోచక కాసేపు చేష్టలుడిగి నిలబడిపోయాడు. చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తె అని ఖచ్చితంగా నిశ్చయించుకోవడానికి కూడ వీలుపడలేదు. కాస్త దూరం వారిని వెంబడించి వెళ్ళి రూఢి చేసుకోవాలని వెళ్ళాడు. గుంపులో వారిని వెన్నంటి వెళ్ళడం సులభసాధ్యం కాలేదు. అతడు వారిని వెన్నంటి వస్తుండడాన్ని రాక్కమ్మాళ్ గమనించేవుండాలి. ఆమె ఉన్నట్లుండి, “అయ్యయ్యో! ఈ మనిషి మా వెంబడే వచ్చి మమ్మల్ని ఇబ్బంది పెడుతున్నాడు. ఆడవాళ్ళను వెన్నంటి వచ్చి ఇబ్బంది పెడుతున్నాడు!” అని కేకలేసింది. వెంటనే ఆ కూటమిలో ఉన్న కొందరు ముందుకొచ్చి ఆళ్వార్ కట్టియాన్ని గద్దించి అతడికి బుద్ధిచెప్పనారంభించారు. ఆళ్వార్ కట్టియాన్ వారికి తానలాగేం

చేయలేదని, వారందరిలాగే తాను కూడ మకుటాభిషేక మహోత్సవాన్ని చూడడానికి వచ్చినవాడేనని సత్యప్రమాణం చేసి చెప్పాడు. తనను చుట్టుముట్టిన జనాలను సమాధానపరిచి బయటపడేటప్పటికి, రాక్కమ్మాళ్, చంకలో బిడ్డతో ఆ రెండో స్త్రీ మాయమైపోయారు. ఆళ్వార్ కట్టియాన్ కోట వాకిలి వరకు వారిని వెతుక్కొంటూ వెళ్ళాడు. కోట వాకిలికి కాస్త దూరాన ఒక మూసిన పల్లకిలో ఆ రెండో స్త్రీ ఎక్కడాన్ని గమనించాడు. పల్లకి చుట్టూ నలుగురు అశ్వారూఢులైన వీరులు సిద్ధంగా నిలబడి ఉండడాన్ని కూడ చూశాడు. పల్లకిలో ఆమె ఎక్కి కూర్చోగానే పల్లకి, దానితోబాటు గుర్రాలు వేగంగా ముందుకు వెళ్ళనారంభించాయి. వారి వెంబడి ఇంకాస్త దూరం వెళదామా వద్దా అని ఆలోచిస్తుండగానే మకుటాభిషేకాన్ని చూడడానికి వస్తున్న ఒక పెద్ద గుంపు ఆళ్వార్ కట్టియాన్ని ముందుకు తోసుకొని వెళ్ళి కోట లోపలికి చేరవేసింది. ఆ వార్తను కోట దళపతికి వెంటనే తెలియజేయడం చాల ముఖ్యమని ఎంచి ఆళ్వార్ కట్టియాన్ పట్టాభిషేక మంటపానికి వచ్చి చేరాడు. యువరాజు అరుళ్మొళివర్మగారి ఆజ్ఞప్రకారమే ఇలా మారువేషం వేసుకొన్నానని, జనకూటమిలో అటూ ఇటూ సంచరించి ప్రజలేమనుకొంటున్నారో తెలుసుకొని వచ్చి చెప్పమని పొన్నియిన్ సెల్వన్ పురమాయించారని, ఆ కర్తవ్యాన్ని నెరవేర్చేటప్పుడే పైన వివరించిన సంఘటనలను తాను చూడడం జరిగిందని ఆళ్వార్ కట్టియాన్ వివరించిన తర్వాత, చిన్న పళువేట్టరయ్యర్ అతడి మాటలను పూర్తిగా నమ్మారు. తమ కుమార్తెయైన పాత మధురాంతకుల భార్య గురించి ఆయనకు అప్పటికే చాల దిగులుండేది. తిరుమలై చెప్పిన వార్త ఆయన దిగులును అధికం చేసి, ఆయన మనసులో పెద్ద ఆందోళనను పుట్టించిందప్పుడు. తమ అంతఃపురానికి వెళ్ళి నిజాన్ని తెలుసుకొని వస్తామని, తాము అత్యవసరంగా వెళ్ళవలసి రావడం గురించి ముఖ్యమంత్రి అనిరుద్ధుల ద్వారా సుందర చోళ చక్రవర్తికి, పొన్నియిన్ సెల్వన్‌గారికి తెలియజేయమని ఆళ్వార్ కట్టియాన్‌కి చెప్పి, చిన్న పళువేట్టరయ్యర్ అతివేగంగా మకుటాభిషేక మంటపంనుంచి బయటకు వెళ్ళారు.

~

ఆళ్వార్ కట్టియాన్ వచ్చి పొన్నియిన్ సెల్వన్‌కి చెప్పవలసిన అవసరమే లేకపోయింది. తమిళ కవిపుంగవులైన నల్లన్ సాత్తనార్‌గారితో మాట్లాడుతున్నప్పుడే యువరాజు చిన్న పళువేట్టరయ్యర్ మీద కూడ ఒక కన్ను వేసివుంచారు. ఆయన మంటపంనుంచి బయటకు వెళ్ళగానే యువరాజు వదనం మునుపటికన్న అధికంగా ప్రకాశించసాగింది. చక్రవర్తి వైపు తిరిగి గంభీరస్వరంతో ఇలా చెప్పనారంభించారు:-

"తండ్రీ! మన కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్ ఏదో అత్యవసరమైన కార్యం మీద బయటకు వెళుతున్నారు. ఆ కారణంగా ఈ మకుటాభిషేక వైభవం ఆగిపోనవసరం లేదు. ఈ సభలో ఇంకా ఎందరో పెద్దలున్నారు. వీరచరిత్రభూయిష్టమైన అనేక కులాల పెద్దలున్నారు. మహాయుద్ధాలలో పాల్గొని ప్రతిష్ఠాకరమైన వీరకృత్యాలు చేసి, మహాగాయాలను భరించినవారున్నారు. వారిలో ఎవరైన తమ

దివ్యహస్తాలతో ఈ పురాతన చోళవంశ మణిమకుటాన్ని ఎత్తి ధరింపజేయవచ్చు. అందరూ ఈ స్వర్ణకిరీటాన్ని, రాజఖడ్గాన్ని, రాజదండాన్ని తమ దివ్యహస్తాలతో తాకి ఇప్పటికే ఆశీర్వదించారు. కాబట్టి ఇక నా చేతులతో నేనే ఈ మణిమకుటాన్ని ఎత్తి శిరస్సున ధరించినా తప్పేమీ లేదు. కానీ, అలా చేసేముందు, తండ్రీ! మీకు, ఇక్కడ విజయం చేసిన పెద్దలకు, పురాతన కుల పెద్దలకు నేనొక విన్నపం చేయగోరుతున్నాను. ఒక పావురం ప్రాణాన్ని కాపాడేందుకు తన శరీరం నుంచి కండను కోసిచ్చిన శిబి చక్రవర్తి పరంపరలో వచ్చినవాడిని నేను. కాబట్టి మన కులస్థులందరిలాగే నేను కూడ 'శెంబియన్' అన్న కులం పేరు పొందినవాడిని నేను. లేగదూడను కోల్పోయిన ఆవుకు న్యాయం చేకూర్చేందుకు తన కుమారునికే మరణదండన విధించిన మనునీతి చోళుల వంశంలో పుట్టినవాడిని. మన కుల పూర్వీకులందరూ యుద్ధరంగంలో వెన్నుచూపి పారిపోని వీరులని పేరుగాంచినట్లే, నీతిమార్గంనుంచి అణుమాత్రం కూడ తప్పనివారన్న కీర్తిని కూడ పొందినవారు. వారి పరంపరలో వచ్చిన నేను నీతిమార్గం నుంచి వేరుగా నడుచుకోసాధ్యమా? ఇంకొకరికి న్యాయంగా చెందవలసిన వస్తువునుగాని, పదవినిగాని అపహరించవచ్చా? మన ఆస్థానకవి మన కుల పూర్వీకుల గురించి చాల చక్కగా ఛందోబద్ధకవిత్వరూపంలో పాడినప్పుడు వారందరూ నా మనోనేత్రం ముందు వచ్చి దర్శనమిచ్చారు. నలంకిళ్ళి, కోశెంగణార్ కరుణాపూరిత నేత్రాలతో నన్ను వీక్షించి, 'మా కులంలో ఉదయించిన కుమారా! నీవీ సింహాసనానికి అర్హుడవేనా అని కాస్త ఆలోచించు!' అన్నారు. విజయాలయులు, ఆదిత్యులు, పరాంతకులు నన్ను వీరోచిత నేత్రాలతో వీక్షిస్తూ, 'కుమారా! నీవీ సింహాసనాన్ని అధిష్టించేందుకు ఎంతటి వీరకృత్యాలను చేశావు? చెప్పు!' అని అడిగారు. నేను వారికి ఉత్తరమిచ్చేందుకు జంకాను. తర్వాత మనసు దిటవు చేసుకొని వారికి చేతులు జోడించి నమస్కరించి ఇలా విన్నవించుకొన్నాను. 'చోళకుల పితామహులారా! మీరు చేసిన మహాకార్యాలలో వెయ్యింట ఒక వంతుకూడ నేనింకా చేయలేదు. కానీ మీ ఆశీర్వాదం వల్ల ఇకమీదటనే చేయబోతున్నాను. మీరు నెలకొల్పిన చోళకుల కీర్తిప్రతిష్టలను ఇంకా పెంపొందించి దీర్ఘకాలం నిలిచేటట్లు చేయగల కార్యాలను చేయబోతున్నాను. అసాధ్యమైన కార్యాలను చేయబోతున్నాను. లోకం చూసి ఆశ్చర్యపడే మహావీరులైన మీరే చూసి మెచ్చుకొనే ధీరకృత్యాలను చేసి మీ అందరి దీవెనలను పొందబోతున్నాను!' అని నేను మన కులపూర్వీకులకు తెలియజేశాను. వారు కూడ విప్పారిన వదనాలతో నన్ను వాత్సల్యంతో ఆశీర్వదించారు..."

~

ఇలా భావోద్వేగంతో పొన్నియిన్ సెల్వన్ చెప్పుకొచ్చిన మాటలను విని ఆ సభలోనివారంతా రోమాంచితులైనారు. వారిలో ఒకరు "వీర వేల్! వెట్రి (=విజయం) వేల్ (=శూలం)" అని ఘోషించారు. తక్కినవారందరూ ఆయనతోబాటు అలా ఘోషించగా, ఆ ఘోష పట్టాభిషేక మంటపం బయట కూడ మారుమోగింది. అక్కడ గుమిగూడిన ప్రజల్లో అది ఒక పెద్ద సందడిని పుట్టించింది.

పొన్నియిన్ సెల్వన్ కూడ అందరితోబాటు 'వీర వేల్! వెత్రి వేల్' అని ఘోషించారు. "తండ్రీ! చోళనాడు వీరులదైన ఈ ఘోష ఒకసారి, తమ తాతగారైన పరాంతక చక్రవర్తి కాలంలో ఉత్తర పెన్న దాటి, తుంగభద్ర, కృష్ణానది వరకు మారుమోగింది. ఆ నదులకవతల ఉన్న వేంగి దేశస్థులు, కళింగులు, మాన్యకేత దేశస్థులు ఆ ఘోష విని గడగడ వణికారు. ఇంకా పశ్చిమానికి వందలకొద్దీ ఓడల్లో వేలసంఖ్యలో చోళనాడు వీరులు వెళ్ళి మన చోళనాడు వర్తకాన్ని కాపాడుతూ వచ్చారు. తండ్రీ! మీరు జబ్బుపడి మంచం పట్టినప్పటినుంచి చోళ దేశపు విజయఘోష సన్నగిల్లింది. నలుదిక్కులా పగవారు తలెత్తుతున్నారు. వేంగి, కళింగం, కల్యాణపురం, మాన్యకేతం మనతో కయ్యానికి కాలు దువ్వుతున్నారు. హిమాలయాలకు అవతల ఉన్న దేశాలనుంచి ఈ మహాభారత దేశానికి వస్తున్న అపాయాన్ని గురించి వారు చింతించడం లేదు. చోళనాడు అభివృద్ధిని చూసి అసూయపడి కుతకుతలాడుతున్నారు. లంకలో మహీంద్రుడు ఇంకా సైన్యం కూడదీస్తున్నాడు. వీరపాండ్యుడు మరణించినా, అతడి కులానికి చెందినవారు ఎవరి తలమీదనైన కిరీటం పెట్టి కలహం పుట్టించజూస్తున్నారు. మహీంద్రుడు, పాండ్యరాజు, ఆపత్కాల సహాయకులు కూడబలుక్కొని కుట్ర పన్ని, అభిమన్యునికి, అరవాన్‌కి సాటియైన నా అన్నగారైన ఆదిత్య కరికాలన్‌గారి ప్రాణానికి ముగింపు చేసేశారు. పశ్చిమాన చేరదేశపు రాజుకు నౌకాబలాన్ని తయారుచేయడంలో ఒక కొత్త మొరటు కూటమి సహాయం చేస్తూంది. చోళనాడును చుట్టుముట్టిన కొత్త అపాయం ఇది తండ్రీ! చాలకాలంగా అరబ్బు దేశస్థులు నౌకానిర్మాణంలో పేరుగాంచివున్నారు. చైనాదేశం వరకు వెళ్ళి వర్తకవ్యాపారాలు చేసి వస్తున్నారు. మన చోళదేశపు నదీముఖద్వారాలకు కూడ వారు తరచు వచ్చి వెళ్ళడం జరుగుతూంది. నాగరీకతలో ఉన్నతులైన ఆ పురాతన అరబ్బులను అణగదొక్కి ఇప్పుడు ఒక కొత్త అరబ్బు గుంపు పుట్టుకొచ్చింది. వారు అరబ్బుదేశస్థులో, లేక చుట్టుపక్కలున్న ఇంకేదైన దేశానికి చెందినవారో మనకు తెలియదు. కానీ మూర్ఖత్వంలో వారిని మించినవారు ఇంకెవరూ ఉండరు. నేనే వారి క్రూరకృత్యాలను ప్రత్యక్షంగా చూడడం జరిగింది. నన్ను పట్టి బంధించి తీసుకొని వచ్చేందుకే మన కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్ రెండు ఓడల నిండా వీరులను పంపారు..."

~

అప్పుడు సుందర చోళ చక్రవర్తి అడ్డుపడి, గద్గదస్వరంతో, "కుమారా! నేనలా పంపించిన కారణం నీవెరుగవా?" అని అడిగారు.

"తండ్రీ! అది నేను బాగ ఎరుగుదును. ఇక్కడ రాజ్యహక్కు గురించి కలకలం, సంక్షోభం ఏర్పడింది; పాండ్యరాజు ఆపత్కాల సహాయకుల గురించి కూడ మీకు తెలియవచ్చింది. కాబట్టి నన్ను భద్రంగా మీ వద్దకు తీసుకొని వచ్చి చేర్చేందుకే నన్ను చెరపట్టి బంధించి తీసుకొని రమ్మని పంపించారు. మీకు నామీదున్న అపరిమిత ప్రేమే అలా ఆజ్ఞ జారీ చేసేలా చేసింది. అందరికీ అది తెలియాలనే ఇప్పుడది ప్రస్తావిస్తున్నాను. అలా నన్ను చెరపట్టి బంధించ వచ్చిన వీరులు వందల సంఖ్యలో ఉన్నారు. ఈలంనాడు

(లంక) ఒడ్డున ఓడ విరిగిపోగా, దాన్నుంచి ఎలాగో గట్టెక్కి ఒక చోట దాక్కొన్న అరబ్బులేమో పదిమందికన్న ఎక్కువ లేరు. మన వీరులు నిద్రపోతున్నప్పుడు ఉన్నట్లుండి ముట్టడించి ఎంతమందిని చంపారో తలుచుకొంటే నా మనసే ఆ వేదననుంచి ఇంకా తేరుకోవడంలేదు. ఆ కొత్త అరబ్బుజాతివారు చేరదేశపు రాజుకు ఓడలు నిర్మించడంలో సహాయం చేస్తున్నారు. అది మాత్రం కాదు; కళింగదేశస్థులతో కూడ సంబంధాలు ఏర్పరచుకొన్నారు. ఈ మూడు దేశస్థులు కూడబలుక్కొని చోళదేశపు సముద్రవ్యాపారన్ని పూర్తిగా నాశనం చేసేయాలని తీర్మానించినట్లు తెలియవచ్చింది. సముద్రదొంగలు అరబ్బుదేశస్థులైతేనేమి? లేక, మనతో ఎన్నో విధాల సంబంధాలేర్పరచుకొన్న చేరదేశస్థులైతేనేమి? మన సముద్రవాణిజ్యాన్ని కాపాడుకోవాలంటే, మన సముద్రసైన్యాన్ని పెంచాలి. వేలకొద్ది కొత్త ఓడలను నిర్మించాలి. కొత్త కొత్త కళాసీలను పనిలోకి తీసుకొని తర్ఫీదివ్వాలి. ఓడలో ప్రయాణం చేస్తూ సముద్రదొంగలతో పోరాడగల వీరులను మన సైన్యంలోకి తీసుకోవాలి. దక్షిణసముద్రంలో ఉన్న దీవులన్నింటా పులిజెండాను నాటి మన వీరులను అక్కడ మన ప్రతినిధులుగా నియమించాలి. తండ్రీ! ఈ కార్యాలన్నీ చేస్తానని నేను మన పూర్వీకులకు మాటిచ్చాను. దాన్ని నెరవేర్చేందుకు మీ అనుమతి కావాలి. ఈ సభలో ఉన్న పెద్దల సమ్మతం కూడ కావాలి!"

~

పొన్నియిన్ సెల్వన్ ఇలా చెప్పి ఆపగానే, సుందరచోళ చక్రవర్తి, "చోళకుల కీర్తిని ఇంకా పెంపొందిస్తావంటే నేనడ్డు వస్తానా? చోళదేశపు సముద్రవ్యాపారాన్ని కాపాడే ప్రయత్నాలకు ఈ సభలోని ముఖ్యులు అభ్యంతరం చెప్పబోతున్నారా?" అనగానే, మళ్ళీ ఆ సభలో, "వీర వేల్! వెట్రి వేల్!" అన్న ఘోష లేచింది.

"తండ్రీ! మీరు, ఈ సభికులు అడ్డు చెప్పరు. నేను చేబట్టబోయే బృహత్కార్యాలలో విజయుడిని కావాలని ఆశీర్వదించి పంపుతారు. మీ ఆశీర్వాదం ఫలించి నేను చేపట్టబోయే కార్యాలలో గెలుపొందాలంటే, మొదట నా మనసులో ప్రశాంతత నెలకొనాలి. ఋజువర్తన లేని కార్యమేదీ నేను చేయలేదు, నా కులపూర్వీకులు ఆమోదించలేని కార్యమేదీ నేను చేయలేదు, ఇతరుల హక్కయిన దేన్నీ నేను దురాశతో అపహరించలేదన్న నెమ్మది నేను పొందాలి. ఇక్కడ కులధర్మానికి తగని పని చేసి బయలుదేరితే, నా మనస్సాక్షి నన్ను వేధిస్తూనే ఉంటుంది. పగవారితో పోరాడి ఎలా జయిస్తాను? ధర్మాన్ని నెలకొల్పేందుకు పోరాడుతున్నామన్న నమ్మకం నా మనసులో ఎలా కలుగుతుంది? మునుపొకసారి నేను లంకారాజ్యసింహాసనాన్ని కబళించేందుకు ఆశపడ్డానన్న వదంతి ఒకటి లేచింది..."

"బిడ్డా! దాన్నెవరూ నమ్మలేదు. నీవలాంటి నేరం చేస్తావని ఎవరూ భావించలేదు కూడాను" అన్నారు చక్రవర్తి.

"మీరు నమ్మివుండరు, తండ్రీ! కానీ అలాంటి మాట నా చెవిన పడగానే నా మనసు ఎంతగానో

వేదనకు లోనైంది. ఈలం దేశపు బౌద్ధభిక్షువులు నాకు బహూకరించిన మణిమకుటాన్ని నేను నిరాకరించిన విషయం నా మిత్రులిద్దరు ఎరుగుదురు. వారప్పుడు నా పక్కనే ఉన్నారు, ఇప్పుడు కూడ నా పక్కనే ఉన్నారు..."

అప్పుడు సభలోవున్న బౌద్ధభిక్షువుల గురుదేవులు కూడ, "అవును! మేము కూడ ఆ విషయాన్నెరుగుదుము!" అన్నారు.

"ఒక నిరాధారమైన నింద నా మనసులో అటువంటి వేదనను కలిగించింది. దాన్ని మీరు నమ్మకపోయినా, నమ్మినవారు కొందరున్నారు. నిజంగానే నేనిప్పుడు ఇంకొకరికి చెందవలసిన సింహాసనాన్ని అపహరిస్తే, అందువల్ల ఈ మహత్తరవంశానికి ఎంతటి అపకీర్తి కలుగుతుంది? నా జీవితాంతం దాని గురించి నేను వేదన పడుతుంటాను. ఇంకే పెద్ద కార్యం మీద కూడ నా మనసును కేంద్రీకరించలేను. ఉత్సాహంతో ఆ కార్యాన్ని చేయలేను..."

~

చాలసేపటినుంచి వంచిన తలెత్తకుండ కూర్చొనివున్న మధురాంతకులు ఇప్పుడు తలెత్తి పొన్నియిన్ సెల్వన్ని చూసి ఏదో చెప్పబోయారు. పొన్నియిన్ సెల్వన్ వంతిదేవుని చూసి సంజ్ఞ చేయగానే ఆ వీరుడు మధురాంతకుల చెంతకు వెళ్ళి నిలబడ్డాడు. ఆయనకు మాత్రం వినిపించేలాగ ఆయన చెవిలో, "మిత్రమా! సుందరమూర్తి నాయనార్ పాడిన దేవారంలో మొదటి పాదమేమి?" అని అడిగాడు. ఈ సమయాన ఈ ప్రశ్నేమిటి అని ఆశ్చర్యంతో మధురాంతకులు, "నెలవంకను శిరస్సున ధరించిన పిచ్చివాడా!" అన్నారు. వంతిదేవుడు ఉత్తుత్తి కోపంతో, "ఏమయ్యా! నన్ను పిచ్చివాడంటున్నారా? మీకే కద ఆడవాళ్ళ పిచ్చి పట్టి తిరుగుతున్నారు? అదిగో, చూడండి! మీ ధర్మపత్ని పూంగుళలి మిమ్మల్ని చూసి నవ్వుతోంది!" అన్నాడు. ఇదేమిటి? మన మంచి స్నేహితుడు ఉన్నట్లుండి (లేని) కయ్యానికి కాలు దువ్వుతున్నాడు? అని మధురాంతకులు స్త్రీలు ఆసీనులైవున్న వైపు చూశారు. నిజానికి పూంగుళలి ఆ సమయాన ఈయన వైపు చూడనే లేదు. పూంగుళలి, వాణతి, కుందవై, శెంబియన్ మహాదేవి, వాణమహాదేవి మొదలైన అంతఃపురస్త్రీలందరూ ఎనలేని కుతూహలంతో పొన్నియిన్ సెల్వన్నే చూస్తున్నారు.

మళ్ళీ ఆయన పొన్నియిన్ సెల్వన్ని చూసినప్పుడు ఆయన చోళ వంశపు పురాతన మణిమకుటాన్ని చేతబట్టుకొని ఉండడాన్ని చూశారు.

"దళపతి చిన్న పళువేట్టరయ్యర్ ఇంకా తిరిగి రాలేదు. అందువల్లనేమి? సూచించిన ముహూర్తానికి నేనే పట్టాభిషేక ఉత్సవాన్ని జరిపిస్తాను! తండ్రీ! విజయాలయ చోళ చక్రవర్తి మొదలు మన పూర్వీకులు ధరిస్తూ వచ్చిన ఈ పురాతన మణిమకుటాన్ని మీరు నాకివ్వాలని ఉద్దేశించారు. సామంతరాజులు, దళపతులు, సేనాపతులు, కులపెద్దలు, సాధారణప్రజలు - అందరూ అందుకు

ఒప్పుకొన్నారు. కాబట్టి ఈ కిరీటం ఇప్పుడు నా సొంతమైంది. నాకు సొంతమైన వస్తువును నాకిష్టం వచ్చినట్లు ఉపయోగించే అధికారం నాకుంది కద? నాకన్న ఈ కిరీటాన్ని ధరించేందుకు ఎక్కువ అర్హత కలిగినవారు ఇక్కడ ఒకరున్నారు. ఆయన నాకన్న ప్రాయంలోను పెద్దవారు. ఈ చోళరాజ్యం మీద నాకన్న ఎక్కువ హక్కు, అధికారం ఉన్నాకూడ ఆయన దాన్ని కోరలేదు. నేను పట్టం కట్టుకొని సింహాసనం మీద ఆసీనుడిని కావడాన్ని చూసి ఆనందించేందుకే ఇక్కడికి వచ్చారు. ఆయన నా ప్రాణాలను ఒకసారి కాపాడారు. నా ప్రాణంకన్న మిన్న అయిన నా మిత్రులను కాపాడారు. ఈ చోళకులానికి రాబోయిన ఒక విపత్తును అడ్డుకొన్నారు. ఇలాంటి మహత్తరమైన కార్యాలేమీ నేనింతవరకు ఈ చోళనాడుకు చేయలేదు. కాబట్టి ఈ మణిమకుటాన్ని మహానుభావులు గండరాదిత్యుల కుమారులు, నా పినతండ్రియైన మధురాంతక దేవుల శిరస్సున ధరింపజేస్తాను!"

~

ఇలా చెబుతూనే పొన్నియిన్ సెల్వన్ చక్రవర్తికి ఇంకొకవైపు ఆసీనులైన మధురాంతకులను సమీపించి ఆయన శిరస్సున మణిమకుటాన్ని ఉంచారు.

మణిమకుటాన్ని పెట్టేటప్పుడు మధురాంతకులు అడ్డురాకుండ ఉండేందుకు వంతిదేవుడు ఆయన వెనక నిలబడి ఆయన రెండు చేతులను గట్టిగా పట్టుకొన్నాడు.

కానీ ఆయనలా ఏం చేయలేదు. ఆయన మైమరచి, వశం తప్పి నిజంగానే పిచ్చిపట్టినవాడిలాగ నలువైపుల వెర్రిచూపులు చూడసాగారు.

మణిమకుటాన్ని ధరింపజేయగానే పొన్నియిన్ సెల్వన్ "కోపరకేసరి మధురాంతక ఉత్తమ చోళులకు జయహో!" అని ఘోషించారు. "చక్రవర్తి ఉత్తమ చోళులకు జయహో!" అని వంతిదేవుడు పెద్దగా ఘోషించాడు.

ఇంతసేపూ భ్రమించి నిలబడిపోయిన ముఖ్యమంత్రి అనిరుద్ధులు మొదలైనవారందరూ ఇప్పుడు "కోపరకేసరి మధురాంతక ఉత్తమ చోళులకు జయహో!" అని ఘోషించారు.

సుందరచోళ చక్రవర్తి భావోద్వేగం వల్ల మాట్లాడే శక్తిని పూర్తిగా కోల్పోయారు కాబట్టి తమ చేతనున్న పుష్పాలను మధురాంతకుల మీద చల్లారు.

అంతఃపురస్త్రీలు కూడ చక్రవర్తి వెంట మధురాంతకుల మీద పూలవర్షం కురిపించారు.

మధురాంతకులు సంభ్రమాశ్చర్యాలు కాస్త తగ్గగానే, లేచి శెంబియన్ మహాదేవి వద్దకు వెళ్ళి ఆమెకు నమస్కరించి నిలబడ్డారు. ఆ మహాదేవి కనుల వెంబడి అశ్రుధారాపాతం ప్రవహించసాగింది.

"కుమారా! దేవుని ఇచ్ఛ ఇలా ఉంది! నీవు, నేను దానికెదురుగా నడవడం ఎలా సాధ్యం?" అన్నారు.

పొన్నియిన్ సెల్వన్ సభలోని తక్కిన కవిపుంగవులు, భట్టారకులు, భిక్షువులు

మొదలైనవారిని చూసి, "మీరిక మీ ఆశీర్వాద వచనాలను తగిన రీతిగా మార్చుకొని చెప్పండి!" అన్నారు.

వారు కూడ తొందరగా తొందరగా తమ ఆశీర్వాద వచనాలను, కవితలను మార్చి కూర్చుకొని పాడనారంభించారు.

~

మధురాంతక ఉత్తమ చోళులకు మణిమకుటాభిషేకం జరిగిన కాసేపటికల్లా ఆ వార్త తంజావూరు ప్రజలమధ్య వ్యాపించింది. అతివేగంగా అది వ్యాపించేందుకు వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ పెద్ద కారణమైనారు. పొన్నియిన్ సెల్వన్ ఆజ్ఞ ప్రకారం వారు నగరవీధుల్లో అక్కడక్కడ తమ మనుషులను నెలబెట్టివుంచారు. వారి వద్దకు వేగంగా వెళ్ళి ఈ విషయం చెప్పి, "కోపరకేసరి ఉత్తమ చోళులకు జయహో!" అని ఘోషింపజేశారు. యువరాజు అరుళ్మొళివర్మ తమకివ్వబడ్డ రాజ్యాన్ని తమ పినతండ్రి మధురాంతకులకిచ్చేశారని, సముద్రదొంగలను అదుపు చేసేందుకు ఒక పెద్ద నౌకాసైన్యాన్ని కూడదీసుకొని త్వరలోనే బయలుదేరబోతున్నారని నోటిమాటగా ప్రజల మధ్య అతివేగంగా సుడిగాలిలాగ వ్యాపించసాగింది. కొందరు దాన్ని వెంటనే నమ్మారు. పొన్నియిన్ సెల్వన్ సద్గుణానికిది తగినదేనని వారు భావించారు. ఇంకొందరు, "చేతికి చిక్కిన మహారాజ్యాన్ని ఎవరైనా ఇలా ఇంకొకరికిలా దానం చేసేస్తారా?" అని సందేహం వెలిబుచ్చారు. వేవేలమంది ఒకే సమయాన పలువిధాలుగా మాట్లాడగా లేచిన మహాశబ్దమూ, "జయహో! జయహో!" అన్న ఘోషలు కలగలిసి సుడిగాలి వేచేటప్పుడు అలల కడలిలో లేచే పెద్ద హోరులాగ ధ్వనించింది.

కాసేపటికల్లా అలంకరించబడ్డ పట్టపుటేనుగు మీద బంగారు అంబారీలో మధురాంతక దేవరు ఆసీనులై ఊరేగింపుకు బయలుదేరగానే ప్రజల అన్ని సందేహాలు వీడిపోయాయి. ఏనుగు కుంభస్థలం మీద మావటిగా కూర్చొనివున్నది పొన్నియిన్ సెల్వన్ అని తెలియగానే ప్రజల ఉత్సాహం ఎల్లలు మీరింది. "కోపరకేసరి మధురాంతక ఉత్తమ చోళులకు జయహో!" అన్న ఘోషలు లేచాయి. కానీ వారి మనస్సుల్లో పొన్నియిన్ సెల్వన్ చేసిన ఆ అసాధారణ ఘనకార్యమే గూడుకట్టుకొనివుంది. కానీ వారి ముఖాలు తామరపూవుల్లాగ విప్పారివున్నాయి. పొన్నియిన్ సెల్వన్ పట్టం కట్టుకొని ఊరేగింపుకు వచ్చివుంటే ఎంత ఉత్సాహంగొనివుండేవారో, దానికన్న పదిరెట్లు ఎక్కువ ఉత్సాహాన్ని, కుతూహలాన్ని ప్రజలు వెలిబుచ్చారు.

~

హిమాలయశిఖరాన పులిజెండాను నాటిన కరికాల్ పెరువళత్తాన్‌ని పొన్నియిన్ సెల్వన్ మించిపోయారని, త్యాగశిఖరాన ఆయన తన గుర్తును ఎన్నటికీ మాసిపోనట్లు నాటారని జ్ఞానులు సంతసించారు.

సాధారణ ప్రజలేమో, అలాంటి అపురూపమైన అలంకారాలను, ఉపమాన-ఉపమేయాలను వెతకలేదు. మధురాంతకుల శిరస్సున మణిమకుటాన్ని ధరింపజేసి, పట్టపుటేనుగు మావటిగా ఆయన

వచ్చిన దృశ్యం వారందరినీ పరవశింపజేసింది. ఆడుతూ, పాడుతూ, నవ్వుతూ, దీవెనలు కురిపిస్తూ ఒకరినొకరు హత్తుకొని ఆనందిస్తూ, పూలవర్షం కురిపిస్తూ, అక్షింతలు చల్లుతూ ప్రజలు కోలాహలంగా ప్రజలు మైమరచిపోయారు.

ఇలా ఆడుతూ పాడుతూ మైమరచివున్న ప్రజల మధ్య పట్టపుటేనుగు నడుచుకొంటూ వెళ్ళడం అంత సులభం కాదు. పొన్నియిన్ సెల్వన్ కూడ తొందరపడకుండ తాము కూడ ప్రజల కుతూహలాన్ని చూసి ఆనందిస్తూ, అక్కడక్కడ పరిచయమున్నవారు కనిపించినప్పుడు ఏదైనా చమత్కారంగా మాట్లాడుతూ, ఏనుగును మెల్లమెల్లగా నడిపించుకొంటూ వెళ్ళారు. ఊరేగింపు ముగిసి అంతఃపురానికి తిరిగివచ్చేటప్పటికి పొద్దుగుంకి రాత్రికావచ్చింది. ఆకాశంలో చుక్కలతో వీధుల్లో వెలిగించిన దీపాలు పోటీ పడుతూ ప్రకాశించసాగాయి. అంతఃపురం పైమేడనుంచి పూలవాన కురిసింది. “ఏనుగు మావటీ! ఏనుగు మావటీ!” అన్న ఒక ఇంపైన గొంతు వినిపించింది. పొన్నియిన్ సెల్వన్ తలెత్తి చూసినప్పుడు చిరునవ్వుతో విరిసిన వాణతి ముఖం కనిపించింది.

“అమ్మాయీ! భయపడకు! మధురాంతక ఉత్తమ చోళుల రాజ్యంలో ఏనుగు, పులి కలిసిమెలిసి జీవిస్తాయి; పిల్లి, చిలుక ఆనందంగా ఉంటాయి!” అన్నారు పొన్నియిన్ సెల్వన్.

~~~
~~~

# అధ్యాయము - 89

## వచ్చింది వసంతం!

**మధురాంతక** ఉత్తమ చోళుల పట్టాభిషేక మహోత్సవం జరిగి ఒకటిన్నర మాసాలు గడిచాయి. హేమంతఋతువు ఎప్పటికన్న వేగంగా సెలవు తీసుకొని వెళ్ళిపోయింది. దక్షిణ మలయమారుతమనే రథమెక్కి వసంతకాలం వచ్చింది. రామచిలుకలు మామిడిచెట్ల కుంకుమరంగు చిగుర్ల పక్క తమ రంగురంగుల ముక్కు;లను ఉంచి పోల్చి చూశాయి. రావి చెట్ల బంగారు వన్నె లేతాకులు పిల్లగాలులు వీచినప్పుడు మెల్లగా అటూ ఇటూ కదలాడాయి. పొన్నచెట్లనుంచి ముత్యాల్లాంటి మొగ్గలను రాలుస్తూ కోయిలలు కోలాహలంగా కూశాయి. ప్రకృతి ఒడలు పులకరించింది. భూమాత కుతూహలంతో పొంగింది. ఆకులు రాలిపోయి బోసిగా కనిపించిన చెట్లలో ఉన్నట్లుండి మొగ్గలు తొడిగి పూలై పూశాయి. మాధవీలతలు, మల్లెపొదలు పూలగుత్తుల భారాన్ని మోయలేక నేలవైపు వంగాయి. నదుల్లో ప్రవాహం తగ్గింది. వాటి తీరం వెంబడి పాలరాతిలాంటి తేటనీరు గలగలా పారుతూంది.

చోళనాడు ప్రజల మనసు, ముఖాలు విప్పారి వెలిగాయి. బంగారు వన్నె వరిపంటలను కోత కోసి, తూర్పారబట్టి గాదెల్లో నింపడమైంది. రాజకీయ అనిశ్చిత పరిస్థితి తీరి, దిగులు తొలగిపోయింది. నగరాల్లోను, పల్లెల్లోను ప్రజలు మన్మధుని పండుగ జరుపుకోవడానికి సన్నాహాలు చేసుకోనారంభించారు. దేవాలయాల్లో వసంతోత్సవం జరిపేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. నలువీధుల కూడళ్ళలో నాట్య, నాటక ప్రదర్శనలకు మేడలు/వేదికలు సిద్ధం చేయబడుతున్నాయి.

ఈ కమనీయ దృశ్యాలనన్నింటినీ చూస్తూ వల్లవరయ్యన్ పళైయారై వైపు వెళుతున్నాడు. ఈ సారి అతడు దాక్కొని, మరుగ్గాను, మారువేషం వేసుకొని గాని ఆ నగరంలో ప్రవేశించలేదు. తెరిచివున్న ప్రధాన నగరద్వారం గుండా ప్రవేశించి తిన్నగా యువరాకుమారి కుందవైదేవి అంతఃపురానికి వెళ్ళాడు.

యువరాకుమారి కుందవై వాణతి మొదలైన చెలికత్తెలతో వాకిలి దగ్గరికి వచ్చి అతన్ని స్వాగతించింది.

చాలదూరం ప్రయాణం చేసి వచ్చిన అలసట తీరగానే అంతఃపుర ఉద్యానవనంలోకి వచ్చి తనని కలవమని చెప్పి వెళ్ళింది.

వంతిదేవుడు సేదదీరేందుకు చాలసేపు తీసుకోలేదు. స్నానపానాలను అతివేగంగా ముగించుకొని ఉద్యానవనానికి వెళ్ళాడు. యువరాకుమారి అతడి రాకకోసం అక్కడ వేచివుంది. ఒకరినొకరు కలుసుకోవడంలో ఎవరికెక్కువ కుతూహలం, ఉత్సుకత ఉందో చెప్పలేము. ఒకరినొకరు విచారించి ఎన్నో సంగతులు తెలుసుకోవాలని ఇద్దరూ చాల ఆసక్తిగొనివున్నారు. కాని వారి ఉద్వేగానికి అది మాత్రమేనా

కారణం? తమ భవిష్యత్తు గురించి నిశ్చయించుకోవడం కూడ కారణం కావచ్చు కద?

"అయ్యా! మీరు వెళ్ళిన కార్యంలో పూర్తి విజయం పొందలేదని తెలుసుకొన్నాను. అది నిజమేనా?" అని అడిగింది కుందవైదేవి.

"నిజమే, దేవీ! ఇంతవరకు నేను చేపట్టిన ఏ కార్యంలో పూర్తి విజయం సాధించాను గనక?" అని చెప్పి పెద్దగా నిట్టూర్చాడు వంతిదేవుడు.

"అలా చెప్పకండి. నా తమ్ముడిని లంకనుంచి తీసుకొని వచ్చి చేర్చారు కద? ఆ సమయాన అరుళ్మొళి వచ్చి చేరినందువల్లనే కద చోళదేశం ఈ మాత్రం బతికి బయటపడింది?" అన్నది కుందవై.

"అరుళ్మొళివర్మగారికి అనవసరమైన చలిజ్వరం వచ్చేలా చేసి కొనప్రాణంతో ఉండగా తీసుకొని వచ్చి అప్పజెప్పాను. అది కూడ పూంగుళలి మహారాణి సహాయం వల్లనే సాధ్యమైంది. సేందన్ అముదన్, పూంగుళలిల వద్ద ఆయనను అప్పజెప్పి నాగపట్టణానికి పిలుచుకొని వెళ్ళమని చెప్పినప్పుడు, వారు ఈ తంజావూరు నగరానికి వచ్చి పట్టం కట్టుకొని సింహాసనమధిష్టించబోతారని  కలలో కూడ ఊహించలేదు..."

"ఉత్తమ చోళ చక్రవర్తి ప్రాణాలను కాపాడింది మీరేనని నేను మరిచిపోలేదు. పెద్ద పళువేట్టరయ్యర్‌కి బదులుగా మిమ్మల్ని చోళనాడుకు ధనాధికారిగా నియమించేయాలని ఉత్తమ చోళులు కోరుతున్నారు..."

"అదృష్టవశాత్తు బతికి బయటపడ్డాను!"

"అదేం అలా అంటున్నారు? ఈ చోళరాజ్య ధనాధికారి పదవి సాధారణమైనదా? ముఖ్యమంత్రి పదవి కన్న, మాతండనాయకుల పదవికన్న మిన్న కద? ధనాధికారి దయలేనిదే చక్రవర్తి కూడ ఏ కార్యమూ చేయలేరు కద?"

"దేవీ! పెద్ద పళువేట్టరయ్యర్‌గారి పాతాళ బొక్కసంలో నేనొకసారి దాక్కోవలసివచ్చింది. అప్పుడక్కడ కుప్పలు కుప్పలుగా పడివున్న బంగారు కాసుల మధ్య ఒక సాలెపురుగు వలను చూశాను. చచ్చిపోయిన ఒక మనిషి అస్థిపంజరాన్ని కూడ చూశాను. ఇక మీదట ఆ బొక్కసపు నేలమాళిగవైపే వెళ్ళకూడదని తీర్మానించుకొన్నాను...."

~

యువరాకుమారి చిరునవ్వు నవ్వేసి, "మీరు ధనాధికారి పదవిని స్వీకరించినా కూడ ఆ పాతాళ బొక్కసానికి వెళ్ళనవసరం లేదు. ఆ బొక్కసంలో ఉన్న ధనాన్నంతా ఖర్చు చేసి ఒక పెద్ద నౌకాదళాన్ని నిర్మించేందుకు అరుళ్మొళి తీర్మానించేశాడు. కొత్త చక్రవర్తి అనుమతి కూడ తీసుకొన్నాడు!" అన్నది.

"కొత్త చక్రవర్తి వారి పట్టమహిషితో కోడిక్కరైకి వెళ్ళారని నేను తంజావూరులో ఉండగా తెలుసుకొన్నాను."

"అవును. వారు వెళ్ళేటప్పుడు మిమ్మల్ని కూడ తమతోబాటు పిలుచుకొని వెళ్ళలేకపోతున్నాం కద అని చాల విచారించారు."

"నేను అందుగురించి దిగులుపడడం లేదు. ఇప్పుడు కూడ కోడిక్కరైకి వెళ్ళి వారిని కలుస్తాను. అరుళ్మొళివర్మగారు నేను లేని సమయం చూసి కొడుంబాళూర్ రాకుమారిని పెళ్ళిచేసుకొన్న విషయం గురించే విచారిస్తున్నాను."

"ఎందుకయ్యా! మీ స్నేహితుడు నా అనుంగు చెలికత్తెను పెళ్ళి చేసుకోవడం మీకిష్టం లేదా?"

"భగవాన్! నేనా అర్థంతో చెప్పలేదు. నేనా పెళ్ళి చూడలేకపోయానన్న విషయం గురించే విచారిస్తున్నాను. వాణతిని పెళ్ళి చేసుకోవడానికి అరుళ్మొళివర్మగారు పూర్వజన్మలో ఎంతో పుణ్యం చేసివుండాలి. మీ స్నేహితురాలు వాణతి కూడ భాగ్యశాలే. కానీ ఎందుకంత తొందర పడ్డారు?"

"వారు తొందరపడలేదు. నేనే తొందరచేశాను. నాతలిదండ్రులు కంచికి బయలుదేరి వెళ్ళాలనుకొంటున్నారు. వారు వెళ్ళే లోపల పెళ్ళి జరగాలన్నాను. ఇందువల్ల కొడుంబాళూర్ పెద్ద వేళార్ మనసు కూడ నెమ్మదిగొంది. పట్టాభిషేకం నాడు మీ స్నేహితుడు ఉన్నట్లుండి మధురాంతక ఉత్తమ చోళుల శిరస్సున మణిమకుటాన్ని పెట్టడం ఆయనకు పెద్ద అదిరిపాటును కలిగించింది."

"ఇంకా చాలమంది అప్పుడు అదిరిపడివుంటారు."

"మా అందరికీ అది ఆశ్చర్యాన్ని కలిగించింది. స్నేహితులిద్దరూ ఆ సంగతిని చాల రహస్యంగా ఉంచారు."

"మీకైన చెప్పివుంటారని నేననుకొన్నాను...."

"కొన్ని మాసాల క్రితమైతే చెప్పివుంటాడు. నన్నడగకుండ అరుళ్మొళి ఏ కార్యమూ చేసింది లేదు."

"ఇప్పుడెందుకు మారిపోయారు?"

"అంతా సహవాస దోషంవల్లనే! మీతో చేరిన తర్వాతే నా ముద్దుల తమ్ముడిలా మారిపోయాడు. లోపల, బయట ఒకేలాగుండేవాడు. కపటనాటకంలోను, మంత్ర తంత్రాల్లోను ఆరితేరాడు!"

"దేవీ! నామీద ఊరకే నిందలు మోపకండి. మధురాంతక ఉత్తమచోళులకు పట్టం కట్టిన కపటనాటకానికి మీ తమ్ముడే సూత్రధారి, పూర్తిగా బాధ్యులు. ఇలా అందరినీ మోసం చేయవచ్చా అని నేను వాదించి చూశాను. రాముడు అయోధ్యప్రజలను మోసం చేసి అర్ధరాత్రి అడవికి వెళ్ళిన వృత్తాంతాన్ని ఉదాహరణగా చెప్పారు. మీకైనా చెప్పవద్దా అని అడిగాను. తమ జీవితంలో ఒక్కసారైన మిమ్మల్ని సంప్రదించకుండ ఒక కార్యాన్ని చేసి, తర్వాత మీచేత 'శభాష్' అనిపించుకోవాలన్నారు. దేవీ! యువరాజు చేసిన కార్యం మీ మనసుకు నచ్చిన కార్యమే కద?"

"ఇంతకన్న నాకు నచ్చిన, నేను మెచ్చిన కార్యాన్ని ఇంకెవరూ ఇక చేయలేరు. ఈ కార్యంలో

నా తమ్మునికి సహాయం చేసినందుకు చాల కృతజ్ఞతలు!" అన్నది యువరాకుమారి.

"దేవీ! అరుళ్మొళివర్మగారు మణిమకుటాన్ని ధరించి, సింహాసనమధిష్ఠించి, లోకమేలడాన్ని చూసేందుకు మీరు చాల ఆసక్తిగొన్నారని నేను భావించాను..."

"మునుపలా నేను ఆశపడ్డానన్నది నిజమే. నా చెలి వాణతి అటువంటి శపథం చేసిన తర్వాత నా మనసు మార్చుకొన్నాను. పైగా, అన్నగారు హత్యచేయబడగానే తమ్ముడు సింహాసనమెక్కితే లోకం ఏమనుకొంటుంది?"

"అవును, దేవీ! లంకాదేశపు రాజవంశంలో జరిగిన భయంకరకృత్యాలు ఈ విషయంలో అరుళ్మొళివర్మగారికి చాల కలతను కలిగించాయి. కానీ అందు గురించి కూడ ఆయన అంతగా దిగులు పడలేదు. నా మీద ఆ క్రూరహత్యానేరాన్ని కొందరు మోపజూసినప్పుడు, నన్ను కాపాడేందుకే ఆయన చోళసింహాసనమధిష్ఠించాలని నిశ్చయించుకొన్నారు. మంచివేళగా పెద్ద పళువేట్టరయ్యర్ ఆ నేరాన్ని తమ మీద వేసుకొని, నా మీద ఆ నింద పడకుండ కాపాడారు."

"పాపం! ఆ ముసలాయన లేనందువల్ల ఈ చోళనాడే వెలతెలాబోయినట్లనిపిస్తూంది."

"అన్నగారి వెంబడి తమ్ముడు కూడ వెళ్ళిపోవడాన్ని తలుచుకొంటే చాల విచారం కలుగుతూంది."

"అయ్యో! చిన్న పళువేట్టరయ్యర్ కూడ చనిపోయారా? ఖచ్చితంగా తెలుసా?" అని అడిగింది కుందవై.

"నేనాయన వద్ద సెలవు తీసుకొన్నప్పుడు ప్రాణాలతోనే ఉన్నారు. కానీ నూటయాభై అడుగుల రాతికొండ మీదినుంచి తిన్నగా కిందపడినవారు ఎలా బతకగలరు? ఇప్పటికి చనిపోయివుండాలి. చిన్న పళువేట్టరయ్యర్ మరణానికి ఒక విధంగా నేనే కారణభూతుడనయ్యానని తలచినప్పుడు నా మనసు విలవిల్లాడుతూంది" అన్నాడు వంతిదేవుడు.

"అయ్యో! అదంతా వివరంగా చెప్పండి. మకుటాభిషేకం నాడు చిన్న పళువేట్టరయ్యర్ని పట్టాభిషేక మంటపంనుంచి బయటకు పంపించేందుకు మీరు, నా తమ్ముడు కూడబలుక్కొని కుట్ర పన్నారు కద? అక్కడినుంచి వివరంగా చెప్పండి. అందుగురించి నా తమ్ముని వివరాలడిగేందుకు వీలేపడలేదు. మిమ్మల్ని అడిగి తెలుసుకొందామని ఉండిపోయాను. 'ఆడవాళ్ళ దగ్గర ఏ రహస్యమూ దాగదు' అన్న భావంతోనే ఇంతకు మునుపు చెప్పలేదు. ఇప్పుడైనా చెప్పవచ్చు కద?"

"దేవీ! మీకు చెప్పకపోవడానికి ఆ భావం కాదు కారణం. మిమ్మల్ని ఒక్కసారైన ఆశ్చర్యపరచాలని యువరాజనుకొన్నారు."

"నేనేమంతగా ఆశ్చర్యపోలేదు. మీరిద్దరూ కూడబలుక్కొని ఇలాంటిదేదో కుట్ర ఒకటి పన్నివుంటారనే సందేహించాను. ఏదైనా పొరబాటు జరగకూడదు కద అని కాస్త దిగులుపడ్డానంతే."

"నిజానికి, పొరబాటు జరగనే జరిగింది. అతిముఖ్యమైన కార్యం నెరవేరినా, దాని మూలంగా జరిగిన ఇంకొక విపరీతాన్ని ఆపలేకపోయాము. ఒకవేళ మిమ్మల్ని సంప్రదించివుంటే అలా జరిగేది కాదేమో!" అన్నాడు వంతిదేవుడు.

తర్వాత, సేందన్ అముదన్ అనబడ్డ కొత్త మధురాంతకులకు పట్టం కట్టాలని పొన్నియిన్ సెల్వన్ తీర్మానించినప్పటినుంచి వారు వేసుకొన్న పథకాలు, చేసిన పన్నాగాలు, చేసిన కార్యాలు - అన్నిటి గురించి వివరంగా చెప్పాడు.

~

మధురాంతకులకు పట్టం కట్టబోతున్నామని ముందుగానే చెబితే, అందుకు అనేక ఆక్షేపణలు, అడ్డంకులు కలుగుతాయని అరుళ్మొళివర్మ ఎంచారు. కొడుంబాళూర్ వేళార్, మలైయమాన్ మునుపటిలాగే ఆ ఆలోచనను వ్యతిరేకిస్తారు. పెద్ద పళువేట్టరయ్యరేమో మరణించే సమయంలో పొన్నియిన్ సెల్వన్‌కే పట్టం కట్టాలని చెప్పి మరీ (పరలోకానికి) వెళ్ళారు. ఆయన తోటివారు ఆయన కోరికను నెరవేర్చాలని ఆశిస్తారు. చిన్న పళువేట్టరయ్యర్‌కి తమ అల్లుడు నిజమైన మధురాంతకుడు కాడని తెలిసిపోయింది. పడవ నడిపే పూంగుళలిని సింహాసనమెక్కించడంలో ఆయనకు ఆసక్తి, ఉత్సాహం ఉండవు. శెంబియన్ మహాదేవి, సేందన్ అముదన్ అయిన మధురాంతకులు, పూంగుళలి - అందరూ ఆక్షేపిస్తారు. వారి అభ్యంతరాలను తోసిపుచ్చడం సుందరచోళ చక్రవర్తికే అంతగా ఇష్టం కాకపోవచ్చు. ఈ కారణాలన్నీ దృష్టిలో ఉంచుకొనే, పొన్నియిన్ సెల్వన్ తాము చేయదలుచుకొన్న కార్యాన్ని చివరి నిమిషం వరకు రహస్యంగా ఉంచదలుచుకొన్నారు. పట్టాభిషేక సమయాన తమ మీదగొన్న అభిమానం వల్లో, మధురాంతకుల మీదగొన్న అసూయవల్లో అభ్యంతరాలు చెప్పగలవారందరినీ వేర్వేరు కారణాలు చెప్పి బయటి ఊళ్ళకు పంపేశారు. తమకు సహాయం చేసేందుకు ఒకరు కావాలి కాబట్టి వంతిదేవునికి మాత్రం తమ అంతరంగంలోని ఉద్దేశాన్ని చెప్పారు. ఇద్దరూ ఆలోచించే అన్ని పథకాలు వేసుకొని కార్యాలను అతిజాగరూతతో చేసుకొంటూ వచ్చారు.

పార్థిబేంద్రుడు, గందమారన్, కొడుంబాళూర్ వేళార్ మొదలైనవారిని ఊరు వదిలి వెళ్ళిపోయేలా చేయడమైంది. కానీ చిన్న పళువేట్టరయ్యర్ని ఊరు బయటికి పంపించేలాగ చేయడం సాధ్యం కాదు - ఆయన కోట దళపతి కావడమే కారణం. ఆయన చేతుల మీదుగా పొన్నియిన్ సెల్వన్ శిరస్సున మణిమకుటాన్ని ధరింపజేయాలని అందరూ మాట్లాడి తీర్మానించడమైంది కూడాను. ఆ సమయాన కొత్త మధురాంతకుల శిరస్సున మణిమకుటాన్ని ఉంచమంటే ఆయన ఒప్పుకొంటారా? ఆయన నిరాకరిస్తే అది పెద్ద అపశకునంగా భావించబడుతుంది. కాబట్టి పట్టం కట్టే సమయాన ఆయన్ని ఎలాగైనా మంటపంనుంచి బయటకు పంపించాలని స్నేహితులిద్దరూ ఆలోచించారు. పూర్తిగా తృప్తినిచ్చే యుక్తి ఏదీ తోచలేదు. ఈ సమయాన ఆళ్వార్ కట్టియాన్ వచ్చి ఒక విచిత్రమైన వార్తను అందించాడు.

~

పాండ్యరాజు ఆపత్కాల సహాయకులైన రవిదాసు పక్షంవారు ఎక్కడకు వెళ్ళారు, నందినీదేవి ఇంకా వారితోనే ఉందా, తిరుప్పురంపయం అడవిలో నడిరాత్రి పట్టం కట్టబడ్డ చిన్నపిల్లాడు ఏమైనాడు మొదలైన విషయాలను తెలుసుకోవడానికి ముఖ్యమంత్రి అనుమతి పొంది అరుళ్మొళివర్మ ఆళ్వార్ కట్టియాన్ని పంపించారు. పాతాళ చెరసాలనుంచి తప్పించుకొన్న కరుత్తిరుమన్ వారితో చేరాడా, గందమారన్ చంపానని వచ్చి చెప్పినట్లు పాత మధురాంతకుడు నిజంగానే మరణించాడా, లేక అతడు కూడ బతికి బయటపడి కుట్రదారులతో చేరాడా అని తెలుసుకోవడం కోసం కూడ తిరుమలై బయలుదేరి వెళ్ళాడు. అతడీ విషయాలను తెలుసుకొని రావడానికి చాలకాలం పడుతుందని భావించారు. కానీ తిరుమలై కొన్నాళ్లకల్లా తిరిగి వచ్చేశాడు.

రవిదాసు కూటమిని, పడవ నడిపే మురుగయ్యన్ భార్య రాక్కమ్మాళ్‌ని అతడు కొల్లిమలై దగ్గర చూశాడు. ఆమె ఎక్కడికి వెళుతూందో కనిపెట్టి ఆమెను వెంబడించి వెళితే రవిదాసు కూటమి ఎక్కడుందో పసికట్టవచ్చని ఆళ్వార్ కట్టియాన్ ఎంచాడు. కానీ రాక్కమ్మాళ్ తంజావూరు వైపు వెళ్ళడం అతడికి ఆశ్చర్యం కలిగించింది. కానీ, ఆమెను వెంబడించి వెళితేనే పాండ్యరాజు ఆపత్కాల సహాయకులుండే చోటు తెలుసుకోవడం సాధ్యమని ఎంచి, మారువేషం వేసుకొని ఆమెకు తెలియకుండ ఆమె వెన్నంటి వెళ్ళాడు. ఉరయూర్ సమీపానికి వచ్చిన తర్వాత, పొన్నియిన్ సెల్వన్‌కి జరగబోయే పట్టాభిషేక మహోత్సవాన్ని చూసేందుకు ప్రజలు తండోపతండాలుగా తంజావూరు వైపు వెళుతుండడం కనిపించింది. ఆ గుంపులో రాక్కమ్మ కూడ కలుసుకొంది. అయినా కూడ ఆళ్వార్ కట్టియాన్ ఆమెను వదలకుండ తంజావూరు వరకు వెన్నంటి వచ్చాడు. రాక్కమ్మ తంజావూరు కోట లోపలికి గుంపులో గుంపుగా దూరి చిన్న పళువేట్టరయ్యర్ మాళిగ వైపు వెళ్ళడం చూసి ఆళ్వార్ కట్టియాన్ చాల అచ్చెరువొందాడు. వెంటనే అరుళ్మొళివర్మగారి వద్దకు వెళ్ళి ఆయనకు, వంతిదేవునికి ఈ సంగతిని తెలియజేశాడు. రాక్కమ్మను పట్టి బంధించేద్దామా అని వారు మొదట అనుకొన్నారు. అలా చేయవద్దని, ఆమె ఎందుకొచ్చిందో తెలుసుకోవడమే ముఖ్యమని తీర్మానించారు. రాక్కమ్మ చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తెకు ఏదో సమాచారం తీసుకొని వచ్చివుండాలని ఊహించారు. చిన్న పళువేట్టరయ్యర్‌కి ఇప్పుడది చెప్పవద్దని, పట్టాభిషేక సమయంలో ఆయనను మంటపం నుంచి బయటకు పంపేందుకు ఉపయోగించుకొందామని తీర్మానించారు.

ఆళ్వార్ కట్టియాన్ మళ్ళీ చిన్న పళువేట్టరయ్యర్ అంతఃపురం వద్దకు వెళ్ళినప్పుడు ఆమె కనిపించలేదు. పట్టాభిషేక మహోత్సవం చూసేందుకు వస్తున్న జనకూటమి ఇంకా పెరిగి పెద్దదికాసాగింది. ఆళ్వార్ కట్టియాన్ ఆ గుంపులో చేరుకొని అంతఃపుర ముఖద్వారాన్ని శ్రద్ధగా గమనించసాగాడు. ఇద్దరు స్త్రీలు అంతఃపురంలోపలినుంచి బయటికి వచ్చారు. వారిలో ఒకతె చంకలో పసిబిడ్డతో ఉంది. ఆ ఇద్దరిలో ఒకతె రాక్కమ్మ అని వెంటనే తెలిసిపోయింది. ఇంకొకామె తలమీద కప్పుకొన్న బట్ట ఆమె ముఖాన్ని

మరుగుపరుస్తూంది. ఆమె చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తె కావచ్చని తిరుమలై ఊహించాడు. వారికడ్డుపడి ఆపడమా, లేక వారెక్కడికి వెళుతున్నారని కనిపెట్టడమా అని నిశ్చయించుకోలేకపోయాడు. ఇంతలో వారు గుంపులో దూరి మాయమైనారు. వారు కోట వాకిలివైపే వెళ్ళివుండాలని ఎంచి ఆళ్వార్ కట్టియాన్ ఆ దిక్కుగా వెళ్ళాడు. కోట వాకిలికవతల నిలిపివుంచిన పల్లకిలో వారెక్కడాన్ని, అశ్వారూఢులైన వీరులు వారి ముందు, వెనక కాపలాగా వెళ్ళడాన్ని చూసేశాడు. ఇక చిన్న పళువేట్టరయ్యర్‌కి ఈ విషయాన్ని ఏ మాత్రం ఆలస్యం చేయకుండ చెప్పేయాలని ఎంచి వేగంగా సభామంటపానికి వచ్చాడు.

ఆ సమయాన పొన్నియిన్ సెల్వన్ తమిళ కవిపుంగవులతో మాట్లాడుతున్నారు. ఆళ్వార్ కట్టియాన్ చిన్న పళువేట్టరయ్యర్‌కి సంగతి తెలియజేయగానే ఆయన అతడితో బయలుదేరారు. తమ అంతఃపురానికి వెళ్ళి తమ కుమార్తెను వెతికారు. కూతురు అక్కడ లేదని గ్రహించి అదిరిపడ్డారు. ఆళ్వార్ కట్టియాన్ చెప్పిన సంగతి నిజమే అయివుండాలని తీర్మానించారు. ఆయన తిరిగి సభామంటపానికి వచ్చేలోపు, “మధురాంతక ఉత్తమ చోళులకు జయహో!” అన్న ఘోషలు వినవచ్చాయి. సభామంటపంలో జరిగింది తెలుసుకొన్న తర్వాత ఇక తమకక్కడ పని లేదని గ్రహించారు. కొందరు అంతరంగ వీరులను తమ వెంట తీసుకొని పారిపోయిన తమ కుమార్తెను వెతికేందుకు బయలుదేరారు. తమ కుమార్తె చోళవంశానికి పారంపర్య శత్రువులైన పాండ్యకులపు ఆపత్కాల సహాయకులతో చేరడమా అని ఎంచినప్పుడు ఆయన మనసు కుతకుతలాడింది. దానికన్న తమ కుమార్తెను తమ చేతులతోనే చంపేయడం మేలని ఎంచి వేగంగా వెళ్ళారు.

~

ఆ రాత్రి ఉత్తమ చోళ చక్రవర్తి పట్టాభిషేక మహోత్సవం ఘనంగా జరిగి ముగిసిన తర్వాత ఆళ్వార్ కట్టియాన్ అరుళ్మొళివర్మగారికి ఆ మధ్యాహ్నం జరిగిందంతా వివరంగా చెప్పాడు. ఆయన వంతిదేవునితో మంత్రాలోచన చేశారు. రవిదాసు కూటమివారు మంత్రతంత్రాలలో ఆరితేరినవారని ముగ్గురికీ తెలుసు. ముక్కుమీద కోపంగొన్న చిన్న పళువేట్టరయ్యర్ వారి మంత్రతంత్రాలను తిప్పికొట్టలేరని, వారి చేత చిక్కి ఆపదకు లోనవుతారని ఎంచారు. ఆయన ప్రియపుత్రికనే చంపేసేటటువంటి విపరీతకార్యాన్ని చేయగలవారని కూడ భావించారు. కాబట్టి చిన్న పళువేట్టరయ్యర్ని కాపాడి పిలుచుకొని రావడానికి, పాండ్యనాడు ఆపత్కాల సహాయకులు ఎక్కడున్నారు, ఏం పథకం వేస్తున్నారు అని తెలుసుకోవడానికి వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ వెంటనే బయలుదేరి వెళ్ళడం మంచిదని నిర్ణయించారు.

~

ఇలా చిన్న పళువేట్టరయ్యర్ తమ కుమార్తెను, ఆమెను తమకు తెలియకుండ తీసుకొని వెళ్ళిన కుట్రదారులను వెన్నంటి వెళ్ళగా, వారు వెళ్ళిన దారిని అక్కడక్కడ విచారించి తెలుసుకొంటూ వంతిదేవుడు, ఆళ్వార్ కట్టియాన్ ముందుకు సాగారు. చిన్న పళువేట్టరయ్యర్ దారి తెలియక అడ్డదిడ్డంగా

వెళ్ళివుండాలని వారిద్దరూ గ్రహించారు. ఇందునుంచి ఆమె కుమార్తెను తీసుకొని వెళ్ళినవారు కావాలనే ఆయనను దారి తప్పించాలని అలా అడ్డదారుల్లో వెళ్ళివుండాలన్న తీర్మానానికి వచ్చారు. కావేరినదీతీరం వెంబడి చాలదూరం ప్రయాణం చేసిన తర్వాత, అమరావతి నది కావేరితో సంగమించే చోట దిశ మారి ఆ ఉపనది తీరం వెంబడి నైఋతి దిక్కున ప్రయాణం చేశారు. చేరదేశానికి, కొంగుదేశానికి ఎల్లగా ఉన్న యానైమలై (=ఏనుగుకొండ) ప్రదేశాన్ని చేరారు. యానైమలై కొండపాదాన్ని చేరుకొన్న తర్వాత ముందుకు ప్రయాణం చేయడం చాల కష్టమైంది. ఆ అరణ్యప్రదేశంలో చెట్లు చాల దట్టంగాను, ఎత్తుగాను పెరిగివున్నాయి. వనమృగాల భయంకర గర్జనలు నలువైపులనుంచి వినవచ్చాయి. గుర్రాలను నడుపుకొంటూ వెళ్ళడం ఇంచుమించు అసాధ్యమనిపించింది. గుర్రాలను వదిలిపెట్టి కాలినడకన వెళితే అవి అడవిమృగాలకు ఎరకావచ్చన్న భయం కూడ ఉంది.

చివరికి మిత్రులిద్దరూ ఇక గుర్రాలను ముందుకు నడుపుకొని వెళ్ళసాధ్యంకాని అతి దట్టమైన అడవిప్రదేశానికి వచ్చి చేరారు. దగ్గర్లో ఎక్కడో ఇంకొక గుర్రం సకిలించే శబ్దం వినిపించింది. ఆ చోటును వెతికి పట్టుకొని వెళ్ళినప్పుడు అక్కడ చిన్న పళువేట్టరయ్యర్ ఎక్కి వచ్చిన గుర్రమూ, దానికి కాపలాగా ఒక మనిషి కనిపించారు. చిన్న పళువేట్టరయ్యర్, ఆయనతో వచ్చిన తక్కిన ముగ్గురు కాలినడకన అక్కడినుంచి ముందుకు వెళ్ళారని తెలిసింది. తమ గుర్రాలను కూడ చూసుకొమ్మని ఆ మనిషికి అప్పజెప్పి మిత్రులిద్దరూ ముందుకు వెళ్ళారు. సూర్యుని వెలుతురే దూరని గాఢాంధకారంతో నిండిన దట్టమైన అడవిమార్గాన చాలదూరం వెళ్ళారు. తర్వాత, చెట్లు దట్టంగా ఉన్న కొండదారి వెంబడి కొండెక్కి వెళ్ళారు. పది అడుగుల దూరానికవతల ఏముందో కనిపించని చిమ్మచీకటి ముసిరిన దారి వెంబడి వెళ్లవలసివచ్చింది.

చివరిగా, కాస్త వెలుతురు పడుతున్న ప్రదేశాన్ని చేరారు. అక్కడ కొండ మీదినుంచి ఒక జలపాతం పడుతుండడం వల్ల ఈ బయలు, వెలుతురు ఏర్పడ్డాయి. దాన్ని దాటుకొని ముందుకు ప్రయాణం చేయడం అసాధ్యమని తోచింది. ఎందుకంటే అక్కడ కొండగోడ అంత నిటారుగా ఉంది. ఎంత వెతికి చూసినా, పైకి వెళ్ళే దారి కనిపించలేదు. జలపాతంలో కాస్త స్నానమాడి, సేదదీరి తిరిగి వెళ్ళిపోవలసిందేనని ఎంచారు. చిన్న పళువేట్టరయ్యర్, ఆయన అనుచరులు వనమృగాలకు ఎరైవుండాలని భావించారు.

~

ఈ సమయాన ఎదురుచూడని ఒక విచిత్రమైన దృశ్యం వారికి కనిపించింది. కొండమీద జలపాతం ఎక్కడ ఆరంభమవుతుందో, అక్కడ రెండు మనుష్యాకారాలు కనిపించాయి. పోరాడుతూనే వారు జలపాతం కిందకురికే చోటును సమీపించసాగారు. వారిని గుచ్చి నిశితంగా చూడగా, ఇద్దరూ తమకు ఇప్పటికే బాగ తెలిసినవారని తెలియవచ్చింది. ఒకరు చిన్న పళువేట్టరయ్యర్; ఇంకొకరేమో ఆయన కుమార్తెను పెళ్ళాడిన పాత మధురాంతకులు! ఆహా! యుద్ధమంటే ముఖం చిట్లించే మధురాంతకులు

ఇంతలో ఇంత లాఘువంగా కత్తియుద్ధం చేయ నేర్చుకోవడం ఎంతటి వింత? దళపతితో సరిసమానంగా / సమవుజ్జీగా కత్తియుద్ధం చేస్తున్నారు కద? అయ్యో! చిన్న పళువేట్టరయ్యర్ వెనుకంజ వేస్తున్నారే! నిజంగానే అలిసిపోయి వెనుకబడుతున్నారా? లేక తమ అల్లుడు కద అని జంకి వెనుకంజ వేస్తున్నారా? ఎలావున్నా కూడ, జలపాతం కిందకురికే అపాయకరమైన చోటుకు వచ్చేస్తున్నారు కద? అయ్యో! అక్కడ జలపాతం నిటారుగా పల్లంలో పడుతూందని ఆయనకు తెలియదులాగుంది!

ఆళ్వార్ కట్టియాన్, వంతిదేవుడు పెద్దగా అరిచి ఆయనను హెచ్చరించేందుకు ప్రయత్నించారు. వారి ప్రయత్నం ఫలించలేదు! జలపాతం పడుతున్నప్పుడు హోరుమని లేచే శబ్దం వంద సింహగర్జనలను, ఏనుగుల ఘీంకారాలను మించగలదు. ఈ ఇద్దరు మనుషుల కేకలు ఆ శబ్దాన్ని అణచివేసి పైకి లేవగలదా, ఏమి?

కాబట్టి వారి కళ్ళముందే ఆ ఘోర సంభవం జరగగా, వారు చూస్తూ ఊరుకోవలసివచ్చింది. ప్రత్యర్థియైన అల్లుడిని చూస్తూ పోరాడుతూ కొద్ది కొద్దిగా వెనక్కి జరుగుతూ వచ్చిన చిన్న పళువేట్టరయ్యర్ జలపాతం చివరికి వచ్చి కాలుజారి నిటారుగా జలపాతం పల్లంలో పడిపోయారు! ఆయనతో పోరాడుతూ వచ్చిన పాత మదురాంతకుడు బండ చివరికి వచ్చి ఒకసారి తొంగి చూసి మరుక్షణం మరుగైనాడు.

చిన్న పళువేట్టరయ్యర్ కాలుజారి కిందపడ్డ ఆ పైభాగం కిందినుంచి సుమారు ఒక కొబ్బరి చెట్టంత ఎత్తుంటుంది. అంతెత్తునుంచి కిందపడ్డవారు బతికి బయటపడతారని ఎదురుచూడలేదు. కానీ ఆ మహావీరుని శరీరాన్నైనా చూద్దామని ఎంచి మిత్రులిద్దరూ జలపాతం పడుతున్న స్థలానికి వేగంగా పరుగెత్తి వెళ్ళారు. చిన్న పళువేట్టరయ్యర్ శరీరం కనిపించలేదు. జలపాతం పడి పెద్ద పల్లమై అది నిండి, పొంగి పొర్లి చుట్టూవున్న కొండరాళ్ళను గుద్దుకొంటూంది. ఆయన శరీరం లోతైన ఆ జలపాతపు కొలనులో పడి మునిగిపోయివుండాలని ఊహించారు. ఒకవిధంగా ఇది మంచిదే. గట్టున బండరాళ్ళ మీద పడివుంటే ఆ మహావీరుని శరీరం ఛిన్నాభిన్నమైవుండేది. లోతైన కొలనులో పడ్డందువల్ల ఆ దుర్గతి తప్పింది. త్వరలోనే ఆ జలపాతం నీటి సుడిగుండం ఆయన శరీరాన్ని బయటకు తీసుకొని వచ్చి గట్టున పడేస్తుందని ఎదురు చూడసాగారు.

వారు ఎదురుచూసింది వృధా కాలేదు. కాసేపటికల్లా చిన్న పళువేట్టరయ్యర్ బయటకు వచ్చారు. మిత్రులిద్దరూ వేగంగా కొలనులోకి దూకి ఆయనను గట్టుకు తీసుకొని వచ్చి చేర్చారు. మొదట, నిర్జీవదేహమని ఎంచారు కాని, ఇంకా ప్రాణం ఉండవచ్చేమోనన్న చిన్న నమ్మకం, ఆశ వారి మనస్సుల్లో కలిగింది. కాబట్టి చన్నీళ్ళలో మునిగిన వారిని బతికించేందుకు చేయవలసిన ప్రధమ చికిత్సలన్నీ చేశారు. చాలసేపటి తర్వాత చిన్న పళువేట్టరయ్యర్ గట్టిగా ఊపిరి వదిలి కళ్ళు తెరిచి చూశారు. ఆయన అధికంగా మాట్లాడలేకపోయారు. కానీ చెప్పవలసింది కొన్న మాటల్లో క్లుప్తంగా చెప్పేశారు.

~

అతి ప్రయాసపడి చిన్న పళువేట్టరయ్యర్ ఆ కొండ శిఖరాన్ని చేరుకొన్నారు. అక్కడ ఇంచుమించు నూరుమంది మధ్య తమ కుమార్తె ఉండడాన్ని చూశారు. రవిదాసు కాలాంతక గండరిని తమతో చేరమని ఆహ్వానించారు. ఆయన అల్లుడే పాండ్యరాజ్యానికి అర్హుడని, అతడికే పట్టం కట్టబోతున్నారని, చేరదేశపు రాజు, లంకరాజు మహీంద్రుడు కొత్త పాండ్యరాజుకు సహాయం చేసేందుకు ముందుకు వచ్చారని చెప్పాడు. వారి ఉద్దేశం తెలుసుకోవడానికి చిన్న పళువేట్టరయ్యర్ వారు చెప్పిందంతా వింటూ వచ్చారు. తర్వాత వారు కుట్రదారులన్న నేరాన్ని వారి మీద మోపి, తమ కుమార్తెను తమతో తిరిగి పంపమని అడిగారు. "మీ కూతురు మీతో వస్తానంటే, పిలుచుకొని వెళ్ళవచ్చు!" అన్నాడు రవిదాసు. చిన్న పళువేట్టరయ్యర్ తమ కుమార్తె ముఖాన్ని చూశారు. ఆమె తన భర్తకు ఏ గతి పడుతుందో తనకూ అదే గతి పట్టనీ అని చెప్పి, ఆయనతో వెళ్ళ నిరాకరించింది. "నిన్ను వీళ్ళతో వదిలిపెట్టి వెళ్ళడం కన్న నా చేతులతోనే చంపేస్తాను!" అని చెప్పి కాలాంతక గండరు కత్తిని పైకెత్తారు. అంతవరకు మరుగైవున్న పాత మధురాంతకుడు ఉన్నట్లుండి ప్రత్యక్షమై, "నా భార్యను చంపేందుకు నీవెవరు?" అని వాగ్యుద్ధం ప్రారంభించాడు. ఇందువల్ల చిన్న పళువేట్టరయ్యర్‌కి కాస్త ఆశ్చర్యం కలిగింది. తమ చేతులతోనే తమ అల్లుడిని చంపి తమ కుమార్తెను విధవను చేయడమా అన్న సందేహం ఆయన మనసులో తలెత్తింది. ఆయన మనసులో కలిగిన ఆందోళనవల్ల తీవ్రంగా పోరాడలేకపోయారు. ఆలోచిస్తూనే వెనుకంజవేయసాగారు. వెనక జలపాతం నిటారుగా కిందికి దూకుతుండడాన్ని గమనించక అందులో పడిపోయారు.

ఇదంతా కష్టపడి చెప్పేసి, "నేనిక బతకబోను. నా అంతిమసమయం దగ్గరకొచ్చేసింది. మీరు వేగంగా తిరిగి వెళ్ళండి. చేరనాడు మీదికి, లంకమీదికి చోళమహాసైన్యం దండెత్తి వెళ్ళాలి. పొన్నియిన్ సెల్వన్‌గారికి మదురైలో 'చోళపాండియన్' అన్న అభిషేకనామంతో పట్టాభిషేకం చేయమని చెప్పండి. ఈ మూడు కార్యాలను వెంటనే చేయకపోతే చోళసామ్రాజ్యానికి మహాపాయం కలుగుతుంది. మళ్ళీ మునుపటిలాగ పాండ్యరాజ్యం వేరుపడిపోతుంది! వెంటనే వేగంగా వెళ్ళండి!" అన్నారు చిన్న పళువేట్టరయ్యర్. వారిని ఈ స్థితిలో అనాధగా వదిలిపెట్టి వెళ్ళేందుకు మిత్రులిద్దరికీ మనసు రాలేదు. కాబట్టి ఇద్దరిలో ఒకరు ఆయనను చూసుకోవాలని, ఇంకొకరు తంజావూరుకు వెళ్ళాలని తీర్మానించారు. ఇద్దరిలో వేగంగా గుర్రం నడపగలవాడు వంతిదేవుడు కాబట్టి అతడే తంజావూరుకు వెళ్ళవలసివచ్చింది.

~~~
~~~

# అధ్యాయము - 90

## స్వర్ణవర్షం కురిసింది!

**వంతిదేవుడు** తాను ఆనైమలైకి వెళ్ళివచ్చిన వృత్తాంతాన్ని చెప్పి ముగించగానే కుందవైదేవి అతన్ని చూసి, "అయ్యా! మీరు చెప్పిన వృత్తాంతం చాల విచిత్రంగా ఉంది. నిజంగా జరిగిన సంఘటనేనా అని సందేహం కూడ కలుగుతూంది. కట్టుకథలు చెప్పడంలో మీరు నిష్ణాతులని ఎరుగుదును. అందులోను మీరు తరచూ మాట మార్చి, దిద్ది, కిందా మీదా చూస్తూ మాట్లాడినప్పుడు నా సందేహం ఇంకా అధికమైంది!" అన్నది.

వంతిదేవుడు మళ్ళీ ఒకసారి కిందా మీదా చూసేసి, కుందవైదేవిని చూశాడు.

"దేవీ! కట్టుకథలు చెప్పేందుకు వేరే సందర్భాలున్నాయి. నాకున్న ఆ సామర్థ్యాన్ని మీముందు ఇంతవరకు ప్రదర్శించలేదు. మధ్యమధ్య నా మాటలు తడబడ్డందుకు వేరే కారణముంది!" అన్నాడు.

"అది కూడ పెద్ద రహస్యమా? ఆడవాళ్ళకు చెప్పకూడనిదా?" అని అడిగింది కుందవై రాకుమారి.

"ఇంకెవ్వరికీ చెప్పకూడని రహస్యమే. కానీ అనుమతిస్తే అది కూడ చెబుతాను!" అన్నాడు వంతిదేవుడు.

"నిజం చెప్పేందుకు నా అనుమతి ఎప్పుడూ ఉంది!" అన్నది కుందవై.

"అలాగైతే చెప్పేస్తాను. తర్వాత నామీద కోపగించుకోవడం వల్ల ప్రయోజనం ఉండదు. నేను మీతో మాట్లాడుతున్నప్పుడు కొన్నిసార్లు యధాలాపంగా నా చూపు మీ కళ్ళలో పదిలమైపోతూంది. దేవి నల్లని కళ్ళలో ఏం మాయ ఉందో తెలియదు. అది నన్ను చేష్టలుడిగి నిలిచిపోయేలా చేస్తుంది. మళ్ళీ సంభాళించుకొని నా మాటలను కొనసాగిస్తున్నాను!" అన్నాడు.

కుందవై పెదవులు విరిసాయి. బుగ్గలు సొట్టపడ్డాయి; కళ్ళు నవ్వాయి.

"అయ్యా! నా కళ్ళలో అటువంటి ఊహాతీతమైన మాయశక్తేమీ లేదు. కొంతకాలంగా కాటుక పెట్టుకోవడం కూడ వదిలిపెట్టేశాను. నా కళ్ళలో మీరు మీ రూపాన్నే చూసివుంటారు. అదే మిమ్మల్ని నిశ్చేష్టులయ్యేలా చేసివుంటుంది!" అన్నది.

"దేవీ! నా రూపాన్ని నేను అద్దంలో చూసి ఎరుగుదును. తేట నీటిలో నా ప్రతిబింబాన్ని చూసివున్నాను. అప్పుడల్లా నేనెటువంటి ఆశ్చర్యానికి లోనుకాలేదు!" అన్నాడు వంతిదేవుడు.

"నా కళ్ళను అద్దంతోను, నీటితోను పోలుస్తున్నారా? అద్దం మసకబారిపోతుంది; నీరు కలతబారుతుంది!" అన్నది కుందవై.

"అద్దం మాసిపోతే తుడిచి శుభ్రం చేస్తాను. నీరు కలతబారకుండ చూసుకొంటాను. మీ కనురెప్పలు మూసి తెరవేసి నా రూపాన్ని మరుగుపరచడాన్ని నేనడ్డుకోలేను కద?" అన్నాడు వంతిదేవుడు.

"అద్దం ముందు నిలబడితేనే రూపం ప్రతిబింబిస్తుంది. నీరు కలతబారకుండ తేటగా ఉంటేనే రూపం కనిపిస్తుంది. కానీ నా కళ్ళు తెరిచివున్నా, మూసినా మీరు నా ముందున్నా, లేకున్నా కూడ మీ రూపం నా కళ్ళలో ఎప్పుడూ ప్రకాశిస్తుంది. ఈ విచిత్రానికి కారణమేమని మీరు చెప్పగలరా?"

~

వంతిదేవుడు, ఒడలు పులకరించగా, గద్గద స్వరంతో, "దేవీ! ఆ కారణమేమిటో తెలియడం లేదే!" అన్నాడు.

"తెలియకపోతే నేనే చెబుతాను. మీ దగ్గరే ఏదో అటువంటి మాయమంత్రశక్తి ఉంది. చోళకులం మీద పగతీర్చుకోవడానికి వచ్చిన నందిని మనసు కూడ మిమ్మల్ని చూసి చంచలించింది కద?"

"కాసేపటి క్రితం అమృతం కన్న తీయని మాట చెప్పి నన్ను పరవశింపజేశారు. అదే ఊపులో ఆ క్రూరవిషసర్పం మాటెందుకు?"

"నందినిని మనసులో విషం నింపుకొన్న పాముని నేను ఒకప్పుడు భావించేదాన్ని. ఇప్పుడామెను తలుచుకొన్నప్పుడు ఆమె మీద జాలే కలుగుతూంది."

"నందిని మీద మీరు కనికరంగొనడం చోళకులాన్ని నాశనం చేసేందుకు వచ్చే హాలాహలం మీద కనికరం చూపినట్లే."

"అయ్యో! చోళవంశానికే కులదైవమైపోయిన మందాకినీదేవి కుమార్తె ఆమె! నా ముద్దుల తమ్ముడు అరుళ్మొళిని ఎన్నోసార్లు కాపాడిన దేవత కూతురామె! నా తండ్రి కుట్రదారుల శూలానికి గురి కాకుండ తన ప్రాణాలనే బలి ఇచ్చి కాపాడిన మందాకినీదేవి పుత్రిక ఆమె...!"

"కానీ ఆ కుట్రదారులను ఎగదోసింది ఆమే! ఆదిత్య కరికాలన్‌గారికి యముడిగా వచ్చింది ఆమే! వీరాధివీరులైన పెద్ద పళువేట్టరయ్యర్ని తన మోహపు వలలో పడేలా చేసి కీలుబొమ్మలా ఆడించింది ఆమే..."

"పెద్ద పళువేట్టరయ్యర్ మతిని మాత్రమేనా పోగొట్టింది? పార్థిబేంద్రపల్లవుడు, గందమారన్ మొదలైనవారిని కూడ బుట్టలో వేసుకొని తన చిటికెనవేలి చుట్టూ తిప్పుకొంది! ఇదంతా తెలిసివుండి కూడ నేనామెను అసహ్యించుకోలేకపోతున్నాను, ఆమె మీద కోపం తెచ్చుకోలేకపోతున్నాను. వీరపాండ్యుని మరణానికి పగ తీర్చుకోవడానికే ఆమె ఇదంతా చేసింది! చేటట్టిన కార్యాన్ని నెరవేర్చడంలో గెలుపొందింది! వీరకులానికి చెందిన అమ్మాయి! ఆమె ఇటువంటి భయంకర కృత్యాలను చేపట్టేందుకు ఒకవిధంగా నేను కూడ కారణమని ఎంచినప్పుడు విచారంగా ఉంది. ఆమె చిరుప్రాయంలో ఆమెను పళైయారైనుంచి

తరిమికొట్టాము..."

"మంచిపని చేశారు, దేవీ! మీ మనసులో నిండిన కనికరం వల్ల ఆమె చోళకుల శత్రువు కుమార్తె అన్న నిజాన్ని మరువకండి! వీరపాండ్యుని కుమార్తె చోళుల ఇంట పెరిగి అందువల్ల కలిగిన అనర్థాలు చాలవా? వీరపాండ్యుని కుమార్తె ఇక్కడే పెరిగి ఆదిత్య కరికాలన్‌గారిని పెళ్ళాడేటట్లు జరిగివుంటే...."

"చాల మేలు జరిగివుండేది. ఈ రెండు పెద్ద కులాల మధ్య పగ వీడి రెండు కులాలు కలిసి ఒక కులమైవుండేది. కానీ ఆ వార్త నిజమేనా?"

"దేని గురించి అడుగుతున్నారు, దేవీ?"

"నందిని వీరపాండ్యుని కుమార్తె అన్న విషయం నిజమేనా?"

"నందిని అలాగని ఆదిత్య కరికాలన్‌గారికి చెప్పగా నేనే నా చెవులారా విన్నాను. పెద్ద పళువేట్టరయ్యర్ కూడ విన్నారు. అందువల్ల ఆయన మనసు పూర్తిగా మారిపోయి ఆయన రౌద్రాకారం దాల్చేలా చేసింది. ఆ వార్తే ఆదిత్య కరికాలన్‌గారి ప్రాణానికి యముడైంది"

"కాస్త ఆలోచించండి! కరికాలన్ మీద పగ తీర్చుకోవడానికే ఆమె అలా చెప్పివుండవచ్చు కదా? వీరపాండ్యుని కరికాలన్ కోపం నుంచి కాపాడేందుకు అమె ఇంకొక విధంగా చెప్పిన విషయం మీకు తెలుసు. కన్న తండ్రిని తన ప్రేమికుడని ఏ ఆడదైనా తన నోటితో చెప్పగలదా?"

"దేవీ! కరికాలన్‌గారప్పుడు ఆవేశంగొనివున్నారు. ఆమె ఏం చెప్పిందో, ఈయన ఏమని అర్థం చేసుకొన్నారో ఎవరికి తెలుసు? కరికాలన్‌గారు చెప్పిందే కదా? ఆయనే తర్వాత నందిని 'వీరపాండ్యుడు నా తండ్రి' అని చెబితే నమ్మేశారు కదా? పైగా, వీరపాండ్యుడు మరణించిన తర్వాతే ఇది ఆమెకు తెలిసివుండవచ్చు కదా? నందిని తన పుట్టుక గురించిన నిజాన్ని తెలుసుకోవడానికి ఏమేం ప్రయత్నాలు చేసిందో మీకు తెలుసు కదా? నడిరాత్రి తన తల్లి ఆత్మలాగ నటించి సుందరచోళ చక్రవర్తికి పిచ్చిపట్టేలా చేసింది కదా? అది చూసి మీ స్నేహితురాలు వాణతి మూర్ఛిల్లి పడిపోలేదా...?"

"పాతాళ చెరసాలలో మూడేళ్ళపాటు బంధించబడి మీతోబాటు విడుదల చేయబడ్డ పిచ్చివాడిని ఆళ్వార్ కట్టియాన్ భయపెట్టి తెలుసుకొన్న నిజం మీకు తెలిసేవుంటుంది..."

"తెలియకేమి? నందినికి, ఆమె సహోదరునికి తానే తండ్రినని వాడు చెప్పాడు..."

"అదే నిజం కూడ కావచ్చు కదా?"

"అలాగైతే, అబద్ధం కూడ కొన్నిసార్లు బలీయంగా ఉంటుంది. అంతఃపురంలోనే పెరిగి, యుద్ధరంగమంటేనే భయపడే పాత మధురాంత దేవరు తాము వీరపాండ్యుని కుమారుడని తెలుసుకోగానే ఎంతటి వీరపురుషులయ్యారన్నది మీరు చూసివుంటే భ్రమించిపోయేవారు. ఒకసారి చిన్న పళువేట్టరయ్యర్ తమ వజ్రహస్తంతో నా భుజాన్ని పట్టుకొన్నారు. అది తలుచుకొంటే ఆయన పట్టుకొన్న చోట ఇంకా

నొప్పెడుతుంది. అటువంటి మహావీరులతో మనమందరం 'పిరికిపంద' అని ఎంచిన పాత మధురాంతకులు సరిసమానంగా కత్తియుద్ధం చేసిన సంఘటనను నేనెన్నడూ మరువలేను."

"అందుగురించే నేను కూడ మీ మాటల మీద సందేహంగొన్నానని చెప్పాను."

"నమ్మలేని సంభవమే. నందిని మూసిన పల్లకిలో ప్రయాణం చేసేవాడు, పళువేట్టరయ్యర్ పేరు వింటేనే గడగడ వణికేవాడు మనమెరిగిన పాత మధురాంతకుడు - చిన్న పళువేట్టరయ్యర్‌తో సరిసమానంగా కత్తియుద్ధం చేయ తెగిస్తాడని ఎవరూహించగలరు? కానీ అది నిజంగా జరిగిందని ఆళ్వార్ కట్టియాన్ తిరిగివచ్చి మీకు చెబుతాడు."

"అయ్యా! మీరు నందినిని చూడ సాధ్యం కాలేదా?"

"ఆ స్త్రీరూపందాల్చిన రాక్షసిని నేనెందుకు చూడాలి?"

"నందిని గురించి ఇక అలా మాట్లాడకండి. ఎప్పుడైనా ఒకరోజు నేనే ఆమెను కలుస్తాను. నిజానికి ఆమె తండ్రి ఎవరన్నది కూడ తెలుసుకొంటాను. కానీ ఒకటి తెలుసుకోండి. నందిని గురించి నా ముందు ఏదీ తప్పుగా, లోకువగా మాట్లాడకండి. ఆమె తండ్రి ఎవరైనా కూడ, ఆమె తల్లి ఎవరన్న విషయం గురించి సందేహం లేదు కద? నేనామె మీద అనురాగంగొనేందుకు ఆ ఒక్క కారణమే చాలు. దానికన్న ఇంకొక ముఖ్యమైన కారణం ఉంది..."

"ఏమది?"

"నందిని మీమీద ప్రీతిగొన్నది. ఆమె తన రాజముద్రగొన్న ఉంగరాన్ని మీకిచ్చింది. తంజావూరు కోటనుంచి తప్పించుకోవడానికి సహాయం చేసింది. కొళ్ళిడం నదీతీరానున్న అడవిలో రవిదాసు కూటమి చేత చిక్కినప్పుడు మళ్ళీ మిమ్మల్ని కాపాడింది..."

"చివరిగా, ఆదిత్య కరికాలన్‌గారిని హత్య చేశానన్న భయంకరమైన నిందను నా తలమీద మోపింది. అందుకోసమే అన్ని కుట్రలు పన్నింది!"

"ఎందుకలా చేసిందని మీకు తెలియరాలేదా?"

"పాము ఎందుకు కరుస్తుందన్న ప్రశ్నకు జవాబు చెప్పాలా? చిరుత ఎందుకు మీదికి దూకుతుందన్న ప్రశ్నకు ఉత్తరం అవసరమా?"

"నందిని పుట్టినప్పుడే పాముగానే, చిరుతగానో పుట్టలేదు. మేమే ఆమెను అలా మార్చాము. సందర్భాలలా మార్చాయి. మీరు కూడ అందుకు కారణమైనారు, ఒకవిధంగా."

"అయ్యయ్యో! ఎందుకలాంటి లేనిపోని నింద నామీద? నేనామెకు అలాంటి కీడేం చేశాను?"

"మీరామెకెలాంటి కీడూ చేయలేదు; ఆమే మీమీద ప్రేమగొన్నది."

"భగవాన్!"

"పురుషులు కొన్ని విషయాల్లో కళ్ళుండీ గుడ్డివారవుతున్నారు కాబోలు. అయ్యా! ఇది

వినండి! నందిని మనసు మీకు తెలియలేదా? నేను బాగా తెలుసుకొన్నాను. ఆ దౌర్భాగ్యశాలి నిజానికి వీరపాండ్యుని మీద ప్రేమగొనలేదు; పెద్ద పళువేట్టరయ్యర్ మీద కూడ ప్రీతిగొనలేదు; ఆదిత్య కరికాలన్‌తో ఆమెకు నిజమైన స్నేహం లేదు. వారందరి మీద ప్రేమగొన్నట్లు నటించినదంతా రాజపీఠం మీద కూర్చోవడానికే!"

"అది నాకు కూడ తెలుసు, దేవీ! ఆమె కిరాతక హృదయంలో అణువంత ప్రేమకు కూడ చోటు లేదు!"

"అది పొరబాటు. మిమ్మల్ని చూసినప్పుడే ఆమె మనసులో నిజమైన ప్రేమ పుట్టింది. మీ అభిమానాన్ని చూరగొనడానికి ఆమె ఏం చేసేందుకైనా సిద్ధమైంది..."

"నామీద యువరాజును చంపిన నిందను మోపేందుకు కూడ సిద్ధమైంది."

"అదెందుకని? మీరెన్నటికీ చోళకులంతో స్నేహసంబంధాలు ఏర్పరచుకోకుండ చేసేందుకే...."

"అందుకని నేను తంజావూరు వీధుల కూడలిలో ఉరికంబం ఎక్కేందుకు ఏర్పాట్లు చేసేసింది. దానికన్న ఆమె చేతబట్టిన కత్తితోనే నన్ను చంపివుండవచ్చు కద?"

"మిమ్మల్ని చంపదలచివుంటే ఆమె అలా చేసివుండవచ్చు. లేక రవిదాసు కూటమి చేత చంపించివుండవచ్చు. పెద్ద పళువేట్టరయ్యర్ నేరాన్ని తమ మీద వేసుకొని ఉండకపోతే, పొన్నియిన్ సెల్వన్ అడ్డుపడివుండకపోతే, మిమ్మల్ని నిజంగానే ఉరికంబం ఎక్కించేందుకు ఆజ్ఞ జారీ చేయబడివుంటే, రవిదాసు కూటమి వచ్చి మిమ్మల్ని విడిపించుకొని వెళ్ళేవారు. మీరు కూడ ఒకవేళ ఈనాడు ఆనైమలై మీదున్న కూటమిలో చేరివుండేవారు..."

"అటువంటి విపత్తు కలగకుండ దేవుడే నన్ను కాపాడాడు."

"చోళనాడును కూడ కాపాడారు. మీవంటి ఒక వీరుల సేవ చోళనాడుకు దక్కేందుకు కాపాడారు."

"దేవీ! చోళనాడు మహత్తరమైనది. అయిదు లక్షల వీరుల శూలాలు, ఖడ్గాలు ఈ సామ్రాజ్యాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్నాయి. నేనొక్కడిని ఈ సామ్రాజ్యానికి అంత ముఖ్యం కాదు..."

"చోళసామ్రాజ్యాన్ని నలువైపులనుంచి కొత్త అపాయాలు కమ్ముకొస్తున్నాయని మీరే చెప్పారు."

"అది నిజమే, దేవీ! రవిదాసు శక్తిసామర్థ్యాలు మహత్తరమైనవి. పాండ్యనాడు సింహాసనానికి అర్హులైనవారిద్దరిని పుట్టించేశాడు. ఇంతకు మునుపే ఒక చిన్న పిల్లాడికి పాండ్యరాజన్న పట్టాన్ని కొళ్ళిడం నదీతీరం అడవిలో కట్టబెట్టాడు. ఆ పరాంకుశ నెడుంజెళియన్‌తోబాటు ఇప్పుడు అమరభుజ నెడుంజెళియన్ ఒకడు చేరాడు..."

"అదెవరు అమరభుజ నెడుంజెళియన్?"

"మన పాత మధురాంతకుని కొత్త పేరది. పాండ్యరాజ్యానికి హక్కు చెలాయించేవారు

'మధురాంతకుడు' అన్న పేరుతో చెలామణీ కాలేడు కద? చిన్న పళువేట్టరయ్యర్ జలపాతపు పల్లంలో పడిపోయిన వెంటనే కొండ శిఖరాన 'పాండియన్ అమరభుజ నెడుంజెళియన్‌కి జయహో!" అన్న ఘోష లేచింది - ఆ జలపాత ఘోషను అదిమేస్తూ!"

"ఇలా ఇద్దరు వారసులను / హక్కుదారులను ఏర్పాటు చేయడం వల్ల రవిదాసు కూటమికి ఏం లాభం?"

"ఒకడికేమైనా జరిగితే ఇంకొకడు చేతిలో ఉండనీ అని. ఒకడివల్ల లంకరాజు మహీంద్రుని సహాయం పొందేందుకు, ఇంకొకడి వల్ల చేరదేశపు రాజు సహాయాన్ని పొందేందుకు వారు పన్నాగం పన్నుతారు..."

"అయ్యా! మీరు, నా తమ్ముడు కూడబలుక్కొని కుట్రపన్ని ఉత్తమ చోళుల తలమీద చోళ మణిమకుటాన్ని కట్టబెట్టేశారు. ఉత్తమ చోళులకు మీరు పెద్ద మేలు చేశారని నేను భావించడం లేదు. ప్రస్తుతం చోళసామ్రాజ్యభారాన్ని మోయడం అంత తేలికని తోచడం లేదు..."

"చోళసామ్రాజ్యభారాన్ని మోయడం ప్రస్తుత పరిస్థితుల్లో చాల కష్టమైనదే. కానీ దాన్ని ఉత్తమ చోళులా భరించబోతున్నారు? ఆయన తమ తల్లికి తోడుగా ఆలయకైంకర్యాలలో కాలం గడపబోతున్నారు. చోళసామ్రాజ్యాన్ని భరించేవారు, కాపాడి రక్షించబోయేవారు మీ సహోదరుడు అరుళ్మొళి వర్మగారే!"

"అది నిజమే. అరుళ్మొళి అందుకు సమర్థుడే. కానీ వాడు ప్రాయంలో చిన్నవాడు; అనుభవం లేనివాడు. చోళసామ్రాజ్యాన్ని భరిస్తూ వచ్చిన రెండు పెద్ద వజ్ర స్తంభాలు - పళువూర్ రాజులు - ఇక లేరు. పెద్దాయన మనందరినీ వదిలే వెళ్ళిపోయారు. మీరు చెప్పేది చూస్తే, చిన్న పళువేట్టరయ్యర్ బతకడం సందేహమేననిపిస్తూంది...."

"ఆయన బతికి వచ్చినా కూడ రాజ్యానికి ఉపయోగపడరు. తమ కూతురిని, అల్లుడిని తలుచుకొని కుంగిపోతారు..."

"శంబువరయ్యర్ కూడ అదే స్థితికి చేరుకొన్నారు. ఈ కొన్నాళ్ళలో ఆయన మనసు, శరీరం కూడ పూర్తిగా అలిసిపోయాయి. మలైయమాన్ ఇప్పటికే వయసు మళ్ళినవారు. తమ మనుమల్లో ఒకడు మరణించి, ఇంకొకడికి పట్టం లేకపోగానే అయన కూడ పూర్తిగా కుంగిపోయారు. కొడుంబాళూర్ పెద్ద వేళార్ మనసు ఒక స్థితిలో లేదు. అరుళ్మొళి పట్టం కట్టుకోబోతున్నానని చెప్పి, చివరి నిమిషంలో తమను ఏమార్చేసిన విషయాన్ని ఆయన క్షమించలేకపోయారు. అరుళ్మొళి వాణతిని పెళ్ళిచేసుకోవడం కూడ ఆయనకంతగా తృప్తినివ్వలేదు. ఇక రాజ్యవ్యవహారాలలో తాము తల దూర్చబోమని, కొడుంబాళూర్‌లో ఆలయకైంకర్యాలు చేయబోతున్నామని చెప్పేసి వెళ్ళిపోయారు. కడంబూర్ మాళిగలో జరిగిన రహస్య సమావేశంలో పాల్గొన్న చిన్న, సామంతరాజులందరూ వారు అనుకొన్న కార్యం ఇంకొక విధంగా ముగియడంతో కుంగిపోయారు. అయ్యా! అరుళ్మొళికి సహాయం చేసేందుకు తోడుగా ఉండేవారు కావాలి.

ఖడ్గబలం, భుజబలంతోబాటు బుద్ధిబలం కూడ కలిగిన మంచి స్నేహితులు వాడికి కావాలి!"

"మంచివేళగా పార్థిబేంద్రపల్లవుడున్నాడు!" అన్నాడు వంతిదేవుడు.

"ఆయన సహాయం కూడ అరుళ్మొళికి దొరుకుతుందని చెప్పలేము. ఆయనను ఊరవతలికి పంపేసి ఉత్తమ చోళులకు పట్టం కట్టింది ఆయనకు కోపం తెప్పించింది. దానికన్న, అరుళ్మొళి మిమ్మల్ని తన అంతరంగస్నేహితులుగా ఎంచడం ఆయనకు నచ్చలేదు..."

"ఆయన కోపం న్యాయమైనదే. చోళకులానికి ఆయన ఎంతో సేవ చేశారు. నేనేమో కొత్తగా వచ్చినవాడిని. కావాలంటే నేనాయన వద్ద క్షమాపణ కోరుతాను."

కుందవై కాసేపాలోచించి, "అది అగ్నికి ఆజ్యం పోసినట్లవుతుంది" అన్నది.

"పార్థిబేంద్రులు మహావీరులు. ఆయనను సమాధానపరిచేందుకు ఇంకేదారి లేదా?" అన్నాడు వంతిదేవుడు.

"ఆయనే ఆ దారిని సూచించారు. నా తండ్రికి తమ కోరికను వెలిబుచ్చారు..."

"పార్థిబేంద్రుల కోరికను నెరవేర్చేందుకు చక్రవర్తి అభ్యంతరం చెప్పివుండరు..."

"కానీ అది చక్రవర్తికి సంబంధించినది కాదు. ఆయన కుమార్తెకు సంబంధించినది. ఆయన కుమార్తె దాన్ని తిరస్కరించింది! అవునయ్యా! శివాలయానికి పూలసేవ చేస్తున్నవారు ఉన్నట్లుండి సింహాసనమెక్కి మణిమకుటాన్ని ధరించడాన్ని చూసి పల్లవకులశేఖరులు ఓర్వలేకపోయారు. సముద్రంలో పడవ నడిపే పిల్ల సింహాసనమెక్కగానే ఆయన సహించలేకపోయారు. పాత పల్లవనాడుకు తమను స్వతంత్రరాజుగా చేస్తూ శిలాశాసనం చెక్కించమని అడిగారు...."

"ఆహా! అదెలా సాధ్యం? చోళరాజ్యం ఛిన్నాభిన్నం కాదా?"

"ఆ హక్కునిచ్చేందుకు నా తండ్రి ఆమోదం తెలిపేశారు. దానితో పల్లవకుమారులాగలేదు. మునుపొకసారి పల్లవ రాకుమారి చోళరాకుమారుని పెళ్ళాడిందట. దానికీడుగా సుందరచోళ చక్రవర్తి కుమార్తెను తమకిచ్చి పెళ్ళిచేయాలని కోరారు!"

~

ఇది వినగానే వంతిదేవిని ముఖం చాల కుంగిపోయింది. దాన్ని దాచుకోవడానికి ముఖాన్ని అటువైపు తిప్పుకొన్నాడు.

కుందవై ముఖాన చిరునవ్వు విరిసింది. కావాలనే ఆమె ఇంకా ముందుకు ఏమీ చెప్పక ఊరుకొంది.

కాసేపాగి వంతిదేవుడు, "అందుకు చక్రవర్తి ఏం ఉత్తరమిచ్చారు?" అని అడిగాడు.

"దానికి చక్రవర్తి ఎలా జవాబు చెప్పగలరు? అది ఆయన కుమార్తె కోరిక మీద కద ఆధారపడివుంటుంది? చక్రవర్తి తమ కుమార్తెను అడిగారు...."

"చక్రవర్తి కుమార్తె అందుకేం ఉత్తరమిచ్చారు?"

"పార్థిబేంద్రుని పాణిగ్రహణం చేసేందుకు సమ్మతించనని చెప్పేసింది!"

"ఎందుకు? ఎందుకు?" అని వంతిదేవుడడిగిన గొంతులో ఎనలేని కుతూహలం తొణికింది.

"చక్రవర్తి కుమార్తె కారణమెందుకు చెప్పాలి? అయినా కూడ, ఒక కారణం చెప్పింది. పునీతమైన పొన్నినది పారే పుణ్యదేశాన్ని విడిచి విదేశానికి వెళ్ళడానికిష్టపడడం లేదని చెప్పింది."

"అదొక్కటేనా కారణం?"

"ఇంకొక కారణం ఉండవచ్చు. అందులో ఆసక్తి ఉన్నవారికి కద చెప్పాలి? డొంకతిరుగుడుగా అడిగేవారికి ఎందుకు చెప్పాలి?"

"దేవీ! అమితాసక్తితోను, శ్రద్ధతోను అడుగుతున్నాను!"

"అంతగా శ్రద్ధాసక్తులు ఉన్నవారు తమకు తామే తెలుసుకొంటారు. వారికి చెప్పనవసరం లేదు."

~

కుందవైదేవి ముఖాన్ని అప్పుడే మొదటిసారి చూస్తున్నట్లు వంతిదేవుడు ఆమె ముఖాన్ని చూశాడు.

మెరుపును మెరుపు రాసుకొంది. అలలు ఒకదానికొకటి గుద్దుకొన్నాయి. స్వర్గం భూమికి దిగివచ్చింది. భూలోకం ఆకాశలోకమైంది.

కనుకొలకుల్లో చిలిపినవ్వుతో, "ఒక అమ్మాయి మనసులో ఉన్నది తెలుసుకోలేక ఆమె నోరు విప్పి చెప్పాలని ఎదురుచూసే మగవారిన ఏమనుకోవాలి? చోళసామ్రాజ్యపు పగవారి తంత్రాలను, పన్నాగాలను వారు పసిగట్టగలరని ఎలా నమ్మడం?" అన్నది.

వంతిదేవుడు కాసేపు పైకీ కిందకీ చూసేసి, "దేవీ! పురాతన పల్లవకులంలో పుట్టిన పార్థిబేంద్రుడు కోరిన అదే కోరికను ఇల్లూ వాకిలి లేని ఒక అనాధ యువకుడు వెలిబుచ్చితే, అందుగురించి చక్రవర్తి ఏమనుకొంటారు?" అన్నాడు.

"ఆయన ఏమనుకొన్నా కూడ, తమ కుమార్తె కోరిక ఏమని అడుగుతారు; ఆ విధంగానే బదులు చెబుతారు."

"దేవీ! చక్రవర్తి ముద్దుల కుమార్తె ఏమని ఉత్తరమిస్తుంది?"

"ఇలా డొంకతిరుగుడుగా అడుగుతూ కష్టపడనేల? చక్రవర్తినే అడిగి తెలుసుకోవచ్చు కద? జవాబు వెంటనే తెలుస్తుంది!" అన్నది కుందవై.

"అదెలా సాధ్యం? లంకనుంచి వేంగినాడు వరకు ఒకే ఛత్రం కింద ఏలే రారాజు ప్రియపుత్రికను తనకిచ్చి పెళ్ళి చేయమని ఒక ఊరూ పేరూ లేని యువకుడు - బంధువులు, తోబుట్టువులు లేని ఒక

అనాధ – ఎలా తెగించి అడగగలడు?" అన్నాడు వంతిదేవుడు.

"వాణర్‌కులంలో పుట్టిన ఒక వీరులకు ఇంతటి వినయం ఎక్కడినుంచి అబ్బింది? మొట్టమొదట మీరు నన్ను చూసినప్పుడు మీ కులం గొప్పలను నాకు చెప్పింది మరిచిపోలేదు. చేర, చోళ, పాండ్యవంశస్థుల అంతఃపురాల్లో మగబిడ్డలు పుడితే, ఆ మగబిడ్డ ఎద విశాలంగా ఉంటే, ఆ బిడ్డ ఎదమీద << మావలివాణ్ >> పేర్లన్నీ రాయవచ్చని అంతఃపురవనితలు మురిసిపోయేవారన్నారు. వాణర్‌కుల రాజు మాళిగ వాకిట తక్కిన రాజులందరూ పేచివుండేవారని, కవిపుంగవులు రాజు వద్ద తీసుకొని వెళుతున్న బహుమానాలను చూసి, 'అది నా గుర్రం', 'అది నా ఏనుగు' అని తమలో తాము మాట్లాడుకొనేవారని చెప్పారు. అలా గొప్పలు చెప్పుకొనేవారు ఇప్పుడింత వినయంగా మాట్లాడుతున్నారెందుకని?"

"అందుకు మీ తమ్ముని స్నేహమే కారణం, దేవీ! కులం గొప్పలు చెప్పుకొని గర్వపడడం ఆయనకిష్టం లేదు. సూర్యవంశంలో జన్మించినవారని, కరికాల్ వలవన్ వంశస్థులని, విజయాలయ చోళుల మనుమడి మనుమడినని గొప్పలు చెప్పుకోవడం తలుచుకొని ఆయన నవ్వుతున్నారు. ఆయన ఒకనాడు నాతో ఏమన్నారో తెలుసా? 'నా కులపూర్వీకులు ఇంతవరకు తామ్ర, శిలాశాసనాలు రాయించేటప్పుడల్లా సూర్యవంశంనుంచి, మనునీతి చక్రవర్తి నుంచి, శిబి చక్రవర్తి నుంచి మొదలుపెట్టి రాయించేవారు. నేను రాజపీఠాన్నధిష్టిస్తే, అ సంప్రదాయాన్ని మార్చేస్తాను. నేను చెక్కించే శిలాశాసనాల్లో, రాయించే తామ్రపత్రాలలో నేను సాధించిన కార్యాలను మాత్రమే రాయిస్తాను. అప్పుడా శాసనాలు కట్టుకథలా అనే సందేహానికి తావివ్వకుండ నిజమైనవిగా కీర్తిగొని విరాజిల్లుతాయి!' అన్నారు. దేవీ! నేను కూడ ఆయన మాటను ఒప్పుకొంటాను. నా వంశ గతవైభవాలను గురించి ఇక గొప్పలు చెప్పుకోకూడదని నిర్ణయించుకొన్నాను. మీ తండ్రిగారి వద్దకు వెళ్ళి నా కులం పాత గొప్పతనాలను చెప్పి మీ చేయి కోసం చేయి చాచను. అరుళ్మొళి వర్మ, నేను ఈ చోళసామ్రాజ్యం మేలు కోసం మా జీవితాలను పణంగా పెట్టాము. ఉత్తరాన వింధ్యపర్వతాల మీద, దక్షిణాన త్రికోణమలై (మలై=కొండ) మీద, పశ్చిమాన లక్షదీవుల మీద, తూర్పున సముద్రాలకవతల ఉన్న శావగం, గడారం, కాంభోజం మొదలైన రాజ్యాలలో పులిజెండాను ఎగురవేయాలని తీర్మానించాము. మేము పైన సూచించిన కార్యాలలో ఒకింత వరకు విజయం సాధించిన తర్వాతే సుందరచోళ చక్రవర్తి వద్దకు వెళ్ళి, 'ఇదిగో నేను సాధించిన విజయమాలలు - వీటిని తమ కుమార్తెకు సమర్పించేందుకు అనుమతినివ్వండి' అని నా విన్నపాన్ని తెలియజేస్తాను. లంకకు వెళ్ళి మహీంద్రుని జయించి పాండ్యరాజు మణిమకుటాన్ని, రత్నహారాన్ని తీసుకొని వచ్చి రాకుమారి ముందు సమర్పిస్తాను. సమర్పించి, 'తమ దివ్యహస్తాన్ని గ్రహించేందుకు అర్హుడనైతే ఆ భాగ్యాన్ని నాకు ఇవ్వండి' అని సగర్వంగా అడుగుతాను!"

"అయ్యా! తమ తీర్మానాన్ని నేను మెచ్చుకొంటున్నాను. మీకు, పార్థిబేంద్రుల ఆలోచనాసరళికి

మధ్యవున్న తేడాను చూసి ఆశ్చర్యపడి సంతోషిస్తున్నాను. కానీ మగవారైన మీరు మాత్రమే ఇటువంటి కార్యాలు చేయగలరు. విజయాలను, సాధించిన కార్యాలను కానుకగా సమర్పించగలరు. వాటి గురించి గర్వపడవచ్చు. ఆడవాళ్ళుగా పుట్టినవారికి ఇవేవీ సాధ్యం కాదు. వారికి అవసరం లేదు కూడాను. రాచకులంలో పుట్టిన స్త్రీలకు స్వయంవరం ఏర్పాటు చేసే సంప్రదాయం మన దేశంలో చాలకాలంగా ఉంటూ వచ్చింది. ఇప్పుడెందుకో మరుగైపోయింది. అయ్యా! నా తండ్రి నాకు స్వయంవరం ఏర్పాటు చేసి ఈ విశాల భారతదేశంలోని రాకుమారులనందరినీ ఆహ్వానిస్తే, నా చేతిలోని పుష్పహారాన్ని వారెవరి కంఠంలోను వేసేదాన్ని కాను. తంజావూరు కోటనుంచి తప్పించుకొని పారిపోయి వచ్చి పళైయారై ఆలయ పూజారి సహాయంతో పడవెక్కి నదిని దాటి అంతఃపుర ఉద్యానవనంలో దూరి నన్ను ఏకాంతంగా కలిసిన అనాధ యువకుడు, ఆ రాకుమారుల మధ్య ఎక్కడైనా ఉన్నాడా అని వెతుకుతాను. ఆయన మెడలోనే నా చేతిలోని స్వయంవరమాలను వేస్తాను!"

~

వంతిదేవుని చెవుల్లో వేవేల కిన్నెర కింకిణులు మోగాయి. ఆకాశంనుంచి స్వర్ణవర్షం కురిసింది. పూలు వెల్లివిరిసి చెట్ల మీద రంగురంగుల సీతాకోకచిలుకలు నాట్యమాడాయి.

"నేను చెప్పింది మీకు నచ్చలేదా?" అన్నది కుందవై.

"భలే మాటన్నారు! నేను మెలకువగానే ఉన్నానా, నేను విన్నదంతా నిజమేనా, లేక కలగంటున్నానా అని తేల్చుకోలేకపోతున్నాను. కలకాదు, నిజమేనని తెలుసుకొన్నాను! పాలకడలిని చిలికి దేవతలు అమృతాన్ని పొందారు. దాన్ని ఆరగించి అమరులైనారని విన్నాను. మీరు ఇప్పుడు చెప్పిన మాటలు నన్ను అమృతమారగించినవాడిగా చేశాయి. నాకు కొత్త జీవితాన్నిచ్చాయి!"

"అయ్యా! ఒకటి మాత్రం మరిచిపోకండి. మీరు వెళ్ళేచోటల్లా ఎన్నో అపాయాలను ఎదుర్కొంటారు. ఎన్నెన్నో యుద్ధరంగాల్లో పాల్గొంటారు. పగవారు వంచనతో, కుట్రలతో మిమ్మల్ని పైలోకానికి పంపించేందుకు ప్రయత్నిస్తారు. అలా ఏమైన మీ ప్రాణాలకు అపాయం కలిగితే, ఈ సుప్రసిద్ధ చోళకులంలో జన్మించిన ఒక రాకుమారి పెళ్ళికి మునుపే విధవైపోతుంది! ఇది మరిచిపోకండి!" అన్నది.

"దేవీ! అలా ఏనాడూ జరగదు. నేను అమృతంగ్రోలి అమరుడనయ్యాను కద? నాకిక మరణమే లేదు! చిమ్మచీకటి కమ్ముకొన్న దట్టమైన అడవుల్లో గాలివానలో చిక్కుపడి దిక్కుతోచక తడబడే సమయాల్లో, ఆ అడవి మధ్యవున్న ఒక ఇంట్లో కిటికీ దగ్గర దీపం వెలిగించి నాకోసం ఎదురుచూస్తుంటారు. ఆ తలపే నాకు ధైర్యాన్నిచ్చి, ఆ గాలివానలో, గాఢాంధకారంనుంచి బయటపడేందుకు తోడుగా, మార్గదర్శిగా నిలుస్తుంది. అలల కడలిలో ఓడలో రోజులు, వారాలు, నెలలు గడుస్తుండడం తెలియక గతి తప్పి, మతి తప్పి నిలబడ్డప్పుడు, సప్తనక్షత్ర మండలం కింద ఎప్పుడూ ప్రకాశిస్తూ నిలకడగా ఒకే చోట నిలిచి దారి చూపే ధ్రువనక్షత్రంగా మీరు నిలిచి, వెలుతురునిచ్చి దారి చూపుతారు. నేను దిక్కు తెలుసుకొని, ఓడను

తిప్పుకొని వస్తాను. సముద్రతీరం వెంబడి మహోన్నత శిలలను తాటి చెట్టంత ఎత్తైన అలలు గుద్ది అల్లకల్లోకం సృష్టించే నిశారాత్రాలలో దీపస్తంభం నుంచి ప్రసరించే కాంతిగా మీరు ప్రకాశిస్తారు. ఆ ప్రకాశవంతమైన కాంతి సహాయంతో నా ఓడ బండరాళ్ళకు గుద్దుకోకుండ తీరానికి తీసుకొని వచ్చి చేరుస్తాను. గడ్డిపోచ కూడ మొలవని ఎడారి ప్రదేశంలో, మాడ్చేసే ఎండలో, కాల్చేసే ఇసుకలో దాహంతో నాలుక పిడచకట్టుకొని నేను విలవిల్లాడుతున్న సమయాల్లో కొబ్బరిచెట్లు, తీయని అరటిచెట్లు తీరం వెంబడి ఏపుగా పెరిగిన జీవనదిగా మీరు నాకు ప్రాణం పోస్తారు. దేవీ! నేనీ విశాలప్రపంచంలో ఎక్కడికి వెళ్ళినా ఎన్ని కష్టాలకు లోనైనా, ఒకనాడు తప్పక తిరిగి వస్తాను. తిరిగి వచ్చి మీ చేయి పట్టి పాణిగ్రహణం చేస్తాను. నా ఈ మనోరథం నెరవేరే వరకు యముడు నా దగ్గరికి రాడు. అమృతమారగించిన అమరుడిగా ఉంటాను!"

~

ఇలా వంతిదేవుడు తన జీవితంలోనే మాట్లాడి ఎరుగనట్లు మాట్లాడిన తర్వాత కూర్చొన్నాడు. యువరాకుమారి కుందపై మైమరచి అతన్నే చూస్తూండిపోయింది. ఈ మాటలన్నీ ఈ వీరుడు మొట్టమొదటిసారిగా తనతో చెప్పలేదని, ఎన్నెన్నో ఏళ్ళ క్రితం ఎన్నోసార్లు ఈ వాక్ప్రవాహాన్ని తాను విన్నట్లు ఆమెకు తోచింది. ఈ చిత్తభ్రమ విచిత్రాన్ని గురించి ఆమె ఆలోచిస్తున్నప్పుడు "అక్కా! అక్కా!" అన్న వాణతి పిలుపు వినిపించింది.

ఇద్దరూ చటుక్కున తిరిగి చూశారు.

వాణతి వేగంగా వారి దగ్గరకు వచ్చి, "అక్కా! ఈయనకు ఒక అత్యవసరమైన తాళపత్ర సందేశం వచ్చింది. మణిమేఖల అన్న గందమారన్ దగ్గరనుంచి వచ్చింది!" అని చెబుతూ ఆ తాళపత్రాన్ని అందిందింది.

~~~
~~~

# అధ్యాయము - 91

## పూవు రాలిపోయింది!

**వంతిదేవుడు** తాళపత్ర సందేశాన్ని వాణతినుంచి తీసుకొని, "రాకుమారీ! నేను మీకింకా గుర్తున్నానా? పూర్తిగా మరిచిపోయారని కద అనుకొన్నాను?" అన్నాడు.

"అయ్యా! మిమ్మల్ని ఎలా మరువసాధ్యం? నాకు, నా భర్తకు మీరు చేసిన సహాయాలను ఎలా మరువగలను?" అన్నది వాణతి.

"అందుకే నేను లేని సమయం చూసి పెళ్ళి చేసుకొన్నారు కాబోలు!" అన్నాడు వంతిదేవుడు.

వాణతి చిలిపినవ్వుతో, "అవును; మీరు ఉండివుంటే పొన్నియిన్ సెల్వన్‌గారి మకుటాభిషేకంలాగ వివాహం కూడ జరిపించివుండవచ్చు కద? మీరేం పన్నాగం పన్నేవారో, ఏమో ఎవరికి తెలుసు?" అన్నది.

"నేనా పొన్నియిన్ సెల్వన్‌గారి మకుటాభిషేకం జరగకుండ చేశాను? పూంగుళలితో జగడమాడి మీరు 'సింహాసనమెక్కను' అని చేసిన శపథం కద దానికి కారణం? పడవనడిపే పిల్లకు అదృష్టం కొట్టింది! నన్ను తప్పుబట్టి ఏం ప్రయోజనం?" అన్నాడు వంతిదేవుడు.

"ఆమే ఆ అదృష్టాన్ని అనుభవించనీ! అందుకోసం ఆమె మీద నాకేమీ కోపం లేదు. మీమీద కూడ నాకేమీ కోపం లేదు. సంతోషం మాత్రమే. కానీ మీ పెళ్ళి ముహూర్తం పెట్టించేటప్పుడు మంచి జ్యోతిష్కుల చేత పెట్టించండి!" అన్నది.

"కుడంద్తె జ్యోతిష్కులనే ముహూర్తం పెట్టమని చెబితే సరి! మీకంతా వారిమీదనే కద నమ్మకం!" అని వాణతిని చూసి అన్నాడు వంతిదేవుడు.

వాణతి గొల్లుమని నవ్వేసి యువరాకుమారిని చూసి, "అక్కా! ఈయన కుడంద్తె జ్యోతిష్కులను గురించి చెప్పగానే ఒక విషయం గుర్తుకొచ్చింది!" అని చెప్పేసి మళ్ళీ గలగల నవ్వింది.

"దేన్ని తలుచుకొని నవ్వావు, వాణతీ? 'నీ కడుపున పుట్టబోయే కుమారుడు ముల్లోకాలను ఏలుతాడు' అని ఆ జ్యోతిష్కులు ప్రేలాపించారు కద, దాన్ని గుర్తు తెచ్చుకొని నవ్వావా?" అని అడిగింది కుందవై.

"దాన్నెందుకు 'ప్రేలాపన' అంటున్నారు, దేవీ? ఆ జోస్యం ఫలించబోతూంది!" అన్నాడు వంతిదేవుడు.

వాణతి తనకు తెలియకుండానే వచ్చిన సిగ్గు వెనక తన చిరునవ్వును దాచేసుకొంది. తర్వాత, "అక్కా! నేనొకటి చెప్పవస్తే, మీరు మాటను ఇంకొకవైపు తిప్పుతున్నారు కద? కుడంద్తె జ్యోతిష్కులను

నేను 'యువరాకుమారికి తగిన వరుడు ఎక్కడినుంచి రాబోతాడు?' అని అడిగాను. 'ఈ నిమిషమే ఆకాశంనుంచి వచ్చి దూకినా దూకవచ్చు!' అన్నారాయన. మరునిమిషమే ఈయన జ్యోతిష్కుల శిష్యునితో దెబ్బలాడుతూనే లోపలికి వచ్చి దూకారు! ఆ సంభవాన్ని గుర్తు తెచ్చుకొని నవ్వాను!" అన్నది.

కుందవై పొంగుకొస్తున్న నవ్వును అదిమిపెట్టి, కోపం నటిస్తూ, "చాలు నీ పరాచికాలు! ఆ అత్యవసర తాళపత్రాన్ని ఈయన చదవనీ!" అన్నది.

~

వంతిదేవుడు ఆ సందేశాన్ని చదివుతున్నప్పుడు అతడి ముఖంలో తోచిన దిగులును రాకుమార్తెలిద్దరూ గమనించారు.

"ఏం సంగతి? గందమారన్ ఏం రాసి పంపించాడు?" అని యువరాకుమారి ఉత్కంఠతో అడిగింది.

"మీరే చదివి చూడండి!" అని వంతిదేవుడు తాళపత్రాన్ని కుందవైకిచ్చాడు.

ఆ తాళపత్రంలో ఇలా రాసివుంది:

"నా ప్రియమిత్రుడు వల్లవరయ్యన్ వంతిదేవునికి వ్రాయునది - నేను నీకు చేసిన అపకారములను, నీ మీద మోపిన నిందలను మన్నించి, నా సహోదరి మణిమేఖలను చివరిచూపుగా వచ్చి చూచుటకు వెంటనే బయలుదేరి రమ్ము. ఇట్లు, యువ శంబువరయ్యర్ గందమారన్."

కుందవై చదివేసి, "ఒక విధంగా ఇది మంచి వార్తే. మణిమేఖల దొరికింది అని తెలుస్తూంది!" అన్నది.

"అదేమి? మణిమేఖల ఎక్కడికి పారిపోయింది?" అని అడిగాడు వంతిదేవుడు.

"మణిమేఖల గురించిన సంగతి మీకేమీ తెలియనే తెలియదా?"

"తెలియదు! మిమ్మల్ని అడగాలనుకొంటున్నాను."

"నేనూ చెప్పాలనుకొంటున్నాను. కానీ ఆమె గురించి ఇంతవరకు విచారించకనే ఉన్నవారి వద్ద ఆమె గురించి ఎలా ప్రస్తావించడమని జంకాను."

"దేవీ! మణిమేఖల విషయంలో నేను రాతిగుండె కలవాడినెలా అయ్యాను? ఆమె ప్రకారం నేను చనిపోయాను కద?"

"లేదు; ఆమెకు మీరు మరణించినవారు కారు. మరణమే లేనట్లు వరం పొందిన అమరులైనారు!"

"పోనీ. ఇప్పుడైనా మణిమేఖల గురించి చెప్పండి."

"చెప్పేందుకు చాల విచారంగా ఉంది. శెంబియన్ మహాదేవి మణిమేఖల తమతో ఉండనీ అని ఎంతగానో చెప్పి చూశారు. కానీ శంబువరయ్యర్ అందుకు ఒప్పుకోలేదు. గందమారన్ సరిహద్దు రక్షణకు

వెళ్ళిపోతాడని, తమ కూతురైనా తమతో ఉండాలని చెప్పి తమతో పిలుచుకొని వెళ్ళారు. కడంబూర్ మాళిగ కాలిపోయినందువల్ల పాలసముద్రం అనే నది ఉత్తరతీరాన కొత్తగా మాళిగ కట్టుకోవడానికి చక్రవర్తి వద్ద అనుమతి తీసుకొని వెళ్ళారు. దారిలో వీరనారాయణపురం సమీపాన రాత్రి బసచేసేందుకు గుడారం వేసుకొని బస చేశారు. పొద్దున లేచి చూస్తే మణిమేఖల కనిపించలేదు. ఒకవేళ ఇక్కడికే పరుగెత్తి తిరిగి వచ్చేసిందేమోనని విచారించేందుకు మనుషులను పంపారు. ఇక్కడికి రాలేదని చెప్పి పంపాము. అప్పటినుంచి మా అందరికీ ఒకే దిగులుగా ఉంది. ఒకవేళ వీరనారాయణపురం చెరువులో దూకి చనిపోయిందేమోనని తలుచుకొని విచారించాము. నలుదిక్కులా మనుషులు వెతుకుతున్నారని తెలిసింది. గందమారన్ పంపించిన సందేశంనుంచి మణిమేఖల్ ఉన్నచోటు తెలిసి, ఆమెను కనిపెట్టారని తెలుస్తూంది."

"నేనామెను వెళ్ళి చూడడంవల్ల ప్రయోజనమేమి? ఎలాగూ ఆమె నన్ను గుర్తుపట్టబోవడం లేదు!" అన్నాడు వంతిదేవుడు.

"అయినా కూడ మీరు తప్పక వెళ్ళాలి. 'చివరిసారిగా' అని రాశాడు గందమారన్. దాని అర్థం ఏమిటో తెలియడం లేదు" అన్నది కుందవై.

"అక్కా! ఈయన కొంచెం కూడ జాలి, కనికరం లేనివారు. మణిమేఖల ప్రేమకు ఏమాత్రం పాత్రులు కారు. కొందరు ప్రేమకోసం మహాసామ్రాజ్యాలనే త్యాగం చేస్తున్నారు. ఈయనేమో ఒక ప్రయాణం చేసేందుకు వెనుకంజవేస్తున్నారు!" అని వాణతి ఒక బాదుడు బాదింది.

వంతిదేవుడు, "రాకుమారీ! లోకంలో రాజ్యాలు కొన్నే ఉన్నాయి. కాబట్టి ప్రేమకోసం రాజ్యాన్ని త్యాగం చేసేటటువంటి కార్యాన్ని కొందరు మాత్రమే చేయగలరు. కానీ మీరు మొదట చెప్పింది నిజమే. మణిమేఖల ప్రేమకు నేను ఏమాత్రం అర్హుడిని కాను. దైవం మీద ఉండవలసిన ప్రేమను నావైపు మళ్ళించింది. నేను దేవుడిని కానే కాను. ఎన్నో కొరతలు, లోపాలు ఉన్న మామూలు మనిషిని నేను. మణిమేఖల దేవునికి అర్పించవలసినది!" అన్నాడు.

"అయినా కూడ మీరు వెళ్ళి ఒకసారి ఆమెను చూసి రావడంలో తప్పేమీ లేదు కదా? గందమారన్ కూడ 'చివరిసారిగా'అనే కద రాశాడు?" అన్నది యువరాకుమారి కుందవై.

"నేను వెళ్ళనని చెప్పలేదు కదా? వెళ్ళడంవల్ల ప్రయోజనముందా అని సందేహిస్తున్నానంతే. నేనామెకు చనిపోయినవారి లెక్కలో చేరిపోయాను కద అని జంకాను. కానీ 'చివరిసారిగా' అని గందమారన్ రాసిన మాటకు అర్థం తెలియడం లేదు. తర్వాత ఆమెను చూడకూడదని కట్టుబాటు విధించబోతాడా ఏమి? లేక బౌద్ధమతస్థుల కన్యామఠంలో ఆమెను తీసుకొని వెళ్ళి చేర్చేయబోతున్నాడా, ఏమి?"

"మీరొక రోజు ప్రయాణం చేస్తే అంతా తెలిసిపోతుంది!" అన్నది యువరాకుమారి కుందవై.

~

వంతిదేవుడు పళైయారైనుంచి వీరనారాయణపురానికి ఒక్కరోజే ప్రయాణం చేశాడు. కానీ

మునుపటిలాగ కాక ఈసారి ఒకరోజు ఒక యుగంలాగ తోచింది. అతడి మనసులో పాత జ్ఞాపకాలు, సంఘటనలు ముసురుకొంటున్నాయి. మొట్టమొదట అతడీ దారిన తంజావూరుకు వెళ్ళినప్పుడు ఎన్నెన్నో కమనీయ దృశ్యాలను చూశాడు. ఎన్నెన్నో గాలిమేడలు కట్టుకొన్నాడు. అవన్నీ గాలిమేడలుగానే నిలిచిపోయాయి. అనుకోని సంఘటనలెన్నో జరిగిపోయాయి. చోళనాడు ప్రజల ముద్దుల రాకుమారుని, తమిళదేశమంతా వేనోళ్ళ కొనియాడే వీర రాకుమారుని, తన చేతికొచ్చిన సామ్రాజ్యాన్ని ఇంకొకరికి ఇచ్చేసి మేరుపర్వతంకన్న ఉన్నతమైన త్యాగశిఖరంగా వెలుగొందే పొన్నియిన్ సెల్వన్‌ని ప్రాణమిత్రునిగా పొందాడు. అటువంటి పొన్నియిన్ సెల్వన్ గౌరవించి, భక్తితో వందనంచేసే యువరాకుమారి మనసు చూరగొన్నాడు. లంకలో ఉన్న మహాసైన్యానికి మాతండనాయకునిగా పదవిని గడించాడు. ఇదంతా తన సామర్థ్యం వల్లనేనని చెప్ప సాధ్యమా? ముమ్మాటికీ కాదు. కడంబూర్ మాళిగకు ఆ రాత్రి తాను యధాలాపంగా వెళ్ళి చేరడం, అక్కడ చిన్న/సామంతరాజులు చేసిన మంత్రాలోచన తెలుసుకొన్న విషయం, తర్వాత జరిగిన కార్యక్రమాలకు, సంఘటనలకు కారణమైనాయి. ఈ ఎనిమిది నెలల్లో ఎన్నెన్నో సంఘటనలు జరిగిపోయాయి. వాటిలో కొన్ని చాల ముఖ్యమైనవి. ఆకాశంలో కనిపించిన ధూమకేతువు తన విపరీత స్వభావాన్ని చేతల్లో చూపించి మాయమైపోయింది - ఆదిత్య కరికాలన్ అస్తమించారు. ఆదిత్య కరికాలన్‌గారికి, ఆ తోకచుక్కకు సంబంధం ఉండగలదా? లక్షలాది ప్రజలు అటువంటి నమ్మకం కలిగివుండడం అబద్ధమా? ఆకాశంలో ఎల్లప్పుడూ సంచరించే నక్షత్రాలకు, గ్రహాలకు ఈ భూలోకంలో ఈరోజు పుట్టి రేపు మరుగయ్యే మనుషులకు మధ్య సంబంధం ఉండసాధ్యమా? కానీ మనుషుల గ్రహింపుకతీతమైన ఏదో ఒక శక్తి మనుషుల జీవితాలను నడిపిస్తుందనడంలో సందేహం లేదు. లేకపోతే, తాను గత ఎనిమిది నెలల్లో ఎన్నో ఇక్కట్లలో, అపాయకరమైన పరిస్థితుల్లో చిక్కుకొన్నా కూడ ఎలా తప్పించుకోగలిగాడు? ఎంతెంతమంది తానా ఇక్కట్లనుంచి, అపాయాలనుంచి తప్పించుకోవడానికి సహాయం చేశారు? వారిని ఆయా సమయాల్లో తనకు సహాయం చేసేందుకు అక్కడికి తీసుకొని వచ్చిందెవరు? ఆ ఊహాతీతమైన, విచిత్రమైన శక్తినే పెద్దలు దైవమని గౌరవించి పూజిస్తున్నారా? శివుడు, పెరుమాళ్ళు (విష్ణువు), మహాశక్తి అని పిలిచి, పాడి పరవశిస్తున్నారా?

~

అతి క్లిష్టమైన పరిస్థితుల్లో అతడికి ఎదురుచూడని విధంగా దొరికిన సహాయాన్ని తలుచుకొన్నప్పుడు వంతిదేవునికి చాల ఆశ్చర్యం కలిగింది. సహాయం చేసినవారిని తలుచుకొంటే మనసు కరిగింది. గందమారన్ పిదప తనకెంత కీడు చేయబూనినా కూడ, మొదట్లో అతడు చేసిన సహాయం ఎన్నడూ మరువలేనిది. ఆళ్వార్ కట్టియాన తనకెంతో సహాయం చేశాడు. మాయమోహిని రూపంగొన్న ఆ రాక్షసి నందిని కూడ తనకెంతో సహాయం చేసింది! ఆమె మీద యువరాకుమారికి కలిగిన ఆర్ద్రతాభావాన్ని తలుచుకొని ఆశ్చర్యపోయాడు. పడవనడిపే అమ్మాయి పూంగుళలి చేసిన సహాయాన్ని ఏడేడు జన్మలకు

మరువలేడు. ఆమె చోళసామ్రాజ్య సింహాసనం మీద ఆసీనురాలు కావడనికి తగిన అర్హత కలిగినదే.

మొదట సేందన్ అముదన్‌గా తనకు పరిచయమైన ఉత్తమ చోళుల సహాయాన్ని ఏమని వర్ణించగలం? దానికీడైన సహాయం ఇంకేదైనా ఉందా? ఆయనను వైద్యకుమారుడు విసిరిన ఈటె బారినుంచి కాపాడింది ఆయన చేసిన సహాయాలన్నింటికీ కృతజ్ఞత తెలియజేసినట్లవుతుందా? ముమ్మాటికీ కాదు. తన ఒంట్లో ప్రాణమున్నంతవరకు చోళకులానికి సేవ చేయడం మూలంగానే ఆ కులానికి తాను పడ్డ ఋణాన్ని తీర్చగలడు. తర్వాత ధనాధికారి పెద్ద పళువేట్టరయ్యర్! తమ ఆజానుబాహు శరీరం మీద అరవైనాలుగు యుద్ధగాయాలను భరించిన ఆ మహావీరుని చూసే భాగ్యం కలిగితేనే చాలని తాను ఎంచిన కాలముండేది. ఆయనను చూడడమేగాక, ఆయన అనవసర కోపానికి, ద్వేషానికి తాను గురయ్యాడు. చివరికి, అంతటికీ ఆయనే పరిహారం చేసేశారు. తాను విసిరిన కత్తి గురి తప్పి, ఆదిత్య కరికాలన్‌ని చంపారని ఒప్పుకొని తనను ఒక భయంకరమైన నింద నుంచి, అతికఠిన శిక్షనుంచి కాపాడారు! ఆయన కద మహానుభావుడు! ఇక ఆయనకు తానేవిధంగా కృతజ్ఞత తెలుపగలడు?

వీరందరికన్న ఆ అమాయకురాలు మణిమేఖల! ఆమె తనమీద ఎందుకింతటి పవిత్రమైన ప్రేమగొంది? ఎందుకిలా పిచ్చిది కావాలి? తనను కాపాడగోరి యువరాజు హత్యానేరాన్ని ఎందుకు తనమీద వేసుకొంది?

అంతా ఆ మూఢుడు గందమారన్ వల్ల వచ్చిన విపత్తు. మొదట గందమారన్ మణిమేఖల వద్ద తనని ఇంద్రుడు-చంద్రుడు, అర్జునుడు-మన్మధుడని పొగిడాడు. అప్పుడే ఆ అమాయకురాలు తన మనసును తనకిచ్చేసింది కాబోలు! ఇదంతా వంతిదేవునికి తెలియదు.

'నా చెల్లెలిని మరిచిపో! ఆమెను పెద్దింట్లో ఇవ్వబోతున్నాము!' అని గందమారన్ చెప్పగానే వంతిదేవుడు నిజంగానే ఆమెను మరిచిపోవడానికి ప్రయత్నించాడు. యువరాకుమారి కుందవైని చూడడం అందుకు బలాన్నిచ్చింది. కానీ మణిమేఖల తన మనసును మార్చుకోలేదు; మార్చుకోవడానికి ప్రయత్నం కూడ చేయలేదు. అందరికీ తెలిసేటట్లు తన మనసులో ఉన్నది వెలిబుచ్చేందుకు జంకలేదు కూడాను. ఆహా! ఎంతటి తీయని స్వభావం కలిగిన అమ్మాయి! ఎంత ఒద్దిక, ఎంత వినయం! పసిబిడ్డలాంటి మనసామెది! నిజంగానే ఆమె పసిబిడ్డే! పాలవంటి మనసు! అందులో కాస్త చిలిపితనం. తాను చనిపోయానని ఆమె ఇప్పుడు భావిస్తూండడం చాల మంచిది. ఆమె ఎప్పుడూ చిత్తభ్రమతో ఉండబోదు కద? కొన్నాళ్ళ తర్వాత ఆమె మనసు తేటపడుతుంది. ఇంకొక వీరయువకుని పెళ్ళాడి ఆనందంగా జీవించబోతూంది...! నిజానికి, అలా జరుగుతుందా? లేక, తనను తానే మోసగించుకొంటున్నాడా? మణిమేఖల ఈ స్థితికి లోనుకావడానికి తానే బాధ్యుడవుతాడా? 'చివరిసారిగా చూసేందుకు రా' అని గందమారన్ రాసిన మాటకర్థమేమి? ఒకవేళ...ఒకవేళ... ఆః! ఆ ఆలోచనే ఎంతటి వేదనను కలిగిస్తూంది!

~

వంతిదేవుని ఆలోచనావేగానికి తగ్గట్లు అతని గుర్రం కూడ వేగంగా సాగింది. అదృష్టవశాత్తు కొళ్ళిడం నదిలో ప్రవాహమంతగా లేదు. పడవ కూడ అవసరం కాలేదు; గుర్రం మార్చవలసిన అవసరం కూడ రాలేదు. గట్టు వెంబడే ప్రవహిస్తున్న చిన్న ప్రవాహాలను దాటి తెల్లని ఇసుక మేటలను సులభంగా దాటి అవతలి గట్టు(కు) చేరాడు.

కడంబూర్ మాళిగ కాలిపోయి, మసిబారిన గోడలు, స్తంభాలతో నిలిచిన ఘోరదృశ్యాన్ని దూరంనుంచే చూస్తూ ముందుకు సాగాడు. వీరనారాయణపురం చెరువు దగ్గరే గందమారన్ మనుషులు వంతిదేవుని కోసం వేచివున్నారు. "చిన్న యజమాని ఎక్కడ?" అని అడగగా, "చెరువు గట్టున పడవలో వేచివున్నారు" అని వారు బదులు చెప్పారు.

చెరువు గట్టున ఎందుకు ఎదురు చూస్తుండాలి అని ఆలోచిస్తూనే వంతిదేవుడు వీరనారాయణ పురం చెరువును సమీపించాడు. ఆ చెరువు పొడవైన గట్టు ఒక పెద్ద, పొడవైన కోట గోడలాగ చెరువు లోపలున్న నీటివిస్తారాన్ని మరుగుపరుస్తూంది. మొదటిసారిగా అతడు ఆ చెరువుగట్టుకు వచ్చినప్పుడు ఆషాడ మాసం పద్దెనిమిదోరోజు పండగ సందర్భంగా ప్రజలు తండోపతండాలుగా వచ్చి చేరుతున్నారు. స్త్రీపురుషులు, చిన్నపిల్లలు కోలాహలంగా ఆడుతూ పాడుతూ విందారగిస్తున్నది గుర్తుకొచ్చింది. ఇప్పుడా చెరువు గట్టున జనసంచారమే లేదు. అప్పుడా చెరువు అన్ని తూములనుంచి నీరు గుప్పుగుప్పుమని కాలువల్లోకి పారుతున్న శబ్దం హోరుమని పెద్దగా వినిపిస్తూంది. ఇప్పుడేమో కొన్ని కాలువల్లోకి మాత్రం చెరువు నీరు మెల్లగా ప్రవహిస్తూంది. అది ఒక శోకగీతాన్ని పాడుతూ నాట్యమాడుతున్న నర్తకి కాలిగజ్జెల దుఃఖపూరిత శబ్దంలాగ వినిపిస్తూంది. ఎత్తైన చెరుగు గట్టుమీదికి గుర్రాన్ని లాఘువంగా ఎక్కించి పైకి చేరాడు వంతిదేవుడు. అక్కడినుంచి అతడి కళ్ళముందు కనిపించిన దృశ్యం కూడ చాల వ్యత్యాసంగా ఉంది. చెరువు నిండి, గట్లు తెంచుకోవడానికా అన్నట్లు అలలు గట్టును గుద్దుకోవడం లేదు. గట్టు అడుగుభాగంనుంచే నీరు విస్తరించింది. అంతగా ఇంకిపోయింది చెరువు మరి. నీటి చెంగావి వన్నె పూర్తిగా మారి, పాలరాతిలాగ తేటగా ఉంది. గట్టు వెంబడి కలువపూలు, ఎర్రతామరలు, నీలోత్పల పుష్పాలు, లేతాకులు, ముదురుటాకులు, లేత మొగ్గలు, సగం విరిసిన మొగ్గలు, పూర్తిగా విరిసిన పూలు - ఇంతటి వైవిధ్యంతో వెల్లివిరిసాయి. కొన్నిచోట్ల అవి నీటిని పూర్తిగా కప్పేశాయి.

చెరువు దక్షిణపు గట్టు వారగా పారుతున్న ఉత్తరనది నుంచి వెల్లువగా నీరు చెరువులోకి దూకడం లేదు. ఆ నదీప్రవాహం వెంబడి తెల్లని పక్షుల్లాంటి పడవలు తేలి రావడం లేదు. నదివెల్లువ పారే చెరువు తీరం వెంబడి ఇప్పుడు దట్టంగా పెరిగిన చెట్లు, పుట్టలు కనిపించాయి. వాటి మధ్య అక్కడక్కడ తెల్ల కొంగలు లోతులేని నీటిలో ఒంటికాలి జపం చేస్తూ కనిపించాయి.

~

వీటన్నిటినీ గమనించేందుకు వంతిదేవుడు కొన్నిక్షణాలకన్న ఎక్కువసేపు తీసుకోలేదు.

అంతలో చెరువుగట్టు వారగా కాస్త దూరాన నిలిచివున్న పడవమీదికి అతడి దృష్టి మళ్ళింది. ఆ పడవలో ఉన్నవారిలో ఒకడు గందమారన్ అని కూడ వెంటనే చూసి తెలుసుకొన్నాడు. వెంటనే ఆవైపు గుర్రాన్ని వేగంగా నడిపాడు. గుర్రం మీదినుంచి కిందకు ఒక్క దూకు దూకి పడవ దగ్గరికి వెళ్ళాడు. గందమారన్ ఒక చేయి చాచి వంతిదేవుని పడవలోకెక్కించుకొన్నాడు. పడవ నడిపేవారికి పడవను ముందుకు నడపమని సైగ చేసి, వంతిదేవుని వైపు కన్నీరు నిండిన కళ్ళతో చూశాడు.

"మిత్రమా! త్వరగానే వచ్చేశావు! చాల ధన్యవాదాలు! ఒకవేళ ఈరోజు రాకుండ రేపు వచ్చివుంటే మణిమేఖలను ప్రాణాలతో చూసివుండేవాడివి కావు!" అన్నాడు.

వంతిదేవునిది రాతిగుండె అన్నది నిజమే! మనసులో అంతటి దృఢత్వం లేకపోతే, గత ఎనిమిది మాసాల్లో అన్ని పెద్ద కార్యాలు సునాయాసంగా చేయగలిగేవాడా? తనకుగాని, ఇతరులకుగాని రాగల అపాయాలను గురించి కించిత్తు కూడ చింతించక, తన ప్రాణాన్ని తృణప్రాయంగా ఎంచి అన్ని క్లిష్టపరిస్థితులను నెగ్గుకొచ్చేవాడా?

అటువంటి దృఢమనస్కుడు గందమారన్ మాట విని కదిలిపోయాడు. 'చివరిసారిగా చూసేందుకు' అని గందమారన్ రాసిన అర్థం ఇప్పుడు స్పష్టంగా తెలుస్తూంది. అతడి కళ్ళనుంచి అశ్రుధారలు ప్రవహించసాగాయి.

"గందమారా! మణిమేఖల ప్రాణానికే అపాయమా? అదెలా? ఆమె చిత్తమే కద గతి తప్పింది? అది కూడ నీగురించి, నాగురించే కద?" అని గద్గద స్వరంతో అడిగాడు వంతిదేవుడు.

"మిత్రమా! ఇప్పుడు మణిమేఖల మనసు తేటబడిపోయింది. కానీ ఇంకెంతసేపు సజీవంగా ఉంటుందో తెలియదు. నిన్ను చూసేంతవరకు సజీవంగా ఉండాలని అన్ని దేవుళ్ళకు మొక్కుకొంటున్నాను!" అన్నాడు గందమారన్.

~

ఆ తర్వాత అతడు తానెరిగినంతవరకు జరిగిన సంభవాలను ఇలా వివరించాడు:-

కంచిలో చక్రవర్తి వచ్చి నివసించేందుకు బంగారు మాళిగను సిద్ధం చేస్తున్నాడు గందమారన్. అప్పుడు శంబువరయ్యర్ మణిమేఖలను కూడ వెంట తీసుకొని బయలుదేరారని విన్నాడు. ఆ తర్వాత కొంతకాలానికి వీరనారాయణపురం చెరువు దగ్గర మణిమేఖల కనిపించకుండపోయిదన్న వార్తను కూడ విన్నాడు. వెంటనే పార్థిబేంద్రుని వద్ద సెలవు తీసుకొని చెల్లెలు ఎక్కడుందో, ఎలావుందో తెలుసుకోవడానికి పరుగెత్తి వచ్చాడు. అతడి తండ్రి దుఃఖభారంతో ఇంచుమించు పిచ్చివారయ్యే స్థితిలో ఉన్నారు. 'రాత్రి గుడారంలో పడుకొంది, పొద్దున లేచి చూస్తే కనబడలేదు' అన్న మాట తప్ప ఆయన దగ్గరినుంచి ఇంకేమాటగాని, వార్తగాని లభించలేదు. పళైయారైకి మనుషులను పంపారని చెప్పారు. మాళిగలోను, చుట్టుపక్కల వెతికి చూశారని చెప్పారు. పళైయారైకి ఆమె వెళ్ళివుంటుందని గందమారన్ అనుకోలేదు.

చెరువులో పడి మునిగిపోయి ఉండవచ్చని, వెతికి చూసి ఆమె శరీరాన్నైనా కనిపెట్టాలని ఎంచాడు. ఒకవేళ చెరువు చుట్టుపక్కలున్న అడవుల్లో తిరుగాడుతుండవచ్చన్న ఆశ కూడ అతడి మనసులో కొద్దిగా ఉంది.

చెరువు గట్టు వెంబడి చుట్టూ తిరిగి తిరిగి వెతికాడు. చెరువునుంచి పారుతున్న కాలువల వెంబడి కాస్త దూరం వెతికాడు. చెరువుకు అడ్డదిడ్డంగాను, గట్టు వెంబడి పడవలో వెళ్ళి వెతికాడు. ఇలా సుమారు నాలుగు రోజులు వెతికి ఫలితం లేకపోయేసరికి, చెరువు పైభాగంలో ఉన్న ఒక దీవిలోని మంటపం అతడికి గుర్తుకొచ్చింది. వేటకు వెళ్ళిన కరికాలన్, వంతిదేవుడు నీటిలో ఆటలాడేందుకు వచ్చిన నందిని, మణిమేఖల ఆ మంటపంలో ఒకరినొకరు కలిసి, విందుభోజనం చేసి, సరదాగా మాట్లాడుతూ కాలం వెళ్ళబుచ్చిన విషయం కూడ గుర్తుకొచ్చింది. మణిమేఖల పడవ లేకుండ ఆ ద్వీపానికి ఒంటరిగా వెళ్ళగలడం అసాధ్యమైన కార్యం. ఎలుగుబంటి, చిరుత మొదలైన వన్యమృగాలతో నిండిన పశ్చిమభాగంలోని అడవి గుండా మణిమేఖల అక్కడికి వెళ్ళ సాధ్యమా? అడవిని దాటినా, దారిలో ఎన్నో చిన్న కాలువలను దాటి వెళ్ళాలి కద? అయినా కూడ, అది కూడ ఒకసారి చూసేద్దామని గందమారన్ పడవెక్కి ఆ మంటపానికి చేరాడు. మంటపాన్ని చేరగానే పాతజ్ఞాపకాలు అతడి మనసులో ముసురుకొన్నాయి. మొదట మంటపం నిర్మానుష్యంగానే అగుపించింది. అక్కడెవరూ ఉన్నట్లు కనిపించలేదు. పడవనుంచి మంటపం మెట్లమీదికి దిగి అక్కడే కాసేపు నిలబడి తాను కట్టిన గాలిమేడలన్నీ గాలిలోనే కొట్టుకుపోయాయి కద అని పెద్దగా నిట్టూర్చాడు. అతడి నిట్టూర్పుకు ప్రతిధ్వనిలాగ ఇంకొక నిట్టూర్పు వనిపించి అదిరిపడ్డాడు. పరుగెత్తి వెళ్ళి చూశాడు. మంటపం అవతలి మెట్లమీద మణిమేఖల పడివుంది. వాడిపోయిన పూవులాగ పడివుందామె. ఆమె చీరె చాలచోట్ల చిరిగిపోయివుంది. ఒంటిమీద చాలచోట్ల గీరుకుపోయివుండడం కనిపించింది, మొదట్లో ఆమె ఒంట్లో ప్రాణం ఉన్నట్లే అనిపించలేదు. చాలరోజులు పస్తుండి దిక్కుతోచక ఎక్కడెక్కడో తిరుగాడి చివరికి అలిసిపోయి పడిపోయి చనిపోయినదాని శరీరంలాగే తోచింది.

ఆ దృశ్యాన్ని చూసిన గందమారన్ హృదయంలో వేయిశూలాలు గుచ్చినంతటి బాధ కలిగింది. మణిమేఖలను ఎత్తి ఒడిలో వేసుకొని విలపించాడు. నిట్టూర్పు శబ్దం గుర్తుకు రాగానే ఒకవేళ ఆమె ఒంట్లో ఇంకా ప్రాణం ఉండవచ్చనే ఆశతో మంచినీళ్ళు తీసుకొని వచ్చి ఆమె ముఖం మీద చల్లాడు. నోటిలో కాస్త పోశాడు. వేడి పుట్టేందుకు ఒళ్ళంతా రుద్దాడు. కాసేపటికల్లా మణిమేఖల కళ్ళు తెరిచి అతడివైపు చూసింది. “అన్నా! నీవేనా? నేననుకొన్నది నిజమైపోయింది. స్వర్గానికి వెళితే నిన్ను, ఆయన్ను చూడొచ్చని తలచాను. ఆయనెక్కడ?” అని అతిమెల్లని స్వరంతో అడిగింది. గందమారన్ పొంగివస్తున్న ఏడుపును అతికష్టంమీద అదిమిపెట్టి, “వస్తారమ్మా! వస్తారు!” అన్నాడు.

మణిమేఖల తాను స్వర్గంలో ఉన్నాననుకొంటూంది. గందమారన్ని కూడ స్వర్గంలో చూస్తున్నట్లు భావిస్తూంది; వంతిదేవుని గురించి విచారిస్తూంది అని కూడ గందమారన్ గ్రహించాడు. ఆమె

మనసుకు ఉలికిపాటు కలగకుండ ఆమె నమ్మకాన్ని వమ్ము చేయక, ఆమె అనుకొంటున్నట్లే సమాధానమిచ్చి సంభాళించాడు.

~

ఆ తర్వాత మణిమేఖల ప్రాణం లేచి వచ్చేందుకు తాను చేసిన ప్రయత్నాల గురించి, తొందరగా రమ్మని వంతిదేవునికి తాళపత్ర సందేశం రాసి పంపిన విషయం గురించి చెప్పాడు. చివరిగా,

"మిత్రమా! నీవు నా సందేశాన్ని చదివి వచ్చినందుకు నా మనసులో ఉప్పొంగుతున్న కృతజ్ఞతాభావం చెప్పనలవికాదు. మణిమేఖల ఇంకెక్కువ కాలం జీవించదు. ఆరిపోయే స్థితిలో ఉన్న దీపం వత్తిని కాస్త ఎగదోస్తే ఇంకాసేపు వెలుగుతుంది కద? ఆ విధంగానే ఆమె ప్రాణదీపం ప్రకాశిస్తూంది. ముఖ్యంగా, నిన్ను చూసే ఆశే ఆమెను ఇంకా ప్రాణాలతో ఉంచింది! మనమందరం స్వర్గంలో ఉన్నామని ఆమె నమ్ముతూంది. దానికి వ్యతిరేకంగా నీవేమీ చెప్పకు! ఆమెను చూసిన వెంటనే నీకు దుఃఖం ముంచుకు రావడం సహజమే. దాన్ని కూడ అదిమిపెట్టి ఆమెతో విప్పారిన ముఖంతో మాట్లాడాలి!" అని వేడుకొన్నాడు.

పడవ ద్వీపమంటపం దగ్గరకొచ్చేసింది. మణిమేఖలకిష్టమైన ఆ వాద్యాన్ని మీటుతున్న ధ్వని, మెల్లగా పాడుతున్న శబ్దం వినవచ్చాయి. వంతిదేవుడు గందమారన్ని చూసి, "అవును, మిత్రమా! మణిమేఖలే వీణ వాయిస్తూ పాడుతూంది!" అన్నాడు.

పడవనుంచి వారు మంటపం మెట్లమీదికి దిగారు. మణిమేఖల ఏం పాట పాడుతూందని వంతిదేవుడు చెవులు రిక్కించి విన్నాడు. మునుపొకసారి అదే మంటపంలో అదే వాద్యం వాయిస్తూ పాడిన పాటే.

<< ఆ మధురమైన పాటను అనువదించవలసి ఉంది >>

పాట ముగిసేవరకు వంతిదేవుడు మెట్లమీదే వేచివుండి, తర్వాత మెల్లగా మెట్లెక్కి మంటపం లోపలికి వెళ్ళాడు.

~

మణిమేఖల అతన్ని చూడగానే యాళ్‌ని కిందకు దొర్లించేసి లేవడానికి ప్రయత్నించింది. ఒంట్లో శక్తి లేక కాళ్ళూని నిలబడలేక పడిపోబోయింది. వంతిదేవుడు ముందుకు ఒక్కదూకు దూకి ఆమె కింద పడిపోకుండ పట్టుకొన్నాడు. మెల్లమెల్లగా ఆమెను కూర్చోబెట్టి తాను కూడ కూర్చొన్నాడు. మణిమేఖలను తన ఒళ్ళో ఆనించుకొన్నాడు.

మణిమేఖల మళ్ళీ మళ్ళీ తలెత్తి అతని ముఖాన్నే చూడసాగింది. అతడు వంతిదేవుడేనా, తాను పడుకొన్నది అతడి ఒళ్ళోనేనా అని చాలసార్లు రూఢి చేసుకొంటున్నట్లు తోచింది.

"నా అన్న నన్ను మోసం చేయలేదు. స్వర్గం ఒట్టి కల కాదు. ఈ అద్భుతం కూడ అబద్ధం

కాదు!" అని ఆమె పెదవులు మెల్లగా పలికాయి.

"అబద్ధం కాదు, మణిమేఖలా! అబద్ధం కాదు. ఇది నిశ్చయంగా స్వర్గమే. నేను వచ్చింది కూడ నిజమే!" అన్నాడు వంతిదేవుడు.

అతడెంత ఆపుకొందామని ప్రయత్నించినా కూడ అతడి కళ్ళలో నీళ్ళుబికాయి. మణిమేఖల ముఖం మీద అతడి కళ్ళనుంచి అశ్రుబిందువులు ముత్యాలలాగ జారి పడ్డాయి. అతడికి తెలియకనే వెక్కిళ్ళు వచ్చాయి.

మణిమేఖల ముఖం కాసేపు ఒక మానవాతీతమైన శోభతో ప్రకాశించింది. ఆమె పెద్ద పెద్ద కళ్ళనుంచి చంద్రకిరణాలు కూడ వీచాయి.

దానిమ్మ మొగ్గల్లాంటి ఆమె పెదవులు విచ్చుకొని ఏవేవో మధురమైన/ఇంపైన మాటలను కురిపించాయి. వంతిదేవుడు చాల శ్రద్ధతో ఆ మాటలను విన్నాడు. కానీ ఆమె ఏం చెప్పిందని మాత్రం తెలుసుకోలేకపోయాడు.

ఎందుకని తెలుసుకోవాలి? ఆమె చెప్పింది ఏం మాటలైతేనేమి? హృదయమనే కలశం తెరుచుకొని అమృతంలాంటి ప్రేమ పొంగి వస్తున్నప్పుడు మాటలతో పనేమి?

~

కాసేపటికల్లా మణిమేఖల తీయని పెదవులు మూసుకొన్నాయి. కనురెప్పలు వాలిపోయాయి. ముఖంలో వెలిగిన ఆ వర్ణనాతీత శోభ సన్నగిల్లింది. ప్రశాంతత నెలకొంది.

జలమంటపం మీద దట్టంగా పరుచుకొన్న చెట్లమీదుగా మంద, మలయమారుతం వీచింది. చెట్లనుంచి కొన్ని పూలు రాలాయి.

మణిమేఖల ప్రాణంకూడ ఆమె శరీరం నుంచి రాలింది.

ఒంటిని విడిచి ప్రాణం ఎక్కడకు వెళ్ళింది? ఏ దారి వెంబడి వెళ్ళింది? మలయమారుతంతో కలిసి వెళ్ళిందా? హృదయతాపం ధ్వనించేటట్లు పాడిన కోయిల మధురగీతంతో కలిసి ఆకాశానికి ఎగసిందా?

ఎక్కడ వెళ్ళింది? సకల భువనాలను, సకల జీవరాశులను సృష్టించి, లయించే పరమార్థుని పాదారవిందాల చెంతకు వెళ్ళిందా?

లేక కన్నీళ్ళింకిన శిలలాగ చేష్టలుడిగి, ఇహ స్పృహలేక కూర్చొనివున్న వంతిదేవుని మనసులోగాని కలిసిపోయిందా?

ఎవరికీ తెలియదు; తెలిసినా చెప్పసాధ్యం కాదు.

ఒకటి మాత్రం నిజం.

సరదా, చిలిపితనం, ఉత్సాహం, కుతూహలం, తెంపరితనం, దుడుకుతనం రూపంగొన్న వంతిదేవుని మనమిక చూడబోము.

మెత్తని స్వభావం, కరుణ, వివేకం ఆ క్షణాన వచ్చి వంతిదేవునిలో గూడుకట్టుకొన్నాయి.

మణిమేఖల అనే దైవం అతని హృదయమనే కోవలలో నెలకొంది.

ఇక అతడు ఎక్కడికి వెళ్ళినా, ఏ కార్యం చేయబూనినా, ఆ దైవం అతడికి తోడుగా ఉంటుంది.

వల్లవరయ్యన్ వంతిదేవుడు ఎన్నో మంచిపనులు చేయగల శక్తి, సామర్థ్యం పొందాడు. అతడెరిగిన అందరూ అతడికి వందనాలర్పించేందుకు అర్హుడైనాడు.

ఓ వీరుడా! ప్రస్తుతానికి నీ నుంచి సెలవు తీసుకొంటున్నాము. నీ దుఃఖపూరిత చింతనలో మేమద్దురాము. అరుళ్మొళివర్మ ప్రియమిత్రుడా! నీవు దీర్ఘకాలం జీవించుగాక! వీర తమిళుల పరంపరలో నీ పేరు చిరస్థాయిగా వెలుగొందుగాక!

~~~
~~~

# మలి పలుకు

**పాఠకులకు** నా హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసుకొంటున్నాను. సుమారు నాలుగేళ్ళపాటు 'పొన్నియిన్ సెల్వన్' కథను చదువుతూ రావడంలో పాఠకులు చూపిన ఉత్సాహాన్ని, ఉత్కంఠను, ఆతురతను కొనియాడుతున్నాను. కథ ప్రారంభించిన కొన్ని నెలలవరకు ఇది పాఠకుల్లో ఇంతటి ఆసక్తిని పుట్టిస్తుందనుకోలేదు. పురాతన తమిళనాడు చరిత్ర పేర్లు కొన్ని కొందరికి చాల తలనొప్పి పుట్టించిందని విన్నాను. పోనుపోను పాఠకులు ఆ తలనెప్పిని ఎలాగో వదిలించుకొన్నారు. ఇంతకు ముందు వచ్చిన ఏ ధారావాహికథను కూడ పాఠకులు ఇంత ఆసక్తితో చదవలేదన్న స్థితికి అతిత్వరలో చేరుకొంది. ఆ ఆసక్తి ఇంకా కొనసాగుతూ వస్తూంది.

కథ ప్రారంభించిన మరుసటియేడు ఆషాడమాసం పద్దెనిమిదోరోజు పండగనాడు (కావేరినది వర్షాకాలంలో ఉప్పొంగి పారే రోజు) పరమక్కుడి పట్టణం నుంచి చాలమంది స్నేహితులు 'పొన్నియిన్ సెల్వన్' కథ ప్రతిమీద సంతకం చేసి తమ మెచ్చుకోలును తెలియజేశారు. పొన్నియిన్ సెల్వన్ మొదటి అధ్యాయం పద్దెనిమిదోరోజు పండగనాడు వీరనారాయణపురం చెరువు గట్టుమీద మొదలయ్యింది కద?

తర్వాత చాలమంది పాఠకులు ఉత్తరాల ద్వారా తమ సంతోషాన్ని తెలియజేశారు.

ఈ మెచ్చుకోళ్ళకన్నిటికీ ఈ కథారచయిత అర్హుడేనని నేననుకోవడం లేదు. పురాతన తమిళనాడు చరిత్ర గొప్పతనమే అదంతా అని భావిస్తున్నాడు. నిజానికి, పాత తమిళనాడు చరిత్ర వృత్తాంతాలు తమిళులు గర్వపడదగినవే. గత కొన్ని సంవత్సరాలుగా (అంటే 1950's) పాత తమిళ చరిత్ర గురించిన పరిశోధన ముమ్మరంగా జరుగుతూంది. శిలాశాసనాలు, తామ్రపత్రాలు ఇప్పుడిప్పుడే చదవబడుతున్నాయి. పురాతన చరిత్ర పరిశోధకులు వాటిని ఆధారంగా చేసుకొని అక్కడక్కడ చరిత్ర భాగాలను నిర్మిస్తూ వస్తున్నారు.

చరిత్రలో ఏ ఒక్క కాలం కూడ పరిపూర్ణంగా పరిశోధించబడిందని చెప్పలేము.

పధ్నాలుగు వందల సంవత్సారలకు మునుపు కంచిని రాజధానిగా చేసుకొని సుదీర్ఘకాలం రాజ్యమేలిన పల్లవరాజుల చరిత్ర కొంతవరకు పరిశోధించి తెలుసుకోవడమైంది.

తర్వాత, వెయ్యేళ్ళకు మునుపు మొదలై సుమారు మూడువందల సంవత్సరాలపాటు కీర్తిప్రతిష్టలతో కొనసాగిన విజయాలయ చోళుని పరంపర వృత్తాంతాలు కూడ కొంతవరకు పరిశోధించబడ్డాయి. ఆ కాలానికి చెందిన సంఘటనల గురించి ఖచ్చితంగా తీర్మానించబడలేనట్లు సందేహాలు కలగడానికి ఆస్కారముంది. కానీ కొన్ని చారిత్రక సంభవాలు వివాదాలకు ఆస్కారం లేనట్లు ఆధారాలతో నిరూపించబడ్డాయి.

వీటన్నిటిలో అతిముఖ్యమైనది, తమిళనాడుకు సాటిలేని గొప్పతనాన్ని తేగలిగినది, ప్రపంచ

చరిత్రనే మార్చిన సంభవమని కొనియాడదగ్గ సంభవమొకటుంది. సుందరచోళ చక్రవర్తి రెండవ కుమారుడైన అరుళ్మొళివర్మ (పిదప 'రాజరాజ చోళుడు' అని పేరుగాంచిన రారాజు) చిన్న ప్రాయంలో తాను సులభంగా పొందగలిగిన చోళసామ్రాజ్యాన్ని వద్దని చెప్పి, తన పినతండ్రి ఉత్తమ చోళునికి పట్టం కట్టడమే ఆ సంభవం.

"**సుందర చోళుల తర్వాత ఆయన కుమారుడైన అరుళ్మొళి వర్మ చోళసింహాసనమధిష్టించి రాజ్యమేలాలని చోళనాడు ప్రజలు గట్టిగా కోరారు. కానీ అరుళ్మొళివర్మ తన పెద్ద తాతగారైన గండరాదిత్యుల కుమారుడు, తనకు పినతండ్రి కావలసిన ఉత్తమచోళుని అర్హతను గౌరవించి అతడికే పట్టం కట్టాడు**" అని తిరువాలంగాడు తామ్రపత్రాలు ఘంటాపథంగా చెబుతున్నాయి.

ఈ సంఘటనను ఇంకొన్ని తామ్రపత్రాలు, శిలాశాసనాలు ఆ కాలపు జ్ఞానులు పలువురి చేత రాయబడ్డ గ్రంధాలు నిర్ధారించి చెబుతున్నాయి.

అరుళ్మొళివర్మ పట్టం కట్టుకోవాలని చోళరాజ్య ప్రజలందరు కోరుకొన్నారు; బంధువులు తోబుట్టువులు కోరుకొన్నారు; చోళరాజ్య సైన్యాధిపతులు కూడ కోరుకొన్నారు.

అలా అన్ని విధాల ఆదరమూ, అనుకూలత ఉండి కూడ, ఆయన సామ్రాజ్యాన్ని ఉత్తమ చోళునికి ఇచ్చి పట్టం కట్టాడు.

ప్రపంచ చరిత్రలోను, కావ్యాల్లోను, ఇతిహాసాల్లోను దీనికి సాటియైన మహాకార్యం, సంఘటన కనబడడం అరుదు.

అశోక చక్రవర్తి కళింగ యుద్ధంలో మహావిజయాన్ని సాధించిన తర్వాత, "ఇక యుద్ధమే వద్దు" అని తీసుకొన్న తీర్మానాన్ని, అరుళ్మొళివర్మ చేసిన త్యాగానికి సాటి అని చెప్పవచ్చు.

'పొన్నియిన్ సెల్వన్' కథలో శిఖరాగ్ర సంభవం అరుళ్మొళివర్మ చేసిన సాటిలేని త్యాగమే. కథలో వచ్చే కొన్ని సంఘటనలు ఈ మహత్తరమైన సంభవంవైపే వెళుతున్నాయి. అందుకే ఈ కథ ఐదవభాగానికి 'త్యాగశిఖరం' అని పేరు పెట్టబడింది.

ఈ కథలో శిఖరాగ్రమైన సంఘటన పొన్నియిన్ సెల్వన్ చేసిన త్యాగమే అని పాఠకులు గ్రహించివుంటారనే నమ్ముతున్నాను. ఎవరైనా దాన్ని గ్రహించలేదంటే దానికి కారణం రచయిత రచనాకౌశల్యలోపమే అని చెప్పాలి. ఆ కొరతను రచయిత వినయంతో ఒప్పుకొని పాఠకుల క్షమాపణ కోరుకోవలసివుంది.

~

'పొన్నియిన్ సెల్వన్' కథ వెలువడిన మొదట్లో పాఠకులు ఎనలేని ఆసక్తి చూపించారు. పలువురు రచయితను, కథను పొగిడి, మెచ్చుకోలుగా ఉత్తరాలు రాసి ఉత్సాహపరుస్తూ వచ్చారు. అప్పుడల్లా పాఠకుల ఉత్తరాల్లోని భావంలో తేడానే కనిపించేదికాదు.

కథ ముగిసిన తర్వాత కూడ వందలకొద్ది ఉత్తరాలు వచ్చాయి. ఈ ఉత్తరాల్లో ఒక పెద్ద తేడా

కానవచ్చింది. సగం మంది కథను మెచ్చుకొని, కథ ముగింపును కూడ మెచ్చుకొంటూ రాశారు. ఇంకొక సగం మందేమో కథ ముగింపు అంతగా నచ్చలేదని నిరాశ వెలిబుచ్చుతూ రాశారు. ఉన్నట్లుండి ముగించేసినందుకు, కథలోని ముఖ్యమైనచాల పాత్రలు ఆ తర్వాత ఏమయ్యాయని చెప్పకనే ముగించేసినందుకు వారి అసంతృప్తిని, విచారాన్ని తెలియజేస్తూ రాశారు. కారాలు, మిరియాలు నూరినవారు కూడ కద్దు.

ఖండించినవారు, కొరత చెబుతూ రాసిన వారందరూ కథను ఇంకా పొడిగించి ఉండవచ్చని అభిప్రాయపడ్డందుకు తృప్తిపడుతున్నాను. మూడున్నరేళ్లపాటు సుదీర్ఘంగా రాసి ప్రచురించిన ఈ కథను చదివి చదివి అలిసిపోయి, “ఎప్పుడు ముగించబోతారు?” అని అడగక, “ఎందుకిలా ఉన్నట్లుండి ముగించేశారు? ఎందుకింకా పొడిగించి రాయకూడదు?” అని పాఠకులడగడం సంతోషకరమైన విషయమే. కానీ పాఠకులలో చాలమందిని తృప్తిపరచలేకపోయినందుకు విచారిస్తున్నాను.

'పొన్నియిన్ సెల్వన్' కథని ఇప్పుడు ముగించినట్లు ముగించడానికి రెండు ముఖ్యకారణాలున్నాయి.

1. ముందుగానే సూచించినట్లు, కథకే శిఖరాగ్రమైన సంఘటన పొన్నియిన్ సెల్వన్ చేతికందిన మహాసామ్రాజ్యాన్ని ఇంకొకరికిచ్చి పట్టం కట్టడమే.

ఆ మహాసంఘటన తర్వాత కథను పొడిగిస్తూ వెళ్ళడం ఆంగ్లంలో చెప్పేటట్లు, “క్లైమాక్స్" తర్వాత "యాంటీ క్లైమాక్స్" లాగే ముగుస్తుంది.

పాఠకులు పలువురిప్పుడు తొందరగా ముగించేసినట్లు చెప్పినా, ఈ కథను ఇంకా పొడిగిస్తే, అదే పాఠకులు ఇంకొక విధంగా కొరత చెప్పే పరిస్థితి వస్తుంది. “ఎప్పుడు ముగించబోతున్నారు?” అని పాఠకులు రచయితను అడిగే పరిస్థితి త్వరలో వచ్చేస్తుంది.

2. సాధారణంగా 'నవలలు' రాసేందుకు, ముఖ్యంగా 'చారిత్రక నవలలు' రాసేందుకు నిర్దుష్టమైన నియమాలేవీ లేవు (అలాంటివేవైనా ఉంటే అవి నాకు తెలియదు). ఒక్కొక్క రచయిత తనకు నచ్చిన రీతిలో రాస్తున్నారు.

~

కానీ, పూర్తిగా కల్పితంగా రాయబడే సాంఘిక నవలలకు, చారిత్రక సంఘటలను ఆధారంగా చేసుకొని రాయబడే నవలలకు మధ్య ఒక తేడా తప్పక ఉండి తీరుతుంది.

కల్పిత నవలల్లో సృష్టించబడే పాత్రలన్నిటికీ రచయిత సులభంగా ముగింపు చెప్పేయవచ్చు. కథానాయకుడు, కథానాయకి పెళ్ళి చేసుకొన్న తర్వాతో, లేక కథానాయకుడు ఉరేసుకొని, కథానాయకి సముద్రంలో దూకి చనిపోయిన తర్వాత, కథలో వచ్చే తక్కిన పాత్రల కథను ఏదో ఒక రకంగా ముగించి సరిపుచ్చేయవచ్చు.

పెళ్లిచేసుకొన్న యువతులు పిల్లలు, మనవళ్ళతో చాలకాలం సుఖంగా జీవించారని, తక్కిన పాత్రల్లో మంచివాళ్ళందరూ సుఖసంతోషాలు పొందారని, చెడ్డవాళ్ళందరూ చాల కష్టాలు పడి చచ్చారనో, లేక తగిన శిక్ష అనుభవించారనో చెప్పి కథను తృప్తికరంగా ముగించవచ్చు.

చారిత్రక నవలలను అలా ముగించడం అంత సులభమైన పని కాదు; ఉచితం కాదు కూడాను.

చారిత్రక నవలలలో చనిపోయిన పాత్రలు తప్ప, తక్కినవారందరూ పిదప కాలంలో పలుకార్యాలలో పాల్గొంటారు; గెలుపో, ఓటమో, సుఖమో, దుఃఖమో పొందుతారు. వాటి గురించి ముందే చెప్పేయడం ఉచితమా? లేక ఆధారాలతో కూడిన వివరాలు లేకనే ముగిసిన సంఘటనలను గురించి రాయడం ఉచితమవుతుందా?

కథను ఏ కాలంలో ముగిస్తామో, ఆ కాలంలో పాత్రలు ఉన్న పరిస్థితిలోనే వదిలిపెట్టడమే ఉచితమని భావిస్తున్నాను. ఇది చాలమంది పాఠకులకు తృప్తినివ్వలేదని తెలుసుకొన్నాను. కొంతవరకైనా వారిని తృప్తిపరచాలనుకొంటున్నాను.

పలువురు పాఠకులు తెలుసుకోగోరిన వివరాలను సేకరించి ప్రశ్నల రూపంలో ఇదిగో మీ ముందుంచుతున్నాను:

1. వంతిదేవుడు యువరాకుమారి కుందవైదేవిని పెళ్ళాడాడా?
2. కోట దళపతి చిన్న పళువేట్టరయ్యర్ ఏమయ్యారు?
3. వీరవైష్ణవుడైన ఆళ్వార్ కట్టియాన్ ఏం చేశాడు?
4. పొన్నియిన్ సెల్వన్ ప్రయాణం ఏమైంది?
5. పాత మధురాంతకులు, చిన్న పళువేట్టరయ్యర్ కుమార్తె ఏమయ్యారు?
6. నందిని చేత పట్టంకట్టించుకొన్న యువపాండియన్ గురించిన వివరాలేమి?
7. నందిని గతేమి?
8. వాణతి గురించి కుడందై జ్యోతిష్కులు చెప్పినవి ఫలించాయా?
9. పాండ్యరాజు ఆపత్కాల సహాయకులు ఏం చేశారు?

పైన సూచించిన ప్రశ్నల్లో చాలవాటికి ఉత్తరాలు పాత తమిళనాడు చరిత్ర తెలిసినవారు తామే తెలుసుకోగలరు. అయినా కూడ, అందరినీ తృప్తిపరిచే బాధ్యతను ముందుంచుకొని, పైన క్రోడీకరించిన ప్రశ్నలన్నింటికీ సమాధానాలు చెప్పేస్తున్నాను:

1. ఇంకొన్ని అడ్డంకులను దాటిన తర్వాత వంతిదేవుడు, కుందవై పెళ్ళి చేసుకొంటారు. ఇద్దరూ చోళసామ్రాజ్యంలో చాల గౌరవించబడతారు. తంజావూరు పెద్ద కోటలో ఉన్న ఒక శిలాశాసనంలో 'రాజరాజచోళుల గౌరవనీయులైన అక్కగారు, వల్లవరయ్యర్ వంతిదేవుల మహాదేవిగారు, ఆళ్వార్ పరాంతకులు కుందవై అమ్మగారు' అని చెక్కబడి విలసిల్లుతోంది.

2. ఉక్కుమనిషైన చిన్న పళువేట్టరయ్యర్ బతికి బయటపడి పలుకష్టాలను అనుభవించిన తర్వాత ఊరికి తిరిగి వస్తారు. చోళసామ్రాజ్యానికి ఎన్నో గొప్ప సేవలు చేస్తారు.

3. వీరవైష్టవుడైన ఆళ్వార్ కట్టియాన్ తన గూఢచారి ఉద్యోగాన్ని ఇంకా కొనసాగిస్తూ వెళతాడు. నందిని, పాండ్యరాజు ఆపత్కాల సహాయకులు పన్నే కుట్రలను తెలుసుకొని వచ్చి చెబుతాడు.

4. పొన్నియిన్ సెల్వన్ వంతిదేవునితోబాటు ఒక పెద్ద నౌకాసైన్యాన్ని సిద్ధం చేసుకొని, సముద్రదొంగలను అదుపులో పెట్టి, చోళసామ్రాజ్యాన్ని సముద్రాలకవతల ఉన్న దేశాలకు విస్తరిస్తాడు. ఉత్తమ చోళులకు పట్టం కట్టి పదిహేను సంవత్సరాలయిన తర్వాత ఆయన మరణించగా, పొన్నియిన్ సెల్వన్ సింహాసనమధిష్టిస్తారు. 'రాజరాజచోళుడు' అన్న పట్టంతో దీర్ఘకాలం చోళసామ్రాజ్యాన్ని ఏలుతారు.

5. పాత మధురాంతకుడు పాండ్యరాజు ఆపత్కాల సహాయకులు ఎగదోయడం వల్ల, లంకరాజు, చేరదేశపు రాజుల సహాయం తీసుకొని పాండ్యదేశాన్ని ఆక్రమించుకొని పట్టాభిషేకం చేసుకోవడానికి ప్రయత్నిస్తాడు. అతడి ప్రయత్నం చాలవరకు బలం పుంజుకొంటుంది. రాజరాజచోళులు పట్టానికి వచ్చిన తర్వాత అమర భుజకీర్తి నెడుంజెళియన్ని యుద్ధంలో ఓడిస్తారు. అతడు వీరస్వర్గం చేరుకొంటాడు.

6. తిరుప్పురంపయం అడవిలో పట్టంకట్టబడ్డ యువపాండియన్ (పిల్లాడు) కూడ పాండ్యరాజ్యానికి హక్కు చెలాయించాలని ప్రయత్నిస్తాడు. వాడు యుద్ధరంగంనుంచి తప్పించుకొని పారిపోయి మళ్ళీ రాజ్యాన్ని చేజిక్కించుకోవడానికి ప్రయత్నిస్తాడు. ఇతడు పిదపకాలంలో రాజేంద్రచోళుని చేతిలో యుద్ధంలో మరణిస్తాడు.

7. నందిని అమర భుజ నెడుంజెళియన్ మరణించిన తర్వాత తాను కూడ అసువులు బాస్తుంది. అంతకు మునుపు రాజరాజచోళులు ఆమెను కలుస్తారు. ఆయనకు తన పుట్టుక గురించిన రహస్యాన్ని, ఆదిత్య కరికాలన్ మరణం గురించిన నిజాన్ని చెప్పేసి చనిపోతుంది.

8. కుడందై జ్యోతిష్కుల జోస్యాలు వాణతి విషయంలో ఫలిస్తాయి. వాణతికి పుట్టే బిడ్డయిన రాజేంద్ర చోళుడు 'గంగను, కటారాన్ని జయించిన చోళుడు' అని తర్వాతి కాలంలో చరిత్రలో ప్రసిద్ధికెక్కుతాడు. కానీ వాణతి తన శపథాన్ని నెరవేర్చేసి ప్రాణత్యాగం చేస్తుంది. రాజరాజచోళునితో సింహాసనమధిష్ఠించే మహిళ 'ఉలగ (=లోక)మహాదేవి' అనే ఇంకొక రాణి.

9. పాండ్యరాజు ఆపత్కాల సహాయకులు మళ్ళీ పాండ్యరాజ్యాన్ని స్థాపించే ప్రయత్నంలో నిమగ్నమవుతారు. నందిని ప్రాణాలతో ఉన్నంతవరకు ఆదిత్య కరికాలన్ అకాల మరణం వెనుకనున్న రహస్యం గురించి విచారణ జరగలేదు - అందులో నందిని పేరు కూడ వస్తుందనే కారణం వల్లనే. నందిని మరణం తర్వాత రాజరాజ చోళులు రవిదాసు మొదలైనవారిని పట్టి బంధించి, శిక్ష విధించి, వారి ఆస్తులను జప్తు చేసేందుకు ఆజ్ఞలు జారీ చేస్తారు.

పాఠకులు అంతగా విచారించని పాత్రల గురించి కూడ చెప్పి ముగిస్తాను.

సుందర చోళ చక్రవర్తి కంచిలోని బంగారు మాళిగలో మూడేళ్ళపాటు నివసించి అక్కడే మరణించి 'బంగారు మాళిగలో మరణించిన దేవరు' అన్న పేరు పొందుతారు. ఆయన ప్రియపత్ని - వాణమహాదేవి - మలైయమాన్ కుమార్తె - ఆయనతో చితికెక్కి పరలోకం చేరుతుంది.

పార్థిబేంద్రుడు కుందవై తనను పెళ్ళాడ నిరాకరించినందువల్ల కంచిలో స్వతంత్ర రాజ్యాన్ని నెలకొల్పజూస్తాడు. అందులో ఓడిపోయి సంతతి లేక మరణిస్తాడు.

గందమారన్ పాలాట్రు (పాల + ఆరు (నది)) నది వాయవ్యదిశలో కొత్త మాళిగను కట్టుకొని చోళసామ్రాజ్యానికి సేవలు చేస్తాడు. అతడి తర్వాత శంబువరయ్యర్ కులం చాల పేరుప్రఖ్యాతులు పొందుతుంది.

~

పాఠకులను తృప్తిపరచేందుకే పై వివరాలను రాశాను. నిజానికి, ఇవన్నీ ఇంకొక పెద్ద చారిత్రక నవలకు ఆధారం కాదగిన ముఖ్యమైన సంఘటనలు.

ఉత్తమచోళుని తర్వాత సింహాసనమెక్కిన రాజరాజచోళుడు, రాజేంద్రుడు, రాజాధిరాజచోళుడు, వీర రాజేంద్రుడు, కులోత్తుంగ చోళుడు మొదలైన చోళరాజుల కాలంలో మహోత్కృష్ట సంఘటనలు 'పొన్నియిన్ సెల్వన్' కథలాగ పలు చారిత్రక కథలు రాసేందుకు కథావస్తువులు కాదగినవి.

జ్ఞానంలో, ఎరుకలో, రచనానైపుణ్యంలో, పరిశోధనలో ఈ కథారచయితను మించినవారు రాబోయే కాలంలో చోళచరిత్రను ఆధారంగా తీసుకొని ఎన్నెన్నో మహత్తరమైన చారిత్రక నవలలను రచించి, తమిళనాడుకు ఇంకా పెద్దగా సేవ చేస్తారని నమ్ముతున్నాను.

~ శుభం ~